# శ్రీ విష్ణు సహస్రనామము

( షష్ఠమ భాగము 502-600 నామ వివరణ )

మాస్టర్ కె. పార్వతికుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# శ్రీ విష్ణు సహస్రనామము

( షష్ఠమ భాగము 502-600 నామ వివరణ )



మాస్టర్ కె. పార్వతికుమార్

ధనిష్ఠ

# ముందుగా ఒక మాట

శ్రీ గురుదేవులు, మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమారు గారు, శ్రీ విష్ణుసహస్రనామ వివరణ అనే జ్ఞానయజ్ఞాన్ని ప్రవచన రూపములో, 1993 లో విశాఖపట్టణములో, రాధామాధవ ప్రాంగణమున ప్రారంభించి, కొన్ని సంవత్సరములు కొనసాగించిరి. వారు శ్రీ విష్ణుసహస్రనామము లో గల అన్ని నామములకు వివరణ ఇచ్చినప్పటికి, కొన్ని నామముల వివరణ అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న నామములను ముద్రణ రూపము లో అందజేయవలెనన్న సదుద్దేశము శ్రీ గురుదేవులకు విన్నవించుట జరిగినది. వారు ముందుగా మన మాసపత్రిక 'నా వాణి' లో నామముల వివరణ ప్రచురించమనగా, శుభకృత్ ఉగాది సంచికతో ధారావాహికగా అవి ముద్రణ రూపము దాల్చుట మొదలైనది. వారి అనుమతి, ఆశీర్వచనములతో శ్రీ విష్ణుసహస్రనామముల వివరణ e-Books రూపముగా పాఠకుల ప్రయోజనము కొరకు తీసుకుని రావడము జరుగుచున్నది. ఈ ప్రయత్నములో భాగమే ఈ చతుర్థ భాగము

ఈ పుస్తకములలో శ్రీ గురుదేవుల ప్రవచనములు వినబడినంత, అతికొద్ది సవరణలతో అందజేయడమైనదని గమనించగలరు. ప్రతి శ్లోకములో నామముల విభజనకు మాస్టర్ E.K. గారు ఆంగ్లములో వ్రాసిన విష్ణుసహస్రనామములో నామ విభజనను ప్రాతిపదికగా తీసుకునుట జరిగినది.

ఈ ప్రయత్నములో పాల్గొనుచున్నవారందరికీ ఈ వివరణలు అత్యంత మరపురాని, ఆనందకరమైన అనుభూతులు కలిగించుచున్నవి. ఈ యజ్ఞములో పాలుపంచుకుంటున్న వారందరికి మాస్టరుగారి ఆశీస్సులు అందాలని మాస్టరు గారికి మా ప్రార్థన. ఈ పుస్తకము చదివిన వారందరికి గురుదేవులు అందించిన అమూల్యమైన విషయములు అత్యంత సులభముగా హృదయస్థమై, స్ఫూర్తినిచ్చి, సాధనకు మరింత ఉన్ముఖులను జేయగలవని మా నమ్మకము.

శ్రీ విశ్వావసు నామసంవత్సర గురుపూర్ణిమ సందర్భముగా శ్రీ విష్ణు సహస్రనామ వివరణ షష్ఠమ భాగము - 502 నుండి 600 నామములకు- శ్రీ గురుదేవులు ఇచ్చిన వివరణయే, మనందరి అక్షరాంజలిగా వారి పాదపద్మములకు సమర్పితము.

ధనిష్ట

# ఉపోద్ఘాతము

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు విష్ణుమూర్తి యొక్క అవతరణము మన దృష్టి యందు నిలబడాలి. నారాయణ మంత్రం చేసుకునేటప్పుడు ఆదిశేషుడు, దాని పడగ క్రింద వున్న నారాయణమూర్తి, నారాయణమూర్తి యొక్క వర్ణనము, ఆయన యొక్క రూపము, రంగు, శబ్దముల మీద దృష్టి ఉంచాలి. చూపుడు వేలంత రూపాన్ని మనసుకు తెచ్చుకోవాలి. అలా తెచ్చుకుంటే నీలమేఘశ్యామలమైన ఆయన శరీరము కనిపిస్తుంది. ఆయన ధరించిన ఆభరణములన్నీ బంగారు రంగులో వున్నట్లుగా కనిపిస్తాయి. క్రమముగా ఆయన ముఖము, బాహువులు, వక్షస్సు, పాదములు మనకి కనిపిస్తాయి. ఉత్తరీయంతో కప్పి ఉన్న భాగాలన్నీ మిసమిసలాడే మేలిమి బంగారంతో వున్న ఆభరణాలుగాను, వస్త్రములుగానూ దర్శించాలి. కప్పివుండని భాగము తేజోవంతమైన నీలమైన రంగుతో భావన చేసుకోవాలి. నారాయణమంత్రం చేసుకొనేటప్పుడు, మస్తకం నుండి పాదం వరకు, భగవంతుని దర్శనం చేయాలి. ఆ తరువాత విష్ణుసహస్రనామం చదువుకునేటప్పుడు విష్ణువు యొక్క రూపం మన హృదయం నందు నిలబడడానికి అవకాశం వుంటుంది. ఆ అవకాశం ఏర్పడిన తర్వాత, విష్ణువు తన విశాలమైన నేత్రాల నుండి మనను చూస్తున్నట్లుగా భావన చేస్తూ, ఎంత సేపు వుండగలిగితే అంతసేపు ఉండాలి. ఎక్కువ సేపు ఉండలేము. మహా అయితే 2-3 నామాల వరకు వుండవచ్చును. ఆ తరవాత ఉండలేము. మళ్ళీ తెచ్చుకొంటూ వుండాలి. ఇది ఒక సాధన! అప్పుడు లోపల నుండి వికాసం రావడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనలో వున్న నిజస్వరూపం అంటే మన అసలు స్వరూపం విష్ణు స్వరూపమే కనుక! మనల్ని అంగుష్ట మాత్రంగా (చూపుడు వేలంత) విష్ణుమూర్తి రూపాన్ని హృదయమునందు ధ్యానము చేయమని భాగవతం షష్టమస్కంధంలో చెప్తారు. మనకి హృదయమునందు సింహము అనే భాగము వున్నది. ఉదరవితానాన్ని సింహాసనమని కూడా చెప్తారు. ఆ సింహాసనం మీద విష్ణుమూర్తి ఉన్నట్లు ధ్యానం చేసుకుంటున్న కొద్దీ, పెరుగుతున్నట్లుగా భావన చేయాలి. ఆయన నుండి వచ్చే నీలము, హిరణ్మయము అయిన కాంతులు మన హృదయాన్ని అంతా నింపుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. మన దేహమంతా పూర్తిగా నిండిన తరువాత, అవే కిరణములు బహిః ప్రపంచంలో వ్యాపనం చెందుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. ఇలా చేసుకోవాలంటే ముందు నారాయణ మంత్రం వుంటుంది.

నారాయణ మంత్రంలో మన శిరస్సు, నేత్రములు, శ్రవణేంద్రియములు, ప్రాణేంద్రియములు, గొంతు, భుజస్కంధములు, బాహువులు. హృదయము, ఊపిరితిత్తులు, రక్తనాళములు, గుండె, అలా దిగి వెడుతూ మొత్తం దేహమంతా నారాయణ మంత్రంతో ప్రతిష్టాపన చేసికోవాలి. దేహమంతా నారాయణ భావనలో నింపాలి. అలా నింపిన తరువాత విష్ణుసహస్రనామం

చేసుకునేటప్పుడు, నారాయణతత్త్వంతో నిండిన ఈ దేహంలో కేంద్రము నందు ఆదిశేషువు వెనకాల పడగ పట్టి ఉన్నచూపుడు వేలంత భగవంతుని ప్రతిమను, చతుర్భుజుడై ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఇంకొక చేతిలో కమలము, మరియొక చేతిలో గద ధరించి నిలబడిన భగవంతుని, వక్షస్థలము నందు కౌస్తుభమును ధరించిన వాడిని, చిరునవ్వు గలిగిన వాడిని ఆవాహన చేసుకోవాలి. ఈ విధంగా చదువుకున్నట్లయితే జరగవలసిన మార్పులు మనలో సవ్యంగా జరుగుతాయి. ఈ భావనలో విష్ణుసహస్రనామం చేసుకోవాలి. లేకపోతే tape వేస్తే వెళ్ళిపోయినట్లు 1008 నామాలు అయిపోతాయి. ఈలోగా మనసు ఎక్కడో తిరిగి వస్తుంది. తిరిగి రావడం మనకి అభ్యాసమైన విషయం కాబట్టి, విష్ణుసహస్రనామం చేసేటప్పుడు మళ్ళీ మనసును అక్కడికి తెచ్చుకోవడమనేది అభ్యాసంగా మొదలు పెట్టి మనం ఆ రూపాన్ని మళ్ళీ దర్శనం చేయడం మొదలు పెడితే, అప్పుడు మనలో భక్తి ఉద్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్రమత్తత వస్తుంది. శ్రద్ధ కలుగుతుంది. విన్న విషయాలు మర్చిపోవడం వుండదు. చెప్పిన విషయాలు గ్రహించడంలో లోటు ఉండదు. సహస్రనామం అనే సంప్రదాయము మనకి ఋషులు ఏర్పరిచారు. ఈ సహస్రనామములలో ముఖ్యమైన విషయము, ఏ నామము అయినా భగవంతుడిదే అని తెలుసుకోవడము. నామము ఏదైనా భగవంతుడిదే!. 'సహస్ర' అనే సంఖ్య ఒకటి తరువాత మూడు సున్నాలుగా, 1000, మనకి కనిపిస్తుంది. భూః, భువః, సువః లోకాలుగా ఉన్న సృష్టి మూడు సున్నాలైతే, ఆ మూడింటిని వ్యాపించినది ఒకే ఒక తత్వము- 'ఒకటి'. ఒకటి లేకపోతే ఆ మూడు సున్నాలకి విలువ లేదు. ఒకటి ఉంటే ఆ సున్నాలకి విలువ ఉన్నది. అందుచేత ఎవరి వలన పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞానమయము అయిన లోకములు ఏర్పడ్డాయో, (Matter, Force, Consciousness అంటారు ఆంగ్లంలో) ఆ తత్వం ఆ మూడు లోకాలు వ్యాపించి ఉన్నది. మూడు లోకములలో వ్యాపించిన రకరకములైన రూపములకు నామములున్నాయి. ముందు రూపం ఏర్పరచి, తరువాత నామాన్ని అందించారు. రూపం లేకుండా నామం లేదు. ఒక నామం ఉందంటే ఆ రూపం ఉందిట అని అర్థం. అందుచేత మూడు లోకములలో ఉన్న నామాలన్నీ భగవంతుని కీర్తించడమే! భగవంతుని సంబోధించడమే! ఎందుకంటే రూపాలన్నీ భగవంతుడివే! భగవంతుడు కాని రూపం ఏదీ లేదు. అదీ భారతీయ జ్ఞానమునకు సంబంధించిన సమన్వయము. ఋషులు సమగ్రమైన అవగాహన పొందిరి, భగవంతుడు కానిది ఏమీ లేదు అని మనకు తెలియజేసారు. దేనిని చూసినా భగవంతుడుగానే చూడడం. మూడు లోకాలలో ఉండే సమస్త రూపములు, వానికి ఏర్పరిచిన నామములుగా కనబడుతున్నదీ దైవమే! సృష్టి అంతా కూడా నామరూపాత్మకము అంటారు. అంటే రూపు ఏర్పడి, వాటిని గుర్తించడం కోసం ఒక నామం. పురుషసూక్తంలో ఏ విధంగా సృష్టి ఏర్పడింది, ఆ ఏర్పడిన సృష్టిలోని ప్రతి విషయానికి తరువాత ఎలా నామకరణం చేసారు, అనే

విషయం తెలియపరుస్తారు. ఆరాధకులకు తెలియవలసిన ఒక ముఖ్య విషయము "సమస్తమూ దైవమే! సమస్త రూపములు దైవమే! ఆ రూపమునకు ఉన్న నామం కూడా దైవమే!". ఇది దీక్ష. ఈ దీక్ష పట్టి సహస్రనామాలు పారాయణ చేసుకోవాలి. ఏది చూసినా అందులో ఆ మొత్తం ఉంది అని తెలియాలి. నువ్వు కోరుకొని చూసిన దాంట్లోనే కాదు. కొన్ని రూపాల్లో దైవాన్ని చూస్తాం, కొన్ని రూపాల్లో దైవాన్ని చూడం. కొన్ని నామాల్లోనే దైవాన్ని చూస్తాం, కొన్ని నామాల్లో దైవాన్ని చూడం అనేది భారతీయ సమగ్ర జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని అందించిన ఏకైక భూమి భారత భూమి. అది మనం గుర్తించాలి.

జీవునకు రుచి ఉన్నది, జీవుని రుచి వెలుగు. కిరణం! అందుచేత భగవత్ ఆరాధన చేస్తున్నప్పుడు మనలో స్ఫూర్తి పెరిగి దైవం మీద రుచులు పెరుగుతూ ఉంటాయి. ఆ రుచులు పెరిగిన కొద్దీ వైవిధ్యంగా, వైభవోపేతంగా దైవాన్ని వర్ణన చేసాం, కీర్తనలు చేసాం, స్తోత్రం చేసాం. దైవము యందు ఆసక్తి వలన దైవం మీద రుచులు పెరిగి రకరకములుగా ఎన్నెన్నో ఆరాధనలు చేసాము. అవన్నీ మన పురాణాల్లో ఉన్నాయి. ఈ విధంగా ఇచ్చిన సహస్రాలు మనం రోజూ పారాయణము చేయాలనుకుంటే మనకు ఒక దీక్ష ఉన్నది. ఏంటంటే, కనపడుతున్నదంతా దైవముగా భావన చేయడము. అలా భావన చేస్తే సహస్రనామం సఫలీకృతం అవుతుంది. సిద్ధిని ఇస్తుంది. దైవానుభూతిని ఇస్తుంది. అలా కాక మన వంటింట్లో గూడులో పెట్టుకున్న చిన్న ప్రతిమ దేవుడనుకొని, అది కాక మిగతాదంతా వేరు అనుకునే వాళ్ళకి సహస్రనామం ఫలించదు. ఇది ముఖ్యమైన విషయం.

సహస్రం అనే పదం, అదొక మంత్రం. దీన్ని (శిరస్సుపైన) 'సహస్రారము' అంటారు. 'సహస్రదళ పద్మము' అంటారు. 'పరిపూర్ణస్థితిని' సహస్రము అంటారు. అది ఒక మంత్ర శాస్త్రం. 'స' అనే అక్షరానికి; హ'అనే అక్షరానికి; మళ్ళా ' స్ర' అనే అక్షరానికి చాల వివరణ ఉన్నది. అది అలా ఉండగా సహస్రము అంటే 1000 అనే పద్ధతి తీసుకుంటే, మూడు లోకములూ వ్యాపించిన ఒకే ఒక తత్వానికి సంబంధించినది అనేది ఒక భావన. కాబట్టి ఈ మూడు లోకములకు సంబంధించిన ఏ రూపము అయినా సరే అది దైవముదే ! దెయ్యము అయినా దైవము యొక్క రూపమే! అని తెలిస్తే దెయ్యం ఏమి చేయదు. పులైన, పామైన, తేలైన, నీ శత్రువైనాను. నువ్వు అనుకోవడం బట్టి శత్రువు! శత్రువులో కూడా దైవము ఉన్నాడు అనుకుంటే అంత బాధించదు. మహాత్ములు అట్లాగే జీవించారు. పులిలో కూడా దైవముందని తెలిసిన వారే పులిని పిల్లి వలే చక్కగా సాకారు. పాములో దైవము ఉందని తెలిసిన వారే పామును సాకారు. పిచ్చి ఏనుగులో దైవమును దర్శించిన బుద్ధునికి ఏనుగు చిన్న కుక్కపిల్లలాగ పక్కన వచ్చి కూర్చుంది. ఇలా సమస్తమును దైవాన్ని దర్శించే పద్ధతి కోసం సహస్రనామాలు ఇచ్చారు. ఆరాధన అలా చేసుకోవాలి.

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ఇలాగ కూడా భావన చేసుకోవచ్చు. నక్షత్రములు 27. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు. ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం చొప్పున మొత్తం 108 శ్లోకాలు. మనం 4వ శ్లోకం చదువుతున్నామంటే మొదటి నక్షత్రంలోని నాల్గవ పాదంలోనే ఇంకా వున్నామని అర్థం. ఉదాహరణకు అశ్విని నక్షత్రం వాళ్ళు, వాళ్ళ యొక్క పాదాన్ని బట్టి దాని అర్థం ఎక్కువగా ఆకళింపు చేసుకొనవచ్చును. కాలం సద్వినియోగం అవడములో భాగంగా విష్ణుసహస్రనామం చదవడం 20 నిముషాలు పడుతుంది. 20 నిముషాలు సద్వినియోగం అవకుండా, విష్ణుసహస్రనామం కొన్ని వందల సార్లు చదివి ఉండవచ్చును. ఎందుకంటే tape చదువుతుంది. మనమూ చదువుతాము, మనం చదువుతున్నాము అనుకున్నప్పుడు మనం వినాలి. మనం వినాలి అంటే ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం వినకపోతే ఏమీ కాదు. విష్ణుసహస్రనామం మంత్రం అనుకుంటే, మంత్రం శబ్దానికి సంబంధించినది. దాని యొక్క యంత్రం విష్ణువు యొక్క రూపం! మనం చదివే ప్రక్రియ అంతా కూడా తంత్రం. కాబట్టి ఈ తంత్రమంతా ఆ యంత్రాన్ని లోపల ఆవాహన చేసుకొని, శబ్దాన్ని వింటూ చదవకపోతే, దాని యొక్క వినియోగమేమీ మనయందు జరగదు. అంటే విష్ణువు యొక్క సాన్నిధ్యము, దానికి సంబంధించిన వికాసము, మన యందు కలగడానికి అవకాశం వుండదు. అందుకనే భగవంతుడు లేడేమో అనే భావన కలుగుతుంది. అందుకే ఏళ్ళ తరబడి విష్ణుసహస్రనామం చదివిన వాళ్ళలోనూ మార్పు రాదు. వాళ్ళ ఆలోచనలలోనూ మార్పు రాదు. ఈ మొత్తం కార్యక్రమం మన మనస్సు, ఇంద్రియములు, శరీరములలో వుండే రుగ్మతలు, మాలిన్యములు అన్నీ క్షాళనమై, భగవంతుని అనుభూతి చెందే అర్హత సంపాదించుకోడానికి చేస్తున్నాం. ఆటువంటి ధృఢనిశ్చయం, resolution ఉండాలి. లేకపోతే 20 నిముషాలు దండగ. విష్ణువు యొక్క రూపము యంత్రము, విష్ణువు యొక్క నామము మంత్రము, మనం ఉచ్చారణ చేసి వినడం తంత్రము. ఈ మంత్రము, యంత్రము, తంత్రము కలిసినప్పుడే అది ఒక త్రిభుజాకారమైన వలయంగా ఏర్పడి, ఒకదాని నుండి మరొక దానికి శక్తి ప్రసారం (energy supply) వుంటుంది. లేకపోతే దైవశక్తి యొక్క ప్రసారానికి ఒక circuit complete కాదు. ఆ circuit complete కావాలంటే, ఏది చదువుకున్నా అలాగే చదువుకోవాలి.

విష్ణు సాన్నిధ్యము కొరకు, విష్ణు సాయుజ్యము కొరకు, విష్ణు సామీప్యము కొరకు, విష్ణు సారూప్యము కొరకు విష్ణువును మనం లోకంలో దర్శనం చేస్తూ ఉండాలి. దర్శనం చేస్తూ ఈ సహస్రనామాలను అవగాన చేసుకుంటూ ఉండడం వల్ల మనకి ఆశయ సిద్ధి కలుగుతుంది. విష్ణు సహస్రనామము అధ్యయనం చేసే వారందరూ కూడా లోకాన్ని విష్ణువుగా చూడటం అనే సాధన మరవకుండా చేస్తూ ఉండాలి. ఎందుకంటే లోకం రూపంలోనే విష్ణువు ఉన్నాడని 'విశ్వం విష్ణుర్వషట్కారో' అని విష్ణు సహస్రనామ ప్రారంభము లోనూ, 'విష్ణుండు విశ్వంబు విష్ణుని కంటెను వేరేమియును లేదు' అని భాగవతంలోనూ చెప్పబడినది

కదా! లోకాన్ని చూస్తున్నప్పుడు విష్ణువుని చూస్తూ ఉండడం వలన మాత్రమే మనం విష్ణు దర్శనానికి క్రమశః అర్హత సంపాదించుకుంటాం. అలా చూడకుండా విష్ణుసహస్రనామం యొక్క అవగాహన చేసుకుంటే అది విజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప మన యందు సత్యమై నిలవదు. మనయందు దాని యొక్క అనుభూతి పరిపూర్ణం కాదు. దివ్యమైన విషయములను తెలుసుకోవడం ద్వారా మనకు వికాసం వస్తుంది. అందులో ఏమీ సందేహము లేదు. వచ్చిన వికాసం నిలబడాలంటే దివ్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు, కార్యక్రమానికి కార్యక్రమానికి మధ్య ఉండే interval లో, ఎంత వరకు విష్ణువుని చూస్తే అంత continuity ఉంటుంది. ఆ interval లో మనం విష్ణువుని చూడకపోతే continuity ఉండదు. మళ్లీ విష్ణుసహస్రనామం class లో మాత్రమూ మనకు మళ్లీ విష్ణు అందరి రూపాల్లో ఉంటాడు, అన్ని రూపాల్లో ఉంటాడు అన్నది నామాల అర్థాలలో కనిపిస్తూ ఉంటాడు. మనం లోకంలో చూడడం మొదలు పెడితే నెమ్మదిగా అక్కడో point, ఇక్కడో point ఉన్న వాటి మధ్య continuity ఏర్పడి, ఎప్పుడూ విష్ణువు యొక్క సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంటుంది. అది సాధన! ఇది ఆ సాధనకు ఏర్పరచుకునే సాధన సంపత్తి. ఇక్కడ మనం implements పోగేసుకుంటున్నాం. అవి మన life లో workout చేసుకోవాలి. లేకపోతే ఇది కేవలం ఒక విజ్ఞానంగా కొంతకాలమే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు ఉండే వికాసం బయటకు వెళ్ళి పనులు చేసుకుంటూ ఉంటే, పనుల రూపంలో ఉన్న భగవంతుణ్ణి, ఎవరితో పనులు చేస్తున్నామో వారి రూపంలోని భగవంతుణ్ణి, ప్రదేశంలోని భగవంతుణ్ణి చూడకపోవడం వల్ల వికాసము తగ్గుతుంది. వికాసం తగ్గిన కొద్దీ ఇంకొంచెం తక్కువగా చూస్తాం. ఇంకొంచెం తక్కువ చూసిన కొలది ఇంకా వికాసం తగ్గుతుంది. మర్చిపోతాం. విష్ణువుని చూడడం మరిచిపోవడం తో విజ్ఞానం కూడా మాయమైపోతుంది. హరించుకుపోతుంది.

విష్ణుసాన్నిధ్య రూపంలో మనల్ని ప్రతి సన్నివేశంలోనూ ఉత్తీర్ణులను చేయాలంటే మనం లోకాన్ని విష్ణువుగా చూడాలి. విష్ణువుని కొంచెం చూడడం మొదలు పెట్టి, అక్కడి నుండి కొంచెం ఎక్కువగా చూడటం అయ్యి, ఇంకా కొంచెం ఎక్కువ చూడ్డం, ఇంకొంచెం ఎక్కువ చూడ్డం మొదలు పెట్టాలి. ఇంక వేరే పద్ధతి లేదు. విష్ణు రూపంగా సృష్టి అంతా చూడ్డం అనేది ఒక essential prerequisite for experiencing Vishnu. ఇది ఒక practical instruction క్రింద తీసుకుని మనం వీలున్నంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. ఆచరణలో పెడితే తప్ప మనలో మార్పు రాదు. లేకపోతే వినడం- మర్చిపోవడం, వినడం-మర్చిపోవడం అయ్యి, మనం అట్లాగే ఉంటాం. ఎన్నిసార్లు భగవత్ తత్వ విషయాలు విన్నా మనం మారక పోవడానికి కారణం ఏమిటో? చెప్పినవి వినడము, శ్రద్ధతో ఆచరించక పోవడమే! లోకంలా కనిపిస్తూ ఉండేదంతా విష్ణువే! లోకాన్ని చూస్తున్నప్పుడు దేవుడు గుర్తుకు రావాలి. మనం దేవుడిని

చూడటం అంటే. లోకం కాక చూడడం అనే అభ్యాసం, పారపాటు వల్ల ఏర్పరచుకున్నాం. దానివలన కనబడ్డ వాటిల్లోనే చూడడు, కనబడని వాటిల్లో వీడేం చూస్తాడని భగవంతుడు నవ్వుకుంటాడు. ఎదురుగా ఉన్నదే కనపడదుట. ఎవ్వరికీ కనబడని వస్తువు వెతకడానికి బయలుదేరాడట అంటే అర్థం ఏమన్నా ఉందా? ఆయన ఇన్ని రూపాల్లో కనిపిస్తుంటే, ఇన్ని రూపాల్లోనూ ఉన్న ఆయన్ను చూడకుండా, వీళ్లందరినీ నిర్లక్ష్యం చేస్తూ ఆకాశంలో చూస్తే శూన్యం కనిపిస్తుంది. పూర్ణం కనిపించదు. ఇక్కడ నుండి చూస్తే అక్కడి వరకు మొత్తం అంతా పూర్ణంగా కనిపిస్తుంది అని భగవంతుడు చెబుతున్నాడు. కనుక సాధనలో మనం రోజూ ఎన్ని సంఘటనల్లో, ఎన్ని ప్రదేశాల్లో, ఎందరు వ్యక్తుల్లో, ఎన్ని ఆకారాల్లో విష్ణువును చూడగలిగాము? ఎన్ని ఆకారాల్లో చూడలేకపోయాం? చూడడం అనేది ఒక అభ్యాసంగా చేసుకొనడం వలన మాత్రమే మనలో మార్పు వస్తుంది తప్ప, లేకపోతే ఎంత పెద్ద విషయాలు తెలుసుకున్నా రెండు మూడు రోజులు అయ్యాక అవి ఆవిరైపోతాయి. అవి మిగలవు. మళ్లీ freshగా మొదలు పెట్టడమే! ఎప్పుడు ఇమిడి ఉంటాయి అంటే ఈ చింతనలు ఉన్నప్పుడు ఇమిడి ఉంటాయి. అవసరమైనప్పుడు వాటంతటవే మనలోంచి వ్యక్తమవుతుంటాయి. అప్పుడు ఏదో చెప్పారండీ మీకు చెబుదామనుకున్నాను, అనే పరిస్థితి ఉండదు. ఎవరికన్నా చెప్పవలసి వచ్చిందనుకోండి 'పుష్కరాక్షః' గురించి, మనలో అంతా వికాసం చెంది మొత్తం బయటవాళ్ళకు అందుతుంది. ఎప్పుడూ? విష్ణు లోకంలో ఉండటానికి మనం ప్రయత్నం చేస్తే! లోకం విష్ణువే కనుక మనం విష్ణు లోకంలో ఉన్నాము అనుకోండి, అదే వైకుంఠంలో ఉండడం అంటే. వైకుంఠం అంటే ఎక్కడో అవతల ఉందనుకోవడం ఒక పద్ధతి. మనం ఎక్కడ భావన చేస్తే అక్కడ వైకుంఠం ఉంటుంది. మన భావన యందు భగవంతుడు స్థిరపడితే వైకుంఠం మనయందు, మన చుట్టూ ఏర్పడుతుంది. అది భగవంతుడు ఇచ్చిన పెద్ద రహస్యం. ఎప్పుడైతే భగవత్ చింతన మనలో ఉంటుందో మనకు రాగద్వేషాలురావు. ఇలా కూర్చొని మంచి విషయాలు చెప్పకుంటుంటే ఆ కాసేపు రాగద్వేషాలు ఎందుకు రావు అంటే భగవత్ చింతన చేసుకుంటున్నాం కాబట్టి. మామూలు సన్నివేశాలలో కూడా ఎదురుగుండా ఉండే వ్యక్తులు, సమయాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భగవంతుడే అని గుర్తు పెట్టుకోవడం అనేది అత్యుత్తమ సాధన. అది చేసుకున్నంత సేపు భగవత్ సంబంధమైన భావన తెరవెనుక ఉంటే, అంటే మన మనసు వెనక ఉంటే, ఆ భావన ఉండటం వలన రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష అసూయలు ఉత్పన్నం కాకుండా ఉంటాయి. ఆ భావన తప్పుకుంటే ఇవన్నీ కప్పేస్తూ ఉంటాయి. అందుకే లోకాన్ని విష్ణుపరంగా చూడాలి. అప్పుడు మనం ఉంటున్నది విష్ణులోకం. అలాగే శివుడుపరంగా చెప్పుకుంటే అది శివలోకం. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు. అలాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు, ప్రద్యుమ్నుడు అని ఒక వ్యూహం చెప్పుకున్నాం కదా. అట్లాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు, ఈశ్వరుడు ఇట్లా చెప్పుకుంటాం. అట్లాగే

ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. ఎట్లా చెప్పకున్నా పేర్లే. అసలు విషయం ఏంటంటే ఉన్నది ఒక్కటే అని గుర్తు ఉండాలి. ఇన్ని రూపాలలో ఉన్నది ఒక్కటే అని గుర్తుండాలి. మనం అందరితో ప్రవర్తించినప్పుడు అది గుర్తు ఉండాలి. అలా ఉంటే మనలో మార్పు వస్తుంది. మనల్ని మనం బాగు చేసుకోవడానికి చేసుకునే కార్యక్రమమే కదా ఇది. అంతేగాని this is not a favour to God. ఇది దేవుడికి ఉపకారం కాదు. ఇలా చేయకపోతే పాపం భగవంతుడు ఏమైపోతాడో అని కాదు కదా, మనం చేస్తున్నది. చేస్తున్న కార్యక్రమములలో నుండి మనలో ఉద్ధారణ కలగాలి. మనలో ఉద్ధరింపు రావాలి. దేనికి? మన మనస్సు, ఇంద్రియములు, శరీరమునకు చక్కని అనుసంధానం ఏర్పడాలి. శమము ఏర్పడాలి. దేహంలో ఉన్నంత కాలం మనకు పరిపూర్ణమైన ఆనందం కలగాలి. దేహంలో ఉండడమే ఒక బందిఖానాలో ఉన్నట్లు అన్న పరిస్థితి భగవంతుడు సృష్టించింది కాదు. మనం చేతకాక చేసుకున్నాం. కాబట్టి దాన్ని మనం తెలుసుకోవాలంటే మనలో మార్పు రావాలి. మనలో మార్పు రాకుండా మేము ఇలాగే ఉంటాము మీరు అలా చెప్పకు పోతూ ఉండండి అంటే అలా చెప్పకు పోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. మార్చుకోని వారు అలాగే బందిఖానాలో ఉన్నట్లుగానే బాధలు పడుతూ ఉన్నారు. ఈ మార్పు తెచ్చుకోవడాన్నే 'వ్యవసాయం' అంటారు. విశిష్టమైన పర్యవసానం చెందే దాన్ని వ్యవసాయం అంటారు. విశిష్టమైన పర్యవసానం మన దేహాదుల యందు ఏర్పడాలి. ఏర్పడితే then we can see better, we can listen better, we can speak better, we can understand better. Everything is better in ourselves when we are in this practice. Suppose there is no betterment it means there is no practice. Betterment, time తీసుకొస్తుందని wait చేస్తే అవ్వదు. Time వచ్చి వెళ్లి పోతుంది. మంచిరోజు వచ్చినప్పడే తెల్లవారుజామున లేస్తానండీ అనుకుంటే ఎప్పటికీ లేవలేం. మంచిరోజుగా మనం తయారు చేసుకోవాలి. దానికి మనకు భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు. దాన్ని వినియోగం చేసుకోవాలి. ఈ విధంగా చేసుకుంటే వ్యవసాయం అంటే విశిష్టమైన పర్యవసానం అంటే, మార్పు తీసుకొస్తుంది. ఎటువంటి మార్పు తీసుకు వస్తుంది? చిన్న గింజ కొన్ని వేల విత్తనాలుగా తయారుచేసే ప్రపంచంలో కొన్ని వేల మందికి ఆహారంగా చేసే పద్ధతి ఉన్నది. దీనికి ఏం చేస్తారు? భూమిని దున్నుతారు. విత్తనం వేస్తారు. నీరు పోస్తారు. దాన్ని పెంచుకుంటారు. దాన్ని పెంచేటప్పుడు రక్షణ చేసుకుంటారు. తర్వాత ఇంటికి పట్టుకొచ్చుకుంటారు. తినేట్టు గా తయారు చేసుకుంటారు. తింటారు. ఇంత జరుగుతుంది. వేసిన గింజ ఆర్నెల్లు అయినా వేసినట్లే ఉంటే? ఏం చేస్తున్నావ్ అంటే పాతిన గింజ తీసి తింటున్నా అన్నట్లుగా ఉంటే ఎలా? అంటే గింజ గింజ గానే ఉండి పోయి, మొక్క అవకుండా దాంట్లోంచి ధాన్యం అవ్వకుండా ఎంతకాలం? ఎక్కువ మందికి భగవంతుని సాధన ద్వారా ఈ వ్యవసాయం ఎందుకు జరగదు? లోకమునందు ఈ విధమైన దృష్టి ఉండదు కాబట్టి! లోకమును కొంచెం తక్కువ చూస్తూ ఉంటారు. నిజానికి

లోకమే భగవంతుడు. కాబట్టి లోకాన్నే భగవంతుడు గా చూడాలి. లోకాన్ని భగవంతుడుగా చూసుకుంటూ, విష్ణు సహస్రనామం అభ్యాసం చేసుకుంటే ఫలశ్రుతి బాగా ఉంటుంది. 'ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః' విష్ణు సహస్రనామం తర్వాత ఫలశ్రుతి ఉన్నది. అందులో భయం వచ్చే వారికి భయం తప్పిస్తాడు. ఆపద వచ్చే వారికి ఆపద నుండి తప్పిస్తాడు. మృత్యువులో వెళ్లే వాడికి మృత్యువు నుండి తప్పిస్తాడు-- ఇవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు వస్తాయి? ఈ నామాల్లోని సత్యాలు మన జీవితాల్లో అనుభూతి చెందినప్పుడు కదా! ఈ సాధన, వేయి నామాలు జపించే లోపల పరిపూర్ణం కాకపోయినా కనీసం మొదలవ్వాలి.

విష్ణు సహస్రనామం గూర్చిన ప్రసంగములు వార, వారము ఏర్పాటు ఎందుకు చేసుకుంటున్నాము? ఈ వారం రోజులలో మనము అంతర్యామి యందు ఏ మాత్రం నిలబడి ఉన్నాము, అంతర్యామి పైన ఏర్పడుతున్న త్రిగుణముల యొక్క క్రీడ యందు ఎంత లోబడి జీవిస్తూ ఉన్నాము, అందరి జీవుల రూపంలోనూ ఉండే ఒకే ఒక అంతర్యామిని గుర్తు చేసుకొని సజీవమైన మూర్తులు అన్నీ కూడా మనము భగవంతుడుగా ధ్యానము చేసుకోగలుగుతున్నామా లేదా అని assess చేసుకోవడానికి, ఏర్పాటు చేసుకున్నాము. ఆ సాధన జరిగినప్పుడు మనకి భగవంతుని యొక్క సాన్నిధ్యము మనకు లభించినట్లు! అలా కాక జ్ఞానము, విజ్ఞానము దాని యొక్క సేకరణ యందు నిమగ్నమైనట్లయితే, ఎన్ని జన్మలు గడిచినప్పటికీ కూడా మనలో భగవంతుని యొక్క అనుభూతికి అవకాశము ఉండదు. నేర్చుకోవటం ముఖ్యం కాదు, గుర్తు తెచ్చుకొని గమనిస్తూ ఉండటం అనేది సాధన! నేర్చుకున్నవి మర్చిపోతాం. ఈ విధంగా చూడటం మొదలు పెట్టినప్పుడు మనము కూడా అంతర్యామిలో భాగంగా మనల్ని మనము అవగాహన చేసుకుని, శాశ్వతములమై, అక్షరములమై భగవంతుని అనుభూతిని ఎక్కువ పొందుతూ, సృష్టిని అంతా కూడా భగవంతుని క్రీడగా, వైభవంగా కొనియాడుతూ, దానియందు మనము అంటక జీవించడానికి అవకాశం ఉంది. భగవత్ భక్తులు అలా జీవిస్తూ ఉంటారు. అది వాళ్లకు ఎలా సాధ్యమైందంటే ఆ సాధనే! ఇది చేయక ఎంత ఆరాధన చేసినప్పటికీ ఆయన సాన్నిధ్యాన్ని పొందటానికి అవకాశం లేదు. ఈ సాధననే 'అనుష్ఠానం' అని కూడా అంటారు. శ్రీకృష్ణుడు 'నా మతము అంటే, అందరిలో ఉన్న నన్నే దర్శిస్తే నీకు గుణముల యొక్క ఆట అంటదు. నన్ను దర్శించకపోతే నీవు గుణములలో ఇరుక్కుపోతావు. నువ్వు బంధింప పడతావు, సుఖము కోరి దుఃఖ పడతావు, సౌకర్యములు కోరి అసౌకర్యములు అనుభవిస్తావు. లాభం కోరి నష్టం పొందుతావు. జయం కోరి అపజయం పొందుతావు' అని చెప్తాడు. అందుకని ఈ త్రిగుణములలో తేలేటటువంటి సృష్టికి ఏదైతే ఆధారమో దానిని దర్శనము చేయుట సాధన. అదీ అనుష్ఠానము! పుస్తకాలతో ఏమాత్రం సంబంధం లేదు. అది జీవితము అనే ఒకే ఒక పుస్తకముతో సంబంధం ఉన్న విషయము. ఆ జీవితము అనే పుస్తకములో మనకు ఒకొక్క రోజు ఒక్కొక్క పుట. సంవత్సరము ఒక chapter. ఒక chapter లో 365

pages ఉంటాయి. అటువంటి chapters ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క chapter గా మనం చూసినట్లయితే మనమే ఒక పెద్ద గ్రంథం.ఈ గ్రంథములో రాసింది అంతా భగవత్ తత్వం గూర్చి రాసామా, భగవత్ తత్వమే అనుభూతిగా ఉన్నామా? చూసుకోవాలి. మాస్టర్ గారు 'అయస్కాంతం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము అయస్కాంతీకరణము చెందాలి కదా! వెలుగు గురించి ఎంత తెలిస్తే ఏమి లాభం వెలుగై ఉండాలి కదా' అంటూ ఉండేవారు. ఆహారం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము? తింటేనే కదా దాని యొక్క అనుభూతి. అందుకని అనుభవైకమైన జ్ఞానము, అనుభూతిపరమైన జ్ఞానము ఎక్కడి నుంచి వస్తుంది అంటే కనబడుతున్న దానికి ఆధారముగా ఉన్న దానిని గమనిస్తూ ఉండటం అనేది చేయగలిగిన నాడు. అది మాటిమాటికి గుర్తు తెచ్చుకోవడానికి ఇటువంటి క్లాసులు పెట్టుకుంటాము తప్ప విష్ణు సహస్రనామంలో ఎంత చెప్పారు, ఒక్కొక్క నామానికి ఎంతెంత వివరణ వచ్చింది, ఆ వివరణలో జ్యోతిష్యం ఎంత వచ్చింది, శబ్దాల గురించి ఎంత వచ్చింది, తంత్రం గురించి ఎంత వచ్చింది, మంత్రం గురించి ఎంత వచ్చింది అని కాదు. అంతర్యామిని దర్శనం చేయడం అంటే ఉదాహరణకి ఒక ఆయన మాట్లాడుతున్నాడు అనుకోండి ఆయనలోంచి మాట్లాడే వానిగా ఉన్న భగవంతుని దర్శనము చేయాలి. మాట యొక్క అర్థము అనేది పైన తేలేది. లోపల ప్రవాహముగా సరస్వతి ఉన్నది కదా! ఎవరైనా మాట్లాడుతూ ఉంటే ఆ సరస్వతీ ప్రవాహము ఎలా ఉందో గమనించామా? అంతర్యామిగా ఉన్నది అక్కడ సరస్వతి ప్రవాహం under-current అంటాం. బహిర్గతంగా నదీ ప్రవాహం పై బోలెడన్ని పడవలు, బోల్డు దూలాలు, కర్రలు ఉంటాయి అలా అన్నీ తేలుతూ ఉంటాయి. తేలుతూ ఉన్న వాటిని చూస్తున్నామా, ప్రవాహమును చూస్తున్నామా? ప్రవాహం ఉండకపోతే ఈ తేలేవన్నీ ఏమీ లేవు కదా! అట్లాగే జీవితంలో మనము వస్తువు, పశువు, వృక్షాలు మొదలైన కనబడే అన్నిటి యందు అంతర్యామిగా ఉండే వాడిని గుర్తు తెచ్చుకొని ఆ మూర్తులతో ప్రవర్తించడము అనేది సాధన. అలా కానప్పుడు మనము ఎన్ని విషయాలు తెలుసుకున్నా మళ్లీ మర్చిపోతూ ఉంటాము. తెలియటం ముఖ్యం కాదు ఇక్కడ నేర్చుకోవడం ముఖ్యం కాదు. ఈ విధమైన అనుష్ఠానము ముఖ్యము. అన్నింట్లోనూ నన్ను ఈ విధముగా దర్శనము చేయటం అనేది నా మతము అని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఆ సాధన మాత్రమే మనల్ని లోతుల్లోకి తీసుకు వెళుతుంది. లేకపోతే జీవితము కాసేపు మునుగుతూ ఉంటుంది, కాసేపు తేలుతూ ఉంటుంది, కాసేపు ఢీ కొట్టుకుంటూ ఉంటుంది, కాసేపు కిందకు పడుతూ ఉంటుంది, కాసేపు పైకి ఎగురుతూ ఉంటుంది, ఏవేవో అట్లా తమాషాలు జరుగుతూ ఉంటాయి. సాక్షీభూతుడిగా ఉండవలసిన జీవుడు, తన యొక్క చిత్త ప్రవృత్తులలో ఇరుక్కుని తనే బోల్తాలు కొట్టేస్తూ ఉంటాడు. ఈ చిత్త ప్రవర్తనాన్ని త్రిగుణాత్మకమైన వంటి రజస్సు, తమస్సు కారణముగా, వాటి యొక్క సమతూకము లేకపోవటము కారణముగా రకరకాల బాధలు అనుభవిస్తూ

ఉంటాడు. అలా కాకుండా సమస్తము లో నిండి ఉన్న అంతర్యామిని దర్శించడానికి చేసే సాధనలే ఈ సహస్రనామ వివరణ కార్యక్రమము.

కంభంపాటి పార్వతి కుమార్

# విషయ సూచిక


502 గభస్తి ..... 1

503 నేమిః ..... 2

504 సత్త్వస్థః ..... 9

505 సింహో ..... 15

506 భూతమహేశ్వరః ..... 30

507 ఆదిదేవః ..... 35

508 మహాదేవః ..... 46

509 దేవేశః ..... 49

510 దేవభృత్ ..... 52

511 గురుః ..... 56

512 ఉత్తరః ..... 58

513 గోపతిః ..... 72

514 గోప్తా ..... 76

515 జ్ఞానగమ్యః ..... 78

516 పురాతనః ..... 81

517 శరీరభూతభృత్ ..... 85

518 భోక్తా ..... 98

519 కపీంద్రః ..... 102

520 భూరిదక్షిణః ..... 104

521, 522 సోమపః, అమృతపః ..... 105

523 సోమః ..... 115

524 పురుజిత్ ..... 116

525 పురుసత్తమః ..... 121

526 వినయః ..... 124

527 జయః ..... 137

528 సత్యసంధః ..... 138

529 దాశార్హః ..... 139

530, 531 సాత్వతాం, పతిః ..... 140

532 జీవః ..... 142
533 వినయితా ..... 149
534 సాక్షి ..... 154
535 ముకుందః ..... 160
536 అమితవిక్రమః ..... 163
537 అంభోనిధిః ..... 165
538 అనంతాత్మా ..... 174
539 మహోదధిశయః ..... 175
540 అంతకః ..... 179
541 అజః ..... 183
542 మహార్హః ..... 196
543 స్వాభావ్యః ..... 204
544 జితామిత్రః ..... 211
545 ప్రమోదనః ..... 216
546, 547, 548 ఆనందః, నందనః, నందః ..... 223
549, 550 సత్యధర్మా, త్రివిక్రమః ..... 236
551 మహర్షిః ..... 242
552 కపిలాచార్యః ..... 248
553 కృతజ్ఞః ..... 254
554 మేదినీపతిః ..... 260
555 త్రిపదః ..... 265
556 త్రిదశాధ్యక్షః ..... 271
557 మహాశృంగః ..... 275
558 కృతాంతకృత్ ..... 282
559 మహావరాహః ..... 289
560 గోవిందః ..... 298
561 సుషేణః ..... 301
562 కనకాంగదీ ..... 304
563, 564, 565, 566 గుహ్యాః, గభీరః, గహనః, గుప్తః ..... 307
567 చక్రగదాధరః ..... 326

568, 569 వేధాః, స్వాంగః ..... 332
570 అజితః ..... 337
571 కృష్ణః ..... 340
572 ధృఢః ..... 344
573 సంకర్షణః ..... 347
574 అచ్యుతః ..... 354
575 వారుణః ..... 357
576 వరుణః ..... 360
577 వృక్షః ..... 364
578 పుష్కరాక్షః ..... 368
579 మహామనాః ..... 370
580 భగవాన్ ..... 380
581 భగహా ..... 381
582 ఆనందీ ..... 383
583 వనమాలి ..... 393
584 హలాయుధః ..... 402
585, 586 ఆదిత్యః, జ్యోతిరాదిత్యః ..... 409
587 సహిష్ణుః ..... 412
588 గతిసత్తమః ..... 415
589 సుధన్వా ..... 420
590 ఖండపరశుః ..... 430
591 దారుణః ..... 433
592 ద్రవిణప్రదః ..... 435
593, 594 దివిస్పక్, సర్వదృక్ ..... 445
595 వ్యాసః ..... 449
596, 597 వాచస్పతిః, అయోనిజః ..... 454
598 త్రిసామ ..... 469
599 సామగః ..... 471
600 సామ ..... 472

# 502 గభస్తి

'గ' అనే శబ్దము గమనముకు ప్రతీక. గం గణపతయే నమః అంటాము. వ్యాపకశక్తి! అదే గురువులో 'గ' కూడా. కాబట్టి గమనము కలిగిన వాడు.'భ' అనే అక్షరము బృహ్మణంకు సంబంధించిన అక్షరం అంటే అవ్యక్తం నుండి వ్యక్తమునకు వచ్చే తత్త్వము. అవ్యక్తుడే వ్యక్తుడవుతుంటాడు. అవ్యక్తం లో నుండి వ్యక్తములోనికి ఎట్లా వస్తాడనేది కుంభరాశి మార్గము అని చెప్తారు. 'The Aquarian passage'. అది తెలిస్తే చావు పుట్టుకల రహస్యం తెలుస్తుంది. అది తెలపగలిగినవాడు అగస్త్యమహర్షి. ఋషీంద్రుల అవతారంలో అతి ప్రాముఖ్యము కలిగినవాడు, అదే మళ్లీ Master CVV గారు అందించారు. 'భ'అనే శబ్దము బృహ్మణం లేదా వ్యక్తం చేయుట.'గ' అనే శబ్దము గమనము, వ్యక్తమై గమనం చేస్తూ ఉంటాడు. కేవలం వ్యక్తమగుటయే కాక అక్కడి నుండి వ్యాపనం చెందుతాడు. 'స్త' అనే శబ్దానికి స్థిరపడుట, నిలబడుట, ఉండుట గా గోచరింపచేసేవాడు అని అర్థం.

## 503 నేమిః

నేమిః అంటే వృత్తమైన ఆకారము. గుండ్రమైన ఆకారము. 'అనేమి చక్రం' అంటారు. అంటే గుండ్రంగా ఉంటుంది కానీ పరిధి కనబడదుట. అలాగే గభస్తినేమి అనే ఒక శబ్దం భగవంతుడిది. ఇందులో నాలుగు అక్షరాలు నాలుగు రకాలైన భగవత్ తత్త్వాన్ని తెలియజేస్తాయి. గమనము, వ్యక్తమగుట, స్థిరపడుట, గుండ్రముగా నుండుట. 'భ' అనే అక్షరానికి మరియొక అవగాహన ఏమిటంటే వెలుగు. భారతీయులం అంటే వెలుగు నందు రతి కలిగిన వారమని అర్థం. వెలుగు నందు ఎవరికి ఆసక్తి ఉంటుందో, ఆసక్తి ఎటువంటి ఆసక్తి అంటే రతి వలె ఆసక్తి అన్నమాట, ఎందుకని? రతిసలిపేటి వాడికి అదే భావన తప్ప ఇతరమైన భావన ఉండదు. అనన్య చింతన ఉండదు. అటువంటి అనన్య చింతన వెలుగుతో కూడిన వాడు భారతీయుడు. అలా ఎక్కడ ఉన్నా వాడు భారతీయుడే. ఇక్కడ ఉండి ఆ రతి లేనప్పుడు భారతీయుడు కాడు. ఎందుకంటే మనకి డబ్బు కావాలి, లేకపోతే పదవులు కావాలి, లేదా ఆస్తులు కావాలి, ఇలా ఉంటాం మనం. మనకి మరి ఎలా వ్యక్తమవుతాడు? వ్యక్తమయితే వెలుగుగా కనిపిస్తాడు తప్ప, ఇంకొక రకంగా కనిపించడు. అవ్యక్తుడు వ్యక్తమవడము అంటే, మనకి కనబడని విద్యుత్తు, కనబడే దీపం లాగా రావడం లాంటిది. కనపడితే అమ్మవారు అవుతారు. ఎందుకని? ఆయన కనబడటం అంటే ఆమె కనబడడమే. ఆవిడ కనబడితే, ఆవిడగా ఆయన వచ్చారని తెలుస్తుంది. Tube light విద్యుత్ ఉండబట్టే వెలిగింది కదా. విద్యుత్ కనబడడం అంటే అట్లా కనబడుతుంది, వినబడడం అంటే ఇట్లా mike ద్వారా వినబడుతుంది, విద్యుత్తుని చూడలేం కదా. చోటులో ఉంది. Wire లో ఉంది అని విప్పతీసి చూస్తే ఎట్లా ఉంటుంది? చూసేవాడు విద్యుత్ లోకి లయమైపోతాడు. మనలో కూడా అదే ఉంది, fuse off అంటాం కదా. మనలో ఉండే విద్యుత్తు, చోటులో ఉండే విద్యుత్తు, కలిసి పోతే మనం మిగిలిపోతాం. కాబట్టి, కనబడనిది కనబడడం అంటే, వెలుగుగా కనబడడం. అమ్మవారిగా ఇంద్రుడికి కనపడి, 'నేను వచ్చానంటే ఆయన వచ్చాడు అనుకో', అని చెప్తుంది. అంటే భగవంతుని యొక్క వ్యక్తరూపం అమ్మవారు, వెలుగు. కాబట్టి ఆయన వ్యక్తమవడం అంటే బృహ్మణం చేయడం అంటే వెలుగుగా రావడమే. వచ్చిన వెలుగు గుండ్రంగా వస్తుందట. Space Globe! మన గోళం కూడా అలాగే గుండ్రంగా ఉంటుంది కదా. వెలుగు గోళం కూడా గుండ్రంగా ఉంటుంది. నిశీధిలోకి మనం ఎగిరి ఈ గోళాన్ని చూస్తే, ఇది కూడా వెలుగుతున్నట్లుగా గోచరిస్తుంది. ఈ మధ్య మనకి శాస్త్రజ్ఞుల పుణ్యమా అని, భూమి కూడా చాలా చక్కగా ఆకాశంలో ముత్యంలా వెలుగుతున్నట్లు గోచరిస్తోంది, వెలుగు ఉందండోయ్ భూమికి, అని తెలిసింది. మనకు కనబడదు. కొండల్ని దూరం నుండి చూస్తే వెలుగు. వెలుగు చంద్రుడికి, సూర్యుడికే ఉందనుకోకండి,

భూమికి ఈ వెలుగు ముందే ఉంది. భూమికి ఒక పరిధి ఉంది, ఆ పరిధిలో తిరుగుతుంటుంది, ఆ పరిధి దాటిపోదు. సూర్యుడి చుట్టూ తిరగడానికి ఒక పరిధి ఉంది. అందులోనే తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడు చుట్టూ తిరుగుతుంటుంది. కాబట్టి భూమి గభస్తినేమి! అలాగే మిగతా గ్రహాలు కూడా. అన్నీ సూర్యుడిలో నుండి దిగివచ్చి వెలుగు ముద్దల్లా ఏర్పడినాయి. సూర్యుడు ఒక వెలుగు ముద్ద. అందులో నుండి దారాలు దారాలుగా వచ్చి, మళ్ళీ ఉండలు ఉండలుగా తయారైనాయి. ఒక ఉండ అందులో నుండి బయటడి వస్తే, మన భూమి కన్నా 6 రెట్లు ఎక్కువ వెలుగుగా ఒక ఉండ్రాయి తయారైనది. అది బుధుడైనాడు. మన కన్నా రెండు రెట్లు ఎక్కువ వెలుగుగా ఇంకొక ఉండ్రాయి వచ్చింది, అది శుక్రుడు. ఆకాశంలో మనకి అన్ని నక్షత్రాలకన్నా, గ్రహాలకన్నా బాగా వెలుగుగా కనిపించేది శుక్ర గ్రహం. మిగతా గ్రహాలు అంత వెలుగుగా కనిపించవు. దాని వెలుగు మిగతా వాటి వెలుగు కన్నా తక్కువే. కానీ మనకు దగ్గరగా ఉండడం చేత అలా కనిపిస్తుంది. ఇక్కడ tube light బాగా కనిపిస్తుంది, అక్కడ కైలాసగిరి కొండపైన, flash light అయినా ఇక్కడకి తక్కువగా కనిపిస్తుంది కదా. ఇది tube light అది flash light! దీనికి దానికి పోలిక లేదు. కానీ ఇది దగ్గరగా ఉండడం చేత అలా కనిపిస్తుంది. ఇట్లా ఒక రెట్టు, రెండు రెట్లు, మూడు రెట్లు, నాలుగు రెట్లు, ఐదు రెట్లు, ఆరు రెట్లు, ఏడు రెట్లు, సూర్యుడు, భూమి వెలుగు కన్నా. అన్నీ వెలుగు ముద్దలే. అవి ఏమి చేస్తున్నాయి? సూర్యుడికి అదే దూరం లో తిరుగుతుంటాయి. ప్రతిదానికి పరిధి ఉంటుంది. సూర్యుడికి ఒక దూరంలో భూమి, అంతకన్నా దూరంలో బృహస్పతి, అంతకన్నా దూరంలో శనిగ్రహం అటుంటారు. ఇటు శుక్రుడు, కుజుడు, బుధుడు ఉంటారు. దాన్నిబట్టే 'హోరాశాస్త్రం' వచ్చింది. పొద్దున్నే ఈవేళ ఆదివారం, లేవంగానే మొదటి గంట సూర్యుడు, తర్వాత గంట శుక్రుడు, ఎందుకు వచ్చింది అంటే సూర్యుడు కేంద్రంగా వృత్తములుగా మిగతా వాళ్ళందరూ తిరుగుతూ ఉంటారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క పరిధి. ఆ పరిధిలో తమ చుట్టూ తాము తిరుగుతూ, సూర్యుడు చుట్టూ తిరుగుతుంటారు. వీళ్లందరి పరిధి కలిసి సూర్యుడి పరిధి. అదే ఆయన Memorandum. Memorandum అనేది CVV గారి భాష. ఒక్కొక్కళ్ళకి ఒక పన్నా. ఎవడి పన్నా బట్టి వాడి Memorandum of Association రాసుకుంటారు కదా. అందులో నిర్వచిస్తారు- మేం ఇవి చేయవచ్చు, ఇవి చేయకూడదు అని. అలాగే భూమికి ఒక Memorandum ఉంది. ఆ Memorandum ఆ భూమి జీవలక్షణములో Memory గా ఉంటుంది. అందుకనే CVV గారు ఏమన్నారం టే నీవు ఒక Memory వి. ఎందుకంటే, నీవు ఒకడివి ఉన్నావనుకుంటావు కదా. అదే నీ Memory. నువ్వు ఒక్కడివి ప్రత్యేకంగా ఉన్నావు అనుకుంటున్నావు కాబట్టి నీకు బుల్లి పన్నా ఒకటి ఉంటుంది. అదే నీ Memorandum. అట్లా భూమి పరిధి చిన్నిది. అంతకన్నా మిగతా గ్రహాల పరిధి పెద్దవి. అందరికన్నా పెద్ద పరిధి శని గ్రహానిది. అలా అందరినీ తన చుట్టూ తిప్పుతున్నవాడు

తనలోంచి వచ్చినవాడు కాబట్టి, ఆయనని గభస్తినేమిః అన్నారు. మరి ఆయనో? ఆయన కూడా తిరుగుతున్నాడు. ఆయనే సౌనమహర్షి. మనకి ముందు ముందు తెలుస్తుంది, ఋషులు ముందే చూశారు. ఇంకో ఆయన చుట్టూ తిరుగుతుంటాడాయన. ఎవరాయనా? 'ధ్యేయ స్సదా సవితృ మండల మధ్యవర్తీ' అని అంటుంటాం. ఈ 12 మంది సూర్యులూ కలిసి ఈ ఏడు గ్రహాలు ఒక సూర్యుడు చుట్టూ తిరుగుతున్నట్లు, తిరుగుతుంటారు. ఈవేళ సూర్యుడు చుట్టూ తిరిగేవి ఏడు గ్రహాలు అని తెలుసు. ఇవి కాక రెండు చాయాగ్రహాలు, అవి గ్రహాలు కావు. ఛాయలు. '7 ఏమిటో 72 ఉన్నాయి చూస్తే' అంటారు జ్వాలాకూల్ మహర్షి. సూర్యుని సంసారం 72, ఈ వేళకి 10 తెలిసినాయి. ఆ మధ్య ఇంద్రగ్రహం కనిపించింది అదే Neptune అన్నారు. యమగ్రహం ఉందని తెలిసింది Pluto అన్నారు. వరుణ గ్రహం తెలిసింది Uranus అన్నారు. ఏడు నుండి పది అయ్యాయి. అంతేనా? కాదు, 'సూర్యునికి మొత్తం సంతానం అంతా కలిపి 72' అని చెప్పారు జ్వాలాకూల్ మహర్షి. అదేమిటి సార్? అంటే 'తెలుస్తుంది నెమ్మదిగా, మీరు వెలుగులోకి బాగా ప్రవేశించిన కొలది మిగతావన్నీ కూడా కనిపిస్తూ ఉంటాయి. మీరు మీ Group Life లో ఇంద్రుడ్ని, వరుణుడ్ని వేసుకున్నారు. ఇంద్రగ్రహం (Neptune) మీకే కాదు, ఐదు సౌర కుటుంబాలకి ఒకడుగా నిలబడుతున్నాడు' అని చెప్పారు. ఐదు సౌర కుటుంబాలకి ఒక ఇంద్రగ్రహం ఉందండి. ప్రతి వాళ్ళకి మా వాడే అనిపిస్తుంటాడు. కృష్ణుడ్ని ప్రతివాడు మా వాడే అనలేదూ? గోపికలు మా వాడే అంటే, హిమాలయాలలో ఉండే ఋషులూ మా వాడే అంటారు. ప్రతి వాళ్ళకి మా వాడే. ఏదో అనుకుంటున్నారు, అనుకోనీండి, అన్నారు జ్వాలాకులుడు. ఇంద్రగ్రహం ఎప్పుడైతే మీకు కూడా కనిపించిందో దాని ప్రభావం మీ మీద ఉందన్న మాట. రాహువు సూర్యుడ్ని మింగినది మనం చూసినప్పుడు, రాహు ప్రభావం మన మీద ఉంటుంది. భూమి మీద ఉంటుంది. మిగతా అప్పుడు రాహు ప్రభావం ఉండదు. కేతు ప్రభావం తాను చంద్రుడ్ని మింగినప్పుడు, మనం చూసినప్పుడు, దాని కిరణాలు భూమి మీద పడినప్పుడు, ఈ భూమి మీద జీవకోటి మీద ఉంటుంది లేకపోతే ఉండదు. వరుణగ్రహం కనబడినప్పుడు నుండి వరుణ ప్రభావం మన మీద ఉంటుంది, ఎందుకని? మనం ఆ రెండూ చూశాం కదా. ఎక్కడో ఊరి బయట గురువుగారు ఉన్నారట అని తెలిస్తే ఆయన ప్రభావం మన మీద పడదూ? అంతవరకు ఉన్నారని కూడా ఎవరికీ తెలియదు. ఎవరో ఒకడు పోయి చూసొస్తాడు, ఒక గురువుగారు వచ్చాడు రండి మనం కలుద్దాం అంటే పాలోమని పోతాం కదా. అప్పటి నుండి ఆయన ప్రభావం మన మీద ఉంటుంది కదా. ఇలా గోళాలు గోళాలుగా 72 ఉన్నాయి. ప్రతిదీ గోళాలుగా దింపుకొస్తాడండీ, వెలుగుని. అవి గోళంగా ఉన్నాయా లేక చతురస్రంగా ఉన్నాయా అని దేనితో చూస్తామూ? కన్నులతో. అది ఎట్లా ఉంది? ముక్కు గోళంగా లేదు, పళ్ళు గోళంగా లేవు, చెవులు గోళంగా లేవు. కాబట్టి మనలో గోళాలన్ని కూడా చూడాలి. రెండు గోళాలు చూశాం కదా ఇప్పటికి. ఇంకా గోళాలున్నాయి. ఇంకో

గోళం మూడోకన్ను, పైన, శివుడు కన్ను. శివుడు మనల్ని అనుగ్రహిద్దామంటే అక్కడ నుంచే చూస్తాడు. అది ఆయన property. మనది కాదు. గాయత్రి చేసేటప్పుడు

బ్రహ్మా శిరో, విష్ణుర్ హృదయగం, రుద్ర శ్శిఖా

ఇన్నీ గోళాలే. షట్చక్రాలన్నీ గోళాలే. ఇన్ని గోళాలు పెట్టుకున్న నీకు రెండు గోళాలు ఉన్నాయనే తెలుసు. అవి ఊరికే బయట ప్రపంచం చూడడానికి తప్ప, సూక్ష్మ లోకాన్ని చూడగలిగే గోళాలు కావు. నీవు ఒక సూర్య మండలం అని వారు చెప్తారు. నువ్వు సూర్యుడివి, బయట ఏ గ్రహాలు ఉన్నాయో అవి నీలో కూడా ఉన్నాయి. గణపతి ఉన్నాడు మూలాధారంలో, లేకపోతే బృహస్పతి అనుకో. ఒక స్థితిలో శని అవుతాడు. బృహస్పతి మన మూడో కన్నులో ఉంటాడు, శని మూలాధారం లో అక్కడ బిగించేస్తాడు. అందుకనే మనం పైకి లేవలేము. ఊర్ధ్వగతి చేరలేం. అనుకోవడం, వినడం తప్ప అవదు కదా. ఎందుకు అవదు? పట్టువల్ల. పట్టు ఉంటే అక్కడ నుండి లేవవు, నీ పట్టే నీలో ఉన్న శని. అందుకని ఏం చేయాలి? అస్సలు బొత్తిగా పట్టే లేనివాడిని తెచ్చి అక్కడ పెట్టుకోవాలి, ఆయనే బృహస్పతి. ఆయనకి దేని మీదా పట్టుండదు. మనం పట్టడం ఏమిటి? పట్టంతా వాడిది, విడుపు వాడిది అని తెలిసినవాడు. అందుకనే గణపతి ధ్యానం మూలాధారే అని మొదలు పెడతాం కదా. 'గం' అని చెప్తాం, ఎందుకనీ, అక్కడ Expansive Conciousness! బృహస్పతి జ్ఞాపకశక్తి, గురువు కదా. శని Consolidating consciousness, పోగేస్తాడు, తెచ్చిపడేస్తాడు, స్థిరపడుస్తాడు, ఏం తెచ్చుకుంటే అది పోగేసి స్థిరపరిచి concretise చేసేస్తాడు. అయిపోతుంది. నీవు మంచి తెచ్చుకుంటే Universal consciousness చేసేస్తాడు. Concretisation శని చేసి పెడుతుంటాడు మంచికిగాని, చెడుకిగాని. అక్కడ బృహస్పతిని తలుచుకో, గురువు కదా. అక్కడ ఉండేది శనిగ్రహం. అందుకనే శనిని ప్రార్థన చేయమంటారు. శని ప్రార్థనే అక్కడ చేసే శివ ప్రార్థన. 'వదలవయ్యా బాబు కాస్త' అంటే, 'నాకేం లేదు నీవు వదలడం లేదు' అంటాడు లోపలి నుండి. 'నీవు బయట విషయాలు వదిలేయ్. నేనేం పట్టుకోలేదు. నీ పట్టుబట్టే అక్కడ పట్టు ఉంటుందని' చెప్తాడు. మనకి ఎంతెంత పట్లు ఉంటాయంటే, మన పట్టుని ముట్టుకుంటే తేనెటీగలాగ కుట్టేస్తాం. మరి విడుపు ఉండాలి. అట్లాగే మూలం. స్వాధిష్టానం లో అంగారకం, కుజుడంటాం. English లో Mars అంటాం. అలాగే బొడ్డులో/ మణిపూరకం లో చంద్రుడు, మనస్సు. మనస్సు మీద కూడా మళ్లీ శని పట్టు ఉంటుంది, మొదటి పట్టేమో భౌతికం మీద. ఇక్కడ పట్టేమో మన అభిప్రాయాల మీద. హృదయంలో/అనాహతం లో శుక్రుడు, విశుద్ధి లో బుధుడు. ఆజ్ఞలో బృహస్పతి. మనలో నేను, తానుగా ఉండేవాడిగా, హృదయ కమలం ఒకటి, విశుద్ధికి హృదయ కేంద్రానికి మధ్యలో ఉంటుంది. అక్కడుంటాడు సూర్యుడు. ఇలా దర్శనాలు చేసుకుంటే, వరుణుడు ఉన్నాడు, ఇంద్రుడు ఉన్నాడు, సమస్తం ఉంది. ఇట్లా దర్శనాలు లోపల జరుగుతాయి. ఇలా దర్శనాలు బయట కూడా చేసుకోవచ్చు. బయట ఉన్న గోళాలన్నీ లోపలా

ఉన్నాయి. ప్రతి జీవుడు ఒక సూర్య మండలం, future Solar System! అలా పెట్టుకున్నాడు ఆయన Programme. ఎప్పటికీ అయిపోవడం ఉండదది. అందుకనే చెప్పాడు- ఆ కనబడుతున్న సూర్యుడు, నేనూ ఒకటే అని అనుకోమని. అది ఒక ధ్యానం! నిజంగా అది సత్యం. వాడి దగ్గర ఉన్న సరుకంతా మనలో కూడా పెట్టాడు కదా. వాడిలో నుండి వచ్చాం కదా, మన సరుకు మన పుర్రెలోకి వెళ్లడం లేదూ? ఏం వెళ్తాయి? తప్పకుండా వెళ్ళేవి జబ్బులు. ఏం సందేహం లేకుండా వెళ్ళిపోతాయ్. మనకిచ్చిన ఆస్తి నిలబెట్టుకోలేరేమో గాని, మనకిచ్చిన జబ్బులు జీవితాంతం నిలబెట్టుకుని, దాంతో వాళ్ళు కూడా మనం పట్టిన దారి పట్టేస్తారు. అందిస్తామా లేదా? జాగ్రత్తగా Genes లో పదిలం చేసి ఇచ్చేస్తాం. జన్యువులు అంటారు సంస్కృతంలో genesని. ఇలా జన్యువులలో పదిలపరుస్తాం. మనకుండే కుళ్లుబుద్ధులు, మనకుండే లోభత్వం, మనకుండే మోహం, వాళ్ళకి అందించేస్తాం కదా. అట్లాగే సూర్యుడులో ఉండేదంతా మనకి అందించాడు. మనం గోళం అని మనకి తెలియదు. గోళాల గుంపు ఇదంతా, నడుస్తూ ఉంటుంది. ఇట్లా తయారు చేస్తాడండి. ఎక్కడికి వెళ్లాలి, ఇక్కడ మన దగ్గర నుండి సవితృ మండలం వరకు. సూర్యులందరికి సవితృ మండలము కేంద్రం. అయితే సవితృ మండలానికి కూడా మళ్లీ కేంద్రం ఉంటుంది. వాడినే మనం ప్రార్ధన చేస్తూ ఉంటాం-

ధ్యేయ స్సదా సవితృ మండల మధ్యవర్తీ
నారాయణ సరస్సిజాసన సన్నివిష్టః
కేయూరవాన్ మకర కుండలవాన్ కిరీటీ,
హారీ హిరణ్మయ వపుర్ధృత శంఖచక్రః

ఇది శ్లోకం. అందుకని ఈ సవితృ మండలాలన్నీ గుండ్రం గుండ్రంగా తిరిగి అక్కడ చేరుకుంటాయి. అక్కడ ఉంది అసలు గభస్తినేమి! అక్కడ నుండి మొదలై అట్లా అట్లా వస్తూ ఉంటాయి. మనం దీపావళికి కాల్చే విష్ణుచక్రాన్ని చూడండి తిప్పుతూ ఉంటే అందులోంచి రవ్వలు వచ్చి పడుతుంటాయి. అలా అక్కడ తిరిగితే వచ్చే ఒక్కొక్క రవ్వ ఒక సవితృ మండలం. మళ్లీ అది దానంతట అది తిరుగుతూ ఉంటుంది. మన విష్ణుచక్రం నుండి వచ్చిన రవ్వలు పడిపోతాయి, అవి పడకుండా మళ్ళీ దాని చుట్టూ 12 మంది సూర్యులని తయారు చేస్తూ ఉంటుంది. అవి పడవు వాటి చుట్టూ ఇన్ని గ్రహాలు తయారుచేసేస్తాయి. అంతేకాకుండా ఇవన్నీ మనలో కూడా నిక్షిప్తం చేశారు. ఏం scheme అండి? అసలు తాపత్రయం అంటే భగవంతుడేనేమో. అంత తాపత్రయం ఎవరికీ లేదు. కాబట్టి తాపత్రయం కాస్తో కూస్తో అంటింది. ఆయన దగ్గర లేనిదేది మన దగ్గరకు రాదండి. అట్లా వస్తుంది గభస్తినేమి అనేది భర్గోదేవస్య మండలం నుండి సవితృ మండలం వచ్చి, అక్కడ నుండి ఇది మనకి ఆదిత్యః సవితృ సూర్యః. కాబట్టి ఈ విధంగా మొత్తమంతా నడిపిస్తున్నావు. నీవు ఏం చేస్తున్నావు? ఒక బృహ్మాణము! అందులోంచి వెలుగు. దానికో గమనం. అదో గుండ్రాయి. గుండ్రాయిలో నుండి ఇంకో గుండ్రాయి అక్కడి నుండి

గుండ్రాయి గుండ్రాళ్ళుగా మనం ఉన్నాం. మనం గుండ్రాళ్లమే! ఆ విధంగా వచ్చేస్తాయి. ఇంత ప్రణాళిక ఉంది ఆ ఒక్క నామంలో. అట్లా మనం కూడా వ్యాపనం చెందవచ్చు. ఏం చెప్పారో తెలుసా మనం ఎట్లా ఉంటామో

నీవార శూక వర్తన్వీ పీతా భాస్వత్యణూపమా
తస్యా శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః

కదా.అంటే ఒక బియ్యం గింజ తీసుకుంటే దానిమీద ఒక తలకాయ ఉంటుంది. దానిమీద తలకాయంత బిందువు ఉంటుందట. లోపల నీలమైన రంగులో, కళ్ళు మిరుమెట్లు గొలిపే కాంతిగా ఉంటాడట. అంతే! అది ఉండబట్టే మనం ఇంత అయ్యాం. అది వచ్చేస్తే ఇదంతా పడిపోతుంది.

తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః స బ్రహ్మ స శివ స్స హరి

వాడే అంతా త్రిమూర్తులూ వాడే. మనస్సు వాడే. సమస్తము వాడే. అంతగా మనలో ఉన్నాడు. అంతగా సూర్యుడిలో ఉన్నాడు. అంతగా భూమిలో ఉన్నాడు. ఇట్లా మనకి ఉన్నాడు. ఈ అవగాహనతో వీటన్నింటితోను మీరు వ్యాపన శక్తి ద్వారా అనుసంధానం చెందవచ్చు. Law of correspondence అంటారు. అదొక దర్శనం. నీలో గ్రహాలని ఆకాశంలో ఉండే గ్రహాలతో న్యాసం చేసుకోవచ్చు. ఆకాశంలో గ్రహం ఎక్కడ ఉందో నీలో ఆ గ్రహం అక్కడ ఉంది. 12 భాగాలు చేసుకుంటే శరీరాన్ని మేషరాశి నుండి మీన రాశి వరకు 12 భాగాలూ శరీరంలోనే ఉన్నాయి. ఏ రాశిలో అక్కడ గ్రహ సంచారం జరుగుతూ ఉంటుందో, దాన్ని గోచారం అంటారు. 'గో' అని ఎందుకన్నారంటే వెలుగు స్వరూపాలు కాబట్టి. ఇప్పుడు బృహస్పతి మన లెక్కలో సాయన కుంభరాశి లో తిరుగుతున్నాడు. అదృష్టవంతుడికి అక్కడ సంబంధించిన అనుభూతులన్నీ వస్తాయి ఎందుకని? సాయన కుంభరాశిలో ఉన్నాడు బృహస్పతి. శని గారు ఎక్కడున్నారండి మేషం లో? అంటే ఫాలభాగం పైన. అక్కడ ధ్యానం చేసుకోవాలి. ఈయన అక్కడ ఉండడంలో దివ్యప్రణాళిక ఏమిటో, దానికి సంబంధించి నీవు కూడా కొంచెం అనుసంధానం చెందుతావు. అలాగే శుక్రుడు ఎక్కడ ఉన్నాడో అక్కడ చేర్తాం ఈ శరీర భాగంలో. ఎందుకని? 12 రాశులూ మనకి ఉన్నాయి కాబట్టి. ఇది చాలా అత్యుత్తమైన విద్యగా ఇచ్చారు. తద్వారా ఏం జరుగుతుందో తెలుసా! నీవు సూర్య మండలం తో అనుసంధానం చెందుతున్నావు. తద్వారా ఇన్ని గ్రహముల యొక్క తత్త్వం నీలో వికసిస్తాయి. నీలో వికాసం చెందుతాయి. అందుకనే ఏడు లోకాల్ని 7 గ్రహాలని తలుచుకోవడం అనేది మనకి మామూలుగా ఇచ్చేశారు.

ఓం భూః ఓం భువః ఓం సువః ఓం మహః ఓం జనః ఓం తపః ఓగ్ం సత్యం
ఓం తత్సవతుర్వరేణ్యం

అని చెప్తాం ఎందుకని. ఇన్ని స్థితులలోనూ నువ్వు ఉన్నావు, భౌతికంగా ఒక్క గోత్రనామం అనుకోక అని చెప్పడానికి. ఈ చదివేది ఏమిటో అర్థం చేసుకుంటే గుర్తుంటుంది.

సంస్కృతం అవడం వల్ల ఏదో చదివేద్దాం, అందరూ చదువుతున్నారు కదా అని చదివేస్తే తప్ప అదేమిటో అనే ప్రశ్న పుట్టదు కదా. అది పుట్టకపోతే లాభం లేదు. లోపల పృచ్ఛకుడు ఎప్పుడూ ఉండాలి. ప్రతీదీ ఇదేమిటి అని అడుగుతూ ఉండాలి. దానికి సమాధానం చెప్పకుంటూ ఉండాలి ఆ విధంగా పరిప్రశ్న ద్వారా తెలుసుకోవలసిందే. ప్రశ్న పుడితే, సమాధానానికే ప్రశ్న పుడుతుంది. సమాధానముండి ప్రశ్న పుడుతుందని చెప్తారు. There is no question without an answer. The answer already exits which comes to you in the beginning as a question. అదీ పెద్దల అవగాహన. సమాధానమే ప్రశ్నగా నీలో ఉద్భవిస్తుంది కాబట్టి, సమాధానం దొరుకుతుంది. సమాధానం లేని ప్రశ్న లేదు. నీకు ప్రస్తుతానికి తెలియకపోవచ్చు. ఇట్లా ఉంటుందండి కాబట్టి న్యాసం చేసుకోండి. అందుకనే అక్కడ బోర్డు మీద వేసుకుంటాం. రాధా మాధవంలో, జగద్గురు మందిరం అని పేరు పెట్టాం. World Teacher Temple అని లోపలికి వస్తే మొట్టమొదట కనిపించేది కుడి పక్కన మీకు ఈరోజు గ్రహచారం ఉంటుంది. అది మన వాళ్లు రాస్తారు. ఎందుకని? నీవు చూస్తే దానిమీద న్యాసం చేసుకోవచ్చు. ప్రార్ధన ముందు ఆ పని చేస్తే సృష్టి లోపలకు రావచ్చు. గభస్థినేమికి ఇంతవరకూ సరిపోతుంది..

## 504 సత్త్వస్థః

సత్త్వస్థః అంటే సత్త్వము నందు ఎప్పుడూ గోచరమైన వాడు అని అర్థం. సత్త్వమును తన నివాసంగా చేసుకున్నవాడు. 'స్థ' కదా, అన్నింటోనూ స్థిరంగా ఉంటాడు. అందుకనే శివుడు అన్నిట్లోనూ ఉన్నాడు కదా. అందుకని ఆయన్ని 'స్థాణు' అన్నారు. అన్నిట్లో ఉంటాడు. విష్ణువు అన్నిట్లో వెలుగుతాడట. అన్నిట్లో ఉండేవాడు శివుడైతే, అన్నిట్లో వెలిగేవాడు విష్ణువు అయితే, ఆ వెలుగుని వ్యాపనం చేసేవాడు బ్రహ్మ. ప్రతి దాంట్లోనూ ముగ్గురూ ఉంటారండి. మూడూ లేకపోతే పని కాదండీ. మీరు ఏదైనా మంచి కార్యం, పెద్ద కార్యం చేద్దాం అనుకుంటే ముగ్గురు ఉండాలి. ఆ ముగ్గురికి స్ఫూర్తి ఒక్కటే అయి ఉండాలి. ఒక చోట నుండే స్ఫూర్తి ఉండాలి. స్ఫూర్తి వంతుడు ఆ ముగ్గురికి కేంద్రంగా నాలుగుగా ఉండాలి, అంటే you have to move as a triangle with the centre. Then the work is sure to manifest. ఒక్కడే ఏకాకై చేస్తే అవ్వదు, ఏదో అవుతాయి. ఇద్దరు చేస్తుంటే ఏదో అంతంత మాత్రమే అవుతాయి. ముగ్గురు చేసుకుంటే బాగా అవుతాయి. ఎందుకని సృష్టి అంతా త్రిగుణాత్మకం! మూడు రకాలుగా తయారు చేసుకుంటుంది అమ్మవారు. 'త్రిగుణాత్మిక, త్రిగుణాంబ, త్రిగుణ, త్రికోణగ' అలా త్రీ త్రీ లుగా చెప్పకుంటాం. సంస్కృతంలోనూ, ఆంగ్లం లోనూ 'త్రీ' ఏ. అన్ని భాషల్లోనూ మూల శబ్దాలు ఒక్క చోట నుండే వచ్చాయి. అవి దివ్యత్వం నుండి దిగి వచ్చాయి. అవి ఎక్కువగా ఉన్నవి సంస్కృతం లో. మిగతావన్నీ అందులో నుండి పుట్టినవే. కనుక మూడు గా ఉంటే పని నడుస్తుందండి. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. మూడు వేదాలు కూడా అదే. నాలుగోది Manifestation. ఈ మూడింటికి కేంద్రంగా ఒకటుంటే ఇంక ఆ పనులన్నీ తప్పకుండా జరుగుతాయి. అంటే ఒక ముగ్గురు, ఒక మనిషి/ ఆయన చెప్పినది తూచా తప్పకుండా నడిచారనుకోండి ఆయన కేంద్రంగా నడిపిస్తాడు. ఆయన నడవడు. ఉంటాడు. ఈ ముగ్గురు చేసుకుపోతారు. అట్లా ఆయన్ని కేంద్రంగా పెట్టుకుని అమ్మవారు సృష్టంతా పట్టుకొచ్చింది. ఆయనే లేకపోతే అవిడ లేదు. ఆవిడ లేకపోతే త్రిగుణాలు లేవు. ఆయన నుండి తను ఆదిపరాశక్తిగా వ్యక్తమై, తన నుండి తానే ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగా తయారై మళ్లీ ఆయన్ని ముగ్గురు గా మలచుకుని త్రిమూర్తులని మొదలుపెట్టారు. కాబట్టి నలుగురు లేక ముగ్గురు గా ఒకే స్ఫూర్తితో, ఒక గురువు స్ఫూర్తితో, ముగ్గురు శిష్యులు ప్రచండంగా పనిచేయవచ్చు. అందుకే ఒక పరంపర ఎప్పుడు పూర్తయిందంటారంటే నలుగురు ఏర్పడినప్పుడు! గురువు, పరమ గురువు, పరమేష్టి గురువు, ఆ పైన పరబ్రహ్మతత్త్వం! బాబాజీ, లహరి మహాశయుడు, యుక్తేశ్వరగిరి, యోగానంద! మైత్రేయుడు మరువు దేవాపి జ్వాలాకూలుడు! మైత్రేయుడన్నా బాబాజీ అన్నా ఒక్కరే. కనుక ఈ రెండు త్రిభుజాలకి మైత్రేయుడు కేంద్రం. ఒక పరంపర పూర్తి

అవ్వాలంటే నాలుగో తరం రావాలి. అప్పుడు ఆ కార్యానికి పరిమితత్వం అనేది పూర్తవుతుంది. ముగ్గురే ఉన్నారనుకోండి కొంత జరుగుతుంది, నలుగురు ఉన్నారంటే పూర్తయిపోతుంది. అందుకనే ఒక మనిషి ముని మనవడిని చూసాడు అంటే వాడికి ముక్తి అన్నారు కదా. అంటే వాడు, వాడికో కొడుకు, వాడి కొడుకుకి కొడుకు, వాడి కొడుకుకి కొడుకుకి కొడుకు ముని మనవడిని చూస్తే ముక్తేమిటి? ఇదే మునిమనవడిని చూడడం! అంటే నీలో నుండి ఒకడు పుట్టి నీ పని చేస్తూ, వాడిలో నుండి ఇంకొకడు పుట్టి నీ పని చేస్తూ, వాడి లోంచి ఇంకొకడు పుట్టి నీ పని చేస్తే నీ పని పూర్తవుతుందండి. ఎందుకనీ? నాలుగు స్థితులు కదా. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలు. పరా పశ్యంతి మధ్యమా వైఖరి. మొత్తం నాలుగు కదా. అందులో మూడు కనిపించనివి ఒకటి కనిపించేది. 'పాదోస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి'. ఇది మూడు నాలుగు అవడం, నాలుగు మూడు అవ్వడం. ఒక సంకల్పం వచ్చిందండి. అది ఇచ్ఛ. దాన్ని ఎలా నిర్వర్తించాలో జ్ఞానం ఉందండి. అది జ్ఞానశక్తి. అంటే know how. దానికి మళ్లీ ఒక plan వేసుకోవాలి అని క్రియ. ఆ తర్వాత అంతా శుభ్రంగా వచ్చేస్తుంది బయటికి. ఇలా ఏం మాట్లాడాలో ముందు తెలిసింది లోపల. అక్కడ నుండి దాన్ని ఒక భాషలో మలుస్తావు. ఆ భాషని వ్యక్తం చేస్తుంటావు. ఇట్లా వస్తుంది కదా లేకపోతే అలా మాట్లాడగలమా? అది ఒక ప్రక్కనుండి ఇలా ధారావాహికంగా వస్తున్నదంటే, ఆ సంకల్పాన్ని ఒక భావంగా తయారు చేసి, భావాన్ని ఒక భాషగా మలచి, ఆ భాష నుండి ఇలా బయటకు వచ్చేస్తుంది. ఇలా నాలుగు స్థితుల్లో మొదటిదాన్ని ఋగ్వేదం అన్నారు. రెండో దాన్ని సామవేదం అన్నారు. మూడోదాన్ని యజుర్వేదం అన్నారు. నాలుగో దాన్ని అథర్వణ వేదం అన్నారు. Manifestation. 'అథ' అని ఎందుకన్నారంటే అధో భాగంగా వచ్చి పడుతుందని. అందుకని మూడు ఆధారంగా నాలుగు వస్తాయి కాబట్టి the Triangle over the square అని ఇచ్చారు. ఒక బిందువు నుండి పరిధి ఏర్పడి, అందులోంచి త్రిభుజం ఏర్పడి, దాంట్లో నుండి చతుర్భుజం ఏర్పడుతుంది. అందుకని ఒక దేవాలయం నిర్మాణం చేయాలంటే ఒక చతురస్రం మీద ఒక త్రిభుజం పెట్టుకుంటారు. ఇది వరకు ఇళ్ళు కూడా చతురస్రం మీద త్రిభుజంగా కట్టుకునేవారు. ఇప్పుడు త్రిభుజం తీశేసాము. చతురస్రాలే మిగిలాయి. డబ్బాలే అన్నీనూ. ఏమైందీ, ఏది కావాలో అది తీశేసాము. ఏదో ఒక డబ్బా జీవితం. పెంకుటిళ్లన్నీ ఎట్లా ఉండేవి? దేవాలయాలు ఎట్లా ఉన్నాయండి? మనం కూడా అంతేనండి తల తీసేసిన తర్వాత మనిషి ఎట్లా ఉంటాడండి? తల్లోనే మూడు ఉన్నాయి. నాలుగోది ఉంది కానీ ఇక్కడ తల లేని మనుషులు. ఒకడు మొదట మూడై, ఆ మూడులో ఒక దానిలో స్థిర పడతాడు. వాడు నాలుగో వాడు కాక మొదటి వాడు. మూడయిన తర్వాత అందులో ఒక దానిలో స్థిరపడతాడు. దాన్నే సత్త్వం అంటారు. మిగతా రెండింటిని రజస్సు, తమస్సు అంటారు. తమస్సులో ఉండే భగవంతుడు గోచరించడు. ప్రణాళిక గోచరించదు. మనం ఏం

చేయాలో తల పగలగొట్టుకున్నా తెలియదు. రజస్సులో ఉంటే చేయవలసిన దానికన్నా ఎక్కువ లేదా అసలు చేయవలసినది కాక ఇంకొకటి చేసేస్తూ ఉంటాం. తమస్సులో చేయాల్సింది కూడా చేయము. అందుకని ఈ రెండింటిలో ఇమిడి ఉన్న వారందరికీ భగవత్ తత్త్వం గోచరించదు. అసలు నమ్మకమే పుట్టదు దానిమీద. కాస్తో కూస్తో సత్త్వం అనేది మినుకు మినుకుమంటూ పెరుగుతుంటే, లోపల ఏదో మనని మించినది ఒకటి ఉన్నదని తెలుస్తుంది. ఇక దాని గురించి తెలుసుకోవాలనిపిస్తుంది. తెలుసుకుంటారు. సత్త్వంలో నిలబడ్డ వారికి భగవంతుడు ఎప్పుడూ అలా దగ్గరగా ఉంటాడు. భగవంతుడి పాదాల దగ్గరే ఉంటాడు సత్త్వం లో ఉన్న వాడు. ఎప్పుడూ వాడి సాన్నిధ్యం లోనే ఉంటాడు. రజస్సులో ఉండేవాడు అలా ఉండలేడు. రావణుడు ఉండలేకపోయాడు. విభీషణుడు ఉండగలిగాడు. కుంభకర్ణుడు ఉండలేకపోయాడు. రజస్సు లో ఉన్న విశ్వామిత్రుడు -మహర్షి కాక ముందు- వశిష్ఠుని లో చూడలేక పోయాడు. వశిష్ఠుని చూడగానే కుళ్ళు పుట్టేది. దానికి వశిష్ఠుడా కారణం? కారణం విశ్వామిత్రుడి లోనే ఉంది. చూసినప్పుడల్లా అతడేంటి అనిపించేది కానీ, పోట్లాడితే అతడే పెద్దవాడు ఇతడికన్నా. వశిష్ఠుడు పోట్లాడే వాడు కాదు. ఇతడిలా బాణం వేస్తుంటే దండం పెట్టే వాడు వశిష్ఠుడు. వశిష్ఠుడు మంత్రదండం అలా పెట్టుకుని కూర్చునేవాడు. వేసినవన్నీ అది మింగేసేది. నీ ఆవుని తీసుకుపోతానన్నాడు, తీసుకుపో, అన్నాడు. అంతే ఆవును తీసుకు పోలేకపోయాడు. ఏం చేయలేక పోయాడు. రజస్సులో ఉన్నవాడు సత్త్వం లో ఉన్నవాడిని చూసి ఏడవడం తప్ప, ఏం చేయలేడు చూడండి. రజస్సు ఉన్న వాడిని చూస్తే మనకి వాడే గొప్పవాడిగా కనిపిస్తాడు. పైగా మనం సినిమాలు కూడా అట్లాగే తీసుకుంటున్నాం. రావణుడే రాముడు కన్నా గొప్పగా ఉన్నట్టుంటుంది కదా సినిమాలో. అంటే తీసేవాళ్ళల్లో రజస్సు పెరిగి, అట్లా తీస్తూ ఉంటారు. చూడడానికి రావణాసురుడు మనిషి బలంగా ఉంటాడు. ఎక్కువ పాడుగ్గా ఉంటాడు ధగధగా మంచి బట్టలు వేసుకుంటాడు. కిరీటం పెట్టుకుంటాడు. అందంగా ఉంటాడు. ఇవన్నీ ఉంటాయి. రాముడో? రావణుడు రాముడి గురించి 'రాముడు వెంట పడతావు అతనిలో ఏం కళలేదు' అంటాడు. నువ్వు రజస్సులో ఉంటే కళ కనిపించదు. సత్త్వం లో ఉన్న కళ కనిపించక అట్లా మాట్లాడతాడు. కృష్ణుడిలో మాత్రం ఏం కళ కనిపించిందండి సమకాలికులైన రాజులకి. ఏ కళా కనిపించలేదు. కానీ సన్నివేశం వచ్చినప్పుడు ఆయన ఆకాశం అంత ఉండేవాడు. వీళ్ళేమో చీమల్లా ఉండేవాళ్లు. ఇదేమిటిరా అనిపించేది. అంతే అది. సత్త్వగుణ సంపన్నులలో భగవంతుడు ఎక్కువ వ్యక్తమవుతుంటాడు. రజస్సులో నుండి వ్యక్తం కాడు, తమస్సులోంచి అసలే వ్యక్తం కాడు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'సత్త్వం లో ఉంటే నేనేమిటో నీకు తెలుస్తుంది. రజస్సు లో ఉంటే తెలియదు. తమస్సులో ఉంటే అస్సలు తెలియదు. కానీ తమస్సులో ఉండడం కన్నా రజస్సు లో ఉండడం మంచిది. రజస్సు లో ఉండడం కన్నా సత్త్వం లో ఉండడం మంచిది' అంటాడు. తమస్సులో ఉన్న

వాడికి ముందు బాగా పని పెట్టేయాలి. వాడి తమస్సు అంతా వదిలిపోవాలి. రజస్సులోకి వచ్చాడు కదా. ఇప్పుడు తగ్గించాలి కొంచెం. బాగా పెంచిన తర్వాత కత్తిరించడం సులభం కదా. అట్లా కత్తిరించేస్తారు. ఎక్కువగా తమోగుణానికి, రజోగుణానికి లోబడి ఉంటారు. సత్త్వగుణంలో ఉండేవాళ్లు తక్కువ ఉంటారు. వాళ్లకే దైవతత్త్వం ఎక్కువగా తెలుస్తూ ఉంటుంది. భగవంతుడే త్రిగుణముల గురించి చక్కగా ఇచ్చాడు మనకి భగవద్గీతలో. ఏ గుణాలు ఉంటే మనం సత్త్వం లో ఉన్నట్లు, ఏ గుణాలు ఉంటే రజస్సు లో ఉన్నట్లు, ఏ గుణాలు ఉంటే తమస్సులో ఉన్నట్లు. అదేమిటో రజస్సులోనూ, తమస్సులోనూ ఉన్న గుణాలే మనలో ఎక్కువ ఉన్నట్లు అనిపిస్తాయి. సత్త్వంలో ఉండే గుణాలు ఇలా ఉంటాయా అనిపిస్తుంది. అదీ పరిస్థితి. కాబట్టి భగవంతుడు సత్త్వం లో ఉంటే కనిపిస్తాడండి. మీరాబాయి లో ఉన్న సత్త్వం, వాళ్ళ ఆయనకే అర్థం కాలేదు. పోతనామాత్యుని లో ఉండే సత్త్వం, అప్పటి రాజులకి ఏం అర్థం కాలేదు. అలాగే హనుమంతుడు వచ్చి తోక పట్టి విసిరి కొడుతుంటే తెలిసింది అమ్మో అనుకున్నారు. ఒక మహాత్ముడి యొక్క ఒక మహాశయం ఎప్పుడు తెలుస్తుందీ అంటే అతడ్ని ఏదో కెలికి, అతడినేదో చేయబోతుంటే, చేసిన వాడికి ఏదో అవుతుంటే అప్పుడు తెలుస్తుంది. అంతవరకు తెలియదు. అతడు లేకపోతే సినిమాలో నాగయ్య లాగా మామూలుగా ఉంటాడు. చలిమిడి ముద్దలాగా కనిపిస్తాడండి. ముట్టుకున్నావా అది ఆటంబాంబే! మిగతా వాళ్ళు ఆటంబాంబుల్లాగా కనిపిస్తారు కానీ ముట్టుకుంటే అది baloon. రామాయణంలో రావణాసురుడు మొదటిసారి రాముడ్ని చూడడమనే అద్భుతమైన ఘట్టం చదువుకోవలసినదే! రావణాసురుడు మొట్టమొదటిసారిగా రాముడిని చూడగానే అతడి రజస్సంతా కారిపోతుంది. ఇట్లా అంటే పడిపోతాడు. అదీ రాముడు చేసింది ఆరోజు. కొట్టేస్తే ఆ రోజుతో అసలు యుద్ధం అయిపోయేది. ఎందుకని? ఈయన సత్త్వం లోనికి ఆయన రజస్సంతా ఆకర్షింపబడిపోయింది. అతడిలా డొల్లలా మిగిలిపోయాడు. మూడు బాణాలు వేయగానే పడిపోతాడు. పోయి ఇంటికెళ్లి rest తీసుకో, మళ్లీ రా, అని చెప్తాడు. ఎందుకని? మిగతా వాళ్లంతా ఉన్నారు కదా. వాళ్లందరి సంగతి చూసి, ఇతడిని చివరికి చూస్తే మంచిదీ, అని. లేకపోతే వాళ్ళంతా పారిపోయి, మళ్ళీ మొదలు పెడతారు ఏదో దరిద్రపు పనులు. అందుకని పంపించేస్తాడు. జరాసంధుడి విషయంలో కూడా అలాగే చేస్తాడు కృష్ణుడు. వాడి చుట్టూ ఉన్నవాళ్లని ముందు కొట్టేస్తే, ఆ తర్వాత వాడిని కొట్టొచ్చు. అసలు వాళ్ళని కొట్టాల్సిన అవసరం ఆయనకి లేనేలేదు. కొట్టించడానికి మనిషి ఉన్నాడు. ఎందుకు ఊరికే labour work మనకి. వాడి చేత కొట్టించేశాడు. అయిపోయింది. అదీ సత్త్వం లో ఉన్నవాడు చేసే పని. మనమే కొట్టాలనుకోవడం రజస్సు. వాడు పోవాలంతే కదా, ఇంకొకడి చేత కొట్టించ్చేస్తాం అదీ లెక్క. కృష్ణుడి లెక్కలు వేరు. ఈ మొత్తం కౌరవసేనంత ఒక్కరోజు చక్రం తిప్పేస్తే అయిపోయేది. ఆ రాజసూయానికి పిలవడం, చేయడం, ఆయన వేలికి ఆ రక్తం కారటం,

వెంటనే ద్రౌపది తన చీర చింపి కట్టడం. కాబట్టి చీరలు ఇచ్చాడు అని చెప్తారు. కాబట్టి ఇచ్చాడని మనం అనుకుంటాం లేకపోయినా ఇచ్చేవాడేమో! ఎందుకంటే commercial agreement లాగా ఉండదు భగవంతుడి పనులు. రక్షించదలుచుకుంటే రక్షిస్తాడు వాళ్ళ స్వభావాన్ని బట్టి, వాళ్ళు పాటిస్తున్న ధర్మాన్ని బట్టి. అర్జునుడిలోనూ, భీముడిలోనూ కనిపించనిది ధర్మరాజులో ఏం కనిపించిందండి మనకి? సినిమాల్లో అస్సలు కనిపించదు. ఎందుకని? ధర్మరాజు character అంతంత మాత్రంగానే ఉంటుంది. భీముడేమో ఒడ్డు పొడుగు ఉన్నవాడిని పెడతారు, పిడుగుల్ని తినేసే వాడిలాగా. ఇంకొకడేమో చాలా అందంగానూ, చాలా అలంకారం చేసి పెడతారు. మనకేమో ధర్మరాజు ఏమిట్రా వాడి మొహం అన్నట్లు ఉంటుంది. కానీ ఎవరిని చూసి కృష్ణుడు ఈ పనులు చేసి పెడ్తాడు? 'ఈ కర్ణులు పదివేలురైనను నొత్తురు సత్తురు రాజరాజా' అని జంట కవులు బ్రహ్మాండమైన పద్యం రాశారు. ఎవరికి? ధర్మరాజుకు. ఆయనకి just కోపం వస్తే చాలయ్యా, అని. ఆయనకి కోపం రాలేదు తమాషాగా. 'మీరు ౨౦ ఏళ్ల నుండి తంటాలు పెడుతున్నా, నాకు కోపం వచ్చింది కానీ ఆయనకి రాలేదు' అంటాడు కృష్ణుడు. కృష్ణుడికి కోపం వస్తుంది ఒకసారి. వీళ్ళందర్నీ ఒకసారి రాజసూయ వైభవంలో చూసి, ఆ తర్వాత అరణ్యంలో చూస్తాడు. అది ముందు scene, తర్వాత scene ఇదే. ఆయనకి ఇది చూడగానే కోపం వస్తుంది. అయిపోయింది ఇవాళ కొట్టేస్తానని ఆయన అంటే, అర్జునుడు 'అలా కాదు బావా, మేం కొంచెం నోరు పారేసుకున్నాం. ఒకడ్ని తొడ చీలుస్తా అని, ఇంకొకడ్ని ఇంకేదో చేస్తామని చాలా చెప్పేశాము అక్కడ. ఇప్పుడు మా మాట' అంటే 'సరె మీ మాట కోసం సంవత్సరాలు ఏడుస్తూ కూర్చోండ'ని అంటాడు. అందుకే నోరు పారేసుకోవద్దని చెప్తారు. మాట మాటకి అర్జునుడికి కృష్ణుడు ఇచ్చే సలహా 'ఎందుకురా ఊరికే నోరు పారేసుకుంటావు' అంటాడు. 'ఈరోజు సాయంత్రం లోగా సైంధవుడ్ని కొట్టకపోతే అగ్ని ప్రవేశం చేస్తానని' అంటే ఏమిటి నీ మొఖం. ఆ పని చెయ్యి. ముందే ఎందుకు అట్లా మాట్లాడతావు? చచ్చేచావైంది కదా. వాడెవడో కవ్విస్తుంటే ధర్మరాజును వదిలి వెళ్లిపోతాడు అర్జునుడు, యుద్ధంలోనే. దుర్గ కనబడి చెప్తుంది 'ఒరేయ్ నీ రథంలో కూర్చుంది నేనే! అతడు నేనే వేరు కాదు! ఆయనే నేను, నేనే ఆయన కాబట్టి ఆయన చెప్పిన మాట నీవు జవదాటకుండా చేశావంటే విజయం నీది. ఏమైనా పాల్లు పని చేశావు అంటే చచ్చావే' అని చెబుతుంది. అయినప్పటికీ చేస్తాడు, తింటాడు. ఎందుకని? అంతకు ముందు చెప్పింది కదా అమ్మవారు ఈయన మాట వినమని వినలేదు. అసలు ముందు 'అసలు యుద్ధం ఏమిటి బావా' అన్నాడు. 'అదేమిట్రా ఇదంతా చేసి ఇప్పుడిలా' అంటాడు. ఇంకోసారి వాడు కవ్వించగానే వెళ్లిపోయాడు. దాంతో ఆణిముత్యం లాంటి కొడుకు వెళ్ళిపోయాడు. ఇంకోసారి ప్రతిజ్ఞ చేసి తన చావు తాను తెచ్చుకున్నాడు. 'నీకెందుకు మొదటి నుండి ఆ నోటి దూల' అంటాడు కృష్ణుడు మన భాషలో చెప్పాలంటే. 'ఆ భీముడా అలా నోరు పారేసుకున్నాడు, నువ్విలా నోరు పారేసుకున్నావు లేకపోతే ఎప్పుడో

అయిపోయి ఉండేది రా పని'. సత్త్వంలో ఉన్నవాడు నోరు పారేసుకోడు. తాను చేయవలసిన పని చేస్తాడు. తాను చేస్తాను అని declare చేయడు. రజస్సుఉంటే declare చేస్తాడు. ఒక సంవత్సరం లోపల ఈ పని చేస్తాను అంటే రజస్సు అవుతుంది. కష్టమవుతుంది పూర్తి చేయడానికి. జ్వాలాకులుడు ఈ మాట చెప్తాడు. 'చేస్తా అన్న పని చేసేయ్ తప్ప, చేస్తానని వాగ్దానాలు చేయబోకు. మొత్తం సృష్టిలో చాలా శక్తులు ఉంటాయి. చూద్దాం ఎలా చేస్తాడో అని అడ్డుపడతాయి. చస్తావు. నీ మాట నీకు అడ్డు' ఇదో సత్యం. రజస్సు వాళ్ళు ఇలా ఉంటారు. తమస్సు వాళ్లతో అసలు మనకి problem ఉండదు. వాళ్లకే వాళ్ళు problem. అలా పడుంటారు. అందుకనే భగవంతుడి యొక్క తత్త్వం తెలియాలన్నా, భగవంతుడి దర్శనం కలగాలన్నా, భగవంతుడు మనమే అని తెలియాలన్నా, సత్త్వం! త్రిగుణాతీతుడైన వాడు గోచరం కావాలంటే త్రిగుణములలో సత్త్వము నందు మనం ప్రవేశించాలి. సత్త్వంనందు ప్రవేశించాలంటే మనం ఏం చేయాలండీ అంటే, భగవద్గీత అక్కడే ఉంది. అందులో గుణత్రయ విభాగయోగం, అందులో సత్త్వగుణం అంటే ఏముండాలో చెప్తారు. అవి అలవాటు చేసుకుంటే రకరకాలైన దివ్య దర్శనాలు వస్తుంటాయి. మనలో సత్త్వం పెరుగుతుంటుంది. పెరిగిన కొద్దీ సాన్నిధ్యం పెరుగుతుంది.

## 505 సింహో

'సింహము' అత్యుత్తమమైన వేదపరమైన సంకేతం. సింహం లో వుండే 'స' కారము, భగవంతుని యొక్క పురుషతత్వానికి, 'హ' కారము శ్రీ లేక స్త్రీ తత్వానికి సంబంధించినది. అందుకే, పురుషసూక్తంలో మొదటి సూక్తం 'సహస్ర శీర్షా పురుషః' అని మొదలవుతుంది, 'స' అనే అక్షరంతో, అలాగే శ్రీ సూక్తం లో మొదటి సూక్తం 'హిరణ్య వర్ణాం హరిణీం' అని 'హకారం' తోమొదలవుతుంది. మనకి స్త్రీ పురుషతత్వం మొత్తంగా భగవద్ తత్వం అని చెప్తారు. ఇందులో ఎవరు మొదలు, ఎవరు తరువాత అనేది ఏమీ లేదు. ఇద్దరూ కలిసి వున్న తత్వమే అవ్యక్తమైన తత్వం. దిగివస్తే ఇద్దరుగా దిగి వస్తారు. మొత్తం ఈ సృష్టి నిర్మాణం అంతా కూడా 'స' కారం నుండి 'హ' కారంగా దిగివచ్చి, వెలుగుగా దిగివచ్చి, వెలుగుకి 'పెంజీకటికవ్వల ఎవ్వండేకాకృతి వెలుగు' అనేది పరబ్రహ్మతత్వం. ఆ చీకటికి ఇవతల వుండే వెలుగు, మనకి తెలిసిన వెలుగు 'హ' కారానికి సంబంధించినది. అమ్మవారిని మనం 'ఈం' అని కూడా పిలుస్తాం. అందుకే పార్వతి, సరస్వతి, లక్ష్మి అని 'ఇ'కారం తో పూర్తి అయ్యేలా అమ్మవారి నామాలు వుంటాయి చాలా వరకు. శ్రీ సూక్తంలో కూడా మనకి 'ఈం' అనే బీజాక్షరం మధ్యలో వస్తుంది. 'తాం పద్మినీం ఈం'! ఆ 'ఈం' అనే శబ్దం అమ్మవారి శబ్దం. కాబట్టి దాన్ని శక్తిబీజంగా చెప్తారు. 'స' 'హ' పదాలకి 'ఇ' కారం తగిలిస్తే, ఇక్కడ మనకి 'సి హ', మధ్యలో అనుస్వారం లాగ సున్నా మిగిలింది. అది సున్నా అంటే శూన్యం కాదు, పూర్ణం. ఆ పదం తెలియడం చాలా గొప్ప విద్య. Zero అంటే శూన్యం అనే అర్థమే ఎక్కువ వస్తుంది. 'సున్నా, ఏమీ లేదు' అని అనుకుంటూ ఉంటారో, అందులోనే సమస్తం వుందని చెప్పిన వాళ్ళు ఋషులు. సున్నాలోంచి రెండు వ్యక్తం అవుతాయి. ఎందుకంటే అది పూర్ణతత్వం కాబట్టి. పూర్ణతత్వం లోంచి ఒకటి పురుష తత్వం గానూ, మరి ఒకటి స్త్రీ తత్వంగానూ వ్యక్తమవుతాయి. కానీ పూర్ణత్వంలో రెండూ కలిసి వుంటాయి అని చెప్పడానికి అర్ధనారీశ్వరతత్వం ఇచ్చారు. అయ్యవారి యొక్క హృదయమునందు అమ్మవారు ఇమిడి వుంది అని చెప్తారు. అంటే, అసలు తత్వంలో రెండూ కలిసి వున్నాయి, కాబట్టి పూర్ణము. అవి రెండు భాగములుగా విడివడడం చేత Feminine and Masculine principles ముందు వస్తాయి. Positive and Negative Currents! ఈ రెండిటిలోంచి దిగివచ్చే శక్తివంతమైన బీజంకి 'ఈం' అనే శబ్దం! అందుకే శ్రీ సూక్తం చదువుతున్నప్పుడు మనం ఆ 'ఈం' అనే బీజాక్షరం చాలా స్పష్టంగానూ, ఎక్కువ శ్రద్ధతోనూ పలకాలి, నిజంగా మనలో శక్తి ప్రవేశించాలి అంటే. స హ ఇ కలవడం వాళ్ళ, సి హ అయ్యింది. మధ్యలో పూర్ణం వుంది. ఈ మొత్తం పూర్ణం నుంచీ ఈ రెండూ వచ్చాయి అని చెప్పడం పూర్ణం యొక్క ఉద్దేశ్యం. ఈ విధంగా జరగడం కోసం 'సింహం'

పదం ఇచ్చారు. మనం సాకినీ, హాకినీ అనే అమ్మవారు వున్నట్టు లలిత సహస్రనామంలో చదువుకుంటాం. సాకినీ అంటే స తత్త్వంకి సంబంధించిన భగవద్ తత్త్వము. హాకినీ అంటే దిగివచ్చిన వెలుగు తత్త్వము. అది 'సహ' అంటాం. ఇంకా మనకి పైకి తెలుసుకుంటే, 'యహ' అంటాం. అందుకని ఈ షట్చక్రాలకి సంబంధించిన బీజాక్షరాల్లో స కారం ఒకటి వున్నది, హ కారం ఒకటి వున్నది, ర కారం ఒకటి వున్నది, ఈం కారం ఒకటి వున్నది. అందుకే శ ర ఈ కలిపితే శ్రీ వస్తుంది. శ్రీం అనే బీజాక్షరం! హ ర ఇ కలుపుకుంటే హ్రీం అనే బీజాక్షరం! అలాగే వాగ్దేవతలకి సంబంధించిన బీజాక్షరాలు 'ఐం'! ఇలా మనకి అమ్మవారికి సంబంధించిన బీజాక్షరాలు అన్నీ కూడా ఒకదాని తరువాత ఒకటి మనకి వ్యక్తమవుతూ వుంటాయి. ఇవి ఎక్కణ్ణుంచి వ్యక్తమౌతున్నాయి? పూర్ణంలోంచి వ్యక్తం అవుతున్నాయి. అందుకనే 'పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే' అని ఒక mathematical equation ఇచ్చారు మన ఋషులు. అది పూర్ణం, అది సున్నా కాదు. అది పూర్ణం అవ్వడం చేత అందులోంచి ఇవన్నీ వస్తున్నాయి. అది సున్నా అయితే సున్నలోంచి ఏమి వస్తాయి? ఏమీ రావు కదా. శూన్యంలాగా కనిపిస్తున్నది, సమస్తమూ కలిగి వున్నది. పూర్ణంలాగా కనిపిస్తున్నది, సమస్తమూ కలిగి వున్నది. అక్కడ అవ్యక్త స్థితిలో వున్నది, ఇక్కడ వ్యక్త స్థితిలో వున్నది. కాబట్టి అది పూర్ణం అవ్వడం చేత ఇది పూర్ణం అని చెప్పడానికి, 'పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే', పూర్ణము నుండి పూర్ణము ఉద్భవిస్తుంది. నీవే లేకపోతే నీ కొడుకు ఎలా పుడతాడు? నీకు సంతానం ఎలా కలుగుతుంది? నీవు ఉండబట్టే కదా నీ నుండి సమస్తమూ వచ్చినాయి- ఆస్తులూపాస్తులూ, సమస్యలు, పిల్లలు. వీళ్ళందరూ ఎక్కణ్ణుంచి వచ్చారు? మనలోంచి వచ్చారు. కదా. మనమే లేమనుకో, మనం సున్నా అయితే వస్తాయా ఇవన్నీ? రావు. ఇది తెలియాలి. అందుకే ఈ రోజున ఎవరు ఏమీ లేదనుకుంటారో, ఏమీ లేనట్టుగా ఉన్నదే సమస్తమూ కలిగి వున్నది, అని దర్శించిన ద్రష్టలు ఋషులు. ఇంకా సమయం వుంది, శాస్త్రానికి ఈ విషయం తెలియడానికి, తెలుస్తుంది వాళ్లకి. ఎందుకంటే ఇప్పుడు వాళ్ళు 'zeroing in' అనే ఒక concept లో వున్నారు. అంటే negative-positive temperatures try చేస్తూ వుంటే ఇటు plus కొంతైనా వస్తుంది, అటు minus కొంతైనా వస్తుంది తప్ప సున్నా రావడంలేదు. సున్నా వస్తే మొత్తం అంతా సున్నా లోకి వెళ్ళిపోతుంది. సున్నాలోకి రావడం వుండదు. ఎప్పుడు వస్తుంది అంటే, దాన్నే మనం కుంభయుగమునకు సంబంధించిన చైతన్యంగా చెప్పుకుంటాం. సున్నా లోంచి సమస్తం ఎలా వస్తోంది? సున్నా లోకి సమస్తం ఎలా వెళ్తోంది? పూర్ణం లోంచి ఇదంతా ఎలా ఏర్పడుతోంది? ఏర్పడి, వెనక్కి వెళ్తే శూన్యం వలె కనిపిస్తుంది తప్ప అది కూడా పూర్ణమే, అని చెప్పడానికి మనకి, Fullmoon అంటాం కదా. పౌర్ణమి, పూర్ణిమ. 'పూర్ణిమ' అని ఎందుకు అన్నాం? అది Fullness అని. Fullness in manifestation. ఎలా చూశాం

చూడండి. పూర్ణం అనుకుంటే సున్నా అనుకుంటే.... కాబట్టి మనకి ఎక్కడ ఈ పూర్ణం వస్తుందో అక్షరంగా, అక్కడ కాస్త ఆగాలి. అందులో వుంది మొత్తం అంతా. అక్కణ్ణుంచి అంతా వ్యక్తమౌతుంది అని తెలియాలి. ఎవరైనా 'పూర్ణిమ' అని పేరు పెట్టుకున్నారనుకోండి సమస్తమూ కలిగి వున్నదని అర్థం. జాగ్రత్తగా పెట్టుకోవాలి పేర్లు. ఎందుకంటే పూర్ణిమ అని పెట్టుకున్నాక ఏమీ లేదంటే ఎలా? అలాగే మనకి అత్యుత్తమమైన ఇంకొక నామం 'గంగ'. అద్భుతమైన నామం. అంతా గంగే అంటాం అంటే నది గంగ కాదు. సమస్తమూ గంగే. మనం మామూలుగా సంప్రదాయమైన పద్ధతిలో ఎప్పుడైనా ఎవరింటికి అయినా వెళ్తే, 'కాస్త గంగా జలం వుంటే ఇవ్వండమ్మా' అంటాం. మా ఇంట్లో లేదండీ, మేము కాశీ నుండి తెచ్చుకోలేదండీ అని అనక్కర్లేదు. 'గంగ' లో 'గ' అంటే గమనము. మళ్ళీ అటు 'గ' గమనము. రెండూ గమనములే, ఏమిటిది? ఒక గమనము అవ్యక్త స్థితి నుండి వ్యక్త స్థితి లోకి అవరోహణం చేసే గమనము. ఒక గమనము వ్యక్త స్థితి లో నుండి అవ్యక్త స్థితి లోకి ఆరోహణం చేసే గమనము. ఈ రెండు గమనములు ఎవరి ఆధారంగా జరుగుతున్నాయి? మళ్ళీ అక్కడ మధ్యలో పూర్ణం వుంది. అదీ గంగ! ఆకాశం నుండి వచ్చినది కదా. అక్కణ్ణుంచి శంభుని శిరస్సు. అలా ఆకాశం నుండి దిగివచ్చిన వాళ్ళం మనం. శంభుని శిరస్సు అంటే మనం పిలక పెట్టుకుంటామే అది! అందు నుండి సుశ్లోకమైన హిమాద్రి. అంటే హృదయం. అక్కణ్ణుంచి పాతాళం చేరింది అంటే మూలాధారం, అక్కణ్ణుంచి పంచేంద్రియాల ద్వారా, కామం ద్వారా బయటకి ప్రవహిస్తూ వుంటాం, పాతాళంలోకి వెళ్తూ వుంటాం. ఎంత కామం వుంటే అంత పాతాళంలోకి వెళ్తాం. అదీ గంగావతరణం కథ! ఇదేదో మనకి సంబంధించినది కాదు, ఎవరో అలా దిగివచ్చారు అనుకోకండి. ఇది మనకి సంబంధించినదే, అలా కోరికలతో, ఐదు ఇంద్రియాలతో, మాటతో, నీ జననేంద్రియంతో ఎంత నువ్వు బయటకి వెళ్తే అంత నువ్వు పాతాళంలోకి వెళ్తున్నట్టు లెఖ్ఖ. అది ఒక గమనం! అది సృష్టి అవతరణకి సంబంధించిన కథ. సంకేతపరంగా చెప్పారు. ఆకాశంలో నీళ్ళు వుండడం ఏమిటి? వీళ్ళకి ఏమీ తెలియదు అనుకున్నారు. తెలీదు అన్నవారికి చాలా తెలియదు, నిజంగా తెలుసున్నవాడు నాకు తెలుసు అని అస్సలు చెప్పడు. అదే కదా మనం చెప్పకున్నాం భాగవతంలో. తెలిసిన వాళ్ళు తెలియని వాళ్ళని చూసి, తెలియని వాళ్లకి ఏమి చెప్పినా తెలియదు కాబట్టి మనం చెప్పకుండా వుంటే బావుణ్ణు అనుకుని, మీకు తెలియనివి చెప్తూ వుంటే అవును, అంటూ వుంటారు అంతే. ఎందుకు మూర్ఖులతో వాదన. చేరి మూర్ఖుల మనస్సు రంజింప రాదన్నారు. ఈ రోజున చాలా తెలుసు అని తెలివితేటలు వున్నవాళ్ళు, చాలా చదువుకున్నాం అనే వాళ్ళకి, చాలా science తెలుసు అనుకునే వాళ్లకి, ఏమీ తెలియదు అని తెలిసిన ఒక స్థితి వున్నది. మన కథలన్నీ అనువదింపబోయి, ఎలా పడితే అలా, అడ్డగోలుగా, దరిద్రంగా అనువదించిన వారిని మన భారతీయులే పూజిస్తున్నారు దురదృష్టం, Max Muller లాంటి వాళ్ళని.

అతడికి ఏమీ తెలియదు. Max Muller మన వేదాలకి చాలా సేవ చేశాడు అంటూ వుంటారు, చాలా చదువుకున్నాం అనుకునే వాళ్ళే. అతడు రాసినవి అన్నీ బూతులే, ఎందుకు బూతులైనాయి అంటే, సంకేతం తెలియకుండా రాశాడు. నీరంటే ఏమిటో తెలియదు. ఆవు, సింహం, వృషభం అంటే ఏమిటో తెలియదు. మన దేవతల యొక్క వాహనాలు అన్నీ కూడా సంకేతములు! తెలియక పోతే ఒకరకంగా కనిపిస్తూ వుంటుంది. తెలిస్తే ఒకరకంగా కనిపిస్తూ వుంటుంది. తెలియని వాళ్ళు ఎక్కువ అయిపోయి, తెలిసిన వాళ్ళు తక్కువ అయిపోతే ఏం చేస్తారంటే, ఈ వెధవలకి చెప్పినా అర్థం కాదు కాబట్టి, better we close the temples. మూసేద్దాం, తరువాత చెప్పొచ్చు. వినే వాళ్ళు మళ్ళీ వస్తారు, మళ్ళీ వినిపించుకుందాం, సత్యం ఎక్కడికి పోతుంది. మరుగున వుంటుంది తప్ప, పోదు కదా. ఆ విధంగా చేసిన వాళ్ళు. ఆకాశంలో ఏదైతే మనం విద్యుత్ అంటామో మన పెద్దలు దాన్ని 'ఆపః' అన్నారు. 'ఆపోవా ఇదగం సర్వం' అని చదువుకుంటూ వుంటారు అందరూ సంధ్యావందనంలో కదా. 'సమ్రాడాపో విరాడాపః స్వరాడాపః' అన్నీ 'ఆప'! ఆప అంటే ఏమిటి? ఆకాశంలోని గంగ. అది అవ్యక్తమైన స్థితిలో వుంటుంది. అక్కణ్ణుండి వ్యక్త స్థితి లోకి వచ్చింది, అక్కణ్ణుండి భూమి మీదకి వచ్చింది, అక్కణ్ణుండి సముద్రంలోకి పోయింది. ఇన్ని రకాలుగా పోయింది అది. అది ఒక 'గ'. అక్కణ్ణుండి అంటే పూర్ణం లోంచి దిగి వచ్చింది. ఇంకొక 'గ' ఇటు నుండి అటు వెనక్కి వెళ్తుంది. అది ఒక గమనం. ఒక గమనాన్ని 'ఇడ' అన్నారు. ఇంకొక గమనాన్ని 'పింగళ' అన్నారు. అందుకనే అమ్మవారి ప్రార్థన చేసుకునే వారు, తిరుగుప్రయాణంలో వెళ్ళేవారు 'పింగళాం' అంటాం. శ్రీసూక్తంలో 'ఇడాం' అని రాదు కదా? 'పింగళాం పద్మమాలినీం.'! పద్మములు దేనికి కారణం? వికాసానికి కారణం! వికాసం ఎక్కడ కలగాలి అంటే, షట్చక్రములన్నీ కూడా కమలములుగా వికసించాలి. అవి చక్రములుగా ఉన్నాయంటే అర్థం ఏమిటంటే, గిర గిర గిరా అక్కడే తిరుగుతున్నాయని. చక్రగతి వేరు, కమలం యొక్క వికాసం వేరు. విష్ణుమూర్తికి ఒకచేతిలో చక్రం వుంటుంది. నువ్వు ఎంత తిరిగితే అంత తిప్పతా అని. కమలం కూడా వుంటుంది ఒక చేతిలో. అర్థం ఏమిటంటే, నీకు కావాలంటే వికాసం కూడా ఇస్తానని. కాబట్టి వికాసం కి వికాసం వుంది, ఊరికే తిప్పడం వుంది. రెండూ వున్నాయి నా దగ్గర అని సంకేతాలు చూపిస్తాడు విష్ణుమూర్తి. కాలగతిలో తిప్పేస్తాను నిన్ను అని చెప్పడానికి చక్రం. వికాసం కలిగిస్తాను అని చెప్పడానికి కమలం. గాయత్రీ అమ్మవారు కూడా రెండు కమలాలు పట్టుకుని వున్నది అని చెప్తాం. ఒక కమలం కిందకి వుంటుంది, ఒక కమలం పైకి వుంటుంది. కిందకి వున్నది అవ్యక్తం నుండి వ్యక్తానికి మొత్తం వికసించడం. ఇంకొకటి వ్యక్తం నుండి అవ్యక్తానికి మొత్తం వికసించడం. అందుకే యోగులకి షట్చక్రములు వుండవు. ఒకటే చక్రము! మూలాధారంలో వుండే చక్రము నాలుగు దళముల పద్మంగా మారిపోతుంది. స్వాధిష్ఠానంలో వుండే చక్రము ఆరు దళముల పద్మంగా మారుతుంది. మణిపూరకంలో

వుండే చక్రము పది దళముల పద్మంగా మారుతుంది, హృదయములో వుండే చక్రము పన్నెండు దళముల పద్మంగా మారుతుంది, అలాగే విశుద్ధిలో పదహారు అక్కణ్ణుండి, భ్రూమధ్యంలో నూట ఎనిమిది! వీటన్నిటికీ కేంద్రం అష్టదళ పద్మం, విశుద్ధికీ హృదయానికీ మధ్య నారాయణలోకం వుంటుంది. ఇవన్నీ పద్మాలుగా వికసిస్తాయి. ఎప్పుడయ్యా? అంటే, బయటకి తిరగడం మానేస్తే. ఊరికే బయటకి పరిగెత్తి, బయట పనులే చేసుకుంటూ వుంటే, బయటే అంతా వుంది అనుకుంటే! బయట వున్నది నాలుగో వంతు. అమృతత్వము, దివ్యమైనది మూడు వంతులు లోపల వున్నది. కాబట్టి, ఆ మూడు వంతులలో మనం జీవించడం అన్నది ఎక్కువ ముఖ్యం. దాన్ని 'అంతర్ముఖ విద్య' అంటారు. ఆ విధంగా ప్రయాణం చేస్తే మనకి 'గంగ' అనే పదానికి అర్థం తెలుస్తుంది. కొంత ఎప్పుడూ దిగి వస్తూ వుంటుంది. కొంత ఎప్పుడూ ఎక్కి వెళ్తూ వుంటుంది, ఇదే కదా విశ్వరూప సందర్శనంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చూపించాడు. ఆయనకి ఎడమ పక్క నుండి దిగి వచ్చేస్తూ వుంటారు అందరూ. కుడి పక్క నుండి అందరూ పైకి వెళ్ళిపోతూ వుంటారు ఆయనలోకి. మనలో కూడా ఎడమ ప్రజ్ఞ వ్యక్తీకరణం చేసే ప్రజ్ఞ. కుడి ప్రజ్ఞ మళ్ళీ అవ్యక్తమైన స్థితి లోకి వెళ్ళే ప్రజ్ఞ. మనకి ఇటువంటి పదాలు ఎన్నో పెద్దలు ఇచ్చి వున్నారు. అందులో 'సింహము' అనే పదం ఒకటి. సింహాన్ని కొంచెం మార్పు చేస్తే, 'సోహం' అనే పదం వస్తుంది. అక్కడ ఈంకారం బదులు, ఓంకారం తీసుకుని వస్తున్నాం. సోహం లో కూడా మనకి పూర్ణం వున్నది. స కారం వున్నది, హ కారం వున్నది. సంస్కృతంలో ఒకో పదాన్ని మనం ధ్యానం చేస్తే, అలా అది మనకి వ్యక్తం అయ్యి, దానిలో వుండే రహస్యాలన్నీ చెప్తుంది ధ్యానం ద్వారా. అంతే గానీ, మాకు స తెలుసు, హ తెలుసు అంటే, ఏం తెలుసు ఏమీ తెలీదు. ఓం తెలుసు అని మనం అనుకోవద్దు. ఆ తెలియడం వేరు. అక్షరాలు తెలిసినంత మాత్రాన జ్ఞానం రాదు. A to Z అక్షరాలు తెలిసిన వాడు, ఏ electronics పుస్తకమో, chemistry పుస్తకమో తెరిచి కూర్చున్నాడనుకోండి. అంకెలు కూడా వచ్చు. చదివేస్తే అర్థం అయిపోతుందా? ఈ తెలియడం కూడా అంతే! Superficial understanding is no understanding. ఈ సింహము అనేది అత్యుత్తమైన వేదపరమైన సంకేతాలలో ఒకటి. 'స' కారము యొక్క తత్త్వమునూ, 'హ' కారము యొక్క తత్త్వమునూ, పూర్ణము యొక్క తత్త్వమునూ అవగాహన చేసుకున్నవాడిని 'సింహము' అని పిలిచారు. He is the Lion among men. వాడు ఎప్పుడూ హృదయమునందు ఉంటాడు, అంటే, ఉదరవితానం అంటామే దానికి పైన కూర్చుని ఉంటాడు. అదీ కూర్చునే కుర్చీ మానవుడికి, అంతకన్నా క్రింద కాదు. శుభ్రమైన కుర్చీ వేసి కూర్చోండి అంటే, కుర్చీ పీట క్రింద కూర్చున్నామనుకోండి, కాళ్ళ క్రింద ఎలా వుంటుంది? భౌతికమైన విషయములయందు మాత్రమే ఆసక్తి, కామపరమైన విషయములయందు మాత్రమే ఆసక్తి, మనకి వున్న భావములే మొత్తం అనుకునేవాళ్ళంరూ కుర్చీ క్రింద కూర్చున్న వాళ్ళు. కుర్చీ క్రింద కూర్చుంటే పైన ఉన్న కుర్చీ చెక్క తప్ప, అంతకన్నా పైన ఏమీ

కనపడదు. కుర్చీ పైన కూర్చుంటే మనకన్నా పైన చాలా వుందని తెలుస్తుంది. అందుకనే 'సింహాసనాసీనా' అన్నారు అమ్మవారిని. కదా. 'రత్నఖచిత సింహాసనం సమర్పయామి' అంటాము దేవతలని ఆవాహన చేసినప్పుడు. ఎందుకంటే వారు సింహాసనం దాకా రాగలరు దానికంటే క్రిందకి రాలేరు. సింహాసనము అంటే ఉదరవితానము యొక్క బిందువు. మనం పీట వేసి కూర్చోపెట్టం కదా అయ్యవారిని లేక అమ్మవారినీ లేక దేవతలందరినీ? సింహతత్త్వం వరకే వస్తారు. స కారమూ, హ కారమూ పూర్ణము తెలిసినవారినే దేవతలన్నారు. దివి అంటే వెలుగు. దేవత అంటే వెలుగు రూపములూ అని అర్థం. 'దివి' యే divine అయిపోయింది. సంస్కృతం నుండే సమస్త భాషయందు మూల పదములు పుట్టుకు వచ్చాయి. అది తెలియాలి అంటే నిరుక్త శాస్త్రం తెలియాలి లేదా పెద్దల అనుగ్రహం వుండాలి. ధ్యానం ద్వారా, పెద్దల అనుగ్రహం చేత, సమస్తమూ నీకుగా నువ్వు తెలుసుకోవచ్చు. నీ యందు అది వున్నది. అదే సమస్తాన్నీ నీకు వ్యక్తం చేస్తుంది. సింహము అనే స్థితి ఎవరికి వుంది అంటే, తన భావమునకు తాను పట్టుబడనివాడికి. తన నుండి వ్యక్తమైన భావములు తనలోంచి పుట్టే పిల్లల లాంటివే! తన నుండి పుట్టిన పిల్లలకి తను లోబడిపోయాడు అనుకోండి, తను రాజు కాదు కదా. రాజు కూడా సింహాసనము మీదే కూర్చుంటాడు. సింహాసనం మీద కూర్చున్నవాడే రాజు. అందుకే ఏసుక్రీస్తు I am the king of kings అంటాడు. మిగతా రాజులందరూ కూడా సింహాసనం మీద కూర్చున్న వారు కాదు. సింహాసనం కోసం ఏడ్చిన వాళ్ళే. అది పోతుందేమో అని యుద్ధాలు చేసి, అది పోతుందేమో అని మనుష్యులని చంపి! మీ kingdom ఎక్కడ వుంది? అంటే మీరు అనుకునే kingdom కాదు నాది, మీకు కనబడదు అని చెప్పాడు. It is the kingdom of the divine but not of this earth అంటాడు. ప్రతీ మహాత్ముడు కూడా ఒక సింహము లాంటి వాడు, ఒక రాజు లాంటి వాడు. రాజు సింహాసనము మీద కూర్చుంటాడు. అందుకనే ఇటూ-అటూ రెండు సింహాలు పెడతారు, సింహాసనము అనే సంకేతం తెలుపడం కోసం. ఒకటి సకారానికి సంకేతం, ఒకటి హ కారానికి సంకేతం. మధ్యలో వున్నది పూర్ణం, ఆ పూర్ణమునందు కూర్చున్నాడన్నమాట. ఈ కుర్చీకి ఈ చెయ్యి 'స' అయితే, ఈ చెయ్యి 'హ' అయితే మధ్యలో వున్న చోటు పూర్ణము. ఆ చోటు వాడు కూర్చుని నింపుకుని, అటో చెయ్యి, ఇటో చెయ్యి పెట్టుకుంటాడు. అదీ సింహాసనము అంటే. యోగమునందు సింహాసనమునందు కూర్చున్న వారికే ధ్యానము జరుగుతుంది. అంటే కూర్చోగానే ఎక్కడికో ఆలోచనలు వెళ్ళిపోవడంగా కాకుండా, ఎక్కడో మూలాధారంలోకి దిగిపోవడం కాకుండా, మరీ క్రింద కూర్చోబోక, మరీ ఎత్తయిన చోట కూర్చోబోక, కొద్దిగా ఎత్తయిన ప్రదేశంలో కూర్చో అని చెప్తుంది భగవద్గీత గానీ, పతంజలి యోగశాస్త్రం గానీ. మరీ క్రింద కూర్చోబోక అంటే మణిపూరకంఅంటే బొడ్డులో కోరికల భావనలో, స్వాధిష్ఠానంలో కోరికల్లోనూ, మూలాధారంలో మరీ బొత్తిగా భౌతికమైన విషయాల లోనూ నీ యొక్క

ప్రజ్ఞ కూర్చోపెట్టక! ఈ మూడిటికీ పైన వుండే ప్రజ్ఞ సింహరాశి ప్రజ్ఞ! అక్కడ కూర్చో. పైన కూర్చోబోక అంటే కొంతమంది కళ్ళు మూసుకుని పైకి చూస్తూ వుంటారు, దేవుడు ఎక్కడో పైన ఉన్నట్టుగా. కొంతమంది క్రిందకి చూస్తూ వుంటారు. అలా క్రిందకీ చూడక్కర్లేదు, పైకీ చూడక్కర్లేదు, సమంగా చూడమంటారు. సమంగా చూడడం అంటే వెన్నెముక నిటారుగా వుంటుంది, 'Chin down position' అంటారు జ్వాలాకూల్ మహర్షి. చూడండి యోగులు ఎలా కూర్చుంటారో. Neck సరిగ్గా లేకపోతే పైకీ క్రిందకీ ప్రసారాలు జరగవు. అందుకని సమంలో కూర్చో, అక్కడి నుండి తరువాత భ్రూమధ్యంలోకి వెళ్తావు, నిన్ను నువ్వు తెలుసుకుంటావు అని, చెప్తారు. సింహాసనము మీద కూర్చున్నవాడికి మాత్రమే ప్రాణాయామము సుమా! అన్నాడు పతంజలి మహర్షి. స్థిరము, సుఖము, ఆసనము అనేది అయిన తరువాత, ప్రాణము యమింపబడుట అనే నాలుగో మెట్టు వుంటుంది. ఈ రోజుల్లో ధ్యానము చేస్తున్నాము, meditation చేస్తున్నాం, ఒక fashion. Yoga చేస్తున్నావా? అంటారు. ఏమిటి చేసేది yoga? తాట తీయడం, పిడకలు చేయడం లాంటిది కాదు yoga చేయడం. వాడేమి చేస్తున్నాడంటే నాలుగు ఆసనాలు వేస్తూ yoga చేస్తున్నానంటాడు. నువ్వు చేస్తున్నది physical fitness కోసం చేసే exercise. అది యోగం కాదు. అసలు యోగం అంటే ఏమిటి? భగవంతునితో కలిసి ఉండడాన్ని 'యోగం' అన్నారు. భగవంతుడంటే మొత్తంతత్త్వం! మొత్తంతత్త్వంతో కలిసివున్నవాడు యోగి. ఎదో నువ్వనుకున్న దేవుని బొమ్మ, దానితో కుస్తీలు పట్టేవాడు యోగి కాదు. మహా అయితే వాడు ఒక ఉపాసకుడు. ఉపాసకులు యోగుల ముందు చాలా చిన్నవారు. ఉపాసకులు అవీ ఇవీ చేసి మహత్యాలు చూపించగలరు. యోగి చూపించడు ఎందుకంటే, వాడు వున్నాడు, వాడు చూపిస్తాడు అన్నీ, మనకెందుకు? మనం వాడితో ఉందాం, వాడితో చెప్పిన పని చేద్దాం అనే తప్ప, వీడిదయిన ప్రత్యేకత కోసం పీడించుకోవడం వుండదు. అతడూ యోగి! సమస్త కాలములయందు, సమస్త ప్రదేశములయందు, సమస్తమునందు, కాలము, దేశము, నామము, రూపము వీటిచేత విభజించబడని తత్త్వమునందు తాను ఇమిడి ఉన్నవాడు యోగి! అందుకే ''యోగీభవ అర్జునా!' అంటాడు కృష్ణుడు. కర్మయోగి కర్మము తో ముడిపడి వున్నాడు. జ్ఞానయోగి అంటే ఊరికే జ్ఞానం తెలుసు, ఎందుకూ పనికిరాడండీ. చాలామంది చాలా తెలిసినవాళ్ళు ప్రపంచానికి పనికి వస్తున్నవాళ్లు ఎవ్వరూ లేరు. అందుకనే శ్రీకృష్ణుడు 'వీళ్ళందరికన్నా నువ్వు యోగి అయిపో బావుంటుంది,' అంటాడు. యోగి అయిపోతే వాడే వీడి నుండి పనిచేస్తూ ఉంటాడు. వీడు ఏమీ చేయ్యఖ్కర్లేదు వాడే అన్నీ చేసుకుంటాడు. 'అదే కదా రథంలో నువ్వు వెనుక కూర్చో, నేను నడిపిస్తాను కథ,' అని చెప్పడం. 'ముందంతా నేను కూర్చుని చేస్తాను, కీర్తి అంతా నీకు వస్తూ వుంటుంది. అందరూ నువ్వు చేస్తున్నావు అనుకుంటారు, చేసేది నేను, నువ్వు అనుకోకు, దెబ్బ తింటావు' అంటాడు. అర్జునుడు 'నేనే పాడిచేస్తున్నాను ఇదంతా' అనుకున్నప్పుడల్లా దెబ్బ

తిన్నాడు. లేదు ఈయనే మొత్తం అన్నీ అనుకున్నప్పుడల్లా చక్కని అనుభూతి పొందాడు, కీర్తి పొందాడు, జయం పొందాడు అన్నీ జరిగాయి. యోగుల చరిత్రలు అందుకు చదువుకోవాలి. మనం ఆయనతో వుంటే, ఆయనే మనయందు వుండి సమస్తమూ నిర్వర్తించి, దానికి సంబంధించిన వైభావమూ, కీర్తి, ప్రతిష్ఠ, సంపద అంతా నీకు అప్పజెప్తాడు. 'నాకు ఏం కావాలిరా? నీకోసమే' అని. పిల్లవాడి కోసం తండ్రి పడే పాట్లు అన్నమాట. ఆ విధంగా నిర్వర్తిస్తాడు. అలా నిర్వర్తించాలంటే ధ్యానం చెయ్యాలంటే, ముందు చక్కగా ప్రశాంతమైన వాతావరణంలో మూడు శ్వాసలు తీసుకుని, ఒక శ్వాసతో మూలాధారం నుండీ, ఒక శ్వాసతో స్వాధిష్ఠానం నుండీ, ఒక శ్వాసతో మణిపూరకం నుండీ మనల్ని మనం ముక్తులని చేసుకున్నట్టుగా భావన చేసి, ఈ ఉదరవితానం/ diaphragm నందు నువ్వు చిన్న వెలుగుగా కూర్చున్నట్టుగా భావన చేసుకోవాలి. ఈ కనిపించేది ఒక బండ రూపం. ఈ బండ రూపానికి basis ఒక వెలుగు రూపం వుంది. This is of brick and mortar, that is of lines of light. ముందు మనం గీతలు గీసి కదా ఇల్లు కట్టాం? గీతల నుండి ఇల్లు వచ్చింది. అసలు గీతలు లేకపోతే ఇల్లు రాదు కదా. అలా lines of force గా నిన్ను నువ్వు భావన చేసుకుని, అక్కడ కూర్చుని, అప్పుడు ఓంకారం చెయ్యి తెలుస్తుంది ఏమిటో. గబగబా పరిగెత్తుకుంటూ కూర్చుని 'ఓం' అంటే, బర్రె అరిచినట్టుగా వుంటుంది తప్ప ఏమీ వుండదు. ఓంకారం చెయ్యాలంటే దానికి ఒక శ్రద్ధ కావాలి, ఒక preparation కావాలి. ఆ విధమైన శ్రద్ధ కలిగి, preparation కలిగి, అక్కడ కూర్చుని అక్కణ్ణుంచి, ఇక్కడ వాడున్నాడు, ఇక్కడ మనం వున్నాం, శ్వాసతో వాణ్ని దింపు కుంటున్నాము. ఉచ్ఛ్వాసతో వాడు దిగి వస్తున్నట్టు, నిశ్వాసతో మనం వెళ్లి కలుసుకుంటున్నట్టు. కొన్ని కొన్ని సార్లు మనం వెళ్లి వాణ్ని కలిసే ప్రయత్నం చెయ్యాలి, కొన్నిసార్లు వాడు మనల్ని కలవాలి, ఇక్కడ కన్నా (అనాహతం కన్నా) దిగిరాడు. ఎక్కడో పుట్టలో పాము లోపల ఎక్కడో కలుగులో వుంటే వాడు రాడు. మట్టిలో ఇరుక్కుని కూరుకు పోతే వాడు రాడు. అలాగే 'ఓం' అంటే అది వినపడదు. అటుపక్క connection లేదన్నమాట నీకసలు. ఉత్త telephone instrument వుంది నీ దగ్గర, connection లేదు. Connection లేకుండా 'హలో! వినపడుతోందా?' అంటే ఏం వినపడుతుంది? ఏమీ వినపడదు. అందుకని connection వున్న telephone కావాలనుకుంటే అక్కడ(అనాహతం లో) కూర్చోవాలి. అక్కడ కూర్చుని, అక్కడ నువ్వు ఒక వెలుగు రూపంగా దర్శనం చేసుకుని, అప్పుడు నీకు ఈ ఫాలభాగంలో మొత్తం అంతా నిండి వాడి వున్నాడు. నువ్వు ఉచ్ఛ్వాస చేస్తున్నప్పుడు వాడు నీ దగ్గరకి వస్తున్నాడు. నువ్వు నిశ్వాస చేస్తున్నప్పుడు నువ్వు వాడి దగ్గరకి వెళ్తున్నావు. ఇదీ మనం దేవాలయానికి వెళ్ళడం-దేవుడు మన దగ్గరకి రావడం! అదీ తిరుపతికి వెళ్ళడం అంటే. ఏడుకొండలవాడు ఇక్కడ వున్నాడు. ఇక్కడకి వెళ్ళాలి మనం తిరుపతికి వెళ్ళినా. గబగబా చూసేసి వచ్చేద్దాం, బండికి టైము అయిపోతోంది ఇలా

కాదు. పొద్దున్న దిగి సాయంత్రం పరిగెత్తుకొచ్చేస్తే దేవుడా పాడా ఏమీ లేదు. ఏదైనా చేస్తే దాన్ని పరిపూర్ణముగా అనుభూతి పొందేలా చెయ్యండి లేకపోతే చెయ్యొద్దు. ఎవడు అడిగాడు మనని తిరుపతి రమ్మని? ఆయన అడిగాడా? ఆ విధంగా, సహ అంటే కలిసి వుండడం సంస్కృతంలో. సహనావవతు-కలిసి రక్షింపబడదాం, సహనౌ భునక్తు- కలిసి ఆనందిద్దాం, సహవీర్యం కరవావహై, సహాధ్యాయి అంటాం కదా? స్నేహ అనేది కూడా అందులోంచి వచ్చిందే. సహచరుడు కలవడం. ఆ సహ శబ్దాన్ని సింహ శబ్దం చేశారు. ఆ సింహ శబ్దం అద్భుతమైన తత్త్వం. మనయందు దాన్ని సత్యం చేసుకుందాం. సింహము, సింహో అంటే జీవుడు దేవుడుగా ఎవరండీ వున్నది? వాడే! అందుకే ఆయనకీ 'సింహము' అనే పేరు ఇచ్చారు. 'నరసింహం' అంటే చాలా పెద్దవిషయం. సింహరాశి లోనే వస్తుంది నరసింహం కూడా. సింహము అనేది అగ్నితత్త్వపు రాశుల్లో మధ్యస్థమైన రాశి. మేష రాశి విద్యుత్తు అయితే, ధనూరాశి పదార్ధంలోని వేడిమి అయితే, సింహరాశి జ్వాల! విద్యుత్తు అవ్యక్తమైన అగ్ని. అగ్రే నియతి ఇతి అగ్నిః అన్నారు. అగ్ని అగ్ని అంటాం, అగ్గిపెట్టె ఉందా? అంటాం కదా. అగ్ని అన్న పదం ఎలా వచ్చింది? సంస్కృతం లో వ్యుత్పత్తి అర్ధం లేని పదమే లేదు. మిగతా భాషలన్నీ పిచ్చి భాషలే. సందేహం లేదు. బాధపడకండి, కోప్పడకండి. అగ్నేనియతి, అన్నిటికంటా ముందు వుండేది. ఇతి అగ్నిః. ప్రతీదానికి నిర్వచనం వుందండీ. ముందు దానికి తత్త్వం వుంది, ఆ తరువాత ఆ పేరొచ్చింది. సృష్టి ముందు జరిగి తరువాత పేర్లు పెట్టుకున్నాడు దేవుడు. మనలాగా ముందు పుట్టకుండానే పిల్లవాడికి పేరు ఏమి పెడదాం ? అనే type కాదు. పని మొదలవకుండానే పెద్ద Board తయారు చేశామనుకో. Board ముఖ్యమా? ముందు పని. ఒకాయన World Teacher Trust పేరు చెప్పగానే, పెద్ద board తయారు చేశాడు. అది ఆయన ఇంటికన్నా పెద్దదిగా తయారయిపోయింది. అది ఎక్కడ వ్రేలాడదీయాలో తెలియక ప్రహరీ గోడకి పెట్టాడు. అంత బోర్డు, లోపల office ఆ board లో సగం వుంటుంది. ఊరికే ఆబ అంతే! సరే నెమ్మదిగా ఆ Board కదిలి కదిలి ఇక్కడకి వచ్చేసి ఇక్కడ board గా తయారు అయిపోయింది. మళ్ళీ ఇక్కడి నుండి ఇంకెక్కడికో వెళ్ళింది. కాబట్టి ముందు Board కాదు, ముందు పని. ముందు పిల్లవాణ్ణి కనాలనే సంకల్పం రావాలి. ఆ తరువాత భార్యా భర్తా యొక్క మనస్సు, ఇంద్రియము శరీరము పవిత్రంగా వుండి, పవిత్రమైన భావనలో వుండి, ప్రశాంతమైన మనస్సు వారిద్దరికీ కలిగి వుండి, ప్రశాంతమైన వాతావరణంలో ఇద్దరూ వుండి, పుణ్యమైన కాలంలో గర్భధారణ కార్యక్రమం చేసుకోవాలి. ఊరికే ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు, ఎలా పడితే అలా, ఈ కార్యక్రమం జరిగితే పరమ దరిద్రులు పుట్టుకొస్తూ వుంటారు. జంతువులే మనుష్యుల రూపంలో పుట్టుకొస్తూ వుంటాయి. మానవాకృతులే తప్ప మానవులు కాదు చాలామంది. ఎందుకంటే పుట్టిన దగ్గర నుండీ మనుష్యులని చంపేయడం, మనకి కావలసినది పట్టుకెళ్ళిపోవడం, అదేకదా ఈ రోజుల్లో పశుప్రవృత్తి! There is no

hesitation to kill. Paper తీస్తే వీడు వాణ్ని చంపాడు, వాడు వీణ్ని పాడిచాడు, ఆ భర్త వదిలేశాడు, ఆ భార్య ఉరి, ఇవి కదా. చావు వార్తల తోనే కదా పొద్దున్నే మనం లేస్తాము. సాయంత్రమో, మధ్యాహ్నమో వస్తే బావుణ్ణు paper. హింసా ప్రవృత్తి ఎక్కణ్ణుంచి వస్తోంది? జంతు ప్రవృత్తి లోంచి వస్తోంది. వాడు ఎక్కణ్ణుంచి వచ్చాడు? మనం పుట్టిస్తే వచ్చాడు. మనం ఎలా పుట్టించాం? మనం అటువంటి అశాంతిగా వున్న సమయంలో, పిల్లల్ని కనకూడదు. ఆరోగ్యం లేకపోయినా పిల్లల్ని కనకూడదు. నీకు ఆరోగ్యం లేకుండా పిల్లల్ని కంటే వాళ్లకి కూడా అదే వస్తుంది. ఏం తెలుసు నీకు? కన్నావా? అంటే కన్నాను. ఏం కంటావు? మగపిల్లవాణ్ని కాదు జబ్బుల పుట్ట. ఆడపిల్ల జబ్బుల పుట్ట. ఆస్తులు ఇవ్వకపోవచ్చు గానీ జబ్బులు ఇస్తున్నారు తమ సంతతికి. భారతీయుల గురించి ఒక మంచి వాక్యం వుంది పాశ్చాత్య దేశాలలో. బాగా ఎండ ఎక్కువ వుండి చిరాకు వుంటుంది. చిరాకు వచ్చేసి కోపంలో పిల్లల్ని పుట్టించేస్తుంటారు వాళ్ళు. చికాకులో పిల్లలు పుడుతూ వుంటే ఇలాగే వుంటారు. పాశ్చాత్య దేశాలలోనూ ఏమీ ఇంతకన్నా బావున్నారు అనడానికి వీలు లేదు. కాబట్టి ప్రతీదానికీ ఒక పద్ధతి వున్నది. ఆ పద్ధతిలో జరగకపోతే అన్నీ ఇబ్బందులు వస్తాయి. ఎందుకు ఇవన్నీ చెప్తున్నాను. మేషరాశి అగ్ని యొక్క విద్యుత్ తత్వానికి సంబంధించినది. సింహరాశి అగ్ని యొక్క జ్వాలా తత్వానికి సంబంధించినది. ధనూరాశి లేదా మార్గశీర్ష మాసం అంటాం అది అగ్ని నిహితమై పదార్థం నందున్న తత్వానికి సంబంధించినది. మన యందు వేడి వున్నది కదా. Temperature చూస్తే వేడి తెలుస్తుందా లేదా? సున్నా degree రాదుగా? అది ఉండబట్టే శరీరం! ఆ వేడి ఎక్కువైతే పోతాం. నూట ఎనిమిది degrees వేడి వుంటే ఏమౌతుంది? లోపల అగ్ని ప్రజ్వరిల్లి, పదార్థాన్ని కాల్చేసి, తత్వాన్ని పట్టుకుపోతుంది. అంతే. జ్వాల మీరు చూసినట్లయితే మీకు ఏమి అర్థం కావాలండీ? హోమం చేసుకుంటాం కదా. హోమం లో జ్వాల చూడడం చాలా ముఖ్యం. పుస్తకం చదువుతూ కూర్చుంటే గుడ్డివాడిలాగా, కనపడే జ్వాలని చూడవు కదా? 'ఈ జ్వాల ముఖ్యం రా! జ్వాల చూడకుండా హోమం దగ్గర ఎందుకురా?' అని చెప్తున్నాడు యోగి. చోటులో వుండే అగ్ని, పదార్థంలో వుండే అగ్ని రెండూ కలిసినప్పుడు జ్వాలగా వస్తుంది. మీరు వెలిగించేసి పైన మూకుడు వేసేయండి. జ్వాల ఉంటుందా? ఇక్కడ దీపం పెట్టారు, మూత పెట్టేసారనుకోండి Chimney మీద ఆ జ్వాల ఉంటుందా? పోతుందా? మనం అనుకుంటాం, మనం బాగా వత్తి వేశాం, నూనె పోశాం అందుకే వెలుగుతోంది అని. కాదు. నూనె వేసి, వత్తి వేసి, వెలిగించి పైన మూత పెడితే వెలగదు. ఎందుకంటే అక్కడ వెలగడానికి వుండవలసినది ఇంకొకటి లేదు. ఏమిటది? కంటికి కనపడనిది. అది కూడా దిగుతుంది అందులోకి. Oxygen అందడం లేదు అంటాం. Oxygen అంటే ఏమిటి? ఆ తత్వం యొక్క వాయు రూపం. సూర్యుడి యొక్క కిరణం దాని యొక్క వెలుగు రూపం. అంతకన్నా ఆకాశంలో అవ్యక్త రూపం. అలా వుండి, దిగివస్తూ, నీకు

జ్వాలగా తయారౌతోంది. అంత మాత్రం చేత కింద నూనె, వత్తి లేకపోతే నీకు జ్వాల రాదు. దానంతట అది దిగి వచ్చి నీకు జ్వాలగా కనిపిస్తుందా? వత్తి ఉండాలి. వత్తి ఎందుకండీ, విద్యుత్ వుంది కదా? అంటే అక్కడ కూడా ఈ విద్యుత్ Filament ఈ వత్తిలాగ పనిచేస్తోంది కాబట్టి, వెలుగుతోంది. Filament అంటే ఏమిటి? సూక్ష్మమైన పదార్థం. పదార్థం సూక్ష్మమయితే వెలుగు యొక్క అత్యుత్తమం గోచరిస్తూ వుంటుంది. నీ శరీరం ఎంత పలచనగా వుంటే, అంత వెలుగుని ఎక్కువగా ప్రసరింపచేయడానికి పొంది ఉంటావు, కాకపోతే మూసుకుపోయి వుంటుంది. ఆ దీపపు సెమ్మెలో వున్న లోహం/metal లో కూడా అగ్ని వుంది. ముట్టుకుంటే కాల్తుంది. ఇంకా బాగా వేడెక్కిస్తే అదృశ్యమైపోతుంది. దేన్నయినా ఉన్నదాన్ని లేకుండా చెయ్యాలంటే ఏమిటి కావాలి? అగ్ని! లేనిదాన్ని ఉన్నట్టుగా చెయ్యాలంటే ఏమిటి కావాలి? అగ్ని! అందుకనే అన్ని లోకాలు అగ్ని చేతనే అవతరింపబడుతున్నాయి, మళ్ళీ అదృశ్యం చేయబడుతున్నాయి. అందుకనే అగ్ని ఆరాధన అన్నిటికన్నా ముఖ్యం అన్నారు. అగ్ని వల్లే సూర్యుడు వెలుగుతున్నాడు. అగ్ని వల్లనే సూర్యుణ్ణి వెలిగించేవాడు వెలుగుతున్నాడు. వాడు సవితృడు. సావిత్రి అంటాం. అంతకన్నా పైన భర్గోదేవ మండలం. దాన్ని మనం 'వైకుంఠం' అంటూ వుంటాం. ఇవన్నీ అగ్ని చేతనే చేయబడివున్నాయి. ఆ అగ్ని ఆరాధన చేయడం ముఖ్యం. ఒక శిష్యుడు గురువుగారిని, 'దేన్నీ ప్రార్థన చేయమంటారండీ?'అని అడిగాడు. 'రోజూ సూర్యుడి వెలుగుని చూసి ప్రార్థన చెయ్యి' అని చెప్పాడు గురువు. అంటే శిష్యుడన్నాడు 'మరి రాత్రి పూట కష్టం కదా, కనబడడు కదా సూర్యుడు?' అన్నాడు. శిష్యుడు ఏమీ చేయడు, ఊరికే సందేహాలు ఎక్కువ. గురువుగారికి ఎంత తెలుసు? అనే సందేహం తప్ప, చెప్పింది చేయడం అనే తత్త్వం తక్కువ వుంటుంది. 'పోనీలేరా! రాత్రి చంద్రుడు వుంటాడుగా, అగ్ని యొక్క వెలుగే చంద్రుడు, ఆ చంద్రుణ్ణి చూసి, మనస్సులో ప్రతిబింబించుకుని, ఆ రూపాన్ని ధ్యానం చెయ్. సూర్యుణ్ణి ఉదయం ప్రతిబింబించుకుని మనస్సులో ఆ రూపాన్ని ధ్యానం చెయ్. పగలు అది చెయ్, రాత్రి ఇది చెయ్' అన్నారు. అంటే శిష్యుడికింకా సందేహం ఆగలేదు. 'అలా కాదు అమావాస్య వచ్చింది అనుకోండి అప్పుడో?' అంటే, 'అవును అమావాస్య రోజున ఏదీ నీకు కనబడదు కదా, అప్పుడు చిన్న అగ్ని వెలిగించుకుని ఆ జ్వాలని చూసి ధ్యానం చెయ్.' అన్నారు. అప్పుడు వాడు 'రాత్రి అనుకోండి, అమావాస్య అనుకోండి, బాగా వర్షం పడుతోంది అనుకోండి, ఆచ్ఛాదన లేని చోట వున్నాను అనుకోండి. అప్పుడు అగ్ని ఎలా వెలిగించుకోను? అప్పుడు ధ్యానం ఎలా చెయ్యాలి?' అని అడిగాడు. అప్పుడు గురువు, 'ఆ అగ్ని నీ హృదయంలో వుంది. దాన్ని ధ్యానం చెయ్యి'. అన్నాడుట. అప్పుడు శిష్యుడికి ఇక అవకాశం దొరకలేదు ఏమి చెప్పాలో. అలాగేనండీ, వస్తాను అని చెప్పి వెళ్ళాడు. ఒక ముప్ఫైరేళ్ళకి తిరిగి వచ్చి 'కనబడ్డది అగ్ని' అని చెప్తాడు. వాడు అదృష్టవంతుడు, సాధన చెప్పిన పద్ధతిలో, సరిగ్గా చేశాడు. అంటే మనలో వున్న పదార్థమూ, ప్రజ్ఞ రెండూ కలిస్తే జ్వాల అవుతుంది. ప్రజ్ఞ అవ్యక్తము, పదార్థము వ్యక్తము.

పదార్ధంలో ప్రజ్ఞ అంతర్లీతంగా వుంది. ప్రజ్ఞలో పదార్ధం అంతర్లీతంగా వుంది. మనకి పదార్ధంలో వేడిమి వుంది అని తెలుసు తప్ప, ఆకాశంలో పదార్ధం వుందని తెలియదుగా ఇంకా? అది తెలిసిన వాళ్ళు ఋషులు. వాళ్ళేం చెప్పారంటే మేషం అంటే చైత్రమాసం దానికి సంకేతం. మార్గశీర్షమాసం, ఎందుకు మార్గశీర్షం అన్నారంటే అక్కణ్ణుంచి బయలుదేరి వెళ్ళాలని. పదార్ధం లో వుండేవాళ్ళు చేరాలంటే అక్కణ్ణుంచేగా బయలుదేరాలి. రెండిటికీ అనుసంధానం చేసే అగ్నితత్త్వపు రాశి సింహరాశి. అందుకని సింహరాశి మనకి శ్రావణమాసం గా ఇచ్చారు. ఏమిటి శ్రావణమాసం లో మనం చేసేది? బంగారం కొనుక్కుంటాం, అంతేగా? ఎందుకు బంగారం కొనుక్కునే సాంప్రదాయం వచ్చింది? జ్వాల యొక్క రంగు. 'హిరణ్యవర్ణాం' కదా. దానియొక్క ఘనీభవించిన స్థితి మనకి బంగారం. బంగారం కొనుక్కోండి, వద్దు అని చెప్పడంలేదు. వీలుంటేనే కొనుక్కోండి, అప్పుచేసి మరీ కొనుక్కోవద్దు. అసలు బంగారం లోపల వుంది. ఈ బంగారం తెలిస్తే, బయట బంగారం మీద మోజు వుండదు. బయట బంగారం పదార్ధమైనది. లోపల బంగారం తేజోమయం అయినది. అందుకని శ్రావణమాసం లో బంగారం కొనుక్కో అంటే అర్ధం, ఇక్కడ వుందిరా దాన్ని పొందు. నీ హృదయంలో, బాగా కరగేసిన బంగారం చూస్తే ఎంత ధగధగ లాడుతుందో, అలా నీ రూపం నీకు కనిపిస్తుంది లోపల. అదీ కావాలి. అందుకని ఏం చెప్పారు? అమ్మవారి పూజలు, ఆమెకి అలంకారం గా ఎవరికీ ఎంతెంత బంగారం వుంటే, bank locker లోంచి తెచ్చి ఆమెకి పెట్టి, ఆరోజు పడకగదిలో కాకుండా అక్కడే పడుకుంటారు. అమ్మవారి మీద భక్తి కాదు. బంగారం మీద భక్తి. దొంగాలొస్తారేమో అని. అవ్వగానే అమ్మవారి మీదవి గభాలున అన్నీ తీసేసి మళ్ళీ bank లో పెట్టేవరకూ వీడికి ఆదుర్దాయే, కదా. సాంప్రదాయం కాలగతిలో ఏ విధంగా భ్రష్టు పడుతుందో చెప్తున్నా. అన్నీ చాలా అత్యుత్తమమైన సాంప్రదాయాలు మన దగ్గర వున్నాయి. అవి మన సంస్కారాల తగ్గిన కొద్దీ అవి భ్రష్టుపడుతున్నాయి. మనకి కావలసినది భావన. అది రోజూ చేసుకో. ఈ సింహరాశియందు నీకు కనిపించేది అటువంటిదే. హృదయమునందు గోచరించేది Golden Aura లేక హిరణ్యవర్ణం. అమ్మవారి సూక్తం కూడా 'హిరణ్య వర్ణాం హరిణీం' అని వస్తుంది. కాబట్టి ఆ విధమైన రంగు మనకి అక్కడ గోచరం అవుతుంది. అంటే పై నుండి భగవద్ తత్త్వం దిగి వచ్చింది. కింద నుండి జీవతత్త్వం పదార్ధంలోంచి కాస్త విడిపడి కలిసింది. రెండూ కలిసే సరికే వెలుగు ముద్ద అయ్యింది. పదార్ధం లేకపోతే అది వీలుపడదు. జీవుడు లేకపోతే లేదు. దేవుడు లేకపోతే లేదు. అంటే ఒకటి మూడు అయ్యింది. ఒకటీ-మూడు మళ్ళీ కలవాలంటే రెండు లోనే కలుస్తాయి. అందుకనే మనకి రజస్సు, తమస్సు, సత్త్వమూ అనే మూడు గుణాలలో, సత్త్వము నందు కలయిక వలన భగవద్ అనుభూతి కలుగుతుంది, అని చెప్పారు. దానికి బాగా ప్రాణాయామం చెయ్యాలి. వీలుంటే 24 నిముషాలు చెయ్యండి. 48 నిముషాలు చెయ్యండి, మరీ వీలుంటే 72

నిముషాలు చెయ్యండి. ఊరికే అవీఇవీ చేయకండి. 24 గంటల్లో 11 సార్లు రుద్రాభిషేకం పెట్టుకుంటే మీ మనస్సు అందులో ఎంతసేపు నిలిచింది? అంతక్కర్లేదు ఒక్క సారి విష్ణు సహస్రనామం చదివినప్పుడు ఎన్ని నామాలు గుర్తున్నాయి? అంతే మన మనస్సు, అసలు నిలబడలేని మనస్సు. అది నిలబడాలి అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసల మీద కేంద్రీకరించడం ఒక్కటే మార్గం! చేస్తే అది చెయ్యండి. చేస్తే సరాసరి సింహాసనం దగ్గరకి వెళ్ళిపోతారు. ఎన్నోసార్లు చెప్పకున్నాం కదా. ఉచ్ఛ్వాస నిశ్వాసల యందు మనస్సు వుంచండి. యోగానికి అది ముఖ్యం. సత్యనారాయణ వ్రతం చేద్దామా, వెంకటేశ్వర స్వామి వ్రతం చేద్దామా, విష్ణు సహస్రనామం పారాయణ చేద్దామా, గణపతి పూజ చేద్దామా ఇవే ఆలోచనలు! 'అథ యోగానుశాసనం' అని ఎందుకు అన్నాడో తెలుసా పతంజలి? 'అవన్నీ అయిపోయాక రారా' అన్నాడు. ఎందుకనీ నీ లోపలకి నువ్వు వద్దామనే ఆసక్తి ఉంటే అప్పుడురా. ఊరికే అవన్నీ పెట్టుకుని నువ్వు లోపలికి రాలేవు. రాబోకు లోపలకి తలుపులు తెరవము. పెంచుకున్న కొద్దీ బయట పెరుగుతూ వుంటాయి కదా. ఎన్ని పటాలు/బొమ్మలుంటాయి మన ఇంట్లో? వాటన్నిటికీ పైన పువ్వులు పెట్టాలి, పైన తుడుచుకోవాలి. అన్నీ ఇక్కడ నీ హృదయంలో వున్నాయయ్యా అని చెప్తున్నారు. తీసేయవయ్యా అంటే అమ్మో! తీసేస్తే ఎలా అవుతుంది అంటే, తీసేస్తే ఏమీ కాదు. నిన్ను పెట్టమని వాళ్ళు అడిగారా? ఎందుకు తీసేశావు అని అడుగుతారా? అంతా మన దగ్గరే వుంది దానికి సంబంధించిన confusion. యోగంలోకి వద్దామనుకుంటే, శ్వాసను పట్టుకుని, శ్వాస అనే చాంతాడుతో లోపలకి, హృదయం లోకి దిగాలి. అక్కడి నుండి ఇంకో దారి వుంటుంది పైకి వెళ్ళడానికి 'చిత్రిణి' అని. చిత్రిణి అంటే 'చైతన్యవంతమైన వెలుగురేఖ'. అది మన బ్రహ్మదండం అంటే వెన్నెముకలో వున్న సుషుమ్నలో వున్న వెలుగురేఖ అని చెప్పారు మంత్ర శాస్త్రంలో. కాబట్టి ముందు చాంతాడు వేసుకుని హృదయంలోకి దిగాలి. దిగి ఇక్కణ్ణుండి అక్కడికి వెళ్ళాలి. సింహరాశి వెలుగు తత్త్వం. వెలుగు అంటే అవ్యక్తము-వ్యక్తము కలిసిన చోటు. వెలుగు చీకట్లు కలిసిన చోటు. తెలిసి తెలియనటువంటివి కలిసిన చోటు. అందుకే సంధ్యా సమయంలో గాయత్రీ మంత్రం చేసుకోమన్నారు. ఎందుకంటే గాయత్రి వెలుగు స్వరూపం కాబట్టి. అయిపోయిన తరువాత ప్రాయశ్చిత్త మంత్రం చేసుకుంటే మనని మనం మోసం చేసుకున్నట్టే. రాత్రి 8 గంటలకి సంధ్యావందం చేస్తూ వుంటారు. అది ఊరిలో వాళ్ళందరినీ మభ్య పెట్టడానికి తప్ప, అసలు సంధ్య ఏది నువ్వు చేస్తున్న వందనానికి? రైలు వెళ్ళిపోయిన తరువాత platform మీదకి ఎంత వెళ్లి మొత్తుకున్నా, ఆ రైలు వస్తుందా మళ్ళీ platform మీదకి? రాదు. అదే రాదు మరి సంధ్య వస్తుందా? అస్సలు రాదు. నీ కోసం మొత్తం భూమి వెనక్కి తిరిగితే, నీతో సహా అన్నీ పడిపోతాయి. తిరిగి రాదు. అయిపోయింది. ప్రాయశ్చిత్తం ఎందుకంటే రేపైనా మళ్ళీ సరైన సమయానికి చేస్తాను అని చెప్పడానికి. ఇవన్నీ మనం మర్చిపోయి తిప్పలు పడుతున్నాము. ఎంత మొత్తుకున్నా, ఎన్ని గుళ్ళు తిరిగినా, ఎంత

దేవుడి పాదాలు పట్టుకున్నా, ఎంత ప్రార్థించినా ఏమీ కదలడంలేదు కదా. ఎందుకు కదలదు అంటే అసలు విషయం తెలియక దానియొక్క వక్రీకరణం చెందిన భావనలో వుండడం చేత. సింహరాశి తత్త్వం తెలిస్తే అక్కడ దేవుడు, జీవుని యొక్క కలయిక స్థానం సింహరాశి. సాధన చేసుకోండి. ఎన్నో అద్భుతమైన విషయాలు సింహరాశిలో వున్నాయి. ఇందులోంచే హౌస్, సోహం. సః అహం అని చెప్పడం సోహం. అతడే నేను అని తెలుస్తుంది చివరికి. సింహం దగ్గరకి వెళ్తే ముందు మనం హంస అని తెలుస్తుంది. హంస అనేవాడు, సోహం అని తెలుస్తుంది. అంటే ముందు నేనున్నాను. నేను అనుకుంటున్నవి అన్నీ నేను కాదు. నా పేరు ఇది కాదు, నా ఊరు ఇది కాదు. నా కులం ఇది కాదు. నాది అనుకున్నది ఏదీ నాది కాదు. ఇవన్నీ తెలుస్తాయి. అవన్నీ వాడివి అని తెలుస్తాయి. నువ్వు కేవలం ఒక వెలుగు రూపానివి అని తెలుస్తుంది. ఇది సింహరాశిలో తెలుస్తుంది. అక్కణ్ణుండి 'అతడే నేనుగా వున్నాను' అని తెలుస్తుంది. అదే సోహం! సః అహం! అతడే నేను. అక్కణ్ణుండి అతడూ, నేను, ఈ పదార్థం అంతా ఒకటే, 'ఓం' అని తెలుస్తుంది. 'ఓం' అనే పదం లో 'అ' 'ఉ' 'మ' అనే మూడు అక్షరాలు వున్నాయి. 'అ' అనేది అవ్యక్తమైన భగవద్ తత్త్వం. 'మ' అనేది పదార్థమైన తత్త్వం. 'ఉ' అనేది ఈ రెండిటినీ అనుసంధానం చేస్తున్న తత్త్వం. ఈ మూడింటినీ శివుడు, విష్ణువు, బ్రహ్మ అన్నారు. ఇలా చెప్పకుంటే ఎన్నైనా వస్తాయి. కాబట్టి మనం మూడో class లో వున్నవాళ్ళం రెండో class కి దిగి వెళ్తే, ఒకటో class వాడు మన దగ్గరకి వస్తాడు. అదే, నువ్వు నాలుగు మెట్లు ఎక్కి రారా! నేను నాలుగు మెట్లు దిగి వస్తాను అని చెప్పడం. సరిగ్గా చెప్పడం అంటే నువ్వు మూడు మెట్లు ఎక్కిరా నాలుగో మెట్టు దగ్గర వుండు. నేను మూడు మెట్లు దిగి వస్తాను, నాలుగో మెట్టు దగ్గర కలుసుకుందాం. మూడు ఏమిటంటే భౌతికము, కామమయము, భావమయము అనే మూడు లోకాలు ఎక్కి మనం రావాలి. అతను ఎక్కణ్ణుండి దిగివస్తాడు అంటే, పరతత్త్వం నుండి దివ్యతత్త్వం. అక్కణ్ణుండి మనం వుండే etheric plane, వెలుగుతత్త్వం అంతవరకూ దిగి వస్తాడు. అందుకనే, అటుమూడు-ఇటు మూడు మధ్యలోని నాలుగో లోకాన్ని బుద్ధిలోకం అన్నారు. అంటే ఏడులోకాల్లో మధ్యలోకం! అంతవరకూ ఆయన దిగి రాగలడు, అంతవరకూ నువ్వు ఎక్కాలి అంటే నువ్వు బుద్ధిమంతుడివి అవ్వాలి. బుద్ధిని కలిగి వున్నవాడు అంటే వెలుగుని కలిగి వున్నవాడు అవ్వాలి. అది అవ్వాలి అంటే సత్సంధ పఠనం, సత్పురుషులతో సత్సాంగత్యం కలిగి వుండాలి. వారి యొక్క సేవ చేసుకోవాలి, తద్వారా జీవితంలో ధర్మం తెలుసుకోవాలి, ధర్మం ప్రకారం జీవించడం నేర్చుకోవాలి, అప్పుడు నీలో నువ్వు బుద్ధిలోకాలని పొందుతావు. First mark వచ్చేవారంతా బుద్ధిమంతులు అనుకోకండి, వారికి ఎంతో అసూయ వుంటుంది. ఇంకొకడికి తనకన్నా ఎక్కువ marks వస్తే ఏడుస్తాడు. ఇంకేమి బుద్ధిమంతుడు? Competition కదా మనకంతా. వాళ్ళందరూ ఒకరకమైన పరుగు పందెం లో వున్నారు. వెనుక ఎవరైనా వస్తే వాడికన్నా వేగంగా

పరుగెత్తాలనే లేఖ్కలో వుండి, ముందు ribbon touch చేసిన వాడు బుద్ధిమంతుడు ఎలా అవుతాడు? శక్తిమంతుడు అవుతాడేమో గానీ బుద్ధిమంతుడు అవ్వడు. 'బుద్ధిలోకంలోకి వస్తే అక్కడ నేను నీకు కనిపిస్తాను. అప్పుడు నీ సమస్యలకు పరిష్కారం పొందుతావు' అని చెప్తాడు, భగవద్గీతలో శ్రీకృష్ణుడు. 'నీకు ఎటువంటి సమస్యకైనా పరిష్కారం కావాలంటే నువ్వు మూడు అంతస్తులు దాటి, నాలుగో అంతస్తులో కూర్చో. నేను వస్తా అక్కడికి. నీకు కావలసినది చెప్తా, వెళ్ళు, చేసుకుపో. అంతేగానీ మనోలోకంలో వుండి నీ సమస్యలకి పరిష్కారం అడిగితే రాదు' అంటాడు. ఎందుకు మనం పెద్దవాళ్ళ దగ్గరకి వెళ్లి సలహా అడుగుతాం? మనం నాలుగో అంతస్తులోకి వెళ్ళలేం. వాళ్ళు మూడో అంతస్తు దాటి నాలుగో అంతస్తులోకి వెళ్ళగలరు. ఐదు, ఆరులోకి వెళ్ళగలరు. కావాలంటే ఏడులోకి కూడా వెళ్ళగలరు. వాళ్ళు మీరు అడిగితే, మనల్ని అడుగుతున్నారు, మనకి చాలా తెలుసు కాబట్టి చెబ్దాం అనుకోరు, ఒక్కసారి మూడు శ్వాసలు తీసుకుని, నాలుగో శ్వాసలో వెళ్లి అక్కడ కూర్చుంటాడు. 'ఏమిటి స్వామీ? వీడు ఇలా అడుగుతున్నాడు ఏం చెప్తావు?' అంటాడు. అప్పుడు ఆయన దిగి వస్తాడు. ఈయన ఆయన చెప్పినది వింటాడు, విన్నది చెప్తాడు. తెలిసినవాళ్ళు అలా వుంటారు. మనం చెప్పాం. వాళ్ళు మనల్ని అడుగుతూ వుంటారు. సలహాలు మనం చెప్పకపోతే వాళ్ళు ఎలా బతుకుతారు? అని అనుకునేవాళ్లు తప్పడు సలహాలు చెప్తూనే వుంటారు. కాబట్టి మనం బుద్ధిలోకంలోకి ఎదగాలి, అందుకే ఈ సాధన అంతా కూడా. కేవలం ధర్మం తెలిసింది, ఆ ధర్మం ప్రకారం నడవడం తెలియడం కోసం సాధన. అప్పుడు అన్నీ జరుగుతాయి. మనస్సు, ఇంద్రియాలు, శరీరం పవిత్రీకరింపబడనంతవరకూ ఏమీ లేదండీ. పవిత్రీకరిస్తే, పవిత్రీకరింపబడిందా లేదా అనేది నీ మాటలోనే తెలుస్తుంది. అబద్ధాలు చెప్తూవుంటే చాలా సులభంగా తెలుస్తుంది తెలిసినవాడికి. కానీ నువ్వు అబద్ధం చెప్తున్నావా? అని అనడు. ఏ రాశి అయినా అద్భుతమైన భావం కలిగినది. అందులోనూ సింహరాశి. ముందు ముందు మనం ఆషాఢ పౌర్ణమి చేసుకుంటున్నామే గురు పౌర్ణమి అని, ఆ విధంగా సింహరాశిలో శ్రావణ పౌర్ణమి చేసుకుంటారు తెలిసిన సత్సాధకులందరూ. సత్సాధకులు అంటే సత్యమును అన్వేషిస్తున్న సాధకులు. సాధన అంటే, సత్యమును అన్వేషించేదే సాధన తప్ప, మనకేదో కావలసినది సాధించుకోవడం, భగవంతుని చుట్టూ తిరగడం అన్నది సాధన కాదు. నీ కొరకు భగవంతుడా, భగవంతుని కొరకు నీవా, అని అంటూ వుంటాం కదా? 99 శాతం మనకోసం భగవంతుడు. ఒక్క శాతం భగవంతుని కోసం మనంగా ఉంటాడు ఈ కనపడుతున్న దాంట్లో.

## 506 భూతమహేశ్వరః

భూతముల యొక్క ఈశ్వరులకు ఈశ్వరుడు. భూతేశ్వరులు వున్నారు. లోకేశ్వరులు వున్నారు. లోకేశ్వరేశ్వరా! అంటూ వుంటాం కదా. ఈ పేటకి ఒక నాయకుడు ఉంటాడు. కొన్ని పేటల గుంపుకి ఒకడు ఉంటాడు నాయకుడు. వాళ్ళందరికీ ఇంకొకడు ఉంటాడు. ఊరందరికీ ఇంకోడు ఉంటాడు. రాష్ట్రానికి ఒకడు, దేశానికి ఒకడు, గోళానికి ఒకడు ఉంటాడు కదా. ఎక్కడికక్కడ వాడు ఈశ్వరుడే. ఇంట్లో నువ్వు ఈశ్వరుడివి. ఆఫీసులో నీ ఈశ్వరుడిని నువ్వు కలుస్తావు, నీ పైవాడు అని అర్థం. ఇటువంటి ఈశ్వరులు ఎంతో మంది వున్నారు కదా. భూతాలు. భూతాలంటే దయ్యాలు అనుకోకూడదు. పుట్టినవి అన్నీ భూతాలే. జీవులు అన్నింటినీ 'భూతములు' అంటారు. జీవుడు వచ్చాడు అంటే భూతం వచ్చింది అని అర్థం. మనకి భూతం అంటే ఇంకొక అవగాహన వచ్చేస్తూ వుంటుంది. వాడుకలో అలా మార్చేసుకున్నాం అంతే. భూతముల యొక్క ఈశ్వరుడు, లోకముల యొక్క ఈశ్వరుడు. వీళ్ళందరికీ ఈశ్వరుడు ఒకడున్నాడు. వాడు ఆయన! అందుకే నీకు పైన వుండే వాడిలో ఆ ఈశ్వరుడిని చూడాలి. అప్పుడు వాడు నీ పట్ల ఉన్ముఖుడవుతాడు, సుముఖుడవుతాడు, నీ పనులు అవుతాయి. Boss అంత మంచివాడు కాదండీ, అనుకోబోకండి. Boss రూపంలో వున్నది ఎవరూ, ఆయనే అని చూడండి. మంచివాడు అవుతాడు. అన్ని రూపాల్లో నేనే వున్నాను అని కదా. అటువంటిది నీ పై వాడిలో ఉండడా? వాడు మాత్రమే excluded, నీకు ఇష్టం లేదు కాబట్టి? నీకు ఇష్టం లేని వాళ్ళందరిలో దేవుడు వుండడా? నీ పైవాడిలో దేవుణ్ణి చూశావనుకో ఉన్ముఖుడవుతాడు. నీ క్రిందవాడిలో దేవుణ్ణి చూశావనుకో ఉన్ముఖుడవుతాడు, నువ్వు చెప్పినది వాడు చేస్తాడు. లేకపోతే నువ్వు ఒకటి చెప్తే, వాడు ఒకటి చేస్తాడు, వీడు చెప్తే మనం ఎందుకు చెయ్యాలి? అంటాడు, strike చేస్తాడు. Work to rule అంటాడు. Work to rule లో కూడా ఆయన్ని మరచిపోకపోతే, పిచ్చాడు తాపత్రయ పడుతున్నాడులే పాపం అని, చేసి పెడతాడు. అది మర్చిపాయాడనుకో, కిందవాడు పని చెయ్యడు. మోసం చేస్తాడు. సంతకం సరిగ్గానే వుంది sir, అని Cheque pass చేయిస్తాడు, ఆ తరువాత మనం పీక్కుంటూ కూర్చోవాలి. ఎందుకని? మనం భగవంతుడ్ని చూడలేదు వాడిలో. మర్చిపోతూ వుంటాం. మరచిపోవడమనేది ఒక కళ్యాణ గుణం జీవుడికి. మర్చిపోగానే అవతలివాడి నిజగుణం పనిచేస్తుంది. గుర్తుంటే అసలువాడు పని చేస్తాడు. తెరలు పడ్డాయంటే మనం మర్చిపోయాం అని అర్థం తప్ప, పక్కవాడు చెడ్డవాడు అని అనుకోబోకండి. 'అందరూ నిమిత్తకారణాలే అబ్బాయి! నీకే నీది తెచ్చి ఇస్తూ వుంటారు' అని చెప్తాడు కృష్ణుడు. అయ్యింది అంటే మన గొప్ప, అవ్వలేదు అంటే వాడెవ్వడో పాడుచేశాడు. ఇదీ కదా

మనము. అయినప్పుడు వాడి యొక్క అనుకూలత వుంది, అవ్వనప్పుడు వాడి ప్రతికూలత వుంది. పనులు అయ్యేట్టుగా కొన్ని vehicles, అవ్వనట్టుగా కొన్ని vehicles నీ చుట్టూ కనిపిస్తుంటాయి. ప్రతికూలాన్ని అనుకూలం చేసుకోవడం అన్నది సాధనలో ఒక పెద్ద భాగం. రాముడు అలా చేశాడు. ప్రతికూలం అయిన సన్నివేశం అనుకూలం అయ్యింది.ధర్మరాజుకి అలా అయ్యింది. ఎలా? అన్నిట్లో దాన్ని చూస్తాడు కాబట్టి. ఏదో ఇక్కడ దండం పెట్టుకుంటే పోతుంది కదండీ! అంతవరకూ ఎందుకు? అని మనం అనుకుంటూ వుంటాం. హైదరాబాదులో మా బంధువు ఒకరు 'అన్నిటికీ భగవంతుడు ఎందుకురా బావా, Local గా వున్నాడు కదా, వాణ్ని పట్టుకుంటే పోతుంది కదా? ఎవరికి వాళ్ళని పట్టుకుందాం,' అన్నాడు. 'అది యోగం కాదురా, వాణ్ని పట్టుకుంటే, వీళ్ళు కూడా వాడిలో భాగమే కాబట్టి, వీళ్ళు ఉన్ముఖులై వుంటారు. అదీ యోగం! అందుకని అన్నిటికీ ఒక చోటే దండం పెట్టు. అప్పుడు ఇంతమంది చుట్టూ తిరగఖ్ఖర్లేదు. లేకపోతే, దీనికి వాడి దగ్గరకి వెళ్లి, దానికి ఇంకొకడి దగ్గరకి వెళ్లి, ఇంకోదానికి పై వూరిలో వాడి దగ్గరకి వెళ్లి, ఇలా ఎన్ని పడతావు? ఒకడు తెలిస్తే వీళ్ళందరూ ఉన్ముఖులై వుంటారు' అని చెప్పాను. భూతములకు ఈశ్వరుడు కాబట్టి మహేశ్వరుడు అన్నారు. నీ మొత్తం శరీరతత్వానికి నువ్వు ఈశ్వరుడవు. నీవుంటేనే ఇది నడుస్తుంది. కానీ నువ్వేనా మొత్తం? కాదు. నీకు ఈశ్వరుడు వున్నాడు. ఈశ్వరుడికి ఈశ్వరుడు వున్నాడు సుమా! నువ్వు పెద్దవాడు అనుకుంటూ వుంటావే, వాడికన్నా పెద్దవాడు వీడు అని చెప్పడానికి. రాజకీయనాయకుల చుట్టూ, ఆఫీసర్ల చుట్టూ తిరగఖ్ఖర్లేదు పనులవ్వాలంటే. నీకు నిజంగా దమ్ము వుంటే నీ లోపల ఉన్నవాడికి చెప్పుకో. 'నాకే కష్టం వుంది, చేసిపెట్టవా? నా కర్తవ్యం వరకు నేను చేస్తాను. ఎవ్వరి కాళ్ళూ పట్టుకోను, నీ కాళ్ళే పట్టుకుంటాను' అని. అలా అయినవాళ్ళు ఎంతమంది వున్నారో! అందుకని, ఈశ్వరుడికి ఈశ్వరుడయిన వాడు, ఎవరి వల్ల నీ పనులు అవ్వాలో, వాళ్ళని నీకు ఉన్ముఖులని చేస్తాడు, నీవు యోగంలో వుంటే! మాస్టరు CVV గారు ఈ వాక్యం చెప్పారు. 'నా యోగంలో ఉన్న సాధకుడికి ఎవడితో నైనా పని పడితే, వీడు వాడి దగ్గరకి వెళ్ళే లోపల వాడికి వీడితో పని పడేలా చేస్తాను' అని చెప్పారు. చాలా అద్భుతం. అలా జరిగినాయి ఎన్నోసార్లు. మనం చేసే కార్యక్రమాల్లో ఎన్నో సార్లు అలా జరిగింది. మీకు ఎవరితో పని వుందో, వాడికి మూడురోజుల ముందు మనతో పని వుంటుంది. అయిపోలేదా? ఎలాగూ వచ్చినవాడి పని మనం చేసి పెట్టే ఉద్దేశ్యంలోనే వుంటాం, చేయము అనే ఉద్దేశ్యంలో ఉండము కదా. సాధ్యమైనంత వరకూ సాగుదాం అనే కదా సాధన పేరుతో. వాడు 'తప్పకుండా సార్! మీ పనా? మీ పని అంటే నాకు చాలా important' అంటాడు. ఎందుకంటే వాడి పని మనం చేస్తున్నాం కాబట్టి. అలా అమరికలు చేస్తారు. 'నిజంగా CVV యోగంలో వున్నవాళ్ళు ఎవరినైనా ఏదైనా అడిగితే నాకు అవమానం' అని, చెప్పారు CVV గారు. ఇంట్లో అడిగినదల్లా చేసే నాన్న వుండగా, పక్కింటికి వెళ్లి కుర్రవాడు Chocolates

కొనుక్కుంటాను, ఒక్క పది పైసలు ఇస్తారా, అంటే ఎలా వుంటుంది తండ్రికి? ఏం కొడుకు వీడు, అనిపిస్తుంది. అంతేనా? నేను అన్నీ ఇస్తా కదా పక్కింటికి ఎందుకురా వెళ్లి అడుక్కుంటున్నావు, అంటాడు. నన్ను చాలా సార్లు ఎంతోమంది మాకే పని చేసి పెట్టమని వాళ్ళతో చెప్పండి, వీళ్ళతో చెప్పండి అంటే నేను ఎవ్వరితో చెప్పను. CVV గారితో చెప్పకుంటా. ఇలా అడుగుతున్నాడు కాస్త చూడండి అని. అయిపోతే వాడొచ్చి, 'మీరు చెప్పారు సార్ అయిపోయింది' అంటే మేము చెప్పం. ఊరువాళ్ళందరికీ నీ గురించి చెప్పడమేనా పని? అలా ఉండడమే. అందుకే CVV గారు 'శరీరం స్త్రీయా పురుషుడా కాదు, మగాడుగా వుండండి' అంటారు. ధైర్యం కలిగి ఉండండి. ధీరత్వం కలిగి వుండండి. ఎంత మహత్తరమైన విషయం నువ్వు పట్టుకున్నావో, ఒక గురువు పాదం నువ్వు పట్టుకున్నావు అంటే. మళ్ళీ చిల్లర కొట్లు ఎందుకు? చిలక్కొట్లు అనవసరం. అది దురదృష్టం. దానివల్ల ఏమౌతుందో తెలుసా? హనుమంతుడి ఒడిలో ఉండేవాడు హనుమంతుడి తోక పట్టుకుని వ్రేల్లాడుతున్నట్లు వుంటుంది. హనుమంతుడి ఒడిలో వుంటే, హనుమంతుడి ఎక్కడకు వెళ్ళినా, తన ఒళ్ళో పెట్టుకుని తిప్పుకుంటూ ఉంటాడు. అది మార్జాల కిశోర న్యాయం అంటే, ఆయన్ని పట్టుకు వ్రేల్లాడుతూ వుంటే, ఆయన అట్టా అట్టా ఎగురుతూ, దూకుతూ వుంటే కొండమీద ఎక్కడో జారి పడిపోతాడు. 'ఒడిలో వుండే మార్గం ఇస్తే, తోక పట్టుకుంటావేంటిరా' అంటారు. మనం ఎవరిని ఆవాహన చేస్తున్నామో మనకి తెలియదు. భగవద్ తత్త్వాన్ని నమ్ముకున్నవాడు ఇంక దేని జోలికీ పోడు. పోతన ఎవరి దగ్గరకి వెళ్ళాడండీ? కావ్యాన్ని అంకితం ఇవ్వకపోతే చంపేస్తాం, పాడిచేస్తాం అంటే ఆ చేస్కో అలాగే. అన్నాడు. 'కాటుక కంటి నీరు చనుకట్టు పయింబడ నేల ఏడ్చెదో, కర్ణాట కిరాత కీచకులకమ్మ .....శుద్ధిగ నమ్ము భారతీ' అంటాడు. ఆ పద్యం చదివితే కన్నీళ్లు రావాలి. 'ఇంత దివ్యమైన తత్త్వం గురించి చెప్తున్నావు. ఇది వాడికి అంకితం ఇస్తావా?' అంటుంది. 'నన్ను కోసినా ఆ పని చేయను' అంటాడు పోతన. మనల్ని కొయ్యక్కర్లేదు, కొద్దిగా మనకి ఇబ్బంది అనిపిస్తే చాలు, వాడి దగ్గరకే వీడి దగ్గరకే పరుగెడతాం. చూడండి మరి యోగులు ఎలా వున్నారో? నిలబడి పోయారు నమ్మినదాని మీద. వాడు దిగి రావాలి. సమస్తమునకు ఆధారమైన వాణ్ని నువ్వు పట్టుకున్నట్లే, ఒక సద్గురువుని పట్టుకుంటే మరింక దిక్కు చూడకు. కట్టుబడి వుండు. కట్టుబాటు కలిగి వుండు. పతివ్రతవై వుండు అంటారు కదా. పతివ్రత అని ఎందుకు అంటాం? పతి తప్ప ఇంకేమీ లేదు అనే భావన పరిపూర్ణంగా వున్నది కాబట్టి పతివ్రత అంటాం. వాడు మంచివాడు లేక చెడ్డవాడు, ఛీ! దరిద్రుడు మా ఆయన అని పక్కవాడితో మాట్లాడేలా వుండదు. పక్కవాడు దరిద్రుడు అంటే 'నోర్మూయ్!' అని చెప్పేలా వుండాలి. అలా నీ ధోరణే నీకు పతి. నీ గురువే నీకు పతి. ఇంకో పతి దగ్గరకి వెళ్తే, దాన్ని జారత్వం అంటారు, వ్యభిచారం. అంతమాత్రం చేత మిగతా వాళ్ళందరినీ గౌరవించకు, అనేది లేదు. అందరిలోనూ వాడు వున్నాడు కాబట్టి అందరినీ గౌరవించు. నువ్వు

చెప్పకుందాము అనుకుంటున్నావే అది నీ మొగుడికే చెప్పు. ఇంటావిడ సమస్యలుఊళ్ళో వాళ్ళందరికీ చెప్తే, ఏమిటయ్యా ఇలా చేస్తున్నావు అని అడుగుతారా లేదా? 'వాడికీ వీడికీ చెప్తున్నావేంటే? నాకు చెప్పు నేను చెయ్యలేకపోతే అప్పుడు చెప్పొచ్చు వేరేవాళ్ళకి' అంటాడా? సంక్రాంతి వస్తోంది నాకు చీర కొనిపెట్టండి అని భార్య వేరేవాళ్ళని అడిగితే? మనం చేసేవి అన్నీ ఇలాగే వుంటాయి. భూతద్దం వేసి చూపిస్తే మనకి శ్రద్ధ పెరుగుతుంది అని చెప్తున్నాను అంతే. ఇంటావిడ ఊరిలో ఎవరి దగ్గరకో వెళ్లి చీర కొని పెడతావా? పువ్వులు కొని పెడతావా? అని అడిగిందనుకోండి. ఇంటాయన ఏమనుకుంటాడు. సరిగ్గా అంతే మనం నమ్ముకున్న దేవతనో, గురువునో అడగడం మానేసి, వీడు లాభంలేదు అనుకుని ఇంకొకడి దగ్గరకి వెళ్లి వాళ్ళందరినీ అడగడం. వెళ్ళు, తప్పలేదు. చూడు, తప్పలేదు. దండం పెట్టుకో తప్పలేదు. అడగక. ఎందుకు అడగకూడదు? నీకు అన్నీ బాధ్యత వహించే వాడు ఒకడు ఇక్కడ తయ్యరయ్యాడు కదా. ఇక్కడ పెట్టుకుని అక్కడికి వెళ్తావేంటి? అది నియమం! సమస్తమునూ దర్శించు కానీ నువ్వు అడిగే చోటు ఒకటే వుండాలి. సమస్తమునకూ ఈశ్వరుడు, యజమాని అయిన వాడు భగవంతుడు. నీ గురువు యందు, నీ దేవత యందు ఆయన్ని దర్శనం చెయ్యి. గణపతిని దర్శనం చేసావనుకో మరి ఇంక చుట్టూ వందమందిని పెట్టుకోబోకు. కుమారస్వామిని దర్శనం చేసావనుకో ఇంకొకళ్ళని పెట్టుకోబోకు. అందుకే ప్రతీ స్తోత్రంలో 'ఇంకొకటి లేదు' అంటారు, అనన్య చింతన కావాలనే ఉద్దేశ్యంతో. నువ్వు తప్ప ఇంక ఎవ్వరినీ కొలవను అని అంటాం హనుమాన్ చాలీసా లో. 'ఔర దేవతా చిత్తన ధరయీ'. నా చిత్తమునందు వేరే దేవతను ధరించను! అని చెప్పి, వినాయకుడి గుడి దగ్గరకి వెళ్లి కొబ్బరికాయ కొడుతున్నామనుకోండి, లెంపలు వేసుకుని గుంజీళ్ళు తీస్తున్నారు అనుకోండి. వీడేవిటో అక్కడికి వెళ్ళాడు అనిపిస్తుంది. అక్కడికి వెళ్లి అవే చదువుతాము మళ్ళీ. 'త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి, త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మాసి' నువ్వే త్రిగుణాలు, నువ్వే కాలం, నువ్వే ఇది, నువ్వే అది అని చదువుతాము గా గణపతిది. అదేవిటది? చదువుకో! కానీ ఒకటే గుర్తు పెట్టుకో. ఈ సమస్తములో వాడే వున్నాడు అనుకుంటే ఎంతమందిని అయినా syllabus పెట్టుకో. వేరు అనుకుంటే మాత్రం ఒక్కడినే పెట్టుకో! అంతటిలో వాడే వున్నాడు. వాడే నా పతి అనుకున్న వారు మీరాబాయి మొదలగువారు. కాబట్టి మొగుడు అఖ్ఖర్లేదు వాళ్లకి. In flesh and blood మొగుడు అఖ్ఖర్లేదు వాళ్లకి. దేవదాసీలు అంటే వాళ్ళు. దేవదాసీలు అంటే ఏవిటి అర్థం? శివుడికి అంకితం దేవదాసీలు, దేవదాసులు. దేవదాసుడు అంటే వాడు పెళ్లి చేసుకోడు. వాడికి ఏమీ అఖ్ఖర్లేదు.ఎవ్వరి వద్దా ఏమీ కోరడు. అన్నిటికీ భగవంతుడే! దేవదాసీకి కూడా పతి వాడే. చూడండి. అంతర్యామి తత్త్వం మీరు అలవాటు చేసుకున్నట్లయితే, ఇంక వేరే ఏమీ వుండదు. మీకంటూ ఒక మొగుణ్ణి ఏర్పరుచుకుంటే, వాడిలోనే, అంతర్యామిని, గురువును, మిగతా దేవతలను చూడు. ఒక దేవతను పెట్టుకుంటే ఈ దేవతలోనే సమస్త దేవతలనీ చూడు. లేకపోతే రాముడా,

కృష్ణుడా, హనుమంతుడా, రోజుకి ఒకటి బావుంటుంది మనకి. ఇదంతా ఎందుకు వుంటుంది అంటే అంతా ఒక్కటే అని తెలియక పోవడం కోసం. అందుకే సహస్రానామాల్లో మూల తత్త్వం దగ్గరకి తీసుకుని వెళ్తూ ఉంటాము.

## 507 ఆదిదేవః

ఆది దేవుడు అంటే మొట్టమొదటి దేవుడు. మహాదేవుడు. దేవతలందరికీ దేవుడు. దేవేశో అంటే దేవతలందరికీ ఈశ్వరుడు. దేవభృత్ అంటే దేవతలందరిని భరించిన వాడు - భర్త ! గురుః - సమస్తమునకు పెద్దవాడు. ఇలా మనకి ఒక అవగాహన. ఆదిదేవుడు అంటే మనకి విష్ణుమూర్తి తత్త్వముగాను, మహాదేవుడు అంటే శివ తత్త్వముగాను, దేవేశే అంటే బ్రహ్మ తత్త్వముగాను. దేవభృత్ అంటే దేవతలందరినీ భరించిన ప్రాణశక్తి గాను. గురుః అంటే ఈ మొత్తానికి అంతటికి కూడా మూల కారణము అయినవాడు. ఈ విధంగా మరో అవగాహన ఉన్నది. ఆది దేవుడు అని ఎందుకు వచ్చిందంటే, ఆదిత్య లోకము అంటే వెలుగే ఆ లోకం. ఆదిత్యః, సవితః, సూర్యః అనే మూడు స్థితులలో, అవ్యక్తమైన స్థితి నుండి ఆ వెలుగు దిగి వస్తూ ఉంటుంది. ఆదిత్య లోకం మొట్టమొదట వ్యక్తం అయిన లోకం. దానినే 'ప్రధానము' అని, 'అదితి' అని అంటారు. ఆ వెలుగు ఏర్పడక ముందు చీకటి ఉంది. ఆ చీకటి వెనకాల అసలు విషయము ఉంది. 'పెంజీకటి కవ్వల నెవ్వండేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్' అంటాడు గజేంద్ర మోక్షములో, గజేంద్రుడు. అంటే మనకి In the beginning there was darkness. God said 'let there be light.' అంటే there must be GOD beyond darkness, కదా ! In the beginning there was the WORD. The word was with GOD and the word was GOD. మనకి ప్రతి నామములో కూడా మూల తత్త్వములోకి తీసుకు వెళ్ళడము ముఖ్యమైన ఉద్దేశము. మనము ఎరిగిన నామములకు, రూపములకు అతీతముగ వున్న భగవత్ తత్వాన్ని మనకి అందించడానికి భీష్ముడు చేసిన ప్రయత్నము విష్ణు సహస్రనామము. ఎందుకంటే శ్రీకృష్ణుడిలో సమస్తమైన దేవతలని ఆయన దర్శించాడు. అర్జునుడంతటి వాడు దుర్గని దర్శించాడు. భీష్ముడు సమస్తమును దర్శించాడు. కృష్ణుడు యొక్క స్వరూపము ఏమిటయ్యా అంటే, నారాయణుడూ, వాసుదేవుడూ, విష్ణువూ కాక సమస్తమునకు మూల కారణమై దిగి వచ్చిన తత్త్వము! అందుకని 7 లోకములకు ఆధారభూతమైన తత్త్వము ఏదైతే ఉందో, దాన్ని ఎరుకగా చెప్తారు. దాన్ని 'గోలోకం' అంటారు. దానికి గోపతి, గోపాలుడు అని చెప్తారు. ఆ తత్త్వము దిగి వచ్చింది. దిగి వచ్చిన దానిలో మీరు ఏమి చూస్తే అది కనిపిస్తుంది. ఈ భూమి చేసుకున్న ఒక పుణ్య విశేషము వలన అటువంటి తత్త్వము భూమికి దిగి వచ్చింది. మళ్ళి దిగి వస్తుందా అనేది సందేహమే, అని చెప్తారు ఋషులు. మనం చెప్పిన దానికి పెద్ద ప్రమాణము ఏమీ లేదు! మన్వంతరాల తరబడి వెలుగు దేహాలతో ఈ భూమిని పాలిస్తు ఋషులు ఉన్నారు. వాళ్ళ నిన్న మొన్నటి వాళ్ళు అనుకోమాకండి! మన్వంతరాలు అంటే మీకు అవగాహన ఉన్నదో లేదో నాకు తెలియదు. ఎందుకంటే, మన కలియుగం

4,32,000 సంవత్సరాలు. భూమికి సంబంధించి, మనకి సంబంధించి కాదు. దానికి రెట్టింపు ద్వాపర యుగం. కలియుగానికి మూడింతలు త్రేతాయుగం. కలియుగానికి నాలుగింతలు కృతయుగం. అంటే, 1,2,3,4, కలిపితే 10. ఈ నాలుగు యుగాలు కలిపి ఒక మహాయుగం అంటారు. అలాంటి మహాయుగాలు ఒక 72 జరిగితే ఒక మన్వంతరం. అటువంటి మన్వంతరాలలో మనం ఇప్పుడు వైవస్వత మన్వంతరంలో ఉన్నాం. ఇది భూమి చరిత్ర. ఇప్పుడు ఉన్న మనువు, 7 వ మనువు. కాబట్టి ఏడుగురు మనువులు నడిచిన చరిత్రలో ఎంతో మంది మహాత్ములు ఈ భూమికి సంబంధించిన పరిణామము, దానికి సంబంధించిన శక్తులుగాను, కొంత మంది దీని మీద ఏర్పడిన జీవులను వాటి యొక్క పరిణామము నడిపే శక్తులుగాను ఉన్నవారు. వారందరిని ఒకసారి చూసి పోవడానికి ..... మనకి మాములుగా కేంద్రం నుండి ఎవరైనా వస్తుంటే హడావిడిగా ఉంటుంది కదా ! అలా ఒక్కసారి అన్ని కేంద్రాల కేంద్రము నుండి ఒక తత్వము దిగి వచ్చింది. దిగి వస్తే భూమి పులకరించింది. ఋషులు పులకరించారు. జీవులన్నీ పులకరించాయి. దాన్ని చూసి చెప్తున్నాడు ఈయన. ఇంతకీ ఆయన పేరు ఏమిటి? 'కృష్ణుడు'! కృష్ణ అన్న పదానికి అర్థము ఏమిటి? నల్లగా ఉన్నాడు అని. నల్లనివాడు అని ఎందుకు పెట్టాడు గర్గ మహర్షి? అందుకు కారణం భాగవతంలో చెప్పారు. కృతయుగములో ఉండే తెలుపు రంగు, త్రేతలో ఉండే నీలము రంగు, ద్వాపరంలో ఉండే హిరణ్మయమైన రంగు, కలియుగములో ఉండే పొగ రంగు. ఇన్ని రంగులూ ఏ రంగు లోంచి దిగి వచ్చినాయో ఆ రంగు. దానికి రంగు అని చెప్పడానికి ఏమ్ లేదు. ఇప్పుడు ఆకాశము ఏ రంగు అని చెప్తారు? అర్ధరాత్రి ఏ రంగు అని చెప్తారు? చిమ్మ చీకటిగా ఉందని అంటుంటాము కదా. అలా అయితే మళ్ళీ తెల్లవారే సరికి ఎలా వెలుగు అయిపోయింది? అన్ని రంగులు అందులో నుండి వచ్చిన రంగది! అందుకే దాన్ని Absolute Light అన్నారు. కృష్ణుడు అదే చేస్తుంటాడు రెండు మూడు సార్లు. పోయిన గురువుగారి అబ్బాయిని తీసుకు రమ్మంటే, ఎక్కడికో వెళ్లి తీసుకు వచ్చేస్తాడు. ఓ బ్రాహ్మణ పిల్లలు అందరు పోతున్నారంటే రథములో అర్జునుడిని, బ్రాహ్మణుడిని కూర్చోబెట్టి తీసుకుని వెళ్తుంటే కొన్ని లోకాల వరకు వీళ్ళకి తెలివి ఉంటుంది. ఆ తరువాత అర్జునుడంతటి వాడికి తెలివి ఉండదు. కళ్ళు మూసుకోండి భయం వేస్తే, అని చెప్తాడు. కాస్సేపు అయినాక, కళ్ళు తెరవండి, అంటాడు. తెరిచేసరికి బ్రాహ్మణుడు, అర్జునుడితో పాటు కొంత మంది పిల్లలు ఉంటారు. ఎక్కడ నుండి వచ్చారంటే, మీకు తెలియని లోకాలలో వాళ్ళు ఉన్నారు, నేను పట్టుకు వచ్చాను, అని చెప్తాడు. అటువంటి తత్వాన్ని దర్శించిన వాడు భీష్ముడు. అంటే ఏ తత్వం? సమస్తమునకు ఆధారభూతము అయిన తత్వం. అది మీకు నాకు మధ్య చోటులో ఉన్న తత్వం. కేవలం చోటుగా ఉంటుంది. ఏమి లేనట్టుగా ఉంటుంది. అదీ కృష్ణుడి యొక్క తత్వము! చూసేవాళ్ళకి ఈయన ఏమిటో, దేవుడేమిటో, అనిపించే తత్వము! కానీ చూడగలిగిన వాడికి సమస్తము అందులో

కనిపించే తత్త్వము! అందుకని కృష్ణుడు దేవాలయములో ఇంక మిగతా దేవతలు ఉండరు. ఎందుచేత? అన్ని దేవతలు అందులో కలసి mix అయ్యాయి. ఆయన శివుని వలె 'గురువు', విష్ణువు వలె 'ప్రభువు'. బ్రహ్మ వలె 'జ్ఞాని'. ఇంద్రుని వలె సమస్తము నిర్వహించ గలిగే శక్తి ఉన్నవాడు. మీరు ఏ తత్త్వం చెప్పండీ, అమ్మవారి తత్త్వం, అయ్యవారు తత్త్వం చెప్పండి, ఎన్ని తత్త్వాలైనా చెప్పండి. మామూలుగా ఇవన్నీ భగవంతుని యొక్క శక్తులుగా చెప్పకుంటాము. భగవంతుని ప్రజ్ఞలుగా చెప్పకుంటాము. వాటి యొక్క సమీకరణమే 'కృష్ణుడు' గా వచ్చింది. ఆ తత్త్వాన్ని గురించి భీష్ముడు చెప్పడములో రకరకాలుగా కనిపిస్తూ వచ్చాడు. అందులో ఇప్పుడు 'ఆదిత్యుడు'! 'అదితి' అనే తత్త్వము గురించి చెప్పడానికి వేదములో తలమునకలు అయిపోయారు ఋషులే ! మేము ఇహ చెప్పలేము అని చెప్పారు. ఏమిటయ్యా! అంటే That is the Dawn ! మనకి కూడా సూర్యోదయము సమయములో ఉన్న ఆ అద్భుతమైన అనుభూతి మిగతా సమయములలో ఉండదు. మొత్తము ఈ సృష్టికే సూర్యోదయము 'అదితి'. అంతకు ముందు 'దితి' చీకటి! దితి నుండి కొంత మంది, అదితి నుండి కొంత మంది పుట్టుకు వచ్చారు. ముందు అదితి నుండి పుడితేనే కదా, దితి కొంచెం బాధ పడుతుంది. అందుకని మొట్ట మొదటిగా పుట్టిన దేముడని తెలుసుకోవాలి. వెలుగుగా కనిపించిన దేవుడని అర్థం. వెలుగే దేవుడు అనుకోమాకండి, చీకటి కూడా దేవుడే! అది చెప్పడానికే 'కాళి' బొమ్మిచ్చారు. అది చెప్పడానికే కృష్ణుడి బొమ్మిచ్చారు. ఎందుకంటే ఈ వెలుగుకి ఆధారము అయినది ఒకటి ఉన్నది. దాంట్లోంచి వెలుగు వస్తోంది. వెలుగు ఎప్పుడూ ఉండకపోవచ్చు. వెలుగు వస్తు, పోతూ ఉంటుంది. మనకి తెలియదు వచ్చి పోతున్నట్టుగా. మనము నిద్రలోకి వెళ్ళగానే తెలివి పోయింది కదా. మనకి తెలియని చోటులోకి వెళ్ళిపోయింది. మనము నిద్ర లేచే సరికి మళ్ళి వచ్చిందది. వచ్చి పోయేదే తెలివి, అదే చైతన్యము. చైతన్యానికి కూడా ఆధారభూతముగా ఏదైతే ఉందో దాన్ని 'సత్యము' అన్నారు. దాన్ని 'అస్థిత్వము' అన్నారు. ఆ తత్త్వము ఒకసారి భగవంతుని సంకల్పంగా, సృష్టి సంకల్పంగా 'వెలుగు' గా వస్తుందిట. దాన్ని మన వాళ్ళు 'అదితి' అన్నారు. 'ఆదిపరాశక్తి' అన్నారు. ఆ వెలుగు మూడుగ విభజించబడినది కనుక ఇచ్ఛ, జ్ఞాన, క్రియా శక్తులుగా ఏర్పడిందని అన్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా ఏర్పడిందని చెప్పారు. అందుకని ఆదిదేవుడు అంటే వ్యక్తము అయిన మొట్టమొదటి దేవుడూ, వెలుగూ, అని. నిజానికి వెలుగు చైతన్య స్వరూపము. వెలుగు పుట్టిన చోటు ఒకటి ఉంది. సత్యస్వరూపం. కేవలం మనము చైతన్యవంతులము అని మనకి తెలియడం వల్ల, పూర్తిగా తెలియడం అవదు. పూర్తిగా మనకి మనం తెలియడం అంటే, ఈ చైతన్యము ఎక్కడ నుండి పుట్టుకు వస్తోందో ఆ స్థితి లోకి మనం వెళ్లగలగడం. వెళ్తే మనం ఉండము, అది ఉంటుంది. అదే 'సమాధి స్థితి'! అది ఉన్నప్పుడు మనం ఉండము, మనం ఉన్నప్పుడు మనకి వెనకాల, background consciousness లో, కనబడక ఉంటాము.

మనము లేవడానికి కారణం అసలు అదే.మనం లేచిన తరువాత, చైతన్యం లోంచి మన మనస్సు లేస్తుంది. మనస్సు లోంచి ఇంక మనం విపరీతంగా లేచిపోతాము. మన కోరికలు, మన ఆలోచనలు. మన స్థితిగతులు, movements. ఇవన్నీ కూడా ఎక్కడ నుండి వచ్చినాయి అంటే మనము ఉండడం చేత కదా. ఉండడం నీ ఇష్టముతో లేవు. నీ ఇష్టము అయితే నువ్వు ఎన్నాళ్ళు కావాలంటే అన్నాళ్ళు ఉండాలి కదా. ఉండలేవు! వాడి లోంచి వస్తుంటావు, వాడిలోకి వెళ్తుంటావు. వాడయిపోయిన తరువాత నువ్వు ఉండవు కాబట్టి, 'అది' ఎట్లా ఉంటుందో తెలియదు. అల సముద్రము లోంచి వ్యక్తము అయినప్పుడు అలగా కనిపిస్తోంది. నేను ఎక్కడ నుండి లేచాను, అని ఒక ప్రశ్న వేసుకుంటే, తిరిగి వెళ్ళినప్పుడు అది అందులో కలసిపోతుంది. అల ఉంటేగా! అలా మనం మన అస్తిత్వము లోకి ప్రవేశించినప్పుడు మన యొక్క ప్రత్యేకమైన అస్తిత్వము ఉన్నదే, అంటే పేరు, ఊరు, ఇల్లువాకిలి ఇదంతా ఉండవు ఇక. 'అది' ముట్టుకు వచ్చిన వాడికి ఇదంతా ఏమి లేదు అని తెలుస్తుంది. అప్పుడు ఈ పాట పాడుకోవచ్చు, 'అంతా భ్రాంతి యేనా ' అని. నీ పేరూ భ్రాంతే, నువ్వూ భ్రాంతే. భ్రాంతే అంతా ! అదే అంతా గా ఉంటే, నువ్వు ఎదో కొంత అందులో. వాడు లేస్తే, నువ్వు లేచావు అనుకుంటున్నావు. అనుకో, అన్నాడు. నిజానికి లేచింది వాడు. నువ్వు నిద్ర లేచావు అనుకుంటావు, లేవగలవా నీ మట్టుకు? లేచిన తరువాత లేచాము అనుకోవడమే! లేపే వాడు ఒకడు ఉండ బట్టి నువ్వు లేచాను అనుకుంటున్నావు. అది అన్యాయము కదూ? మన పనులన్నీ అట్లాగే ఉంటాయి. మనలో ఉంటాడు వాడు. వాడు అందరి కంటే పెద్దవాడు. నిజానికి వాడిని 'గురువు' అని పిలుస్తారు. ఆ తత్త్వాన్ని మనకి అందించడానికి వస్తాడే అతడూ నిజమైన గురువు! అంతే కానీ నాలుగు భజనలు చేయించి, వ్రతాలు చేయించి, ఆసనాలు వేయించి, ఎదో గాలి పీల్చి వదులు అని చెప్పే రకం కాదు. ఎవరు గురువు? అంటే 'కుంభనీధవుఁ జెప్పెడి గురుఁడు గురుడు'. సద్గురువు అంటే సత్యమునకు దారి చూపించేవాడు! వాడు మొదటి వాడు కాబట్టి, మొదట వాడిని చూడలేము కాబట్టి, మొదట మనం చూడగలిగిన వాడు 'వెలుగు'! ఆదిదేవుడు! ఈ అదితి అనే తత్త్వము గురించి ఋగ్వేదములో చాల చక్కగా ఇచ్చారు. దానికి మనకి చక్కనైన ఒక అవగాహన ఈ సమకాలికములో, ప్రపంచానికి ఇచ్చిన ఋషి 'అరవిందమహర్షి'. ఎప్పుడైనా ఆయన వ్రాసిన 'సావిత్రి' చదువుకోండి. ఎంతో అద్భుతముగా ఉంటుంది THE DAWN! మన హృదయము కూడా దాన్నే ముందు అందిస్తుంది. అందులోంచి వచ్చారు 12 మంది భావములు. వారు ద్వాదశ ఆదిత్యులు. అదితి లోంచి వచ్చారు. అదితికి, కశ్యపుడికి పుట్టిన వాళ్ళు అంటారు కదా ! కశ్యపుడు అంటే సమస్తమును సాక్షిభూతముగ చూస్తున్న భగవత్ తత్త్వమే! ఆయన ముందు దితిలో ఉంటాడు. తరువాత అదితి వస్తుంది. అదితిలోంచి ద్వాదశ ఆదిత్యులు వస్తారు. అక్కడ నుండి మిగతా కథ అంతా నడుస్తూ ఉంటుంది. కాబట్టి మనము లేవంగానే మన స్థితి, చైతన్య స్థితి! అదితి స్థితి! ప్రతి వాడికి

ఒక సూర్యోదయం ఉంది, బయట సూర్యోదయం కాకుండా. లేచినప్పుడే సూర్యోదయం మనకి. ప్రతి ప్రాంతానికి ఓ సూర్యోదయం ఉంది. మనకిగా ఒక సూర్యోదయం ఉంది. నాలుగింటికి సూర్యోదయం అయ్యే వాళ్ళు, ఐదింటికి సూర్యోదయం అయ్యే వాళ్ళు, ఏడింటికి సూర్యోదయం అయ్యే వాళ్ళు, ఎనిమిదింటికి సూర్యోదయం అయ్యే వాళ్ళూ ఇలా రకరకాలుగా ఉంటారు. వాళ్ళు లేవడమే వాళ్ళకి సూర్యోదయం! లేవంగానే భావము లోకి జారిపోని వాళ్ళకి సూర్యోదయం కనిపిస్తుంది. ఎందుకంటే తను లేవడం అంటే వెలుగుగా లేవడమే! దానికి Madam Blavatsky చాల చక్కగా చెప్పింది. You spring up from that which cannot be defined. దేనిని నువ్వు నిర్వచించలేవో దాని నుండి ఒక్క సారి అట్లా ఉద్భవించడమన్నమాట. లలితా సహస్రనామంలో 'చిదగ్ని కుండ సంభూత'- అందులోంచి ఒక్కసారి వెలుగుగా మొత్తము అంతా బయటకి వస్తుంది. వచ్చినప్పుడు ఆ వెలుగు detail అవుతుంది. Detail కాకుండా, వివరంగా అవకుండా ఉన్న వెలుగు, నువ్వు ఎప్పుడు నిద్ర లేస్తే అప్పుడు నీకు గోచరిస్తుంది. నువ్వు అదే.అదే నువ్వు ఉద్భవించడం అంటే. ప్రతి రోజు ఉద్భవిస్తున్నావు, ప్రతి రోజు లయము చెందుతున్నావు. ప్రతి రోజు నువ్వు ఈ ఉద్భవించి, లయము చెందే లోపున వృద్ధి చెందుతున్నావు, హాని కూడా పొందుతున్నావు, ధర్మాన్ని ఆచరించపోతే! సృష్టిలో హాని లేదు, వృద్ధే ఉంటుంది. జీవులలో హాని వృద్ధులు కేవలము మానవులకే ఉంటాయి. మిగతావాటికి హాని - వృద్ధులు లేవు. కాల చక్రము ప్రకారము వెళ్లిపోతుంటాయి. అవి పుడుతుంటాయి, పెరుగుతూ ఉంటాయి, లయం అవుతుంటాయి మళ్ళీ పుడుతుంటాయి. మనం పుట్టి లయము అయ్యే లోపల, రకరకాలుగా కిందామీదా అవుతూ ఉంటాము. ఇది కాకుండా ఉండాలంటే ముందు 'మనం అవ్యక్తము అయిన స్థితి లోంచి, ప్రతి ఉదయమూ వ్యక్తము అవుతున్నాము' అని తెలియాలి. అందుకే మనలను 'వ్యక్తులు' అన్నారు. వ్యక్తము అయినవాడు వ్యక్తి! ఎక్కడ నుండి? అందరూ ఒక చోట నుంచే వ్యక్తము అయ్యారు. సముద్రములో అలలు ఎక్కడ నుండి వస్తున్నాయి? ఒక సముద్రము లోంచే కదా. ఈ సమస్తము కూడా ఒక చోటు నుండే వ్యక్తము అవుతోంది. నువ్వూ అంతే! నువ్వేదో కొమ్ములు పెట్టుకు వచ్చావనుకోకు. నీ లాగే అందరూనూ. వ్యక్త స్థితిలో మనము ఎవరో చూసిన వారికి, అప్పుడు అదియే తానుగా ఉన్నాడని తెలుస్తుంది. ఇది తెలియడమే మొత్తము! అలా తెలిస్తే 'ఆది దేవుడు' తెలుస్తాడు. ఆదిదేవుడు నీలోనే ఉదయం లేస్తున్నాడు. అంటే సృష్టిలో లేచే మొట్టమొదటి వెలుగుగా, దాన్నే సృష్టి లోపల 'దేవుడు' అన్నారు. సృష్టికి అవతల, లోపల అనే తేడా లేని దేవుడు ఒకడున్నాడు. వాడు లేకపోతే ఈ వెలుగు లేదు. అందుకనే శివుడు గురించి చెప్పేటప్పుడు 'లోపల వెలుపల' అనేది లేనివాడు అన్నారు. వాడి లోపల అన్నీ వస్తుంటాయి, పోతుంటాయి. వాడికి లోపల, బయట లేదు. ఆ విధంగా ఉండే తత్త్వము నుండి ఒక తత్త్వము వెలువడితే అది సృష్టికి దైవము! ఆ విధంగ మనకి చెప్తున్నాడు భీష్ముడు. 'నువ్వు ఆదిదేవుడువి! అంతేనా? కాదు!

'మహాదేవుడు'వి.' అంటే ఈ అంతా ఎక్కడ నుండి వచ్చిందో అది! ఎట్లా ఉద్భవించావో అట్లా లయం చేస్తావు నువ్వు. మహాలయ పక్షాలు అంటుంటాము కదా. మహాలయము అంటే? ఇది/శరీరము ఆలయము. ఇది ఎక్కడ నుండి పుట్టిందో అది మహాలయము. అందరూ అక్కడికి పోవలసిందే! మహాలయ పక్షాలు అని మనము ఎందుకు చేస్తామంటే, ఈ ఆలయము నుండి నిష్క్రమణ పొందిన వాళ్ళ వుంటారే, exit అయిన వారు. వాళ్ళందరిని ఆ రోజు తలచుకుంటూ ఉండడం కోసం పెట్టుకున్న ఒక పక్షము అది. భాద్రపద మాసములో, కృష్ణ పక్షం అంతా కూడా మహాలయ పక్షము. అంటే తిరిగి వెళ్ళడానికి ద్వారాలు తెరుస్తారు అని. వైకుంఠ ద్వారం తెరిచే రోజు ఉంది కదా, అట్లాగే పితృ లోకాల లోకి వెళ్లేప్పుడు పితరుల యొక్క ఆశీర్వచనం పొందడం సులభం. మహాలయ పక్షాలలో మనము లేరు అని అనుకునే వారి యొక్క ఆశీర్వచనం పొందవచ్చు, విశిష్టమైన దృష్టి ఉన్నట్లు అయితే దర్శనము కూడా చేయవచ్చు. మహాలయ పక్షానికి ఒక అమావాస్య ఉంటుంది, నెల నెల ఒక అమావాస్య ఉంటుంది. అలాగే అదితి ప్రతి నెల పౌర్ణమి లో కూడా వస్తుంది. పూర్ణమైన వెలుగు. కాబట్టి, ఆది దేవుడవె కాదు నాయన, నువ్వు మహా దేవుడువి కూడా! అందుకనే ఈ పని కూడా చేయగలవు. త్రిమూర్తులలో విష్ణువు స్థితికారకుడు. శివుడు లయ కారకుడు. కానీ నువ్వు ఆదిదేవుడివి, మహాదేవుడువి కూడా. అంటే అన్నీ నీ చేతిలో ఉన్నాయి. ఏది ఎప్పుడు మూసేయాలో అప్పుడు మూసేయగలవు. సమస్తము తెలిసిన వాడవు కదా. అగ్రపూజ ఆయనకే చేయిస్తాడు భీష్ముడు. అయన ఒక్కడికే తెలుసు కృష్ణుడు గురించి. మిగతా వాళ్లకి ఇంతగా తెలియదు. అందుకని ఎవరైనా మన గురించి చెప్పాలంటే, మన గురించి పూర్ణముగా తెలిసిన వాడు చెబితే బావుంటుంది లేకపోతే అవాకులు, చవాకులు వస్తాయి. అందుకని కృష్ణుడు ధర్మరాజుని భీష్ముని వద్దకు పట్టుకు పోయి, ఆయన వద్ద ధర్మాలు నేర్చుకో అని చెప్తే, ధర్మరాజు అడిగాడు, 'అసలు ఏ దేవుడికి మనం మొక్కితే అది మనకి complete, పూర్ణము అయిన విషయం చెప్పవా? 'కిం ఏకం దైవతం లోకే' అంటాడుగా విష్ణు సహస్రనామములో! నువ్వు ఆది దేవుడవు, మహా దేవుడవు అంటాడు. ఇవన్ని 'కృష్ణ' అనే పదము లోనే ఉన్నాయి. కృష్ణ అనే పదములో త్రిమూర్తి తత్త్వమే కాదు, పరాశక్తి తత్త్వమే కాదు, అన్నీ అందులో ఉన్నాయి. త్రిమూర్తి తత్త్వము యొక్క కూడికే పరాశక్తి. పరాశక్తి యొక్క ఉద్భవమే అంతకు ముందు ఎవరికీ తెలియని స్థితి నుండి తెలిసిన స్థితి. తెలియని స్థితి కాబట్టి అదంతా శూన్యము అన్నారు చాలా మంది. కానీ, అది శూన్యం అయితే అందులో నుండి ఏమీ రాదుకదా. అది 'పూర్ణము' కాకపోతే ఎట్లా వస్తుంది? ఇప్పుడు ఈ glass లో నీళ్లు ఉంటేనే కదా బయటకి వస్తాయి. డబ్బా బోర్లించినట్లు ఎన్నెన్ని వచ్చినాయండి! గోళాలు వచ్చినై, జీవులు వచ్చారు, సూర్య మండలాలు వచ్చినాయి. అంటే అది ఏమి లేదు అనటానికి వీలు లేదు కదా. ఏమీ లేకుండా అన్ని ఎక్కడ నుండి వచ్చినాయి? అదే కుంభ చైతన్యానికి సంకేతముగా ఇచ్చారు. కుంభ రాశి బొమ్మలో, ఒక

కుండ ఒక స్త్రీ మోస్తూ ఉంటుంది. ఆ కుండ లోంచి ఇటు నుండి నీళ్లు వస్తుంటాయి. ఆ కుండకి అటు కూడా మూతి ఉంటుంది. అది ఎవరికీ తెలియదు ఎందుకంటే, మనకి కనబడకుండా వేసే బొమ్మ కనక! కానీ ఆ కుండ కి ఇటు ప్రక్క మూతి ఎలా ఉందో, అటు కూడా మూతి ఉంది. అదీ 'కుంభ రాశి'. ఇటు మూతి నుండి చూస్తూ ఉంటె నీళ్లు వస్తున్నట్టు ఉంటుంది. అటు మూతి చూస్తే ఏమీ ఉండదు! మాములుగా నీళ్లు అటు నుండి ఇటు రావాలి కదా. అటు నుండి ఇటు వస్తున్నాయి కానీ, ఈ మూతి దగ్గర కనిపిస్తాయి నీళ్లు, ఆ మూతి దగ్గర కనిపించవు. అదేంటి అది? అర్థం చేసుకుంటే కుంభ రాశి అర్థం అవుతుంది. Aquarian Passage అని అర్థము. అటు నుండి ఇటు ఎలా దిగి వస్తాయో, ఇటు నుండి అటు అలా పట్టుకు పోతాడుట అదే కుండలోంచి. అటు నుండి ఇటు వచ్చే సమస్తమైన తత్వాన్ని 'గంధర్వతత్త్వము' అన్నారు. దాని అధిదేవతగ 'వేనుడు' అనే గంధర్వుడు గురించి చెప్తారు మనకి వేదములో! అలాగే ఇటు నుండి అటు మనము straw పెట్టి పీలుస్తే వెళ్లిపోతుందట తత్వము, దాన్ని 'మార్కండేయుడు' అన్నారు. మార్కండేయుడు అంటే శివలింగము కౌగలించుకు కూర్చున్న వాడు కాదు, వేదములో చెప్పే మార్కండేయుడు ఇట్లా straw పెట్టి పీల్చేస్తాడు. Straw లో ఇట్లా ఊదితే బుడగలు వస్తాయి. అవే సృష్టి! కాబట్టి ఏమీ లేని దాంట్లోంచి ఎలా అంతా వస్తు ఉంటుందో, అలా అంతా ఉన్నట్టుగా కనిపించేదాన్ని ఏమి లేనట్టుగా ఉన్న దాంట్లోకి మొత్తము లాగేస్తూ ఉంటారు. అందుకని ఈ రహస్యము తెలియాలంటే కుంభ చైతన్యము అంటే ఏమిటో తెలియాలి. అది మాఘమాస ప్రజ్ఞగ మనకి ఇచ్చారు. ఇది తెలిసిన వాడికి ఇటు రావడము, అటు వెళ్ళడము తెలుస్తుంది. అంటే తాను ఉన్న స్థితి నుండి తాను లేని స్థితికి వెళ్ళి, మళ్ళి తాను ఉన్న స్థితికి రావడమన్నమాట. అల వచ్చి, మళ్ళా వెళ్ళి సముద్రములో కలిసి, మళ్ళా రావడము. వచ్చిన అల మళ్ళా అదే అల అని ఎవరు చెప్పగలరు? చిరంజీవులకు మాత్రమే అది సాధ్యమవుతుంది. వాళ్ళు చిరంజీవులు ఎందుకు అయ్యారంటే 'పుట్టని, చావని త్రోవ' వెతుక్కున్నారు. త్రోవ! గుర్తుపెట్టుకోండి ! ప్రహ్లాదుడు భాగవతములో ఏమి చెప్పాడంటే, 'ఈ గురువులు చెప్పేవి పెద్ద విషయాలు కావు, పుట్టని చావని త్రోవ వెతుకుకొనుట దొడ్డ బుద్ధి' అని. ఊరికే ఏదో బుద్ధి నేర్పడము కాదు. అది కొంత జ్యోతిష్యం వచ్చింది, కొంత వేదం వచ్చింది. కొంత విష్ణు, లలిత సహస్రనామాలు చదవగలం, గుర్తు పెట్టుకున్న కొన్ని పద్యాలు చదవగలం ఇలా మనకి చాలా తెలుసనుకుంటాం. ఈ తెలిసింది, తెలిసింది కాదు. 'నువ్వు ఎక్కడ నుండి పుట్టుకు వచ్చావో, మళ్ళి ఎక్కడకి వెళ్తావో, అక్కడ నుండి ఎట్లా రాగలవో' అవి తెలిస్తే, అసలు తెలిసినవాడు! అదీ 'అమృతత్వ విద్య'! అందుకే మహాత్ములు దిగి వచ్చి ఇస్తూ ఉంటారు దాన్ని. మహాదేవుడు దగ్గర ఈ విద్య ఉన్నది. మనము 'మృత్యోర్మృక్షీయ మామ్ అమృతాత్', అని శివుని ప్రార్థన చేస్తాం. మృత్యువు నుండి నన్ను బ్రతికించి, ముక్షీయ అంటే Liberate me from Death. 'మామ్ అమృతాత్' అంటే అమృతత్వము వరకు

నడిపించు. మృత్యువు దగ్గరకి రాకుండా ఎలా అంటే, 'ఉర్వారు కమివబంధనాత్', బాగా పండిన దోస పండు దోస తీగకి అంటి ఉన్నట్టుగా ఉంటుంది తప్ప, మామూలుగ తీస్తే వచ్చేస్తుంది లాగనక్కర్లేదు. విడిబడే ఉందే, అన్నట్లుగా ఉంటుంది. పచ్చిగా ఉంటె తెంపుకోవాలి. పండినది దాని అంతట అదే వూడి వస్తుంది. అంటే ముడి పడి లేదు అని అర్థం. మనకి మూడు రకాల ముడులు ఉన్నాయి. బయట విషయాలన్నీ మనకి ముడులు. మన కోరికల యందు మనకి ఉన్న ముడులు. మనకి ఉన్న భావములు యందు మనకి ఉన్న ముడులు. ఈ మూడు ముడులే 'బ్రహ్మ గ్రంధి, విష్ణు గ్రంధి, రుద్ర గ్రంధి'. ఈ గ్రంధి చ్ఛేదనము జరిగిన వాడు ఇదే శరీరములో ముక్త జీవుడుగా ఉంటాడు. గ్రంధి చ్ఛేదనము జరిగిందని ఎవరన్నా అంటే 'వాడు మాట్లాడిన మాట బట్టి, వాడికి ఉండే భావనల మీద ఉన్న పట్టు బట్టి, వాడికి కోరికల యందు ఉన్న పట్టు బట్టి, వాడికి బయట తాను సంపాదించినది 'తనది' అనే పట్టు బట్టి' తెలుస్తుంది. చూస్తారు ఉందో లేదో! ఒక లక్ష రూపాయలు ఎవరో కొట్టేశారండి మీ account లోంచి, లేక మీ నగలు పోయాయండి అంటే ఎట్లా ఉంటుంది? నగలు పోనక్కరు లేదు, చెప్పలు పోతే చాలు మనకి. కొత్త చెప్పలు అయితే సంచిలో వేసుకు దగ్గర పెట్టుకుంటాము. పాతవి అయితే పోనీలే పోయినా పర్వాలేదు అని అక్కడ వదిలేయ వచ్చు కాని, అవి ఉంటాయన్న భావన ఉంటుంది కదా. వెంట్రుకలే ఇవ్వ లేరు కొంత మంది. వెంట్రుకలే ఇవ్వలేవు ఇంకేమి ఇస్తావురా నువ్వు? అదీ వాడు చూపిస్తున్నాడు తిరుపతిలో, ఎవడు వెంట్రుకలు వదలగలడు? ఎవడు లేదు? అని. కొంత మంది మీసాలు ఇవ్వరు, అబ్బే ఇవ్వకూడదండీ అంటారు. మీసాలు ఇచ్చినా బతికే ఉంటాము. వెంట్రుకలు తీసేసినా బతికే ఉంటాము. పోనీ ఏదో పోయింది, ఎంత సేపు ఏడుస్తాము? మహా అయితే ఒక వారం ఏడుస్తాము, అంతే కదా. మన వాడు అనుకున్న వాడు పోయినా కూడా, ఏడుస్తూనే కాఫీ తాగుతూ ఉంటారు. అంటే coffee వెళ్తూ ఉండాలి, tiffens వెళ్తూ ఉండాలి, ఏది ఆపము కదా. అంటే ఏమిటి పోయింది? ఏమి పోలేదు. ఊరికే ముక్తి కావాలి అంటారు! ఏమిటి ముక్తి? ముక్తి అంటే ఒకటే. నీకు బయట నీవి అనుకున్న వాటి మీద పట్టు ఏమైనా ఉందా? ఉంటే, లేదు అని అనుకోకండి. ఒక సారి ప్రయత్నించి చూసుకోండి. ప్రకృతిలో బోలెడంత మంది దేవతలు ఉంటారు. వీడు ఏమంటున్నాడో ఓ సారి చూద్దామని ఏవో ఒకటి ఎత్తుకు పోతారు. గబాల్ని నా car ఎత్తుకు పోవచ్చు. ఏడిస్తే, 'అదేంటిరా నువ్వు లేదన్నావు కదా అందుకని ఎత్తుకు పోయాము. అంత కన్నా ఏమి లేదు'. అట్లా వస్తాడుట వాడు, తస్కరుడుగా. 'తస్కరాణాం పతయే నమో నమః' అంటాము మనము రుద్రనమకం లో. దొంగలకు దొంగవి నువ్వు, అని దణ్ణం పెడుతూ ఉంటాము. ఎందుకంటే దొంగతనము చేయమాకు నువ్వు అని అడగడం కోసము తప్ప నువ్వు దొంగిలిస్తావు అని తెలియదా మనకి. దేవుడు దొంగ ఏమిటి? అనుకుంటాము. దేవుడు దొంగ కూడా! అదీ మన ఋషులు చెప్పింది. నీవు దొంగతనముగ పొందింది అంతా మరి పట్టుకు పోవాలి కదా,

అని ఇంకో దొంగని అమరిక చేస్తుంటాడు. ఇట్లా మహాలయానికి వెళ్లాలంటే, మనం చూసే ఆలయాలు ఉత్త ఆలయాలు. మహాలయం ఉంటుంది. అక్కడ ఏమి కనిపించదు. ఏమిటి అదీ అంటే అది మీ యొక్క అసలైన స్థితి అది. మీ యొక్క అస్తిత్వం అంటాము. అది తెలియాలంటే, మహాలయానికి వెళ్ళాలి. మహాలయానికి ఇప్పుడు కాదండీ తరువాత వస్తాము, ఇప్పుడు బోలెడు పనులు ఉన్నాయి. బయట విషయాలు, మనుషులు, వస్తువులు, ప్రదేశాలు ఆస్తులు మీద మనకి మమకారం. రెండోది మనకి లోపల కొన్ని కొన్ని కోరికలు అట్లా దుంప తెంచుతూ ఉంటాయి. మనకి కావాలి, దాన్ని మనం ఊరికే పెంచుతూ ఉంటాము. కానీ 'మనకి కావలసింది అదే వస్తుంది, మనం వాటి వెంట ఊరికే పడుతూ ఉండక్కరలేదు కదా' అని తెలిసినవాడు కోరడు! కోరక పోతే ప్రాణము హాయిగా ఉంటుంది. కోరితే ప్రాణము ఉసూరు మంటూ ఉంటుంది ఎందుకంటే కోరినది దొరకదు. దొరకలేదు అన్న బాధ, తద్వారా ఉసూరుమంటూ ఉండడము. అదే ప్రాణానికి హాని! కామము ప్రాణాన్ని అట్లా పీల్చేస్తూ ఉంటుంది. అందుకనే కామమయం అయిన శరీరం నిర్మూలనం జరిగితే తప్ప, ప్రాణమయ శరీరానికి ముక్తి లేదు. అన్నమయ కోశం, ప్రాణమయ కోశం, మనోమయ కోశం అని చెప్పుకుంటాము. కానీ కాదు. అన్నమయకోశానికి, ప్రాణమయకోశానికి మధ్యలో ఒకటి ఉంది, కలి పురుషుడు! వాడు కోరికల రూపములో మన ప్రాణాలను తింటూ ఉంటాడు. దీన్ని మనం ఎట్లా తగ్గించుకోవాలి? అమావాస్య నాడు ధ్యానం చేసుకుంటే కామశరీరము దగ్ధమౌతుంది. ఎందుకని? అమావాస్య శివుడు! అమావాస్య ముందు మాసశివరాత్రి ప్రార్ధనలు చేసే ఒక సాంప్రదాయము మన ఋషులు ఇచ్చారు. నీలో ఉండే కాముడు, ధర్మసమ్మతమైన వాటిపై మాత్రమే స్ఫూర్తి కలిగించి, అధర్మము అయిన వాటిపై కలిగించకుండా ఉంచుతాడు. ఏ కోరిక వల్ల నువ్వు దుఃఖం పొందుతావో ఆ కోరిక నీకు కలగకుండా చేసే తత్వము నీకు మాసశివ రాత్రి ధ్యానము చేసిన వాళ్లకి అందుతుంది. ఊరికే అదొక దంభాచారంగ చేసే వాళ్ళకి అవదు. కామశరీరం దగ్ధము కావాలంటే అమావాస్య లోకి ప్రవేశించే ముందు ధ్యానము లోకి వెళ్ళాలి. మహాలయ పక్షాలు ఎప్పుడు వచ్చాయి? అర్ధ రాత్రికి ముందు ఆరు రుతువులలో అర్ధరాత్రి శరత్ ఋతువు అయ్యింది. ఆశ్వీయుజ మాసం. అర్ధరాత్రికి వెళ్ళే ముందే మహాలయ పక్షాలు ఇచ్చారు. అట్లా అమావాస్య లోకి వెళ్ళే ముందే నీకు మాసశివరాత్రి వస్తుంది. కృష్ణ త్రయోదశి తిథి పూర్తి అయ్యి, చతుర్దశి వస్తుంటే వస్తుంది శివరాత్రి. ఆ తరువాత అమావాస్య. ఆ తరువాత పాడ్యమి. అమావాస్య లోకి ప్రవేశించాలంటే త్రయోదశి సాయంత్రము నుండి సిద్ధము అవాలి. అప్పుడు చక్కటి ధ్యానము చేసుకున్నట్లయితే, నీ కామ శరీరానికి హద్దులు ఏర్పరుస్తాయి ప్రకృతిశక్తులు అనండి, దేవతలు అనండి మీ ఇష్టము. అందుకని ఆ రాత్రి మేలుకుని ఉండడం పెట్టారు పెద్దలు. ఎప్పుడూ నిద్రపోతూనే ఉంటాము కదా, ఈ ఒక్క రాత్రే కదా? చచ్చిపోము. ఆయుర్వేద పరంగా కూడా, ఆ రోజున మేలుకున్న వారికి ఆరోగ్యము చాల

బాగుంటుందని, చెప్పారు. అందుకని ప్రతి మాస శివరాత్రికి జాగరణ చేసే వారు ధన్యులు. జాగరణ చాల మంచిది. ప్రతి నెల ఆవిధంగా ఒక రాత్రి మెలుకున్న వాడి ఆరోగ్యము బాగుంటుంది. Metabolism లో కూడా మార్పు వస్తుంది. మనం భావాలరూపములో, కోరికల రూపములో ఏవేవో పోగు వేసుకున్నవన్నీ సర్దుబాటు అవుతాయి ఒక్క రాత్రి మేలుకుని ఉంటె. మాఘ మాసములో కృష్ణ త్రయోదశి అయిన తరువాత వచ్చే చతుర్దశి మనకి పెద్దశివరాత్రి అని చెప్పుకుంటాము. ప్రతి నెల వచ్చేది మాసశివరాత్రి అని ఎందుకు అన్నారంటే 'అది మరీ మహత్తరమైనది సుమా' అని మనకి తెలపడానికి. మేలుకొని ఉండలేము. ఏమైనా చదువుదామంటే నిద్ర వస్తుంది. తింటే అసలు నిద్ర వస్తుంది. ప్రయత్నము చేయండి, చాల మంచిది. కనీసము 12గం వరకు మాస శివరాత్రి నాడు మేలుకుని ఉండడానికి ప్రయత్నించండి. వీలుంటే తెల్లారే వరకు. మళ్ళి మరునాడు పడుకోకండి. ఇవన్నీ నిష్ఠకి సంబంధించిన విషయాలు. ఇవన్నీ వాళ్ళు అందిస్తున్నారు కాబట్టి శ్రద్ధ ఉండే వాళ్ళు అందుకోండి. మిగతా వాళ్ళు మర్చిపోండి. చేయలేకపోతే బాధ పడవద్దు. మళ్ళా అదో కోరిక అయిపోతుంది. అదే మాదిరిగ పౌర్ణమి సద్వినియోగము చేసుకుంటే సూక్ష్మ శరీరము నిర్మాణము అవుతుంది. పౌర్ణమి సూక్ష్మ శరీర నిర్మాణానికి, అమావాస్య కామ శరీరం దగ్ధము చేయడానికి. కామ శరీరంను దగ్ధము చేయ గలిగిన వాడు శివుడే! ఆయన మీద బాణాలు వేసి కొడితే, ఎవడురా ఊరికే పుల్లలు వేసి కొడుతున్నాడూ, అని ఆయన కళ్ళు తెరిస్తే మన్మధుడు కుప్ప అయిపోయాడు. అతడిని బూడిద కుప్ప చేద్దామని శివుడు కళ్ళు తెరవలేదు, ఏవో పూతిక పుల్లలు తన మీద పడుతున్నాయి చూద్దామని కళ్ళు తెరిచాడు. అది శివుడిలో కామాన్ని ప్రేరేపించాలని మన్మధుడు చేసిన ఒక ప్రయత్నము. ఎందుకంటే పార్వతీదేవి శివుని కోసం చాలా తపస్సు చేసింది. పార్వతి వచ్చి 'అటువంటి పిచ్చి పిచ్చి పనులు చేయమాక, అతని సంగతి నీకు తెలియదు. పొందితే అతనినే పొందాలని నేను వచ్చాను' అంటుంది. 'నేను శివుడిని పెళ్లి చేసుకుంటాను' అంటే ఇంట్లో వాళ్ళందరికి గుండెలు పగుల్తాయి. 'శివుడిని పెళ్లి చేసుకోవడమేమిటి తల్లి! అయ్యే పని కాదు అని. ఆయన చాలా పెద్ద విషయం. ఆయనని కలుసుకోవడం అంటే మనము మూడిపోవడమే, ఆయనే ఉంటాడు మనము ఉండమని'. అది ఉండి మనము లేని స్థితి అది. అట్లా కాదు నేను వెళ్ళి తపస్సు చేసుకుంటాను అంటే, 'వద్దమ్మా!' అంటుంది. వద్దమ్మా అని చెప్పడానికే 'ఉమ'! ఉమ అంటే 'ఉ' నీవు, 'మ' వెళ్ళవద్దు. 'నువ్వు వెళ్ళవద్దు' అని రోజూ చెప్తుండేది. 'ఉమా' అని అదో పేరు అయిపోయింది. ఆవిడ వెళ్ళింది. తపస్సులు కొన్ని వేల సంవత్సరాలు చేసింది. ఏవీ తగలలేదు. అది ఓ పెద్ద 'అగ్ని'! ఎటువంటి అగ్ని అంటే దగ్గరకి వెళ్తేనే కాలిపోతారు. మన్మధుడు చూస్తాడు. ఏవిటి ఇట్లా బాధ పెట్టేస్తున్నాడు ఈ పిల్లని అని, పరహిత ధర్మము ఆచరించడం కోసము, రెండు మూడు బాణాలు వేసాడు. ఏమి కావాలి అని కళ్ళు తెరిస్తే

ఈయన మాడిపోయాడుట. ఎవరు కళ్ళు తెరిస్తే కామం మాడిపోతుందో, కాలిపోతుందో వాడ్ని ప్రార్థన చేసుకోవాలి. ఆయనే 'మహాదేవుడు'.

## 508 మహాదేవః

మహాదేవుడు మనకి అమావాస్య నాడు దొరుకుతాడు. అదో కార్యక్రమము నడుపుతూ కామ శరీరము తగ్గించుకుంటూ, సూక్ష్మ శరీరాన్ని అంటే వెలుగు శరీరాన్ని తయారు చేసుకోండి. ఈ భౌతికము అయిన స్థూల పదార్థము ఏదైతే ఉందో, దానికి సూక్ష్మము అయిన ప్రాతిపదిక ఉన్నది. Foundation ఉన్నది. అది ఆధారంగా ఈ స్థూలమైనవి వచ్చినాయి. సూక్ష్మము ఆధారంగా స్థూలము వచ్చిందనేది ఋషులు చెప్పిన సత్యం. మనము గాలి పీల్చడము వల్ల బతుకుతున్నాము తప్ప, ఇది ఉండడం వల్ల గాలి పీలుస్తున్నామా? మనలో సూక్ష్మముగా తత్త్వము ఉండడం వల్ల, 'సత్యం' అంటామే, అది ఆధారంగా మనం చైతన్యవంతులము అవడం వలన, చైతన్యవంతులము అయ్యే సమయములోనే స్పందన అవడం వలన, స్పందనము వలన ఉచ్ఛ్వాస, నిశ్వాసలు ఉండడం వలన, తద్వారా ప్రాణశక్తి శరీరం అంతా కూడా వ్యాపించి ఉండడం వలన మనము ఉన్నాము తప్పా ! మనం గాలి పిలుస్తున్నాము కనుక ఉన్నాము అంటే, గాలి పీల్చకపోతే? ఇంకా స్పందనము ఉంటుంది. స్పందనము లేకపోయినా నువ్వు ఉంటావు. ఇట్లా మనకి సూక్ష్మము నుండి స్థూలానికి సమస్తము ఉంది. అందుకని physical measurements మన వాళ్ళు ఎప్పుడూ పెట్టుకోలేదు. భూమి తత్త్వము, శుక్ర తత్త్వం, గురుగ్రహ తత్త్వము, శనిగ్రహ తత్త్వము గురించి మాట్లాడతారు. ఒక మనిషి గురించి అంటే వాడు ఎంత పొడుగు, ఎంత లావు, ఎన్ని kg లు, ఇవా ? కాదు. కేవలము physical dimensions లెక్క కాదు కదా. వాడి యొక్క స్వభావము లెక్క! అంతే కానీ గురు గ్రహము ఇంత పొడుగు, బరువు, లావు ఉంటుంది అనే quantitative analysis ఒకటి ఉండగా qualitative analysis ఒకటి ఉంది. Science అంతా quantitative analysis చేసి చేసి, ఇప్పుడు కొంచెం Quantum అంటూ quality లోకి వస్తోంది. అప్పుడే ఆ పద్ధతులలో తేలవు. కృష్ణుడు పురుషోత్తమ ప్రాప్తియోగము లో 'నువ్వు మూలం లోంచి తత్త్వములోకి రాగలవు తప్ప, తత్త్వము లోంచి మూలము లోకి పోలేవు' అని చెప్పాడు. zero శతాబ్దము బాగుంటుందని చెప్తాము. వాడి తరువాత ఇంకోడు వస్తాడు. ఛీఛీ ఈ theory తప్పంటాడు. వంద ఏళ్ళు అయ్యే సరికి ఈ theory లు అన్ని తప్పు, అని చెప్తారు. ఈలోపు మనం ఏమి అనుకోవాలి? ఇవాళ్టికి కూడా కోతి నుండి మనిషి వచ్చాడని చెప్పకుంటున్నారు. తెలిసిన వాళ్ళందరు నవ్వుకుంటున్నారు. ఇంకో వంద ఏళ్ళ తరువాత 'కోతి నుండి మనిషి వచ్చాడని చెప్పిన వాడు కోతి' అంటాడు. 'అప్పుడు నమ్మిన వాళ్ళు ఘోరమైన కోతులు' అంటారు. ఏవో చెప్తుంటారు, వింటూ ఉండడమే! కొంత వాళ్ళ వల్ల ఉపయోగము ఉంది కానీ, అంతా వాళ్ళకి తెలియడం లేదు. ఇవాళ వాళ్ళు Brain లో What is Consciousness? అనే ప్రయోగం చేస్తున్నారు. అంటే కొంచెము

తెలివైన ప్రదేశాలో ప్రవేశిస్తున్నారు. తెలుసుకోవాలి, ప్రయత్నం చేయ్. It is a law of physical apparatus, which you will never understand. గ్రుడ్డి వాళ్ళకి సూర్యోదయము గురించి ఎంత చెప్తే తెలుస్తుందండి? నీకు సూక్ష్మము అయిన విషయాలు తెలియాలంటే, నీలో సూక్ష్మ శరీరం పెంపొందాలి. సూక్ష్మము అయిన దృష్టి పెంపొందాలి. దూరశ్రవణం పెరగాలి. సూక్ష్మము అయిన దూరదృష్టి ఏర్పడాలి. అప్పుడు చూడగలవు. అట్లా చూశారు ఋషులు. మొత్తము గోళాలు, సూర్య మండలాలు, సవిత్ర మండలాలు, భర్గోదేవ మండలాలు చూసారు. వాళ్ళు వైకుంఠము చూసి, ఇట్లా ఉంటుందని వర్ణించి ఇచ్చారు భాగవతం లో. పుక్కిటిపురాణము అనుకుంటే అది వేరే సంగతి. పౌర్ణమి నాడు చక్కగా ధాన్యం చేసుకుని, పౌర్ణమిని చక్కగా వినియోగము చేసుకోగలిగితే, మీలో సూక్ష్మశరీర నిర్మాణము జరుగుతుంది. అప్పుడు మీ రూపము మీకు వెలుగు రూపముగా కనిపిస్తుంది. మీకు 'మీరు వెలుగు' అని తెలిసిన తరువాత ఈ మట్టి శరీరము మీద పెద్దగా ఆశ ఉండదు. మట్టితో ఏర్పరచుకున్న వస్తువులపై ఆశ ఉండదు. మనము మట్టి కాదని తెలుస్తుంది. మట్టి తెచ్చి ఇట్లా అద్దుకున్నాము మనము అంతే! వినాయకుడ్ని మట్టితో చేస్తాము కదా. మట్టా వినాయకుడు? కాదు కదా. కలిపేస్తే వినాయకుడు వెళ్ళిపోయాడా సముద్రములో? వినాయకుడు ఉన్నాడు కదా, అని మట్టిలో కలిపేశాము. మనము కూడా అంతే! అందుకని పౌర్ణమి 'ఆదిత్య తత్త్వానికి' చెందినది. అమావాస్య 'మహాదేవ తత్త్వానికి' చెందినది. ఆదిదేవుడు పౌర్ణమి నాడు. మహాదేవతత్త్వము అమావాస్యకి త్రయోదశి నుండి మొదలు పెట్టి అమావాస్య పూర్తి అయ్యే వరకు, అట్లాగే పౌర్ణిమకి ఆదిత్య తత్త్వము చతుర్దశి నుండి మొదలు పెట్టి, అంటే పౌర్ణమి తిథి మొదలు అవడానికి ముందు నుండి పౌర్ణమి తిథి అయిన 12 గం వరకు కూడా మనకి ఆ తత్త్వము సాన్నిధ్యము బాగా ఇస్తూ ఉంటుంది. అందుకని పౌర్ణమి అని మొత్తుకోవడం. ఎదో glamour కోసము కాదు పౌర్ణమి. ఉపవాసము ఉన్ననాడే ఆకలి ఎక్కువ వేస్తుంది. అందుకని కొంచెము తక్కువ తీసుకోమని పౌర్ణమి, అమావాస్య సమయములలో అని చెప్తారు. ఎందుకంటే స్థూలము అయిన పదార్థాలు లోపలకి వెళ్లిన కొలది, బాగా మత్తు ఎక్కి నిద్ర రావడము తప్ప, సూక్ష్మమైన లోకాల లోకి స్ఫూర్తి పెరగదు. అందుకూ ఆ విధంగా చెప్పారు. మహాదేవుడవు నువ్వు! అన్నాడు. ఎందుకంటే కృష్ణుడికి మూడు శరీరాలు! అన్నీ చూస్తాడు భీష్ముడు. ఒకటి ఉందా లేదా అన్నంత పలచగా ఉంటుందిట. రెండవది విపరీతమైన నలుపా, నీలమా? అన్నట్టుగా ఉంటుందిట. ముదురు నీలంగా ఉంటుందిట. ఇవన్నీ కలిపి ఇంకో శరీరము బయటకి కనిపిస్తూ ఉంటుందిట. అందరూ చూసినది ఇది! కామించిన స్త్రీలు అడిగినదేమో ప్రాకృత శరీరము. అలాగే తప్పకుండ ఇస్తాను నా శరీరం యొక్క స్పర్శ అనిచెప్పి, దాని కన్నా సూక్ష్మమైన అప్రాకృత శరీరం స్పర్శ ఇచ్చేసరికి, కృష్ణుడు మనతో ఉన్నాడని ప్రతివాళ్ళు అనుకున్నారు. అందరి ఇళ్లలోనూ కృష్ణుడు ఉండేవాడు. ఎనిమిది భార్యల ఇళ్లలోనూ

కృష్ణుడు ఉన్నాడూ, గోపికల ఇళ్లలోనూ కృష్ణుడు ఉన్నాడు. ఎలా ఉన్నాడు? ఇలా ఉన్నాడు. ఆ తత్త్వము తెలిసినవాడు కాబట్టి భీష్ముడు 'నువ్వు మహాదేవుడవు కూడా' అన్నాడు.

## 5వ దేవేశః

దేవేశుడు అంటె దేవతలకి ఈశ్వరుడు. ఎవరూ అంటే చతుర్ముఖ బ్రహ్మ! దేవతలకి ఏమైనా కష్టము వస్తే వాళ్ళు అందరూ బ్రహ్మ వద్దకే వెళతారు. విష్ణువు, శివుడు అంత సులభంగా కనిపించరు ఎవరికీ. బ్రహ్మ దగ్గరకి వెళ్ళి, ఇలా ఉంది పరిస్థితి అని చెప్తే, ఆయన కళ్ళు మూసుకుని, అక్కడ నుండి వినిపించింది ఉన్నవారికి చెప్తూ ఉంటాడు. ఇంద్రాది దేవతలు అందరూ Crisis /సంక్షోభము వచ్చినప్పుడు ఆయన దగ్గరకి వెళ్తారు. అంతే కాదు రాక్షసులు కూడా ఆయన దగ్గరకే పోతారు. బ్రహ్మ దగ్గర నుండి వరాలు పొందారు రావణుడు, విభీషణుడు, కుంభకర్ణుడు. దేవతలకి, రాక్షసులకు కూడా ఆయన దగ్గరకి Access ఉంది. రాక్షసులు వీళ్ళకన్నా గట్టి వాళ్ళు. వాళ్ళకే ఉంది అనుమతి. అందరు అక్కడకి వెళ్లి తెచ్చుకుంటూ ఉంటారు. ఎవరికి కావలసిన పరిష్కారం వాళ్ళకి ఇస్తూ ఉంటాడు. అందుకని ఈ ఇంద్రాది దేవతలకి కనపడే దేవుడు ఎవరయ్యా? అంటే, The Creator! ఆ Creator వెనకాల ఉండేవాడు కనబడరు. మనకి తెర మీద నటన చేసే నర్తకులు తెలుసు తప్ప, తెర వెనక వాళ్ళని అట్లా నర్తింపజేసే వారు మనకి తెలుస్తుందా? NT Ramarao garu కృష్ణుడిగా చాల బాగా నటన చేస్తారు అని తెలుసు తప్ప, ఏ ఏ దర్శకుడు ఆయన చేత అలా కృష్ణుడి వేషము వేయించారు చెప్పండి? చెప్పలేరు! ఎందుకంటే వాళ్ళంతా తెర వెనుక మనుషులు. ఈయన తెర మీద మనిషి. తెర వెనక ఉన్నవాడు ఏ విధముగా తెర మీద ఉన్నవాడిని నర్తింప చేస్తాడో, తెర మీద ఉన్నవాడిని చూస్తే తెలుస్తుంది కదా. రామారావుగారి దగ్గరకి వెళ్లి, ఆ సినిమాలో ఎవరు మిమల్ని direct చేశారు అంటే చెప్పగలడు. మనము చెప్పలేము. అట్లాగే బ్రహ్మని direct చేసిన వాళ్ళు వెనకాల ఉన్నారు కదా. త్రిమూర్తులలో ఉండే విష్ణువుని, త్రిమూర్తులలో ఉండే శివుడిని కలవచ్చు. వాళ్ళు తెర మీద ఉండేవాళ్ళు. తెర వెనక ఉన్నవాడూ? తెర మీద ఉన్నవాడే తెర వెనక ఉన్నవాళ్ళకి medium లేక వాహిక. దేవుడికి పూజ చేయాలంటే పూజారికి చెప్పవలసిందే! ఇవి చేయండి అవి చేయండి అని. సరాసరి దేవుడినే అడిగితే ఏమి జరుగుతుంది? ఏమీ లేదు. అట్లా బ్రహ్మగారు దేవతలందరికీ ఇచ్చాడు. ఆయనకి చెప్పకుంటే, ఆయన వెనకాల ఉండే వారితో అయన మాట్లాడుకోగలడు. యోగులు, ఋషులు కూడా మాట్లాడగలరు. దేవతలు మాట్లాడ లేకపోవచ్చు. అందుకనే కృష్ణుడు అర్జునుడ్ని 'దేవతవి అయిపో' అని చెప్పలేదు. 'యోగీ భవ' అని చెప్పాడు. యోగి అవమన్నాడు. 7 లోకములూ, ఆ పైన ఉండే 8వ లోకము వరకు దారి తెలిసినవాడు ఎక్కడ ఉంటె ఏమిటండి? వాడు భూలోకములో ఉండవచ్చు, పాతాళములో కూడా ఉండవచ్చు. నీ source కి visa ఉంది, అంతే కాదు source నుండి వచ్చిన అన్ని లోకాలలోకి visa ఉంది. నారదుడు 14 లోకాలలో ఎక్కడికి వెళ్లినా visa

చూపించేస్తాడు. అన్నిటికీ ఒకటే visa! UNO లో పనిచేసేవాడు ఈ భూమి మీద ఎక్కడికి అయినా visa తీసుకోకుండా వెళ్ళవచ్చు భూమి వరకు. అట్లా మనకి నారదుడు అన్ని లోకాలలోకి తిరుగుతాడు. కారణము ఏమిటంటే, మూలము తెలుసుకున్నవాడు కాబట్టి. అందుకే ఆయనని అన్ని లోకాలవారు అన్ని విశేషాలు అడుగుతూ ఉంటారు. ఏమిటి సంగతి చెప్పండి అని. ఏ సంగతులూ లేకపోతె రాడు అని. వాళ్ళ చేత అనిపించుకుని వాళ్ళకి అంతా మంచి, చెడు చెప్పిపోతూ ఉంటాడు. అట్లా అదంతా, సమస్తము తన దగ్గర పెట్టుకున్నవాడు తన దగ్గర ఎదురుగా నిలబడి ఉన్నాడు, తాను దేహత్యాగము చేసే సమయములో! కోరి వచ్చాడు అక్కడకి. అటువంటి అద్భుతమైన వ్యక్తి భీష్ముడు! అందుకే ఆయన్ని మర్చిపోకూడదు. విష్ణుసహస్రనామము మర్చిపోయినా పర్వాలేదు. ఎందుకంటే ఆయన లోంచే వచ్చింది కదా విష్ణు సహస్రనామం. ఆయన నుండి వాక్కుగా వ్యక్తము అయ్యింది. కాబట్టి బ్రహ్మగారి వరకు వెళ్తే, ఆయన కనుక్కుని చెప్తూ ఉంటాడు. ఇంకా time ఉంటుందటున్నారయ్యా, అంటుంటాడు. ఎప్పుడు దిగుతాడో తెలియదు, అంటాడు. నీకు తెలుసా, అంటే నాకూ తెలియదూ, వాడికే తెలుసు ఎప్పుడు దిగుతాడో, అంటాడు. సినిమాలో చూపెడతారు కదా, పాము మీద పడుకుంటాడు హాయిగా. వీళ్లంతా గొడవ పెడుతున్నారు అంటే, ఇంకా కొంచెం time ఉన్నది అంటాడు, హాయిగా పడుకుని కాళ్ళు ఒత్తించుకుంటూ. అంటే, తనలోనే వినిపిస్తుంది ఇంకా కొంత time ఉంది వీళ్ళకి కర్మ పరిపక్వమవడానికి, పాపం పండాలి అంటే, వాడికేమో అనుకుంటాడు. కాదు ఇంద్రుడికి! ఇంద్రుడ్ని ఎవడో ఒకడు ఏడిపిస్తూనే ఉంటాడు. ఎప్పుడూ? అతడు ధర్మాన్ని అతిక్రమించినప్పుడు, ఒక రాక్షసుడు చూసి ఆక్రమిస్తాడు. రాక్షసులకీ తెలుసు, ఇతడు సరిగా ఉన్నంతకాలం మనం ఏమీ చేయలేమని. సరిగ్గా లేకపోతె వాళ్ళని కాస్త చూసుకోండి అని వాళ్ళకి instructions! సరిగ్గా లేకపోతేనే సింహాసనం నుండి తోసేస్తారు. తోసేస్తే మొత్తుకుంటాడు. మొత్తుకుంటే ఇంకా time ఉంది, పాపం పండాలి, అంటాడు. వాళ్లకేమో అనుకుంటాడు, కానీ ఇంద్రుడికే! అలా చెప్పి, వారిని పంపించేస్తాడు. ఈయన కూర్చుంటాడు. బలి చక్రవర్తిని ఎక్కడ పెట్టాడండి? మోకాలుకి సంబంధించిన లోకం లోకి తొక్కి పంపిస్తాడు. సుతలం అంటే మోకాలు, భూమి అంటే మూలాధారం. మూలాధారం క్రింద లోకాలలో set చేశాడండీ. ఆయన complaint ఏమీ చేయలేదు. 'అదేవిట్రా అక్కడ ఉండిపోయావు? సరైన స్థితులు లేవు ఏమీలేవు, అడగ వచ్చు కదా. అయినా ఎంతైనా మా వాడు కదా అందుకని తోసేశాడు వాళ్ళ వాళ్ళ కోసం', అన్నట్లుగా ప్రహ్లాదుడంతటి వాడు కూడా అనుకుంటాడు. అనుకుంటే చెప్తాడు. బలికి ఎక్కడున్నా అభ్యంతరమేమీ లేదు. ఎందుకంటే ఎక్కడ ఉన్నా ఆయన వద్దకి passport ఉంటుంది. తను ఆయనతో phone లో మాట్లాడుతూ ఉంటాడు. ఆయనా తనతో మాట్లాడుతూ ఉంటాడు. ఎక్కడ ఉంటె ఏమిటీ? అంతే కాదు. అక్కడ నుండి ఇక్కడకు వచ్చి కనిపిస్తాడు. నువ్వు అక్కడికి వెళ్లి చూడవచ్చు. ఇంక ఎక్కడ ఉంటె

ఏమిటండి, చెప్పండి. అది తెలిసిందిట బలిచక్రవర్తికి. అట్లా తెలిసిన వాళ్ళు అందరు కూడా యోగులు! వాళ్ళ గురించే భాగవతములో ఇస్తారు. కాబట్టే భాగవతము చదువుకోవాలి. వాళ్ళు పూర్తిగా భగవంతుని తత్త్వము నిండి ఉన్న వాళ్ళు. కాస్తో కూస్తో భగవంతుడు కాదు వాళ్లకి. మనకి ఎదో కాస్సేపు ఉన్నాడు, కాస్సేపు లేడు అనిపిస్తుంది. వాళ్ళకో? తాము ఉండరు, వాడే ఉంటాడు. కాబట్టి దేవేశో! బ్రహ్మ, ఆయన తో కూడా సమస్త దేవతలూ ఆయన లోంచే దిగి వచ్చారు కదా. వారికి ఈశ్వరుడు ఆయనే! భూత మహేశ్వరుడు అన్నాం కదా , ఏమిటో ఇన్ని రకాల ఈశ్వరులు చెప్తున్నాము అంటే నిజమే కదా. చిన్న చిన్న గురువులు దగ్గర నుండి పెద్ద గురువుల వరకు, ఆఖరి వాడి వరకు అందరికీ ఈశ్వరుడు! సందుకో ఈశ్వరుడు, ఊరుకో ఈశ్వరుడు. రాష్ట్రానికి ఒకడు. దేశానికీ ఒకడు. గోళానికి ఒకడు. గోళాలన్నీటికీ కలిపి ఒకడు. సూర్య మండలాలకు ఒకడు. అట్లాగే దేవతలందరికి ఈశ్వరుడు నువ్వే! ఈ ముగ్గురూ 'నువ్వే' అని చెప్తున్నాడు కృష్ణుడికి.

## 510 దేవభృత్

దేవభృత్ అంటే ఇంత మంది దేవతలని భరిస్తున్నాడుట వాడు. గోళాలు కూడా దేవతలే! భూదేవి అంటాము కదా, బృహస్పతి అంటాం కదా. అన్నిటినీ భరిస్తున్నాడండి ఆయన. ఇక్కడ 'భృత్' అంటే ఎట్లా భరిస్తున్నాడు అంటే ప్రాణము చేత భరిస్తున్నాడట. భూమి దాని చుట్టూ అది ఎట్లా తిరుగుతూ ఉందండి? ఎవడైనా తిప్పి వెళ్ళేడా ? తిప్పి వెళ్లినా, కొంత సేపటికి ఆగిపోతుంది బొంగరం లాంటిదే. మూడు కోట్ల ముప్ఫై సంవత్సరాలు అయ్యింది, ఇంకా తిరుగుతూనే ఉంది. ఆగలేదు. ఆగితే? అదీ ఉండదు, మనమూ ఉండము. అందుకని ఆగడం లేదు. తిరుగుతూనే ఉంది. ఎవడు తిప్పుతున్నాడు? ఇదే కాదు, అన్ని గోళాలు తిరుగుతున్నాయి. సూర్యుడు కూడా తిరుగుతున్నాడు ఇంకో మండలం చుట్టూ. ఆ మండలాన్ని 'సవితృ' అంటున్నారు. అది కూడా తిరుగుతోంది ఇంకో మండలం చుట్టూ. దాన్ని 'భర్గోదేవ' అన్నారు. భర్గులు అంటే వెలుగు ముద్దలు. భృగు మహర్షి అంటామే, అంతా వెలుగు ముద్దలు. అలా తిరుగుతూ ఉంటాయి. అంతే కానీ భృగు మహర్షి అంటే కాస్సేపు భూలోకానికి, కాస్సేపు బ్రహ్మ లోకానికి, కాస్సేపు విష్ణు లోకానికి వెళ్తే, వాళ్ళెవరూ పట్టించుకోలేదు అని గొడవ వచ్చింది కదా. అంటే, మనం దీపావళికి విష్ణు చక్రము కాలుస్తామే, అందులోంచి రవ్వలు వస్తాయి చూశారా? ఆ విష్ణులోకము కేంద్రములో చూడండీ అక్కడ అంత చీకటిగా ఉంటుంది. ఏమి కనపడదు. ఇంతకు ముందు బిళ్ళ బాగానే కనిపిస్తుంది. చక్రం వెలుగుతో తిరుగుతుంటే, అక్కడ ఏమి లేనట్టుగా కనబడుతుంది. ఏమి లేనట్టుగా ఉన్న దాంట్లోంచి వెలుగు రవ్వలు వస్తాయి. అట్లా చూడాలి మనం విష్ణువుని చూద్దాము అనుకుంటే దీపావళి సామానులో విష్ణురూపము విష్ణుచక్రం లో, భూచక్రం లో కనిపిస్తుంది. చూద్దామని లేకపోతె ఎదురుగా నిలబడినా కనబడదు. 'ఒరేయ్! నేను దేవుడ్నిరా నువ్వు కావాలంటే వచ్చాను' అంటే, 'చాల్లేవయ్యా పో!' అంటాడు. ఎప్పుడు దేవుడు దిగి వచ్చినా నిరాశే! ఎవ్వరూ చూడలేదు, ఒప్పుకోలేదు కూడా. ముమ్మాటికీ కాదు అని చెప్పారు. అందుకని చూసేవాడికి కనపడితే సుఖం. చూడని గుడ్డివాడికి, ఎదురుగా నిలబడితే ఏంటి? కాబట్టి, ఆవిధంగా ఆచక్రము నుండి రవ్వలుగా వస్తే, వాటిని 'భార్గవులు' అన్నారు. అందులో కొన్నేమో సంసారం నిర్మాణము చేస్తుంటే, కొంత మంది సన్యాసుల్లా తిరుగుతూ ఉంటారుట. సన్యాసులుగా తిరిగే వాళ్ళని Comets అన్నారు. వాళ్ళకి ఇక్కడకి అక్కడకి తేడా ఏమి ఉండడము. సన్యాసులుకి programme ఏమి ఉంటుందీ? Programme ఉంటె సన్యాసి కాదు వాడు, గుర్తు పెట్టుకోండి. ప్రణాళికలు ఏంటి సన్యసించిన వాళ్లకి? వాళ్ళు అప్పుడు సన్యాసులు కారు, సంసారులే! సన్యసించడము అంటే ఏంటి? సన్యక్ న్యాసము నందు నిలబడి ఉండడం. ఇంక మిగతావన్నీ

పట్టించుకోరు. వారికి రకరకాల ప్రణాళికలు, గొడవలు ఉండవు. వాడి పని ఏంటయ్యా అంటే అట్లా హాయిగా తిరుగుతూ ఉంటాడు, సృష్టి మొత్తము అంతా తిరుగుతూ, చూస్తూ ఉంటాడు. అన్ని చోట్ల 'దాన్నే' దర్శిస్తూ ఉంటాడు. రేపు అక్కడకి వెళ్ళాలి అని rule ఏమి లేదు. ఈ time కి ఇక్కడే ఉండాలని rule లేదు. ఎప్పుడు ఎక్కడ ఉన్నా దేవుడుతో ఉంటాడు. ఎవరన్నా పెడితే తింటాడు, లేకపోతె వెళ్ళిపోతాడు. ఇది తినాలని కూడా ఉండదు. షిర్డీ సాయిబాబా సన్యాసి. పొద్దున్నే లేచి స్నానం చేసి గాయత్రీ చేసుకోవాలి కదా అనే programme లేదు mind లో. అదీ సన్యాసి! Cooked food 3గం తరువాత తినకూడదు అని షిర్డీ సాయిబాబాకి లేదు. ఎవరు ఏది పెడితే అది తిన్నారు కదా. శుభ్రమైన బట్టలు వేసుకుని atleast physical గా అయినా clean గ లేకపోతె ఎలా అని ఆయనకీ లేదు. చిరుగు చొక్కా వేసుకుని ఉంటె, ఎవడో కుర్రవాడు చూసి బాధ పడి చొక్కా మార్చుకో బాబా అంటే, 'చొక్కా మార్చడమేమిటిరా, చొక్కా మారిస్తే నేను కనబడను', అంటాడాయన. అంటే ఏ నియమాలు లేవు, అడిగిన వాళ్ళకి ఎన్నైనా ఇవ్వగలడు. అదీ శివుడంటే! శివుడు దగ్గర నియమాలు లేవండి. Organizations పెట్టుకుంటే నియమాలు వస్తాయి. సంసారము పెట్టుకున్నారనుకోండి నియమాలు ఉంటాయి. పెళ్లి చేసుకుని సన్యాసులతో తిరుగుతాను అంటే ఒప్పుకుంటారా? డొక్క చీరేస్తారు! కొంత మంది భృగువులు సంసారులు కారట. అవీ సవితృ మండలాలు, సూర్య మండలాలు. సూర్యునికి ఎంత సంసారమండీ! ఈ గోళాలన్నీ అయన లోంచి వచ్చినవే! అవి సంరక్షించుకుంటూ ఉండాలి. వాటికి ప్రాణశక్తి అందిస్తూ ఉండాలి. అందులో జీవులకి పంపిస్తూ ఉండాలి. వాటిని సంరక్షిస్తూ ఉండాలి. పుట్టిన దగ్గర నుండి ఎన్ని బాధలు గృహస్థుకి! Comet సన్యాసి కాబట్టి అట్లా తిరుగుతూ ఉంటాడు. అది వస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు ప్రచోదనం చేసి పోతూ ఉంటుంది. మొన్న ఆ మధ్య 1910 సం లో మార్చి 30 తారీకున, ఈ భూమిని ముట్టుకుని 'కుంభ చైతన్యం' ని అందించి పోయింది. వాళ్ళు అట్లా తిరుగుతూ ఉంటారు. నారదుడు అటువంటి వాడు. అటువంటి ఋషులు గోదోహన మాత్ర వేళ ఒక చోట ఉండరట. అంటే, ఆవు పాలు పితికే అంత సమయము కూడ వాళ్ళు ఒక చోట ఉండరుట. మనం ఎక్కడికైనా వెళ్తే అక్కడ settle అయ్యి కూర్చుంటాము. అటువంటి వాళ్ళు కొంత మంది, ఇటువంటి వాళ్ళు కొంత మంది ఉన్నారుట. ఇటువంటి వాళ్ళు ఉండబట్టి మళ్ళా సృష్టి పుడుతూ ఉంటుందట. అంటే సూర్యుడి లోంచి మళ్ళి గోళాలు పుడుతుంటాయి, గోళం మీద జీవులు పుట్టుకు వస్తారు. ఇట్లా కొంత మంది సంసారులుగా, కొంత మంది సన్యాసులుగా ఉన్నారు. ఇవన్నీ వెలుగు ముద్దలే! వాళ్ళూ భార్గవులు అంటే. వాళ్ళనే 'భృగు' మహర్షులు అంటారు. వాళ్లందరికీ దేవుడ్ని 'భర్గోదేవ' అంటాము. ఆయన్ని మనం గాయత్రీ మంత్రము ద్వారా ఆవాహనము చేస్తాము. ఇవన్నీ ఇట్లా బోలెడంత వెదజల్లవచ్చు మన లోంచి. వెదజల్లిన వాటిని పట్టి ఉంచడమూ? ఎంత దూరము ఉన్నది సూర్యుడికి, భూమికి? సంస్కృతము

వచ్చిన వాళ్ళు చెప్పగలరు. ఎంత దూరం చంద్రుడికి సూర్యు,డికి, చంద్రుడికి భూమికి, గోళానికి గోళానికి? ఇలా ఇన్ని గోళాలని ఏది పట్టి ఉంచింది? ప్రాణశక్తి! అంటే పూసల గొలుసు ఉన్నదనుకుంటే, అట్లా పూసకి ఎక్కించినట్లుగా మొత్తము అన్నిలోకాల గోళాలని ఎక్కించి నడిపించే ప్రాణసూత్రమున్నది. Thread of Life అంటారు దాన్ని. మనలో కూడా అది ఉండబట్టే అన్నీ జరుగుతున్నాయి. ఈ కన్ను దారి కన్నుది, చెయ్యి దారి చెయ్యిది, నోరు దారి నోరుది అయిందనుకోండి. ఏమి చేస్తారు మీరు? ప్రాణము లేకపోతె దేని దారి దానిదే అప్పుడు. మనలో పదార్థము ఉంది, నీరు ఉంది, అగ్ని ఉంది, వాయు ఉంది, ఆకాశము ఉంది. వెలుగు ఉంది. తెలివుంది. వీటన్నిటిని పట్టి ఉంచేది ప్రాణము! ఈ తెలివి ఎందుకు పనికి రాదు ప్రాణము లేకపోతే! చాల తెలివైన వాడండీ అంటే ప్రాణము లేకపోతె ఏమి లాభమండీ? అందుకనే తెలివుండగానే ప్రాణము ఏమిటో తెలుసుకోమని చెప్తారు పెద్దవాళ్ళు. ప్రాణము ఉండగానే తెలివి పెంచి పోయేవాడు, ఊరికే బుర్ర వాడినవాడు అవుతాడే తప్ప, ఎందుకూ పనికి రాడు. తెలివి ఉండగానే ప్రాణము తెలుసుకో. వీడు పతిదేవుడు.? అంటే, మూలము వాడు తరువాత వీడే లెఖ్ఖ. దాన్నే మనవాళ్ళు 'కుండలినీ చైతన్యము' అని చెప్పారు. అందులో ప్రాణము ఉన్నది, తెలివీ ఉన్నది. ఇట్లా అక్కడ నుండి ఇక్కడ వరకు కుండలిని చైతన్యముతో మొత్తము అంతా ఒక అల్లిక చేసి తిప్పుతున్నాడట. ఆ దారం కనబడదు. ఒక దున్నపోతు మీద వచ్చిన వాడు తీసుకుపోయేది దీన్నే! దారంతో అలా వేసి, ఇలా లాగేస్తే వచ్చేస్తుంది అది. వాడి దగ్గరే ఉంది అది. ప్రాణము యొక్క రహస్యం యముడి చేతిలో ఉంది కదా. అంటే ఏమిటి? యమము ఎవరికి అయితే ఉంటుందో, వాళ్ళకి వాళ్ళ చేతిలో ప్రాణశక్తి ఉంటుంది. యమము ఏమిటి అంటే పతంజలి మహర్షి చూసుకుంటే తెలుస్తుంది. యమమును అభ్యాసము చేస్తే, యోగములో ప్రవేశించిన వాడికి ప్రాణశక్తి అందుతుంది. అందితే, వాడు అది పెట్టుకొని పనులన్నీ చేసుకుని, తను వచ్చిన పని అయిపోగానే ప్రాణశక్తిని పట్టుకుని వెళ్ళిపోతాడు. తెలివిని పట్టుకుని ఉండడు. తను తెలివిగా ఉండి, ప్రాణాన్ని వదులుతాడు. మిగతా వాళ్లకి ముందు ప్రాణము పోతుంది, తెలివి ఉండదు. అందుకని వాడు తెలివి తప్పుతాడు. తెలివి తప్పి ప్రాణము పోయే కన్నా తెలివి ఉన్న ప్రాణము పోవడంలో పెద్ద తెలివుంది. వాళ్ళు అసలు చచ్చిపోరు. అందుకని మన పెద్దలు 'ముందు నువ్వు ఇది నేర్చుకో, మిగతావన్ని తరువాత నేర్చుకుందుగాని' అని. చెప్పారు. అది తెలిస్తే అది పట్టుకుని వస్తూ ఉండవచ్చు. ఇదివరకు ఏమి చేశామో తెలుస్తుంది. దాని continuation చేసుకోవచ్చు. అందుకని ఈ భరించే వాడు మనని భరించడం ఏమిటి? గోళాలనే భరిస్తుంటే. మనము ఎంత? మనము వెళ్ళిపోయాము అనుకోండి, ప్రాణమూ వెళ్ళిపోతుంది. దేని దారి దానిదే. అయినా కాస్తసేపు గుండె కొట్టుకుంటునే ఉంటుంది. కళ్ళు పని చేస్తుంటాయి. Liver / కాలేయము పనిచేస్తూనే ఉంటుంది. అందుకని ఆ organs తీసుకు వచ్చి ఇంకొకళ్ళకి పెట్టవచ్చు అని చెప్పి శాస్త్రం! కన్ను తీసి ఇస్తారు.

పరహితము కాబట్టి ఇవ్వవచ్చు. అమ్ముకున్నావో వచ్చే జన్మ లో కన్ను ఉండదు, నీది కానిది నువ్వు అమ్మడం వల్ల. ఇవ్వు! ఎవడికి ఇచ్చావు? ఆ రూపం లో ఉన్న 'వాడికి'! అసలు మొత్తము అంతా వాడిది. నీకు ఊరికే ఇచ్చాడు. అద్దె కూడా కట్టించుకోవడం లేదు. దాన్ని నువ్వు అమ్మడమేమిటి? అలాచేస్తే దాన్ని దొంగతనం చేసినట్లుట. ఏ భాగానికి ఆ భాగములో ప్రాణము ఉన్నది. వీటన్నిటికీ కలిపి, ఒక సమాహార ప్రజ్ఞగా ప్రాణం ఉన్నది. ఇంత మందికీ కలిపి ప్రాణము ఉన్నది. గోళానికి ప్రాణము ఉన్నది. గోళాలన్నిటికి కలిపి ప్రాణము ఉన్నది. ఇట్లా జడలు జడలుగా ఇంకో ప్రాణము ఉన్నది. దానితో అందరిని లేపుతున్నాడు, నడుపుతున్నాడు, తిప్పుతూ ఉన్నాడు, చూస్తూ ఉన్నాడు. నీలో కూడ శ్వాస రూపం లో బయటకి కనిపించేది ఉన్నది. అందుకనే 'ప్రత్యక్ష బ్రహ్మ' ఎవరయ్యా అంటే, 'వాయువు'. 'నమస్తే వాయో, త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి. త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి' అని నొక్కి చెప్తుంటాము మనం. అది Declaration! ఈ వాయువు నడిపించేది లోపల 'స్పందన'! స్పందనని నడిపిస్తున్నదో? 'ప్రాణము'! కాబట్టి, ప్రాణము వలన స్పందనము, స్పందనము వలన శ్వాస. కాబట్టి ప్రాణము వలన శ్వాస ఉందని అనుకోకండి. కాస్త సేపు ముక్కు మూసుకుంటే చాలు, బతికే ఉంటారు. ఎక్కువసేపు మూసుకుంటే ప్రాణము వెళ్ళిపోవడం వలన మళ్ళి పీల్చడానికి ఉండదు. ఎంత మందికి గుర్తు ఉంటుందండి లోపల ప్రాణము ఉందని. ఉంది కాబట్టి మర్చిపోయాము. పనులు గుర్తు ఉంటాయి తప్ప, అయ్యో! మనలో ఇంత ప్రాణశక్తి కరుణతో అందించాడే, దాన్ని మనం డబ్బు కన్నా జాగ్రత్తగా చూసుకోవాలి అన్న జ్ఞానం ఎంత మందికి ఉంటుంది? ఉంటె ప్రాణము ఎందుకు సన్నగిల్లుతుంది? ఉన్నది కనబడడం లేదు కదా. అంత రహస్యముగా లోపల ప్రాణశక్తిగా ఉన్నాడు. అలాగ సమస్తమునకు ప్రాణశక్తిగా ఉండి దానిని నిలబెట్టి ఉంచాడు. నువ్వు ఎట్లా నిలబడి ఉంటావు ప్రాణం లేకపోతే? ఎలా నిలబడ్డావో ఎప్పడైనా ఆలోచించావా? ఎలా నడుస్తున్నావు? ఎప్పుడూ గమనించాలి. ఎందుకంటే ఇదీ, దేవుడు ఎక్కడో ఉన్నాడని చూడడము కాదు. ఇక్కడే ఉన్నాడు లోపల. 'అదిగో అల్లదిగో శ్రీహరి వాసము కాదు, ఇదిగో ఇల్లదిగో' లోపల చూడు. నీలో ప్రాణము రూపములో ఉన్నాడు. నీలో తెలివి రూపంలో ఉన్నాడు. నీలో నీ అస్థిత్వంగా ఉన్నాడు. ఇన్ని రకాలుగా ఉన్నాడు కదా, చూడవేమీ? చూడు, అని చెప్తున్నాడు భీష్ముడు. ఎదురుగా ఉన్నవారిలో కూడా ఉన్నాడు చూడమని చెప్తున్నాడు.

## 511 గురుః

ఈ పదము మనకి విపరీతముగా బాగా తెలిసిపోయింది, అనుకుంటాము కదా. తెలిస్తే ఇప్పుడు తెలిసినంత గోల ఉండదు. ఇంత మంది గురువులు లేరు, గురువు ఒక్కడే అని తెలిసిన వాడికి 'గురు' తెలిసినట్లు లెక్ఖ. ఉన్నది ఒకడే గురువు, అతడికి కోటానుకోట్ల రూపాలు ఉన్నాయని తెలియాలి. గురువు ఒక్కడే, అతడికి వాహికలు చాలా వున్నాయి. మామిడి పండు ఒకటి కోసి, కళ్ళు మూసి నోట్లో పెడితే, ఏమి తిన్నావురా అంటే మామిడి పండు తిన్నాను అంటాడు. మా ఇంట్లో చెట్టుకి పండే మామిడి పండు, పక్కింటి మామిడి చెట్టు పండు మామిడి పండు కాదు అన్నాము అన్నాకోండి, ఎలా ఉంటుందీ? అదే కదా అంటాము మనము. 'మా గురువుగారే, మిగతా గురువుగార్లు ఏమీ లాభము లేదండి. వాళ్ళకి ఏమీ తెలియదండీ,' అంటే, నీకు ఏం తెలుసు ఆయనకి తెలియదు అనడానికి? అందరి గురువులలోను ఒకే తత్త్వాన్ని చూసి దణ్ణము పెట్టుకున్న వాడే నిజమైన శిష్యుడు! అందరిలోనూ చూడగలగడానికి ముందు ఒక గురువు దగ్గర శ్రద్ధా భక్తులతో విద్య నేర్చుకోవాలి. నేర్చుకున్న తరువాత గురువు అంతర్యామి స్వరూపుడు, అందరిలోనూ ఉంటాడని తెలుస్తుంది. అప్పుడు అందరి గురువులకు నీ గురువుకి ఎంత శ్రద్ధ భక్తులతో దణ్ణం పెట్టుకుంటావో అంతే శ్రద్ధ భక్తులతో పెట్టగలుగుతావు. అవన్నీ రూపాలే తప్ప, లోపల ఉండే తత్త్వం ఒకటే 'గురు తత్త్వము' అని తెలియాలి. అలా అందరి గురువులలోను గురుతత్త్వాన్ని చూడగలిగిన వాడే సంకుచితం అయిన మనస్తత్త్వము నుండి బయట పడిన వాడు అవుతాడు. అలా కాని వాడు ఏదో ఒక రూపానికి బద్ధుడై ఇరుక్కుపోతాడు. ఇంతమంది గురువులకి ఓ గురువు ఉన్నాడు, ఈ భూమి మొత్తానికి ఓ గురువు ఉన్నాడు. ఆయన ఈ భూమికి 'జగద్ గురువు'! ఆయనకీ గురువు ఉన్నాడు. ఈ గోళాలన్నిటికి ఒక్కొక్క గోళానికి ఒక గురువు ఉన్నాడు. వాళ్లందరికీ గురువు సూర్యుడిలో ఉన్నాడు. సూర్యుడికి గురువు సవితృ మండలములో ఉన్నాడు. ఆయనకి గురువు అట్లా పైకి పైకి పోతే, 'ఒక్కడే', ఉంటాడు. వాడి నుండే మొత్తము అంతా! 'గురు' అంటే, 'అందరికన్నా పెద్దవాడు, అందరికన్నా మొదటి వాడు' అని అర్థము. 'వాడే' ఈ రూపములో ఉన్నాడని చెప్తున్నాడు భీష్ముడు. దానికి ఒక నానుడి ఉంది. 'కృష్ణం త్రైలోక్య గురుః' అని. అంటే ప్రజ్ఞ, శక్తి, పదార్థముతో ఆవరింపబడ్డ సమస్త సృష్టికి మూల కారకుడు ఈ 'కృష్ణ తత్త్వం'. కృష్ణుడ్ని తత్త్వముగ చెప్పినది భాగవతం. ఊరికె కృష్ణుడి బొమ్మను ప్రచారం చేసేస్తే అది ఇంక వేరే ఎదో అయిపోతుంది. కృష్ణుడు భగవద్గీతలో 'నేను' గురించి చెప్పాడు. అదే 'నేను' గురించి క్రీస్తు చెప్పాడు, మోసెస్ చెప్పాడు. తెలిసిన ప్రతి గురువు ఆ 'నేను' గురించే చెప్తాడు. ఇంకోటి చెప్పడు. చెప్తే తెలియని వాడి కిందే లెక్ఖ. ఆ 'నేను' తత్త్వానికి రూపము కట్టుకు వచ్చిన వాడు కృష్ణుడు.

అంతే కాదు లోకాతీతమైన కార్యాలు చేసినవాడు కృష్ణుడు. కాబట్టి ఆయన ఇలా చెప్పాడు. అందరి గురువులలోను నీ గురువును చూడు. ఎందుకంటే, రూపంలో ఉన్నవాడివి కదా, కనుక నువ్వు రూపానికి బద్ధుడై ఉంటావు కనక. అభ్యాసం చెయ్. తరువాత నీ గురువులో ఆ గురుతత్వాన్ని చూడగలిగినప్పుడు ఆ గురువు యొక్క అంతేవాసి అవుతావు. అంత వరకు అంతే వాసివి. గురువు యొక్క అంతేవాసి అవడము అంటే You are within the Heart of your Master. ఆయన ఇంట్లో ఉన్న వాడివి. ఆయనకి ఇల్లు హృదయమే! మహాత్ములకు వేరే ఇల్లు మీద వ్యామోహము ఉండదు. హృదయమే వాళ్ళ ఇల్లు. అక్కడే ఉంటారు. అక్కడ నుండి సమస్తాన్ని నిర్వహిస్తూంటారు. ఆయన హృదయములో నీకు చోటు దొరికినది అనుకో, వాడిని 'అంతేవాసి' అంటారు. 'ఆచార్యః పూర్వ రూపం, అంతేవాస్యుత్తర రూపం'. అంతేవాసి అన్న సంస్కృత పదానికి అర్థము లోపల వశించి ఉన్నవాడు. గురువు లోపల ఎప్పుడు నువ్వు వశించి ఉండగలవు? గురు తత్వాన్ని అవగాహన చేసుకుని, గురు రూపాన్ని అధిష్టించి, అంటే తన యొక్క పరిమితత్వాన్ని దాటి, తత్వం లోకి ప్రవేశిస్తే అంతేవాసి అవుతావు. అలా కాకపోతే తెలుగు అంతే వాసివి అవుతావు. తక్కువ స్థితిలో ఉంటావు. నీ గురువు గురించి ప్రచారం చేసుకోవడములో జన్మ అంతా అయిపోతుంది. గురుతత్వము నువ్వు అందుకోలేవు, ఇంకొకరికి అందించలేవు. అందుకని భాగవతములో ఏమి చెప్పారంటే, You only speak of the Original in the name of Krishna! Krishna అంటే ఇలా చెప్పాడట. ఆ నామానికి ఉండే అవగాహన! దాన్ని చూడాలి! దానిలో దీన్ని కూడా చూడవచ్చు. దాంట్లో, దీంట్లో ఎక్కడ పడితే అక్కడ చూడవచ్చు. అది గురుతత్వం! మొత్తమంతటికి కూడా అదే ఆధారం. చివరికి ప్రాణానికి కూడా గురువు ఆయనే, అని చెప్పాడు. ఇవ్వగలడా ప్రాణము పోయిన వాళ్లకి? లేదుగా! మహాత్ములందరు ప్రాణము పోయిన వాళ్ళకి ప్రాణము ఇచ్చారు. ఎట్లా ఇచ్చారు? గురువు అవబట్టి! గురు అంటే తత్వము! ఇట్లా ఉండ బట్టి చేయగలుగుతారు. లేకపోతే చేయలేరు. చేయక పోయినా చేశామని చెప్పవచ్చును, అది వేరే సంగతి. 'ఎవరో బతికిస్తే నేనే బతికించాను' అని చెప్పే గురువుల దగ్గర నుండి, నిజముగా వెళ్ళిపోయిన వారిని బతికించిన గురువుల వరకు మనకి కనిపిస్తారు. ఆదిదేవుడు, మహాదేవుడు, దేవేశుడు, దేవభృత్, గురు. ఒక్కొక్క నామంలో ఇంతింత పెట్టి మనకి అందించిన మహానుభావుడు భీష్ముడు. దానిని Record చేసినవాడు వాడు 'వేద వ్యాసుడు'! ఎప్పటికీ అవ్వని tape. 18 పురాణాల tape. భారతము tape, భాగవతము tape, అందులో ఉన్న స్తోత్రాలు అన్ని tapes. ఇది Master Tape అన్నమాట. అక్కడ నుండి మనం మన tapes తయారు చేసుకున్నాము. కాబట్టి వాళ్ళిద్దరికీ దణ్ణం పెట్టుకోవాలి. విష్ణు సహస్రనామం మనకి అందించినందుకు కృష్ణుడితో పాటుగ!

## 512 ఉత్తరః

'ఉత్' అంటే ఊర్ధ్వము అని అర్థం. 'ఉదార' అని అమ్మవారిని మనం శ్రీ సూక్తంలో పిలుస్తాం. ఉత్తర భాగం అంటే తరువాతి భాగము అని ఒక అవగాహన ఉన్నది. ఉత్తరభాగం అంటే ఉపరిభాగం అని ఒక అర్థం ఉన్నది. ఊర్ధ్వము అయిన విషయము లేక ఉత్తర ధ్రువము, ఉత్తరము ఇవన్నీ కూడా అందులో నుండే మనకి వచ్చిన పదములు. సు-ఉక్తము అనేది కూడా అందులో నుండి వచ్చినదే. సూక్తములు మనము చక్కగా ఉచ్ఛరించడం. భగవంతుడు ఊర్ధ్వముఖుడై, ఉత్తరుడై ఉంటాడనే ఒక భావన భగవత్ తత్త్వానికి సంబంధించి చెప్పకోవడం జరుగుతుంది. ఊర్ధ్వ ముఖంగా ఉండడం అంటే ఆకాశంలో ఉండడం అని అర్థం కాదు, స్థూలమునకు సూక్ష్మము ఊర్ధ్వము. స్థూలంగా మనకి అన్నీ కనిపిస్తూ ఉంటాయి. ఈ స్థూలానికి ఆధారంగా దాని వెనక ఉన్న సూక్ష్మమైన స్థితి, (దీనికన్నా అది) ఉత్తరంగా ఉన్నది అని అర్థం. మహాత్ములందరూ కూడా జీవితం యొక్క ప్రయోజనాన్ని నిర్వర్తించుకున్న తరువాత ఉత్తర దిశగా నడిచి వెళ్ళారని చెప్తారు. ఉత్తర దిశగా నడిచి వెళ్లారంటే సూక్ష్మమునందు ప్రవేశించారు అని అర్థం. స్థూలం నుండి సూక్ష్మంలోకి ప్రవేశించి, దేహత్యాగం చేశారని చెప్తారు. అంతేగాని ఉత్తర ముఖముగా నడిచి అంటే, భౌతికమైన ఉత్తరం కాదు, స్థూలం నుండి సూక్ష్మమునకు వెళ్లేది ఉత్తరం. ఎందుకంటే మన ఉత్తర ధృవం కూడా ఇంకొక దానికి దక్షిణ ధృవమే. ఇప్పుడు మనం ఇక్కడ కూర్చున్నాము అంటే ఇది మనకి నేల, కానీ ground floor లో ఉండే నేలకి ఇది ఉత్తరం. ఆపై floor ఇక్కడ ఉండే ఈ floor కి దక్షిణం అవుతుంది. అంటే ఇది ఒకదానికి ఉత్తరం, ఒకదానికి దక్షిణం. అలా ఉత్తరదక్షిణాలు, భౌతికమైన మార్పులు జరుగుతూ ఉంటాయి తూర్పుపడమరలు కూడా అంతే. ఈ భూమిని దాటి మనం అంతరిక్షం లోకి ప్రవేశిస్తే తూర్పు లేదు, పడమరలేదు. మనకి భౌతికమైన ప్రపంచంలో ఉండే కొన్ని అవగాహనలు సూక్ష్మ లోకంలోకి వెళితే ఉండవు. పగలు, రాత్రి అనేది భూమి మీద ఉన్నప్పుడే ఉంటుంది. ఈ భూమి తన చుట్టూ తను తిరుగుతూ ఉండడం లో, సూర్యుడు చుట్టూ తిరగడంలో ఎప్పుడూ సగభాగం వెలుగు, సగభాగం నీడ పడుతూ ఉంటుంది. నీడ పడ్డది చీకటిగా ఉంటుంది, వెలుగు పడ్డది పగలుగా ఉంటుంది. కానీ భూమి నుండి మనం కనుక అంతరిక్షంలోకి వెళితే పగలు లేదు రాత్రి లేదు. పౌర్ణమి లేదు అమావాస్య లేదు. ఉత్తరము లేదు, దక్షిణము లేదు. వీటిని భౌతికమైన స్థితిలో ఏర్పడే ద్వంద్వములు అంటారు. ఈ ద్వంద్వములు ఉత్తర దిశగా వెళ్ళిన వాళ్ళకి ఉండవు. మహాత్ములందరూ కూడా సూక్ష్మమునందు జీవిస్తూ స్థూలంలో పనిచేస్తూ ఉంటారు తప్ప, స్థూలాన్ని అతుక్కుపోయి ఉండరు. స్థూలాన్ని అతుక్కుపోయి ఉండడం అంటే బహిర్గతమైన విషయములందు బాగా అతుక్కుని ఉండడం. 'ఐతరేయము' అంటారు,

తనకన్నా ఇతరముగా కనిపిస్తున్న ఈ బహిర్ ప్రపంచాన్నంతా! నిజానికి అది ఇతరం కాదు, కాకపోతే నామరూపాత్మకమైన జగత్తులో ఉన్న తత్వాన్ని చూడకపోవడంచేత మనకన్నా అది ఇతరముగా కనిపిస్తూ ఉంటుంది. 'నేను, అతడు' అని మహాత్ములు అందరూ చెప్తారు,

వీరు నే మను మతిభ్రమణంబున భిన్నులై ప్రవర్తిల్లక
సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునందుల్లముఁ జేర్చి

అని చెప్పాడు ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడికి. ఎక్కడైతే స్వేతర భావము - తను, ఇంకొకళ్ళు అనుకున్నారో అప్పుడు ఇంకోళ్ళ గురించి అభిప్రాయాలు, తను, తన ఇల్లు, తన ఆస్తులు లేకపోతే తన వారు ఇలా బహిర్గతంగా బంధాలు వేసుకునే వాళ్ళందరికీ కూడా ద్వంద్వాలు ఉంటాయి. మహాత్ములు ఈ బహిర్గతమైన ప్రపంచము నాలుగవ స్థితికి సంబంధించినది అని, దీనికి మూడు స్థితులలో సూక్ష్మమైనదీ, వెలుగుతో కూడిన ప్రపంచం ఒకటి ఉన్నది అని తెలిసి, 'త్రిపాదస్య అమృతం దివి' అని చెప్పకుంటాం. 'పాదోస్య విశ్వాభూతాని' కనబడుతున్నఈ విశ్వము, అంటే ఇప్పుడు ఈ గోళములు, వాటి మీద ఉన్న భూతములు లేక జీవులు ఇవన్నీ కూడా ఒక పాదమే భగవంతునికి. అంటే ఒక నాల్గవ వంతు, అని అర్థము. అది కాక మూడు వంతులు లోదృష్టి కలిగిన వాళ్లకి కనిపిస్తాయి. వాళ్లకి ద్వంద్వములు ఉండవు. అందుకనే పెద్దలు ఏం చెప్తారంటే జ్యోతిష్య మార్గంలో, బాగా బొడ్డు పెరిగినవాళ్లకి ద్వంద్వములు ఉంటాయి అన్నారు. బొడ్డు మూసుకుపోతే ద్వంద్వములు ఉండవు. పిల్లవాడికి పుట్టంగానే బొడ్డుకు సంబంధించిన ప్రజ్ఞ అంత పుట్టదు. ఏడు సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపు పుడుతుంది. అలాగే స్త్రీ పురుషుల విభేదాలు కూడా ఏడు సంవత్సరాల నుండి 14 సంవత్సరాలలో అవయవాల్లో అమరిక జరుగుతుంది. అంతకు ముందర పది రాశుల జీవుడే ప్రతివాడు. అటువంటి వాడిని 'పూర్ణపురుషుడు' అంటారు. 12 రాశుల పురుషుడ్ని 'అపరిపూర్ణమైన పురుషులు' లేక 'బయట అతుక్కుపోయిన పురుషులు' లేక 'భూమి జీవులు' అంటారు. నిజానికి మనం భూమికి సంబంధించిన వాళ్ళం కాదు, భూమి మీదకు దిగి వచ్చిన వాళ్ళం. సూర్యవంశీయులం! భూమికి దిగివచ్చిన తర్వాత భూమి మీద మనం అతుక్కుపోవడం చేత మనలో ద్వంద్వములు ఏర్పడ్డాయి. ఇలా ద్వంద్వములు ఏర్పడకుండా ఉండాలంటే లోదృష్టి కావాలి. సాధన కూడా బహిర్గతముగా చేసే దానివల్ల కొంత మనకి మంచి అలవాట్లు ఏర్పడడమే తప్ప, అంతర్ముఖులు అవ్వడానికి, అంతర్దర్శనులు అవ్వడానికి అవకాశం లేదు. లోదృష్టి ఏర్పడినవారికి సమస్తమైన విషయములు గోచరించి, బయట విషయము చాలా చిన్నది అనిపిస్తుంది. బయట జీవితమే సతమతమైపోతూ ఎప్పటికీ తేలకుండా చాలా బరువెక్కిన వాళ్లను చూస్తే, తెలియక అట్లా బాధపడుతున్నారు, నిజానికి ఇదంతా చాలా చిన్న విషయం కదా అనుకుంటారు వాళ్ళు. వాళ్లకి స్త్రీ, పురుష భేదం కూడా ఉండదు. అంటే మనలో స్త్రీత్వం,

పురుషత్వము రెండు ఉంటాయి. స్త్రీలో పురుషుడు ఉన్నాడు, పురుషుడులో స్త్రీ ఉన్నారు. స్త్రీ పురుష తత్వములు ఏ మనిషిలో సమత్వం చెందుతాయో అతను అర్ధనారీశ్వరుడు తో సమానము. అంటే తనయందే తన స్త్రీ ఉండుట చేత, బహిర్ముఖముగా దేనిని కామించనవసరము లేదు. అలాగే ఒక స్త్రీకి తన యందే తన పురుషుడు ఉండుట చేత, తను బయట కామించవలసిన విషయము ఇంకొకటి ఏమీ లేదు. శ్రీరాముడు, సీతాదేవి ఒకరిని ఒకరు ఆ విధంగా దర్శనం చేసుకోవడం వలన, వారికి ఇంకొకటి కావలసిన అవసరం కనపడలేదు. కావాలనే కోరిక ఆమెకి పుట్టడం చేత ఆ విధమైన బంధనం జరిగింది. అందుకని రామునియందు ఎప్పుడూ సీత ఉన్నది, సీతయందు ఎప్పుడూ రాముడు ఉన్నాడు, ఆ విధంగా వాళ్ళు పూర్ణజీవులుగా జీవించారు. అలాగే మహాత్ములందరూ కూడా పూర్ణజీవులుగా జీవిస్తారు. తనకి ప్రత్యేకంగా వ్యక్తిగతంగా కావలసినది, అనేది లేకుండా జీవిస్తూ ఉంటారు. సమస్తము వైభవోపేతంగా నడిచి వెళుతూ ఉంటుంది, తాను కోరకయే తనకి అవసరమైవి భగవంతుడు ఇస్తాడు అనే నమ్మికతో జీవిస్తూ ఉంటారు పూర్ణపురుషులు. వారికి 10 రాశులే పనిచేస్తాయి. సంవత్సరచక్రంలో Virgo - భాద్రపదమాసం పౌర్ణమి నుండి కృష్ణపక్షం మహాలయపక్షం 15 రోజులు, అక్కడి నుండి ఆశ్వీయుజమాసం 30 రోజులు, అక్కడి నుండి కార్తీకమాసం మొదటి 15 రోజులు, మొత్తం 60 రోజులు ఇవన్నీ కూడా సంవత్సరచక్రంలో చీకటికి సంబంధించిన కాలం. శరదృతువులోకి ప్రవేశిస్తూ ఉంటే, చీకటికి సంబంధించిన కాలం. పుష్యమాసంలో ప్రవేశించినప్పుడు మనకి ఉదయం అవుతుంది. దానినే 'ఉత్తరాయణ సంక్రమణం' అని చెప్తూ ఉంటాం. పుష్యము రెండు గంటలు, మాఘము రెండు గంటలు. ఫాల్గుణము రెండు గంటలు అప్పటికి ఆరు గంటలు అవుతాయి. చైత్రము రాగానే మిట్టమధ్యాహ్నం వెలుగు అది మనకి ఉగాది. బాగా గుర్తు పెట్టుకోండి సంవత్సరచక్రంలో మకరసంక్రమణంతో ఉత్తరాయణం రావడంతోనే మనకి ఉదయం అవుతుంది. సంవత్సరంలో ఉదయం. ఉదయం నుండి మనకి రెండు గంటలు పుష్యమాసం, రెండు గంటలు మాఘమాసం. రెండు గంటలు మీనము- లేక ఫాల్గుణ మాసం. ఇవి జరిగేసరికి ఆరు గంటలయ్యేసరికి మనం సరిగ్గా మిట్ట మధ్యాహ్నంకి వస్తాం సంవత్సరంలో. అందుకని అత్యంతమైన వెలుగు మనకి అందే సమయం కాబట్టి భగవంతుని సరాసరి అందుకోమని చెప్పి కాలచక్రం ద్వారా మనకి అప్పుడు వసంత నవరాత్రులు ఇచ్చారు. అందుకనే 12 గంటలకు ప్రార్థన కూడా ఇచ్చారు మనకి - త్రికాల సంధ్యలో 12 గంటల వేళ సంధ్యావందనం. ఎందుకు అత్యంత ప్రాముఖ్యత సంపాదించుకున్నదంటే సరాసరి నీకు సూర్యకిరణం సహస్రారం ద్వారా మూలాధారానికి దిగి వెళ్ళిపోతుంది. ఎవరికి? దానియందు అనుసంధానం జరిగిన వాళ్ళకి. లేకపోతే మామూలే. అబ్బో ఎండగా ఉంది అని కప్పేసుకుని తిరగడం. ఆ తర్వాత చైత్రమాసం మధ్యాహ్నం 2 గంటల వరకు. వృషభం లేక వైశాఖమాసం రెండు నుండి 4 గంటల వరకు. మిథునం లేక జ్యేష్టం 4 నుండి 6

గంటల వరకు. అప్పుడు కర్కాటకం వస్తుంది లేక ఆషాడమాసం వస్తుంది అది సాయం సంధ్య! ఆషాడమాసం 6:00 నుండి 8 గంటల వరకు. శ్రావణమాసం 8 గంటల నుండి 10 గంటల వరకు. భాద్రపద మాసం 10 గంటల నుండి 12 గంటల వరకు. కాబట్టి మనం నెమ్మదిగా అర్ధరాత్రికి దగ్గర అవుతున్నాం. ఆశ్వీయుజమాసం అర్ధరాత్రి 12 గంటల నుండి ఉత్తరార్ధం అన్నమాట. అందుకని ఆశ్వీయుజమాసం చిమ్మ చీకటి సంవత్సరానికి, కాబట్టి అమ్మవారు వెలుగుగా భావన చేసుకుని దాటి వెళ్ళాల్సిందే తప్ప, లేకపోతే ఇరుక్కుపోతావు కాల స్వభావంలో, అన్న ఉద్దేశంతో మనకి అక్కడ అమ్మవారి నవరాత్రులు పెట్టారు. ఆ తర్వాత మనం ఇంకా చీకట్లోకి వెళ్తాం. మనకి బాగా నిద్ర వచ్చేది 12 తర్వాత కదా 12:00 నుండి 2:00 గంటల వరకు ఆశ్వీయుజమాసం 2 గంటల నుండి 4 గంటలు జాగరణ చేసేవాళ్ళకి చాలా చచ్చే చావు అయ్యే సమయం, అది కాల్తీకమాసం. అప్పుడే వాడికి crisis అంటాం మనం. సంక్షోభం. ఆ! నిద్రపోతే పోలేదా అనిపిస్తూ ఉంటుంది. అయ్యో, ఇంతసేపు ఉన్నాం కదా నిద్రపోకుండా ఈ కాసేపు ఉందాంలే, అనిపిస్తూ ఉంటుంది. ఇట్లా మనని ఏడిపిస్తుంది. అంటే విపరీతమైన చీకటి అంటే ఏమిటంటే ఒక్కడే ఉన్నాడు ఇంకెవరూ లేరు 'వాడే శివుడు'. లేకపోతే 'నారాయణుడు'. వైష్ణవంగా చెప్తే నారాయణుడు. శైవం గా చెబితే పరమశివుడు. తత్వం గా చెప్తే పరబ్రహ్మతత్వం! ఉత్తపేర్లే కదా అన్నీను. అక్కడ నుండి నాలుగు గంటలకి, మనకి బ్రాహ్మీ ముహూర్తం, అదే మార్గశీర్ష మాసం. అందుకనే మార్గశీర్షమాసంలో నాలుగు గంటలకు నిద్ర లేవడం. సూర్యుడు లేవడానికి రెండు గంటల ముందే నిద్రలేచి, చక్కగా భగవద్ధ్యానాలు చేసుకుంటే మంచి స్ఫూర్తి కలుగుతుంది. మార్గశీర్షం అంటే Highway - Headway దొరుకుతుంది. అప్పుడు ప్రార్థన చేసుకున్న వాళ్ళకి దారి దొరుకుతుందని, మార్గశీర్ష మాసాన్ని సద్వినియోగం చేసుకున్న వాళ్లకి నిజమైన ఉదయం వస్తుంది ఉత్తరాయణానికి. ఉత్తరాయణం, మార్గశీర్ష ఏకాదశినాడు వైకుంఠద్వారాలు తెరుస్తారు, మనమంతా అందులోకి వెళ్ళిపోవచ్చు అని కదా. ఎవరికయ్యా అంటే ఈ సంవత్సర చక్రంలో ఉండే ద్వాదశ భావములను కాలం ద్వారా అనుభూతి చెందుతూ, అట్లా సాధన చేసుకుంటూ తనని తాను ఉద్ధరించుకున్న వాడికి. అది కూడా మళ్ళి ఉత్తే! తెలుగు ఉత్త కాదు 'ఉత్' — ఉద్ధరణ! 'ఉద్ధరేత్ ఆత్మానాత్మానాం' అన్నాడు కదా భగవద్గీతలో శ్రీకృష్ణుడు, ఆరవ అధ్యాయంలో. నీ యొక్క మనస్సు, ఇంద్రియములు, శరీరము, ఇవి ఇంద్రియార్థములు. అంటే పంచేంద్రియముల చేత మనము బయట చూసి మోజుపడి పోగేసుకునేవన్నీ ఇంద్రియార్థాలు. ఆవిడ బావుంది పెళ్ళి చేసుకుందాం, ఇహ అక్కడ నుండీ పిల్లలు, సంసారం. లేకపోతే ఇది బావుంది కొనుక్కుందాం అని తెచ్చి ఇంట్లో పెట్టుకోవడం, దాన్ని జాగ్రత్త చేయడం. ఇవన్నీ ఉంటాయి. ఐదు ఇంద్రియాల ద్వారా మనం ఇంద్రియార్థాలను కోరుతూ ఉంటాం. ఇంద్రియార్థములు, శరీరము, ఇంద్రియములు, మనస్సు ఇవన్నీ జీవుని యొక్క నీడ. జీవుడు కాదు. ఇందులోకి తను

ప్రతిబింబిస్తున్నాడు తప్ప, తానది కాదు. ప్రతిబింబించిన చంద్రుడు గాని, సూర్యుడు గాని కొంత కలతబారుతూ ఉంటారు నీళ్లు కదులుతూ ఉంటే కదా. చంద్రుడికి, సూర్యుడికి ఆకాశంలో కదలిక లేదు కదా. ఉన్నట్టుగా అనిపిస్తూ ఉంటుంది. జీవుడు కూడా మనస్సులోనూ, ఇంద్రియాల్లోనూ, ఇంద్రియార్థాలలోనూ బాగా చొచ్చుకుపోయి ఇరుక్కుపోయి ఉంటే, వాడికి అంతా కలతే జీవితం. ఆ పైన కూర్చుంటే, ఏ కలతా లేదు. దీన్ని చూసి ఓహో! ఎంత వైభవంగా ఉంది అనుకుంటాడు. మహాత్ములు దీనినే మనస్సు, పంచేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, పంచ ఇంద్రియార్థములు - ఎన్నెనాయి పదహారు. ఈ పదహారుని 16 కళలు అంటారు. ఈ పదహారే చంద్రుడు చూపించే కళలు మనకి. ఎప్పటి నుండి? అమావాస్య నుండి పౌర్ణమి అంతము వరకు. పాడ్యమి నుండి చతుర్దశి 14. అమావాస్య ముందు వేసుకుంటే, 15. పౌర్ణమి వేసుకుంటే 16. పదహారు కళలు. అమ్మవారికి 16 కళలు అంటాము — షోడశి! అట్లాగే చంద్రుడికి 16 కళలు. అలాగే షోడశ ఉపచార పూజ. అవన్నీ ఇందులో ఊరికే తమాషాగా పెట్టినవి కాదు. ఈ 16 కళలతో వైభవంగా జీవించడానికి జీవుడికి ఇదంతా ఇచ్చారు. మనస్సు, జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, ఇంద్రియార్థములందు ఆసక్తి. వెళ్ళి చూసి రమ్మని తప్ప, ఉండిపొమ్మని కాదు. ఈ 16 కళలతో కూడిన శరీరం నీకు ఇచ్చారు దాన్ని 'లింగ శరీరము' అంటారు భాగవత మార్గంలో. ఈ లింగ శరీరంలో జీవుడు తనను తాను ప్రతిబింబించుకుని, దీనిని అంతా అనుభవిస్తూ ఉంటాడు కానీ, ఇది అంతా కేవలం భగవంతుని యొక్క సృష్టే తప్ప అంత నిజమైన విషయం కాదు, తాను, తను దిగివచ్చిన మూలమైనతత్త్వము, ఇవి రెండే సత్యము అని తెలిసి ఉంటాడు. కాబట్టి మనం ఉత్తరః అన్నాం కదా. ఉత్తరత్వం అంటే ఇంద్రియాల్లోకి వెనక్కి రావాలి. ఇంద్రియాల్లోంచి కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు రెండూ ఇంద్రియార్థాల లోనే ఇమిడిపోయి ఉంటాయి. జన్మలు వెళ్ళిపోతూంటాయి తప్ప బయట తెమలదు. వీటి దారిన ఇవి వింటూ ఉంటారు కానీ, అవే కోరుకుంటూ ఉంటారు. కోరుకున్న కొద్ది ఇరుక్కుంటూ ఉంటారు. దానికి ఎప్పుడూ మనం ఒక కథ చెప్పుకుంటూ ఉంటాం. అప్పుడే ఎవరో ఒక బాణం వేసి కొడితే ఒక లేడిని, అది చచ్చింది. వేటగాడు లేడిని పట్టుకుపోయాడు. బాణం మాత్రం ఇక్కడ వదిలేశాడు. దాని కొనకేదో కొంచెం రక్తం ఉంది. ఆ రక్తం నాకడానికి ఒక తోడేలు వచ్చింది. కొంచెం భయంకరమైన జంతువు. బావుంది, రక్తం free గా దొరికిందని దానిని నాకిందిట. నాకుతూ ఉంటే అందులో నుండి ఇంకా రక్తం వచ్చిందిట, మళ్లీ నాకిందట. నాకిన కొద్దీ రక్తం వస్తోంది బాణం నుండి. ఎలా వస్తుందండి? నాలుక తెగి వచ్చిన దాని రక్తమే కదా. దాని యొక్క మొనను నాకుతున్న కొద్దీ ఇంకా రక్తం వస్తుంది. అది తన రక్తము అని తెలియక బాణం మొన నాకుతూ, నాకుతూ, నాకుతూ చచ్చిపోయిందట. ఇలా ఉంటుంది. మామూలుగా ఈ ప్రతిబింబం చెందిన జీవితాన్ని సత్యమని

కలలం బోలెడి పుత్రమిత్ర వనితాగారాది సంయోగముల్
జలవాంఛారతి నెండమావులకు నాసల్ చేయు చందంబునం
దలఁతున్ సత్యములంచుమూఢుఁడ వృధాతత్త్వజ్ఞుఁడన్

బాధ పడతాడు కదా. అప్పుడు ఇదంతా వాంఛారతి కామం దివ్యమైన విషయమే దేనికయ్యా అంటే, ధర్మపరంగా మనకి కావాల్సినవి, ధర్మసమ్మతంగా అందుకుని జీవించడం. అలా కాకుండా కామం విజృంభిస్తే ఇరుక్కుపోతాం. ఇరుక్కుపోతే అంతే! ఇంక చతికిల పడిపోతారు. స్థూల లోకంలో పుడుతూ ఉంటారు, గిలగిలలాడుతూ ఉంటారు. శరీరం వదిలినా మళ్ళీ వాటి మీద మోజు ఉండడం తో, మళ్ళీ మళ్ళీ, మళ్ళీ మళ్ళీ వాటి కోసమే వెళ్తూ ఉంటాము. కదా. ఆ hotel tiffin బావుంది కాబట్టి అక్కడికే పోతూ ఉంటాం కదా. ఒకసారి తిని వస్తాము, మళ్ళీ అక్కడికే పోతూ ఉంటాము. బెజవాడ వెళ్తే బాబాయ్ hotel- బందరు వెళితే అమావాస్య hotel ఉంటుంది. అలాగే నెల్లూరు వెళితే కోమల విలాస్ ఉంది. కొన్నాళ్ళు బెజవాడ లో Welcome hotel ఉన్నట్లు, కొన్ని కొన్ని ఊర్లలో కొన్ని కొన్ని పేర్లు ఉంటాయి. మద్రాసు వెళ్తే woodlands ఇలా. మైసూర్ వెళ్తే Das prakash. ఏంటయ్యా అంటే దీనికి సంబంధించింది అలా పట్టుకుపోతూ ఉంటుంది. అలాగే చూస్తాం ఏదో ఒకటి. ఆ చూసిందాని కోసం మళ్ళీ చూడాలి, మళ్ళీ చూడాలి అని పట్టుకుపోతోంది కదా ఇంత మొత్తాన్ని. ఇలా కళ్ళతోనో, చెవులతోనో, ముక్కుతోనో, నోటితోనో అలా ఇరుక్కుపోయిన వాళ్ళ కథలే అజామీళుడు, పురంజనుడు మనకి. ఇలా వెళ్ళిన వాడు స్థూలంలోకి ఇరుక్కుపోతాడు. ఇరుక్కుపోయిన వాడిని ఎట్లా తీసుకురావాలి ఇక్కడికి? అందుకని ఏమి చేయాలి అంటే, షోడశోపచారపూజ ఇచ్చారు. దానివల్ల పంచేంద్రియములు మళ్ళీ ఒకసారి సమీకరణం చేయబడతాయి. ఎందుకంటే ఇంద్రియాలకు ఏదో ఒక రుచి ఉంటే తప్ప అవి ప్రతిస్పందించని ఒక దుస్థితికి వచ్చేసినాయి. సరాసరి మనలోపల వెలుగుని చూడండి అన్నామనుకోండి, ఏం వెలుగు చూస్తాడు వాడు? కళ్ళు మూసుకుంటే సమస్యలే గుర్తు వస్తూ ఉంటాయి. ఏమిటో ఆయన చెప్తాడు కానీయండి నా బొంద ఏం కనిపిస్తుంది? ఆయన ఊరికే మాటిమాటికి లోపల చూడండి, వెలుగుని చూడండి, స్పందన చూడండి అంటూ ఉంటాడు ఏం కనిపిస్తుంది? స్పందన లేదు, వెలుగు లేదు. అప్పులు కనిపిస్తూ ఉంటాయి. లేకపోతే ఎవరో మనకి బాకీ పెట్టి, ఇవ్వనివాడు గుర్తు వస్తూ ఉంటాడు. అది కాకపోతే రోగాలు, ఇంట్లో సమస్యలు గుర్తుకు వస్తాయి. ఉద్యోగంలో సమస్యలు గుర్తుకు వస్తాయి. ఇవే కదా గుర్తు వస్తాయి. ఇంద్రియముల ద్వారా మనస్సుకి బాగా బయటకి వెళ్ళడం అలవాటు అయిపోయింది కాబట్టి, ఆ అలవాటైన మనస్సును లోపలికి తీసుకుని రావాలంటే ఇంద్రియాలకు రుచి అయినది పడేయాలి కదా. తెలివైన దొంగ, కుక్క అరుస్తూ ఉంటే దానికి ఒక biscuit పడేసి లోపలికి వచ్చేస్తాడు, అంతేగా. లేకపోతే అది అరుస్తూనే ఉంటుంది వీడు దొరికిపోతాడు. అలాగే ఇంద్రియాలు కూడా బయటవాటికి

అలవాటు పడ్డాయి. ముక్కుకి వాసన అలవాటు. మంచి వాసన ఉంటే సంతోషిస్తుంది. విప్పారుతుంది. చెవికి మంచి శబ్దం, తిట్లు చివాట్లు వినబుద్ధి కాదు కదా. మనం తిట్టగలం కానీ ఇంకొకరిని, ఇంకెవరైనా మనని తిడితే వినలేం కదా. కానీ శ్రావ్యమైన శబ్దం చెవికి వినడానికి ఉన్ముఖత్వం చూపిస్తుంది. చాలా దివ్యమైన, అందమైనవాటియందు ఎక్కువ ఆసక్తి కలిగి ఉంటుంది కన్ను. అలాగే కాదు వెలుగు - మీరు రాత్రి పూట రోడ్డు మీద వెళుతూ ఉంటే car లో, మీరు driving చేయకుండా పక్కన కూర్చున్నా, ఎదుటి నుండి లారీలు, పెద్ద పెద్ద బస్సులు వస్తుంటే అప్రయత్నంగా కన్ను ఆ head lights నే చూస్తుంది. కావాలంటే చూడండి ఒకసారి. అటు ఇటు తిప్పి చూద్దాం అన్నా చూడబుద్ధి కాదు. కొంచెంసేపు అయిన తర్వాత కళ్ళు నెప్పులు పుడతాయి. అబ్బా! ఏంటి ఈ traffic అనిపిస్తుంది తప్ప, కన్ను మాత్రం దాన్నే చూస్తూ ఉంటుంది. అంటే కన్ను వెలుగుకి అప్రయత్నంగా ఆకర్షింపబడుతుంది. ఎందుకంటే ఈ రెండు కనులకీ ఇక్కడ ఇంకొక కన్ను (ఆజ్ఞ లో) ఉన్నది. అది వెలుగుని దర్శించే కన్ను. దానికి ఈ రెండూ పుత్రుల లాంటివి. అందుకని అప్రయత్నంగా వెలుగును చూస్తుంది. అందాన్ని చూస్తుంది. అందాన్నిచూసిన కన్ను మిగితాది మర్చిపోతుంది. కదా. Cinema poster చూస్తూ accident చేసుకున్న వాళ్ళు లేరూ రోడ్డు మీద? ఉంటారు. అందమైనవాళ్లని చూస్తూ ఎటో, గుద్దేసిన వాళ్ళు ఉంటారు. అందమైన వాళ్లని చూడడం కోసం సినిమాకి వెళ్లే వాళ్ళు ఉంటారు. అందానికి అటువంటి ఆకర్షణ ఉన్నది. అది కంటికి ఉన్న ఆకర్షణ. నాలుక రుచి కోరుతుంది. రుచి అంటే రెండు రకాల రుచులు ఉన్నాయి. రుచికరమైన శబ్దాన్ని ఉచ్ఛరించడానికి, అది ముందు అలవాటు పడదు. రుచి కలిగిన భోజనానికి అలవాటు పడుతుంది. తర్వాత స్పర్శ జ్ఞానం మృదువైన దానిని ముట్టుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటుంది కదా. అందుకనే అందంగా ఉండే వాళ్ళని ముట్టుకుందాము అనే ఒక ఆర్తి కలుగుతూ ఉంటుంది. అది urge. చిన్నపిల్లలని, పాలు గారే బుగ్గలు ఉండే వాళ్ళని బుగ్గలు ముట్టుకుని, ముద్దులు పెట్టుకుని నానా బాధ పెడతాం కదా? మనం ముద్దుల తోను, బుగ్గలు ముట్టుకోడాలతోను, ఎందుకు అట్లా చేస్తాం? మృదువైన దానిని ముట్టుకోవడానికి స్పర్శ కోరుతూ ఉంటుంది కాబట్టి. ఇవన్నీ ఆలోచించి ఋషులు ఏం చేశారంటే ఈ ఐదిటిని పట్టాలంటే ఒకటే పద్ధతి ఐదింటికి ఒకటే పగ్గం వేయాలి. అందుకని షోడశోపచారపూజలో మృదువుగా ఉండే స్పర్శ వలన, అక్కడ నిలబడడం కోసం పూజకి సున్నితమైన పువ్వుల యొక్క స్పర్శ. ముక్కుగారికేమో సుగంధ ద్రవ్యములు అవి ఉంటే అక్కడ ఉంటుంది. లేకపోతే అక్కడ ఉండదు. ఇక్కడ సుగంధ ద్రవ్యములు వేయకపోతే పక్కన ఇంట్లో మసాలా దోశ వేస్తూ ఉంటే అవతలకి వెళ్ళిపోతూ ఉంటుంది. కాబట్టి ముక్కుని అంటే వాసన చూసే జ్ఞానేంద్రియాన్ని, అక్కడ ఉంచడం కోసం సుగంధ ద్రవ్యాలు. అందుకని చందనం, అగరవత్తులు వెలిగించుకోవడం. అలాగే నాలుకకి పని చెప్పడం కోసం స్తోత్రములు, సూక్తములు. సూక్తములు అంటే చక్కగా ఉచ్ఛరింపబడినవి.

అవి వినడం అనేది చెవికి. చూడడానికో? దివ్యమైన, అందమైన, మనోహరమైన మూర్తి ఒకటి. ఆ మూర్తికి మనం చేసే శోభాయమైన అలంకరణ, ఆభరణాలు పెట్టి, దీపాలు పెడతాం. పూజ చేస్తూ ఉన్నప్పుడు ఎన్ని దీపాలు పెట్టుకుంటే అంత బావుంటుంది. కావాలంటే చూడండి. చివరికి నాలుకకు, రుచికి, రుచికరమైన ప్రసాదము కాబట్టి ఈ విధంగా 5 ఇంద్రియాలని అక్కడ మనం సమీకరించడానికి మన పెద్దలు షోడశోపచార పూజ ఇచ్చారు. ఇది మొదటి రహస్యం. రెండో రహస్యం ఏమిటంటే ఈ 16 ఉపచారాలు ఆ 16 లింగ శరీరంలో ఉండే దివ్యతత్వాన్ని ఆకర్షించి, నీ మనస్సుని సమీకరణచేసి, వెలుగుయందు కేంద్రీకృతం చేయడం కోసం షోడశోపచార పూజ ఇచ్చారు. అయితే పూజ బాగా ఎక్కువ పెంచేసుకుంటే ఏమవుతుంది అంటే నీరసం వచ్చి, సగంలో ఇంక ఎప్పుడు అయిపోతుందా అన్నట్టుగా ఉంటుంది. 'షోడశోపచారపూజ చేసుకోవడం ఒక్కటే వెలుగులోకాలకి ప్రవేశించడానికి కలియుగంలో మానవుడికి సులభమైన మార్గం' అని చెప్పి శ్రీకృష్ణుడు భాగవతంలో ఏకాదశ స్కంధంలో చెప్పాడు. ఉద్ధవుడు అడుగుతాడు 'ధ్యానంబు ఏ క్రియన నిలుచు'నని. కలియుగంలో మానవుడికి ధ్యానం నిలవడం చాలా కష్టమని చెప్తాడు దేవుడు. ఎంతసేపటికి బయట తిరిగే తత్త్వం కలిగినవాడు అంతర్ముఖుడు అవడం అనేది అంత సులభం కాదు. చాలా ఉన్నతమైన నియమములు, నిష్టలు పాటించినవాళ్ళు, ధర్మమునందే ఎల్లకాలమునందు నిలిచి ఉండేవారికే తప్ప మిగతా వాళ్ళు అంతర్ముఖులు కాలేరు. అందుకని ప్రాథమికదశలో షోడశోపచార పూజ చేసుకోవడం చాలా ముఖ్యం. చేసుకోవడం వల్ల పంచేంద్రియములు ముందు సమన్వయించబడతాయి పంచేంద్రియములతో సమీకరణమే మనస్సు. కర్మేంద్రియాలు కూడా ఉపచారాలు చేసినప్పుడు పనిచేస్తాయి కాబట్టి ఈ విధంగా ఐదు పంచేంద్రియములు ఐదు కర్మేంద్రియములు, ఇంద్రియార్థముల నుండి విడిపడి, దివ్యమైన ఇంద్రియార్థముల యందు ఆకర్షింపబడి ఉంటాయి. అవీ అర్థములే. అగరువత్తి లేకపోతే మేం పూజ చేసుకోలేమండి అంటే, అది కూడా ముందుముందుకి limitation కదా. దీపం లేకపోతే prayer చేసుకోలేము, ప్రార్థన చేసుకోలేము అగరువత్తి లేకపోతే ప్రార్థన చేసుకోలేము, పువ్వు లేకపోతే చేసుకోలేము, ఆభరణాలు లేకపోతే చేసుకోలేము, దీపం లేకపోతే చేసుకోలేము, ప్రసాదం లేకపోతే పూజ ఏమిటండీ? ఇవన్నీ ముందు ముందుకి వెళ్ళిన తర్వాత ఉండవు. ఇవన్నీ ఎందుకు? ముందర పిల్లవాడికి chocolate ఇస్తే చదువుకుంటావా, ఇవాళ homework చేస్తే నీకు రెండు cadbury choclates ఇస్తానూ అని చెప్తామా లేదా? వాడికి ఎంతవరకు అట్లా ఇస్తావు cadbury chocolates? వాడికి home work తనంతట తాను చేసుకోవడం అనే ఒక అలవాటు అయ్యేంతవరకు. ఆ తరువాత chocolate ఇవ్వకపోయినా homework చేసుకుంటాడు. పైథాగరస్ అనే ఒక మహర్షి మన కాశీ పట్టణంలో సమస్తమైన వేదవిద్యను నేర్చుకుని, Greek దేశంవెళ్లి ఈ విజ్ఞానాన్ని అక్కడ తన

వాళ్ళందరికీ పంచాలి. ఎందుకంటే ఈ అద్భుతమైన విషయాలు తెలియవు కదా వీళ్ళకి అని ఆత్రంగా వెళితే, ఎవ్వడూ రాడు class కి. 'నాకు బోలెడు తెలుసు, మీకు చెప్తాను' అంటే, 'సరేలే తర్వాత చూద్దాం' అంటారు. ఇదేమిటి ఇట్లా ఉన్నారు మనుషులు? వీళ్ళని బాగు చేస్తే బాగుంటుంది అని, ఆయనకు తపన ఉంది. కానీ ఎవరికీ interest లేదు, శ్రద్ధ లేదు. ఇది కాదు పద్ధతి అని ఏం చేశాడంటే, ఊర్లో కొంతమంది గోళీకాయలు ఆడుకునే వాళ్లని ఒక 15 మందిని పోగేసి, 'నేను tiffin తినడానికి డబ్బులు ఇస్తాను. లేకపోతే tiffen నేనే చేసి పెడతాను. అయితే దానికి ఒక condition ఉంది. ఏమిటంటే ఒక గంట సేపు నేను ఏదో ఒకటి చెప్తాను అది మీరు వినాలి' అని చెప్తాడు. బావుంది! Tiffin పెడతాను అంటున్నాడు గంటసేపు ఏం చెప్తే మనకేంటిలే, అని ఒక 15 మంది పిల్లలు చేర్తారు. వాళ్ళే రేపు 'tiffin వాళ్లే పెడుతున్నారు రండిరా', అని ఇంకో పాతికమందిని పోగేసుకొస్తారు. మొత్తం 40 మంది అవుతారు. ఆ! బాగుంది అనుకున్నాడు ఆయన. 40 మందికి ఇంటావిడ tiffin చేసి పెడుతూ ఉంటే ఈయన పాఠాలు చెప్తాడు. ఒక నెల రోజులు అయ్యేసరికి, వాళ్లకి ఈయన చెప్పేవి దివ్యమైన విషయాలు కాబట్టి ఆకర్షింపబడుతున్నారని తెలిసి ఏం చేస్తాడంటే, 'ఆవిడకి కొద్దిగా నీరసంగా ఉందిరా మొత్తం tiffin చేయలేదు సగం చేస్తుంది' అన్నాడు. సగం tiffin పెడతాడు. 'ఫర్వాలేదు గురువుగారూ, సగం tiffin కి మేము ఎలాగో అలా adjust అయిపోతాం' అంటారు. ఇంకొక నెల అయిన తర్వాత 'ఆవిడకి బొత్తిగా ఒంట్లో బాలేదు పావు tiffin మీకు', అంటే 'సరే సార్,' అంటారు. ఇంకొక నెల అయిన తర్వాత 'tiffin పెట్టడానికి వీల్లేదురా అందరికీ తలా ఒక రూపాయి ఇస్తాను ఏదైనా బయట కొనుక్కు తినండి' అంటారు. ఇంకా కొన్ని రోజులు అయిన తర్వాత 'అర్ధ రూపాయి ఇస్తాను' అంటాడు. ఇంకొక నెల అయిన తరువాత 'పావలా' అంటాడు. ఇంకొక నెల అయిన తర్వాత 'నేనేమీ ఇవ్వను' అంటాడు. 'మీకు ఇష్టం వుంటే వినండి, లేకపోతే వెళ్ళిపొండి' అని చెప్తే, 'అమ్మమ్మ! అలా కాదు సార్! మీరు చెబితే చాలు కావాలంటే మేమే ఇస్తాము' అంటారు. వాళ్ళను అలా పట్టుకొస్తాడు. ఆ విధంగా మనం ఇంద్రియాలకు నేర్పాలి. పైథాగరస్ సామాన్యుడు కాదు. మన ఋషులలో దేవాపి మహర్షి శంతనుడికి అగ్రజుడు. ఆయనే మళ్లీ పునర్జన్మ ఎత్తి, గ్రీకు దేశంలో వేదవిద్యను మళ్లీ పంచినవాడు. వీళ్ళందరూ చిరంజీవులు. మనం పెట్టుకున్నామే దేవాపి మహర్షి యొక్క ఫోటో, ఆయనే ఈ పైథాగరస్! సమస్తమైన త్రయీ విద్య ఆ దేశానికి ఇచ్చి, Holy Thrinosophia అన్నాడు. Sophia అంటే wisdom అని అర్థం. Thrino అంటే 3 అని. Wisdom అంటే విద్య. త్రయీ విద్య. Thrinosophia అని పెట్టాడు మొత్తం త్రయీవిద్య అంతా అక్కడ ఇచ్చేసాడు. ఇవాల్టికి కూడా పైథాగరస్ అంటే పడిచస్తారు western world లో. ఆయన ఏమిటి చేశాడు? రుచి చూపించాడు, నెమ్మదిగా రుచి తగ్గించుకుంటూ అసలు విషయంలోకి పెట్టాడు. అందుకనే ప్రసాదం కోసం భక్తులు వచ్చినా కూడా రానీయమని, అన్నారు. పూజల్లో

ఇవాళ ప్రసాదం ఏంటండి? అంటూ ముందు పూజలో ప్రసాదం చూసుకుని వస్తూ ఉంటారు కదా. ప్రసాదం నుండి మొదలై, అన్ని ఇంద్రియాలు అక్కడ చేరిన తర్వాత స్తోత్రములయందు రుచి మరిగి, లోపల దానియందు ఒక అభ్యాసము చేత దానికి కట్టుబడి ఉన్నప్పుడు, నెమ్మదిగా ఇవన్నీ అంతర్యాగం, షోడశోపచారపూజ మానసికంగా చేసుకో, అన్నారు. ముందు భౌతికంగా చేసుకో. ఆ తరువాత నీకు లోపల మూర్తి నిలబడినదనుకో, కళ్ళు మూసుకుంటే నువ్వు ఇంతసేపు బయట చూసింది లోపల ఒక క్షణమైనా కనిపిస్తుంది. ఎంతసేపు అంటే వాడి మనస్సుకి ఉన్న స్థిరత్వం బట్టి అంతసేపు. అలా నువ్వు చూసే మూర్తి ఓపిక కొద్దీ బంగారమో, వెండో, పంచలోహాలో పెట్టుకుంటారు కదా. దాన్ని లోపల దర్శనం చేసినప్పుడు ఏం జరిగింది నీకు? దాని యొక్క సూక్ష్మరూపం లోపల చూసారు తప్ప, అంత పెద్ద కంచు విగ్రహం నీలోపల ఉంటే నువ్వు గుండెలు బరువెక్కి చస్తావు కదా. నీకు మూర్తి దర్శనం లోపల అవుతోంది కదా. ఈ మూర్తిని బహిర్గతంగా దానిమీద ఏకాగ్రతతో మనస్సు, ఇంద్రియములు కలిపి నువ్వు నిమగ్నం చేసి పూజ చేయడం వల్ల కనులు మూసుకుంటే నువ్వు ఏ సీతారాములను, ఏ బలరామకృష్ణులను, ఏ గురువు యొక్క ముఖాన్ని, ఏ హనుమంతుని బొమ్మను ప్రార్ధన చేశావో అదే లోపల కనిపిస్తుంది మళ్లీ. ఇంకొకళ్ళ ఇంట్లో హనుమంతుడు నీకు కనిపించడు కదా. అంటే ఏమైంది? నీ మనస్సు దానికి అభ్యాసపడ్డది. కనులు మూసుకోగానే అది కనిపిస్తూ ఉంటుంది అంటే జరిగిందేంటి? భౌతికము, పదార్థం అయిన రూపం ఏదైతే ఉందో, దానిలో నుండి పదార్థం పోయింది. దాని వెలుగు మాత్రం నీకు లోపలికి వచ్చింది. మంచి పంచలోహాల కృష్ణుడి విగ్రహం పెట్టుకుని, దీపాలు పెట్టుకుని ప్రార్థన బాగా చేసుకుంటున్నాం అనుకోండి, కళ్ళు మూసుకుంటే అలా వెలుగుతున్న పంచలోహాల యొక్క రూపం బంగారంతో కూడినది లోపల కనిపిస్తుంది అంటే హిరణ్మయమైన దర్శనం నీ లోపల జరగడం మొదలుపెట్టింది. ఇంక నీకు బయట బంగారంతో సంబంధం లేదు, లోపల బంగారం దొరికింది. అదీ ఉత్తరముఖంగా వెళ్లడం అంటే అర్థం. ఇలా ఇచ్చారు మన పెద్దలు. ఇచ్చి ఇలా నువ్వు ఉత్తర ముఖంగా వెళ్తే నీది ఉందే, నీది కూడా అంతే కదా. ఆ (భగవంతుని మూర్తి) రూపం సంగతి ఏంటో నీ రూపం సంగతి కూడా అదే. రక్తమాంసాలతో ఉన్న ఈ రూపానికి లోపల, ఇదే రకంగా వెలుగుతో కూడిన శరీరం బంగారం రంగులో దర్శనం చేసుకోవచ్చు. ఎప్పుడు? ఇలా లోపల బంగారం రంగుతో నువ్వు ఒక దివ్యమైన మూర్తి దర్శనం చేయడం అనే ఒక అభ్యాసం మనస్సుకి చేసినప్పుడు. ఆ తర్వాత నీ రూపం నువ్వు 'స్వస్వరూప సంధానం' అంటారు, అది జరుగుతుంది. అక్కడి నుండి హృదయమునందు బంగారు రంగులో కనిపించే రూపం క్రమశః మనం సాధనలో బాగా ఎక్కువ శ్రద్ధాభక్తులు కలిగి ముందుకు వెళుతూ ఉంటే అది ఊర్ధ్వముఖం,గా వెళ్లి భ్రూమధ్యంలో వజ్రం రూపంలో గోచరిస్తూ ఉంటుంది. అది వెలుగు రూపం! అంటే నీ వెలుగు శరీరం, నీ బంగారు శరీరం, నీ

కనబడుతున్న శరీరం మూడు శరీరాలు ఉన్నాయి. ఇక్కడ మూడు శరీరాలు నీకు నీలో ఏర్పడినప్పుడు ఎప్పుడైతే బంగారు శరీరం ఉందని తెలిసిందో, ఇంక ఈ శరీరం 'ఆ! పోతే పోయింది లే,' అన్నట్టుగా ఉంటుంది. ఆ శరీరంతో నువ్వు అన్ని చోట్లా తిరగవచ్చు. అంతకన్నా ఉత్తమమైన శరీరంతో మిగతా గ్రహగోళాదుల్లో కూడా తిరగవచ్చు. మహాత్ములందరూ కూడా అలా తిరుగుతారు. కుజగ్రహానికి వెళ్ళివచ్చిన, బుధగ్రహానికి వెళ్లి వచ్చిన వాళ్ళ కథలు మనకి ఉంటాయే, ఎట్లా వెళతారు? ఈ శరీరంతో ఎక్కడికీ పోలేరు. ఆ శరీరంతో వెళ్లగలరు. ఉత్తరముఖంగా వెళ్లడం అంటే ఇది. ఇలా ఒక్కొక్కదానిలోంచి, ఒక్కొక్క దానిలోంచి వెళుతూ ఉంటే ఇప్పుడు ఉన్న భౌతికమైన శరీరానికి ప్రాణమయ శరీరం ఉత్తరంలో ఉంది. ప్రాణమయ శరీరం కన్నా ఉత్తరంలో మనకి మనోమయ శరీరం ఉంది. మనోమయం అనేసరికి పంచభూతాలు దాటి వెళ్లిపోయావు. కానీ నువ్వు ఉన్నావని తెలుస్తోంది. అంటే ఏమిటి? పదార్థం దాటావు, జలం, అగ్ని, వాయువు, ఆకాశం దాటేశావ్, అప్పుడు నువ్వు మనస్సుగా ఇంకా ఉన్నావ్, అంటే ఇంక ఏమీ లేదు, నువ్వు ఉన్నావని నీకు తెలిసింది. అక్కడి నుండి బుద్ధిలోకం ఉత్తరం. బుద్ధిలోకం నుండి జీవలోకం. అంటే జీవుడుగా నీ యొక్క వెలుగే నీ బుద్ధి. ప్రతివాడికి వాడి వెలుగే వాడి బుద్ధి గా పనిచేస్తూ ఉంటుంది. సూర్యుడు బుద్ధిని వైవస్వతమనువు అన్నారు. సూర్యుడు వివస్వతుడు అన్నారు కదా. వివస్వతుడు అంటే అల్లిక చేసేవాడు. జీవుడు కూడా అల్లిక చేసేవాడే, తెగ అల్లుతారు కదా జీవితం. విపరీతంగా అల్లి, చాలా చిక్కుముడులు పడ్డ తర్వాత అప్పుడు కుయ్యో-మొర్రో అంటాడు. అంతవరకు అల్లుతూనే ఉంటాడు ఆ జీవుడు. వాడి స్వభావం అది. సూర్యుడు అలా అల్లడం వల్లే ఈ గోళాలు వచ్చినాయి, గోళాల మీద జనాలు వచ్చారు. వీళ్ళందరూ సంసారం అంతా ఈదలేక ఇలా బాధ పడుతున్నారు. ఆయన బాధలు ఏంటో మనకు తెలియదు కదా. 'సర్లేరా! నా బాధలు నాకున్నాయ్', అంటాడు ఆయన. వైవస్వతుడు సూర్యుడు యొక్క వెలుగు. అక్కడి నుండి వైవస్వతుడి యొక్క పుత్రుడు ఇక్ష్వాకు! మనస్సు! అందుకని ఇక్ష్వాకు భూమికి రాజు, ఇక్ష్వాకు చక్రవర్తి కదా. 'ఇక్ష్వాకు కుల తిలకా' అని ఇక్ష్వాకు వంశం మొదట సూర్యవంశం. తర్వాత చంద్రవంశం. భూమికి రాజు అంటే శరీరమునకు రాజు. శరీరమునకు ఎవరు రాజండి? మనస్సు! కాబట్టి భూమి శరీరం అయితే, ఇక్ష్వాకు మనస్సు అయితే, వైవస్వతుమనువు బుద్ధి అయితే, సూర్యుడు మనం. ఇది మొత్తం భగవద్గీతలో శ్రీకృష్ణుడు

ఇమం వివస్వతే యోగం ప్రోక్త వాన్ అహమవ్యయం,
వివస్వాన్ మనవే ప్రాః మనురిక్ష్వాకవేబ్రవీత్

అని చెప్పాడు. నేను వివస్వతుడికి చెప్పాను అన్నాడు. నేనెవరు? జీవుడికన్నా పైవాడు అన్నమాట. నేను సూర్యుడు కదా, నా బుద్ధి వైవస్వతుడు, నా మనస్సు ఇక్ష్వాకు, నా శరీరం భూమి. ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటి, ఒకదాని తర్వాత ఒకటి ఉత్తర ముఖం.

కృష్ణుడు 'నేనే అసలు సూర్యుడికి చెప్పాను' అంటాడు. కాబట్టి నీకు ఇంకోడు ఉన్నాడు మొగుడు. వాడు నీకన్నా ఉత్తరంగా ఉంటాడు. వాడు అందరికీ మొగుడు. వాడినే దేవుడు అంటాము. వాడు తెలియాలంటే భౌతికంగా మనం గుండ్రాయి లాగా ఉంటే తెలియదు. ఈ గుండ్రాయి స్థితి నుండి సూక్ష్మమైన రాయి అవ్వాలి. అక్కడి నుండి హిరణ్మయమైన రంగులోకి వెళ్ళాలి. అక్కడి నుండి వజ్రపు రంగు, వజ్రపు శరీరమూ. పూజ అంతా చేసేసి 'వజ్ర శరీర ప్రాప్తిరస్తు' అంటారు బ్రాహ్మడు. విషయం correct. వజ్రపు శరీరము నుండి బంగారు శరీరం, బంగారు శరీరం నుండి భౌతిక శరీరం నీకు సహజంగా ఉంటే, ఇవి కాకుండా ఒక నీడ శరీరం ఉంది. అది లింగ శరీరం. మహాత్ముల విషయంలో లింగ శరీరం దగ్ధం అయిపోతుంది. అంటే ఏమిటి? బయట ఎంత విలువైన విషయమైనా కూడా వారికి అంత విలువైనది కాదు అని. మామూలుగా బయట ప్రపంచంలో అధికారుల విలువలు, పదవుల్లో ఉండే రాజకీయ నాయకుల విలువలు, డబ్బున్న వాళ్ల విలువలు కదా, విలువలు అంటే! ఇతడికి అవేవీ విలువలు కాదు. ఇతడికి ఒకటే విలువ. అందుకని (పై) వాడిని నమ్ముకుని, మిగతావన్నీ పామ్మనే వారు మహాత్ములలో కనిపిస్తారు. పోతన అదే కదా. భాగవతమార్గం లో పెద్దవాళ్ళందరికీ కూడా ఏదీ విలువ కాదు. అది ఒక్కటే విలువ. 'తోలు ఒలిచేస్తారుట అంటే, ఇంకొకటి ఉంది లోపల అంటాడు. తోలు ఒలిచేస్తే బంగారం ఉందయ్యా, బంగారం ఒలిచేస్తే వజ్రం ఉందయ్యా, వజ్రం ఒలి చేస్తే నేను ఉన్నానయ్యా, నన్ను కూడా ఒలి చేస్తానంటే వాడు అయిపోతానయ్యా', అన్నట్టుగా ఉంటారు. అందుకని వారూ ధీరులు! ఇన్ని పొరల్లో ఇతడు కొట్టుకుంటూ ముందుకు వెళ్తూ ఉంటే 'ఉత్తర దిశగా మహాత్ములు ప్రయాణం చేసి వెళ్లారు' అంటే అర్థం ఇది. దక్షిణ దిశగా వెళ్ళాడు అంటే మనకి దక్షిణాన ఏం పెట్టారు? యమలోకం పెట్టారు. 'దక్షిణ దిక్కు కూర్చుని భోజనం చేయకండి' అని పెట్టారు. మన వాళ్ళకి చచ్చిపోతామని భయం. యముడు వస్తాడని. చచ్చిపోయిన వారిని ఎటువైపు ముందు పడుకోబెడతారు? ఉత్తరం వైపు. మనని కూడా దక్షిణం వైపు చూస్తూ పడుకోవద్దు అని, ఉత్తరం తల ఉంచి పడుకోబోకండి, అని ఎందుకు చెప్పారు? దక్షిణం వైపు చూస్తుంటే వాడు వచ్చి తీసుకువెళ్లిపోతాడని. అట్లా ఏమీ రాడు. యమధర్మరాజు ధర్మ స్వరూపుడు. తన ధర్మం ప్రకారమే వస్తాడు. అందుకని దక్షిణం వైపు వెళ్లడం అంటే కూరుకుపోవడం. పడమర వెళ్లడం అంటే కూరుకుపోవడం. ఉత్తరం వెళ్ళడం అంటే ఎదగడం, తూర్పు వెళ్ళడం అంటే వెలుగులోకి వెళ్లడం. అందుకని సాధన చేసేవాళ్లు ముందు తూర్పుగా కూర్చుని సాధన చేసుకుని, సాధనలో ఉత్తమ గతులు దొరికిన తర్వాత ఉత్తరం వైపు తిరగాలి. వెలుగు దర్శనం అయిన వాళ్ళు 'ఈ వెలుగుకి పుట్టుక స్థానం ఏది' అని ప్రశ్న వేసుకుంటారు. వారికి ఉత్తరం లెఖ్క. అసలు వెలుగే తెలియనివాడు ఉత్తరం తిరిగితే ఏమీ ఉండదు. మళ్లీ తిరుగు టపాలో వచ్చేయడమే వెనక్కి ఉత్తరమల్లే. (ఈ ఉత్తరం తెలుగులో ఉత్తరం సుమండీ) ఇలా సూక్ష్మలోకాల్లోకి

వెళ్లాలండి. వెళ్లాలంటే షోడశోపచార పూజ తప్పదండీ. ఆ తరువాత అది మానసికంగా చేసుకోవడం తప్పదండీ. మనస్సుకి ఒక స్థిరత్వం వచ్చిన తర్వాత, అప్పుడు శ్వాస మీద మనస్సు పెట్టడం అనేది చేయాలండి. శ్వాసని పట్టుకుని లోపలికి వెళ్ళాలండి. లోపలికి వెళ్లి స్పందన దగ్గరికి చేరాలండి. అక్కడండి దర్శనాలు. ఇలా ఉంటాయి. ఇట్లా దాటి దాటి, మనం దాటి దాటి అంటే ఎక్కడో ఉన్నాడని అనుకుంటాము, లేడు ఇక్కడే ఉన్నాడు అది తమాషా. దూరం ఏం లేదు. మనకి concept ఏంటంటే దేవుడు ఎక్కడో వైకుంఠంలో ఉన్నాడనే ఒక distance concept పెట్టుకుంటాం. అదేమీ లేదు. No distance. It is as proximate to you as anything. I am most proximate than anything. అంటే మనకి ఖనిజాల నుండి వృక్షాల్లోకి, వృక్షాల్లో నుండి జంతువులలోకి, జంతువులలో నుండి మనిషిలోకి, మనిషిలో నుండి దేవతల్లోకి ఇట్లా classes ఉన్నాయి కదా. ఎక్కడా పోవక్కర్లేదు. సరాసరి అంతర్యామి అయిన భగవంతుడు అన్నిటియందు అక్కడే ఉన్నాడు కాబట్టి దూరం లేదు దగ్గరే. అందుకనే ఒక చక్కని ఉపనిషత్తు లాంటి కథ US నుండి ఒకాయన ఇచ్చాడు. చాలా అద్భుతంగా ఉంటుంది. ఆనందం వేస్తుంది. నిజంగా తెలిసిన వాళ్ళు చూస్తే ఆయనకు దండం పెట్టుకోవాలి. పాశ్చాత్యుడు కాబట్టి మనకన్నా తక్కువ తెలుసు, అనుకోకూడదు. అందులో ఆయన పుస్తకం పేరు ఏంటంటే There is no such thing as far away. దూరం అనేది ఏమీ లేదు. అందులో ఒక పిల్ల పిట్ట తల్లి పిట్టని అడుగుతుంది 'నా స్నేహితుడి పుట్టినరోజు అమ్మా నేను వెళ్తాను,' అని. అంటే 'పుట్టినరోజు ఏమిటి? అని అడుగుతుంది. అంటే పుట్టడం ఏమిటి? పుట్టడం అనేది ఏమీ లేదు. నువ్వు పుట్టావు అనుకుంటే పుట్టావు తప్ప, నువ్వు ఎప్పుడూ ఉంటావు. పుట్టాను అనుకున్న వాడికే చావు తప్ప, ఎప్పుడూ ఉండే వాడికి చావేది? శాశ్వతుడికి చావేమిటండీ? పుట్టాను అనుకున్న వాడికి చావు. నిద్రపోని వాడికి మేలుకోవడం ఏమిటి చెప్పండి? నిద్రపోలేదు రాత్రంతా, 'పొద్దున ఐదింటికి లేచావా?' అంటే 'లేచావా ఏమిటి? నేను లేచే ఉన్నాను' అంటావు కదా. ఎప్పుడూ లేచే ఉన్నవాడికి నిద్రపోవడం లేనప్పుడు వాడికి లేవడం లేదు కదా. 'పుట్టుకే లేని వాడికి చావే లేదు కదా' అని ఒక మాట అడుగుతుంది. ఆ తర్వాత అర్థం చేసుకుని పిల్ల పిట్ట అవునంటుంది. 'మరి స్నేహితుడి దగ్గరికి వెళ్ళడం ఏమిటి?' అంటుంది. వెళ్ళడానికి వాడు సన్నిహితుడే, స్నేహితుడు అంటే. సన్నిహిత్వం అంటే ఏమిటంటే మనయందు సన్నిధానం చేసినవాడు. స్నేహితుడు The only friend is God అని మనకి ఒకటి ఉంది. మైత్రేయుడన్నదాంట్లో స్నేహితుడు అన్నదానిలో అర్థం. భక్తి యోగంలో మొట్టమొదట భక్తుడికి ఉండాల్సిన గుణం ఏమిటి అంటే 'మైత్రి' అన్నాడు. ఆ తరువాత కరుణ. కాబట్టి నీతోనే ఎప్పుడూ ఉండేవాడికన్నా నీకింక స్నేహితుడు ఎవరు? వాడు ఉండబట్టే కదా నువ్వు ఉన్నావ్? వాడు లేకపోతే నువ్వు లేవు కదా కాబట్టి he is the first friend that should be remembered. నీ best friend ఎవరండీ? అంటే 'నా లోపల, నాలాగా ఉండి, నా అస్తిత్వానికి కారకుడైన భగవంతుడే' అని చెప్పినవాడు

తెలిసినవాడు. 'Friend అంటే ఏమిటి? అని అడుగుతుంది. ఆ Friend దగ్గరికి వెళ్లడం ఏమిటి నీలోపలే ఉన్నాడు కదా. అసలు వాడే నువ్వుగా ఉన్నాడు కదా? వాడు సముద్రం అయితే నువ్వు అల. వాడు లేకపోతే నువ్వు లేవు. వాడే నీలాగ ఉన్నాడు కాబట్టి వాడే స్నేహితుడు'. ఇలా చెప్తుంది. ఎంత బాగా చెప్పారు. మొత్తం పుస్తకం అంతా కూడా మూడే వాక్యాలు ఉంటాయి. మొత్తం పుస్తకం అననుగాని, వేసి ఇచ్చేశాడు. ఉత్తమ లోకాల్లోకి వెళ్లడం అంటే ఇలా అంతర్ముఖుడై, ఇంద్రియార్థముల నుండి విడిపడి, ఇంద్రియముల నుండి విడిపడి, మనస్సు బుద్ధియందు లగ్నం అగుట చేత నిజమైన రుచి తెలిసి, బయట విషయమునందు ఆసక్తి తగ్గిపోతుంది. బయట విషయములు వాటంతట అవి రాలిపోవడం సన్యసించడం తప్ప అవి వదిలించుకోవడం సన్యాసం కాదు. అందుకని 'సన్యాసం వచ్చేది తప్ప, పుచ్చుకునేది కాదు' అని EK మాస్టారుగారు చెప్పేవారు. చూడండి ఆకు రాలిపోయే కాలంలో చెట్టుకి ఆకులు రాలిపోతాయి. చెట్టు బోడి అయిపోతుంది. మళ్ళీ చిగురు వస్తూ ఉంటుంది. పువ్వులు వస్తాయి, మళ్ళీ బోడి అయిపోతూ ఉంటుంది కదా. బోడి అయిపోతున్నప్పుడల్లా మళ్ళీ చిగురు వస్తూ వుంటుంది అనేది దానిని చూస్తే మనకి తెలుస్తూ ఉంటుంది. కాబట్టి ఇవన్నీ అస్తిత్వం కారణంగా జరుగుతున్నాయి కదా. ఆ విధంగా రాలిపోయి, తను తనకి తెలిసే పద్ధతి వరకు వెళ్లి, జీవుడు దేవుడి సన్నిధానం చేరుకున్నాడనే వరకు కూడా ఇలా ఉత్తరంగా కథ నడుస్తూ ఉంటుంది. ఎంత వరకూ ఉత్తరం అండీ అంటే త్రిమూర్తులకు కూడా ఇంకా ఉత్తరం ఉంది. త్రిమూర్తులు అందర్నీ సమీకరిస్తే వెలుగు అవుతారు. వారి ముగ్గురిని సమీకరించే కదా దుర్గని పుట్టించారు. లేక పరాశక్తి అనండి. ఆ వెలుగు కూడా ఒక చోటు నుండి పుట్టుకొచ్చిన వెలుగే. కాబట్టి దానికి ఉత్తరం. ఇంక వాడి సంగతి ఏం చెప్తాం. అందరికీ ఉత్తరుడే! బ్రహ్మకి వాడు ఉత్తరుడే. దిగివచ్చిన ప్రతిదానికి ఉత్తరుడే అందుకని ఉత్తరః అని ఇచ్చారు. ఇది ఒక అవగాహన. మనం కూడా కేవలం అంతర్ముఖ సాధన ద్వారానే ఉత్తరుడు అయిన భగవంతుడి యొక్క అనుభూతి పొందుతూ ఉండవచ్చు. స్థూలమునందే ఇరుక్కుని ఉంటే వీలుపడదు.

## 513 గోపతిః

గోపతి అంటే గోవులకు పతి. గోలోకం అంటే ఏడు లోకములకు అవతల ఉండే లోకం. అక్కడి నుండి ఆయన దిగి వచ్చాడు. అందుకని ఆవులని పరిపాలించాడు. ఆవులలో ఆ గోలోకానికి సంబంధించిన తత్త్వం అందులో ఉంది. అందుకే దానికి ఆ పవిత్రత. ఏడు లోకాల అవతల 8వ లోకానికి సంబంధించిన తత్త్వం ఒకటి ఉంది. ఈ మధ్యనే America లో ఈ వేద ఋషులు కానీ, భారతీయులు కానీ ఆవులకి ఎందుకు ఇంత importance ఇస్తారు, అని పూర్తిగా భస్మం చేసి చూస్తే, అతీతమైన ఏదో ఒక element అందులో కనిపించిందిట. అందుకే వీళ్ళు దాని గురించి తాపత్రయ పడుతూ ఉంటారు, అని మేము వెళ్ళినప్పుడు Miami లో ఒకళ్ళు చెప్పారు. బావుంది అనుకున్నాం. మనవాళ్ళు ఏం చెప్పారు అంటే ఏడు లోకాలకే అతీతమైన ఒకతత్త్వం అందులో ఉంది అని. అందుకని గోవుని పూజ చేసుకోమన్నారు, గోవు కన్నులలోకి చూడమన్నారు. గోవు తోకని ముట్టుకోమన్నారు. గోవు ని చూసి బయలుదేరిన వాడికి భగవంతుడ్ని చూసి బయలుదేరినట్లు లెఖ్ఖ. ఎంకంటే ఏడు లోకాల అవతలి ఉండేవాడు సరాసరి దర్శనం ఇస్తాడని. అలాగే మనం భూమిని దున్నించేటప్పుడు మొదట గోపాదం పెట్టించుకోవడం అనేది ఒకటి ఉన్నది. 'గోపాదం పెట్టిన తర్వాతే భూమి దున్నుతామని' అంటే అర్థమేమిటో తెలుసా? గోపాదం అంటే కిరణం అని కూడా అర్థం ఉంది. సూర్యుడి కిరణాలు బాగా పడి భూమి పదును ఎక్కిన తర్వాత దున్నితే, ఆ తర్వాత వర్షాలు పడ్డప్పుడు అది సారవంతం అవుతుంది. ఎండాకాలం పూర్తి అవుతున్న సమయంలో దున్ని, వర్షాకాలానికి శుభ్రంగా ready చేసేసి ఉంచుతారు. వర్షం పడంగానే భూమి సారవంతం అవుతుంది. అప్పుడు భూమిలో నుండి ఒక రకమైన అగ్ని పుడుతుంది. కొత్తగా వర్షం పడినప్పుడు చూడండి భూమిలో నుండి ఒక విధమైన వేడి రాదూ? Latent heat. అదే సారవంతాన్ని ఇస్తుంది. మనలో కూడా వేడి ఉండడం వల్ల తిన్నవన్నీ అరుగుతూ ఉంటాయి. భూమి లోపల వేడిగా ఉంటుంది కాబట్టి, భూమి మీద సూర్యుడి కిరణాలు బాగా పడినప్పుడు గోవు భూమి మీద నడుస్తోంది అని అర్థం. గోపతి నడుస్తున్నాడు అని. ఎవరు గోపతి? వాడు! గోపతి అంటే ఇంకొక అర్థం ఉంది. గోవులకి భర్త ఎవరు? ఎద్దు కదా. చూడండి సంస్కృతంలో. సంస్కృతానికి మించిన భాష లేదు. ఎద్దు మనకి ద్వాదశ రాశుల్లో ఏ రాశిలో తగులుతుంది? వృషభరాశి! వృషభరాశి అంటే ఏ మాసం? వైశాఖమాసం! వైశాఖమాసంలో ఎండలు ఎట్లా ఉంటాయి? డొక్క చింపేస్తాయి. మన గ్రీష్మమంతా కూడా వైశాఖంలో బాగా చూసేస్తూ ఉంటాం. కాబట్టి అప్పుడు పడే కిరణాలని 'గోపతి' అంటారు. వృషభరాశిలో చంద్రుడు ఉన్నప్పుడు, భూమి మీదకి వచ్చే కిరణములు గోపతి అని ఒక అవగాహన ఉన్నది. అది ఆధ్యాత్మికపరమైన

జ్యోతిష్యపరంగా తెలిసిన రహస్యం. మామూలుగా గోపతి అంటే గోవులకు పతి గోపాలుడు అని, కృష్ణుడు అని. ఇవన్నీ ఉన్నాయి. అవి అలా ఉండగా ఇది ఒకటి ఉంది. గోపతి అంటే నందీశ్వరుడు అన్నమాట. వృషభరాశి. వృషభం అంటే మళ్ళీ వేదంలో చాలా ఉన్నది. ఏమిటి వృషభం? ఉచ్చారణ! వాక్కు యొక్క ఉచ్చారణ. మాట్లాడేదే మనకి కనిపిస్తోంది. మాట్లాడేదానికి ముందు భాషాపరంగా మన లోపల వాక్యం ఉంది. భాషగా ఉండకముందు భావంగా ఉంది. భావంగా ఉండకముందు సంకల్పంగా ఉంది. సంకల్పంగా ఉండకముందు నీలో నీలాగా ఉంది. ఇన్ని రకాలుగా ఇది ఉందే, మనం వీటిని చూస్తున్నామా? మాట్లాడిందే చూస్తాం. మాట్లాడకముందు? మాట్లాడక ముందు నీలో భావన చూస్తే telepathy అంటాం. 'సూక్ష్మ శ్రవణం' అంటాం. మాట్లాడక్కర్లేదు కొంతమంది అవతలవాడు మాట్లాడకుండానే వాళ్ళు ఏమనుకుంటున్నారో వీళ్ళు వినగలరు. వాడిలో భావం ఉంటుంది కదా, భావననే వినేస్తారు. శబ్దభేది! అదొక విద్య. పూర్తిగా వినక్కర్లేదు. తెలిసిపోతుంది. ఎట్లా తెలిసింది మాట్లాడకుండానే? భావం చదవగలడు కాబట్టి. కాబట్టి ఉచ్చరించిన భాష 'వైఖరి'. ఉచ్చరించని భాష 'మధ్యమ'. భావం 'పశ్యంతి' - అంటే అప్పుడే దిగి వచ్చింది కాబట్టి 'పశ్యంతి'. దర్శనం చేశాం మన భావం మనం. అంతకుముందు 'పరా' అంటే beyond. ఇలా మనకి తెలియని చోటు నుండి సంకల్పం లాగా మనలోకి వచ్చి, మనకి దాని చేత భావాన్ని కలిగింపజేసి, ఆ భావన చేత మనని నడిపించదా, నడిపిస్తుందా? తిరుపతి వెళదాం అనే భావన వచ్చిందనుకోండి అంతకు ముందర ఉండదు అప్పుడు పుడుతుంది. వెళ్లొచ్చేంత వరకు తిప్పేస్తుంది ఆ భావం. తిప్పుతుందా, లేదా? అదే వృషభం. వృషభానికి ఎవరు అధిపతి? ఎవరికి వాహనం? మూలతత్త్వానికి వాహనం. మనలో వచ్చే ప్రతి సంకల్పం కూడా వాక్కు అని గుర్తుపెట్టుకోండి. అలా దిగి వస్తూనే ఉంటుంది, సరస్వతీ ప్రవాహం లాగ. ఒకదాని తర్వాత ఒకటి, ఒకదాని తర్వాత ఒకటి వచ్చి అలా పట్టుకుపోతూ ఉంటుంది. ఇవాళిది, రేపది, చూసిన విషయాలు, విన్నవి, అనుభూతి చెందినవి, వాటి గురించి నిన్ను పరిగెత్తించేటట్లు గా నీలో సంకల్పాలు ఊరుతూనే ఉంటాయి కదా? ఎందుకమ్మా ఇంత ఊరతావు? అని మనల్ని మనం లోపల అడగాలి. 'సహ్యా సన్న్యస్త సంకల్పో యోగీ భవతి' అని అంటాడు పరమాత్ముడు. అంటే ఎవరయ్యా యోగి అంటే 'సంకల్పాలని సన్యసించిన వాడు యోగి' అంటాడు. సంకల్పాలు మనలో ఊరుతున్నాయనుకోండి నువ్వు సంసారివి. యోగి ఎట్లా అవుతావు? యోగి అవ్వలేవు. యోగి ఎప్పుడు అవుతావు? నీలో కేవలం దివ్యత్వమునకు సంబంధించిన సాన్నిధ్యము యొక్క అనుభూతి తప్ప ప్రత్యేకమైన సంకల్పములు లేక, దివ్యసంకల్పం మేరకే ప్రవర్తిస్తూ ఉండేవాడు యోగి. Father Thy Will, not mine - అంటాడు కదా. 'దివ్యసంకల్పమే నా సంకల్పంగా పని జరగాలి తప్ప నాదైన ప్రత్యేకమైన సంకల్పాలు అంటే నన్ను నేను కట్టేసుకునేవే' అని. కాబట్టి ఇటువంటి సంకల్పంగా దిగివచ్చే వాక్కుని మనవాళ్లు 'ఋషభం' అన్నారు. అది

utterance - ఋగ్వేదం అన్నారు. ఋగ్వేదం అంతా కూడా utterances తో కూడి ఉంటుంది. మనలో ఈ పిచ్చి పిచ్చి సంకల్పాలు కలిగి, మనని ఊరికే తిప్పలు పెట్టి, మనం నానా రొష్టు పట్టించె స్థితి నుండి మనని మనం ఉద్ధరించుకోవాలంటే ఏం చేయాలి? ఋగ్వేద సూక్తములను పఠించాలి. 11,600 చిల్లర సూక్తాలు ఉన్నాయి ఋగ్వేదంలో. మన మీద కరుణతో కొన్ని మనకి మాస్టర్ గారు తయారుచేసి ఇచ్చారు. వేదంలో చక్రవర్తి ఋగ్వేదం అయితే, ఋగ్వేదంలో అన్నిటికన్నా ముఖ్యమైనది, 11,600 సూక్తాలలో కల్లా మకుటాయమానమైన సూక్తం పురుష సూక్తం! అది కేవలం భగవంతుని తత్త్వం గురించి ఉన్నది. అందుకే రోజు పురుషసూక్తం, తరువాత శ్రీ సూక్తం, చదువుకున్నవారికి వ్యక్తిగత సంకల్పముల నుండి రక్షింపబడే ఒక అమరిక ఉన్నది. ఊరికే తోచక ఇచ్చినవి కాదు ఇవన్నీ. తెలిసి ఇస్తారు మహాత్ములు. రోజూ పురుష సూక్తం, శ్రీ సూక్తం శ్రద్ధగా చదువుకోవాలి. శుక్లపక్షంలోనేమో ముందు శ్రీ సూక్తం తరువాత పురుష సూక్తం చదువుకోవాలి. కృష్ణపక్షంలోనేమో ముందు పురుష సూక్తం తరువాత శ్రీ సూక్తం చదువుకోవాలి. ఇంకా నీకు ఓపిక ఉంటే మిగతా సూక్తాలు చదువుకో. విష్ణుసూక్తాలు ఉన్నాయి, అగ్నిసూక్తాలు ఉన్నాయి, సుపర్ణసూక్తం ఉంది, సరస్వతీసూక్తములు బోలెడు సూక్తములు ఉన్నాయి. దగ్గర దగ్గర 11, 600 సూక్తాలు ఉన్నాయి. కాబట్టి ఇంతవరకు చేస్తే నువ్వు ప్రకృతిని, పురుషుడిని ఇద్దరినీ ఆరాధించినట్లు అయింది కదా. అది కూడా కృష్ణపక్షంలో మనం సృష్టి నుండి మూలంలోకి వెళ్తాం. అమావాస్యకి వెళ్ళేటప్పుడు. శుక్లపక్షంలో మూలం నుండి మళ్లీ పూర్ణమైన సృష్టిలోకి వస్తాం. కాబట్టి కృష్ణ పక్షంలో అయ్యవారు ముందు, అమ్మవారు తరువాత. శుక్లపక్షంలో అమ్మవారు ముందు, తరువాత అయ్యవారు ఇట్లా చదువుకోవాలి. ఇలా మనం సూక్తాలు చదువుకుంటే మీలోనే మీకు మార్పు కనబడుతుంది. మీరు మారారు అని తెలియదు, మీకు. మీ చుట్టూ ఉండే వాళ్ళు చెప్తారు ఏంటయ్యా అన్నీ తగ్గించేసుకున్నావు, అన్నీ మార్చుకున్నావు అని. ముందు భయపెడతారు, ఏమైపోతావో అని. ఏమీ అయిపోము బాగుపడతాం. ఎందుకనంటే మనని తిప్పలు పెట్టే సంకల్పాల నుండి మనం రక్షింపబడడం కన్నా ఏం కావాలండి మనకి? మనం చాలా విషయాలు మోజుపడి చేసినవి మనని బంధించినవి ఎన్ని లేవు? ఉన్నాయి కదా. నంది ఏం చేస్తూ ఉంటాడు? ఎప్పుడూ నందీశ్వరుడు శివుడినే చూస్తాడు ఇంకొకటి వాడికి సంబంధం లేదు. గరుత్మంతుడు విష్ణుమూర్తికే అంకితం. సింహం అమ్మవారికే అంకితం. అలా ఉంటాయి. అంతేకానీ, వాహనం కావాలి అనుకున్నప్పుడు లేకపోతే ఎట్లా ఉంటుంది? మన driver మనం car ఎక్కుదాం అనుకున్నప్పుడు వాడు లేకపోతే తీసేస్తాం వాడిని, అంతేగా. నిజమైన భక్తుడు భగవంతుడు యందే లగ్నమైన మనస్సు కలిగి ఉంటాడు. ఇది యోగస్థితి! అటువంటి స్థితి మనకి కలగాలి అంటే గోపతిని ప్రార్థన చేయాలి. గోపతి అంటే భగవానుడు అని అర్థం కాదు వృషభము అని అర్థం. వృషభము అనేది రిషభము అని అర్థం. ఎందుకన్నారయ్యా

అంటే అది వాక్కు, నాలుగు స్థితులుగా, పరా పశ్యంతి మధ్యమా వైఖరి స్థితులలో దిగివస్తుంది. అందుకని ఈ సూక్తములను చక్కగా ఉచ్ఛరించినవాళ్లకి సంకల్పములయందు ఊరుట అనేది ఉండదు. అంటే రజోగుణం నెమ్మదిగా క్షీణిస్తోంది అన్నది అర్థం. రజోగుణం ఉన్నకొద్దీ రకరకాల రుచులకి నాలుక విజృంభిస్తుంది. చెవి విజృంభిస్తుంది రకరకాల వినికిడిలకి. కనులు విజృంభిస్తాయి రకరకాల దృశ్యాలకి. అన్నీ చచ్చిపోతాయి. ఊరకుండప్పా! అన్నాడు కదా రమణ మహర్షి. ఊరిపోకురా, అట్లా ఉండమని. అంతకన్నా ఏం కావాలండి? తెలియకుండా పడతాం కదా, అది గోపతి!

## 514 గోప్తా

గోప్తా అంటే రహస్యంట. మరి ఇది అంతా రహస్యమే. ఉత్తరుడూ, ఈ నందీశ్వరుడు, వాక్కు అన్నీ రహస్యమే! మనకి మామూలుగా కనిపించేదంతా కూడా ఆ మొత్తంలో నుండి ఊరిన విషయం. సముద్రంలో, సముద్ర తరంగాలలో జలం ఉంది. ఒప్పుకుంటాం. సముద్రనురుగు లో ఎంత జలము ఉందండి? ఉందా? ఇలా చేతిలో పట్టుకుంటే కాసేపైన తరువాత ఏమీ ఉండదు కదా, తాగితే? పాల నురుగు నాలుగు గ్లాసులు పోసిపోతే ఎవరైనా ఊరుకుంటారా? పాలల్లో నీళ్లు కలిపితేనే ఒప్పుకోము. వాడు పాల నురుగు పోశాడు అనుకోండి, ఉత్త నురుగు, నురుగు లో ఎంత అస్తిత్వం ఉంది? ఇటుపక్క జీవితంలోనూ అంతేరా, అని అటుచూసిన వాళ్ళు చెప్తున్నారు. మనం ఇదే అంతా అని తాపత్రయపడుతున్నామే, 'అబ్బాయ్ ఇది కేవలం నురుగు. ఇది బుడగ' అని పెద్దలు చెప్పారు. బుద్ధుడప్రాయం. ఏమిటో అలా అంటారు గాని మనకి అర్థం అవుతుందా? సముద్రపు నురుగు తాగు. పాల నురుగు ఓ బిందెడు తాగు. ఏమైనా నీకు పోషకం దొరుకుతుందా? ఇదీ అంతే. ఇటువంటి ఉపమానాలు చెప్పుకోవాలి. This is only a precipitate. పాలు పిండుతుంటే నురగ వచ్చింది తప్ప నురగ కోసం పాలు పిండుతామా? దేనికోసం పాలు పిండుతామండి? పాల కోసం పిండుతాం. నురగ ఎట్లా వస్తుందండి? అది వస్తుంది అంతే. అట్లాగే, నువ్వు అనుభూతి చెందడానికి అంతా నీకు అమరిక చేస్తే, నీదైన ఊరడం నువ్వు మొదలు పెట్టావనుకో అదంతా నురగ అయిపోతుంది. నిన్ను పంపించింది ఒక purpose కి, నువ్వు చేస్తున్నది ఇంకో పని. ఉదాహరణకి మనం ఏదైనా మంచి school ఒకటి పెట్టామనుకో, వచ్చిన వాళ్ళని అంతా చూసి రమ్మని చెప్తాం కదా. చూసి రండి అని పంపిస్తే, school కి వెళ్లకుండా దారిలో ఎక్కడో market లో ఇరుక్కుపోతే? మనం అలా ఇరుక్కుపోయిన వాళ్ళం. వచ్చిన పని ఒకటి, చేసిన పని ఒకటి. వచ్చిన పని మరిచిపోయాము. ఈ చేసిన పనులన్నీ లుంగలు చుట్టేసాయి. అవన్నీ విప్పుకోవడానికి ఎన్ని జన్మలూ సరిపోవట్లేదు. ఎందుకిలా జరిగింది? ఈ సూక్ష్మమైన ధర్మములు తెలియక, వీటిని తెలుసుకోవడానికి శ్రద్ధ లేక. ఎవరూ చెప్పక అనకండి. సృష్టిలో నేర్చుకుందాము అనుకునే వాళ్ళకి చెప్పేవాళ్ళు ఎప్పుడూ ఉన్నారు. కాకపోతే 'మాకు అంతా తెలుసు, మేము చెప్తాము' అని వాళ్లు డప్పు కొట్టుకుని తిరగరు. వాళ్ల దగ్గరికి వస్తే చెప్తారు. ధర్మముయందు సూక్ష్మములో వాటియందు ఆసక్తి ఉన్నవారికి - 'శ్రద్ధవాన్ లభతే జ్ఞానం' అని కృష్ణుడు చెప్పలేదూ? ప్రతీ విషయం టపా టపా కొట్టిపారేసాడు. నీకు శ్రద్ధ ఉంటే జ్ఞానం అదే దగ్గరికి వచ్చి నేర్పుకుంటుంది. నీకు నిజంగా ఏదైనా ఒక విషయమునందు శ్రద్ధ కలిగితే, ప్రకృతి దానికి సంబంధించిన దానిని నీకు అందించేటట్టు చేస్తుంది. ఏదైనా పుస్తకమో, దానికి సంబంధించిన మనిషో, దానికి

సంబంధించిన అనుభూతో, దానికి సంబంధించిన అనుభవమో నీకు కలుగజేసే కరుణ కలిగిన అమరిక ఈ సృష్టిలో ఉంది. తెలుసుకుందాం అనుకునే వాడికి తెలియబడేట్లుగా రహస్యంగా అంతా అమర్చి ఉంచాడు. అందుకని 'గోప్తా' అన్నారు. అంటే భగవంతుడు గుప్తా గారన్నమాట. గుప్తా అన్న పదం అందులో నుండే వచ్చింది. అన్నీ రహస్యంగా ఉంచుతాడు కదా, గుప్తా అంటే. ఏమిట్రా అంటే, వాడి వరకు వాడికి పాపం ఈ రహస్యం తెలీదు. ఎంతవరకు సంపాదించావు రా? అంటే ఎంత అడిగినా చెప్పడు. నాలుక కోసినా చెప్పడు, చీరేసినా చెప్పడు. వాడు గుప్తా, కాబట్టి గోప్తా. అన్నిట్లోనూ అక్కడే ఉంటాడు ఉన్నట్టు కనబడడు. మనం చూస్తే వీడూ వాడూ అని చూస్తాం తప్ప, వీడే వాడు అని చూడము కదా. వచ్చినవాడే నారాయణుడు అని చూసేవాడు మహర్షి /యోగి/ ఋషి. ఆ వచ్చినవాళ్ళు ఫలానా సూర్యారావు గారు, వాళ్ళ ఆవిడ, లేకపోతే స్నేహితుడు. ఇలా చూసామనుకోండి. అదీ చూపే, ఇదీ చూపే. వచ్చినవాడు వాడే అని తెలిసి, ఏది చూసినా అదే ఇదిగా ఉందని, ఇది చూసినా అదే ఇదిగా ఉందని గమనించడం అనేది ప్రహ్లాదుడి తత్త్వం. అన్నీ వదిలేసి ఏదో తను నమ్మిన నారాయణుడు ఒక రూపం, ఒక నామం, పట్టుకుని తిరిగాడు అనుకోబోకండి. కనబడుతున్నదల్లా నారాయణుడే, వినపడుతున్నదల్లా నారాయణడే. అదీ సాధన! అలా లేనప్పుడు అక్కడ ఉన్నదే కనబడడం లేదు కదా మనకి. ఇంట్లో ఎదురుగుండా ఉండేదే కనపడదు. వెతుక్కుంటూ ఉంటాం కదా. జేబులో కళ్ళజోడు పెట్టుకుని వెతికిన వాళ్ళం ఉండమూ? ఉంటాం కదా. అలా ఎదురుగుండా ఉన్నదే కనిపించడం లేదనుకోండి అంతకన్నా గుడ్డివాళ్ళు ఇంకెవరు ఉన్నారని చెప్తాడు. ఎవరో 'ఏవండీ ఎంత పిలిచినా వినిపించడం లేదు ఏమైనా చెవుడా?' అంటారు. ఎంత చూద్దామన్నా కనిపించదు, ఏమిటిది? అంటే, 'నేనెప్పుడూ కనిపిస్తాను మీరు చూడదలుచుకోలేదంతే. నేనెప్పుడూ వినిపిస్తాను మీరు వినదల్చుకోలేదు. మీ ఖర్మ నేనేం చేస్తాను? మీరు గుడ్డివాళ్లు, చెవిటివాళ్లు. ఆ మాట అంటే కోపం వస్తుంది. అందుకని అనను, నోరు మూసుకుని కూర్చుంటాను' అని చెప్తాడు గట్టిగా అడిగితే. గోప్త ఉన్నప్పటికీ కూడా ఉన్నట్టు తెలియకుండా ఉన్నాడండి చూడండి ఎంత బాగున్నాడో. ఎదురుగుండానే ఉన్నాడు. కనబడడండీ. ఎందుకు కనబడడండీ? మనం అలా పొర వేసేసుకున్నాం కాబట్టి. మనకి 16 పొరలు పడిపోయినాయి. లింగ శరీరం నుండే 16 కళలు పోయి, 16 పొరలు వచ్చేసినాయి. ఇంక ఏం కనిపిస్తుంది? Cataract! ఒక్క పొరే అది. కన్నుగుడ్డు మీద 16 పొరలు వచ్చాయనుకోండి ఇంక వాడికి ఏమీ కనబడదు.

## 515 జ్ఞానగమ్యుఁ

జ్ఞానము ద్వారా దొరికేవాడు. 'నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహవిద్యతే' అన్నారు. పవిత్రం పవిత్రం అని బాగా మడి, మడి అని రొష్టు పడుతూ ఉంటారు కదా, ఆ మడిలో జ్ఞానం లేదు, అజ్ఞానమే. వాడు ముట్టుకోకూడదు, వీడు ముట్టుకోకూడదు. వాడు కనపడకూడదు, వీడు కనపడకూడదు. జీవుడు దేవుడే. అవమానం చేయకండి. భక్తులం అని చెప్పి మనంత బ్రష్టు పట్టిన వాళ్ళం ఎవ్వరం కనిపించము. మళ్లీ దేవుడిని తలుచుకుంటున్నాం. చాలా ఆశ్చర్యం వేస్తుంది. అదైనా మానేయ్, ఇదైనా మానేయ్ - రెండు పెట్టుకోక. చాలా మోసం అది. అందరినీ మర్యాదగా చూడండి. వాడిలో కూడా వీడే ఉన్నాడు. శంకరాచార్యుల వారి చివరి ఉపదేశం అదే. ఆయనకేమో దాహం. వాడి దగ్గర నీళ్లు ఉన్నాయి. తాగాలి అనిపిస్తుంది. వాడు చండాలుడు. ఏమిటది? ఇంత జ్ఞానికీ పూర్వ వాసనలు ఎక్కడో ఉంటాయి. అవి అలా వచ్చేస్తుంటాయి. 'కొంచెం తప్పుకో', అంటాడు. వాడు 'ఎక్కడికి తప్పుకోమంటావ్?' అని అడుగుతాడు. అప్పుడు అర్థమవుతుంది శంకరాచార్యుల వారికి. 'ఇక్కడైనా చోటే, అక్కడికి వెళ్ళినా చోటే, నా లోపల ఉన్నది కూడా చోటే! నీ లోపల ఉన్నదీ చోటే. ప్రపంచం అంతా చెప్పావు కదా, ఇట్లా మాట్లాడుతున్నావ్ ఏంటో?' అంటాడు. అప్పుడు కాళ్ల మీద పడతాడు. అందుకని చూసే వాడికే కనపడతాడు. జ్ఞానగమ్యులు. పవిత్రత, పవిత్రత అని నాలుక కోసుకునే వాళ్ళు ఉంటారే, వాళ్లలో అంతా అపవిత్రమే. వాళ్ల భావాలు అపవిత్రం. వాళ్ల ఉద్వేగాలు అపవిత్రం. ఊరికే బయటికి మేడిపండు చూడ మేలిమై ఉండును అన్నట్టుగా ఉంటారు. Cleanliness is not purity. గుర్తుపెట్టుకోండి. శుచివేరు, శుభ్రత వేరు. శుభ్రత బయట విషయం. శుచి లోపల విషయం. శుచి, శుభ్రత కావాలి అన్నారు కదా. ఉత్త శుభ్రత లాభం లేదు. West కు వెళితే చాలా clean గా ఉంటుంది. అంటే The external is very clean. The internal is very impure. ఇక్కడ? In some cases internal is pure. Internal అంతా pure అనడానికి లేదు. External is భయంకరమైన uncleanliness మనకి. West తో బయట విషయంలో పోటీ పడలేము. కానీ లోపల విషయం కూడా West ని పట్టి నేర్చుకుని, వాడిలా తయారైపోతున్నాము. అది మన విషయం. అన్నిటికంటే మనకి పవిత్రమైన విషయం 'జ్ఞానం'! జ్ఞానము కలిగినవాడు పవిత్రుడు. వాడు స్నానం చేశాడా లేదా, అదేంటండి ఆయన స్నానం చేయకుండా prayer చేస్తున్నాడు అంటారు. చేస్తాడు. దత్తాత్రేయ మార్గంలో మీరు వెళ్తే తాగుతున్నట్టు కూడా మీకు కనిపిస్తాడు. ఏం చేస్తారు? మీలాగా తలకాయ దువ్వుకోడు. బొట్టు పెట్టుకోడు. పొద్దున్నే సంధ్యావందనం చేయడు. విష్ణు సహస్రనామం చదువుతావా అంటే, ఎందుకు చదవాలి? అని అడుగుతాడు. అతడికి అయిపోయాయి ఇవన్నీ.

అంతర్ముఖంగా జ్ఞాని అయిపోయి, సమస్తమునందు దానినే దర్శిస్తూ ఉంటాడు. కాలిగోళ్ళు కూడా తీసుకోడు. His external is nothing to him. His internal is everything. అలా ఉంటారు. మాస్టర్ గారు అంతటివారు, Indore వెళ్తే అక్కడ భక్తరాజ్ మహరాజ్ గారని ఒకాయన కూర్చుని ఉన్నారు. పొద్దున 10 గంటలయ్యింది. ఇంకా స్నానం చేయలేదు ఏమీ లేదు ఎవరో చెప్పారు చాలా పెద్ద యోగి, మీరు చూస్తారా అంటే తప్పకుండా చూస్తాను అని వెళ్ళారు. మాస్టర్ గారు తెల్లవారకుండానే స్నానం చేసే అభ్యాసం కలవారు కదా. పది గంటలకి వెళ్లారు 'Mortakka' అని M.P. లో Indore దగ్గరలో ఒక 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. వెళితే ఆయన అక్కడ కూర్చున్నారు. స్నానం చేయలేదు. గడ్డం గీసుకోలేదు. మాష్టారుగారు చూశారాయన్ని ఒకసారి. చూస్తే ఆయన ఏమన్నారు? 'నువ్వేం చూస్తున్నావో అది ఇక్కడ ఉంది' అన్నారు. ఎలా ఉంది? 'It is here' అన్నాడు ఆయన English లో అంతే. ఆయనకి ఆహార నియమాలని, స్నాన నియమాలని, సంధ్యావందనాలని ఇవన్నీ ఏమీ లేవు. ఇవి తినాలి అని, ఇవి తినకూడదు అని ఏమీ లేదు. ఏ క్యా హై? అంటారు మనం చెప్తే. 'It is here' అని చెప్పేటప్పటికి, మాస్టర్ గారు ఆయన కాళ్లకు దండం పెట్టారు. వెంటనే ఆయన ఈయన కాళ్ళ మీద పడి దండం పెట్టారు. అదీ మహాత్ములు! మన కాళ్ళ మీద పడంగానే మనమే గొప్ప వాళ్ళం అనుకోకుండా వెంటనే ఈయన కాళ్ళ మీద పడి, 'తూర్పుదేశం నుండి యోగి వచ్చారు. ఆయనకు మనము భోజనం వండి పెట్టాలి తీసుకురండి' అని చెప్పారుట. తూర్పుదేశం అంటే విశాఖపట్నం, వాళ్లది పశ్చిమం అని కాదు అర్థం. తూర్పు దేశం అంటే వెలుగు దేశం నుండి అని అర్థం. వెలుగులోకం నుండి అని అర్థం. మాటలు అలా ఉంటాయి. తెలుసుకునే బుద్ధి ఉండాలి. అది బుద్ధిలోకంలో ఉంటే తెలుస్తుంది. ఈయనకు మనస్సులో సంకల్పం ఉంది నర్మదలో స్నానం చేద్దాము అని. అది కూడా పట్టుకున్నారు. ఈయన ఆ మాట అన్నారు. ఏమన్నారు? 'నర్మద నదికి వెళ్లి స్నానం చేసి రండి, నేనే మీకు వండి పెడతాను' అని చెప్పారు. అన్నవారు ఏం చేశారు తెలుసా? మాష్టరుగారు 'అలాగే తప్పకుండా!' అని వెళ్ళబోతూ ఉంటే వెనక్కి పిలిచి, 'స్నానం చేసే వండుతాను, స్నానం చేయకుండా వండను' అని చెప్పారట. ఏం మాట్లాడ్తారు మీరు? ఏమి మాట్లాడలేరు. అలా ఉంటారు జ్ఞానులు. ఊరికే బయట ఆడంబరాలతో పడి చచ్చిపోయేవాళ్ళకి అందే విషయం కానేకాదు. ఈ ఊరు వచ్చి మన ఇంటికి హోమానికి వస్తాను అన్నారు తెల్లవారి 5:00 గంటలకి. రాలేదు. 7:30 కి వచ్చారు. కానీ ఆయన వచ్చినట్టు నాకు అనిపించింది. ఆయన్ని తీసుకొచ్చినాయన, 'late అయిపోయిందండీ గురువుగారు లేవలేదు' అంటే, 'లేవలేదు ఏమిటి ఇక్కడికి వచ్చారు, శరీరం అక్కడ పెట్టి', అని తెలుగులో అని, ఆయన్ని అడగండి మీరు హిందీలో, అన్నాను. '5 గంటల నుండి ఏడు గంటల వరకు మీరు నిద్ర లేవకుండా పడుకున్నారు కదా ఎక్కడికి వెళ్లారు?' అంటే 'కుమారు హోమం చేస్తున్నాడు కదా, ఎలా చేస్తాడో అని చూడడానికి వెళ్ళాను', అన్నారు భక్తరాజ్ మహారాజు గారు.

మరి అటువంటి వాళ్ళని చూసి కూడా మనం కొన్ని కొన్ని విషయాలలో ఏది ఎక్కువ ముఖ్యం, ఏది తక్కువ ముఖ్యం అని తెలియాలి. మనం తక్కువ ముఖ్యమైన విషయాలు ఎక్కువ ముఖ్యంగా చేసుకుని, ఎక్కువ ముఖ్యంగా ఉన్న విషయాలు ఎప్పుడో భ్రష్టు పట్టించాము. దానివల్ల ఉపయోగం లేదుగా? అది ఎవరికి దక్కుతుంది? జ్ఞానమార్గంలో నడిచిన వారికి. జ్ఞానమార్గంలో నడవడం అంటే మనం చెప్పుకున్న పద్ధతులలో అంతర్ముఖంగా వెలుగు దర్శనం కోసం చేసే ప్రయత్నంలో, బహిర్ముఖమైన విషయాలలో అంత పాకులాడకుండా వెళ్తే దొరుకుతాడు జ్ఞానగమ్యుడు, ఇంకో విధంగా దొరకడు.

## 516 పురాతనః

మనం ఎవరి గురించి చెప్పుకున్నా వాడి కన్నా ముందువాడు. అందరికన్నా ముందువాడు మనకి తెలిసి బ్రహ్మ. వాడికన్నా ముందు 'వాడు'! బ్రహ్మకే తను ఎక్కడి నుండి వచ్చాడో తెలియదట. అలాగే సమస్తమైన విషయాలు ఊహించండి మీరు. మీరు ఊహించిన దానిలో కూడా మీకు పూర్తిగా దొరకడు ఎందుకంటే అసలు మీరు ఊహించడానికి వాడే మీలో పునాదిగా ఉంటాడు, అందుకని మీకు దొరకడు. వాడు ఉండబట్టి మీరు రకరకాలుగా, రకరకాలుగా అనుకుంటున్నారు. 'నువ్వు అనుకున్నవన్నీ కూడా నేను కాదు. నన్ను నిర్వచించలేరు' అని చెప్తాడు. అనిర్వచనీయము అని చెప్పడంలో ఉద్దేశం ఏంటంటే, వేదములు కూడా భగవంతుని కీర్తించినాయే తప్ప, about Him తప్ప not of Him. 'Speaking about truth', 'speaking the truth' కి తేడా లేదూ? About God ఎందుకు చెప్పుకుంటున్నాం అంటే, స్ఫూర్తి కోసం. చెప్పుకోవడానికి వాడే మనలో ప్రాతిపదికగా ఉన్నాడు. వాడు ఇందులో లేకపోతే ఇంక నేను చెప్పడం అనేది లేదు. వాడు మీలో లేకపోతే మీరు వినడం అనేది లేదు. మీరు వింటున్నాం అని అనుకుంటున్నారు. వినడానికి మీలో ఏమిటి basis? మీరు ఉన్నారు. మీరు ఉండడం అంటే వాడు ఉండడమే. అందుకే దేవుడిని వెతకడం అంటే నిన్ను నువ్వు వెతుక్కోవడం అన్నారు. ఊళ్లో వెతికితే కనబడడు. NVS Murthy గారు ఉన్నారు. ఊర్లో NVS Murthy గారి గురించి ఆయన వెతుక్కుంటున్నారు అనుకోండి, ఆయనకి కనిపిస్తాడా? మొత్తం భూగోళం అంతా తిరిగినా కనిపించరు. ఎందుకని? NVS Murthy ఆయనే కాబట్టి. మిగతా వాళ్ళందరికీ envious గా ఉండేటట్టుగా చక్కగా నడుపుకున్నారు ఆయన జీవితం. కదా. అలా తనయందు తానుగా ఉన్నవాడిని దర్శనం చేయాలంటే ఊర్లో వెతికితే ఎలా కనిపిస్తాడు? ఓపిక ఉన్ననాళ్ళు పుణ్యక్షేత్రాలు అవున్నాయి, ఇవున్నాయి అని ఎంత తిరిగినా, చివరికి నీ లోపలికి నువ్వు వస్తేనే కనిపిస్తాడు. నీ లో నుండి నీకు దర్శనం అయితే బయట కూడా దర్శనం అవుతాడు. తనయందు, అఖిల భూతములయందు, కనిపిస్తాడు అన్నాడు గానీ, అఖిల భూతములయందు, తనయందు అనలేదు. అందుకనే Man know thyself అన్నాడు Pythagoras. 'నిన్ను నీవు తెలుసుకో' అన్నాడు. ఎందుకంటే అన్నిటికీ పునాదిగా ఉన్నవాడు కాబట్టి. ఈ గోళాలు పుట్టక ముందర ఉన్నాడు. గోళాలని పుట్టించే వాళ్ళ సిద్ధులు. వాళ్ళ కన్నా ముందు ఉన్నాడు. సిద్ధులు కన్నా ముందు సాధ్యులుగా ఉన్నాడు. చారణులుగా ఉన్నాడు. వాళ్ల కన్నా ముందు గంధర్వులు గా ఉన్నాడు. వాళ్ల కన్నా ముందు సంకల్ప శక్తిగా ఉన్నాడు. సంకల్పశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియశక్తి వీటన్నిటికన్నా ముందు ఆదిశక్తిగా ఉన్నాడు. ఆదిశక్తి కూడా ఇందులో నుండి వచ్చినదే. అంతకన్నా

ముందర ఏమిటో మనకి తెలియదు. అందులో నుండి అన్ని వస్తాయి. అందులోకే అన్ని వెళ్ళిపోతాయి. ఇవన్నీ ఉన్నా ఉంటాడు, ఇవన్నీ లేకపోయినా ఉంటాడు. అందుకని పురాతనుడు. అందుకని దేవుడు అంటే అర్థం ఏమిటయ్యా అంటే, మనం ఎరిగిన దాని కన్నా ఇంకా ఒక మెట్టు పైన ఉంటాడు. వాడిని ఎరగడం అంటే మనం ఇక ఉండమండి. అదీ తన్మయము! తత్ మయము. అది తన్మయస్థితి. అది అయిపోయినప్పుడు మనం ఉండం కదా. మళ్లీ మనం వచ్చినప్పుడు, అందులో ఉన్నాం. అందులో ఉన్నప్పుడు, ఎలా ఉన్నాం? తెలియదు. అందులోకి వెళ్ళిపోతే అది అయిపోవడం తప్ప. అల సముద్రంలో కలిసిపోతే, అలకి సముద్రం అయిపోయాననీ, అంతకుముందు తను అల అని, ఏమీ గుర్తు ఉండదు. అలగా బయటకి వచ్చినప్పుడు 'అబ్బా! అంతకు ముందర సముద్రంగా ఉన్నామే' అని గుర్తు ఉండదు. సముద్రంలో ఉంటే ఎలా ఉంటుంది అని, అల వెళ్లి కలిసిపోతే తనుండదు. ఈ తిప్పలే పడతాడు నారదుడు. నారాయణుడి యొక్క సిద్ధి పొందినప్పుడు. విష్ణుస్థితి తెలుస్తుంది, వాసుదేవుడిస్థితి తెలుస్తుంది. నారాయణస్థితిలో అది అయిపోతాడు, అది అయిపోయినప్పుడు అందులో నుండి బయటికి రాడు. అబ్బో ఎంత బావుంది, కావాలి కావాలి అనుకుని అది అయిపోదాం అనుకున్నంతసేపూ 'తను' ఎక్కువుంటాడు. 'ఇంక దొరకదు నీకు, ఈసారి వచ్చే కల్పంలో చూసుకుందాము' అని చెప్తాడు. నిద్రపోయే ముందువరకు తెలుసండి. నిద్ర లేచిన తర్వాత నిద్రలో నుండి లేచాము, అని తెలుసండి. నిద్రలో ఎలా ఉన్నారండి? బాగా నిద్రపోయారా? అంటే ఏమో తెలియదండి అని చెప్పాలి. బాగా నిద్రపోయాము అంటే ఎలా తెలుసండి మీకు, అని అడిగితే? Did you sleep well అని English లో అడిగితే, Oh excellent అని అంటాడు, ఎలా తెలుసు మీకు? మనకి ఏమీ తెలియదు కాబట్టి బాగా నిద్రపోయాం అని లెఖ్ఖ. అందుకని నారాయణుడు ఉంటే నరుడు ఉండడు, నరుడు ఉంటే నారాయణుడు కనపడడు. అంటే నరుడు తపస్సు చేసుకుంటూ ఉంటే నారాయణుడు పనిచేస్తూ ఉంటాడు, నారాయణుడు తపస్సు చేస్తూ ఉంటే నరుడు పని చేస్తూ ఉంటాడు అని నరనారాయణుల గురించి చెప్తారు. ఎందుకంటే దిగివస్తే అలా ఉంటుంది. కాబట్టి మనము పురాతనుడిలోకి ప్రవేశించినప్పుడు, మనము వాడిలో భాగమైపోయి మనము ఉండం. అదే రాజవిద్యారాజగుహ్య యోగం లో చెప్పాడు శ్రీకృష్ణుడు. 'నిజానికి నువ్వు లేవు రా నేనే ఉన్నాను. నేనే నీలో ఉన్నాను. నువ్వు ఉన్నావు అని నువ్వు అనుకుంటుంటే, అనుకోనీలే అని వదిలేశాను' అని. తెలిస్తే చాలా బాధగా ఉంటుంది మనకి. 'నాయందు మీరున్నారని' అంటాడు ముందు. 'నీ యందు నేనున్నాను' అంటాడు తర్వాత. ఈ రెండూ బావున్నాయి. మూడోది చెప్పనా, 'అసలు మీరు లేరు. ఉన్నది నేనే మీరు ఉన్నారని మీరు అనుకుంటున్నారు', అని చెప్పి చెప్తాడు. ఇదే రాజ విద్య! రాజవిద్యా రాజగుహ్యం గురించి ఉపన్యాసం ఇవ్వమంటే పండితుడు గంటల తరబడి, రోజులు తరబడి చావ కొట్టేస్తాడు తప్ప అసలు విషయం చెప్పలేడు. ఎందుకు చెప్పలేడు అంటే వాడికే అందలేదు.

అందాలంటే, అది వీడిలో, వీడిలా ఎలా ఉందో తెలియాలి. అంటే 'సోహం' అనే మంత్రం తనయందు సిద్ధి పొందాలి. అప్పటి నుండి తెలుస్తుంది. 'సః అహం', అతడే నేను! అప్పటి నుండి చెప్పినదే చెప్పుకుంటూ ఉంటాము ఎందుకంటే బాగా నమిలేస్తే అది ఎక్కుతుందేమో అని వాడి సంకల్పం అంతే. మనం కూడా సనాతులమే. ఆయనెంత సనాతనుడో మనము కూడా అంతా సనాతులమే. 'దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవః సనాతనః'. జీవుడు దేవుడే. సనాతనుడే. కానీ అది తెలియకపోవడం వలన కాదనుకుంటాం. అలాగే నేను సమర్థుడనే, అని తెలుసుంటే బాధ లేదు. కాదు నేను ఎవరినో కదా అంటే మరి ఇప్పడే పుట్టినట్టు, ఇంకాసేపట్లో పోయినట్లు. ఎప్పడండీ పుట్టింది నేను? అంటే చెబుతాము. ప్రతివాడికీ వాడి date of birth ఒకటి తెలుసుకదా? అంటే అజ్ఞానం అని అర్థం. ఎవరైనా date of birth అడిగితే మనం ఖచ్చితంగా చెప్పామనుకోండి, ఎవరికి తెలుసు? దానికి 'నేనే సాక్ష్యం' అంటాడు. వీళ్ళెవరూ సాక్ష్యం కాదు. మీ అమ్మో, నాన్నో సాక్ష్యం దానికి. నాన్న కూడా చెప్పడు, ఎక్కడో ఉంటాడు. అమ్మే సాక్ష్యం. కదా. ఇప్పడు అదా నీ date of birth? అందుకని మహర్షులు date of birth అడిగితే నవ్వుతారు. ఒక మహాత్ముడు America వెళ్తే కృష్ణుడి date of birth చెప్పమని అడిగారు. 'మా కృష్ణుడికి date of birth లేదు' అని చెప్పాడు. వాళ్ళు అదిరిపోయారు. అదేమిటని అడిగారు. 'వాడెప్పడూ ఉంటాడు. ఎప్పడూ ఉండే వాడికి date of birth ఏమిటని' అడిగాడు. ఇది అడక్కముందు ఇంకొక మాట అన్నాడు. 'Christ date of birth తెలుసా నీకు?' అని అడిగాడు. 'ఆ తెలుసు' అన్నాడు. 'చెప్పు' అన్నాడు. ఏదో చెప్పాడు. 'కృష్ణుడికి date of birth లేదు ఎందుకంటే వాడు ఎప్పడూ చావలేదు. పుట్టలేదు. మీ christ చనిపోయాడని నువ్వు అనుకుంటున్నావు, పుట్టాడని నువ్వు అనుకుంటున్నావు అది నీ అజ్ఞానం', అని చెప్పాడు. పుట్టడం, చావడం లేనివాడు పుట్టాడంటావేంటి, చచ్చాడంటావేంటి? చచ్చిపడుండక నేను చెప్పేది విను, అన్నాడు. అతడూ మగాడంటే! అతడూ భారతీయ ఋషి! పుట్టినరోజు celebrations అంటే ఊళ్ళో వాళ్ళ ప్రాణం తీయడం కదా. మనం పుట్టినరోజు చేసుకుంటున్నామంటే ఊళ్ళో వాళ్ళు చచ్చారే. ఎందుకంటే వచ్చి చూడకపోతే ఆయన ఏమనుకుంటాడో? ఆ-- ఊర్కే వెళ్తే బాగుండదు. పళ్ళు పట్టుకెళ్ళాలి. లేకపోతే ఇంకొకటి పట్టుకెళ్ళాలి. ఈ గొడవలన్నీ ఎందుకండీ. అసలు నువ్వు పుట్టినవాడివి కానప్పుడు? జీవుడికి పుట్టడం లేదు చావడం లేదు. మరి లయమైపోతే? అంటే లయమై పోయి కూడా వాడి కడుపులో ఉంటాడు. మళ్ళీ తెరవగానే మొత్తం అంతా బయటకి వచ్చేస్తాయి ఉండ్రాళ్ళలాగా. అది బ్రహ్మతత్త్వం. బ్రహ్మ 'అమ్మో! ఇంతుంది సృష్టి, నేనెప్పడు చెయ్యగలను సార్' అని బాధపడుతూ ఉంటాడు. విష్ణువు నవ్వి. 'నువ్వేమి చెయ్యక్కరలేదు. నువ్వు ఊరికే నాకు channel గా ఉండు, వాహికగా ఉండు. నేను అంతా చేసుకునిపోతానుగా' అంటాడు. 'నేనెలా చెయ్యాలి' అంటే? 'ముందు తపస్సు చెయ్యి' అంటాడు. తపస్సు చేస్తే కనిపిస్తుంది. అంతా

అక్కడే ఉంది. ఈయన ఏమీ చెయ్యక్కరలేదు. ఊరికే డబ్బా మూత తెరవాలి. తెరిస్తే మొత్తం అంతా లోపల ready గా ఉంది. అలా టప టప టపా వచ్చేస్తుంది. బ్రహ్మగారు సృష్టించారని కీర్తి మాత్రం వచ్చేస్తుంది. చూడండి ఎంత కరుణామయుడో? తనదే అనుకుంటే పడిపోతాడు బ్రహ్మ. వాడిది అని బ్రహ్మ అనుకోవాలి. ఊళ్ళోవాళ్ళు బ్రహ్మోదనుకుంటే అనుకోనివ్వాలి. నిజంగా బ్రహ్మకీ, నారాయణుడికీ మధ్య జరిగిన సంభాషణ భాగవతంలో చాలా చక్కగా ఉంటుంది. చదువుకోవాలి. అన్నీ అయిపోయిన తర్వాత ఉండే విషయం కదా. కాబట్టి పురాతనుడు, సనాతనుడు, అందరికన్నా ముందువాడు, ఎప్పుడూ ఉండేవాడు, పుట్టుకలేనివాడు కాబట్టి చావులేనివాడు. పెరిగేవాడు కాదు, తరిగేవాడు కాదు, మారేవాడు అంతకన్నా కాదు.

## 517 శరీరభూతభృత్

శరీరములను, అందు నివసించే జీవులను, ఇద్దరిని ధరించేవాడు అని అర్థం. 'ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః'. 'దేవభృత్' అంటే దేవతలను ధరించినవాడు. ఇక్కడ శరీరములను, పుట్టిన జీవులన్నిటినీ ధరించినవాడు. దేవతలను ధరించడం అంటే వెలుగును తాను ధరించడం చేత సృష్టి ఏర్పడుతుంది. వెలుగు నుండి సమస్తమైన జీవులందరూ పుట్టుకొస్తారు. అందుకనే వెలుగుని తొమ్మిది అంటారు. దానినే 'పరాప్రకృతి' అని చెప్తారు. పది భగవంతుడు. ఎనిమిది తత్త్వములు వెలుగు నుండి పుట్టుకొస్తాయి. అందుకనే వారందరినీ అష్ట ప్రకృతులు అంటారు. తన నుండి పుట్టిన పరాప్రకృతి నుండి అష్టప్రకృతులు పుట్టుకొస్తాయి. ఆ పైన మూల ప్రకృతి, ఆ పైన దేవుడు. మనవరకు వెలుగులోంచి పుట్టుకొచ్చిన వాళ్ళం కాబట్టి ఎనిమిది వరకు వుంటాము మనం. తొమ్మిది అమ్మవారు, పది అయ్యవారు అని చెప్పుకుంటారు. కాబట్టి ముందు వెలుగుని ధరిస్తాడు. వెలుగుని ధరించడం వలన అందులో నుండి సమస్తమైన విషయములన్నీ కూడా తను ఆధారముగా, త్రిగుణాత్మకమైన ప్రకృతి అల్లుకుంటుంది. ఈయన్ని పెట్టుబడిగా పెట్టుకుని ఆవిడ అన్నీ తయారు చేస్తుందన్నమాట. ఈయన లేకపోతే ఆవిడ తయారు చేయడానికి ఏమీలేదు. ముడిసరుకు అంతా కూడా ఈయన. పనంతా ఆవిడది. అందుకనే ఆవిడ రజస్సు, తమస్సు, సత్త్వ గుణములు కలిగి సృష్టి నిర్మాణము చేస్తూ వుంటుంది. ఈయన ఆధారం లేకపోతే చేయలేదు. అదే కృష్ణుడు చెప్తాడు 'నేను చెయ్యని వాడిని. నేను ఏమీ చేయడం లేదు. నాలో నుండి పుట్టిన గుణముల నుండి ఇవన్నీ పుట్టుకొస్తున్నాయి' అంటాడు. 'నువ్వు చెయ్యకపోతే ఇవన్నీ జరగవు కదా' అంటే 'నేను చేయకపోతే జరగవు, కానీ నా సహకారము ప్రకృతికి ఉండడం చేత ప్రకృతి చేస్తుంది. నా సహకారము ఏమీ లేకపోతే ప్రకృతి ఏమీ చేయలేదు కాబట్టి చేసినవాడిని. అందుకనే చేస్తున్న వాటిలో నేను చేయనివాడిగా వుంటాను. నేను చేయనివాటిలో చేసేవాడిగా వుంటాను. నన్ను ఈ విధంగా దర్శించవచ్చు' అంటాడు. బాగా చేస్తున్నట్టు కనబడ్డవాళ్ళలో చెయ్యనివాడిగా వుంటాడు. అసలు చేయనట్టుగా కనిపిస్తున్న వాళ్ళు చాలా చేస్తూ వుంటారు. మహాత్ములు ఏదో మారుమూల ప్రదేశములో వుండి, ఏదో ఆ ఊళ్ళో పదిమందితో మాట్లాడినట్లుగా వుంటుంది. కానీ వాళ్ళు చేసేపని అదృశ్యముగాను, అంతర్నిహితముగాను ఎంత వుంటుందంటే, వాళ్ళు శరీరాన్ని త్యజించిన తర్వాత కూడా వాళ్ళ కార్యక్రమం అలా నడిచి వెళ్ళి, భౌగోళికంగా అవుతుంది. షిరిడీలో ఊరికే అలా కూర్చుని పదిమందికి చెప్పిన మనిషి, ఈ రోజు ప్రపంచమంతా వ్యాపించారు. అలాగే కుంభకోణంలో కూర్చున్న ఈ యుగం మనిషి ప్రపంచమంతా వ్యాపించారు. మహాత్ములు చెయ్యనట్టుగా కనిపిస్తారు. చాలా చేస్తారు. మామూలు

మనుషులు చాల చేస్తున్నట్టు కనిపిస్తారు. ఏమీ ఉండదు. అందుకనే భగవద్గీతలో 'ఇది తెలుసుకో, నీవేదో చేస్తున్నావని అనుకోవద్దు. నీలోంచి చేసేవాడిని నేనుగా గమనిస్తే, ఈ చేయనివాడు చేయడం మొదలుపెడతాడు. నీవు చేసుకుంటూ వుంటే, వాడు అలాగే లోపల వుంటాడు'. అంగుళీమాలికుడు బందిపోటు. దారులు కాస్తాడు. అడవులలో వుండి, అందరినీ కొట్టి, డబ్బులు తెచ్చుకుంటూ, పెళ్ళాం పిల్లల్ని పోషించుకుంటూ వుంటాడు. అంగుళీమాలికుడు ఒక గుట్టమీద నిలబడి తనయొక్క సామ్రాజ్యపు సరిహద్దుల్లోకి ఎవరు వస్తున్నారో చూస్తూ వుంటాడు. వచ్చినవాళ్ళను దోచుకుంటూ వుంటాడు తన అనుయాయులతో. ఒక రోజున అదే దారిలో బుద్ధుడు తన శిష్యులతో నడిచి వస్తున్నాడు, సన్యాసి. ఈయన దగ్గర ఏమీ వుండవు కదా. కాబట్టి అంగుళీమాలికుడు 'లోపలకి రాబోక. ఇది నా ప్రాంతము. నాకో నియమము వుంది. లోపలకి వచ్చినవాళ్ళను చావగొట్టి, వాళ్ళ దగ్గర వుండేది లాక్కుంటాన. నీవు కదలవద్దు, రావద్దు' అంటాడు. వాడి అరుపులు, బెదిరింపులు పట్టించుకోకుండా, బుద్ధుడు అంతకుముందు ఏ విధమైన స్పందన (vibration) ఉందో, అందులో తేడా లేకుండా అదే విధముగా నవ్వుతూ నడచి వస్తూ వుంటాడు. ఆయన వస్తున్న కొలదీ వీడు కోపంతో అరుస్తాడు. అవేశం వస్తుంది. ఇంకా అరచి, కత్తి తీసి, చాలా హడావిడి చేస్తాడు. వాడి దగ్గరకు ఆయన వచ్చేస్తాడు. 'నిన్ను కదలద్దు అంటే ఎందుకు అక్కడ నుండి కదిలొచ్చావు? నిన్ను ఇప్పుడు చంపేస్తానంటాడు'. అపుడు బుద్ధుడు అతనిని చూచి నవ్వి, 'నేను కదలలేదు. నేను నీ సరిహద్దులో కనిపించిన దగ్గర నుండి నీ దగ్గరకు వచ్చే లోపల నీవే చాలా కదిలావు. నీవు కదులుతూ నేను కదిలానని అంటావేమిటి?' అంటాడు. ఆయన కదల్లేదు. అదే స్పందన, అదే స్ఫూర్తి. ఎక్కడా భావములయందు ఆవేదన గానీ, భయం గానీ, ఆదుర్దా గానీ ఏమీ కలగలేదు. 'కదిలేవన్నీ నీ దగ్గర పెట్టుకున్నావు. నేను కదులుతున్నానంటున్నా వేమిటి?' అని కళ్ళలోనికి చూసి అడిగేసరికి, వాడికి ఈయనలో వుండే నిశ్చలత్వం ఈయన కళ్ళలోంచి, వాడి కళ్ళలోకి అందుతుంది. వెంటనే కత్తి క్రింద పడేస్తాడు. పారేసి, మిమ్ములను చూస్తూంటే 'నేను నిశ్చేష్టుడనయ్యాను' అంటాడు. అంటే చేతన పనిచేయాలంటే చేష్టలు తగ్గాలి. చేష్టలన్నీ కూడా చేతన ఆధారముగా జరుగుతున్నవి కదా. చేతనయందు నిలబడిన వాడికి చేష్టలుడిగినట్టుగా వుంటాయి. కానీ చేతన ఎక్కువగా వుంటుంది. షిరిడీలో మారుమూల గ్రామంలో అంత మహాజ్ఞాని, సమస్తమూ తెలిసినవాడు అక్కడ ఏమి చేసాడని? ఇప్పుడు వున్నట్టుగా అప్పుడు లేదు కదా. ఊహించుకుంటే మట్టిగోడలతో, మహా వుంటే వంద గడపలు వున్నాయేమో ఆ వూరిలో. అక్కడ ఆయన ఏమి చేసాడని ఇప్పుడు భూమంతా వ్యాపిస్తోంది? అట్లాగే ఏమి చేశారని మాస్టరు CVV గారి గురించి భూమంతా వ్యాపించింది. అందుకని చేయకపోవడంలో చెయ్యడం ఉంది. మనస్సు, ఇంద్రియములు, శరీరంతో చేయడం పెద్ద చెయ్యడం కాదు. ఈ చేతలు చాలా short lived. వాళ్ళ చేతలు యుగయుగాలుగా నిలబడేవి. ఈ భూమి

వున్నంతకాలం ఏసుక్రీస్తు, రాముడు, బుద్ధుడు, కృష్ణుడు వీళ్ళని ఎవ్వరూ మరువరు. మహాత్ములు చేసిన చేతలు మరువరు. ఏమిటి చేస్తారంటే ఏమీ చేయనట్టు కనిపిస్తారు. అన్నీ చేస్తారు. మనలో అన్నీ చేస్తున్నది ఏమీ చేయనట్లుగా కన్పిస్తుంది. అదేమిటి? మనలో వుండే స్పందన! అది ఎంతమందికి గుర్తుంటుంది? మన ఆలోచనలే మనకు గుర్తుంటాయి. మన ఇంద్రియములు, ఇంద్రియార్థములు ఇవే ఎక్కువ గుర్తుంటాయి. సముద్రము పాలిమేరలో మనకి తరంగాలు ఎక్కువ వుంటాయి. అసలు సముద్రం లోపల లోతుగా వుంటుంది కదా. అందుకనే లోతైన విషయములు కాబట్టి అది అందదు. దానిని తీసి తత్త్వంగా మన కందించడమనేది ఈ నామములో ఒక ప్రయత్నం. అందుచేత ఈ శరీరాన్ని ధరించినవాడు జీవుడు. జీవుణ్ణి ధరించినవాడు దేవుడు. ఈ జీవుడు ఎక్కడ నుండి వచ్చాడు? వెలుగు నుండి వచ్చాడు. అందుకని వీడికి ఇది సహజంగా వెలుగు శరీరం. మూడు రకాల శరీరాలు వున్నాయి. కాబట్టి వెలుగులోంచి హిరణ్మయమైన శరీరము లోనికి వచ్చి, అక్కడ నుండి భౌతికమైన శరీరము వీడికి వస్తుంది. ముందు నామములో 'దేవభృత్' చెప్పారు. ముందు నీవు దివ్యత్వాన్ని లేక వెలుగును ధరించావు. ఇప్పుడేమి చెపుతున్నాడు? తద్వారా జీవులను ధరించావు. తద్వారా జీవుల శరీరాన్ని ధరించావు. సమస్తమూ నీవే ధరించి యున్నావు. నీవు లేకపోతే శరీరము లేదు, జీవుడు లేడు. కాబట్టి ఇందరిలో లోతులలో ఉన్నవాడు 'వాడు'. వాడు వున్నంతసేపూ అన్నీ వుంటాయి. ఉట్టి మన శరీరము మాత్రమే కాదు, ఈ భూగోళము, గ్రహగోళాదులు, ఎన్ని గ్రహములు తాను ధరించి యున్నాడు. అవి ఆయన ధారణ చేత నిలబడి వున్నాయి తప్ప లేకపోతే నిలబడి వుండవు. అందుకని శరీరములు, జీవులు మనకి రెండు రకములుగా చెప్తారు. మన భౌతిక శరీరం. మనస్సు, ఇంద్రియములు శరీరముగా ఏర్పడిన శరీరం. అలాగే భూగోళం, మిగతా గోళాలు. గోళాలన్నీ తయారుచేయడానికి ముందు తాను వాటిని ధరించాలి. తర్వాత తానే జీవులుగా కూడా దిగివచ్చి, వాటిని ధరిస్తాడు. తరువాత ఈ జీవుల్ని, ఈ గోళాలకు ఆకర్షింపబడేటట్టుగా, ఇక్కడ వుండేటట్టుగా చేస్తాడు, అంటే circus tent వేసిన తర్వాత. Tent circus కాదు. Tent లేకపోతే circus చేయలేము. అందుకనే గుడారాలు వేసినట్టుగా గోళాలు నిర్మాణము చేసి వాటిమీదకి జీవులని, జంతువులని circus లోనికి ప్రవేశించినట్టుగా, ఇందులోనికి ప్రవేశబెడతాడు. ఇటు జీవులను తనే ధరిస్తున్నాడు. అటు గోళాలను తనే ధరిస్తున్నాడు. వాళ్ళిద్దరికీ అనుసంధానము కలిగేట్టుగా భూమి మీద వుండే విషయాల మీద మనకి ఆకర్షణ, ప్రేమ, అనురాగము కలిగేట్టుగా కూడా మళ్లీ మనకి ఇంద్రియాలుగా తానే ధరిస్తున్నాడు. ఇంద్రియాలు లేకపోతే బయట ప్రపంచంలో దేనినీ మనం అందుకోలేము. మనలో ఐదు ఇంద్రియాలనూ మూసివేస్తే, బయట ప్రపంచముతో మనకు ఏ సంబంధమూ ఉండదు. నిజానికి సాధన పేరున మనము చేసేది కూడా అదే. చిత్తవృత్తి నిరోధన! 'యోగః చిత్తవృత్తి నిరోధకః'. చిత్తము అంటే చైతన్యము ఐదు ఇంద్రియముల

ద్వారా బహిర్గతం అవుతుంది. ఇప్పుడు మనం యోగసాధన పేరున ఏమి చేస్తామంటే, దాన్ని మళ్ళా వెనక్కి రప్పించుకుంటాము. అసలు బయటకు ఎందుకు వెళ్ళాలి? బయటికే వెళ్ళకపోతే గొడవ లేదు కదా. అది అలా వెళ్ళకపోతే నీకు తినాలని తెలియదు, చచ్చిపోతావు. తాగాలని తెలియదు. ఎక్కడో గుంటలో పడిపోతావు. భూమి మీద లేకపోతే నీళ్ళలో పడిపోతావు. అగ్నిలో పడిపోతావు కనబడకపోతే. వినబడక, కనబడక, వాసన చూడక, రుచి చూడలేక, స్పర్శ తెలియక వుంటే ఏమవుతుంది చెప్పండి జీవుడికి? అందుకనే జీవుడికి ఐదు ద్వారాలు పెట్టాడు బయటికి. అవి తను ధరించాడు. ఇంద్రియాలు ధరించిన భగవంతుణ్ణి 'అనిరుద్ధుడు' అంటారు. కపిలుడు, దేవహూతికి 'తల్లీ! ఇంద్రియాలు ధరించిన దేవుడు 'అనిరుద్ధుడు'. మనస్సును ధరించిన దేవుడు 'ప్రద్యుమ్నుడు'. బుద్ధిలోకాల వరకు దిగి వచ్చినవాడు 'సంకర్షణుడు'. ఆ పైన సమస్తమూ వ్యాపించి నీలో కూడా వున్నవాడు 'వాసుదేవుడు' అని' చెప్తాడు. మీరు మీ అంతట చదువుకుంటే చాలా technical గా వుంటుంది. అది తీసివేసి కపిల, సాంఖ్య అని చెప్పి ఇచ్చాను 'Sankhya- The sacred doctrine' లో. ఇంతే ఈ నాలుగే. అంతటా వ్యాపించినవాడు, మనలో కూడా వున్నాడు. వాడు వాసుదేవుడు. వాడు ముందు వెలుగును ధరించి వున్నాడు. మనలోనికి దిగిరావడమే సంకర్షణ. అక్కడ నుండి వెలుగులోకాల లోనికి, మనోలోకాల్లోకి దిగివస్తాడు. అక్కడ నుండి ఇంద్రియాల్లోకి దిగివస్తాడు. అక్కడ నుండి శరీరములోని అణువణువున తానే ఉన్నాడు. దిగివస్తాడు. అక్కడ నుండి బయటకు వెళతాడు. మనకి, బహిర్గతమైన ప్రపంచానికి ఏమిటి ఆధారం? మనం interact అవ్వడానికి, ప్రవర్తించడానికి? బహిర్గతమైన మనస్సు, ఇంద్రియములు, శరీరం ఈ మూడూ లేకపోతే బయట ప్రపంచముతో మనకు ఏమీ సంబంధం లేదు. ధ్యానం పేరున ఇప్పుడు మనం చేసేదేమిటంటే ఆ మూడూ ముడిచేసి, లోపలకి వెళ్ళాలనే అంతర్ముఖమైన సాధన. ఇంద్రియముల యొక్క వ్యాపారం ముందు అరికట్టడమే 'యోగము' అని మొట్టమొదట సూత్రముగా, యోగసూత్రములలో పతంజలి మహర్షి చెపుతాడు. మనం కన్నులు మూసుకున్నా కూడా అంతకు ముందు చూసిన దృశ్యాలే, అంతకు ముందు విన్న విషయాలు, మాట్లాడిన మాటలు ఇవన్నీ మనకు మెలుగుతూ వుంటాయి. పంచేంద్రియముల చేత పొందినవే మళ్ళీ గుర్తు వస్తూ వుంటాయి. ఈ పంచేంద్రియాలను సమీకరణ చేసుకుని, మనస్సు బలం చేసుకుని, దాన్ని బుద్ధి అనే వెలుగులోనికి ప్రవేశపెట్టడానికి, షోడశోపచార పూజ వినియోగపడుతుంది. ఇవన్నీ ధరించినవాడు, వాడున్నాడు కాబట్టి నీవు వెనక వెనక వెళితే, నీవు వెలుగు లోకాల్లోకి వెళతావు. అక్కడ నేనున్నానని తెలుస్తుంది. నీవు ఉండడం అంటే ఎలా వున్నావు? వాడే నేనుగా వున్నానని తెలుస్తుంది. అప్పుడు ఇవన్నీ వాడి పొరలు అని తెలుస్తుంది. ఉల్లిపాయ పొరల్లాగ అంతా అల్లుకుని వున్నాయి. అంతమాత్రం చేత ఉల్లిపాయ పొరలన్నీ విప్పేస్తే ఏమి కనిపిస్తుంది లోపల? చోటే! వాడు కూడ అంతే.

ఉల్లిపాయ అంటే మొదటి పొరా, చివరి పొరా, మధ్య పొరా, మొత్తమా? ఉల్లిపాయ చాలా పెద్ద జ్ఞానానికి సంబంధించినది. ఇన్ని పొరల్లో ఏ పొర ఉల్లిపాయ? అన్ని పొరలూ కలిపి ఉల్లిపాయ. పైన మనం తీసేసే తొక్కు లాంటిది శరీరం. లోపల ప్రతీపొర ఉల్లిపాయ. కాబట్టి అన్నీ విప్పేస్తే? ఇప్పుడు ఈ ఇంటికి గోడలన్నీ తీసేసామనుకోండి, ఏమి మిగులుతుంది? మొత్తం చోటులో ఈ చోటు కలిసి పోతుంది. అలా వుంటాడు. ఇలా కలవకుండా ఉండేవాడు ఒకడున్నాడు సృష్టి వున్నంతకాలం, ఎనిమిదవ పొరలో వాడుంటాడు జీవుడిగా. వాడు తొమ్మిదికి సంబంధించినవాడు. అందుకనే జీవుని అంకె కూడా తొమ్మిదే! మొత్తం వెలుగు నుండి ఒక అంకెగా, ఒక వెలుగు ముద్దగా వీడు వచ్చాడు. అందుకనే మన అంకె తొమ్మిది అని తెలియాలి. మనకు ఒకడున్నాడు. వాడితో కలిస్తే పది అవుతాం. తొమ్మిదితో, ఒకటి కలిస్తే పది అయితే తను విడిగానూ, మొత్తము సృష్టి, దానియొక్క వైభవము విడిగానూ గోచరిస్తాయి. సృష్టి వైభవము అనుభవిస్తాడు గానీ, సృష్టికి అంటుకుని వుండడు. అది పది నెంబరు. భగవంతుడు అలా వున్నాడు. ఇదంతా సృష్టించినా కూడా దీనిని అంటుకుని లేడు. వీటియందు నిండియున్నా కూడా ఏదీ ఆయనకు అంటదు. అలా నీవు కూడా వాడిలో కలిసి ఉంటే, తొమ్మిదిని పది కలిస్తే ఏమైంది? పందొమ్మిది. పందొమ్మిదంటే ఒకటి తొమ్మిది, పది. తొమ్మిదిని పది కలిస్తే పదై పోతావు. కలవకపోతే తొమ్మిది, ఎనిమిది పొరలతో కలుస్తుంది. పదహారు పొరలు లింగ శరీరానికి అని చెప్పాను. ఇప్పుడు ఎనిమిది పొరలు చెపుతున్నాను. అంటే అందులో సగమన్నమాట. ఒక్కొక్క చోట ఒక్కొక్క రకంగా. 'ఏకం సత్ విప్రా బహుధా వదంతే' అని ఒకే సత్యాన్ని తెలిసినవాళ్ళు రకరకాలుగా చెప్పారు. ఇప్పుడు మీకు చెపుతున్నది భగవద్గీతలో ఎనిమిదో అధ్యాయంలో శ్రీకృష్ణుడు చెప్పినది. అష్ట ప్రకృతులతో నీవు కలిసిపోతావు. అష్ట ప్రకృతుల్లో కలిస్తే తొమ్మిది, ఎనిమిదితో కలిస్తే ఎంతైంది? పదిహేడు. ఏడు, ఒకటి కలిపితే ఎనిమిది. కాబట్టి నీవు వుంటే దివ్యత్వంగా, దేవుడిగా వుండవచ్చు లేకుంటే బందీకృతుడైన జీవుడిగా వుండవచ్చు. ఈ రెండింటిలో దేన్నో ఒకదాన్ని ఆశ్రయించకుండా వుండడానికి వీలులేదు. అదీ అక్షర పరబ్రహ్మ యోగం, ఎనిమిదో అధ్యాయం! అందులో ఈ రహస్యం ఇచ్చారు. అక్కడ మనని మనం ఓంకారంగా గుర్తించే మార్గం ఇచ్చారు. అక్షరం అంటే ఓంకారం. ఓంకారం యందు మనం ఇమిడి, ఓంకారమే మనము అని తెలిసినప్పుడు సమస్తమూ ఓంకారము ద్వారా ధరించబడ్డది అని తెలుస్తుంది. ఎందుకంటే భగవంతుడు ఓంకారం కాదు. భగవంతుడికి మొదటి శరీరము నాదం. నాద శరీరుడు. కాబట్టి మొదటి తొడుగు నాదం. రెండవ తొడుగు వెలుగు. ఇంక అక్కడ నుండి మిగతా తొడుగులన్నీ వుంటాయి. అందుకని నీవు నాదం నుండి దాని పుట్టుకస్థానం లోనికి వెళితే, అక్కడ నుండి నాదం ఒక 'భృత్' అంటే ఒక ధరించింది. ఒక భరించింది. వెలుగు ఒక ధారణ. అక్కడ నుండి అష్ట ప్రకృతులు ఒక ధారణ. ఇలా ధారణ చేసుకుంటూ వస్తాడు. మనం మామూలుగా ఇంద్రియములన్నీ ఒకటే అనేస్తాం. కానీ ఐదు

ఇంద్రియములకు, ఐదు gradations వున్నాయి. ఆకాశం, తర్వాత వాయువు, తర్వాత అగ్ని, తర్వాత జలము, తర్వాత పృథ్వి ఇలా. అందుకని మళ్ళీ ఇవి పదహారు అని కూడా చెప్పుకోవచ్చు. అలాగే ఈ ఐదు ఇంద్రియములు, ఐదు కర్మేంద్రియముల ద్వారా వ్యక్తమవుతూ వుంటాయి. వాటికి అనుసంధానం వుంది. కర్మేంద్రియములకు, జ్ఞానేంద్రియములకు, తన్మాత్రలకి సంబంధం వుంది. ఆ సంబంధమే మీకు కపిలుడి కథ చెప్పిన దానిలోను, తర్వాత 'Healing' అనే పుస్తకములోను ఇచ్చాను. ఐదు ఐదుగా దిగి వస్తూంటాయి అన్నీను. అన్నిటికీ మొదటి gradation నుండి చివరి వరకు. మనకు ఇప్పుడు ఉదాహరణ చెప్పాలంటే ముక్కు, వాసన, భూమి. ఈ మూడూ ఒకటి. భూమి లేకపోతే వాసన లేదు. ముక్కు లేకపోతే వాసన చూడలేవు. వాసన లేకపోతే ముక్కు, భూమి వున్నా నీకు తెలియదు. ముక్కు వుంది, భూమి వుంది నీకు వాసన చూసే తన్మాత్ర లేదనుకో. ఏమి చేస్తావు? వాసన చూసే తన్మాత్ర వుండి, భూమి వుండి, ముక్కు లేదనుకో. ఏమి చేస్తావు? త్రిభుజముగా, అన్నీ triangles గా దిగివస్తాయి. సృష్టంతా కూడా త్రిగుణాత్మకముగా దిగివస్తుంది. అలాగే కన్ను, వెలుగు, చూడడం. వెలుగుంది, కన్నుంది అసలు చూడడం లేకపోతే? కళ్ళుండి చూడలేని వారున్నారు. ఈ మూడు లేకపోతే అది పూర్తవదు. ఇలా ప్రతీదీ ప్రతీదానిలోంచీ ఇలా ధరించుకుంటూ, ధరించుకుంటూ పొరలు, పొరలుగా వుంటాడు. ఆ పొరలలో మనకి classification ఒకటి వెలుగును ధరించినవాడు, రెండు శరీరము మరియు జీవులను ధరించినవాడు. అందుకే దేవుడికి మొదటి వాహిక జీవుడు. జీవుల మొత్తము యొక్క సమీకరణమే అమ్మవారు. శంఖారావములో మాస్టరుగారు మొదటి మూడు పేరాలలోనే ఇది ఇచ్చారు. బాగా చదువుకోండి. ఎప్పుడూ కూడా చదివేశామని అనుకోబోకండి. భగవద్గీత చదివేశామనుకున్నవాడు తెలివిలేనివాడు. మహాత్ములు వ్రాసిన పుస్తకాలు చదువుతూ వుండాలి. ఇది present continuous తప్ప past కాదు. మనలో ఎంత సంస్కారం పెరుగుతూ వుంటే, అంత అందులో దర్శనాలిస్తూ వుంటాయి. ఈ నామాల యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే తత్త్వంలో ఇమిడి యుండడం. తత్త్వము నుండి పొరలు. అందులోనికి వెళితే ఇవన్నీ వుండవు. ఎందుకని గుర్తు తెచ్చుకోవాలీ అంటే, చీకట్లో బావిలో ఉండిపోయిన వాళ్ళం, బయటికి రావాలంటే ఒక త్రాడు కావాలి కదా. ఆ త్రాడు మనలో చైతన్యపు దారం లాగ వున్నది. 'సూత్రే మణి గణాయివ' అంటాడు. సూత్రమునకు ఎక్కించిన పూసలుగా, నేను ఆధారంగా ఇన్ని లోకాలు ఏర్పడివున్నవి అని భగవద్గీతలో చెపుతారు. నీ వరకు, నీలో నేను నీలాగానే వుంటాను కాబట్టి నీవు ఆధారంగానే ఇదంతా నిలబడివుంది అని చెపుతాడు. నువ్వే లేకపోతే ఇవన్నీ ఏమీలేవు. నీలో వుండే ఏడు లోకాలు లేవు. కాబట్టి ఈ భావం ఎంతసేపు వుంటే, అప్పుడు ఇవన్నీ తొడుగులు. తొడుగులకు విలువ ఎప్పుడు? 'వాడు' వుంటే విలువ, తొడుగులను బట్టి మనిషికి విలువ ఇచ్చే ఒక పద్ధతి వున్నది. మంచి బట్టలు, మంచి నగలు వేసుకుంటేనే గానీ

బాగుండం అని మనకో నమ్మకం కదా. కానీ మంచి బట్టలకు, ఆభరణాలకి, నగలకి విలువ ఇచ్చేట్టుగా కొంతమంది వుండరు. వాళ్ళూ మహాత్ములంటే! ఎందుకంటే ఇవన్నీ తొడుగులే కదా. బుద్ధి లోకము ఒక తొడుగు, మనోలోకము, ఇంద్రియ లోకము, శరీరం ఒక్కో తొడుగులు. హనుమంతుడు మహాజ్ఞాని కాబట్టి రామచంద్రుని చూసినప్పుడు, లక్ష్మణస్వామిని చూసినప్పుడు, 'ఓహోహో! జీవితంలో మొట్టమొదటి సారి చూశాను ఆభరణాలకు వన్నె తెచ్చిన మూర్తులు' అంటాడు. కొంతమంది నగలు పెట్టుకుంటే నగలకే శోభ. కొంతమంది నగలు పెట్టుకుంటే పెట్టుకున్నవాళ్ళకు శోభ. ఎంత తేడా వుంది? కాబట్టి తొడుగులకు శోభ ఎక్కడ? వాడుంటే! వాడు లేకపోతే తొడుగుకు శోభ లేదు. శరీరంలో నుండి ఆ తత్త్వం జారితే దానికి శోభ ఏముంది? తొందరగా మోసుకుపొండి, వాసన వచ్చేస్తుంది, అని చెప్తారు. ఎంత మనవాడనుకున్నా ఉంచుకుంటామా మన దగ్గర? 'భార్యా భిభ్యతి తస్మిన్మాయే' అన్నారు శంకరాచార్యుల వారు నీ శవాన్ని చూసి నీ భార్య కూడ జడుసుకుంటుంది

భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే నహినహి రక్షతి డుకృణ్ కరణే

ఊరికే తెలివితేటలు అనే circus లో జీవించకురా. సమయం వచ్చిందంటే మొత్తం పోతుంది. ఈ లోపల నువ్వెవరో తెలుసుకో. నీవు గోవిందుడిని భజన చెయ్యి. తద్వారా తెలుసుకో. నీ భార్యను గానీ, భర్తను గానీ ఎవరని నీవు అనుకుంటున్నావు? మామూలుగా శరీరం అనుకుంటాము. కాదు. స్వభావం అనుకుంటాం. అయితే ఆ శరీరం అక్కడే వుంది కదా, ఎందుకు భయం? పోయిన భర్త గురించి భార్యకు, భార్య గురించి భర్తకు శరీరం పోయినా భావం పోయిందా? అసలు దేనిని నీవు భార్యగా చూస్తున్నావు, దేనిని భర్తగా చూస్తున్నావు? వాడిని కదా చూస్తున్నావు. వాణ్ణి చూసేవాడికి శరీరం పోతే పోయినట్లు కాదు. శరీరం పోయినంత మాత్రాన నీ మిత్రుడు గానీ, భార్య గానీ, భర్త గానీ ఎవ్వరూ పోలేదు. పోయాడని అనుకునేవాడు ఎవడయ్యా అంటే తెలియనివాడు. తొడుగులయందు శ్రద్ధ కలవాడు మాత్రమే అలా అనుకుంటాడు. అసలు విషయమునందు శ్రద్ధ కలవాడికి మాత్రం పోవడం అంటూ ఏమీ వుండదు. ఇల్లు పడిపోతే పోయిందని అనుకోకూడదు. చోటు వున్నది కదా, మళ్ళీ వస్తుందనుకోవాలి. అలా వుంటారు వాళ్ళు. వాళ్ళు 'దానిని' చూస్తారు. 'అది' ఎప్పుడూ వుంటుంది కాబట్టి, దానియందు లగ్నమై యుంటారు. కాబట్టి అలా ఉన్నవాడికి 'వుంటాడు'. ఉండడమే కాదు వాడి స్ఫూర్తి నీకు వినిపిస్తుంది. వాడి రూపం నీకు కనిపిస్తుంది కూడా. అదీ చిరంజీవులనే వాళ్ళు శరీరం వదిలిన తర్వాత కూడా గోచరించడం! అంతేకాదు మనకు అత్యంత ప్రియమైనవాళ్ళు పోయిన తర్వాత కూడ, కలల్లో కనిపిస్తూ వుంటారు కదా. ఉన్నాడా, పోయాడా? ఉన్నాడు. వాణ్ణి పెట్టుకున్న ఇటుకలు ఇవన్నీ పోయినవి తప్ప రూపం వెలుగుగాను, మరొకటి గానూ వుంటూనే వుంటుంది. అందుకని పెద్దలేం చెప్తారంటే

'ఎవరో పోయారనిగానీ, వచ్చాడని గానీ అనుకోవద్దు. రావడం, పోవడం అనేది లేదు. ఎప్పుడూ వుంటాడు'. అదీ భగవద్గీతలో మొట్టమొదట అర్జునుడికి కృష్ణుడు చెప్పిన బోధ. మీ తాతలు, తండ్రులు, గురువులు వాళ్ళందరూ ఎక్కడికీ పోరు, కాకపోతే బట్టలు మార్చుకుంటారు, అంతే! అందరూ ఇక్కడే వుంటారు. అంతేకాదు యుద్ధం కోరి పోయినవాళ్ళంతా మళ్ళా వచ్చి యుద్ధాన్నే కోరుకుంటారు. అందుకని మానవజాతికి యుద్ధం బెడద ఇప్పుడప్పుడే పోదు అని చెప్తారు. అంటే తెలిసినవాడు అలా వుంటాడు. కాబట్టి అన్నీ తానే ధరించి వున్నాడు. ఏవి, ఎప్పుడు, ఎంతకాలం అనేది తెలుసు. జీవుడనేవాడు ఎల్లకాలం వుంటాడని, శరీరం వుండకపోవచ్చు కానీ. పంచభూతాత్మకమైన శరీరము కాబట్టి పంచభూతాలు ఎప్పుడూ వుంటాయి. మనం కొండంతా త్రవ్వితే, కొండ తగ్గిపోయింది. కానీ ఏమైంది? ఆ పదార్థమంతా ఇళ్ళ రూపంలో వుంది. Total matter ఎక్కడికీ పోదు. అలాగే total water ఎక్కడికీ పోదు. మొత్తం జలం భూమిమీద వుండేది ఆకాశం లోనికి వెళ్ళినా, ఆకాశం నుండి మళ్ళీ దిగివచ్చి మళ్ళీ నదుల్లోనూ, కాలువల్లోనూ అన్నిటిలోనూ మళ్ళీ ఇక్కడే పడుతుంది. మళ్ళీ అలా అలా ఇళ్ళలోకి, స్నానాల గదుల్లోకి, మనకు ఎక్కడ అవసరమైతే అక్కడికి వెళుతుంది. కాబట్టి మొత్తం జలం ఎప్పుడూ అంతే. మొత్తం పదార్థము, మొత్తం వేడిమి, మొత్తం వాయువు, మొత్తం ఆకాశం అంతా అంతే. ఏదీ పోదంటాడు. మరి ప్రళయం సమయంలో ఏమౌతుందంటే పదార్థము, జలంలోకి వచ్చి ఇమిడివుంటుంది. జలం అగ్ని లోనికి, అగ్ని వాయువు లోనికి, వాయువు ఆకాశం లోనికి ఇమిడిపోతాయి. ఆకాశం అనే వెలుగు 'నా' లోకి ఇమిడిపోతుంది. ఇవన్నీ ఇమిడిపోయినవే తప్ప వున్నాయి. వృక్షము యొక్క మొత్తం ప్రణాళిక గింజలో వున్నది. ముందే చూద్దామని గింజ పగలగొట్టి చూస్తే కన్పిస్తుందా? కానీ వున్నది. మామిడిచెట్టు గింజ మళ్ళీ మామిడిచెట్టు లాగే వస్తుంది. మానవుడికి మానవుడే వస్తాడు బయటకి. జంతువు జంతువుగానే వస్తుంది. తొమ్మిది నెలలు అయిన తరువాత మనకి పుట్టేది పందో, ఎనుగో, కుక్కో తెలియదంటే ఎలా? భయం వేయదూ? అందులోనూ బీజమే, జంతువులోనూ బీజమే. గింజగా చూస్తే నీకు ఏ గింజో తెలియదు కదా. కానీ విచ్చుకుంటే మొత్తం అంతా అందులోనే వుంది. అంటే అవన్నీ ఇమిడిపోయి వుంటాయి. అందుకని ప్రళయమప్పుడు జీవుడు నాలో ఇమిడిపోయి వుంటాడు తప్ప ఇంకొక పద్ధతి లేదు. మళ్ళీ తలుపులు తెరవగానే ఒక్కొక్కడు బయటికి వస్తాడు. భాగవతంలో మొదటి స్కంధం లో నారదుని, 'నీవు తర్వాతి కల్పంలో బయటికి వస్తావు' అన్నారంటే క్రిందటి జన్మే తెలియదు, మనకి. అటువంటిది భాగవతం ఉపదేశానికి, నారదుడు వ్యాసుడికి ఏ వృత్తాంతం చెప్పాడండీ? ఈ కల్పం కాదు ఆయన చెప్పిన కథ. యుగం కూడా కాదు. ముందు కల్పం. అంటే మనకు ఈ జన్మ కాదు, యుగం కాదు, మహాయుగం కాదు, మన్వంతరం కాదు. ఈ బ్రహ్మగారు కాకుండా, ఇంతకు ముందు బ్రహ్మగారి నుండి తను వచ్చినప్పుడు, తనకు జరిగిన

ఉపదేశం ఆయనకు గుర్తుందీ అంటే, అసలు మనం ఊహించగలమా ఆ dimension? పూర్వజన్మ వృత్తాంతం అని రాస్తారు కదా. ఏదో ముందు జన్మ అనుకుంటారు నిన్న లాగ. నిన్నటి విషయం కాదు ఇది. అక్కడ నారాయణుడు ఏమి చెప్తాడు? నారాయణుని అనుభూతి కల్గిన తర్వాత, నారదుడు ఆ అనుభూతిలో తాను వుండిపోవాలని చాలా తాపత్రయపడతాడు. 'నువ్వు తాపత్రయ పడ్డకొద్దీ దానికి దూరంగానే వుంటావు తప్ప, అందులో ఇమడలేవు. అందుకని ఇప్పుడు నీకు అవ్వదయ్యా, వచ్చే కల్పంలో పూర్ణ పురుషుడిగా దిగివస్తావని' చెప్తాడు. ఏమిటి వచ్చే కల్పం అంటే, 14 మన్వంతరాలైతే వెయ్యి మహాయుగాలు అవుతాయి. నాలుగువేల యుగాల క్రిందటి విషయం మాట్లాడుతున్నాడాయన. అప్పటి నుండీ వున్నాడండీ, ఆయన. ఎంత చూసాడు? అందుకని నారదుడిని మించినవాడు లేడు. అసలు ఈ భూమి పొరలు, సూర్యమండలం పొరలు దాటి అనుభూతి పొందాలంటే, నారదుని దర్శనం కావాలి. Grandest Master! ఇప్పుడు మనకుండే భూమండలానికి మనం మైత్రేయ మహర్షిని జగద్గురువుగా భావన చేస్తున్నాం. ఈ గోళాలన్నీ కలిపితే సూర్యుడు. అటువంటి వాళ్ళు 12 మంది. వాళ్ళందరూ మొత్తం 60 నక్షత్ర మండలాలకీ గురువు నారదుడే! మామూలు విషయం కాదు. నారద, నారాయణ అక్కడ ఏ శబ్దం వున్నదో, ఇక్కడ కూడా అదే శబ్దం. ఆ 'నార' శబ్దము ఇక్కడ కూడా వున్నది. 'నా' అంటే ఆరోహణలో మళ్ళీ తత్త్వంలోకి తీసుకెళ్ళే దారి. 'ర' అంటే అటునుండి దిగివచ్చే దారి. 'దా' అంటే ఇచ్చేవాడు. అటు నుండి ఇటు, ఇటు నుండి అటు జీవుడు ఎక్కడా అడ్డు లేకుండా 14 భువనాల్లో కూడా తిరిగి రాగలిగి, దారి చూపించగల్గిన ఒకే గురువు నారదుడు. ఎంత పెద్ద విషయాలు? వాళ్ళందరి గురించి బాగా meditate చేయాలి. 60 మంది భార్యలు, 60 మంది పుత్రులు నారదుడికి ఒక జన్మలో అని చెప్తాడు కదా ఇవి 60 constellations. అటువంటి మహత్తరమైన విషయాలు మనకు ఊరికే ఎందుకూ కానట్టుగా ఇచ్చివేసారు. కాబట్టి మనకు ఎందుకూ కాకుండా పోయాయి. కానీ లోతుల్లోకి వెళితే, చాలా మహత్తరమైన విషయాల్లో రెండే పేర్లు మీకు కనిపిస్తాయి. నారాయణుని తర్వాత నార తో వచ్చేది ఈయన పేరే. ఆయన తలుచుకొనే నామం నారాయణ నామం. నారాయణం 'ఆయనం' అంటే path of water అని అర్థం. జలం అంటే మనం చూసే జలం అనే కాదు. అన్ని స్థితుల్లోనూ జలం ఉంది. ఆకాశంలో విద్యుత్, నేలమీద నీరు 'ఆపోవా ఇదగ్ం సర్వం'. ఈ జలముల దారి ఉందే సూక్ష్మము నుండి స్థూలమునకు, స్థూలము నుండి సూక్ష్మమునకు, ఇలా దింపుతాడు, తీసుకెళతాడు. ఆ మార్గాన్ని 'ఆయనము' అంటారు. అయనములో ఒకసారి వెనక్కు పట్టుకుని పోతాడు. అది 'నా'! తర్వాత క్రిందకు పట్టుకొస్తాడు కనబడేటట్టు. అది 'రా'! అది 'నారాయణ'! నారాయణ అనే నామం వచ్చిన చోటు ఒకటి తెలియాలి. 'అంతా cyclical గా వస్తూ వుంటుంది, పోతూవుంటుంది. నువ్వు ఊరికే చూచి వైభవం అనుభూతి చెందాలి తప్ప అందులో వ్రేళ్ళు పెట్టబోక!

ఇరుక్కుంటావు' అంటారు. అందుకనే నారాయణ భక్తులు భాగవతంలో వస్తారు. చక్రంలో తిరగరు. తిరుగుతున్న చక్రాన్ని చూసి, దానియొక్క వైభవమును అనుభూతి చెందుతూ, భగవంతుని స్తోత్రం చేసుకుంటూ వుంటారు. సృష్టి రూపమే భగవంతుని రూపము. భగవంతుని రూపమే సృష్టి. అటు గోళాలు, ఇటు జీవులు, వాళ్ళందరికి పారలు. మన భూమికి కూడా చాలా పారలున్నాయి. భాగవతంలో షష్ఠమ స్కంధములో భూమి పారలన్నీ ఇచ్చారు భూలోకం వరకు. పుష్కరిణి అన్నామే మనం, పుష్కర ద్వీపం అని మన సత్యలోకం లాంటిది భూమికి అది. 'అక్కడికి వెళ్ళినవాడు ముక్తజీవుడు' అని వుంటుంది. భూమి పదార్థం, చుట్టూ జలం, దాని చుట్టూ అగ్ని, దానిచుట్టూ వాయువు, దాని చుట్టూ ఆకాశం అలా వెళ్ళి ఏడు పారలు దాటిన తర్వాత నీకు ఏడో పారలో పుష్కర! అందుకనే పుష్కరక్షేత్రం గురించి మహాభారతంలో ధర్మరాజుకి చెపుతాడు ధౌమ్యుడు. అన్ని క్షేత్రాల్లోకెల్ల ఉత్తమమైన క్షేత్రం 'పుష్కర క్షేత్రం'. అక్కడ స్నానం చేస్తే సమస్త పాపాలు పోతాయి. అక్కడకు వెళ్ళాలంటే నీ పాపాలన్నీ పోతేగానీ వెళ్ళలేవు. అక్కడికి వెళ్తే అన్నీ పోతాయి, నీ శని వదులుతుంది అంటారు. ఒక లోకంలో వున్నది ఏడు లోకాల్లో కూడా దానికి ప్రతీకలుగా వుంటాయి. పుష్కర క్షేత్రానికి ప్రతీకగా భూమిపై మనకి రాజస్థాన్ లో ఢిల్లీ నుండి జైపూర్ వెళ్ళేదారిలో వుంది. దీనిని 'బ్రహ్మక్షేత్రం' అంటారు. 'పుష్కరక్షేత్రం' అంటారు. ఇప్పుడక్కడ ఏమీలేదు. అంతా ఎండిపోయి వుంది. ఇది ఏడవ స్థితిలో వున్న పుష్కరం. స్వామి పుష్కరిణి తిరుపతిలో వుంది. ప్రతి ఆలయానికి పుష్కరిణి ఉంటుంది. అంటే 'ఏడవలోకం అయిన సత్యలోకం నుండి వచ్చిన ప్రజ్ఞ ఆ నీళ్ళలో వుంది' అని పుష్కరిణికి అర్థం. కాబట్టి అందులో స్నానం చేస్తే పునీతులవుతావు. ఇలా భూమికి కూడా పారలున్నాయి. ఈ పారలన్నిటినీ దాటిన తర్వాత 'ధ్రువపథం' వుంటుంది. మనం ఎరిగిన సప్తర్షి మండలం కూడా దాటి వెళ్ళినది ధ్రువపథం! అదికూడా ఆ స్కంధంలోనే వుంది. అంటే ఇన్ని పారలుగా మనకు 'ధ్రువము' ముందు ఏర్పడి, సమస్తమైన జగత్తు ధ్రువం ఆధారంగా ఇలా గోళంగా చేయబడింది. అదీ ధ్రువుడు! ధ్రువుడు తపస్సు చేస్తుంటే చుట్టూ చోటంతా వంగిపోయింది అంటారు. అది చోటనకుండా భూమి అంటారు. భూమి వంగడం కాదు. అది మొత్తం పరుచుకుని పోయిన ఆకాశం అంతా, గోళంగా ఏర్పడింది. ఆయన నారాయణుని గురించి తపస్సు చేశాడు. మన భూమి మీద జరిగిన కథ కాదు. వామనుడి దగ్గర నుండి భూమి కథ మొదలైంది. అంతకుముందు నరసింహావతారం భూమికి సంబంధించినది కాదు. వరాహావతారం అసలేకాదు. మత్స్యావతారం కానేకాదు. మత్స్యము, కూర్మము, వరాహము వేరే జరిగినవి. అక్కడ నుండి వామనుడు, తరువాత భూమి మీద జరిగినవి పరశురాముడు, రాముడు, కృష్ణుడు. అందుకనే మనకి చెప్పిన ధ్రువుడి కథ చాలాముందు వస్తుంది. ఆ ముందు వచ్చిన కథలో ఆయన కారణంగా మొత్తం చోటంతా గోళంగా ఏర్పడింది. అది భూమి! భూమి అంటే భూమిక! That is the area where the

creation shall happen. విశ్వం అంతా కూడా అందులో నిర్మాణం చేయబడుతుంది. అందుకని ధృవపథం నుండి చూస్తే తాబేలు వంటి మీద కనబడ్డట్టుగా సమస్తమైన నక్షత్ర మండలాలు, సప్తర్షి మండలాలు కూడా గోచరిస్తాయి. అది ధృవుడిని నారాయణుడు అనుగ్రహించిన తీరు. సామాన్యమైనది కాదు. ఎక్కడ పెట్టాడు? సప్తర్షులకన్నా పైన పెట్టాడు. అక్కడ నుండి చూస్తేట తాబేలు డిప్పలాగా కనపడుతుంది. అలాగ ఇక్కడ 'శారమేయ మండలం' అంటే Serius అంటాం. అలాగే కృత్తికా మండలం, అలాగే ఒక సప్తర్షి మండలం ఇలా అన్నీ పై నుండి మనం overview చూడవచ్చు. అదీ ధృవుడు! చదువుకోవాలి. నేనెందుకు చదువుకోమన్నానంటే జ్ఞానం పెరగాలని కాదు, భగవత్తత్త్వం యొక్క లోతు తెలియడం కోసం. ఆ విధంగా చదువుకున్నంతసేపు ఆ తత్త్వంతోనే వుంటాం మనం. ధృవుణ్ణి అనుగ్రహించినట్లుగా ఎవరినీ భగవంతుడు అనుగ్రహించలేదు, అనిపిస్తుంది. మళ్ళీ ఇంకొకటి చదువుకుంటే వాడిని అనుగ్రహించినట్లుగా ఇంకొకళ్ళనెవరినీ అనుగ్రహించలేదని అనిపిస్తుంది. బలి చదువుకున్నా అలాగే అనిపిస్తుంది. పైన, క్రింద ఏముంది? తెలిసినవాడికి అంతా ఒకటే. కాకపోతే ధృవుడికి అటువంటి పథం కల్పించాడు. రెండవసారి తపస్సు అయినతర్వాత అక్కడికి చేరుకుంటాడు. మొదటి తపస్సున ఆశీర్వదిస్తాడు. ధృవపథం నుండి పారలు పారలుగా ఇవన్నీ ఏర్పడినాయి. గోళాలన్నీ ధరించి యున్నాడు. ధృవుడి కథ అంతా కూడా గోళాలు ఏర్పడినవని, ధృవుడి తండ్రి ఉత్తానపాదుడని, ఆయన నుండి దిగి వచ్చిన సంతతి అంతా కూడా గోళములు ఏర్పడే కథ! ఆ ఉత్తానపాదుడికి, ప్రియవ్రతుడు అని తమ్ముడుంటాడు. ఆయన నుండి జీవులు దిగివచ్చిన కథ. రెండు కథలు. గోళములు పుట్టుక కథ ఒకటి, గోళముల మీదకి జీవుల్ని ఏర్పాటు చేసిన కథ ఒకటి. ఈ రెండు కథల్ని కలపడం పృధుచక్రవర్తి కథగా వస్తుంది. కలిపి, ఈ జీవులకి ఈ భూమిమీద వుండే విషయాల మీద అనుసంధానం కలిగించడం. నీవున్నావు, శరీరం వుంది. ఈ శరీరముతో వీటన్నిటినీ ఎలా వాడుకోవాలో తెలియకపోతే ఏమి చేస్తావు? శరీరం భూగోళం అనుకోండి. నువ్వు వెలుగు. వెలుగు రావాలి. లోపల ప్రవేశించావు, ఏమి చెయ్యాలో తెలియదు దీన్ని. అదా purpose? Car ఉంది, నువ్వున్నావు, driving రాదు. దాన్ని చూస్తూ ఏడిస్తే ఎలా? వాహనాన్ని ఎలా వాడుకోవాలో తెలిసినవాడికి కదా దాని యొక్క అనుభూతి. ఎటూ వెళ్లలేము, ఏదీ చూడలేము. కాబట్టి అటు దాన్ని, ఇటు దీన్ని అని చెప్పడం కోసం రెండింటినీ ఒక్కసారి చెప్పాడు ఈ నామంలో. 'శరీరభృత్' ఒకటి, 'భూతభృత్' ఒకటి. అంటే ఒకటి గోళాలకి సంబంధించిన కథ, ఉత్తానపాదుడి కథ. ఒకటి జీవులకు సంబంధించిన కథ, ప్రియవ్రతుడి కథ. ఆ తరువాత వాళ్ళిద్దరినీ అనుసంధానము చేసిన కథ, ప్రచేతసుల కథ. ప్రకటింపబడిన చేతస్సు కలిగిన వాళ్లమవుతాం. ప్రచేతసుల కథ అంటే ఇంద్రియాలను వాడుకుని జీవుడు బయటికి వ్యక్తమవడం. ఇంద్రియాలు లేకపోతే నీవు బయటకు వ్యక్తం కాలేవు కదా.

అంతర్ముఖుడైన జీవుని, బహిర్ముఖుణ్ణి చేయడానికి చేతస్సు కావాలి. ప్రచేతస్సు అంటే ప్రకటించిన చేతస్సు, వ్యక్తమైన చేతస్సు. అంటే ఇంద్రియాలనే ఐదు గొట్టాలలోంచి వ్యక్తము చెందే కథ. ఆ తర్వాత భూమిమీద ఏమి తినాలో, ఏమి తినకూడదో (ఒకటి తినబోయి ఒకటి తింటే చస్తాడు) అది పృథుచక్రవర్తి కథ. ఈ భూమిని గోవులాగ క్షీరం అంటే పోషక పదార్థాలు, ఔషధులు తయారు చేసుకునే కథ. అన్నీ ఈ శరీరాన్ని పోషించడానికే, జీవుణ్ణి పోషించడానికి కాదు. ఈ భాగవతం ఎంత పెద్ద శాస్త్రం! భాగవతం అంటే గజేంద్రుడి మోక్షం, అంబరీషోపాఖ్యానం, ప్రహ్లాదుడి కథ మాత్రమే అనుకుంటారు. ఏదో దేవుని గురించి పాగుడుతాడండి, పద్యాలుంటాయండి. కాదు మొత్తం బ్రహ్మాండము యొక్క నిర్మాణం, పిండాండము యొక్క నిర్మాణం. పిండాండము అంటే నీవు... జీవుడివి. నీలో కూడ మళ్ళీ బ్రహ్మాండమంతా వుంది. బ్రహ్మాండ, పిండాండముల నిర్మాణము, వాటి మధ్య అనుసంధానమునకు సంబంధించినది భాగవత కథ. ఎవరు ఎవరికి చెప్పారు? నాలుగు రకాలుగా జరుగుతూ వుంటుంది భాగవతం, simultaneous గా. ఏకకాలంలో! ఒకటేమో మనకు తెలిసింది. శుకుడు పరీక్షిత్తుకి చెప్పడం. వాళ్ళందరినీ గుర్తు పెట్టుకోవాలి. శుకుణ్ణి, పరీక్షిత్తుని గుర్తు పెట్టుకోకుండా భాగవతం చదవలేము. ఇంకొకటి నారదుడు వ్యాసుడికి చెప్పినది భాగవతం. బ్రహ్మ నారదునికి చెప్పినది భాగవతం మూడు. నారాయణుడు బ్రహ్మకు చెప్పిన భాగవతం నాల్గవది. ఇదికాక కలియుగములో విదురుడికి మైత్రేయుడు చెప్పినది భాగవతం. కృష్ణుడు మైత్రేయుడికి చెప్పినది భాగవతం. చూడండి ఎన్ని teacher--student relationships ఉన్నాయో? మైత్రేయ--విదురుడు, కృష్ణ--మైత్రేయులు, శుక--పరీక్షిత్తులు, నారద--వ్యాసులు, బ్రహ్మ--నారదులు, నారాయణుడు--బ్రహ్మ. ఇన్ని రకాలుగా వుంటాయి. వాళ్ళందరినీ తలుచుకోవాలి. ఎందుకంటే అక్కడ teachers వున్నారు, disciples వున్నారు. Disciples are also teachers. వాళ్ళను గుర్తుపెట్టుకుంటే చక్కగా అవగాహన అవుతుంది. అలాగే భారతం చదువుకునేటప్పుడు నారాయణుని, నరుణ్ణి, సరస్వతీ దేవిని, వ్యాసుణ్ణి తలుచుకోవాలి. 'నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్' ఉత్తమ నరుడన్నమాట. 'దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్' అప్పుడు నీకు జయం కలుగుతుంది. జయం కలగడం అంటే 'జయము' అనేది భారతమునకు అసలు పేరు. అది నీకు కల్గుతుంది. అందులో వున్నవి 18 సృష్టి రహస్యములు. అష్టాదశ రహస్యములు 18 పర్వాలుగా ఇచ్చారు. అందులో 18 అధ్యాయాలుగా మళ్ళీ భగవంతుని యొక్క సూక్తులనిచ్చారు భగవద్గీతలో. మొత్తం 18 రోజులు, 18 అక్షౌహిణిల సైన్యం యుద్ధంలో పాల్గొన్నది. జయము అంటే సంఖ్యాశాస్త్రం ప్రకారం (ఇదంతా EK గారి శంఖారావంలో ముందు ఉపోద్ఘాతంలో వుంది) యజము, 'య' అనే అక్షరానికి ఒకటి సంఖ్య, 'జ' అనే అక్షరానికి ఎనిమిది సంఖ్య. మనమేమన్నాం పుస్తకం పేరు? 'జయము' అన్నాం. అంటే 'జ' 8, 'య' 1, అంటే 81 గా కనిపిస్తుంది. కానీ

అంకెలు చదవడం పూర్వ సంస్కృతిలో ఇటు నుండి అటు చదివేవాళ్ళు. అటు నుండి ఇటుకాదు. ఆ సాంప్రదాయమే ఇప్పటికీ ఇస్లామ్ లోను, దాని పుట్టుకైన యూదు భాషలోనూ వుంది. అటు నుండి ఇటు చదువుకుంటారు వాళ్ళు. మనం పుస్తకం ఇటు నుండి చదువుతాం కదా. వాళ్ళు వెనుక నుండి ముందుకు చదువుతారు. ఎందుకని? మనకన్నా ముందు విషయం తెలియాలంటే మనం ముందు, తర్వాతన్నీ మిగతావి తర్వాత అని చదవడం కాదు. మనం చిట్టచివర page! అక్కడ నుండి ముందు page లోకి వెళ్ళాలి. ఏమిటో వాళ్ళదంతా తల్లక్రిందులు అనుకుంటాం. కాదు. అదికూడా సత్యంలో ఒక భాగము. అక్కడ మిగిలుంది. ఇక్కడ లేదు. మనం తిరిగి వెళ్ళవలసిన వాళ్ళం కదా. అందుకని పుస్తకం చివరి page నుండి మొదటి page కి చదువుకుంటూ రావడం. అంకెలు కూడా! 'అంకానాం వామతోగతిః' ఎడమ వైపుకు పోతూ వుంటాయి అంకెలు. అందుకని 81 గా కనిపిస్తుంది తప్ప అది 18... అని చెప్పడం కోసం 'జయము' అని పేరు పెట్టారు. కానీ అదేమిటి నిజంగా? యజము! అంటే తన్ను తాను సమర్పణ చేసుకోవడం. దేనికి? ధర్మానికి! సృష్టి ధర్మంలో అత్యుత్తమమైన ధర్మము పరహితం. కాబట్టి ధర్మానికి సమర్పణ చేసుకునేవాడు 'యజము' చేస్తున్నట్లు లేక 'యజ్ఞము' చేస్తున్నట్లు. అంతేగానీ ఊరంతా గొడవ చేస్తున్నవాడు యజ్ఞము చేస్తున్నట్లు కాదు. ఏదో పెద్ద పెద్ద పాకలు వేసి, ఊళ్ళో వాళ్ళందరి దగ్గర డబ్బులు వసూలు చేసేవి రజోగుణం ప్రాముఖ్యంగా జరిగేవి యజ్ఞాలు కావు. అదే అంటాడు బుద్ధుడు. 'పశువుల్ని, మనుషుల్ని చంపడం కాదురా యజ్ఞం. నిన్ను నీవు సమర్పణ చేసుకో' అని చెప్తాడు. అది పురుషమేధం, Man Sacrifice. అశ్వమేధం అశ్వం అంటే నీ బుర్రలో వుండే మెదడు. దానికి సమర్పణ చేస్తే అశ్వమేధం. ఊరికే ఆవుల్ని, గుర్రాల్ని, మనుషుల్ని చంపి యజ్ఞాలేమిటని తిడతాడాయన. ఎవరికీ నచ్చలేదు. కాబట్టి యజ్ఞం చేస్తేనే జయం. మరి జయం కావాలనే కదా అందరికీ ఆశ? నువ్వు ఎంత 'త్యాగేనైకే అమృతత్వ మానసుఃʼ, నువ్వెంత వదిలించుకుంటే అంత అమృతత్వ స్థితిలోకి వెళతావని చెప్పడానికే ఈ 'యజము' పేరు. ఈ యజము మరి చదివేటప్పుడు జయముగా కన్పిస్తుంది. 81 గా కన్పిస్తుంది. కానీ అది నిజానికి 18. కాబట్టి ఇన్ని రకాలుగా రహస్యాలున్నవి. భాగవతంలో గోళాల కథ, జీవుల కథ, గోళాలు-జీవులు కలిపిన కథ, జీవులు గోళము మీదకి వ్యక్తమైన కథ. ఆ తర్వాత ఏమి తినాలో, ఏమి తినకూడదో తెలిసే కథలున్నాయి. అవన్నీ చాలా ముఖ్యమైన కథలు. అసలు తత్వాలు ఎలా ఏర్పడినాయి అని మైత్రేయుడు మొదలుపెట్టి, విదురునికి చెప్పినట్లుగా చెప్తారు.

## 518 భోక్తా

ఎందుకండీ ఇదంతా అంటే తినడానికిట. ఇది ఆయన తినడానికి చేశాడు. మనని, వంకాయని పుట్టించుకుని, మనద్వారా వంకాయని తింటూ వుంటాడు. మనం తింటుంటే చూసి ఆనందిస్తాడు. ఆయన తినవలసింది ఏమీలేదు. అన్నీ ఒకదానికొకటి భోజనంగా అమర్చి వుంచాడు. 'భోజనం భోక్తా' అని ఆయనే భోజనం, ఆయనే భోక్త. అంటే ఆయనే వంకాయ, ఆయనే తినేవాడు. కానీ తినేవాణ్ణి ఒకణ్ణి తయారుచేసి, వంకాయ ఇంకొకటి తయారుచేసి, వాడు అది తింటూంటే చూసి ఆనందిస్తాడు. ఇలా సమస్తాన్నీ మళ్ళీ ఒకదానికొకటి ఆహారంగా చేశాడు. సమస్తం అగ్నికి ఆహారమే. వాయువుకి అగ్ని కలిస్తే! అనిల & అనల్ వాళ్ళిద్దరూ. అనిల్ అంటే గాలి, అనల్ అంటే అగ్ని, అనలం. అదే మనకి నలుడు, నీలుడు అని ఇద్దరున్నారని రామాయణంలో చెప్తారు. వీళ్ళే వాళ్ళు. ఆ ప్రతీ నామంలోనూ లోతులోనికి వెళితే వాళ్ళ తత్త్వం తెలుస్తుంది. అదీ సంస్కృతభాష. నలుడు, నీలుడు నీళ్ళమీద వేస్తే రాయి తేలుతుంది. ఎందుకని? అగ్నికి, వాయువుకు జలము, పదార్ధము లోకువేగా. లోకువ అంటే సమర్పణ చెందే వుంటాయి కదా. వినయ విధేయతలు కలిగివుంటాయి కదా. అగ్ని, వాయువు తర్వాత వచ్చినవి కదా జలము, పృథ్వి. అదీ ఇక్కడి రహస్యం. అందుకనే వాళ్ళిద్దరూ రాళ్ళు వేస్తూ వుంటే తేల్తాయి. రాముని నామం చెప్పడం వలన తేలినవని, రామాయణంలో భక్తిపరంగా తేలినవని చెప్పకుంటారు. రామాయణంలో అలా వుండదు. ఇద్దరు కుర్రాళ్ళు చిన్నప్పటి నుండి ఉద్దండులు, పిడుగుల్లాంటి వాళ్ళు (చిన్న చిన్న కోతులన్నమాట). ఒకడు వాయువు కారణంగాను, ఒకడు అగ్ని కారణం గాను పుట్టారు. చాలా తేజోవంతులు. దగ్గరలో వున్న ఋష్యాశ్రమం లోనికి వెళ్ళి, అక్కడవున్న వంటసామాన్లు, హోమం సామాన్లు తీసుకుని, సముద్రంలో పారేస్తూ వుండేవాళ్ళు. చిన్నపిల్లలు, వాళ్ళకేమీ తెలీదు. శపించడనికి మనస్సు రాదు. తెలిసి చేస్తున్నది కాదు. తెలియక చేస్తున్నవి. ఆకతాయితనం, ఆటతనం, చిన్నతనం. అందుకని వాళ్ళు నీళ్ళల్లో వేసేవన్నీ తేలేటట్టుగా వరం ఇస్తారు వాళ్ళు. ఎందుకంటే వాళ్ళు వేసినవి తేలితే మళ్ళీ తెచ్చుకోవచ్చు. మునిగిపోతే అవి తయారు చేయించుకోవాలి కదా. ఇలా వుంటుంది కథ. కానీ ఈ కథలో వాళ్ళిద్దరికీ ఈ పేర్లు ఎందుకు పెట్టారు? చక్కగా రాముడు, సోముడు అనవచ్చు కదా. నలుడు, నీలుడు. ఒకడు అనల్, ఒకడు అనిల్. అలా వీళ్ళిద్దరి కారణంగా తేల్తాయి రాళ్ళు. అలా ఈ సమస్తమంతా కూడా ఒకదానినొకటి తినేస్తూ వుంటాయి. ఆయన ఇదంతా మూసివేద్దామనుకుంటే, ఇవి మొదలుపెట్టండిరా, అంటే ఒక్కొక్కళ్ళు ఒక్కొక్కటిగా తినేస్తారు. వాడిని వీడు తింటాడు. అంటే మునిమనవడిని, మనుమడు తింటే, మనుమడిని కొడుకు తింటే, కొడుకుని తండ్రి తింటే ఇట్లా అయిపోతుందన్నమాట! అంటే

ముడుచుకుపోవడం. అలా 'భోక్త'! అంతేకాదు ఇక్కడ ధర్మాలు నిర్వర్తించాలంటే, ప్రతీవాళ్ళకు కాస్తోకూస్తో భయం పెట్టాలి. హద్దులు పెట్టాలి. అందుకని ఎలుకకి పిల్లిని, పిల్లికి కుక్కని, కుక్కకి ఇంకొకటి. ఇలాగే మనిషికి కూడా హద్దులు. అన్నిటికీ హద్దులు పెట్టి, ఒకదానికొకటి ఆహారం చేశాడు. అంతా అన్నమే. 'అన్నం బ్రహ్మేతివ్య జానత్' అంటుంది తైత్తరీయోపనిషత్తు. అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నం అంటే బియ్యం మాత్రమే కాదు. పోషకపదార్ధం అంతా అన్నమే! పండు అయినా అన్నమే! మనం అన్నం తిన్నావా? అంటే ఊరికే బియ్యం తింటేనే అన్నం, ఇక మిగతాదంతా అన్నం కాదు కదా మనకి. శరీరాన్ని పోషించేదంతా కూడా అన్నమే. అవన్నీ మనం తింటున్నాం. ఖనిజాలు, అందులోంచి పుట్టే ధాతువులు అవన్నీ, తర్వాత వృక్షాలు, మనం తింటున్నాం. అలాగే వృక్షాలు పదార్ధాన్ని తింటున్నాయి. సూర్యకిరణాలను తింటున్నాయి. నీరుని తింటున్నాయి. ఇన్నిటిని తింటున్నాయవి. ఇన్నిటి రూపంలోంచి వాడే తింటున్నాడు. అదీ అక్కడి అర్ధం. జంతువులు ఎక్కువగా వృక్షాలను తింటాయి. లేకపోతే వాటిలో వాటిని తింటాయి. కొన్ని మనలను కూడా తింటాయి. సరే, మనల్ని అవి తినకుండా రక్షించుకునే తెలివిచ్చాడు మనకి. మనల్ని తినేవాడు ఒకడున్నాడు మనలో. వాడి నుండి రక్షించుకోలేము. వాడు నీ మనస్సు. మనస్సులో జీవించేవాడికి మృత్యువు తప్పదు. కాబట్టి ప్రతివాడికీ వాడి మృత్యువు వాడితోటే పెట్టాడు. ఎందుకంటే return path సులభం చేస్తున్నాడు. ప్రతి విషయంలో కూడా ఒక చిన్న బిందువు పెట్టాడు. మనకి విశుద్ధి చక్రంలో అమృతత్త్వం వుంది, విషం వుంది. చైతన్యవంతుడికి ఇక్కడ గ్రంధులు స్రవించి అమృతత్త్వస్థితి గల్గిస్తుంది. మిగతావాళ్ళు ఇక్కడ నుండే నురగపుట్టి చచ్చిపోతారు. నురగ అంటే విషం. అందుకని విషం, అమృతం కలిపిపెట్టాడు. అన్నిచోట్ల return path ready గా పెట్టి వుంచాడు. మనిషిని మనస్సు తింటుంది. మనస్సుని బుద్ధి తింటుంది. బుద్ధిని ఆయన తింటాడు. ఆవిడ ఆయనలోకి వెళ్ళిపోతే, ఈ వెలుగంతా మూసుకుపోతుంది. Shop close అయిపోతుంది. ఇలా ఒకదాన్నొకటి తయారుచేసుకుంటూ వుంటాడు. ఒకదాన్నొకటి ఆహారం చేసుకుంటూ ఉంటాడు. అంతా self-contained scheme. దేనికీ బయటకు పోనక్కరలేదు. అలా తయారుచేశాడు. అది 'భోక్త'. అందుకని భోక్తగా వచ్చినవాడిని భగవంతునిగా ఆరాధన చేసుకునే ఒక సాంప్రదాయం మనకిచ్చారు. అలాగే మనుషులు తినేటప్పుడు వాడే తింటున్నాడని గుర్తుపెట్టుకుని, తినేటప్పుడు మనిషిని అస్సలు కష్టపెట్టకూడదు. అది మనకి శాపం! మర్చిపోతాం అనుకోండి. తింటున్నప్పుడే arguments అన్నీ వస్తూ వుంటాయి. తినేటప్పుడు మనిషిని బాగా తినమని గానీ, తినవద్దని గానీ అనకూడదు. అది చాలా పాపం. తినేవాడిని నీవు ఎక్కువ తింటావని గానీ, బాగా రుచిగా వుంది కదా అని తింటూ వుంటే వద్దని, అనకూడదు. జబ్బు చేస్తుందని అనకూడదు. తిన్న తర్వాత చెప్పాలి. ఎందుకంటే తినేవాడు 'వాడు'. వాడు తింటున్నాడు. వాడు పదార్ధాన్ని తింటాడు. తినేవాడికి తెలియకపోతే తినేవాడిని పదార్ధము ద్వారా

తింటాడు గుర్తుపెట్టుకోండి. అన్నం విషం అవుతుంది. ఎవరికి? తిన్నది పడనివాడికి కదా. చూడండి ఎట్లా తింటున్నాడో! కాబట్టి మనస్సు చేత తినక్కర్లేదు మనిషిని. అన్నం చేత కూడా తింటాడు. అజామీళుడికి ఏమి తిన్నా అది విషమై పోయిందిటండి. అన్నం వలన పోషణ జరగాలి కానీ, అన్నం విషమై పోయింది అంటే, అంతా తేడాగా వున్నది. వెళ్ళిపోతే సుఖం. ఇంకొకటి ఇస్తారు. Car ఎక్కితేనే accident అంటే ఆ కారు ఎక్కకుండా ఇంకొక కారు ఎక్కితే better. అందుకనే The wish to live is also ignorance అన్నారు. ఇంకా బ్రతకాలి అనుకోవడం 'అజ్ఞానానికి చివరి పొర' అని చెప్తారు. అజ్ఞానం ఒక పొర, నేను వేరుగా వున్నాననుకునేది ఒక పొర. కోరిక ఒక పొర, విముఖత, కొన్ని వద్దనుకుంటాం అది, కూడా కోరికే. వద్దు వద్దు అని కోరుతున్నావు కదా. అది నాకు వద్దు, నాకు కాకూడదు అని కోరుతున్నావు కదా. విముఖత కూడా ఒక అజ్ఞానపు పొర. చాలాకాలం బ్రతుకుదాం అనేది ఒక పొర. ఇట్లా 5 పొరలున్నాయి. అజ్ఞానపు పొరలు. అందుకనే ఆయన ఏమిచేస్తాడంటే, నీవు తినేదాంట్లో నుండి నిన్ను చంపేస్తాడు, finish. బాగుందా! తిను...నీకెందుకు నేను చూసుకుంటాను కదా. నీవు తింటున్న దాంట్లోనుండి నిన్ను తీసుకుపోతాడు. అది 'భోక్త'! అలాగే భోజనం పెట్టేవాడు. తింటున్నప్పుడు ప్రక్కన కుక్క, కాకి వచ్చి నిన్ను చూస్తున్నప్పుడు దానికి పెట్టకుండా నీవు తినక. నీవు తిన్నది నీకు పడదు. ఒకసారి beachకి EKగారి తో వెళ్ళినప్పుడు ఒకచోట కూర్చొని mixture తిందామనుకుంటుంటే, అక్కడకు ఒక కుక్క వచ్చింది. ఆయన ఉల్లిపాయలు, మిరపకాయలు లేని నాలుగు బజ్జీలు తీసుకురమ్మని, ఒకరిని పంపారు. తేగానే దానికి పెట్టారు. అంతవరకు ఆయన mixture తినలేదు. 'అది చూస్తూ వుండగానే మనం తింటే అంతకన్నా దరిద్రం ఇంకేమీలేదు. అశుద్ధం తిన్నట్టే' అని మాస్టరుగారు చెప్పారు. అలాగే కాకి, ఆవు. నువ్వు తింటుంటే ఇంకొక మనిషి అక్కడ వుండగా, వాణ్ణి కూర్చోపెట్టి నీవు కబుర్లు చెప్తూ తినకూడదు. వాణ్ణి చూస్తూ అవస్థపడుతూ తింటుంటే, పోషకపదార్ధం అవదు. ఎందుకంటే నీది ఎటువంటి నోరో, వచ్చినవాడికి కూడా అటువంటి నోరే! నీది, వాడిదీ కూడా హోమగుండమే. అన్నిటిలో నుండి అందుకునేది దేవతలే. కాబట్టి వాడికి అతిథి అనేది అదే అభ్యాగతి, తిథి లేకుండా వస్తాడు. వాడు చెప్పకుండా వస్తాడు. నీవు తింటున్నప్పుడు వస్తే మనిషిగానీ, జంతువుగానీ పెట్టు. ఇంకొక సూత్రం కూడా చెప్పారు. నీవు తిందామనుకునే ముందు అసలు అందరూ తిన్నారో లేదో చూసుకోమన్నారు. మనకి కంచం కనబడితే... అర్జునుడికి పిట్ట కనబడ్డట్టేనట. పిట్ట కన్ను చూడమంటే అర్జునుడికి పిట్ట కన్ను తప్ప ఇంకేమీ కనబడలేదు కదా. కొట్టరా అంటే కొట్టాడు. మిగతా వాళ్ళందరికి తగలలేదు. అలాగే మనకి కంచం పిట్ట కన్నులాగ వుంటుంది. మరి తినడం మొదలుపెట్టామంటే ప్రక్కవాడి సంగతి అక్కరలేదు. కానీ సంస్కారవంతుడు చేయవలసినదేమిటంటే, అందరూ కూర్చునే వరకు కూర్చోకూడదు. అందరికి అన్నీ అందుతున్నాయో లేదో చూసుకుని తినేవాడు

'వాడు'. అప్పుడు 'భోక్త' అర్ధం అవుతాడు. మనకి భోక్త అర్ధం కాదు. మనమే భోక్తలం మన వరకు. మనకు పూజ వచ్చుకదా. మన పూజ మనమే చేసుకుంటే తప్పు. నీకు బ్రహ్మత్వం వహించవలసిన వాడిని ఒకణ్ణి పిలిచి, వాడిచేత నీవు చేసే క్రతువుకు బ్రహ్మత్వం వహింపచేసి, తద్వారా అతడు క్రతువు నిర్వర్తించిన తర్వాత, అతడికి మనస్సు సంతోషపడేట్లుగ దక్షిణ ఇస్తే, అప్పుడది క్రతువు అవుతుంది. అంటే చేయవలసిన పద్ధతిలో చేసినట్టవుతుంది. నీకే శ్రాద్ధం పెట్టడం మంత్రాలు వచ్చు కాబట్టి, నీవే పెట్టేసుకుంటే ఏమీ అవదు గుర్తు పెట్టుకోండి. కనీసం మనకు ఏదో షోడశోపచార పూజ వచ్చు. నిత్యం చేసుకుంటాం. రోజూ బ్రాహ్మణ్ణి రమ్మంటే రాడు కాబట్టి. వచ్చినా ఇచ్చుకోలేము. కానీ అప్పుడప్పుడు ఆయన్ని పిలిచి, నిర్వర్తింప చేసుకోవాలి. అందుకని అతడ్ని 'బ్రహ్మగారు' అన్నారు. అతడ్ని తృప్తిపరిస్తే నీకు భగవంతుడు చూస్తాడు. ఎంతసేపూ నీ గురించే, అన్నీ మనమే నేర్చుకుని, అన్నీ మనమే చేసేస్తే అయ్యేపని కాదు. విషయం చాలావుంది. చాలా మరచిపోతున్నాం మనం. క్రిందటి తరంలో వున్నవి, ఇప్పటి తరంలో లేవు. మిగిలితే దాచుకుని fridge లో పెట్టుకుని, మళ్ళీ వెచ్చపెట్టుకుని తినడమే. ఇదివరకు మిగిలితే మాధాకబళం వాడు వస్తే వాడికి పెట్టేవారు. వాడికోసం ఎదురు చూసే ఇంటి ఇల్లాళ్ళు ఎంత మందో. మాధాకబళం రాకపోతే పనిమనిషికి ఇవ్వచ్చు కదా. వాళ్ళెవరికీ ఇవ్వక fridge లో పెట్టేస్తాం. మాధాకబళం అనే పేరు ఎక్కడ నుండి వచ్చింది? మాధవ కబళం అది. మాధవునకు వేసే భోజనము అన్నము. కబళం అంటే తినే పదార్ధం. మాధవుని కోసం మిగిలినది అనుకోవాలి. ఏది? మనం తిన్నంత తినగా. అసలు మిగిలేటట్టుగా చేసుకోమనుకోండి. ఎక్కువ వుంటే ఇంటాయన, నీకు ఒళ్ళు తెలియకుండా వుంది. ఎక్కువ చేస్తున్నావని భార్యను కోప్పడతాడు. కానీ ఇదివరకు వాళ్ళు తాము తినగా, మిగిలేటట్టుగా వండుకునేవాళ్ళు. అదీ సమృద్ధి అంటే జీవితంలో. అది ఇంకొకళ్ళకి పెట్టాలి. వచ్చినవాడికి పెట్టాలి. ఇంకొకళ్ళకి పెట్టే సంస్కారాలు మనకు రావు. ఎందుకంటే మనం కొట్టుకుపోయాం బాగా. భోక్త విషయంలో, అతిథి విషయం లోను ఇంత శ్రద్ధ ఉండాలి. ఒక గృహస్థు అంటే వాడు he is an institution. వాడు కుటుంబ కోసమే కాదు. అసలు వుండడమే సమిష్టి కుటుంబము. అందరికోసం. ఇంట్లో పాలేళ్ళ కోసం, పనివాళ్ళ కోసం, గేదెలు, ఆవులు, ఎద్దుల కోసం వీటన్నిటికీ మేత వాడే. పాలం పనులు చేసేవాళ్ళ మేతా వీడే. ఏమిటి వాడు? He is an institution. అలా వుండేది. అంటే మన సాంప్రదాయములో వుండే సంపద అటువంటిది. Richness. ఇప్పుడు richness అంటే ఎంత మిగుల్చుకుంటే అంత richness అనుకుంటున్నారు. అది poverty. అంటే ఎంతమందిని నీవు భోక్తగా ఆ భగవంతుణ్ణి చూసి ఆదరిస్తావో, అంత నీ కడుపు నిండుతుంది. అంత నీ జీవితం నిండుతుంది. అందుకని అన్నిదానాల్లోకెల్ల ముందు చెప్పింది అన్నదానం, తర్వాతది వస్త్రదానం. ఏది చేయాలి అంటే, మన ఓపిక అనుకోండి. ఎవరి స్ఫూర్తిని బట్టి వాళ్ళు చేసుకోండి.

## 519. కపీంద్రుఁ

మనకు ఇదివరకు 'కపి' ఒకసారి వచ్చాడు. 'వృషాకపి' అని. మళ్ళీ కపీంద్రుడు. 'కపీంద్రుడు' అంటే హనుమంతుడు అని ఒకటి. కపులలో శ్రేష్ఠుడు అని అర్థం. హనుమంతుడు భగవంతుని యొక్క అవతారం. అది ఆయన జెండా మీద కూడా వుంది. పది రోజుల యుద్ధంలో భీష్ముడు దానిని చూచే వుంటాడు. ఇంక రెండవది సూర్యుని కిరణాల్లాగ భూమి మీదకు వచ్చి, భూమిమీద వుండే జలాన్ని ఆకాశం లోనికి తీసుకుని వెళ్ళేవాడు కపీంద్రుడంటే. ఆరోహణ క్రమమునకు అధిపతి. ఆరోహణ క్రమమునకు అధిపతి, మార్గదర్శకుడు ఎవరయ్యా అంటే గురువు. అందుకనే హనుమంతుడు జగద్గురువు. కపీంద్రుడు కూడా జగద్గురువే! అంటే ఇక్కడ వున్నవాడిని అక్కడకు తీసుకెళ్ళడానికి వాడు ప్రయత్నం చేస్తాడు. ఈ భూమిమీద వుండే జలాల్ని, వేసవి కాలంలో వచ్చే కిరణాల ద్వారా పైకి తీసుకెళతాడు. వాడు కపీంద్రుడు! మన చేతనాన్ని స్థూలమైన పదార్థం నుండి సూక్ష్మమైన పదార్థానికి ఉద్ధరించేవాడు కపీంద్రుడు. అతడు గురువు. అలా జీవుల్ని ఉద్ధరించుకుంటూ వుంటాడు. దేవుడి తరఫున దిగివచ్చి, సూర్యుడి నుండి దిగివచ్చి జలాల్ని తీసుకెళతాడు పైకి. అంటే దైవం దగ్గర నుండి వచ్చి జీవుణ్ణి ఉద్ధరించి, మళ్ళీ జీవుల్ని దైవం దగ్గరకు చేరుస్తాడు. అదీ సుందరకాండ! ఆ విధంగా కూడా కపీంద్రుడు హనుమంతుడౌతాడు. గురువు అవడం చేత కపీంద్రుడు లేక వానరశ్రేష్ఠ అనవచ్చు. 'కపీంద్రో' అనే పదానికి అర్థమేమిటంటే భగవంతుడే గురువుగా దిగివస్తాడని. దిగివచ్చి జీవుల్ని ఉద్ధరించుకుంటాడు. ఉద్ధరించుకోవడానికి దారి చూపిస్తాడు. స్ఫూర్తి నిస్తాడు. నీలో కల్గిన స్ఫూర్తి వాడే. ఆ విధంగా హనుమంతుడు రాముడి దగ్గర నుండి వచ్చి, అమ్మవారికి స్ఫూర్తినిస్తాడు. అమ్మవారు జీవుడికి ప్రతీక. రాముడు దేముడికి ప్రతీక. భగవంతుని చేత పంపబడినవాడు గురువు. అంటే వాడంతటి వాడు Self-styled కాదు. ఎందుకంటే ఏదో మనం ప్రపంచాన్ని ఉద్ధరించాలనే తాపత్రయంలో వుండేవాడు గురువు కాదు. తాను భగవంతునియందు ఎప్పుడూ నిలిచియుండడం చేత, భగవంతుని యొక్క ఆజ్ఞగా నిర్వర్తిస్తూ వుంటాడు. నిజమైన గురువుకి తాను చేస్తున్న పనులమీద వ్యామోహం వుండదు. తనవల్ల ఉద్ధరింపబడిన వాళ్ళని చూస్తే వ్యామోహం వుండదు. ఏమిటుంటుందయ్యా అంటే, అన్ని పరిస్థితులలో కూడా 'వాడు', వాడొక్కడే వీడికి లెక్క. ఇది జరిగేదంతా వాడి వైభవము. తన కాళ్ళకి దణ్ణం పెట్టినా తను పెట్టించుకున్నాడనుకోడు. 'వాడికే' పెడుతున్నారు వీళ్ళు అనుకుంటాడు. సమస్తం వాడిదే. వాడు పంపిస్తే వచ్చాం. వాడికోసం పనిచేస్తున్నాం. వాడి పని చేస్తున్నాం, వాడు చెప్పినట్లు చేస్తున్నాం. అంటే ఇతడికి స్వంత plan ఉండదు. ఎందుకంటే అంతా అయిపోయిన తర్వాత మళ్ళీ ఇతడు వాడిలోకి వెళ్ళిపోతాడు. వెళ్ళి

తన స్థానంలోనికి అక్కడ ఇంకొకళ్ళని పట్టుకొస్తాడు. గురువు ఎప్పుడు సార్ధక్యం చెందుతాడంటే, తనంతటి వాడు ఇంకొకడు తయారయితేనే. తండ్రికి ఎప్పుడు సార్ధకత అంటే తనయుడు తనంతటి వాడు అయితేనే. చెట్టుకు పండు పండితేనే సార్ధకత. ఎందుకంటే ఆ పండు ద్వారా తిరిగి చెట్టు వస్తుంది. కాబట్టి 'కపీంద్రుడు' అంటే గురువు. కపీంద్రుడంటే హనుమంతుడు. హనుమంతుడు లంకను దర్శించగలడంటే శరీరాన్ని, శరీరంలో ఇమిడియున్న జీవుణ్ణి చూడగలడాయన. హనుమంతుడు సీతను అన్వేషించడం అంటే ఏమిటి? ఎదుటివాడి శరీరం చూస్తే, వాడిలో జీవుడు ఏ లోకంలో వున్నాడో చూస్తాడు. మూలాధారంలో వున్నాడా? బొడ్డు దగ్గర వున్నాడా? హృదయం దగ్గర వున్నాడా? ఆజ్ఞ దగ్గర వున్నాడా? మోకాళ్ళలో వున్నాడా? పాతాళంలోకి కూడా దిగిపోయి వుంటారు. కాబట్టి ఎక్కడ వున్నాడో చూసి, అక్కడ నుండి వాణ్ణి ఉద్ధరించటానికి ప్రయత్నిస్తాడు. అదీ హనుమంతుడు లంకను ముందు చూడ్డం. తర్వాత జీవుణ్ణి చూడడం. లంక వైభవం చూస్తాడు. మానవ శరీరం యొక్క వైభవం అంతా ఇంతా కాదు. అందులో మణిమయ గోపురములు చూస్తాడు. తర్వాత త్రికూట పర్వతంలో అమ్మవారిని చూస్తాడు. అంటే బంధింపబడిన జీవుడు. ఇలా చూచి రక్షిస్తాడు. రక్షించడం అంటే లంకలోంచి బయటకు తీసుకుని రావడమే. దానికి దేవుణ్ణి తీసుకొచ్చి, తీసుకెళతాడు. లంకలోంచి బయటకు తీసుకు రావడమే శరీరంలోంచి బయటకు తీసుకురావడం. అంతకుముందు ఒకాయన లంకలోంచి బయటకు వచ్చాడు. విభీషణుడు. దేవుడి కోసం. వస్తే ఏమి చేశారు? లంకలో రాక్షసులనందరినీ సంహరించిన తర్వాత, ముక్తజీవుణ్ణి మళ్ళీ శరీరంలోనే establish చేసి, స్థాపితం చేసి, నీవిక్కడే వుంటే బాగుంటుంది. నీ పని ఇదే అనిచెప్పి వెళ్ళిపోతాడు దేవుడు. అందుకనే ముక్తజీవుడు ఏమిటయ్యా అంటే, శరీరంలోంచి బయటకు రాగలిగినా కూడా, దివ్యప్రణాళికలో భాగంగా శరీరంలో వుంటాడు తప్ప, శరీరం బంధించదు. మరి ఇవన్నీ గురువు దగ్గర నుండి వచ్చే అనుగ్రహం. గురువేమి చేస్తాడు? మార్గాన్ని చూపిస్తాడు. నడవడం నీ కర్తవ్యం. ఎలా చేసుకోవాలో చెప్తాడు తప్ప చేసిపెట్టడు గుర్తుపెట్టుకోండి. ఎవరన్నా నేనే మీకు సమస్తమూ చేసిపెడతానంటే నమ్మబోకండి. ఎలా చెయ్యాలో చెప్తాను అలా చేసుకుంటే నా అంతటి వాడవవుతావు నువ్వుకూడా అంటాడు. కృష్ణుడు అదే 'నువ్వు యుద్ధం చెయ్యి. ఎలా చేయాలో నేను చెప్తాను. నా మాట వింటే విజయం. వినకపోతే ఏడుస్తావు' అని అర్జునుడికి చెప్తాడు. వినని రెండుసార్లూ ఏడ్చాడు. దారి చూపిస్తాడు. వాడూ కపీంద్రుడంటే. కపీంద్రుడుగా దిగివచ్చినవాడు దైవమే! గురువుగా దిగివచ్చినవాడు దైవమే. ఆరోహణ క్రమంలో తీసుకెళ్ళేవాడూ దైవమే.

## 520 భూరిదక్షిణః

విపరీతంగా ఇచ్చేస్తాడు. ఇవన్నియు కూడా ఆయన ఇచ్చినవే కదా. సమస్తాన్నీ పంచి ఇస్తాడు.

## 521, 522 సోమపః, అమృతపః

ఇవన్నీ ఒకే తత్త్వానికి సంబంధించినవి. అసలు అన్ని నామాలూ ఒకే తత్త్వమునకు సంబంధించిన వివిధమైన వివరణలే. ఈ మూడూ మళ్ళీ అందులో ఒక జట్టు. సోమపః, అమృతపః, సోమపః, అంటే సోమాన్ని పానం చేసేవాడు. అమృతపః అంటే అమృతాన్ని పానం చేసేవాడు. సోమః అంటే సోమమే మళ్ళీ తనని తాను పానం చేస్తూంటాడు. సోమ: అనే నామానికి చాలా అత్యద్భుతమైన అవగాహన వుంది. స + ఉమ అంటే సోమ అవుతుంది. ఉమతో కూడినవాడు, అనే అర్థం గోచరిస్తుంది. ఉమతో కూడకపోతే మనకేమీ తెలియదు. ఉమతో కూడితేనే మనకు తెలుస్తుంది. అందుకని భగవంతుడు సోముడిగా ముందు దిగివస్తాడు. ఇది తన మొదటి స్థితి. ఇక్కడి నుండి మిగిలిన స్థితులన్నీ ఏర్పడతాయి. అన్నిటిలోనూ తను స్థితిమంతుడిగా, ఉమతో కూడి ఉంటాడు. మన మూలాధారంలో కూడా అట్లానే ఉంటాడు. అమ్మవారు, అమ్మవారి లోపల అయ్యవారిగా. యోగ శాస్త్రంలో, తంత్ర శాస్త్రంలో, హఠయోగప్రదీపికలో మూలాధారంలో ఏ విధంగా శివలింగం వున్నదో, ఆ శివలింగం అమ్మవారి ఒళ్ళో ఎట్లావున్నదో, ఆ శివలింగాన్ని కాస్తూ, మూడు చుట్లు చుట్టుకొని పడగయెత్తిన పాము ఏ విధంగా వున్నదో, మనకి వివరణ ఇస్తారు. అంటే భౌతిక లోకం వరకూ అన్ని లోకములయందూ కూడా సోముడితో కూడి, అతడు లేక తత్త్వము వుండడం చేత, (భగవంతుడు అంటే మగవాడు అనే భావన బాగా ఏర్పడిపోయింది. భగవత్ తత్త్వానికి మగ లేదు, ఆడ లేదు) అలా దిగి వచ్చినప్పుడు భగవంతుడు ముందుగా సోముడు అవుతాడు. మనం కార్తీకమాసంలో ఆయననే ఎక్కువగా ప్రార్థన చేసుకుంటాం. సోముడంటే సృష్టి ఏర్పడడానికి కావలసిన పునాదిరాయి అనుకోవచ్చు. పునాది తత్త్వము. అక్కడ నుండి ఆయనని ఆధారం చేసుకుని ఆవిడ సృష్టి అంతా కూడా అల్లుతూ వుంటుంది. కాబట్టి యీ సోమతత్త్వం కారణంగానే ఈ సృష్టి అంతా తయారవుతుంది. సోమపానం చేసే వాళ్ళు వున్నారు. దేవతలు ఏప్పుడూ సోమపానం చేస్తూంటారుట. దానికి సురాపానము అని కూడా పేరువుంది. సురాపానము అంటే 'వెలుగుతో కూడిన మూర్తులు, తమకు ఆధారభూతమైనదాన్ని గ్రోలుతూ ఎప్పుడూజీవిస్తూ వుండడం'. వెలుగుతో కూడిన మూర్తులంటే దేవతలు అని చెప్పుకున్నాము. దివి, దివ, దేవత- యివన్నీ కూడా 'వెలుగు' అనే శబ్దం లో నుండి పుట్టినవే. కనుక దివ్యమైన వెలుగే రూపములుగా కలవారు ఏప్పుడూ గ్రోలుతూ వుండేది సోమరసం. అంటే ఏమిటి? వారి యొక్క అస్తిత్వమునందు లగ్నమై వుంటారు. మనకి మన అస్తిత్వం taken for granted గా తీసుకుంటాం. తీసుకుని మనకి తోచిన పనులన్నీ మనం చేస్తుంటాం. అస్తిత్వం వుండాలంటే సోమము వుండాలి. ఋషులు దీన్ని గ్రోలుతూంటారని చెప్తారు. వాళ్ళందరి

రూపంలో కూడా నీవే వున్నావు. దేవతలందరూ కూడా సోమపానం చేస్తారు. వాళ్ళందరి రూపంలో కూడా నీవే వున్నావు. అదే రసం 'సోమలత' అనే ఒక ఓషధిలో కూడా దొరుకుతుంది. దాన్ని మంత్రపూతంగా యజ్ఞము చేసి, తద్వారా అందులో వుండే సమస్తమైన తత్త్వాన్ని అనుభూతి పొందే క్రతువు ఒకటి వుంది. అది చేసి ఆ సోమతత్త్వాన్ని తనయందు అనుభూతి చెందినవాడు సోమయాజి. సోమయాగం చేశాను అంటారు చాలా మంది. సోమయాగం ఊరికే బహిర్గతంగా చేసి, సోమయాజి అనిపించుకోవచ్చు. నిజమైన సోమయాజి, తను సోమయాజి అని తెలిసి పేరు పెట్టుకోకుండా తిరుగుతూ వుంటాడు. కాబట్టి సోమతత్త్వాన్ని అనుభూతి చెందడం అంటే తనలో వున్న సత్యమునూ, ఆ సత్యమునకు సంబంధించిన వెలుగునూ, ఈ రెండింటినీ తనయందు దర్శనం చేయడం. అలా దర్శనం చేసినవాడు సోమయాజి. అలా దర్శనం చేసినవాడికి తననుంచే సోమరసం ఉద్భవిస్తుంది. ఈ శరీరంలో సోమరసం ఉద్భవించడానికి అద్భుతమైన కేంద్రం ఒకటి వుంది. కొండనాలుక అందుకే యిచ్చాడు దేవుడు. సోమయాగం చేసుకునేవాడికి ఆ కొండనాలుక నుండి ఒక్కక్క బొట్టుగా వచ్చి పడుతుంది సోమరసం. చాలు. అది పడితే ఆహారంతో సంబంధం లేకుండా అలా జీవిస్తూంటాడు. మనకి Pineal and Pituitary Glands వున్నాయి. సోమరసం ఆ glands నుండి secrete అవుతుంది. మనలో కలిగిన భావం చేత, మనలో వీర్యం ఉద్భవిస్తోంది కదా. ఆ భావానికి కలిగిన వేడి చేత వీర్యం ఉత్పన్నమవుతుంది తప్ప, ఎప్పుడూ వీర్యం stock గా మన దగ్గర వుండదు. భావముచేత కలిగిన వేడిమిచేత వీర్యం ఏ విధంగా మనలో ఉద్భవిస్తుందో, అదే విధంగా దివ్యమైన, అనన్యమైన తత్త్వమునందు ఆ భావమును బగా తపస్సు అనే వేడి చేత ఉద్భవింపచేసుకునేవాళ్ళు ఋషులు. అలా చేసుకుంటే ఆ కొండనాలుక నుండి ఒక్క బొట్టు పడితే, ఆ శరీరం అమృతపానము చేసినట్లు లెక్క. అంటే ఇంక వాడికి మృతి లేదు. కనుక అమృతపానం చేసేవాళ్ళు ఎవరయ్యా అంటే సోమతత్త్వాన్ని అవగాహన చేసుకున్న వాళ్ళు. అందుకనే సోమరసాన్ని అమృతపాత్రలోకి అందుకుంటారంటారు. అమృతపాత్ర అంటే మన శరీరమే. అందులో ఇంకో పాత్ర, అందులో ఇంకో పాత్ర. చూడండి set గా stainless steel గిన్నెలు కొనుక్కోరూ ఆడవారు? ఒక దానిలో ఒకటి, ఒక దానిలో ఒకటి. అట్లాగే అన్నమాట. కాబట్టి ఈ సోమతత్త్వాన్ని అందుకునే పాత్ర. ఆ పాత్ర లోకి అక్కడ నుండి సూక్ష్మశరీరంలోకి, ఇలా దింపుకుని అమరులై జీవించే ఒక మార్గం. దీనికి చేయవలసిన సాధన అవ్యక్తమైన తత్త్వము తనయందు స్థితివంతమై, అంటే తను వుండుటగా వుండి, తనయందు యెరుకగా అదే తత్త్వము అమ్మవారుగా వుండేది. అదీ అయ్యవారూ-అమ్మవారు కలసి వుండడం — అర్ధనారీశ్వర తత్త్వం! అలా మనలో వున్నవాడిని గమనిస్తూ వుండాలి. ఇలా గమనించడానికి అష్టవసువుల్లో ఒక వసువు పేరు కూడా సోముడు అని పెట్టారు. అష్టదిక్పాలకుల్లో ఒక దిక్పాలకుడి పేరు కూడా సోముడని పెట్టారు. అష్టదిక్పాలకులు మనకు తెలుసు కదా. ఎవరందులో సోముడు?

ఈశాన్యం సోమ తత్త్వం. అష్ట వసువుల్లో సోముడు, సూర్యోదయానికి ముందు 72 నిముషాలసేపు, సోమపానం చేద్దాం అనుకునే వారందరికీ సంసిద్ధుడై ఉంటాడు. 24 గంటలలో అష్టవసువులలో ఒక్కొక్కరికి మూడేసి గంటలుగా విభజించుకుంటే అందులో మూడు గంటల నుండి ఆరు గంటల వరకూ ఒక భాగం వేసుకుంటే 180 నిమిషాలు అవుతుంది కదా. ఆ 180 నిమిషాలూ అందులో వుండగలిగితే అంతకన్నా మించింది ఏదీలేదు. పోనీ అందులో మూడొవంతు వేసుకుంటే, నెమ్మదిగా తెల్లవారుఝామున లేవడమనేది పెరుగుతూ వుండాలి. ఇప్పటికే చాలా బాగా లేస్తున్నామనుకోకుండా, 5:30 కి లేచే వాళ్ళు 5:00 కి, 5:00 కి లేచే వాళ్ళు 4:30 కి. 4:30 కి లేచే వాళ్ళు 4:00 కి ఇలా మెట్టు మెట్టుగా ఎక్కితే 3:00 గంటలకి లేస్తే అప్పుడు జరిగిన ధ్యానమే ధ్యానము. అప్పటి నుండి తెల్లవారిన తరువాత అంటే సూర్యోదయం అయిన తరువాత 24 నిమిషాల వరకే నిజమైన ధ్యానానికి సరియైన సమయం. ఇంక మిగిలిన సమయాలన్నీ ఏదో పోనీలే పాపం అన్నట్టుగా కొంత పనికి వస్తాయి తప్ప, ఇంతగా పనికిరావు, ఆ సమయంలో శుచియై ధ్యానము నందు నిలబడడం అంటే మనస్సుని అక్కడ లగ్నం చేసి వుండడం తప్ప, మనని నిలబడి ధ్యానం చేయమని కాదు. ఎక్కువ తంతు పెట్టుకోకుండా. మనకి తంతులెక్కువ. అన్నీ సర్దుకునే సరికే నీరసమైపోతుంది. ఇది సర్ది, అది సర్ది, ఇవి వెలిగించి, అవి వెలిగించి, అవి తుడిచి, ఇవి తుడిచి ఇహ కూర్చునేసరికి ఉసూరుమంటుంది ప్రాణం. ఇంక ఏమిటి చేస్తాము? 'ఏగి ఏనుగు కుంభస్థలము కోరుకుంటుందంటామే సింహము' అట్లా కేంద్రమైన విషయాన్ని మనం బాగా అందుకోవాలి. పరిధుల్లో వూరికే రొష్టు పడకూడదు. అది అందుకుంటే అక్కడ నుండి వచ్చే అనన్యమైన శక్తితో నువ్వు ఇక పెంచుకుంటూ పో. అసలు విషయం అందాలి. అందుకని తను లేవగానే నిజానికి తను అదే- సోముడే! మనిషి లేచేసరికి సోముడు, పడుకుంటే శివుడు. ఇక ఇంతకన్నా చెప్పాల్సినది ఏమీ లేదు. మనిషి నిద్రలో వుంటే శివుడు, ఎందుకని? ఎరుక కూడా అస్తిత్వంలో ఇమిడి పోయింది. ఎరుక రాగానే ఏమైంది? లేచినది నువ్వు కాదు. అమ్మవారు- లేక వెలుగు- లేక నీలోని చైతన్యం. అది లేస్తే మనం లేచామని మనం అనుకుంటూంటాము. కాబట్టి నువ్వు లేవగానే ఏమి జరిగింది? ఇద్దరు లేవడం వల్ల నువ్వు లేచినట్టుగా నీకు భావన కలుగుతోంది. ఒకటి అసలు వాడు వుండడం వల్ల, వాడి నుండి లేవవలసిన చైతన్యం లేవడం వల్ల, ఆ వుండడాన్ని 'సత్యం' అన్నారు, లేవడాన్ని 'చైతన్యం' అన్నారు. నువ్వు వాళ్ళిద్దరి నుండి పుట్టిన వాడివి, అందుకనే ప్రతి ఒక్కడు కూడా దైవకుమారుడే! Every one is a Son of God. ప్రతిజీవి కూడా దైవము నుండి పుట్టుకొచ్చినదే! దైవము అంటే దివ్యమైన వెలుగు. వెలుగు ఎక్కడ నుండి వచ్చింది? అస్తిత్వంలోంచి వచ్చింది. కాబట్టి అందరూ దైవకుమారులే. అదే చెప్తాడు తెలిసిన వాడు, 'నేనే కాదు మీరు కూడా' అని. నేను ఒక్కడినే దైవ కుమారుణ్ణి, మీరు పాపులు అనేవాడు తెలిసిన వాడు కాదు. నేను మిమ్మల్ని

బాగు చేయడానికి వచ్చాను, మిమ్మల్ని ఉద్ధరించడానికి వచ్చాను, మీరంతా పాపాత్ములు- ఇట్లా మాట్లాడే వాళ్ళు మూర్ఖాగ్రేసరులైన దైవకుమారులు. అయితే ఇందులో ఆయనది కానిది ఏదీలేదు కాబట్టి negate చేయ్యడానికి ఏమీ లేదు. ఎంతవరకూ మనం కాదంటే అంతవరకు మనకి కాదు తప్ప, అది ఎప్పుడూ అంతే. కాబట్టి నువ్వు లేవగానే నువ్వు మూడవ వాడివి. నీకన్నా ఇద్దరు పెద్దవాళ్లున్నారు. ఒక తల్లి, ఒక తండ్రి ఉన్నారు. లేచీ లేవగానే తల్లి తండ్రులకు దండం పెట్టుకో అంటే ఇదే అర్థం. మరి మా అమ్మగారు ఊరిలో లేరు కదండీ అంటే కష్టం. మా నాన్నగారు వెళ్ళిపోయారు కదండీ, ఇప్పుడు ఆయన కాళ్ళు ఎక్కడ పట్టుకోనంటే! తండ్రి లోపల వున్నాడు. తల్లి లోపల వున్నది. ఆ ఇద్దరినీ గుర్తు చేసేవాడెవడో వాడు గురువు. అతడికి కూడా దండంపెట్టేసుకో పాద్దున్నే. అప్పుడు నువ్వు నాలుగో వాడివి అవుతావు. ఇంక మరి పెంచక. ఇంక అప్పుడు హనుమంతుడు, వినాయకుడు ఇవన్నీ మొదలు పెట్టామంటే మనకు తెమలదు. తెల్లారిపోతుంది. కదా. ముగుర్ని పెట్టుకో. ఎవరూ? గురువు, తల్లి, తండ్రి. తండ్రంటే నువ్వుండడమే తండ్రి. నువ్వున్నావు కదా. నువ్వు ఎరుకలో వున్నావు కదా. అదే తల్లి, ఈ రెండూ నీకు చెప్పేవాడొకడుంటాడు. కదా. ఆయన పటాలు వూరికే bazaar నిండా display చేయడం కాదు, లోపల వుంచాలి. ఈ రోజుల్లో ఏమిటంటే publicity ఎక్కువ. వేమనగారు యెప్పుడో చెప్పారామాట - వైష్ణవులటంచు వార్త మాత్రమె గానీ --- అని 3 నామాలు పెట్టుకునే తిరుగుతూంటే ఈయన వైష్ణవుడని ఊరిలో వాళ్ళకి తెలియాలి తప్ప, గట్టిగా పలకరించి చూస్తే వైష్ణవం ఎంతుందో తెలుస్తుంది, కదా. సమస్తమూ విష్ణువే అని తెలిసి, తాను దాసుడిగా సర్వజీవరాశులకీ సేవచేయడానికి సంసిద్ధుడై వున్న వాడు నిజమైన వైష్ణవుడు. అందుకనే వేమనగారు శివభక్తుల గురించీ, విష్ణుభక్తుల గురించీ చాలా హాస్యం చేస్తూ ఎన్నో పద్యాలు వ్రాశారు. ఆడంబరములు పక్కన పెట్టండి. సాధనకి ఆడంబరంతో సంబంధం లేదు. సాధనకు కావలసినది నిశ్శబ్దము, నిరాడంబరత, నిర్మలత్వము, ఈ మూడూ కావాలి. ఎంత ఆడంబరంగా వుంటే సాధనకి అంత అడ్డు. ఎంత శబ్దం చేస్తుంటే అంత అడ్డు సాధనకి. పొద్దున్నే సృష్టి అంతా కూడా చాలా ప్రశాంతంగా, నీకు సరాసరి ఆ నిశ్శబ్దాన్ని అందించే స్థితిలో వుంటే, నువ్వు వూరికే స్తోత్రాలు పెట్టి, లేకపోతే మైకులు పెట్టి, tape recorder on చేసి గొడవ చేసుకోబోక. ఎప్పుడైతే వీటిలో పడతావో, ఆ అంతర్హితమైన విషయమునందు ఇహ మనస్సు చొరబడదు. అందుకని లేచీ లేవగానే కూర్చోమని చెప్తారు యోగసాధనలో, ఇహ నువ్వు లేచి ఒంటికి సంబంధించినవి అన్నీ చేసి అంతా అయ్యి coffee తాగేసరికి మనస్సు నిండా బోలెడు వచ్చేస్తాయి, ఇక అప్పుడు కూర్చుని నువ్వు చేస్తుంటే, అప్పటికే చాలా పారలు అల్లుకు పోయినాయి నీ చుట్టూ. అవన్నీ తెంపుకోవద్దూ? నువ్వు వాటిలోనే తిరుగుతూ కళ్ళు మూసుకుని కూర్చుంటూ వుంటావు అంతే కదా. అన్నీ మనకు సంబంధించిన సమకాలికమైన సమస్యలు, పరిస్థితులు, సన్నివేశములు ఇవేగా మనము కళ్ళు

మూసుకుంటే మనకు కనపడేవి. అందుకని లేచీ లేవగానే నీకిద్దరూ, నీకు యీ గుర్తు చెప్పిన వాడొకడు, ముగ్గురు, వాళ్ళ ముగ్గురికీ దణ్ణం పెట్టుకొని చతికిలపడిపో అని చెప్తారు. నాలుగింటికి చతికిలపడిపో, అని చెప్తారు. నాలుగింటికి చతికిలపడిపోవాలంటే కనీసం 3:50 కన్నా లేవాలి కదా. ఇంట్లోవాళ్ళకి తెలియకూడదనుకుంటే లేచి అట్లా ఓసారి bath room కి వెళ్లి, మూత్ర విసర్జన చేసి మళ్ళీ వచ్చి మంచం మీద పడుకో ఫరవాలేదు. సాధన కూర్చునే చేయాలని ఎక్కడా లేదు. గుర్తు పెట్టుకోండి. మనం పెట్టుకున్న కొద్దీ ఎన్నైనా ఉన్నాయండీ. పెద్దలేమంటారంటే చెప్పింది చేసుకో, వాటికి నియమాలూ, ఆచారాలూ అడిగావో చచ్చావు. బోలెడుంటాయి. చెప్తాము. చేసుకు చావలేవు. ఏమైనా మంత్రం ఇస్తే చేసుకోవడం తప్ప, ఈ మంత్రం చేయడానికి ఏమైనా నియమాలున్నాయా sir? అని అడిగారంటే చాలా కష్టం. అడిగితే ఆయన చెప్పాలి. ఆయన మీరు చేసుకోలేరని నియమాలు చెప్పకుండా మంత్రం చెప్పి, చేసుకో, అని చెప్తాడు. కనుక నియమాలు అడిగావనుకో ఆయన చెప్పక తప్పదు, చెప్పాడనుకో నువ్వు నియమాలు ఎలాగో పాటించలేవు, మంత్రమూ చేయలేవు. నియమాలు ముఖ్యమా, మంత్రం ముఖ్యమా? పెద్దల దృష్టిలో మంత్రం ముఖ్యము. నియమాలు తరువాత. అందుకనే EK గారు ధావళీ కట్టావా లేదా? ఆచమనం చేశావా లేదా? అనకుండా ముందు ఆల్పాచమానం చేసుకో, ఆచమనం తరువాత చూద్దాం అనేవారు. కేంద్రమైన విషయము ఏదో దాని యందు సరాసరి లగ్నం చెయ్యాలి. అప్పుడే లేచావు కనుక ఇంకా మనస్సు రకరకాల విషయాలలోకి ఎంగిలి పడలేదు. పడుతుందెట్టాగో. పగలంతా ఎంగిలి పడిపోతుంది, విపరీతంగా ఎంగిలి పడే లోపల అది 'మడి'. మడి అంటే మనస్సుకి మడి. అది వున్నవాడికే దేవుడు, అది లేనివాడికి దేవుడు లేడు. నువ్వు ఎంత వుతికి ఆరేసుకున్నా దానిలోంచి ఏమీ రాదు. అక్కడ నుండి మొదలై నీలో పెరుగుతూంటే బయటకు కూడా వ్యక్తమవ్వచ్చు. అది వేరే సంగతి. ఇది మిగిలి లోపల డొల్లయితే కష్టం. కరి మ్రింగిన వెలగపండయితే కష్టం కదా. ఆడంబరాలు వద్దండీ. సాధన చేసుకుందాం అని అనుకున్నవాళ్లు ఆడంబరం తగ్గించుకోండి. అక్కడా, ఇక్కడా తిరగడం తగ్గించుకోండి. కర్తవ్యం మేరకు వెళ్ళండి. అవకాశం మేరకు వెళ్ళండి. పనులొదిలేసి వెళ్లకండి ఇక్కడికీ, అక్కడికి. ఎంత లోపలికెళ్తే అంత పుణ్యక్షేత్ర దర్శనం జరుగుతుంది. అంత పుణ్యపురుషుల దర్శనం జరుగుతుంది. భగవత్ దర్శనమే జరుగుతుంది. నువ్వు పుణ్యపురుషుడ్ని దర్శించి, పురాణ పురుషుడ్ని దర్శించే లోపల నీకు లోపల నుంచే పుణ్యక్షేత్ర దర్శనాలు జరుగుతాయి. ఆ తరువాత భగవంతుని యొక్క దర్శనం జరుగుతుంది. పురాణపురుషుడి దర్శనం తిరగడం వల్ల దొరకదు, ఆరాటపడటంవల్ల ఏమీ దొరకదు. ఆరాటం అంతర్ముఖం చెయ్యండి. సోమపానం చేయండి. సోముడప్పుడు దక్కుతాడు. దక్కాలంటే ఆడంబరం బొత్తిగా తీసేయండి. మనం భక్తులమని ప్రపంచానికి తెలియడం పెద్ద అవరోధం. నిజమైన భక్తుడు తాను

భక్తుడను అని తెలియకుండా, లోపలే దేవాలయాన్ని నిర్మాణం చేసుకుని, అందులో దైవాన్ని ప్రతిష్ట చేసుకున్న తరువాత, దైవం నిర్వర్తించే కార్యక్రమాలు తన ద్వారా జరిగేవి జరుగుతున్నప్పుడు బయటవాళ్ళకి తెలియాలి. అది భగవద్ సంకల్పం గా. తనకై తాను వెంపర్లాడి తన గురించి తనే బయట తెలిసేట్టుగా చేసుకోవడమన్నంత అవివేకం ఇంక ఏమీ లేదు. సాధన ఆ విషయంలో అలా వుంటుంది. మామూలుగా మనం ఏదో ఒకటి నేర్చుకుంటే పదిమందికీ తెలిసేవరకూ తాపత్రయ పడుతూంటాము. పదిమందికి తెలిసేట్టుగా చదువుతూంటాం. రైలులో పుస్తకం తీసి చదువుతూంటాం. గుడిలో గట్టిగా అరుస్తూ స్తోత్రం చేస్తూంటాం. ఇవన్నీ ఎందుకు చేస్తాం? కొంత అలవాటు వల్ల, కొంత బాగుంటుందనీ, కొంత బయటవాళ్లకు కూడా ప్రచారం చేయాలని. ఇట్లా వుంటుంది. ప్రచారం దైవం గురించి కన్నా మన గురించి ఎక్కువగా ఉంటుంది. దైవానికి ప్రచారం అక్కరలేదు. ఆర్ష సంప్రదాయంలో 'దైవానికి ప్రచారం చేసే దుస్థితిలో దేవుడు లేడు' అని ఎప్పుడో చెప్పారు వాళ్ళు. బంగారానికి ప్రచారమేమిటండీ? సువాసన గల పుష్పము 'నేనున్నాను' అని చెప్పాలా? అది వుండడం దాని వాసనవల్లే తెలుస్తుంది. కాగితం పువ్వుకే కాస్త scent పూయాలి. పూస్తే వాసన వస్తుంటే పువ్వేమో అని దగ్గరకు వచ్చి ముట్టుకున్న తరువాత కాదులే scent పూసారనుకుంటాం. పూసుకు తిరగవద్దు, నిర్మాణం చేసుకోండి లోపల. దేవాలయ నిర్మాణం కావాలి లోపల. దైవ ప్రతిష్ఠ జరగాలి. ఏదైనా ఆయన నిర్వర్తించుకోవాలి, తప్ప మనమెవరం? ఇది సాధన. దానికి మొదటి మెట్టు నిరాడంబరత, రెండవ మెట్టు నిశ్శబ్దం. మూడవ మెట్టు నిర్మలత్వం. ఇవన్నీ పాద్దున పూట సాధ్యమండీ. అమృత ఘడియలు అని చెప్తుంటారు కదా. అమృత ఘడియలంటే ఏమిటో? ఆ సమయంలో, ఆ తత్త్వం తో వున్నవాళ్ళకి అమృతం అప్పుడు లభిస్తుంది. 'అమృత ఘడియలండీ బహ్మాండంగా వుంది. ఇప్పుడు మొదలుపెట్టండి పని' అంటుంటాం. ప్రతిదీ పనికే. ఇప్పుడు బయలుదేరు అమృత ఘడియలంటాడు. కానీండి అదొక పద్ధతి. సాధనకి మామూలుగా జరిగేవన్నీ కూడా తలక్రిందులు. We have been inversed 7 times. ఏడు సార్లు తలక్రిందులు చేయబడ్డాము మనము. మళ్ళీ అన్ని సార్లు తలక్రిందులైతే వెనక్కి వెళ్తాము. మేమంతా ఒకసారి ఒక ఊరు వెళ్ళాము. Geneva దగ్గర్లో. అక్కడ doctor దంపతులున్నారు. భార్య విపరీతంగా బయట అంటే బహిర్గతంగా చాలా ప్రచండమైన ప్రచారంలో బతుకుతోంది, ఆధ్యాత్మికమైన విషయమే! ఆయనంత కాదండీ. అయినా మాయింటికి వస్తారా? అని అడిగింది. ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి మనం కాదనుకున్న వాళ్ళలో విషయం ఎక్కువ వుంటుంది. ప్రతివాళ్ళల్లో వుండేది నీకేమీ తెలుసు? ఊరికే road మీద తిరిగేవాళ్ళకి యింట్లో విషయాలు ఏమి తెలుస్తాయి. తెలియవు కదా. ఇంటికి వెళ్ళాము. ఆయన చాలా బాగున్నాడు. చాలా మంచి doctor. చాలా మంచి పేరుంది. లోపలికి వెళ్ళగానే drawing room లో మనం మామూలుగా ఏమైనా అందమైనవి వేలాడతీస్తాము కదా.

ఆయన చక్కగా ఒక అస్థిపంజరం వేలాడదీసాడు. అలా వేలాడి ఉంటే ఎలా వుంటుంది? నాతో వచ్చిన వాళ్ళు ఇదేమిటి చాలా ఘోరం, ఇదేమన్నా Black magic యేమో? అని ఎవరి బాధలు, ఎవరి భయాలు వాళ్ళు పడ్డారు. ఆయన ఏమీ మాట్లాడలేదు. చూస్తున్నాడు. ఎవరేమనుకుంటున్నారో గమనిస్తున్నాడు. ఏముంది? మనకుండే original structure అక్కడ పెట్టాడు. అంతేగదా! మనమంతా అదేగా! దాని చుట్టూ రక్తం, మాంసం అల్లుకుంటే ఇలా కనిపిస్తుంది. అవన్నీ తీసేస్తే అదేకదా. నువ్వు ఇదే అని చెప్పినట్లుగా లేదూ? ఆ తరువాత కాసేపు కబుర్లు చెప్పుకున్నాం. లోపలికి వెళ్ళాం. ప్రపంచమంతా తిరిగినవాడు, అన్నీ తెలిసిన వాడు, కానీ ఏమీ మాట్లాడడు. ఆవిడే విపరీతంగా మాట్లాడుతుంది. అంటే ఆవిడ ఎక్కువ బయట వుంటుంది. ఆయన ఎక్కువ లోపల వుంటాడు. లోపలికి వెళ్ళి ఇక భోజనానికి కూర్చుంటే, అక్కడ ఈ ప్రపంచం నుండి అన్నిచోట్లా సేకరించినవన్నీ పెట్టాడు ఆ గదిలో. అందులో ఒక గ్రీకు దేశపు బొమ్మ ఒకటి. ఒట్టి తలకాయే అది. తలక్రిందులుగా వేలాడదీసాడు. వ్రేలాడతీస్తే, ఇదేమిటో ఇదొక్కటే తలకిందులుగా వుందని అందరి భావన. అది పారబాటున అట్లా తిరిగిపోయిందేమో అంటే 'లేదు, మా ఆయన కావాలనే అట్లా తగిలించాడు. ఎందుకు చేశావంటే చెప్పడు', అన్నది. అది ఎలా వుంటుందంటే ఆ గదిలోకి వచ్చిన వాళ్ళందరికీ కూడా అది తలకిందులుగా కనిపిస్తుంది. కాని దానికి మనమంతా తలకిందులుగా కనిపిస్తుంటాం. అంతే కదా. ఇదేమిటో వీళ్ళంతా తలక్రిందులుగా వున్నారేమిటని అనుకోదా ఆ బొమ్మ? ఇట్లా ఆయన ఒకరకమైన తత్త్వంలో వున్నాడు. ఈ ప్రపంచమంతా తలక్రిందులుగా వుంది. ఎందుకంటే ప్రతిబింబమే కదా. నీళ్ళల్లో పడ్డ చంద్రుడు తలక్రిందులుగా పడ్డాడుట. సరస్సు పక్కన మనం వెళ్ళి ఒడ్డు మీద నిలబడితే ఎట్లా కనిపిస్తాం? Reflection కదా. కాబట్టి ఇది కూడా అదే.అది చెప్పడానికే ఆయన అలా చేశాడు. ఇలా ఏడుసార్లు మనం తలకిందులైతే, ఇప్పుడుండే తెలివి పోయి, అసలు తెలివి వస్తుంది. అందుకని ఋషులు ఆలోచించే పద్ధతికి, మనం ఆలోచించే పద్ధతికి చాలా తేడా. ఎందుకు ఏడుసార్లు? ఏడులోకాలలోనూ ఏడు పల్టీలు కొట్టించారు. కొట్టించడంచేత మనం ఇంత తలక్రిందులుగా వుంటాం. మనం తింటేగానీ బ్రతకలేం అనుకుంటాం కదా. అసలు తిండివల్ల కాదు బ్రతికేది. ప్రాణశక్తి వల్ల బతుకుతున్నాం, అది సోమపానం నుండి వస్తుంది. వచ్చినవారికి ఆహారంతో సంబంధం లేదు. తినకపోతే చచ్చిపోతామేమో అని అనుకుంటాం మనం, తినకుండా బతికి వున్నవాళ్ళు చాలా మంది వున్నారు. హిమాలయాల్లో 1400ల సంవత్సరాలుగా బతికి వున్న వ్యక్తులు కూడా ఇంకా వున్నారు. మామూలుగా అక్కడ ఋషి ప్రపంచంలో సాదాగా వుండే వారు, అంటే aspirants, 6 నెలలకొక్కసారి భోంచేస్తారు. భోజనం అంటే వూరికే పప్పు-గిప్పు, అన్నీ వండుకొని, వంకాయ గుత్తులేసుకొని తినడం కాదు. అక్కడ మంచులో ఇట్లా తవ్వితీస్తే కంద దొరుకుతుంది. ఆ కంద పాలు పిండుకుని తాగుతారు. 6 నెలలు సరిపోతుంది. మనకు 6

గంటలు అవగానే ఇంకా ఏమీ తినలేదే అన్న భావమే ఎక్కువ తప్ప, తినకపోతే ఏమీకాదు. ఇవన్నీ తలకిందులవుతాయి. ఇలా చాలా తలకిందులవ్వాలి. అందుకనే నిశ్శబ్దంగా వుండడం, నిరాడంబరంగా వుండడం చాలా ముఖ్యం. అలా వుంటే బావుంటుంది. చిత్తూరు జిల్లాలో 1950 సంవత్సరం వరకూ జీవించి వున్న ఒక మహాత్ముడి దగ్గరకి ఎంతో మంది వచ్చి ఎన్నో రకాల సలహాలు తీసుకుని వెళ్తూండేవారు. ఆయన చెప్పినట్లు చేసుకున్నవాళ్ళకి ఎప్పుడూ బాగుండేది. ఆయన ఎప్పుడూ ఏమి చేస్తూంటాడో ఎవరికీ తెలియదు. ఆయన చెప్పినది మాత్రం అవుతూండేది. ఏమిటాయన సిద్ధి? ఈయన యేం చేశాడు? ఏమీ కనపడలేదు. ఇంటావిడను అడిగారు. ఆవిడకీ ఏమీ తెలీదు, ఏం చేస్తున్నాడో. మనం అట్లా చేశామా సాధన? ఆయన సాధన ఎలా ఉండేదంటే ఇంట్లో ఇంటావిడకి కూడా తెలిదు. ఆవిడ 50 ఏళ్ళ నుండీ కాపురం చేస్తున్నది. 'ఎప్పుడూ ఏమీ చేస్తున్నట్లు కనిపించరండీ మా ఆయన, మరి ఆయనకి ఇవన్నీ ఎట్లా వచ్చినాయో నాకు తెలియదు.' అని చెప్పిందామె. రోజూ ఆవిడకి ఇది ఒక ఉత్కంఠే, ఏమీ చేయకుండా ఇన్ని ఎల్లా వచ్చినాయి ఈయనలోకి అని. ఆయనకి 70 ఏళ్ళు వచ్చేసాయి. ఈవిడకి 60 ఏళ్ళు వచ్చేసాయి. రోజూ యిద్దరూ పక్కపక్కనే నులకమంచాలు వేసుకొని పడుకుంటారు. సరే ఒక రోజు పొద్దున్నే లేచిన తరువాత ఆవిడ అన్నదట, 'మీరేంచేస్తున్నారో నాకిప్పుడు అర్థమయ్యింది' అని, 'ఏంచేస్తున్నానే' అని అడిగాడట, 'నేను రాత్రి విన్నాను మీరు చేస్తున్నది' అన్నది. 'ఏంటి?' అన్నాడు. 'మీలోంచి రామనామం వినిపిస్తోంది. మీరు రామనామం చేస్తున్నారు కదా?' అంది. 'చేస్తున్నాను కానీ నీపు విన్నావంటే నా సాధన పరిపూర్ణము అవలేదు. ఏదో తప్ప చేశాను, కాబట్టి నీకు తెలిసిపోయింది ఇవాళ' అని చెప్పాడు. అని ఆరోజు సాయంత్రం ఆవిడ్ని పిలిచి 'నేను వెళ్ళిపోతున్నానింక. తెలిసిన తరువాత వుండకూడదు' అని చెప్పాడాయన. 'అదేమిటంటే' 'అంతే.' అన్నాడు. ఆరోజు రాత్రే ఆయన వెళ్ళిపోయాడు. నాకెప్పుడూ సాధనంటే ఆయన గుర్తు వస్తాడు. ఇది నాకొక స్నేహితుడు చిత్తూరు జిల్లా, ఆయన చెప్పాడు. ఈ మధ్య ఆయనా పోయాడు. రామకృష్ణచెట్టిగారని మనమధ్యనే తిరుగుతూ వుండేవాడు, ఒక D.I.G. of Police. 'Brother సాధనంటే అదికదా' అని అన్నాడు. అంతే అది నాకు పట్టింది. చేస్తే అట్లా చేసుకోవాలి సాధన! ఊరికే ఊరంతా తెలిసేటట్టా సాధనా? ఊరంతా చేసేది భగవతత్త్వం యొక్క ఆశీర్వచనం అందరికీ లభించడానికి ఏదో చేసుకో. అది ఇటుపక్క పనికి వచ్చేది. అటుపక్క వెళ్ళడానికి ఎంత నిశ్శబ్దము, ఎంత రహస్యము, ఎంత మౌనము వుంటే అంత మంచిది. కాబట్టి మీరు నాలుగింటికి పక్కమీదే వుంటే ఇంట్లో వాళ్ళకి కూడా యిబ్బందిలేదు కదా. EK Master గారు 'మనం సాధన మూడింటికి చేస్తామని ఇంట్లో వాళ్ళందరినీ సతాయించేస్తే సాధన ఏమిటే? అది సాధన అవదు. అది రొష్టు అవుతుంది ఇంట్లో వాళ్ళకి. దాని వల్ల కర్మ పుడుతుంది' అని చెప్పేవారు. కాబట్టి పడుకునే చేసుకో మంచం మీద. ఎందుకివన్నీ వచ్చినాయి?

మంచంమీంచి నువ్వు లేస్తే నీతోపాటు ఆవిడా లేచి నీకు coffee ఇచ్చి, లేకపోతే కాఫీ ఇవ్వడానికి కూడా లేవవు. బద్ధకస్తురాలివి అని మనం ఆవిడ్ని తిట్టి, ఇవన్నీ వుంటాయి కదా, లేచిన తరువాత. ఇవన్నీ లేకుండా నీవు మంచం మీదనే చేసుకోరా! నీకు మెలుకువ వచ్చింది కదా. నీకు మెలుకువ రావడం అంటే నీవప్పుడే మూడవ స్థితిలోకి వచ్చినట్లు. నీ మెలుకువ, నీ అస్తిత్వం, నువ్వు, ఒక్కసారి నువ్వు నమ్మిన గురువు నీకు మార్గం చూపించేవాడు ఒకడు వుంటాడు కదా. ఉన్నాడని అనుకుంటాం కదా. అది fashion కూడా నిజానికి. అవ్యక్తమైన గురువుకు కూడా దణ్ణం పెట్టుకోవచ్చు. లేకపోతే వాళ్ళిద్దరికీ కూడా దణ్ణం పెట్టుకోండి. పెట్టుకొని అట్లావుండండి. చూడండి దాని రుచి. అలా చేసుకుంటే సోమపానం అనే అత్యుత్తమమైన స్థితి వస్తుంది. అంటే ఏమిటి జగత్పిత, జగన్మాత వారిద్దరినీ నీవు అవగాహన చేసుకొని నీరూపంలో వాళ్ళిద్దరే వున్నారని తెలుసుకుని, తద్వారా సృష్టిలో కూడా అదే నిండివుందని స్పష్టంగా మనకి ఆ స్ఫూర్తి రావడం. ఇంకప్పుడు ఏది చూసినా అదే కనిపించడం. అదీ సోమపానం! అట్లా చేసే వాళ్ళందరి రూపంలో నేనే వున్నాను అని చెప్పడానికి 'సోమప' అని చెప్పారు. తర్వాత ఇట్లా చేసేవాళ్ళందరినీ కూడా అమృతప:! ఇంక ఆ స్థితికి వచ్చిన వాళ్లకి మృతత్వం వుండదు అమృతత్వమే! అందుకని అప్పుడేమి చెప్పారంటే, అమృతం ఎక్కడ నుండి పుట్టింది? మథనం వల్ల కదా. మథనం అంటే అటూయిటూ పీకటమేకదా. మంథర పర్వతాన్ని పెట్టి వాళ్ళటులాగి, వీళ్ళిటులాగారు. అది మనలో జరుగుతోంది, ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా. అందుకని నువ్వు ముందు ఉచ్ఛ్వాస నిశ్వాసల ఆధారంగా, అమృతత్వం నుండి సోమపానం చేయడం వరకు వెళ్ళవచ్చు. ఇప్పుడు నువ్వు స్నానం చేశావా? మడి కట్టుకున్నావా? దానితో సంబంధం లేకుండా జరుగుతున్నాయి ఉచ్ఛ్వాస నిశ్వాసలు. కదా. మడి కట్టుకున్నవాళ్ళకి బాగా జరిగి, మడి కట్టుకోనివాళ్ళకి బాగా జరగకుండా లేదు కదా. ఏమిటి ఈయనిట్లా మరీ మడి అని కోప్పడుతున్నాడని అనుకోబోకండి. కొన్ని ఆచారాలు మనకు దురాచారాలై పోయినాయి. అవి మనని పాడుచేస్తున్నాయి. అందుకే కొంచెం దాని మీద యుద్ధం. నీలో రోజూ జరుగుతున్నాయి ఉచ్ఛ్వాస నిశ్వాసలు, అదే చిలుకుడు. దాన్ని పెంచు. వయ్యారంగా చిలికితే మజ్జిగలో పడుతుందాండీ వెన్న? కోడలు వయ్యారంగా చిలుకుతోందనుకోండి మజ్జిగ కోసం, అత్తొచ్చి ఏమి చేస్తుంది? నాలుగు మొట్టికాయలు మొట్టేది ఇదివరకు. ఇప్పుడూ అటువంటి పనిచేస్తే తిరిగి మొడతారని ఏమీ అనరు. నీవు నాలుగేస్తే వాళ్ళు ఎనిమిది వేస్తారేమో అని కదా. అందుకని లేవగానే చిలుక్కో. ఊళ్ళోవాళ్ళని చిలక్క. నిన్ను నీవు చిలుక్కో. ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా చక్కగా చిలుక్కో, ఎవ్వరూ అడ్డురారు. నీవు రెండు గంటల సేపు చిలుకు. ఇట్లా చిలుకుతూంటే వెన్న పడక ఏమవుతుంది? వెన్నపడడం అంటే ఏమిటి? ఈ మొత్తం శరీరం అంతా వ్యాపించిన మనం, పాలుగా వున్నవాళ్ళం, మనకు పాలల్లో వెన్న వున్నదని తెలుసు కానీ కనబడదు కదా. మనలోపల హృదయంలో జీవుడున్నాడు,

అంటాం కదా. ఎవడికి? చిలుక్కున్న వాడికి. చిలుక్కోనివాడికి పాలల్లోలాగా వుంటాడు. పాలు చూపించి ఇందులో వెన్న వుంది కదా? అంటే 'ఏది? కనబడట్లేదు, కాబట్టి లేదు' అంటారు. కనబడకపోతే లేదనే దుస్థితి ఒకటుంది కదా. చిలికి చూపిస్తే 'ఆ వుందిలే!' అంటారు. అట్లాగే చిలుక్కో కనిపిస్తుంది. నీ హృదయంలో నీవు కనిపిస్తావు. అదీ చిలకడం! ఆ చిలుకుడు బాగా చేసుకోవాలి. అది చేసుకోవడమే శ్వాసయందు మనస్సు లగ్నం చేసి దీర్ఘమైన ఉచ్ఛ్వాస, దీర్ఘమైన నిశ్వాస ముందు 24 నిముషాలు చేసుకొని, తరువాత 48 నిముషాలవరకు పెంచుకొని, ఆ తరువాత 72 నిముషాల వరకు పెంచుకోండి. ఇంకంతే! లేచిన తరువాత ఎవరికోసం ఏమీ చేయక్కరలేదు మనం. అందుకనే యోగసాధన చేసేవాళ్ళు క్రతువుల పేరుతో, ఆరాధనల పేరుతో మనం పెట్టుకున్నన్ని బయటి పనులు పెట్టుకోరు. నీకింకా ఓపిక వుంటే చేసుకో, కానీ ఇది ముఖ్యం. నిన్ను నీవు తెలుసుకోవడం అనేది ముఖ్యం. చిలికిన తరువాత నీకు నువ్వు హిరణ్మయమైన రూపంగా గోచరిస్తావు. ముందు హిరణ్మయమైన దేహం, అక్కడ నుండి వజ్రశరీరం. అందులో వీళ్ళిద్దరూ కూర్చొని వుంటారు. వెండికొండ! వజ్రశరీరాన్ని వెండికొండ అంటారు. అక్కడ అయ్యవారు, అమ్మవారు వుంటారు లోపల, వాళ్ళిద్దరూ, అస్తిత్వం. ఇట్లా మెట్లు మెట్లుగా మనం ఆరోహణ చేస్తూ వెళ్తూ వుంటే కనిపిస్తుంది. కనిపిస్తుంటే, ఇట్లా పుట్టించిన వాళ్ళందరినీ కూడా ఆయన లాగేస్తాడు. అది కూడా వుంది. వెన్న పడ్డ తర్వాత దొంగిలించి తీసుకెళ్ళి తినేయటంలేదా? తింటున్నాడా? ఇట్లా తినేట్టుగా తనే వున్నాట్ట. తనే సోముడుగా వున్నాట్ట, తనే సోమపానం చేస్తాట్ట. తనే అమృతంగా వున్నాట్ట, తనే అమృతపానం చేస్తాట్ట. అమృతపానం చేసేవాళ్ళ రూపంలో తనే వున్నాట్ట. సోమపానం చేసే వాళ్ళ రూపంలో తనే వున్నాట్ట. ఇదీ యిందులో అర్థం.

## 523 సోమః

తరువాత మనం సోముడ్ని సోమవారం ప్రత్యేకించి బాగాపొందవచ్చు. అభిషేకాలు చేసుకుందాం అంటే చేసుకోండి. కానీ ఎక్కువ అంతర్యాగం కావాలండీ. బహిర్యాగం ఓపిక వుంటే చేసుకోండి, లేకపోతే మానేయండి. బహిర్యాగానికి నేను వ్యతిరేకిని కాను. కానీ అంతర్యాగానికి ఎక్కువ ప్రాధాన్యం యివ్వాలి. ఎవరు? ఒక నిర్దిష్టమైన మార్గంలో నడచి, తనను తాను తెలుసుకుందాం అనుకునేవాడు. డంబాచారం ఏమీ పనికిరాదు. అంతర్యాగం చేసుకోండి. ఓపిక వుంటే బహిర్యాగం చేసుకోండి. అంతర్యాగం లేని బహిర్యాగం వల్ల ఉపయోగం లేదు. అది డబ్బా మోత! అంతర్యాగం వుండి బహిర్యాగం లేకపోయినా ఫరవాలేదు. అంతర్యాగము, బహిర్యాగము వుంటే అది ఉత్తమమైన సిరి! ముందు రోడ్డు మీంచి ఇంట్లోకి. ఇంట్లోంచి రోడ్డు మీదకు కూడా వెళ్ళవచ్చు. మళ్ళీ ఇంట్లోకి రాగలిగి వుండాలి. అసలు ఇంట్లోకే వెళ్ళక పోతే ఎట్లా? ఆ విధంగా ఈ నామాలన్నీ కూడా భీష్ముడు దర్శించాడు. అమృతత్వం ఇవ్వగలిగినవాడు కృష్ణుడు. ఎన్నోసార్లు చూపించాడు. సోమపానం చేసిన వాళ్ళందరూ అయన చుట్టూ తిరుగుతున్నారు. మైత్రేయాదులు. అప్పటి జగద్గురువు పరాశరుడు చెప్పాడు కదా. కాబట్టి సోముడు నీవే, సోమపానం చేసేవాడివి నీవే, అమృతపానం చేసేవాడిని నీవే.

## 524 పురుజిత్

పురు అనే శబ్దానికి సంస్కృతంలో అర్థం 'చాలా' అని. 'మిక్కుటముగా', 'మిక్కిలిగా, అనేకమైన'. జీత్ అంటే విజయములు పొందిన వాడు. ఇంద్రజిత్ అని ఒకడున్నాడు. ఏమిటి వాడి గొప్ప? ఇంద్రియములన్నీ జయించాడు వాడు. అందుకని అంత సులభం కాదు వాడ్ని కొట్టడం. ఇంద్రజిత్తు సామాన్యమైనవాడు కాదు. లక్ష్మణుడు చాలా తిప్పలు పడ్డాడు. కారణం ఏమిటంటే వాడు ఇంద్రియాల్ని జయించాడు అంటే అనిరుద్ధతత్త్వం అతనిలో నిండి వుంటుంది. అనిరుద్ధుడు అంటే అర్థం యేమిటి? ఎదురులేని వాడు, ఎదిరింపలేని వాడు. వాడ్నెవరూ ఎదిరించలేరు. వాడికెదురులేదు. అటువంటివాడ్ని ఒకడ్ని పెట్టుకున్నారు వాళ్ళు. ఎప్పుడైతే ఇంద్రియాల్ని మనం జయించామో మనలో అనిరుద్ధస్థితి ఏర్పడుతుంది. ఇక దాన్ని పంచేంద్రియములు, పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచకర్మేంద్రియములు ఏమీ చేయలేవు. Impermeable by matter, water, air, fire and ether. పెద్ద పెద్ద విషయాలు! ఐదు ఇంద్రియాలు జయించినవాడికి ఒక శాశ్వతత్త్వం వుంది. ఎవడికి లొంగుతాడు అనిరుద్ధుడు? ప్రద్యుమ్నుడికి లొంగుతాడు. ప్రద్యుమ్నుడి నుండి వచ్చాడు కదా. ప్రద్యుమ్నుడు అంటే ఏమిటి? సోముని యొక్క వెలుగు, లేక అస్తిత్వము లేక చైతన్యము ఆధారంగా వెలువడిన వెలుగు ప్రద్యుమ్నుడు! వీళ్ళందరికీ పేర్లు పెట్టేశారు. కృష్ణునికి కొడుకు ప్రద్యుమ్నుడు, ప్రద్యుమ్నుని కొడుకు అనిరుద్ధుడు అట్లా అనుకోకండి. ఈ పేర్లు రాక ముందు నుండి వున్న తత్త్వాలు ఇవి. అసలు ఉన్నదాన్ని 'వాసుదేవ' అన్నారు. ఎప్పుడూ నివసించి వుండేవాడు. ఆయన దిగి వస్తాట్ట. 'సంకర్షణ' అంటే దిగి వచ్చేవాడు. ఆ దిగివచ్చిన వాడికి వెలుగుట 'ప్రద్యుమ్న'. అందులోంచి తిరుగులేని వాడొకడు, 'అనిరుద్ధ'. నలుగురు. ముత్తాత, తాత, తండ్రి, కొడుకు నాలుగు స్థితులు కదా. 'చతుర్వర్గ ఫలం జ్ఞానం.' ఇంద్రియాలను జయించిన ఇంద్రజిత్తును అంతకన్నా పై లోకం నుండి జయించాలి. అప్పుడప్పుడూ లక్ష్మణుడు కొంత అహంకార పడ్తాడు కాబట్టి వీలు పడలేదు. మళ్ళీ మన స్థితిని కొంచెం అప్పుడప్పుడూ పైకి లాక్కుంటూ వుంటాం, చూడండి లాగు జారిపోతుంటే, ఎప్పుడూ లాక్కోవాల్సిన అవసరం పడకుండా వుండాలంటే బొందులాగులేసుకోవాలండీ. లేకపోతే అప్పుడప్పుడూ లాక్కుంటూ వుండాలి. ఈయన లాక్కొని మళ్ళీ వచ్చి కొట్టేశాడు. ఏం చేశాడు? నారాయణతత్త్వాన్ని అప్పుగా తెచ్చుకున్నాడు. అంటే ఏమిటి? తను నారాయణ స్థితికి పెరగగలగడం. పెరగగలడు ఎందుకంటే ఆదిశేషుని తత్త్వం కదా. కాలమూర్తి లక్ష్మణుడు! అందుకనే రాముడి వెంటవెంటనే నడిచాడు. భగవంతుడు కాలస్వరూపుడు. కాలాన్ని అంటి పెట్టుకుని వస్తాడు. అట్లాగే కృష్ణుడు బలరాముడ్ని వెంటబెట్టుకొని వచ్చాడు. వాడు లేకపోతే వీడు

రాడు. మామూలుగా ఏమవుతుందంటే అలగా జనంతో పని చేసుకోవడానికి కొంచెం తెలివి సరిపోతుంది. ఉన్న అలగా జనాలందరినీ కొట్టాడు లక్ష్మణుడు. దానికి వున్నది చాలు ఇందులోకి పెరగక్కరలేదు. వీడూ అందులో వాడే కదా అనుకున్నాడు. వాడు కొంచెం పెద్దవాడు. కొంచెం ఒక్కసారి లాగూ పైకి లాక్కోవలసి వచ్చింది. అంతే! వాడికన్నా చాలా పెద్దవాడు లక్ష్మణుడు. మనక్కూడా ఏమవుతుందంటే ఎవరితో తిరుగుతుంటే వాళ్ళ లోకాల్లోకి జారిపోతూవుంటాం కదా. జారిపోయినప్పుడు మళ్ళీ పెద్దవాళ్ళు కలిసినప్పుడు ఒకసారి పైకి లాగబడతాం. 'పురుజిత్' అంటే 'చాలా విజయాలు కలిగిన వాడు' అని అర్థం. భగవంతుడివి కాకపోతే నీవీ, నావా విజయాలు? ఇంత సృష్టి ఆయన కారణంగా అయిందంటే అంతకన్నా విజయం యేం కావాలండీ? మనమేదో కొంచెం ఒక మంచిపని చేయగానే చాలా విపరీతంగా విజయం పొందినట్టు అనుకుంటూ వుంటాం కదా. నీ మంచిపని ఎంత? గురివిందంత. నీవు చేసింది ఊరంతా తెలుసా? ఇంట్లో వాళ్ళకన్నా తెలుసా? అందరికీ తెలీదు కదా. అటువంటిది భూమి, గోళాలు గోళాలుగా పెట్టుకొని మొత్తం లెక్కవుందిగా మనకు. ఇంతా తను పాకాడంటే అంతకన్నా విజయమేమిటండీ? చక్రవర్తులు కూడా పోలికకు చాలరు. అన్నీ ఆక్రమించేసి, అన్నిట్నీ వ్యాపించివున్న వాడి విజయాలు ఎన్నని చెప్తాం? ఎన్నయినా చెప్పుకోవచ్చు భగవంతుని విజయాలు. అందుకని యేం చెప్పారంటే ఎక్కడ ధర్మంతో కూడిన విజయం జరిగిందో అక్కడ విజయం చేసినవాడు భగవంతుడు. శాశ్వతమైన విజయమది. మనకేదైనా మంచి జరిగినప్పుడు అట్లా చేశాను, ఇట్లాచేశాను, ఇంత తెలివిగా చేశాను, అంత తిరిగి చేశాను. కాబట్టే ఇట్లా అయిందని చెప్పే వాళ్లుంటారు కొంతమంది. అంత తెలివిగా నువ్వు చేసినా, ఒక్కోసారి పప్పులో కాలు పడిపోతూ వుంటుంది. కదా. కాబట్టి విజయం కలిగిందంటే అది వాడిది! ఇన్ని విజయాలు అందరికీ వచ్చాయని పక్కన విజయుడు ఒకడున్నాడు కదా. భీష్మాచార్యులవారు విష్ణుసహస్రనామం చెప్పేప్పుడు చాలా విజయాలు సంపాదించాము, అని అనుకుంటూ ఇద్దరు నెలబడ్డారక్కడ వినేవాళ్ళలో, ఎవరో తెలుసా వాళ్ళిద్దరూ? ఒకడు భీముడు, ఇంకొకడు అర్జునుడు. ధర్మరాజుకు పాపం ఆ బాధలేదు. వీళ్ళకే బాధ ఒకటి వుంది. శక్తి సామర్థ్యాలు 'మనవి' అని అనిపించేట్టుగా వున్నాయి వాళ్ళదగ్గర. కాబట్టి వాళ్ళకు అప్పుడప్పుడూ మెరమెర వస్తూ వుంటుంది 'మనవల్ల' అని. అందుకని యేం చెప్పాడంటే 'అన్ని విజయాలు నువ్వే, ఇన్ని విజయాలు అని చెప్పడానికి వీలు లేదు, ఎక్కడ విజయం జరిగినా అది నీదే' అని చెప్పాడు. అంటే ధర్మసమ్మతమైన విజయమే శాశ్వతమైన విజయం! మిగతా విజయాలు విజయాలు కావు. అందుకని భగవంతుని పేర్లలో 'విజయ' ఒకటి. కృష్ణదేవరాయలు ఆయన సభకి 'భువనవిజయం' అని పేరు పెట్టుకున్నారు. అంతా దివ్యత్వమే నర్తించింది ఆసభలో, ఇంకొకటి లేదు. EK గారు చెప్తూ వుండేవారు 'శ్రీకృష్ణుడే మళ్ళీ ఒక్కసారి దిగివచ్చాడేమో అనిపిస్తుంది కృష్ణదేవరాయల గురించి బాగా అవగాహన చేసుకుంటే'

అని. చాలు. ఆ ఒక్క వాక్యంలో కృష్ణదేవరాయల గురించి 18 పురాణాలు రాయగలిగినంత చెప్పారు మాస్టరుగారు. 'కృష్ణాంశ' అది అట్లా వచ్చాడు. కొంత బాగు చేద్దాం పాడైపోతున్నవాళ్ళనని' అన్నారు It is a last effort before the take over of the culture by time. ఎప్పుడూ కూడా పోతుందనుకున్నప్పుడు ఇంకొక ప్రయత్నం చేస్తూవుంటాడట. ఏమన్నా కాస్త నిలుస్తుందేమోనని. ఇప్పుడు పనికిరాక పోయినా ముందుకు పనికివస్తుంది. అందుకని మనకెప్పడన్నా జయం కలిగితే 'అది వాడి జయం' అనుకోండి. అపజయం కలిగితే 'ఎక్కడో మనం procedure లో పొరబాటు చేశాం' అనుకోండి. ఎందుకంటే ఆయన ఇచ్చేది జయమే, అపజయం కాదు. ఆయన దగ్గర ఇద్దరు భటులున్నారు. కుడిచెయ్యి, ఎడమచెయ్యి. వాళ్ళ పేరేమిటి? వాళ్ళ పేర్లు జయుడు, విజయుడు! ఒకడేమో అంతర్గతమైన జయమిస్తాడు. ఒకడు బహిర్గతమైన జయమిస్తాడు. విజయుడు అంటే బహిర్గతంగా ఇస్తాడు. జయుడు అంటే అంతర్గతంగా ఇస్తాడు. జయ శబ్దానికి 18 అంకె! లోపలి జయానికి ఒకడు. బయటి జయానికి ఒకడు. వాళ్ళిద్దరూ ద్వారపాలకులు. వాళ్ళిద్దరికీ దణ్ణం పెట్టుకోకుండా వేంకటేశ్వరస్వామి గుడిలోకి వెళ్ళకండి. మీరు ఎంత కష్టపడి వెళ్తున్నా queue లో వాళ్ళ దగ్గర ఎలాగూ కాసేపు నిలబడక తప్పదు. కదా. వాళ్ళిద్దరికీ దణ్ణం పెట్టకుండా లోపలికి వెళ్తే కనపడడు దేవుడు. రాయే మీరు చూసేది. వాళ్ళిద్దరిలోనూ భగవంతుడ్ని చూడకుండా లోపలికి వెళ్తే సనకసనందనాదులకే దిక్కులేక పోయింది. మనం ఎంత? అన్ని లోకాలలోనూ నారాయణుని చూడగలిగిన మహర్షులు, విష్ణులోకానికి వచ్చేశాం, ఇంకేం అయిపోయింది ఇహ, అదే కనబడుతోంది, లోపలికి వెళ్ళిపోవచ్చు అనుకుని, ఒక్కరవ్వ అశ్రద్ధ చేశారు. మనం కూడా అంతే! చచ్చిచెడి వెళ్తాం కదా తిరుపతికి. అన్నీ భయాలే. Cottage దొరుకుతుందో, దొరకదో? Hotel కి దగ్గరగా వుంటామో, వుండమో? దర్శనం ఎంతసేపు పడుతుందో? అలా అన్నీ దాటేసి ఆయన దగ్గరికి వెళ్ళేసరికి ఇహ దేవుడి మీద ఆరాటం ఎక్కువైపోయి, వీళ్ళిద్దరినీ అసలు పట్టించుకోనే పట్టించుకోం కదా. అక్కడ ముగ్గురున్నారు. వాళ్ళు ముగ్గురూ ఒకళ్ళనొకళ్ళు ఎప్పుడూ చూసుకుంటూ వుంటారు. మూడో ఆయన ఎవరో తెలుసా? వీళ్ళిద్దరూ కాక అటుపక్క వుంటాడు, గరుత్మంతుడు! వాళ్ళు ముగ్గురూ లెక్కేసుకుంటారు. ఏరా! ఈ లోపలికి వెళ్ళేవాడి సంగతేమిటని? అయిపోయింది గురూ! కష్టపడి వచ్చాడు. ఏం కాలేదు. అని చెప్పుకుంటారు. విష్ణువుని చేరాలంటే గరుత్మంతుడి దగ్గర నుండి visa కావాలండీ. శివుడ్ని చేరాలంటే నంది visa కావాలి. అమ్మవారిని చేరాలంటే సింహం visa కావాలి. అప్పుడే అమ్మవారి దర్శనం. సింహం మనని అనుగ్రహించాలి. అందుకని సింహం మీద కూర్చున్న అమ్మవారికి పూజ చేసేటప్పుడు అమ్మవారికి ఎన్ని పూలదండలు వేస్తావో సింహానికి కూడా అన్ని వెయ్యి. వినాయకుడికి ఎంత పూజ చేస్తావో, ఎంత అలంకారం చేస్తావో అక్కడ వుండే మూషికానికి కూడా అంత అలంకారం చెయ్యి. నీకు సమభావం

లేకపోతే దైవం కనిపించడు. ఆ.. ఇది ఎలుక కదా. అని అనుకుంటే కాదు, వీటితో పనేమిటి? అనుకోకూడదు. సింహమే ముందు, తరువాత అమ్మవారు. PA to MD అండీ. PA to Collector. PA to Prime Minister కదా. కలవకుండా వెళ్ళిపోగలవా? తిప్పలు పడతావు. కాబట్టి జయవిజయులు నీకు బహిర్గతమైన విజయం ఇస్తారు, అంతర్గతమైన విజయం ఇస్తారు. అంతర్గత విజయమంటే ఏమిటి? నిన్ను దగ్గరుండి చెయ్యి పట్టుకొని భగవంతుడి దగ్గరికి వెళ్ళడానికి ఆయనే తీసుకుని వెళ్తాడు. అంతకన్నా యేం కావాలి? అట్లా మీరు వాళ్లని దర్శనం చేసుకుని వెళ్లారనుకోండి, అక్కడ తోసేస్తారు కదా లోపల, బయటికి వస్తుంటే అక్కడ ఒక ఖాకీ బట్టలవాడు పక్కకి తీసుకుని ఇంకాసేపు చూడండి అని మళ్ళీ అట్లా పంపిస్తాడు. ఏదీ ఇట్లా వీళ్ళను చూస్తే! వాడి చేతిలో 5,10 పెట్టి చూడడం అక్కరలేదు. ఇవన్నీ సత్యాలు. తిరుపతిలో సత్యం చాలా వుంది. దాన్ని కప్పేసి అంతా అసత్యం వుంది. నీబట్టే వుంటుంది అక్కడ. నీ భావం బట్టి, నీ శ్రద్ధ బట్టి, నీ భక్తి బట్టి నీకు జరిగే దర్శనాలుంటాయి. తమాషా అంతా అక్కడ పెద్ద గారడీగా పెట్టాడు ఆయన. మనం ఈ గారడీలో పట్టుకుని వెళ్ళాలంటే, తిరణాళ్ళలో తిరిగినట్టే. తప్పిపోకుండా వుండాలంటే వాడి చెయ్యి పట్టుకోవాలి. వీళ్ళూ ముగ్గురున్నారు అక్కడ చేతులు పట్టుకోవడానికి. గుళ్ళో ప్రవేశించేప్పుడు ముందు గుర్తుపెట్టుకోండి, ధ్వజస్థంభాన్ని చూడడం మరచిపోవద్దు. ధ్వజస్థంభాన్ని చూడగానే నేను కూడా ఒక ధ్వజస్థంభమునే, దేనికి? చైతన్యము యొక్క స్థంభమును! ఇహ అక్కడ నుండి పేరు, ఊరు, స్థితిగతులు మర్చిపోవాలి. అక్కడ నుండి లోపలికి వెళ్ళిన తరువాత వాహనం కనిపిస్తుంది, భగవంతుడిది. నేను కూడా భగవంతుని వాహికనే! భగవంతుని వాహికగా నువ్వెప్పుడూ దర్శనం చేసుకుంటూ వుంటావు కదా. నువ్వనుగ్రహిస్తే నేనూ చేసుకుంటాను, అని భగవంతుని వాహికకు చెప్పాలి. అందుకనే శివుడిగుడిలోకి వెళ్ళేప్పుడు నందిగార్ని కొంచెం పరిచయం చేసుకొని, ఆయన్ని ఉల్లాస పరచి, వెనకాల మూపురం దగ్గర రాస్తాం కదా. రాసి యేం చేస్తాం? ఆయన రెండు కొమ్ముల్లోంచి, చెవుల్లోంచి తల పెట్టి చూస్తాం. ఇది ఎందుకిచ్చారు? ఆయనలోంచి దర్శనం జరుగుతుంది తప్ప, లేకపోతే జరగదు అని చెప్పడానికి. ఆయన తలుపు. అక్కడికెళ్ళిన తర్వాత నువ్వనుగ్రహిస్తే ఆయనకి నేనూ వాహికనవుతాను, అంటే కాదనడు పాపం, ఆయనకి బొత్తిగా వైషమ్యాలుండవు. రావణాసురుడు కాదనడం వల్ల దెబ్బతిన్నాడు. నందీశ్వరుడ్ని అవమానం చేస్తాడు. నువ్వేంటిరా? 'ఎద్దువి, నీతో నాకేమిటి' అంటాడు.'ఆహా! అంటాడు, అయిపోయింది. గుర్తుపెట్టుకోండి, భగవంతుడ్ని మీరెన్ని తిట్టినా పర్లేదండీ, భగవద్భక్తుల్ని తిడితే ఒప్పుకోడు, ఇది సత్యం! భగవద్భక్తులని తిడితే భగవంతుడు తలుపులేసేసి, తాళాలు పెట్టేస్తాడు. Godrej Lock! ఇంక తన్నుకుని గీపెట్టినా లాభం లేదు. మళ్ళీ ఇంకో మహాత్ముడు నిన్ను కరుణిస్తే, 'ఏదో పాపం వాడట్లా తెలీక చేశాడు, అంత మలీ నువ్వు బిగుసుకుపోక' అంటే, 'ఆ సరే... కానీ నువ్వు

చెప్తున్నావు కదా.' అంటాడు. ఎప్పుడూ కూడా భగవద్భక్తుల ద్వారా భగవంతుడ్ని చేరడం సులభం. భగవద్భక్తులకి సేవ చేసుకోవడం ద్వారా భగవంతుడు ఎక్కువ ప్రసన్నుడవుతాడు. దుర్వాసుడంతటివాడ్ని తిడతాడు విష్ణుమూర్తి! పోతనగారి ప్రకారం 'అరె పోరా బాపనయ్యా!' అన్నాడంతే. ఎందుకని? అంబరీషుని అవమానం చేశాడు కాబట్టి. సనకసనందనాదులకు కూడా ముప్పతిప్పలు అయిపోతాయి. ఎందుకని? వీళ్ళిద్దరినీ సరిగా చూడలేదు కాబట్టి, ఎందుకివన్నీ చెపున్నాను? వాళ్ళిద్దరే జయ, విజయులు, నీకు ఒకటి అంతర్గత విజయము, మరియొకటి బహిర్గత విజయము ఇవ్వగలిగిన భగవంతుని యొక్క రెండు శక్తులవి. కాబట్టి 'జయం నీదనుకోబోక, అంతర్గత జయము నీది కాదు, బహిర్గత జయమూ నీది కాదు. రెండూ అనుగ్రహమనుకో' అంటారు. అలా వుంటాయి. కానీ తర్వాత శ్లోకంలో ఈ ఉత్తరార్ధంలోకి వెళ్ళినప్పుడు 'వినయో' అని వస్తుంది. ఆయన అలా వుంటాడుట వినయంగా. నువ్వేమెటే? కొండ అద్దమందు కొంచెమై వుండదా అనలేదా? అంత కొండా అద్దంలో ఇముడుతోందా? చీమలో కూడా వుంటున్నాడు కదండే? మనకేమిటి? అట్లా వుండలేం కదా మనం! అందుకని 'జయ, విజయులుగా సమస్త విజయములూ నువ్వే' అని చెప్పడానికి 'పురుజిత్' అన్నారు.

## 525 పురుసత్తమః

అందరికన్నా ముందు నుండే వున్నవాడు. అందరిలోనూ వున్నవాడు. ఇప్పుడు మనలో ఏడుపారలుగా, ఏడుగా కనిపిస్తాడు. కానీ ఎనిమిదవవాడుగా వుంటాడు. అష్టవసువులు, ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు, అశ్వినీ దేవతలు-33. ఈ 33 చిలవలు పలవలుగా 33 కోట్ల శక్తులుగా సృష్టి అంతా నిర్మాణం చేసినాయి. ఈ 33, మరి 33 కోట్ల పారల క్రింద లెక్క వేసుకుంటే ఒక్కొక్క పారలోనూ వున్నాడు, పారను మించి పారలో, పారను మించి పారలో అట్లా వున్నాడు. అందుకని పురుసత్తమః. అంటే చాలా రకాలుగా వున్నావయ్యా నువ్వు అని చెప్తున్నాడు. ముందునుంచీ వున్నావు. ఉన్నవాళ్ళందరిలో వున్నవాడిగా వున్నావు. చెట్టులో ఉన్నావు. చెట్టు కన్నా సున్నితమైన పండులో ఉన్నావు. పండు లోపల ఉన్నావు. టెంకగా ఉన్నావు, టెంకలో గింజగా వున్నావు. గింజలో అణువుగా వున్నావు. అణువులో మళ్ళీ ఉన్నావు. ఇట్లా వుంటూనే వుంటాడు. ఎన్నిరకాలుగానైనా వుంటాడు. అంటే ఇన్ని రకాలుగా నువ్వు వున్నావని చెప్పలేం అంటున్నాడు. అది పురుసత్తమః, సత్త అంటే ఏమిటి? సత్ యొక్క అస్తిత్వము! అది తెలియాలంటే సత్త్వగుణంలో వున్నవాడికి మాత్రమే సాధ్యం! మిగతావాళ్ళకి కాదు. తమోగుణం వుండేవాళ్ళకి, రజోగుణం వుండేవాళ్ళకి భగవత్ తత్త్వం అవగాహన కాదు కాదు, కాదు! విశ్వామిత్రునికి కాలేదు, వశిష్ఠుడికి అయింది. తనని తాను చంపుకున్న తరువాత (అహంకారం పోయిన తరువాత) విశ్వామిత్రుడికి అయ్యింది. అందుకనే మనం చస్తే గానీ అసలు తెలివి రాదు అని. ఇది చావు తెలివి! చచ్చిన తరువాత అసలు తెలివి వస్తుంది. అది చెప్పడానికే వినాయకునికి తల తీసేశారు, దక్షుడికి తల తీసేశారు. 'నువ్వు కూడా వున్న తల తీసుకుంటే నీకు తెలుస్తుంది ఈ తలతో ఏమీ తెలియదు', అని చెప్పన్నారు. ఈ తల నీకే అడ్డం. రావణాసురుడంతటివాడు ఒకసారి భరించలేక తల అర్పణ చేస్తాడు. కనిపించాడు. వచ్చాడు. మళ్ళీ వాడి తలే పెట్టించేసుకున్నాడు. ఒకటే కాదు పది. ఇంక నా తల వద్దు, నీ తల వుంటే బాగుంటుంది, అన్నవాడు బ్రతికి పోయాడండీ. వినాయకుడు అట్లా బతికి పోయాడు. మళ్ళీ అక్కడ నుండి ఆయనకేమీ ఇబ్బందులు లేవు. దక్షప్రజాపతి అలా బ్రతికి పోయాడు, తలమార్పిడి కోసమే ముండనం చేయించుకోవడం. తిరుపతి వెళ్ళినప్పుడల్లా మనం జుట్టు ఇచ్చేసి వస్తాం కదా. అంతవరకేనా? కాదు. తలమీద నీకెన్ని వెంట్రుకలున్నాయో నీలో అన్ని భావాలున్నాయి. ఇంకా ఎక్కువే వుంటాయి. వాడు మంచివాడు కాబట్టి అంతవరకే. బట్టతల వాడికి ఇంకా చాలా ఎక్కువ వుంటాయి. నిజానికి ఎక్కువ ఆలోచించడం వల్ల వున్నవి తగ్గినాయి కాబట్టి. అందుకని వేమన 'తలలుబోడులైన తలపులు బోడులవునా' అన్నాడు. అందుకని జుట్టు ఇచ్చేప్పుడు వీడు బాగా గీకుతాడో లేదో? Dettol రాసుకుందామా? ఇవన్నీ కాదు.

కళ్ళు మూసుకుని, 'బాబూ నీకు సమర్పణం' అనుకోవాలి. తల సమర్పణ చేసేది ఎవరికండీ మనం? దేవుడికెట్టాగూ చేయలేం. మంగలాడికే. EK గారు అంటూ వుండేవారు, 'మనం తల ఇచ్చేది ఒక్కడికేనోయ్, మంగలాడికి. దేవుడికిస్తామా?' చచ్చినా ఇవ్వం. దేవుడికి ఇస్తే మంగలాడికివ్వక్కరలేదండీ. 'వీడి చేతిలో ఇంత విశ్వాసంగా పెడతావే తల, వాడి చేతిలో పెట్టలేవా?' అనేవారు ఆయన. 'మంగలాడిపాటి చేయలేదా దేవుడు నీకు? వాడి చేతిలో పెట్టకూడదా నీ తల' అంటూండేవారాయన. కాబట్టి మనం కూర్చుని వాడు మనకి కత్తి వేస్తుంటే, 'నాతలపులన్నీ మార్చు' అని అడగాలి. కొత్త crop కదా వస్తుంది! Let there be a new crop of thoughts which are Divine, which are proximate to Dharma! 'ధర్మానికి దగ్గరలో వుండే ధర్మసమ్మతమైన తలపులే నాకు కలిగించు, ఈ ఉన్నవి తీసేయి' అని కోరుకోవడం తలనీలాలు ఇవ్వడంగా మనకొక సాంప్రదాయం వచ్చింది. మళ్ళీ వస్తాయి. కొత్త crop మళ్ళీ పాత crop లాగా వుండకూడదు. అప్పుడూ తల ఇచ్చినట్లు! అదలావుండగా తలమార్పిడి సాధనలు జరగాలి. మన స్వభావంలో మార్పురావాలి. మనకి కలిగే భావాల్లో మార్పు రావాలి. ఇలా జరిగితే తప్ప, ఊరికే మనం తలనీలాలిచ్చినా, రావణాసురుడు తలకాయ ఇచ్చినా, తేడా ఏమీ లేదు. అందుకని సాధన! తపస్సెందుకయ్యా అంటే భావములన్నీ దగ్ధమవ్వాలి. నీగురించి నీకున్న భావాలన్నీ తగ్గితే, వాడుండడం మొదలుపెడతాడు. ఒకటే కుల్చీ వుంటుంది నీలోపల. నువ్వు కూర్చుంటే ఆయన కూర్చోడానికి చోటులేదు. ఆయన కూర్చుంటే నీవు ఆయన పాదాల దగ్గర నిలుచోవచ్చు. పాదాల దగ్గర కూచోవచ్చు కాళ్ళనెప్పలైతే. హనుమంతుడు చూడండి ఎట్లా కూర్చున్నాడో పాదాల దగ్గర. తక్కువ వాడా? ఇది మనకి సందేశం! 'ఒరే! ఇట్లా వుండరా బావుంటుంది' అని చెప్పడం అది. రామపట్టాభిషేకం చాలా పరిపూర్ణమైన చిత్రపటం. రాముడు దైవము, లక్ష్మణుడు కాలము, అమ్మవారు చైతన్యము, హనుమంతుడు గురువు, నలుగురినీ అక్కడ ఇచ్చారు. ఇంక నువ్వు పెంచుకుంటే సప్త ఋషులు వేసుకోవచ్చు, వశిష్ఠుడు వేసుకోవచ్చు, విశ్వామిత్రుడ్ని వేసుకోవచ్చు. చాలామందిని వేసుకోవచ్చు. సత్త్వగుణంలోకి రావాలి. సత్త్వగుణంలోకి వస్తేనే మన యొక్క 'సత్త' అంటే మనం వుండడం అంటే ఏమో తెలియడానికి దగ్గరవుతాం. అది భగవద్గీతలో రహస్యంగా శ్రీకృష్ణుడు ఇచ్చాడు-'నీవు రజస్సు, తమస్సుని neutralise చేసి అంటే సమన్వయపరచి సత్త్వంలో నిలబడు. అప్పుడే గుణాతీతమైన తత్త్వానికి దగ్గరవుతావు. గుణాతీతమైన తత్త్వానికి సత్త్వం లోంచి ప్రవేశించు. అప్పుడు సత్ లోకి ప్రవేశిస్తావు అంటారు. అప్పుడాయన మంత్రం ఇచ్చాడు 'హరి ఓం తత్ సత్' అని చేసుకోమని'. అందుకని ఆరాధనలు, పూజలు సత్త్వగుణోపేతంగా వుండాలి. రజోగుణంతో కూడి ఉండకూడదు. రజోగుణం పూజలెట్లా ఉంటాయో, తమోగుణం పూజలెట్లాఉంటాయో, సత్త్వగుణం

పూజలెట్లాఉంటాయో, భగవద్గీతలో భగవంతుడే చెప్పాడు. చూసుకోండి ఒకసారి మనం ఏ category లో పడతామో! తమోగుణం వాళ్ళకి నిదానమే ఉండదు అసలు. రజోగుణం వాళ్ళకి ఆడంబరం ప్రధానంగా వుంటుంది. సత్త్వగుణం వాళ్ళు నిశ్శబ్దంగా సరైన పద్ధతిలో చేసుకుంటారు. అందుకని ఏదైనా నేర్చుకుంటే విధివిధానంగా నేర్చుకోవాలి. అలా చేసుకుంటే నీవు సత్త్వంలోకి పెరుగుతావు. సత్త్వంలోకి పెరిగితే 'సత్తమః' అంటే గురువు రూపంలో నరోత్తములు-- 'నర సత్తమా' అంటుంటాం కదా. అంటే సత్త్వములో స్థిరపడిన నరుడు-- యొక్క సాన్నిధ్యం లభిస్తుంది. లభించడంచేత నువ్వు సత్త్వగుణాన్ని కూడా దాటి గుణాతీతమైన స్థితిలోకి వెళ్తావు. వెళ్తే నీవు కూడా సత్తమ స్థితి పొందుతావు. ఇటువంటి సత్తమ స్థితి పొందడం అంటే మనం వుండడం అంటే ఏమిటో మనకు తెలియడం. 'ఇట్లా ఎంతోమంది ఉండడం అంటే ఏమిటో తెలిసిన వాళ్ళుగా నువ్వే వున్నావు' అని చెప్తున్నాడు భీష్ముడు. పురుసత్తమః అని చెప్పడంలో అది ఒక అర్థం. ఇంకొక అర్థం రకరకాలుగా, బొద్దింక గా కూడా వున్నావు నువ్వు అని చెప్పడం పురుసత్తమః అంటే. పుర అంటే city అనీ, పురు అంటే మిక్కిలి అని అర్థం.

## 526 వినయః

భగవంతుని యొక్క కళ్యాణగుణాల్లో 'వినయము' అనేది చాలా ముఖ్యమైన గుణం. వినయము వున్నవాళ్ళకి విద్య వస్తుంది. నిజమైన విద్య నేర్చుకున్నవాళ్ళకి వినయము వస్తుంది. ఒక మనిషిలో విద్య వున్నదా లేదా? అని తెలుసుకోవాలంటే ఆ మనిషిలో వినయం వున్నదా? అహంకారం వున్నదా? చూడాలి. నిజంగా తెలిసినవారు చాలా చాలా వినయ-వివేకమూర్తులుగా వుంటారు. ఎగిరెగిరి పడరు. అహంకార పడరు. ఎవరినీ చులకన చేయరు. ఏ జీవినీ చులకన చేయరు. ప్రస్తుతం అటువంటి ఒక ఉదాహరణ చూడాలనుకుంటే భీమిలిలో వున్న శివానందమూర్తిగారిని చూడాలి. ఆయన దేనియందూ అశ్రద్ధ కలిగివుండరు. అన్ని విషయములయందు కూడా శ్రద్ధ, జీవులయందు వినయము. ఆయన వినయము ఎంత అంటే, ఎంత పెద్దవాడైనా సరే ఆయన దగ్గరికి వెళ్ళేసరికి ఈయన వినయంచేత వాడు చిన్నవాడౌతాడు. ఆ విధంగా వినయాన్ని ప్రదర్శన చేస్తారు. అది భగవంతుని యొక్క కళ్యాణగుణం, మహాత్ములందరూ కూడా వినయవంతులై వుంటారు. మిడిమిడిజ్ఞానం కలవాడు కొంచెం హుంకరిస్తూ వుంటాడు, అహంకరిస్తూ వుంటాడు. వినయం కలవారు అవతలి వాళ్ళని ముందుగా వీరే పలకరిస్తారు. ఆ తరువాత తనకేమి తెలుసో అది చెప్పరు. అవతలివాడు చెప్తూ వుంటే వింటూంటారు. ముందు పలకిరించేవాళ్ళు వినయవంతులు. వాడు పలకరిస్తే మనం పలకరిద్దాంలే, అని ముడుచుకు కూర్చునే వాళ్ళు వినయవంతులు కారు. బాగున్నారా? ఆని ముందు పలకరించి అంతా కులాసాగా వున్నారా? మీ పిల్లలు బాగున్నారా? అనే విషయాలు ప్రతివాళ్ళూ, ప్రతివాళ్ళనీ కనుక్కోవాలి. అలాగే పువ్వుల మొక్కను చూసినప్పుడు పువ్వును కూడా పలకరిస్తారు. ఆ ఇంట్లో పెంపుడు జంతువులు ఉంటే వాటిని, ఇంట్లో మనుషుల్ని అట్లా పలకరిస్తారు. ముందు పలకరించడం వరకే. తర్వాత సంభాషణ అంతా కూడా, అవతలి వాళ్ళు ఎందుకు వచ్చారో దాన్ని గురించి వుంటుంది. వాడు అడిగినదానికి అడిగినంతవరకే తప్ప తనకి తెలిసినదంతా చెప్పడం, ఇటువంటివి ఉండవు. భగవంతుని యొక్క కళ్యాణగుణం ఇది. మనం ప్రత్యేకించి దర్శనం చేయాలి. ఇది ఉన్నవాళ్ళని మీరు మహాత్ములుగా గుర్తించవచ్చు. ఇది లేనివాళ్ళు ఎంత తెలిసినవారైనప్పటికీ కూడా అక్కడ పూర్తి అస్తిత్వం లేదని గుర్తించాలి. ఇది ముఖ్యమైన విషయం! దీన్ని ప్రాతిపదికగా తీసుకుని కొంతమంది మహాత్ముల జీవితంలో వినయం వారు ఏ విధంగా ప్రదర్శింపబడ్డది మనం చూసుకోవచ్చు. ముందు భగవంతుని విషయం చూద్దాం. మామూలుగా అందరూ వినయంగా వుండడం వేరు భగవంతుడు వినయంగా వుండడం వేరు. కదా. మనకు ఎవరితోనన్నా పని ఉంటే చచ్చినట్టు వినయంగా వుంటాం. మనతో ఎవరికన్నా పనివుంటే మనం వినయంగా వుంటామా? సంస్కారం వున్నవాడు

వుంటాడు. సంస్కారం లేనివాడు వుండడు. భగవంతునికి ఎవరితో పనివుంది? ఎవ్వరితోనూ పనిలేదు. ఈ మొత్తం సృష్టిలో సమస్త జీవరాసులకి ఆయనతో పని. ఆయనకు ఎవరితోనూ పని లేదు. అయినప్పటికీ వినయంగా వుండడం అంటే ఏమిటి చెప్పండి? మనం యీ dimension ఎప్పుడన్నా ఆలోచించామా? ఈ దృక్పథం అసలు వున్నదా? మనతో పని వున్న వాళ్ళ విషయమునందు మనకు వినయం వున్నదా? మనకి ఎవరితో పనివుందో వాళ్ళయందు వినయము వుండక తప్పదు కదా. లేకపోతే పని జరగదు. అందుకని మనకి పని ఎవరితో వున్నది? అనేదానితో సంబంధం లేకుండా మనతో పని వున్నవారి పట్లా, మనకి పని వున్నవారి పట్ల ఒకే భావం వుంటే అది సమభావం. అది కేవలం వినయవంతులకి మాత్రమే సాధ్యం! అందరికీ సాధ్యంకాదు. వినయం వున్నవాళ్ళు సత్త్వగుణంలో ప్రవేశించడానికి వీలుపడుతుంది. వినయం లేనివాళ్ళకి సత్త్వగుణంలో ప్రవేశించడానికి వీలుపడదు. తమోగుణమో, రజోగుణమో అధికంగా వున్నపుడు వినయం వుండదు. సత్త్వగుణం మాత్రమే వున్నప్పుడు వినయం వుంటుంది. అందుకని మనం ముందు మొట్టమొదట భగవంతుడు ఏ విధంగా వినయంగా వున్నాడో చూద్దాం. ఎందుకంటే ఎవరితోనూ పని లేనివాడు, అందరికీ ఆయనతో పని వున్నట్టివాడు ఎట్లా వుండాలండీ? ఊళ్ళో చాలా పలుకుబడి కలిగిన అతిముఖ్యమైన వ్యక్తి దగ్గరికి మనం వెళ్తే ఆయన ఎట్లా వుంటాడో మనకు తెలుసు కదా. ఒక అధికారి దగ్గరికి మనం వెళ్తే ఆయన ఎట్లా వుంటాడో మనకు తెలుసు. కదా. అధికారులను కలవాలంటేనే లోపల సగం చచ్చివుంటాం మనుషులం. పలుకుబడి వుండేవాళ్ళను కలవడం అంటే ఇంకా సగం చచ్చిపోతాం. కానీ భగవంతుని విషయం లో అట్లా కాక, తాను వినయవంతుడై వుంటాడట. శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవత్స్వరూపం! పూర్ణావతారం! అందుకనే అవతారం అనరు కృష్ణుణ్ణి. 'పురాణపురుషుడే దిగివచ్చాడు' అని చెప్తారు. ఆయన అటువంటి వినయాన్ని ప్రదర్శించాడు పెద్దలయందు. సంస్కారవంతులందరికీ కూడా ఆయన దణ్ణం పెట్టాడు. ఎవరిలో ఆయనకు సంస్కారం కనపడితే వాళ్ళకి దణ్ణం పెట్టాడు. సంస్కారం కనపడకపోతే దణ్ణం పెట్టలేదు. అక్రూరుడికి దణ్ణం పెట్టలేదు. అక్రూరుడు అహంకారంతో కూడిన జ్ఞాని. అహంకారులకి దణ్ణం పెట్టడు. శివుడు, దక్షప్రజాపతి తన మామగారైనప్పటికీకూడా దణ్ణం పెట్టలేదు. ఎందుకని? దక్షుడిలో తన దక్షత వల్ల కలిగిన అహంకారాన్ని చూసి, ఇప్పుడు వీడికి దణ్ణం పెట్టకూడదు అనుకున్నాడు. శ్రీకృష్ణుడు భగవానుడైనప్పటికీ కూడా తల్లిదండ్రులకు దణ్ణం పెట్టాడు. ఋషులకు దణ్ణం పెట్టాడు. మునులకు దణ్ణం పెట్టాడు. సంస్కారవంతులైన వాళ్ళందరికీ దణ్ణం పెట్టాడు. కాబట్టి నేను చాలా పెద్దవాడిని, నేనెవ్వరికీ దణ్ణం పెట్టను అనుకోవడం చాలా తప్పు అని అందరికన్నా పెద్దవాడు చెప్పినప్పుడు, దణ్ణం పెట్టించుకోవడమే తప్ప, పెట్టడం ఎరుగనివాళ్ళు ఉన్నారనుకోండి అంటే అహంకారం బాగా వుందని అర్థం. రావణాసురుడు దణ్ణం పెట్టడు. ఎందుకని? బాగా రజస్సుతో అహంకరించి

వుండడంచేత. కుంభకర్ణుడు దణ్ణం పెట్టడు, అహంకరించి వుండడం చేత. అందుకని పెద్దలయందు పూజ్యభావం వుండడం అనేది వినయానికి సంబంధించినది. నిజానికి శ్రీకృష్ణుడికి ఎవరితో పని వుంది? ఎవరితోనూ పని లేదు. అయినా ఎందుకు దణ్ణం పెట్టాడు? కృష్ణుడు జీవితంలో ఆచరించి చూపించాడు. నువ్వు ఎంతటి వాడివైనా కొంతగా వుండు అని. కొండ అద్దమందు కొంచెమై వుండదా! తక్కువగా కనిపించడంలో తక్కువతనం ఏమీ లేదు. తను తక్కువ కాదు. ఎక్కువగా కనిపించడు. తెలిసినా తక్కువగా కనిపిస్తూ ఉంటాడు. తనకు తెలిసిన కొద్దీ ఎక్కువగా కనిపించాలనుకునేవాడు తక్కువవాడు. శ్రీరాముడు అందరికీ దణ్ణం పెట్టేవాడు. శ్రీరాముడు కన్నా వినయవంతుడు ఎవరున్నారు? ఎంత వినయం? రామభక్తిలో వినయం సహజంగా అబ్బుతుంది మనుషులకి. అహంకారం చచ్చిపోతుంది. ఎందుకంటే రాముడట్లా ఆచరించి చూపించాడు. తల్లిదండ్రులకి, పెద్దవాళ్ళకు, మునులకు దణ్ణం పెట్టేవాడు. ఋషులందరూ కూడా దిగివస్తారు అవతారమూర్తి అని తెలిసి. ఆ అరణ్యాల్లో పడి అట్లా వందల, వేల సంవత్సరాలు తపస్సు చేస్తున్న వాళ్ళందరినీ అనుగ్రహించడానికి వాళ్ళ ఆశ్రమాలకు వెళ్లి, వాళ్లందరికీ రాముడే దణ్ణం పెట్టేవాడు. మనకసలు వంగదుకదా, ఎవరికన్నా పెట్టాలంటే. తల వంగదు, వళ్ళు అసలు వంగదు. ఎంతమంది పెద్దవాళ్ళ కాళ్ళకి నీవు దణ్ణం పెట్టగలిగితే అంత వినయం పెరుగుతుంది నీలో! దణ్ణం పెట్టే బుద్ధి వుండాలి. కొంతమంది పని కోసం దణ్ణం పెడతారు. ఆ దణ్ణం కూడా పనికివచ్చే దణ్ణం కాదు. కాబట్టి దణ్ణం పెట్టడం అనేది కేవలం మనలో వుండే అహంకార ప్రజ్ఞ ఏ మాత్రం బిగుసుకుంది అనేది మనకు తెలియడం కోసం తప్ప, మాటిమాటికీ దణ్ణం పెట్టామా లేదా? అని కాదు. దణ్ణం పెట్టగలవా, లేవా? కొంతమంది EK గారి లాంటివాళ్ళు దణ్ణం పెట్టించుకునేవారు కాదు. 'చాల్లేవోయ్! ఎన్నిసార్లు పెడ్తావు' అనేవారు. ఆయన అలా అనడం ఆయన వరకూ సత్యం. కానీ పెట్టేవాడు ఎన్నిసార్లు పెడ్తాలే అనుకోకూడదు. పెట్టే వుద్దేశ్యం వున్నా చాలు. పెట్టాలని rule ఏమీ లేదు. రాముని యొక్క పరిస్థితి చూడండి. వందల మంది ఋషుల ఆశ్రమాలకు కేవలం వారికి సాన్నిధ్యం ఇవ్వడానికి వెళ్ళాడు. అంతే! కానీ ఎలా వెళ్ళాడు? ఒక భక్తుడుగా వెళ్ళాడు. వాళ్లకు దణ్ణం పెట్టాడు, సేవలు చేశాడు, పాదాలు కడిగాడు. ఇన్ని చేస్తుంటే వాళ్లు లోపల ఉన్న ఆత్మారాముడు ఇతడే అని గుర్తించి, పొంగిపోయి కరిగిపోయారు. కరిగిపోయి 'నీవు భగవంతుడివి కాబట్టి మమ్మల్ని అనుగ్రహించడానికి వచ్చావు' అంటుంటే ఈయనేమో 'అదంతా నాకు తెలియదు నేను మీ ఆశీర్వచనం కోసం వచ్చానని' చెబుతూ వచ్చేవాడు. దణ్ణం పెట్టినంత మాత్రాన చిన్నవాళ్ళం కాము. ఒక్కొక్కసారి దణ్ణంపెట్టేవాడే దణ్ణం పెట్టించుకునేవాడి కన్నా పెద్దవాడు అవుతాడు. ఎందుకని? అదేకదా సనకసనందనాదులందరికీ శ్రీమహావిష్ణువు చెప్తాడు. వాళ్ళ నలుగురినీ జయ, విజయులు అడ్డగిస్తారు కదా. వీళ్ళకి కోపం వచ్చింది. మొత్తం అన్నిలోకాలు మనకు దణ్ణాలు పెడ్తాయి, వీళ్ళేమిటీ మనం

లోపలికి వెళ్ళడానికి అడ్డగించారు? మన సంగతి వీళ్ళకు తెలిసినట్లు లేదు. అని భావన చేశారు. అంటే రజోగుణం ప్రకోపించింది. శాపం పెట్టారు. వాళ్ళేమీ మాట్లాడలేదు. ఎందుకు అడ్డు పెట్టారో వీళ్ళకు తెలియలేదు. మనం జయవిజయులను చూడకుండా దేవుడ్ని చూద్దామని వెళ్లినప్పుడు, జయవిజయుల్లో దేవుడు కనపడకపోతే నీవు లోపలి కెళ్ళినా నీకు కనిపించేది రాయి మాత్రమే. వాళ్ళు అడ్డుపెట్టారు. అడ్డుపెడితే వీళ్ళకు కోపం వచ్చింది. శపించారు. కోపం వచ్చిందంటే కాస్తోకూస్తో అహంకారం వుంది కదా. ఎందుకు వచ్చింది మహర్షులైన సనకసనందనాదులు నలుగురికీ ఇంత అహంకారం? వాళ్ళెప్పుడూ నారాయణుడిలోనే వుండేవారు. వాళ్ళకి అహంకారం వచ్చిందంటే కారణం ఏమిటి? అది విష్ణుమూర్తి చెప్తాడు బయటికి వచ్చి. బయటికి వచ్చిన తరువాత 'ఏమిరా వాళ్ళు చాలా పెద్దవాళ్ళు కదా. వాళ్ళనెందుకు ఆపారు' అంటాడు. చదవండి, మన మాస్టర్ గారు చాలా బాగా రాశారు. అద్భుతంగా రాశారు. 'వాళ్ళు VIPలు కదరా. వేలాది కోట్లాది జీవుల రూపంలో నేనే వాళ్ళకు దణ్ణం పెడతాను కదా. అటువంటి వాళ్ళను మీరు ఆపవచ్చా?' అంటాడు. అంటే అప్పుడు అర్థం అవుతుంది సనకసనందనాదులకి, మీరు అహంకరించి బాగా దణ్ణాలు పెట్టించుకోవడం మరిగి, వీళ్ళు మీకు దణ్ణం పెట్టలేదనీ, ఆపారనీ, అహంకరించారు కదా. అని అర్థం వచ్చేట్లుగా మాట్లాడుతాడు భగవంతుడు. అట్లా అంటే బాగుండదని 'అదేమిట్రా? నేనే ప్రతిరోజూ వీళ్ళకు దణ్ణాలు పెడ్తూవుంటాను అన్నిలోకాల్లోనూ'. అంటే ఏమిటంటే 'దణ్ణం పెట్టేవాడిలో నేనున్నాను, అది మీరు మరచిపోయారు అని వీళ్ళకి చెప్పడం! రోజూ మీరు దణ్ణం పెట్టించుకుంటున్నారు కదా. ఆ పెట్టేవాడెవడు? నేనే! పెడుతూ వుంటే మీరు పెద్దవాళ్ళమనుకొని అహంకరిస్తున్నారు. సుమా!' అని హెచ్చరిస్తాడు. ఇంకా ఏమి చెప్తాడు? 'మీకు శాపం పెట్టాల్సిందే, తప్పు చేశారు కదా', అంటాడు. ఎవరు? మళ్ళీ అక్కడ వ్యంగ్యార్థం వుంటుంది. తప్పు చేసింది సనకసనందనాదులు, శాపం పెట్టింది సనకసనందనాదులు. విష్ణుభక్తులంటే ఏమిటో తెలుసా? మీరేం చేసినా మాట్లాడరండి. అద్భుతమైన విషయం. వృత్రాసురుడి పూర్వజన్మవృత్తాంతం చదవండి, ఒక్కసారి. మీరే అపచారమైనా చేయండి ఆయన విషయంలో, 'శ్రీహరీ!' అనుకుంటాడు, అంతే! తిరిగి మాట అనడు. తిరిగి కోప్పడడు. ఎందుకంటే విష్ణుభక్తుడికి ఎదుటి వ్యక్తి లో ఉండేది విష్ణువే! దండించినా, ప్రశంసించినా విష్ణువే! కోప్పడినా, ఛీత్కారం చేసినా విష్ణువే! అంతా విష్ణువే! కాబట్టి శాపంపెట్టిన సనకసనందనాదుల గురించి జయవిజయులకి ఎట్లా వుండాలి? ఈ బ్రాహ్మణులు నిష్కారణంగా శాపం పెట్టారు అనుకోవద్దూ? అనుకోవాలి కదా. వాళ్ళు భగవంతుని పనిచేయడానికి అక్కడ నిలబడ్డారు. గుమ్మం దగ్గర. కదా. వీళ్ళకి ఆయన Instructions ఏమిటి? అది ఆయనకు తెలుసు, వాళ్ళకు తెలుసు. బయటవాళ్ళకు తెలియదు. ఏమిటా instructions అంటే, 'ఒరే! మీలో నన్ను చూడని వాళ్ళని లోపలికి పంపించకండి', అని. ఎందుకంటే పంపించినా ఏమీ కనపడదక్కడ, వీళ్ళిద్దరికీ దణ్ణం పెట్టి, లోపలికి వెళితే

కనిపిస్తాడు ఆయన. 'మీలో అంటే కనపడుతున్న దానిలో చూడలేని వాళ్ళు కనపడని దాన్ని ఏమి చూస్తార్రా? కాబట్టి మీలో నన్ను చూసిన వాళ్ళనే లోపలికి పంపించండి' అని. వీళ్ళిద్దరిలో ఆ నలుగురూ చూడలేదు. అందుకని పంపించలేదు. పంపించకపోతే శాపం పెట్టారు. శాపం పెడితే యేం చెప్పాలి మామూలుగా? మీరు చాలా అహంకరించి శాపం పెట్టారు. మాకర్తవ్యం మేం నిర్వర్తించాం. ఇటువంటివన్నీ మాట్లాడాలా? మాట్లాడకపోవడం పరిపూర్ణమైన భక్తి! కాబట్టే భగవత్తత్త్వానికి అంత దగ్గరగా వుండగలిగారు. మనం తప్పు చేశామని ఎవరన్నా అంటే వెంటనే దాన్ని defend చేసుకుంటాం కదా. చేసుకుంటామా లేదా? అంతేకాదు, తప్పు చేసినా ఏదో విధంగా దాన్ని కప్పిపుచ్చుతూ వుంటాం తప్పు నాది కాదని. ఒప్పుకోం కదా. భగవద్భక్తుల విషయంలో ఏమిటో తెలుసా? తప్పు నీది! అని అవతలివాడు అంటే శ్రీహరీ! అనుకుంటాడు. అవును అనడు, కాదు అనడు. నాది తప్పు అనడు. నాది తప్పు కాదు అనడు. మౌనమే సమాధానం! ఎందుకంటే విష్ణుమూర్తి చూసుకుంటాడు. వీళ్ళకేమిటి? వీళ్ళకోసం ఆయన ఎప్పుడూ, అహర్నిశలూ అప్రమత్తుడై వుంటాడు. ఎంతమంది ఎన్నైనా అనచ్చు, అనుకుంటూ వుండచ్చు. విని, ఒక్కసారి భగవంతుడ్ని తలచుకుంటాడు. ఏమిటి నీ లీల ఈ విధంగా వుంది నామీద? అని. అంతేకానీ మళ్ళీ ఆవేశపడి, రోషపడి మళ్ళీ పదిమాటలనేవాడు సాధనకి పనికిరాడు పనికిరాడు, పనికిరాడు! పది జన్మలెత్తినా అంతే! నిజానికి మహాత్ములు యేం చేస్తారో తెలుసా? అవతలివాడి తప్పు తెలిసినా, 'ఇది నీతప్పు' అని అనడు. వాడంతటవాడు కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నం చేసినా, అట్లా సాక్షీభూతంగా చూస్తూ వుంటాడే తప్ప ఏమీ మాట్లాడడు. అక్రూరుడి విషయంలో శ్రీకృష్ణుడు అట్లా చేశాడు. శ్యమంతకమణిని మళ్ళీ దొంగలించుకు వెళ్ళిపోతారు. దానికి అక్రూరుడు consultant. కృష్ణుడ్ని చూసినప్పుడల్లా అక్రూరుడికి 'ఈయనకి తెలుసేమో నేనీ పనిచేసానని' అని, కొంచెం భయంతో కూడిన అనుమాన స్థితి కలిగేది. తెలుసు కానీ శ్రీకృష్ణుడు మాత్రం మాట్లాడేవాడు కాదు. అక్రూరుడు కనపడినపుడల్లా శ్రీకృష్ణుడు వాడి కళ్ళలోకి చూసి నవ్వేవాడు. నవ్వగానే ఆయనకి తేలు కుట్టినట్టుండేది. కానీ చెప్పేవాడు కాదు. తీసుకెళ్ళిపోయావు కదా శ్యమంతకమణి? అన్నట్టుగా వుండేది ఆయన నవ్వు. శ్రీకృష్ణుడు ఆ ఉద్దేశ్యంతో నవ్వచ్చు, నవ్వకపోవచ్చు. వాడికి మాత్రం తేలుకుట్టినట్టుండేది. కొన్ని సంవత్సరాలయిన తరువాత ఈయనకి తెలుసు, కాకపోతే అనడం లేదు, అని తన లోపల తాను భరించలేక శ్యమంతకమణిని తెచ్చి ఇచ్చేస్తాడు అక్రూరుడు. చదువుకోండి భాగవతం. 'మహాభక్తుడని అనుకుంటావే అలాంటి నువ్వు ఇటువంటి తప్పు చేశావు' అని అనడు శ్రీకృష్ణుడు. తప్పు చేస్తే చెప్పకున్నావో నువ్వు సుఖపడతావు. చెప్పకోలేదో, నీవు కష్ట పడతావు. అదే confession! చేసిన తప్పు త్రికరణశుద్ధిగా చెప్పగలిగే దమ్ముంటే వాడు సత్పురుషుడే! ఇటువంటి తప్పు చేశాను. నేనిట్లా చేశాను, నేను మోసం చేశాను, నన్ను క్షమించు అని చెప్పగలిగే దమ్ముంటుందా?

దండలేయించుకుంటుంటే అసలుండదు. పాదనమస్కారాలు పుచ్చుకుంటుంటే అంతకన్నా వుండదు. ఇట్లా వుంటారు. అటువంటిది ఎట్లా వున్నాడు భగవంతుడు? వాళ్ళచేత సేవింపబడుతూనే వాళ్ళను సేవించుకుంటూ వుంటాడు. ఇద్దరు భక్తులు కలుసుకుంటే చూడాలండీ. ఉద్ధవుడు, విదురుడు కలసిన సందర్భంలో అనుభూతి చదువుకోండి ఒకసారి. భక్తితో చదువుకోండి. తెలుసుకుందాం అని చదువుకోవద్దు. కరగండి. భాగవతం చదివితే కరగాలి. విదురుడు, ఉద్ధవుడు వారి సమాగమం. ఒళ్ళు పులకరించకపోయినా, కళ్ళెంబట నీళ్ళు రాకపోయినా, భాగవతంలో ముందుకు వెళ్ళడం అనవసరం. ఇంకా మనకి బాగా బండతనం ఉంది లోపల. ఆ బండతనం పోవడానికి బయట జీవులకి కొంత ఏదో చాకిరీ చేసుకుందాం అని అనుకోండి. భాగవతం అంతా అయిపోతూ వుంటుంది. ఒక్కొక్క ఘట్టం ఒక్కో పూర్ణమైన భాగం. అలాగే విదురుడు మైత్రేయుణ్ణి కలుసుకున్నప్పుడు యేం జరిగిందో చూడండి. ఉద్ధవుడు, విదురుడు ఈయన ఆయన పాదాలపై పడుతూ వుంటే, ఆయన వాళ్ళ పాదాలపై పడుతూ వుంటాడు. దాసోహం అంటే దాసోహం, అలా వుంటుంది. రాముని వినయం చూడండి. వినయం గురించి బాగా చెప్పుకోవాలి. మనకి ఏదో తెలుసు, మనం పెద్దవాళ్ళం అయిపోయామని అనుకుంటూవుంటాం కదా. కోతితో స్నేహం ఏమిటండీ? చెప్పండి. అసలే కోతి, ఏమిటీ వీడితో పెట్టారు నాకు? అనిపిస్తుంది. కదా. To treat another human being on par with us itself it is difficult for us. తోటి మానవుడ్ని మనతో సమానంగా గౌరవించే సంస్కారం లేనివాళ్లం మనం. ఒక కోతిని స్నేహితునిగా భావనచేసి తనతో సమానంగా చూశాడు. రాముని విషయంలో అదీ గొప్ప! అందరినీ తనతో సమానంగా చూసుకుంటాడు. వాడెంతటి వాడైనా వాడూ జీవుడే కదా. కోతిని తనతో సమానంగా చూసుకున్నాడు. గుహుడ్ని తనతో సమానంగా చూసుకున్నాడు. ఏమిటి వాళ్ళందరూ? మన యింట్లో పనిచేసేవాళ్ళను మనతో సమానంగా చూసుకోగలమా? భాషలో వ్యక్తం చేయనక్కరలేదు, భావనలో వుండండి, వాళ్ళకు దానివల్ల ప్రేమ అందుతుంది. అది నీకు వినయం వుంటేనే వస్తుంది. లేకపోతే రాదు. పనివాళ్ళు కనిపిస్తే తిట్టి పోస్తాం కదా, మనకన్నా తక్కువాడైతే వాడి మీద గయ్ గయ్ అని అరుస్తూ వుంటాం. మగైనా ఆడైనా, నీకేం సమానత్వం వుంది? తర్వాత వాడు నీ గురించి యేం భావన చేస్తున్నాడు? ఎప్పుడన్నా ఆలోచించావా? నీవు అరచి వెళ్ళిపోయావు బాగానే వుంది. ఆ తర్వాత వాడు నీగురించి ఏమనుకుంటున్నాడు? ఉన్నవాళ్ళు ఎప్పుడూ ఇంతే, అనుకుంటాడు. అంతేనా? అదే విషయం వినయంతో చెప్పవచ్చు కదా. అదే విషయం ప్రేమతో చెప్పవచ్చు కదా. ఎప్పుడు నీవు ఖచ్చితంగా అట్లా అరవాలి? ఎన్నిసార్లు చెప్పినా అర్థంకానివాడి విషయంలో శిక్షణ కోసం అరవాలి. అసలు మొదలు పెట్టడమే అరుపైతే, సుగ్రీవుడి విషయంలో రాముడు ఎన్నిసార్లు అరవాలి? అరవలేదు కదా. ఉడుత విషయంలో కూడా సమానత్వం చూపించాడు.

విభీషణుడి విషయంలో సమానత్వం చూపించాడు. శత్రువైన వాలి చచ్చిపోయిన తర్వాత వాడి యందు ఎంత సమానత్వం చూపిస్తాడు. అది వినయం ఉంటేనే వస్తుంది. అహంకారం ఉంటే రాదు. మామూలుగా శత్రువు గనక భీముడిలాగా వాడి శవాన్ని కాలితో తంతే నీకేమొచ్చింది! అందులో వాడు లేడు కదా? నీలో అహంకారమేగా? వాలికి ఉత్తరక్రియలు చేయాలని తను దగ్గరుండి చేయిస్తాడు రాముడు. రావణునికి ఉత్తరక్రియలు జరిపిస్తాడండి. అంతకన్నా యేం కావాలి? నానా అష్టకష్టాలు పెట్టిన వాడు మరణిస్తే వాడి దగ్గరికి లక్ష్మణుడ్ని పంపిస్తాడు. 'నాయనా ప్రాణాలు వదిలేస్తున్నాడు, వెళ్ళి జ్ఞానం నేర్చుకో' అని, 'రాజనీతి నేర్చుకో, మహాత్ముడు ఏదో ఒక చిన్న పారబాటు చేశాడు' అంటాడు. అంత పెద్దది చేస్తే చిన్న పారపాటు ఆయనకి. మనకి చిన్నది కూడా పెద్ద పారబాటు కదా. జన్మల తరబడి మాట్లాడుకోవడం కూడా మానేస్తాం కదా. మళ్ళీ దేవుడికి దణ్ణం పెడ్తాం. అదే తమాషా! అదన్నా, ఇదన్నా ఏదో ఒకటి మానేయాలి. రెండూ చేయకూడదు కదా. ఎందుకీ మోసం? నిన్ను నీవే మోసం చేసుకుంటున్నావు. Time waste చేసుకుంటున్నావు. డబ్బు ఖర్చు పెడ్తున్నావు. దీపాలకీ, నూనెలకీ, వత్తులకీ, పూలదండలకీ, పటాలకీ, ఫలహారాలకీ, ప్రసాదాలకీ, గుళ్ళ చుట్టూ తిరగడాలకీ, మానేసేయ్ హాయిగా. ఇట్టాగే వుండు. లేదూ అట్లా వుండలనుకుంటున్నావా? ఇది మార్చుకో! రావణాసురునికి విభీషణుని చేత దహనసంస్కారాలు దగ్గరుండి చేయిస్తాడు. విభీషణుడు సంకోచిస్తూ వుంటాడు. రాముడేమనుకుంటాడో అని. 'వెళ్ళిపోయిన తర్వాత అతడేమిటయ్యా? రావణాసురుడు అక్కడ లేడు కదా. ఆ శరీరం ఆందరి శరీరం లాంటిదే. చాలా ఉత్తమమైన కార్యాలు కూడా చేశాడు. ప్రత్యేకించి శివభక్తుడు. దహనసంస్కారాలు చేయమని' చెప్తాడు. దగ్గరుండి చేయిస్తాడు. జటాయువుకు దహనసంస్కారాలు తను చేస్తాడు ఎవరూ లేకపోతే. పక్షే కదండీ కొంచెం పిచ్చివాడేమో, వెర్రివాడేమో రాముడు అనిపిస్తుంది. వెర్రి కాదు, వినయం! లక్ష్మణుడుకి, సీతకి తెలిసేట్టు చేశాడు. మనమైతే అందరూ చూస్తుంటే చేస్తాం, లేకపోతే చెయ్యం. మనం కొంతమంది for others consumption చేస్తూ వుంటాం. లేకపోతే చెయ్యం. వినయవంతులకి మాత్రమే ఇటువంటిది సాధ్యం. ఇంకెవరికీ సాధ్యం కాదు. వామనుడెంత వినయవంతుడు? భగవంతుడు వినయవంతుడవడం అనేది కొంచెం ఆశ్చర్యకరమైనది. ఎందుకుండాలి? ఉండక్కరలేదు, కానీ ఎందుకుంటాడు? గుణాతీతుడైనవాడు గుణముల ద్వారా ప్రపంచంలోకి వస్తే సత్త్వగుణాన్నే ఆధారం చేసుకుని వుంటాడు. ఇంకోరకంగా వుండడు. మన పైవాడితో, మన దేవుడితో మనం ఏ విధంగా వుంటామో అట్లా ప్రతిజీవుడితో వుండగలవా? ఉంటే వినయం వున్నట్టు! అది సాధన! సులభమేగాని మనలో అహంకార ప్రవృత్తి వున్నప్పుడు కష్టం. అహంకారం తగ్గాలంటే వినయాన్ని ఆశ్రయించడం ఒక్కటే మార్గం. వామనుడు ఎంత వినయవంతుడు. నీకేదో ఇస్తాం అంటే నువ్వు నాకిచ్చేదేమిటి అనలే, 'నాకెందుకు? నాకేంకావాలి?' అన్నాడు. వినయం చేత

పెరిగాడు. 'వినయో జయ:' అందుకని దాని పక్కన పెట్టారు అది. వినయవంతుడికి వున్న జయం వినయవంతుడు కానీ వాడికి లేదు. ఏసుక్రీస్తు వినయం చూడండి. శిష్యుల కాళ్ళు కడిగిన వాళ్ళు ఇంకెవరైనా ఉన్నారా? రేపు వాళ్ళెవరో పట్టుకు పోతారు. పట్టిచ్చేవాడు కూడా అక్కడే వున్నాడు. శిష్యుల్లో ఒకడు. వాడు పట్టిచ్చేవాడని కూడా తెలుసు. కడగగలవా? కడిగాడు. చాలా కష్టం. భాగవతోత్తముల జీవితం చదువుకున్నప్పుడు ఏసుక్రీస్తు జీవితం పరిపూర్ణంగా చదువుకోవాలి. కరిగిపోతావు. ఎక్కడా అహంకారపు ఛాయలు వుండవు. ఎంత వినయవంతుడంటే రేపు ప్రొద్దున తన మరణానికి కారకుడై, కుతంత్రం చేస్తున్న శిష్యుడి కాళ్ళు కూడా, మిగతా శిష్యుల కాళ్ళతో సమానంగా అదే స్ఫూర్తితో, అదే శ్రద్ధతో కడిగాడండి. ఎవరు కడుగుతారా కాళ్ళని? పైజామా, లుంగీ పైకి లాక్కొని కూర్చుని పళ్ళెంలో కాళ్ళు పెట్టుకొని కూర్చున్నవాళ్ళకు తెలిసే విషయం కాదు ఇది. వాళ్ళాశ్చర్యపోయారు, ఏమిటి మాకు కాళ్ళు కడుగుతున్నావని. 'నేను మీకేం చేస్తున్నానో రేపొద్దున మీరు అందరికీ అదే చేయండి. నేను సేవచేసుకున్నాను మీకు, అలాగే మీరూ సేవచేసుకోండి జీవులకు. ఇదొక్కటే మార్గం' అని చెప్తాడు. వీళ్ళెంతసేపూ గురువుగారి దగ్గర తెలుసుకున్నవన్నీ బోధించేసేయాలని అనుకుంటారు. ఆయన ఎంతసేపూ ప్రవర్తన కావాలి, ప్రవక్త అయితే చాలదు, ప్రవర్తకులను చూశాడు. వీళ్లందరిలో బాగా బలిసింది. ఎందుకంటే తనతో బాటు మూడేళ్ళు తిరిగితేనే అంత బలిసింది వాళ్ళకి. మూడు లోకాలు ఆక్రమించేంత పనిచేశాడు మూడేళ్ళలో! ఎప్పుడూ గురువు చుట్టూ వుండే వాళ్ళకి ఎక్కువ బలుస్తుంది. వాళ్ళేదో కొంత special అనుకుంటూ వుంటారు. వాళ్ళ గురించి వాళ్ళు ఎక్కువ ఆలోచిస్తూ వుంటారు. ఏ రోజున ఒక సాధకుడు తన గురించి తాను ఎక్కువ ఆలోచిస్తాడో ఆరోజున వాడు పడిపోయినట్టే. వెంటనే అక్కడొక ఎర్ర పెన్ను తెచ్చుకొని X మార్క్ పెట్టుకుంటాడు గురువుగారు. కొన్నాళ్ళు వీడి programe మనకేమీ లేదు అని, ఎందుకంటే వాడి గురించి వాడు ఆలోచించుకుంటున్నాడు, గొప్పగా ఆలోచించుకుంటున్నాడు, సాధన చాలా బాగా చేస్తున్నానని అనుకుంటున్నాడు. ఇది ఒక పెద్ద inversion సాధకులకి. సాధన చెయ్యి, కాని సాధన చేస్తున్నానని అనుకోబోక, క్రమశిక్షణతో వుండు, కానీ క్రమశిక్షణతో వుంటున్నానని అనుకోబోక. క్రమశిక్షణతో వుంటున్నాను అని అనుకునే వాడికి మిగతా వాళ్ళంతా క్రమశిక్షణలేని వాళ్ళగా కనిపిస్తారు. Disiplined people మిగతా వాళ్ళ indisipline చూసి అరుస్తూ, కరుస్తూ వుంటారు. అట్లాగే నేను honest అనుకునేవాడూనూ. నీవు honest గా వుండు, Honest అనుకోవడంవల్ల ఏమవుతుందో తెలుసా? మిగతా వాళ్లంతా dishonest అనుకుంటూ వుంటాడు. ఎక్కువ అపచారం చేస్తూ వుంటాడు. పాగరు పెరుగుతూ వుంటుంది. మదం పెరుగుతూ వుంటుంది. కొవ్వు బాగా పెరుగుతూ వుంటుంది. ఇలా వుంటాయి మనలో బాధలు. అన్నీ చూస్తూ వుంటాడు తెలిసిన వాడు, ఏమీ మాట్లాడడు. మాయామశ్చీంద్ర సినిమా ఈసారి

ఎప్పుడైనా వస్తే చూడండి. గురువుగారూ లాభం లేదంటాడు, శిష్యుడు, ఊ కానీ! నువ్వేమంటే అదేరా, అంటాడు గురువు. ఏమీ మాట్లాడడు. ఆయన విష్ణువు అవతారం! శిష్యుడు గోరక్ నాథుడు. తరువాతి కాలంలో ఆ శిష్యుడే మహాయోగి అయిపోయినాడు. గోరఖ్ నాథుడే మనకి భూమీ మీద ప్రస్తుతమున్న యోగాన్ని ఇచ్చినవాడు. గోరక్షానాథుడు ఆయన పేరు. గో అంటే కిరణాలు, రక్షణ చేసినవాడు. ఆయన చెప్పిన దాంట్లో కొంత ముక్క తీసి మనకి పతంజలి మహర్షి యోగంగా ఇచ్చాడు. ఈ గోరక్షానాథుడే శ్రీశైల ప్రాంతంలో తపస్సు చేశారు. అందుకని శ్రీశైలానికి ఆ ప్రతిభ. వినయవంతుడికి అన్నీ లభ్యమవుతాయండి. వినయవంతుడు కాని వాడికి ఏమీ లభ్యం కావు. వినయవంతుడు ఏసుక్రీస్తు! ఆరోపణలు చేశారు. ఏమీ మాట్లాడలేదు. నీయిష్టం, ఏమన్నా అనుకో నాగురించి, అని. కృష్ణుడి మీద ఎన్ని చేశారు? ప్రతి నోరున్నవాడు మాట్లాడాడు కృష్ణుడి గురించి. ఎన్నెన్ని మాటలన్నారండీ? నవ్వేవాడు. అంతే! ఎన్నంటే అంత తొందరగా పడిపోతారు వీళ్లని, అననిచ్చేవాడు నవ్వుతూ. వాడు మనల్ని తిడుతూ వుంటే మనం నవ్వుతూ వున్నామనుకోండి, వాడికి కసి పెరిగి ఇంకా నాలుగు తిడతాడు. ఇంకా నాలుగు తిడితే ఇంకా నాలుగు మెట్లు పడిపోతాడు. మన లెక్క ప్రకారం భగవంతునికి వినయం వుండనక్కరలేదు. ఎందుకంటే మనతో పని వున్నవాడి విషయంలో మనం వినయంగా వుండం కదా. ఆయన అట్లా అనుకోలేదు. మహాత్ములో వినయం చూడండి. హరిశ్చంద్రుడు కాటికాపరిగా వున్నప్పుడు senior కాటికాపరి ఈయనకి instructions ఇచ్చేవాడు. ఈయన ఆత్మవంతుడు, తేజోవంతుడు, చక్కవర్తి, అవన్నీ గుర్తుంటే వింటావా? తప్పకుండా చదువుకోవాల్సిన కథల్లో హరిశ్చంద్రుని కథ ఒకటి. వాడు ఎలాపడితే అలా పిలిచేవాడు. కల్లు పట్రా, అనేవాడు. డబ్బులు లెక్క అడిగేవాడు, దమ్మిడి తక్కువ వస్తే తల తీసేస్తాను, తోలు తీసేస్తాను, అని ఏది పడితే అది మాట్లాడేవాడు. ఇంతటి మహాత్ముడు తీసుకెళ్ళి వాడికి కల్లు ఇచ్చేవాడు. ఊహించగలవా? కాస్త నలుగురూ మనల్ని ఆదరిస్తూంటే మన పెట్టె మోసేవాడొకడు ఎప్పుడొస్తాడో చూస్తాం. మనల్ని కార్లో ఎవడు దింపుతాడు? మన కాళ్ళెవరు కడుగుతారు? దండలెవరేస్తారు? ఇది కదా దరిద్రం. సత్సాధన ఎట్టా వుంటుందో చూపించడానికి ఈ కథలు తప్పకుండా నరనరాల్లోకి వెళ్ళిపోవాలి. జీర్ణమైపోవాలి. రక్తకణాల్లోకి కూడా చొచ్చుకుపోవాలి. అప్పుడు నీవు పడివుంటావు. ఓ గురువుగారు అరణ్యంలో వున్నారు, దర్శిద్దాం అని, ఓ మహారాజు బయలుదేరాట్ట. రాజుగారు మోయిస్తున్నాడు పల్లకి. ఎంతని మోస్తారు? వాళ్ళూ మనుషులే కదా. వాళ్ల రూపంలో వున్నది కూడా దేవుడే కదా. అట్లా కర్కశంగా ఎక్కి కూర్చుని పల్లకీలో తిరుగుతున్నాడు, బస్తా శరీరం వేసుకుని, మనం రక్షావాడి రక్షా యెక్కి కూర్చున్నట్లు, మోసి మోసి, మోసి మోసి వాళ్ళకి కొంతమందికి అలుపొచ్చింది, ఆయాసం వచ్చేసిందిట. 'ఇంక మొయ్యలేం బాబూ! మా సంగతి కొంచెం చూడండి' అని పక్కన ఉన్న దండనాథుడితో అంటే, ఆయన

ఏదో నెమ్మదిగా రాజుగారి mood చూసుకుని చెప్తాడు రాజుగారితో. సరే ఎలాగా అని, అలా చూస్తే ఒక చెట్టుకింద మంచి దున్నపోతు వంటి బలం వున్నవాడు ఒకడు కనిపిస్తాడు. 'వాడ్ని పెట్టండి ఒక కొమ్ముకి, మిగతావాళ్ళని అందరినీ ఇంకో కొమ్ముకేయండి' అని రాజుగారు సలహా యిస్తాడు. వీళ్ళంతా వెళ్లారు. 'రారా, రాజుగార్ని మొయ్యరా' అంటారు, మోస్తాడు. ఏమీ మాట్లాడడు. మోస్తూ వుంటే నీవు 'ఈ ఆరణ్యంలోనే వుంటావా?' అంటే ఉంటానంటాడు. 'ఇక్కడ ఫలానా జడభరతుడు అనే ఆయన ఉంటాడు, మీకు తెలుసా?' అని అడుగుతాడు. తెలుసంటాడు. ఏమాత్రం తెలుసునంటే? 'అంతా తెలుసు ఆయన గురించి' అంటాడు. ' ఆయన గురించి కొంత చెప్పు' అంటాడు. 'నువ్వడిగితే చెప్తాను' అంటాడు. ఈయన అడుగుతాడు, ఆయన చెప్తూంటాడు. ఈయన అడిగిన సమస్తమూ ఆయన చెప్తాడు. అంతా అయిపోయిన తరువాత 'ఇంతకీ నీపేరేమిటి' అని అడుగుతాడు. 'నేనే జడభరతుడ్ని' అని చెప్తాడు. వాడు చచ్చిపోవలసిందే కదా ఆ రాజు ఇంక. అంటే వాడి అహంకారం పూర్తిగా చావవలసిందే కదా. అలా ఆ గురువుగారు ఆ రాజుగారి అహంకారాన్ని చంపేసి, దిగు, ఇంక నుండి బాగుండు, అని చెప్తాడు. అహంకారికి జ్ఞానం ఏమటి పామ్మని, చెప్తాడు. మనకి భాగవతంలో చూడండి ఎటువంటి కథలున్నాయో! ఓ పాము మంటలోపడి కాలిపోతూ 'రక్షించు, రక్షించు' అని అరిస్తే ఎక్కడ నుండి వస్తోంది అరుపని చూస్తే, చెట్టు క్రింద ఒక పాము మంటలో ఇరుక్కుపోయింది. రక్షిస్తాడు నలుడు. రక్షిస్తే టపామని కాటేస్తుంది. 'ఇదేమిటి రక్షించమన్నావు, రక్షిస్తే ఇట్లా చేశావు' అంటే 'నీకు మంచే జరుగుతుంది దీనివల్ల' అంటుంది. ఒప్పుకుంటాడు. దానివల్ల మంచి ఏమి జరుగుతుందో నలదమయంతి కథ చదువుకుంటే తెలుస్తుంది. భక్తుడికి శాపాలే వరాలండీ! కష్టాలే మెట్లండీ! సాధనలో ఆరోహణకి ఇవే మెట్లు. అందుకనే కుంతీదేవి 'యేం కావాలి అత్తయ్యా! వెళ్ళి పోతున్నాను, మరిరాను, కనబడను నీకు' అంటే 'నాకు కష్టాలుంచు నాయనా చాలు. కష్టం వుంటే నీతో వుంటాను, కష్టం లేకపోతే పాగరెక్కుతుంది' అని చెప్తుంది. పిచ్చిది, ఇట్లా కోరింది అనిపిస్తుంది మనకు, అవగాహనలేక! 'కష్టం లేకపోతే నేను నిన్ను తలచుకోను. అది నాకు అర్థం అయ్యింది. అందుకని ఎప్పుడూ ఏదో ఒకటి పెట్టు. ఏదో ఒకటి సలుపుతూ వుంటే నిన్ను తలచుకుంటూ ఉంటాను' అని చెప్పింది. అదీ వినయం. దుర్వాసుడు వరం ఇచ్చాడు. సూర్యుడు పలికేటట్లు అయితే ఇక మనం ఎవరి మాట వింటామండి? సూర్యుడు, వాయువు, ఇంద్రుడు, అగ్ని, అశ్వినీ దేవతలు మనకు పలుకుతూ వుంటే ఎవరి మాట అయినా వింటామా మనం? మరి చిన్నప్పుడే ఆవిడకి పలికారు. దాని వల్ల ఏమిటి ప్రయోజనం? 'అన్యదేవతల ఆరాధన వల్ల జీవుడు పరిష్కారం పొందడు' అని శ్రీకృష్ణుడు 7వ అధ్యాయం లో చెప్తాడు. అన్యదేవతలంటే? అనన్యమైనది ఒకటి వుంటీ, దాన్ని పట్టుకోరా. అది నీకు సమస్తమైన పరిష్కారం. అది కాని దేవత ఒకటి వుందని నీవు వేరుగా వున్నానని, దాన్ని ప్రార్థన చేస్తున్నావు కాబట్టి నీవు

ద్వంద్వంలోనే బ్రతుకుతావు. కాబట్టి నీవు ఎప్పుడూ ఏదో ఒక కష్టంలో ఉంటావు. రావణాసురుడు తపస్సు చేసినవాడు కష్టంలో పడడం ఏమిటి? తాను శివ స్వరూపము అని చెయ్యలేదు. 'శివుడు ఒకడు ఉన్నాడు. మన వరకు వాడితో మాట్లాడుకుందాం. కావలసినవి చేసుకుంటూ వుంటాను' అని. జరాసంధుడూ అంతే! ఆయనకో శివుడు ఉన్నాడు. ఉంటాడు. ఎట్లా కావాలంటే అట్లా వుంటాడు. అతడే నేను అని తెలియడమే పరిష్కారం! 'త్వమేవాహం త్వమేవాహం' అంటుంటారు. అంటే 'నువ్వే నేను నువ్వే నేను'! అలా ఉండే వాళ్ళు హరిశ్చంద్రుడి లాగానో, నలుడి లాగానో, ఏసుక్రీస్తు లాగానో ఉంటారు. వాళ్లకి complaints లేవండీ. వచ్చినవి పుచ్చుకుంటారు. వాళ్ళు చేయాల్సినవి చేస్తూ ఉంటారు. ఎదురుగుండా భార్య హరిశ్చంద్రుడికి. 'కొట్టెయ్య రా ఇంకా ఆలోచిస్తున్నావు ఏమిటి' అంటాడు. కొట్టేయడానికి వస్తుంటే అప్పుడు వాళ్లే భయపడిపోయి, ఆయన ఆవిడ తలకాయి కొట్టేస్తే దానిలోంచి వచ్చే consequence ఉందే అది భయంకరమైన consequence అవుతుంది దీనికి అంతకు కారణమైన వాళ్లకి. అందుకని విశ్వామిత్రుడు గబగబా రావాల్సి వచ్చింది. ఈ పని జరిగిందో నేను చచ్చానే, అని వస్తాడు. లేకపోతే రాడు ఓపట్టాన. ధర్మరాజును 'ఇంకా ఏమిటయ్యా వాళ్ల మీద ప్రేమ' అని అడుగుతాడు కృష్ణుడు. 'ఈ పని చేశారు, ఆపని చేశారు, ఇంకో పని చేశారు, మరో పని చేశారు, రకరకాలుగా బాధలు పెట్టారు కదా. ఇంకా వాళ్లగురించి అలోచిస్తావే? నువ్వెంతటి ధర్మరాజవయ్యా!' అని మనకు తెలియడం కోసం చెప్తాడు. ఏదీ సహనం? వినయం ఉంటే కానీ సహనం రాదు. అందుకని చిన్నప్పట్నుండి పిల్లలకి నేర్పినా, మనం నేర్చుకున్నా వినయం నేర్చుకోవాలి. పాగరుమోతులకి అందదు. వినయం వున్న వాళ్ళకి శ్రద్ధ ఉంటుంది. శ్రద్ధ ఉన్నవాళ్లకి జ్ఞానం లభిస్తుంది. సమస్త జయములూ వినయం వున్నవాళ్ళకేనండీ! మిగతా జయాలు తాత్కాలిక జయాలు. వీళ్ళ జయాలు శాశ్వతమైన జయాలు. అట్లా మొత్తం భూగోళాన్నంతా జయించేశారు వీళ్లందరూ, శాశ్వతులైపోయారు కదా. భూగోళం వున్నంతకాలం వీళ్ళ కథలుంటాయి. మిగతావాళ్ళ కథలు కాలం, మడతల్లో మడిచేస్తుంది. ఆయనుండగా కంచు విగ్రహం పెట్టుకునే వాళ్లందరూ, ఆయన వెళ్ళగానే దాన్ని పగులగొట్టేస్తారు. కాలానికి తెలుసు, దేనిలో సత్యం వుందో, దేనిలో సత్యం లేదో. కాలం సత్యాన్ని ఎప్పుడూ రక్షించుకుని తరతరాలకీ ఆ సత్యాన్ని అందిస్తూ వుంటుంది. సత్యం లేనిదాన్ని నువ్వు ఎంత promote చేసినా తొక్కేస్తుంది. వాడి జీవితకాలంలో వాడు ఎన్నో రకాలుగా మోసం చేసి, చాలా పెద్ద పేరు తెచ్చుకోవచ్చు. వెళ్ళిపోయిన తరువాత వాడి కథలు ఒక్కొక్కటి బయటికి వస్తాయి. అప్పుడింక manage చేసుకోవడానికి నువ్వు లేవు కదా. పదవి దిగితేనే నీవన్నీ బయట పడ్డాయి కదా. ఏదీ మొన్న ఈ మధ్య ఇంద్రుడు, చంద్రుడు అన్న ఆయనకి, ఐదు ఏళ్ళు అయి పదవి దిగగానే భ్రష్టుడు అని చూపించారు కదా. శరీరం వదిలేసిన తరువాత నీవేం manage చేసుకోగలవు చేసిన పనులన్నీ! విప్పి చూపిస్తుంది కాలం! అహా అలాగా

అంతటివాడనుకున్నాము. ఇంత మోసం చేసాడా! అనుకుంటాము. ఉన్నప్పుడు వుండడం కాదు, నీవు వెళ్లిన తరువాత ఏమిటి అనేది లెక్క! అది దేన్ని బట్టి వుంటుంది? సత్యాన్ని బట్టి వుంటుంది. చాలామంది అవతారపురుషులుగా కూడా చలామణీ అవచ్చు బతికున్న కాలంలో. వెళ్ళిపోయిన తరువాత కాదు అని మిగతావాళ్లు నిర్ధారణ చేసి చూపిస్తారు. రెండు మూడు శతాబ్దాల్లో, అంతే! నిజమైన అవతారపురుషుడు మూడువందల సంవత్సరాల తరువాత తెలుస్తాడు. ఆరే అరే వచ్చి వెళ్ళి పోయాడండి. 300 ఏళ్ళ తరువాత మనకి తెలిసింది అని అనిపిస్తుంది. అది ఏసుక్రీస్తు, తెలుసా! ఏసుక్రీస్తు కథ ఎవరికి పట్టిందండీ? 300 సంవత్సరముల తరువాత ఒకాయన అన్నీ సేకరించి, నానా గడ్డి కరిచి దొరికినంత రాశాడు. ఒక అతుకుల బొంతల్లే. ఇంకా పెరిగేదే తప్ప తరిగేది కాదది. ఏది? ఆయన పోయిన 300 సంవత్సరాలకి ఆయన కథ గురించి కాలమే నెమ్మదిగా అందించిందండీ. సత్యం వుంటే బతుకుతుందండీ. అసత్యాన్ని నువ్వు ఎంత కప్పిపుచ్చి, మెరుగులు దిద్ది, నువ్వే అన్నీ చేసేసినా, నువ్వు వెళ్ళంగానే అన్నీ విప్పి చూపించేస్తుంది కాలం. అదీ ఆదిశేషుడి తత్త్వం! అల్మారాలో చీరల మడతల్లాగా వుంటాయి. మడతలు విప్పితే సత్యం బయటకి వస్తుంది. అంతకుముందు సత్యంగా చలామణీ ఆయినదంతా అసత్యమని కూడా బయటికి వస్తూ వుంటుంది. Darwin ని ఇప్పుడు చాలా పొగుడుతున్నాం. ఇంకో వందేళ్ళ తరువాత తిడతారు. భ్రష్ట పట్టించాడు, తప్పుదారి పట్టించాడు అని. మహాత్ముల జీవితాల్లో జరిగిన ఘట్టాలన్నీ ఇంతే! అందుకనే తరువాతి నామం 'సత్యసంధ' అని వస్తుంది. నామాలన్నీ గొలుసే! సత్యాన్నే అనుసరించి నడచిన వాళ్ళ కథ ఆకాశంలో ఎప్పుడూ record అయివుంటుందండీ. భూమి మీద record అవనక్కరలేదు, మనబోటి వాళ్ళం ఏదో newspapers మీద, అక్కడా record అవడానికి తాపత్రయ పడతాం. ఇవాళ సభ జరిగితే రేపు press కి వెళ్ళి రాత్రి వాడి దగ్గర వుండి జాగ్రత్తగా మన photo వాడికిచ్చుకొని కూర్చుని వేయించుకుని, వాడు ఈ photo బాగాలేదు ఇంకోటి పట్రా, అంటే ఇంటికి వెళ్ళి ఇంకోటి తెచ్చి వాడికిచ్చుకుని, పొద్దున పడ్డదో లేదో చూసుకుంటాం. బాగానే వుంది. మర్నాడు ఆ కాగితం mixture పాట్లాం వాడి దగ్గర కనిపిస్తుంది. News paper ఎక్కడికి చేరుతుందండి? దానియొక్క ultimate destination ఏమిటో? చెత్త పారేయడానికో, mixture పాట్లాలకో చేరుతుంది. మహాత్ముల photos paper లో వేసుకుంటే మనం గొప్పగా అనుకోకూడదు. అది ఎక్కడికి వెళ్తుందో తెలిసినవాడు తెలివైన వాడు, మన మొహం పేపర్లో పడిందని సంతోషించేవాడు తెలివి తక్కువ వాడు. ఆ తరువాత ఆ paper destination ఏదో తెలిసిన వాడు paper లో నా photo వెయ్యక పోవడమే వేసిన దానికన్నా ఎక్కువ ఫలితం, అని చెప్పగలడు. కదా. మనం ఉండగానే మన ఆత్మ కథ ఎవరైనా రాస్తే బాగుండును, లేకపోతే ఎందుకొచ్చిన గొడవ మనమే వ్రాసేసుకు పోతే బాగుంటుంది. ఇటువంటివన్నీ ఉంటాయి కదా. వాళ్ళు వ్రాస్తే ఏం వ్రాస్తారు మనమే

వ్రాసేసుకుందామని మనం వ్రాసుకుంటే ఏమవుతుందో తెలుసా? వీడే వ్రాసుకుంటే. తర్వాత వీడి గురించి అబద్ధాలు అన్నీ బయటకు రావచ్చు. కాలం ఒప్పుకోదు. అసత్యం అప్పటికప్పుడు ఆనందాన్ని ఇస్తుంది తప్ప, భవిష్యత్తులో దుఃఖాన్నిస్తుంది. సత్యం ఇప్పుడు కొంచెం కష్టంగా ఉండవచ్చు కానీ ముందు ముందు సుఖాన్ని, ఆనందాన్ని ఇస్తుంది. 'తినతినగ వేము తియ్యనుండు', గారెలు విషయంలో చేదు అయిపోతాయి. 20 గారెలు తిన్నావనుకో, 21వ గారె వేస్తే, బాబు ఇంక ఏదైనా ఇవ్వండి, ఇది మాత్రం నెల రోజులు వరకు నాకు అక్కర్లేదంటావా, అనవా? అందుకని ముందు బాగా రుచిగా ఉన్నవి తర్వాత అరుచి అవుతాయి. విషమవుతుంది. ముందు విషం లాగా ఉన్నది తర్వాత అమృతమవుతుంది. అందుకని విదురుడు 'ఆపద ముందు వచ్చి, సుఖం తర్వాత వస్తే, ధన్యులమని, ముందు సుఖం వచ్చి తర్వాత ఆపద వస్తే అంతకన్నా దరిద్రం లేదు' అంటాడు. కొంతమంది జీవితాలు చివర్లో భయంకరంగా ఉంటాయి. ఒక్కడూ నీమొర ఆలకించడు, అన్నట్లుగా ఉంటాయి కదా. ఫెళ ఫెళ ఫెళ ఫెళ అని 50, 60 ఏళ్ళు దాకా officer గా ఉన్నామనుకోండి, పలుకుబడిలో ఉన్నామనుకోండి. అందరూ నీచుట్టూ తిరిగారు, ఆ తర్వాత నీకు ఏదో జబ్బు వచ్చింది. నీతో వాళ్ళకి కింకేమీ పని లేదు. పిలిచినా ఎవ్వరూ రారు. ఇంట్లో వాళ్ళు కూడా రారు. ఎందుకంటే పలుకుబడిలేదు. వాడికి ఏ పక్షవాతమో వచ్చిందనుకోండి, హమ్మయ్య పక్షవాతం వచ్చింది. ఇక వీడి గొడవ మనకు లేదు అనుకుంటారు. హీనమై చివరి దశలో ఉండేవారు కొంతమంది ఉంటారు. చివరి వరకు పెరగడం తప్ప తరగడం లేనివారు కొంతమంది ఉంటారు. ముందు కష్టపడ్డా తర్వాత సుఖపడ్డ వాళ్ళు ఉంటారు. మూడు రకాలు. బ్రతుకు చివరికి హీనమైన వాళ్ళు సత్ప్రవర్తన ఉన్నవాళ్లు కారు. బ్రతుకు కష్టంలో ఉన్నప్పటికీ కూడా సత్యాన్ని నమ్ముకున్న వాళ్ళకి చివరికది వెలిగి, పెద్ద వెలుగు నిచ్చి వెళ్ళిపోతుంది. కొంతమంది మొదట్నుంచి, కిందటి జన్మ నుండి ఒకే పద్ధతిలో ఉండటం వల్ల, జీవితం అట్లా తేడా ఏమీ లేకుండా వెళ్ళిపోతుంది. అట్లా ఉంటారు.

## 527 జయః

మనం ఏది జయం అనుకుంటున్నామో అది జయం కాదు. మనకు జయం అంటే బాగా డబ్బు సంపాదించడం, ఆస్తులు కొనుక్కోవడం, పలుకుబడి సంపాదించడం, ఓ వంద మందో, వెయ్యి మందో, పదివేల మందో మన మాట వినడం, ఇది మనం జయం అనుకుంటా కదా. ఇది జయం కాదు. అది బాదరబంది. నీ చుట్టూ ఎప్పుడూ మనుషులు వేలాడుతూ ఉంటే అది చాలా బాదరబంది. నీ చుట్టూ ఆస్తులు ఉండి నీ ప్రాణాలు తీసేస్తూంటే అది బాదరబంది. నీ పలుకుబడి నీకు పనికిరాదు. నీకు పలుకుబడి ఉందని తెలియగానే నీ చుట్టూ బోలెడు మంది చేరుతారు. వాడికి చెప్పి నా పని చేయించి పెట్టవా, అని అడుగుతారు. అడగరా? ఏమండీ మీకు Vice Chanceller గారు తెలుసు కదండీ, ఈ పని చేసి పెట్టండి. మీకు Collecter గారు తెలుసు కదండీ ఈ పని చేసి పెట్టండి. మీ అన్నయ్య గారి ఫలానా కదండీ ఈ పని చేసి పెట్టండి. ఇలా చాకిరే కదా. నీ దగ్గర డబ్బు ఉన్నది. ఏం జరుగుతుంది? కాస్త అప్పు ఇవ్వండి sir అని వస్తారు. దానం ఇమ్మన్నా బాగుంటుంది, అప్పు అని అడుగుతారు తిరిగి ఇవ్వడు కదా. బెల్లం ఉంటేనే ఈగలు ముసురుతాయి. చెరువులో నీళ్లు ఉంటేనే కదా కప్పలు చేరుతాయి. ఇవన్నీ మన చిన్నప్పుడే చెప్పారు. కాబట్టి నీ పలుకుబడి నీకు పనికిరాదు. నీ ధనం నీకు పనికిరాదు. నీ విద్య నీకు పనికిరాదు. నీ వైద్యం నీకు పనికిరాదు. ఇంట్లో వాళ్ళకస్సలు పనికిరాదు. చెప్పారు కదా పెరటి చెట్టు మందుకు పనికిరాదని. ఊళ్లో వాళ్ళందరూ ఈయన మందు తీసుకుంటే ఇంటి ఆవిడ మాత్రం ఇంకోకళ్ళ దగ్గర తీసుకుంటూ ఉంటుంది. ఆయన సరిగా వేయరండి మందు నాకు, అంటుంది. ఏమైనా అంటే. పోనీ వేసుకుంటే అనుమానం తగ్గుతుందో, తగ్గదో అని. అందుకని నీ దగ్గర ఉన్నది నీ కోసం కాదు అని తెలిసిన వాళ్ళు సుఖపడతారు. మీ దగ్గర వాడు ఉంచాడు. ఎందుకోసం పదిమంది కోసం. మీ దగ్గర బాగా ఆరోగ్యం ఉందనుకో, పదిమందికి చాకిరీ చేయడం కోసమే ఆరోగ్యం. ఇది ఒక dimension. ఇవన్నీ నీకు చెప్పాను కదా. బాగా ఉంటే బాగుంటుంది. బాగా అంటే మనక్కాదు, ఊర్లో వాళ్ళకి బాగుంటుంది. ఓ గంపెడు పిల్లలు ఉండే సంసారంలో ఒకడు బాగా పైకి వచ్చాడనుకోండి, మిగతా వాళ్ళందర్నీ వీడు మొయ్యాలి. ఇది సృష్టి ధర్మం కదా. ఇట్లా ఉంటాయి. అందుకని నీ దగ్గర ఉన్నది నీ కోసం కాదు అబ్బాయి. నీ శరీరం కూడా నీ కోసం కాదు, ఇతరుల కోసం. నీ జ్ఞానం నీకోసం కాదు, ఇతరుల కోసం. పంచేయ్, పంచేస్తే అయిపోతుంది. ఉంచుకోక, ఉంచుకుంటే నిన్ను బంధించేస్తుంది. పంచేస్తే జయం కలుగుతుంది. అదీ జయం!

## 528 సత్యసంధుఁ

ఈ కథలన్నీ సత్యసంధుడు చెప్పిన కథలే. ఇంతసేపు నామం చెప్పలేదు కానీ, సత్యాన్ని నమ్ముకుని ఉండటం చేత కథలు శాశ్వతమైనాయి. అమృత స్థితికి చెందినాయి. ఆకాశంలో ఉన్నాయి. ఆకాశంలో నుండి తీసి మళ్ళీ మనకు వ్రాసి ఇచ్చింది Madam Blavatsky. ఎక్కడి నుండి వ్రాశారు ఇవన్నీ? అంటే, 'మా గురుదేవులు యొక్క అనుగ్రహం చేత ఆకాశంలో ఉండే record నాకు కనిపించింది. అక్కడి నుండి వ్రాసి మీకు ఇచ్చాను. ఇష్టమైతే పుచ్చుకోండి, లేకపోతే లేదు' అని చెప్పింది. అదే మన system లో లిపికలు అని అంటారు. చిత్రగుప్తుల యొక్క సహాయకులు. Asistants! వాళ్ళు ప్రతి వాళ్ల కథ వ్రాసేస్తారుటండీ. దాంట్లో ఈ portion సత్యం, ఇది అసత్యం, ఈ కథ సత్యం కాదు. ఇప్పడేమవుతుందంటే వాళ్ళు రాసే పుస్తకాల్లో ఒకప్రక్క సత్యం, ఒకప్రక్క అసత్యం వ్రాస్తారు. One side అంతా అప్పుడు blank! కలియుగం కదా. దీంట్లో ఇటేమీ వ్రాయరేం అంటే ఏమీ లేదండీ రాయడానికి, చాలా ప్రయత్నం చేశాం రాయడానికి ఒక్క ముక్క కూడా రావడం లేదు అంటున్నారు. అటుపక్కన వ్రాసేస్తున్నారు. ఆకాశం అటుంటుంది, ఇటు ఎందుకు వ్రాయలేదు అని అడగబాక. నేను సుఖపడుతున్నాను. ఇప్పడు ఆ సత్యాన్ని నా దగ్గర అట్టే పెట్టుకు కూర్చోను. అసత్యమైనవి ఆకాశంలో record ఉండదు. సత్యమైనవే ఉంటాయి. అవి ఎప్పటికప్పుడు సమయాన్ని బట్టి బయటికి వస్తూ ఉంటాయి. అన్నమాచార్యులు వారు ఎలా బయటికి వచ్చారండీ? ఎప్పటి విషయం? 500 సంవత్సరాల క్రితం విషయం. 500 సంవత్సరాలంటే అసలు అవగాహన ఉందా? 100 సంవత్సరాలకే ఇప్పటికే చాలా విపరీతమైన తేడా ఉంది. ఆయన కథ భగవంతుడు బయటికి తెచ్చుకున్నాడు, వేటూరి ప్రభాకర శాస్త్రి గారి ద్వారా. మళ్ళీ ఆయన్ని ఎన్నుకున్నారు. మంచి పనికి మంచివారిని ఎన్నుకుంటారు. ఏదో ఒకటి రాశాడు, ఎక్కడో పెట్టేసాడంటారు. ఎక్కడ పెట్టేశాడో ఎవరికీ తెలియదు. ఈయన తీశాడు బయటికి. ఇప్పడు ఆక్రమిస్తున్నాడు మొత్తం ప్రపంచమంతా. ఎంత late అయితే, అంత పన్నా పెద్దదిగా ఉంటుందండీ. ఎంత speed గా వెళ్తే ఆ తర్వాత అంత త్వరగా మూసేస్తారు కథ. ఎంతో మంది మహాత్ములు లాగా చలామణి అయిన వాళ్ళ కథలన్నీ మూసేసింది కాలం. బ్రతికి ఉన్నప్పుడు వాడి బొంద వాడేమిటి అనుకునే వాడి కథలన్నింటినీ ఆకాశం నుండి బయటకు తీసుకువచ్చి, ఆకాశం అంత ఎత్తుకు ఎత్తుతున్నాయి. షిరిడిసాయి అటువంటివారు. పెరిగేదే తరిగేది కాదు. ఆగదు.

## 529 దాశార్హః

దాశార్హులనే వాళ్ళు యాదవుల్లో ఒక శాఖ. మనకు బోలెడు శాఖలు ఉన్నాయి కదా. కులంలో శాఖల్లాగే, యదుకులంలో దాశార్హులనే శాఖకు చెందిన వాళ్లకు శ్రీకృష్ణుడు పుట్టాడు.

## 530, 531 సాత్వతాం, పతిః

సాత్వతులు అంటే సత్త్వమునందు ఎప్పుడూ నిలబడే వాళ్ళు. వాళ్ళందరికీ ఈయన పతి అంటే యజమాని, అధికారి, స్వామి! ఎప్పుడైతే మనిషి సత్త్వంలో ఉంటాడో, వాడికి సమస్తమునందు ఒకే తత్త్వం కనిపిస్తుంది. ఆ తత్త్వానికి వీడే వాహిక. అందుకనే భగవంతుడు భగవద్గీతలో చివరి ఘట్టంలో త్రిగుణాలను గురించి బాగా ఇచ్చాడు. 15 నుండి మొదలుపెట్టాడు. పురుషోత్తమ ప్రాప్తి మూడు. అక్కడి నుండి వరుసగా మూడు, మూడు విషయాలు గాచెప్పడం మొదలుపెట్టాడు. 14 లోనే గుణత్రయ విభాగం అన్నాడు. కదా. అందుకని ఆ chapters చాలా advanced chapters నా దృష్టిలో. ఎందుకు అంటే మూడు గుణాల్నీ సమీకరించి, గుణాతీత స్థితికి నీవు చేరాలంటే, నీలో ఉండే రోగాలన్నీ అక్కడ ఆయనకి ఇచ్చేసేయాలి. తమోగుణ రోగాలు ఏమున్నాయో చూసుకో. రజోగుణ రోగాలు ఏ మున్నాయో చూసుకో. సత్త్వగుణంలో ఉన్నామని నిన్ను నీవు అనుకోక. నేను భక్తుడిని, చాలా మంచి వాడిని అని నువ్వు అనుకోక. అక్కడ చెప్పారు నువ్వు అవునో కాదో! ఇవి ఉంటే భక్తుడివి, ఇవి ఉంటే కాదు అని. భక్తి అంటే ఏమిటి? అవిభక్త స్థితి. అంటే విడిపడని స్థితి. దేనితో? సత్త్వంతో! సత్త్వంతో విడిపడని వాడు అవిభక్తుడు, భక్తుడు. విభక్తి లేదు అక్కడ. సత్త్వగుణంలో ఉండేవాడే ముడిపడి ఉంటాడు. మిగతా గుణాల్లో ఉండేవాడు ముడిపడి ఉండడు. ఉన్నాననుకోవచ్చు, పడిపోతూ ఉంటాడు. కింద పడతాడు, మీద పడతాడు. పెద్దవాళ్లే పడ్డారు. అందరికన్నా బాగా పెద్దవాడు రావణబ్రహ్మ! ఇంతకన్నా బాగా పడ్డవాడిని ఎవరిని చూడలేం మనం. కృష్ణావతారంలో కూడా అంత పెద్దవాడు పడిపోవడం ఉండదు. పడిపోకుండా ఉండాలంటే సత్త్వంలోకి రావాలి. సత్త్వ గుణంలో నుండే భగవంతుడు కూడా వ్యక్తం కాగలడు. అందుకని సత్త్వగుణ సంపన్నులందరికీ కూడా ఆయనే స్వామి! వీళ్ళే ఆయనకి శిష్యులు. ఇంకొకళ్ళ ద్వారా ఆయన పని చేయడానికి వీలుపడదు. ఆయనకంతా నారదుడు లాంటి వాళ్ళు కావాలి. వశిష్ఠుడు లాంటివాళ్ళు కావాలి. ధర్మరాజు ద్వారా పనిచేసుకోగలడు తప్ప అర్జునుడు, భీముడు వీళ్ళది వచ్చే తెలివి, పోయే తెలివి. ఆ పూటకి బాగుంటే ఆ పూట వాళ్లతో పని చేసుకోవచ్చు, మర్నాడు ఎట్లా ఉంటారో చెప్పలేం. అంటే బాగున్నప్పుడు చేసుకుంటాడు, బాగోలేనప్పుడు వదిలేస్తాడు. ప్రస్తుతానికి పలకరిస్తే కరుస్తార్లే వద్దనుకుంటాడు. అజామిళోపాఖ్యానంలో గజస్నానమని ఇచ్చారు. ఏనుగు చిరాగ్గా ఉందని వెళ్లి శుభ్రంగా స్నానం చేస్తుంది. స్నానం చేసి రాగానే మళ్లీ బురద, ఇసుక అంతా మీద చిమ్ముకుంటుంది. మళ్లీ చిరాకు పుడితే మళ్ళీ వెళ్ళి చేస్తూ ఉంటుంది. అలాగే మనం కొన్నాళ్ళు సాధనచేస్తూ ఉంటాం, మళ్లీ కొన్నాళ్ళు పూసుకుంటూ ఉంటాం. మళ్ళీ వచ్చి కడుక్కుంటూ ఉంటాం. పూసుకుంటూ ఉంటాం. కడుక్కుంటూ ఉంటాం. దీన్ని

గజస్నానమన్నారు. ఏమిటి నీవు చేస్తున్నావు? ఇంక వేరే programme లేదు. కడుక్కున్నది దేనికోసం? అది లేదింక. ఎన్నిసార్లు EK మస్తారుతో కలిసి ప్రయాణం చేసినా ఎప్పుడూ ఆయన పెట్టె ఆయనే పట్టుకునేవారు ముందు. నేను పట్టుకుంటానని ఆయనకు తెలుసు కదా ఎందుకు పట్టుకుంటారని నా ఉద్దేశం. ఆయన 'చెప్పలేమోయ్' నేను అప్రమత్తుడనై ఉండడం మంచిది, లేకపోతే నువ్వు పట్టుకోవడం అలవాటైపోయి, పట్టుకోని వాళ్ళని చూసి కోపం వస్తుందోయ్' అనేవారు. అదేమిటి మాస్తారు అనేవాడ్ని. 'మనవి మనమే చేసుకోవాలి. ఎప్పుడూ చేస్తారు అని లేదు. అవి కళలయ్యా' అనేవారు. కొంతమంది ఉత్సాహంగా చేస్తామని వస్తారు వారికి అప్పచెప్పు. వారు చెయ్యకపోతే, ఏరా మానేశావ్ అని అడగక, నువ్వే చేసుకో. ఎవరైనా వచ్చి అడిగితే చేస్తానని, చేయించుకో! లేకపోతే నువ్వే చేసుకో. అదీ మాస్తారిలోని గొప్పతనం. చెట్టుపేరు చెప్పి కాయలు అమ్మేవారు నాకు వద్దు అనేవారు మాష్టారు. ఏదన్నా పని చెప్పండి చేస్తానంటే, ఇన్ని పనులు జరుగుతున్నాయి కదా నీకు తోచింది చేసుకో, అనేవారు. అంతె గానీ ఇది చెయ్యి, అది చెయ్యి అని ఎవ్వరికీ చెప్పలేదు. నువ్వు చొరవ చూపిన కొద్దీ పని చెప్పడం జరుగుతుంది. రజస్సు, తమస్సు కలయిక వల్ల ఒక్కోరోజు మనకి ఒక్కోలా ఉంటుంది. అన్నీ దాటి సత్త్వంలోకి రావాలి. వాడు అప్రమత్తుడై ఉంటాడు. ఏమి చేయాలో తెలిసి ఉంటాడు. అతడికి ఎవరూ చెప్పనక్కర్లేదు. ఎవరూ గుర్తు చేయనక్కర్లేదు. అలాంటి వాడ్ని కొన్నాళ్ళు చూస్తాడుట standard గా ఉన్నాడా లేదా అని. అప్పుడు వాహికగా తీసుకుంటారుటండీ! మనం అనుకోవడం కాదు ఆయన మనల్ని వాహికలు అనుకోవాలి. మనం ఫలానా గురువుగారి శిష్యులం అనుకోవడం కాదు, ఆయన చెప్పాలి ఇతడు నా శిష్యుడని. చెట్టు పేరు చెప్పి ఫలాలు అందుకునే వాళ్లు నాకు వద్దు, చెట్టుని పోషించి ఫలాలు అందరికి పంచే వాళ్ళు కావాలి, అనేవారు మాస్తారు. భట్రాజులు వద్దోయ్ పరమగురువులకి, అనేవారు. ఇక్కడ లోకానికి ఎంత హితం చేసావన్నది ముఖ్యం. జీవులలో అంతర్యామిని ఎంత దర్శించావ్ అన్నది ముఖ్యం. అప్పుడూ, భగవంతునికి వాహిక అవగలుగుతావ్. అంతర్యామి తత్త్వం సత్త్వగుణం ఉన్నవారి ద్వారా పనిచేస్తుంది. వారినే Son Of God అంటారు. He is the Father and He is confident that His Son is available to work through. Father Thy will be done not mine. నీ సంకల్పమే! నా సంకల్పాలు ఏమీ లేవు. పూర్తిగా సత్త్వగుణంలో ఉండేవారికి స్వామిత్వం వహించి, వారి ద్వారా దైవం తన పని అన్ని లోకాలలోను వర్తింప చేస్తుంటాడు. ఇది సాత్వతాంపతిః అనే నామానికి అర్ధం.

## 532 జీవః

జీవుడుగా వున్న భగవంతుడు అని అర్థం. జీవుల రూపంలో ఉన్నది భగవంతుడే అని మనకి చాలా ప్రస్ఫుటంగా భాగవత మార్గములో తెలిసిన విషయం. ఏ జీవిని చూసినా సరే, అది భగవంతుడు అనే గుర్తు మనకు ఉండటం అనేది సాధన. జీవులను చూడగానే దేవుడు గుర్తుకురావడం అనేది సాధనలో మొదటి మెట్టు. అది భగవంతుని చేరుకోవడానికి గడపలాంటిది. మిగతావన్నీ గుర్తుకు వస్తాయి తప్ప, ఎంత చెప్పకున్నా సరే, ఎన్నిసార్లు చెప్పకున్నా సరే, ఎంత ప్రస్ఫుటంగా చెప్పకున్నా సరే, మళ్ళీ మళ్ళీ మళ్ళీ గుర్తు చేసినా సరే, జీవుడిని చూడగానే వాడ్ని ఆవరించి ఉన్న స్వభావమే గుర్తు వస్తుంది తప్ప, వాడితో మనకు ఉండే ఇహలోక సంబంధములే గుర్తొస్తాయి తప్ప, దేవుడుగా గుర్తుకురాడు. అది భగవంతుని యొక్క మాయ! ఈ మాయ అనే ఆవరణ దాటాలంటే ఒకే ఒక మార్గం, అది గుర్తు తెచ్చుకోవడమే! ఇంకో పద్ధతి లేదు. ప్రాథమిక దశలోనే మనకు ఇది ఇస్తారు. ఎందుకంటే, మార్గంలో నిలబడతాడా లేడా అనేది దీని మీద ఆధారపడి వుంటుంది. ఎప్పుడూ ఒక గురువు దగ్గరకి ఒక శిష్యుడు, సత్యాన్వేషియై వచ్చి, భగవద్దర్శనము లేక వెలుగుదర్శనము లేక తన్నుతాను దర్శించుట, అనే విషయమందు ఆసక్తి చూపిస్తాడో, అప్పుడు గురువు మొట్టమొదట శిష్యుడికి 'సమస్త జీవరాసులలో నన్ను దర్శించు' అని చెప్తాడు. ఎందుకంటే దేహంలో వుండే జీవుడు సనాతనుడు, దైవమే ఆ రూపంలో వున్నవాడు. 'దేహో దేవాలయ ప్రోక్తః, జీవో దేవస్సనాతనః' అనే ఒక వాక్యం వున్నది. దైవము దేహమునందున్నప్పుడు మనకు జీవుడుగా గోచరిస్తాడు. దేహము దేవాలయము. అందులో వుండే జీవుడే దేవుడు. మనం చాలా రకాలుగా కవచాలు కావాలనుకుంటాం, రక్షణ కావాలనుకుంటాం. వారు 'తనయందు తన వలె దేవుడున్నాడని, ఈ శరీరం దేవునిది' అని గుర్తుంటే, అది కవచం అయిపోతుంది. మామూలుగా కవచం ఏర్పడాలంటే రకరకాల క్రతువులు చేస్తుంటారు. శిఖముట్టుకుని, సహస్రారం ముట్టుకుని, భ్రూమధ్యం ముట్టుకుని, చెవులు ముట్టుకుని, ముక్కులు ముట్టుకుని, కళ్ళు ముట్టుకుని, నోరు ముట్టుకుని, భుజాలు ముట్టుకుని, వేళ్ళన్నీ ఒక్కొక్కటి ముట్టుకొని, మీరు చేసే మహన్యాసం మన దేహంలో వినియోగపడుతున్న సమస్త అవయవాలలో శివుడే నిండి వున్నాడు అని చెప్పడానికి. అది సంస్కృతంలో వుంది కాబట్టి, ఏదో routine గా చేసుకుని వెళ్ళిపోతాం. ఒకే ఒక్క భావన వుంటే కవచం అయిపోతుంది, మహన్యాసం అంతా అప్పుడు మనం చదవక్కరలేదు. నారాయణ కవచం చదవడం కన్న, నారాయణ కవచంలో వుండే ప్రస్ఫుటమైన భావం 'ఈ శరీరము దేవుడు నివసించేది' అని గుర్తుంటే, ఇది దేవాలయం అవుతుంది. దేవాలయాన్ని దేవుడే కాపాడుకుంటాడు. ఇది EK గారు నారాయణ కవచం వ్యాఖ్యానంలో ఇచ్చిన ఒక

మహత్తరమైన రహస్యం! మన శరీరం అనుకోకుండా, 'ఈ మన శరీరం దేవుని శరీరం' అని గుర్తుంటే, వెంటనే ఈ శరీరం కవచం అయిపోతుంది. జీవుడికి ఏ అపకారం జరగదు, అపాయం రాదు. కిందపడ్డా బతుకుతాడు. Accident అయినా బతుకుతాడు, Train accident, bus accident, plane accident, car accident ఇలా ఏ accident అయినా బ్రతుకుతాడు. వాడికేమి అంటదు. నేలమీద పడితే, ఒక గీత కూడ పడదు. ఉరకేపడితే కాళ్ళు, చేతులు విరిగిపోతూంటాయి కదా. వాడు మేడ మీంచి పడ్డా ఏమీ కాదు, ఎందుచేత అంటే, తనలో 'ఇది దైవానిది' అన్న భావన ఉండటంచేత, ఆ క్షణంలో ఈ శరీరం భగంతుని కవచంలా పనిచేస్తుంది. ఒంటికి కవచం వేసుకోవడం దేనికి? రక్షణ కోసమే! భగవంతుడు కూడా తన కవచంగా ఈ శరీరాన్ని చేశాడు. అందులో తానే జీవుడుగా దిగివచ్చాడు. అందుకని మనము చేసుకోవలసినిది ఒకే ఒక్క భావన! అది ఒక పెద్ద రహస్యం! భాగవతంలో వృత్రాసురుడు ఇంద్రుడికి ఇచ్చిన ఉపదేశం ఇదే! 'నువ్వు నన్ను సంహరిద్దామనుకుంటున్నావే, ఈ శరీరం నాదనుకుంటున్నావు. నువ్వు సంహరించలేక పోవడానికి కారణం, ఈ శరీరం నాది కాదు అని నాకు తెలుసు' అని చెప్తాడు. మనందరికి వజ్రాయుధం యొక్క గొప్పదనం తెలుసు. మహత్తరమైన ఆయుధం, దాన్ని మించిన శక్తిగల ఆయుధం లేదు. అలాంటి వజ్రాయుధం వృత్రాసురుడి మీద ప్రయోగిస్తే, పూచికపుల్ల కన్నా కనాకష్టంగా తగుల్తుంది వృత్రాసురుడికి. అంతకన్నా ఏం కావాలి, ఏం రక్షణ కావాలి మనకి? మనదనుకుని రక్షించమంటే కష్టం. వాడిదనుకుంటే రక్షణ స్వయం సిద్ధంగా ఉంటుంది. సద్యోఫలితంగా ఉంటుంది. అది భాగవతమార్గం! మనది, మనం రక్షించుకోవాలి, అని వ్యామోహపడవద్దు. వాడిది వాడు రక్షించుకుంటాడు. శరీరమే కాదు, మనం కూడా వాడి వాళ్ళమే! కాబట్టి మనల్ని కూడా వాడే రక్షించుకుంటాడు. స్వంతరక్షణ కోసం చేసేది అంతా అజ్ఞానం, అంధకారం. నీ రక్షణ కోసం నీవేమి చేయక! వాడిదిది, నువ్వే వాడికి చెందినవాడివి, ఈ శరీరం వాడికి చెందినది. ఇది కాక మీరాబాయి 'నేను నీదానను, ఈ శరీరం నీది, మాయకూడా నీదే కదా. నువ్వు మాయలో పెడితే మేం మాయలోంచి బయటకు రాలేం. మాయ నువ్వే, శరీరం నువ్వే, జీవము నువ్వే. ఎందుకు మమ్మల్నిలా తిప్పలు పెడతావు. నీ మాయలోంచి నువ్వే మమ్మల్ని ఉద్ధరించకూడదా?' అని చెప్తుంది. అద్భుతమైన మాయ! 'అన్నీ నువ్వే, మాయ, జీవుడు, శరీరం అన్నీ. మరెందుకు తిప్పలు పెడ్తావ్, మాయావరణం నువ్వే దాటించ మని' చెప్తుంది. ఈ మాయ ఆవరణం దాటాలంటే ఒకటే ఒక సాధన. కనబడే జీవరాసుల రూపంలో దేవుడున్నాడనే భావన ఉంటేఈ నామం సార్థకత. ఇదే మొదటి మెట్టు ఎక్కినట్టు, ఈ మెట్టు ఎక్కడమే కష్టం. ఎపుడు కూడా సాధన లో ప్రాధమిక మైన మెట్లు చాలా కష్టంగ ఉంటాయి. తర్వాత మెట్లు సులభమే. ఎంత చెప్పినా ఈ మెట్టు ఎక్కలేం. ఎంతమంది జీవులని చూస్తుంటే మనం దైవం అనుకునే వాడు గుర్తొస్తున్నాడూ? గుర్తురాకపోతే ఈ మాయావరణ దాటలేం. లోపలుండే వాడు గుర్తు

రావాలి. నీ లోపల వుండేవాడు గుర్తు రావాలంటే, ముందు ఇతరుల రూపంలో ఉండేవాడిని, లోపల ఉండేవాడిగ భావన చేయాలి. అందరూ జీవులే! వారి వారి స్వభావములు వేరుగా ఉన్నాయి. జీవులను, స్వభావాలను రెంటిని వేర్వేరుగ గుర్తించగలగాలి. అందుకు రెండు కళ్ళు. కుడికన్నుతో జీవుడ్ని చూడండి, ఎడమకన్నుతో స్వభావాన్ని చూడండి. స్వభావం మరిచి జీవుడ్ని చూస్తే కుదరదు. పులిని కొగిలించుకోలేరు కదా. కొగిలించుకునే లోపల మనము అందులోకి వెళ్లిపోతాం. కాబట్టి ఒక కన్నుతో స్వభావం చూడండి, ఇంకొ కన్ను తో జీవుడిని చూడండి. ఇతరులలో జీవుడ్ని చూస్తే స్వభావం ప్రకోపించదు. అది మహాత్ముల వద్దనున్న మహత్తరమైన సిద్ధి! వారి వద్దకు రాగానే, ఎంత ప్రకోపించిన వారైనా సరె, జీవుని సరాసరి దర్శించుట వలన ఎదుట వ్యక్తి మనకి అనుకూలుడౌతాడు. సత్త్వము నందు ఆ జీవుడు స్థిరపడడం చేత, స్వభావం ప్రకోపించకుండా ఉంటుంది. మహత్ములు ఆ విధంగా ఇతరుల ప్రకోపాలను కేవలం చూపుచేత హరించిన వారైనారు. రాముడు మొదటిసారి రావణుని చూసినప్పుడు, కృష్ణుడు సభలో ధుర్యోధనాదులను చూసినప్పుడు, బుద్ధుడు అంగుళీమాళీకుడ్ని చూసినప్పుడు, ఏసుక్రీస్తు Roman సైనికులను చూసినప్పుడు ఇదే అయ్యింది. Benhar అనే ఒక మహా భక్తుడు దాహంతో బాధపడుతుంటే, సైనికులు నీరివ్వకుండా ఏడ్పిస్తూ ఉంటారు. Benhar చావుబతుకుల మధ్య ఉండగా సరాసరి వారి మధ్యకి వెళ్ళి క్రీస్తు నీరందిస్తే, వీళ్ళలా నిశ్చేష్టులై ఉండిపోతారు. ఏమిచేయలేదు. అలాగే రుక్మిణీ కళ్యాణంలోనూ, కృష్ణుడు దిగి రుక్మిణి దగ్గరకు వచ్చి రుక్మిణిని రథంలోకి తీసుకునివెళ్ళి, రథం కొద్దిదూరం వెళ్ళేంత వరకు అందరూ నిశ్చేష్టులైపోయారు. ఇవన్నీ ఎక్కడ నుండి వస్తాయి, వాళ్ల దృష్టిలో వీరంతా శత్రువులని గానీ, సైనికులని గానీ, దుష్టులైన ధుర్యోధనాదులుగా గానీ, (దుష్టులు మనకి కనిపిస్తారు గాని) భగవంతునికి కనిపించరు, జీవుడే కనిపిస్తాడు. రాముడు రావణుడ్ని చూసినపుడు, జీవుడు అహంకారం అను పొరతో బాగా బంధింపబడి ఉన్నాడే అని కరుణ, జాలి చూపిస్తాడు తప్ప, ద్వేషం రాదు. అందుకని మనం ఎన్నిచోట్ల చూసినా, భగవంతుడు గానీ, భగవద్భక్తులుగానీ, ముందు జీవుడ్ని చూస్తారు, తర్వాత స్వభావం చూస్తారు. ధర్మరాజు కూడా ఎన్ని కష్టాలు వచ్చినా, జీవుడ్ని ముందు చూస్తాడు. జీవుడ్ని చూడగానే మనలో స్వభావం ప్రకోపించకుండా ఉంటుంది. మనం సరాసరి స్వభావం చూడడం వలన, మనకి ఎదుటి వ్యక్తి రాగానే ఆ వ్యక్తి స్వభావం చేత మన స్వభావం ప్రకోపింపబడుతుంది. దైవము యొక్క వ్యక్తరూపమే జీవి. అందుకే అవ్యక్తమైన దైవమునకు మొదటి వాహికగా జీవుడ్ని చెప్తారు. కాబట్టి మనం ఆ విధంగా జీవదర్శనం చేస్తుంటే దైవ దర్శనానికి దగ్గరౌతాం. దైవదర్శనానికి చాలా తాపత్రయపడుతూంటాం కదా. జీవుల రూపంలో కనిపిస్తుంటే చూడకుండా వేరే చూద్దామనుకోవడం వల్ల ఈ తిప్పలన్నీ వస్తూ ఉంటాయి. 'వీళ్ళందరి రూపంలోనూ నేనే ఉన్నాను కదా, అందులో ఉన్న నన్ను దర్శనం చేయలేవా ?

అలా చేయకుండా నీకు ప్రత్యేకంగా నువ్వు కోరుకున్న రూపంలో నేనెందుకు రావాలీ?' అని ప్రశ్నిస్తే? మనకు ఆయన ఏ విధంగా కనబడాలో నిబంధనలు విధిస్తూంటాం. కనబడే రూపంలో చూడం. అదే మనకి షిరిడీసాయి జీవితంలో కనిపిస్తుంది. 'వస్తాలే విందుకు మీ ఇంటికి' అంటాడు. ఒక ముసలివాడి రూపంలో వస్తే, ముసలివాడనుకుని కొట్టేస్తాడు. తర్వాత వచ్చి 'ఏం రాలేదు?' అంటే 'వచ్చాను గానీ, నువ్వు నన్ను తరిమేశావని' చెప్తాడు. సాధన ఎప్పుడూ ఈ మెట్టుదాటని వాళ్ళకి లేదు. ఈ మెట్టు కనీసం ఎక్కడానికి ప్రయత్నం చేస్తుంటే, ఎదుటివ్యక్తి రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష్యాసూయలు మన మీద పనిచేయవు, లేకపోతే పనిచేస్తాయి. వసిష్ఠుని మీద ఎంత విజృంభిస్తాడు విశ్వామిత్రుడు! ఎంత విజృంభించినా, ఏమీ పనిచేయలేదు కదా. కార్తవీర్యుడు జమదగ్ని మీద ఎంత విజృంభిస్తాడు? ఏమీ పని చేయలేదు. ఎందుకు చేయలేదంటే వచ్చిన వాడే నారాయణుడని నానుడి వున్నది కదా. ఈ భావన ఉండాలి. ఈ భావనలో జీవునిగా దేవుని చూడడం ముఖ్యం. ఈ నామంలో 'భగవంతుడు జీవుడే!' అని చెప్పాడు. ఇది చాలా గొప్ప విషయం. భీష్ముడు ఆ విధంగా దర్శనం చేసినవాడు కనక చెప్పగలిగాడు. 'పాపాత్మా పాప సంభవః' అని చెప్పుకోవద్దని EK గారు చెప్పడంలో వుద్దేశ్యం అది. 'ఆత్మ పాపం చేసుకోలేదొయ్, ఆత్మ సహజంగా దివ్యమైనదే! ఏదో తెలియక మనవాళ్ళు అలా పెట్టారు కనక, ఆ ఒక్క శ్లోకం మీరు చదవబోకండి' అని చెప్పారు. 'యానికానిజ పాపాని' అంత వరకే!, 'పాపోహం పాపకర్మణామ్, పాపాత్మ పాపసంభవ' వద్దు అన్నారు. ఎందుకంటే సాధనమార్గంలో ఉండేవాళ్ళు జీవుడ్ని దేవుడిగా గుర్తిస్తున్నప్పుడు పాపాత్మ' అని ఉండదు. శ్రీకృష్ణుడు 'తెలిసినవాళ్ళు, తెలియనివాళ్ళు అని ఇద్దరు ఉంటారు తప్ప, మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు అని లేరు. మంచి చెడు అనుకుంటూ ఉండడం వలన, నువ్వెంత చెడు చూస్తే నీలో అంత చెడు పెరుగుతుంది' అని చెప్పాడు. పురుషమేధంలో మాష్టారు EK గారు చక్కటి వాక్యం రాస్తారు 'దుష్టులున్నారు అనుకోవడం వల్లనే దుష్టత్వం పెరుగుతు ఉంటుంది' అని. అందుకని అందరిలోను జీవుడిగా దర్శనం చేయడమనేది మార్గంలో ప్రాథమిక మెట్టు. ఇది కనబడ్డానికి ప్రాథమికమైన మెట్టే ఐనా, ఇది ఎక్కితే 80 శాతం సాధన అయిపోయినట్లే! దీన్ని ప్రత్యేకించి సాధన చేయాలి. ఏ గురువు ఏ శిష్యుడికి చెప్పినా ఇదే చెప్తారు. భగవంతుడు భగవద్గీతలో ఇదే చెప్పాడు. 'సర్వ జీవరాసుల్లో నన్నే దర్శనం చెయ్యి, సర్వజీవరాసులూ నేనుగా దర్శనం చెయ్యి. అలా దర్శనం చేసినవాడే తెలిసిన వాడు' అని చెప్పాడు. పండితుడంటే సమదర్శనం కలిగిన వాడు. సమదర్శనం అంటే సమస్తమునందూ జీవునిరూపంలో ఉన్న దైవమును దర్శనము చేసేవాడు. కుక్కమాంసం, కుక్క, శూద్రుడు, బ్రాహ్మణుడు, అన్నిట్లోనూ జీవుడున్నాడని దర్శనం చేయగలవా? చేయగలిగితే నీకు సమదర్శనం ఉన్నట్లు. సమదర్శనం ఉంటే నువ్వు పండితుడివి. అంతేగానీ మడికట్టుకుని శూద్రులనీ, ఇంకోటనీ వర్గీకరణ చేసుకునేవాడు

పండితుడు కాడు కృష్ణుడి మార్గంలో. ఆ విధంగా మనం ప్రయత్నం చేయాలి. అలా మనం ఎంత చూడగలిగితే అంత పొరలు విడిపోతాయి. ఎంత చూడలేకపోతే అంత పొరలు కమ్ముకుంటాయి ఎన్ని రకాల సాధనలు చేసినా. రావణుడు తక్కువ తపస్సు చేసాడా? హిరణ్యకశిపుడు ఏమన్నాన్న తక్కువ తపస్సు చేసాడా? వాళ్ళ ముందు అసలు మనం ఎందుకు పనికి రాము కదా . అయినా వాళ్ళు దెబ్బతిన్నారు కదా. ఎందుకు? తనని వేరుగా భావన చేసుకుంటున్నందు వలన వారిలో అహంకారపు పొరలు విడిపడలేదు. తాను జీవుడుగా దేవుని అంశము, అలాగే సమస్త జీవరాసులు. ఈ భావం ఎవరికైతే బాగా స్థిరపడుతుందో, వాళ్ళకి భగవంతుడు జీవుడుగా ఉన్నాడని గోచరిస్తుంది. ఇది మొట్టమొదట భాగవతం ప్రథమస్కంధంలో మాష్టారు EK గారు రాశారు. ఆయన దానికి రాసిన వివరణ చాలు ఈ జీవితానికి. అందులో అన్ని సోపానాలూ ఇచ్చారు. సాధనకి మొదటి అధ్యాయం సరిపోతుంది, ఏ పుస్తకమైనా సరే, అది భగవద్గీత కానీండి, భాగవతం కానీండి. మనం అది చేయడం ఇష్టంలేక ఇవన్నీ చదువుకుంటూంటాం కదా. చదువుకుంటున్నార్ట అంటే ఇంకా సాధన చేయడానికి సిద్ధపడలేదన్నమాట అనేవారు మాష్టారు. ఎక్కువ పుస్తకాలు చదువుతున్నారంటే, ఆయన ఉద్దేశ్యం ఏమిటంటే తక్కువ సాధన చేస్తున్నాడుట అని. జ్వాలాకూల్ మహర్షి 'బాగా పుస్తకాలు చదివితే విజ్ఞానం వస్తుంది. వికాసం వస్తుంది. కాని, ఎక్కువ చదివితే బుర్ర లావైపోతుంది. రోజుకు 15 నిముషాలు చదువు. చదివింది ఏం గుర్తుందో ఇంకో 15 నిముషాలు రాయి. ఇలా చదవడం, రాయడం ద్వారా అది నీలో కొంచెం ఎక్కువ స్థాపితం అవుతుంది. అంతకుమించి చదవకు సుమా, చదివావంటే వేరే మార్గంలోకి వెళ్ళిపోతావ్' అంటారు. ఎక్కువ చదువుతుంటే అదొక వ్యసనంగా తయారౌతుంది. తయారై ఇంకా చదివి, ఇంకా తెలుసుకుందాం ఇంకా ఇంకా అనే భావనలో ఆచరణ తగ్గిపోతుంది. ఎవరు చెప్పినా ఇదే చెప్తారు. కనుక ముందు ఇది సాధన చేయాలి. ఇది చేస్తూ ఇందులో ఉండడానికి కార్యక్రమాలు పెట్టుకోవడం తప్ప, నిజానికి సాధన అది ఒక్కటే! మనవాళ్ళు, ఇంకొకళ్ళు అనుకుంటే సాధనంతా పోయింది. ఎవడు నీ వాడు, ఎవడు నీ వాడు కాదు, నీకెలా తెల్సు? నీ వాడనుకునేవాడు నీకు సాయం సాయం చేయకపోవచ్చు. నీ వాడు కాదనుకున్న వాడు చేయవచ్చు. అందరం వాడి వాళ్ళమే కదా. కాబట్టి వాడితో కలిసి వుండి, తద్వారా వాడినే దర్శనం చేస్తుంటే, వాడే నీకు నీ సన్నివేశాల రూపంలో, జీవులరూపంలో సాన్నిధ్యం ఇస్తూంటాడు. వాడికి సేవ చేసుకోవాలి. దైవానికి సేవ చేసుకుంటే ఎంతో, జీవులకి సేవచేసుకుంటే అంతే! నిజానికి దైవం ఎక్కడ కనబడతాడని సేవ చేస్తావు? సజీవంగా జీవులరూపంలో నీ దగ్గర వుండేవాడికి సేవ చేసుకుంటే గుడులు, గోపురాలు, పుణ్యక్షేత్రాలకు వెళ్ళిన దానికన్నా ఎక్కువ ఫలితం దక్కుతుంది. ఒకటి, దీనియందు ఇంకా మక్కువ తక్కువై, వాటి చుట్టూ మనం తిరుగుతూంటాం. రెండవది కొంచెం సంప్రదాయ బద్ధతవల్ల. మనకి నరనరాల్లో జన్మజన్మల నుండి వచ్చిన

సంస్కారాల బట్టి కూడా పుణ్యక్షేత్రాలకు వెళ్తూంటాం. వెళ్ళడంలో తప్పులేదు. పుణ్య పురుషులను, పుణ్యక్షేత్రాలను ఎప్పుడు దర్శనం చేయాలి అంటే, కర్తవ్యంలో భాగంగా, లేక తనకంటూ ప్రత్యేకమైన కర్తవ్యం వేరే ఏమీలేని సమయంలో వెళ్ళి చూసి, దండం పెట్టుకొనడం వలన స్ఫూర్తి పెరుగుతుంది. కాని నిజమైన స్ఫూర్తి జీవులరూపంలో ఉండే దేవుణ్ణి ఆరాధించినప్పుడు వస్తుంది. దానివల్లనే అనన్య చింతన ఏర్పడుతుంది. అది చేస్తుండడమే! దానికి విసుగు, విరామం వుండకూడదు. ఎన్నాళ్ళు చేస్తామండీ? అనే ప్రశ్న చచ్చిపోయేంత వరకు చేయాలి. అది ఎంతచేస్తే అంత ఆవరణలు తగ్గుతాయ్, ఎంత ఆవరణలు తగ్గితే అంత మార్గమునకు దగ్గరవుతారు. చుట్టూ మనం పొరలు పొరలుగా పేర్చుకొని, స్వభావం మనల్ని మించిన సందర్భంలో సాధన జరగదు. మార్గంలో నడవడం కుదరదు. మార్గంలోకి వెళ్ళడం అంటే, తనలోకి తను నడచి వెళ్ళడం. దానికి సంసిద్ధత, రుచి, ఆసక్తి వున్నట్లయితే, అప్పుడు మార్గోన్ముఖుడు అయినట్లు. తనలోకి తను నడచి వెళ్ళడం అంటే, అంతర్ముఖంగా దర్శనం చేయడానికి శ్వాసను ఆధారంగా తీసికొని, మనస్సును శ్వాసమీద లగ్నం చేసి, హృదయంలోకి ప్రవేశం చేయడానికి చేసే ప్రయత్నం! అంతవరకు చేసేవన్నీ కూడా పాట్లలా గింజ కోసం వెతుక్కున్నట్లుంటుంది. అక్కడనుండి గింజవున్న పాట్లు వెంటబడి, పాట్లను ఒలుచుకోవడంగా వుంటుంది. వట్టి పాట్లలో గింజ దొరకదు. పోని గింజ ఎక్కడ దొరుకుతుందయ్యా అంటే- పాట్లతో గింజ కప్పబడి ఉంటుంది. కాబట్టి ఆ పాట్లు తీసెయ్యాలంటే ఒలుచుకోవాలి. ఒలుచుకోవాలంటే, బయటవాడికి ఒలవడం కాదు, మనల్ని మనం ఒలుచుకోవాలి. మన లోపలనే ఆ గింజ వున్నది. 'నీవారశూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా' అని మంత్రపుష్పంలో చదువుకుంటాం. బియ్యం గింజంత ఉంటాడట లోపల. ఆ గింజకిపైన తలకాయలా ఉంటుంది. అది విపరీతమైన వెలుగుగా ఉంటుంది. అది నారాయణుడు! వాడి కింద బియ్యపు గింజంత వాడే జీవుడిరూపంలో ఉంటాడు! మరి వాడు కనబడాలి కదా? మరి వాడు కనబడాలంటే మన లోపలకి మనం పోవాలి. మన లోపలకి మనం పోవాలంటే ఇంద్రియాలను సమీకరించి, మనస్సులోకి ఇమిడి, మనస్సును శ్వాసలోకి ఇమిడ్చి, రెంటినీ తీసుకువెళ్ళి స్పందనలోకి ఇమిడిస్తే వీలుపడుతుంది. ఎన్నిసార్లు చెప్పుకున్నా ఈ సాధన చేయలేం! ఎందుకు చేయలేమో తెల్సా? బయట తెమలక! బయట ఎందుకు తెమలదు? సమస్తమైన జీవులరూపంలో ఉండే దేవుణ్ణి గమనించక! ఇవన్నీ మార్గానికి అడ్డు వచ్చేవి. ఆ అడ్డు తీసేయాలి. తీసేయాలి అంటే, వాడ్ని బాగా తల్చుకోవాలి. లేకపోతే దుర్గా పూజలు చేయాలి. ఎందుకంటె ఆ తల్లి ఆవరణలు తొలగిస్తుంది. గుమ్మం దుర్గ! అందుకే గుమ్మానికి పసుపు, కుంకుమ పెట్టుకుంటాం, అందానికి కాదు. గుమ్మం దాటుతున్నాం అంటే, ఒక ఆవరణ నుండి ఇంకో ఆవరణలోకి వెళ్తున్నట్లు లెఖ్క! ఇప్పుడు Fashion కి గుమ్మాలే లేవు. మామూలు గదిలోంచి పడగ్గదిలోకి వెళ్తుంటే ఆవరణ మారుతున్నట్లు. భోజనం గదిలోకి వెళ్తుంటే ఆవరణ మార్తున్నట్లు. భోజనాల గదిలో

దానికి సంబందించిన ప్రజ్ఞ ఉంటుంది. పూజగదిలో మళ్ళీ వేరే. ఇవన్నీ ఆవరణలు దాటుతూ వెళ్తున్నామని మనకి తెలియాలని గుమ్మాలు పెట్టారు. గుమ్మాలు లేకపోతే మనకి గుర్తురాదు. దుర్గ అమ్మవార్ని పూజచేయడం ఆవరణలు తగ్గించమని, దైవానికి దగ్గరిగా తీసుకెళ్ళమని. అయ్యవారిని తల్చుకుంటే ఆవరణలు వాటంతటవే తగ్గిపోతాయి. రెండు పద్ధతులున్నాయి. అమ్మను తల్చుకుని, ఆవరణలు తగ్గించి, తండ్రి వద్దకు తీసుకెళ్ళమని కోరడం. సరాసరి నాన్నని తల్చుకుంటే, అమ్మ దారి ఇచ్చేస్తుంది. ఎందుకంటే వాడు వెళ్దామనుకున్న చోటుకే వెళ్తున్నాడు కాబట్టి అడ్డుపడదు. ఆవరణలు ఎంత తగ్గుతూ వుంటే, అంత వినయం పెరుగుతుంది, అంత మార్గం లో నడవడానికి వీలుపడుతుంది. లేకపోతే వీలుపడదు. అందుకే తర్వాత నామం 'వినయితా' అని ఇచ్చారు.

## 533 వినయితా

తన్ను చేరే మార్గంలో ఉన్న జీవుడ్ని 'వినయితుడు' అంటారు. వినయంతో కూడి ఉన్నవాడు. వాడు ఆవేశకావేశాలకి పెద్ద ప్రాధాన్యమివ్వడు. తనయందు కలిగినా కూడా, వెంటనే తిరోగమనం చెంది, భగవంతుని యందు చేరి 'పారపాటైంది, ఇంకొకసారి ఇలా కాకుండా నన్ను రక్షించు' అని కోరుకుంటాడు. ఇతరులు తనయందు అవి చూపిస్తున్నప్పుడు కూడా వాటియందు జీవించడు. తనలో వినయం పెరగడం చేత, ఎదుటివ్యక్తి తన గురించి ఏం మాట్లాడుకుంటున్నారో అనే దాని యందు శ్రద్ధ ఉండదు. తన గురించి మంచిగా మాట్లాడినా, విమర్శించినా దాని యందు శ్రద్ధ ఉండదు. తన మార్గంలో తను నడుస్తూంటాడు. తను నిర్వర్తించవలసిన కర్తవ్యములు జీవితంలో మౌనంగా నిర్వర్తిస్తూ, సమస్త జీవులయందూ భగవంతుని దర్శనం చేసుకుంటూ, బయట పనులు చేస్తూ, ఆ పనులు ఎక్కువ ఉండవు కదండీ, మిగతా సమయంలో లోపల పనియందు నిమగ్నమై ఉంటాడు, అదీ మడి కట్టుకోడం! మనం లోపలికి వెళ్తే మడి, బయట తిరుగుతుంటే మైల. లోపలకెళ్తున్న వాడు మాత్రమే 'వినయితుడు' అని ఈ నామం చెప్తుంది. లోపలికి వెళ్ళడం అంటే, జీవుల రూపంలో దేవుడున్నప్పుడు, జీవుల రూపము (అంటే శరీరము, స్వభావము, అభిప్రాయములు, ఇవన్నీ వాడి చుట్టూ ఆవరణలుగా వుంటాయి) దాటి వాటిలో వుండే జీవదర్శనం చేస్తుండాలి. ఎట్లా చేస్తావు? కేవలం గుర్తుంటే జరుగుతుంది, లేకపోతే జరగదు. గుర్తు చెప్పేవాడు 'గురువు'! మర్చిపోతే మళ్ళీ గుర్తుచేస్తుంటాడు.మళ్ళీ మర్చిపోతే మళ్ళీ గుర్తుచేస్తుంటాడు. ఇది మొదట్లోనే అందరికి గురువైన నారాయణుడు బ్రహ్మాకి చెప్తాడు. మరి మర్చిపోతాం కదా అంటే మళ్ళీ గుర్తు చేసుకోవాలి, గుర్తెలా వుంటుంది? అంటే 'మర్చిపోకపోతే గుర్తుంటుంది' అంటాడు. అందుకని దానికి వేరే shortcuts ఏమి లేవు. పడ్డప్పుడల్లా గుర్తు తెచ్చుకోవడమే! ఎన్ని సార్లు పడ్డా ఫర్వాలేదు. గుర్తు తెచ్చుకుంటే అదృష్టవంతుడే. పడ్డందుకు బాధపడకూడదు, పడడం సహజం. ఎందుకంటే ఆయన సృష్టిలో, మాయలో మనం భాగం కనక పడతాం. పడ్డందుకు బాధపడనక్కర్లేదు. నవ్వుకోవచ్చు. పడనందుకు గర్వపడకూడదు. గర్వపడితే మళ్ళీపడతాం. అందుకని సమస్తమునందూ వాడ్ని గుర్తుపెట్టుకుంటే పడమండీ, లేకపోతే పడిపోతూంటాం. వాడు గుర్తుంటే మనిషి వినయంగా ఉంటాడు, ఇంకో పద్ధతిలో ఉండడు. వాడు గుర్తు లేకపోతే పేట్రేగిపోయి ఉంటాడు. విపరీతమైన కోపం, ఆవేశం, ద్వేషం వస్తూంటాయి. అందుకని మనము ఇదివరకు ఒక నామం లో వినయం గురించి చెప్పుకున్నాం. అక్కడ చెప్పుకున్న పద్ధతి వేరు, ఇక్కడ చెప్పుకున్న పద్ధతి వేరు. ఇక్కడ వినయంగా మార్గంలో నడిచేవాడు కూడా భగవంతుడే అని భీష్ముడు చెప్తున్నాడీ నామంలో. అంటే వీరందరి రూపాలలో

గోచరిస్తున్నవాడు జీవులలోను, పందిలోను, కుక్కలోను గోచరించేటివాడు; వినయంగా భగవంతుని మార్గం లో నడుస్తున్నవాడిలో ఎక్కువగా గోచరిస్తాడు. ప్రస్ఫుటంగా గోచరిస్తాడు. సులభంగా చూడగలుగుతాం కదా. భక్తరాజ మహరాజ్ గారు, శివానందమూర్తిగారూ వచ్చారంటే పరిగెత్తిపోతున్నాం? ఎందుకు? అక్కడ ప్రస్ఫుటంగా ఉండడం చేత. మన లోపల అదే ఉన్నది కాబట్టి ఇది దాని దగ్గరకు లాగేస్తుంది. మహాత్ములను కలవడమనేది మంచి విషయమే. ఎన్నిసార్లు కలిస్తే అంత మంచిది, అందుకు సందేహం లేదు. కానీ ఒకసారి కలిసిన దానికి, మరొకసారి కలిసినదానికి మధ్యలో మనం ఎలా ఉన్నాం అన్న దాన్ని బట్టి తెలుస్తుంది ఉందా లేదా అని. మహాత్ములని కోరి దర్శనం చేయాలి. పుణ్యక్షేత్రాలకు కూడా తప్పక వెళ్ళాలి. ఇవన్నీ దేనికయ్యా అంటే స్ఫూర్తినివ్వడానికి. స్ఫూర్తినివ్వడం వేరు. నీ అంతట నువ్వు నడవడం వేరు. వేలుపట్టి నడిపించినంతసేపూ నడిచి, వేలు వదిలెయ్యగానే చతికిలపడిపోయామనుకో, నీకు నడక రాలేదనే కదా. నడక రావాలంటే, జీవులను దర్శించుకుంటూ రావాలి. భారతంలో మహాత్ములు, భయంకర సన్నివేశాలలో 'ఆ సన్నివేశాన్ని, సన్నివేశం అందించే వాడి రూపంలో ఉండేవాడ్నే వాడిగా దర్శనం చేయడం' అనే పద్ధతి ఇచ్చారు మనకి. అదొక్క స్వభావం మాత్రమే ప్రస్తుత సినిమా భాషలో చెప్పాలంటే మటాష్ అయిపోడానికి వీలుపడుతుంది. ఇంకొక పద్ధతిలో అది neutralize కాదు. అది వశం కాదు. కొట్టినా వాడే, తిట్టినా వాడే, అన్నింటిల్లో వాడే! అందుకే భగవద్గీతలో ఆయన 'తుల్యనిందాస్తుతిర్మౌని' అన్నాడు. 'నిందా, స్తుతుల యందు ఒకే రకమైన మౌనం వహించి ఉంటాను. నా భక్తుడు అలా ఉంటాడు'! తిట్టారనుకోండి, మనకి నోరుంది కదా 10 తిడతాం. ఒక్కోసారి ఎదురుగా తిట్టుకోక, ప్రక్కకి తిట్టుకుంటూంటాం. ఇవన్నీ ఎక్కడ నుండి వస్తాయి? లోపల స్వభావమే పనిచేస్తుంది. భక్తియోగంలో శ్రీకృష్ణుడు తన భక్తుని గుణాలు 42 చెప్పాడు. భక్తుడు అంటే 'అతనితో జతపడి ఉన్నవాడు'! ఫెళ ఫెళ పూజలు, హోమాలూ, క్రతువులూ చేసి నామాలు అరిచి చదివి, ఊళ్ళో వాళ్ళకి భక్తులమని మనం వార్త ఇవ్వవచ్చు కానీ, దానివల్ల ఉపయోగం లేదు. వేమన రాస్తాడు 'వైష్ణవులంటంచు వార్త మాత్రమే గానీ' అంటాడు. ఏమిటి వార్త! ముందు 3 నామాలు చాల గట్టిగా పెడతాడు కదా చూడగానే వైష్ణవుడని తెలుస్తుంది. అదా వైష్ణవము? 3 నామాలు పెట్టుకోడంలో ఒక బాధ్యత ఉన్నది. 'త్రిగుణాత్మకమైన సృష్టిలో ఉన్న భగవంతుడ్ని నేను దర్శనం చేస్తున్నాను' అనే ప్రతిజ్ఞ చేసిన వాడే పెట్టుకోవాలి. ఇడ, పింగళ, సుషుమ్న. అవే మనకి ఇడ - తమస్సు, పింగళ - రజస్సు, సుషుమ్న- సత్త్వం అనుకోవచ్చు. అంటే సమస్తమునూ దైవముగా దర్శనం చేయడం అనేది వైష్ణవం! 'విశ్వం విష్ణుర్వషట్కారో' అన్నారు కదా. విశ్వమునే విష్ణువుగా భావన చేసే ప్రతిజ్ఞ పూనిన వాడు నామాలు పెట్టుకున్నా ఫర్వాలేదు, పెట్టుకోకపోయినా ఫర్వాలేదు. నామాలు పెట్టుకుని ఆ పని చేయకపోతే కేవలం వార్త

ఇస్తున్నావ్ నేను వైష్ణవుడనని! నువ్వు వైష్ణవుడివి కాదు కదా. అని చెప్పడానికి ఈ పద్యం చెప్పాడు వేమన. ఎందుకంటే కొంతమంది వైష్ణవులతో వేమన చాలా కష్టాలు పడి ఉంటాడు. శైవులతో కూడా అంతే. అందుకే శైవుల గురించీ రాశాడు 'శివపూజలేల' అన్నాడు. డంబాచారులని యోగి ఒక్కోసారిఎత్తి పొడుస్తూంటాడు. ఎందుకంటే అది భగవంతుని సంకల్పంగా 'మార్చుకోండిరా' అని సందేశంగా వస్తుంది తప్ప, వాళ్ళకి వీళ్ళమీద ద్వేషం ఉండికాదు. బయట ప్రపంచానికి భక్తుడిగా వార్త ఇవ్వడం ఒకటి, నేను భక్తుడిగా ప్రపంచంలో చలామణి కావచ్చు, అవునో కాదో నాకు, దేవుడికి తెల్సుగా! ఎవడికి వాడు తమ పుటలు విప్పి చూస్తే, పుటలలో ఎంత చెద ఉన్నదో, ఎన్ని బొద్దింకలున్నాయో, ఎంత కంపుకొడుతున్నదో తెలుస్తుంది. ఎవడి కంపు వాడికి తెలుస్తుంది తప్ప ప్రక్కవాడికి తెలియకపోవచ్చు. కానీ ఒక్కడికి తెలుస్తుంది. అందుకనీ ఈ మార్గంలో వినయవంతుడు కావాలి. విద్య చేత వినయం వస్తుంది కదా. విద్య చేత వినయం రాకపోతే మనం నేర్చుకున్నది విద్య కాదని తెలియాలి. విద్య నేర్చుకొనే పద్ధతిలో నేర్చుకోవడం లేదని అర్థం. 'విత్' అంటే దేన్ని తెలుసుకోవాలో, దాన్ని తెలుసుకోడానికి దారి చూపే శాస్త్రం. దానియందు మనం నడుస్తున్నాం అనుకోండి! వినయం సహజంగా వస్తుంది. వినయం రాలేదుటా అంటే విద్య లేదుట, అని అర్థం. విద్య లేకపోతే ఆవరణలు చుట్టేసి, ఈ ద్వంద్వంలో పడి కొట్టుకుంటూంటాం. ఎప్పుడైతే వినయవంతుడై నడిచి వెళ్తుంటాడో, పారలన్నీ దాటతాడు. భౌతికమైన పార ఒకటి ఉన్నది. ఆ పారకి వెనకాల చాలా మందికి కామశరీరమే పనిచేస్తుంటుంది. లోపలకి వెళ్ళి చూసేవాడికెలా ఉంటుందంటే తన కోరికల సముదాయాన్ని తాను బయటకు వచ్చి చూడగలుగుతాడు. తాను వేరు, తన కోరికలు వేరు. మనం మన కోరిక కాదు కదా. మన కోరిక మనల్ని తిప్పుతూంటుంది. తిప్పలు పెడుతుంది. ఎన్ని రకాల కోరికలు ఎన్ని రకాల హింసలుపెడుతున్నాయో చూడవచ్చు. ఈ వినయంగా ఉన్నవాడు, నాకున్న కోరికలు ఏమిటి అని list రాసుకుంటే పనికి వచ్చేవెన్ని? పనికిరానివెన్ని? అవసరమైనవి ఎన్ని? అవసరంలేనివెన్ని? చాలా కోరికలు అవసరం లేనివే ఉంటాయి. కేవలం మనకున్న ఆదుర్దా చేత, భయం చేత, ఆశ చేత ఇవన్నీ కావాలనుకునేవి బోలెడుంటాయి. కావాలనుకుంటే రావు. దాని గురించి ఏం చెయ్యాలో చేస్తే వస్తాయి తప్ప ఊర్కే కావాలనుకుంటే రావు కదా. ఇల్లు కట్టుకోవాలనుకుంటే సరిపోయిందా? దానికి ఎలాంటి వనరులు నీ వద్దకు రావాలి. అవి రావాలంటే నువ్వేం చేయాలి? ఆ పద్ధతిలో వెళ్తే అదవుతుంది. అసలు అవసరమా? నిజమైన మహాత్ములు ఎవరూ ఇంటి కోసం ప్రయత్నం చేయలేదు. ఉంటే ఉంది లేకపోతే పోయింది. ఈ ఇల్లే కాదనుకున్నపుడు ఆ ఇల్లు గురించేమిటి? మాష్టారిని ఓ స్నేహితుడు 'మీకు ఇల్లు వుండాలి మాష్టారూ' అన్నారు. రామకృష్ణశెట్టి గారని మంచి సాధకులు 'ఉండాలట్రా' అన్నారాయన. స్వంతం గురించే ఆలోచించ లేదూ స్వంతిల్లు గురించేం ఆలోచిస్తారు? నిజానికి చీమలు పెట్టిన పుట్టలు

పాములకి నెలవైనట్లు' కదా. 'Fools build the house for the wise men to live in' అని ఉంది కదా. ఎందుకూరకే తాపత్రయపడతావు? నీకు రావాలంటే అదే అప్రయత్నంగా వస్తుంది. నువ్వుచేయవలసింది చేస్తుండు. ప్రయత్నం చేసి పొందాల్సింది ఒకటి ఉందండీ. అది పొందడానికి చేసే ప్రయత్నంలో మిగిలినవన్నీ అప్రయత్నంగా సమకూరుతాయి. మండూకోపనిషత్తు ఈ విషయం చెప్తుంది. పరావిద్య, అపరవిద్య అని రెండున్నాయి. పరా విద్యంటే భగవంతుని చేరుకునే మార్గం. అపరా విద్యంటే తదితర విషయములు. వేదాంగములు కూడా అపరవిద్యే అని చెప్పింది మాండూకోపనిషత్తు. నాకు నిరుక్తము వచ్చు, ఛందస్సు వచ్చు, జ్యోతిష్యము వచ్చు. నేను సమస్తమైన వేదాంగములలో నిష్ణాతుడిని. అంటే ఇవేమీ పనికిరావు. అవన్నీ అపరా విద్యే! 'అప్రయత్నంగా దారిలో లభించే వాటికోసం నువ్వు ప్రయత్నం చేస్తావేమిటి? ప్రయత్నం చేస్తేగానీ లభ్యం కాని విషయం లో ప్రయత్నం చేయవేమిటి? అని అడుగుతుంది. ఈ ఉపనిషత్తు మూడవ శ్లోకంలో 'ఒంటిమీద బొచ్చు నీ ప్రయత్నం మీద పెరుగుతున్నదా?' అని అడుగుతుంది. ఇటు పక్కవన్నీ అంతే అంటుంది. ప్రయత్నం చేయబోక వీటికోసం వాడికోసం చేస్తే ఇవన్నీ నీడవలె నడిచి వస్తుంటాయి. పరమగురువు Pythagoras అనే ఆయన దాన్నే 'నీడ వెంట పడక. అది నిన్ను ఊరికే దాని వెంట పరిగెట్టిస్తుంది తప్ప అది నీకు దొరకదు' అని చెప్పారు. సూర్యుడు తూర్పున ఉంటే నీడ పశ్చిమంగా ఉంటుంది. ఆ నీడ కోసం పరిగెడ్తూ ఉంటే ఏమౌతుందండీ, మనకన్నా ముందే ఉంటుంది. దాన్నే ఎండమావులు అన్నారు. నువ్వెంత పరిగెత్తినా అందిందా ఆ నీడ? అందలేదు కదా. ఓ ఆరుగంటల తర్వాత చూస్తే నీడ కనబడదు. ఏమైందా అని చూస్తే వెనక ఉంటుంది. మళ్ళీ వెనక్కి పరుగు. ఎందుకంటే సూర్యుడు పశ్చిమానికి వెళ్తే నీడ తూర్పునకు వెడుతుంది. సాయంకాలం అయ్యేసరికి నీడ చాలా పాడుగైపోతుంది. ఈలోగా మనకి ఆయాసం వస్తుంది. రోజంతా ఇంక ఎంత పరుగెత్తగలం? జీవితంలో పరతత్వానికి సంబంధించని విషయాలయందు పరుగెడుతున్న వారందరి విషయము ఇంతే! పరతత్వముతో నువ్వు ముడివేసుకున్నావనుకో అంటే, సూర్యుడు ఎటున్నాడో అటు వెళ్తున్నావనుకో, నీ నీడ నీ వెనకే వస్తున్నది కదా? సూర్యుడు పశ్చిమానికి వచ్చాడు. నువ్వు పశ్చిమానికి తిరిగి నడు. నీడ నీ వెంటే నడుస్తుంది. అలా నీ వెంట నడిచేదాని వెనక నువ్వు నడుస్తావేమిటీ అంటాడు Pythagoras. అదే మండూకోపనిషత్తు చెప్తుంది. ఇవన్నీ ఎండమావుల్లో నీళ్ళవలె కనిపిస్తాయి. వెంటపడ్తే ఏమీ ఉండదు. ఎండా కాలంలో తార్రోడ్డు మీద వెళుతుంటే కారులో దూరంగా రోడ్ మీద నీళ్లు ఉన్నట్లుంటాయి. కార్ పోతూనే వుంటుంది. నీళ్లు వుండవు. ఎడారుల వద్ద అలాగే ఉంటుంది ఎండమావులు కనిపిస్తాయి వాటి వెంట పరుగెత్తడం అవివేకము. నీ కర్తవ్యము నువ్వు సరిగా చేస్తూంటే నీ వెంట అన్నీ సరిగా నడచి వస్తూంటాయి.నీ వెంట నడచివచ్చే వాని వెంట నువ్వు పడక. మనిషికి భౌతికశరీరములో ఉండే ఆవరణ, కామమయమైన శరీరము! ఆ కామలోకమంతా

'నీడ' కు సంబంధించిన లోకమే! నీ కర్తవ్యము ప్రకారం నువ్వు పని చేసుకుంటూ వెళ్తుంటే నీకు యుక్తవయస్సు రాగానే పెళ్ళాం కోసం వెతుక్కోనక్కర్లేదు. వస్తుంది. డబ్బు కోసం వెతుక్కోనక్కర్లేదు. నీవు చేయవలసిన కర్తవ్యం నువ్వు నిర్వర్తిస్తుంటే నీకు రావలసిన డబ్బు వస్తూనే ఉంటుంది. ఉన్ముఖత్వం చేయవలసిన కర్తవ్యం మీద ఉండాలి తప్ప, రావలసిన విషయాలమీద ఉండకూడదు. అలాగే ఆస్తులు అప్రయత్నంగా వస్తూ ఉంటాయి. ఉపనిషత్తులో చెప్పినట్లుగా, ఒంటిమీద బొచ్చు ఎంత అప్రయత్నంగా మొలుస్తుందో, అంత అప్రయత్నంగా వస్తాయి అన్నీ. వేటివెంట ఇవన్నీ ఉన్నాయో దాని వెంటపడు. అది 'పరవిద్య' అంటాడు. కాబట్టి ఆ పరతత్త్వం లోకి మనం ప్రవేశించినప్పుడు మొట్టమొదట మనం ఎదుర్కొనేది ఏమిటయ్యా అంటే మన కోరికలు! వాటిని అప్పటికప్పుడు పుచ్చులు, తచ్చులు ఏరి పారేసి, కేవలం అవసరమైనవి, కర్తవ్యానికి సంబంధించినవి మాత్రము ఏరుకొని పని చేసుకుంటూండాలి. చేసుకుంటూంటే కామశరీరం కొంచెం తగ్గితే, ప్రాణశరీరం కొంచెం పెరుగుతుంది. కామం యొక్క తీవ్రత చేత ప్రాణం ఉసూరుమంటుంది. అందుకని పెద్దలు ప్రాణం బావుండాలంటే కామం తగ్గించుకో అని చెప్పారు. కామమే ప్రాణాన్ని తీయగలదు. మళ్ళీ మళ్ళీ మృత్యుముఖంలో పడేసేది. కామము అంటే కోరికలు ఏమీ ఉండకూడదు అని కాదు. ధర్మసమ్మతమైన కోరికలు అన్నీ కోరవచ్చు. అంతకు మించి కోరడం అనేది నీడ వెంటపడడమే. అక్కడ నుండి కామాన్ని విచక్షణా జ్ఞానంతో ఏరుకుని, కేవలం మన మార్గానికి సంబంధించి ఉన్నట్లైతే, నీ కర్తవ్యం మేరకే నువ్వు కామిస్తున్నట్లయితే, తర్వాత మరొక పార వస్తుంది. అది అభిప్రాయముల రూపంలో ఉంటుంది. మనకి సంప్రదాయానికి సంబంధించి కొన్ని, భారతీయులం అవడం వలన కొన్ని, తెలుగువాళ్ళం అవడం వలన కొన్ని, కుటుంబపరంగా కొన్ని అభిప్రాయాలుంటాయి. ఈ అభిప్రాయాలన్నింటినీ మనకుగా మనం అద్దం వేసుకుని చూసుకుంటూండాలి. నీ అభిప్రాయాలకి నువ్వే అద్దం పట్టుకోవాలి. అవి కేవలం అభిప్రాయాలు తప్ప అందులో సత్యం చాలా తక్కువ ఉంటుంది. ఆయనిట్లాగూ, ఆవిడట్లాగూ ఇలా అనుకునేవన్నీ మన అభిప్రాయాలు. అవునో కాదో ఎలా తెలుసు? అవన్నీ మన మనస్సు నిండా పోగేసుకోడం ఎందుకు? ఈ అభిప్రాయాలను గమనించే వాడిగా నువ్వు తయారుకాగలిగితే, అంటే 3 పారలు దాటావన్నమాట. భౌతికము, కామము, అభిప్రాయము లేదా మనోమయము. ఈ మూడింటినీ దర్శనం చేసుకుంటుంటే నీ విషయంలో, సాక్షిగా నీలో నువ్వు ఎలా ఉన్నావో తెలుస్తుంది. అది మూడోనామం సాక్షి!

## 534 సాక్షి

మనలో భగవంతుడు మన విషయంలో అలాగే సాక్షీభూతుడై చూస్తూ ఉన్నాడు నీ రూపంలోనే. నీవు మనస్సులో ఇరుక్కున్నట్లైతే అంతకు పై మెట్టులో ఆయనుండి దర్శనం చేస్తుంటాడు. నీకుండే భావములను బట్టి, నీకుండే కామములన బట్టి, కోరికలను బట్టి నీకివ్వాల్సిన ఫలితాలు ఇస్తుంటాడు. సమస్తాన్ని తాను చూస్తుంటాడు. నేను సర్వసాక్షిని అని భగవంతుడు చెప్పడంలో ఉద్దేశ్యం ఏమంటే, నీలో ఉండి నువ్వు చేసే పనులన్నీ చూస్తుంటాడు. నేను చేసే పనులు అందరకూ తెలియకపోవచ్చు గానీ నాకు తెలుస్తాయి కదా. పారపాటు చేస్తే మన లోపల మన భయం మనల్ని ఏడ్పిస్తూంటుంది కదా. ఎందుకనీ సాక్షీభూతుడై ఉన్నాడు కాబట్టి. నీవు కూడా సాక్షీభూతుడుగా తయారవ్వడం సాధనలో ఒక మెట్టు. అందుకని ఉదయం, రాత్రివేళల్లో తీరిగ్గా ఉన్నప్పుడు, లేదా ఎప్పుడు ఏకాంతం దొరికితే అప్పుడూ లేదా వారానికొకసారి ఊరవతల ఏ చెట్టు కిందో కూర్చొని నీ కొట్టు అంతా విప్పి చూసుకోవాలి, ఏమిట్రా నీ బాధ, అని. నువ్వు పై మెట్టు మీద జీవుడిగా కూర్చొని, నీ మనోమయ లోకంలోనూ, కామమయ లోకంలోనూ, భౌతికలోకంలోనూ నీ కుండే బాధలన్నీ పట్టీ వేసుకుని చూసుకో. ఏమిటీ? వీటిలో సత్యం ఎంత? అబద్ధం ఎంత? భయమేనా? ఆదుర్దాయేనా? మనక్కావలసినది ఎంత? అఖ్ఖర్లేనిది ఎంత? విప్పదీసి ఇట్లా చూసుకోవాలి. Stock taking అంటాం Audit లో. లేకపోతే అంతా బావుంటుంది అనుకున్నప్పుడు ఏదో ఢామ్మని పేలిపోతుంది. నీ ఆరోగ్యం ఎలా ఉంది? దాని విషయంలో నువ్వేం చేస్తున్నావ్? శరీరం భగవంతుడిది కదా. దాన్ని రోగాలూ, రొష్టులతో ఉంచడానికి వీల్లేదు కదా. దాని విషయంలో నువ్వేం చేస్తున్నావ్? నీ కర్తవ్యం ఏమిటి? కర్తవ్యం అంటే కుటుంబపరంగా, సంఘపరంగా, నీ శరీరపరంగా వీటన్నీటినీ మించి భగవంతుని చేరుకోవడం కోసం చేయవలసినది ఇలా 4 కర్తవ్యాలున్నాయి. ధారేషణ, ధనేషణ పుత్రేషణా విషయాల్లో కర్తవ్యం ఎంత ఉన్నది? నువ్వు చేయవలసిన సాధన విషయంలో ఎలా ఉన్నావు? ఒక్కసారి 'పునః పరిశీలన' చేసుకోడం సాధకుడికి ముఖ్యమైన విషయం. అది రోజూ జరిగితే ఉత్తమం. కనీసం వారానికి ఒకసారి జరగాలి. దానికి 'అష్టమి' ని వాడుకోవాలి. నెలలో 4 సార్లు ఈ అవకాశం వస్తుంది. పౌర్ణమి, అమావాస్య 2 అష్టములు. అందుకని పునః పరిశీలన సాధనలో భాగంగా చేసుకుంటే, ఈ సాక్షి అనే భగవత్తత్త్వం మనలో పెరుగుతుంటుంది. లేకపోతే మనం బాగానే ఉన్నాం అనుకూంటూంటాం. బావుంటే జీవితం ఇలా ఎందుకున్నదీ? అనే ప్రశ్న రావాలి కదా. కాబట్టి ఏదో సరిగ్గా చేయడం లేదు. ఏం సరిగా చేయడం లేదో ఒక్కసారి ఒలకబోసి చూసుకో. డబ్బాలో ఉన్నవన్నీ బోల్లించి చూస్తే, దేనికి దాన్ని సరిగ్గా చక్కగా సర్దుకోవచ్చు.

ఇల్లు సర్దుకున్నట్లే. మనం వారానికొకసారి ఇల్లు సర్దుకోకపోతే ఇల్లు బావుండదు. ఎందుకంటే వారంలో ఇక్కడివి అక్కడ, అక్కడివి ఇక్కడా పెట్టి, చివరకు ఎక్కడ పెట్టామో మర్చిపోతూంటాం. అందుకని సర్దుకుంటూంటాం. అలాగే ఒంట్లో కూడా ఈ స్వభావాన్ని సర్దుతూండాలి. సర్దుతూంటే బయట విషయాల్లో నీకుండే బాధలేమిటి? రాసుకో. దాని విషయంలో చేయవలసినదేమిటో ప్రక్క పేజీలో రాసుకో. ఎడం పక్క సమస్య, కుడి పక్క చేయవలసింది రాయి. నీకు తోచకపోతే నీకు నమ్మకమున్నవాడిని అడుగు. అడిగితే వాడు చెప్పింది చెయ్యి. ఊరే సరదాగా అడగబోక. అలాగే కోర్కెల విషయంలో. నిజంగా నీకు ఏమన్నా కావాలా? అఖ్ఖర్లేనిది వుంటే ఎత్తేసెయ్యి. ఎత్తేస్తే చాలా బరువు తగ్గుతుంది. కొన్ని నిత్యావసరాలు, అత్యావసరాలు వుంటాయి. వాటి విషయంలో ఏం చేయాలో కుడిపక్క రాసుకో. ఎటువంటి భావాలు పీడిస్తున్నాయి. ఇవి regular గా చేస్తూంటే సాక్షి, witness in you developes. నీకే తెలుస్తుంది. అద్దంపట్టినట్లు ఇంకొకళ్ళెవరూ మనకి చెప్పనక్కరలేదు. మనకే ఈ మూడు బీరువాలో సర్దుకుంటే తెలుస్తాయి. ఆ విధంగా చూసుకో. చూసుకుంటే 'సాక్షి' బయటకు వస్తాడు. సాక్షి చూపినంత బాగా ఎవరూ చూపించరండీ! అందుకే సాక్ష్యం అడుగుతుంటారు. మనం చూడనిది, విననిది నిర్ధారణ చేయాలంటే ఎలా? సాక్షి కావాలి! అందుకే courts సాక్షిని పెట్టుకుంది. కనబడనిదానికి సాక్ష్యం చూపిస్తుంది సరైన పద్ధతిలో. కలియుగంలో సాక్షి తీసెయ్యండి. మనలో సాక్షి ఉన్నాడు కాబట్టి, మన మనోమయ, కామమయ బహిర్గత లోకాలలో మనకున్న రుగ్మతలూ, తప్పక ఏరి పారేసుకోవలసినన్నీ చూపిస్తుంటాడు. ఇదీ సాధన! ఇలా చేసుకుంటే మనలో సాక్షిభూతుడైన భగవంతుడు వ్యక్తమవుతాడు. మనకి వ్యక్తం కాకపోయినా అయన సాక్షీభూతుడుగా అందరిలోనూ ఉన్నాడు. కాబట్టి ఎవరి account వారి కప్పగించడం ఆయనకి కష్టం కాదు. లోపల accountant ఉన్నాడండీ. ఎప్పటికప్పుడు debit entry, credit entry వేసేస్తూంటాడు. నీ accounts నువ్వే చూసుకుంటున్నావ్ అనుకో, అందుకు వేరే auditor అక్కరలేదు. చిత్రగుప్తుడు అక్కరలేదు. చిత్రగుప్తుడు ఎవరయ్యా అంటే audit చేసేవాడు. Accounts రాసేవాళ్ళు లిపికాస్! వీళ్ళంతా మన అందరి జీవులకు Book Keepers. ఎక్కడున్నారు? మన లోపల వేసేస్తూంటారు టపటప. పొరపాట్న చేసినా, మాట్లాడినా, ఆలోచించినా entry పడిపోతుంది. ఆలోచనే కదండీ అంటే ఆలోచనే కదా పోనీ మరీ ఎర్ర ఇంకుతో రాయను, Orange ink తో రాస్తాలే అంటారు. ఆలోచనలకు కూడా entry ఉంది. కోరిన కోరికలకి entry పడిపోతుంది. మంచి పనులకు నీలం రంగు entry. మరీ భయంకరమైన హత్యలు చేసేస్తే నల్లరంగుతో రాసేస్తాడు. ఇలా రాసేసి, నువ్వెళ్ళగానే నీ account నీకిచ్చి పంపిస్తాడు. ఎందుకని? మళ్ళీ అవి పట్టుకొని రావాలి నువ్వు. లిపికాస్ అనే దేవతలు మనలో ఉన్నారని ఋషులు దర్శించి ఇచ్చారు. ఆకాశంలోనూ ఉన్నారు, లోపలా ఉన్నారు. వారందరికీ head మన చిత్రగుప్తుడు! నీలం entryలు ఎన్ని, ఎరుపు

entry లు ఎన్ని చూస్తాడు. ఒక దాంతో ఒకటి balance చేస్తాడు. ఆదాయంలోంచి ఖర్చు తీసి ఎంత మిగిలిందో చూస్తాం కదా. అక్కడ అలా చూడరు. దేనిదదే! నీలంగా రాసిన వాటన్నిటికీ శుభఫలితాలు. ఎరుపుగా రాసినవన్నింటికీ దుఃఖఫలితాలు. వేటికవి రెండూ ఇస్తాడు తప్ప ఒక దాన్లో నుండి ఇంకొకటి తీసి balance ఇవ్వడు. Divine accounting ఇది DAs వాళ్ళు, CAs కాదు. CA balance చేస్తారు. DAs balance చేయరు. దేనిదదే. ఇది పట్టుకు పద, అంటారు. ప్రతి Red entry మనకి దుఃఖం ఇస్తుందండి. దాంతో ఏమిటి? మనమేదో చేస్తాం, కాబట్టి అనుభవిస్తున్నాం 'వాయిముడు' అంటారు చూడండీ, మూసుకుని అనుభవించెయ్యడమే! నోరు తెరచి నాలుగు మాటలు అంటే ఎర్రఅంకెలు పడిపోతాయి. మన కష్టానికి ఎవర్నో నిమిత్త కారణంగా చూస్తూంటాం. చూసి వాడ్నీ, వీడ్నీ అన్నామనుకోండి ఎర్రఇంకు పడిపోతుంది. మహాత్ముల విషయంలో దూషణ చేసామనుకోండి ఎర్ర inkతో underline పెడతాడు. మేం చిన్నప్పుడు అనంతపురంలో చదివేటప్పుడు అయ్యవారు వచ్చేలోగా కబుర్లు చెప్పకుంటూండే వాళ్ళం. Class కి class కి మధ్య కొత్త అయ్యవారు వచ్చేలోగా విశ్రాంతి కదా. మరి ఈలోగా class కి class కి మధ్య మాట్లాడేవారి పేర్లు class leader board మీద రాసేవాడు 'ఆ రాసేడులే' అని మాటలాడుతుంటే ముందు పేరు రాసేవాడు. ఆ తర్వాత ఇంకా మాట్లాడుతుంటే bracket లో (అతి) అని రాసేవాడు. ఇంకా మాట్లాడితే ఇంకో అతి, ఇంక అలా చోటు అయిపోతే అతిలు రాసి, ఇంకా వీడు మాట్లాడ్తూంటే అక్కడ కింద గీత పెడ్తాడు. అప్పుడు అయ్యవారు వచ్చి, అతిలు దాటి గీతలుకు వచ్చిన వాడ్ని చూసి బెత్తం పెట్టి కొడ్తాడన్నమాట! అందుకని మూడు అతి లు వరకు మాట్లాడేవాళ్ళం. కింద గీత రాకుండా చూసుకునేవాళ్ళం. అలాగ మహాత్ముల విషయంలో గనక ధూషణ చేస్తే, ఒక ఎర్ర underline వచ్చేస్తుంది. ఇవన్నీ ఇలా ఉన్నాయి. ఇవి సత్యం. ఏం సందేహం లేదు. అందుకే నోరు పారేసుకోవద్దు. అభిప్రాయాల విషయంలో కూడా. ఏదీ మంచిగానీ, చెడుగానీ మనది కానిది మన దగ్గరకు రాదు, అని గుర్తుపెట్టుకొని, ఏదో చేశాం సరే. ఇహ ఇప్పుడు అనుభవించేద్దాం, అనే అంగీకారంవల్ల పరిష్కారం వస్తుంది. 'జీవితంలో వచ్చింది వచ్చినట్లు అంగీకరించావో 50 మార్కులు' అంటాడు శ్రీకృష్ణుడు. అంగీకరించి నువ్వు చేయవలసినది చేస్తుండు. ఎవర్నీ తిట్టబోకు, కొట్టబోకు, దూషించబోకు. ఎవరి గురించీ చెడు భావన పెట్టుకోవద్దు. ఇలా వస్తే accounts మనకి clear అవుతాయి. మన accounts మనం audit చేసుకుంటూండాలి. వాడూ సాక్షి! లిపికలు, చిత్రగుప్తుడూ మనలోనే వున్నారు. మనమే చూసుకుంటే పోలేదా? ఇంకోడు వచ్చి మన account గురించి తేల్చి చెప్పే దానికన్న, మనమే తల్చుకుంటే పోయె. అందుకే ఆధ్యాత్మికమార్గంలో keep an account of yourself on daily basis అని చెప్పారు. రూపాయి, అణాలకు సంబంధించింది కాదు. ప్రవర్తనకు సంబంధించిన ఒక చిట్టాపద్దు. ఆలోచనలకి, కోరికలకి, మాటలకీ, చేతలకీ సంబంధించిన పద్దు రాసుకుంటూంటే, మనం

పక్కదారులకు వెళ్తుంటే ఇంకొకళ్ళు చెప్పకుండానే మనకి తెలుస్తుంది. ఎవ్వరికీ చూపించనక్కరలేదు. అందుకే మాష్టారు diary రాసుకోమనేవారు ప్రతిరోజూ. సాధనమార్గంలో అది ముఖ్యం. ఒక కాగితం మీద రాసుకుని, వారం తర్వాత ఏం చేయాలో ఇంకో కాగితం మీద రాసుకుని పాతది కావాలంటే చింపెయ్యండి. ఎవరైనా చూస్తే బావుండదు కదా, అమ్మో వీడికిన్ని వున్నాయా లోపల? అని తెలుస్తుంది కదా. రాయడం వల్ల కొంత బయటకు విసర్జించడం అవుతుంది. అందుకని రాయడం. పెద్దలేం చెబుతారంటే ఎవరిమీదన్నా బాగా ద్వేషం వుంటే వారి గురించి కాగితం మీద బాగా బరికేస్తే కొంత లోపల నుండి బయటకు వెళ్ళిపోతుందని. లేదా నీకు ఎవరి మీద నమ్మకముందో, ఎవరు నిన్ను తర్వాత blackmail చెయ్యడని నమ్మకముందో అలాంటి వాడివద్ద చెప్పేసుకోమన్నారు. అదే confession! ఇంకోళ్ళకి చెప్పకుంటే పోతుంది బాధ, వాడి మీద ద్వేషం కొద్దీ కాదు, నాలో విపరీతంగా వుంది అది వాడికి మోసెయ్యక, అందుకు చెప్తున్నాను అని వాడికి చెప్పి, శిశుపాలుడిలా శుభ్రంగా తిట్టేసావనుకోండి చాలా మటుకు relief వస్తుంది. ఒక్కసారి అక్కసంతా కక్కేసుకున్నట్లు అయిపోతుంది. అట్లా చేసుకుంటే, మనం సాక్షిగా మనల్ని మనం బయట పెట్టుకుంటే పని సుళువు అవుతుంది. సాక్షిగా ఆయనున్నాడు. అందుకే ఎవరూలేని చోటు వుంటుందనుకోవద్దు. ఆధ్యాత్మికమార్గంలో రహస్యంగా ఇంకొకళ్ళకి తెలిస్తే బావుండని పనులు చేస్తూంటారు చూసారా, అవన్నీ ఎవరూ గుర్తించడం లేదనుకొని చేస్తున్నావా పిచ్చివాడా, నీ లోపల నుండే గుర్తిస్తున్నాడు. The witness is in you. సాక్షి నీలో వున్నాడు. ఎవరికీ తెలియకుండా నువ్వేమీ చేయలేవు. అది గుర్తుపెట్టుకో. ఎందుకొచ్చిన గోల? అందరికీ తెలిసినా ఫర్వాలేదనుకునే పనులే చెయ్యి. అదీ చెప్పింది Madam Blavatsky. సాధనమార్గంలో వుండేవాళ్ళు They should not engage in clandestine transactions ' అంటె 10 మందికి తెలిస్తే బావుండదనే పనులున్నాయో, అవి చేయకపోవడం సాధనలోని ముఖ్యమైన విషయం. చేసి తెలీదనుకున్నావో, పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగినట్లే మనకూ నడ్డిమీద పడుతుంది. అంతే మనపని. నడ్డి విరిగేట్లుగా తగుల్తాయి. అందుకని సాక్షిని మనలో మనం ఒక్కసారి ఉద్ధరించుకోవాలి, ప్రజ్వలించుకోవాలి.వెలికితీయాలి. రోజూ అరగంటైనా పెట్టుకోవాలి. వెలికి తీయాలంటే సాధన ఇది. వారానికి ఒక పూటైనా పెట్టుకో. ఎప్పటికప్పుడు మన చరిత్ర ఒకసారి చూసుకుంటే బావుంటుంది. అందులో కొన్ని చేయకూడదని తెలిసినా చేద్దామనిపిస్తుంది. అదీ తమాషా! విధి బలీయమంటే అది! అదెట్లా? దానికేం చేయాలి? మహాత్ముల వద్ద చెప్పెయ్యాలి. 'నేను ఈ విధమైన బలహీనతలో వున్నాను. కొంచెం మీరు కాపాడాలి' అని చెప్పుకోవాలి. లేదూ ప్రార్థనలో నువ్వు నమ్ముకున్న గురువుకో, దైవానికో చెప్పుకోవాలి. 'నాకిలా మనస్సులో వస్తోంది తప్పని తెలుసు నువ్వు నన్ను దాటించవా? సమస్తాన్ని దాటించగలవాడివి కదా. నేనిలాంటి ఇబ్బందిలో వున్నాను,

నన్ను దాటించు' అని కోరుతూంటే కోరికలు వుండే శుద్ధిని బట్టి నీకు బలాన్నిస్తాడు. లేకపోతే నీ మనస్సులో ఆ భావన తీసేస్తాడు. అదే కదా CVV గారు చెప్పింది. 'కోరిక బలీయంగా వుందనుకోరా నాకు చెప్పకో నేను 2 రకాలుగా తీరుస్తాను. ఒకటి ఆ కోరికని మరచిపోయేట్లుగా చేస్తాను. ఆ కోరిక రమ్మన్నా mind లోకి రాదిక అలా .మరపు కలిగిస్తాను. ఇదే సుఖం. అనుభవిస్తే గుర్తుంటుంది. రెండవది. నువ్వు అది అనుభవింపదగ్గ కోరిక అయితే నీకది పూర్తి చేసిపెడతాను' ఏ సద్గురువైనా అదే చేస్తారు. మాష్టారు CVV గారే కాదు. భౌతికంగా వున్న గురువుతో మళ్ళీ అంత సులభం కాదు. అయినా మనకొక అవకాశం కలిగించారు కదా facility! మాష్టారు గారి photoకి చెప్పకోవచ్చు. ఎదురుగా వున్నప్పుడు చెప్పకోవడానికి కొంచెం భయంగా వుంటుంది. Photo యేనా అంటే మహాత్ముల చిత్రపటం సజీవం కనక photo కి చెప్పకుంటే మంచిది. నీ భావన బట్టి photo నా, మహాత్ముల సాన్నిధ్యమా! అనేది ఆధారపడి వుంటుంది. Photo యేనా అనుకుంటే ఆయనుండరు. ఇక్కడ మాష్టారున్నరన్న భావన వుంటే వుంటారు. ఆ విధంగా చెప్పకుంటూంటే ఈ పుచ్చులు, చచ్చులూ పోతూంటాయి. సాధన ద్వారా మనలో సాక్షిని పెంచవచ్చు. లేకపోతే మనం మంచి వాళ్ళమనుకుని తిరుగుతూంటాం. ఏమీ కాదా? అనిపిస్తుంది. పైగా ఎవరన్నా కాదని చేప్తే కోపం వస్తుంది. నీ మొహం నీదేం మంచి? అన్నాడనుకోండి! కోపం రాదూ? మనం ఎంత సృష్టిధర్మం అనుసరించి నడుస్తున్నామో, లేదో చూసుకోవడానికి సాక్షిని పెంచండి. సాక్షిగా అతడే మీలో వుంటాడు. ఎవరన్నా దొంగ సాక్ష్యం చెప్పి మనల్ని ఇరికించాడనుకోండి వాడి రూపంలో, వాడే వచ్చి మనకివ్వాల్సిన పాతకర్మలు ఇచ్చాడని తెలుసుకుంటాడు సాధన మార్గంలో వుండేవాడు. క్రీస్తు గురించి కోర్టులో అడ్డమైన మాటలు మాట్లాడ్తారు. ఏం మాట్లాడడీయన! నువ్వు చెప్పాల్సింది వుందా అంటే ఏమీ లేదంటాడు. 'నువ్వేం చేయాలో తెలుసుకో' అంటాడు. అంతదూరం వెళ్ళిపోతుంది సాక్షి. కాబట్టే భూగోళంలో 80 శాతం జాతికి దేవుడై కూర్చున్నాడాయన మౌనం చేత. తన గురించి తను వాదించుకుంటే అయ్యేవాడు కాదు. తన గురించి 'వాడు' వాదించాలి. మనం వాదించుకోవడం ఏమిటే? కష్టంలో వున్నప్పుడు వాడు చూసుకోవాలి. మనం చూసుకోవటం ఏమిటే? అది మన ఆదర్శం. సరాసరి మనం అక్కడికి వెళ్ళిపోతాం అనలేం. ఎందుకంటే మన పరిస్థితి మనకి బాగా తెలుసు కాబట్టి. కానీ వాళ్ళని చదువుకుంటే మనకి ఆ స్ఫూర్తి వస్తుంది. ఏదో 10 మాటలు అంటే మనం ఆగగలం. లేకపోతే ఒక్క మాట చాలు జన్మంతా కక్ష పెట్టుకుంటాం. ఇంక సాధన ఏదీ? కక్ష సాధన తప్ప, భక్తి సాధన లేదు. ఇవన్నీ తెలుసుకుంటూ సాక్షిని పెంచండి. ఇవన్నీ తెలియని విషయాలు కాదు. అయితే ఇలా గుర్తు చేసుకుంటూ ఉంటే బండిని loop line నుండి main line కి ఈడ్చుకుంటూండడానికి ఉపయోగ పడ్తుంది. ఇలా వింటూ, చెప్పకూంటూ

చేసుకుంటూ ఉంటే దాదాపు బండి main line లోనే నడుస్తూంటుంది. ఆ విధంగా ముందుకు వెళ్దాం.

## 535 ముకుందః

ముకుందుడు అంటే అప్పటికపుడు అనుభూతినిచ్చేవాడు. మీ ప్రక్కనే వుంటాడు ముకుందుడు. 'హే కృష్ణా ముకుందా మురారి' అని పాడుకుంటాం కదా. Immanent God అంటే పిలిస్తే పలికేంత పక్కన వుంటాడండీ. గట్టిగా పైకి పిలవనక్కర్లేదు? రహస్యంగా పిలిచినా, ఏమిట్రా? అని అడిగేంత దగ్గరలో వుంటాడుట భగవంతుడు. ఉండబట్టే కదా భీష్ముడు తల్చుకోగానే అక్కడెక్కడో హస్తినలో వున్న శ్రీకృష్ణుడు వచ్చి సాన్నిధ్యమిచ్చాడు? ముకుందుడు అంటే ఆయన! ఎక్కడో అరణ్యంలో ద్రౌపది ఇబ్బంది పడుతూ 'కృష్ణా' అంటే, అక్కడ మెరుపు తీగల్లే ప్రత్యక్షం అయ్యాడు. ఎవరయ్యాడండీ అట్లా? మనకున్న భూమి చరిత్రలో అలా అయిన వాడున్నాడా? 'వీళ్ళంతా నన్ను అవమానం చేస్తున్నారు నాయనా' అని పిలిస్తే, అక్కడ ఎక్కడో యుద్ధం చేస్తూ కూడా ఇక్కడ రక్షణ ఇచ్చాడు. అలాగే దుర్వాసుడు గొడవ చేస్తున్నాడని పిలిస్తే, వచ్చేసాడు. అంపశయ్య మీదున్న భీష్ముడు 'నేను వెళ్ళిపోతాను, నాకు permission ఇచ్చెయ్' అని అడుగుతాడు. ఎందుకంటే ఈయన వద్దకే ఆయన వెళ్ళవలసినది. నీ ఇంటికి రావాలంటే నీ permission కావాలి కదా. అందుకని 'నువ్వు అనుమతిస్తే నేను నీ దగ్గరకు వచ్చేస్తానంటే' నా వద్దకు రావడం కాదు. ముందు నేను నీ వద్దకు వస్తాను' అని వచ్చేసాడు. వాడూ ముకుందుడు! పిలిస్తే పలుకుతాడండీ! అంత పక్కన వుంటాడు. అంత సన్నిహితంగా వుంటాడు. నీలో నువ్వుగా వుంటాడు. కాబట్టే పలుకుతాడు పిలిస్తే! ఇది భగవంతుని తత్వం లో అద్భుతమైన తత్వం

అక్కరకురాని చుట్టము,
మ్రొక్కిన వరమీని వేల్పు, మోహరమున తా
నెక్కిన పారని గుర్రము,
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ

అవసరానికి పనికి వచ్చినవారే చుట్టమనుకోవాలి. 'మ్రొక్కిన వరమీయని వేల్పు'. మంచి యుద్ధంట, కర్ర వుందిట, గుర్రం ఎక్కాట్ట, కానీ గుర్రం కదలదుట, మరిక అది దేనికీ? గుర్రము పరుగెత్తదట. ఇక ఆ గుర్రం ఎందుకండీ? పిలిస్తే పలకని భగవంతుడు వీరందరినీ వెంఠనే వదిలెయ్ సుమతీ అన్నాడు. అంటే మంచి బుద్ధి వుంటే ఆ పని చెయ్ సుఖపడ్తావ్, అని చెప్పారు. ఇక్కడ భగవత్తత్త్వం చూస్తే పిలిస్తే పలికేట్లుగా వుంటుంది. అంతకన్నా మించిన స్నేహితుడు కానీ, చుట్టం గానీ, దేవతగానీ లేరు అని చెప్పడానికి 'ముకుంద'! నువ్వు పిలిస్తే పలుకుతాడు. ఉన్నాడనుకుంటే ఉన్నాడక్కడ. నీవు ఉంటాడు అనుకోవు కాబట్టి లేడు. ఎక్కడో ఉన్నాడనుకుంటే ఎక్కడో వుంటాడు. నీ భావన బట్టి ఎక్కడో వుంటే, నీ భావన బట్టే నీ ప్రక్కనే వుంటాడు. ఒక్కడివే వెళ్తున్నావా అని అడిగితే,

ఒక్కడుగా ఎప్పుడూ ఎవరూ వెళ్ళరు! తెలిసినవాడు ఒక్కడూ వెళ్ళడం వుండదు. ఒక్కడుగా వున్నా భయం వుండదు. ఒక్కడుగా వున్నది ఒక్కడే! వాడితోపాటు ఉన్నాను అనుకుంటే, శంఖం, చక్రం, గద, పద్మం, వేణువు నీతో వుంటాయి. కానీ ఆ భావన రాదే? వస్తే వున్నది. లేకపోతే లేదు. నీ భావం చేత నీ చుట్టూ కనిపిస్తాడు. నీవు ఉన్నాడనుకుంటే నీ కుడి భుజం మీద నీకు చక్రం దర్శనం అవుతుంది. ఎడమ భుజంమీద శంఖం దర్శనం అవుతుంది. భుజకీర్తులు వున్నాయనుకుంటే వున్నాయండీ. అంతేకాదు కాలంలో ఏ అపాయము రాకుండా, నీ వెనుక పడగవలె ఆదిశేషువుంటాడు. ఆ symbol అలా ధ్యానం చేసుకోవాలి. నువ్వు నిలబడి వుంటే నీ కుడి భుజం వైపు సుదర్శనచక్రం- చక్కని దృష్టికి, నీ ఎడం భుజం వైపు శంఖం- చక్కని వినికిడికి, నీ వెనకాల పడగవలె ఆదిశేషువు, నీ హృదయంలో లక్ష్మి, ఒక చేతిలో గద, ఇంకొక చేతిలో పద్మం అంటే వికసించిన హృదయం, ఇవన్నీ కాక వేణువు నీతో వుంటాయి. నువ్వు భావన చేసుకో చాలా బావుంటుంది. కృష్ణుడితో కలసి నడవచ్చు లేదా విష్ణువుతో కలసి నడవచ్చు. నువ్వనుకున్న గురువుతో కలసి నడవచ్చు. కేవలం నీలో ఆ భావన స్థిరపడితే చాలు. అనుమానం వచ్చిందా వెళ్ళిపోతాడు. మనం నడచి వెళ్తుంటే మనతో మనం నమ్మిన గురువో, దైవమో నడచివస్తున్నాడని గుర్తున్న వాడికది సత్యం. మాష్టారు Diary రాసుకున్నపుడు 'ఈరోజు మాష్టారు సూర్యారావుగారి ఇంటికి వెళ్ళారు' అని రాసుకున్నారు తప్ప, నేను వెళ్ళాను అని రాసుకోలేదు. ఎందుకనీ? తనతోపాటు ఆయన తనయందున్నారనే భావన స్థిరపడ్డది కాబట్టి. ఒట్టి తనువొక్కటే వెళ్తే ఏం లాభం? తనువు కాకుండా, తనువుకు స్వామి అయిన వెళ్తున్నట్లు. అందుకని 'నేను ఎవరింట్లో అడుగుపెడితే వాళ్ళని మాష్టారు అనుగ్రహించినట్లు, నే నెవరితో మాట్లాడితే వారిని మాష్టారు అనుగ్రహించినట్లు' అని చెప్పారు. కారణమేమిటో తాను మాష్టారుగారితో విడివడని స్థితిలో వుండడం చేత! అది ఆయనకు ఎంత సత్యమో, మనకి కూడ భావన చేత అంత సత్యం! అందుకని భావనలో ఎప్పుడూ వెంట వున్నాడనుకుంటే తోడుగా ఉంటాడండీ. భావనలో లేకపోతే పక్కనే, పక్కలో వున్నా కూడా లాభం లేదు. రథంలోనే వున్నాడు కదా? భావంలో గుర్తులేనప్పుడు అర్జునుడికి కృష్ణుడు ఏం ఉపయోగపడ్డాడూ? ఏమీ ఉపయోగపడలేదు. భావంలో 'హే కేశవ్', అంటే 'ఆ ఏంట్రా?' అన్నాడు. మనకీ అంతే! లోపల వున్నాడు. గుర్తొస్తే వున్నాడు. గుర్తురాకపోతే పడుకుని వుంటాడండీ. అక్కడే వున్నాడు. నీకు అత్యంత సన్నిహితుడెవరయ్యా అంటే వాడే అని చెప్పడానికి 'ముకుంద' అనే నామం ఇచ్చారు. ఎవరా అని అటు ఇటు చూడబోక. వాడి ప్రక్కన చూడు. వాడికన్నా స్నేహితుడు లేడు. అదే మైత్రేయనామంలో అర్థం. మిత్రత్వం! భగవంతునితో పరిపూర్ణమైన మిత్రత్వం ఏర్పడితే మైత్రేయుడవుతారు. మీ friend ఎవరంటే అప్పారావు, ఎల్లయ్య, పుల్లయ్య అని చెప్పాద్దు. ఆ స్నేహితుడి రూపంలో వున్నవాడు భగవంతుడే! సన్నిహితుడే స్నేహితుడు! అందరికన్నా సన్నిహితుడు ఎవరూ?

వాడూ! భార్యాభర్తల కన్నా సన్నిహితుడు వాడు. ఎప్పుడూ నీలో నిన్ను అంటి పెట్టుకున్నవాడు కదా. నిన్ను వదలక, నీ ప్రాణప్రవృత్తిని నడిపిస్తున్న వాడు, నిద్రలోకి తీసుకువెళ్ళేవాడు, నిద్ర లేపేవాడు, నీకు భావములు కలిగించేవాడు, నువ్వు అడ్డమైనవి తింటే అరిగించేవాడు, వాడి కన్నా సన్నిహితుడెవరూ? వాడు లేకపోతే మనం లేము కదా. వాడు లేకపోతే మనం నిద్ర లేవలేము. ఇహ లేరండీ, అని చెప్పి పంపేస్తారు. వాడు లేకపోతే నిద్రపోలేము. లేవలేనివాడు నిద్రేం పోతాడు? వాడు లేకపోతే ప్రాణప్రవృత్తులు పనిచేయవు. ఉచ్ఛ్వాస, నిశ్వాసలుండవు. వాడు లేకపోతే అరగదు. వాడు కొంచెం లేకపోతేనే మనకి అరక్కపోవడం. ఇలా రకరకాలుగా వాడు నీకంత సన్నిహితుడిగా వుండి అడ్డమైన చాకిరీ చేస్తుంటే, వాడికన్నా ఎవరండీ ముఖ్యం? వాడెక్కడో ఉన్నాడా? తప్పకదూ? నీలో వాడుండబట్టి కదా నువ్వు చూస్తున్నావ్? వాడుండబట్టి కదా మాట్లాడుతున్నావ్? సమస్తమూ వాడుండబట్టేకదా జరుగుతున్నాయి. నీలో కూడా వాడే వున్నాడు. అది చివరి రహస్యం! ఇంత ఉన్న వాడి గురించి ఎక్కడో వెతుకుతావేంటి? అందుకని భీష్ముడు తన లోపల తల్చుకుంటె ఆయన వచ్చేసాడండీ. కాబట్టే 'ముకుంద' అని నామం పెట్టాడు కృష్ణుడుకి. ఎందుకనీ? చాలాసార్లు చూపించాడు ఆయన ముకుందత్వం! ఎంత సన్నిహితుడో అంత దూరంగా కూడా వుంటాడు మన భావనలో. అందుకని దేవుడు దూరంగా ఉంటాడా, దగ్గరగా వుంటాడా అన్నది మీ భావన బట్టి వుంటుంది. ఒక్కో నామంలోనూ ఇంత లోతులున్నాయి. 'తక్కువేమీ మనకు రాముండొక్కడుండు వరకూ' అన్నాడుగా అయన. ప్రక్కన వాడుంటే కానిదేముందీ? బాధ ఏమున్నదీ? ఏం జరిగినా అసలు వాడున్నాడనుకుంటే పని చాలా సులభం అవుతుంది. ఇది ముకుంద నామానికి కొంత వివరణ.

## 536 అమితవిక్రమః

మితి లేని విక్రమం కలిగినవాడు. భక్తుడు కూడా అంతే! భగవంతుడు భక్తుడి రూపంలో వుంటాడంటారు కదా. భగవంతునితో భావపరంగా అనుసంధానం చేసుకున్నవాడు భక్తుడు. భావనలో వాడితో ఎప్పుడూ విడవకుండా వుంటాడు. అట్లా వుంటే భక్తుడు. అలా కాని వాడు భక్తుడు కాడు. అలా వున్నవాడు, అంటే భగవంతునితో విడివడని వాడిద్వారా భగవంతుని శక్తిసామర్థ్యాలు పనిచేస్తూంటాయి. అందుకని భగవద్భక్తుడు కూడా అమితవిక్రముడు. పోతనామాత్యుడ్ని ఏం చేయలేకపోయారు. 'ఏదో బ్రాహ్మడూ, బెదిరిస్తే పుస్తకం మనపేర పెట్టేస్తారనుకున్నారు'. కుదరదు. ఎందుకంటే వాడిచుట్టూ ఇంత అల్లిక ఉంటుంది. అంబరీషుడు, ప్రహ్లాదుడు, నారదుడు, శుకుడు, వ్యాసుడు, గోపికలు వీరందరి వద్దా మితిలేనంత సామర్థ్యం ఉన్నది. ఎక్కడ నుండి వచ్చిందయ్యా అంటే అక్కడ నుండి. ఎందుకొచ్చిందయ్యాంటే వాడితో అతుక్కుపోయి ఉన్నారు కాబట్టి. ఎంత వాడితో అతుక్కుపోతే అంత యోగి అండీ! మిగతా వాటితో అతుక్కుపోతే పీక్కుంటూ ఉండాలి. అక్కడ అతికించేస్తే ఇంకేమీ ఉండదు. అబ్బా-- ఇన్నిన్ని పనులు ఎలా చేస్తున్నారనుకునే మహత్తర కార్యాలు చేసే మహాత్ములను చూడమూ? ఒక మనిషి వల్ల ఇది సాధ్యమా అనిపించే పనులు చేసిన మహత్ములున్నారు. వారిలో నుండి వీడే పనిచేస్తున్నాడు. వాడి అమితవిక్రమం అంతా ఈ భక్తుడి నుండి వ్యక్తం అవుతూ ఉంటుంది. ఎన్ని రకాల దివ్యాస్త్రాలు వేసినా కమండలం అడ్డు పెడతాడు వశిష్ఠుడు ఓ మంత్రదండంలాగ. సమస్తానికి అదే solution! అది చూసి ఆశ్చర్యపోతాడు విశ్వామిత్రుడు ఏమిటిదని. ఏమిటిదంటే వశిష్ఠుడు ఎప్పుడూ అక్కడ వసించి ఉంటాడు. ఇంకొకటి లేదాయనకు. 12 సూర్యమండలాలకు ఆయన గురువు. సామాన్యం కాదు. అందుకని ఆయన్ని, ఆయన భార్య అరుంధతిని చూపిస్తారు పెళ్ళపుడు చూడండని. వశిష్ఠత్వం ఏర్పడాలి. అనుస్యూతం ఈ భావనలో ఉండడం సిద్ధిస్తే, మితిలేనంత సామర్థ్యాలు నీవు కోరకయే నీయందు ఏర్పడతాయి. అందుకోసం సిద్ధులు, తంత్రాలు, మంత్రాలు పోగేసుకోనక్కర్లేదు యోగికి. ప్రత్యేకించి ఆ విద్యలూ, ఈ విద్యలూ నేర్చుకోనక్కర్లేదు. వాడిలో ఉండడముచేత సమస్త విద్యలూ తనలో భాసిస్తాయి. చదువుకుని నేర్చుకుంటే నీ బుర్రకందినంత మాత్రమే! వాడిలో ఉంటే మేధస్సుకు కూడా మితి ఉండదు. అమితంగా నువ్వు పెరగాలంటే వాడ్నే పట్టుకో. అదేకదా వినాయకుడు చేశాడు. వినాయకుని శక్తిసామర్థ్యములు, కుమారస్వామి శక్తిసామర్థ్యములు ఏమిటని మనకి తెలిసినవే కదా. వినాయకుడు అరిచి గీపెట్టినా ఆ తత్త్వం నుండి బయటకు రాడు. భగవత్ సాన్నిధ్యం నుండి బయటకు రాడు. ఇదీ ఈయన సామర్థ్యము. కుమారస్వామిని మించిన శక్తిసామర్థ్యములు కలవారు సృష్టిలో లేరు. పుట్టీపుట్టగానే తారకాసురుడ్ని

సంహరించినవాడు. దేవతలకు వశంకాని విషయం తారకాసురవధ! మరి ఎంత శక్తిమంతుడూ? ఎంత వేగంగా తిరుగుతాడూ? ఎంత పరాక్రమవంతుడూ? ఎంత విక్రమిస్తాడూ? అలాంటి వానికి గురువై కూర్చున్నాడు కదా. దేనికీ? కేవలం ఒక్క విషయం వల్ల! ఏమిటదీ? సమస్తమునందూ భగవంతుని దర్శనం చేస్తాడు! తద్వారా 'కుమార గురవే నమః' అనిపించుకున్నాడు కదా.. కుమారస్వామికి నువ్వు గురువు! శిష్యుడిపేర గురువుగారికి అలా title/ నామం ఎక్కడన్నా వచ్చిందా? రాదు. CVV గార్ని గురించి చెప్పినపుడు, EK గారి గురువుగారని ఒక నామం చెప్పం కదా. ఫలానా వారు, ఫలానావారి గురువు సుమా, అంటే శిష్యుడెంతటి వాడో చూడూ, ఆయనకే గురువని చెప్పడం! చూడ్డానికి అట్లా చలిమిడి ముద్దలా కనిపిస్తాడు తప్ప, అంతటి కుమారస్వామి ఎందుకూ పనికిరాడు వినాయకుడి ముందు. కారణం యోగస్థితి! కాబట్టి యోగానికి కూడా గణపతి చాలా ముఖ్యం. యోగం చేసేవారు ముందు అందుకే గణపతిని ప్రార్థన చేసుకుంటారు. 'దత్తస్వయోగా ధధ యోగనాథః పాయాద్గణేశః కపిలః కర్మబంధనాత్' దత్తాత్రేయుడూ, కపిలుడు, గణపతి వీరందరూ కావాలి. అమితమైన విక్రమం. అంటే కావాలనుకునేవన్నీ they get fulfilled, పరిపూర్ణంగా నిండుతాయి. ఏం చెయ్యాలీ వాడితో ఉండాలి. వాడదే! వాడూ చేయలేని పనిలేదు. కృష్ణుడిగా వాడుగా దిగివచ్చి చేయలేని పనిలేదని నిరూపించి వెళ్ళిపోయాడు. చిటికెనవ్రేలుతో కొండనెత్తడం దగ్గర నుండీ, సూర్యుడు అస్తమించినట్లుగా గోచరింపచేసీ, పోయిన ప్రాణాలని ఎక్కడెక్కడో తిరిగీ తీసుకొచ్చి ఇచ్చీ-- ఇవన్నీ అమితవిక్రమ కి ఉదాహరణలు. ఇంకే అవతారంలోనూ ఇదిక కనిపించదు. అందుకని కృష్ణుడికా నామం సార్థకమైంది. భగవంతుడు అమిత విక్రముడే! రూపుదాల్చి వచ్చి కూడా తను చూపించాడు.

## 537 అంభోనిధిః

అంభోనిధి అంటే 'సముద్రం' అని ఒక అవగాహన. అంభోనిధి అంటే 'నీటికి నిలయం' అని అర్థం. జలాశయమని అర్థం. నిధి అంటే reservoir కదా. అంబఃు అంటే నీరు. మనకు తెలిసిన నీరు బాగా ఎక్కువగా ఉన్నది సముద్రం. కానీ ఈ సముద్రం ఒకటే కాదు. ఇటువంటి సముద్రాలు చాలా ఉన్నాయి. ఉప్ప సముద్రం, చెరుకు సముద్రం, వరుసగా ఇట్లా 7 సముద్రాలు ఉన్నాయి. ఆరవ అధ్యాయం భగవద్గీత EK గారు రాసిన వివరణం, 13వ భాగం భాగవతంలో చదువుకుంటే ఏ సముద్రాలు ఉన్నాయో తెలుస్తాయి. ఇన్ని సముద్రాలు కలిపి ఒక సముద్రం అన్నారు. దాన్ని 'మహోదధి' అంటారు. ఈ సముద్రాలన్నీ ఏమిటి? నీరా? అంటే భౌతికంగా చూస్తే నీరు లాగా కనిపిస్తుంది. ఆకాశంలోకి చూస్తే నీలంగా కనిపిస్తుంది. అది కూడా నీరే లేక ఇది కూడా ఆకాశమే! ఈ అవగాహన చాలా విశిష్టమైన, విశేషమైన ఒక అవగాహన. నీరు అంటే ప్రజ్ఞ అని అర్థం. అది రకరకాలుగా లోకంలో ఒక్కొక్కలాగా గోచరిస్తూ ఉంటుంది. అది తెలియాలంటే మనం రామాయణంలో ఇవ్వబడ్డ గంగావతరణం చదువుకోవాలి. గం అంటే గమనము, గం అంటే గమనము. రెండు గమనములకు ఆధార భూతమైన చైతన్య స్థానము మధ్యలో ఉండే అనుస్వారము లేక పూర్ణము. కాబట్టి మొత్తం ఈ నీటి యొక్క నడత అంతా కూడా ఆకాశాన్నించి భూమ్మీదకు, భూమ్మీద నుండి మళ్ళీ ఆకాశంలోకి! మనభూమి చుట్టూ ఉండే ఆకాశమే అనుకోకండి. సృష్టి మొత్తం అంతా కూడా ఒకపక్క దిగిరావడం గానూ, ఒకపక్క ఎక్కివెళ్ళడం గాను చైతన్యం యొక్క ప్రవాహం లేక ప్రజ్ఞా ప్రవాహం ఉంటుంది. ఈ మొత్తం ప్రజ్ఞా ప్రవాహంలో గోళాలు తేలుతూ ఉంటాయి. గోళాల మీద ఈ జీవులు. ఈ గోళాలు తేలే ఆకాశం ఏది కనిపిస్తుందో అది సముద్రం అంటే. దానికి భౌతికమైన చిహ్నం మనం చూస్తున్న సముద్రం. మొట్టమొదట మథనం చేసినప్పుడు ఆ సముద్రం ఎక్కడుంది? క్షీరసాగర మథనం అన్నాం కదా. కేవలం వెలుగు సముద్రమే అది! ఆకాశం తన నుండి సంకల్పంగా వ్యక్తం అవగానే అది వెలుగుతో కూడిన ఒక పెద్ద చోటుగా ఏర్పడుతుంది. అవ్యక్తమైన తత్త్వంలోంచి ఒక సంకల్పం వెలువడితే అది ఒక పెద్ద చోటుగా వ్యక్తం అవుతుంది. ఆ వెలుగును చిలకడమే పాలసముద్రాన్ని చిలకడం. వెలుగును చిలికి ఇవన్నీ తయారు చేశారన్నమాట. అదేవిధంగా అంటే ఈ మొత్తం అన్నిటికీ కూడా ఆధార భూతమైన చోటేదైతే ఉందో అది కూడా గుర్తు రావాలి సముద్రం అంటే. అది ఈ కనబడుతున్న సముద్రానికి అసలు రూపం. మనం, ఈ కనబడుతున్న వాళ్ళం, ఈ రూపం మనదంటానికి వీలు లేదు కదా. నిజస్వరూపం ఒకటుంటుంది కదా మనకి. అలా మనమెరిగిన సముద్రానికి నిజస్వరూపం ఏమిటయ్యా అంటే చోటు. చోటులో ఉన్న విద్యుత్తే నీటిలో కూడా ఉంది. నీరేమో భౌతికమైన విద్యుత్తు. చోటేమో

అవ్యక్తమైన, మనకి కనబడని విద్యుత్తు. ఆయన 'అది'!' సృష్టిలో ఆయన ఏమిటయ్యా అంటే చోటుగా ఉన్న సముద్రం. సముద్రం అనడానికి అనంతమైనది, మహత్తరమైంది, ఎల్లలు లేనిది, పరిమితులు లేనిది అని ఇటువంటి భావాలు చాలా ఉంటాయి. అంతేకాకుండా తరంగాలు తరంగాలుగా సముద్రంలో మనకి అలలు గోచరిస్తూ ఉంటాయి. అలాగే చోటులో కూడా తరంగాలు ఉన్నాయి. చోటులో ఉండే తరంగాలని గంధర్వులు అన్నారు. సముద్రంలో ఉండే తరంగాలను అలలు అన్నాం. ఒక్కొక్క తరంగంలోంచి ఒక్కొక్క సృష్టి పుడుతుంది. చోటులో ఉండే ఒక తరంగంలోంచి ఒక సృష్టి పుడుతుంది. దాని బట్టి ఒక సృష్టి అనేది మొత్తం భగవత్ తత్త్వంలో ఒక చిన్న భాగమై ఉంటుంది. అందుకని అంభోనిధి అంటే సముద్రం. సముద్రం వాడే అని అనుకోవడం ఒక పద్ధతి. కానీ ఒక సముద్రమేనా? అసలు సముద్రం అంటే 'స' 'ముద్ర'. ముద్రలతో కూడినది. ముద్రలను అందుకునేది. ఎక్కడి నుండి? అంతకు పైస్థితి నుండి! అందులోంచి సమస్తమైనవి పుట్టుకొస్తూ ఉంటాయి. మనలో ఈ సముద్రం ఎక్కడ ఉంది? మనం మేల్కాంచినప్పుడు మనం ఉండే స్థితినే సముద్రం అంటాం. చైతన్యపు స్థితి అన్నమాట. దాన్ని అధిష్టించి ఆయన ఉంటాడు. అందుకనే చివరిలో 'మహోదధిశయఃి' అని ఇంకో నామం ఇదే శ్లోకంలో చెప్పారు. మనం మేల్కాంచినప్పుడు, మేల్కాంచక ముందు కూడా ఉన్నాం కదా. మేల్కాంచక ముందు ఉన్న ప్రజ్ఞ, మేల్కాంచిన తరువాత, మేల్కాంచిన దాన్ని అధిష్టించి ఉంటుంది. దానిమీద శయనించి ఉంటుంది అని కూడా చెప్పవచ్చు. అది మనలో నారాయణ లోకం అంటారు. మేల్కాంచిన స్థితి 'పరాశక్తి' అని చెప్పవచ్చు. మొత్తం చైతన్యంలోంచి నేనున్నాను అనే భావన రాంగానే ఒక తరంగంగా, ఒక అలగా మనం బయటికొస్తూ ఉంటాం. మనం సముద్రం వద్దకి వెళ్ళినప్పుడు అదేదో బంగాళాఖాతం అనుకోకుండా అనంతమైన తత్త్వం యొక్క ప్రతిరూపంగా మనకది కనిపిస్తోందని భావన చేయాలి. అలా భావన చేస్తే సముద్రం దగ్గరికి వెళ్తే మనలని మనం మరచిపోయే స్థితి ఒకటి వస్తుంది. కేవలం దాని యొక్క అపరిమితమైన రూపం చేతే మనం చాలా చిన్నవాళ్ళమైపోతాం. మన్ని మనం మర్చిపోయి అలా ఆ ఆకాశం, ఈ నీరు కలిసిన చోటు చూస్తూ ఉంటే దాదాపు ఒకటిగానే ఉంటాయి. రెండూ నీలంగానే ఉంటాయి. ఎక్కువ తేడా ఉన్నట్టు కనిపించదు. అట్లా మనకు సూక్ష్మము, స్థూలమునకు మధ్య చాలా తక్కువ విభేదం ఉన్నది, మనం ఊహించుకోవటం వల్ల ఎక్కువ కనిపిస్తుంది అని కూడా తెలుస్తుంది. ఈ భావాలన్నీ మనకి సముద్రానికి సంబంధించినవి. మన వరకు భగవంతుడుపరంగా ఏమిటయ్యా అంటే ఈ మొత్తం సృష్టి చోటంతా కూడా ఆయనే! సృష్టి ఒకటే కాదు ఇటువంటి సృష్టులు చాలా ఉన్నాయి. ఒకదాని తరువాత ఒకటి, ఒకదాని తరువాత ఒకటి, మనకి పురాణాల్లో చెప్తారు. ఒకసారి త్రిమూర్తులందరూ కలిసి ఎప్పుడూ మనం పని చేస్తూనే ఉన్నాం కదా కాసేపు weekend సెలవులు తీసుకుని అట్లా వెళ్ళొద్దాం అని ముగ్గురూ కలిసి బయలుదేరి

వెళుతూ ఉంటే ఇంకో బ్రహ్మ కనిపించాడట ఈ ముగ్గురికీనూ. అప్పుడు విష్ణువు, రుద్రుడు 'ఒరేయ్ ఇంకోడున్నాడురా నువ్వొక్కడివే కాదు, నువ్వొక్కడివే అనుకుంటున్నావు ఇంతకాలం' అన్నారుట. ఇంకొంచెం దూరం వెళ్ళేసరికి ఇంకో విష్ణువు కనిపించాడట. అలాగే ఇంకో రుద్రుడు కనిపించాడట. అట్లా వెళుతున్న కొద్దీ కనిపిస్తూనే ఉన్నారుటండీ. భయం వేసింది వాళ్ళకి. ఈ కథ తమాషాగా మనవాళ్ళు Poetic గా చెప్తారు. ఏదో వాళ్ళకి ఆరేడు జతలు త్రిమూర్తులు కనిపించగానే భయం వేసి, ఎందుకైనా మంచిది మనం వెళ్ళి మన కుర్చీలో మనం కూర్చోకపోతే ఈ లోపల ఇంకెవరన్నా వచ్చి కూర్చుంటారేమో, ఎంతమంది ఉన్నారో మనకు తెలియట్లేదు అనుకున్నారుట. ఇలా అని మనకి పురాణాల్లో ఇచ్చారు. ఎందుకిచ్చారంటే ఒకటే సృష్టి అనుకోబోక అని. ముందు ఒకటే భూగోళం అనుకున్న వాళ్ళం, ఒకటే సూర్య మండలం అనుకున్న వాళ్ళం, చాలా సూర్య మండలాలు ఉన్నాయనీ, వాటన్నిటికీ కేంద్రంగా సవితృ మండలం ఉందనీ, వాటన్నిటికీ కేంద్రంగా భర్గోదేవ మండలం ఉందనీ, అదంతా ఒక సృష్టి అనుకుంటే, ఒక హిరణ్య గర్భం అనుకుంటే, అటువంటివి బోల్డు ఉన్నాయనీ, వాటన్నిటినీ అధిష్టించి ఈ వెలుగు ఉన్నదనీ, ఆ వెలుగును అధిష్టించి అవ్యక్తమైన తత్త్వం ఉందనీ ఇట్లా చెప్పారు మనవాళ్ళు. అందుకని ఇందులో కొన్ని ముందు మొదలుపెట్టినవి ఉంటాయి. కొన్ని తరువాత మొదలుపెట్టినవి ఉన్నాయి. కొన్ని అయిపోతూ ఉంటాయి. కొన్ని పుట్టుకొస్తూ ఉంటాయి. కొన్ని కొన్ని ఆలోచనలు అయిపోతూ ఉంటే కొన్ని కొన్ని ఆలోచనలు పుట్టుకు రాట్లేదండీ! ఒక్కొక్క ఆలోచన ఒక్కొక్క సృష్టేగా మనలోంచి? చిన్నా పొన్నా సృష్టా? కొన్ని కొన్ని చిన్నవే అయిపోతాయి తొందరగా. ఏదో పెన్ను కొనుక్కుందాం, బజారు కెళ్ళాం, తెచ్చుకున్నాం, వచ్చేశాం అయిపోయింది. మంచి వాచీ కొనుక్కుందాం, ఇంకొంచెం ఎక్కువ time పడుతుంది. దానికోసం సంపాయించాలి, అది కొనుక్కోవాలి. కొనుక్కున్న తర్వాత మర్చిపోతాం. ఇల్లు కట్టుకుందాం, జన్మంతా పట్టచ్చు. పెళ్ళి చేసుకుందాం, పెద్ద కార్యక్రమం. ఇట్లా చిన్నచిన్న సృష్టులు, పెద్ద పెద్ద సృష్టులు ఒకదాని తరువాత ఒకటి వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి. ఈ వచ్చి వెళ్ళిపోయేవి అన్నీ కూడా ఎందులో జరుగుతున్నాయో దాన్ని మనము 'అంభోనిధి' అనాలి. తరంగాలు తరంగాలుగా, అలలు అలలుగా ఎన్నో వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి. మనలో కూడా మన వరకు ఎన్ని ఆలోచనలు వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి కదా. కొన్ని మన్ని పట్టికెళ్ళిపోతూ ఉంటాయి. సముద్రం ఒడ్డున నిలబడి అలలు బాగున్నాయని అలలలో దిగితే, లోపలికి పట్టుకుపోతుంది కదా. అట్లా ఆలోచనలు మన్ని పట్టుకుపోయి కొన్ని పనులు చేయించేసి, ఆ తరువాత పీల్చి పిప్పిచేసి, ఒడ్డున పారేస్తూ ఉంటాయి కదా. ఈసురోమంటూ వస్తాం కదా ఒకరోజు office నుండి. ఊళ్లోకెళ్ళిన వాళ్ళం ఒకరోజు చాలా పీల్చేసిన మామిడిపండల్లే వచ్చేస్తాం ఇంటికి. లేకపోతే పిండేసిన బత్తాయి పండో, కమలా పండో లాగా వచ్చేస్తాం. ఏమిట్రా ఏమైందంటే మన ఆలోచన మన్నట్లా పిండేసి చివరికి ఇట్లా

పారేసిందని. ఇంక ఆ పూటకి ఏ ఆలోచన లేదు. పడుకోవడమే! మళ్ళీ ఆలోచనలు వస్తాయి కదా. ప్రతీ ఆలోచన మనలోంచి ఒక సృష్టికి దారితీస్తుంది గుర్తుపెట్టుకోండి. ఎన్ని ఆలోచనలు వచ్చినాయండీ మనకి? ఎన్ని వస్తున్నాయి? ఎన్ని వస్తాయి? ఇవన్నీ మనలోంచి ఎక్కడి నుండి వస్తున్నాయి? అది మనలో ఉండే 'అంభోనిధి'. మహా సముద్రం. ఇది తేలేనా పెట్టేనా? పోయేంత వరకు ఉంటాయి కదా. పోయింతర్వాత ఉండవని చెప్పడానికి వీలు లేదు. ఉన్నాయి కాబట్టి మళ్ళీ పుట్టుకొస్తాం. వీటన్నిటికీ మూలస్థానం అనేది ఏదైతే ఉందో దాన్ని 'గాయత్రి' అన్నారు. దాన్నే 'వెలుగు' అన్నారు. అందులోంచి ఇవి పుట్టుకొస్తూ ఉన్నాయి. ఆ పుట్టుకొస్తున్న ఆ వెలుగు తత్త్వాన్ని ఇక్కడ మనకి 'అంభోనిధి' అని చెప్పారు. పెద్ద పెద్ద గోళాలు గోళాలుగా, సృష్టులు సృష్టులుగా పుట్టుకొస్తున్న దగ్గర నుండి, గోళాలు గోళాలుగా పుట్టుకొస్తూ, అక్కడి నుండి జీవుల్లో మళ్ళీ పుట్టుకు రావడం. చీమల్లో పుట్టుకొస్తున్నాయి కదా. బెల్లం ముక్క కనపడిందనుకోండి ఓ మూల ఇంక దానికదే activity. ముందు చూస్తుంది. కొంచెం రుచి చూస్తుంది. వాసనొస్తే ఇంక దానికి పిచ్చి, వెర్రెక్కుతుంది. ఎక్కి పోలోమని అందరినీ పోగేసుకొస్తుంది. పోగేసుకొచ్చి line కడుతుంది. Line కట్టి ఆ ముక్కలని నెత్తిన పెట్టుకుంటాయి. పెట్టుకుని నెమ్మదిగా పట్టుకుపోతూ ఉంటాయి. మధ్యలో ఎవరన్నా అడ్డొచ్చి ఏదన్నా చేస్తే మళ్ళీ విడిపోతాయి. కానీ బెల్లం వల్ల వచ్చిన భావన ఇంకా ఉంటుంది కాబట్టి మళ్ళీ వస్తూ ఉంటాయి. మళ్ళీ అవి మోసుకుపోతూ ఉంటాయి. తేనెటీగకి అంతే activity. వీటన్నిటిలోంచి అదే పని చేస్తోంది. ఈ అంభోనిధే! వదల్దు. ఎందుకు వదల్దు అంటే అసలు మొత్తంలో ఏం ఉందో జీవుల్లో కూడా అదే ఉంది కాబట్టి, వాడి దగ్గర లేంది మన దగ్గర ఉండదు కాబట్టి, ఇంత activity మనకి. కాకపోతే వాడికి మనకి ఓ తేడా ఉంది. ఇంకో నామం కొంచెం దాటి, ఒకటి దాటి అవతలికి వెళితే, అనంతాత్మా దాటి అవతలికెళితే 'మహోదధిశయః' ఇహ దానిలో తేలుతూ ఉంటాడుట. మనం మునుగుతూ ఉంటాంట. తేడా అదొక్కటే. ఆయన వరకు ఇవన్నీ క్రీడాప్రాయంగా జరుగుతూ ఉంటాయి. దానిమీద తేలుతూ ఉంటాడాయన. మనం వీటిలో మునుగుతూ లేస్తూ, మునుగుతూ లేస్తూ, మునుగుతూ లేస్తూ ఉంటాం. అంతే తేడా! జీవుడికి దేవుడికి ఉండే తేడా అదీ! ఈశ్వరత్వాన్ని సంపాదించుకున్న జీవుడు కూడా తేలుతూ ఉంటాడు. మనము ధ్యానం చేసుకుంటూ కూర్చుని భావన అనే దూడను వదిలేస్తే, అది అలా అలా విపరీతంగా ఎక్కడెక్కడో తిరుగుతుంటే నువ్వు చూస్తూ ఉన్నావనుకో, ఒకరకంగా ఆశ్చర్యం వేస్తుంది. మనమేనా? అనిపిస్తుంది. అన్నుంటాయి మనలో, ఒకటి. రెండోదేమో వాటి యొక్క వైవిధ్యం చూస్తే ఆశ్చర్యంతో పాటు ఒక రకమైన నవ్వొస్తుంది. ఆనందం వస్తుంది. ఏంట్రా నువ్వు? ఇంతింత మడతలు పెట్టుకుని కూర్చున్నావు లోపల. విప్పినకొద్దీ వస్తున్నాయి అని. దుశ్శాసనుడు పీకినంత వచ్చింది అక్కడ. ప్రతి వాడిలోంచి కళ్ళు మూసుకుని కూర్చుంటే అట్లా వస్తూనే ఉంటాయి. వస్తున్నాయి అని బాధపడకు

అన్నాడు శ్రీకృష్ణుడు ఆరవ అధ్యాయంలో. 'ఆ వచ్చేది నేనే అనుకుంటే ఆగిపోతాయి'. అది ధ్యానానికి రహస్యం. అదే మాస్టర్ CVV గారు కూడా మనకిచ్చారు. రెండు పద్ధతులు ఉన్నాయి ధ్యానానికి. ఒకటి మనస్సు శ్వాస మీద లగ్నం చేసి, లోపలికెళ్ళిపోయి స్పందనలో ఇమిడి, అక్కడి నుండి నిశ్వాసాలకు వెళ్ళడం ఓ పద్ధతి. రెండోది ఇట్లా అలలు అలలుగా తరంగాలు తరంగాలుగా వచ్చే ఆలోచనల్ని గమనిస్తూ ఉండడం అనేది ఒకటుంది. ఇదేమో భ్రూమధ్యంలో చేసే సాధన, ధ్యానం. అదేమో హృదయంలోకి తీసుకెళ్ళే ధ్యానం. జీవ లక్షణం బట్టి ఒక్కొక్కళ్ళకి ఒక్కోటి నచ్చుతుంది. రెండూ మనకి సనాతనమైనవే. ఈ రెండిట్లో ఏది గొప్ప అని ఏం అనుకోవద్దు. ఒక్కొక్కళ్ళకి ఒక్కోటి వాళ్ళ వాళ్ళ జీవ లక్షణం బట్టి నచ్చుతుంది. కొంతమందికి భ్రూమధ్యంలో ధ్యానం కుదురుతుంది. ఎక్కువమందికి హృదయంలో ధ్యానం కుదురుతుంది. కాబట్టి కూర్చుని అట్లా చూస్తూ ఉంటే తరంగాలు పోయి సముద్రం మిగులుతుందండీ! ఆ వెలుగుంది చూశారా! వెలుగు తరంగాలే ఇవన్నీ. ఆ వెలుగు అనంతంగా గోచరిస్తుంది. భ్రూమధ్యంలో వెలుగుతో కూడిన నీలాకాశం పరిధులు దాటిపోయి ఎల్లలు లేకుండా అట్లా గోచరిస్తూ ఉంటుంది. దాంట్లో గోళాలు కనిపిస్తాయి. గోళాలు తిరుగుతూ ఉంటాయి. ఆ గోళాల మీద జీవులు. మామూలుగా ధ్యానం చేసుకునే వాళ్ళకి సరిగ్గా ఓ మెట్టెక్కితే ఏం జరుగుతుందో తెలుసా? భూమ్మీద తను కూర్చున్నట్టు ఉంటుంది. ఎప్పడది? మూలాధారంలోంచి ప్రజ్ఞ విడిపడితే, ఊర్ధ్వముఖమై విశుద్ధికొస్తే చుట్టూ అంతా ఆకాశమే ఉంటుంది. వీడు భూమ్మీద కూర్చోని ఉంటాడు. 'Master CVV' అనే పుస్తకం రెండవ ముద్రణ మనం వేసినప్పడు అటువంటి బొమ్మ వేశారు అట్టమీద. వేస్తే మాస్టరు గారు ఆ బొమ్మ చూసి చాలా ఆనందించారు. ఈ గదిలోనే, 'ఎంత అద్భుతంగా ఉందోయ్ ఈ బొమ్మ. వేసిన వాడికి తెలిసి వేశాడో తెలియక వేశాడో నాకు తెలియదు కానీ ఇందులో చాలా సత్యం ఉంది సుమా!' అన్నారు. మనం కూడా ధ్యానం చేసేటప్పడు ఏదో మన పైన ఒక roof ఉందని, అచ్ఛాదన ఉందని, చుట్టూ ఈ చెట్లూ గిట్లూ ఈ కూపంలో కూర్చోవద్దు. ఎట్లా కూర్చోవాలో తెలుసా? కళ్ళు మూసుకుని ఓంకారం చేస్తే సరాసరి కంఠం దగ్గరకి జరగాలి. విశుద్ధి ఆకాశానికి ప్రతీక. హృదయం వాయువుకి ప్రతీక. మణిపూరకం కొంతమంది అగ్ని, కొంతమంది జలం, రెండూ చెప్తూ ఉంటాం. ఎందుకంటే చాలా తక్కువ పుస్తకాల్లో అది జలానికి సంబంధించిందని చెప్పారు. మాస్టరు గారు, శంకరాచార్యుల వారు ఇచ్చారు. ఎక్కువ మంది దాన్ని అగ్నికి కేంద్రం అని చెప్తారు. స్వాధిష్టానం-జలం అక్కడి నుండి మూలాధారం-పృథ్వి! అందుకని కళ్ళు మూసుకుంటే ప్రజ్ఞ పదార్థంలోనే ఇమిడి ఉందనుకోండి, అంటే మూలాధారంలోంచి బయటపడలేదని అర్థం. ఇది దాటి వెళ్ళి అది విశుద్ధికి వెళ్ళిందనుకోండి, ఒక్కొక్కసారి మనం ఓంకారం చెప్పగానే ఒక్కసారి బాణం ఎక్కు పెట్టి పైకి వేస్తే వెళ్ళినట్టు వెళ్ళిపోవాలి. ఒక్కొక్క ఓంకారం జీవుడ్ని దేముడు దగ్గరికి తీసుకెళ్ళే పరిస్థితి తీసుకురావాలి.

ఎందుకంటే అది 'ధనువు' కదా. అది ఆధారంగా 'ప్రణవోధనుః' అన్నారు. అది ఆధారంగా మనం పైకి వెళ్ళాలి. అంటే ఊర్ధ్వలోకం అంటే పైనని కాదు. 'సూక్ష్మం' అని అర్థం. EK గారు చాలా చక్కగా 'స్థూలము నుండి సూక్ష్మమునకు వెళ్ళుటయే, స్థూలము నుండి ఊర్ధ్వమునకు వెళ్ళుట' అని చెప్పారు. స్థూలము నుండి సూక్ష్మమునకు వెళ్ళుటయే ఊర్ధ్వగతి అని చెప్పారు. ఆ విధంగా మనం కళ్ళు మూసుకుని మూడుసార్లు ఓంకారం చెప్పగానే కనీసం మూడు కేంద్రాలు దాటి హృదయంలో కన్నా రావాలి. గాల్లో ఉన్నట్టు అప్పుడు. ఇంకా కావాలంటే ఇంకొంచెం పైకెళ్ళి ఆకాశంలో ఉండచ్చు. అంత మరీ ఆకాశంలో ఉంటే పడిపోతామేమో అనిపిస్తే, కళ్ళు మూసుకుని ఓంకారం చేసిన తర్వాత మన చుట్టూ ఎటు చూసినా సరే నీలమయిన తరంగాలు లేని సముద్రం అండీ! మన క్రింద భూమి అండీ! భూమి మీద మనం కూర్చున్నాం అండీ! అంటే ఉత్తరధ్రువం మీద కూర్చున్నాం అనుకోండి! ఉత్తరధ్రువం అంటే మామూలుగా మనకు ఒక అభిప్రాయం ఉంది. నిజానికి మనం ఉన్నది భూమి లోపల కాదు, భూమి అంచు మీదే ఉన్నాం కదా. Australia లో ఉన్నా, India లో ఉన్నా, Himalayas లో ఉన్నా, America లో ఉన్నా అందరూ బంతి మీదే ఉన్నారు. బంతి లోపల లేరు. బంతి మీద ఉన్నప్పుడు బంతి చుట్టూ ఏముంది? నీలాకాశమే కదా. గోళం చుట్టూ ఉండేది ఆకాశమే కదా. కాబట్టి కళ్ళు మూసుకోగానే మనకి చుట్టూ అటువంటి ఆకాశం గోచరిస్తూ ఉంటే, దాన్ని దర్శనం చేస్తూ ఉంటే, మనకొచ్చే ఆలోచనలు అందులోంచి వచ్చే తరంగాలుగా గోచరించాలి. తరంగాలు వచ్చినవన్నీ పోయాయి. సముద్రం ఉండేది. లేదా చోటు ఉండేది. అట్లా నీలం అయిన, తరంగములు లేని, పరిధులు లేని, పరిమితి లేని ఆకాశాన్ని దర్శిస్తూ కూర్చున్నాం అనుకోండి, కొన్నాళ్ళకి ఆకాశ దర్శనం అవుతుంది. దర్శనం చేసుకునే వాడొకడున్నాడా? దర్శనం అయిందిట అంటే దర్శనం చేసుకున్నవాడు ఒకడున్నట్టే కదా. వీడు లేకుండా 'అది' దర్శనం కాదు కదా. అప్పుడు వీడెక్కడున్నాడు? దాన్ని అధిష్ఠించి ఉన్నాడు అని అర్థం. ఆ విధంగా ఈ సాధనలో ఎన్నెన్ని దృశ్యాలు గోచరిస్తాయంటే భూమి మీద ఉండేవి, చోటులో ఉండే గోళాలు గోచరిస్తూ ఉంటాయి. పరమగురువులు గోళాల్లో ఏం జరుగుతుందో చూడగలగడం అంటే ఇదే! ఋషులు అన్ని గోళాలు చూసి, మొత్తం సమస్తమైన సృష్టిని చూసి, అన్ని సూర్య మండలాలని, సప్తర్షి మండలాన్ని, కృత్తికా మండలాన్ని ఇలా అన్నీ దర్శించారు. ఎట్లా దర్శించారండీ? ఇట్లాగే దర్శించారు. కాబట్టి ఆ విధంగా ఋషి దృష్టి ఎంత దూరమైనా అలా వెళ్ళిపోతూనే ఉంటుంది. దారిలో ఏమన్నా గోళం అడ్డొస్తే కనిపిస్తుంది. చోటులో మనం చూస్తున్నప్పుడు ఏదైనా అడ్డం వస్తే ఏదో కనిపిస్తుంది. లేకపోతే చోటేం కనిపించదుగా. ఇక్కడి నుండి కామేశ్వరరావు గారి రూపం నేను చూస్తుంటే అక్కడ ఆగుతుంది. ఎందుకనంటే అక్కడ ఒక రూపం ఉంది కాబట్టి. అట్లా గోళాలని చూస్తూ ఉంటారు. ఆ గోళాల్లో ఏం ఉందో చూస్తూ ఉంటారు. ఇలా అపరిమితమైన గోళ దర్శనాలు చేసేశారండీ ఋషులు. చేసేసి 'దీనికి అంతులేదు'

అని చెప్పేశారు. అనంతాత్మ! 'ఓరి బాబోయ్ దీనికసలెక్కడా మొదలూ చివరా ఏం లేదండీ! ఇట్లా పోతున్న కొద్దీ కనిపిస్తూనే ఉంటాయి' అని చెప్పి, ఈ అత్మతత్త్వం ఉందే ఇది అనంతం అని తేల్చారు వాళ్ళు. ఇక్కడితో అయిపోయింది అని చెప్పడానికేం లేదు. నీకయిపోతుందంతే! నీకుండే పన్నాని బట్టి అయిపోవడం తప్ప దానికయిపోవడం లేదు. ఎంత అద్భుతమైన విషయం? మనం ఊహించలేం కదా. మనకి దేవుడు అంటే ఏదో మనం గూడులో పెట్టుకునే చిన్న బొమ్మ లాగా ఉంటుంది అంతే కదా. చూసేవాడికి చూసిన కొద్దీ ఉన్నాడు. చూసేవాడుగా ఉన్నాడు. చూపుగా ఉన్నాడు. తెమలదు ఎప్పటికీ. తెమలక వాళ్ళేం చెప్పారంటే ఇంకేం చెప్పలేం, ఏదో కొంత చెప్పగలం అన్నారు. తెలిసినవాడేం చెప్తాడంటే భగవంతుడి గురించి చెప్పమంటే, 'ఏం చెప్పమంటావు? ఈ పూటకి అందినంత చెప్తా' నంటాడు తప్ప ఉన్నదంతా చెప్తా అని చెప్పగలిగిన వాడు ఎవడూ భూమ్మీద ఇంతవరకు పుట్టలేదు. దేనికంటే, చెప్తే దేని గురించి చెప్తాడో దాంట్లో వీడు భాగం కాబట్టి. వీడొకడు మిగిలిపోతూనే ఉంటాడు ఎప్పటికప్పుడు మొత్తం చెప్పినా. మొత్తం చెప్పనూ లేడు. వీడికందినంత చెప్తాడు. ఎన్నెన్ని లోకాలున్నాయి. లోకాల్లో లోకాలున్నాయి లోకాల్లో లోకాలున్నాయి. ఓ చెట్టు, పెద్ద రావి చెట్టు, మర్రి చెట్టు తీసుకుంటే ఆకుకి ఆకుకి మధ్య చోటు లాగా ఉన్నాయి లోకాలు. మనభూమి చుట్టూనే బోల్డు లోకాలున్నాయి. ఇట్లా ప్రతి గోళానికీ ఉన్నాయి. అట్లా మళ్ళీ మండలానికంతా ఉన్నాయి. అందుకనేం చెప్పారంటే, 'అయ్యా మొత్తంలో ఉన్నవాడివి, నా చుట్టుపక్కల, నాలో కూడా ఉన్నావు కాబట్టి 'నువ్వెంతో' నేను దర్శనం చేయదలచుకోలేదు, 'నువ్వేంటో' దర్శనం చేయదలచుకున్నాను అని చెప్తాడు. నువ్వెంతో దర్శనం చేయడం నా వల్ల అయ్యే పని కాదు. ప్రయాస మిగులుతుంది. గోదావరిలో ఏమాత్రం నీళ్ళు పారుతున్నాయో లెక్క వేసుకుంటూ పోతుంటే దాహం తీరదు కదా. నీ వరకూ దాహం తీర్చుకో, గోదావరి ఏమిటో తెలుస్తుంది. జలం ఏమిటో తెలిస్తే ఎక్కడి జలమైనా అదే కదా. జలం ఎంత అని లెక్కేసుకుంటే? కష్టం! అందుకని మహోదధి అంభోనిధికి పక్కన అనంతాత్మాన్. అనంతమైన ఆత్మ! అందులోంచి మనం ఊరికే బుడుగు బుడుగు మని లేస్తూంటాం, కలుస్తూంటాం. లేస్తూంటాం కలుస్తూంటాం. ఎంతటి వాళ్ళం మనం? ఎవరికి వాళ్ళం మందో పెద్ద సామ్రాజ్యంగా అనుకుంటూ ఉంటాం. ఆ మొత్తంలో మనమెంత? అందుకని గాయత్రీ మంత్ర జపం అంటే ఈ రకమైన సముద్ర దర్శనం! వెలుగు సముద్రం అది! వెలుగుకి మనవాళ్ళేమన్నారంటే పాలు అన్నారు తెల్లగా ఉంటాయని. అంతేకానీ అక్కడ వాళ్ళు రోజూ కాఫీలు తయారు చేసుకోవడానికి పాలు కొనుక్కోక్కర్లేదని కాదు. పాలసముద్రం అంటే వెలుగు సముద్రం! దాన్ని అధిష్టించి 'ఆయన' ఉన్నాడు. అది ధ్యానం చేయాలి. ధ్యానం చేయాలంటే కనులు మూసుకొని ఏమిట్రా నీ లోపల నుండి రానీ, ఎన్నొస్తాయి? ఈ వచ్చేవన్నీ అలలు, తరంగాలు. అట్లా కూర్చుంటే వస్తుంటాయి వస్తుంటాయి వస్తుంటాయి, కొన్ని ముందు రావడమే అలవాటు

మనకి. ఎందుకంటే అదే అలవాటు చేశాం ఇన్నేళ్ళూనూ. ఇవన్నీ ఎక్కడి నుండి వస్తున్నాయి? దాన్ని చూడాలి కదా. కాబట్టి వచ్చే తరంగంమల్లా నన్నుగా ధ్యానం చేసుకుంటూ ఉన్నట్లయితే ఆ తరంగం ఆగిపోతుంది. కాసేపు నేనుగా నీకు చోటు ఉంటుంది. నీలమైన ఆకాశం ఉంటుంది లేక వెలుగు గోచరిస్తూ ఉంటుంది. మళ్ళీ ఆలోచన రాగానే మాయమై పక్కకెళ్ళిపోతూ ఉంటాను. ఇలా ఆలోచనలు వస్తూ ఉంటాయి, ఆగుతూ ఉంటాయి. ఓ క్షణమైనా ఆగితే అదృష్టమే. ఆగిని సమయంలో అక్కడ మనకి నిశ్చలత్వం వస్తుంది. ఆ నిశ్చలత్వంలోంచి ఆ వెలుగే రూపు కట్టుకుంటే దర్శనాలు అవుతూ ఉంటాయి భగవద్ దర్శనాలుగా! ధ్రువోపాఖ్యానం మీరు చదువుకుంటే ధ్రువుడు నారాయణుడి గురించి చేసే తపస్సులో, తన భ్రూమధ్యంలో ఏర్పడిన, నీలమైన వెలుగులోంచి ఆకారంగా దర్శించి బయటికొస్తాడు తనలోంచే. బయటెక్కడి నుండే ఊడిపడతాడు. నీలో ఉండే నీలాకాశమే ఈ రూపు కట్టుకొని బయటికొచ్చింది. ఎందుకు ఈ రూపే కట్టుకుంది? ఇంకో రూపెందుకు కట్టుకోలేదు? ఏం శివుడుగా రాకూడదా? అమ్మవారుగా రాకూడదా? గణపతిగా రాకూడదా? ఎట్లా అయినా రావచ్చు! ఇట్లాగే ఎందుకొచ్చింది అంటే, అంతకు ముందు ఒకాయన ఇట్లా చేయమని చెప్పి వెళ్ళిపోయాడు. నారదుడొచ్చి చిన్నపిల్లవాడు అన్న ఉద్దేశ్యంతో అనంతమైన తత్త్వం, దానికి రూపం లేదు, నామం లేదు, ఇట్లా పెడితే బావుండదని, ఆయనిట్లా ఉంటాడు, ఇట్లా నీలంగా ఉంటాడు, ఆయనకి శంఖం ఉంటుంది, చక్రం ఉంటుంది, గద ఉంటుంది, పద్మం ఉంటుంది, మెడలో హారం ఉంటుంది, వక్షస్థలం మీద పుట్టుమచ్చ ఉంటుంది, బంగారం రంగు ఆభరణాలు ఒళ్ళంతా పరుచుకున్నట్టు ఉంటుంది, గోళ్ళ దగ్గర నుంచీ అన్నీ కాంతి విరజిమ్ముతూ ఉంటాయి, కనులు విచ్చుకున్న పద్మాలు లాగా ఉంటాయి ఇట్లా వర్ణించి ఇచ్చేసి వెళ్ళిపోయాడు. ఓ frame ఇచ్చి వెళ్ళాడండీ! గురువుగారు ఇచ్చేసరికి, మనవాడు చాలా బాగా ధ్యానం చేసి, ఎంత ధ్యానం చేశాడు? చదవాలి. ధ్రువుని తపస్సు ఒక్కసారి తప్పకుండా చదువుకోండి. చదివితే ఏం జరుగుతుందో తెలుసా? తనలో ఉండే చైతన్యమేదయితే ఉందో, (తను చైతన్య స్వరూపుడే కదా.) భ్రూమధ్యంలో దాన్ని అట్లా దర్శనం చేస్తూ ఉంటే అదే ఇట్లా రూపు కట్టుకొని బయటికొచ్చి కనిపిస్తుంది. మనం ఎవరిని చూసినా మన భావంతో ఏర్పరచిన రూపంలోంచి చూస్తూ ఉంటాం. అసలు దర్శనం జరిగే లోపల. భగవంతుడెప్పుడూ అట్లా గదను మోస్తూ తిరగడు. నువ్వు భావన చేయటం వల్ల ఆ రూపంలోకి దిగొస్తాడు. ఓ వెండి గదో, బంగారు గదో మోస్తూ తిరగాలి అంటే సామాన్యం కాదు. ఎప్పుడూ శంఖం పట్టుకు తిరగమంటే తిరుగుతాడా? రెండూ ఎప్పుడూ చేతిలో పట్టుకుని, రెండు చేతులు పైకి పెట్టుకుని తిరగండి చూద్దాం. అయ్యేపని కాదు. ఇవన్నీ శుభప్రదమైన సంకేతాలుగా ఇచ్చారు మనకి. అలా భావన చేయడం వల్ల ఆ విధంగా అక్కడ గోచరించాడుట. మనం లేవంగానే ఈ సముద్రంలోకి లేవడమే! ఆ మొత్తం సముద్రాన్ని 'గాయత్రి' అన్నారు. అది

నీలో కూడా ఉంది కాబట్టే, నీలోంచి కూడా సంకల్పాలు వస్తాయి. అదెక్కడి నుండి వచ్చింది? అది పరమాత్ముని సంకల్పంలోంచి వచ్చింది. 'పరమాత్ముని సంకల్పముల్ పరా ప్రకృతివై' అని చాలా చక్కగా రాశారు కృష్ణస్వామి 'వేదమాతయగు గాయత్రి' అని. 'నానుండి వ్యక్తమౌ సరస్వతీమ తల్లివై'. మనలోంచి ఈ మాట్లాడుతూ ఉండడం అంటే, అదే ప్రవాహంగా వస్తుంటే మాటలు వస్తున్నాయి. లేకపోతే ఎక్కడ నుండి వస్తుంది? కాబట్టి ఈ విధంగా ఉండే తత్వాన్ని భగవంతుడు చాలా పెద్దవాడు, గొప్పవాడు, గోళాలన్నీ దాటేశాడు, చోటులో అన్నీ ఉన్నాయి. ఇదో పద్ధతి. అదంతా మనలో ఉంది, అది అక్కడ మనం తెలుసుకోవాల్సిన విషయం. ముఖ్యంగా ఈ వెయ్యి నామాలు భగవంతుడు గురించి చెప్పినవి, మనలో దర్శనం చేసుకుంటే మనకి సత్యం అవుతాయి. లేకపోతే కేవలం ఓహో, ఆహా అనడానికి పనికొస్తాయి. మా విష్ణుమూర్తి అంత గొప్పవాడు సుమా! అని చెప్పుకోవడానికి పనికొస్తాయి. ఈ దర్శనం భ్రూమధ్యంలో జరగవలసిన దర్శనం! దర్శనం చేస్తే 'అనంతమైన చైతన్యంలో నువ్వొకడివి ఉన్నావు' అని తెలుస్తుంది. 'నువ్వు కూడా అదే' అని తెలుస్తుంది. అప్పుడు మనం చిన్నవాళ్ళమవుతాం. మనిషి పెరిగిన కొద్దీ చిన్నవాడవుతాడండీ! ఇదోటి గుర్తుపెట్టుకోండి. మనిషి చిన్నవాడుగా ఉన్నకొద్దీ చాలా ఎక్కువ ఎగిరెగిరి పడుతూ ఉంటాడు. 'కొండ అద్దమందు చిన్నదై ఉండదా' అన్నాడు వేమన గారు. అంత పెద్ద కొండ ఇంత చిన్న అద్దంలో ఇమిడిపోయింది కదండీ! మనం Life size అద్దం పెట్టుకోవాలి కనబడాలంటే. అందుకని పెద్దవాడైనకొద్దీ చాలా చిన్న వాటిల్లో ఇముడుతాడుట. అన్నిటికన్నా పెద్దవాడు కాబట్టి వాడు చీమలోనూ, దోమలోనూ కూడా ఇమిడిపోయాడు. అందుకని తెలుసుకున్నకొద్దీ మనిషిలో వినయం పెరుగుతుంది. తను చిన్నవాడవుతున్నకొద్దీ దేవుడు లోపల పెద్దవాడవుతాడుట. అది గుర్తుపెట్టుకోండి. ఈ శరీరం అనే ఇంట్లో మొత్తం అంతా మనమే నిండి కూర్చున్నామనుకోండి ఆయనకి చోటుండదు కదా. మన దేముడి గది ఏమాత్రం ఉంటుంది మనింట్లో? దేవుడికి గది ఉంటే గొప్పే, దేవుడికి గూడు ఉంటుంది కదా. ఆ గూడుకి పైన ఇంత వంటింటి సామానంతా కూడా ఉంటుంది. 'ఏదో నేనిక్కడ ఉన్నారా ఈ మూల పడేశాడు నన్ను' అని చెప్తున్నట్టుగా ఉంటుంది. కదా. భగవద్భక్తుడింట్లో ఎట్లా ఉంటుందీ? వీడు అట్లా గూడులో కూర్చుంటాడు, వాడికి ఇల్లంతా ఇచ్చేస్తాడు. ఎంత తేడా? దైవానికిల్లండీ! మనల్ని కూడా ఉండనిచ్చాడు అని అనుకుంటాడు తప్ప, మేము కూడా ఇలా దేముడిని ఉండనిచ్చామండి, ఓ మూల మా ఇంట్లో వంటింట్లో ఓ మూల గూడులో పెట్టేసాం, అక్కడుంటాడు పడుంటాడని. వాడు పడుండటము దగ్గర నుండి మనం పడుండడంగా మార్చేస్తుంది. ఎప్పుడు? ఈ దర్శనం జరుగుతున్న కొద్దీ వాడెంత పెద్దవాడో తెలిస్తే, మనం ఎంత చిన్న వాళ్ళమో తెలుస్తూ ఉంటుంది. మనం చిన్నవాళ్ళమైనకొద్దీ వాడు పెద్దవాడవుతూ ఉంటాడు. వాడు పెద్దవాడవడమంటే 'మన సమస్తము నుండి వాడే

పనిచేస్తూ ఉంటాడు'. ఈ శరీరం నుండి వాడు పనిచేస్తుంటే నువ్వు చూస్తూ ఉండచ్చు. వాడు నీ ద్వారా పనిచేస్తుంటే ఆనందిస్తూ ఉండచ్చు. వాడిదే అసలు ఇల్లు. వాడికేదో చిన్న చోటిచ్చాం అంటే ఎట్లా? వాడికి పెద్దచోటిచ్చి, మనం చిన్న చోటులో ఉండడమనేది సరియైన మార్గం. ఇవన్నీ మనకి ఈ ధ్యానంలోంచి బాగా గోచరిస్తాయి. అంటే ఇది 'The Magnitude'! 'పన్నా! దైవం యొక్క పన్నా మనం అనుకున్నంత చిన్నది కాదు. అసలు మన ఊహకే అందదు. మన ఊహించం కూడా! అదే వచ్చిన గొడవ. ఊహకందనంత పెద్దవాడ్ని ప్రార్థన చేస్తున్నాం రోజూ. గాయత్రి రూపంలో, ఓంకారం రూపంలో, నారాయణ మంత్ర స్మరణలో, పంచాక్షరి స్మరణలో, ద్వాదశాక్షరీ స్మరణలో, మనం చేస్తున్నామే వాడు ఇంత అంత అని చెప్పడానికేం లేదు, అంత పెద్దవాడు. వాడిని ధ్యానం చేయండి. నీ దేముడో, నీ గురువో నీకు అంతుచిక్కనంత పెద్దవాడు. నీకు చిక్కినంత నీకు అంతే అనుకుంటూ ఉంటావు నువ్వు. అది నీ కొలత తప్ప ఆయన కొలత కాదు. అది గుర్తుపెట్టుకోండి. సముద్రంకి వెళ్ళి నీళ్ళు తీసుకురారా అంటే, వాడో చెంచాడు తీసుకురావచ్చు. మహా వాడు తెస్తే ఒక గంగాళం తీసుకు రాగలడు అంతే కదా. అంతేనా అక్కడుంది? ఎంత తెచ్చుకున్నా ఉంది కదా. అట్టా ఉంటుంది తత్త్వం! అందుకని మనం తొందరపడిపోయి అంభోనిధి అంటే సముద్రం, సముద్రం వాడే అనేస్తే, సముద్రం చాలా చిన్న విషయం మొత్తం గోళం మీద. అలా ఉంటుంది.

## 538 అనంతాత్మా

దానంతటకీ కారణం అయినవాడు. అసలు బొత్తిగా పరిమితి లేనివాడు.

## 539 మహోదధిశయః

దానిమీద పడుకుని ఉంటాడని అర్థం. విష్ణుమూర్తి గారు గుర్రుపెట్టి నిద్రపోడు. మెలకువగానే ఉంటాడు కానీ విశ్రాంతిగా ఉంటాడు. ఊరికే హడావిడి పడకుండా ఉంటాడు. నిజమైన president అంటే ఆయన. ఒక office కి MD అనండి, లేకపోతే పెద్ద సంస్థకి chairman అనండి, ఒక దేశానికి prime minister అనండి, ఎట్లా ఉండాలో తెలుసా ఆయన? సమస్తాన్ని అధిష్టించి, ప్రశాంతంగా ఉండి, ఎక్కడ ఏం జరుగుతుందో తనకి తెలిసి ఉండాలి. వాడూ అధ్యక్షుడు! అలా కాకపోతే ఉట్టి పేరుకే అధ్యక్షుడవుతాడు.. చాలా efficiency ఉన్న managing director ఎవరయ్యా అంటే, ఓ పెద్ద factory production production జరిగిపోతూ, marketing marketing జరిగిపోతూ, అన్నీ ఏ ఏ department లు ఆయా department లు చక్కగా పనిచేస్తూ ఉంటే ఈయన, ఈయన గదిలో కూర్చుని చక్కగా ఏదైనా novel చదువుకుంటూ ఉంటాడుట. వాడు most efficient అని ఇప్పుడిప్పుడే management పుస్తకాల్లో రాస్తున్నారు. అంతేగానీ ఊరికే కంగారు పడిపోయి, వాడిని పిలిచి, వీడిని పిలిచి, వాడిని కంగారు పెట్టి, వీడిని కంగారు పెట్టి-- వాడు కాదుట. వాడు కొంచెం కంగారు గొడ్డు. వీడు అందరికీ ఎవరెవరికి ఏ ఏ పనులు చేయాలో చెప్పేసి, చెప్పిన పనులన్నీ వాళ్ళు చేయకపోతే తను చేయగలిగిన సత్తా కలిగి ఉంటాడు. ఉండడం చేత, మనం చేయకపోతే ఆయనొచ్చి చేసేస్తాడు అన్న భయం చేతయినా వాళ్ళు పని చేస్తారు కదా. ఇంద్రుడుకటువంటి భయం పెట్టాడు. ఇంద్రుడికెప్పుడూ భయమే మనం చేయకపోతే ఏదో ఒకటి వచ్చేస్తుందేమో! దిక్పాలకులకి అటువంటి భయం పెట్టాడు. సమస్త లోకాల్లో ఉండే సమస్త దేవతలకీ మనం చేయకపోతే మనకన్నా బాగా చేసేవాడు ఇంకోడుంటాడు కాబట్టి, మనం చేయటం చేయకపోతే నడవబోదు అనే స్థితి కల్పించి, అందరికీ అటువంటి స్థితి కల్పించి, తను ఇహ rest తీసుకుంటున్నాడండీ! అది best management కదా. అంతేగానీ సాధించడానికి ప్రతిసారీ వాడి దగ్గరకి పోయి, వాడి పని మనం చేసి, ఇట్లా కాదు. వాడు సరిగా చేయట్లేదు, తను చేయడు. ఇంకోడిని బాగా చేసేవాడిని అక్కడ పెడతాడు. అప్పుడు వీడు సిగ్గుపడి బాగా చేస్తూ ఉంటాడు. ఇదీ భీష్ముడికి తెలిసిన మాట! The most sublime management principle భగవంతుడి వద్ద ఉన్నదని. లేకపోతే ఇవి అన్నీ ఇట్లా manage చేయలేడు కదా. Management management అంటుంటాం కానీ అదీ మన ఋషులు దర్శించిన దేముడు! మిగతా చోట ఆ ఋషులు ఇట్లా దర్శించలేకపోయారు భగవంతుడిని. హాయిగా పడుకుంటున్నట్టుగా ఎవడండీ చూపించింది? చూపించండి. ఒకాయనేమో కొండమీద కూర్చుంటాడు. ఏం పట్టదు, కళ్ళు మూసుకుని చుట్టూ పాములు తిరుగుతున్నా, మెడ చుట్టూ తిరుగుతున్నా, ఒంటి

చుట్టూ తిరుగుతున్నా ఆయనకేం పట్టదుట. అంటే crisis లో కూడా ఆయన disturb కాడు. ఇంకో ఆయన ఎప్పుడూ relaxed గా ఉంటాడుట. MD room లో ఒక మంచి మంచం ఉందనుకోండి పడుకోవడానికి ఎట్టా ఉంటుంది? ఎందుకు ఇది చెప్తున్నానంటే మనం కూడా అట్లా ఉండచ్చు. We can be as relaxed as Him if you are a knower. తెలిసినవాడవయితే అన్నీ జరుగుతాయి. మాస్టారు శంఖారావంలో రాశారు. పనులు జరుగుచుండును అని రాశారు. నెమ్మదిగా మనం చేస్తున్నామనే మెర మెర పోతుందిట. పోయి పనులు జరుగుచుండును. అట్లా పనులు జరుగుచుండును అనే స్థితిలోకి పెరగడం ఎప్పుడొస్తుంది అంటే, మనం చేయకుండా సోమరిగా పడుకుంటే రాదు. చేయడం లోంచి ఉన్న నిపుణతలోంచి వస్తుంది అది. ఏం చేయకుండా అన్నీ జరుగుతాయండీ, అని కూర్చోవడం వేరు. వీడికి జరుగుతాయి. వాడికి జరగవు. ఆ.. మీకేమండీ అన్నీ జరుగుబాటు అయిపోతుంటాయి అంటాడు కదా. ఎందుకు వీడికి జరుగుబాటు అవుతాయి? నువ్వూ కూర్చో. నీకు జరుగుబాటు అవుతుందేమో చూడు. అవదు కదా. పోతనామాత్యుడు 'వదిలేయరా నాగలి అదే దున్నుతుంది' అని చెప్పాడు కొడుక్కి. దున్నింది నాగలే, ఎడ్లు లేకుండా. మనం ఎడ్లు తీసేస్తే, ఎడ్లుంటేనే అంతంత మాత్రం. ఇంక లేకపోతే ఎక్కడ నడిచేను అది. ఏముంది తేడా? అధిష్టించి ఉన్నాడు. తన పనిముట్లలో కూడా తను ఉన్నాడండీ! అట్లా వ్యాపనం చెంది ఉంటాడు. తాపత్రయపడే వాడికి ఈ స్థితి రాదు. వాడొకడున్నాడు, మనం చేయాల్సింది మనం చేస్తూ ఉందాం, వాడు చూసుకుంటాడు అన్నీ అని వాడికొదిలేసి, వీడూ చేయవలసిన పనియందే నిమగ్నమైతే ఈ స్థితి నెమ్మదిగా వస్తుంది. తన వెంట నడిచి వచ్చేస్తాను నేను. తను వేటి వెంట నడవక్కర్లేదు, వాడి వెంట మాత్రం నడిస్తే చాలు. ఆ విధంగా మనలో జీవుడుగా మనకి పెద్ద organisation ఉంది. Body అనేది మనకి మామూలుగా ఈ BHPV, Shipyard ఈ factoryల కన్నా చాలా పెద్దది. ఇందులో ఎన్నో దేవతా ప్రజ్ఞలు ఉన్నాయి. ఇంద్రుడు ఉన్నాడు-మనస్సు కదా. రాక్షసులు ఉన్నారు-అహంకారం లేదా?-రావణాసురుడు, నిద్ర పోదామనిపించే కుంభకర్ణుడు లేడా? ఉన్నాడు. విభీషణుడు-ఉన్నాడు. అందరూ ఉన్నారు. మొత్తం సృష్టిలో ఉండే సరంజమా అంతా శరీరంలో ఉందండీ! వాడేవిధంగా సృష్టిని అధిష్టించి విశ్రాంతిగా ఆనందిస్తున్నాడో, నువ్వు కూడా ఈ శరీరాన్ని అట్లా అధిష్టించి విశ్రాంతిగా ఆనందించే ఒక స్థితి ఉన్నది. అది యోగ స్థితి! వాడలా కూర్చుంటాడంతే. వాడు కూర్చుంటే వీళ్ళంతా పనిచేస్తూ ఉంటారు. వాడు కూర్చున్నప్పుడు ఏం చేస్తాడంటే, అర్హత గల వాళ్ళకి ఇంకొంత పని ఇస్తుంటాడు. అంతా జరుగుతుంది అనే వాడు ధర్మరాజు. అర్జునుడికి కృష్ణుడు రథంలో కూర్చోవాల్సి వచ్చింది. ధర్మరాజుకి అక్కర్లేదు.. ఎందుకక్కర్లేదు? కూర్చునే ఉన్నాడు లోపల. ఏమీ బొత్తిగా నల్లి కుట్టినట్టు కూడా ఉండదండీ ధర్మరాజుకి. అర్జునుడు 'మనం అన్నయ్యని రక్షించుకుంటూ ఉండాలి' అని అనుకుంటూ ఉంటాడు. అప్పుడప్పుడు ఆ పక్కకు వెళ్ళిపోయినప్పుడు

'ఒరేయ్ అట్లా వెళ్ళిపోతావేంట్రా' అని ధర్మరాజు ఏం అడగడు. ఆ పోతే పోయాడు అనుకుంటాడు అంతే కదా. పద్మవ్యూహం అప్పుడు కూడా ఏం కంగారు పడలేదు. ఓ రోజు ద్రోణాచార్యుడు దాదాపు దగ్గరికొచ్చేస్తాడు. పట్టుకుని ఇహ దుర్యోధనుడికి అప్పచెప్పడమే! తమ్ముళ్ళల్లో రక్షిస్తా అన్నవాడు ఎటో వెళ్ళిపోయాడు. ఇంకోడు ఇంకోవైపు వెళ్ళిపోయాడు. మిగతా వాళ్ళందరినీ ద్రోణాచార్యుడు టపటపా కింద పడేశాడు. కింద పడేసి వచ్చేశాడు ధర్మరాజు వరకు. వస్తే వచ్చాడు ఏమిటి? ఏం తేడా లేదు. ఇంకోడయితే సాయంత్రం ఇంటికి రాంగానే ఆ అర్జునుడ్ని పిలిచి ముక్కచివాట్లు పెట్టాలి కదా. నన్ను రక్షించకుండా వెళ్ళిపోతావా? అని. ఏమీ లేదు. హాయిగా ఉంటాడు. ఎంత హాయిగా ఉంటాడో! శ్రీకృష్ణుడే ఆశ్చర్యపోతాడు. 'ఏం ధర్మరాజువయ్య బాబు నువ్వూ, ఏం చేసినా నీవు అట్టాగే ఉంటావు అదీ తమాషా!' అంటాడు. అదీ నిశ్చలత్వం. ఆయనండీ president. ఆయన అడవిలో ఉన్నా president. ఇంట్లో ఉన్నా president. సింహాసనం మీద ఉన్నా president. ఐదుగురు అన్నదమ్ములో మిగతావాళ్ళు కిందా మీదా పడి ఆయన దగ్గరికి రావాల్సిందే. అరణ్యంలో కూడా ఆయన ఎవరో తెచ్చేసి శుభ్రమైన అక్షయపాత్ర ఇచ్చేశాడు. బాగా జరిగిపోయింది. రాముడంత ఇబ్బంది పడలా ధర్మరాజు. రాముడు లేడిని పట్టుకుని, వాటిని కాల్చుకుని, ఆ మాంసం వండుకుని, సరిగ్గా పోపు సామాను దొరక్క అదే తినేశాడు. ధర్మరాజుకి అవేం లేవు. ఈ పూట పరమాన్నం కావాలంటే పరమాన్నం, పలావు కావాలంటే పలావు, మసాలా దోశ కావాలంటే, అంటే మసాలా దోశ తినలేదనుకోండి వాళ్ళు ఆ రోజుల్లో. అంటే ఊరికే చెప్తున్నా ఎంత బాగా జరిగిందీ! ఎవరన్నా రావచ్చు. ఎందుకొచ్చిందిదీ? ఇది నిశ్చింత! వాడు చూస్తాడు. మనం మనం చేయాల్సింది చేస్తాం. ఏమిటి ఈయన చేసేది? దైవాన్ని పట్టుక్కూర్చున్నాడు లోపలంతే! నువ్వు ఏం చేయి అది మాత్రం వదలకు. దైవాన్ని పట్టుకోవడం వల్ల ధర్మాన్ని పట్టుకున్నాడు లేక ధర్మాన్ని పట్టుకోవడం వల్ల దైవాన్ని పట్టుకున్నాడు. ఎట్లా అయినా చెప్పుకోండి. ఇంతా భగవంతుడు కూడా 'అశ్వద్ధామ హతః' చెప్పవయ్యా, అశ్వద్ధామ అనే ఏనుగు చచ్చిపోయింది, ఆ మాట చెప్ప అంటే చెప్పనంటాడు. మరి ఎట్లా? ద్రోణుడ్ని గెలవాలి కదా. అంటే, అది నీకు సంబంధించింది నాకు సంబంధించింది కాదు అంటాడు. 'నేను ధర్మాన్ని నమ్ముకున్నాను. నువ్వు ధర్మం కోసం పనిచేయాలి నీకు తప్పదు. నువ్వు చూసుకో ఏం చేయాలో' అని చెప్తాడు. ఎవరన్నా ఉండగలరండీ అట్లా? ఎవరూ ఉండలేరు. కానీ అప్పుడు ఆయనే సర్దుకుంటాడు, దేముడే! 'అశ్వద్ధామ హతః కుంజరః అని అంటావా' అని. 'అది సత్యం కాబట్టి అంటాను' అంటాడు. సరే ఆయన 'కుంజరః' అనేది ఎవరికీ వినపడకుండా డప్పులు మోయించేసుకుని తాపత్రయపడ్డాడు కదా. భగవంతుడికి ఈ తిప్పలు! భక్తుడికి తిప్పలు లేవు గుర్తుపెట్టుకోండి. చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. నిజంగా మన ఋషి దర్శనాలు చూస్తే, తిప్పలు భగవంతుడికి తప్ప భక్తుడికి లేవు. వాడు హాయిగా ఉంటాడు.

అంబరీషుడి విషయంలో విష్ణువు కంగారు పడాలి తప్ప, అంబరీషుడు కంగారు పడేదేం ఉండదు. ప్రహ్లాదుడి విషయంలో ఎంత ఎంత అప్రమత్తంగా ఉంటాడూ! ఏమో ఎప్పుడు ఎక్కడ నుండి విసిరేస్తాడో వీడిని, తెచ్చుకుంటూ ఉండాలి కదా. సమస్తం వ్యాపించి ఉన్నాట్ట! కొండమీంచి వేసేసి, సముద్రంలో పారేసి, ఏనుగుల చేత ఎక్కించి, పాములు చేత కరిపించి, ఏం చేసినా సరే అన్నీ ఆయన కాస్తూ కూర్చోలేదూ? ప్రహ్లాదుడికి ఏముందండీ? మరీ ఆయన చక్కగా తీశాడు సినిమా కూడా 1965 లో. ఏం ఉండదు. వాడున్నాడనే వీడి ధైర్యం! వాడికెవడున్నాడు? వాడికి వాడే! వీడికి వాడొకన్నాడు. అదీ తోడుండడంలో ఉండే ఒక ప్రయోజనం. భక్తుడి position ఒక విధంగా భగవంతుడి position కన్నా చాలా privileged position అనిపిస్తుంది. వాడి ఒళ్ళో వీడు కూర్చుంటాడు. తిప్పాల్సింది వాడు. కాపాడుకోవాల్సింది వాడు. ఆశ్చర్యంగా ఉంటుంది కదా. చివరికే వాడు ఉన్నాడా? అంటే ఉన్నాడా అన్నాడు హిరణ్యకశిపుడు. ఎక్కడా? అంటే ఎక్కడపడితే అక్కడే ఉన్నాడన్నాడు. ఓరి వీడి దుంప తెగ, అయితే ఎక్కడ పడితే అక్కడ ready గా ఉండాలనుకుంటాడు. ఉన్నాడుగా! కాకపోతే అక్కడి నుండి వ్యక్తమవడానికి ready గా ఉండాలి. వాడు అడిగాడు. ఎవడు? ఎస్వీరంగారావు- హిరణ్యకశిపుడు. స్తంభం లో ఉన్నాడా అంటే వచ్చేశాడుగా అందులోంచి. ఆయన ఎన్ని తిప్పలు పడ్డాడో మనకు తెలియదుగా! కృష్ణుడు పడ్డ తిప్పలు మనకేం తెలుసు? ఎన్ని రకాలుగా అవతలి వాళ్ళ ఆలోచనలకి ఎన్ని పాచికలు return చేసేశాడాయన. వాళ్ళ పాచికలే వాళ్ళకి తిరిగి వేశాడు. ధర్మరాజు నిశ్చింత. ఎందుకిదొచ్చిందంటే, ఇది. ఈ స్థితి, ఇందుకోసం చదవాలి మనం. సన్నివేశాల్లో వీళ్ళంతా ఎట్లా ప్రవర్తించారో తెలుసుకోవడం కోసం చాలా శ్రద్ధగా, భక్తిగా, ఏకాంతంగా, నిశ్శబ్దమైన ప్రదేశంలో చదువుకుంటూ ఉంటే ఇవి మనకు బాగా ఎక్కుతాయి. ఒక్కొక్క భక్తుడు చూపించిన నిశ్చలత్వం ఇంతా అంతా కాదు. వాళ్ళు కూడా ఈ స్థితిలో ఉంటారు. వశిష్ఠుడు అట్లా ఉంటాడు. అంగీరసుడు, శక్తి, నారదుడు, శుకుడు, వ్యాసుడు ఆ కోవలోకే వస్తారు. వాళ్ళంతా భాగవత పరంపర! అందుకనే శ్రీకృష్ణుడు అన్నమాట, మంద్రజాలం ద్వారా మనం విన్న మాట, 'ప్రపంచం తలక్రిందులైనా సరే వారి తలలకు క్రిందు లేదు' అని రాశారు మాస్టారు. శ్వేతద్వీపవాసులు కదా వాళ్ళు. శ్వేతద్వీపం అంటే పాలసముద్రమే! వెలుగు! వెలుగు ద్వీపం మనలో ఉంది. అందులో మనం జీవిస్తున్నట్టయితే, చుట్టూ ఎన్ని రకాల గందరగోళాలయినా మనం మాత్రం అట్లాగే ఉంటాం. అదీ 'ప్రపంచం తలక్రిందులైనా వారి తలలకు క్రిందు లేదు', అని మాష్టారు రాయడంలో భావం. కాబట్టి ఈ నామంలో మనకి అంభోనిధి, అనంతాత్మా, మహోదధిశయః.

## 540 అంతకః

ఆట ఏది మొదలైనా దానికొక చివరుంటుంది. పూర్తి చేస్తారు. మన ఆలోచనకి లేదా? ప్రతీ ఆలోచనకీ ఒక అంతుంది కదా. పుట్టిందానికల్లా అంతుంటుంది. ఆలోచన పుట్టిందే! కొన్ని కొన్ని వెంటనే పోతూ ఉంటాయి. చిన్నచిన్న అలలు లాగా. కొన్ని కొన్ని పెద్దవిగా ఉంటాయి. అది ఏదైనా పుట్టిందల్లా వెళ్ళిపోతూ ఉంటుంది. అట్లా వెళ్ళిపోవడం ఎవరిలోకి వెళ్ళిపోతుంది? వాడిలోకి వెళ్ళిపోతుంది. మన ఆలోచన వెళ్ళిపోయి మళ్ళీ రాదా ఇంకోసారి? మనలో నుండి వెళ్ళిపోయి, మళ్ళీ మనలోంచి వస్తూ ఉంటుంది. అందుకని భగవంతుడికి అన్నిటినీ అంతం చేసేవాడు అనే నామం. పుట్టిన ప్రతిదానికీ అంతం ఉంది. అది జీవి అవచ్చు, గోళం అవచ్చు, అదో పెద్ద మండలం అవచ్చు, అది ఒక సృష్టి అవచ్చు, ఒక మహా సంకల్పం అవ్వచ్చు. ఎంత మహాసంకల్పం అయినా సంకల్పమే! అది ఎక్కడి నుండి పుట్టిందో దాంట్లోకి పోవాల్సిందే. అందుకని వచ్చిందల్లా మళ్ళీ వెళ్ళిపోతుంది అని తెలిసుండాలి. Everything has an end, accept the One. వాడు మాత్రం ఎప్పుడూ ఉంటాడుట. మనలోంచి బోల్డు వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి మంచివి, చెడువి. మనం అట్లా ఉంటూనే ఉన్నాం కదా. శరీరం కూడా వచ్చి వెళ్ళిపోతుంది తప్ప, మనం ఉంటాం. అది తెలియడమే ఆర్యధర్మం! వచ్చి వెళ్ళిపోయేది శరీరం, వచ్చి వెళ్ళిపోయేవి సన్నివేశాలు, వచ్చి వెళ్ళిపోయేవి ఆలోచనలు, మనం మాత్రం శాశ్వతంగా అట్లా ఉంటాం. ఆరంభం ఉన్నదానికల్లా అంతం ఉంటుంది. ఆరంభం ఒక్కటే దేవుడనుకోకూడదు. అంతం కూడా దేవుడే అనుకోవాలి. దేవుడి సంకల్పం ప్రకారమే మొదలైంది. దేవుడి సంకల్పం ప్రకారమే అంతమవుతుంది. వాడి సంకల్పం మేరకి మనం జీవిద్దాం అనుకుంటే ఎక్కువ రోజులు బతుకుదాం అనే గొడవుండదు. మన పెద్దవాళ్ళు అజ్ఞానంలో ఇదోటి పెట్టారు. ఎక్కువ రోజులు బతుకుదాం అనుకోవడం అజ్ఞానం అని చెప్తారు. ఎన్ని రోజులు బతకాలని వాడు నిర్ణయించాడో అన్నాళ్ళు బతుకు! హాయిగా బతుకు! వాడ్ని అనుభూతి చెందుతూ బతుకు! లేకపోతే వాడిలో బతుకు శరీరం వదిలేసి! Wish to live అనేది అజ్ఞానం అని చెప్పారు. Purpose అయిపోయి పాడిగించుకున్నా ఇబ్బందే! సాధన జరుగుతున్నంత కాలం ఉండాలి. ఇహ ఈ శరీరంలో సాధన జరగట్లేదు, శరీరం రొష్టుగా ఉంది, ఏం చేయాలి? ఇది వదిలేసి ఇంకోటి పట్టుకోవాలి. Car పనిచేయట్లేదు దానికే tyres మాటిమాటికీ punctures వేసుకుంటూ, మాటిమాటికి repair చేసుకుంటూ, ఊడిపోయే తలుపులు అన్నీ పెట్టుకుని ఎన్నాళ్లు నడుస్తావా car లో? Car మారిస్తే బావుంటుంది. వాడు మారుస్తాడు. అందుకే పట్టుకుని వేళ్ళాట్టం అనేది ఉండదు. CVV గారి మార్గంలో చాలా ప్రధానమైన శిష్యులు ఒకాయన పోతరాజు నరసింహం గారు. పోతరాజు

నరసింహంగారంటే సర్వేపల్లి రాధాకృష్ణన్ గారితో సమానమైన జ్ఞాని. ఆయన అదృష్టవశాత్తు యోగి కూడా అయ్యారు. ఆయన మాస్టర్ CVV గారికి ఎంత సన్నిహితమైన, అంతరంగికమైన శిష్యుడు అంటే ఆయన మరణం ఆయనకి ఇచ్చేసారండీ! 'నువ్వు ఎప్పుడు కావాలంటే అప్పుడు పోవచ్చురా' అని చెప్పారు. అందరినీ 'రా' అని పిలిచేవారు CVV గారు. ఈయనెంతటి వాడైనా ఎంత పెద్ద philosopher ఆయన. రాధాకృష్ణన్ కి అంత సన్నిహితమైన స్నేహితుడు కూడా. కాకపోతే ఆయన president అవడం వల్ల అందరికీ తెలిశాడు. ఈయన కాకపోవడం వల్ల మనబోటి వాళ్ళకే తెలిశాడు. ఆయనకి, ఆయన భార్యకి ఒక వరం ఇచ్చి వెళ్ళిపోయారు CVV గారు. 'మీకెంతకాలం కావాలంటే అంతకాలం బతకచ్చురా మీకా వరమిచ్చిపోతున్నాను, నా చేతిలో ఉంది చావు, నేను వద్దంటే ఎవరికీ చావు రాదు' అని చెప్పారు. CVV గారు వెళ్ళిన తర్వాత కూడా సాధన చేసుకుంటూ ఉండే వాళ్ళు భార్యాభర్తలు ఇద్దరూ. ఒకసారి prayer లో extension అడిగారు ఈయన. ఇచ్చారు. Continue చేస్తున్నారు. మళ్ళీ extension, మళ్ళీ ఇచ్చారు. మళ్ళీ extension అది మోహమేగా! Retire అయిపోయిన తర్వాత ఇంకో రెండేళ్ళు ఇవ్వండి సార్ అంటే సరే చావు అంటే, మళ్ళీ రెండేళ్ళు అంటే 62. మళ్ళీ రెండేళ్ళు అంటే వాడికి విసుగు పుట్టదూ? అంటే ఏమిటి? ఇచ్చాడు కాబట్టి వాడుకుంటున్నావు తప్ప నీలో అజ్ఞానం పెరుగుతోంది కదా. శరీరం మీద బంధం పెరుగుతోంది కదా. ఈ శరీరం లో ఉండాలి అని అనిపిస్తోంది కదా. నువ్వు శరీరం కాదు కదా. ఇవన్నీ తెలియాలి కదా. మూడోసారి extension వచ్చేసరికి విపరీతమైన జబ్బులు వచ్చేస్తున్నాయి ఒంటినిండా. వచ్చేస్తే ఇంటావిడ చెప్పిందిట, 'ఏమండీ సాధన కోసం మనం పాడిగింపు అడిగాం, మాస్టరు గారు ఇచ్చారు, పాడిగింపు కోసం పాడిగింపు సాగడం తప్ప కదా. అందుకనే మనకివన్నీ వచ్చినాయి. మనకొద్దండీ శరీరం, ఇంక ఈ శరీరంలో సాధన జరగదు కాబట్టి మనమెళ్ళిపోదాం, అసలిదడక్కుండానే వెళ్ళిపోయి ఉంటే ఎక్కువ బాగుండేదేమో' అని చెప్పింది. చెప్తే prayer లో చెప్పేసుకున్నారు. extension cancel చేసేయమని. అయిపోయింది. మనకి ఇవన్నీ ఎక్కువ తెలియవు ఎందుకంటే CVV గారి గురించే అణువంత తెలుసు. ఆయన అనుయాయుల్లో MN గారి గురించి గానీ, పోతరాజు నరసింహం గారి గురించి గానీ మనకి చాలా తక్కువ తెలుసు. కేవలం దండం పెట్టుకుంటే చాలు వాళ్ళకి. ఏం తెలియక్కర్లా. మా గురించి తెలిసేది ఏమిట్రా అన్నట్టుగా ఉంటారు వాళ్ళు. వాళ్ళు కనిపించినా 'ఏరా' అని మాట్లాడుతారు తప్ప ఇంకో రకంగా మాట్లాడరు. అది వాత్సల్యం అన్నమాట. 'ఏరా, ఓరేయ్' అని పిలిచే పరిస్థితి. ఆ నరసింహంగారే మనకి మాస్టర్ CVV గారి photo మన మాస్టరుగారికి పంపించింది వెళ్ళిపోబోయే ముందు. పోతరాజు నరసింహం గారి దగ్గర నుండి మాస్టరు గారికి మొదటి కాపీ మాస్టర్ CVV గారి photo అందుతుంది. ఆ photo అందక ముందే ఆయన పోయినట్టు paper

పడుతుంది. రెండు రోజులు తర్వాత మాస్టారుకి post లో photo వస్తుంది. 'ఫలానా ఆయన చెప్పారు పంపించమని, కాబట్టి నేను పంపిస్తున్నాను' అని చెప్పి పంపించేశారు. అది మనకి link. ఎందుకిది చెప్తున్నానూ? వెళ్ళి పోవడానికి కూడా సంసిద్ధత! ఎందుకంటే వచ్చిందల్లా వెళ్ళిపోవడానికే! వచ్చారుట అంటే వెళ్ళిపోవాలి. అందుకనే Bible లో 'It came to pass' అని రాస్తారు. ఒక సన్నివేశం రాంగానే ముందు మొట్టమొదటి వాక్యం ఏం రాస్తారంటే Old testament లో, 'ఈ సన్నివేశం వెళ్ళడానికి వచ్చింది' అని. జీవితంలో సన్నివేశాలన్నీ కూడా ఒకటి వచ్చిందట అంటే వెళ్ళిపోతుంది. ఉండిపోదు. పెద్ద పెద్ద సన్నివేశాలు అట్లా స్థిరంగా మనతో ఉండిపోవు. మనమున్నా వెళ్ళిపోతాం, అదన్నా వెళ్ళిపోతుంది. అట్లా దానితో కలకాలం కలుసుండిపోవడం ఉండదు. It came to pass. Everything passes by. అన్నీ జరిగి వెళ్ళిపోతాయి. నువ్వీ లోపల కంగారు పడి దాన్ని కంగాళీ చేయకుండా ఉంటే, దాన్నించి మళ్ళీ పుట్టే ఫలహేతువులు మనకు ఉండదు. 'మా కర్మఫలహేతుర్భూఃమ' అన్నాడు కదా శ్రీకృష్ణుడు. ఈ మధ్యలో నువ్వు మళ్ళీ వేళ్ళు కాళ్ళు అందులో పెట్టావంటే సన్నివేశం వెళ్ళిపోతుంది కానీ, దీని కంపంతా నీకు మిగిలిపోతుంది. ఎందుకివన్నీ మనకి? ఒక్కటే విషయం గుర్తు పెట్టుకోవడం కోసం. ఏమిటయ్యా అంటే all things that approach you would pass by. నువ్వలా నిశ్చలుడవై, నిశ్చింతతో వాడితో ముడి పెట్టుకుంటే, ఎంత భయంకరమైన విషయమైనా సరే అట్లా వచ్చి వెళ్ళిపోతుంది. ఈ లోపల నువ్వేమన్నా కొంచెం అందులో involve అయితే దానిది కొంత నీకు మసి పూసేసి, పేడ చల్లేసి వెళుతుంది. నేను, భగవంతుడు కేవలం అన్నీ ఇచ్చేవాడే అనుకోకూడదు, పుచ్చుకుపోయేవాడు కూడా అనుకోవాలి. అందుకే ఈ నామం వేశాడు అంతకఃమ. ఈయనంతా చేశాడు కదా మొత్తం అంతా. ఎవరి గురించి స్తోత్రం చెప్పాడో ఆయన, ఈ భూమ్మీద కనీ వినీ ఎరగునంత ప్రాణనష్టం జరగడానికి president కృష్ణుడు గారు. అదే విదురుడికి కూడా బాధ లోపల. ఇంత దేవుడూ ఇంతమంది మనుషుల్ని తీసేశాడేంటని ఆయన లెక్క. ముప్పైఏళ్లు పట్టింది ఆయనకు అర్థం అవడానికి. మన గురువు గారు చూస్తూ మన చుట్టూ ఉండే వాళ్ళని చంపేస్తున్నారనుకోండి, ఎట్టా ఉంటుంది? భీష్ముడికి ఎట్లా ఉండాలి? ప్రత్యర్థి జట్టులో ఉన్నాడు, తన వాళ్ళు అనుకున్న వాళ్ళందరినీ ఏరేశాడు. చూడగలడా వాడిలో దేవుడ్ని? ఎట్లా చూడగలిగాడు భీష్ముడు? మిగతా వాళ్ళు చూడలేకపోయారు. ప్రత్యర్థి జట్టులో చూడగలిగినవాడు భీష్ముడొక్కడే! అటు ఇటు లెక్కేసుకున్నా ఇంత బాగా చూడగలిగిన వాడెవడూ లేడు కృష్ణుడ్ని. చూస్తూ చూస్తూ నీవాళ్ళు అనుకున్న వాళ్ళనుకున్న వాళ్ళందరినీ పట్టుకు పోతుంటే, నువ్వెట్లా దండం పెడతావండీ? ఇంకెవరికయినా దండం పెడదామని పెడితే ఆ అయ్యే పని కూడా అవదని మనకొక నమ్మకం ఉంటుంది కదా. CVV గారి విషయంలో ఒక్కోసారి ఆయనకు దండం పెట్టాలి అంటే లోపల భయం వేస్తుంది. మరి తప్పకుండా అవ్వాలి అనుకున్న

దానికి దండం పెడితే, తప్పకుండా అవ్వాలి అని నువ్వు అనుకున్నావు కాబట్టే కాకుండా చూసే ఓ పద్ధతి ఉంది అక్కడ. అందుకని భీష్ముడు కాబట్టే చెప్పాడు, 'నువ్వు అన్నింటినీ అంతం కూడా చేస్తావు నాయనా నాకు తెలుసు'. ఎంత జన నష్టం? 18 అక్షౌహిణులు అంటే సామాన్యమా? చివరికి మిగిలింది వేళ్ళమీద లెక్కపెట్టగలిగినంత మందే మిగిలారు. అయినప్పటికీ వాడ్ని దేవుడిగా దర్శనం చేశాట్ట అంటే ఈయన్ని మనం ఆయనతో సమానంగా దండం పెట్టాలండీ! ఎవరూ పెట్టలేరు. విదురుడికే పెట్టబుద్ధి కాలేదు దండం. భీష్ముడు వెంటనే పెట్టగలిగాడు. మిగతా వాళ్ళని వదిలేసేయండి ఆ జట్టులో ఉండే వాళ్ళని. పాండవులు దండం పెట్టడంలో పెద్ద గొప్ప లేదు. అంతా కలిసి రావటమేగా ఆయన వల్ల. గురువుగారి వల్ల కలిసొస్తున్న కొద్దీ విపరీతంగా పెడుతూ ఉంటారు దండాలు. ఇక్కడ ఏమిటి? Reverse కొట్టేస్తుంది. దండం పెట్టినప్పుడల్లా ఒకడ్ని పట్టుకు పోతూ ఉంటాడు. అయినా దండం పెట్టాడంటే? దేంట్లో నిలబడ్డాడండీ భీష్ముడు? మనమెప్పుడన్నా ఆలోచించామా భీష్ముడు గురించి ఈ dimension లో. వాళ్ళెవరో తెలుసా? వాళ్ళు ద్వంద్వానికి అతీతమైన జ్ఞానులు. తనకి తెలిసిన మంచి, తనకి తెలిసిన చెడు రెండింటినీ దాటేసి, ప్రపంచజ్ఞానంగా ఉండే మంచి చెడును కూడా దాటేసి, వాడిలో కూర్చున్న వాళ్ళండీ! కాబట్టి వాళ్ళకి జరిగిందంతా సబబే. అట్లా ఉండడం కష్టం. చెప్తుంటేనే కొంచెం చిరాగ్గా ఉంటుంది. అటువంటిది ఆయన అటు కూర్చుని దెబ్బలు తింటూ, అన్నీ కొట్టించేసుకుని మొత్తం అంతా పంపించేశాడు కదా. ఈయనొకడ్ని మిగిల్చాడు. అయినప్పటికీ 'నువ్వే సమస్తం' అని దర్శనం చేశాట్ట అంటే ఎంత impersonal. ఎంత స్వభావాన్ని దాటి ఎంత ఎత్తులో కూర్చున్నాడో అని చూడవచ్చు. అదే అంతకః నామం. మన వరకు తెలుసుకోవాల్సింది 'ఏదీ శాశ్వతం కాదు, అంతా వెళ్ళిపోతుంది నీ శరీరంతో సహా. నీకివాళ ఉండే భావాలు వెళ్ళిపోతాయి. ఉండవు. మరికొన్నొస్తాయి. అవీ వెళ్ళిపోతాయి. అంతా ప్రవాహమే. ఈ మొత్తం ప్రవాహంలో ప్రజ్ఞ ఒక్కటే స్థిరమైనది. చైతన్యం కూడా అందుకని అమ్మవారన్నారు. కదిలి వెళ్ళిపోయేదే. కదలిక కలిగేదే చైతన్యం. కాబట్టి అసలు తత్త్వానికి ఈ చైతన్యం కూడా కదిలి వెళ్ళిపోయేదే. ఆయనలోకి వెళ్ళిపోతుంది. మళ్ళీ ఆయనలోంచి బయటికొస్తుంది'. ఇంత భావం ఈ నామంలో ఉన్నది.

## 541 అజః

అజః అంటే 'పుట్టుక లేనివాడు' అని ఒకసారి అవగాహన చేసుకున్నాం. ఇప్పుడు అవగాహన, యజ్ఞంలో బలిపశువును 'అజము' అని పిలుస్తారు. అంటే 'గొఱ్ఱెపోతు, గుఱ్ఱాల్ని బలి యివ్వడం అశ్వమేధమని, నరులని బలి యివ్వడం నరమేధమని అంటారు. ఇలాగ భగవంతుని పురుషసూక్తం లో 'దేవా యద్యజ్ఞం తన్వానాః అబధ్నన్ పురుషం పశుమ్' పురుషుని పశువుగా బంధించి, అంటే భగవతత్త్వాన్ని/మూలతత్త్వాన్ని ఆధారంగా చేసుకుని, సమస్త సృష్టి నిర్మాణమును దేవతలు చేసారని తెలుస్తున్నది. భగవంతుడ్ని వండుకుంటే సృష్టి వస్తుంది. గోధుమపిండి వండుకుంటే పూరీలు, చపాతీలు వచ్చినట్లుగా, ఆయన్ని వండుకుంటే సమస్త గోళాదులు, తారకలు, సమస్త గోళాదులలో వుండే జీవులు యివన్నీ బయటికి వచ్చాయి. ఇది ముఖ్యమైన అవగాహన! పురుషసూక్తంలో చెప్తారు దేవతలు 'సర్వహుతః' అనే యజ్ఞం చేసారని. మొత్తం ఆయన్ని ఆహుతి చేసేసారు. అందుకు ఆయన ఒప్పుకున్నాడట. అలా వండుకుంటే మీరంతా బయటకు వస్తారు అని. వండితే ముందు ఆయనలోంచి సంకల్పం, సంకల్పంలోంచి దాన్ని నిర్వర్తించే జ్ఞానం, దానితోబాటు దాన్ని నిర్వర్తించే క్రియ, సామర్థ్యము, లేక శక్తి యిలా వచ్చాయి. ఇదే ఇచ్ఛాశక్తి (సంకల్పశక్తి), జ్ఞానశక్తి, క్రియాశక్తి ఇలా 3 వచ్చాయి. ఈమూడు సంకల్పాలు ఆయన లోంచే వచ్చాయి. మనకి ఒక ఆలోచన వచ్చిందనుకోండి, ఉదా:- ఏమైనా సరే ఈవారం సినిమాకి వెళ్ళాలని సంకల్పించాం. ఎలా నిర్వర్తించుకోవాలో అది జ్ఞానం. అంటే యేరోజు ఖాళీ వుంది, యేరోజు సెలవుంటీ, యేరోజైతే ticket దొరుకుతుంది అని. సినిమాకి వెళ్తే అదీ క్రియ. ఏమైందీ? మనలోంచే సంకల్పం వచ్చి, మన సంకల్పమే జ్ఞానాన్ని పుట్టించి, నిర్వర్తించాం. మనలో వుండే ప్రజ్ఞని వండుకోవడం వలన మనం సినిమా చూశాం. అలాగే ఏమైనా సరే సంఘంలో కీర్తిప్రతిష్టలు సంపాయించాలనుకున్నాం అనుకోండీ, ఊరికే వస్తాయా? వీడ్ని వీడు యెంత వండుకుంటే, వీడు చేసిన పనుల కారణంగా పదిమందికి మంచి జరిగి, అందులో నుండి వీడికి కీర్తిప్రతిష్టలు వస్తే, వీడ్ని వీడు మథనం చేసుకోవడం వల్లనే కదా. భగవంతుడిలో ఏమున్నాయో అవన్నీ జీవుడిలో పెట్టి పంపాడు. అందుకే మనల్ని మనం అర్థం చేసుకుంటే దైవం అర్థం అవుతాడు. మనల్ని మనం అర్థం చేసుకోకపోతే దైవం అర్థం కాడు. అందుకనే 'నిన్ను నువ్వు తెలుసుకో', Man! Know Thy self అని మన ఋషులు చెప్పారు. నిన్ను నువ్వు తెలుసుకుంటే సృష్టి అర్థమవుతుంది. జీవితమంతా మనం హారతి కర్పూరంలా వండేస్తాం కదా. కుటుంబపరంగా, ధనార్జన కోసం--- ఇలా రకరకాల భావాలకి మనమే మనకి సమర్పణ చెందడంవలన, ఆ భావాలతో తిరుగుతూ, ఆ భావాలు నిర్వర్తింపబడుతున్నాయి. మనం మనకొచ్చిన ఒక భావాన్ని

నిర్వర్తించకపోతే అది ఆకాశంలోకి వెళ్ళిపోతుంది. మనం సహకరించడం వల్లే మంచి, చెడు పనులన్నీ జరుగుతూ వుంటాయి. అలాగే భగవంతుడు తనలోంచి వచ్చిన సంకల్పానికి తను సహకరించడం వలన సంకల్పశక్తి, అది ఆధారం గా జ్ఞానశక్తి, యింకా సహకరించడంతో క్రియాశక్తి. ఇదంతా కలిపి ఒక వెలుగుముద్ద. ఎవరూ? ఈయనే! అప్పుడు ఈయన్ని పట్టుకుని అటూఇటూ చిలికారట. వెలుగుగా వున్న చోటును చిలకడమే పాలసముద్రాన్ని చిలకడం. ఇంకా గేదెలు, ఆవులు, మేకలు, జంతువులు, మనుషులు పుట్టకుండా పైన పాలెక్కడ నుండి వస్తాయండీ? పాలు అంటే 'తెల్లని అవధులులేని చోటు'. అంతేకానీ పాలసముద్రం కాదు. ఆయన యెడమపక్క నుండి కొంతమంది, కుడిపక్క నుండి కొంతమంది వచ్చి అటూఇటూ లాగారు. వెంకటేశ్వరస్వామిని లక్ష్మీదేవి, అలుమేలుమంగ తలోపక్కకీ లాగినట్లుగా చెప్పేది ఈ సంకేతాన్నే, అంతేకానీ అలాంటి కథేమీ జరగలేదు. సామాన్య మానవుడికి నమ్మకం పుట్టించడానికి పెద్దలు రకరకాలు గా ప్రయత్నం చేస్తుంటారు. అందులో భాగమే ఈ కథ. వాటిని చిలికితే అందులోంచి విషం, అమృతం, చంద్రుడు, ధన్వంతరి, లక్ష్మీదేవి యిలా రాని వాళ్ళెవరు? ఆయన్ని పూర్తిగా పుటం చేసేస్తే ఇవన్నీ బయటకు వచ్చాయి. అంతా బయటికి వచ్చారు. 'ఆరణ్యాన్-గ్రామ్యాశ్చయే' అందులోంచి పుట్టినాయట. అరణ్యాలంటే అరణ్యకాలు. మనకు 4 వేదాలున్నాయి. ఈ నాలుగు వేదాలు బ్రహ్మతత్వాన్ని బోధిస్తాయి. మనలో వుండే దైవానికి దారి చూపించేవి ఉపనిషత్తులు. ఉప అనగా దగ్గరగా, నిషత్తు అనగా కూర్చోబెట్టేవి అన్నమాట. 'ఉపదేశము' అంటే దగ్గరగా ఆ దేశము/ఆ లోకములో/ఆ చైతన్యములో కూర్చోడము. 'ఉపనయనము' దానికి దగ్గరగా నడచి వెళ్ళడం. 'ఉపవాసము' దానికి దగ్గరగా కూర్చోడము. ఇలా మనకి అసలు అవగాహనలు ఉన్నాయి. వేదములలో చెప్పబడ్డ సత్యమునకు/ భగవత్తత్వమునకు దారిచూపించేది 'ఉపనిషత్తు'. వాటిగురించి మనం చేసే భావమయ మథనం 'అరణ్యకములు' అన్నారు. అంతేకానీ యెక్కడా అరణ్యంలో కూర్చొని చెప్పుకోవడం కాదు. 'అరణి' అంటే యజ్ఞంలో వాడే పనిముట్టు. దానిని అగ్నిని ముట్టించడానికి వాడతారు. యజ్ఞం చేసేప్పుడు అడ్డంగా ఒక కర్రపెట్టి, దానిమీద నిలువుగా ఒక కర్ర పెట్టి చిలుకుతారు. నిలువుగా పెట్టే కర్రని 'పురుషతత్వము' అని, అడ్డంగా పెట్టే కర్రని 'స్త్రీ తత్వము' అని అంటారు. ప్రకృతి, పురుషుల సమాగమం చేత వెలుగు పుడుతుంది అనే తత్వంగా ఆ 'అరణి' అనే దాన్లో చిలకడం చేస్తే, అందులోంచి అగ్ని పుడుతుంది. అలా ప్రతివాడు కూడా తన శరీరం లో తనెవరో తెలుసుకొనే ప్రయత్నం, తను చేసే సాధనంతా కూడా లోపల వేడి పుట్టించడానికి చేసేదే! లోపల వేడి పుట్టకపోతే సాధన యేమీ లేదు. Fashion మాత్రమే. లోపల వేడి పుట్టి, శరీరాన్ని కొంత దహించి, కొంత తేలిక పరచాలి. అంతేకానీ మొద్దు స్వరూపాల్లా వుండి భగవంతుని చూస్తాం అంటే, అవ్వదు. ఆ వేడి రవ్వలు రావాలి. ఆ రవ్వలు అంతా మంటపెట్టాలి. అక్కరలేనిది కాలిపోవాలి. పవిత్రమైన దానిని కాల్చలేదు

అగ్ని. అందుకనే 'విబూధి' పెట్టుకుంటారు. ఎందుకనీ? ఇంక దాన్ని (విబూధిని) అగ్ని యేమీ చేయలేదు. అందుకే అన్నిటికన్నా అది పవిత్రమైనది. అదీ శివుడు! అందుకే 'నన్ను పవిత్రీకరించు అని కోరుతూ' విబూధి పెట్టుకోవాలి. 'పరమం పవిత్రం! నీరు, అగ్ని, మృత్యువు ఏవీ తాకనిది విబూధి. అలా అంతవరకూ మథనం జరుగుతుందండీ! నీలో వుండే సమస్తమూ మథనం జరిగిపోతే నువ్వు యేం అవుతావు? వాడ్ని సమస్తం మథనం చేస్తే అదృశ్యుడై యివన్నీగా వచ్చాడు. కనుక మనం యిట్నుంచి మథనం చేస్తే, యివన్నీ కాకుండా మనం 'అది' అయిపోతాం. దీన్ని 'యజ్ఞం' అన్నారు. పవిత్రమైన భావమునకు, పవిత్రమైన కార్యమునకు సమర్పణ చెందడం వల్ల మనిషి దేవుడవుతాడు. క్రీస్తు తనను తాను పూర్తిగా సమర్పణ చేసుకుని, మేకులు కూడా కొట్టించుకుని దేవుడయ్యాడు. ఋషభుడు తనను తాను పవిత్రమైన సంకల్పానికి సమర్పణ చేసుకోవడంతో దేవుడయ్యాడు. అలాగే జడభరతుడూ! ఇలాగ హరి అంశావతారములని వీరిని భాగవతంలో 21 మందిని చెప్పారు. వీరందరూ ఒక పవిత్రమైన భావానికి తమ సమస్తమునూ, తమనూ సమర్పణ చేసుకున్నారు. కనుక ఏదో part time గా, ఆరోజు యేమీ పనులు లేక విని వెళ్ళిపోదాం అనుకుని, ఆ పూటకి వేడి తెచ్చుకుందామని ప్రయత్నం చేసి, ఇంటికెళ్ళేప్పటికి చల్లారిపోయీ, ఇలా వుంటుంది మన స్థితి. అయితే ఇలాగ జరగ్గాజరగ్గా కొన్ని జన్మలకి, 'ఇలా వూరికే నిప్పతెచ్చుకుని ఆర్పేసుకుంటే ఏమి లాభం? అది తెచ్చుకుని మన కుంపట్లో పడేసుకోవాలి' అనుకుంటాడు. అసలు ఈ నిప్ప కోసం వెళ్ళడం అనేది ౭౭౭ జన్మల ముందు నుండి మొదలు పెడ్తాడట ముక్తుడవడానికి. జ్వాలాకూలుడనే మహర్షి చెప్తాడూ 'ఈరోజు మొదలుపెడ్తా రేపు అయిపోతుందనుకోక. చాలా సరకు వున్నది నీదగ్గఱ. ఆ సరుకంతా కాల్చాలి. అందుకు నీలో వేడి పుట్టాలి.' ఏం వేడీ? 'తనను తాను తెలుసుకోవాలి' అనే వేడి ఎక్కాలి. ఎక్కిన తరువాత నిప్ప తెచ్చుకుంటూంటాం, ఆర్పేసుకుంటూంటాం. అంటే మనకి ఏమి చెయ్యాలో తెలిసినా కూడా చేయకుండా వుంటాం కదా. అదే యిది. ఆరిపోకుండా విసురుకోవాలట. అదే అభ్యాసం! అప్పటికే వెలుగుగా మారినవాడి నుండి కొంచెం రాసుకు రావడమే పక్కింటికెళ్ళి కొంచెం నిప్ప అడిగి తెచ్చుకోవడం, మన కుంపటి రాజేసుకోవడానికి. మన కుంపటిలో తెచ్చి వేసుకునేలోగా కూడా నిప్ప ఆరిపోవచ్చు. అసలు నిప్ప ఆర్పేసుకోవడానికి కావలసిన సాంకేతిక జ్ఞానము అంటే technology అది మనవద్ద బాగా వున్నది. కానీ సాధన నిప్ప ఆరిపోకుండా చూడాలి. జాగ్రత్తగా ఇంటికి పట్టుకెళ్ళి మన కుంపటిలో వేసుకోవాలి. మన కుంపటి మూలాధారంలో వున్నది. మరచిపోకుండా సాధన చేసుకోవాలి. సాధన నిరంతరమూ అవ్వాలి. దీర్ఘకాలం అవ్వాలి. మన స్వభావంగా అయిపోవాలి. అప్పుడిక వాడికి రాజుకుంటుంది. ఇలా ఒకసారి రాజుకుందో కాలిపోతుంది. అదిటా ౭౭౭ జన్మలలోనూ చివరి ౭ జన్మలలోనే జరుగుతుందట. అది చదివినప్పుడు నాకైతే చాలా అన్యాయం అనిపించింది.

'గురువుగారూ మరీ మమ్మల్ని యింత బాధ పెట్టేస్తున్నారు, ౭౭౦ జన్మలు అని, ఇప్పడేమో చివరి ౭ జన్మలంటున్నారు' అని. మిగతా ౭౭౦ జన్మలు ఏమైపోయాయి. ఏదో అలా తిరుగుతూంటాం. అట్లా దేముడు ఓ fashion గా తిరుగుతూవుంటాం. కానీ మన కుంపటి బాగా రాజుకోవాలి. దేవతలు ఆయన్ని 'అరణ్యం' పుట్టేంత, అంటే అగ్ని పుట్టించేటంత వండారుట. దానిలోంచి వచ్చినవన్నీ భావన చేయడాన్ని 'అరణ్యకాలుగా' యిచ్చారు మనకి. మనలో అయితే జ్ఞానం వగైరాలు పుడ్తాయి సాధన చేస్తే, వేదములకు, అరణ్యకములు భావపరంపరగా అనేక విషయాలు అందించినాయి. ఇవికాక బ్రాహ్మణములు 'elaborate descriptions' ఉన్నాయి. వేదానికి మూడు branches. 1.ఉపనిషత్తు:- దానికి దారి చూపించేది. ౨.అరణ్యకము:- దాని గురించే ఎప్పుడూ భావన. ఏవరైనా యెవరనన్నా ప్రేమిస్తే ఇహ పగలూ, రాత్రీ ఎప్పుడూ అదేకదా. దానియందు వాడు అంత లగ్నం అయిపోతాడు. భగవంతుడు ముందు మనకు పరిచయం కదా. వ్యక్తి అయినా అంతే. పరిచయం బాగా సక్రమంగా నడుస్తుంటే, స్నేహంగా మారుతుంది. పరిచయం స్నేహంగా మారేలోగా సంబంధం అవుతుంది. కొన్ని కొన్ని పరిచయాలు సమ్యక్ బంధం అవుతాయి. కొన్ని పరిచయాలు బంధం అవుతాయి. కొన్ని పరిచయాలవల్ల మనిషి ఉత్తీర్ణుడవుతాడు, ఉద్ధరింపబడతాడు. పరిచయం నుండి సంబంధం, సంబంధం నుండి స్నేహం యేర్పడుతుంది. అందుకని భగవంతునితో పరిచయం నుండి సమ్యక్ బంధం యేర్పడడాన్ని రెండవ మెట్టుగా తీసుకోవాలి. సమ్యక్ బంధం వేరు, ఊరికే ఆయన్ని మనకి కావలసిన వాటికోసం వాడుకోడం వేరు. 'నేను నువ్వయ్యేట్లు చూడవయ్యా అనీ, నీవు నన్ను ఉద్ధరించుకోవయ్యా' అనీ అనుకోవాలి. 'తనను తలచినవాడ్ని నా అంతవాడ్ని చేస్తాను' అని చెప్పారు కదా CVV గారు! ఆయన నన్ను తలచుకున్నవాడ్ని ధనవంతుడ్ని చేస్తానని గానీ, పెద్ద పదవులు యిస్తానని గానీ చెప్పలేదు. 'నేను' అనేదేమిటో తెలుసుకోవాలంటే నన్ను తలచుకో. మిగిలినవి ఏమన్నా కావాలని తలచుకున్నావా చచ్చావే. ఏది తెలుసుకోడం వలన సమస్తాన్నీ దాటేస్తానో అది తెలపడానికి నన్ను తలచుకో. నీకింకా దాని మీద భక్తి, శ్రద్ధ లేకపోతే నావద్దకు రాబోక, అంతా అగ్ని, ముట్టుకుంటే అంటుకుంటుంది, అని చెప్పారు. 'ప్రణతి నిజజనాన్ స్వాత్మ తుల్యాన్ కరోతి' అనేది మాస్టరుగారి జన్మయొక్క keynote సందేశంగా భృగునాడి చెప్పింది. 'నన్ను తలచుకున్నవాడ్ని నా అంత వాడిగా చేస్తాను అని పరబ్రహ్మతత్త్వం మళ్ళీ భూమిమీదకి దిగివచ్చింది' అని రాసిన సన్నివేశం అది. కనుక భగవంతునితో సంబంధం ఏర్పరుచుకోవాలి. అదికదా కుంతి కోరుకుంటుంది. 'నీతో సంబంధం వుండేట్లు చూడవయ్యా' అని! అసలు సంబంధం లేదనుకోండీ, పరిచయస్తులు వేరు, సంబంధీకులువేరు, బంధువులు వేరు. బంధువులలో సంబంధులుండవచ్చు, వుండక పోవచ్చు కూడా. ఎక్కువ మంది బంధువులు హక్కులు కోరుతారు, సమ్యక్ బంధులు

ఒకరియందు ఒకరు బాధ్యత పడడంగా వుంటుంది. కృష్ణుడు అర్జునియందు బాధ్యత పడతాడు. అర్జునుడు కృష్ణుడియందు బాధ్యత పడతాడు. వేలుకి రక్తం అయితే ఠపీమని జలీచీర చింపి కట్టుకట్టింది ద్రౌపది కృష్ణునికి. అదీ సంబంధం! జలీచీర కదా, ఏదో గుడ్డ వెతుక్కు వస్తానన్నలేదు. ఆమె యెటువంటి చీర కట్టుకుని వుండాలి ఆ రోజు? రాజసూయయాగం చివరిరోజు ఆరోజు. భీష్ముడు 'సమస్తానికీ పెద్దవాడు ఆయన వున్నాడు, ఆయనకి అగ్రపూజ చేయండి, నాకు కాదు' అని పాండవులకి చెప్తాడు. కూర్చోపెట్టారు. ఎవరో యేదో వాగాడు. వాడి మీద చక్రం వదలాల్సి వచ్చింది. ఎన్ని సార్లు చక్రం వదలలేదూ. వేలి నుండి ప్రతిసారీ రక్తం వచ్చేట్లయితే యెవరన్నా ఆ చక్రం వదులుతారా? ఆ సారి మాత్రం అలా అయ్యింది. ఎందుకూ? సంసిద్ధత ఎవరికున్నదో చూడడానికి, ఎవరిచ్చారూ? ద్రౌపది! అందరికన్నా ముందు ఆమె వచ్చి, చీరె చింపి కట్టింది. ఏంటదీ? సమ్యక్ బంధం! అక్కడ బోలెడు మంది మగవాళ్ళు వున్నారు. ఏం ఆడవాళ్ళే కట్టాలా? లేదు. పంచో, ఉత్తరీయమో అర్జునుడో, ధర్మరాజో ఎవరైనా చింపవచ్చు కదా? ఆవిడ చింపి వెంటనే కట్టడంవల్లనే ఆమెకు మానభంగ సమయంలో చీరలు యివ్వడం జరిగింది అని భగవంతుని విషయంలో చెప్పకోవడం చాలా తప్పు. ఆయన విషయంలో అలా వుండదు. అది కేవలం మానవులం చేసే పని. మానవుల మస్తిష్కంలో వ్యాపార దృష్టి వుంటే 'నాకు ఆయనేం చేసాడో, దాన్ని బట్టి నేను ఆయనకు చేసిపెడతాను' అనేది commercialism. అలా వుండదు. అందులో కూడా కొంతే చేస్తాం, అంతా చెయ్యం. ఇతరులు చేయడం, చేయకపోవడంతో సంబంధం లేకుండా ధర్మాన్ని అనుసరించి భగవంతుడు చేయవలసినది అప్పడికప్పుడు చేసేస్తాడు. ఇంతకీ యిలా ద్రౌపది సంబంధం కలిగివుండడం వలన ద్రౌపదికి అవసరమైనప్పుడల్లా, అంటే యే ఆపదవచ్చినా కృష్ణుడున్నాడు. దుర్వాసుడొచ్చినా, యింకెవరొచ్చినా కృష్ణుడు ఆమెకు వుంటాడు. ఎందుకంటే ఆమె ఆయనతో అలాంటి అనుబంధాన్ని పెంచుకున్నది కాబట్టి. భక్తులు అలా వుంటారు. కష్టం వస్తే కంగారు పడుతున్నామా? దేవుని తలచుకుంటున్నామా? కంగారు పడ్డావా, ఉపయోగంలేదు. ద్రౌపది కృష్ణుని ఎప్పుడూ సహాయం కోరలేదు. అడిగేవారు వేరు, అడక్కుండా సంబంధం పెట్టుకుని వుండేవారు వేరు. ఇహ అక్కడ నుండి మూడవమెట్టు స్నేహం! ఎటువంటిదో ఆ స్నేహం? స్నేహం అనే పదం సన్నిహితత్వంలోంచి వచ్చింది. అంటే బాగా దగ్గరైపోతున్నారన్నమాట. దేంట్లో? శరీరంతో రాసుకుంటూ, పూసుకుంటూ తిరగడం కాదు సన్నిహితం. చైతన్యపరంగా సన్నిహితత్వం! వాడేమన్నా అనుకుంటే వీడికి తెలుస్తుంది. వీడేమన్నా అనుకుంటే వాడికి తెలుస్తుంది. అది సన్నిహితత్వం! వాళ్ళు మహాత్ములు. వీరు భగవంతునికి సన్నిహితులయ్యారు కనుక భగవంతుని సంకల్పం తెలిసి పని చేస్తూంటారు. వీళ్ళు భగవంతునికి సన్నిహితులు, భగవంతుడు వీరికి సన్నిహితుడు. మిగతావారంతా అంతకన్నా ఒక మెట్టు తక్కువే! మనం భాగవతంలోని భాగవతోత్తముల జీవితాలు

చదివి చూస్తే అది కనిపిస్తుంది. వాళ్ళకి ముందు భగవంతుడు, తరువాత తక్కినవి, ప్రాణంతో సహా. అసలు ప్రాణం బావుండీ, రోజూ తినాల్సింది తినీ, చేయాల్సింది చేసి తల్చుకోడానికే కష్టం. ఈ పూట దొరకలేదట, ఏం తలుచుకుంటావ్? ఏమి దొరకలేదో అది తలుచుకుంటావ్. 'తినకపోతేనేమిటీ' అనుకుంటూ ఉపవాసాలు చేసేవాళ్ళు ఎందుకు వుపవాసాలు చేయడం? తినకపోవడాన్ని తలచుకోడానికి తప్ప, దేవుడ్ని తలుచుకోడానికి కాదుగా నువ్వు చేసే వుపవాసం. దేవుడ్ని తలచుకోవడం వలన తినడం మరచిపోడం నిజమైన ఉపవాసం. అసలు ఉపవాసం అంటే 'వాడియందు మనకుండే ప్రీతిచేత తినడం మరచిపోయాం' అదీ! అత్యంత ప్రీతికరమైన సన్నివేశంలో మనం వుండీ, తినడం మరచిపోతే, ఎవరన్నా గుర్తుచేస్తే ఓహో! తినలేదు కాబోలు అనుకుంటాం. ఇంట్లో పెళ్ళంటే ఒళ్ళు విరుచుకొని చేస్తారు, ముఖ్యంగా ఆడవాళ్ళు. ఎందుకూ? ఆ సన్నివేశంలో వుండే సన్నిహితత్వం వల్ల. మామూలుగా చేయమనండి. చేయలేరు. ఇంతచేసి ఓ రోజు విశ్రాంతి తీసుకుని అలోచిస్తే 'ఇదంతా మనం యెలా చేశాము' అనిపిస్తుంది. శరీరం మరచి ఓ 15 మంది పనిచేయడం వల్లనే కదా గురుపూజలు సక్రమంగా సాగుతున్నాయి. మిగతావారంతా చుట్టపుచూపుగా వచ్చేవారే. 'మాస్టర్' అనే చైతన్యానికి సన్నిహితులైన వారి నుండి, గురుపూజలకు మనం వెళ్ళకపోతే బావుండదేమో అనుకునే వారి నుండి, భోజనాలు బావుంటాయని వచ్చే వాళ్ళ దగ్గర నుండి, అతిథుల వరకు పారలు పారలుగా వస్తారు గురుపూజలకి. నిశబ్దంగా పనులు చేసుకుంటూ వెళ్ళిపోతారు, ఎందుకూ? కేవలం మాస్టరు చైతన్యానికి సన్నిహితంగా వుండడానికి. 'మాస్టరు' చైతన్యానికి దగ్గఱగా వచ్చేవారు 3వ మెట్టువారు. సన్నిహితులంతా భగవద్భక్తులలో కనిపిస్తారు. భగవంతుడికి సన్నిహితులు అంటే వారి గురించే భాగవతంలో చెప్పబడ్డది. అందుకే వారి చరిత్రలు మాటిమాటికీ, మాటిమాటికీ చదువుకుంటే మనం ఎక్కడవున్నాం? వాళ్ళకీ మనకీ యెంత దూరం వున్నదీ, ఎంత వ్యత్యాసం వున్నదీ, మనం ఇంకా యెదగాలి, యెంత మలచుకోవాలీ మనల్ని అని తెలుస్తుంది. ధర్మరాజు, నలుడు, హరిశ్చంద్రుడు వీరందరి కథలూ భాగవతంలో వున్నాయి. రోజూ రాత్రి పడుకునేప్పుడు చదువుకోండి, హరిశ్చంద్రుడు సత్యంకోసం పడ్డపాట్లు చదివితే కళ్ళ వెంబడి నీళ్ళు రాకుండా ఉండవు. మహోత్ముల కథలన్నీ కూడా ముళ్లమీద నడచి వెళ్ళినవి. గులాబీల మీద నడచివెళ్ళినవి కావు. వారితో పోల్చుకుంటే మనం యెక్కడున్నాం అని తెలుసుకోగలుగుతాం. మనం కూడా వాళ్ళలాగా వుండాలనే స్ఫూర్తి కలిగి, పెరుగుతుంది. 'సన్నిహితమైన' 3వ మెట్టు నుండి 'ప్రాప్తి' 4వ మెట్టు. ప్రాప్తి అంటే 'భగవత్ ప్రాప్తి'! ఇది భగవంతుని విషయంలో అయినా అదే, మామూలు ప్రాపంచిక విషయం లో అయినా అదే. 1. పరిచయము, 2. బంధము లేక సంబంధము, 3. స్నేహము లేక సన్నిహితము, 4. ప్రాప్తి లేక భగవత్ ప్రాప్తి! సినిమాల్లో చూపిస్తారు కదా. కథానాయకునికి, నాయికకి ముందు పరిచయం, 2,3 సార్లు కలిసాక ఇష్టం,

తర్వాత స్నేహం ఏర్పడుతుంది, బంధం యేర్పడుతుంది. మధ్యలో villain వచ్చి కష్టాలు పెడతాడు. మన నుండి వచ్చిన 'కర్మ' రూపమే villain. భగవత్ ప్రాప్తికి నువ్వు చేసిన కర్మలు చాలా వున్నాయి. ముందు అవి clear చేసుకో, నీకిప్పడే భగవంతుడేమిటి, అని చెప్తుంది మన కర్మ. పెద్దపెద్ద దుంగలు అడ్డుపడేస్తుంటే, క్రింద పడి దెబ్బలు తగిలి కుయ్యో మొర్రో అంటూ లేచి, మళ్ళీ నడక సాగిస్తూ మళ్ళీ పడుతూలేస్తూ చివరకు పడ్డప్పుడు రామా, కృష్ణా అంటూ దేవుడ్ని తలచుకొనే స్థితికి వచ్చేస్తాం. ఈ రోజుల్లో మరీ తక్కువ పిల్లల్ని కనడం వల్ల పిల్లలు బయటికి వెళ్ళి ఓ గంట ఆలస్యంగా వస్తే భయపడడమే కానీ రామా, కృష్ణా అనుకోరు. 'అన్నిటికీ వాడున్నాడు' అనేది 'భక్తి'! వాడేం చేసినా ఒప్పుకుంటాం అంటాం, ఒప్పుకోక యేం చేస్తావ్? మొత్తం Train అంతా అనకాపల్లి వెళ్తుంటే, నువ్వు అనకాపల్లి వెళ్దామనుకుంటే ఫరవాలేదు, కానీ విజయనగరం వెళ్దాం అనుకుంటే ఘర్షణేకదా? ఎందుకంటే వెళ్ళేది అనకాపల్లి. చక్రం నడుస్తుంటే, అనుకున్నవి అయినప్పడల్లా నువ్వనుకోవడంవల్లనే అయ్యిందని అనుకుంటే, అనుకున్నవి కానప్పడూ? అనుకున్నవి కాకపోవడమే యెక్కువ కదా. మరి ఆ తెలివి రావద్దా? వాడిమీద సమస్త భారమూ వేసి, వాడే నిర్వహిస్తాడు, నాకర్తవ్యాన్ని నేను చేస్తాను, మిగతావాటితో నాకేమీ సంబంధం లేదు, వాడితోనే సంబంధం, అందరిలో కూడా వాడితోనే నాకు సంబంధం. 'నీవే తల్లివి, తండ్రివి, గురువు, దైవము, తోడూనీడ, సఖుడవు నిజముగ కృష్ణా' అని మనం అనుకుంటే 'అమ్మో నిజమే' అనుకుంటాడు కృష్ణుడు. 'కాదులే' అని పద్యం అవగానే మనమే నిరూపించేస్తాం. 'అమ్మయ్య' అనుకుంటాడు అప్పుడు కృష్ణుడు. పద్యం జీవితంలో సత్యమైతే? అప్పుడు 'ప్రాప్తి' వస్తుంది. మనలో వుండే సంస్కారాల రూపంలో మన 'కర్మ' వుంటుంది. ఎప్పుడూ సంచితం అంటే వచ్చినప్పడే సంచినిండా పట్టుకొస్తాం, పోగేసుకొచ్చామన్నమాట. 'సంచయనము' అంటే పోగెయ్యడం. వట్టి ఎముకలు పోగేస్తేనే సంచయనం అనుకోవద్దు. ఏం పోగేసినా సంచయనమే. 'సంచి' అని తెలుగులో అనేది అందుకే, పోగేసుకునేవన్నీ అందులో పడేసుకోవడానికి. సంచీలో అలా వేసుకొస్తాం. సన్నివేశాలు వచ్చినప్పడల్లా అవి మొలకెత్తడానికి ప్రయత్నిస్తుంటాయి. ప్రియంగా వుంటుందని అబద్ధం చెప్పడం, ఎవరూ చూడలేదని అదేదో కాజేయడం వరకు. అందరూ చూస్తుంటే చేయకూడనివి యెవరూ చూడ్డం లేదన్నప్పడు చేస్తాం కదా. అది యెక్కడుంది? లోపల సంస్కార రూపంలో వుంటుంది. ఇది ఉండగా, ప్రతివాడికీ 'వివేకం' యిచ్చాడు భగవంతుడు. లోపల నుండి సత్యం పలుకుతుంది. సత్యం పలికినప్పడు దాని నోరు నొక్కేసి పనులు కానిచ్చేవాళ్ళు కొందరు ఘర్షణ పడి, నిజమేకదా యీ పని చేయకూడదని తెలుసుకుని దాటేవాళ్ళు కొందరుంటారు. ప్రతిసన్నివేశంలోనూ మనకి యెప్పటికప్పడు లోపలనుండి ఆత్మబోధ వస్తూంటుంది. దాన్నే దివ్యసంకల్పం, Good-will, Free-will, సత్యసంకల్పం అంటారు. దీన్ని పని చేయనిచ్చి, చెడ్డపనులు చేయకుండా వుండినప్పడు, చేస్తే వచ్చే

consequences నీకు లేకుండా అక్కడికది ఆగిపోతుంది. లేకపోతే అందులోంచి మరో round వెళ్లిపోతుంది. అజామిళుడు సాధన చేసుకునేవాడే. లోపలున్న సంస్కారం బయటికి వచ్చి, అవునా, కాదా అని తర్జన భర్జన పడి వెళ్ళిపోయి, వృత్తములు వృత్తములుగా తిరిగీ, చివరకు చచ్చీ చెడీ చచ్చేలోపల వెనక్కి వచ్చాడు. అప్పటికయిపోలేదు. ఆ కథ మళ్ళీ మార్గంలోకి వచ్చాడనే చెప్తోంది తప్ప 'నారా' అంటే చివర్లో ముక్తి యిచ్చేసాడు అని అనుకోవద్దు. ఎందుకంటే ముక్తి యిస్తే, ఆ తరువాత గంగ ఒడ్డునా, త్రివేణీ ఒడ్డున తపస్సు చేస్తాడని రాస్తాడా తరువాతి కథలో? మహత్ముల సేవచేసి, మహాత్ములని దర్శించి, ధ్యానంచేసి చివరకు త్రివేణీ సంగమం చేరుకొని, ధ్యానం చేసికొని విష్ణులోకం చేరాడు అని రాస్తారు ఆ తరువాతి కథలో. చచ్చిన తరువాత అవన్నీ యెలా చేస్తాడూ? అంటే మళ్ళీ వెళ్ళిపోయే రోజున, కాస్త భగవంతునికి సంబంధించిన విషయం తలచుకోవడంచేత మళ్ళీ మార్గంలోకి వచ్చి నిలబడ్డాడు అని అర్థం. అలా మనకి ఒక్కొక్క కర్మ గింగిరాలు కొట్టిస్తూంటుంది. అందుకనీ యెప్పటికప్పుడు వివేకాన్ని వర్తింపచేసి, సంస్కారాన్ని అడ్డుకోవాలి. సంస్కారం బలంగా వుంటే వివేకాన్ని తొక్కేస్తుంది. వివేకం బలంగా వుంటే సంస్కారాన్ని తొక్కేస్తుంది. ఇది కర్మ నివృత్తిమార్గం, కర్మ రాహిత్యమార్గం. 'నీకర్మ నేను తీసేస్తాను' అని CVV గారు చెప్పిందిదే! నీకు నీ బలం చాలట్లేదు కనుక నాబలం నీవు తెచ్చుకో. నాబలం చేత నీ సంస్కారాన్ని నువ్వు దహించేయ్'

కర్మతంత్రుడగుచు, కమలాక్షు కొలుచుచు, ఉభయనేతవృత్తి నుండనేని చెడును,
కర్మమెల్ల శిథిలమై మెల్లన ప్రభలమగుచు విష్ణుభక్తి జెడదు

భాగవతంలోని పద్యమిది. అలా చేస్తూ వుంటే మెల్లగా కర్మ అంతా శిథిలమై క్రమేపి వివేకం, అందులోని వెలుగు పెరుగుతూ వుంటుంది. తద్వారా క్షాళనమై 'ప్రాప్తి' వస్తుంది. ఇలా ఆ కథానాయకుడికి, కథనాయికకి మధ్య villain అడ్డుపడ్డ తర్వాత కలుసుకుని group photo తీయించేసుకుంటారు. మంచివాళ్ళంతా కలిసి photo అన్నమాట. అలాగ మనం ప్రాప్తి వద్దకు వచ్చేసరికి, ప్రాప్తికోసం ప్రయత్నం చేసేవారందరూ ఒకరికొకరు తెలుస్తారు. ఇలా పరిచయము, సంబంధమూ, స్నేహమూ, ప్రాప్తి అని నాలుగు మెట్లలో వున్నది. ఆయన అట్నించి దిగివచ్చినపుడు, ఆయన బలిపశువు అని చెప్పడానికి 'అజము' అని చెప్తారు. మేషరాశిలో గొఱ్ఱెతో కథంతా మొదలు మనకి. గొఱ్ఱెను బలి యిచ్చేసి, ఒకడి తలకాయ తీసి, గొఱ్ఱెతలకాయ పెట్టి సంవత్సర చక్రం తయారుచేసారని ఒక కథ వున్నది. అంతా సంకేతపరమే! ఆయనే దక్షుడు! తలకాయ తీసి మరొక తలకాయ పెట్టడమనేది ఒక పెద్ద ఉపదేశం! మనం చేసుకొనే ఈ సాధనంతా కూడా తలమార్పిడి కోసమే! పై డొల్ల అలాగే వుంటుంది కానీ లోపల భావాలు మారితే తలమార్పిడి అయినట్లే! అసలు నా భావాలు నేనేమీ మార్చుకోను, నువ్వేమన్నా బాగు చేయగలవా అంటే? తలకి మార్పు మంగలి బహిరంగంగా చేస్తాడు. అంతరంగంలో

లోపల మార్పు చేసేవాడు గురువు. అందుకే యిద్దరికే తల సమర్పించు-- బహిర్గతంలో మంగలికి, అంతర్గతంలో గురువుకి. ఇంకెక్కడన్నా తల అమ్ముడు పెట్టావో చచ్చావే. తల ఇంకెక్కడా తాకట్టు పెట్టక. ధనం కోసం, పదవులకోసం, రాజుల కోసం అసలు తల తాకట్టు పెట్టక అన్నారు. సత్యమార్గంలో నడిచేవారు రాజులకి లోబడి జీవించరాదు, అని చెప్తారు. అందుకే సరాసరి శివుడి దర్శనం పొందిన ద్రోణుడికి దుస్థితి, రాజుని ఆశ్రయించడం వల్లనే! భగవంతుని ఆశ్రయించినవారు యింకొకర్ని ఆశ్రయించకూడదు. స్వతంత్ర జీవనం వుండాలి. ఇంకొకడ్ని ఆశ్రయించినవాడు భగవంతుడ్ని కూడా ఆశ్రయించినపుడు యిద్దరు మాస్టర్స్ అవడంవల్ల యేది కావాలో తేల్చుకోలేక సతమౌతూంటారు. విదురుడికందుకే శ్రీకృష్ణుడు వచ్చి ఉద్యోగం తీయించేస్తాడు. స్వతహాగా జ్ఞాని అయిన విదురుడు అజ్ఞాని వద్ద చాకిరీ చేస్తున్నాడు. అజ్ఞాని చెప్పింది వినాల్సిన పరిస్థితులలో జ్ఞాని తనను తాను పెట్టుకుంటే యెలా వుంటుందీ? అందుకే రాయబారం పేరున వచ్చిన కృష్ణుడు ముందు చేసిన లోకకళ్యాణ కార్యం విదురునికి ఉద్యోగం తీయించేయడం. విదురుడ్ని పిలిచి 'నువ్వు యెప్పుడూ సత్యవాక్కు పలుకుతావు కనుక మొదటి నుండి ఏమైందో సత్యం చెప్పు' అంటాడు కృష్ణుడు. అతడు చెప్తుంటే ధృతరాష్ట్రుడికీ, దుర్యోధనుడికీ, వాడి తమ్ముళ్ళకీ కర్ణకఠోరంగా అనిపిస్తుంది. దుర్యోధనుడు వెంటనే లేచి అడ్డమైన మాటలు అంటాడు, విదురుడ్ని. తిడితే, విదురుడి మనస్సు బాధపడి అన్నయ్య పక్కన చూస్తే, అన్నగారేమీ మాట్లాడడు. వాడికి మమకారం. అందుకే గుడ్డివాడు. మమకారం చేత యేర్పడ్డ గుడ్డితనం. అందుకే యెక్కడ మమకారం వుంటే అక్కడ గుడ్డితనం వుంటుంది, అని చెప్తున్నది భారతం. మమకారంలో పడి మనం చేసే పనులన్నీ గుడ్డిపనులే. అందుకని గుడ్డివాడు మాట్లాడకపోతే, బాధపడి సంకేతార్థమైన తలపాగా (counselor to the king, సలహాదారుడు) అక్కడ పెట్టేస్తాడు. అయినా ఆ రాజు 'అదేమిట్రా' అనడు. ఏమిటంటే కనబడదుగా! 'అహా! నేనేం లెక్కలేదు మాఅన్నయ్యకి' అని 2 శతాబ్దాలు దాటాక తెలిసింది. అదేం జ్ఞానం! కేవలం విదురుడ్ని ఉద్ధరించడం కోసం అలా చేసి పెడతాడు కృష్ణుడు. రెండెందుకురా ఒక్కడ్ని ఆశ్రయించమని. అందుకే వాడినాశ్రయించిన వాడికి ఇంకొకటి వుండదు. పోతన ఏమి చేశాడు? 'కర్ణాట కిరాట కీచకులకునమ్మ, త్రిశుద్ధిగ నమ్ము భారతీ', ఏమైనా సరే, నాకుటుంబానికెంత అపకారం జరిగినా, నేను సంసిద్ధుడనే, నేను మాత్రం పిచ్చిపని చేయను అని చెప్తాడు. బోలెడు డబ్బు, హోదా, పలుకుబడి, సలాములు ఇంక అంతకన్నా యేం కావాలండీ జీవితానికి? రాజుగారి ఆస్థానంలో, రాజుగారు నిన్ను తలమీద పెట్టుకుంటారంటే యింకేం కావాలి? నీకు కావలసిన కార్యాలు అన్నీ జరుగుతాయి. కోరినవి వస్తాయి. ఇన్ని facilities వదులుకుని, దేవుడి వద్ద కూర్చోవడం అనేది సంసిద్ధత! అప్పుడే ప్రాప్తి! అందుకే మనకా కథ యిచ్చారు. వాడ్ని వదలమన్న యే భావమన్నా, అది యెంత గొప్ప భావమన్నా సరే ఆ భావాన్ని వదిలేయడం అనేది

చేసినవాడికే 'ప్రాప్తి'. 'అజ' అంటే చాలనిది అని కూడా అర్థము. ఇక్కడ అజము అంటే యజ్ఞపశువు. యజ్ఞం చేస్తే అందులో నుండి అరణ్యాలు పుట్టినాయి. అందులోంచి గ్రామాలు అంటే గుంపులు గుంపులుగా జీవులు పుట్టారు అని అర్థం. అందులోంచి ఋగ్వేదం (సంకల్పం) పుట్టింది. అందులోంచి సామవేదం (జ్ఞానం) పుట్టింది. అందులోంచి యజుర్వేదం (క్రియ) పుట్టింది. అందులోంచి గోవులు పుట్టాయి అనగా 'కిరణములుగా వెలుగు ప్రసరించడం పుట్టింది' అని అర్థం. అందులోంచి అశ్వములు పుట్టాయి అంటే 'వెలుగు వ్యాపనం చెందే శక్తి అందులోంచి పుట్టింది' అని అర్థం. అందులోంచి పైదవడలు వుండేవి మాత్రం పుట్టాయి. అందులోంచి కింది దవడలు మాత్రం వుండేవి పుట్టాయి. అని చెప్పుకుంటూ వచ్చారు. అంటే ముందు హిరణ్మయ లోకాలు యేర్పడి, అది ఆధారంగా మనం యెరిగిన స్థూలమైన లోకాలు యేర్పడ్డాయి అని చెప్పడం. అందుకే యజ్ఞంలో పైన బంగారం డిప్ప, కింద వెండి డిప్ప వుండే కప్పల్లో నీళ్ళు పోసి వుంచుతారు. పురుషసూక్తంలో ఈసృష్టి అంతా యెలా పుట్టుకొచ్చిందో చెప్తారు. సంస్కృతంలో వుంటే మనకేమిటో తెలియదు. ఏం చేస్తే వచ్చాయి? వాడ్ని యేమీ మిగలకుండా సర్వం కాల్చేసారుట. భర్గోదేవ మండలం, సవితృమండలం, సూర్యమండలం, గ్రహగోళాదులు, భూమండలం, వీటన్నిటి మీదా జీవులు, వీటన్నిటిమధ్య సంచరించే ప్రజ్ఞలూ యివన్నీ పుట్టుకొచ్చాయి. చూస్తే యింత అయ్యాక కూడా, యీ పుట్టించిన దానికన్నా మించి వున్నాడుట ఆయన. మీరెంత పుట్టించినా యింకా మిగిలి వుంటాడు. ఈ మొత్తం అంతా కూడా మళ్ళీ వాడిలోకి వెళ్లిపోతుంది. అందుకని అట్నుంచి ఇటు దిగిరావడానికి యజ్ఞం చేస్తే, ఆయన సమర్పణ చేసుకున్నాడు. మిమ్మల్ని వండేస్తాం, కట్టేస్తాం అంటే కానీయమన్నాడు. అందుకని కట్టించబడి, సంహరింపబడేదానికి ఉత్తమలోకాలు వస్తాయనే ఒక సాంప్రదాయం వున్నది. ఒకాయనకి ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో ఒకరోజు తనకున్న గొఱ్ఱెలలో తనకు అత్యంత ప్రీతి అయినదీ, శ్రేష్ఠమైనదీ, పవిత్రమైన గొఱ్ఱెని దేవుడికి సమర్పణ చేసేస్తున్నాడట. అలా చేస్తూంటే 'నీ కొడుకుని నాకు సమర్పణ చేయమని' భగవద్వాణి వినిపించిందిట. సిరియాళుడికథ శివపురాణంలో వస్తుంది. అలాంటి కథే బైబిల్లో వస్తుంది. అబ్రహాం 'నీకొడుకుని నాకు బలి చెయ్యరా, వూర్కే గొఱ్ఱెలిస్తావేమిటి' అంటే కొడుకుని నాతో వస్తావా, అంటే వస్తానంటాడు. సరే తనతో తీసుకువెళ్లి, అక్కడ నిన్ను దేవుడికి సమర్పణ చేద్దామనుకుంటున్నాను, అంటే వాడేమో చేసెయ్యమంటాడు. అంటే భగవంతునికి సమర్పణ అంటే సంసిద్ధత అన్నమాట. తండ్రి కొడుకుని చంపడం అంటే తనను తాను చంపుకోవడమే. ఎందుకూ? 'అత్మావై పుత్రనామాసి' అని అంటారు కదా. తన నుండి పుట్టిన వాడ్ని తన చేతులతో నరకడం అంటే అయ్యేపనికాదు. తండ్రి చెప్తే, తల్లిని నరికాడు పరశురాముడు. ఎలా నరికాడు? అంటే, ఎటువంటి అవగాహన వుండడం వలన నరికాడూ? నరికినా ఫరవాలేదు, అక్కడ తండ్రి రూపం లో దైవం వున్నాడు, వాడే చూసుకుంటాడు, అని నరికేశాడు. 'ఏంట్రా

నరికావ్' అంటే నువ్వు చూసుకో, నరకమన్నావు, నరికేసాను, అంతే! ఆయన భార్యని మళ్ళీ బ్రతికించుకుంటాడు. భార్యకదా అని బతికించలేదు. ఆమెని పునీతం చేయడానికి అలా చేస్తాడు. ఈ కలియుగంలో అర్థమయ్యే కథలు కావవి. బొత్తిగా araldite వేసి శరీరాన్ని అతికించేసుకున్న జీవులం మనం. పీకితే యేడవడం తప్ప, నీకోసమే పీకుతున్నానంటే ఒప్పుకోడు. అందుకే తెలివి తప్పించి పట్టుకు పోతున్నారు. ఈ రోజుల్లో తెలిసి దేహం వదిలేవాడు కోటికి ఒక్కడే వుంటాడు. పోతున్నాం అంటే ఈ దరిద్రంలోంచి బయటికి పోతున్నాం, అనే భావనే లేదే. అందుకని యజ్ఞం ఇటు నుండి చేసినా వాడు దొరుకుతాడుటండి. కృష్ణుడు చేసింది పురుషమేధం! తనను తాను అలా సమర్పణ చేసుకుని, 126 సవత్సరాల్లో ఏ ఒక్కరోజూ తన కోసం బ్రతకలేదు. పుట్టిన దగ్గఱ నుండి 'Hit list లో Z లో' వున్నాడాయన. మనకీ X,Y,Z అని 3 list లు యిచ్చారు. ఇహ Naxals any moment కొట్టేస్తారు అనుకున్నవాడికి 'Z' list లోని వారు, second category 'Y' list, third category 'X' list. ఇలా 3 listలు ఉన్నాయి. కృష్ణుడు పుట్టినదగ్గరనుండి Z list. వచ్చిన పని చేసుకువెళ్ళాడే తప్ప, 126 సంవత్సరాలలో తన కోసం యేం జీవించాడండీ? చూడ్డానికి చాలా వైభవంగా జీవించాడనిపిస్తుంది. ఎప్పటికప్పుడు రోజూ నువ్వు చంపబడతావు అనే స్థితిలో నువ్వుంటే, ఏమిటయ్యా నువ్వు ఆనందించేది? Any moment we may die, we may be killed. We may die applies to all, true with all. తలచుకుంటేనే భయమేసి చచ్చిపోవచ్చు మనం. అలాంటిది యెప్పుడయినా నిన్ను చంపెయ్యచ్చుట అంటే యెంత అప్రమత్తంగా వుండాలి? అయినా యెంత క్రీడామయంగా జీవించాడూ? ఎంత భూమి ఉద్ధరణకు జీవించాడూ? భూమిని, భూమిజీవులను, భూమిని కాపాడే పెద్దపెద్ద ప్రజ్ఞలను, ఇంద్రుడ్ని, బ్రహ్మని, వాళ్ళ లోకాలకు వెళ్ళి వాళ్ళని, నరకలోకానికి వెళ్ళి వాళ్ళని అందర్నీ ఉద్ధరించాడు. ఎన్ని పనులు చేసాడండీ? తలచుకుంటే అత్యంత ఆశ్చర్యం కలిగేటన్ని పనులు చేశాడు. 126 సంవత్సరాలలో చివరి నిముషం వరకు చేస్తూనే ఉన్నాడు, అదీ పురుషమేధము! అంతేకానీ వూరికే పూజలందుకోడానికి కాదు. చేసీ, చేసీ, చేసీ అయిపోయి వెళ్లిపోయాడు. EK గారు రాసిన పురుషమేధం చదివితే, మనలో అద్భుతమైన లోతులు వస్తాయి. శ్రీకృష్ణుడేవిధంగా సృష్టిజీవుల హితంకోసం తనను తాను సమర్పణ చేసికున్నాడో వుంది. ఆ పుస్తకంలో కృష్ణుని లోతులు బాగా తెలుస్తాయి. పిల్లనగ్రోవి మ్రోయించాడు, ఆడవాళ్ళతో ఆడాడు, పదిమందికీ పదిచోట్ల కనిపించాడు..... ఇవే మనకు తెలుసు. మిగతావో? తనని లెక్కచేయకుండా తనను తాను సమర్పణ చెంది ఉన్నాడు. ప్రక్కన పడుకున్నవాడు సాక్షాత్తు ఆదిశేషుని అంశే మళ్ళీ! యుద్ధంలో సారథిగా యెదురుగా వుండి, బాణాల తాకిడిని తను తీసుకుని అర్జునుడ్ని కాపాడిన వాడు. ముందు దెబ్బ నన్ను కొట్టు, నాభక్తులను కాదు అనే వాడు నిజమైన గురువు, దైవము! ప్రాణసంకట సమయాల్లో తన శిష్యుడ్ని రక్షించినవాడు సద్గురువు. కృష్ణుడు రోజూ యెన్ని బాణాల

దెబ్బలు తిని వుంటాడండీ? ఒళ్ళంతా పుండయిపోయి వుండదూ? ఎందుకంటే మన candidate కంటే యెదుటివాడు బలవంతుడు. భీష్ముడు అర్జునిడికన్నా గట్టివాడు. అర్జునుడి గట్టి, కృష్ణుని బలం మాత్రమే! ద్రోణుడు, కర్ణుడు, వీరంతా అర్జునిడికన్నా గట్టివారే. ఇక్కడ ధర్మం అన్నిటికన్నా గట్టి, కనుక దైవం కాయవలసి వచ్చింది. ఓసారి అర్జునుడు, హనుమంతుడికి తమలో తమకి యెవరు యెక్కువ భక్తులు అని పోటీ పెడ్తాడట. అసలు హనుమంతుడికి తను భక్తుడ్ని అనే తెలీదు. ఎందుకంటే ఆయనెప్పుడూ రాముడిలోనే వుంటాడు. కనుక భక్తుడనే గుర్తు కూడా వుండదు. తన గురించి ఆలోచించే సమయమేదీ? అది పూర్ణమైన భక్తి! భక్తంటే హనుమంతుడి తరువాతే. జ్ఞానానికీ, యోగానికీ కూడా హనుమంతుడే! 'జ్ఞానినాం అగ్రగణ్యం' కదా. ఈ జ్ఞానులం అనుకునేవారి కన్నా జ్ఞాని. ఎంత జ్ఞాని అంటే తను, తను స్మరిస్తున్న దైవం, స్మరణ ఈ మూడూ కూడా కలిసి ఒకటైపోయిన తత్త్వం! అదీ జ్ఞానం! అటువంటి వాడి వద్దకు వెళ్ళి వీడూరికే కుర్ర వ్యవహారం కదా. ఇదేదో కథగా యిచ్చారనుకోండి, నిజంగా జరిగిందని నేననను. ఇంతకూ వెళ్ళి 'నేను కృష్ణ భక్తుడ్ని' అంటే 'ఆహా' అంటాడు ఆంజనేయుడు. 'నీకు కృష్ణుడు తెలుసా?' అంటే 'తెలీదు' అంటాడు. 'రాముడు తెలుసు' అంటాడు. అయితే యేం చేద్దాం 'అంటే చూద్దాం నీ భక్తి గొప్పో, నా భక్తి గొప్పో' అని ఈయన bridge కడ్తాడు తనకుండే భక్తి, అంతకన్నా తనకుండే ఆయుధసంపత్తి, సామర్థ్యం చేత, కట్టి 'ఇది నాభక్తికి సంబంధించిన వంతెన. నువ్వు భక్తుడివి కదా. నువ్వు అది యెక్కి, తొక్కి విరిచేస్తే నువ్వు నాకన్నా భక్తుడిగా ఒప్పుకుంటాను' అని అర్జునుడంటే, హనుమంతుడు నవ్వుతాడు. ఒక కాలు పెట్టగానే ఒంగి, ఆగుతుంది. రెండో కాలు పెట్టాడు. అంతకంటే కొంచెం ఒంగి, ఆగుతుంది. ఇంకా పైనెక్కి తొక్కుతాడు. వంగదు. ఏం చేసినా వంగదు. 'నువ్వే నాకన్నా గొప్ప భక్తుడివి' అని హనుమంతుడు చెప్తాడు. ఆ వంతెన కింద నుండి కృష్ణుడొస్తాడు. ఆయన వీపంతా పచ్చడి పచ్చడి అయిపోయుంటుంది. అర్జునుడ్ని మందలించి ఇలాంటి పిచ్చిపిచ్చివి పెట్టబోక అని, హనుమంతుడి కాళ్ళకి దండం పెట్టమంటాడు. హనుమంతుడి దగ్గర గరుత్మంతుడికి కూడా గర్వ భంగం అవుతుంది. చాలా మందికి గర్వభంగం అవుతుంది. సమర్పణ చెందడంవలన భక్తుడి విషయంలో భగవంతుడు అంత తాపత్రయ పడతాడు. అంత సమర్పణ భక్తుడు కూడా చేసుకున్నట్లయితే, వాడుకూడా తనను తాను మథనం చేసుకోవడం వలన, తన నుండి దివ్యమైన ప్రణాళిక ప్రపంచానికి అంది, జీవులను ఉద్ధరిస్తూంటుంది. అదీ కృష్ణుడు చేసింది. త్యాగం లేకుండా యేమీరాదు. 'త్యాగం' అంటే ఈరోజుల్లో అందరూ చూసేట్లు 10రూ ఇవ్వడం కాదు. 'నీకున్నది ఇవ్వడం కాదోయ్, నిన్ను ఇచ్చుకో దేవుడికి' అనేవారు మాస్టారు. నీకున్నది యివ్వడం అంటే finance చేస్తున్నావని అర్థం. నీకున్నవి వాడికక్కరలేదు. నువ్వు కావాలి వాడికి. ఈ 1000 రూ వుంచండి సార్ గురుపూజలకి, అంటారు. ఎపుడొస్తారు గురుపూజలకీ? అంటే time లేదండీ, రావడం అవదు.... ఎలా

వుంటుందీ ? సమర్పణ యెక్కడ జరుగుతుందో అక్కడల్లా 'అజ' మనే భగవంతుని యొక్క కళ్యాణగుణాన్ని దర్శనం చేయాలి. మహాత్ములంతా అలా దర్శనం చేసినవారు. తమ్ముతాము సమర్పణ చేసుకుని, తద్వారా భగవత్ చైతన్యములోనికి వారు ఇమిడారు. భగవంతుడు తనను తాను సమర్పణ చేసుకుని సృష్టినంతా బయటకు తీసుకు వచ్చాడు. ఇది 'అజ'.

## 542 మహోర్షిః

మహోర్షిః అంటే చాలా గొప్ప అర్హత కలవాడని. భగవంతుడు చాలా గొప్ప అర్హత కలవాడని చెప్పుకోడంలో పెద్ద విశేషం యేమీలేదు. ఈ నామంలో వుండే గొప్పతనమేమిటంటే భగవత్తత్త్వం భాగవతుల రూపంలో ప్రపంచంలో మెలుగుతున్నప్పుడు, అత్యంత అర్హత కలిగినవాళ్ళలో, భగవంతుని యొక్క అస్థిత్వం దర్శనం చేయడం సాధన. ఈర్ష్యపడడం సాధన కాదు, మనకన్నా చాలా మంచివాళ్ళుంటే సంతోషించగలగాలి. మనకన్నా ఉత్తముడంటే సంతోషించగలగాలి. మనకన్నా యెక్కువ దైవీ సంపత్తి గలవాడంటే సంతోషించగలగాలి. అలా భగవంతుని యొక్క అస్థిత్వం గోచరిస్తున్నదని చూసి సంతోషించాలి తప్ప, మరొకరకంగా ఈర్ష్యపడినట్లైతే వున్న అర్హత కూడా పోతుంది. అందుకని అర్హులలో భగవంతుని అస్థిత్వం దర్శనం చేయాలి. ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క విషయమునందు అర్హత వుంటుంది. ఆ వ్యక్తిలో ఆ అర్హతగా గోచరిస్తున్నవాడు భగవంతుడుగా నీకు ధ్యాస వున్నట్లైతే నీకు అందరిలో భగవంతునితో సంబంధం యేర్పడుతుంది. ప్రతివ్యక్తిలోనూ కొన్ని అర్హతలుంటాయి. కొన్ని అనర్హతలుంటాయి. అనర్హతలు అతని చీకటికి సంబంధించినవి. మనకి సంబంధించినవి కావు. అర్హతలు అతని వెలుగుకి సంబంధించినవి, మనకి సంబంధించినవి. ఎందుకంటే మనంకూడా వెలుగుకి సంబంధించినవాళ్ళం కనుక వ్యక్తిలోని అర్హతలు మాత్రమే అందుకొని అనర్హతల జోలికి పోకుండా వుండడం అనేది మకరందం అందుకొనే తేనెటీగలాంటిది. పువ్వును నొప్పించకుండా మకరందాన్ని ఆస్వాదన చేసి, అనుభూతి చెందుతుంది. అలాగే సమస్త జీవులలో కూడా కళ్యాణగుణాలు వెతికి చూసుకొని, ఆనందించడం అనేది ఒక యోగసాధన. అలా సాధన చేస్తుంటే మనలో వుండే over critical nature పోతుంది. ప్రతివారినీ నిర్ణయించే nature పోతుంది. ప్రతివారిని ఎద్దేవా చేసే nature పోతుంది. తప్పులు బాగా వెతికి చూస్తూంటాం. ఒప్పులు మాత్రమే చూడడం దేవయాన మార్గం. దేవయానంలో ఒప్పులు చూడడం తప్ప, తప్పులు చూడడం వుండదు. అందుకని ప్రతివ్యక్తిలో వుండే మంచిని దర్శనం చేయాలి. ధర్మరాజు అలా దర్శనం చేశాడు. సాధకులంతా అలా దర్శనం చేశారు. సిద్ధిపొందారు. ఇతరులలోని అర్హతని గుర్తించాలనేది ఈనామంలో గోచరిస్తుంది. అదే 'విభూతియోగం' లో కూడా చెప్తారు. మొసలిని చూస్తే 'మొసలి పట్టు నేనే' అనడంలో ఉద్దేశ్యం అది మొసలి యొక్క అర్హత. ఇంకెవరికీ లేదు అలాంటి పట్టు. నువ్వు కూడా యేదైనా మంచి విషయాన్ని పట్టుకుంటే అలా పట్టుకో, అని నీకు సందేశం. అలాగే ఎలుకని చూస్తే నిపుణత, నేర్పరితనం కనిపిస్తుంది. లోకహితమైన కార్యములయందు నేర్పరితనం వున్నట్లయితే వినాయకుడికి సమర్పణ చెందిన ఎలుకగా

వుంటావు. కాకపోతే వాళ్ళింట్లోనూ, వీళ్ళింటిలోను యెవరికీ తెలియకుండా దోచుకుపోయే నేర్పరితనం వుంటుంది. మనం యెంత బాగా దాచుకున్నా ఎలుక మన కన్ను కప్పి రంధ్రం చేసుకుని తనకు కావలసినది పట్టుకు పోగలదు. ఇది ఎలుక నేర్పరితనం. ఈ నేర్పరితనం లోకహితంగా చూపించి, ఎవరికీ తెలియకుండా అందరి కన్నుకప్పి ఎన్నో మహాకార్యాలు చేసి, తను మాత్రం యేమీ తెలియకుండా వున్నాడనుకోండి, అది అర్హతగా మారుతుంది. మనం వుంటామా అలా? చిన్నపని చేస్తే వూరంతా తెలియాలనిపిస్తుంది. ఎలుక రహస్యంగా చేస్తుంది కద! లోకహిత కార్యాలు దైవసమర్పణగా, రహస్యంగా చేస్తే అర్హత వస్తుంది. అలా జంతువులలో అర్హతలున్నాయి. సింహంలో nobility, ఓ రకమైన రాజసం, గాభీర్యం వుట్టిపడతాయి. ఎట్టి పరిస్థితిలోనూ గడ్డి తినదు. పరిస్థితులు బాగాలేవు కనక కాస్త ఎంగిలిపడదాం అనే తత్త్వం సింహంలో కనబడదు. అలాగే ఏనుగులు, పాములు, తేళ్ళు ఇలా ఎన్నో జంతువులలో కనిపిస్తున్నదే అర్హత. అసలు ప్రతిదానిలోనూ నువ్వు చూడగలిగితే రెండు కనుపిస్తాయి. ఒకటి పనికిరానివి, రెండు పనికివచ్చేవి. ద్వాదశరాశులలో కూడా గోచరిస్తాయి. Negatives, Positives. నువ్వు దివ్యపథంలోకి నడచి వెళ్ళాలంటే ప్రతిదాంట్లో వుండే మంచిని మాత్రమే కోరి, చెడుజోలికి పోరాదు. మనస్సు చెడుజోలికి పోతూందిటా అంటే యెదుటి వ్యక్తిలోని చెడుజోలికి నీలో చెడు విజృంభించి పనిచేస్తోందిట, మేల్కాంచి వుందిట అని అర్థం. ఈ నామం చెప్పేది ఏమంటే ఇతరుల అర్హతలు చూడు, నీకు సంబంధించని ఇతరములని చూడక. అవి వాడికి సంబంధించినవి. ప్రతివ్యక్తిలోనూ వెతికి చూసుకుంటే మంచి కనిపిస్తుంది. ఎందుకంటే వ్యక్తి అంటే వ్యక్తమైనతత్త్వం అని కదా. అవ్యక్తము వ్యక్తమైనది, వ్యక్తీకరణం కూడా చెందినది అంటే ముందు అదృశ్యం నుండి దృశ్యమానమై, అక్కడ నుండి ఒకటిగా గోచరించడం మొదలుపెట్టింది. అవస్థితి చెందినా యిది అదేకదా. ఆకాశంలో వుండే ఆవిరి నీరై, నీరు మంచుగడ్డ అయిందనుకోండి, మంచుగడ్డలో వున్నది కూడా ఆవిరి అని ఎంతమందికి గుర్తుంటుందీ? అదీ లో దృష్టి. లోదృష్టి యేర్పరచుకోవడం Occultism, లేదా ఏదో గుడ్డెద్దు చేలో పడ్డట్లు గా ఉంటుంది. ఈ లోదృష్టి కలగడానికి 'ఇతరులలో వుండే అర్హతలను చూసి అసూయపడక' అని చెప్పారు. కర్ణుడు అర్జునుడిలో వుండే అర్హతలను చూసి అసూయపడ్డాడు. ఎందుకూ? ఆ అర్హతలు తనలో కూడా వున్నాయి కానీ యెవరూ గుర్తించడంలేదు. నీలోవున్నది యెందుకు గుర్తించడం లేదు, వాడిలో వున్నది ఎందుకు గుర్తిస్తున్నారు? ఒకసారి పునః పరిశీలన చేసుకుని, ఆత్మ పరిశీలన చేసికుని వుంటే కర్ణుడు బాగుపడి వుండేవాడేమో? అలాకాక వాడు నాకన్నా తక్కువవాడు, గొప్పవాడు కాదు అని ఋజువు చేయడం కోసం జన్మంతా తాకట్టు పెట్టాడు. ఏం కాలేదు కదా. దాంతో తనలో వున్న చెడు విజృంభించి మంచి బాగా తగ్గిపోయింది. అందుకే చెడు చూసిన దగ్గర నుండి, దానిలోంచి ద్వేషం, అసూయ,

వేర్పాటుధోరణి ఇవన్ని వస్తూంటాయి. ప్రతి చిన్న వాటిలోనూ అర్హత వుంటుంది, చూడగలిగితే. అసలు అర్హత అందరిలో ఒకటే. అందరమూ 'అదే యిది' గా తయారైనవాళ్ళమే కదా. దాన్ని అన్నిటిలో దర్శనం చేస్తే, అది కనిపిస్తుంది. మిణుగురు పురుగులో కూడా అర్హత వున్నది. అది కాసేపైనా, క్షణమైనా వెలుగుగా గోచరిస్తుంది. మనం మొత్తం జీవితంలో ఒక్కసారి కూడా ఎవరికీ వెలుగుగ గోచరించం. దాని జీవితం సార్థకత చెందింది. వెలుగు పురుగు వెలుగుకోసం సమస్తాన్ని అర్పణ చేసినట్లుగా కనిపిస్తుంది. దానికి అర్హత వున్నది. సృష్టిలో దేని అర్హత దానికి ఉన్నది. ఇలా అందరిలోనూ అర్హతగా అవతరించేతత్త్వం యేదైతే వుందో, అది భగవత్తత్త్వం గా సాధన చెయ్యడం ఈ నామం యొక్క ప్రత్యేకత. అలా చేసిననాడు నీలో అర్హతలు పెరుగుతాయి. మనలో అర్హతలు పెరగడం లేదుట అంటే, అర్హతలని మనం ఆరాధించడంలేదుట అని అర్థం. గింజుకున్నా, పీక్కున్నా అర్హత రాదు. నీ కర్తవ్యమునందు నీవు నిలబడి, యితరుల అర్హతను ప్రశంసించగలిగిన సమర్థత నీలో ఉంటే అర్హత వస్తుంది. మానవజాతికంతకీ ముందు నిలచి, జాతిని నడిపిస్తున్నవాడు మైత్రేయమహర్షి. శ్రీ కృష్ణుడు దేహత్యాగం చేసే సమయానికి, కొత్తతరం జాతికి ఎవరు వెలుగుకు దారి చూపించేవాడిగా మిగులుతాడో అని చూస్తే, అందరికీ మైత్రేయుడు అగ్రస్థానంలో వున్నాడు. కాబట్టి మైత్రేయుడ్ని జగద్గురువుగా స్థాపితం చేసి, 'కలియుగంలో జీవులని ముందుకు తీసుకు వెళ్తుండు. వాళ్ళకి దారిచూపించు. అసలే చీకటి. చీకట్లో చిరుదీపంగా నిన్ను ఇక్కడ వదిలి వెళ్తున్నాను' అంటాడు. 'నేనూ వచ్చేస్తాను' అంటే 'ఎక్కడికి వచ్చేస్తావు? నేనసలెక్కడ లేను?' అంటాడు. అన్నిచోట్ల వుండేవాడి వద్దకి 'వచ్చేస్తాను, వచ్చేస్తాను' అంటే ఎక్కడికి వెళ్తావు? ఉన్నచోట వుంటే వెళ్ళినట్లే. ఎక్కడో వున్నాడనుకుంటే ఇక్కడ లేడని అనుకోడమే కదా. ఇక్కడ లేడనుకుంటే పప్పులో కాలేసినట్లే కదా. కనుక మైత్రేయుడికి ఆ బోధచేసి ఇక్కడ వుంచేశాడు. ఉన్నాడాయన. 2,500 సంవత్సరాలు నడిపించాడు. నడిపించేసరికి వుద్ధతంగా, ఫెళఫెళమంటూ వచ్చి, తనను దాటి ముందుకు వెళ్ళిపోయాడు. ఎవరూ? గౌతమబుద్ధుడు! నన్ను ఆయన నియమించాడు కనుక నాకన్నా ముందు ఎవరూ వెళ్లరాదు, అన్న నియమమేమైనా వున్నదా? అలా అడ్డుపడి వుంటే కిందపడి పోయేవాడు. తనకన్నా విజృంభించి, మార్గం లో ముందువెళ్తున్న మానవుడ్ని చూసి, మైత్రేయుడు ప్రశంసించాడు. మనం ప్రశంసించగలమా? ప్రశంసించడమే అర్హత! అంతేకాదు ఆయన చప్పట్లు కూడా కొట్టాడట. చప్పట్లు కొట్టడమే కాదు పూజచేసాడట, ఆరాధన చేసాడట, ఆనందించాడట. హత్తుకున్నాడుట, రకరకాలుగా ప్రశంసించాడుట. ఉద్ధవుడు, విదురుడు కలుసుకున్నారు. ఉద్ధవుడు భక్తుడు, విదురుడు జ్ఞాని. General గా వీళ్ళిద్దరూ కలసినప్పుడు జ్ఞాని భక్తుడ్ని ఒక emotional fellow గా చూస్తాడు. ఆ భక్తుడు ఈ జ్ఞానిని ఒక అహంకారిగా చూస్తాడు ఇంతే. ఇంతకన్నా ఏమీ వుండదు. దొందూ దొందే అంటే ఇద్దరూ పప్పులో కాలేసారని.

కానీ విదురుడు ఉద్ధవుడిలోని భక్తి పారవశ్యం దర్శనం చేశాడు. ఉద్ధవుడు విదురుడిలోని జ్ఞానాన్ని దర్శనం చేశాడు. కనుక సమయం తెలియనంతసేపు కౌగలించుకుని అశ్రుధారాపూరితులై అలా నిలబడి పోయారుట ఇసుక తిన్నెల్లో. ఆ తరువాత ఒకరినొకరు పలకరించుకునే ఘట్టం అద్భుతంగా వుంటుంది. భాగవతంలో రాసిన దానికన్నా ఓ వందరెట్లు ఎక్కువగా ప్రభుదత్త బ్రహ్మచారి అని ఒకాయన 'భాగవత కథలు' అనే పుస్తకంలో చాలా బాగా రాసారు. అందులో వీరు కలుసుకోడం గురించి రాసింది చదివితే కళ్ళంబడి నీళ్ళురాకపోతే ఒట్టు. ఇద్దరు భగవద్భక్తులు కలుసుకుంటే ఎలా వుంటుందో సరిగ్గా తెలియాలంటే ఉద్దవుడు, విదురుడు కలుసుకున్న సన్నివేశం ఒకసారి చదువుకోవాలి. ఎంత బావుంటుందంటే ఒళ్ళు గగురుపొడుస్తుంది, కళ్ళంబడి నీళ్ళువస్తాయి. ఎందుకనీ? ఈయనలో ఆయన చూసింది భగవత్తత్త్వమే! అప్పటికి కృష్ణుడు వెళ్ళిపోయాడు. ఉద్ధవుడు ఎండాకాలం లో బాగా ఎండిపోయిన నేలల్లే అయిపోతాడు. విదురుడు కనపడగానే స్వాతిచినుకు అంటామే, మొదటి వర్షం చినుకు పడగానే భూమి ఎలా లాగేస్తుందో అలా అనిపించిందిట ఉద్ధవుడికి విదురుడు కనపడగానే. అలాగే విదురుడికి ఉద్ధవుడు కనిపించగానే. కేవలం కృష్ణుడే ఉద్ధవుడంటే. ఎందుకనీ? ఉద్ధవుడు కృష్ణభావం తప్ప మరోభావం లేనివాడు. కృష్ణుడి గురించి విదురునికి ఒక తపన వున్నది. ఆ తపన ఓ విధంగా వైరభావంగా మారి, అందులోంచి సత్యభామలా విరహం ఏర్పడింది, అందులోంచి ఆయన్ని చూడాలనే తాపం వచ్చింది. ఆ తాపంతో బయలుదేరి వస్తుంటే ఉద్ధవుడు కనిపించాడు. లేకపోతే ఉద్ధవుడు గోచరించేవాడు కాదు. ఇంత జ్ఞానినీ తీసుకెళ్ళి ఉద్ధవుడు మైత్రేయుని వద్దకు చేరుస్తాడు. భాగవతం రోజూ చదువుకుంటే లోపలి కల్మషాలు హరిస్తాయి. లేకపోతే కలియుగంలో మనిషి వద్దన్నా పోగేసుకునేవి కల్మషాలే. భావపరంపరలు పోగేసుకునేవి కల్మషాలు. ఈ పోగేసుకున్న కల్మషాలకు భోగిమంట పెట్టాలంటే ప్రతిరాత్రీ భాగవతం చదువుకుని పడుకోవాలి. ఒక్క సంవత్సరం పాటు రోజూ రాత్రిపూట భాగవతం చదివితే మనలో వుండే విషపూరితభావాలన్నీ మండిపోతాయి. ఉపశమిస్తాయి. భగవత్పరమైన భావం పెరుగుతుంది. ఆ స్ఫూర్తితో నిద్రలోని కెళ్తాం కనుక, నిద్రలేవగానే కొంచెం ప్రశాంతంగా వుంటుంది. ప్రశాంత హృదయంతో భగవద్గీత చదువుకుంటే ఏది ఎలా నిర్వర్తించుకోవాలో బాగా తెలుస్తుంది. చాలా హడావిడైన మనస్సుతో 'శంఖారావం' (EK గారు వ్రాసిన భగవద్గీత) చదివితే, చాలా tough గా వుందనిపిస్తుంది. మనస్సులో ప్రశాంతత లేకపోవడంవలన అలా అనిపిస్తుంది. మనస్సులో ప్రశాంతత నువ్వు నిద్ర లేచినంతమాత్రాన రాదు. అంతకుముందు నీవు చేసిన preparation బట్టి వుంటుంది. ముందురోజు రాత్రి నువ్వు భాగవతం చదువుకుని ఆ స్ఫూర్తితో నిద్రలోకి వెళ్ళినవాడికి మర్నాడు ఉదయం 'శంఖారావం' చదువుకుంటే తేడా తెలుస్తుంది. పొద్దుట భగవద్గీత, రాత్రి భాగవతం చదువుకోవడం అనే పద్ధతి కొన్నివేల సంవత్సరాలనుండీ వస్తున్నది.

భాగవతం భక్తిపారవశ్యంలోకి తీసుకు పోవడమే కాకుండా, భాగవతోత్తములు ఏ విధంగా భగవంతునితో అనుసంధానం చెంది జీవించారో తెలుస్తుంది. ఒకటి practical living, ఒకటి practice. Day అంతా నీకు కావలసిన అభ్యాసం గీత నుండి అందుతుంది. ఎలా జీవించాలో ఆ తత్త్వం తెలుపుతుంది. జీవించినవారు ఎట్లా వుంటారో తెలిపేది భాగవతం. సాయంత్రం భాగవతం చదువుకుంటే ఆ రోజున మనకుండే కుటుంబపరమైన సమస్యలు, సంతాన పరంగా, ధనార్జనపరంగా, సంఘపరంగా వుండే సమస్యలన్నీ మర్చిపోవడానికి ఒక మార్గం ఏర్పడుతుంది. అందుకనే పూర్వకాలంలో చిన్నచిన్న గ్రామాలల్లో పనులన్నీ పూర్తి చేసుకుని అందరూ ఏదో ఒక చోట చేరి, భాగవత శ్రవణం చేసుకునేవారు. ఏ గుడికో వెళ్ళి శ్రవణం చేసుకోనక్కరలేదు. ఇల్లే గుడి అనుకుంటే చాలు యింట్లో అంతా కలిసి చదువుకోవచ్చు. ఎవరూ లేకపోతే నువ్వు చదువుకో. మీరంతా ఎందుకూ పనికిరారు, మీకు భాగవతం అంటే ఇష్టంలేదు అనద్దు. అంటే వున్న అర్హత పోతుంది. అర్హత ఎప్పుడు పోతుందంటే ఇంకొకరి గురించి వేరే అభిప్రాయాలు వ్యక్తం చేసినా, మనలో entertain చేసినా పోతుంది. ఎంత మేర ఈ అభిప్రాయాలు పెట్టుకుంటే, అంతమేర భగవత్తత్త్వం వుండడానికి వీల్లేదు. అప్పుడు భగవత్ ప్రాప్తికి అర్హత పోతుంది. ఆయన యందు మనస్సు పెడితే మిగతావి వుండవు. మిగతావాటిమీద మనస్సు పెడితే ఆయనుండడు. అందుకని మనలో అర్హత పెంచుకోవాలి. 10 సంవత్సరాలైనా మనలో అర్హత పెరగలేదంటే, మన జీవన విధానంలో తేడా వున్నది. మనల్ని మనం మార్చుకోవాలి. ఎప్పుడూ తనను తాను మార్చుకోడానికి ప్రయత్నం చేయడమే సాధన. ఊళ్ళోవాళ్ళని మార్చడానికి చేసేది సాధనకాదు, అహంకారం. 'వీళ్ళంతా పాపులు, వీళ్ళని నేను బాగు చేయాలంట' అనుకుంటే అంతకన్నా దురహంకారం ఇంకోటి లేదు. ఈ విధంగా తయారుచేసినవాడూ, అందరినీ తనలోంచి తీసుకొచ్చినవాడూ ఒకడున్నాడు. వాడికన్నా నువ్వు అర్హుడివి కాదుగా. నీదారి చూసుకో. నువ్వు నడిచేదారి చూసి ఎవరన్నా నీతో నడిస్తే నడవనీ. అదీ నిన్ను చూసి కాక నీలోవున్న దివ్యత్వాన్ని చూసి నడుస్తున్నాడని తెలుసుకో. నువ్వు నడిపిస్తున్నావని, నువ్వు నడిపించావని, నువ్వు మార్చావని అంతకన్నా దురహంకారం ఇంకోటిలేదు. అది అనర్హతకు దారితీస్తుంది. అసలైన అర్హత నువ్వు చేయవలసినది నువ్వు చేస్తూండు. దైవంలో వుంటూ వుండు. నువ్వు దైవం లో వుంటూ వుంటే, చూసి బాగుందనుకున్నవాడు నీతోబాటు దైవంలో వుండదల్చుకున్నవాడ్ని వుండనీ, అది వాడి నిర్ణయం తప్ప, వాళ్ళగురించి నీ నిర్ణయం కాదు. నువ్వు చేసే పనులు చూసి చేరినవారిని నువ్వు చూడడం మొదలుపెట్టావా అర్హత పోతుంది. మన గురించి ఎవరెవరు ఏమి అనుకుంటున్నారు? మనకి దండం పెట్టుకుంటున్నారా? ఇవన్నీ దేనికి దారితీస్తాయి? నువ్వు ఏ పనులు చేయడం వలన, ఎలా ప్రవర్తించడం వలన నీ వెనుక వారు నడుస్తున్నారో, ఆ ప్రవర్తన నీలో లేక

పోవడంవలన నీ వెనక నడిచిన వారంతా మాయమైపోతారు. నిన్ను విడిచి వెళ్ళిపోతారు. ఇది దేవాపి మహర్షి 'నువ్వు ఏ పనులు చేయడం వలన నిన్ను కొంతమంది అనుసరిస్తున్నారో, నీలో ఏ ప్రవర్తన బాగా వుండడం వలన కొంతమంది నిన్ను అనుసరిస్తున్నారో, ఆ పని, ఆ ప్రవర్తన ఇంకా కొంచెం పెంపొందించుకో తప్ప, నిన్ను అనుసరిస్తున్న వారిని నువ్వు అనుసరించబోక' అని చెప్తారు. చాలా ముఖ్యమైన విషయం. అలా కాకపోతే నీకు సాధన వుంటుందా? అర్హత ఎలా వుంటుంది? మన నుండి జరుగుతున్న కార్యముల ద్వారా మన అర్హత ఎంత వున్నదీ, ఎంత లేదూ అని తెలుస్తుంది. ఓ పక్క కర్ణుడు కోల్పోతూంటాడు. సంవత్సరం తిరిగేసరికి యింకోటి పోయిందీ అని అతడికి తెలుస్తుంది. అర్జునుడికి యింకోటి వచ్చిందని తెలుస్తుంది. ఏమిటి కారణం? ఇటు దైవీ సంపత్తి, కర్ణుడికి ఆసురీ సంపత్తి. అతడికి ఎంతసేపూ అర్జునుడిమీద కారాలు, మిరియాలూ నూరుతూ, బాణాలకు పదునుపెట్టడంతో సరిపోయింది. అర్జునుడిలో కృష్ణభక్తి పెరిగింది. ఈనామం నుండి మనం తెలుసుకోవలసినది ముందు 'ఎదుటివారి అర్హతలను ఆరాధన చేయడం'. రెండు, అది కారణంగా మనలో అర్హత పెరుగుతున్నదా లేదా చూసుకోవడం. అర్హత పెరగడం మన నుండి జరిగే కార్యముల ద్వారా తెలుస్తుంది. ఒక్కొక్క పని మూసేసుకోడం ఎంతసేపు. పెట్టి ముయ్యడంగా కాక కొత్తవి తెరచి పనులు చేయించడంగా వుండాలి. ఒక మనిషి వందమంది పనులు చేయవచ్చు. అది అర్హత పెరుగుతున్నకొలదీ వంద మంది నుండి వెయ్యిమంది పని చేస్తారు. మొత్తం భూగోళం కూడా చేయచ్చు. అతడిలో దివ్యత్వం యిలా పెంచుకుంటూపోతే అర్హులవుతారు. పరమగురువులు, ఋషులు, యోగులు అంతా అర్హులే. దేవతలకి, ఇంద్రునికి, గరుత్మంతాదులకు కూడా వారివారి అర్హతలున్నాయి. వారందరికీ కలిపి మరో అర్హతవున్నది. వాడు 'మహా అర్హుడు'. అదీ ఈనామం. ఇంక ఆపైన ఎవరూ లేరండీ. ఆయనే అని చెప్పడం. అర్హతకి గరిష్ట పరిమితి ఇక్కడ కనిపిస్తుంది. అదీ కృష్ణుడి జీవితంలో భీష్ముడికి గోచరిస్తుంది. అందుకే ఆయన్ని 'మహా అర్హుడు' అని వర్ణించాడు. ఇవి దైవం భూమిమీద నడచినప్పటి సన్నివేశంలోని నామాలు. ఈనామాలన్నీ కూడా కృష్ణుడ్ని వుద్దేశించి చెప్పబడ్డవి. నా దృష్టిలో విష్ణుసహస్రనామం చదివినప్పుడు కృష్ణుడి బొమ్మ పెట్టుకోవాలి. అన్ని నామాలకి సంబంధించిన అర్హతలు కృష్ణునిలో గోచరిస్తాయి. ఈ భూమిమీద వుండి, అన్ని లోకాలనూ శాసించిన అర్హత వున్నవాడు. బ్రహ్మనూ, ఇంద్రుడ్ని, వరుణుడ్ని, యముడ్ని శాసించిన ఘట్టాలున్నాయి. సమస్తాన్నీ శాసించిన వాడు ఇక్కడ, రూపంలో వున్నాడు, ఒక్కడే వందచోట్ల కనిపించాడు. ఎక్కడా లేడు, అన్నిచోట్ల వున్నాడు అనిపించాడు. ఇన్ని చేసినవాడు కాబట్టే, రాజసూయంలో అగ్రపూజకి ఎవరు అర్హులు అన్న ప్రశ్న వస్తే, అంతా తలా ఒకపేరు చెప్పారు. మరీ అర్హత వున్నవాడు, మరీ నిఘూఢంగా వుంటాడు. కొద్దిగా కొద్దిగా, ఓ మాదిరిగా అర్హత వున్నవాడు బాగా మిడిసిపడుతూంటాడు. మిడిసిపడే అర్హత, అర్హత

కాదు. మౌనంగా వుండే అర్హతే, అర్హత. ఎంత నిండకుండా వుంటే అంత చప్పుడు. చప్పుడు తగ్గుతోందిటా అంటే దైవం పెరుగుతున్నాడుటా అని అర్థం. ఎంత పెరిగితే అంత చిన్నవాడవుతాడు, వామనుడు. పెద్దవాడవుతున్నాడంటే స్వభావం పెరుగుతున్నదన్నమాట. పెద్దవాడవడం వుండదు. అసలు పుట్టినపుడు, పెరిగినపుడు, వెళ్ళిపోయేప్పుడు కూడా వాడు ఒకలాగే వుంటాడు. వాడి పరిమాణం అంతే! పెద్దవాడు అవడం వాడి భౌతిక శరీరానికే కానీ వాడికి కాదు. దేన్ని ఉద్దేశించి జీవిస్తున్నామో దాన్ని బట్టి వుంటుంది. అసలు పుట్టినప్పుడు ఎంతవుంటాడో అంతే వుంటాడుట ఎప్పుడూనూ. అంతే వుండేసరికి కనబడడట ఎవరికీను. ఎందుకు కనబడడూ? బయటకు ప్రకటన చేయాలన్న తత్త్వం లేని వాడు, కనబడాలనే తత్త్వం అస్సలు లేనివాడు. గమనించినవాడికి, లోదృష్టి వున్నవాడికి కనబడతాడు. కనుక ఇతరులెవ్వరూ గమనించలేదు. భీష్ముడు అర్హుడన్నారు. భీష్ముడు నేను కాదు, ఆయనే అసలైన అర్హుడన్నాడు. భీష్ముడు అందరికీ సమ్మతుడయ్యాడు. 'కృష్ణుడు' అని భీష్ముడు చెప్తే, అందరికీ సమ్మతం కాలేదు. ఇది చూడండీ. అందరిచేత అంగీకరింపబడిన వాడొకడూ, అందరిచేత అంగీకరింపబడని వాడొకడూ. మామూలుగా ఎలా చూడాలీ? అందరిచేతా అంగీకరింపబడినవాడే పెద్దవాడని కదా. అలా లెక్కలు వేయడానికి వీల్లేదు. అంగీకరించడం, అంగీకరించకపోవడం ఎదుటి వ్యక్తి యొక్క సంస్కారంలో వుంటుంది తప్ప మహాత్ముల తత్త్వంలో వుండదు. ఏసుక్రీస్తుని కేవలం ముగ్గురే అంగీకరించారు పరిపూర్ణంగా. శిష్యులు కూడా పారిపోయారు. కృష్ణుడ్ని ఎంతమంది అంగీకరించారూ? కనుక మన అంగీకారంతో సంబంధం లేదు. అక్కడ ఎవరైతే 'మహార్షుడు' అని చెప్పబడి, అందరిచేతా సమ్మతింపబడ్డాడో ఆయన చెప్తాడు, 'నాకు పాద పూజ చేయడం కాదు, సమస్త లోకాలనూ శాసించే వాడు ఆయన! ఆయన పాదపూజ చేసుకుంటే నీకు సమస్త శుభములూ కలుగుతాయి' అని చెప్తాడు. అలా చెప్పడంలో ఎంత గొప్పతనమున్నదీ? ఎంత మంచితనం, ఎంత లోతున్నది? ఆరోజున, ఆ సన్నివేశంలో భీష్ముడుకి కనక అగ్రపూజ చేస్తే, ఆయనకి మొత్తం భూగోళమంతా అందరి రాజుల వద్దా status/ స్థితి, పెరిగేది. అయినా ఆయన కృష్ణుడ్ని చూపించాడు. క్షత్రియులు యాదవ వంశాన్ని గొప్ప వంశంగా భావించేవారు కాదు. కృష్ణుడు సుక్షత్రియుడు కాదని చులకన భావన. మొదట్లోనే చెప్పాడు తీరంలేని వంశంలో పుట్టానని. ఎందుకంటే వంశమూలపురుషుడు అయిన యదువుకు తండ్రి శాపం వున్నది. శాపం కలిగిన వంశంలో పుడ్తాడు కృష్ణుడు. ఈ దేవయాన మార్గానికి సంబంధించిన వంశం అది. Children of God..భీష్ముడు అన్నీ దాటినవాడు కనుక అటు చూపించాడు. అంతా చూసారు. కనుక అర్హులందరిలోకి అర్హుడు అన్న సన్నివేశం కృష్ణుడి జీవితంలో జరిగింది. ఈ నామాలలో ప్రతి నామానికి తగ్గ సన్నివేశం కృష్ణుని జీవితంలో వున్నది. అది యిందులో గొప్పదనం. అందుకే విష్ణుసహస్రనామాల్లో భీష్మునియొక్క అవగాహన భగవత్తత్త్వం గురించేకాక, కృష్ణుని

గురించి కూడా అని తెలుసుకోవాలి. అది కారణం చేత మహోర్షుడన్నాడీయన్ని. మనం కూడా మహోర్షుని సాన్నిధ్యం పొంది అర్హులం కావచ్చు. ఆయనతో అంటే కృష్ణునితో పరిచయం, బంధుత్వం, స్నేహం ఏర్పరచుకొని, ఆయన్ని ప్రాప్తించుకుంటే మనలో అర్హతలు పెరుగుతాయి. అందుకే భక్తుని అర్హతల ముందు జ్ఞాని అర్హతలు కూడా ఆగవు. భక్తుడు అంటే యోగి అంటే భగవంతునితో జతపడినవాడు. వాడు నడుస్తుంటే భగవంతుడు నడుస్తున్నట్లే. ఆయన భక్తునిలో చాలా ఎక్కువగా వుంటాడు., భక్తుడు, ఆయన చేతన చాలా ఎక్కువ కలిగివుంటాడు. అలా భక్తుడు కూడా మహోర్షుడుగా చూపించబడతాడు. భగవంతుని మహత్యం భక్తుడు చూపిస్తుంటే, భక్తుని యొక్క గొప్పదనాన్ని భగవంతుడు చాటి చెప్తూ వుంటాడు. అదీ భగవంతునికి భక్తునిపై వుండే ప్రేమ. మనం భగవంతుడ్ని అవసరం కాబట్టి ప్రేమిస్తాం. ఆయన ఏ అవసరమూ లేకుండా ఎప్పుడూ భక్తునిదే పైచేయిగా వుంచుతాడు. అలాంటి అర్హత కలుగుతుంది. అందుకే భగవద్భక్తులని అర్హులుగా భావించి, పూజ చేసుకోవాలి. 'నీ పాదార్చకుల తోడి నెయ్యము' అనేది బాగా గుర్తుపెట్టుకోవాలి.

## 543 స్వాభావ్యః

స్వభావం. భగవంతుని యొక్క స్వభావం అందర్నీ పుట్టిస్తూ, వాళ్ళ రూపములలో తనే ఆడుకుంటూంటాడు, మళ్ళీ కలిపేసుకుంటూంటాడు. మళ్ళీ పుట్టించుకుంటాడు, మళ్ళీ ఆడుకుంటాడు, మళ్ళీ కలిపేసుకుంటాడు, అది ఆయన స్వభావం. చిన్నపిల్లలు బొమ్మలతో పెళ్ళిళ్ళు అంటారు, వంటసామాను అంటారు, అన్నీ ఆడి, ఉన్నట్టుండి అన్నీ ఆటసామాను బుట్టలో పడేస్తారు. మళ్ళీ తీస్తారు. మళ్ళీ ఆట, మళ్ళీ మూసేస్తారు. ఎందుకలా ఆడుకుంటారూ? అది దైవీ స్వభావం! పిల్లలు ఎందుకు ఇలా ఆడుకోవాలంటే, ఆ భావన చేసేవారి మెదడులో ఏదో అస్వస్థత వున్నదని అనుకోవాలి. ఆడుకునే పిల్లల్ని చూసి ఏడ్చేవాళ్ళుంటారు ఎందుకిలా ఎప్పుడూ ఆడుకుంటారని. లేకపోతే చిరాకుపడేవాళ్లుంటారు. ఎందుకంటే వీడికి ఆడుకోవడం చాతకాదు. వాళ్ళని ఆడుకోనీయడు. మాస్టారు ఓ ఉదాహరణ చెప్తుండేవారు, జన్మ జన్మలకీ మర్చిపోనిది. మనం Madras వెళ్ళే train మధ్యాహ్నం 12:30 గం. లకు అనుకోండి. మంచి మండు వేసవి. వెళ్తే, train 2:30 గం. లు late. ఈకాడికి మళ్ళీ ఇంటికెవరు వెళ్తారని అక్కడే waiting. వేడి, మీద రేకుల షెడ్డు. పైగా మన platform లలో సర్వాంతర్యామి అన్ని జీవులుగా తాండవం ఆడుతూంటాడు. దోమలు, ఈగల నుండి, వాసనల నుండి, ఆవులు, కుక్కలు తిరగడం అన్నీ అక్కడే. ఎలా వుంటుంది మనస్సు? కాసేపు railway వాళ్ళని తిడతాం. Enquiry వాడు మనం బయల్దేరేముందు కనుక్కుంటే right time అంటాడు. అసలు మనకి ప్రత్యేకించి సాధనకి పనికి వచ్చేవారిలో వాడొకడు. తెల్లవారి 4గం.ల train కి, 3గం.లకి లేచి 3.30కి phone చేస్తే outer లోకి వచ్చేస్తోందంటాడు బండి. వెళ్తే 2గం. లు late. భౌతికంగా అంత వీర్యవంతులం కాదు గానీ లేకపోతేనా! అందుకని మానసికంగా అప్పుడా enquiry వాడ్ని మెడపిసికేసో, కత్తి పెట్టి పొడిచేసో చేసేస్తాం కదా. వెష్టపడతాం కదా. ఉసూరుమని అలా కూర్చొని వుంటే, ఇంటినుండి మస్తుగా తిని రావడంతో నిద్ర వస్తూంటుంది. ఇలా వుంటే ఓ 5సం. ల, 7సం. ల పిల్లలు యెంతో హాయిగా, యివేవీ పట్టకుండా, ఏమిటేమిటో ఆడేసుకుంటూ, పరుగెడుతూవుంటారు. వాళ్ళను చూస్తే వీడికి కోపం వస్తుంది. వీడికి జబ్బు. లేకపోతే 'వీళ్ళింత హాయిగా, పరిసరాలతో సంబంధం లేకుండా హాయిగా ఆడుకుంటున్నారూ, మనం ఇలా లేకపోతిమే అనే జ్ఞానం కలగకపోగా, వాళ్ళను రెండు తగలనిచ్చి, కూర్చోండి ఓచోట, కదిలారంటే ఇంకా నాలుగిచ్చుకుంటాను' అంటాడు. సన్నివేశాలతో సంబంధంలేకుండా వాళ్ళు ఆడుకోగలిగారంటే వాళ్ళది దైవీ స్వభావం. దేవుడలా ఆడుకుంటాడట. క్రీడామయుడు వాడు. అందుకే పిల్లల్లో దేవుడ్ని చూడమన్నారు. మనలాగా వాళ్ళు mental luggage ఏమీ లేకుండా హాయిగా ఆనందిస్తూంటారు కాబట్టి

వాళ్ళని చూస్తే నీకు ఆనందం కలుగుతుంది. అందుకే పిల్లలతో కాసేపు ఆడుకోవడంవల్ల, కలిసి వుండటంవల్ల మనకి కూడా కాస్త స్వభావంలో మార్పువస్తుంది. ఆయన స్వభావం ఏమంటే, ఆయన నుండి వచ్చింది భావం. 'దొంగరాముడి'లో పాటవుంది. 'ఆడుకుందాం రావోయి జంటగా' అని చిన్నపిల్లల పాటవున్నది. సినిమా పాటల్లో తత్త్వం చూడగలిగినవాడికి చాలా వున్నది. 'నీవులేని నేను లేనె లేనులే' అని వున్నది. మామూలుగా చూస్తే ఏదో పిచ్చిపాటలు నాయికా నాయకులు పాడుకుంటున్నారనిపిస్తుంది. అసలు అందులో ఎంత తత్త్వం వున్నదీ? 'నీవని నేనని తలచితిరా, నీవే నేనని తెలిసితిరా' అని. పాటలోని తత్త్వం? నువ్వొకడూ, నేనొకడు అనుకున్నాను గానీ, కాదు, నువ్వే నేనని తెలిసినది అంటే 'సోహం' అనే మంత్రం అర్థం అయ్యిందనేకదా. అర్థం చేసుకుంటే అన్ని చోట్లా ఉంది. లేని చోటు లేదు. చూస్తే సినిమాల్లో కూడా వున్నది. చూడకపోతే ఇంకోటి వుంటుంది, చూస్తే అసలుది వుంటుంది. ఎంతో ప్రేమగా పురుషుడు, ప్రకృతి పాడుకుంటుంటే నీ భావన చేత 'రాధామాధవం' అయిపోతుంది. లేకపోతే యింకోటి అవుతుంది. నువ్వు దిగిపోతావో, పైనుంటావో పాటబట్టి లేదు, నీబట్టి వుంటుంది. వెధవపాటలు కాదు, నువ్వు వెధవ్వయితే అది వెధవపాటలు. ఆయన స్వభావం ఏమంటే తనలో నుండి వచ్చింది, వచ్చాక ఇలా ఆడుకుందామా అని అడుగుతుందిట. 'ఆ....కానీ' అంటాడుట. వెంటనే ఆవిడ ఒక్కతే మూడు అయిపోతుందిట. మరి నేను మూడు అయిపోయాను, నువ్వు కూడా అయిపోతావా, అంటుందిట. 'ఊ..కానీ' అని మూడు అవుతాడట. ఒకటి మూడు అయిపోతాడు. ఇలా 3, 3 చొప్పున అల్లిక మొదలు పెడ్తారు. అదే ఒక ఆట. ఇంతయిపోయింది. ఆట మనకి బరువైందికాని, వాళ్ళకి హాయిగానే వున్నది. ఏరోజైనా చాలు ఆట ఆపేద్దామా అని ఆవిడ అంటే ఆపేస్తాడు, ఆగిపోతుంది, అయిపోతుంది. ఆయనకి ఆడడమూ, ఆడకపోవడమూ అంతా ఒకటే. నువ్వయినా అంతే సరిగ్గా చూసుకుంటే. పాద్దున్నే లేస్తావు, నీలోంచి ఆవిడ లేస్తుంది. ఆవిడ లేవడమే నువ్వు లేవడం. లేకపోతే నువ్వెక్కడ లేచావు. పాద్దున్నే చైతన్యవంతులం అవుతాం కదా. తెలివొచ్చింది కదా. అంటే ఆవిడ శక్తి, పరాశక్తి. ఏపేరు పెడితేనేం, లేవడమే! ఆవిడకి రకరకాల పేర్లుపెట్టి, 108 సార్లు, నానాబాధలూ పడుతూ 35 నిముషాలు చదువుతాం, అసలు విషయం ఏమీ ఎక్కకుండా. ఆవిడ లేవగానే ఆట మొదలు. ఏమిటీ ఆట? ఆలోచన. ఏమిటీ ఆదివారం, అయినా పాద్దున్నే లేవవలసివచ్చింది కదా అని ముందు బాధ. వెంటనే CVV గారి మీద ఓ విసుగు, అందరూ హాయిగా ఆదివారం పడుకుంటే మనకేమిటీ ఈ పాద్దుటే లేచి ఈ గరుడసేవ అని బాధ. నిజానికి కంచిగరుడసేవే. CVV గారు ఉలకడు, పలకడు, కదలడు, మెదలడు. ఎక్కడో లోపలనుండి పనిచేస్తూంటాడు. ఆయన పనిచేస్తున్నట్లు మనకి తెలియడానికి చాలా కాలంపడ్తుంది. ఏదో ఒకభావంతో లేచి, మంచం మీద నుండి మన రథం కదిల్చి, వేయాల్సిన దాణా వేసి, మాట్లాడాల్సింది

మాట్లాడాలి, ఈలోగా వేయిరకాల భావాలు వస్తూంటాయి, పోతూంటాయి. తిరుగుతూ వుంటాం. భావాలు మనల్ని తెగ తిప్పి తిప్పి తిప్పి సాయంత్రం మంచం మీద పారేస్తాయి. అంతే, 'బతుకుజీవుడా' అని లోపలకు వెళ్ళిపోతాం. మామూలు మానవుడికి నిద్రే సుఖం. 'ఆ నిదురకూడా దోచుకొనే దొరలు యెందుకూ' అనే పాటకూడా వుంది కదా. దొరలు అంటే ఇక్కడ ఆలోచనలు. భయంగానీ, అనుమానంగానీ వున్నాయనుకోండీ, నిద్రపడుతుందా? తినేస్తుంది కానీ. ఇట్లా మనలోంచి స్వభావాలు పని చేస్తాయి, ఆయన లోంచీ స్వభావాలు పని చేస్తాయి. ఆయనలో స్వభావం పని చేస్తోంది కనుకనే మనలో స్వభావం పని చేస్తోంది. ఆయనలో లేనిది మనలో ఏమీవుండదు. అందుకే మన 'స్వభావాన్ని' 'స్వ భావం' చేయాలి. అంటే 'నేను' గురించిన భావం చేయాలి. నేను గురించిన భావం చేస్తే, అసలు ఇదంతా ఇలా యెందుకున్నదో, ఇందులో మనం ఏమి చెయ్యాలో మనకి తెలుస్తుంది. లేకపోతే అసలు మనం యేం చేస్తున్నామో, ఎందుకు తిరుగుతున్నామో, ఎందుకు బ్రతుకుతున్నామో తెలీకుండా పోతుంది. పగలంతా సుడిగాలి తిరిగినట్లు తిరుగుతాం. సుడిగలిలో పుల్లాకులూ, కాగితాలూ ఇవన్నీ వాటికి కావాలని తిరగవు. ఆగాలి వల్ల తిరుగుతాయి. అలాగే మన స్వభావాలు మనల్ని తిప్పేస్తాయి. అలా తిప్పి తిప్పి ఏ పెంటకుప్ప మీదో అలా ఫెడీమని పారేస్తుంది. అసలు గట్టి సుడిగాలి వస్తే చెంబులు, తప్పేలాలు కూడా తిరుగుతాయి. ఇప్పుడు మనలోనే లోపల బోలెడు సుడులున్నాయని, మనం ఇంక తిప్పక్కర్లేదని పాపం సుడిగాలులు లాటివి రావడంలేదు. మనం ఆ గాలి తిప్పినట్లు మనం తిరిగామా, త్రిప్పబడ్డామా? తిప్పబడి తిరిగానంటావేం? తిరిగాను అంటే నీకు అవసరం లేకపోతే ఆగగలిగి వుండాలి. నీ అంతట నువ్వు స్వచ్ఛందంగా తిరగాలి. బలవంతంగా తిరగడం కాదు. బావుండదు కదా అని భోజనానికి వెళ్ళడం కాదు. నీకు వెళ్ళాలనిపించకపోతే మానేయవచ్చు. మన భావనలో మగతనం వుండాలి, ధీరత వుండాలి. 'స్వ' అంటే నేను అనే తత్త్వం మీద ఆధారపడి వుండి ఏవి నిర్వర్తించవలసినవీ, ఏవి నిర్వర్తించనవసరంలేనివి అని తెలిసి, తనను తాను ఉద్ధరించుకుని ఊరికే అలా గాలికి తిరగకుండా జీవించడం జరుగుతుంది నెమ్మదిగా. అందులో మామూలుగా మనం చేసే బోలెడు కార్యక్రమాలు పడిపోతాయి. మనకిగానీ, మన చుట్టూ వుండేవారికిగానీ ప్రయోజనం కల్పించేవీ, భగవంతుని స్ఫూర్తిలో మనం వుండడానికి పనికివచ్చే భావాలు మాత్రమే వుంటాయి. మిగిలినవి తగ్గిపోతాయి. పాట్టు జీవితం తగ్గి, గింజ జీవితం పెరుగుతుంది. అంతా హుస్కు మాత్రమే కదా. ఎక్కడికెళ్ళినా, train లో, club లో, meetings లో, Office ల్లో అన్ని చోట్లా కోరి మరీ హుస్కు వేస్తాం. 'వాక్కు' అంటే 'నువ్వే'!అలాంటి వాక్కుని, నీలోంచి దిగివచ్చిన దాన్ని యిష్టం వచ్చినట్లు హుస్కు వేసుకుని ధ్వంసం చేస్తున్నావు. ఇలాంటప్పుడు అవసరమైన దృశ్యాలు చూడ్డం కన్ను మానేస్తుంది, అవసరమైన విషయాలు వినడం చెవి మానేస్తుంది. అవసరంలేని పదార్థాలు తినడం నాలుక చేస్తుంటుంది, అవసరం అయిన

మాటలు మాట్లాడడం నాలుక మానేస్తుంది. అలా కాకుండా నిన్ను నీవు సమీకరణం చేసుకోవడం మొదలుపెట్టక పోతే, తెలీకుండా అలా స్వభావంలో జన్మలు జన్మలు వెళ్ళిపోతాయి. ఎన్ని జన్మలో? కేవలం దైవీస్వభావం తో కూడిన జన్మలే ౭౭౭ అనుకున్నాం. మొత్తం మానవ జన్మలు యింకా చాలా ఎక్కువ వున్నాయి. ఎందుకిలా అంటే తనదైన స్వభావంలో జీవించడంచేత, అవన్ని గింజల రూపంలో వుండడంచేత, తెరిపిన పడలేక, తెమలక శరీరం వెళ్ళిపోయే సమయానికి అవని పనులన్నీ మనస్సులో, గింజల రూపంలో వుండడంచేత, అవి పూర్తిచేసుకోడానికి మళ్ళీ వచ్చి, అవి ఏమిటో మరచిపోయి, మరికొన్ని ఏరుకొని, అలా పాత files అన్నీ pending లోనే పెట్టుకుని వెళ్ళిపోతూంటారు ఎప్పటికప్పుడు. కొంతమంది tables చూస్తే ఇంతెత్తున pending files కనిపిస్తాయి. యోగి ఏ రోజుకారోజు balance 'nill' గా చూసుకుంటాడు. సాధకుడు వారానికి ఒకసారి మొత్తం అంతా పై వారానికి యేమీ బాకీ లేకుండా చూసుకుంటాడు. శనివారం సాయంత్రానికి పూర్తిచేసుకుని కూర్చుంటే, ఆదివారం పొద్దుటికి మళ్ళీ నూతనత్వం వుంటుంది. లేకపోతే పాతవే మళ్ళీ ముందు తెచ్చుకుని నెమరువేసుకొని తిన్నట్లుగా వుంటుంది. అందుకని యెట్టి పరిస్థితిలోనూ by Saturday that weeks program should be completed. ప్రశాంతంగా నిద్రపోయి, ఆదివారం పూవువలె లేవాలి. అక్కడ్నుంచి రోజూ ఏపూట పని ఆ పూట అయిపోవాలి. కాలాతీతం అయ్యేకొలదీ పనికి బరువు పెరుగుతుంది. అందుకే postponement లేకుండా, ఎప్పటికప్పుడు చేసుకుంటూవుంటే యెన్నో పనులు చేయడానికి time వస్తుంది. అదీ Time Expand అని CVV గారు ఇచ్చిన మంత్రం! ఇది నీలో నిశితత్వం పెరిగినపుడు, స్ఫూర్తి పెరిగినపుడు అవసరమైన పనులకే ఇంద్రియాలను, కర్మేంద్రియాలను, వాక్కును వాడుకుంటున్నప్పుడు, అవసరమైన భావాల కోసమే మనస్సును వాడుకుంటున్నప్పుడు ఇలా 15 రకాలున్నాయి. వీటి వాడకం మీద నీకు లింగ శరీరం బాగా ఉబ్బడమో, దగ్ధం అవడమో జరుగుతుంది. లింగశరీరం దగ్ధం అయితేకానీ మనిషికి బంధనం పోదు. 15 తత్వాలతో కూడిన ఒక శరీరం, మనలో మనకి తెలియకుండా బాగా విజృంభించి పెరుగుతుంది. కాళ్ళు, చేతులు, ముక్కు, చెవులు, నాలుక, కళ్ళు, జననేంద్రియం ఎలా వాడుకోవాలో తెలిసి, ఈ 15 నియమించ గలిగితే, లింగశరీరం దగ్ధమై వెలుగు శరీరానికి దారితీస్తుంది. ఇది భాగవత ధర్మం. భాగవతంలో 'లింగ శరీరాన్ని దగ్ధం చేసుకున్నవాడు దివ్య శరీరాన్ని ఏర్పరచుకున్నాడు' అని వస్తుంది. దానికి మనల్ని ముందు మనం సమీకరణ చేసుకోవాలి. మనందరికీ ముందు ధ్యానం జరగదు. పెద్ద fashion గా కళ్ళుమూసుకు కూర్చోవడం తప్ప. ఏంజరుగుతుంది? మన స్వభావం నుండి ఎన్ని భావాలు వస్తున్నాయో చూసుకోవడానికి వీలుపడుతుంది. లేచి కూర్చొని కళ్ళుమూసుకోగానే మనలోంచి ఎటువంటి భావాలు వస్తున్నాయో చూసుకోవచ్చు. కుటుంబపరంగా, ధనంపరంగా, ఇతరులమీద అభిప్రాయాలపరంగా,

చేయాల్సిన పనులపరంగా, కీర్తి అపకీర్తుల పరంగా వచ్చేస్తూంటాయి. ఇవే కదా కళ్ళు మూసుకుని కూర్చుంటే వచ్చేవి? ఏమిటివన్నీ అని లేచి వెళ్ళిపోవద్దు. వచ్చినవన్నీ గుర్తుపెట్టుకుని తర్వాత diary లో రాసుకోండి. మంచీ చెడూ, పుచ్చు పురుగూ అన్ని ఆలోచనలూ రాసుకోండి. ఎవరికీ చూపించనక్కర్లేదు. 'ఇదీ నువ్వు' అనే సంస్కారం. నీ balance sheet. అసలు CVV అన్నాక ఇహ MN లేరు, EK లేరు. అంతా యిదే గొడవగా వుంటుంది. రాసేయ్. ఎంతసేపు దివ్యమైన భావాలు వచ్చినాయి, ఎంతసేపు నీ వ్యక్తిగత సన్నివేశాలకి సంబంధించి వచ్చాయి రాసుకో. ఒకసారి చూసుకో. అన్నీ నీనుండి వచ్చినవే. బయటకి వచ్చినాక కొంత తెరిపి. రోజూ యిలా రాసుకోవడం అనేది ముందు మనిషి తేలిక పడడానికి ఉపయోగపడుతుంది. ధ్యానం, దైవప్రాప్తి తరువాత చూసుకుందాం. లోపల నుండి మనిషి తెరిపినపడతాడు. భావాలు బయటకి వస్తాయి కదా. ఎంతసేపు వస్తాయి భావాలు! అలా ఒక సంవత్సరం note చేస్తే, అంతకుముందు ఇదేరోజున నువ్వు రాసుకున్నదీ, ఇప్పుడు నువ్వు రాసిందీ పోల్చి చూసుకుంటే ఎక్కడున్నామో మనం తెలుస్తుంది. భావాలలో పరిమితి కలిగిందా, పరిణామం కలిగిందా, ఇంకా నాసిగా తయారయ్యామా, ఇంకొంచెం బాగా తయారయ్యామా, ఈ సంవత్సరం ఏమి జరిగిందీ అన్నది తెలుస్తుంది. సాధన చాలా అప్రమత్తతతో చెయ్యవలసింది. అందుకే శ్రద్ధ కావాలన్నారు. ఏదో మహాత్ముని నమ్ముకున్నాం, ఆయనే లాగేస్తాడు అనుకునేది బాధ్యతారహితమైన దృక్పథం. ప్రతి నిముషం మనల్ని మనం పదునెక్కించుకుంటుంటే వాళ్ళకి సంతోషంగా వుంటుంది. వీడే నడిచి వస్తున్నాడు, వీడ్ని మనం మోసుకు తిరగనక్కరలేదు అని తెలుస్తుంది. నడిచి రావాలి. ఎంతసేపు లాక్కెళతారు? ఆ విధంగా నువ్వు నీభావాలు పెంపొందించుకుంటూ వస్తే, నెమ్మదిగా నీ ధ్యానంలో, నీ గురించిన భావం అంటే 'నేను' అనే ప్రజ్ఞయందు మనస్సు స్థిరపడడం ప్రారంభం అవుతుంది. అప్పుడు ఈ విష్ణుసహస్రనామంలో చెప్పిన దైవీభావమైన 'స్వభావం' నీయందు కాలాన్నిబట్టి, దేశాన్నిబట్టి భాసిస్తూ వుంటుంది. ఎక్కడుంటే అక్కడ నువ్వేం చేయాలో, నీ కర్తవ్యంగా భగవంతుడేం నిర్దేశించాడో అది నీకు తెలుస్తుంది. దాని ప్రకారం నువ్వు నిర్వర్తిస్తూంటావు. అదీ daily నా program నాకు వస్తుంటుందని చెప్పడంలో అర్థం. Already programmed mind కి రావుకదా. ఈరోజంతా మనం ఎలా తిరగాలో, ఏం వండుకోవాలో మనమే నిర్ణయించేసుకున్నామనుకోండి, 'సరే బావుందిరా, కానీ' అంటాడు. పొద్దున్నే ఆయనతో కూర్చుని 'నేనేం చేయాలి' అని అడిగావనుకో, ఆయన చెప్తాడు. లేకపోతే చెప్పడు. ఈ పవిత్రీకరణ అంతా అయితే, అడిగితే 'నేను' అనే ప్రజ్ఞ నుండి వచ్చే భావములు నీలో భాసిస్తాయి, అప్పటి నుండి నువ్వు భగవంతుని మార్గంలో నడవడం, ఆయన ప్రణాళికననుసరించి జీవించడం, ఆయన ప్రణాళిక నిర్వర్తించడానికి భూమిమీద ఒక scout వలె పనిచేయడంగా వుంటుంది. ఇంతవున్నది ఈ నామంలోని సాధన! భగవంతుడు తను ఒక ప్రణాళిక ప్రకారం దీన్నంతా

work out చేసుకొస్తున్నాడు. తన నుండి వచ్చిన చైతన్యం అల్లుతూ వుంటే తను సహకరిస్తున్నాడు. ఇక్కడ భగవంతుడు అంటే చైతన్యం. ఈ చైతన్యానికి ఆధారం అయిన తత్వానికి ఏ ప్రణాళికలూ లేవు. ప్రణాళికలన్నీ అమ్మవారివే. అయ్యవారి తత్వం లో schemes/ ప్రణాళికలు యేమీ వుండవు. వచ్చింది attend అవడం వుంటుంది. 'సర్వారంభ పరిత్యాగీ' అంటాడు భక్తుల విశిష్టగుణాలలో. రోజుకో ప్రణాళిక వేసుకొచ్చేవాడు ఇంకా రజస్సులో వున్నట్లు. తనకొచ్చే ప్రణాళికలలో భగవత్పరమైనవి ఏవున్నాయో చూసుకుని, చేసుకునేవాడు సత్త్వగుణసంపన్నుడు. రజోగుణం కలిగినవాడు రోజుకొకటి మొదలుపెడ్తాడు. సగం చేస్తాడు, మధ్యలో పక్కన పారేస్తాడు. అవకపోవడానికి కారణం ఇంకేదో చూపిస్తూంటాడు. నువ్వేకదా సంకల్పించావు? నువ్వు చేయక వాళ్ళూ వీళ్ళూ ఏ సాయం చేయలేదని ఏడుస్తావేమిటే? నువ్వు కదా చేద్దామనుకున్నావ్? ప్రక్కవాళ్ళు నిన్ను చేయమని, నువ్వు చేస్తానని ఒప్పుకుంటే, వాడు నిన్ను సగంలో వదిలేస్తే అది వేరే సంగతి. తమోగుణం వాడికి ఏ భావమూ రాదు కనక ఏమీ చేయక్కర్లేదని అలా మన్ను తిన్న పామల్లే పడివుంటాడు. వీడు వేరు, 'ఆరంభ పరిత్యాగి' వేరు. బెల్లం కొట్టే గుండ్రాయికీ, శివలింగానికీ తేడా లేదండీ? రెండూ రాళ్ళుగానే కనిపిస్తాయి. కానీ ఈ గుండ్రాయికి పూజలు చేయరు. పైగా చావగొడుతుంటారు. శివలింగానికి పూజలు జరుగుతూంటాయి. అందుకని ఏమీ చేయనివాడున్నూ, బొత్తిగా ఏమీ చేయనట్లుగా ఉండి, సమస్తాన్నీ చేయించేవాడున్నూ తేడాగా వుంటారు. 'చేసేవాడిలో చేయని వాడుగా నేనుంటాను' అని చెప్తాడు. కృష్ణుడు చేసాడా అంటే చేయలేదు, చేయలేదా అంటే చేశాడు. కృష్ణుడు యుద్ధం చేసాడా అంటే చేయలేదు. చేయలేదా అంటే చేశాడు. Critical moments లో ఆయనే చేశాడు. గుణాతీత స్థితిలో అలా వుంటుంది. అందుకని స్వభావాన్ని త్రిగుణాతీతంగా ఉద్ధరించేంతవరకూ సాధన వున్నది. అందుకని ప్రతి నిత్యం మనలో వచ్చే భావాలు అద్దంలో చూసుకున్నట్లు మనం చూసుకోవాలి. చూసుకుంటే మనలో వుండే పుచ్చులు, చచ్చులు మనకే తెలుస్తాయి. ఇంకొకడు చెప్పే పరిస్థితి రాదు. పైగా ఇంకొకడు చెప్తే మనం ఒప్పుకోం కూడా, నామీద యిష్టం లేక అలా చెప్తున్నాడనుకుంటాం. అందుకే రోజూ మన మొహం అద్దంలో చూసుకుంటే, మన మొహంలో ఎన్ని మచ్చలున్నాయో, ఎంత మసి వున్నదో మనకే తెలుస్తుంది. దానికి ప్రాథమికమైనది ధ్యానం. అది జరుగుతూంటే మన గురించిన భావన, మనలో వుండే సత్యం ప్రకటింప చేస్తూంటుంది ఎప్పటికప్పుడు. ఎవరికీ చెప్పక. నువ్వే note చేసుకుని, అది బాగుచేసుకోడానికి ప్రయత్నం చెయ్యి. మనల్ని మనం ఉద్ధరించుకోవడం కానీ, బాగుచేసుకోవడంగానీ కానిది సాధన అవదు. ధ్యానయోగంలో శ్రీకృష్ణుడు అదే చెప్తాడు 'నిన్ను నువ్వే ఉద్ధరింప చేసుకోవాలి' అని. నీలో వుండే నన్ను ఆధారంగా తీసుకుని నిన్ను నువ్వు ఉద్ధరించుకో అన్న శ్లోకం వున్నది. ఎవరో వచ్చి ఉద్ధరించాలనుకోవడం వలన జాతి, మనిషి కూడా నిర్వీర్యమైపోతారు. ఎవరూ

వచ్చి ఉద్ధరించరు. నిన్ను నువ్వు ఉద్ధరించుకుంటుంటే, నీలోనే వున్నవాడు నిన్ను ఉద్ధరిస్తాడు. నీచేత పదిమందికి ఉద్ధరింపు మార్గాన్ని చూపిస్తాడు. అది వాడు చూపించేది, నువ్వు చూపించేది కాదు.

## 544 జితామిత్రః

జిత+అమిత్రః అని సవర్ణదీర్ఘ సంధి. మిత్రులు కాని వారిని జయిస్తూంటాడట. మిత్రులను జయించేదేమున్నదీ? ఎలాగూ వాళ్ళు తన జేబులో వున్నారు. తనని భజన చేసికుంటూ, తను చెప్పింది చేస్తూ, తన ప్రణాళికలో భాగమై వుంటారు వాళ్ళు. తన్నెదిరించి నడిచేవాళ్ళు కొందరుంటారు. వాళ్ళూ ఆయనలో నుండే వస్తారు. ఎదిరించి నడవడం అంటే ధర్మాన్ని వ్యతిరేకించి పనిచేసేవారిగా కొంతమంది తయారవుతారు. ఈ తయారైనవారందరినీ తనలోకి రప్పించుకుంటాడట మళ్ళీ. ప్రతికూలురిని అనుకూలురుగా మార్చుకుంటాడుట. ఎలాగ? వాడికి సన్నివేశాల ద్వారా నేర్పుకుంటాడు. పెద్దలు చెప్తే నేర్చుకుని బాగుపడే కొంతమంది, సద్గంథాలు చదివి, నేర్చుకుని బాగుపడ్డ వాళ్ళు కొంతమంది ఉంటారు. ఎవరు చెప్పినా వినం, మా దారిన మేము స్వంతంగా ప్రయోగం చేసి తెలుసుకుంటాం అనుకునే వాడికి కూడా నేర్పుతాడు. ఎలా నేర్పుతాడు? అరటిపండు తొక్కమీద కాలువేస్తే జారుతుందని నేను నమ్మను, జారిచూస్తాను అంటాడా, 'సరే జారరా' అంటాడు. అంతే మొహమో, మోకాలి చిప్పో పగిలాక తెలుస్తుంది. అలా నేర్చుకుంటారుట కొంతమంది. అధర్మంలో ప్రవర్తించే వారందరినీ వారి స్వానుభవం మీద వాళ్ళకి ధర్మము నందు ఆసక్తి కలిగేటట్లుగా, శతాబ్దాల తరబడి వాడి వెనకబడి, వాడికలా నేర్పుకుని వస్తాట్ట. ఆయనకి ఎంత ఓపికో చూడండి. ఎలా నడుచుకోవాలో చెప్పిద్దాం అని శిష్యులని పంపితే వినడు, పుస్తకాలు రాస్తే చదవడు, చదవక పోగా వాటిని ఎద్దేవా చేస్తుంటాడు. అందుకని వాడికి వాడి జీవిత సన్నివేశాల్లోంచి వేస్తాడు. ప్రతివాడికి ఏదో భయం వుంటుంది. దాని మీద కొడతాడు. అప్పుడు వాడు దిమ్మెరపోయి, దారిలోకి వస్తాడు. బాగా పాట్టేలల్లే తిరిగేవాడికి యే నలభై యేళ్ళకో heart attack వచ్చిందనుకోండీ, ఆ మర్నాటి నుండే వాడి గూడు నిండా బోలెడు దేవుడిపటాలు చేర్తాయి. బోలెడు గురువుల పటాలు చేర్తాయి. బోలెడు స్తోత్రాలు మొదలుపెడతాడు. రుద్రాక్షలు, తులసిమాలలు, గుళ్ళుగోపురాలు, గుండు కొట్టించుకోవడాలు, విబూధులు, కుంకాలు ఇహ అంతే. ఎందుకూ? ప్రాణభయం వాడికి. ఇహ అది వాడుకుని దేవుడు విపరీతంగా నేర్పేస్తాడు. అట్లాగే బాగా డబ్బు మీద వ్యామోహం ఉన్నవాడికి పెంచీ, పెంచీ ఠపాలున కింద పడేస్తాడు. ఇంటినిండా చేరినవారంతా తలా ఒకటి చెప్పి, ఇహ వాస్తు భక్తుడిగా మారిపోతాడు. ప్రతి దానికి వాస్తు చూస్తుంటాడు. చూశాం కదా అలాంటి వాళ్ళని. జాతకాలు ఆయన బాగా చెప్తాడు వెళ్ళండి, అంటారు. వాడు వీడ్ని ఏవేవో చేయమంటాడు. మామూలుగా అయితే చెయ్యం. ఇప్పుడు చేసిపెట్టాలి, తెగ చాకిరీ చేయిస్తాడు. గుళ్ళంటాడు, జోస్యం అంటాడు, నాడి అంటాడు, వాస్తు అంటాడు, పూజలూ, వ్రతాలూ, నోములూ అంటాడు. ఇలా పడుతుంటే

దేవుడు చూసి, 'అమ్మ దొరికావురా ఇప్పుడు' అనుకుంటాడు. Lockup లో పెట్టినట్లే దొరుకుతాడు. ఏదో ఒక భయంతో మనిషి భగవంతునికి దొరక్క మానడు. డబ్బు, కీర్తి, ప్రాణభయాలవంటి యేదో భయం వుండితీరుతుంది. కష్టాలు ఎంతటి వాడైనా కొంతవరకూ భరించగలడు. అంతకుమించి యింక భరించలేడు. 'లావొక్కింతయులేదు ధైర్యము విలోలం బయ్యెన్ ప్రాణంబులున్ రావుల్ దప్పెను', అప్పుడు వాడికి doubt వస్తుంది. వాడెవరో వున్నాడన్నారు, చూద్దాం అని. ఏవో మొదట్లో కొన్ని జరుగుతాయి. నమ్మకం పుడుతుంది. మళ్ళీ కొంత జరగవు. జరక్కపోయినా ఈ లోపల ఇవన్నీ అలవాటైపోతాయి. ఏమీ రానివాళ్ళకి, చాలా చోట్ల చూస్తే ఫెళ ఫెళ భక్తి మొదలవుతుంది. ఎంత భక్తుడవుతాడంటే వీడు, మామూలుగా నిశ్శబ్దంగా వుండి భక్తిలో వున్నవాడ్ని disturb చేసేంత భక్తుడవుతాడు. ఒకటో class భక్తి వాడు, Phd భక్తి వాడికి చెప్పేస్తూంటాడు. వాడేం చేస్తాడూ? 'వీడేదో కొత్తపిచ్చి వాడు' అని అనుకుని, అలాగే అంటాడు తప్ప ఏమీ మాట్లాడడు. వాడు చేయడు, కాదనడు. వీడు గబగబా 5వ class వరకు వస్తాడు. ఇహ పాఠాలు కష్టం అవడం ప్రారంభమవుతాయి. అందరి parents 7th వరకు మా అమ్మాయికి 'A' grade అని చెప్తారు. నేను లోపల 8th కి రానీ చూద్దాం అనుకుంటూంటాను. ఇహ 10th, EAMCET ఏమీ రావు. తెలిసి పోయింది కదా. అంతవరకూ నెమ్మది పడరు. ఎగిరే ఆకు వేరు, అణిగివుండే ఆకు వేరు. ఈ ఎగరడంలో అంతకుముందు జరిగినట్లుగా జరగవు. మనం నమ్ముకున్న దైవం సరైనది కాదా? మనం పట్టిన గురుపాదాలు కాక ఇంకేమన్నా పట్టుకుందామా అనిపిస్తుంది. ఎందుకనిపిస్తుందంటే ఇన్నాళ్ళు కొన్ని కొత్తవి నేర్చుకున్నాడే అవి వదలలేడు, పాత భావాలలోకి పోలేడు. పోదామనిపిస్తుంది, పోలేడు. ఉన్నది బావుండదు. కొత్తదాన్లోకి రావడానికి time పడ్తుంది. లోపల విపరీతమైన ఘర్షణ జరుగుతూవుంటుంది. ఇదంతా నిజమా, అబద్ధమా, మోసమా? ఋషులు ఇదంతా అబద్ధంగా అల్లిక చేసారా? ఈ పరమ గురువులున్నారా అసలు? ఇలా విపరీతంగా కసిగ వచ్చి, సన్నివేశాల రూపంలో నేర్చుకొని, నెమ్మదిగా మెత్తబడటం నేర్చుకుంటాడు. మెత్తబడడం మొదలుపెట్టాడంటే అమిత్రుడ్ని మిత్రుడిగా చేసుకున్నట్లే కదా. ఇంత పని చేస్తాడు. ఎంత మంది అమిత్రులని, అలా ఒకసారి నవ్వి మిత్రులని చేసుకున్నాడో కృష్ణుడు. అయన నవ్వుతో, చూపుతో, స్పర్శతో చాలామంది పడిపోయారు. అయినా పడనివాళ్ళని చివరకు పడేసాడు. ఈ శరీరంలో వీడిక పడడు, ఇంకొక శరీరం ఇద్దామని శరీరం కూడా తీసేసాడు. అంతేకానీ వదలడు. తనలోంచి బయటికి వచ్చినవారు తిరిగి తనలోకి వచ్చేంతవరకూ వదలడండీ, అదీ జితామిత్రుడు. మనం కూడా అలాగే చేసుకోవాలి. మనం కూడా మనకిష్టంలేని వారి విషయంలో మౌనంగా వుండి, మనం చేయవలసినది చేసుకుంటూ వెళ్తూంటే, వాళ్ళే మన మీదుండే భావాలు మార్చుకుంటారు. వాళ్ళ భావాలు మనం మార్చాలంటే ఏమీ కాదు. ఈ జన్మకి

కాకపోతే మరోజన్మకి మారుతాయి. ఏం తొందర? ఏదో మనకోసం వాళ్ళు మంచి భావాలను entertain చేసుకోవాలని మనమెందుకు అనుకోవాలి? ఇతరులు మనగురించి ఏమనుకుంటున్నారు అనే ఆలోచన లేకుండా పని చేసుకుంటూ వెళ్ళిపోతూ వుంటారుట భక్తులు. అదీ అజాతశత్రుడు చేసుకుంటూ వెళ్ళిపోయాడు. తనవరకూ అందరూ మిత్రులే. అదే, ఆ జిత, అమిత్రత్వం అనేది సాధనలో ప్రతిమనిషికీ కావలసిన విషయం. ఎవరి మీద, ఎందుకిష్టం లేదూ? సమాధానం వస్తుంది. అంతేకదా. అదలా వుంచి, జీవుడిగా వాడేమిటో? జీవుడిగా వాడు నీలాటివాడే! కనుక జీవుడిగా ఎవర్నీ నిరాకరించకూడదు. కొంతమంది జీవుల స్వభావాన్ని కొంతవరకు నిరాకరించుకోవచ్చు. మనం వారినే నిరాకరించామనుకుంటే అది వారికి సంబంధించిన విషయం, కానీ జీవుడిగా నిరాకరించరాదు. కుక్కని, తేలుని కూడా నిరాకరించరాదు. తేలు address చూసుకుని వచ్చి కుడుతుందా? ఏదో దాని దారిన పోతూ, మనల్ని చూసి భయపడి కొట్టేస్తామేమో అని కుడుతుంది. మనలో కొట్టేద్దాం అన్న భావన రాకపోతే, దానిలోనూ కుడదాం అన్న భావన రాదు. అదీ తమాషా. అది నా ప్రత్యక్ష అనుభవం. దాన్ని జీవుడిగా కాగితంలో ఎక్కించి, పారేసి, రక్షించి, స్వభావం నుండి తప్పించుకోవచ్చు కదా. ఇది సాధనగా చాలా కష్టతరం. మొదటి మెట్టే కొంచెం కష్టంగా వుంటుంది. తిరుపతి మొదటి కొండ చావగొట్టదూ మనల్ని? నడిచి ఎక్కుదామని చాలా పారబాటు నిర్ణయం తీసుకున్నాం అనిపిస్తుంది, ముందు కొండ ఎక్కేప్పుడు. సగం దారిలో మనకి దీనికి స్ఫూర్తినిచ్చిన వారిని కూడా తిట్టుకోవడం కూడా వుంటుంది. ఎక్కేసాక భావాలు మారిపోతాయి. ఎలావుందిరా, చాలా బావుందండీ. మీరప్పడేమనుకున్నారో, 'అడక్కండి సార్' అంటాడు. అంతే సాధన కూడా! Initial steps are very difficult. ఎందుకంటే మనలో చాలా మార్పుకోరుతుంది. అధ్యాత్మిక సాధనలో ఒకటి, రెండు మెట్లు చాలా గట్టివి, కష్టమైనవి. చాలామార్పు కోరుతుంది. మూడు నుండి సులభం. మనవరకు మనల్ని ఉద్ధరించుకోవడం కోసం మనలోపల ఎవరి గురించి అమిత్రత్వం వద్దు. మనలో ఎవరిమీదైనా అమిత్రత్వం వున్నదీ అంటే మనకు అర్హత పోతుంది. వాడికి మనమీద శత్రుత్వం వుంటే వేరే విషయం. అమృతత్వ సిద్ధికి చేరే లోపల నీలో ఒక సన్నివేశం జరుగుతుందట. నిన్నొక గుహలోకి తీసుకు వెళతాడట. అక్కడొక పీఠం దగ్గర నిలబెడతారట. నీపక్క అటూ యిటూ ఇద్దరుంటారు. 'చాలా మంచివాడండీ ఈయన, మీరీయనకి ఆశీర్వాదం యివ్వాలి' అని. ఆశీర్వాదం ఇవ్వడమే అమృతత్వ సిద్ధి కలగడం! అప్పడక్కడ నుండి ఒక శబ్దం వినిపిస్తుంది. 'ఫలానావాడి గురించి ఏమనుకుంటున్నావు' అని. వీడు మన దృష్టిలో మనకు తీరని అన్యాయం చేసినవాడై వుంటాడు. అప్పడు మన భావాలలో కలిగే సంచలనం వారు గుర్తిస్తారట. మనం మాట్లాడనక్కర్లేదు. మనం, 'వాడూ జీవుడే, వాడూ మంచివాడే' అని ఉపన్యాసం దంచగలం. అందుకని ఉపన్యాసంతో సంబంధం లేకుండా ఈపేరు, రూపం

మనకి గుర్తు రాగానే మనలో కలిగే vibrations లో ఏమన్నా కలత వచ్చిందేమో అని, వాడే చూసుకుంటాడట. కలత వస్తే ఇహ అప్పుడేమీ శబ్దం వినపడదు, కలత వస్తే. పక్కనున్న వాళ్ళు 'పద పోదాం next time better luck' అంటారు. ఇంకోసారి 'పరమగురువు పీఠం మీద కనుపించి అద్భుతమైన ఆశీర్వాదం యిస్తారు' అని, యిద్దరు పట్టుకు గుహలోకి తీసుకువెళితే అక్కడ సరిగ్గా నిన్ను ముప్పుతిప్పలు పెట్టినవాడు కనిపిస్తాడు. ఎలావుంటుందీ? ఇలా జన్మల తరబడి ఇష్టం లేనివారు కనుపిస్తారటండీ. వీడు/ఈవిడ 'ఏమిటీ ఇక్కడా' అనిపించే భావ ప్రకటనలతో తెలిసిపోతుంది. Vibrations లో తేడా రాకూడదట. నువ్వు చెప్పక్కరలేదు అంతా scanning అయిపోతుంది. పంపించేస్తారు. ఇదిలా వుండగా ఇంకో సన్నివేశం ఎలా వుంటుందంటే 'బాగా prepare చేసి, నువ్వు చాలా అదృష్టవంతుడివి, నీకు దర్శనం యేర్పాటు చేస్తున్నాం' అని కలలో చెప్పి, తరువాత వీడిని ఇద్దరు తీసుకు వస్తారు. అప్పుడే ఇంకో ఇద్దరు ఇంకోడ్ని పట్టుకొస్తూ వుంటారు. వాడంటే వీడికి అస్సలు పడదు. అదేమిటీ, వాడొస్తున్నాడు?' అంటే, 'వాడికి కూడా' అంటారు. 'నేనొప్పుకోను' అనే భావన వీడి లోపల రాగానే, వెనక్కి పంపేస్తారు. అలా ఉంటుంది. 'అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ యేవచ' అనేది మొట్టమొదటి qualification గా భక్తియోగంలో భగవంతుడు చెప్తాడు. సర్వ భూతములయందు ద్వేషంలేకుండా, మైత్రి కలిగ వుండవయ్యా అని, మరియు నలుబది రెండు చెప్తాడు. ఏమన్నా చేస్తే మనం అవి చెయ్యాలి. ఊరికే రొట్టుకొట్టుడు ఉపయోగం లేదు, short cut అసలే ఉపయోగం లేదు. ఏదో అది మనలాగే ఒక జీవి. మనకుండేవి మనకున్నట్లే దానికుండేవి దానికున్నాయి. ఏదో కలిసి నడుస్తున్నాం, వాడు చూసుకుంటాడులే అనుకుంటే, ఇంతగా లోపల పాకాలుండవు. పాకాలు పెట్టుకెళ్తే అక్కడేమీ అవదు. అందుకే సాధన పరంగా జితామిత్రత్వం అనేది పెద్ద కార్యం. అది సాధించినవాడు కాబట్టి ఆయనకు మిత్రుడు, మైత్రేయుడు అని పేరు పెట్టారు. ఈ మొత్తం భూమిమీద వుండే ఏ జీవినీ ప్రేమించకుండా ఉండలేడుటండీ మైత్రేయుడు! మనకిష్టం లేని వాళ్ళని కూడా ప్రేమిస్తాడు. 'నేను రెండుపూటలా మీ photo పెట్టుకొని prayer చేస్తున్నానే, మరి వాళ్ళని నాకిష్టంలేని వాళ్ళని కూడా మీరు చేరదీస్తున్నారేమిటీ' అని అనడానికి లేదు. నిన్నెంత చేరదీస్తాడో వాడ్ని అంతే చేరదీస్తాడు. జీవులుగా నువ్వెంత కావలసినవాడవో వాడూ అంతా కావలసినవాడు. నువ్వేసే తూకాలు అక్కడ వుండవు. ఆయన తూకాలు వేరే. కానీ తూకాలు ప్రకారంగా యిచ్చేది, ఆయన కాదు, విధి యిస్తుంది. గురువు ఎప్పుడూ మార్గం చూపిస్తూ వుంటాడు. ఎప్పటికప్పుడు రక్షణ చేద్దామని ప్రయత్నిస్తుంటాడు. సంచిత కర్మ, ప్రారబ్ధకర్మ దాంట్లోంచి తూకంగా నీకు వచ్చేవి వస్తూంటాయి. ఇటువంటి సన్నివేశాలు వచ్చినప్పుడు పడిపోకుండా వుండడానికి యివి యిచ్చాడు. భీష్ముడి వరకు తనకి వ్యతిరేకంగా యుద్ధంచేసి, తన చావుకి కారణమైన వాడు కృష్ణుడు. అర్జునుడు, శిఖండి కాదు. కృష్ణుడు తన ప్రవర్తన ద్వారా ఇలా

ఉండకూడదు, ఇలా ఉండాలి అని సందేశం ఇచ్చాడు భీష్ముడికి. అందుకే ఆయన బాణాలచేత కొట్టించుకున్నాడు. బాణాలమీద పడుకున్నాడు. ఎంత బాధపడి వుండాలీ? దేవుడ్ని నమ్ముకుంటే ఇదా చేసేపని? అయినా పాగిడాడుటండీ. అదీ జితామిత్ర! అలాటి వారు ధర్మరాజు, రాముడు, హరిశ్చంద్రుడు. వారు ఎవ్వరినీ ఏమీ అనరండీ. వారు నాలుకకి ఏమంత్రం పెట్టుకున్నారో కానీ, అనడం మానేస్తారు. భావాలను ప్రోత్సహించడం మానేస్తారు. భావం వదిలేస్తారు. తద్వారా జితామిత్రత్వాన్ని సాధించడం జరుగుతూ వుండాలి. అయిపోవడం వుండదు. Tracing perfection తప్ప we can never be perfect .ఎంత నువ్వు చేయగలిగితే అంతవరకూ నువ్వు ఉత్తీర్ణుడవుతావు. అంతవరకూ ఉద్ధరింపబడుతూంటావు. అంతవరకూ ఉద్ధరించుకుంటూ వుంటావు. ఏరోజు ద్వేషం వస్తే ఆరోజు పడిపోతావు.

## 545 ప్రమోదనః

ప్రమోదం అంటే బయట సన్నివేశాలతో సంబంధం లేకుండా లోపల ఎప్పుడూ ఆనందంగా వుంటాడుటండీ. బయట మనుషుల చేతకానీ, మనుషుల యొక్క చేతల చేతగానీ, మాట్లాడే మాటలు కానీ, బయట వాతావరణం కానీ, మనం ఒకటంటే ఇంకొకటి అవుతూ ఉన్నప్పుడు కానీ, లోపల ఆనందమే. గురుపూజలలో వర్షం వచ్చింది. మనది షామియానా కదా వర్షం వస్తే ఎలా? అనుకుంటే కాదు. ఒప్పుకోవాలి. లోపల ఆనందంగానే వుండాలి. దీనికి ఒక సాధన వున్నది. వాడు ప్రమోదనుడు! అందుకే కృష్ణుడికి ఏనాడూ ముఖంమీద చిరునవ్వు చెదరలేదు. బయటకు కోపం నటించవచ్చు. శిశుపాలుడ్ని నవ్వుతూ చంపలేదు. మొహం రౌద్రాకారం దాలుస్తుంది, లోపల మాత్రం వాడు వచ్చేస్తున్నాడు, రక్షిస్తున్నాను అన్న ప్రమోదం, బయటకి శిక్షణ, లోపల రక్షణ కదా. అలాగే విజృంభించి యుద్ధము చేసినప్పుడు బయటకి ఇంకో రకం భావన వ్యక్తం చేయవచ్చు. లోపల శాంతియే, ప్రమోదమే. ప్రశాంతమే, ఆనందమే. లోపల ఏమీ చెదరదు. బయట మాత్రం ఆ కాసేపూ కవళికలు మారుస్తాడు. ఎందుకనీ? వచ్చిన జీవుడ్ని ధర్మపథంలో పెట్టే ప్రయత్నం కోసం మారుస్తాడు. దుర్మార్గుడు వస్తే గాంభీర్యవంతుడవుతాడు. పిచ్చి పని చేస్తే కోపం వస్తుంది. 'ఆయనకీ కోపం వస్తుందా' అనుకోవచ్చు. ఆయన కోపం ఆ సన్నివేశం వెళ్ళగానే వెళ్ళిపోతుంది. అప్పటికప్పుడు తెప్పించుకున్న కోపం తప్ప, కోపానికి వశుడైనవాడు కాదు. కోపాన్ని వశం చేసుకున్నవాడు. రాముడి విషయంలో ఇది చాలా బాగా చెప్తారు. రాముడు కోపం తెప్పించుకుని యుద్ధం చేస్తాడుట. లేకపోతే యుద్ధం కూడా చేయలేడాయన. విపరీతమైన శాంతమూర్తి అయిన రాముడు. రావణుడు వాళ్ళని చూసి 'వీళ్ళతో యుద్ధం ఏమిటే?' అనుకుంటాడుట. అందుకే రావణుని చంపలేక చంపుతాడు. విపరీతమైన కరుణ. జీవుడిగా వాడి అర్హతలు చూసి ఆనంద పడతాడు. తన పెళ్ళాన్ని ఎత్తుకు పోయినవాడ్ని చూసి ఆనందపడుతున్నాడు అంటే మామూలుగా ఏదో Mental Symptom అని ఏదైనా Homeo మందు వెయ్యాలి. రావణుడ్ని చూడగానే లక్ష్మణుడికి BP పై count 200, కింది count 100 దాటి పోతుంది. రాముడు రావణున్ని చూడక ముందెలా వున్నాడో, రావణుని మొదటి సారి చూసాక కూడా అంతే ప్రశాంతంగా వున్నాడుటండీ. అసలు ఎన్ని తిప్పలు పడివచ్చాడు, వీడ్ని చూడడానికి. అంతేకాదు జీవుడుగా వాణ్ణి చూసి ఆనందించాడట. 'ఎంత వైభవం, ఎంత కళ వున్నాయి. వీడిలో ఎంత దివ్యత్వం వుంది' అని చూసాడట. అంత తీరని అపకారం చేసిన వాడిలో ఇవి చూసాడట అంటే అది పరిపూర్ణమైన దైవతత్త్వం! అది కేవలం అవతారతత్త్వం లో గోచరిస్తుంది. మనం ఆ సన్నివేశాలలో గబగబా దాటేయకూడదు. రాముడి ప్రతి

సన్నివేశంలోనూ మనం అక్కడుండి, రాముడి ఇది చేశాడు, మనమైతే ఏమి చేస్తాం అని చూడాలి. అప్పుడు రామాయణం భలేగా వుంటుంది. మన రామాయణం వేరుగా వుంటుంది. ఎన్ని మాటలంటాం, ఎన్ని రకాలుగా మొహం విషం చెందుతుందీ, ఇవన్నీ మనకే తెలుస్తుంది కదా. ఇలా చదువుకుంటేనే స్ఫూర్తివచ్చి, ఆయన చేసేదాంట్లో లక్షోవంతు చేయడానికి ప్రయత్నం వస్తుంది. అలా work out చేసుకోవాలి. విషం అంతా లోపలే వున్నది, బయట లేదు. 'బయట విషానికి భయపడక, లోపలి విషానికి భయపడు' అని చెప్తాడు, ఒక గ్రీకు గురువు తన శిష్యుడికి. అప్పుడే శిష్యుడు కొత్తగా పామును చూస్తాడు. పాము నాలుక బయటకు వచ్చి రెండుగా కనిపిస్తుంది. చీలిపోయి వుంటుంది కద! వచ్చి గురువుగారికి చెప్తాడు. 'రెండు నాలుకలున్నాయి పాముకి, అందుకే విషం ఎక్కువేమో' అని, అంటే 'దాని రెండు నాలుకలకీ భయపడక, మనిషి రెండు నాలుకలకి భయపడు' అని చెప్తాడు. 'మనిషి ముందొక మాట, వెనకొకమాట చెప్తాడు కదా, దానికి భయపడు. నీకు రెండు నాలుకలున్నాయేమో చూసుకో, పాముకి సహజం గా తనకున్న రెండు నాలుకలూ చూపిస్తూనే వున్నదీ, నీవు ఒక నాలుక పెట్టుకుని రెండు నాలుకలతో మాట్లాడుతున్నావు, నువ్వెంత దొంగవి?' అంటాడు. దానివి రెండూ, మనకి వంద నాలుకలు. అందుకే దాని విషం నీకెందుకు, నీ విషం సంగతి చూడమంటాడు. నాలుక విషం గ్రక్కేవాడికి మృత్యువు తథ్యం. అమరత్వస్థితిలో వున్నవాడికి నాలుక నుండి పిచ్చి మాటలు రావు. ఎందుకంటే అమృతంగానీ, విషంగానీ రెండూ విశుద్ధిలోనే వున్నాయి. విషం బయటికి వచ్చినప్పుడు, నురగల్లాగ వచ్చేస్తుంది. వెంటనే మనం మంచం save చేసుకోవాలి మనిషి పోయినా అని, 'ఇహ దింపెయ్యండి మంచం మీద నుండి, నేల మీద పెట్టెయ్యండి' అంటాం. ఎంత తొందరగా మన equation మారిపోతుందీ? శంకరాచార్యులంటారు ఇంతవరకూ నీభార్యే కదా అంటే, అయ్యుండచ్చు, కంపుకొడ్తోంది అంటాడు. అయినా, భార్య శరీరం కంపుకొడ్తోంది కానీ, భార్య కాదు. కిందికి దించెయ్యకపోతే ఆ మంచం చాకలికి యిచ్చేయాలి మన సాంప్రదాయం ప్రకారం, అందుకూ కిందికి దించెయ్యమంటారు. ఇలా దృష్టి మంచం మీద, మనిషి మీద కాదు. Main issue ఏమంటే Daily basis గా, ఇవన్నీ self introspection కి సంబంధించిన నామాలు. భగవత్పరంగా చెప్పారు. భగవంతుని స్తుతి చేయడానికి పనికి వస్తాయి. ఆ తత్త్వం మనలో కూడా వున్నది. దాన్ని పెంపొందించుకోవడానికి సాధన వున్నది. అది చేసుకుంటూ వుండాలి. ఇలా ఉన్నవాడికి ప్రమోదం వస్తుంది. జీవులనే చూస్తాడు తప్ప భావాలను చూడకపోవడం వలన 'ప్రమోదం' వస్తుంది. ఏనుగులో నుండే జీవిని చూస్తుండటం వలననే, మత్తెక్కి బుద్దని మీదకి వచ్చిన ఏనుగు అక్కడే ఆగిపోతుంది. ఎంతమందినో అది తొక్కేసి వెళ్ళిపోతోంది రాజవీధిలో ఎందుకూ? వాళ్ళంతా మనలాంటివారే. పిచ్చెక్కి మదించిన ఏనుగును చూసారే తప్ప, అందులోని జీవిని చూడలేదు. అందరూవచ్చి 'అది వస్తోంది,

తప్పకోమని' చెప్తారు బుద్ధునికి. ఏమీ కంగారు పడడు. అలా నడుచుకు పోతూంటాడు. ఎదురుగుండా ఏనుగు వస్తుంది. ఈయన ఏనుగు కళ్ళలోకి చూస్తాడు. ఏనుగు ఈయన కళ్ళలోకి చూస్తుంది. ఏనుగు అలా కూర్చుండిపోతుంది. కూర్చుంటే దాని కుంభస్థలం మీద చేయిచేసి మూడు సార్లు రాస్తాడు. దానికి మామూలు పరిస్థితి వస్తుంది. మెల్లిగా నడచి వెళ్ళిపోతుంది. ఎందుకు ఆయనకు సాధ్యమైందీ? దాని స్వభావంలో ఆయన ఇరుక్కోలేదు. అలాగే పులిని పిల్లిలా చేశాడు మరువు మహర్షి. ఎందుకనీ? వాళ్ళకి జీవి కనిపిస్తే, మనకి పులి కనిపిస్తుంది. మనం చూసేది వేరు, వాళ్ళు చూసేది వేరు. అది పులికాదు, జీవి అన్నప్పుడు, పులిభావం నీమీద పని చేయదు. కాబట్టి పులి నిన్నేమీ చేయదు. ఏ జంతువైనా, మనిషైనా అంతే. అదీ కృష్ణుడి జీవితంలో, రాముడి జీవితంలో, వామనుడి జీవితంలో గోచరిస్తుంది. ఎవరిని నిర్జించడం కోసం ఇన్ని రకాల దానాలు చేసాడో, వాడు రాగానే తెలిసిపోయి దానం చేశాడు బలి. అసలు మొత్తం scheme అంతా వాడికి వ్యతిరేకంగా పనిచేయడానికి. వాడు వచ్చేసరికి, వాడికి దాసోహం అంటాడు వైష్ణవుడల్లే. గురువుగారికి మండిపోతుంది. అలాగే రావణుడికి రాముడ్ని చూడగానే, సత్తువంతా జారిపోతుంది. రాముడ్ని చూసిన రావణుడికి ఆత్మ పరమాత్మలో ఐక్యం అయినట్లుగా అయిపోయి, నిర్వీర్యుడైపోయి ఆరోజు యుద్ధంలో చెత్తకింద ఓడిపోతాడు. రుక్మిణిని తీసుకెళ్లినప్పుడు, కృష్ణుని చూస్తూ బాణాలు పట్టుకున్న యోధులంతా కూడా ఈయన వారి కళ్ళల్లోకి చూసి, నవ్వినప్పుడు యేమైందీ? అలాగే సభలో రాయబారమప్పుడు అందరి కళ్ళల్లోకే చూడగానే, అందరూ లేచి నిలబడ్డారు. దుర్యోధనుడు కూడా లేచి నిలబడ్డాడు. అసలు వాడే చెప్తాడు, ఎవరూ లేవకండీ, వాడ్ని అవమానించాలని. అలాంటివాడు కృష్ణుడు వచ్చీరాగానే, వాడ్ని చూసీచూడగానే లేచి నిలబడతాడు. ఈ గాడిదే లేచింది, మనం లేవడానికేం అని భీష్మాదులు కూడా లేస్తారు. ఎందుకు వీలయ్యింది ఇదీ? కృష్ణునికి జీవుని దర్శనం చేయడం తప్ప, స్వభావాన్ని దర్శనం చేయడం వుండదు. జీవుడ్ని రక్షించుకుంటాడు, స్వభావాన్ని వీలైతే మలచుకుంటాడు. అవసరమైతే శిక్షిస్తాడు. అదీ మార్గం. అందుకని జీవతత్వాన్ని గమనించడం అనేది ఎవరైతే సాధన చేస్తారో, వారికి బయట సన్నివేశాలతో సంబంధం లేకుండా మోదం వుంటుందండీ, అదీ 'ప్రమోదం'. మోదం వేరు, ప్రమోదం వేరు. శాంతి వేరు, ప్రశాంతి వేరు. వట్టి మోదం కాసేపు వుంటుంది, పోతూంటుంది. 'మోదక ప్రియః' అన్నట్లుగా నాలుగు లడ్లు తిన్నప్పుడు మొహం విప్పారుతుంది. ఆతరువాత ఓగ్లాసు కాకరకాయ రసం ఇస్తే ముఖం ముకుళించుకు పోతుంది. బహిర్గతమైనదాన్ని మోదం అంటారు. అంతర్గతమైనదాన్ని ప్రమోదం అంటారు. అది మారదు. ఎప్పుడూ వుంటుంది. అందరి జీవులనీ జీవులుగానే చూస్తాడు, ముందు అదే అర్జునుడికి బోధ చేస్తాడు. 'శత్రువుని చూడబోక, యుద్ధం చేయలేవు. ఓడిపోతావు, జీవుడ్ని చూడు' అంటాడు. వీడికంత సత్తా వుండదు కదా. అర్జునుడు తన మాట వినడేమో, స్వతంత్ర బుద్ధి

వున్నవాడు, స్వతంత్రంగా చేసి బాగా దెబ్బలు తింటాడేమో, వీడ్ని రక్షించుకోవాలి అని, రేపు యుద్ధం అంటే ఈరోజు రాత్రి అర్జునుడి వద్దకు వస్తాడు. 'ఏం చేస్తున్నావురా' అంటే బాణాలు బాగా నూరుతుంటాడు. ఎందుకు నూరుతున్నావంటే 'రేపు గట్టిగా కొడితే కండలు చీలిపోవాలి కదా' అని జవాబిస్తాడు అర్జునుడు. నవ్వుతాడు కృష్ణుడు. 'ఎందుకు నవ్వుతావు' అంటే 'చీల్చేద్దాం, చెండాడేద్దాం అదికాదు మన ఉద్దేశ్యం. ధర్మం కోసం యుద్ధం చేస్తున్నాం'. అంటాడు. మరేం చేయమంటావు? అంటే, ఈతత్త్వం చెప్తే వాడికెక్కే పరిస్థితిలో వాడు లేడు. వాడు పండ్రెండు సంవత్సరాలుగా అడవిలో నానాబాధలు పడివుంటాడు. తొంబది సంవత్సరాల వయసు అప్పటికే. దుర్యోధనుడి ద్వారా చిన్నప్పటి నుండి అరిష్టాలు మొదలు. తొంబది సంవత్సరాలంటే దుర్యోధనుడు three times Saturn అండీ. మరి వీడి లగ్నం మీదే వాడి శని యెక్కిందో మనకి తెలీదు కానీ, ఎంతుంటుందీ వాళ్ళ మీద? ఇలా కాదని 'దుర్గని ప్రసన్నం చేసుకో' అని చెప్తాడు. ఎందుకంటే నేను చెప్పింది విను అంటే వినే type కాదు. Proximity problem. దగ్గఱ వుండడం చేత దైవం యొక్క వెలుగులో వుండరు. చీకటిలో వుంటారు. అదే దీపం కింద నీడ. ఎక్కడ పడదు వెలుగు? దీపంకింద మాత్రమే పడదు. మిగతా చోటంతా వెలుగు. 77 లో EK గరు పైన వున్నప్పుడు, కింద మా స్నేహితులు వచ్చినపుడు, పరిచయం చేస్తే చాలా ఆనందపడి ఒకాయన చెప్పాడు, 'ఒకటి గుర్తు పెట్టుకో, దీపంకిందే చీకటి వుంటుంది జాగ్రత్త' అని. Shade లో వుండబోక అన్నాడు. వాడు ఎంత తెలిసిన వాడై వుంటాడండీ? వాడికి తెలుసో, తెలీదో వాడిలోంచి మనకి ఆ వాక్యం వచ్చిందికదా. There is a danger of falling into shade of the light when you are very proximate to the light. అందుకే స్వంత కుటుంబసభ్యులకి ఎప్పుడూ మహాత్ముల యొక్క తత్త్వం అవగాహన కాక బాధపడుతూ వుంటారు. కృష్ణుడు కొడుకులకే దక్కలేదు. ఎందుకు దక్కలేదంటే నాన్ననే చూస్తున్నారు వాళ్ళు, లేదా తమ్ముడ్నే చూస్తారు, లేదా మొగుడ్నే చూస్తారు. ఇలా చూస్తారు కదా. అలాగే బాగా సన్నిహితంగా వుండడం వలన యాదవులు చూడలేకపోయారు. క్రీస్తు No prophet will be known in his native land అన్నాడు. ఎంతకొట్టారండీ ఆయన్నీ? అంత మేకులు కొట్టించుకున్న మహాత్ములెవరన్నా వున్నారా? అర్జునుడికి కృష్ణుడు సఖుడు. తన చెల్లెలినిచ్చి పెళ్ళి చేయించాడు. కనుక బావ అయ్యాడు. అవసరమై పిలిచినపుడెల్ల వస్తాడు. కనుక 'వాడు మనలాగే, కాకపోతే కొంచెం యెక్కువై వుంటుంది' అనుకుంటాడు. కానీ ఆయనకు తెలుసు, వీడి ద్వారానే చేయించుకోవాలని. వీడికి అప్పుడప్పుడు తిక్క వస్తుంది. తిక్క తగ్గాలంటే యేంచెయ్యాలి అని ఆలోచించి 'దుర్గ ప్రార్థన చెయ్యారా' అని చెప్తాడు. అర్జునుడిలోని దివ్యగుణం మంచి సంయమనం కలిగిన మనస్సు కలిగి వుండడం. దేని మీద లగ్నం చేస్తే ఠక్కున అది చేరి పోతాడు. లేకపోతే అరణ్యవాసంలో శివుడ్ని మెప్పించి పాశుపతాస్త్రం తెప్పించుకోమంటే ఎన్ని జన్మలకయ్యే పనండీ? శివుడి గురించి వెయ్యేళ్ళు

తపస్సు చేసిన వారున్నారు. మరి ఐదు సంవత్సరముల అరణ్యవాసం అయి ఏడు సంవత్సరములు మాత్రమే మిగిలి వుంది. కనుక ఏడు సంవత్సరాల్లో శివుడు ప్రత్యక్షమవుతాడా అన్న ప్రశ్న అర్జునుడివద్ద వుండదు. అలాగే వెళ్ళి చేస్తాడు, రక్కున శివుడు వస్తాడు. అదీ ఆయనకుండే సంయమనం. మనస్సు దేనిమీద లగ్నం చేస్తే దాని మీద నిలబడి పోతాడు. అదీ గొప్ప విషయం. సహజ యోగి అన్నమాట. ఏదో మడతల్లో అవి యివీ యేవో వుండవచ్చు. అసలు విషయం వద్ద అలా వుంటుంది. అందుకే వెంఠనే దుర్గ ఆరాధనలో కూచుంటాడు. ఇంకోడైతే కూచుంటే పనవదు. అర్ధరాత్రి దుర్గప్రార్థన చేయరా, అంటే తెల్లారే లోపల అర్జునుడికి దుర్గ ప్రత్యక్షమవుతుంది. మనకు? ప్రతిసారీ 'మనకు' అని చూసుకోవాలి. అది నేను చెప్పేది మీకు. ఎక్కడి దుర్గ? ఎప్పటికి తేలేను? ఎన్నిసార్లు మనం దుర్గా పూజలు చేసామండీ? ఏమాత్రం కనిపించిందీ! కనిపించి, ఆమె 'ఏరా నాయనా' అంటే 'యుద్ధం అమ్మా, నాకు జయం కలిగేట్లు ఆశీర్వదించు' అంటే 'నీ రథంలో నేనే కూర్చుంటున్నాను, నీరథాన్ని నిర్వర్తించేవాడు, నీముందు కూర్చుని రథసారథ్యం వహించేవాడు ఎవరనుకుంటున్నావ్? నేనే! ఒకటి గుర్తు పెట్టుకో, ఆయన చెప్పినట్లు చెయ్యి. అంతా ఆయన చేతిలోనే ఉన్నది. ఆయన చెప్పిందెప్పుడూ కాదన బోకు' అని చెప్తుంది. 'అలాగే' అన్నవాడు పాద్దుటే 'హంసపాదు' వేస్తాడు. 'నేను యుద్ధం చెయ్యను' అంటాడు. ఇంత తపస్సు చేయించి, ఆమెతో చెప్పించినా కూడా, ఆమె రూపంలో కూడా ఆయనే వచ్చి చెప్తాడు actual గా. రెండూ ఒకటే. ఆమే, ఆయనా కూడా అష్టమినాడే పుట్టారు. ఒకరు శుక్లాష్టమి, ఒకరు కృష్ణాష్టమి. అంతే తేడా. అది స్త్రీ స్వరూపం, ఇది పురుషరూపం. అది, ఇది కూడా త్రిమూర్త్యాత్మకమైన శక్తే! త్రిమూర్తులని సమీకరణ చేస్తే దుర్గ వచ్చింది. ఇక్కడా అంతే. రెండూ ఒకటే. నేను చెప్తే వినడని ఆమె చేత చెప్పించినా, మళ్ళీ మొదటికే వచ్చాడని ఎలాగో నానా తిప్పలూ పడి చేయిస్తాడనుకోండి. సన్నివేశాలలో క్రుంగి పాకుండా 'క్షుద్రాం హృదయ దౌర్బల్యం' అంటాడు మొదటే గీతలో. సన్నివేశానికి క్రుంగామా, నువ్వు క్షుద్రుడివి అయిపోతావు. ప్రమోదం ఆయనకున్నది. ఎందుకంటే అందరిలోనూ అదే జీవుని చూస్తూంటాడు. ఇంత క్రుంగిపోయిన వాడ్ని చూస్తే ఎంత చిరాకు రావాలండీ కృష్ణుడికే ? ఫెళ ఫెళ మంటూ యుద్ధం మొదలుపెట్టి, అసలు main candidate 'యుద్ధం చెయ్యను బావా, ఇదంతా ఏమిటీ'? అని తత్త్వంలోకి దిగితే, వేదాంతం మొదలు పెడితే ఎలా వుంటుందీ? లాగి లెంపకాయ కొడదాం అనిపిస్తుంది కదా. ఓపిగ్గా వాడికి చెప్పాలా? ఈముక్క యుద్ధం మొదలుపెట్టే ముందు ఉద్ధరించలేకపోయినావా, అని చెప్పద్దా? పరశురాముడైతే ఆ పనే చేసి వుండేవాడేమో. కృష్ణుడు కదా. చెప్పాడు. ఎట్లా చెప్పాడు? ఎంతో సంతోషంగా చెప్పాడుటండీ అటువంటి సమయంలో. మోదానికి సాధన ఏమంటే అందరిలో ఉండేవాడిని గమనిస్తుంటే, వీడిలో ప్రమోదం ఏమాత్రం తగ్గదండీ. అందరిలో వుండేవాడ్ని గమనించక పోతే పోతుంది. గమనిస్తూంటే హృదయం వికాసం చెంది,

ఆనందంగా వుంటుందిట. అట్లా మహాత్ముల జీవితాల్లో బోలెడు కనిపిస్తాయి. పరమగురువుల జీవితంలో కూడా బోలెడు కనిపిస్తాయి. అతిక్రూరమైన జంతువులు కూడా ఎంతో స్నేహంగా మెలుగుతాయి. ఇహ మనుషులు నిశ్చేష్టులైపోతారు. రాముడు, కృష్ణుడు అలా నిశ్చేష్టులని చేశారు. ఆ మనోహరత్వం వాళ్ళలోంచి అలా వస్తుంది. 'సర్వజన మనోహరి, సర్వ ముఖరంజని, సర్వ రాజవశంకరి' అని చెప్పకుంటాం కదా. రాజుల్నే వశం చేసి పెట్టమని. ఎలా వశమౌతూంటారు? ఇలాగ. రాజుల్ని చూడక, జీవుల్ని చూడడం వలన. 'సర్వ దుష్ట మృగవశంకరి' దుష్టమృగాలని చూస్తే వశం కాదు. జీవులుగా చూస్తే వశం. అదే వశం అయితే మనుషులని చూస్తే వశమవరూ? మనుషుల్లో కూడా జీవుడ్ని చూడడం మొదలుపెడ్తే నీలో కూడా మోదం పెరిగి, ప్రమోదంగా లోపల తిష్టవేసుకుంటుంది. అప్పుడిక సన్నివేశాలు నిన్ను ముట్టుకోవు. నీలోపల మోదాన్ని పాడు చెయ్యవు, బయట ఎలావున్నా. బయట కాసేపు బావుంటుంది, కాసేపు బావుండదు. ఇది ఎప్పుడూ బావుండే విషయం కాదు అని తెలుసుకుంటే అది ఒక తెలివి. బావున్నప్పుడు కాస్త భయపడు, అని చెప్తాడు అన్నమాచార్యులు. ఎందుకంటే ఈ బావుండడం తరువాత బావుండక పోవడం వస్తూంటుంది అని. బావుండక పోవడం వున్నప్పుడు సంతోషించు, ఎందుకంటే ఆ తరువాత బావుండడమే వచ్చేది. కష్టం వచ్చాక సుఖం, సుఖం తర్వాత కష్టం. Alternative గా work-out అవుతుంది. Law of alternation సృష్టిలో ఎప్పుడూ పని చేస్తూంటుంది. పగలు అయిపోతూంటే సంతోషించడానికేమీ లేదు. రాత్రి అవుతూంటే మళ్ళీ పగలు అవుతుందని సంతోషించు, అంటాడు కృష్ణుడు. ప్రతిరాత్రీ ఇంకొక పగలుకు వాగ్దానం. ప్రతి పగలూ ఇంకొక రాత్రికి వాగ్దానం. అందుకని చీకట్లో వున్నప్పుడు వెలుగుని కోరుకోవడంలో ఎక్కువ ప్రయోజనం వున్నది. వెలుగులో వున్నప్పుడు వెలుగుని కోరుకోవడం వుండదు, 'ఉండడమే'! అందుకని ప్రమోదంలో వుండేవాడికి వెలుగు, చీకట్లు అనేవి వుండవు. భూమిమీద వుండేవాడికే వెలుగు, చీకటి. భూమిదాటి వెళ్ళిపోతే రాత్రి, పగలు యేమీ వుండదు. ఎందుకంటే భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నప్పుడు కాసేపు భూమి వీపు వైపు సూర్యుడు కనిపించకపోవడం, మళ్ళీ తిరిగినప్పుడు వీపువైపు సూర్యుడొచ్చి, మొహం వైపు చీకటి. ఇలా వుంటుంది కదా భూమి గుండ్రం గా తిరుగుతున్నప్పుడు. మనం ఏ భాగాల్లో వున్నామో దాన్నిబట్టి రాత్రి, పగలు. అసలు దీన్లో నుండి బయటకి వచ్చేస్తే పగలేదీ, రాత్రేదీ? పూర్ణిమా, అమావాస్యలూ, ఉత్తరాయణ, దక్షిణాయణాలు ఏవీ? When you are earthy ఇవన్నీ వున్నాయని అర్థం. భూమిమీద వుండడం అంటే భూమికి సంబంధించిన విషయాల్లో ఇమిడి వున్నవాడి చైతన్యానికి వెలుగూ చీకటి, పూర్ణిమా అమావాస్య, ఉత్తరాయణం దక్షిణాయణంగా జీవితం వుంటుంది. భూమికి అంటుకు పోకుండా, భూమికి ఆధారమైన దానికి మనం నిలబడి వున్నామనుకోండి, భూమి విషయాలు నిన్నేమీ చేయలేవు. దాని

ప్రభావం ఉండదు. అదీ Objectivity యొక్క impact నీపైన లేకపోవడంగా చెప్తారు. 'ఇతరేయము లేదా బహిరంగము యొక్క ప్రభావము నీమీద లేదు' అని చెప్తారు. అలా నువ్వు తయారైతే దానికి 'వైరాగ్యం' అని పేరు పెట్టారు. కాకపోతే ఆ పదం ఎక్కువ వాడకం అయ్యిందే కానీ, దాని భావం ఏమిటో పోయింది. వైరాగ్యం అంటే ఏ విషయంలోనూ ఇలా జరుగాలని కాక, జరుగుతున్న దానిలో సత్యాన్ని గమనిస్తూ, ఆనందిస్తూండడం. ఇది యోగ స్థితి! ద్వంద్వాతీత స్థితి! అందులో ప్రవేశించిన వాడికి 'ప్రమోదం' వుంటుంది. మహాత్ములంతా అందులో జీవిస్తూంటారు. కనుక వారినాశ్రయించడం వలన మనం కూడా అందులోకి ఎదగవచ్చు. సరే, భగవంతుడు అదే. 'భగవద్భక్తులు అది సుమా, అది చూడు' అని చెప్పడం ఇందులోని విశేషం. సాధకుడిగా నువ్వు కూడా భగవద్భక్తులలో వుండే ఆ అర్హతని పొందు సుమా అని చెప్పడం అనేది మన వివరణ యొక్క ప్రయోజనం. ప్రమోదం యోగస్థితికి/ద్వంద్వాతీత స్థితికి వచ్చినపుడు వచ్చేది. అది కలగాలంటే రోజూ మన జీవితంలో మహాత్ముల ఆరాధన, దర్శనం వుండాలి, ఇంకొకటి వుండరాదు. .

## 546, 547, 548 ఆనందః, నందనః, నందః

ఆనందుడు, నందనము, నంది మూడూ కలిపితే అవి ఒకే తత్త్వానికి సంబంధించిన మూడు నామాలు. ఎప్పుడూ ఒకే తత్త్వము మూడు రకాలుగా దిగి వస్తూ వుంటుంది. కర్త, కర్మ, క్రియ; ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు; బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు; ఇలా మనకి ఒకటి మూడుగా దిగి వచ్చి, మూడు అల్లికగా, త్రిగుణాత్మకంగా సృష్టి అల్లిక జరుగుతూ వుంటుంది. అందులో ఆనందం అనే పదం మనకి తెలుసు. నందనం అంటే ఆనందానికి కారణం అయినది. నంది అంటే శివుని ఎదురుగా కూర్చునే వాడు అనుకుంటాం. ఎల్లప్పుడూ ఆనందంగా ఉండేవాడిని 'నందీ' అంటారు. నంది అంటే ఆనందించేవాడు. నందనం అంటే ఆనందానికి కారణం. ఆనందం పొందడానికి కారణం ఆనందించేవాడు. ఒకటి పొందేవాడు. ఒకటి పొందబడ్డది, ఒకటి పొందడానికి చేసే కారణం. ఈ మూడు భగవద్ తత్త్వంగా మనకి విష్ణు సహస్రనామంలో చూపించారు. ఎవరియందు ఆనందం వుంటే వారి యందు భగవంతుడు వున్నట్లు అర్థం. ఎవరి యందు ఆనందం తక్కువ వుంటే, వారి యందు ఆయన కొంచెం నిద్రపోతున్నట్లు లెఖ్క. లేకపోవడం వుండదు. అందరియందు ఉంటాడు. కొంచెం ఎక్కువ తక్కువలుగా ఉంటాడు. అంతే. మనలో కూడా అప్పుడప్పుడు ఎక్కువ ఉంటాడు, అప్పుడప్పుడు తక్కువ ఉంటాడు. ఎప్పుడూ అదే పద్ధతిలో ఆనందంగా ఉండేవాడు నంది. ఎందుకయ్యా? అంటే ఎల్లవేళలయందు శివదర్శనం చేసుకుంటూ ఉంటాడు. గుళ్ళోనే కూర్చుంటాడు అని కాదు. ఎక్కడ చూసినా శివుడినే చూస్తాడు, ఇంకొకటి చూడడు. అది నందీశ్వరుడు చేసే పని. ఎక్కడ వున్నా విష్ణువునే చూస్తాడు, ఇంకొకటి చూడడు గరుత్మంతుడు. కాబట్టి వాళ్ళు పరమ భక్తుల లెఖ్క లోకి వస్తారు. అలా సమస్తము నందూ ఆయననే దర్శనం చేయడం మూలంగా వారికి ఆనందం ఎప్పుడూ వుంటుంది. భగవద్ దర్శనం చేసుకోలేని తరుణం వుంటుంది, ఆ తరుణంలో ఆనందం ఉండకపోవచ్చు. ఆనందం గురించి తైత్తరీయ ఉపనిషత్తులో చక్కగా చెప్పారు. దీనికన్నా ఇది ఆనందం, దాని కన్నా అది ఆనందం, దాని కన్నా అది ఆనందం అన్నిటికన్నా అది వంద రెట్లు ఆనందం, దానికన్నా అది వంద రెట్లు ఆనందం, దానికన్నా అది వంద రెట్లు ఆనందం ఇలా చెప్తూ వుంటారు. మామూలుగా ఏదైనా తింటే ఆనందంగా వుంటుంది. ఎంతసేపు వుంటుంది? నాలుగు గంటలు వుంటుంది. Lunch కి తింటే మళ్ళీ dinner వరకూ వుంటుంది. మళ్ళీ dinner ఇప్పుడు తినాలి కదా. మధ్యాహ్నం తిన్నాక ఆనందంగా వుంది కదా, మళ్ళీ ఇప్పుడు ఎందుకు తినడం? అనే పరిస్థితి లేదు. తింటే కొంత ఆనందంగా వుంటుంది, ఉండకపోవడం ఏమీ లేదు. ఆ ఆనందం భగవద్ తత్త్వమే, కానీ అది వచ్చి వెళ్ళిపోతూ వుంటుంది. అలాగే వింటే ఆనందంగా వుంటుంది. అందుకే కదా భగవత్ పరంగా

నాలుగు విషయాలు విని ఆనందించడానికి మీరు చేర్తూ వుంటారు. చెప్పి ఆనందించడానికి నేను చేర్తూ వుంటాను. ఇందులో ఏ ఆనందం లేకపోతే ఎందుకు వస్తారు ఎవరైనా? రారు కదా. అందుకని చెప్పినప్పుడే ఆనందం. మరి మిగతా అప్పుడో? అంత ఆనందంగా వున్నదా? తిన్నదానికన్నా కొంచెం వినడం ఎక్కువ ఆనందంగా వుంటుంది. చూస్తే ఆనందం. తిరుపతి, శ్రీశైలం వెళ్తాం, మహాత్ముల దర్శనానికి వెళ్తాం. చూసింది అంతకన్నా ఆనందంగా వుంటుంది. మరి ఆ తరువాతో? మళ్ళీ ఆనందం వుండదు. ఇలా మనకి భౌతిక పరమైన ఆనందం కొంత ఉన్నది, ఇంద్రియపరమైన ఆనందం కొద్దిగా ఎక్కువ సేపు వుంటుంది. చూసినది, విన్నది నెమరు వేసుకుంటూ వుంటాం. తిన్నది నెమరు వేసుకోవడానికి ఏమీ లేదు. మళ్ళీ తినేవరకూ అది ఆరాటపడుతుంది. అలాగే స్పర్శించింది మళ్ళీ స్పర్శించేవరకూ ఆనందం ఇంద్రియపరమైన ఆనందం. ఆపైన మనో పరమైన ఆనందం వున్నది. మనస్సుకి కొన్ని బావుంటాయి. ఒకసారి బావున్నవి మళ్ళీ మరొకసారి బావుండవు, అదేమిటో? మనస్సుకి ఎప్పుడూ ఒకేలా బావుండవు. కిందటిసారి వెళ్ళినప్పుడు బావుంది, ఈసారి ఏమిటి ఇలా అనిపిస్తుంది. అందుకని మనస్సుకి సంబంధించిన ఆనందం కూడా ఇంద్రియపరమైనది కాకుండా భావపరమైనది కాబట్టి కొంచెం ఎక్కువ వుంటుంది, కానీ అది పరిపూర్ణమైన ఆనందం కాదు. ఆ తరువాత విజ్ఞానపరమైన ఆనందం వుంది. అంటే మంచి జ్ఞానవంతులు ప్రబోధం చేస్తూ వుంటే, మనం వింటూ వుంటే చాలా ఆనందంగా వుంటుంది. సద్గంథాలు:- ప్రపంచ గ్రంథాలు, రామాయణం, భారతం, భాగవతం, ఎలా చదవాలో తెలిసి చదువుకుంటే మరి జన్మంతా ఇంకా ఏమీ అఖ్ఖర్లేదు ఇవి చదువుకుంటూ వుందాం అన్నంత ఆనందంగా వుంటుంది. చాలు. మనోవికారాల నుండి ఇంద్రియాల యొక్క బంధనం నుండి బయటపడ్డట్టే! భౌతిక శరీరం యొక్క ఆవశ్యకతల నుండి బయటపడిపోయిన ఆనందం సద్గంథపఠనంలో రుచి మరిగిన వాళ్లకి తెలుస్తుంది. అందుకని వాళ్ళు అలా అవి చదువుకుంటూ, మిగతా విషయాలను ఆలోచించకుండా, విజ్ఞానపరముగా జీవిస్తూ ఉండే వాళ్ళ ఆనందం, మనోలోకాల్లో జీవించే వాళ్ళ ఆనందం కన్నా, చాలా ఎక్కువగా వుంటుంది. దాని రుచి తెలియాలంతే. అక్కణ్ణుంచి అప్పుడు ఏమౌతుంది అంటే, మిగతా వాటికన్నా దీనితో శాశ్వతత్వం పెరుగుతుంది. ఆ తరువాత ఈ విజ్ఞానమయలోకంలో భగవంతుని తత్త్వం గురించి బాగా అవగాహన అవుతూ, దానియందు రుచి మరిగి, గ్రంథముతో పరిచయము, సంబంధము, స్నేహము, ప్రాప్తి. గ్రంథముతో పరిచయముద్వారా, గ్రంథముతో స్నేహము, తద్వారా భాగవత మార్గములో నడుస్తున్నవారితో స్నేహము, తద్వారా భగవద్ ప్రాప్తికి సోపానాలు. ఇలా ఏర్పడుతాయి. ఏర్పడితే అప్పుడు భగవంతునియందు రుచి కలుగుతుంది. భగవంతునియందు రుచి కలగడం వేరు, భగవంతుని నమ్మడం వేరు. నమ్మకం మనస్సుకి సంబంధించినది. మనస్సుకి పౌర్ణమి అమావాస్యలు వుంటాయి. ఒక్కోసారి

బాగా నమ్ముతాం. ఒక్కోసారి ఆ!-- అనిపిస్తూ వుంటుంది. ఒకసారి వున్నాడా? లేడా? అనిపిస్తుంది. రకరకాలుగా ఏడిపిస్తాడు కదా. అది భగవంతుడు ఏడిపిస్తున్నాడు అని మనం అనుకుంటాము. లేదు. మన మనస్సుకి వుండే కళలు. పాడ్యమి నుండి పౌర్ణమికి వుండే కళలు, మళ్ళీ పౌర్ణమి నుండి అమావాస్యకు వుండే కళలుగా, ఉండీ లేనట్టుగా చూపించేది మనస్సు తప్ప 'అది' ఎప్పుడూ వున్నది. కాబట్టి ఆ రుచి తెలిసినవాడు ఇంకమరి వెనక్కి వెళ్ళడు. భగవంతుడియందు రుచి కలగడం ఒక అదృష్టం. దాన్ని పూర్వపుణ్యం అంటారు, అంటే ఇంతకు ముందు చాలా సత్కార్యాలు చేస్తే దొరుకుతుంది అని. దారిలో ఈ ఆనందం కోసం వెతుక్కోవడం ప్రతీవాళ్ళకీ తప్పదు కదా. ఈ వెతుకులాటలో ఇది కాదు, దీని వల్ల రాదు, ఇది కాసేపు ఇస్తుంది, నేతి సిద్ధాంతం పట్టుకుని అలా వెళ్ళిపోతాం అన్నమాట. ఇంక ఎక్కడో అక్కడ ప్రతీ జీవికీ, వాడి జీవలక్షణం బట్టి ఒక చోట బాగా దొరుకుతుంది ఆనందం. ఇంక అక్కడ వాడు స్థిమితబడిపోయి, అందులో వాడు అంతర్గతుడై, హృదయంలో భగవంతుని యొక్క స్నేహం పెరిగి, అక్కడ భగవంతుని యొక్క దర్శనం జరిగి, అక్కడ భగవంతునితో సంభాషించుకుంటూ, అక్కడ దర్శనము, స్పర్శనము, సంభాషణము వాడితో చేసుకుంటూ, దేవుడితో లోపల మాట్లాడుకుంటూ వుంటాడు. త్యాగరాజు, అన్నమయ్య వంటి మహాత్ములందరూ దేవుడితో లోపల మాట్లాడుకునేవారు. అన్నీ చక్కగా వాళ్ళు చెప్పుకుంటూ వుంటారు. అప్పుడప్పుడు మనస్సు వికారాలు చూపిస్తూ వుంటే మనస్సుకి చెప్తారు. 'నిధి చాల సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా నిజముగా తెలుపు మనసా? నన్ను ఇలా ఏడిపించబోకు అని వాళ్ళు అలా దేవుడితోనూ మనస్సుతోనూ మాట్లాడుకున్నవే పాటలుగా మనకి ఇచ్చారు తప్ప, మనకోసం పాటలు వ్రాసి, ఏదో మనల్ని అందరినీ ఉద్ధరించేద్దామనుకోలేదు. అలాటి తపన వున్నవాళ్ళు ఎవరూ ఉద్ధరించలేరు. గుర్తుపెట్టుకోండి. తమని తాము ఉద్ధరించుకునే మార్గంలో పదిమందికి ఏదైనా దొరికితే వాళ్ళూ పట్టుకుని నడుస్తారు తప్ప, ఈ పది మందినీ ఉద్ధరించడానికి నేను కంకణం కట్టుకున్నాను అంటే కంకణం బరువు అయిపోతుంది అంతే. తాము భగవంతుని తో పొందే స్నేహము అందులో కలిగిన ప్రాప్తి కారణంగా, తన స్ఫూర్తి లోంచి పదిమంది స్ఫూర్తి పుచ్చుకుని వాళ్ళు నడిస్తే నడుస్తారు, అది వాళ్లకు సంబంధించినది. తనవరకూ తను నడవడమే. అలా భగవంతుని రుచిమరిగిన వారు వేరు. వాడు ఎప్పుడూ ఆనందంగా ఉంటాడు. ఎందుకంటే వాడికి లోపలే అంతా వుంది. సర్వము తన లోపల వున్నది, సర్వమునకు యజమాని తన లోపల వున్నాడు. తన యజమాని సృష్టి సమస్తమునకు యజమాని. తనలో వున్నాడు. తనతో వున్నాడు. తనకి దర్శనం ఇస్తూ ఉంటాడు. తనతో సంభాషిస్తూ ఉంటాడు. ఇంకేం కావాలి? బయట ఆరాటాలు వుండవు. బయట ఆరాటాలు వున్నంతకాలం ఏవో వికారాలు వుంటాయి. వీడికి ఇది ముఖ్యం, మిగతావి ముఖ్యం కాదు. అందుకని ఎప్పుడూ భగవంతునితో ఉంటాడు.

ఉండి, అన్ని పనులూ మనలాగే చేసుకుంటూ ఉంటాడు. వాడికీ మనలాగే సంసారం వుంటుంది, సంఘంలో ఎదో ఒక వృత్తో, వ్యాపారమో వుంటుంది. వాడికి వుండే బాధలు వాడికి వుంటాయి కానీ, వాటిలో చిక్కుకోక లోపల హృదయంలో జీవిస్తాడు. అలా జీవించడం చేత ఎప్పుడూ ఆనందంగా ఉంటాడు. బయటకి వచ్చినప్పుడు ఎప్పుడు ఆనందంగా ఉంటుందో చెప్పలేము. లోపలికి వెళ్తే ఎప్పుడూ ఆనందంగానే వుంటుంది. అవేవో గుడి ప్రాకారం దగ్గరే వదిలేసి గుడిలోకి వచ్చి దేవుడి దగ్గర కూర్చున్నట్టు అన్నమాట. ప్రతీరోజు హృదయంలోకి వెళ్ళడం అంటే, గోపురం దాటి వెళ్ళడం అంటే, బహిర్ ప్రపంచంలోంచి అంతర్ ప్రపంచంలోకి వెళ్ళడం గుళ్ళోకి వెళ్ళడం. ఆ తరువాత అక్కడ కూర్చోవడం, ధ్వజస్థంభం చూడడం అంటే నేనొక వెలుగు స్థంభం అని తెలియడం. నా లోపల వెలుగు వున్నది. అదే నృసింహుడు. ప్రతీవాడి లోపల నృసింహుడు వెలుగై వున్నాడు. అదే ఆ స్థంభం! స్థంభం అని ఎందుకు అన్నాం అంటే సుషుమ్నలో ఉండడం చేత మనం భగవత్ తత్వానికి వాహిక. కాబట్టి భగవంతుని వాళ్ళం అని ధ్వజస్థంభం చూడగానే గుర్తు రావాలి. ఆ తరువాత లోపలికి వెళ్తే ఇలా గుర్తువచ్చి, దేవుడు తప్ప ఇంకేమీ లేదబ్బాయ్! అని తెలుసుకున్నవాడు ఒకడు వస్తాడు. వాడు భగవంతుడి వాహనం. ధ్వజస్థంభం దాటి లోపలికి వెళ్తే అక్కడ వాహనం కనిపిస్తుంది. ఆయనకి దండం పెట్టుకోవాలి. ఎందుకంటే ఆయన మనకన్నా ముందు వెళ్ళినవాడు, మన అన్నగారన్నమాట. ఆయన యొక్క ఆశీర్వచనం పుచ్చుకుని తరువాత మనం దేవుణ్ణి చూడాలన్నమాట. గుడి అలా కట్టారు. ప్రతీచోటా ముందు ఒక ప్రాకారం వుంటుంది. ప్రాకారం లోపలి వెళ్ళడం అంటే మన లోపలికి వెళ్ళడం. లోపలి వెళ్ళిన తరువాత మనం జీవుడిగా దేవుని యొక్క వాహిక. మనకి వాహిక శరీరం. దేవుడి దగ్గరకి వెళ్తున్నాం అనే భావన చేత ఇక తన పేరు ఊరు స్థితిగతులు మర్చిపోయి, అక్కణ్ణుండి లోపలి వెళ్తే శివాలయం లో అయితే నంది, విష్ణువు ఆలయం లో అయితే గరుత్మంతుడు కనిపిస్తాడు కదా. లేకపోతే రామాలయం అయితే హనుమంతుడన్నా కనిపిస్తాడు. వాళ్ళని మర్చిపోకూడదు. ఎందుకంటే వాళ్ళు ఇదే మార్గంలో వెళ్ళి సిద్ధులైన వాళ్ళు. కాబట్టి మనకి కూడా ఆశీర్వచనమిస్తారు. అలాగే సత్యాన్వేషకులకి సద్గురువు యొక్క సాన్నిధ్యం దొరుకుతూ వుంటుంది. ఏది కావాలి నీకు దేవుడి దగ్గర నుండి ? ఫలానాది కావాలి అంటే వీళ్ళు దొరకరు. దొరికినా వాళ్ళేమీటో మనకి తెలియదు. ఏమీ అఖ్ఖర్లేదండీ! దేవుడి రుచి కావాలండీ. రుచి అంటే వెలుగు అని ఇంకో అర్థం వుంది. సూర్యుడి నుండి వచ్చే కాంతుల్ని కూడా 'రుచులు' అంటారు. అలా కాంతులు కావాలి. దైవంతో ఉండడమే కావాలి ఇంక ఏమీ వద్దు నాకు, అనే వాళ్లకి ఈ భాగవత మార్గంలో నడిచిన సద్గురువులు, అంటే భగవంతుని యొక్క వాహికలు, 'బావుంది! మేము కూడా నిన్ను ప్రోత్సహిస్తాం, నీకు కూడా స్ఫూర్తినిస్తాం, మార్గాన్ని చూపిస్తాం, అలా నడువు' అని చెప్తారు. అలా నడిచి మనం ముందుకి వెళ్తే మనం నెమ్మదిగా గర్భగుడి దగ్గరకి వెళ్తాం కదా. ఏ గుడి అయినా

గర్భగుడి దగ్గరకి వెళ్ళేదాకా మనకి ఆదుర్దాయే. వెళ్ళిన తరువాత అక్కడ క్షణం కూడా వుండదు మనస్సు. అదేదో చూసీ చూడకుండా చూడగలుగుతాం కాబట్టి, అదేదో బావుంది అనుకుంటాం. అక్కడే ఒక గంట సేపు కూర్చోపెడితే, ప్రాకారం అవతల వదిలేసినవి అన్నీ లోపలకి వచ్చేస్తాయి. గుళ్ళోకి వెళ్ళడం అంటే మనకి ముక్కుపుటాలద్వారా లోపలి వెళ్ళడమండీ. అక్కడ వుంది మన ప్రాకారం. గోపుర ప్రాకారం మన ముక్కే! అందులోంచి లోపలకి వెళ్ళిపోతే, ఒక్కొక్కటే దాటేసి హృదయంలోకి వెళ్తే, అక్కడ వెలుగు దర్శనాన్ని కోరాలి. కోరితే ఎప్పుడో అవుతుంది తొందర ఏమిటి? మనం ఇవాళ మనకి తెవిలింది అని ఇవాళ కోరితే ఇవాళ అవ్వదు. అవన్నీ లోపల్నుంచి ముడులు విప్పుకుంటూ రావాలి కదా. అందుకని బయట ఆరాటపడకుండా హృదయంలో ఆరాటపడండి. ఆరాటపడితే అసలు ఈ ఆనందానికి కారణం ఒకటి వుంది కదా. అది వాడే! ఇదంతా ఆనందమయంగా తయారుచేసి ఉంచాడు. మనకి తెలియక దుఃఖమయంగా చేసుకుంటున్నాము. అందుకని ఆనందానికి హృదయంలోకి వెళ్ళడం ఒక్కటే మార్గం. ఇంకొక మార్గం లేదు. బయట ప్రపంచంలో ఎప్పుడూ ఎక్కడా ఆనందం దొరకదు, గుర్తుపెట్టుకోండి. ఈ బహిర్గతమైన ప్రపంచం ఐతరేయం, భగవంతుడు కాకుండా ఉన్నట్టుగా అనిపిస్తుంది. అది కాకుండా కనిపించేది, తనకన్నా ఇతరంగా కనిపించే దానిలో వాణ్ణి చూస్తేనే ఆనందం. మరొకటి చూస్తే ఒకోసారి బావుంటుంది ఒకసారి బావుండదు. ఎప్పుడూ బావుంటుంది అని చెప్పలేం. అందుకని బావుండీ-బావుండని తరంగాల మధ్య ఉయ్యాల అంటారు. అన్నమాచార్య అదే అంటాడు ఈ జీవుణ్ణి ఉయ్యాలలో పెట్టేసావయ్యా? కాసేపు అలా వెళ్తాడా ఆనందంగా ఉంటాడు, కాసేపు ఇలా వస్తుంది ఉయ్యాల ఏడుస్తాడు. ఏడుస్తూ కుయ్యో మొర్రో అంటే మళ్ళీ అలా పంపిస్తావు హాయిగా ఉంది అంటాడు. నీకు కూడా అలవాటు అయిపోయింది. పవళింపు సేవ అని మేము కూడా ఉయ్యాల ఊపుతాం కదా. అందుకని నీకు కూడా జీవుల కష్ట నష్టాలు తెలుస్తాయి దీనివల్ల, ఎంత కష్టపడుతున్నామో. నీకు కూడా మా భావాలు బాగా తెలుస్తున్నాయి ఊగించడం వల్ల. ఎలా సాధకుల మనస్సులో కలిగే హెచ్చు తగ్గులు ఉంటాయో అవే ఉయ్యాల భగవంతునికి లోపల ఉంటుంది. ఒక రోజు విపరీతంగా ఊగించేస్తాం. వైకుంఠ ఏకాదశి అంటే వదిలేస్తాం ఏమిటి? ముందు రోజు రాత్రి వాళ్ళ ఆవిడతో చెబుతాడు. 'రేపు నాకు కొంచెం కళ్ళుతిరుగుతాయి. వీళ్ళంతా ఉయ్యాల తెగ ఊపేస్తారు. మళ్ళీ మరునాడు నుండీ ఎవ్వరూ పట్టించుకోరు. ఒకరోజు కళ్ళు తిరిగినా ఏమీ అనుకోకు. ఇది తాత్కాలికమే' అని చెప్తాడు కదా. మనకి కొన్ని పర్వదినాలు వచ్చినప్పుడు విపరీతంగా ఆకాశంవరకూ ఊపేస్తాం. సినిమాల్లో చూడండి అలా ఊపుతూ ఊపుతూ వుంటే, బాగా పెద్ద ఊపు అయిపోయి, మనకి signal వస్తుంది ఇక పడుతుంది కథానాయిక అని. మరి కాలో చెయ్యో విరిగే వరకూ ఊపుతారు కదా. అలా ఆనందం వైపు ఊగి, మళ్ళీ దుఃఖంలోకి వచ్చేస్తారు. అందుకని అన్నమయ్య 'ఎంత

విభవము కలిగిన అంతయు ఆపదని చింతించిన కదా తెలివి' అన్నాడు. నిజమైన తెలివి ఏమిటంటే బాగా అద్భుతంగా ఒకటి జరిగితే, దాని పక్కనే ఇంకొకటి వుంటుంది, గులాబీకి క్రిందనే ముల్లువున్నట్టు. అందుకే ఎందుకొచ్చిన గొడవ. గులాబీ వద్దు. ముల్లు వద్దు. లోపలకి వెళ్ళిపోతే ముల్లు వుండదు. గులాబీ కన్నా గుబాళించే వాసన వుంటుంది. ముక్కుకి ఏవీ వెలిగించకుండానే మంచి సువాసనలు అందుతాయి. ఎందుకంటే ఇంద్రియాలకి ఆ రకమైన అనుభూతి ఉన్నది. కన్నుకి వెలుగు అందుతుంది. చెవికి నాదం అందుతుంది. వెలుగును రుచి చూసిన నాలుక ఇంకా బయట రుచి పట్టుకోదు. బయట వదిలేసి లోపలకి వెళ్ళిపోతాయి ఇంద్రియాలన్నీ. అనిరుద్ధుడిగా వుండే ఇంద్రియాలు ప్రద్యుమ్నుడిగా వెలుగయిపోతాయి. వెలుగైపోతే ప్రద్యుమ్నుడికి తర్వాతి దర్శనం సంకర్షణుడు. తనే భగవంతుడు దిగివచ్చిన రూపంగా తెలుస్తుంది. అది అసలు భగవంతుడు మనం కాదు అని వాసుదేవతత్త్వంగా మనకి తెలుస్తుంది. ఇలా ఈ మార్గంలో మనం లోపలకి నడిచి వెళ్తూ వుంటే, ఆనందం పెరుగుతూ వుంటుంది. అది సన్నివేశాలతో సంబంధం లేని ఆనందం. అన్నీ బావున్నా ఆనందంగా లేదనుకోండి ఎదో జబ్బు చేసిందని అర్థం. బావుండలేదు ఆనందంగా లేము. బావుంది ఆనందంగా ఉంటున్నాం. అది సామాన్యమైన స్థితి. బావుండే-బావుండలేదు మనకి సంబంధం లేదు. ఈ బావుండే బావుండటం లేదు అనేది ఉయ్యాల. మనం అందులో ఉండొద్దు. దానికి అతీతంగా ఉందాం. ద్వంద్వాతీతం ఉండాలంటే లోపలకి వెళ్ళాలి. అలా వెళ్తే ఎప్పుడూ ఆనందంగా ఉంటుందిట. ఎప్పుడూ ఆనందంగా వుండే వాడి ముఖంలో చిరునవ్వు వుంటుంది. అంటే వికటాట్టహాసాలు చేస్తూ వుండడు. మామూలుగా వికటాట్టహాసాలు చేసేవాళ్ళు మర్నాడు ఏడుస్తూ ఉంటారుట. సాధకులకి వికటాట్టహాసం అనేది prohibited, నిషేధం! వికటంగా నవ్వితే మళ్ళీ అలాగే ఏడుస్తావు. అందుకని you can smile but don't laugh అని చెప్తారు పరమ గురువులు. చిరునవ్వు వుండాలి. వికటాట్టహాసం వుంటే మళ్ళీ అంత ఏడుపూ వుంటుంది. అది ఉయ్యాల. అందుకని మనం చిరునవ్వు కలిగిన ముఖం వున్న దేవతలని ప్రార్థన చెయ్యాలి. ఎందుకంటే భ్రమరకీటకన్యాయంగా ఆ చిరునవ్వు మనకి వస్తుంది. ఎవరితో తిరిగితే వారి యొక్క అలవాట్లు నీకు అబ్బుతాయి, వాడితో తిరగడంచేత. చిరునవ్వు వుండేవాడితో తిరిగితే చిరునవ్వు అబ్బుతుంది. ఏడుస్తూ వుండే వాడితో తిరిగితే ఏడుపు వచ్చేస్తూవుంటుంది. కోపం వుండేవాడితో తిరిగాం అనుకోండి కోపం వస్తుంది. ధనాశ ఉన్నవాళ్ళతో తిరిగితే ధనం మీద ఆశ పుడుతుంది. కీర్తి మీద ఆశ ఉన్నవాళ్ళతో తిరిగాం అనుకోండి కీర్తి మీద ఆశ పుడుతుంది. భగవంతుని చేరే ఆశతో ఉన్నవాడితో మనం చేరామనుకోండి, మనకి కూడా భగవంతునియందు రుచి, ఆశ అనేవి కలుగుతూ వుంటాయి. కాబట్టి లోపల చిరునవ్వు వున్న వాళ్ళకి అది సత్త్వగుణ సంపద. బయటకి బాగా నవ్వేవాళ్ళు ఆసురీస్వభావము కలిగిన వాళ్ళు అని చెప్తారు. అందుకనే చూడండి రావణుడి నవ్వు ఎలా

వుంటుంది సినిమాల్లో? బాగా గట్టిగా అరుస్తూ నవ్వేవాడినే పెడతారు అక్కడ. సినిమా గురించి మనం మాట్లాడకూడదు, తప్ప, అనుకుంటాం కానీ తప్పలేదు. భగవద్భరంగా మనం ఏదైనా మాట్లాడుకోవచ్చు. నాగేశ్వరరావుని రావణాసురుడి వేషమో, హిరణ్యకశిపుడి వేషమో వేయించామనుకోండి, ఆయన అలా నవ్వినా బావుండదు. ఆసురీ ప్రవృత్తి కలిగిన వారు బాగా ఇంద్రియపరంగా సుఖిస్తూ వుంటారు. దైవీ సంపత్తి ఉండేవాడు చిరునవ్వుతో ఉంటాడు. చాలా ఆనందం కలిగే సన్నివేశాలలో కూడా వికటాట్టహాసాలు చేయడు. ఆనందంగా ఉంటాడు అంతే. అందుకే మన పెద్దవాళ్ళు చెప్పారు ఆడవాళ్ళు గట్టిగా నవ్వకూడదు అని. మగవాడు ఎందుకు గట్టిగా నవ్వాలి. వాడూ నవ్వకూడదు. కాకపోతే చెప్పినవాడు మగవాడు కాబట్టి ఆడవాళ్ళని నిర్దేశించాడు. మగ అయినా, ఆడ అయినా అట్టహాసాలు చేయకూడదు. అట్టహాసం మనలోంచి వస్తోంది అంటే మనలో అసురత్వం ఉందిట, అది గుర్తుపెట్టుకోండి. అసురత్వం అంటే సురత్వం లేకపోవడం. సురత్వం అంటే వెలుగు యొక్క ప్రాముఖ్యత, పనితనం, activity, చైతన్యం. ఇవన్నీ తక్కువగా వుంటే అట్టహాసాలు వస్తాయి. అందుకని ఈ అట్టహాసాలు తగ్గించుకోవడం కూడా సాధనలో ఒక భాగం. పరమగురువుల మార్గంలో నడుస్తూ వుంటే, వారు చిన్న విషయాల నుండీ చాలా పెద్ద విషయాల వరకూ అన్నిటి గురించీ మనకు సూచనలు ఇస్తూ వుంటారు. వెకిలిగా నవ్వకూడదు. మాటేకాదు, నవ్వు కూడాను. ఎందుకు వచ్చిందంటే చాలామంది కేరింతలు కాసేపు వేస్తే అది ఆనందం అనుకుంటారు. అది ఆనందం కాదు. ఆనందం అంతర్ముఖమైనది. బహిర్ముఖమైన ఆనందం శాశ్వతమైనది కాదు. అది కేవలం తన లోపల తన సమస్తమునకూ రాజైన వాడు తనవాడు తన యందు వున్నాడు అని తెలిసినవాడు ఆనందంగా ఉంటాడు. వాడికి ఇంకా ఏం కావాలి? ఏం కావాలన్నా వాడే వున్నాడు వాడే చూసుకుంటాడు. దానివల్ల నిర్భీతి వస్తుంది. దానివల్ల బయట మనకి ఇది కావాలి, అది కావాలి అని ఏదీ వుండదు. వాడికి కావాలసినవన్నీ వాడి దగ్గరకి వస్తూ వుంటాయి. తను కోరడు, తన దగ్గరకి అన్నీ వస్తూ వుంటాయి. పతంజలి మహర్షి చెప్తాడు. విలువైన వస్తువులు అన్నీ కూడా వద్దన్నా ఆయన చుట్టూ చేరతాయిట. ఎందుకు చేరతాయి అంటే ఆయనయందు భగవంతుడు ఉపస్థితుడై వున్నాడు కాబట్టి. మిగతావాళ్ళు బాగా దేవురించినా దొరకనివి, ఇతడి దగ్గరకి అప్రయత్నంగా వస్తూ వుంటాయి. ఎందుకు వస్తూ వుంటాయి అంటే మొత్తం ఇన్నిలోకాలకీ రాజైన వాడితో తాను కలిసి వున్నాడు కాబట్టి. ఆ విధంగా తను భగవంతునితో వుండడం చేత తనకి అంతరంగంలో ఆనందం వుంటుంది, బహిరంగంలో ఎలా వున్నా తాను పెద్ద బాధ పడడు. వాడూ సత్సాధకుడు. ఎంతసేపూ భగవత్ తత్త్వంలో మనకి భగవంతుణ్ణి నమ్మడం వుంటుంది తప్ప, భగవంతుణ్ణి నచ్చడం వుండదు. మాస్టరు గారి దగ్గర నేను మొట్టమొదటసారి విన్నా, God-fearing మనకి వద్దోయ్ God-minded మనం

అవుదాం అని. ఎంత గొప్ప విషయం అది! God-fearing ఏమిటి? దేవుడంటే భయపడడం ఎందుకు? దేవుడంటే భయం వద్దు. దేవుణ్ణి మనస్సు నిండా నింపుకుందాం. దైవాన్ని నింపుకుంటే భయంలేదు ఏమీలేదు. వాడే అంతా వున్నాడు, వాడే చూసుకుంటాడు. నువ్వు చెయ్యాల్సినది చేస్తూ వుండు, వాడు నీకు చెయ్యాల్సింది చేస్తూ ఉంటాడు. ఆ నమ్మకం ఉంచుకో. అందుకని faith కూడా పెద్దమెట్టు కాదు. కింద మెట్టే. వాడు వున్నాడు. వాడు అన్నీ చూసుకుంటాడు. నేను వాడితో వుంటాను, నేను చెయ్యవలసినది చేస్తూ వుంటాను. ఇంకా మిగతా ఆరాటాలు పడబోక మనసా! అని చెప్పుకోవాలి మనస్సుకి. మనసా చింత పడకే, తొందర పడకే అని పాటలు వున్నాయి కదా. మనస్సుతో మాట్లాడుకుని చెప్పుకోండి మనస్సుకి. నన్ను మనోలోకాల్లో ఉండనివ్వు, నేను బుద్ధి ఇంద్రియ, భౌతిక లోకాల్లోకి దిగి వచ్చి పని చేస్తాను, కానీ వాడితో కలిసి వుండి పని చేస్తాను తప్ప ఒక్కడిగా రాను. ఒక్కళ్ళుగా బయటకివస్తే బయటకి వెళ్ళగానే ఎదురుదెబ్బలు తగుల్తాయి. వాడితో కలిసి బయటకి రావాలి. వస్తే బయట కూడా ఆనందమే వుంటుంది. లేకపోతే దుఃఖకారణాలు బయట బోలెడు కనిపిస్తూ వుంటాయి. సన్నివేశాల్లో అవీ ఇవీ అన్నీ వుంటాయి. మనం అనుకున్నట్టుగా ఉంటుందేమిటి రోజు? ఒకటి అనుకుంటే ఇంకొకటి అవుతూ వుంటుంది. కదా? వాడితో వుంటే కుంగడం, పొంగడం వుండవు. 'ఊ! కానీ నీ సంకల్పం ఇలా వుంది. ఇందులో నేను ఏంచెయ్యాలి?' అదొక్కటే గుర్తుపెట్టుకోండి. భాగవత మార్గంలో ఒకే ఒక్క ముఖ్య సూచన ఏమిటంటే, సన్నివేశాల రూపంలో కాలం నీకు కర్తవ్యాన్ని నిర్దేశిస్తూ వుంటుంది. ఇలా జరగాలి అని మనం రోజు మొదలుపెట్టినా, అలా కాకుండా మరోకలాగా ముందుకి వెళ్తూ వుంటుంది రోజు. కాబట్టి ఇలా జరగాలి అని ఎందుకూ? అనుకో ఫరవాలేదు, కానీ ఇలా జరగక పోయినా ఫరవాలేదు అని అనుకోవాలి. ఎలా వున్నా ఆనందంగా ఉండడం. జరిగింది అంతా భగవద్ సంకల్పమే అనుకుందాం. మంచి కథ వుంది దీనికి. పెద్దలు చెప్పే నీతివాక్యాలు కథలుగా చెప్తే బుర్రకి ఎక్కుతుందని చెప్పారు. అక్బరు అనే చక్రవర్తి గురించి మనందరికీ తెలుసు. ఆయనకీ వీరబలుడు అనే మంత్రిగారు/ సలహాదారుడు వున్నారు. ఆ వీరబలుడు బీరబలుడు, బీర్బల్ అయిపోయాడు. భజరంగబలి లాగ. భజరంగబలి అసలు వజ్రాంగబలుడు హనుమంతుడు. వజ్రం వంటి శరీరం కలిగిన వాడు. వజ్రం అంటే అభేద్యమైనది కదా. శాశ్వతమైన దివ్య శరీరం కలిగిన వాడు. వజ్రాంగా కాస్తా భజరంగ్ అయిపోయింది. అలాగే వీరబలుడు బీర్బల్ అయిపోయాడు. ఒకసారి అక్బర్ గారు అలా సరదాగా అడవిలోకి వేటకి వెళ్దామా? అన్నారుట. రాజు గదా వద్దంటే బావుండదు. వెళ్తుంటే దారిలో అడవిలో ఏదో క్రూర జంతువు కనిపిస్తే ఖండిద్దామని ఒరలోంచి కత్తి లాగుతుంటే అది ఇరుక్కుని రాలేదుట. లాగుతుంటే ఎడం చేయి బొటనవేలు తెగిందిట. తెగేసరికి అక్బరు ఏంటి ఇట్లా జరిగింది ఇవాళ, అని అనుకున్నాట్ట. భటులందరూ వచ్చేసి కట్లు అవీ కట్టేసి కొంచెం హంగామా,

చేస్తున్నారు. అందరూ 'అయ్యో మీకెంత కష్టం వచ్చిందని' బాధ వ్యక్తంచేస్తున్నారు. రాజు గారి కష్టం మరి చిన్న కష్టమైనా పెద్ద కష్టమే కదా. ఈయన జుట్టు ఎక్కువ కత్తిరించినా, తక్కువ కత్తిరించినా కూడా కష్టమే. అటువంటిది వేలే తెగింది. తెగేసరికి అందరూ పరామర్శించారు సైనికులు, చుట్టూ ఉండేవాళ్ళు. బీర్బల్ మాత్రం ఏం మాట్లాడలేదు. మాట్లాడకపోతే కొంచెం రోషం వస్తుంది కదా. 'ఏంటయ్యా నువ్వేం మాట్లాడవేమి? నా వేలు ఎందుకిట్లా తెగిందంటావ్?' అని అడిగాడట. 'మన మంచికే అయ్యింది రాజా, ఇది భగవంతుని యొక్క సంకల్పం, ఏం జరిగినా కళ్యాణమే జరుగుతుంది అని గుర్తుపెట్టుకోవాలి. కష్టం అనుకోవద్దు. ఇవాళ మనకో కష్టం వస్తే అది కళ్యాణ కారణం అనుకోవాలి' అన్నాడు బీర్బల్. వేలు తెగి ఏడిచేవాడికి ఇట్టా చెబితే ఎట్లా ఉంటుందండీ! నీవేలు తెగినా పరవాలేదు, నీ మెడ తెగినా పరవాలేదు, నీ ముక్కు తెగినా పరవాలేదు, అంతా కళ్యాణ కారణం అంటే? అసలే క్షాత్రధర్మం చాలా కోపమొచ్చింది. స్నేహితుడనుకున్నాను, వేలు తెగితే ఇట్లా మాట్లాడతాడా అని వెంటనే భటుడ్ని పిలిచి 'వీడిని తీసుకెళ్ళి జైల్లో పెట్టేయండి' అంటాడు. అంటే అక్బర్ కి ఓ నమస్కారం పెట్టి, 'ఇది కూడా భగవత్ సంకల్పమే' అని చెప్పి వెళ్ళి హాయిగా జైల్లో కూర్చుంటాడు. అక్బర్ మళ్ళీ వేటకి వెళ్తాడు. ఆరోజు కొంతమంది అడవి మనుషులు అక్బర్ని పట్టేసుకుంటారు. పట్టేసుకుని వాళ్ళ నాయకుడి దగ్గరికి తీసుకువెళ్తారు. ఆ నాయకుడే 'ఒరేయ్ ఇవాళ మనం అమ్మవారికి బలివ్వాలి, శుభ్రమైన మనిషేమన్నా దొరికితే పట్రండీ బలిచ్చేద్దాం' అని పంపించాడు. వాళ్ళకి అక్బర్ దొరికాడు. దొరికితే లోపలికి తీసుకువెళ్ళి వాళ్ళ నాయకుడి దగ్గర నిలబెట్టారు. బావున్నాడు. బ్రహ్మాండంగా ఉంది. ఇవ్వాళ మన అమ్మవారు చాలా సంతోషిస్తుంది బలికి. మంచి బలి దొరికింది అనుకుని, అక్బర్ ని prepare చేశారుట. సంసిద్ధం చేసిం తర్వాత ఆపాదమస్తకం చూస్తే, ఎడం చేతి బొటనవేలు తెగుంది. అది చూశాడు వాళ్ళ నాయకుడు. 'Already బలి అయిపోయింది వీడికి. ఎవరో బలి చేసేశారు. మనము అసంపూర్ణమైన జీవుడి దేహాన్ని బలివ్వడానికి వీల్లేదు, వీడిని వదిలేయండి, ఇంకెవడ్నన్నా పట్టుకు రండి' అన్నాడు. ఆయన్ని వదిలేస్తారు. అప్పుడు అర్థమైంది అక్బర్ కి తన వేలు తెగడం ఎంత మంచిదయిందో తనకారోజు. ఇంత చక్రవర్తి కథా ఆ రోజుతో మరి tragedy అయిపోయేది కదా. తెలిసి 'అరెరెరెరే ఎంత బుద్ధిశాలి నా సలహాదారు, అతడు చెప్పిన మాట చాలా సత్యం. వేలు తెగిందని బాధపడ్డాను, మెడే తెగేది కదా ఇప్పుడు, వేలుకి బాధపడ్డం తప్ప కదా. ఏది జరిగినా భగవంతుడు మన కళ్యాణం గురించే, మన మంచికే చేస్తాడు. ప్రస్తుతానికి చేదుగా ఉంటుంది కానీ తరువాత బావుంటుంది. అయ్యో! ఇంత ఉపకారిని నేను జైల్లో పెట్టానే' అని బాధపడుతూ రాజ్యానికి వెళ్ళి, సరాసరి ముందు జైలుకి వెళ్ళిపోయి, స్వహస్తాలతో ఆ తాళం తీశాడుట. తీసేసి బీర్బల్ ని కావలించుకుని 'నీ మాట చాలా సత్యమైనది. నేను ఈరోజున ఇట్లా మళ్ళీ నీకు కనబడ్డానంటే ఈ వేలు తెగడం వల్లే కనబడ్డాను, లేకపోతే

మెడ తెగేది నాకు, అయిపోయేది ఈ రోజుతో. చాలా సంతోషం. నీ అంత ఉత్తమమైన, వివేకమైన స్నేహితుడు నాకెవరూ లేరు' అని క్షమించమన్నాడుట. 'క్షమించడమేమిటి? నేను నీకు ధన్యవాదాలు చెప్తున్నాను' అంటాడు బీర్బల్. 'అదేమిటయ్యా' అంటే 'నన్ను కారాగారం లో పెట్టకపోతే నేను నీతో వచ్చేవాడిని. నిన్ను, నన్ను పట్టుకునే వాళ్ళు, నీ వేలు తెగింది కాబట్టి నిన్ను వదిలేసేవాళ్ళు, నాకేం తెగ లేదు కదా నన్ను నరికేసే వాళ్ళు అక్కడ, కాబట్టి నన్ను కారాగారం లో పెట్టడం కూడా భగవంతుని యొక్క సంకల్పమే. జరిగిందల్లా మన మంచికే జరిగిందిగా' అంటాడు. అదీ అంతా మనమేలుకే అని అనుకోవడం. ఈ కథ చూడండి ఎంత బాగుంది. నిజంగా జరిగిన కథ ఇది. అరవిందుడుకో దివ్య సంకల్పం వస్తే, అది నిరాకరిస్తే, ఆయన్ని కూడా jail లో పడేస్తే 'ఎందుకు ఇట్లా నన్ను jail లో పెట్టారు? నేను బోల్డు ఉద్యమం నడిపిస్తున్నాను కదా' అంటే, 'నీ మొహం ఆ ఉద్యమం ఏంటి అంతకన్నా దివ్యమైన ఉద్యమం నిర్వర్తించడానికి నిన్ను jail లో పడేశాం' అని ఆ తరువాత ఆయనకి ఒక దర్శనం జరుగుతుంది. అందుకని మనం అనుకునే కష్టాలు, మనం అనుకునే అశుభాలు, మనం అనుకునే అసౌకర్యాలు, మనం అనుకునే అపజయాలు అవి క్రమశః కళ్యాణ కారణాలు అవుతాయి. అది తెలుసుకుని నడిచే వాళ్ళు సాధకులు. అట్లా నడుస్తుంటే మనకేం జరుగుతుందంటే మనలో నుండి బయట జరిగేవి, మన చుట్టూ జరిగేవి వీటన్నిటినీ చూస్తూ ఉండడం తప్ప మనం అందులో పడి కాసేపు ఏడవడం, కాసేపు నవ్వడంగా కాకుండా ఉండే స్థితి ఉంటుంది. ఇది కలిగించేవాడు 'వాడేట'! అందుకని వాడియందు రుచి పెరిగిందనుకోండి, వాడే గమ్యం అవుతాం. వాడే మనం అయిపోతాం. ఆనందం పొందుదాం అనుకునేవాడు, ఆనందం అయిపోతాడు. ఆనంద కారణం కూడా వాడే అయిపోతాడు. ఇలా ఉండడం ఆనందం అండీ! ఇది కేవలము అంతర్ముఖ దర్శనం అయ్యి, ఆ రుచి చూసిన వాళ్ళకే సాధ్యం. అందుకని వాళ్ళే మనకి ఆదర్శ పురుషులు. ఎప్పుడూ గులాబీల మీద నడిచి వెళ్ళిన వాళ్ళు కాదు సాధకులు. ముళ్ళదారే ఉంటుంది. మీరాబాయికి కృష్ణుడు లోపల దొరికాడు. 'మేరే తో గిరిధర గోపాల దూసరాన కోయి' అంది. అంతే కదా. ఇంక రెండో వాళ్ళెవరూ లేరు అంతా కృష్ణుడే అంది. రాజభవనం నుండి గెంటేశారు. రోడ్డుమీద పాడుకుంటూ వెళ్ళిపోయింది. కృష్ణుడితోనే ఉంది. కృష్ణుడుగానే ఉంది. శాశ్వతంగా కృష్ణుడితో ఉండి. అందరికీ ఇవాల్టికి కూడా మన మనస్సులలో నిలిచింది. అందుకనే భక్తజనుల జీవితాలు ప్రత్యేకించి మనం కష్టంలో ఉన్నప్పుడు చదువుకోవాలి. చదువుకుంటే మనకి చాలా స్ఫూర్తి వస్తుంది. ఎందుకంటే మనకన్నా చాలా కష్టాలు పడ్డారు. అంత కష్టం పడ్డ వాళ్ళని చూస్తే మనదేం కష్టంలే, నామొహం అనిపిస్తుంది. పైగా వాళ్ళు కష్టంలో భగవత్ స్ఫూర్తిలో ఎక్కువ నిలబడ్డారు తప్ప భగవంతుని తూలనాడడం, దూషించడం, సందేహించడం చేయలేదు. కాబట్టి మనం ఆ మార్గంలో నడిచి వెళితే, శాశ్వతమైన ఆనందం కలుగుతుంది. దాన్నే

'బ్రహ్మానందం' అంటారు. ఎందుకంటే బ్రహ్మ ఎప్పుడూ ఆ తత్త్వాన్నే తన యందు ఉంచుకుని, అదే పని చేస్తుంటే తను చూస్తున్నవాడు కాబట్టి శాశ్వతమైన ఆనందం పొందడానికి వీలు పడుతుంది. అటువంటి శాశ్వతమైన ఆనందం కృష్ణుడులో దర్శించి భీష్ముడు మనకీనామం ఇచ్చాడు. ఆయన ఆనంద కారకుడు. అంటే ఎవరన్నా ఆయన్ని చూస్తే చాలు ఆనందం కలుగుతుంది. ఆయనే ఆనందం. ఎప్పుడూ ఆనందిస్తూ ఉంటాడు. కదా. ఎక్కడైనా ఉండచ్చుకానీ యుద్ధంలో చిరునవ్వు ఉండడం కష్టమండీ! యుద్ధంలో కూడా ఆయన ముందు కూర్చుని చిరునవ్వు నవ్వుతూ ఉంటే ఎదుటి శత్రువుల యొక్క చేతనం అంతా, చైతన్యం అంతా ఆకర్షింపబడేదిట. భాగవతంలో ఆ పద్యం ఒకటి తప్పకుండా మనమంతా కంఠస్థం చేయాలి. హృదయస్థం చేస్తే మరీ మంచిది. కంఠస్థం చేయడం అంటే ఊరికే mental understanding. హృదయస్థం చేస్తే ఇంకా బావుంటుంది. By-heart అంటాం చూశారా! ఎదురుగా ఉండే రాజుల యొక్క ఆయువులన్నీ కూడా ఈయనలోకి ఆకర్షింపబడేవట ఈయన అట్లా నవ్వుతూ రథంలో కూర్చుని ముందుకొస్తుంటే. ఇహ చేతనం లేని ఆ శరీరాలని అర్జునుడు కొట్టుకున్నాడు అని. ఎందుకంటే ఈయనలో ఉండే ఆకర్షణ అంత! ఎంత? ఈ భూమికి మళ్ళీ అటువంటిది ఇంతవరకు దిగి రాలేదు. 'ఇహ దిగిరాదేమో' అంటూ ఉంటారు ఋషులు. 'ఇది రాదు' అనరు. ఎందుకంటే వాళ్ళకేం తెలుసు? మళ్ళీ ఆయన సంకల్పిస్తే రావచ్చు కదా. మళ్ళీ రాదేమో అనిపించేంత ఆనందం అది. వ్రజం లో అందరికీ ఆనందం కలిగించాడు. ఎంత ఆనందం కలిగించాడూ? మనకి ఏ అవతారంలోనూ ఇంత ఆనందాన్ని పంచి పెట్టిన వాడు కనిపించలా. ఆనంద కారకుడు. అందుకనే 'నందనా' అనే పేరు కృష్ణుడుకే తగింది. 'నందనందనా' అంటూంటాం కదా. నందన అనే పేరు కొడుక్కి కూడా పెట్టారు. సంస్కృతంలో కొడుకుని నందనుడు అంటారు. ఏమిటీ నందనుడు? కొడుకు పుట్టాడని ఆనంద కారణం అన్నమాట వాడు. అన్యాయం కదూ? కూతురు పుడితే ఉండకూడదా? కేవలం మనస్సులో ఉండే ఒక పరిమితమైన భావం కూతురు- కొడుకు తేడా. నిజానికి ఏం లేదు. మనం అనుకుంటే ఉంది. సంతానం కలగంగానే ఆనంద కారణం కదా. అందరికీ sweets పంచుతాం. రకరకాల గొడవలు చేస్తూంటారు. ఎందుకు చేస్తుంటారు? ఆనంద కారణం అని. అసలు నందనుడు 'ఈయన'. ఈయన పుట్టాడనుకోండి, కొడుకు పుట్టడం ఒకటి, ఈయనే పుట్టాడనుకోండి మనలో, పిచ్చెక్కిపోతుంది. అట్లా పిచ్చెక్కిన వాళ్ళే కృష్ణ భక్తులందరూ. కృష్ణుడనే మత్తులోకి వెళ్ళిపోయి, ప్రపంచాన్ని లెక్క చేయక, రాజులవలె జీవించారట వాళ్ళందరూ. ప్రజలందరికీ ఎంత ఆనందం కలిగించాడు! ఆనందం చేత మత్తెక్కిపోయింది. ఏమిటి? మనుషులకే కాదు. ఆవులకీ, దూడలకీ కూడా అంత మత్తూ ఎక్కింది. చెట్లకి మత్తెక్కి విపరీతంగా ఫలాలనందించింది. ఫలాల యొక్క బరువు చేత శాఖలు నేలకు వాలి ఉండేవట. అట్లాగే ఆవుల పాదుగులు విపరీతంగా పాలతో నిండి,

పొల్లి పొదిలేట్టుగా ఉండేవట. గోవులు, పిల్లలు, పెద్దలు ఓహో-- ఆనందమే ఆనందం. అట్లా నింపాడు. అలాగే యోగేశ్వరుల్ని ఆనందంలో నింపాడు. భక్తుల్ని ఆనందంలో నింపాడు. ఎక్కడికి వెళ్తే అక్కడ పంచేశాడండీ ఆనందం. కుబ్జకి ఆనందాన్నిచ్చాడు. ఎవరికివ్వలేదూ! ప్రతి వాళ్ళకి ఆనందాన్ని పంచాడు. ఎంత ఆనందం పంచాడంటే యుద్ధానికి వచ్చి చచ్చిపోయే వాళ్ళకు కూడా! కౌరవసేనలో ఎదురుబడి వస్తున్న వాళ్ళంతా మరి చచ్చిపోవడానికే గదా వస్తున్నారు. వాళ్ళందరినీ కూడా తన చూపుల చేత, తన నవ్వుల చేత ఆనందాన్ని పంచినవాడు శ్రీకృష్ణుడు. అది చూశాడు భీష్ముడు! నువ్వే ఆనందానివి, నువ్వే ఆనందకారకుడివి, నిన్ను పొందిన వాడు 'నంది' అవుతాడని చెప్పాడు. అది ఆయన పొందాడు. అందుకనే అంపశయ్య మీద పడుకుని అంత సేపు ఉపన్యాసాలు ఇచ్చాడండీ! అది అంతా చదవలేం ఒకరోజులో. ఎంత చెప్పాడు? ఆరోజు అయిపోతే మళ్ళీ ఇంటికి వెళ్ళి మళ్ళీ వచ్చారు. మళ్ళీ వెళ్ళి మళ్ళీ వచ్చారు. అట్లా చాలా రోజులు వస్తారు వీళ్ళందరూనూ. వచ్చి ఆయన చెప్పినవన్నీ వింటారు. శాంతి, అనుశాసికపర్వాల నిండా భీష్ముడు చెప్పిన ధర్మాలు ఉన్నాయి. అవన్నీ చెప్పాట్ట ఆయన, ఒకపక్క బాణాలు గుచ్చుకుంటూ 'వెళ్ళిపోతానయ్యా' అంటే, 'ఇవన్నీ చెప్పవయ్యా' అంటే ఎవరు చెప్తారండీ? ఎందుకు చెప్పగలిగాడు అంటే అక్కడ కృష్ణుడు ఉండడం చేత. అక్కడ కృష్ణుడంటే ఎక్కడ? హృదయంలో! అడిగింది కూడా హృదయంలోనే కృష్ణుడ్ని. 'మరి నువ్వు సమ్మతిస్తే నేను శరీరంలోంచి ఇంక వెళ్ళిపోతాను', బయటికి వస్తానని వెళ్ళిపోవడం అంటే. ఎక్కడికెళ్తాడు? చిరంజీవులు ఇక్కడికి అక్కడికి వెళ్ళిపోవాలనే తాపత్రయం ఉండదు. భగవంతుడులో ఉండడమే వాళ్ళకి తెలుసు. శరీరంలో ఉండడం తక్కువ తెలుసు. దేవుడులో ఉండడం ఎక్కువ తెలుసు. దేవుడులో ఉండడం కారణం చేత, శరీరంలో ఉందామనే వాంఛ తగ్గుతూ ఉంటుంది. Wish to live is also ignorance అని చెప్పారు పరమ గురువులు. ఇంకా బతుకుదాం, ఇంకా బతుకుదాం అనుకుంటారు. ఇంకా బతకడం అనేది శరీరంలోనా? దేవుడులోనా? Wish to live in God అయితే పర్వాలేదు. Wish to live in body అంటే తేడా వస్తుంది. అందుకని భీష్ముడు భగవంతుని యందు జీవిస్తున్న వాడు. భగవంతునికి సమర్పణ చెందిన వాడు. ఆయన్నే తలుచుకోవడం వలన అంపశయ్య మీద పడుకున్నా, ఆయనకి రక్తం కారుతున్నా, చాలా రోజులున్నాడు ఆయన అంపశయ్య మీద. తెలుసా? ఎప్పుడో కార్తీక మాసంలో వస్తుంది యుద్ధం. ఎప్పుడండీ భీష్మఏకాదశి వచ్చేది? మాఘమాసంలో శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి భీష్మఏకాదశి. అయిపోయింది కార్తీక మాసంలో 18 రోజుల యుద్ధం. మార్గశీర్షం, పుష్యం, మాఘం ఉన్నాడు. ఎందుకున్నాడు? ఉత్తరాయణం వచ్చింతర్వాత వెళదాంలే అనుకున్నాడుట. లేకపోతే ఆయనకి అధోగతులు వెళ్తాయని కాదు, బాట సులభంగా ఉంటుంది, శుభ్రం గా వెళ్ళిపోవచ్చు అని. హిమాలయాలకు ఎప్పుడు వెళితే బావుంటుంది? మంచు పడేటప్పుడు వెళితే బావుండదు కదా. మంచు

కరిగిందండీ, రోడ్లు కనిపిస్తున్నాయంటే వెళితే బావుంటుంది. అట్లాగే కాలానికి కూడా కొన్ని రోడ్లు ఉత్తర లోకాల్లోకి అంటే ఊర్ధ్వ లోకాల్లోకి అంటే సూక్ష్మలోకాల్లోకి ఉన్నాయి. సూక్ష్మ లోకంలోకి ప్రయాణం చేయాలంటే ఉత్తరాయణంలో వెళ్తే సులభం. దక్షిణాయణంలో అయితే మళ్ళీ అన్నీ దుబ్బులు, గబ్బులు అన్నీ కొట్టుకుంటూ పోవాలి. రోడ్లు పడిపోతూ ఉంటాయి. Avalanches వస్తూ ఉంటాయి. కదా. పడిపోతే ఆగిపోవాల్సి వస్తుంది. అందుకని wait చేసి, roads అన్నీ clear గా ఉన్నాయింక బయల్దేరవచ్చు అని తెలిసింది. తెలిసి బయల్దేరేముందు అసలు అన్నిటికీ సంబంధించిన వాడు ఇక్కడే ఉన్నాడు కాబట్టి, 'మరి బయల్దేరనా' అని అడిగాడు. ఎక్కడ అడిగాడు? కృష్ణుడు ఎక్కడో హస్థినలో ఉంటే, ఈయన ఇక్కడ యుద్ధ భూమిలో ఉంటే అడిగాడు. అడిగితే కృష్ణుడు వచ్చాడు. వచ్చి 'ఏం వెళ్తావులే వీళ్ళందరికీ చెప్పి వెళ్ళు' అని చెప్పాడు. కృష్ణుడు దగ్గర గొప్ప విషయం ఏంటంటే అసలు ఆయనకంతా తెలుసనే భావన ఎవరికీ రానివ్వడు ఒకటి. రెండోది ఎవరికేది తెలుసో ఆయనకి బాగా తెలుసు. అందుకని వాళ్ళచేత చెప్పిస్తాడు. యుద్ధభూమిలో అప్పుడు ఎవర్నీ రప్పించి అర్జునుడికి చెప్పడానికి అవకాశం లేదు కాబట్టి ఈయన చెప్పాడు. లేకపోతే చెప్పేవాడని నేననుకోను. ఇంకోడ్ని పిలిపించి చెప్పించడానికి సమయం లేదు కాబట్టి తను చెప్పాల్సి వచ్చింది. లేకపోతే అది కూడా చెప్పేవాడు కాదు. ఉపన్యాసాలు ఇచ్చినవాడు కాదు కృష్ణుడు. కాబట్టి ఈయన చేత చెప్పించాడు. చెప్పించడంలో స్ఫూర్తి ఎవరు? కృష్ణుడు! వ్యాసుడికి స్ఫూర్తి ఎవరు? కృష్ణుడు! ఆ స్ఫూర్తి తో మధ్యలో 'నువ్వే ఇది కూడా' అని ఆయన గురించి చెప్పిన స్తోత్రం ఇది. కృష్ణ పరంగా ఉత్తమమైన స్తోత్రం ఏది అంటే, నాకు తెలిసింది విష్ణుసహస్రనామం! కళ్ళు మూసుకుని మందహాసం కలిగిన కృష్ణుడ్ని లోపల దర్శనం చేసుకుంటూ, విష్ణు సహస్రనామం చదువుకోండి. దాని అనుభూతి వేరు. అంత ఆనందాన్నిస్తాడు. ఎవరికివ్వలేదు? అందరికీ ఇచ్చాడు ఆనందం. పంచేశాడు. విపరీతంగా పంచాడు. శత్రువులకి, మిత్రులకి, ఆశ్రిత జనులకి, యోగులకి, ఋషులకి ఓహో పంచి పంచి పంచి విపరీతంగా పంచి వెళ్ళినవాడు కాబట్టి, ఈ మూడు పేర్లు ఆయనకి సంబంధించినవి. అందుకని నందన్ అంటే ఆనంద కారకుడు. నంది-ఆనందించేవాడు. నందము-ఆనందము. ఈ మూడు నువ్వే, అని చెప్తున్నాడు భీష్ముడు.

## 549, 550 సత్యధర్మా, త్రివిక్రమః

'సత్యాన్నాస్తి పరోధర్మః' అన్నాడు కదా. నీ భావం, నీ మాట, నీ చేత ఒక్కటిగా ఉంచు. కష్టమైనా నష్టమైనా దాన్ని పరిపాలించు. అలా ఉంటే అది సత్యధర్మం అవుతుంది. అంటే సత్యమునే ధర్మముగా పరిపాలించిన వాడు, దైవము. సత్యమునే ధర్మముగా పరిపాలించిన వాళ్ళందరూ కూడా దైవము యొక్క ప్రతిరూపములే. అలా పరిపాలించిన వారు హరిశ్చంద్రుడు, ధర్మరాజు. ఇక మిగతా వాళ్ళంతా చేయలేదా అంటే నిజంగా భగవత్సాన్నిధ్యం పొందిన వాళ్ళందరూ కూడా వాక్కును పవిత్రీకరించుకుని, తద్వారా సత్యమునందే నిలవడం ప్రధానంగా, మిగతావన్నీ అప్రధానంగా జీవించి సులభంగా దైవాన్ని చేరగలిగారు. కర్ణుడుకో ధర్మం ఉంది. ద్రోణుడికో ధర్మం ఉంది. భీముడుకో ధర్మం ఉంది. అర్జునుడికో ధర్మం ఉంది. అందరికీ తలో ధర్మం ఉంటుంది. ఎవరి స్వధర్మాన్ని వారు పరిపాలించడం చేత, తద్వారా ఉత్తమ గతులొస్తాయి. కానీ సత్యాన్నే ధర్మంగా స్వీకరించి, అనుసరించిన వాళ్ళకి అన్ని లోకాల్లోనూ జయమేనండీ! మనకీశతాబ్దంలో సత్యం గురించి చెప్పుకోవాలంటే మహాత్మాగాంధీ గురించి చెప్పుకోవాలి. ఇంకెవరూ మనకు తెలిసి, కనబడరు. తెలియకుండా ఉండవచ్చు. మనకి తెలిసిన వాళ్ళే, ఇంక అంతకన్నా లేరని కూడా అనుకోకూడదు. సత్యాన్నే పరిపాలించిన సత్యహరిశ్చంద్రుడి నాటకం చూసి, స్ఫూర్తి వచ్చి, 'జీవితంలో నేను సత్యాన్నే అనుసరిస్తాను' అని నిర్ణయం తీసుకున్నాడాయన. ఎన్ని కష్టాలొచ్చినా, ఎన్ని నష్టాలొచ్చినా సత్యాన్ని వదల్లేదు. 'My experiments with truth' అని పుస్తకం రాశాడు. తప్పకుండా భారతీయులైన వాళ్ళు చదువుకోవాలి ఆ పుస్తకం. మనమేమిటో ఉన్నవన్నీ కాదని ఇంకా ఏదో కావాలంటాం. అక్కడే ఉంటుంది అది చూడం. మహాత్మా గాంధీ సత్యంతో, మొత్తం జీవితమే ఒక ప్రయోగంగా నిర్వర్తించాడు. మనమేం నేర్చుకున్నాం? ఏం చదివాం మహాత్మాగాంధీ గురించి. ఏం చదవలేదు. తప్పక చదువుకోవాల్సిన మహత్తరమైన జీవితం మహాత్మాగాంధీది. మహాత్ముడని బిరుదు కూడా ఇచ్చారు కదా. ఇవ్వకపోయినా ఆయన మహాత్ముడే! ఆయన సత్యంలో నిలబడడానికి చేసిన కృషి, సాధన, ప్రయత్నం ఎంతటిదండీ! దాంతో ఆయన మొత్తం భూగోళం మీద ఎవరూ జయించలేని, బలీయమైన ఒక ప్రభుత్వాన్ని అదుపులో పెట్టి, శాసించి, మనకి కావలసిన స్వాతంత్ర్యాన్ని పట్టుకొచ్చాడు. సామాన్యమైన విషయం కాదు. మనకి ప్రతీదీ చాలా సామాన్యంగా ఉంటుంది. అదే తమాషా. మహాత్మాగాంధీ జీవితం అద్భుతమైన జీవితం. మనం పెద్దవాళ్ళయ్యే లోపల చదువుకోవాలి. ఎందుకంటే ఆయన సత్యాన్వేషి! సత్యం కోసం జీవితాన్ని సమర్పణ చేసిన వాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ సత్యాన్ని తప్పిన వాడు కాదు. ఆయన చేస్తే అది 'సత్యాగ్రహం' అయింది. అందరూ చేస్తే

సత్యాగ్రహం ఏం ఉంటుంది? సత్యాగ్రహం అంటే ఏమిటి? సత్యానికి ఆగ్రహం కలిగితే ఏదీ ఆగదు, అని చెప్పడం. ఈయనిక్కడ ఏదో ఒక విషయం చెప్పేవాడు ఇట్లా కావాలి భారతీయులకి ఇట్లా చేయాలి మీరు అని. British Govt. ఒప్పుకోలేదు, ఆ రోజు నుండి ఈయన నీళ్ళు కూడా ముట్టుకునేవాడు కాదు. కూర్చునేవాడు. సరే ఈయన కూర్చుంటే వాళ్ళందరూ కదిలిపోవాలా? వణకాలా? గడగడళ్ళాడాలా? ఎలా వీలు పడ్డది? ఇప్పుడు ఇంకోడ్ని కూర్చోమనండి ఎవర్నన్నా. ఎవ్వరూ కదలరు. ఈయన సత్యాగ్రహం మొదలుపెడితే అక్కడ London లో, British Govt. యొక్క కేంద్ర స్థానంలో ఒణుకు పుట్టేది. అలా ఉండేది ఆ సత్యాగ్రహం. భౌతికమే చూసే మనకి అది అవగాహన కాదు. సూక్ష్మాన్ని దర్శిస్తే, మహాత్మాగాంధీ సత్యాగ్రహమనే పేరుతో ఎంత పదునైన, శక్తివంతమైన అస్త్రాన్ని British రాజ్యం మీద వదులుతూ ఉండేవాడో మనకి అవగాహన ఉంటుంది. వాళ్ళ తుపాకీలతో ఎంతమందినైనా కాల్చేస్తారు భౌతిక లోకంలో. ఈయన సత్యలోకం నుండి పట్టుకొచ్చాడు శక్తిని. అదే సత్యం! అది పెట్టి కొట్టేవాడు. అది పెట్టి కొట్టంగానే కదిలేవాళ్ళు వాళ్ళు. అట్లా కదిలించి కదిలించి కదిలించి లాభం లేదు మొండివాడు, ఇవ్వకపోతే కష్టం, అని ఇచ్చేశారు. లేకపోతే మనకొచ్చేదేంటి! వచ్చేది కాదు. కేవలం భారతీయులకి ఈ స్వతంత్ర్యము తెచ్చిపెట్టడం కోసం దిగివచ్చిన ఒక మహాత్ముడు ఆయన. ఆయన జీవితం చదువుకోలేదుట అంటే మనకి శ్రద్ధ లేదు, భక్తి లేదు, బాధ్యత లేదు. ఆ విధంగా సత్య ధర్మాన్ని పరిపాలించడం చేత ఆయన మహాత్ముడయ్యాడు. అలాగే సత్యాన్ని నమ్మి, సత్యం కోసం సమస్తం త్యాగం చేసిన వాళ్ళందరికీ భగవంతుడు దిగివస్తాడండీ! భగవంతుడు చేదోడు వాదోడుగా ఉంటాడండీ! అసలు నోరు విప్పితేనే అబద్ధం అయితే పారిపోతాడు. లోపలున్న వాడు కూడా కొంచెం దూరంగా ఉందాం, వీడి దగ్గర ఉండకపోతే వీడు పడిపోతాడు కాబట్టి ఉందాం కానీ, కొంచెం ఎడంగా ఉందాం వీడికి, అనుకుంటాడు. మాట మాట్లాడితే అందులో logic, అందులో manipulation, అందులో management. అంతా వంకరే. ఏమవుతుంది? వంకర మాటలు మాట్లాడిన వాళ్ళ దగ్గరకి దేవుడు రాడు గుర్తుపెట్టుకోండి. వాక్కు పరిశుద్ధిగా ఉంటేనే భగవంతుని యొక్క సాన్నిధ్యం. వాక్కులో శుద్ధత్వం చాలా ముఖ్యం. పవిత్రత చాలా ముఖ్యం. వాక్ స్థానం భగవంతునిది. కాబట్టి నాలుక చాలా ముఖ్యమైనది. నాలుక ముఖద్వారం. వాక్కే ఋగ్వేదం అన్నారు. 'వాగేవ ఋగ్వేదః' అన్నారు. మనలోంచి వచ్చే సంకల్పం, మనం మెలకువ గాంచడం, అక్కడి నుండి భావం రావడం, అక్కడి నుండి మాట రావడం ఇవన్నీ కూడా సత్యం యొక్క సంకల్పమే! దాన్ని ఆరాధించి, దాన్నే వర్తిస్తూ దానికోసమే జీవించే వాళ్ళ దగ్గర భగవంతుడు ఉంటాడు. వాళ్ళ రూపంలో భగవంతుడు ఉంటాడు అని చెప్తున్నారు. హరిశ్చంద్రుడికదే కదా. ఆయన రూపంలో అక్కడ దేవుడున్నాడంటే, విశ్వామిత్రుడు ఒకసారి చూసొస్తానని ఇంత గొడవ చేస్తాడు. ఆయనకేం పట్టదు. అన్నీ వదిలేశాడు.

ఏదైనా సరే సత్యం కోసం త్యాగం చేస్తాడు. సత్యం కోసం త్యాగం చేసిన వాళ్ళ దగ్గరికి దేవుడు వస్తాడు అని చెప్పడమే, బలిచక్రవర్తి కథ. సత్యం అనేవాడు ఎప్పుడూ. 'సత్యమేవ జయతే నా అనృతం' అదే మనకు ఉపనిషత్తు చెప్తుంది. దానికి తార్కాణంగా ఎన్నో కథలు ఉన్నాయి. సత్యం యందు నిలబడే వాళ్ళకి దానియందు ఉండే రుచిచేత, మిగతావి వాళ్ళు పట్టించుకోకపోవడం చేత, బయట ప్రజలకి అదంతా త్యాగం చేసినట్టుగా కనిపిస్తుంది. త్యాగం చేస్తున్నాను అనుకునేవాడు ఎక్కువ త్యాగాలు చెయ్యలేడండీ! అతనికేదో రుచి ఉంది, ఆ రుచిలో ఉండడం చేత ఇవన్నీ వెళ్ళిపోతుంటే పట్టించుకోడు. ప్రపంచం త్యాగం అంటుంది. వాడికి తెలియదు. ఓ అట్లా అయిందా, అని అనుకుంటాడు అంతే. కర్ణుడు త్యాగం వేరు, బలిచక్రవర్తి త్యాగం వేరు. బలిచక్రవర్తి దానం మొదలుపెడితే ఏమైందండీ! దేముడు దిగి రావాల్సి వచ్చింది. అంటే అక్కడ దానం అనే ధర్మం కాదు. దానం చేస్తాననే ఒక వాక్కు యందు నిలబడడం, సత్యం యందు నిలబడడం. ఏదైనా చేస్తానని చెయ్యకపోతే అసత్యవాదే. అందుకని పెద్దలేం చెప్తారంటే 'చేస్తానని చెప్పకు, చెయ్యగలిగితే చెయ్యి. ఎందుకంటే చేస్తావో లేదో నీకే తెలియదు కదా' అంటారు వాళ్ళు. 'నీకే నీమీద బొత్తిగా స్వామిత్వం లేదు కదా. మరి చేస్తానని చెప్తావు, ఒక్కటీ చెయ్యలేవు. అందుకని చెప్పడం ఎందుకులే సరాసరి చెయ్యడం లోకి రా' అంటాడు గురువు. బలి, అడిగిన వాడికి లేకుండా చెయ్యడమనే ఒక యజ్ఞం పెట్టుకుని చెయ్యడం మొదలుపెడితే దేవుడొచ్చేశాడు. వచ్చి అడిగాడు. అడిగితే ఇచ్చాడు. ఇస్తే బలిచక్రవర్తి శాశ్వతుడయ్యాడు. నశించిపోలేదు. సత్యధర్మ త్రివిక్రమ ఈ రెండు నామాలు కలిసి చెప్పుకోవాలి. మూడు లోకాలని ఆక్రమిస్తాడటండీ సత్యాన్ని నిర్వర్తించేవాడు. దేముడు, మూడు లోకాలు ఆవరించి ఉన్నాడు. దేముడు సత్యమే పలుకుతాడు అనేది పెద్ద విషయం కాదు. అట్లాగాకుండా ఉంటే దేముడు ఎందుకు అవుతాడు. అవడు కదా. అది పరిపాలించిన మానవకారులు/ జీవులు, వాళ్ళు భగవంతుడే అని తెలుసుకోవడం ఇక్కడ తెలివి. ఎవరయితే ఈ విధంగా సత్యాన్ని అనుసరించి వెళ్తారో వాళ్ళకి కేవలం భూలోకమే కాదు, భువర్లోకం, సువర్లోకం, మూడు లోకాల్లోనూ వాళ్ళ యశస్సు వ్యాప్తి చెంది, స్ఫూర్తినిచ్చి చాలా ప్రజ్వలంగా వెలుగుతూ ఉంటుంది జీవలక్షణం. అది తెలిసే హరిశ్చంద్రుడు గురించి ఇంద్రసభలో చెప్పుకోవడం జరుగుతుంది. అది తెలిసే బలిచక్రవర్తి గురించి చాలా చెప్పుకోవడం జరుగుతుంది. బలిచక్రవర్తి మూడడుగులు ఇస్తానంటే, ఈయన అందుకోవడం చేత, మూడడుగుల్లోనూ మూడు లోకాలు వ్యాపించడం చేత త్రివిక్రముడు అనే నామం వామనుడికి లేక భగవంతుడికి వచ్చింది. కానీ, తద్వారా బలిచక్రవర్తికి కూడా వచ్చింది. అలా కాకుండా ఉండుంటే బలిచక్రవర్తి గురించి మనం ఇవాళ ఇట్లా చెప్పుకోం కదా. అలా కాకపోతే సత్యహరిశ్చంద్రుడి గురించి మనం చెప్పుకోం కదా. పేరులో సత్య ఉండి అసత్యాలాడడం కన్నా, సత్య అని లేకుండా అసత్యం ఆడకుండా ఉంటే బావుంటుంది. పేరులో సత్యం కన్నా ప్రవర్తనలో సత్యం ఉండాలి. ఈ మధ్య మరీ

సత్యనారాయణ అని పేరు పెట్టుకుని చాలా అబద్ధాలాడుతున్నారు ఎక్కువమంది. అది మరీ భయంకరం. ఇంటిపేరు A అయితే పర్వాలేదు. అది కూడా కలిపి చదువుకోవచ్చు. బలిచక్రవర్తి, హరిశ్చంద్రుడు, ధర్మరాజు వీరంతా 'సత్యంచేత' మూడు లోకాల్లో ఆక్రమించారు. భగవత్ స్ఫూర్తి పొందే లోపల ప్రతి సాధకుడూ తనకి సంబంధించిన మూడు లోకాల మీద తనకి అధిపత్యం రావాలి. అది ఒక రహస్యం. అంటే మనోమయ లోకం, ఇంద్రియమయలోకం, భౌతికలోకం. ఈ మూడు లోకాల మీద తనకి అధిపత్యం వచ్చిన వాడు త్రివిక్రముడై, తనదైన సామ్రాజ్యాన్ని భగవత్ పరంగా పరిపాలిస్తూ ఉంటాడు. వాళ్ళూ మహాత్ములు! ఇవాళ నుండీ నేను రాత్రిపూట ఏం తిననండి, అని చెప్పి రేపొద్దున ఏదో మంచి పదార్థం చేస్తే, ఏదో అన్నా గానీ, అని తినేశాం అనుకోండి అది సత్యం అవదు కదా. ఇవాళ నుండి ఇవి చూడను, అని చూశాం అనుకోండి, ఇవాళ నుండి ఇవి చేయను, చేశామనుకోండి, ఇవాళ నుండి ఇట్లా మాట్లాడను అనుకుని మాట్లాడుతున్నాం అనుకోండి. అర్థమేమిటంటే మనలో సత్యం అనేది ఆవగింజంత ఉంది. అది అప్పుడప్పుడూ తొంగి చూస్తూ ఉంటుంది. మనమేమో ఆ రోజుకుంటాం. తరువాత దాన్ని పడుకోపెట్టేస్తాం. అలా కాకుండా నిర్వర్తించుకుంటూ, సాధించుకుంటూ రావాలిట. ఏమిటో? భౌతిక శరీరం మీద స్వామిత్వం. ఇంద్రియాల మీద స్వామిత్వం. మనస్సు మీద స్వామిత్వం. ఈ మూడూ ఏర్పడితే మనం కూడా త్రివిక్రమ అనే బిరుదు ఇప్పించుకోచ్చు. బిరుదు ఇవ్వకపోయినా త్రివిక్రములవుతాం. ఈ మూడు దాటడం అంటే వెలుగులోకంలో ఉండడమే! అలా ఉన్న వాళ్ళను కూడా త్రివిక్రముడనాలి. అట్లా విక్రమించి మూడు లోకాలందూ విహరించగలిగిన ప్రజ్ఞగా తయారవడమనేది ఈ నామంలో సాధనగా, త్రివిక్రముడి గురించి చెప్పుకోవచ్చు. మూడడుగుల్లో చిన్నవాడు పెద్దవాడైపోయాడు. మనం కూడా ఈ మూడు మెట్లెక్కేస్తే చిన్నవాళ్ళం పెద్ద వాళ్ళమవుతాం. ఏ మూడు మెట్లు? భౌతిక ప్రపంచానికి సంబంధించిన విషయాలు, ఇంద్రియాలకు సంబంధించిన విషయాలు, మనస్సుకు సంబంధించిన విషయాలు, ఈ మూడిటిని దాటేస్తే అంతటి వాళ్ళమవుతాం. నిజానికి త్రివిక్రమత్వం ప్రతి వారిలోనూ ఉంది. అందరం ఇప్పుడు వామనులుగా ఉన్నాం. ఎందుకు వామనులుగా ఉన్నాం అంటే దాని చుట్టూ చాలాపేర్చుకున్నాం. ఆ పేర్చుకున్నవన్నీ ఒక్కసారి స్తంభంలోంచి వచ్చినట్టుగా, మన దివ్యమైనట్టి వెలుగు లోపలి నుండి బయటికొచ్చి వీటన్నిటినీ నెట్టేస్తే పెద్దవాళ్ళమవుతాము. పెద్దవాళ్ళమవడం అంటే భగవంతుడు మన నుండి వ్యక్తమవడమే. శ్రీయుతా నీ భటుని పెద్ద చేయన్ తగదే అంటే అర్థం ఇదే

నా ఇంటికి విచ్చేయుము, నీ యంఘ్రిసరోజ రేణునికరము శోకన్
నా ఇల్లు పవిత్రంబగు, శ్రీయుత నీ భటుని బ్రోవం దగదే

అని కృష్ణుడ్ని అడుగుతాడు అక్రూరుడు. అక్రూరుడు అడిగిన ఇల్లు brick and mortar. అందుకని వెళ్ళలేదు ఆయన. అలా కాకుండా తన ఇంట్లోకి రమ్మన్నాడనుకోండి, తన

శరీరంలోకే, 'నువ్వు బాగా చొచ్చుకుని వచ్చి పెద్దవాడ్ని చెయ్ నన్ను' అంటే చేసేవాడేమో! తరువాత చేశాడెప్పుడో చిట్ట చివరి దశలో. అందుకని మా ఇంటికి రండి మాస్టారూ అని అన్నప్పుడు లోపలికి రమ్మని అడగాలి. 'నా హృదయంలో మీరుండండి, నా వెన్నుముక నిండా మీరు నిండండి, స్తంభం లోంచి అయనెవడో వచ్చాడు కదా అట్లా మీరు కూడా ప్రతి నిమిషం నాలోంచి వ్యక్తం అవుతూ ఉండండి' అని కోరుకుంటే అది మంచి ప్రార్థన అవుతుంది. అప్పుడు నువ్వు నిజంగా శాశ్వతంగా పెద్దవాడివవుతావు. అలా కాక మనింటికి తీసుకొచ్చి, ఆయనకేదో పాద పూజ చేసి, దండలేసి, బట్టలు పెట్టి, పక్కనుండే వాళ్ళనీ వీళ్ళనీ అందరినీ పిలిచామనుకోండి, ఆ పూటకి పెద్దవాడివవుతావు. అదృష్టవంతులండీ మీ ఇంటికి మహాత్ములొచ్చారు, అని చెప్తారు అయిపోతుంది. మర్నాడు నుండి ఎవరి పని వాళ్ళదే. ఎవరికీ గుర్తు కూడా ఉండదు కదా. ప్రజానీకం యొక్క బుర్ర లో జ్ఞాపకశక్తి అనేది చాలా తక్కువగా ఉంటుంది. ఎంత తక్కువ అంటే మూడు రోజుల క్రితం అత్యద్భుతమైన విషయం జరిగితే ఇవాళ మళ్ళీ దాని గురించేం గుర్తుండదు కదా. బయట ప్రపంచంలో మనకి recognition కోసం ఇంటికి రమ్మన్నవాడింటికి వెళ్ళలేదు దేముడు. తన ఇంట్లోకి రమ్మన్న వాళ్ళందరి ఇంట్లోకి వచ్చేశాడు. వచ్చి వాళ్ళనుద్ధరించాడు. వాళ్ళు ఎంత పెద్ద వాళ్ళయిపోయారంటే ఇవాల్టికి కూడా వాళ్ళని మర్చిపోలేనంత పెద్ద వాళ్ళని చేసేశాడు. అలా పెద్దవాళ్ళు అయిన చరిత్రలన్నీ మనకి భాగవతంలో ఉన్నాయి. మనకి ప్రత్యేకించి భారతదేశంలో అదృష్టం ఏమిటంటే, మనకి ఈ దేశంలో అట్లా ఉన్నవాళ్ళు చాలామంది అడుగడుగునా కనిపిస్తూనే ఉంటారు. అదీ ఈ దేశం యొక్క నాణ్యత. మిగతావన్నీ బావుండవు. బహిర్గతం గా ఏం బావుండదు ఈ దేశం. అంతర్లోకానికి సంబంధించి మాత్రం అద్భుతంగా ఉంటుంది. ఇక్కడ ప్రతి శతాబ్దానికి ఓ డజనుమంది జనబాహుళ్యంలోకి వస్తారు. అలా కాకుండా చాలామంది ఉన్నారు. ఆ దేశాల్లో ప్రతి 12 శతాబ్దాలకి ఒకడొస్తే గొప్ప. అదీ ఈ దేశం యొక్క పవిత్రత. కాబట్టి మనం ప్రత్యేకంగా భగవంతుడు సంకల్పం చేత ఇక్కడ పుట్టాం కాబట్టి, మనం కూడా ఈ మార్గంలో నడిచి వెళ్తే, పెద్ద పెద్ద వాగ్దానాలు ఏం చేయబోకండి. లోపల అనుకోవచ్చు. బయటికి చెప్పద్దు. దాన్ని నిర్వర్తించగలమేమో చూసుకోండి. అదీ దీక్ష! నిర్వర్తిస్తున్న దాన్ని గురించి చెప్పకండి. మనం చెప్పకపోయినా తెలిసిందనుకోండి తెలియనీయండి. అలా నిర్వర్తించుకుంటే సత్య ధర్మాన్ని పరిపాలించిన వాళ్ళమవుతాం. మామూలుగా మనల్ని బంధించేవి మూడే మూడు ముళ్ళు. ఒకటి మనస్సులో, ఒకటి ఇంద్రియాల్లో. ఒకటి భౌతిక శరీరంలో ఉన్నాయి. దీన్నే mental, emotional and physical bodies అంటారు. మన భాషలో చెప్పుకోవాలంటే మనోమయ శరీరంలోనూ, కామమయ శరీరంలోనూ, అన్నమయ శరీరంలోనూ మనకి మూడు రకాల బంధనాలు ఉన్నాయి. ఎవరో వేసి పంపించలేదు. మనమే వేసుకున్నాం. బాగా కామించామంటే ఒక ముడి పడిపోతుంది. బయటవి బాగా

పట్టుకున్నాం అంటే ఒక ముడి పడిపోతుంది. మనస్సులో ఏదన్నా పట్టు ఉందంటే పడిపోతుంది. అవి automatic locking system. అదేంటండీ నేను వెయ్యలేదు కదా అంటే నువ్వు వెయ్యక్కర్లా, నువ్వు అనుకోవడం వల్ల పడిపోతుంది అది, అంటే ఇపుడు మనం mind లో ఇంటికి తాళం పెట్టేద్దాం అని అనుకుంటే అక్కడ తాళం పడిపోతుంది. అట్లా ఉంటుంది మనకి. మనకి బయట ఆ పరికరాలు కూడా వస్తాయి. మరువు మహర్షి ఓ మాట చెప్తాడు. 'బయట పరికరాలు ఏం చూస్తావులేవోయ్ దానికన్నా అత్యుత్తమమైనట్టి పరికరాలు లోపల ఉన్నాయి, ఇప్పుడు మీరు బయట చేస్తున్నారు అని అనుకుంటున్నారే అవన్నీ మా దగ్గరున్నాయి, అవి లోపలా, బయటా కూడా ఉన్నాయి. బయట కూడా మీకన్నా మంచివి వున్నాయి, లోపల కూడా అంతకన్నా ఉత్తమమైనవి ఉన్నాయి' అని. అందుకని లోపల మనకి electric system ఉంది, computer system ఉంది. ఇవాళ పొద్దునే ఒక మరువు మహర్షి సూక్తి ఒకటి చూసాను. ఏంటి ఇవాళ గురువుగారు మనకి ఏం message ఇస్తారు వైకుంఠ ఏకాదశి పూట అని తెరిస్తే 'ఈ మానవాళి బయట ప్రపంచంలో యంత్రాంగముతో కొట్టుకు చచ్చిపోతోంది, ఏదో ఓ రోజున తెలివొస్తుంది, ఈ యంత్రాలు కాదు, అసలు మనిషి కన్నా మించిన యంత్రం లేదు సృష్టిలో' అని, 'అప్పుడు లోపల యంత్రాలు తెలుసుకుని, ఆ అద్భుతం తెలుసుకుని తద్వారా ఈ బయటి యంత్రాలు అన్నీ భస్మీకరిస్తాడు. కానీ అది ఇప్పుడప్పుడే అయ్యే విషయం కాదు' అని చివరలో ఒక వాక్యం రాస్తాడు. మనం చూడం. ఎప్పుడో అవుతుందది. 'అన్ని శక్తులు లోపలే ఉన్నాయి కదా. భగవంతుడే తన యొక్క స్వరూపంగా మానవుడ్ని తయారు చేశాడు కదా తనంతటి వాడ్నిగా. కాబట్టి అన్నీ ఇక్కడే ఉన్నాయి. కాబట్టి బయట భౌతికంగా చేసుకోనక్కర్లేదు. లోపలి నుండే దాన్ని అప్పటికప్పుడు నిర్వర్తించి, మళ్ళీ అది లేకుండా చేసుకోవచ్చు. బయట తయారు చేసుకుంటే అవి మోసుకు తిరుగుతూ ఉండాలి. వాటిని కాపాడుకుంటూ ఉండాలి' అంటాడు. అంతవరకు మనకి ప్రయాణం జరుగుతూ ఉంది. ఏమిటోనండీ అంత బాగా జరగట్లేదు ఈమధ్య ప్రార్థన, అన్నామనుకోండి, ఎందుకు అని బయట ఎవరినీ అడగక్కర్లా. ఎందుకు అని లోపల అడిగితే తెలుస్తుంది. ఎక్కడో భావాల్లో ఉంటాయి కొన్ని తలకిందులుగా. కోరికల్లో ఉంటాయి తలకిందులు. లేకపోతే భౌతికంగా బయట మనకి జరిగే కొన్ని విషయాల్లో ఇరుక్కుపోయి ఉన్నాం. ఈ మూడిట్లో ఎక్కడో ఒకచోట మనకి ముడి పడిపోవడం వల్ల మామూలుగా జరిగే సాధన జరగదు. అందుకని ఈ పద్ధతిలో మనం ముందుకు వెళ్ళి సత్య ధర్మాన్ని అనుసరిస్తూ, త్రివిక్రమత్వాన్ని పొందుతూ తద్వారా ఆనందకారకుడిని అందుకుని ఆనందమయ లోకాల్లో జీవించడమనేది ఈ శ్లోకానికి భావంగా మనం తీసుకుందాం.

## 551 మహర్షిః

మహర్షి, ఋషి. ఋషి అంటే, కనపడుతున్న దాంట్లో సమస్తాన్నీ దర్శనం చేయగలిగినవాడు. అంటే, ఒక రూపాన్ని దర్శనం చేసినప్పుడు, ఆ రూపానికి ఆధారంగా ఉండే గుణాలని, ఆ గుణాలకి ఆధారంగా ఉండే తత్త్వాన్ని, సమస్తాన్నీ దర్శనం చేసేవాడు ఋషి. మనం కొంత చూస్తాం కానీ, మొత్తం చూడం. ఒక వ్యక్తి కనిపిస్తే, ఆ వ్యక్తి యొక్క నామరూపాలను చూస్తాం. రూపం లో లావయ్యారు, సన్నమయ్యారు ఇలా చూస్తూ ఉంటాం. పుట్టిన దగ్గర నుండి వెళ్లే వరకు ఎట్లాగూ అదే నామం. ఇట్లా చూస్తూ ఉంటాం. 'అసలు వాడు' చిక్కడూ, లావవ్వడు. హోని వృద్ధులు శరీరానికే! అలాగే, వాడికి ఉండే గుణాలు. మనిషికి ఒక పేరు, ఒక రూపం. ఆ రూపం వెనకాల, వాడికి సంబంధించిన స్వభావం. స్వభావము వెనకాల త్రిగుణముల యొక్క కలయిక. త్రిగుణముల వెనకాల, అందులో ఉండే చైతన్యం. చైతన్యం వెనకాల ఉన్న సత్యం. ఈ మొత్తాన్ని కూడా, లోతుగా, ఒక దృష్టితో చూసేస్తాడు ఋషి అనేవాడు. మహాత్ములు అట్లా చూస్తారు. కేవలం ఒక్కొక్కట్ట ఒక్కొక్క ఆవరణలో ఆగిపోతారు. కొంతమంది రూపం చూసి, బాగుంది అనుకుంటారు. కొంతమంది స్వభావం కూడా చూస్తారు. మరి కొంతమంది స్వభావం వెనకాల ఉన్న త్రిగుణముల యొక్క కలయిక వలన వాడి స్వభావం అట్లా ఉంది అని తెలిసి, వాడిని పెద్ద కష్టపెట్టడు. కాఫీ బాలేదు, అన్నామనుకోండి. ఎందుకు బాలేదు? పాలు, డికాషన్, పంచదార, మూడూ కలయికలో తేడా ఉందనుకోండి, కాఫీ బాగుండదు. అట్లా గుణముల యొక్క సమ్మిశ్రమములో సమపాళ్ళు లేకపోవడం వలన, తేడా ఉండడం వలన స్వభావం బాగుండదు. అందుకని ఋషి నామాన్ని, రూపాన్ని, స్వభావాన్ని, త్రిగుణముల యొక్క కలయికని దాటి ఉన్న చైతన్యాన్ని, ఆ చైతన్యానికి ఆధారంగా ఉన్న సత్యాన్ని చూస్తుంటాడు. అక్కడ నుండి ఇటు చూసుకుంటూ వస్తాడు. చూసుకుంటూ వచ్చి, చైతన్యం అవతరించడానికి ప్రయత్నం చేస్తాడు తప్ప, మిగతావి ముట్టుకోడు. ఇంక మిగతావి ఏవి ముట్టుకున్నా సరే అది, చాలా గొడవ గొడవగా ఉంటుంది. ఎవరూ ముట్టుకోనివ్వరు కూడా. ఎవరిని తప్పంటే ఎవరు ఒప్పుకుంటారు? ఎవరూ ఒప్పుకోరు కదా ఈ ప్రపంచంలో. మీరు చదివారేమో Dale Carnegie అనే ఆయన, ఒక పుస్తకం రాశారు How to win friends and influence people అని. అందులో 'ఎవరి తప్పు వాళ్లు ఒప్పుకోరు కాబట్టి, తప్పు పడదామనే ప్రయత్నం చేయబోక, తప్పయినప్పటికీ', అని మొదటి పాఠం చెప్పారు. మనం అది చేస్తూ ఉంటాం. ఎదుటి వ్యక్తిలో తప్పులు పట్టుకుంటూ ఉంటాం. అవి పట్టుకుంటే మన mind లో అవి పడతాయి తప్ప, వాడేమీ మారడు. ఆయన ఒక కథ ఇచ్చారు. ఒకడు అమెరికాలో, భయంకరంగా తలకాయలు కత్తితో నరుక్కుంటూ 400 హత్యలు చేశాడుట. చివరికి వాడిని

పట్టుకున్నారు. పట్టుకున్న తర్వాత వాడికి ఉరిశిక్ష వేశారు. ఉరికంబానికి ఎక్కించేటప్పుడు 'నీ మాటగా ఏమన్నా చెప్పాల్సింది ఉందా?' అని అడిగారట వాడిని. అంటే, 'నా అంత మంచి వాడు ఎవరూ లేరు, ఈ ప్రపంచం నన్ను అర్థం చేసుకోలేదు' అని చెప్పాడట వాడు. అట్లా ఉంటుంది ప్రతి వాడికి. 400 తలకాయలు చెరిగేసినవాడికి కూడా, తను చాలా మంచివాడు అన్న భావన ఉంటుంది కాబట్టి, ఎవరినీ తప్పు బట్టి ఉపయోగం లేదు. వాడు ఆ మూసలో అట్లా ఉండడానికి కారణం, అసలు నమూనాలో తేడా. మనం మారుస్తాం అంటే, ఎవరూ ఒప్పుకోరు ప్రపంచంలో! అందుకని ఋషి వాడిలో చైతన్యం పెంచుతాడు, తన దృష్టి ద్వారా! పెంచడం చేత, 'మనం అంత బాగాలేము, ఇంకొంచెం బాగుపడితే బాగుండు' అనే భావన వాడికే కలుగుతుంది. వాడినే వాడు మార్చుకోవడానికి ఒక ప్రయత్నం చేసుకుంటూ ఉంటాడు. దానికి ఈయన దోహదం చేస్తూ ఉంటాడు అంతే! తన దగ్గర ఉన్నదీ అదే, వాడి దగ్గర ఉన్నదీ అదే.తనలో మేల్కాంచింది వాడిలో కూడా మేల్కాంచినట్లయితే, వాడే వాడిని దిద్దుకుంటాడు, అనే సహనంతో కూడిన ప్రేమ తత్త్వం తో ప్రయత్నిస్తాడు. ప్రేమ ఎప్పుడూ సహనాన్ని కోరుతుంది, సహనం లేకపోతే ప్రేమ ఉండదు. సహనం లేకే మనం ఏదో అనేస్తూ ఉంటాం. అందుకనే సహనము, ప్రేమ ఊరికే పదాలు వేరు తప్ప రెండిటి యొక్క తత్త్వము ఒకటే. అందుకని సహించగలిగి ఉండాలి. సహిస్తే, వాళ్లు మనల్ని కోరకుండా మనము సలహా ఇవ్వకూడదు, ఒకటి. కోరినా, సలహా చెప్పడంలో వారి తప్పులు చెప్పకూడదు. తప్పులు ఎత్తి చూపిస్తే బాధపడతారు తప్ప మార్చుకోరు. అందరం తప్పులు చేస్తూనే ఉంటాం. కనకనే ఋషి వాడిలో చైతన్యాన్ని పెంచుతాడు. చైతన్యం వికాసం కలగడం కోసం ఏదో గ్రంథ పఠనం చెప్తారు. ఏ పుస్తకం చదివినా అందులోంచి, వీడక్కడ కనిపిస్తాడు కదా. భారతం, రామాయణం నిజంగా నిష్పక్షపాతంగా చదువుకుంటే, మనం కనిపిస్తూ ఉంటాం అందులో. రావణుడు చేసే పనిలోనో, కుంభకర్ణుడు చేసే పనిలోనో, సుగ్రీవుడు చేసే పనిలోనో అన్నిట్లోనూ మనం కాస్త కనిపిస్తాం. సందేహం లేదు. రాముడిలో మనం పొందాల్సినవి ఉంటాయి. మిగతావారిలో మనలో ఉన్నవి కనిపిస్తూ ఉంటాయి, అందుకని రాముడు కథానాయకుడు అవుతాడు. ఆ విధంగా, తనని తాను మార్చుకోవడానికి, ఒక అవకాశం కలిగిస్తూ, చైతన్యం యొక్క బలాన్ని పెంచుకుంటూ, సత్యంలో బలం పెంచుకుంటూ, సత్యవంతుణ్ణి, చైతన్యవంతుణ్ణి చేయడానికి ఎక్కువ ప్రయత్నం చేస్తాడు. ఇక ఆ కింద విషయాలు ముట్టుకోడు ఋషి, ఎందుకంటే ముట్టుకుని ఉపయోగం లేదు. ఈ ప్రపంచాన్ని అంతా మార్చేద్దాం అనుకుంటాం. మన ఇంట్లో వాళ్ళనే మార్చలేము! ఇంట్లో వాళ్ల వరకు ఎందుకు? నువ్వు మారుతున్నావా? మారవు. అందుకని, ముందు మనం మారడం అనేది ముఖ్యం. మనని చూసి ఎవరన్నా మారితే మారుతారు, మారకపోతే వాళ్లు మారే time లో వాళ్లు మారతారు. మనం మారుద్దాం అనుకోవడం వల్ల, వాళ్లు మారకపోవడం వల్ల మనకి

వాళ్లకి మధ్య స్పర్ధ ఎక్కువ అవుతుంది తప్ప, మార్పు రాదు. ఋషి దృష్టి ఉండేవాడు అట్లా ఉంటాడు. ఈ సమస్తము భగవంతుని యొక్క లీలగా నడుస్తోంది, జీవులందరూ వాడిలోంచే వచ్చారు, జీవ స్వభావాలు వేరువేరుగా ఉన్నాయి, ఎవరి స్వభావం ప్రకారం వాళ్లు ప్రవర్తిస్తారు తప్ప, మనం అనుకున్నట్టుగా వాళ్ళు ప్రవర్తించరు. కాబట్టి తనకిగా తను, తన స్వభావం ఎలా ఉందో చూసుకుని, తద్వారా మహాత్ములు చెప్పినవో, వారు రచించిన బోధలో, గ్రంథములో, వాటిలోంచి తన్నుతాను మార్చుకుంటూ, వెళ్తూ ఉండడం అనేది సాధన! మనని ఎవరైనా 'నేను ఎందుకు ఇలా ఉన్నాను, నాలో ఏమి తప్పు ఉండడం వల్ల నేను ఈ విధంగా ఉన్నాను', అని ఎవరన్నా అడిగినా కూడా, తొందరపడి అమాయకంగా చెప్పేయకూడదు. నీకు తోచింది చెప్తే, అడిగి చెప్పించుకుని మనల్ని తిడతారు. అది నా స్వానుభవం మీద చెప్తున్నా. ఎవరైనా 'ఎందుకండీ నేను ఇట్లా ఉన్నాను, ఇన్నాళ్లు పోయినా'? అని అడిగితే, ఇందువల్ల ఇట్లా ఉన్నావని తెలియక చెప్పడం వల్ల 'చూశావా నా గురించి ఆయన ఇట్లా మాట్లాడాడు' అని ఊరంతా చెప్పిన వాళ్ళు దాదాపు ఒక డజను మంది ఉన్నారు. ఆశ్చర్యం వేసింది. 'ఓహో మనం అడిగితే చెప్పకూడదు. బానే ఉన్నావులే, ఇంకొంచెం ఎక్కువ ధ్యానం చేసుకో, ఇంకొంచెం ఎక్కువ ప్రార్థన చేసుకో, మంచి గ్రంథం చదువుకుంటూ ఉండు అదే కాలం కలిసి వస్తుంది' అని చెప్పాలట. ఋషి అట్లా చెబుతాడట. అదే మాస్టర్ గారికి, మనకి తేడా! ఆయన ఎంత భయంకరమైన వ్యక్తికైనా సరే, సూటిగా పొడిచి చెప్పలేదు, ఎందుకంటే పొడవడం వల్ల ఏమీ జరగదు. ఎద్దునీ, గేదెని పొడుస్తే ఏమైందండీ? మారుతుందా? మారదు కదా. అది తెలిసి ఉంటుంది వాళ్ళకి. తెలిసి ఉండి, అందరికీ ఏదో ఒక స్ఫూర్తి కలిగించి వదిలేస్తారు. 'పర్వాలేదులేవోయ్ బానే ఉంటుంది, మాస్టర్ గారికి బాగా ప్రార్థన చేసుకో', అని చెప్పడం తెలివి! వాడిలో ఉండే లోపము తెలిసినా కూడా చెప్పకుండా, ఏ విధంగా వాడు బాగుపడాలో అది మాత్రం చెప్పి ఊరుకోవడం అనేది తెలివి! అంతేగాని, ఏదో మనం తగుదునమ్మా అని ఏదో నాలుగు పుస్తకాలు చదివి, మనని ఎవరో తెలిసినవాడని వాడు అనుకోవడం వల్ల, వాడు అడగడం వల్ల, మనం తెలిసిన వాళ్ళం అనుకుని చెప్పడం వల్ల, చాలా ఇబ్బందులు వస్తాయి, ఋషులు అట్లా చేయరు. ఇక్కడ, భగవంతుని ఏమన్నారంటే, ఋషులందరికీ ఋషి ఆయన మహర్షి! 'మహర్షిః' అంటే, అస్సలు బొత్తిగా వ్యక్తిగతమైన స్వభావము లేనివాడు అని అర్థం. అంటే తన గురించి తను ఎప్పుడో మర్చిపోయిన వాడు మహర్షి. బ్రహ్మర్షి! విశ్వామిత్ర మహర్షి అంటాం. వశిష్ఠమహర్షి అంటాం. మహర్షి అంటే ఇంక వాడు లేడు. వాడు ఎప్పుడో, ఎక్కడి నుండి వచ్చాడో, వాడిలో కలిసిపోయాడు. తనకి తాను గుర్తులేని స్థితి! హనుమంతుడ్ని అట్లా చెప్పుకోవాలి మనం. హనుమంతుడికి, తనెవరు అనే ప్రశ్న లేదు. ఎందుకంటే, తను అది అయిపోవడం వల్ల, అదే ఇక్కడ ఉంది, తాను లేడు. అందుకని హనుమంతుడికి గుర్తు చేయాలి. హనుమంతుడిని పొగిడితే కానీ ఆయన ఏమీ చేయలేడు అని, ఏదో పిచ్చి

పిచ్చిగా మాట్లాడడం కాదు. పొగిడితే కానీ చేయలేకపోవడం కాదది. తనదంటూ ఒక శక్తి ఉందని నమ్మడు మహర్షి. సమస్తం భగవంతుడిదే! ఇది భగవంతుడిదే! భగవంతుడే ఇందులో ఉన్నాడు. తను లేడు, వాడు అయిపోయాడు. అందుకని వాడే ఉంటాడు. ఉంటాడు కాబట్టి వీళ్ళందరూ 'నువ్వే ఎగరగలవు' అని చెప్తే 'నేనెగరగలనా? మీరు చెప్తున్నారు కాబట్టి అలాగే' అంటాడు. అంతేగాని హనుమంతునికి తను ఇంత భక్తుడ్ననిని కూడా తెలియదు. తనింత రామభక్తుడని వాళ్లు వీళ్లు వచ్చి చెప్తే 'అలాగా' అంటాడు. 'నువ్వు చాలా బాగా పాడుతావు' అంటే, 'అవునా' అంటాడు. మనకి మనమే చెప్పకుంటాం, నేను బాగా చదువుతాను, నా అంత బాగా విష్ణు సహస్రనామం ఎవరూ చదవరు, మిగతా వాళ్లంతా తప్పులు చదువుతూ ఉంటారు ఇట్లా--. హనుమంతుడికి అట్లా ఉండదుట. ఎందుకు ఉండదు అంటే, మహర్షి! మహర్షి అంటే తను లేడు. వాడే ఉన్నాడు. తన గురించి మాట లేదు. హనుమంతుడు ఎప్పుడూ తన గురించి మాట్లాడుకున్నట్టు ఏమీ ఉండదు. రాముడి గురించి మాట్లాడడమే ఉంటుంది. మనం రెండు మాటలు గురువుగారి గురించి మాట్లాడితే, మూడవ మాట గురువుగారితో మనది చేర్చి మాట్లాడి, ఐదవ మాట వచ్చేసరికి గురువుగారు వెళ్లిపోయి మన గురించి మాట్లాడుకుంటూ ఉంటాము. గమనించండి కావాలంటే! మహర్షికి దైవం తప్ప ఇంకో మాట రాదు. తన గురించి మాట్లాడుకోవడం ఉండదు. శ్రీకృష్ణుడు ఎక్కడన్నా మొత్తంలో, తన గురించి మాట్లాడుకున్న సన్నివేశం ఉందండీ? విష్ణు సహస్రనామం ఎవరిని ఉద్దేశించి చెప్పాడు భీష్ముడు? ఆయన గురించి చెప్పాడు. ఆయన ఎక్కడన్నా, ఎప్పుడన్నా, నేను ఇంతటి వాడినిరా! మీ దుంపలు తెగ గుర్తించలేరా, అన్నమాట ఉందా? గుర్తించిన వారిని కూడా మాయలో పెట్టాడు తప్ప, గుర్తింపు కోసం తాపత్రయ పడలేదు కదా. ఈ నామాల్లో మనం రకరకాల మహాత్ముల దర్శనాలు చేసుకున్నా, వీటన్నిటికీ పరాకాష్ఠ శ్రీకృష్ణుడే ఔతాడు! అలాగే రాముడు కూడా! 'నువ్వు సాక్షాత్తు విష్ణుమూర్తివయ్యా, ఇట్లా రూపంలో దిగి వచ్చావు' అంటే, 'నాకదంతా తెలియదు' అంటాడు. ఆయన తెలియనితనం ఆ అవతారంలో ఒక లక్షణం. గరుత్మంతుడు వచ్చి 'నేను నీకు ఎప్పటి నుండో స్నేహితుడిని' అని చెప్తాడు. రెండుసార్లు నాగపాశం వల్ల దెబ్బతింటారు, వివశులై పడిపోతారు, పడిపోతే గరుత్మంతుడు వచ్చి, ఆయన రెక్కలు విసిరేసరికి, ఆ నాగ బంధం అంతా వీళ్ళకి పోతుంది, వానరులకి. వీళ్లంతా లేస్తారు. లేస్తే రాముడు పాగుడుతాడు, నీలాంటి మహాత్ముడు వచ్చి ఇటువంటి సాయం చేయడం వల్ల మేము ఇవాళ ఈ విధంగా ఉన్నాము, అంటే, 'నేను నీ సేవకుడిని, నీకు చాలా స్నేహితుడిని చిరకాలమైన పరిచయం ఉన్నది మనిద్దరి మధ్య' అంటే, 'నాకేమీ తెలియదు' అంటాడు. నిజంగా తెలియదు. కృష్ణుడి విషయంలో సమస్తం తెలుసు. తెలియక మాట్లాడకపోవడం వేరు. తెలిసి మాట్లాడకపోవడం? ఎట్లా ఉంటుంది? మొత్తం అంతా తెలిసి, ఏమి తెలియనట్టుగా ఉండడం అనేది అయ్యే పని కాదు. కొంచెం తెలిస్తేనే, మరి ఊరంతా చెప్పాలనిపిస్తుంది,

వెంటనే పుస్తకం రాసి, అచ్చేసి, అందరికీ పంచి, దగ్గరుండి చదివించాలనిపిస్తుంది. అటువంటిది సమస్తము తెలిసి ఉండి, సమస్తము నిండి ఉండి, ఎన్నడూ తన గురించి, ఎప్పుడూ మాట్లాడనివాడు శ్రీకృష్ణుడు. కాబట్టి మహర్షి! అట్లా ఉన్నవారు ఉన్నారు కానీ, అంత స్థాయిలో ఉన్నవారు ఎవరూ లేరు. ఆయన పరాకాష్ఠ! అదే స్థాయిలో ఉండే వాళ్ళు చాలామంది మనకి గోచరిస్తారు. 'వాళ్ల గురించి అనేది' ఉండదు. మాటలో ఉండదు, చేతలో ఉండదు, అందులో మనం ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వాడు హనుమంతుడు! నారదుడు కూడా ఆ కోవలోకి రాడని, చెప్తూ ఉంటారు పెద్దలు. హనుమంతుడి యొక్క లెక్క అటువంటిది. అందుకని ఆయన్ని ప్రార్థన చేస్తే రాముడు సంతోషిస్తాడు. ఎందుకనీ? రాముడే అక్కడ ఉన్నది. ఇంకొకడు లేడు. అందుకనే భగవద్భక్తుడ్ని మనం ప్రార్థన చేస్తూ ఉంటే, భగవంతుడు సంతోషిస్తూ ఉంటాడుట. భగవద్భక్తుని ఆరాధన చేసుకుంటేట, భగవంతుడినీ ఆరాధన చేసినట్టు, భక్తుడినీ ఆరాధన చేసినట్టు! విశేషించి భగవంతుడు ఎక్కువ ఆనందిస్తాడట, తన భక్తుడిని ఆరాధిస్తున్నాడని. అదే శత్రుఘ్నుడిగా చెప్తారు మనకి. మామూలుగా మనకి రామాయణంలో శత్రుఘ్నుడికి పెద్ద పాత్ర లేదు, మనం కూడా పెద్ద అలోచించము. మహా అయితే భరతుడి వరకు వెళ్తాం. రాముడు, లక్ష్మణుడు, భరతుడు కదా, శత్రుఘ్నుడు ఏమిటి ఊరికినే సత్ర కాయలా అనిపిస్తుంది మనకి. మన గుర్తింపు కోరేంత స్థితిలో శత్రుఘ్నుడు లేడు. మనమంతా గుర్తించకపోతే ఆయన బాధపడడుట. ఆయన రాముని యొక్క దాసునికి, దాసుడుట. అది గొప్పతనం శత్రుఘ్నుడిది! లక్ష్మణుడు, రాముడి దాసుడుగా ఉన్నాడు. అందులో పెద్ద ఏముంది, ప్రతివారు గురువుగారికి సేవ చేద్దాం అనుకుంటారు. గురువుగారికి సేవ చేసేవాడికి, సేవ చేసేవాడిగా ఉండడంలో ఎంత గొప్పతనం ఉందండి! అసలు బొత్తిగా తన గురించి తనకు గుర్తింపు కావాలి అనే తీట, లేనివాడు. లక్ష్మణుడికి ఉందా అంటే ఉందని నేను చెప్పను. లక్ష్మణుడ్ని కావాలనే రాముడు తనతో తీసుకెళ్లిపోతాడు. 'ఇక్కడ ఉంటే ఎప్పుడు ఆవేశం వస్తుందో వాడికే తెలియదు' అని పట్టుకుపోతాడు. భరతుడితో ఆ భయం లేదు రాముడికి. భరతుడ్ని రాముడిలాగా ఆరాధన చేసుకోవడం అంటే సామాన్యమా? అంటే, గురువుగారి శిష్యుడిలో గురువుగారిని దర్శనం చేసుకుంటూ, ఉండడం. దాసానుదాసుడు అంటూ ఉంటారు చూశారా వైష్ణవులు, అందుకే వచ్చింది అది. దాసాను దాసుడు అంటే అర్థం ఏమిటంటే భగవంతుని యొక్క దాసునికి నేను దాసుడ్ని అని చెప్పడం. అహంకారం ఉంటే అది అయ్యే పని కాదు. శత్రుఘ్నుడు అటువంటివాడు. అందుకని శత్రుఘ్నుడి గురించి తక్కువ అంచనా వేసుకోకూడదు. కారణం ఏమిటంటే, రాముని భక్తునికి, రాముని యందు ఎంత భక్తి, ప్రేమ ఉంటుందో, రాముని భక్తుని యందు అంత భక్తి ప్రేమలు ఉన్నవాడు కాబట్టి. వాళ్లందరూ self recognition అనేది దాటినవారు. తమ గురించి తమకు గుర్తు లేని వాళ్ళు. అటువంటి వాళ్ళు భాగవతోత్తములు! ప్రహ్లాదుడికి తన గురించి తనకు గుర్తు ఉండదు. అంబరీషునికి తన

గురించి తనకు గుర్తు ఉండదు. శుకుడికి తన గురించి తనకు గుర్తు ఉండదు. వ్యాసుడు మొదలైన వారందరూ మహర్షుల కోవలోకి వస్తారు. మైత్రేయ మహర్షి అంటారు. మరువు మహర్షి. దేవాపి మహర్షి. ఎందుకన్నారంటే వాళ్లు వేల సంవత్సరాలు, భూమి మీద జీవులకి ఎంతో రకంగా ప్రచోదనం కలిగిస్తూ, తామెవరో ఎవరికీ తెలియకుండా, అట్లా రహస్యంగా ఉంచినవాళ్లు. ఎందుకంటే వాళ్లు మనం ఎవరో తెలియడం కాదు కదా కావాల్సింది, జీవులకి దైవాన్ని చేరే మార్గం తెలియాలి తప్ప, మనమేమిటి మధ్యలో అనుకునే వాళ్ళు. మనం అట్లా కాదు. వాళ్ల పేరున మనం తెలియాలని చాలా తాపత్రయపడుతూ ఉంటాం. 5000 సంవత్సరాల తర్వాత Madam Blavatsky చెప్తే, ఈ photos బయటకు వచ్చినాయి. మనం ఐదేళ్లకే మన photos ఎవరైనా పెట్టుకుంటే బాగుండు అనేటువంటి స్థితిలోకి ఎదిగిపోతూ ఉంటాం. అది ఎదగటం అనుకుంటాం, పతనం చెందుతూ ఉంటాం. మహర్షి అనే దానికి ముఖ్యమైన అర్థం 'తాను లేక, అతడు నిండిన స్థితి'. 'తన గురించి' అనే మాట ఉండదు. తరచి తరచి తరచి తరచి అడిగితే కూడా దైవం గురించే చెప్తాడు తప్ప, తన గురించి చెప్పడు. ఎందుకంటే, అక్కడ ఉన్నది దైవం! అదీ మహర్షి పదానికి అర్థం.

## 552 కపిలాచార్యః

కపిల దేవహూతి సంవాదం EK గారు ఇచ్చినది తప్పకుండా అందరూ చదువుకోండి. చాలా ముఖ్యమైన ఘట్టం భాగవతంలో. కపిల దేవహూతి సంవాదం క్షుణ్ణంగా తెలిసి ఉంటే, సాధనపరంగా మొత్తం మనకున్న syllabus ఏమిటో తెలుస్తుంది. ఏదో కొంచెం తెలుసుకుని పరితృప్తి చెందిన వాడు సాధకుడు కాదండీ! ఆత్మ దర్శనం అయ్యేంతవరకు కూడా, ఆవేదన ఉన్నవాడొక్కడే సాధకుడు! ఎప్పటికప్పుడు మనకి ఇప్పటికే చాలా తెలిసిపోయింది అని తృప్తి పడేవాడు సాధకుడు కాదు. సాధన విషయం లో, సిద్ధి పొందేంతవరకు కూడా తృప్తి లేని వాడు సాధకుడు! అబ్బో ఇప్పటికే చాలా service చేశాం, silver jubilee కూడా అయిపోయింది ఎవరూ గుర్తించట్లేదూ, ఏదో certificate ఇవ్వలేదూ, లేకపోతే మనం ఇంతటివారము, ఎవరు గుర్తించట్లేదూ, గమనించట్లేదూ ఇవన్నీ ముఖ్యం కాదు. ఏమిటి ముఖ్యం? తపన! అది అయ్యేంతవరకు తపన! అందుకే మీరు దేవహూతికి కపిలుడు చెప్పిన విషయాలు ఒక్కసారి చదువుకోవాలి. నాలుగు విషయాలు చెప్తాడు. తల్లీ! ముందు భక్తి ఉండాలమ్మా, ఉంటేనే జ్ఞానం అబ్బుతుంది, భక్తి లేని వాళ్లకి జ్ఞానం అబ్బదు. అని భక్తి బోధన చేస్తాడు. భక్తి లేనిదే ఏమీ జరగదు. భక్తి అంటే అక్కడ చెప్పే భక్తి, శ్రద్ధ! ఏ పని చేసినా, ఎంతో భక్తి, శ్రద్ధలతో దేవుడికి చేసినట్లుగానే, ఎవరికి పని చేసినా, చేసి పెడుతూ ఉండాలి. ఇది అలవాటయితేనే ఏదైనా ఉంది, లేకపోతే ఏమీ లేదు, అని చెప్తాడు. ఇది ఒకటి. రెండు, జ్ఞానం! జ్ఞాన సముపార్జన అనేది నిత్యం జరుగుతూ ఉండాలి. నాకు ఇప్పటికే చాలా తెలుసు అనుకోవడం అనేది కుదరదు. అది మనకి వేదంలోను, ఉపనిషత్తుల్లోనూ కూడా చెప్పారు. ప్రతిరోజూ చదువుకోవాల్సిందే! కేవలం చదువుకోవడం కాదు, చదువుకున్నది రాసుకోవాల్సిందే! ఎందుకంటే నీకు, ఒకటి మతిమరుపు, చదివిందే మర్చిపోతాం. తెలియవలసినది చాలా ఉంటుంది. అందుకని జ్ఞానం పెంచుకుంటూ ఉంటేట, జ్ఞానం వలన, తపస్సు ఎక్కువ సిద్ధిస్తుంది. దాన్ని 'యోగము' అంటాడు కపిలుడు. యోగం అంటే భగవంతునితో మనని అనుసంధానం చేసుకోవడం! అది తపస్సు! ఈ భక్తి జ్ఞానముల ఆధారంగా యోగం నడపాలమ్మా, అంటాడు. ఈ మూడూ కలిస్తే, వైరాగ్యం సహజంగా వస్తుంది. ఎన్ని తెలుసుకున్నా వైరాగ్యం రావట్లేదుట అంటే ఈ మెట్లు సరిగ్గా ఎక్కట్లేదుట అని అర్థం. భక్తి జ్ఞాన వైరాగ్యములు అంటూ ఉంటాం కదా మనం. భక్తి, జ్ఞానము, యోగంతో జోడిస్తే, వైరాగ్యం అవుతుంది. అందుకని ఈ నాలుగు మూల స్తంభాల ఆధారంగా, మనలో దేవాలయ నిర్మాణం జరిగితే, దైవం అందులో ప్రతిష్ఠుడు అవ్వడానికి అవకాశం ఏర్పడుతుంది. అందుకనే అదే పుస్తకాన్ని English లో 'Sankhya' అని కపిలుడు చెప్పింది రాసి, అక్కడ నాలుగు corners నుండి కలిపి పైకి చేరినట్లుగా ఒక

pyramid వేసి, అక్కడ వెలుగు బొమ్మ వేశాం. ఉద్దేశం ఏమిటయ్యా అంటే ఈ నాలుగూ ముఖ్యం. ఈ నాలుగు ఉన్నవాడే సాధకుడు అని! భక్తి పెరగాలి, జ్ఞానం పెరగాలి, ఈ రెండూ కారణంగా, యోగము, వైరాగ్యము పెరగాలి. తాపత్రయాలు పెరుగుతున్నాయిట అంటే, పునాది సరిగ్గా లేదని అర్థం. తాపత్రయాలు తగ్గాలి. మనకి పూజ చేస్తున్న కొద్దీ ఇంకా తపన అటు పెరుగుతూ ఉంటే అయ్యే పని కాదు. అందుకని కపిలుడు ఇచ్చిన సాంఖ్యానికి మాస్టారు ఒక చక్కటి నిర్వచనం చేశారు. 'భక్తి జ్ఞాన యోగ వైరాగ్యముల యొక్క సమన్వయమే సాంఖ్యము' అని చెప్పారు EK గారు. ఆ నాలుగూ మనలో ఎంత పెంపొందింపబడుతుంటే, అంత మనము ముందుకు వెళ్లడానికి ఒక అవకాశం ఉంటుంది. ఏదో అడ్డగోలుగా కాసేపు ఇది చేసి, కాసేపు అది చేసి, కాసేపు ఇంకోటి చేయడం కాదు. ఇవి వంట వంటివి, సరిగ్గా దేని తర్వాత అది వేసుకుంటూ వెళితేనే అది రుచి. లేకపోతే ఇంకోటేదో అవుతుంది. సాంబార్ పెట్టాలంటే ముందు ఏం చేయాలి, తర్వాత ఏమి చేయాలి అని ఉంటుంది కదా. వెనకది ముందు, ముందుది వెనక, నీ ఇష్టం వచ్చినట్టు చేస్తే అది రాదుగా. మరి, ఇది సాంబారుకన్నా పెద్ద విషయం. అందుకని, చేసే పనులలో భక్తిశ్రద్ధలు ఉన్నాయా, లేదా చూసుకోవాలి. ఎవరికి చేస్తున్నా, అదే శ్రద్ధతో చేయాలి, ఏ పని చేస్తున్నా అదే శ్రద్ధతో చేయాలి, దీన్ని 'అశ్వవిద్య' అంటారు. నీలో పరిపూర్ణమైన మనస్సుతో, ఆ పని చేయడం అనే ఒక శ్రద్ధ ఏర్పడకపోతే, ఏమీ జరగదు. అందుకని, ఒక ఆశ్రమానికి ఒక శిష్యుడు వెళ్లి, గురువుని ఆశ్రయిస్తే, ముందు వాడు శ్రద్ధవంతుడు అయ్యేంతవరకు వాడికి ఏమీ నేర్పరు. శ్రద్ధ లేని వాడికి భగవద్గీత చెప్తే ఏమి లాభం? వాడికి తోచినట్లుగా భగవద్గీత నుండి అవాకులు చవాకులు మాట్లాడుతాడు. భక్తి, శ్రద్ధ ఉన్నవాడికి అట్లా ఉండదు. మనకి ఏం తెలుసు భగవద్గీత? ఈ భూమి మీద ఉండే సమస్త ఆశ్రమాలలో కూడా ప్రతిరోజూ మహర్షులు చదువుకునే పుస్తకం భగవద్గీత! మనం అసలు చూడనే చూడము దానిని, ఎందుకంటే, అదేదో పాతది, అది important కాదు అన్నట్టుగా ఉంటుంది. మనకి ఏం తెలుసు? తెలియదు. భక్తిశ్రద్ధలు ఉంటే అన్నీ తెలుస్తాయి. అందుకే మొట్టమొదట, గురుకులంలో శిష్యుడికి గురువు కోరేది ఏంటంటే, నీవు శ్రద్ధావంతుడివి అవ్వాలి, జ్ఞానవంతుడివి అవ్వాలి. ఆ తర్వాత దాని ఆధారంగా నీవు యోగవంతుడివి అవ్వాలి. అంటే యోగం అంటే భగవంతుడితో అనుసంధానం చెందడమే యోగం! తద్వారా ఆత్మవంతుడివి అవ్వాలి; వైరాగ్యం, ఈ మూడూ జరుగుతుంటే వచ్చేది. అందుకనే మాస్టరుగారు కర్మ సన్యాస యోగంలో, 'సన్యాసం పుచ్చుకునేది కాదు, వచ్చేది' అని రాశారు. సన్యాసం పుచ్చుకున్న వాళ్ళు, రకరకాల బాధల్లో ఉంటారు. నీలో వెలుగు పెరుగుతూ ఉంటే సన్యాసం సహజంగా వస్తుంది. అందుకని కపిలుడు, తల్లికి చెప్తాడు. ఈ నాలుగూ ఉండాలమ్మా అని. ఎటువంటి సన్నివేశం! కపిలుడు, కర్దమ ప్రజాపతి, దేవాహూతికి పుట్టినవాడు. పుట్టంగానే పిల్లవాడిని చేతికి అందించేసి, తండ్రి వెళ్లిపోయాడట. అట్లా ఉండే వాళ్ళు

ఋషులు. 'అదేమిటది మీరు ఇలా వెళ్లిపోతున్నారు? అంటే, 'కొడుకును అందించాను కదా, నీ సంరక్షణ వాడు చూసుకుంటాడు' అంటాడు. 'మరి నా జ్ఞానం సంగతి ఏం చేశారు, నా ముక్తికి మార్గమేమిటి? ' అంటే 'వాడు చెప్తాడు' అంటాడు. అంతేగాని పిల్లలు పుట్టిన దగ్గర నుండి ఇంకా వాళ్ళని అట్లా వాటేసుకుని, వాడికి పుట్టిన వాళ్ళని వాటేసుకుని, వాళ్లకి పుట్టిన వాళ్ళని వాటేసుకొని, వాళ్లకి Eamcet లో seats వరకు వెళ్లిపోవడం అన్నంత భయంకరమైన జిగురు, ఆర్య సాంప్రదాయంలో లేదు. వివాహం యొక్క ఫలశృతి ఏమిటయ్యా అంటే, సత్సంతానం కలగడం. సమర్థవంతులైన తనయులు కనుక, దొరికితే, తన భార్యను వాళ్లకు అప్పజెప్పేసి, ఋషులు అరణ్యానికి వెళ్ళిపోయి తపస్సు చేసుకునే వాళ్ళట! మనకి వాళ్లు కూడా మనతో పాటు అక్కడికి వచ్చి రోజు పాద్దున్నే ఇడ్లీ అదీ పెట్టకపోతే, మనకు జరగదు కాబట్టి, ఇట్లా ఉండిపోయాం కానీ, నిజానికి, అది ధీరత్వం! దేవహూతి అంటే, ఆవిడ పిలిస్తే దేవతలు వస్తారుటండి! పిలిస్తే దేవతలు వచ్చే ఆమె అడిగిందట, నా సంగతేమిటి, నా ముక్తికి మార్గం ఏమిటని. అంటే దేవతా దర్శనం అయినంత మాత్రాన ముక్తి లభ్యమైనట్లు కాదు అని చెప్పడం! ఏదో ఓ దేవత పలకంగానే బాగా విర్రవీగుతూ ఉంటాం. ఆత్మవంతుడైన వాడికి సమస్త సృష్టి దేవతలు సహకరిస్తారు. ఏదో ఒక దేవతను పట్టుకుని వేలాడడం కాదు. అందుకనే ఉపాసనా మార్గం వేరు, యోగ మార్గం వేరు అని చెప్తారు పెద్దలు. యోగములో ధ్యానము, భగవంతుని యొక్క అంతర్యామిత్వం మీద ఉంటుంది. ఒక దేవతను ఆరాధించడం గా ఉండదు. ఎందుకంటే అంతర్యామి యందు, అందరి దేవతలూ ఇమిడి ఉన్నారు. నీకు అంతర్యామితో గనక బాగా సన్నిహితత్వం ఏర్పడి, సమన్వయం ఏర్పడితే, అంటే పరిచయము, సంబంధము, స్నేహము, ప్రాప్తి అని నాలుగు స్థితులు ఏర్పడితే, ఆయన నీకు దొరికితే, ముక్కోటి దేవతలూ నీ దగ్గర ఉన్నట్లే! అందుకనే గురువు దగ్గర ముక్కోటి దేవతలు ఉంటారని చెప్పడంలో అర్థం అది. ఎందుకంటే గురువు, పరతత్త్వంతో అనుసంధానం చెంది ఉంటాడు కాబట్టి, ఆయన సాన్నిధ్యంలో దేవతలు అందరూ ఉంటారుట. ఎందుకని? 'అక్కడ' ఉన్నాడు కాబట్టి. మన ఊరు D.G.P మన ఇంటికి వచ్చాడు అనుకోండి. D.I.G కి గాని Commissioner of Police కి కానీ, C.I లకి కానీ, S.I లకి కానీ, D.G.P గారు ఎక్కడున్నారని ఎప్పుడూ వాళ్ళు Minute to minute programme చూసుకుంటారు కదా. ఫలానా వారి ఇంటికి ఇంటికి వెళ్లారు, వాళ్ళిద్దరూ బాగా స్నేహితులు గావాల్సు, మనం ఆయన్ని జాగ్రత్తగా చూసుకోవాలి అనుకుంటారు. కదా. అట్లాగే, పరతత్త్వాన్నే తన ఒంట్లో ఉంచుకున్న వారి చుట్టూ, దేవతలు ఉండరా? ఒక దేవతను ఉపాసన చేయడం వేరు, యోగమునందు నిలబడి, ఆత్మ తత్త్వాన్ని అనుభూతి చెందడం వేరు. ఉపాసన చేసినంతకాలమే బలం! యోగము ద్వారా ఆత్మతత్త్వాన్ని పొందిన వాళ్ళు, తాము అది అయిపోవడం వల్ల, పడిపోవడం ఉండదు. అందుకనే శ్రీకృష్ణుడు అర్జునుడ్ని 'యోగీ భవ అర్జునా!' అంటాడు. యోగి

అయిపోవడం అంటే వాడితో యోగం చెందు, కలిసిపో, విడిపడక. వేరే పెట్టుకోబోక! మిగతా వాళ్ళందరూ మన చుట్టూ ఉంటారు. కృష్ణుడు చుట్టూ అందరూ ఉన్నారు కదా. రాముడు చుట్టూ అందరూ ఉన్నారు కదా. ప్రహ్లాదుడి చుట్టూ పంచభూతాలు అన్ని co-operation ఏ కదా. అది యోగం! అందుకని యోగం ద్వారా వీటన్నిటినీ సాధన చేసుకోవచ్చు తల్లీ అంటాడు కపిలుడు. దేవహూతి అంతటి స్థితిలో ఉన్నా, ఆవిడ కూడా కోరింది 'నాకేమీ తెలియదు నాన్నా, నాకు ఏదైనా దారి చూపించూ, మీ నాన్నగారు నువ్వు దారి చూపిస్తావని నిన్ను నాకు అప్పజెప్పి వెళ్లారూ, నువ్వే నాకు వెలుగుకి దారి', అంటుంది. 'నాకు కొంత తెలుసు, ఇక మిగతాది మీరు చెప్పండి' అన్నట్లుగా అడగకూడదుట గురువుగారి దగ్గరికి వెళ్ళినప్పుడు. దేవహూతి కపిలుడి దగ్గరకు ఎట్లా వెళ్లిందో బాగా మనం చదువుకోవాలి. అట్లా చదువుకోవాలి, గబగబా పుస్తకం చదివేశాము, అయిపోయిందండి ఇంక next ఏమి చదవమంటారు? అంటే వీడేమీ చదవలేదని అర్థం. దేవతలు కూడా తను పిలిస్తే వచ్చే స్థితిలో ఉన్న ఆవిడ, కొడుకు ఏడేళ్ల వాడు గురువు! వాడి దగ్గరికి, ఆ గొట్టికాయగాడి దగ్గరికి అంటాం, ఎటువంటి శ్రద్ధా భక్తులతో దరిచేరిందో, మనం అందులో చదువుకోవాలి. ఇంతదైనప్పటికి కూడా 'నాకు ఏమీ తెలియదు, నువ్వు సమస్తం తెలిసినవాడివి, నాకు నువ్వు దారి చూపించు' అని అడిగిందండీ! మనం? ఇంతవరకు నాకు తెలుసు ఆపైన మీరు చెప్పండి అంటాము. అది అహంకారానికి చిహ్నం! శ్రద్ధాభక్తులకి చిహ్నం కాదు. కపిలుడు కూడా కొంచెం చెప్పి మధ్యలో, ఆమెకు సాధనలో ఆకళింపు అయ్యేంతవరకు మౌనం ప్రసాదించేవాడు. అంటే మళ్ళీ చెప్పేవాడు కాదు. మళ్లీ మౌనం ప్రసాదించేవాడు. మళ్లీ చెప్పేవాడు, మళ్లీ మౌనం ప్రసాదించేవాడు. ఈ విధంగా ఆవిడకి ఆయన జ్ఞాన బోధ చేసి, తర్వాత తన దారిన తాను వెళ్తాడు. ఆవిడ కోసం చేసినా మనందరికీ కూడా అది లభ్యం అయింది. ఈ భూమి మీద మొట్టమొదటి గురువు కపిలుడు! ఈ రోజున మనం California అంటున్నామే, ఆ ప్రాంతం అంతా కూడా కపిలుడు నివసించిన స్థానం. అందుకని ఆ ప్రదేశానికి ఒక ప్రత్యేకత ఉంది. కపిలుడు దేవహూతికి ఇచ్చిన జ్ఞానం గురించి చెప్తూ, కృష్ణుడిని చూసి, భీష్ముడు 'నువ్వే కపిలుడివి కదా' అంటున్నాడు. అదీ ఆయన దర్శనం! కపిలుడు భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యాలు ఇచ్చాడు. ఒకటి. రెండవది ప్రకృతి యొక్క స్థితులను అన్నీ కూడా చక్కగా వివరించి చెప్తాడు తల్లికి. ఏడు లోకాలు ఏర్పడినాయి కదా. మళ్లీ ఏడు లోకాలలోనూ ఒక్కొక్క లోకంలో ఏడు లోకాలు ఏర్పడినాయి కదా. ఈ లోకాలన్నీ ఎట్లా ఏర్పడినాయి. ఈ లోకాల్లో భగవత్తత్త్వం ఏ విధంగా, వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలుగా దిగి వచ్చిందో అది చెప్తాడు. 'ప్రకృతిగా కనిపించేదంతా కూడా భగవత్తత్త్వం యొక్క రూపమేనమ్మా, సృష్టిని, భగవంతునితో విడదీసి చూడకూడదు' అని చెప్తాడు. ఇవన్నీ స్థితి బేధాలు అని చెప్పడమే కాదు, సృష్టిలో ఆ ప్రజ్ఞగా తను నిలిచిపోయి ఉన్నాడు. కపిలుడు అంటే ఈ రోజున మొత్తం సృష్టిలో, సూక్ష్మ పదార్థం

నుండి స్థూలపదార్థం వరకు ఏర్పడిన ఈ అలమార్లు అలమార్లుగా, గుమ్మాలు గుమ్మాలుగా ఉంటాయి చూశారా, అట్లా విడదీసి ఉంచే ప్రజ్ఞగా ఉండిపోయాడు. మనలో కూడా అట్లా ఉన్నాడు. ఆ విడతీయడంలో ఆయన దగ్గర ఉండే శక్తి సంఖ్య! సంఖ్యా శక్తి! సృష్టిలో ఉండే సంఖ్యాశక్తి కపిలుడు! అందుకని ఆయన చెప్పింది 'సాంఖ్యము' అంటారు. మనలో కూడా సంఖ్యా జ్ఞానంగా ఉండిపోతాడు. మనలో కూడా ఏడుపొరల యొక్క శరీరాన్ని, సప్త ధాతువుల్ని, వాటి యొక్క నిర్మాణం, తర్వాత మనలో రెండు కళ్ళు, ఒక ముక్కు, రెండు రంధ్రాలు ముక్కుకి, ఒక నోరు, పై పెదవి, కింద పెదవి, 32 పళ్ళు, ఇట్లా అన్నీ సవ్యంగా ఏర్పడేట్టుగా కూడా మనలో ఉంటాడు. ముందు మనలో పిల్లవాడు పుట్టడానికి శుక్రం ఎప్పుడయితే స్త్రీ గర్భంలోకి వెళ్తుందో, అక్కడినుండి number consciousness గా పనిచేసి, అన్నీ ఆ అంకెల ప్రకారమే తయారుచేసి, తర్వాత మన వెన్నెముకలో సుషుమ్న లోకి వెళ్లి అక్కడ ఉండిపోతాడట ఆయన. అదీ కపిలుడు! అందరిలోనూ ఉన్నాడు. అందరిలోనూ పదార్ధ లోకములు భూః, భువః, సువః, మహః, తపో, జనో, సత్యలోకాలు ఉన్నాయి. ఇన్ని లోకాలుగాను ఏర్పరుస్తుంటాడు. అంటే ఏడు కేంద్రాలకి అధిపతిగా ఉంటాడు మనలో. వాటి నుండి ఏడు లోకాలూ మనలో నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమం నిర్వర్తిస్తూ ఉంటాడు. అది కారణంగా సప్త ధాతువులూ చక్కగా పనిచేసి శరీర నిర్మాణానికి, అంటే ఒక మనిషి శరీరానికి, ఒక సృష్టి నిర్మాణంలో ఏడు లోకాలు ఏర్పడడానికి ఉన్న ప్రజ్ఞ కపిల ప్రజ్ఞ! అది కపిలుడంటే. అలా దిగి వచ్చాడు సృష్టి మొదట్లో. దిగివచ్చి, కర్దముడి ద్వారా వచ్చి, సృష్టి కాస్త, బురదగా ఉన్నది గట్టిపడుతున్న సమయంలో వచ్చిన మొట్టమొదటి గురువు ఈ భూమికి. అదే రాశాను 'సాంఖ్య పుస్తకం' లో. ఈ భూమికి మొదటి గురువు కపిలుడని! ఇది నాకు తెలిసి కాదు, మాస్టర్ గారు రాసి ఇచ్చారు. ఇంగ్లీషు చదువుకునే వాళ్ళకి పనికొస్తుందని రాశాను. కపిలుడి నుండి సమస్త జ్ఞానం ఒక్కసారి, భూమి మీద ఇవ్వబడింది, మొట్టమొదటి జాతికి. అందుకనే గురువులని తలుచుకుంటే కపిలుడిని తలుచుకోవాలి, అందరికన్నా ముఖ్యంగా ఈ భూమి జీవుల వరకు. కాబట్టి ఆ కపిలుడివే నువ్వు అని చెప్తున్నాడు కృష్ణుడు గురించి భీష్ముడు. మనము కపిలుడి గురించి గుర్తు పెట్టుకున్నప్పుడు దేవహూతిని గుర్తుపెట్టుకోవాలి. ఆమెకున్న లక్షణాలు మనకు లేకపోయినా, ఆమెకున్న శ్రద్ధా భక్తులతో ఎటువంటి పద్ధతులతో గురువు దగ్గరికి ఆమె వెళ్ళింది? సొంత కొడుకే అయినప్పటికీ. ప్రకృతి యొక్క వివిధములైన అవతార తత్వాలు అన్నీ ఇచ్చాడు. పరాప్రకృతి నుండి స్థూల ప్రకృతి వరకు, మొత్తం ఏ విధంగా పదార్థం విభజించబడుతుందో లోకాలుగా ఇచ్చాడు. ఆ తరువాత భక్తి గురించి చెప్పాడు. ఆ తర్వాత జ్ఞానం చెప్పాడు. ఆ తర్వాత యోగం చెప్పాడు. వైరాగ్యం లక్షణాలు ఎట్లా ఉంటాయో చెప్పాడు. ఇదీ కపిలుడు! ఇవన్నీ కృష్ణుడు చేసి చూపించాడు. అన్ని లోకాల్లోనూ తను వెళ్లొచ్చాడు. భక్తిశ్రద్ధలు ప్రదర్శించాడు. యోగాన్ని ప్రదర్శించాడు,

యోగశక్తులనీ ప్రదర్శించాడు. వైరాగ్యాన్ని ప్రదర్శించాడు. జ్ఞానాన్ని ప్రదర్శించాడు. కాబట్టి కపిలుడు! ఇట్లా నాలుగూ అందరిలోనూ ఉండవు, గుర్తుపెట్టుకోండి. భక్తి మాత్రమే ఉండి జ్ఞానము లేనివాళ్ళు చాలామంది ఉంటారు. ఈ జ్ఞానము మాత్రమే ఉండి, యోగము లేనివాళ్ళు చాలామంది ఉంటారు. భక్తి జ్ఞానములు ఉన్నా, వైరాగ్యం లేనివాళ్ళు ఉంటారు. నాలుగూ కలిస్తేనే అక్కడ పరిపూర్ణత! అందుకు కపిలుడు! 'కపిల' అనంగానే ఈ నాలుగూ గుర్తుకు రావాలి. వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ వ్యూహాలలో భగవత్తత్త్వం మన యందు, మన చుట్టూ ఉండే సృష్టిలో ఎట్లా ఉన్నదో కూడా చూపిస్తాడు. ఈ నాలుగు వ్యూహాలని చక్కగా అవగాహన చేసుకోవాలి. గుర్తుపెట్టుకోండి, భక్తి అంటే ఏదో ఎప్పుడూ ఏదో గోల చేసుకోవడం కాదు, మనోవికాసం కలగాలి. మనో వికాసం జ్ఞానం వల్ల మాత్రమే కలుగుతుంది. జ్ఞానం పవిత్రీకరించినట్లుగా ఇంక ఏదీ పవిత్రీకరించలేదు ఈ సృష్టిలో అని శ్రీకృష్ణుడే చెప్పాడు. 'నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహవిద్యతే'! జ్ఞానం పవిత్రీకరించిన విధంగా ఇంక ఏదీ కూడా పవిత్రీకరించలేదు. అని చెప్పాడు. అందుకని జ్ఞాన సముపార్జనము అనేది daily, దైనందిన కార్యక్రమంలో భాగం అవ్వాలి. ఏం తెలుసుకున్నావు? ఇప్పుడు తెలుసుకున్నది సరిపోయిందా? మాస్టరు గారి గురించి ఏమి తెలుసుకున్నాం? గురుపరంపర గురించి ఏమి తెలుసుకున్నాం?, భగవత్తత్త్వం గురించి ఏం తెలుసుకున్నాం? సృష్టి గురించి ఏమి తెలుసుకున్నాం? ఎన్ని ప్రశ్నలు ఉంటాయి తెలుసా తపన ఉన్నవాళ్లకి? ఊరికే సంతృప్తి చెంది అట్లా తిరగడం అనేది ఉండదు. మన పరమ గురువుల మార్గంలో ఎప్పుడయ్యా తృప్తి అంటే, నీ నుండి వాడు పని చేస్తుంటే అప్పుడు తృప్తి! అంతవరకు తృప్తి లేదు. అప్పుడు కూడా నీవు వాడైపోయేంతవరకు వాడు తృప్తి చెందడు. అలా కాని ప్రతిరోజు కూడా ఈరోజు ఈ విధంగా అయిపోయింది కదా, నేను నీయందు నిలబడలేకపోతిని కదా, మళ్లీ ప్రయత్నం చేస్తాను అనుకుంటాదట సరైన సాధకుడు. అట్లా ఉంటుంది మహర్షి.

## 553 కృతజ్ఞుఁ

కృతజ్ఞత! అది దైవీ లక్షణాల్లో చాలా ముఖ్యమైన లక్షణం. చిన్న మేలు చేసినా, జన్మల తరబడి గుర్తుపెట్టుకునే తత్త్వం ఉందే, అది దివ్య గుణాల్లో చాలా ముఖ్యమైన గుణం. మామూలుగా, పెద్ద పెద్ద ఉపకారాలు పొందినా, చిన్న ఉపకారం అడిగినప్పుడు చేయకపోతే, ఆ మొత్తం మర్చిపోతాం మనం. బోలెడు ఉపకారాలు పదుల సంవత్సరాలు పుచ్చుకుని, ఏదో ఒక్కసారి అడిగింది చేయలేదు కాబట్టి, వాడి మీద కోపం వచ్చేస్తుంటుంది. అది మన పరిస్థితి. భగవంతుడి పరిస్థితి ఏమిటయ్యా అంటే, చిన్న మంచి పని, ఇంకో జీవుడికి వీడు చేస్తే ఆయన గుర్తుపెట్టుకుని వెంటనే ఏదో ఒకటి చేస్తాడటండీ, మర్చిపోడట. మనకి, సాంప్రదాయంలో ఏమి ఇచ్చారంటే, ఎవరింటి కన్నా వెళ్లి ఒక్కసారి వాళ్ళింట్లో నువ్వు గనుక భోజనం చేస్తున్నట్లయితే ఒక భావన చేసుకోమని చెప్పారు. 'ఈరోజున ఈ ఇంట్లో భగవంతుడు నాకు వీరి ద్వారా భోజనం ఇచ్చాడు కాబట్టి, కలకాలం ఈ ఇంట్లోవారు తరతరాలుగా, వృద్ధి పొందుతూ ఉండాలి. భగవంతుని యొక్క కరుణాకటాక్షాలు వీళ్ళ మీద ఉండాలని భావన చేయమని' చెప్పారు. అది మన సాంప్రదాయం. మన పరిస్థితి ఎట్లా ఉంటుందంటే 'అంత బాగా వండలేదండి, ఏదో అంతంతమాత్రంగా తిన్నాను, లేకపోతే ఇది ఎక్కువైంది అది తక్కువైంది' ఇలా అనుకుంటూ ఉంటాం. కదా. భగవంతుడుట మీరు చిన్న ధర్మాన్ని ఒకటి నిర్వర్తిస్తే, దానికి పెద్ద ఉపకారం చేయడానికి సిద్ధంగా ఉంటాడట. అది, ఎవరి యందు ఉందో వాళ్ల యందు దైవీలక్షణం ఉన్నట్టు. ఆ రూపంలో భగవంతుడు ఉన్నట్టు. ఎంత కృతజ్ఞత! శిశుపాలుడిని చంపేటప్పుడు, చక్రం వదిలితే, వేలు నుండి రక్తం వచ్చింది కొంచెం, కృష్ణుడికి! అప్పుడే రాజసూయం చేసి, ఇక చివరి రోజు అంటే ఎంత మంచి పట్టుబట్ట కట్టుకుని ఉండాలి, ద్రౌపది? అద్భుతమైన చీర, మొత్తం అప్పటివరకు ఉన్న వాటిలోకెల్లా best చీర కట్టుకుని ఉండాలి. కృష్ణుడికి వేలు నుండి రక్తం వచ్చినప్పుడు అంతమంది ఉన్నారు అక్కడ. సభ నిండా జ్ఞానులు ఉన్నారు. ఎందుకో పాడిమైతుకుల్లాగా ఉంటారు జ్ఞానులు. నారదుడు కూడా ఉన్నాడు. ధర్మరాజు ఉన్నాడు, మనమంతా బాగా డప్పుకొట్టుకునే అర్జునుడు ఉన్నాడు, ఎవరికీ అనిపించలా! అట్లా చూస్తూ ఉండిపోయారట. అది చూడండి. ఆమె అందరికన్నా ముందు, తన కట్టుకున్న చీర కొంగు చింపి, కృష్ణుడి వేలుకి కట్టింది ద్రౌపదీ దేవి! ఆ వేలుకి వచ్చిన రక్తం అంత ఎక్కువ కాకపోవచ్చు. అదేమీ పెద్ద విషయం కాకపోవచ్చు. కానీ ఆమెకి ఆయన యందున్న అనురాగం, భక్తి, ప్రేమ ఎటువంటివంటే వెంటనే చీర కొంగు చింపేసి, తీసి వేలుకి కట్టేసిందట. 'ఏం పెద్ద గొప్ప, వేలికి గుడ్డ కడితే' అని అనుకోవచ్చు. కానీ ఎంత చేశాడు దానికి ఈయన? ఈరోజున ఈ వేలికి గుడ్డ కట్టించుకున్న వాడు, ఆమెకి చేసిన

ఆ రక్షణ, మనం ఊహించగలమా? ఈరోజుకి కూడా ద్రౌపదీదేవికి జరిగిన ఆ సన్నివేశం తలుచుకుంటే గుండె ఉన్నవాడికి ఎవడికైనా కళ్ళెంబడి నీళ్లు వస్తాయి. లేనివాడి సంగతి చెప్పలేం. అటువంటి స్థితిలో తను ఎక్కడో ఎవడో సాళ్వుడు అనే ఒక రాక్షసుడితో యుద్ధం చేస్తూ ఉంటాడు కృష్ణుడు. చేస్తూ ఉంటే ఈవిడ చేసిన ఆక్రందన తను విని, ఆమెకు వస్త్రదానం చేస్తాడు. అట్లాగే దుర్యోధనాధులచే వదలబడిన ఒక బాణం లాంటివాడు దుర్వాసుడు, వస్తే ఆమె ప్రార్థించింది. ఎక్కడున్నాడో అప్పుడు కృష్ణుడు తెలుసా! శ్రీకృష్ణుడు వీళ్లు అరణ్యవాసం చేస్తుంటే, పన్నెండేళ్ళు తపస్సు చేస్తాడు. ఎందుకని? ఆ తర్వాత జరగబోయే సన్నివేశం, భౌగోళికమైన సన్నివేశం. ధర్మం కోసం తను నిలబడాల్సిన సమయం. ఆ తపస్సులో ఉన్నవాడు బయటకు వచ్చి, ఆమెకి మళ్లీ అక్షయపాత్రలో కావాల్సినవన్నీ ఏర్పడేట్టు చేసి మళ్లీ తపస్సుకి వెళ్ళిపోతాడు కృష్ణుడు. మనం తపస్సు చేసుకుంటుంటే nuisance, మాటిమాటికి పిలుస్తారు, మనం చేసేదే పావుగంట prayer, అందులో ఏవో వస్తువులుంటాయి. ఆయన తపస్సు కన్నా, ఆమె యొక్క సంరక్షణ ముఖ్యం, అని వెళ్ళిపోయాడంతే! కృతజ్ఞత! గుహుని యందు రామునికి ఉన్న కృతజ్ఞత! సుగ్రీవుని యందు రామునికి ఉన్న కృతజ్ఞత! మనం ఊహించలేం. అది చదువుకోవాలి. కృతజ్ఞతా లక్షణం భగవంతుని యందు, భగవంతుని భక్తుల యందు, ఏ విధంగా ప్రకటింపబడింది అనేది గమనించాలి. ఒక్క చిన్న ఉపకారం జరిగితే జన్మల తరబడి దానికి కృతజ్ఞుడిగా ఉండడం అనేది భగవత్తత్త్వం. ఎన్ని చేసినా ఇంకా చేయలేదు అనడం, చేసిన వాటిల్లో ఇంకా ఏవో పొరపాట్లు చూపించడం, అన్నీ చేసి ఒకటి చేయకపోవడం వల్ల, ఇదివరకు చేసినవి కూడా మరచి తిట్టడం. చేస్తాం. సామెత కూడా ఉంది. 'పెట్టనమ్మ ఎట్లాగూ పెట్టలేదు, పెట్టే ----కేమొచ్చింది' అన్నాడట వాడెవడో, ముష్టివాడు. రోజూ ఒక ఆవిడ అన్నం పెడుతోందిట. ఒక ఆవిడ రోజూ పెట్టనే పెట్టట్లేదు. పెట్టనావిడ బాగానే ఉంది, ఈ పెట్టే అమ్మ ఒకరోజు పాపం పెట్టలేకపోయింది, పెట్టలేదుట అందుకని ఆవిడ --- అయిపోయింది వాడి దృష్టిలో. కృతజ్ఞత అనేది లేని చోట భగవంతుడు సంతోషించడు. చాలా ముఖ్యమైన విషయం అది! మనకు ఎవరన్నా చిన్న ఉపకారం చేసినా, చాలా గుర్తుపెట్టుకుని, ఎప్పుడన్నా అవకాశం దొరికితే మళ్ళీ చేయాలి. చేస్తున్న కొద్ది ఊరికే ఉపకారాలు పొందుతూ ఉండడం కాదు. మనలో దైవీ లక్షణం పెరుగుతూ ఉండాలంటే కృతజ్ఞతా భావం బాగా పెరగాలి. ఇప్పుడు మనం ఉండే కాలం ఎలాంటిదంటే తల్లిదండ్రుల యందే మనకి కృతజ్ఞతా భావం ఉండదు. మనకి ఉన్నదా కృతజ్ఞత అనేది ముఖ్యం. రాముడి కృతజ్ఞత అద్భుతంగా ఉంటుంది. కృష్ణుడి యొక్క కృతజ్ఞత చాలా అద్భుతంగా ఉంటుంది. వాళ్ళు పరాకాష్ఠ. భగవత్ భక్తుల యొక్క కృతజ్ఞత అట్లా ఉంటుంది. విభీషణుడి యందు కృతజ్ఞత రాముడికి. ఉడత యందు కృతజ్ఞత? ఉడతకన్నా ఎక్కువ చేయగలిగి కూడా, మనం 'ఏదో ఉడతా భక్తి sir' అంటాం. నిజంగా ఉడత అంతే చేస్తాం మనం, మనిషయ్యుండి! ఆ ఉడత స్ఫూర్తి ఎంతో చూడండి! సముద్రం

మీద వంతెన నిర్మాణానికి అది సాయం చేయడం ఏమిటండి? మహామహులందరూ సముద్రం మీద వంతెన తయారు చేస్తుంటే, తన వంతు ఆ ఇసుకలోకి వెళ్లి గబగబా పోర్లేసి వచ్చి, ఆ ఇసుక తీసుకెళ్లి సముద్రంలో పడేస్తుంది. మళ్లీ వచ్చి మళ్లీ ఇసుకలో పొర్లి మళ్లీ అక్కడికి వెళ్లి ఆ నీళ్లలో, ఈ ఒడ్డున ఉన్న ఇసుక ఆ సముద్రంలోకి వేస్తుంది, వంతెన నిర్మాణానికి! ఎంత కృషి చేసిందంటే అసలు ఎక్కడా, ఆకలి దప్పులు కూడా మర్చిపోయి చేసిందట రాముడి కోసమని! ఎవడూ చూడలేదు. Busy గా ఉన్నారు, ఎవరు పట్టించుకుంటారు, మనం బోలెడు పెద్ద పెద్ద పనులు చేస్తున్నాం కదా, చాలా busy గా ఉంటాం. చిన్నవాళ్ళని అస్సలు పట్టించుకోము. వాడు తిన్నాడో లేదో కూడా పట్టించుకోము, వాడికి ఉందో లేదో, వాడు కట్టుకున్నాడో లేదో, మనకేమీ సంబంధం లేదు. ఎందుకంటే మనం చాలా పెద్దపెద్ద విషయాల్లో, ఏటీ, శారమేయ మండలం, సప్తర్షి మండలం కృత్తికా మండలం అక్కడి నుండి CVV గారి energy ఎలా వచ్చింది, ఇవి చెప్పకోవడం లో ఉంటాము తప్ప, ఇంట్లో వాళ్ళు అన్నం తిన్నారో లేదో కూడా చూడం. అందరూ చాలా హడావిడిగా ఉంటుంటే రాముడు ఒక్కడే చూశాడటండీ! అంటే ఎంత చిన్న జీవి అయినా చేసిన ఉపకారం చూడగలిగిన తత్త్వం, భగవత్తత్త్వం! చూసి, ఆనందం పట్టలేక, చేతిలోకి తీసుకుని ఒకసారి వీపు నిమిరాడట. అందుకని అక్కడ మూడు చారికలు పడ్డాయి అనేది కథ చెప్పారు. అది రాముని యొక్క కృతజ్ఞతా లక్షణం! ప్రతి వాళ్ళ యందూ అట్లా ఉంటాడు రాముడు. కృష్ణుడు కూడా అట్లాగే ఉంటాడు. భగవద్భక్తులందరూ కూడా అట్లా ఉంటారు. చిన్న మేలు మీరు చేయండి ఒక మహాత్ముడికి, జన్మజన్మలకి సరిపడా మీకు స్ఫూర్తినిస్తాడు. భోజనం పెట్టండి, తాను మీ ఇంట్లో అడుగు పెట్టినప్పుడు మీరు చూపించిన ప్రేమా, భక్తి, ఆదరం బట్టి, ఎంత దొరుకుతుందో. ఒక మహాత్ముడు మన ఇంటికి రావడం ఒక అద్భుతమైన విషయం. మన ఇంట్లో ఉన్నాడట అంటే అది మరీ అద్భుతమైన విషయం. తరతరాలకి ఆశీర్వచనం ఇస్తారు మహాత్ములు. ఏదో ఆరోజు మన ఇంట్లో కాఫీ తాగారు, అనే point కాదు. అసలు మన ఇంటికి ఆయన రావడమే భగవంతుని యొక్క ఆశీర్వచనం! అనుగ్రహం! ఏ ఇల్లు అయితే భగవద్భక్తుల చేత పావనం చేయబడుతుందో తరచు, ఆ ఇంట్లో ఏడు తరాల వరకు ఏ విధమైన లోటు ఉండదు. అంత ఆశీర్వచనం ఉంటుంది ఎందుకంటే భగవంతుడే స్వయంగా వస్తాడు, భగవద్భక్తుడి రూపంలో. భగవంతుడి అనుగ్రహం చేత వాళ్లు మన ఇంటికి వస్తారు తప్ప మనం పిలిచామని, లేకపోతే ఏదో చాలా ఉందని రారు. అంటే మనం చాలా భక్తులమని కాదు. అనుగ్రహం లెక్కగా వాళ్ళు వస్తారు. వస్తే, మీరు ఇచ్చిన ఒక్క కాఫీయో, వక్కపొడో, ఒక పూట టిఫినో, ఒకసారి పెట్టిన భోజనమో ఆధారంగా వాళ్ళు నీకు ఎన్ని రకములైన బంధాల నుండి తొలగించడానికి అక్కడ పునాది వేసి వెళ్తారో మనకి అసలు అవగాహన ఉండదు. అట్లా ఉంటుంది వాళ్ళ కృతజ్ఞత! మనం ఊహించలేం భగవద్భక్తులు ఇంటికి వస్తే ! భగవంతుడే వస్తే? విదురుడి ఇంటికి వెళ్ళాడు

కదా, ఎప్పటి నుండో అడుగుతున్నాడు రమ్మని. దుర్యోధనుడు కృష్ణుడు రాయబారానికి వెళ్ళినప్పుడు 'మా ఇంటికి విందుకి రా' అని పిలుస్తాడు. 'మీ ఇంటికి ఇప్పుడు రాకూడదు లే ఇప్పుడు బాగుండదు. నేను ఇప్పుడు దూతగా వచ్చాను కదా' అని, తనే కోరి విదురుడి ఇంటికి వెళ్తాడు. వెళ్తే అక్కడ తిన్నదేంటి విదురుడి ఇంట్లో? అరటిపండు తొక్కలు! అరటిపళ్ళు కూడా కాదు. విదురుడేమో, కొంచెం జ్ఞాని, కొద్దిగా intellectual కదా. ఈయన కోసం పాలు, వెన్న ఇటువంటివన్నీ ఏదో పోగేసుకు రావాలని వెళ్లి తెచ్చి, ఇంట్లోకి వెళ్ళంగానే, ఇంటావిడ ఆనందం పట్టలేక ఏం చేస్తుందయ్యా అంటే కృష్ణుడికి అరటి పళ్ళు తన ఇంట్లో ఉంటే అవి పెట్టే పారవశ్యంలో, పండు కింద పడేసి తొక్కు అందిస్తూ ఉంటుంది. ఆయన తొక్కు తినేస్తూ ఉంటాడు. తొక్కా, పండా అనేది మనబోటి వాళ్లకి గాని భగవంతుడికి ఉండదు. ఆవిడ పెడుతున్నది ప్రేమ, భక్తి కదా. అది ఆయన అందుకుంటున్నాడు అంతే! సరే మన మహాజ్ఞాని అన్నీ పోగేసుకుని, బుట్టనిండా వేసుకొని ఇంటికి వచ్చేసరికి, ఇంట్లో scene ఏమిటయ్యా అంటే భార్య తన్మయత్వంలో అరటిపండు ఒలిచి, పండు పారేసి, తొక్క పెడుతోంది. ఆయన అంత పారవశ్యంలో దాన్ని తింటున్నాడట. 'అపచారం అపచారం' అన్నాడు. అంతవరకు ఆవిడకు తెలియలేదు పండు బదులు తొక్కలు పెడుతున్నట్లు. 'ఏం అపచారం లేదు, మీ ఇంట్లో తింటానంటే ఇవి తినడానికే వచ్చాను, ఇది పొందడానికే వచ్చాను, ఇందులో ఉండే మాధుర్యం నీకు తెలియదులే' అని చెప్పి ఆరోజు ఆ భోజనం పెట్టిన కారణంగా మర్నాడు ఆయనకు ఉద్యోగం తీయించేస్తాడు. ఎందుకని? ఆయన్ని ఉద్ధరించుకోవాలని! ఎందుకంటే, భార్య ఎట్లాగూ ఉద్ధరింపబడ్డది. ఈయనకి ఉద్ధరింపబడటానికి ఈయనకున్న జ్ఞానమే అడ్డం. జ్ఞానులకు చాలా కష్టం. భక్తులకు ఒక విధంగా సులభం. భక్తుడు ముందయ్యి, జ్ఞానము తర్వాత సముపార్జన చేసుకుంటే బతికి పోతాడు. ముందు జ్ఞానం తెచ్చుకున్న వాడికి భక్తి రాదు. అహంకారం వస్తుంది. అదే పరిస్థితి విదురుడికి! అందుకని మరి వాళ్ళ ఇంట్లో భోంచేశాం కదా మరి వాళ్ళకి ఏదన్నా చేయాలి కదా మనం. ఆ ఉద్దేశంతో మర్నాడే CVV గారి లాగా, ఉద్యోగం తీయించేశాడు. CVV గారికి దణ్ణం పెట్టుకున్నా అట్లాగే జరుగుతూ ఉంటుంది. సద్యోఫలితం అన్నమాట ఇంకో పద్ధతిలో! మనం ఒకటి అనుకుంటే ఆయన దానికి opposite గా చేసి, ఆ-- కానీ రా, అంటాడు. ఇప్పుడు తెలియదు అది, long runలో తెలుస్తుంది. ముప్పై ఏళ్ళకు తెలిసింది విదురుడికి. ఉద్యోగం తీయించేస్తే, రోషం వచ్చింది. కోపం వచ్చింది, ఏవేవో మాట్లాడాడు. నానా గొడవలు పడ్డాడు. ముప్పై ఆరేళ్లకు మళ్ళీ తెమిలి, మైత్రేయుని ద్వారా కృష్ణుని యొక్క, స్పర్శ, ఆశీర్వచనం, అనుగ్రహం అన్నీ పొందుతాడు. అంటే 36 ఏళ్ళు ఈయనలో ఉండే అహంకారాన్ని అంతా బాగా క్షాళనం చేసి, మనిషిని మృదువుగా తయారు చేసి, వినయం వచ్చేట్టుగా చేసి, భక్తి పెరిగేట్టుగా చేసి, భక్తికి పరాకాష్ఠ అయిన ఉద్ధవుడిని కలిపి, ఉద్ధవుడి ద్వారా విదురుడికి ఇంకా చాలా చెప్పించి, పూర్తిగా వెన్న ముద్ద లాగా

తయారు చేసిన తర్వాత, మైత్రేయుడికి అందిస్తే, మైత్రేయుడు కృష్ణ స్పర్శ ఇస్తాడు. ఇదీ కృతజ్ఞతకి లక్షణం! మనం ఇవాళ వెళ్ళి దణ్ణం పెట్టుకున్నాం, రేపేదో అయిపోవాలి అనుకుంటాం. ఏమిటి అయిపోవాలి? నువ్వు చైతన్యవంతుడివి అవ్వాలనేదే వాళ్ళ సంకల్పం! తద్వారా బంధ విముక్తుడివి కావాలి. వాళ్లు ఊరికే scavenging పనికి రారు. నువ్వు పెట్టిన కుప్పలు, నీ చేత ఊడిపించడానికి, నీకు కావలసిన ఆత్మస్థైర్యం, దానికి సంబంధించిన వికాసం ఇస్తారు. అది పట్టుకుని మనం ఊడ్చుకోవడమే! 'మా ఇంట్లో కాస్త ఊడ్చి పెట్టండి సార్' అంటే కుదరదు, అసలు ఊడ్చుకోవడానికి కుప్పలు ఉన్నాయని కూడా మనకు తెలియదు. లోపల చైతన్యవంతుడిని చేసి, ముందు కుప్పలు చూపిస్తారు.. కుప్పలు ఎట్లా ఊడ్చుకోవాలో కూడా నేర్పుతారు. ఇంత ఉంటుంది కృతజ్ఞత లక్షణంలో! ఒకసారి ఊరికే వాళ్ళు కుప్పలు ఊడిస్తే, మనం మళ్ళీ పిలుస్తాము 'మళ్ళీ కుప్పలు పేర్చాం రండి' అని. కృష్ణుడు అదే చెప్తాడు 'నీకు ఊడ్చి పెట్టడానికి రాలేదు నేను, ఎట్లా ఊడ్చుకోవాలో చెప్పడానికి వచ్చాను' అని. అందుకని భగవంతుని కృతజ్ఞతా లక్షణం భగవదవతారాల్లో చూడొచ్చు. భగవత్ భక్తుల జీవితంలో చూడొచ్చు. మాస్టరు గారు అట్లా చేశారు. ఎట్లా చేశారో మనకు ఏమీ తెలియదు ఇంకా. ఇవాళ చేసింది, సరిగా సాధన చేసుకుంటే 12 జన్మల తర్వాత తెలుస్తుంది. 12 జన్మలకి, మాస్టర్ EK అంటే ఏమిటో తెలుస్తుంది. అట్లా చేశారాయన! ఇప్పుడు ఏమీ తెలియదోయ్ అని చెప్పారు. మరి తెలియకపోతే ఎట్లా మాస్టారు? అంటే తెలియకపోతే ఏం? అనేవారు. నేనేం చేస్తున్నానో నీకు తెలియకపోతే ఏం, నేనేం చేయాలో, అది చేస్తున్నాను. ఊరికే డబ్బాలు కొట్టుకుని, నీకు అది చేశాను, నీకు ఇది చేశాను, అని చెప్పుకునే, పద్ధతి కాదు. ఎందుకని అంటే నిజంగా నిన్ను యోగమునందు నిలబెట్టి, తద్వారా నీకు క్షేమం కలిగించడం అనేది వాళ్ల సంకల్పం. అందుకని ఆయన నేను ఎవరి గుమ్మం ఎక్కినా, వాళ్లు ఈ మార్గంలోకి రాక తప్పదు, ఎవరిని చూసినా వాళ్ళు ఈ మార్గంలోకి రాక తప్పదు. ఏమిటి ఈ మార్గం? ఋషి మార్గం! సనాతన మార్గం! ధర్మ మార్గం! దానికి కావాల్సిన కుంపటి, అక్కడ వెలిగించి వెళ్ళిపోతారు. ప్రస్తుతం ఆ కుంపటి, మండకపోవచ్చు. కానీ మండుతుంది. తద్వారా వంట జరుగుతుంది. ఎన్నో జరుగుతాయి. 12 జన్మలకు మళ్లీ, అట్లా చూసి వెళ్ళిపోతారు. విత్తనాలు వేయడం అంటే అట్లా వేయాలి. ఇవాళ విత్తనం వేసేసి రేపు పండు వచ్చేసిందా లేదా అని చూసుకోరు. ఎందుకు చేశారు? ఎప్పుడో ఒకసారి మీరు కాఫీ ఇచ్చి ఉండొచ్చు, లేకపోతే సరదాగా ఒక సిగరెట్టు ఇచ్చి ఉండొచ్చు ఆయనకి. ఆయనతో బస్సులో వెళుతుంటే ఆయనకి టిక్కెట్టు కొని ఉండొచ్చు. ఏది, పావలా టిక్కెట్టు. అంతే కదా సిటీ బస్సులో అంతకన్నా ఏం ఉండేది ఆ రోజుల్లో?. లేకపోతే స్కూటర్ మీద ఒక drop ఇచ్చి ఉండొచ్చు. లేకపోతే సినిమా టిక్కెట్టు తీసుకొని ఉండొచ్చు ఆయన పేర, ఇంతే కదా మనం మహా చేస్తే . అంతకన్నా చేసింది ఏముంటుంది. లేకపోతే మీ ఇంటికి

వచ్చినప్పుడు ఒక కప్పు కాఫీ ఇచ్చి ఉండొచ్చు. తాగుతారు. అది ఆధారంగా అంత చేస్తారట. అది కృతజ్ఞత లక్షణం!

## 554 మేదినీపతిః

మేదినీపతి అంటే, భూమికి భర్త! భూమికి భర్త అంటే సూర్యుడికి అనుసంధానం చేసి చెప్తారు. కృష్ణుడు భూమిని ఉద్ధరించడానికి వచ్చినవాడు. మన శరీరం కూడా మేదినీ యే. దీన్ని కూడా భరిస్తున్నది వాడు, మనం కాదు. పాడు చేస్తున్న వాళ్ళం మనం. భరించేవాడు ఆయన. ఈ శరీరాన్ని, ఆయన భరించి ఉంచితే, దీనికి పతిగా ఆయన ఉంటే, మనం ఏదో పిల్లాటలు ఆడుతున్నాం. ఆయన వెళ్ళిపోతే శరీరం కూడా పక్కకెళ్ళిపోతుంది. చాల్లేవోయ్, వెళ్ళమంటుంది, మనని. దైవము, ఉన్నంతసేపే కదా శరీరం ఉంటుంది. దైవం ఉన్నప్పుడే, జీవుడు బయటికి వచ్చి చూసుకోవడం నేర్చుకోవాలిట. అసలు ఇది దైవానిది అని తెలిసి ఉండడం ముఖ్యం. లింగధారణ అని చెప్తారు కదా మనకి. ఊరికే ఒంటి మీద రుద్రాక్షలు వేసుకుని, దాంట్లో ఒక లింగం పెట్టుకుని, రోజూ దానిని నీళ్లతో తడపడం కాదు లింగధారణ! మహన్యాసంలో ఏం చెప్తారో తెలుసా, ఈ శరీరం అంతా శివుడు నిండి ఉన్నాడు! ఈ శరీరం శివుడిది, ఆయన ఇందులో నన్ను ఉండనిచ్చాడు అని గుర్తు ఉంటే లింగధారణ చేసినట్టు. నీ భావన ప్రతినిత్యం 'ఇది శివునిది, నన్ను ఉండనిచ్చాడు ఇందులో'అని ఉండాలి. లేకపోతే ఏ కుక్కలోనో, పందిలోనో కూడా పెట్టొచ్చు కదా మనని, ఇందులో ఉండనిచ్చాడు. ఇది ఆయనది. ఆయన దాంట్లో మనం ఉన్నాం. మనని కూడా ఉండనిచ్చాడు. 'నన్ను కూడా ఉండమంటావా' అని అడుగుతాడట, మనకిచ్చి! 'ఆలోచిస్తాం సార్, ఏదో ఒక మూల, మీక్కూడా' అంటాం మనం. దేవుడి గూడు ఎంత చిన్నది, మన ఇంట్లో? అంతే ఇస్తాం చోటు, కదా. అసలు అంతలో మనం ఉండి, మొత్తం ఇల్లు ఆయనకి ఇవ్వాలి. మనం ఏదో కొంచెం అది కూడా బావుండదని ఇస్తాం, ఊళ్లో వాళ్ళు మీ ఇంట్లో దేవుడి గది లేదా? అని అంటారేమోనని ఒక చిన్న గూడు దేవుడికి. అసలు దేవుడి గూడు ఏంటి , అసలు దేవుడిదే ఇల్లు. బాబురావు గారి ఇంటికి వెళ్తే అక్కడ ఉంటుంది ఒక slogan. 'Master is the Head of our family ' అని. మనకి గుర్తు చేయడానికి. వాళ్ల భావనలో ఎంత ఉంచుకుంటే, వాళ్లకి అంత ఉంటుంది. భావనలో ఉన్నంతసేపే ఉంటుంది. అట్లాగే నారాయణ కవచం. ఊరికే వల్లిస్తే నారాయణ 'కవచం' అవ్వదు. ఎప్పుడు అవుతుంది తెలుసా ఇది, కవచం? 'ఈ శరీరం నారాయణుడిది, ఇందులో నారాయణుడు ఉన్నాడు, కాబట్టి నేను చాలా భక్తిశ్రద్ధలతో ఇందులో జాగ్రత్తగా ఉంటాను' అని గుర్తుంటే కవచం అయిపోతుంది. ఆ క్షణంలో మర్చిపోతే అది కవచం అవదు, మామూలు తోలు అవుతుంది. కవచం అయితే, రక్షణ! ఇది భగవంతుడిది అని గుర్తు ఉన్న వాడి శరీరానికి ఏ రకమైన అపాయాలు లేవండీ. మనం రక్షించుకుందాం దీనిని, అని రకరకాలుగా రక్ష మంత్రాలు, వగైరాలతో అవుతుందా రక్షణ? పగలూ,రాత్రి నువ్వా దీన్ని రక్షించేది?

నువ్వు తయారు చేశావా, నువ్వు రక్షించడానికి. ఎట్లా రక్షింపబడతావు? ఇది భగవంతుడిది, నన్ను కూడా ఉండనిచ్చాడు దీంట్లో అని గుర్తుపెట్టుకోవాలి. ఇది Boss ది అని గుర్తు ఉండాలి. ఇచ్చిన కారు మనది కాదు కంపెనీది అని గుర్తుందనుకోండి, జాగ్రత్తగా ఉంచమూ? అట్లాగే ఇచ్చిన శరీరం మనది కాదు వాడిది. ఈ శరీరం ఏమిటి, అసలు అన్నీ వాడివే! ఏది వాడిది కాదు? నీ పిల్లలు నీ వాళ్ళా ? వాడివాళ్లు. నీ ఆస్తి నీదా? వాడిది. అంతా వాడిది అని తెలిస్తే, 'గోవింద' ఉంటుంది. అందుకే గుండు! సమస్తానికీ యజమాని వాడు. నీ శరీరానికి, నీకు యజమాని వాడు. ఇది వాడిది అని గుర్తుంటే శరీరం బాగా పనిచేస్తుందిట. అది కూడా చూడండి. తినేటప్పుడు వాడి శరీరానికి మనం భోజనం పెడుతున్నాం అని గుర్తుంటే, చాలా జాగ్రత్తగా తింటాం. అది మన కోసం తినడం కదా. శరీరం కోసం తినడం కాదు, దైవానికి సంబంధించినది కాబట్టి దానికి ఆహారం వేయడం అనేది కాదు, మన కోసం తినడం కదా, అందుకని ఇట్లా ఉంటుంది. మన శరీరం అంటే అది so so గా ఉంటుందండి. వాడి శరీరం అంటే కవచం అయిపోతుందండి. అందుకనే మహాత్ములకి అపాయాలు జరగవు. కూలిపోయేవి కూడా కూలకుండా ఉంటాయి, గుద్దుకు పగిలిపోయేవి కూడా పగలకుండా ఉంటాయి, పగిలినా వారికి ఏమీ కాదు. అట్లా ఉంటుంది. కారణం ఏమిటయ్యా అంటే 'ఇది మనది కాదు వాడిది, మనని ఉండనిచ్చాడు. వాడే రక్షించుకుంటాడు. మనం రక్షించుకోవడం ఏమిటండీ'? ఇదీ ఋషుల మార్గం! ప్రపంచాన్ని రక్షిద్దాం అనుకుంటారు కొంతమంది. పక్కవాళ్ళని రక్షిద్దాం అనుకుంటాడు, వాడు రక్షిస్తాడు. నిన్ను వాడుకుంటే వాడుకుంటాడు రక్షణకి. అంతా వాడిదే! కాబట్టి మేదినీపతి అంటే మన శరీరం దగ్గర నుండి మన ఇంటి వరకు, మన భూగోళం వరకు, అన్ని గోళాల వరకు, అన్నిటికీ వాడే పతి! కృష్ణుడు భారతయుద్ధం లో ప్రతిరోజు యుద్ధం అవగానే సాయంత్రం అర్జునుడ్ని రథం నుండి 'దిగు' అనేవాడుట. ఆయన దిగిన తర్వాత, 'వెళ్లి rest తీసుకో' అని చెప్పి, ఆయన గుర్రాలని నదికి తీసుకువెళ్లి, గుర్రాలకంతా సేద తీరేట్టుగా స్నానాలవి చేయించి, రథానికి అన్నీ సీలలు గట్టిగా ఉన్నాయో లేదో చూసి బిగించుకొని, మళ్లీ పాద్దున్నే అర్జునుడు రథం ఎక్కే సమయానికి శుభ్రంగా తెచ్చేవాడట, Perfect condition లో. అదే కదా చేస్తున్నాడు మనకీ రోజూ! మన రథం, అంటే మన ఈ శరీరం సాయంత్రానికి ఏ కీలు ఆ కీలు ఊడిపోయి ఉంటుంది. ఉసూరుమంటూ వెళ్తాం మంచం మీదకి. పాద్దునకి చక్కగా fresh గా చేసి ఇస్తే, ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని మళ్లీ పాడు చేస్తూ ఉంటాం దాన్ని, ధ్వంసమే! చేస్తే మళ్ళీ రాత్రంతా బాగు చేసేస్తాడు. అర్జునుడు 18 రోజులు యుద్ధం అయిన తర్వాత చివరి రోజు ఆయనకి జ్ఞానోదయం అయిందట. అతను కృష్ణుడితో 'బావా! నాకన్నా ముందే నువ్వు రథం ready చేసి, నేను ఎక్కడానికి తీసుకొస్తున్నావు. నేను దిగి వెళ్లిన తర్వాత దీన్ని తీసుకెళ్లి నువ్వు అక్కడ అన్నీ చేస్తున్నావు, అసలు నువ్వు నిద్రపోయావో లేదో నాకు తెలియదు. ఇప్పుడు యుద్ధం అయిపోయింది కాబట్టి, ఈ ఒక్క

రోజుకి నువ్వు ముందు దిగిపో, తర్వాత నేను దిగుతాను' అంటాడు. 'నీకు నా మీద ఉండే గౌరవం కి చాలా సంతోషం, కానీ నీ తెలివి చాలా అరకొర తెలివి, ఏడ్చావులే, దిగు' అని చెప్తాడు. అదేమిటంటే 'అంతే నువ్వు దిగు, నువ్వు దిగిన తర్వాతే నేను దిగాలి, నువ్వు దిగకుండా నేను దిగితే నువ్వు చస్తావ్' అని చెప్పడు. చెప్పకుండా, 'దిగు తెలుస్తుంది' అంటాడు. అర్జునుడు దిగాక, కృష్ణుడు దిగుతాడు. దిగంగానే అట్లా మంటలు వచ్చేసి రథం అంటుకుని వెళ్ళిపోతుంది, ఆకాశంలోకి. అగ్ని దేవుడు ఇచ్చిన రథం అది. ఇందుకోసం ఇచ్చాడు. దానికి చోదకుడు కృష్ణుడే! ఈ శరీరం కూడా అగ్నిదేవుడు ఇచ్చిన రథమే కదా. అగ్నిలోంచి పుట్టామండీ మనమంతా! అందుకని ఈ శరీరం అందులోకే వెళ్ళిపోతుంది. అందుకనే అగ్నికి ఆహుతి చేయడం. ఇక్కడ అక్కడ పడేయడం కాదు. గోరి కట్టేయడం, నీళ్లలో పారేయడం, పద్ధతి కాదు. ఆర్య సంప్రదాయం ఏమిటయ్యా అంటే అగ్ని నుండి వచ్చింది, అగ్నికే ఇచ్చేస్తాం. ఇందులో పెద్ద తత్త్వం చెప్తాడు కృష్ణుడు. 'నేను ఉండగానే ఇందులో, నువ్వు బయటికి రావడం నేర్చుకో' అని చెప్తాడు అర్జునుడికి. 'శరీరంలో 'పెద్ద నేను' ఉండగానే 'చిన్న నేను' బయటకు రావడం యోగం! వచ్చి, దాన్ని చూడడం! అర్జునుడు దిగిన తర్వాత, రథాన్ని చూసుకుంటాడు. అదే అర్జునుడు కూర్చుని, కృష్ణుడు దిగిపోతే? రథంతో పాటు అర్జునుడు కూడా! అది మరణం! అర్జునుడు దిగిన తర్వాత, కృష్ణుడు దిగి, రథాన్ని పంపించేయడం దేహత్యాగం! దేహత్యాగానికి, మరణానికి, అంత తేడా ఉంది. అందరూ శరీరంలో చచ్చిపోవడం ఉంటుంది. కానీ యోగం చేస్తే అలా ఉండదు. తాము ఈ శరీరంలో ఉండగానే, తనని ఉండనివ్వగానే మొట్టమొదట గురువు చేసే ఆశీర్వచనం, ఆయుర్దాయం, ఆరోగ్యం, ఆ తర్వాత ఈశ్వరత్వం! ఆయురారోగ్య ఐశ్వర్య మస్తు, కదా. కాబట్టి, మనం ఇది ఉండగానే, ఇందులోంచి బయటకు వచ్చి, దీన్ని చూసుకోవడం నేర్చుకోవడమే! ఆ తరువాత దీంతోపాటు కాలిపోక్కరలేదు. చచ్చిపోవక్కర్లేదు. మేదినీపతి అంటే 'ఇది వాడిది' అని గుర్తుండాలి. ఇదే కాదు, మన ఇల్లు కూడా వాడిదే! మనం వాడి వాళ్ళమే, సమస్తమూ వాడిదే! మనకి emphasis ఏమిటయ్యా అంటే 'ఈ శరీరం నీది కాదు, వాడిది' అని. దీనికి ఆహారం పెడుతున్నప్పుడు వాడి శరీరానికి పెడుతున్నట్టుగా భావన చేసి పెట్టు. అప్పుడది నిజమైన నైవేద్యం! లేకపోతే అది ఊరికే, laboratory work, laborious work. ఇది ఆనందమయమైన విషయం కదా. నోట్లో పడుతున్న కొద్ది, ఓహో తెగ ఆనందం గా ఉంటాం. శరీరానికి ఏది కావాలో అది పెడతావు. ఎప్పుడు? ఇది వాడిది అని తెలిస్తే. లేకపోతే ఏం చేస్తామంటే, మనకేం కావాలో అది తింటాం. మనకేం కావాలో తినడం కోసం కాదు, తిండి పెట్టింది. శరీర పోషణ కోసం పెట్టారు తిండి. అట్లా చాలా చాలా తెలుస్తూ ఉంటాయి. అందుకనే మనవాళ్లు దాన్ని కూడా క్రతువు చేసేశారు. అది కూడా వాడికి ఆహారం పెడుతున్నట్లుగా మనల్ని తీసుకోమన్నారు. ముఖాన్ని హోమగుండం అని చెప్పారు. ఆ హోమగుండంలో, అగ్నికి మనం అందిస్తున్నట్టు అందిస్తే, సమస్త దేవతలకి అగ్ని అందిస్తాడు commission

కొట్టకుండా! ఆ విధంగా భోజనం చేయమని చెప్పారు. సాధనపరంగా మేదినీపతి అంటే, ఈ భూమికి అతడే భర్త! మన శరీరం కూడా భూమే! దానికీ ఆయనే భర్త! ఆయనకి సంబంధించినది, ఆయనకి చెందింది. యోగ పరంగా, సాధనపరంగా, చెప్పుకుంటే మనకి ఇది ఎక్కువ పనికొస్తుంది. ఈ భూమంతా ఆయనదేనండీ ఆయనకు సంబంధించినదే, ఓహోహో ఆహాహా అని చెప్పుకున్నాం అనుకోండి మనకు ఏమీ ఉండదు, మనం మామూలుగానే ఉంటాం. సాధనపరంగా చెప్పుకోవడం వల్ల మనకు ఏమి తెలుస్తుందంటే, ఇది వాడిది. కాబట్టి వాడిదిగా treat చేస్తే, మొత్తం తల నుండి కాలిగోరు వరకు కూడా, పవిత్రంగా చూసుకోవడం ఉంటుంది. ఎక్కడికక్కడ పాచి పేర్చకుండా, తల్లో పేల దగ్గర నుండి కాలి గోళ్ళ మట్టి వరకు పవిత్రం గా చూసుకో. ఒక పరమ గురువు ఎట్లా ఉంటారో తెలుసా? తల వెంట్రుక దగ్గర నుండి, కాలి గోరు వరకు, అంతా మెరుస్తూ ఉంటుందిట. అంత కళ! ఎందుకనంటే ఇది వాడిది కాబట్టి, ఎంత బాగా ఉంచుతారుట అంటే, ఒకసారి దేవాపి మహర్షి కనిపించారుట! కనిపిస్తే ఆశ్చర్యంతో నిశ్చేష్టురాలైపోయిందిట Madam Blavatsky! 'ఏమిటట్లా, ఆ అందం ఏమిటి, ఆ వెలుగేమిటి, ఆ తళ తళ ఏమిటి, పాదంలో చిన్నవేలు దగ్గర నుండి బొటనవేలు వరకు, వాటికుండే గోళ్ళ దగ్గర నుండి, తల మీద వెంట్రుకల వరకు, ఏ భాగం చూసినా, అంత పవిత్రంగా ఉంది. ఆ శరీరం'. అప్పుడు తెలిసింది ఆవిడకి. ఎందుకంటే ఆవిడ ఇంకోరకంగా ఉండేది. ఇట్లా ఉండకూడదు అట్లా ఉండాలని. మనం ఏం తిన్నా పర్వాలేదు, ఎట్లా ఉన్నా పర్వాలేదు, ఏం చేసినా పర్వాలేదు; అనేది పనికి రాదు. రాముడి శరీరం రామాయణంలో ఎంత బాగా వర్ణిస్తారూ? మనం ఎవరన్నా వేసుకుంటే మంచి dress వేసుకుంటే అది చాలాబాగుందని అంటాం. అంటే నువ్వు బాగా లేవు dress బాగుందని చెప్పడం! రాముడు ఎట్లా ఉండేవాడుట అంటే, హనుమంతుడు చెప్తాడు. అగస్త్యాశ్రమంలో లోపాముద్రాదేవి సీతాదేవికి, రాముడికి ఆభరణాలు ఇస్తారు. అసలు అగస్యుడు ఇచ్చిన ఆభరణాలు అంటే ఎట్లా ఉంటాయండి అవి? మనం ఊహించలేం. విపరీతమైన అందంగా ఉంటాయి. అందులో ఏమీ సందేహం లేదు! ఎందుకంటే, సప్తర్షులంతా ఒక ఎత్తు, అగస్త్యుడు ఒక్కడు ఒక ఎత్తు. సప్తర్షుల పూజలు చేసినప్పుడు కూడా ఏడు ఋషులకి కలిపి ఒక పూజ, ఈయనకు separate గా ఒక పూజ ఉంటుంది. అంతటివాడు ఆయన. మరి ఆయన భార్య లోపాముద్రా దేవి అంటే, సాక్షాత్తు శక్తి స్వరూపిణి! ఆవిడ ఇచ్చింది నగలు, అవి పెట్టుకున్నారు. వీళ్లు వస్తున్నారు. వస్తుంటే హనుమంతుడు చూశాడుట. మనలాంటి వాడైతే ఓహోహో ఏం మంచి ఆభరణాలు అనుకుంటాము. ఆయన అనుకున్నాడట వాళ్లతో మాట్లాడుతూ, 'ఓహోహో ఎంత వన్నెతెచ్చారు ఆభరణాలకి వీళ్ళ యొక్క రూపంతో' అని. హనుమంతుడు అట్లా అంటాడు. ఆభరణాలకే వన్నెతెచ్చిన రూపం రాముడిది, లక్ష్మణుడిదీను. ఆభరణాల వల్ల వన్నె వచ్చే రూపాలు కాదు కదా. అందుకని అటువంటి వాడు ఏం వేసుకున్నా 'వేసుకున్న దానికి'

బాగుంటుంది. వేసుకున్న దానికి వెలుగు వస్తుంది. మనం చెప్తూ ఉంటామే, కొంతమంది కుర్చీలో కూర్చుంటే కుర్చీకి శోభ అని. కొంతమంది కుర్చీలో కూర్చుంటే, కుర్చీ వల్ల వాడికి శోభ. కొంతమంది కూర్చుంటే కుర్చీకే శోభ. అట్లా ఉంటారట పరమ గురువులు. వారి శరీరాలు చూస్తే, శరీరానికే వాళ్లు ఉండడం శోభ అందులో. అంతేగాని ఊరికే తలలో పేల దగ్గర నుండి కాలి గోళ్లలో మట్టి వరకు పెట్టుకుని ఉండరు వాళ్ళు, ఎందుకంటే ఇది తెలిసిన వాళ్లు కాబట్టి. ఇది వాడిది. వాడిది ఎంత శుభ్రంగా ఉంచుతాం? ఆ దేవుడి గూడు ముందు శుభ్రంగా ఉంచాలని ఒక ప్రయత్నం ఉంది కదా. మరి ఈ గూడో? ఈ గూడు కూడా అంత బాగా ఉంచాలి. ఎంత పవిత్రత శరీరానికి పెరుగుతూ ఉంటే అంత లక్ష్మి అక్కడ ఉంటుందండి. శరీరం అంటే మనవరకు మనస్సు, ఇంద్రియాలు, శరీరం. కాబట్టి పవిత్రత మనోభావాల దగ్గర నుండి మొదలై భౌతికశరీరం వరకు ఉంటుంది. అలా దీన్ని తయారు చేసుకోవాలి. ఎందుకంటే ఇది ఆయనది కాబట్టి. ఒక గురువుగారు మనకు ఏదైనా ఇచ్చారు అనుకోండి ఎంత పవిత్రంగా చూసుకోవాలి? మొత్తం సృష్టికే గురువు అయిన వాడు మనకు ఇచ్చాడు, దాన్ని ఎంత పవిత్రంగా చూసుకోవాలి? అదీ భావన.

## 555 త్రిపదః

త్రిపదః అంటే మూడు పాదములుగా వ్యాపించిన వాడు అని అర్థం. 1. పదార్థానికి సంబంధించిన పాదము 2. శక్తికి సంబంధించిన పాదము 3. ప్రజ్ఞకి సంబంధించిన పాదము. వీటినే భూలోకము, భువర్లోకము, సువర్లోకములుగా విభజించి చెపుతారు. సృష్టిని మూడు లోకాలుగాను, ఏడు లోకాలుగాను , పధ్నాలుగు లోకాలుగాని. నలభై తొమ్మిది లోకాలుగాను కూడా అవగాహన చేసుకోవడం వుంటుంది. మూడు పాదములు ఆక్రమించిన భగవత్తత్త్వం ప్రజ్ఞ, శక్తి, పదార్థము! ప్రజ్ఞ అంటే ప్రకటింపబడిన జ్ఞానము. మనము నిద్రస్థితి యందున్నప్పుడు, అంతర్ముఖులమై యుండుటచేత, ప్రకటింపబడిన జ్ఞానము లేక వుంటాం. ఉదయం లేవగానే ప్రకటింపబడతాం. నేను ఉన్నాను అని తెలియడమే ప్రకటింపబడడం. ఆ తరువాత ఆ ప్రజ్ఞ ఆధారంగా శక్తి పుడుతుంది. శక్తి ఆధారంగా పదార్థం పుడుతుంది. లేచిన వారిలో ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగా ప్రజ్ఞ అవతరణము చెంది, శక్తి ఆధారముగా శరీరావయవములు పనిచేస్తూ వుంటే, వారు పనిచేస్తూ వుంటారు. ప్రతివారిలో ప్రజ్ఞ, శక్తి, పదార్థము, ఈ మూడుగా అతడే వ్యాపించి యున్నాడు అని తెలియడం ఒక తెలివి. ఈ మూడూ లేనప్పుడు కూడా అతడు వున్నాడు. అతడు ఉండడం చేత ప్రజ్ఞాలోకము ఏర్పడుతుంది. ఆ తత్త్వము మనలో ఉండడం చేతనే మనం మేల్కాంచడం జరుగుతుంది. వాడిని నాల్గవవాడిగా చెపుతారు. అందుకని చతుర్భుజుడు అని చెప్తారు. ఆ నాల్గవవాడు ప్రజ్ఞగా వికాసం చెందుతాడు. అంటే ప్రకటింపబడతాడు. ప్రకటింపబడిన తరువాత అందులోంచి మూడు శక్తులూ పుట్టుకు వస్తాయి. అవి ఆధారంగా పదార్థం యొక్క అవతరణము, సృష్టి లోకములు ఏర్పడడం జరుగుతూ వుంటాయి. కాబట్టి తానే ఈ మూడు పాదములు ఆక్రమించి యున్నాడు. అలాగే మనం కూడా ఆత్మవంతులుగా, ప్రజ్ఞావంతులుగా, శక్తివంతులుగా, శరీరధారులుగా కూడా పనిచేస్తూ వున్నాము. మనకి తెలిసిన 'నేను ఉన్నాను' అనే తెలివి, మనకున్న శక్తి, మన శరీరము, ఈ మూడూ మనకి వున్నాయి తప్ప మనం కాదు. మనం కాదు అంటే మనం నిజస్థితి నుండి మనమే ఈ మూడుగా వ్యక్తమవుతున్నాము. అందుకే ఒకే ఒక తత్త్వము ఈ మూడు రకాలుగా వ్యక్తమవుతోందని చెప్పడం కోసం మనకి త్రిభుజము, త్రిభుజము మధ్యలో ఒక బిందువు ధ్యానానికి ఇస్తారు. బిందువుగా వున్న తత్త్వమే ప్రజ్ఞ గాను, శక్తి గాను, పదార్థము గాను వ్యక్తమవుతోందని తెలియడం కోసమే ఇది ఒక యంత్రముగా ఇచ్చి, దానికి ఒక మంత్రం ఇచ్చారు. ఈ మూడు శక్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా చెపుతారు. ఆ తత్త్వమే అన్నిటికన్నా ముందు వున్నది కాబట్టి, అన్నిటికన్నా పెద్దవాడు అని చెప్పడం చేత, పెద్దవాణ్ణి గురువు అనడం చేత, మొత్తం సృష్టికి మొదటి నుండీ వుండేవాడు, ఎప్పుడూ వుండేవాడు

'గురువు'! అతడి నుండి వ్యక్తమైనవి మూడు శక్తులు. అందుకని బ్రహ్మా, విష్ణు, మహేశ్వరులుగా వ్యక్తమవుతున్న తత్త్వమే పరతత్త్వము కూడా! అందుకనే 'గురుస్సాక్షాత్ పరబ్రహ్మ' అని అంటాం. పరబ్రహ్మ తత్వమే బ్రహ్మతత్త్వము గాను, విష్ణుతత్త్వము గాను, మహేశ్వర తత్త్వముగాను వ్యక్తమవుతోంది. వ్యక్తమయ్యేది మాత్రమే చూడగలం తప్ప, ఎక్కడ నుండి వ్యక్తమవుతోందో చూడడం ఋషి దృష్టి. తానే అది అయివుండడం చేత, తన నుండి వ్యక్తమైనదని తెలుస్తుంది తప్పా, తనకి తాను తెలియదు. అంటే తనకి తెలివి రావడం తెలుసు తప్పా, తెలివి రాక ముందు తెనెవరో తనకి తెలియదు. వచ్చిన తెలివి తప్పా తన తెలివి కాదు. తన నుండే తానే, తెలివిగా మేల్కాంచాడు. మేల్కాంచిన తెలివి లోంచి శక్తి వచ్చింది. అంటే తానే తెలివిగా మేల్కాంచి, అందులోంచి శక్తిగా మేల్కాంచాడు. అందులో నుండి పదార్థంగా మేల్కాంచాడు. ఇట్లా అతడే మూడిటినీ ఆక్రమించి ఉంటాడు. ఈ మూడూ అతనివి (పరబ్రహ్మవి) అన్న భావన లేనప్పుడు రాక్షసుడు పుడతాడు. ఈ మూడు పురములలో మళ్ళీ తనని తాను ఉద్ధరించుకోవడం కోసం త్రిపురాసుర సంహారం. అంటే త్రిపురములను ఆక్రమించిన అజ్ఞానాన్ని సంహరించడమే త్రిపురాసుర సంహారం. త్రిపురాంతకుడంటారు. త్రిపురాంతకం మనకి ప్రతిరోజూ జరుగుతూనే వుంటుంది. ప్రతిరోజు నిద్రలోకి వెళ్ళేముందు ఈ మూడూ మర్చిపోతున్నాము కదా. శరీరము మరపు వస్తుంది. మనకుండే శక్తి, సామర్థ్యములు మరపు వస్తాయి. మనం వున్నామనే తెలివి కూడా మరపు వస్తుంది. మరచి నిద్రలోకి వెళ్ళినపుడు ఈ మూడు పురములు మనకి లేకపోవడమే కదా. ప్రతి ఉదయం ఈ మూడు పురములలోకి దిగి వస్తూ వుంటాం కదా. మనమే మూడుగా దిగివస్తాం, నాల్గవవాడై యుండి. మనమే కేంద్రం నుండి పరిధికి ఈ విధంగా వ్యక్తమవుతాం. మనమే మళ్ళీ పరిధి నుండి కేంద్రానికి తిరోధానం చెందుతూ వుంటాం. ఇది ప్రతి ఉదయము, ప్రతి రాత్రి జరిగే కథ. ఇదే కథ మాసంలో ఇంకొంచెం విస్తృతంగా జరుగుతుంది. ఇదే కథ సంవత్సరంలో జరుగుతుంది. ఇదే కథ యుగంలో జరుగుతుంది. ఇదే కథ మహాయుగంలో జరుగుతుంది. ఇదే కథ మన్వంతరంగా జరుగుతోంది. ఇదే కథ ఒక సృష్టి కథగా జరుగుతోంది. ఇట్లా మేల్కాంచి, మళ్ళీ అందులోకి వెళ్ళే కార్యక్రమం అనుస్యూతంగా ఒకదాని తరువాత ఒకటి జరుగుతూనే వుంటుంది. సృష్టి అయిపోయే లోపల మళ్ళీ ఇంకో సృష్టి వస్తూ వుంటుంది. మనకి ఆలోచన ఒకటి వచ్చి వెళ్ళిపోయే లోపల ఇంకో ఆలోచన వస్తుంది. ఈ విధంగా మూడు మూడుగా వ్యక్తమవుతూ వుంటాడు. అసలువాడు నాలుగోవాడు అని చెప్పడానికే ఈ నాలుగు తత్వాలకీ మొదటి తత్వాన్ని వాసుదేవుడని, రెండవ తత్వాన్ని సంకర్షణుడని, మూడవ తత్వాన్ని ప్రద్యుమ్నుడని, నాల్గవ తత్వాన్ని అనిరుద్ధుడని చెప్తారు. ఈ నాలుగు తత్వాలనీ పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి వాక్కులుగా చెపుతారు. ఈ నాలుగు తత్వాలనీ నాలుగు వేదాలుగా ఇచ్చారు, నాలుగు యుగాలుగా ఇచ్చారు. ఈ నాలుగింటికి ముఖ్యమైన అవగాహన ఏమిటంటే:- కేంద్రము

ఒకటి, దాని చుట్టూ మూడు వున్నాయని చెప్పడం. అందుకని కేంద్రము, దాని చుట్టూ వున్న త్రిభుజాన్ని ధ్యానం చేసుకోవాలని చెప్పారు. ఆ ధ్యానంలో ఉన్న ముఖ్యార్ధము ఏమిటంటే:- నేను కేంద్రమును, నానుండి ప్రజ్ఞ వ్యక్తమవుతోంది, నాప్రజ్ఞ నుండి శక్తి వ్యక్తమవుతోంది. నా ప్రజ్ఞ, శక్తులు ఆధారంగా శరీరం పనిచేస్తోంది అనుకోవడం. 'నేను' అనే తత్త్వమే మేల్కాంచినపుడు ప్రజ్ఞ అవుతోంది. మేల్కాంచనపుడు తనయందు తాను 'నేను' గా వుంటుంది. ప్రకటింపబడిన జ్ఞానము కాబట్టి ప్రజ్ఞ అనబడుతోంది. కాబట్టి త్రిపదః అంటే మూడు పాదములుగా లేక మూడు లోకములుగా అతడే వ్యక్తమవుతున్నాడని చెప్పడం! సమస్తమునందు మనం ఈ మూడింటిని దర్శనం చెయ్యవచ్చు. ఒకటి రూపంగా దర్శనం చేయవచ్చు. రెండు అందులో పనిచేస్తున్న త్రిగుణాత్మక శక్తిగా, మూడు ఆ రూపం యొక్క స్వభావంగా దర్శనం చేయవచ్చు. వీటికి కేంద్రమైన బిందువుగా ప్రజ్ఞ పనిచేస్తూ వుంటుంది. ఇది విశ్వాత్మ ప్రజ్ఞలో భాగంగా ఒక ప్రజ్ఞగా మేల్కాంచి యుంటుంది. ఈ నాలుగూ తెలపడం కోసమే మనకి చతుర్భుజమైన చక్రం ఒకటి సంకేతంగా ఇచ్చారు. అదే చతుర్భుజముతో కూడిన సంకేతాన్ని ఈనాడు పాశ్చాత్య దేశస్థులు క్రైస్తవమతం cross గా చేసుకున్నారు. కానీ cross క్రైస్తవమతం కన్నా చాలా పురాతనమైనది. క్రైస్తవమతం రెండువేల సంవత్సరముల నుండి మాత్రమే వుంది. కాని ఈ చతుర్భుజమనే సంకేతము సృష్టి మొదటి నుండి వుంది. సృష్టికి ఆధారభూతమైన ఒక సంకేతం అది! 5 వేల సంవత్సరముల క్రితం వేదవ్యాసుడు దీనినే

చతుర్వర్గ ఫలం జ్ఞానం, కాలావస్థా చతుర్ముగాః
చతుర్వర్ణ మయోలోకః, తత్సర్వం చతుర్ముఖాః

అనే ఒక భావనగా ఇచ్చారు. అంతేకాక వేదాలలో భగవంతుడు ప్రకటితమైనప్పుడు బ్రహ్మని చతుర్ముఖుడుగా చెపుతారు. చతుర్ముఖుడిని మనం చూసినప్పుడు మనకు మూడు ముఖాలే కనిపిస్తాయి, నాల్గవముఖం కనిపించదు. నాలుగు ప్రక్కలా నాలుగు ముఖాలున్నప్పుడు, నాలుగు సింహాల స్థంభము వుంటుంది చూడండి, ఎటు నుండి చూసినా మూడే కనపడతాయి, నాల్గవది మరుగున వుంటుంది. అలాగే అసలు తత్త్వం మరుగున వుండి, ఎప్పుడూ మూడు మూడుగా వ్యక్తమవుతుంది. అంతా మూడు మూడుగా వ్యక్తమవుతోందని చెప్పడానికి మహాభారతంలో ఏం చెప్తారంటే

త్రయస్త్రింశః సహస్రాణి, త్రయస్త్రింశః శతానిచ,
త్రయస్త్రింశ్చ దేవానాం, సృష్టి సంక్షేమ లక్షణాః

అని మూడుగా, మూడు పదులుగా, మూడు వందలుగా, మూడు వేలుగా, ఇట్లా వ్యక్తమవుతోంది. అంతా మూడుగా వ్యక్తమవుతోంది. 'The whole creation is a triangle of forces' అంటారు పరమగురువులు. Triangular force ప్రజ్ఞలోంచి వచ్చింది. ఆ తత్త్వం గుణానికి అతీతమైనది. ఆ తత్త్వం లోనుండి మూడు గుణములు కూడుకొని వస్తున్నాయి, అని మనకి భగవద్గీత చెప్తోంది. 'త్రిపదః' అనే నామం మనం

అర్థం చేసుకోవాలంటే, మనయందు త్రిపదములు వున్నాయి, అవి త్రిపురములూ, త్రిగుణములుగా వెలసినాయి, త్రిపురములు సూత్రములైతే, ఆ సూత్రములాధారముగా నిర్మింపబడిన ప్రజ్ఞ, శక్తి, పదార్థములు. భగవద్గీత యందు కూడ 'ప్రజ్ఞ, శక్తి, పదార్థముగా కనిపిస్తూ వుంటాయి, కాని ఈ మూడింటికీ నేనే ఆధారముగా వున్నాను' అని చెప్తాడు. అదే క్రైస్తవమతములో నాలుగు భుజాలుగా తీసుకున్నారు. అంటే నాలుగు తత్వాలు నిండి వున్నాయని చెప్పడానికి, ఈ సంకేతాన్ని అందుకున్నారు. కాని అసలు మొట్టమొదట ఇచ్చిన చతుర్భుజం ఎట్లా వుండేదంటే, నాలుగు భుజాలూ సమానంగా వుండేవి. రాను రాను క్రైస్తవమతం ఎక్కువ పదార్థమయమైన లోకాలలో కూరుకుపోవడం వలన, పదార్థమయమైన భుజం బాగా పాడుగ్గా పెంచుకున్నారు. కాబట్టి meterialistic tendencies మతంలో పెరగడంచేత సత్యం దూరమైంది. అసలు originalగా వున్న చతుర్భుజం, నాలుగు భుజములూ సమానంగా వుండి, దానిచుట్టూ వృత్తం గుర్తు వుండేది. ఈ నాలుగు సమానంగా వుండి, ఒకే తత్వాన్ని చెప్పడం కోసం వృత్తం! అందుకే యంత్రం గురించి ఏది చెప్పినాసరే, ఇందాక నేను చెప్పిన త్రిభుజము మధ్యలో బిందువులాగ, నాలుగు భుజములు దానిచుట్టూ వృత్తం. వృత్తం లేనిదే యంత్రానికి ఫలితం లేదు, ఎందుకంటే Unity of life, Unity of creation. ఏకత్వ భావన నశించినప్పుడు, ఎంత జ్ఞానమున్నా అది నిష్ఫలమే అవుతుంది, నిష్ప్రయోజనం మవుతుంది. ఏకత్వంలో అనేకత్వం చూడాలి. ఏకాత్మ భావన లేని అవగాహన సత్యదూరంగా వుంటుంది. ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే, ఒకటే మూడు భాగాలుగా విభజింపబడి యున్నదని చెప్పడం కోసమే! త్రివిక్రమ అవతారం యొక్క ముఖ్య ఉద్దేశ్యము కూడా అదే. ఆయన మూడు అడుగులతో మూడు లోకాలు కొలిచేసాడని కదా. 'నిలచిన నిలువున నిఖిల దేవతల' అని అన్నమాచార్యుల వారు పాడినపాట. అందుకని ఒక పాదముతో భూమి, మరియొక పాదముతో శక్తి, మరియొక పాదముతో ప్రజ్ఞ, ఆయనే ఆక్రమించి వున్నాడు. ఆయన నాల్గవవాడు. నాలుగంకె అంటే, కేంద్రముగా నున్న త్రిభుజములో నున్న అంకెగానైనా చెప్పవచ్చు, లేకపోతే చతుర్భుజముగా ఉన్న సంకేతముగా కూడా చెప్పవచ్చు. ఆ చతుర్భుజాన్నే చూపిస్తున్నట్టుగా విష్ణుమూర్తిని ఒక సంకేతం గా ఇచ్చారు. దాన్నే Madam Blavatsky చూపించిన మొట్టమొదటి సంకేతంగా చెపుతారు. 'ఈ సృష్టికి పునాదిరాయి ఇది' అని చెప్పి చతుర్భుజాన్ని చూపిస్తారు పరమగురువులు Madam Blavatskyకి. 'ఈ పునాదిరాయి నీకు అర్థమైతే, సృష్టంతా నీకు అర్థమవుతుంది'అని చెప్తారు. మూడు కనిపిస్తూ వుంటాయి, కానీ మూడింటికీ మించి ఒకడున్నాడు, వాడు మూడింటి యందు నిండి వున్నాడు. మూడింటినీ మించి వున్నాడు. మనం కూడా మన తెలివి, మన శక్తి, మన శరీరమును మించి వుంటాము. ఈ విధముగా మనం అవగాహన చేసుకోవాలి. చేసుకుంటే మనమే ఈ మూడుగా వ్యాపిస్తున్నాము. ఈ మూడింటినీ మించి వున్నాము.

ఈ మూడింటి యందు కూడ వున్నాము. అది కృష్ణుడి యొక్క తత్త్వం గా భీష్ముడు చెపుతున్నాడు. ఎందుకంటే ఆయన పదార్ధము మీద స్వామిత్వము చూపించాడు. సమస్త శక్తుల మీద స్వామిత్వం చూపించాడు. అందరికి వున్న ప్రజ్ఞ కన్నా మించిన ప్రజ్ఞగా కనిపించాడు. ప్రజ్ఞకి కూడా అతీతంగా ఉన్న తత్త్వం గా గోచరించాడు. వున్నాడు. ఇలా నాలుగు విధములుగా గోచరించడం చేత, త్రిపదములు ఆక్రమించిన తత్త్వము నీవు, అని చెప్పడం కోసం త్రిపదః అని ఇచ్చాడు. సృష్టి త్రివిక్రమత్వం మనకి రావాలంటే ఈ మూడింటిని వ్యాపించి, అధిగమించి వుండాలి. లేకపోతే వామనుల వలె వుంటాం. వామనుడంటే పొట్టివాడని అర్ధం. పొట్టివాడంటే ప్రజ్ఞ యందు, శక్తి యందు, ఎరుక యందు పొట్టివాడు, పదార్ధము నందు బందీకృతుడైనవాడు. కనిపించడానికి దేవుడు పొట్టివాడుగా వుంటాడుట, కానీ అవసరాన్ని బట్టి పెరుగుతూ వుంటాడుట. ఎప్పుడూ పెరిగి కనిపించడు. ఎప్పుడూ ఆకాశం వరకు ఉండేటట్టుగా వుండడు. అణువులో అణువంత వుంటాడు. బ్రహ్మాండములో బ్రహ్మాండమంత వుంటాడు. 'అణోరణీయాన్, మహతో మహీయాన్' అణువులో అణువుగానే ఒదిగి వుంటాడుట. మొత్తం మహత్తు అంతా కూడ వ్యాపించి వుంటాడుట. అందుకని వామనావతారం ఏం చెపుతుందంటే, నువ్వు ఎంతటి వాడివో తెలిసి, ఇంతవాడిగా వుండు, వామనుడిగా వుండు. మనకట్లా ఉన్న వాళ్ళ కధలు ఇచ్చారు. హనుమంతుడి కధ అలాంటిది. అవసరాన్ని బట్టి పెరుగుతాడు తప్ప, ఊరికే ఎప్పుడూ పెరిగి వుండడు. ఊరికే పెరిగి వుండి, ప్రకటించుకోవడం ఎందుకు? లంకిణి ముందు పెరిగి చూపించాడు. మళ్ళీ చిన్నవాడయ్యాడు. పెద్దవాడై యుండి కూడ చిన్నవాడుగా ఉండడమన్నది ఒక తత్త్వం. అందుకని భగవత్తత్త్వం భూమి మీద తిరుగుతున్నప్పుడు, ముందే ఫెళ ఫెళమని అందరికీ ప్రకటించేటట్టు పెరగదు. తను వచ్చిన పని చక్కబెట్టుకోవడానికి అనువుగా ఒక అల్లిక చేసుకుని, ఇతరులకు తెలియని పద్ధతిలో కార్యక్రమన్ని పూర్తిచేసి, చివరిదశలో తెలిసీతెలియని దశలో వెళ్ళిపోతాడు. చిన్నవాడుగా వుంటాడు పెద్దవాడు అయినవాడు. అది చెప్పడానికి వామనావతారం ఎత్తాడు. రాముడంతే! కృష్ణుడంతే! ఏసుక్రీస్తు అంతే! వాళ్ళు వున్నప్పుడు తెలియదు, వాళ్ళు ఇంతటివాళ్లని. వాళ్ళు వెళ్ళిన తరువాత వాళ్ళు ఎంతటివాళ్ళో తెలుస్తుంది. అది భగవత్తత్త్వంలో ఒక ముఖ్యమైన విశేషము! మనం ఈ విష్ణు సహస్రనామం చెప్పుకున్నప్పుడు 1. ఈ నామపరముగా భగవంతుని యొక్క తత్త్వము ఎట్లా వుంది? 2. భగవద్భక్తులు లేక భాగవతోత్తములు ఈ తత్త్వంతో ఎట్లా వుంటున్నారు? 3. అది మనం సాధనపరంగా ఎట్లా చేసుకోవాలి? ఇలా మూడు భాగాలు ప్రతి నామానికి. ఈ మూడు తత్త్వాలు ఆక్రమించిన శరీరం మీద స్వామిత్వం, శక్తి మీద స్వామిత్వం, ప్రజ్ఞ మీద స్వామిత్వం, ఎవరికి వుంటుందంటే, తనకి తాను తెలిసిన వాడికి వుంటుంది. ఇతరులకు వుండదు. ఉండని వాళ్ళు నిజంగా వామనులైపోతారు. తెలిసినవాళ్ళు కూడ వామనుల వలె వుంటారు, కాని వామనులు కారు, అవసరాన్ని బట్టి

పెరుగుతారు, అవసరం లేనప్పుడు మామూలుగా ఉంటారు, గొల్లపిల్లవాడే కదా అనుకున్నట్టుగా వుంటాడు. కాని సన్నివేశము వచ్చినపుడు, సన్నివేశానికి మించి కొంచెం పెరుగుతూ వుంటాడు, మొత్తం అంతా పెరగడు. ఉన్న సన్నివేశము కన్నా కొంచెం పెరిగి వుంటాడు. మహత్తర సన్నివేశం వస్తే, మహత్తు కన్నా పెరిగి కనిపిస్తాడు. అంతే తప్పా ఎప్పుడూ అంత ప్రకటితంగా ఉండడమనేది సత్యదూరమైన విషయం. అప్రకటితంగానే ఉండి, అవసరాన్ని బట్టి ప్రకటితమవుతూ వుంటాడు. లేకపోతే అట్లా వుంటాడు. అవసరానికి తనని తాను ప్రకటించుకోవడమే తప్ప, ఊరికే పోచుకోలుకి, ఇతరులకి చెప్పుకోవడం కోసం ప్రకటించుకున్నట్టుగా వుండదు. ఇది త్రిపదః అనే నామానికి అవగాహన.

## 556 త్రిదశాధ్యక్షః

త్రిదశాధ్యక్ష అంటే మూడు లోకముల యందున్న దేవతలకి అధ్యక్షుడైనవాడు. తన నుండి వ్యక్యమైన ప్రజ్ఞ, శక్తి, పదార్ధము. వాటిలోంచి మళ్ళీ ఒక్కొక్క లోకము నుండి కొన్ని వెలుగులు కిరణములుగా ఏర్పడితే, వారు దేవతలుగా ఏర్పడుతారు. సురలు అంటే కిరణముల యొక్క కేంద్రములు అని అర్ధము. Branch offices లాగ ఏర్పడతాయన్నమాట. Branch offices లో ఏమవుతుందంటే Head Office నుండి అక్కడకి carry out అవుతూ వుంటాయి. మన శరీరంలో కూడా సుర కేంద్రములున్నాయి. అవి సరిగ్గా నిర్వర్తించుకోకపోతే అక్కడ అసురకేంద్రములేర్పడుతూ వుంటాయి. అంటే వెలుగుకి మూతపడుతుంది. అది అసురత్వము. అసురీ తత్వము పని ఏమిటయ్యా అంటే వెలుగుని ప్రసరింప చెయ్యనివ్వకుండా అడ్డుపడడం. శూరసేనములు, మధుర అని మనకి రెండు ప్రదేశాలున్నాయని చెప్పుకున్నప్పుడు, అందులో ఒకటి శూరసేనము అని చెప్పుకున్నాము కదా. శూరసేనములు అంటే కాంతులు వెదజల్లే ప్రదేశములు శరీరములో వున్నాయి. వాటిని పనిచెయ్యనిస్తూ వుండాలి. శరీరములో ఎట్లా వున్నాయో సృష్టిలో కూడా అట్లాగే వున్నాయి. ఇట్లా మూడు లోకములలోనూ కూడా రకరకములైన కేంద్రములు వ్యక్తమైనవి. అవి ఎట్లా వ్యక్తమైనాయంటే విష్ణుచక్రము చూసినపుడు గిరగిరా తిరుగుతున్నప్పుడు ముత్యాలు ఏర్పడుతూ వుంటాయి కదా. ఒక్కొక్క ముత్యం వెలువడినప్పుడు ఒక్కొక్క కేంద్రమవుతుంది. అందులోంచి గిరగిరా మళ్ళీ తిరిగి వెలుగు వస్తూ వుంటుంది. సవితృమండలం నుండి సూర్యమండలాలేర్పడి, సూర్యమండలం నుండి మళ్ళీ సూర్యుడు కేంద్రముగా గోళాలన్నీ ఏర్పడి, మళ్ళీ గోళాలమీద మనుషులు ఏర్పడి, మళ్ళీ వాళ్ళలో నుండి మనుషులు ఏర్పడి, ఇలా కేంద్రము నుండి జీవులు అనుస్యూతము గా వస్తూ వుంటాయి. కానీ అసలు వున్నది మూడే! భూః, భువః, సువర్లోకములు! కానీ అది 33 కోట్ల కేంద్రములుగా కూడా వెలువడుతోంది. మనం 33 కోట్ల మంది దేవతలు వున్నారని చెప్తాం. 33 కోట్ల లో 33 అంకె దానిలో ముఖ్యమైనది. 'The Magnificient number' అని అంటారు Masonic system లో. మూడు లోకముల యందున్న రుద్రప్రజ్ఞలు, మూడు పదకొండ్లు ముప్పైమూడు. పదకొండు సంఖ్య ఎట్లా ఏర్పడిందంటే, ఒక అడుగుకి పన్నెండు అంగుళములు తీసుకుంటే, అందులో పదకొండు భాగములు అవుతాయి. పన్నెండు అంగుళముల స్కేలులో పదకొండు భాగాలు వుంటాయి. ఈ చివర ఒకటి, అటు పన్నెండు వుంటుంది. అంగుళములు పన్నెండే కానీ అందులో వుండే భాగాలు పదకొండే వుంటాయి. ద్వాదశాదిత్యులు, ఏకాదశ రుద్రులు, అష్టవసువులు కలిపితే ముప్పై ఒకటి (31). వారికి అశ్వనీ దేవతలు/ మిత్రా వరుణులను కలిపితే ముప్పై మూడు. ఈ ముప్పై

మూడు దేవతలు మొట్టమొదట వచ్చిన వాళ్ళు. ఈ ముప్ఫై మూడు ఏడు లోకములలోను ఇట్లాగే వస్తూ వుంటారుట. ఒక్కొక్క లోకానికి ఒక్కొక్క సున్నా పెట్టుకున్నామనుకోండి, అంకె ముప్ఫై మూడుకోట్లు (33,00,00,000) అవుతుంది. అదీ 33 కోట్ల దేవతలంటే. ప్రతి లోకములోను 33 మంది దేవతలున్నారు. అట్లా ఏడు లోకాలున్నాయి. ఏడు లోకాలకి ఏడు సున్నాలు చేర్చుకుంటే, 33 ప్రక్కన ఏడు సున్నాలు. ఏడు సున్నాలు పెడితే అది ఒక కోటి. అది 33 అంకెగా వుంది కాబట్టి 33 కోట్ల దేవతలున్నారు. అది ఆ సంఖ్యా పరం గా చెప్పారు. ఎవరు లెక్కపెట్టారండి 33 కోట్లు వరుసగా పేర్లు చెప్పండి అంటే? మళ్ళీ కనపడు ఇప్పుడు నీకు అర్థమయ్యే విషయము కాదు అని చెప్పాలి. మిత్రుడు, వరుణుడు అంటే వరుణ తత్త్వం ఉపాధి. మిత్రతత్త్వం అందులో నివసిస్తూ వుండే ప్రజ్ఞ. 'శంనో మిత్రస్యం వరుణః' అంటాం చూడండి. ఒకటి ప్రకృతి తత్త్వము కలిగినది, వరుణశక్తి ఉపాధిగా ఏర్పడుతూ వుంటుంది. దేనికి ఉపాధి? దేనిని తనయందు కలిగివున్నదో దానికి ఉపాధి! పాలచెంబులో పాలు వున్నాయనుకోండి, చెంబు ఉపాధి అవుతుంది. పాలచెంబు వరుణుడైతే, అందులో వున్న మిత్రుడు పాలు. చెంబు లేకుండా పాలు ఎక్కడ పెట్టుకుంటాం? అట్లాగే సృష్టి ఏర్పడాలంటే తత్త్వానికి ఉపాధులు కావాలి. అందుకనే అసలు తత్త్వం తానే కుడి ఎడమగా ముందు విడివడ్డాడుట. ఎడమ తత్త్వాన్ని వరుణుడన్నారు. కుడి తత్త్వాన్ని మిత్రుడన్నారు. అందుకని 'గరుడ' అనే దివ్యమైన సంకేతార్థాన్ని అవగాహన చేసుకుంటే, ఎడమ రెక్కంతా ప్రకృతిపరము, కుడి రెక్కంతా ప్రజ్ఞాపరము. ఆ రెండింటినే ఇడ, పింగళ అన్నారు. ఇడ ఎడమ అయింది. పింగళ కుడి అయింది. కుడి ఎడమలుగా ఒకే శక్తి పనిచేయడం అనేది జరుగుతుంది. అందులో నుండి ఏడులోకాలు ఏర్పడినప్పుడు, ఈ రెండు ప్రజ్ఞలాధారముగా ఏడులోకాలలోనూ ఏర్పడినవన్నీ కూడా 33 అవుతాయి. ఏడులోకాలలోనూ ఏర్పడుతాయి. కానీ ఇవి అంతకు ముందు నామం 'త్రిపదః' తీసుకుంటే అసలు తత్త్వం వున్నవి మూడే! ఏమిటా మూడు? గరుత్మంతుడు, అతని కుడి రెక్క, ఎడమ రెక్క; ప్రజ్ఞ, శక్తి, పదార్థము. ఇట్లా అర్థం చేసుకోవాలి. చేసుకుంటే మనకి సులువుగా తెలుస్తాయి.అలా ప్రపంచం లోని అన్ని సంకేతాలూ ఒకే తత్త్వాన్ని బోధిస్తున్నాయని తెలుస్తుంది. ఇది చెప్పడానికే ఒక ఉపనిషత్తు చెప్పారు. ఓ శిష్యుడు గురువుగారి దగ్గరకు వచ్చి, అసలు ఎంతమంది దేవతలున్నారు గురువుగారూ? అని అడిగాడుట. 33 కోట్ల మంది వున్నారని చెప్పాడాయన. 33 కోట్ల మంది దేవతలే? అన్నాడు. పోనీ నువ్వు అలా బాధపడేట్టు అయితే, మూడు కోట్ల ముప్ఫై లక్షలమంది అన్నారుట. మూడు కోట్ల ముప్ఫై లక్షలమందా? అంటే, పోనీ అంత బాధపడుతూ వుంటే ముప్ఫై మూడు లక్షలు అన్నారుట. ముప్ఫై మూడు లక్షలా? నిజంగా చెప్పండి, అన్నాడుట. మూడు లక్షల ముప్ఫై వేలురా, అన్నారుట. అట్లా అడుగుతూ, అడుగుతూ వుంటే అది ముప్ఫై మూడు అయింది. ముప్ఫై మూడు మంది నిజంగా వున్నారా? అది final number అంటారా? అని అడిగితే, లేదు ముగ్గురే! అంటారు.

ఎవరా ముగ్గురూ అంటే ఇందాకటి నుండి మనం చెప్పకున్న ముగ్గురు. అదే 'త్రిపదః'. మూడూ ఎప్పుడూ వుంటారా? అంటే లేదురా ఒకడే వుంటాడు, మూడుగా వస్తూ వుంటాడు! అంటారు. వాడే అసలు దేవుడు! ఒకటి నుండి మూడై, మూడు నుండి ముప్పై మూడై, ముప్పై మూడు నుండి ముప్పై మూడు కోట్లమంది అవుతాడు. వీళ్ళందరికీ అధ్యక్షుడు ఎవరండి? ముప్పై మూడు కోట్లకి పైన వున్నవాడు ఒకడున్నాడు కదా. వాడి నుండి కదా ఇవన్నీ వస్తున్నాయి. ప్రజ్ఞగా గరుత్మంతుడు ఏర్పడితే, అక్కడ నుండి ఆయనకి రెక్కలేర్పడితే, అక్కడ నుండి మిగతా కథ అంతా. గరుడోపాఖ్యానము బాగ చదువుకోవాలి. గరుడ పురాణము చదువుకోవాలి. సుపర్ణసూక్తము అని వేదములో ఇచ్చారు చాలా చక్కగా. చదువుకోవాలి. అందులో ఒక రెక్కమీద ఈకలన్నీ గుంపులు గుంపులుగా బేసిసంఖ్యలో వుంటాయిట. ఇంకో రెక్కమీద ఈకలన్నీ సరిసంఖ్యలో గుంపులు గుంపులుగా వుంటాయిట. ఏమిటో పిచ్చిపిచ్చిగా రాసుకున్నారు. ఒక గ్రద్దని పట్టుకుని ఇంత రాసుకోవాలా అనుకుంటారుట. అది గ్రద్ద కాదు. మూడు లోకములను ఆవరించి వున్న మూడు రకములైన దేవతలు ఎవరు? ద్వాదశ ఆదిత్యులు- ప్రజ్ఞా తత్త్వము కలవారు. ఏకాదశ రుద్రులు- శక్తి తత్త్వముగా ఏర్పడిన వారు. అష్ట వసువులు- పదార్ధ లోకములతో నిండిన వారు. గరుత్మంతుణ్ణి ఆదిత్య తత్త్వముగా తీసుకుంటే, ఆయన కుడిరెక్క రుద్ర తత్త్వముగా తీసుకుంటే, ఆయన ఎడమరెక్క వసు తత్త్వముగా తీసుకోవలసి వుంటుంది. మనలో కూడా గరుత్మంతుడున్నాడు. కాకపోతే విశాలంగా వున్న రెక్కలు ఏమైనాయంటే మనవరకు వచ్చేసరికి బాగా కుచించుకుపోయి, అస్థిపంజరములో ఉండిన ఊపిరితిత్తులు అయిపోయినాయి. ఇది కూడా గాలి సరిగ్గా పీల్చకపోవడం చేత, సిగరెట్లు ఇత్యాది కాల్చడం చేత బిగుసుకుపోయి, ఇంక గాలి పీల్చడానికి అవదండి, ఇంక వదిలేసెయ్యండి శరీరాన్ని అని చెప్తారు. ఈ ఊపిరితిత్తులు రెండు ప్రక్కలా వున్న రెండు రెక్కల లాంటివి. అందులోంచి గాలి పీల్చేవాడు ఎవడు? గరుత్మంతుడు. దానిని అధిష్టించిన వాడు విష్ణుమూర్తి! అందుకనే మనలో స్పందన గరుత్మంతుడిగా చెప్తారు. గరుత్మంతుడు ఆధారముగా ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరుగుతుంటే ఊపిరితిత్తులు ఆడుతుంటాయి. ఆ స్పందనాన్ని నడిపిస్తున్న, దానిని అధిష్టించియున్న శక్తి ఒకటి వున్నది కదా. అది భగవత్తత్త్వము! అందుకని గరుత్మంతుని యొక్క స్వరూపము మనలో స్పందనాత్మక ప్రజ్ఞగా ఉన్నప్పుడు, అది ఆదిత్య తత్త్వముగా చెప్తే, అందులో నుండి కుడిప్రక్కగా శక్తులు విజృంభిస్తాయి. ఆ శక్తులే రుద్రులు! అందుకని కుడిరెక్క రుద్రాత్మక మైనది. ఏకాదశ రుద్రులు అందులోంచి శక్తులుగా పుట్టుకొస్తారు. ఎడమరెక్క నుండి ఆ శక్తి, ప్రజ్ఞ ఆధారముగా పదార్ధము ఏర్పడుతుంది. అష్టవసువులు అంటే ఎనిమిది పొరలుగా వుంటుందిట మొత్తం ప్రకృతి అంతా. ఈ ఎనిమిది పొరలలో నున్న ప్రకృతిని అష్టప్రకృతులు, అష్టలక్ష్ములుగా చెప్తారు. అవి ఏర్పరచే వారు అష్టవసువులు! వాటికి గురువు కపిలుడు! పదార్ధమయ లోకములలో ఎనిమిది

అరలుగా ఏర్పడుతున్న, అరలు అరలుగా ఏర్పరుస్తున్న ప్రజ్ఞని 'కపిల' అని గుర్తించారు. ఇట్లా ఇవన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది వున్నాయి. కాబట్టి 'త్రిదశాధ్యక్షః' అంటే ఈ మూడు లోకముల యొక్క దేవతలుగా పనిచేస్తున్న వాళ్ళందరూ ఎవరైనప్పటికీ, వారందరికి అధ్యక్షుడిగా కూడ నువ్వే వున్నావు అని.

## 557 మహాశృంగః

శృంగము అంటే పెద్ద కొండశిఖరం అని అర్థం. 'సుమేరు మధ్య శృంగస్థా శ్రీమన్నగరనాయికా' అని చదువుకుంటూ వుంటాం కదా. శృంగము అంటే the Pinnacle! మనం మహాపర్వత కొండ శిఖరం 'శృంగము' అయితే దానిపైన ఉన్న బిందువును 'మేరువు' అంటారు. మనం కొమ్ము అంటాం. దానికి అగ్రం వుంటుంది. దానిని 'మేరువు' అంటారు. అలాగే ఒక గుడి కట్టినప్పుడు, పునాదులు వేసుకుంటూ, దానిమీద రాళ్ళు పేర్చుకుంటూ వెళ్ళి, చివరకి పైన ఒక కలశం పెడతాం. దానినే 'శృంగము' అంటారు. ఆ శృంగము ఎట్లా నిలబడి వుందండి? ఈ కట్టిన కట్టడం దానికి ఆధారంగా ఉండడం చేత, దానిమీద శృంగము వుంటుంది. ఈ కట్టిన కట్టడానికి ఆధారం పునాదులు కదా. కాని సృష్టి అట్లా వుండదు. అది ఆధారంగా ఇవి ఉంటాయి. అటు నుండి ఇటు! మన దేవాలయములన్నీ అట్లా కట్టారు. పునాదులు గట్టిగా త్రవ్వి ఇప్పుడు గుళ్ళు కడుతున్నాం మనం. అంటే మనము పదార్థములోంచి పైకి ఎదుగుతున్నాము. ఋషులు ప్రజ్ఞలోంచి పదార్థము లోనికి దింపారు. గుడిని ఎట్లా కడతారో తెలుసా? పైన వుండే బండలు ఆధారముగా క్రింద Structure అంతా నిలబడివుంటుంది, గాలికి, వానకి తట్టుకునేట్టుగా. పైన మనకి ఇలా చతురస్రంగా పలకలు వేసుకుంటూ వెళ్ళిపోతూ వుంటారు. ఇలా పలక వేస్తారు, దానిమీద మళ్ళీ ఇలా వేస్తారు, ఒకటి అటు నుండి ఇటు వేస్తారు. ఇంకొకటి ఇటు నుండి అటు వేస్తారు. అందుకని చుట్టూ చూస్తే చతురస్రంగా కనిపిస్తూ వుంటుంది. ముందు ఒక diamond ఆకారములో పైన, అట్లా పేర్చుకుంటూ వెళతారు. పేర్చుకుంటూ వెళితే ఏమిటంటే పై పలక, క్రింది పలకని పట్టి వుంచుతుంది. క్రింద పలక మీద పై పలక కాదక్కడ. పై పలక క్రింద పలకని పట్టి వుంచుతుంది. అన్ని పలకలు కలిపి స్థంభాలని పట్టి వుంచుతాయి. స్థంభం కదలదు. ఎందుకంటే పై నుండి వచ్చే బరువు వలన కదలదు. స్థంభం క్రింద నేలమీద ఒక నాపరాయో ఏదో పెడతారు అంతే. భూమిలోకి పాతుకుపోయే గుళ్ళు కావు మొదట కట్టిన గుళ్ళు. అట్లా కట్టడం మనకి తెలియదు. అందుకని ఇట్లా కట్టుకుంటున్నాము. మనకు తెలిసినదేమంటే శరీరంలో జీవుడు వున్నాడని. కానీ అలా ఉండదు. జీవుడిలో శరీరం వుంది. అదీ నిజం. శరీరంలో ఎక్కడో మిణుకు మిణుకుమంటూ ఉండడమే కదా మన అవగాహన. శరీరాన్ని జీవుడు ధరించాడు తప్ప, జీవుణ్ణి శరీరము ధరించి లేదు. మనదంతా తల్లక్రిందుల అవగాహన. ఆ సత్యం ఎప్పుడు తెలుస్తుందంటే, యోగంలో ఆరవ వ మెట్టయిన ధారణ మెట్టు ఎక్కితే, మనం శరీరం ధరించి వున్నాము కానీ, శరీరం మనకి ఆధారం కాదు అని తెలుస్తుంది. అందుకని ఆహారం మనకి ఆధారమనే అజ్ఞానం వుండదు. శరీరానికి ఏది ఆధారమో తెలుసా? జీవతత్త్వం ఆధారం! మనకి బాగా భౌతికమైన అవగాహనే తప్ప, అంతకు

మించిన అవగాహన లేదు కాబట్టి అంతా భౌతికంగానే ఆలోచిస్తాం. కలకాలం బ్రతికేట్టయితే, చచ్చిపోతున్నారేం బాగా తిండి దొరికేవారు కూడా? చావకూడదు కదా. శరీరానికి బాగా పోషణ ఇస్తూ వుంటే, బాగా తింటూ వుంటే ఎల్లకాలం బ్రతకాలి కదా. ఎందుకు బ్రతకడం లేదు? దేనిమీద ఏది ఆధారపడి వున్నదో అవగాహన లేక! దానిమీద పెద్ద పెద్ద theories, సభలు. అది ఒక మతముగా తయారుచేసుకోవడం. ఇట్లా వెళ్ళిపోతూ వుంటుంది. అన్నీ చూసి ఆనందిస్తూ వుంటాడు. పై నుండి క్రిందకి ఏర్పడితే, క్రింద నుండి పైకి ఏర్పడింది అనుకుంటాం. అందుకనే పురుషోత్తమ ప్రాప్తి యందు బాగా అవగాహన చేసుకోండి అని చెప్తారు- 'ఊర్ధ్వ మూల మధ శ్శాఖం' అని. మనకి మామూలుగా చెట్టుకి వేళ్ళంటే భూమిలో వుంటాయని కదా అర్థం. శ్రీకృష్ణుడు చెప్పిన చెట్టుకి వేళ్ళు పైన వుంటాయిట, శాఖలు క్రిందకి వుంటాయిట. ఏమిటో అడ్డదిడ్డంగా చెప్పినట్టు వుంటుంది. అడ్డదిడ్డం ఎందుకంటే మనం అడ్డదిడ్డంగా వున్నాము కాబట్టి, అసలు విషయం మనకి అడ్డదిడ్డంగా గోచరిస్తుంది. మనం శీర్షాసనం వేస్తే మిగతా మనుష్యులందరూ తలక్రిందులుగా నడుస్తున్నట్టు వుంటుంది. అంతేకదా. ఇదీ అంతే! దీనిమీద అదా? దానిమీద ఇదా? ఎందుకు ఇది చెప్తున్నానంటే అమ్మవారు మేరువు వుంది చూసారా! శ్రీచక్రం ఇలా గీతలు గీతలుగా గీసేసుకుంటూంటారు, అది శ్రీచక్రం కాదు, అది చాలా నాసిరకమైన representation of Shri Chakram. దానిని 'శ్రీచక్రమేరు' అంటారు. శ్రీచక్రమేరు ఎట్లా వుంటుందంటె ఒక త్రిభుజం, దానిమీద ఇంకో త్రిభుజం పేర్చబడి వుంటుంది. ఒకటి తూర్పు వైపు ముఖం వుంటే, ఇంకోటి పశ్చిమ వైపు ముఖం వుంటుంది. ఒకదాని మీద ఒకటి పేరుస్తారు. ఇట్లా తొమ్మిది త్రిభుజాలు పేరుస్తారు. అలా నిర్మాణం చేసుకు వస్తారు. మీరు ఎవరైనా ఎప్పుడైనా వెళ్ళి వుంటే, దేవీపురంలో, ఇట్లా నిర్మాణం చెయ్యడానికి ఒక ప్రయత్నం జరిగింది. పూర్తిగా అయిందని నేను అనలేను గాని. శ్రీచక్రం మేరువుని 'శ్రీచక్రం' అంటారు. మేరువు ఎందుకు అయిందంటే, అట్లా తొమ్మిది ఆవరణలు కట్టుకువస్తారు. కట్టుకొచ్చిన తరువాత పైన ఉండే త్రిభుజం లో బిందువు వుంటుంది. It is a three-dimensional Yantra. అంతేకానీ ఉప్మా తిన్న Plate లా వుండదు. అందుకే మన అవగాహన పట్టి horizontal గానే ఉంటాం, Vertical గా పెరగం. ఆ శ్రీచక్రం మేరువు పైన బిందువుని 'శృంగం' అంటారు. ఆ బిందువు మధ్యలో అమ్మవారు వుంటారుట. అది ఆమె నగరం. 'సుమేరు శృంగ మధ్యస్థా శ్రీమన్నగరనాయికా'. మహాశృంగం అంటే లోకలన్నిటికీ ఆయన కొమ్ము అండి. ఇవన్నీ ఆయన నిలబెట్టినవి అనికాదు, మన గుడిలాగ, ఆయన నుండి ఇవన్నీ నిలబడి వున్నాయి. ఆయన లేకపోతే ఇవన్నీ నిలబడి వుండవు. అట్లానే మనలో కూడా ఆ మేరు స్థానమున్నది, శృంగమున్నది. అది జీవుడిగా హృదయ కమలము నందు ఉండే చిన్న బిందువు

నీవార శూక వర్తన్వీ పీతాభా స్వత్యణూపమా
తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః

ఒక వరిగింజ తీసుకోండి. పొట్టు తీసెయ్యండి. లోపల గింజ వుంటుంది. వరిగింజ పైన చిన్న తలకాయ వుంటుంది. అదీ 'నీవార శూక వర్తన్వీ'! దానిమీద 'తస్యాశ్శిఖాయ' చిన్న గుండు, 'మధ్యే పరమాత్మా వ్యవస్థితః,' 'స్సబ్రహ్మా, స్సహరి', ఇంక మీరు అనుకున్న దేవతలందరూ వాడే అని చెప్తారు. అదీ మనకి మంత్రపుష్పంలో చెప్పింది. ఆ చిన్న బిందువు ఆధారంగా, ఇంత పెద్ద భయంకరమైన మన over weight శరీరాలన్నీ కూడ ఏర్పడినాయి. అది తప్పకుంటే ఈ మొత్తం అంతా పడిపోతుంది. అంతేకానీ ఇవన్నీ కలిసి దానిని జాగ్రత్త చేసుకుంటున్నాయి అనుకుంటే అంతకన్న అజ్ఞానం ఇంకోటి లేదు. అది వీటన్నిటినీ జాగ్రత్త చేస్తోంది. సమస్త లోకాలకి ఆధారం అది! మనలో వుండే సప్తధాతువులు ఏడు లోకాల క్రింద లెక్క. ఒక్కొక్క ధాతువు ఒక్కొక్క లోకానికి సంబంధించి వుంది. శరీరంలో అన్నిటికన్నా స్థూలం ఎముక. అన్నిటికన్నా ఉత్తమమూ, సూక్ష్మం శుక్రబీజం. ఈ ఏడు ధాతువులకు సంబంధించిన లోకాలు, నీలో ఏడుధాతువులు గా శరీరం లో పనిచేస్తున్నవి అన్నీ కూడా అది ఆధారంగా వున్నవి. నువ్వు కూడ అది ఆధారంగా వున్నవాడివే. నీవు వాడి ఆధారంగా వచ్చిన ప్రతిబింబానివి. ఈ ఏడులోకాలకి ఏడు ధాతువులుగా ఏర్పడిన శరీరం కూడ వాడి ఆధారంగా ఏర్పడినదే. ఏది మొత్తానికి ఆధారమో, దానిని మరచిపోవడం చేత మనిషి అజ్ఞానంలో పడతాడు. ఇదే శరీరం బందీకృత అవడమంటే! ఇల్లు కారాగారమవుతుంది. House has become prison. ఎప్పుడు? వాణ్ణి మర్చిపోయినప్పుడు! శరీరాన్ని ప్రతివాడు 'వాడిది' అనుకుంటే కవచం అవుతోంది మేదినీపతి నామం లో. ఇప్పుడు ఇందులో అసలు మొత్తానికి ఆధారం అంత చిన్నదిగా కనిపిస్తున్న బిందువు అని చెప్తున్నారు. అందరిలోను ఆ కేంద్రబిందువు ఆధారంగా మొత్తం ఏర్పడుతున్నది. ఇప్పుడు ఈ మామిడిచెట్టు ఉందనుకోండి, దీనికి ఓ కేంద్రబిందువు వుంటుంది. మనం ఉన్నామనుకోండి, ఓ కేంద్రబిందువు వుంటుంది. గురువులు మొత్తానికి ఓ కేంద్రబిందువు వుంటుంది. దానిని 'శంబళ' అని అన్నారు. ఏం జరిగినా శంబళకి తేడా రాదు. శంబళకి తేడా వస్తే గోళం వుండదు. అట్లాగే ఈ శరీరంలో వున్న వాడు తప్పుకుంటే, ఈ శరీరాన్ని ఎంత బాగా కాపాడినా, ఈ శరీరానికి ఎంత నగిషీ పెట్టినా, Cosmetics రాసినా, రోజూ తలంటుపోసినా, ఎన్ని చేసినా ఏమీ ఉపయోగం లేదు. ఉండాల్సినది అది, దానివల్ల వచ్చే స్పందనం! అది బావుంటే, మిగతావన్నీ బావున్నట్టే. అది బావుండకపోతే ఎన్ని బావున్నా బావుండనట్టే. భక్తరాజ్ మహరాజ్ గారు ఓ మాటన్నారు. ఆయన్ని వారానికొకసారి ఒక డాక్టరుగారు వచ్చి check చేసి వెళుతూ వుండేవారు, ఎందుకంటే ఆయనకి గుండెజబ్బని. 'నాకు జబ్బంటారేమిటి వీళ్ళూ పార్వతీకుమార్? హింస నడుస్తున్నంత సేపు ఏం ఢోకా లేదు. హింస బావుందో లేదో నేను చూసుకుంటాను, మిగతావన్నీ వాడు చూస్తాడు.

మిగతావి బావున్నా, ఇది బావుండకపోతే ఉండదు కదా. డాక్టరుగారు వచ్చి బాగానే వుందని చెపితే, వీడికేం తెలుసు, నాకు బావుందని, నాకు బావులేదికక్కడ వాడు బాగా లేదన్నప్పుడు నాకు బాగానే వుంది. అసలు నిజంగా బావుండనప్పుడు డాక్టరుకి తెలియదు. ఎందుకంటే ఇది తెలియదు కదా వాడికి, అందులో నేనున్నాను కదా. ఇది బావున్నంతసేపు నేనున్నట్టే. బావుంటుంది. ఆ పైన ఉండేవన్నీ కూడ దానిమీద ఆధారపడి వున్నాయి కదా. ఈ సప్తధాతువులతో కూడిన శరీరం, దానిమీదే ఆధారపడి వుంది కాబట్టి, ఇది బావుంటే నేను బావున్నట్టే. ఇది బావులేనప్పుడు అది ఎంత బావున్నట్టు కనిపించినా బావున్నట్టు కాదు. అందుకే సరిగ్గా పోయే time కి డాక్టరుకి తెలియదు' అంటారాయన. 'ముందు నుండి పోతావు పోతావని చెపుతూ వుంటాడు రోజూ. వీడు పోతాడన్నప్పుడు వాడు పోడు. ఫర్వాలేదన్నప్పుడు పోతూ వుంటాడు' అని చెప్పారు. అందుకని తెలియడమంటే లోపల కేంద్రం నుండి పరిధికి అన్నీ ఏర్పడినాయి తప్ప, పరిధి నుండి కేంద్రానికి నిర్మాణం జరగలేదు. సృష్టి from centre to circumference. అందుకని కేంద్రం బావుంటే పరిధికి తేడా వచ్చినా మళ్ళీ నిర్మాణం చేసుకోవచ్చు. కేంద్రం బావుండక పరిధి ఎంత గట్టిగా వున్నా ఉపయోగం లేదు. ఎంత బలిష్ఠమైన శరీరాన్ని కలిగివున్నా మనిషి పాపం వెళ్ళిపోవడం లేదా? కట్టుదిట్టం చేసినా సమయం వచ్చేసరికి ఎటునుండి వస్తుందో తెలియదు, ముడుచుకు పట్టుకుపోతుంది కదా. అర్జునుడు అష్టదిగ్బంధనం చేసినా పట్టికెళ్ళిపోయాడు కదా యముడు, బ్రాహ్మడి కొడుకుని. అర్జునుడికి ఇటు నుండి అటు తెలుసు బాగా. ఎంత కట్టడి చేసినా, కట్టుదిట్టం చేసినా అవ్వలేదు. 'అడవి రక్ష లేని అబలుండు వర్ధిల్లు, రక్షితుండు మందిరమున చచ్చు' అని భాగవతంలో ఓ పద్యం వుంది. మనల్ని మనం రక్షించుకుందామని రకరకాలుగా planలు వేసుకుంటూ వుంటాము. అది ఎట్నుంచి వస్తుందో తెలియదు. కొట్టేస్తుంది వచ్చి. కానీ అసలు ఏ రక్షణ లేనివాడు అడవిలో కూడ హాయిగా వుంటాడుట. అట్లాగే ఇక్కడ కూడ! అసలు విషయం బావుంటే, మిగతా అంతా బావుంటుంది. వాడూ అసలు విషయం! ఇది చెప్పడానికి మహాశృంగఃు. ఆయన ఉన్న స్థానానికి దగ్గరగా వుండి, అనుసంధానం చెందు. ఇంక మిగతావన్నీ అంటావా, దానికి లోబడి వున్నవే కదా. ఈ విషయాలన్నీ కూడ వాళ్ళకి దగ్గరగా వున్నవే, కాబట్టి నీకు దగ్గరవుతాయి. వాణ్ణి వదిలేసి, మిగతావన్నీ పట్టుకుంటే అంత పెద్ద సుఖం లేదు. ఎందుచేతనంటే మిగతావన్నీ పట్టుకుంటే, దేవతలకి కూడా దిక్కు లేదు. వాడు తప్ప! అందరికీ దిక్కయిన వాణ్ణి నువ్వు పట్టుకుంటే, నీకు వాడు దిక్కు అయితే, దేవతలకి కూడా వాడే దిక్కు కాబట్టి, నీకు వాళ్ళు స్నేహితులై వుంటాడు. సహకరిస్తూ వుంటారు. సహకారం అందిస్తూ వుంటారు. అసలు వాడ్ని కాకఇంకోణ్ని పట్టుకున్నావనుకో. వాడికే time బాగుండకపోతే నీకేమి చేస్తాడు? తక్షకుడు ఇంద్రుణ్ణి పట్టుకున్నాడు, గురువుగారూ కొంచెం కాపాడండి అని. అంటే నీకేం ఫర్వాలేదు లేవయ్యా నాకుల్చి చుట్టూ చుట్టుకుని కూర్చో, అన్నాడు. ఏమైంది?

జనమేజేయుడు చేసే యజ్ఞం లో ఇంద్రుడు, కుర్చీ, కుర్చీకి కట్టుకున్న తక్షకుడు ముగ్గురూ అలా పల్టీలు కొట్టుకుంటూ, హోమగుండం లోకి వచ్చేస్తారు. ఏం ఉపయోగం లేదు! గరుత్మంతుణ్ణి పట్టుకున్నా గర్వభంగం పొందిన వాళ్ళున్నారు. పట్టుకుంటే వాణ్ణి పట్టుకోవాలి. లేకపోతే వాడియందే ఎప్పుడూ ఉండే వాణ్ణి పట్టుకోవాలి. వాడు మరీ గట్టి! వాడికి ఒకళ్ళే ఇష్టం. 'నాకు మేలుగోర, నా భక్తులకు కాని' అంటాడు అంబరీషోపాఖ్యానములో. భగవంతుడు భక్తులకు commited అండి. భక్తుడికోసం ఏదైనా చేస్తాడుట. ఇద్దరూ మద్దిచెట్లై పడి ఉండమని నారదుడు శాపం ఇస్తే, ఎలాగ విముక్తి అంటే భగవంతుడు వచ్చి రోలు కట్టుకుని మీకు స్పర్శ ఇచ్చి ముక్తి నిస్తాడన్నాడుట. అంటే పాపం అంత చిన్న పిల్లవాడు కూడా బాగా అల్లరిచేసి, వాళ్ళమ్మకి రోలు కట్టేసే బుద్ధి కల్పించి, ఆ రోలు లాక్కుంటూ వెళ్ళి చెట్లు పడేసి వాళ్ళకి మోక్షం ఇచ్చాడు. ఎందుకు చేశాడుట? కేవలం నారదుని వాక్యం సత్యం చెయ్యాలని చేశాడుట. ఎంత భక్తవత్సలుడో భగవంతుడు, అని రాస్తాడు భాగవతంలో. భగవద్భక్తుని యొక్క వాక్యం సత్యం చెయ్యాలని చాలా రకాలుగా భగవంతుడు కృషి చేస్తాడు. కనుక పట్టుకుంటే భగవద్భక్తుణ్ణి పట్టుకో. లేకపోతే భగవంతుణ్ణి పట్టుకో. భగవంతుని పట్టుకోవడం కన్నా, భగవద్భక్తుని పట్టుకోవడం సుకువు. అలా పట్టుకుంటే నువ్వు శృంగముకి దగ్గర వున్నట్టే! సద్గురువుని పట్టుకుంటే! దేవతలని కూడా నువ్వు లెక్క చేయనక్కరలేదు. ఇదేగా మొట్టమొదటి కథ మనకి గురుచరిత్రలో ఇస్తారు. గురువుగారు 'కుష్టురోగం వస్తుందిరా నాకు, అందుకని నన్ను వదిలేయండిరా, నాకు సేవ చేయలేక మీరు చస్తారు పొండంటాడు'. అంటే ఓ దీపకుడనే శిష్యుడు (వాడిలో వుంది దీపం) 'అదేం కుదరదు సార్, మీరు బావున్నప్పుడు మీతో కలసి పెసరట్లు, దోసెలు తిని, మీరు బావులేనప్పుడు వదిలెయ్యడం కాదు కదా.' అని వాడు పోడు. గురువు 'నేను కాశీ వెళ్ళిపోతున్నా నంటాడు'. ఈ శిష్యుడు కూడా వెంట వెళతాడు, 'మీ సేవలు చేసుకుంటాను నేను. మీరే నాకు సర్వస్వం' అని. వీడు చేస్తూ వుంటే, ఆయనకి కుష్టురోగం ఎంత వస్తుందంటే, శరీరంలోంచి ఘోరమైన వాసన కొడుతూ, పురుగులు బయటికి వస్తూ వుంటాయి. మనం అయితే బయటికి వెళ్ళి బూతులు తిట్టుకుంటాం. ఇంత భయంకరంగా వుంటుందనుకోలేదు, ఇంత కుళ్ళుందేమిటి ఈయన లోపల అని. ఇటువంటి భావనలు వస్తాయి కదా. ఏమిటేమిటో assessments చేస్తూ వుంటాం. అదేం లేదుట పాపం. అట్లా సేవ చేస్తున్నాడుట. అదంతా తీస్తున్నాడుట, కడుగుతున్నాడుట, శుభ్రం చేస్తున్నాడుట. విసుక్కోవడం లేదుట. ఆ సేవ చూసి, కాశీ విశ్వేశ్వరుడికే విపరీతమైన ఆనందం కలిగి, ఒకరోజు గురువుగారు నిద్రపోతూ వుంటే శిష్యుణ్ణి పిలిచాడుట, 'ఒకసారి ఇలా రారా. నీయందు నాకు చాలా వాత్సల్యం కలిగింది. నీవేమిటి ఇంత సేవ చేస్తున్నావు, నేనెక్కడా చూడలేదు. నీకు ఏం వరం కావాలంటే ఆ వరం ఇస్తాను కోరుకో, నీ గురువుని బాగు చెయ్యమంటే బాగుచేస్తాను' అని శివుడు అంటే 'మా గురువుగారిని అడిగి చెపుతాను

సార్' అంటాడు. మనమైతే 'గురువుకి నేనే చేసిపెట్టానండి, లేకపోతే చచ్చేవాడు కుళ్ళు కంపులో పడి. ఏదో నాయందు విశ్వాసము, దయ ఉండడంచేత నేను ఆయనకి చేసిపెట్టానని, లేకపోతే ఈయన ఏమై పోయేవాడో' ఇట్లా మాట్లాడుతాము కదా. దీపకుడన్నాడు 'చాలా సంతోషం. విశ్వేశ్వరుడివి నువ్వు దర్శన మిచ్చావు. కానీ నాకు నా గురువు ఆజ్ఞ కావాలి. ఆయన చెప్పినది నేను చెయ్యాలి. కాబట్టి ఆయన్ని అడిగి నీకు చెపుతాను' అంటే 'ఇదేమిటిరా నేను సాక్షాత్తూ శివుడిని కదా' అంటే, 'అయ్యుంటే అయ్యుండచ్చు గాక' అంటాడు. 'సరే అడిగి చెప్పు' అని వెళ్ళిపోతాడు. గురువు లేవగానే 'ఏమిటిరా ఎవరితో మాట్లాడుతున్నావు' అని అడుగుతాడు. ఈయన నిద్రపోడు. సద్గురువు పిశాచం కన్నా గట్టిగా పట్టుకుంటాడండీ, వదలడు. అంటే 'శివుడు ఇలా వచ్చాడు, ఇట్లా చెప్పాడు' అంటే 'అయితే శివుణ్ణి అడిగి నన్ను బ్రతికిస్తావా నువ్వు' అని అడుగుతాడు. అంటే 'అటువంటి ఉద్దేశ్యాలు నాకేం లేవు. మీకు చెప్తున్నాను అంతే! మీరు ఏం చెపితే అదే!' అని అంటాడు. అయితే 'పామ్మును విశ్వేశ్వరుణ్ణి' అంటాడు గురువు. విశ్వేశ్వరుణ్ణి పామ్మనడం ఏమిటండి? మరి అదే గురువు అంటే! ఆయనా, ఈయనా ఒకటే! ఇట్లా నానాతిప్పలు పెట్టిన తరువాత ఒకరోజు గురువు పువ్వల్లే లేస్తాడు ప్రొద్దున్న. 'ఏమిటైంది' అంటే, 'అసలు ఏ జబ్బూ లేదురా, నీకోసమే ఇట్లా నటించాను. అందరూ వెళ్ళిపోయారు కానీ నువ్వు ఒకడివి మిగిలావు. నువ్వు వదలడం లేదు మరి నన్ను. నువ్వు pass అయ్యావని' చెప్తాడు. ఇది మొదటికథ గురుచరిత్రలో. గురువు ఆరాధనలో ఉన్న ముఖ్యమైన విషయం అదే.గురువు చెప్పినది వదిలేసి వేరే దేవతలను ఆరాధన చేస్తున్నాడుట అంటే, గురుతత్త్వము అబ్బలేదని అర్థం. గురువాక్యం ఎంతవరకు తీసుకెళుతుందంటే, బ్రహ్మాండంలో ఏదీ ఆ వాక్యాన్ని ఎదిరించలేదు, నువ్వు ఆ వాక్యాన్ని పరిపాలిస్తున్నట్లైతే! అంతటివాడు గురువు! సమస్తానికి పెద్దవాడు దేవుడు. అతడి ఆధారంగా సమస్తం వుంది. అందుకే పట్టుకుంటే వాణ్ణి పట్టుకోవాలి. వాణ్ణి పట్టుకోవడం అంత కుదరదు కనక గురువుని పట్టుకోవాలి. గురువు ప్రతిరూపం, ప్రతినిధి. అది నిధి, ఇది ప్రతినిధి అని చెపుతూ వుంటారు. ఇది re presentation కదా. Representative అంటే ఏమిటి? వాడినే నువ్వు present చేస్తున్నావు. Representative of God అని అర్థం. అతణ్ణి పట్టుకుంటే చాలు. అతడు ఎక్కడ వున్నాడు? సద్గురువు ఏం చేస్తాడంటే, తను గురువు అని చెప్పకోడు. సత్యసాయి 'నాకు ఎవరూ భక్తులు లేరు. నాకు శిష్యులు లేరు. నేనే అందరికీ శిష్యుణ్ణి' అంటారు. అందుకని తనకి శిష్యులున్నారు అనుకునేవాడు గురువు కాడు. సద్గురువు ఏం చేస్తాడంటే, తన దగ్గరికి వచ్చినవాడికి, వాడిలో గురువు ఎక్కడ వున్నాడో చూపిస్తాడు. అటు పంపిస్తాడు. నేను 1972 లో అర్ధరాత్రి మా ఇంట్లో, మా తమ్ముడికి ఒంట్లో బావుండకపోతే, మాస్టారు వాడికి సేవలు చేస్తూంటే, ఆయన Belgium లో ఇచ్చిన ఉపన్యాసం casette ఒకటి ప్రక్కన వర్మగారని ఆయన పెడితే వింటున్నాం. 'How to find the address of the Master' అని lecture.

మాస్టరుగారి చిరునామా ఎక్కడ దొరుకుతుందని? అట్లా అట్లా అల్లుకుంటూ వెళ్ళిపోయి, శ్వాస దగ్గరకి తీసుకెళ్ళి, శ్వాసలో నుండి స్పందనం దగ్గరకి తీసుకెళ్ళి, అక్కడనుండి లోపలకి తీసుకెళ్ళి, అక్కడ వున్నాడు గురువు అని చెప్తారు EK గారు. అట్లా చూపిస్తారన్నమాట! సద్గురువు ఎప్పుడూ కూడ 'కుంభినీధవు చెప్పేవాడే గురుడు' కదా. అందరిలో వుండే భగవత్తత్త్వం, మొత్తం సృష్టంతా వ్యాపించిన తత్త్వం, దాని address ఏమిటో నీకు చూపించి అక్కడకి పొమ్మని చెప్పేవాడు గురువు. ఎందుకంటే అందరం వాడికి శిష్యులమే! అందరూ వాడి సంతతే! కాబట్టి చూపిస్తూ వుంటాడు. ఆ మహాశృంగాన్ని అందించేవాడుగా అతడే మనకు దిగివస్తాడు. అతడే మనకి గురువు. వచ్చినవాడి యందు అదే వుంటుంది, ఇంకొకటి వుండదు. అంతేగాక అతడు దారి చూపించేది తనవైపు కాదు. వచ్చినవాడి లోపలకి దారి చూపిస్తాడు. ఈ శరీరానికి, మనకి అధారంగా ఇమిడి వున్న తత్త్వం మనకి అందిందనుకోండి, ఓ శృంగంతో వున్నట్టే. అంతా వుంటుంది. గుర్తుందా మీకు? గుడి పైన ఉండే గోపురం చివర ఉండే దాన్ని 'విమానం' అంటారు. ఏమిటి విమానం? విమానం ఎటు నుండి వస్తుంది? పై నుండి క్రిందకి land అవుతుంది కదా. ఆ విమానంలోంచి ఆయన దిగివస్తాడన్న మాట అక్కడకి. ఆ విమానమే మనలో స్పందనం. స్పందనం దగ్గరకి వెళితే శృంగం దగ్గరకి వెళ్ళినట్టే! స్పందనమును నడిపిస్తున్న వాడితో అనుసంధానం ఏర్పడితే, మహాశృంగం దగ్గరకి వెళ్ళినట్లండి. దానితో వుంటే ఈ ఏడు మెట్ల శరీరం ఉన్నా, ఉండకపోయినా ఇబ్బంది లేదు. ఉంటే బాగానే వుంది. లేదూ మళ్ళీ వస్తుంది. ఈ ఏడూ ఎప్పుడూ వస్తూనే వుంటాయి. అక్కడ కూర్చుని, అట్లా ఏర్పడతాయి. పరమగురువులు Ether లో వుండి, సంకల్పమాత్రం చేత సప్తధాతువుల శరీరనిర్మాణం చేసుకుని అక్కడ ప్రత్యక్షం కాగలరు. ఎందుచేత? ఈ తత్త్వంతో కలసి వుండడం చేత! ఇది manifestation! ఇది ఆదిత్య, రుద్ర, వసువుల యొక్క నిర్మాణం కాబట్టి, 'దేవా యద్యజ్ఞం తన్వానాः అబధ్నన్ పురుషం పశుమ్' పురుషుని ఆధారంగా దేవతలు యజ్ఞం చేసి, ఈ సృష్టి మొత్తాన్ని తయారుచేశారని చెప్పారు కదా. కాబట్టి దైవాన్ని అనుసంధానం చేసుకున్నవాడు అట్లా నిర్మాణం చేసుకోగలడు శరీరాన్ని. ఋషులు అట్లా ప్రత్యక్షం చేసుకుంటారు. అట్లా అంతర్ధానం అవుతూ వుంటారు. ఈ గుడారాన్ని నిర్మాణం చేసుకోవడం, అందులోంచి మళ్ళీ వాణ్ణి అదృశ్యుణ్ణి చేసుకోవడం. ఇవన్నీ వాళ్ళకి పెద్ద విషయం కాదు.

## 558 కృతాంతకృత్

కృత చెయ్యడం. కృతాంతః అంటే చెయ్యడానికి ఒక అంతం వుంది. దానికి అంతంట. దాన్ని చేస్తాడుట ఆయన. ఇవన్నీ చేశాం బాగానే వుంది. మళ్ళీ ఇవన్నీ withdraw చెయ్యడమో? చేశాం. తెలివొచ్చింది. ప్రజ్ఞలోకి వచ్చాం. అక్కడ నుండి గుణాలలోకి వచ్చాం. శక్తిని అందుకున్నాం. శరీరంతో పనిచేశాం. ఇంక నీకు నిద్ర రాదురా ఈ జన్మకి అంటే? బయటికి వచ్చాం. ఇంక తిరిగి లోపలకి వెళ్ళలేవు. ఇలా చేసుకుంటూ వుండు అంటే, మహాబ్రతికితే వారం రోజులు బ్రతుకుతామేమో! అందుకని కృతాంతకృత్! ఈ చేసేవాటికి అంతాన్ని చేసేవాడుట వాడు. పౌర్ణమి వచ్చింది, పదిహేను కళలు అయిపోయినాయి, పదహారవ కళ, ఇంక పదిహేడు, పద్ధెనిమిది అలా పెరుగుతూ పోతూ వుంటే, మనకు పగలే ఉంటుంది తప్ప, ఇంక రాత్రి వుండదు. కిటికీలన్నీ వేసేసుకొని చీకట్లో పడుకోవాల్సి వుంటుంది. కిటికీ తెరిచాం ప్రొద్దున్న, మళ్ళీ రాత్రి మూసుకోవాలి. తెరిస్తే మూసుకోదు అన్నట్టుగా వుందనుకోండి, తెరవడం కృతము! మళ్ళీ దానిని ముయ్యాలి కదా, కృతానికి అంతము! అట్లా చేస్తాడుట. అట్లా చెయ్యకపోతే చస్తాం. అన్ని విషయాలలో ఇది వుంది. ప్రతిదానికీ మితులు ఏర్పరచి, వాటికి తిరోధానం ఏర్పరుస్తారు. పౌర్ణమి తరువాత అమావాస్య, అమావాస్య తరువాత పౌర్ణమి. పగలు తరువాత రాత్రి, రాత్రి తరువాత పగలు. ఉత్తరాయణం తరువాత దక్షిణాయనం, దక్షిణాయనం తరువాత ఉత్తరాయణం. వికసించడం మళ్ళీ ముడుచుకుపోవడం. పురోగమనం, తిరోధానం! ఇట్లా ఏర్పరచి సమస్తాన్నీ ఆ విధంగా వికసింపచేసి, మళ్ళీ తనలో కలుపుకొంటూ, మళ్ళీ వికసింప చేసి, మళ్ళీ తనలో కలుపుకుంటూ ఇలా కాలచక్రం రూపంలో వీటన్నిటినీ నిర్వర్తిస్తూ వుంటాడు. అలా నిర్వర్తించకపోతే తెమలదు. తినడం మొదలు పెట్టామనుకోండి, ఆపాలా? లేకపోతే అలా తింటూ వుంటే, పొట్ట పగిలిపోయి, చచ్చిపోమూ? తాగడం మొదలుపెట్టాం. ఆపాలా? గాలి బాగా గాలి పీల్చమన్నారని పీలుస్తున్నామనుకోండి, ఇంక వదలలేదనుకోండి ఏమవుతుంది? ఢామ్మని baloon లా పేలిపోతుంది. Expansion and Contraction are alternating principles. The law of alternation అని చెపుతారు. అందుకని ప్రతీదానికి మితి పెడతాడు. కృతమునకు అంతము చేసేవాడు కృత అంతకృత్. ఆ విధంగా ధర్మానికి గ్లాని జరుగుతోంది. చాల్లేరా ఇంక ఆపండి అని చెప్పాడు. ప్రతివారికీ limit పెట్టకపోతే సంరక్షణ వుండదు. కృతమునకు అంతము ఏర్పరచే వాడు. పరిధులు నిర్మాణం చేసేవాడు. వినాయకుడు లడ్డూలు తింటే పొట్ట పగిలిపోతుంది కదా. అందుకని తరువాత నాగపాశం ఒక మొలత్రాడులా కట్టారుట. అంటే అదే అర్థం! ఆయన శబ్దములను గుంపులుగా చేసి బయటికి వదిలేస్తున్నాడుట. అవే ఉండ్రాళ్ళు! లడ్డు

చెయ్యాలంటే బూంది గుండ్రంగా చేసి, గుండ్రంగా చేసిన బూందితో లడ్డూలు తయారుచేసి గోళాలుగా తయారుచేస్తాం. అట్లా శబ్దాలన్నిటినీ కూడిక చేసి, పదాలు చేసి అట్లా నిర్మాణం చేసే నిర్మాణానికి అతడు గణాధిపతి! ఒకే తత్త్వాన్ని గణములు, గణములుగా విభజించడం, ఇది గణేశుడు అంటే అర్థం. అంతకు ముందు సృష్టి లేదు. సృష్టి ఏర్పరచాలంటే అంతా వ్యాపించిన తత్త్వాన్ని ముక్కలు ముక్కలు చేసి, వాటిని ఉండలు, ఉండలుగా చేసి విసిరేస్తున్నాడుట గోళాలుగా. ఇలా అంతు లేకుండా విసిరేస్తే? అందుకని ఏం చేశారంటే పొట్ట పగిలిపోతుందని చెప్పి, పాశం వేసి కట్టారు. పరిధి అంటే ఏమిటంటే That is the circumferance. దాన్నే saturn ring అంటాం. ప్రతివాళ్ళకీ ఒక 'ring pass not' అని వుంటుంది. అది దాటితే చచ్చారే! అట్లాగే ఈ భూమి చుట్టూ ఒక వలయం వుంటుంది. అది దాటితే ఇంక నీకు బ్రతికే అవకాశం వుండదు. అట్లా అన్నిటికీ ఏర్పరచి వుంచేశాడు. వీటన్నిటినీ మళ్ళీ అవసరమైనప్పుడు తన లోపలకి మళ్ళీ మింగేస్తాడు. మింగడం మనిషి కాదు, తత్త్వం! ఇది సినిమా రూపంలో చూపిస్తే, వాడు ఇంత మనిషై పోయి, ఒక్కొక్క గోళాన్ని లోపల వేసేసుకుంటున్నట్టుగా చూపించుకోవాలి. అట్లా వుండదు. దాంట్లోనే దానికి సంబంధించిన తిరోధానానికి కావలసిన శక్తి కూడా పెట్టి పంపిస్తాడు. Path of returns అన్నీకూడ వాడిలోనే పెట్టి పంపిస్తాడు. ప్రతివాడికీ పుట్టుకతో పాటే వాడి బుద్ధి కూడ పెట్టి పంపించేస్తాడు. అంతా self contained system. Time వచ్చినప్పుడు అది trigger అవుతుంది. వాడు వచ్చేస్తాడు. ఎందుకంటే ప్రతివాడినీ మళ్ళీ ఎట్లా పట్టి తెచ్చుకుంటాడు? ఒక్కొక్కరికి ఒక్కొక్కటి పెడతాడు. కొంతమందికి మూత్రపిండాలు పనిచేయడం లేదండి, ఇంక వెళ్ళిపోతారని చెపుతాడు. కొంతమందికి ఊపిరితిత్తులు పనిచేయడం లేదంటారు. మరియొకరికి గుండె! ఆ విధంగా ప్రతిదానికీ there is a checkmate. అందుకనే పెరుగుట విరుగుట కొరకే అని చెప్పారు. దీనిప్రక్కనే అది కూడా వుంటుందని గుర్తుపెట్టుకుని, ఆయనే ఈ అంతం చేస్తున్నాడని గుర్తుపెట్టుకుని, తద్వారా ఓహో-- ఇంతకన్నా మనం దాటి వెళ్ళకూడదు అనుకుని జీవించే పద్ధతి ఒకటి వుంది. ఇట్లా హానివృద్ధులు సృష్టిలో వుంటాయి. వృద్ధి మాత్రమే భగవంతుడు, హాని కాదు అనుకోవడం రూపాయి బిళ్ళలో బొమ్మే రూపాయి బిళ్ళ, బొరుసు కాదు అన్నట్టుగా వుంటుంది. రూపాయి బిళ్ళ కావాలంటే, బొరుసు లేకుండా రూపాయి బిళ్ళ ఇవ్వమంటే కాదు కదా. మన జీవితం అలాగే నిర్మాణం చేసుకుందామని ప్రయత్నం చేస్తూ వుంటాము. కేవలం ఆనందమే కావాలి దుఃఖం వద్దు అని అడుగుతున్నాం. రెండూ అడక్క! ఒకటి అడగడానికి వీలులేదు. ఒకటి అడిగితే రెండవది కూడా వస్తుంది. అగరవత్తి కావాలి బూడిద వద్దుఅనడానికి లేదు. దీపం కావాలి, కొండె వద్దు అనుకుంటే అవదు కదా. ఏదైనా ఒకటి కావాలంటే, దానితోపాటు దాని యొక్క కవల ఒకటి వుంది. అది కూడా వచ్చేస్తుంది మనం వద్దనుకున్నా. ప్రాణం కావాలంటే, మృత్యువు కూడా వస్తుంది. అదేమిటండీ ప్రాణం

వచ్చినప్పుడు మృత్యువు వస్తోందంటే, అదికూడా వస్తుంది. సౌకర్యం అనుకుంటే దాని ప్రక్కన అసౌకర్యం. లాభం కోసం పనిచేస్తే నష్టం ఎందుకు రావాలండి? ఆరోగ్యం కోసం అన్నం తింటే అనారోగ్యం రావడం ఏమిటి? ఇటువంటి ప్రశ్నలే వేస్తారు. 'వేదశాస్త్రములు ఎరిగినవారే ఎరుగరు సృష్టివిలాసం, దానికి ప్రశ్నలు వేయరాదు' అని ఒక పాట వుంది. ఎందుకు వేయరాదు. ప్రశ్నలు వేస్తేనే సమాధానములు వస్తాయి. వెయ్యకపోతే రావు. దానికి ఏం చెప్పారో తెలుసా పెద్దలు? 'సృష్టి ద్వంద్వ స్వరూపం. రూపాయి బిళ్ళ లాంటిది. ఒక్కటే కావాలనకు. రెండవది కూడా అందుకోవడానికి సంసిద్ధుడవై అడుగు.' అది చూడండి అదేదో సినిమాలో మూగ పెళ్ళాన్నిస్తే బ్రహ్మదేవుడు, అదేమిటో మూగపెళ్ళానిచ్చావ్ అంటే, వద్దురా నీకు తెలియదు అంటే లేదు లేదు కావాలనుకుంటే మాటలు తెప్పించాడు. చచ్చాడు. కదా. ఎందుకు ఇది అంటే Everything it comes in duality అంటాం! మన సంస్కృతంలో ద్వంద్వము అంటాం. ఒక్కటే అడగడానికి వీలులేదు. గులాబీమొక్క వేసి ముళ్ళు ఎందుకున్నాయి గులాబీమొక్కకి అంటే? ఉంటాయి. సంపంగి చెట్టు వేసుకుని పాము రాకూడదనుకుందుకు వీలులేదు. అమృతం కావాలని చిలికిన వాళ్ళకి ముందు ఏమొచ్చింది? ఇవన్నీ ఎందుకిచ్చారూ? ఇవాళ్టికి కూడా మనం అర్థం చేసుకోము. రెండూ వస్తాయి. తీసుకోవాలా? వద్దా? వంట చేసుకుంటానూ, గిన్నెకి మసి పట్టకూడదంటే మసిపడుతుంది. తోముకో! అమృతం కావాలంటే విషం కూడా పుడుతుంది. దాన్ని eliminate చేసుకో! అందుకనే సాధనలో ముందు వచ్చేది విషాలే బయటికి. తెగ కక్కుతూ వుంటాం. ఆ తరువాత అమృతం వస్తుంది. జ్యేష్ఠ ముందు, లక్ష్మి తరువాత. దేని తరువాత వచ్చింది లక్ష్మీదేవి? అందుకని ఏదైనా కావాలనుకుంటే దానికి counter కూడా వస్తూ వుంటుంది. దానిని అక్కరలేదనుకోబోక. ఏం చెయ్యమంటావంటే కావలసినదాన్ని పుచ్చుకుని, అక్కరలేనిదాన్ని ఏ విధంగా eliminate చెయ్యాలో తెలుసుకో లేదూ, అయినప్పటికీ వచ్చింది, You can't ask for a part. ఇది పెద్ద తత్త్వం! ఈ తత్త్వానికి సంబంధించినదే కుంభచైతన్యం. మనం ఉన్నది వున్నట్టుగా వుండి, ఇట్లాగే శాశ్వతంగా ఉండిపోవాలని అనుకుంటాం. అంటే ఉండిపోవడానికి వీలులేదు. ఉండడం కావాలంటే, లేకపోవడము దాని ప్రక్కనే వుంది. అందుకని కోరినప్పుడు దాని counter కూడా దానితో వస్తుంది కాబట్టి కోరబోక. వచ్చినది అందుకో అని చెపుతారు ఋషిప్రోక్త మార్గములో. నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తిస్తూ వుంటే, నీకు వచ్చినదాన్ని అందుకో. ఇది తెలిసినవాడు సుఖపడతాడు. మరి అది అందుకున్నప్పుడు ఇది కూడా వస్తుంది. 'అంత వివరము కలిగి అంతయును ఆపదని చింతించినది కదా తెలివి' ఎంత బాగా చెప్తాడు అన్నమయ్య. సత్కారములు పొందడం తో పాటు రేపు పొద్దున్న దుమ్మేస్తారు. అది కూడా వస్తుందని గుర్తుండాలి. సత్కారముతో పాటు ఛీత్కారము కూడా వుంటుంది. పొగడ్తతో పాటు నింద కూడా వుంటుంది. ఉత్త పొగడ్తలే కావాలంటే అయ్యే పని కాదండి. నిందలు కూడా

వస్తూ వుంటాయి. అదృష్టం కొద్దీ పాగడ్తలు మొహం మీద వుంటాయి. నిందలు వెనుక వుంటాయి. మన ముందు ఎక్కువ మాట్లాడలేక వెనుక అంటారు. వాడేం చదివేడు వాడి బొంద అంటూ వుంటారు. వాడికేం తెలుసంటాం. అందుకనే శ్రీకృష్ణుడు ఏం చెప్పాడంటే 'తుల్యనిందా స్తుతిర్మౌనీ' అంటే నిందాస్తుతుల యందు ఒకే భావము తుల్యభావము. సమతూకంగా వుండు. మౌనంగా వుండు. పొగిడితే అట్లా baloon లాగ ఉబ్బిపోక. అలా ఉబ్బితే చిల్లు పడినప్పుడు కుంచించుకుపోవాలి. ఉబ్బితే కదా బుడగలకి problem. అసలు గాలే తీసుకోలేదనుకోండి ఎంత కొట్టినా, గాలి వెళ్ళనప్పుడు విచ్చుకోదు. విచ్చుకోనప్పుడు పిన్ను పెట్టి పొడిచినా, ఏమవుతుంది? అట్లాగే వుంటుందది. అదిట కృష్ణుడు! పొగిడినా ఒకటే, తిట్టినా ఒకటే! రెండింటికీ ఒకటే సమాధానం నవ్వు! అది కూడ వికటాట్టహాసం కాదు చిరునవ్వు! పరమగురువులు 'వికటాట్టహాసం చెయ్యడం రాక్షసప్రవృత్తి' అని చెప్తారు. చిరునవ్వు దైవీస్వభావం. అట్టహాసాలు చేస్తూ వుంటారు చూడండి. అది ఆసురీ ప్రవృత్తి. అట్టహాసం చెయ్యకండి మాకు కొంచెం disturbance కలుగుతుందని, చెప్తారు. 'మా అనుంగు శిష్యులు అట్టహాసం చెయ్యడం మేము ఒప్పుకోమని' చెప్తారు. వెకిలిగా నవ్వవద్దు. ఏడుపు మొహం పెట్టుకొని తిరగవద్దు. వెకిలినవ్వు వద్దు, ఏడుపు మొహం వద్దు. మరి ఏమిటి అంటే, చిరునవ్వు! దానికి standard ఏమిటి అంటే? రావణాసురుడు నవ్వినట్టు కృష్ణుడు నవ్వడం ఎప్పుడైనా సినిమాలో చూశారా? చూడం కదా. రావణాసురుడి నవ్వు, హిరణ్యకశిపుడి నవ్వు ఎట్లా వుంటాయి? అట్లా వుండవు. కథానాయకుడి నవ్వు వికృతంగా వుండదు. Villain నవ్వు వికృతంగా వుంటుంది కదా. అందుకే ముందు మీరు నవ్వడం దగ్గర్నుంచి నేర్చుకోండయ్యా, అని చెపుతారు గురువులు. మొన్నా మధ్యనే కొంతమంది పాశ్చాత్య స్త్రీలు చాలా వెకిలిగా నవ్వుతూ, శరీరంతో విన్యాసాలు కూడా చేస్తూ వుంటే చెప్పాను. చాల వికృతంగా వుంది. మీకేమైనా తెలుసా అని? అంటే నేను చెప్పానంటే ఏడుస్తారని, వాళ్ళు చెప్పారన్నాను. నిజంగానే వాళ్ళు చెప్పారు. చెప్పిన విషయాలు చెప్పాను. మీకు కూడా చెప్తున్నాను. ఎప్పుడూ వికటాట్టహాసాలు చేయవద్దు. వెకిలినవ్వులు వద్దు. చిరునవ్వు ఎప్పుడూ వుంచుకోండి. Cheer in every where is a divine quality అన్నారు జ్వాలాకూల్ గారు. చిరునవ్వు మనకి శ్రీకృష్ణుడు, రాముడు వాళ్ళెప్పుడూ చిరునవ్వుతో వుంటారు. వికటాట్టహాసం చేసినవాళ్ళు ఏడుస్తారు. ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి. అది వుంటే ఇది వుంటుంది. Balance! దాన్నే The golden middle path అంటారు. దానినే 'యోగం' అంటారు. ఆ చివర వుండకు, ఈ చివర వుండకు. మధ్యలో వుండు. ఎడమ రెక్క మంచిదా, కుడి రెక్క మంచిదా అనుకోకు. రెండు రెక్కలకి మధ్యలో వుండు. అందుకని కృతమునకు, అంతానికి మధ్యలో మనం ఉన్నామనుకోండి, చెయ్యడానికి, అయిపోవడానికి; చెయ్యడం, అయిపోవడం; రెండు రెక్కలుగా వుంటాయి. ఒక అయిపోవడం లోంచి ఒక చెయ్యడం వస్తుంది. ఒక చెయ్యడం లోంచి

ఒక అయిపోవడం వస్తూ వుంటుంది. అయిపోవడం ఎప్పుడూ వుండదు. చెయ్యడం ఎప్పుడూ వుండదు. అదీ మీనరాశి ప్రజ్ఞ! చాల అద్భుతమైన ప్రజ్ఞ! సంవత్సరం మొదలు, అంతము రెండూ ఒకేచోట, ఒకే బిందువులో ఇమిడి వున్నది. భూతము, భవిష్యత్తు, వర్తమానంలో ఎట్లా ఇమిడి వున్నాయో అట్లా. అందుకని మనం చేసేదాంట్లో అయిపోవడం వుంది. మనం అయిపోతుందనుకునే దాంట్లో మళ్ళీ కొత్తగా చెయ్యడం వుంటుంది. Centre becomes circumferance, Circumferance becomes centre. గురువు శిష్యుడవుతాడు, శిష్యుడు గురువవుతాడు. ఇట్లా చెప్పారు. అదికాదని, ఇదికాదని విభజించక. ఎందుకంటే అవి రెండూ కలిసియున్నవే, నీకు రెండుగా కనిపిస్తున్నాయి గాని. బొమ్మ, బొరుసు కలిపి రూపాయే కదా. విడదీయకు. నీ అవగాహన కోసం విడదీసుకో. అంతేగానీ అవి విడిగా లేవు. అది చెపుతాడు శ్రీకృష్ణుడు. 'ఈ సృష్టిలో అంతా నువ్వు మంచికే చేస్తే, పాపం ఎక్కడ నుండి పుడుతోందని' అడుగుతాడు. అది పుడుతుంది. ఎందుకంటే ఇది అగ్నికార్యం కదా. తుడుచుకుంటూ వుండాలి. అద్దం కొనుక్కుంటే దుమ్ము ఎందుకు పడాలంటే? పడుతుంది. సృష్టి అగ్నికార్యం కాబట్టి, అందులో నుండి combustion జరుగుతుంది కాబట్టి. అగ్నికార్యం నుండి పుట్టే మసిని తుడుచుకోవడం ఒక ధర్మం! ఎందుకంటే అగ్ని వున్నచోట మసి వుంటుంది. పదార్ధంతో కూడిన అగ్ని ఎక్కువ మసి ఇస్తుంది. కాబట్టి మసిని తుడుచుకుంటూ, పదార్ధం వెలుగులో ఉండడమనేది చేస్తూ వుండాలి. ఈ విధంగా సమన్వయ పరచుకోవడమనే దానికే ఈ రోజున Synthesis, అని అంటున్నాం. Synthesis అనేది కుంభరాశి ప్రజ్ఞ! ప్రతీదీ ఒకటి అద్భుతంగా కనిపిస్తే, దాని యొక్క వికృతరూపం ఇంకోప్రక్క వుంటుంది. అందుకనే ప్రతి కథకి ఒక నాయకుడుంటే, ఒక ప్రతినాయకుడుంటాడు, వాడి counterpart. లేకపోతే కథ ఏమున్నదీ? రాముడే వుండి, రావణుడు లేడనుకోండి, ఎవరు చదువుకుంటారు రామాయణం? కృష్ణుడుండి, కౌరవులు ఇత్యాదులు లేరనుకోండి, ఎవరు చదువుకుంటారు భారతం? హరిశ్చంద్రుడుండి, విశ్వామిత్రుడు లేడనుకోండి. ఎవరు చదువుకుంటారు? బంగారం యొక్క వన్నె ఎప్పుడు తెలుస్తుందంటే, మంటలో పడినప్పుడే! అన్నారు కదా. అట్లా ఈ రెండూ వుంటాయి. రెండూ రెండుగా కనిపిస్తాయి. కాదు అందులో ఇది వుంది, ఇందులో అది వుంది. అందుకని దీంట్లో దానిని చూడడం, దాంట్లో దీనిని చూడడం. పదార్ధంలో పరమార్ధం చూడడం, పరమార్ధంలో పదార్ధం ఇమిడి వుందని తెలియడం. పరమార్ధంలో పదార్ధం ఇమిడి వుందని తెలియడానికే వెంకటేశ్వరస్వామి బొమ్మ. మరి కనబడదని చెప్పి ఇంత పెట్టారు తప్ప, ఉండేది బిందువంతే. పరతత్త్వంలో పదార్ధతత్త్వం ఒక బిందువంత వుంటుంది. పదార్ధతత్త్వంలో పరమార్ధ తత్త్వం బిందువంత వుంటుంది. అందులో ఇదుంటుంది. ఇందులో అదుంటుంది. అక్కడ నుండి ఇక్కడ వరకు రెండూ హెచ్చుతగ్గుల్లో వుంటాయి. ఈ రెండింటిని రెండుగా చూడకుండా, ఒకటిగా చూడడమనేది సాధన!

సృష్టిలో మంచే తీసుకుంటాను, చెడుతో సంబంధం లేదు అంటే, మంచితో చెడు కూడా ఎప్పుడూ వుంది, సృష్టి మొదలవగానే వుంటుందది. ఈ రెండింటి యొక్క అస్తిత్వం యొక్క ప్రయోజనం తెలుసుకోవడం కుంభచైతన్యం! The fitness of things. కుంభచైతన్యం ఏం చెబుతుందంటే there is no waste in this world, there is only wasted thing. వృథా ఏమీలేదు సృష్టిలో. నీ బుర్రలో నీకుండే అజ్ఞానం మేరకు వృథా వుంటుంది. ఈ మనిషి పనికిరాడనేదేముండదు. ఈ జంతువు పనికిరాదనేదేముండదు. ఈ పనికిరాని మొక్కలు హాయిగా పెరుగుతున్నాయి అంటాం. పనికిరాదంటే నీకు తెలియదు అది ఎట్లా వినియోగించుకోవాలో తప్ప, అది పనికిరాకపోవడం వుండదు. ఇది సమన్వయం! అది కృతాంతకృత్ అనే పదంలో వస్తుంది. ఎందుకంటే అంతమనేది తెలియడమనేది కుంభరాశి చైతన్యం! నిజానికి అంతము ఆరంభమే! అంతం కాదిది ఆరంభం అని చెప్తూ వుంటారు. ఆరంభం అంతానికే. అంతం ఆరంభానికే. కాని అంతంలో ఆరంభం జరుగుతుంది. ఆరంభంలో అంతం జరుగుతుంది. ఉచ్ఛ్వాస నుండి నిశ్వాస వస్తుంది. నిశ్వాస నుండి ఉచ్ఛ్వాస వస్తుంది. ఒకదానితో ఒకటి పెనవేసుకున్నట్లుగా వుంటుంది. రెండూ కలిపి స్పందనగా ఉంటాయి. అందుకని ద్వంద్వానికి అతీతంగా వున్న స్థితిలోకి వెళితే, ఈ రెండింటి యొక్క ప్రయోజనమేమిటో తెలుస్తుంది. ఆ విధంగా తెలుసుకోవడానికి ఒక అద్భుతమైన భావన ఈ కృతాంతకృత్! మనకి ఆధ్యాత్మికపరంగా 50 percent సృష్టిని negate చెయ్యడమనే దుర్బుద్ధి ఒకటి ఏర్పడుతూ వుంటుంది. ఎందుకు ఏర్పడుతుందంటే, మనం సృష్టిని 50 percent non God చేస్తాం. దైవం అంతటా వున్నాడని, అంతటా వున్న దైవం నువ్వు దుష్టులనుకునే వాళ్ళలో కూడా వుంటాడు. ఈ రోజు ప్రపంచమంతా సద్దామ్ హుస్సేన్ చాలా దుష్టుడంటున్నారు. అతడి నుండి ఏ ప్రయోజనం పెట్టాడో దేముడు మనకు తెలీదు. అందుకని ఋషి దృష్టి ఎట్లా వుంటుందంటే, they see higher plan in the physical events. Hitler ని తిట్టిపోసిన వాళ్ళు బోల్డుమంది వుంటే, Hitler కూడా మొత్తం plan లో భాగమే కదా. అంటాడు ఋషి. ఎంత మంచి జరిగింది యుద్ధం జరగడం వల్ల. అది చూడరేం? చెడే చూస్తారేం? చెడులో మంచి వుంటుంది, మంచిలో చెడు వుంటుంది. కాకపోతే కష్టంలో ఒక మంచి వుంటుంది. సుఖంలో ఒక చెడు వుంటుంది. ఇట్లా కలపోతగా దీంట్లో అది చూడడం, దాంట్లో ఇది చూడడం. మొత్తం అంతా ఏమీ లేదయ్యా అసలు. ఇవన్నీ ఇట్లాగే వుంటాయి తప్పా, రెండుగా కనిపిస్తాయి. దానికన్నా కొంచెం పైన వెళ్ళి అక్కడ కూర్చుంటే higher dimension, ఇవన్నీ ఇట్లా వుంటాయి అని తెలుస్తుంది. మంచి, చెడు ఎప్పుడూ కలిసే వుంటుంది ప్రపంచములో అని తెలుస్తుంది. భగవంతుడు దిగివచ్చినా, పూర్తిగా అధర్మాన్ని నిర్మూలించడం కాదు. ధర్మానికి, అధర్మానికి మధ్య balance చేసి వెళ్ళిపోతాడు. అట్లా కాకపోతే వాడు వెళ్ళిన తరువాత మళ్ళీ ఎక్కడ నుండి వచ్చింది అధర్మం? Balancing factor. ధర్మాన్ని నిర్వహించేవాళ్ళు సరిగ్గా

నిర్వహించకపోతే అధర్మం పెరిగిపోతుంది. అదే దేవతలు కొంచెం గర్వించినప్పుడల్లా రాక్షసులు వచ్చి వాళ్ళ కుర్చీ లాగేసుకోవడం. మళ్ళీ దేవతలకు బుద్ధి వచ్చినప్పుడు భగవంతుడు వచ్చి, ఇంక చాల్లేరా అని రాక్షసులని పంపించేసి, వీళ్ళని కుర్చీలో కూర్చోపెట్టడం. ఇవే కథలు మనకి. లేకపోతే అసలు అసురులని ఎందుకు సృష్టించాలండి? అదుంటే ఇదుండాలి. సురత్వం వున్నప్పుడు అసురత్వం వుంటుంది. అసలు తత్త్వంలో ఈ రెండూ ఇమిడి వుంటాయి. ఇటువంటి అవగాహననే 'సమన్వయము' అంటారు. Synthesis అంటారు. మనకి ఎంతసేపూ చెడు కాకూడదు. మంచి కావాలి. చెడేమిటి, మంచేమిటి? ప్రవాహం అది. నది పల్లాలలోనూ పారుతూ వుంటుంది, ధడేల్మని పడిపోతూనూ వుంటుంది కదా. అట్లా పడకపోతే అక్కడ నుండి ఎలా వచ్చింది? ఎన్నిచోట్ల క్రిందపడింది? ఎన్నిచోట్ల గుట్టమీద నుండి పడింది? ఎన్నిచోట్ల సమతలంగా వెళ్ళింది? ఒడిదుడుకుల లోంచి ప్రవహించింది. అన్ని ప్రవాహాలు అలా ప్రశాంతంగా రాజమండ్రి దగ్గర గోదావరి వున్నట్టు ఉంటుందా? ఈ సత్యం కనుక అంగీకరించగలిగితే, జీవితంలో ఒక పెద్దమెట్టు ఎక్కినట్టు. అట్లా కాకపోతే ఇట్లా కుస్తీ పడుతూనే వుంటాం. అది ఎప్పటికీ అవదు. కుస్తీకి ready గా వున్నప్పుడల్లా అవతల నుండి కుస్తీ పట్టడానికి ready గా వుండేవాడు వుంటాడు. అదీ కృష్ణుడు చెపుతాడు. 'చెడుతో యుద్ధం చేద్దామని అనుకోబోకు. వాడు చేస్తే తప్పక నువ్వు చెయ్యి. వాడు ఊదితే శంఖం నువ్వు ఊదు. వాడు బాణం వేస్తే నువ్వు బాణం వెయ్యి. నువ్వే తగుదునమ్మా అని, బాణం తీసి వేసెయ్యడానికి ప్రయత్నించకు. శంఖం నువ్వు పూరించవద్దురా. వాళ్ళని పూరించనీ. అప్పుడు మనం పూరిద్దాం. వాడు వెయ్యనీ బాణం, మనం వేద్దాం. నువ్వు ముందు వెయ్యడమెందుకు?' అంటాడు. తెలిసినవాడు అట్లా వుంటాడు. ఆ synthesis కృష్ణుడిలో వుంది. Synthesis రాజయోగంలో వుంది. మిగతా వాళ్ళంతా పాపాలు, పుణ్యాలుగా రెండూ విడదీసి చూపించి అదివద్దు, ఇది కావాలి, దీన్ని పొందండి, దాన్ని నిర్మూలించండి అని మాట్లాడుతూ వుంటారు. వాళ్ళకి తెమలదు. ఉన్నవాళ్ళకి అసలు తెమలదు. సృష్టి ఉన్నంతకాలం రెండూ వుంటాయి. సృష్టిలో ద్వంద్వాలు వుంటాయి. వర్షాకాలం కావాలంటే ఎండాకాలం వుండాలి. అంతకుముందు బాగా ఎండలుంటే బాగా వర్షం వుంటుంది. అసలు ఎండలొద్దండి మేము భరించలేమంటే, వర్షాలుండవు, నీళ్ళుండవు. అబ్బెబ్బే కుదరదండి. అదేమిటది? క్రింద మసి పారకూడదండి దోసెలు కావాలండి. పెనం కాలకూడదండి, oil అయిపోకూడదండి, gas అసలు అవకూడదండి, దోసె కావాలంటే అవదండి. అంటే ఈ సత్యం అర్థం చేసుకుంటే మనకి ఘర్షణ తొంభై శాతం పోతుంది. పది శాతం వుంటుంది.

## 559 మహావరాహః

వరాహావతారం గురించి ఇక్కడ ప్రస్తావన వుంటుంది. వరాహుడుగా భగవంతుడు భూమిని ఉద్ధరించిన సన్నివేశం మనకి ఈ అవతారంలో ముఖ్యమైన ఘట్టం. వరాహమూర్తి బ్రహ్మ ముక్కు నుండి బయటకు వచ్చినట్లుగా మనకి చెప్తారు. ఆయన యొక్క రూపం అతి పెద్దదిగా వుండడం చేత 'మహా' అనే విశేషం తగిలించడం జరిగింది. రెండు తెల్లటి కోరలతో, చాలా నల్లని, మహా దేహం కలిగిన ఒక అడవి పంది రూపంలో భగవంతుడు రూపుదాల్చి, నీటిలో ఎక్కడో అదృశ్యమైపోయిన భూమిని ఎత్తిపెట్టి, ఆ భూమిని ఉద్ధరించే కార్యక్రమానికి అడ్డుపడుతున్న హిరణ్యాక్షుడు అనే రాక్షసుడ్ని చంపడంగా మనకి కథ వుంటుంది. మన పురాణాది గ్రంధాలలో ఇవ్వబడిన సమస్తమైన విషయములు కూడా చాలా గూఢమైన విషయములు, గుహ్యమైన విషయములు, భావగర్భితమైన విషయములు. సృష్టి కథ జరుగుతుంటే అందులో భాగంగా ప్రళయం లో నుండి సృష్టి బయటకి వస్తున్న సందర్భంలో జరిగిన సన్నివేశాలు అన్నీ ఒక కవి పరముగా మనకి కథలుగా అందించడం జరిగింది. వరాహావతారం కాని, మత్స్యావతారం కాని, కూర్మావతారం కాని ఇవన్నీ కూడా సృష్టి ఏర్పడుతున్నప్పుడు జరిగిన కథలు. వరాహావతారం భూమి పుట్టుకకు సంబంధించిన కథ. ఇంతకు ముందు భూమి అదృశ్యమై వున్నది. వరాహావతారం మొత్తం చోటులో ఇమిడి వున్న పృధ్వీతత్వాన్ని మొట్టమొదటగా వ్యక్తం చేయడం అనే కథగా మనం అవగాహన చేసుకోవాలి. చోటులో పదార్ధం వున్నది. పదార్థములో చోటు వున్నది అనేది ఋషులు ఎరిగిన శాస్త్రము. మొత్తం చోటులో నుండి పదార్ధం బయటికి వస్తూ వుంటుంది. వచ్చిన పదార్ధంలో మళ్ళీ చోటు వుంటుంది. పదార్థము, పరమార్థము విడదీయరాని అవినాభావ సంబంధం కలిగినవి. అది అర్ధనారీశ్వర తత్వంగా ఇస్తారు. అంటే పదార్థానికి, ప్రజ్ఞకి హెచ్చు తగ్గులు ఉండవచ్చు. పదార్ధం బాగా ఎక్కువగా కనిపించి, ప్రజ్ఞ తక్కువగా వున్నట్లుగా గోచరించడం మనకు భౌతికంగా కనిపిస్తుంది. ప్రజ్ఞ చాలా ఎక్కువగా వుండి, అందులో పదార్ధం ఇమిడి వున్నట్లు అయితే అది భౌతికంగా అంత కనిపించదు. ఒకటి స్థూలమైన విషయము, రెండవది సూక్ష్మమైన విషయము. సూక్ష్మమైనదయినప్పటికి కూడా వున్నదని మనకు తెలుస్తూ వుంటుంది. మనం ఉండడం ఎట్లాగో, అట్లా ఉంటుంది. మనం ఉండడం అంటే మన శరీరం ఉండడమే కాకుండా, ఉండడం అనేది ఉన్నది. కనబడకుండా కూడా ఉన్నది అని తెలిసే స్థితి మనకు తెలపడానికి వాయువుని చెప్తారు. వాయువు వున్నదని అందరికీ తెలుసు. కనబడదు కదా. శబ్ద తరంగాలు వున్నాయని ఇప్పుడు మనకి తెలుసు , కనబడవు. కనపడకపోయినప్పటికి వున్న స్థితులు వున్నాయి. వాటిని సూక్ష్మ స్థితులు అంటారు. కనబడే స్థితులు కొన్ని వున్నాయి. అవి స్థూలమైన

స్థితులు. స్థూలమైన పదార్థం పుట్టుకకు ముందు ఎక్కడ వుంది? సూక్ష్మంగా వున్నది. సృష్టి లో అంతకు ముందు లేనిది కొత్తగా వచ్చేది ఏం లేదు. ఇది ఒక చాలా ముఖ్యమైన విషయం. వున్నదే వ్యక్తమవుతూ వుంటుంది, మళ్ళీ అవ్యక్తం లోకి వెళ్తూ వుంటుంది, వ్యక్తమవుతూ వుంటుంది, అవ్యక్తం లోకి వెళ్తూ వుంటుంది. అందుకని పరమగురువుల యొక్క గ్రంధాలలో ఒక వాక్యం వుంటుంది 'సృష్టిలో లేనిది అంటూ లేదు' అని. అంటే అర్థం ఏంటంటే అసలు లేనిది ఏదన్నా వుంటే దాన్ని గురించి నీకు భావనే రాదు, ఒకటి. అది వుండబట్టి ప్రస్తుతం నీకు కనబడకపోవడం చేత దాన్ని గురించి లేదు అంటుంటాం తప్ప, లేనిది భావన లోకి రావడానికి వీలేలేదు. మనం మామూలుగా ఏదన్నా ఒక వస్తువు వెతుక్కునేటప్పుడు, కళ్ళజోడు లేదంటామ్. కళ్ళజోడు లేదంటే, నువ్వు పెట్టిన చోటులో లేదు, నువ్వు వెతుకున్న చోటులో కనబడడం లేదు. కళ్ళజోడు లేకపోతే కళ్ళజోడు లేదు అనే భావన ఎక్కడి నుండి వస్తుంది? కళ్ళజోడు అసలు వుంది, నీకు లేదు. ఒక గురువు గారు శిష్యుడ్ని స్నానానికి తీసుకెళ్ళి, తీరా నది వడ్డుకి వెళ్ళాక, ఒరేయ్ నీళ్ళు పోసుకునే చెంబు ఆశ్రమంలో మర్చిపోయానురా, వెళ్ళి తీసుకురా అంటారు. అంటే శిష్యుడు గబగబా పరుగెడతాడు ఆశ్రమానికి. ప్రతిచోట వెతుకుతాడు. ఎంత వెతికినా చెంబు కనబడదు. ఎందుకంటే చెంబు ఈయన దగ్గరే వుంది. వచ్చిన తర్వాత శిష్యుడు చెంబు లేదు అంటాడు. ఏ చెంబు అంటాడు ఈయన. అదే మనం రోజూ నీళ్ళు పోసుకునే చెంబు లేదు. అంటే రోజూ నీళ్ళు పోసుకునే చెంబు లేకుండా ఎట్లా పోతుంది, వుంటుంది కదా, చెంబు లేదంటావేమిటి? లేని చెంబు ఎట్లా వెతికావు, అని అడుగుతాడు. ఇది బాగా ఆలోచించాల్సిన విషయం. ఇంత పెద్ద విషయాన్ని అట్లా చెప్పేసే వాళ్ళు. ఇదీ ఉపనిషత్తులు అంటే. లేనిది వెతకవు కదా, వున్నది ఇంకా నీకు దొరక లేదు, అందుకని నువ్వు వెతుక్కుంటున్నావు. లేని చెంబు ఎట్లా వెతికావు అని అడుగుతాడు. లేని చెంబు ఏమిటి ? వుంది కదా అంటే, వుంటే నీకు కనబడదేం? చెంబు వుంది అంటున్నావు, వుంటే కనబడడం లేదు అంటున్నావు, లేదంటున్నావు, లేనిది నీకు ఫలానాది లేదని ఎట్లా తెలుస్తుంది? అందుకని దెయ్యాలు వున్నాయా అని అడిగారనుకోండి ఎవరైనా, లేవని కొంత మంది, వున్నాయని కొంత మంది రకరకాలు మాట్లాడుకుంటారు. దెయ్యం అనేదే లేకపోతే అసలు దెయ్యం అనే పదం ఎక్కడ నుండి వస్తుంది? దేవుడు లేడంటారు కొంతమంది. దేవుడు లేనిదే ఆ పదం ఎక్కడ నుండి వస్తుంది? అందుకని ఏమన్నారంటే అసలు లేనిది అంటూ ఏమీ వుండదు, నీకు లేకపోవడం వుండవచ్చు. ఇప్పడిప్పుడే మనకు శాస్త్రజ్ఞులు వెలుగులో పదార్థం వుందని చెప్తున్నారు. వాళ్ళు చోటు, చీకటి లేదా, vacuum అంటున్నారే. అది కూడా మొత్తం పదార్థంతో నిండి వున్న పరిపూర్ణమైన స్థితిగా ఋషులు దర్శించారు. ఏమీ లేనట్టుగా వున్న దాంట్లో అన్నీ వున్నాయని. అన్నీ వున్నట్లుగా వున్న దాంట్లో ఏమీ లేనట్టుగా వున్నది ఇమిడి వున్నదని! దీంట్లో అది, దాంట్లో ఇది. అందుకని లేకపోవడం అంటూ వుండదు. లేనిది కొత్తగా రాదు. వున్నది స్థితి బేధం చెందుతూ

వుంటుంది. మంచుగడ్డ నీళ్ళు అవుతుంది, నీళ్ళు మంచు గడ్డ అవుతుంది. నీరుగా వున్నప్పుడు మంచు గడ్డగా లేదు తప్ప, మంచుగడ్డ అనే సూత్రం నీటిలో వుంది. అలాగే నీరు ఆవిరి అవుతుంది. ఇవన్నీ స్థితి బేధం తప్ప అసలు లేకపోతే రాదు. నీరు అనే తత్వం లేదనుకోండి, ఊరికే దాని Temperature తగ్గించుకుంటూ వచ్చినంత మాత్రాన, గడ్డ కట్టడానికి సరకు వుండాలి గదా! అంటే విత్తనంలో సమస్తం వుండబట్టి మనకి చెట్టుగా విచ్చుకుంటుంది. విత్తనంలో లేకపోతే? విత్తనం చూసినప్పుడు అందులో మనకి మామిడి పండు కనిపించక పోవచ్చు. మామిడి చెట్టుకు సంబంధించిన విత్తనం. మామిడి పండులో వుండే టెంకెలోనే కదా వుంటుంది. అందులో మనకి మొత్తం మామిడి చెట్టు స్వరూపం అంతా కనిపిస్తుందా? ఋషికి కనిపిస్తుంది. మనకి కనిపించదు. ఋషి అంటే లోదృష్టి కలిగిన వాడు, బాగా చూడగలిగిన వాడు. Microscopic vision వున్నవాడు అన్నమాట. ఆ స్థితి ఎలా కలుగుతుంది అంటే, మనిషి అకస్మాత్తు సన్నివేశాలలో కూడా తన ప్రశాంతత యందు భంగం లేకుండా వుండే వారికి వీలుపడుతుందట. పోతులూరి వీరబ్రహ్మం గారికి కాలజ్ఞానం వుంది కదా. మనకి లేదు కదా. ఆయనకు ఎందుకు వుంది? మనకు ఎందుకు లేదు? భవిష్య పురాణం అని వ్రాసేశారు వేద వ్యాసుడు, ఫలానా అప్పుడు ఫలానా జరుగుతుంది, ఇలా జరుగుతుంది అని వ్రాసేశారు. ఆయన చెప్పినట్లు చేసుకుందాం అన్నట్లుగా, ఆయన చెప్పాడని తెలియకపోయినా అట్లాగే చేస్తూనే వున్నాం కదా. ఎలా చెప్పగలిగాడాయన? ఇన్ని వేల సంవత్సరాలకు ముందు చూసి చెప్పగలిగాడే, in general అది అంతా అట్లాగే జరుగుతుంది కదా. మనం రేపు ఏమి జరుగుతుందో చెప్పలేము. వచ్చే క్షణం ఏమి జరుగుతుందో చెప్పలేం. ఏమిటి తేడా? అంటే అకస్మాత్తుగా జరుగుతుండే సన్నివేశాలలో చెదరకుండా వుండే మనస్సు, అలజడి లేని మనస్సు గనుక నీకు చాలా కాలం వున్నట్టయితే, అది ఆధారంగా నీకు సమస్తం గోచరిస్తూ వుంటాయి. అలజడి చెందే మనస్సు లో ఏమీ గోచరించదు. ఆ విధంగా గోచరించిన వాళ్ళు 'ప్రజ్ఞ లో పదార్థం వుంది, పదార్థం లో ప్రజ్ఞ వుంది, అయ్యవారు, అమ్మవారు వేరువేరుగా లేరు. అయ్యవారులో అమ్మవారు వున్నది, అమ్మవారులో అయ్యవారు వున్నారు. అయ్యవారు గొప్పా, అమ్మవారు గొప్పా అనే బుద్ధి హీనతలో, వాగ్వివాదములు చెసుకోవద్దు' అని చెప్పారు. అందుకని ఏమీ లేనట్లుగా వున్న దాంట్లో నుండి అన్నీ దిగి వస్తుంటాయి. మనకు కొడుకు పుట్టాడనుకోండి, వాడు అంతకు ముందు ఎక్కడ వున్నాడు? క్రొత్తగా పెళ్ళి చేసుకున్న వాళ్ళు సంతానం కోసం ఆలోచన చేస్తున్నప్పుడు కొడుకు వున్నాడా? ఋషి దృష్టిలో వున్నాడు. నీ భావంలో కొడుకని రాంగానే, వాడు వున్నాడు అక్కడ. నీ భావనలో కొడుకు రాకముందు లేడా? వున్నాడు. లేని వాడు రాడు అంటారు. కాబట్టి కొడుకు ఒకడు వుంటే, నీకు కొడుకుని కందామనిపిస్తుంది. అనిపిస్తే నీ భావనలోకి వస్తాడు. అదే భావం నీ భార్యలోకి కూడా వస్తుంది. ఇద్దరి మధ్య భావరూపంలో వుంటాడు. అక్కడ నుండి తండ్రి తీసుకునే

ఆహారపదార్థం ద్వారా లోపలికి వస్తాడు. అక్కడ నుండి వీర్యంగా వృద్ధి పొందుతాడు. అక్కడ నుండి తల్లి గర్భంలోకి ప్రవేశిస్తాడు. ఇదంతా జరిగి తల్లి గర్భంలో ప్రవేశించినప్పుడు ఒక చిన్న నీటి బిందువు అంత వుంటాడు. అక్కడ నుండి ఒక్కొక్కటి ఒక్కొక్కటి పెరిగి పెద్దవాడై, ఎద్దంత అవుతాడు తర్వాత. ఇప్పుడు ఈ ఎద్దంత వాడు మొదటి నుండి అట్లా వున్నాడా? లేడు కదా. కాని ఇంత ఎద్దు వుంది మరి కనబడకుండా, దిగివస్తూ వుంటుంది. మళ్ళీ ఏమైంది? ఏదో జీవించినంతకాలం జీవిస్తాడు, అది ఇది తింటూ, తిరుగుతూ మంచి చెడు, తెలిసినవి తెలియనవి అన్నీ చేసుకుంటూ, పోయాడంటారు. ఎక్కడికి పోతాడు? ఎక్కడికీ పోడు. అదే కృష్ణుడు భగవద్గీతలో, రెండో అధ్యాయంలో 'ఈ వున్నవాడు ఎక్కడికీ పోడు, లేనివాడు ఎవ్వడు రాడు, వీళ్ళందరూ వెళ్ళి పోతారని నీవు బాధ పడనక్కరలేదు, ఇక్కడే వుంటారు అందరూ. బజారులో ఆ మలుపు తిరిగి మళ్ళీ ఇటు వచ్చేస్తుంటారు, అంతే, అంతకంటే వీరెవ్వరూ ఎక్కడికీ పోరు,' అని చెప్తాడు. మరి పోయినట్లుగాను, వచ్చినట్లుగాను కనిపించేది స్థూలమవడం, సూక్ష్మమవడంగా జరుగుతుంటాయన్నమాట. అలా భూమి చోటులో ఇమిడి వున్న స్థితి! ఇమిడివున్న స్థితిలో నుండి భూమి ఏర్పడడానికి కొన్ని అడ్డంకులు వస్తూవుంటాయి. అదీ హిరణ్యాక్షుడు అంటే! కొత్త అలవాటు ఏదన్నా చేసుకునేటప్పుడు పాత అలవాటు కూడ పని చేస్తుంటుంది కదా. అంతకు ముందు ఏం జరిగిందండీ, ప్రళయం జరిగింది. ప్రళయం జరిగితే, ఏం జరుగుతుందంటే వున్నది అంతా కరిగించేశాం. పుట్టించడం అనే దానికి, కరిగించడం అనే అభ్యాసం అడ్డు వస్తుంది. బాగా అడ్డగోలగా ఖర్చు పెట్టె వాడికి సంపాదించమని చెప్తే, వాడు సంపాదించె లోపల ఖర్చు పెట్టడం ఎక్కువగా వుంటుంది. వాడికి కాస్త ఖర్చు పెట్టడం ఆపరా, పోగువేసుకున్నాక ఖర్చు పెట్టుకో, అని చెప్పాలి. ఇంతకు ముందు 'ఈ గోళాలు అన్నీ ముడిచేయండయ్యా' అని చెప్పారు. ముడిచేయండి అంటే అప్పుడు ముడవడం కష్టం అయింది. ఎట్లాగో ఈ గోళాలు అన్నీ ముడిచేయడం కష్టపడి అలవాటు చేసుకున్నారు. అదే 'వాడు చాప మడిచినట్లు మడిచేస్తాడు భూమిని' అన్నారు. భూమి అంటే మన భూమి అనుకోబోకండి ఇది సృష్టిలో గోళములు తయారీ అన్నమాట. గోళాలన్నీ ఇంక మూసేయండి, అని పైనుండి High Command కబురు పంపించింది. పంపిస్తే మూద్దామనుకుంటే, అంతవరకు గోళాలు తయారు చేయడంగా అలవాటు వున్నవాళ్ళకి మూసేయమంటే ఎంత కష్టం? పాత అభ్యాసముల వల్ల కాలం మారి కొత్త ప్రణాళిక రాగానే ఆ అభ్యాసం లో నుండి పుట్టిన సృష్టి ధర్మాలు వుంటాయే, అవి పని చేస్తూ వుంటాయి వాటి మీద. పనిచేయడం చేత కొత్తగా వేసిన ప్రణాళికని రానివ్వదు. ఎప్పుడూ night duty చేసే వాణ్ని కొన్నాళ్ళు పోయాక రాత్రి పూట పడుకోవయ్యా, అంటే పడుకోలేడు. మళ్ళీ అలవాటు చేసుకోవాలి. తీరా రాత్రి పూట నిద్ర పోవడం అలవాటు అయినప్పుడు, మళ్ళీ నీకు night duty వేశాం అంటే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. ఇది 'అభ్యాసమూర్తి' అని, సృష్టి కథలో చాలా పెద్ద ధర్మం! ఏదో ఒకటి అభ్యాసం

చేయకపోతే, అక్కడ ఆ విధంగా స్థిర పడి వుండదు. మనమందరము కూడా భగవత్ తత్వం లో ఇమిడి వున్న వాళ్ళం కదా, భగవంతుని యొక్క అంశలం కదా, భగవంతుని నుండి బయటకి రావడానికి నానా గడ్డి కరవాల్సి వచ్చింది దేవతలకు. ఈ రోజు మనం భగవంతునితో యోగం చెందడానికి ఎంత క్రిందా మీదా పడుతున్నాం? మన వల్ల అవుతుందా ? ఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా ఆ యోగ స్థితి అబ్బదు కదా. ఎంత కష్టపడినా చివరికి అది వీలుపడదు, ఊరికే అందరూ కబుర్లు చెప్తారు అనిపిస్తుంది. అనిపించి, వీలుపడుతుంది, ఆ వీలుపడడానికి ఇట్లా చేసుకో అని చెప్పిన వాళ్ళ మీద కోపం వస్తుంది. చెప్పారు తప్ప, అది అయ్యే పని కాదు అనేస్తాం. ఎందుకంటే కొత్త అలవాటు చేసుకోలేక. అట్లాగే భగవంతుని దగ్గర నుండి బయటకు వచ్చేటప్పుడు కూడా 'ఒరేయ్ అట్లా పొండిరా బయటకు' అంటే ఎవ్వరూ పోలా, అతుక్కోవడం మొదలు పెట్టారు. ఇట్లా పంపించేస్తే అట్లా వచ్చేస్తున్నారు. కొత్త తివాచీ విప్పతీస్తుంటే మళ్ళా చుట్టుకుపోతుంది కదా. మాయా బజారులో గింబళి లాగా. అట్లా ఈ జీవులందర్నీ బయటకు పంపించడానికి నానా తిప్పలు పడ్డారట. కొన్ని లక్షల సంవత్సరాలు పట్టినాయట జీవులని దేవుడి నుండి వేరుచేయడానికి. చిన్నపిల్లలు తల్లి చుట్టూ తిరిగి ఆడుకుంటారు, పాకుతూంటారు, ఒళ్ళో పడుకుంటారు. పాతికేళ్లు వచ్చినా ఒళ్ళో పాక్కుంటూ వచ్చి, ఒళ్ళో పడుకుని పాలపీక నోట్లో పెట్టుకున్నారనుకోండి, ఎట్లా వుంటుంది? బాగుంటుందా? వీడేంటి ఇట్లా తయారయ్యాడని రకరకాలుగా బయటికి పంపించడానికి ప్రయత్నం చేస్తాం కదా. వాడికి ఐదు, ఆరు ఏళ్ళు రాగానే బయటికి వెళ్ళి ఆడుకో, అని చెప్తాం. Schoolకి పంపిస్తాం. బయటకు పంపిస్తాం. ఏడుస్తూ వెళతారు ముందు. కొన్నాళ్ళు పోయేసరికి సాయంత్రం వాడ్ని ఇంటికి రా రా, ఇంటికి రా రా, అంటాం, అంతకు ముందు పోరా పోరా అంటాం. ఇప్పుడు రమ్మనేసరికి కొత్త అలవాటు కదా. మళ్ళీ time పడుతుంది. అట్లా అంతకు ముందు ప్రళయం జరిగినప్పుడు ఇవన్నింటిని మళ్ళీ స్థూలంలో నుండి సూక్ష్మంలోకి మార్చడానికి కొన్ని ప్రజ్ఞలు పనిచేశాయి. వాటికి అది అలవాటు అయిపోయింది. పై వాడు తగుదునమ్మా అని ఒక నిర్ణయం చేసేటప్పటికి వాళ్ళందరూ ఆరోజు మారిపోలేరు కదా. అందుకే భూమి దేవతలు పృథ్వీ తత్వం వ్యక్తం కావాలని యజ్ఞం చేస్తుంటే, అంతకు ముందు వాటినన్నిటిని లయం చేసే ప్రజ్ఞలు వుంటాయే, అవి. వీళ్ళు వ్యక్తం చేస్తుంటే అవి కలిపేస్తున్నాయి. అంటే మనం సముద్రం ఒడ్డున ఇసుకలో గుడి కడుతుంటే, అల వచ్చి కొట్టుకుపోతూ వుంటుంది కదా. మళ్ళీ కడుతుంటే మళ్ళీ కొట్టుకు పోతుంటుంది. అదండీ పాపం వాళ్ళ రాక్షసత్వం! వాడింకా నిన్నటి కార్యక్రమంలో ఉన్నాడు, మనం ఇవాళ్టి కార్యక్రమం లోకి వచ్చాం అంతే! అంతకన్నా వాడు ఎక్కడి నుండి వచ్చాడు? పురాణాలలో చెప్పే మహత్తరమైన విశేషం ఏమంటే దేవతలు రాక్షసులు కూడా ఒకే తండ్రి నుండి వచ్చారట. వాళ్ళంతా పాపులు, దుష్టులు అని మనం అనుకోకూడదు. మనకు అర్ధం కాక అలా అనుకుంటూ వుంటాం. ఆ

విధంగా వాడు ( హిరణ్యాక్షుడు) వచ్చిందల్లా చుట్టేస్తున్నాడట. అదీ వాడు చేస్తున్న పని. చేస్తుంటే వాడిని ఆపడం బ్రహ్మవశం కాలేదట. బ్రహ్మగారే కదా సృష్టి చేయాలి. దేవతలు అందరూ ఆయనలో నుండి వచ్చిన వాళ్ళు. పృథ్వీ తత్వాన్ని తీసుకొచ్చి దాన్ని గోళాలు గోళాలుగా చేయాలి. అదీ కార్యక్రమం! ఆ కార్యక్రమంలో భాగంగా, అంతకు ముందు అలవాటు ఈ కొత్తగా నేర్చుకున్న అలవాటు కన్నా బలమైనది కాబట్టి అవి అట్లా పని చేస్తున్నాయి. ఇది మనకు సృష్టిలో వచ్చిన crisis. అక్కడక్కడ వస్తుంటాయి. అమృతం కోసం మథనం చేస్తుంటే ముందు హాలాహలం రావడం. ప్రతి సృష్టి కథలో ఒక్కొక్క విజయం సాధించడం అంటే ఒక్కొక్క లోకం ఏర్పడే ముందు ఒక పెద్ద ఉపద్రవం లాగా వస్తుంది. దాంట్లో నుండి బయట పడతాం. ఎన్నాళ్ళకీ పృథ్వి ఏర్పడకపోవడం అంటే ఆ చోటులో భూగోళం ఎక్కడ వుందో తెలియకపోవడం. అక్కడ దాచేశాడట వాడు. వెతికారు, వెతికారు, వెతికారు దేవతల వశం కాలేదు. బ్రహ్మకు చెప్పారు. బ్రహ్మ నువ్వే ఏదన్నా చేసిపెట్టాలి తప్ప నేనేం చేయలేను అంటే, అసలు నీవు చేసేది ఏమిటి? ఏం లేదు. ముందే చెప్పాడుగా. మధ్య మధ్యలో నువ్వు చేస్తున్నాను అనుకోవడం వల్ల వస్తాయి గొడవలు. నువ్వు అట్లా వుండవయ్యా నేను చేసుకుంటాను ఈసారి అంటే , ఇట్లా అయితే నేను చేయలేను అంటే, నిన్ను ఎవరు చేయమన్నారు? నువ్వు చేయలేవని తెలిసింది కదా, ఇప్పుడు నేను చేస్తానని , ఈయన ముక్కులో నిశ్వాస నుండి గురగుర అని ఒకటి బయటకు వస్తుంది. అంతా చీకటి చుట్టూ, ఏంటయ్యా గురగుర అంటే ఏదో పంది అరుస్తున్నట్లుగా వచ్చిందట. విపరీతంగా నల్లగా వున్నాడటండీ. చీకట్లో కనబడతాడా? అసలే అంతా చీకటి ఓ నల్లటి వాడు నడిచి వస్తున్నాడనుకోండి చీకట్లో, ఏం తెలుస్తుంది? వంటి మీద తెల్ల బట్ట వుంటే తప్ప ఏం తెలియదు. ఏం కనబడడంలేదు, గురుగురు వినిపిస్తుందట, అంతే! ఆ గురుగురు పెరిగి పెరిగి భయంకరమైన గురుగురుగా వుంది. అమ్మో ఏదో పెద్దది పుట్టింది అనుకున్నారట.ఆ పుట్టినది అలా పెరిగి పెరిగి పెరిగేసరికి అప్పుడు బ్రహ్మగారికి అర్థం అయిందట 'ఓహో మనం ఎవరికైతే విజ్ఞప్తి చేశామో, ఆయన వచ్చాడు' అని. వాళ్ళు చూస్తుండగానే అంత చీకట్లో నుండి ఒక చీకటి ఆకారంలో నుండి రెండు కిరణాలు బయటకి వచ్చాయటండీ. ఆ రెండు కిరణాలే రెండు దంతాలు. అదే వరాహావతారం! వరాహావతారం లో ఆ దంతాల మీదే గదా రక్షిస్తాడు. ఈ రెండూ తెల్లటి కోరలట. ఆ తెల్లటి కోరలు రావడమే కనిపిస్తుంది తప్ప, ఎక్కడ నుండి వస్తున్నాయో కనిపించడం లేదట. అంటే దానికి పెద్దలు చెప్పిన అవగాహన ఏమిటయ్యా అంటే సత్యస్థితి నుండి చైతన్యస్థితి ఒకటి, శక్తి ఒకటి ఈ రెండూ ఆధారంగా పదార్థం యొక్క నిర్మాణం మూడు. ఈ రెండూ, అంటే వాటి బాహువులు/ కిరణాలు పెరిగి పెరిగి వాటి ఆధారంగా నెమ్మదిగా భూగోళాన్ని తయారుచేశాయి అని అర్థం. అంటే మనలో ఇడ, పింగళ ఆధారంగా ఈ శరీరం నిలబడి వున్నట్లు. ఆ రెండు కోరలు మనలో వున్నాయి. ఒకటి ఇడ అనే శక్తిగా ప్రవహిస్తుంటుంది, ఒకటి పింగళ అనే శక్తిగా ప్రవహిస్తుంటుంది. ఇడ అనే శక్తి

పదార్థమయం చేస్తూ వుంటుంది, సూక్ష్మం నుండి స్థూలానికి. అలా పెరిగి పోకుండా వుండడం కోసం, పింగళ అనే శక్తి మనలో పదార్థం ని మళ్ళీ సూక్ష్మం లోకి తీసుకువెడుతుంటుంది. సూక్ష్మం నుండి స్థూలానికి, స్థూలం నుండి సూక్ష్మానికి తీసుకు వెళ్ళే ఈ ప్రజ్ఞలు రెండింటినీ అశ్వనీ దేవతలు అని చెప్తారు. ఒకటి నిర్మాణం చేస్తుంటే, ఒకటేమో దాన్ని మళ్ళీ లయం చేసే ప్రజ్ఞలుగా, ఈ రెండింటి మధ్య జరిగే ఒక సమన్వయాత్మకమైన కార్యక్రమంగా, పదార్థం యొక్క నిర్మాణం వున్నట్టుగా గోచరిస్తుంది. కొంత పదార్థం నిర్మాణం అవుతుంటే, కొంత పదార్థం మళ్ళీ అదృశ్యం అవుతుంటే ఈ సృష్టి అవడం, అదృశ్యం అవడం అనేది సమపాళ్ళలో వుండడం చేత ఎప్పుడూ అక్కడ వున్నట్లుగా వుంటుంది. నిజానికి అట్లాగే వుండదు. మనకి మామూలుగా నదీ ప్రవాహం అట్లాగే వున్నట్లుగా కనిపిస్తుంది కదా. మనం ఎప్పుడు వెళ్ళినా గోదావరి నదికి, గోదావరి ఒడ్డున స్నానం చేసి వచ్చేస్తుంటాం. కానీ గోదావరి అదే నదిగా ఎప్పుడూ లేదు. అందుకని 'ఈ భూప్రపంచం లో ఎవ్వరూ అదే నదిలో రెండోసారి స్నానం చేయలేరు' అని చెప్తారు. ఎందుకంటే నువ్వు కాలు తీసి, మళ్ళీ కాలు పెట్టే లోపల అక్కడ అవే నీళ్ళు లేవు కదా, వెళ్లిపోయాయి. నీళ్ళు వెళ్లిపోయేవి, వచ్చేవి ఒకే వేగంలో వుండడం చేత ఎప్పుడూ నీకు అక్కడ ఆ నది వున్నట్లు గోచరిస్తుంది. అలాగే ప్రతి రూపం గూడాను. మానవుని శరీరం కూడా అంతే! కొన్ని అణువులు పుట్టుకుంటూ వస్తుంటే, కొన్ని అణువులు లయం అయిపోతుంటే మధ్యలో మనం ఉంటాం. మన శరీరం 'నది వున్నట్లుగా' వున్నట్టు గోచరిస్తుంది. దాన్ని మనకి ఆయుర్వేదంలో వాత, పిత్త, శ్లేష్మాలుగా చెప్తారు. మూడు కేంద్రాలు. అణువులను పుట్టించే కేంద్రం, అణువులని అదృశ్యం చేసే కేంద్రం, ఈ మధ్యలో అణువులు వున్నట్టుగా కనిపించేది. అది వున్నట్టుగా వుంటుంది తప్ప నిజంగా వుండడం కాదు. అది లేనట్టుగా వుంది తప్ప అది లేనట్టు కాదు. అది లేనట్టుగా వుంది, ఇది వున్నట్టుగా లేదు ఈ రెండు పదాలు మహావాక్యాలు. లేనట్టుగా వుంది అంటే వుంది. వున్నట్టుగా లేదు అంటే లేదు. ఇటువంటి పదాలు మీరు బాగా ధ్యానం చేసుకుంటే గాని, ఇటువంటి సూత్రాలు కొన్ని అర్థం అవడానికి అవకాశం లేదు. అప్పటికప్పుడు అణువులు తయారు అవుతుంటే, మళ్ళీ అదృశ్యం అవుతుంటే మధ్యలో మనం వున్నట్టుగా వుంటాం, నదిలో నీరు వున్న పద్ధతిలో. ఈ శరీరంలో అణువుల పుట్టుక కన్నా అణువులు లయం అయిపోవడం చాలా తొందరగా అయిపోతుంటే మనిషి పలచబడి పోతుంటాడు, చిక్కి పోతుంటాడు. అట్లాగే అణువుల యొక్క పుట్టుక కన్నా, లయం అవడం అనేది బాగా ఆలస్యంగా జరుగుతుంటే బాగా ఒళ్ళు పెరిగిపోతుంటుంది. మీరు బాగా లావు అవుతున్నారు సార్, మంచిది కాదు అని చెప్తాం కదా ! ఏం జరిగింది అక్కడ అంటే ఈ పుట్టుక, లయ స్థానాల రెండిటి మధ్య సరియైన సమతూకం లేకపోవటం వల్ల మనిషిలో వుండవలసిన ప్రాణశక్తి సరిగ్గా వుండదు. అందుకని ఆయుర్వేదశాస్త్రం మనిషిలో ఈ రెండిటిలో ఏది over active, ఏది under active అని చూసి మనిషి

జబ్బు నిర్ణయం చేస్తుంది. తమో గుణం ప్రధానంగా వున్నాడా, రజో గుణం ప్రధానంగా వున్నాడా లేక సత్త్వగుణం నందు వున్నాడా? తమో గుణంతో కూడిన ఒక అభ్యాసం వున్నదనుకోండి దానికి సంబంధించిన జబ్బులంతా ఒక list వుంటుంది. రజోగుణం వాళ్ళ జబ్బులు ఇంకో రకంగా వుంటాయి. కాబట్టి వీడి యొక్క ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ఆహార వ్యవహారంలో మార్పు తీసుకురావడం వల్ల, వాళ్ళని సర్దుబాటు చేయడంగా ఆయుర్వేదం చెప్తుంది. ఎందుకు ఇది చెప్తున్నానంటే ఈ వరాహావతారంలో వుండే రెండు కొమ్ములు ఈ రెండు కిరణాలుగా, ఈ రెండు ప్రజ్ఞలుగా ఉంటే, ఆ రెండింటి మధ్య లేనట్టుగా వున్నవాడు వాడు. నక్షత్రాలు ఆకాశంలో ఎన్నో వున్నాయి. ఈ భూమి చుట్టూ కూడా మనకు కనిపించనవి ఎన్నో ఉన్నాయి. మనకి సూర్యుడు కేంద్రంగా పది, పన్నెండు గ్రహాలు వున్నాయని తెలుసు. కానీ ఋషులు 'అసలు ఈ సూర్యుడు చుట్టూ 72 గోళాలు వున్నాయని' చెప్పారు. మీకు ముందు ఏవో కొన్ని కనిపించాయి, ఇవాళ ఇంకా కొన్ని కనిపించాయి అంటున్నారు. ఒక్క బృహస్పతి చుట్టూ బోలెడు మంది చంద్రులు కనిపిస్తున్నారు. ఈ మధ్య కాలంలోనే మనకి Neptune, Uranus అనే గ్రహాలు కనిపించాయి. అంతకు ముందు లేవా? ఉన్నాయి. 'మీకు ఇంకా కనిపిస్తే 72 వరకు కనిపిస్తాయి' అని చెప్తారు జ్వాలాకూలుడు. మీకు ఎట్లా తెలుసు అంటే 'మేము అట్లా చూసాము, మేము ముందు వెళ్ళి వచ్చాము. మేము చూస్తున్నాము ఒక్కో దాన్ని' అంటారు. కాబట్టి అదృశ్యమైన స్థితిలో వున్న పదార్థాన్ని దృశ్య లోకంలోకి తీసుకురావడం అనే కథ హిరణ్యాక్షుడి కథ. వాణ్ణి సంహరించి అంటే, ఆ లయం చేసే అభ్యాసం అరి కట్టారు. 'ఇప్పుడు కాదురా , కొన్నాళ్ళు నువ్వు rest తీసుకో, మళ్ళీ పిలుస్తాం అప్పుడు వచ్చి చుట్టేద్దువుగాని' అని, కాబట్టి మన శరీరంలో కూడా పదార్థం యొక్క నిర్మాణం చక్కగా జరిగి, సమతూకంగా వుండి రక్షింపబడాలంటే, ఈ అవతార ఘట్టాన్ని బాగా ధ్యానం చేసుకోమని చెప్తారు. 'May he lift up the earth to the kings of beauty' అని మనం చదువుతుంటాం. అది వరహావతారానికి సంబంధించినది. Lift up అని ఎందుకు అన్నారంటే పదార్థంలో బాగా కూరుకు పోయివున్నాము. బరువు ఎక్కి పోయింది పదార్థం, సాంద్రత పెరిగింది, స్థూలం ఎక్కువ అయ్యింది, చురుకుగా వుండదు. వెలుగువలె తేలికగా వుండదు, బరువు ఎక్కి వుంటుంది. కాబట్టి ఒక స్థితిలో భగవంతుని యొక్క ఈ రూపాన్ని బాగా ధ్యానం చేసుకోమని చెప్తారు. ఎందుకంటే, సమర్థవంతంగా శరీరంలో పదార్థం ఏర్పడి వుండడానికి. ఇది మనకి మూలాధారానికి, స్వాధిష్టానికి మధ్య జరిగే కథగా చెప్తారు. ఎందుకంటే నీటి (ఆపస్సు) నుండి పృథ్వీ వచ్చింది కాబట్టి ఆ కేంద్రాలన్నీ కూడా స్వాధిష్టానం నుండి మూలాధారం లోపల వున్నాయి కాబట్టి, అది వరుణ కేంద్రంగా చెప్తారు. అందుకని వరుణుని నగరంలో మహా విష్ణువు వరాహావతరంగా వున్న సందర్భంలో, హిరణ్యాక్షుడు వెతుక్కుంటూ వెళ్ళి, అక్కడ వరుణుడిని నాతో యుద్ధం చేయమంటే, నాతో ఏం చేస్తావులే, అక్కడ ఇంకొకడు

వున్నాడు చాలా బలమైన వాడు, వాడితో చెయ్యి అని చెప్పడం. అక్కడికి వెళ్ళిన తరువాత వీడి తీట వదలడం ఇట్లా మనకు కథగా కనిపిస్తుంది. అర్ధం ఏవిటంటే జలముల నుండి పదార్ధం ఏర్పడుట అని సృష్టిలో ఒక కేంద్రం వుంటే అది మన శరీరంలో కూడా వుంటుంది. జలముల నుండి పదార్ధములు ఏర్పడక పోతే లోపల జలములు పెరిగిపోతాయి. మొహం వుబ్బిందండి అంటాం, కాళ్ళు వాచి నాయండి అంటారు కదా. మోకాలులో నీరు నిలుస్తుంది, మడవలేను అంటారు. ఇవన్నీ ఎక్కడ నుండి వచ్చాయంటే, ఇక్కడ నుండి వస్తుంటాయి. అందుకే ఆ స్థానంలో, వరుణ నగరంలో వరాహస్వామి వున్నట్టుగా ధ్యానం చేయడం. ఇక ప్రతి దానికి మన వాళ్ళు మొత్తం overall గా అంతర్యామి తత్వం అని ఒకటి ఇచ్చి, మళ్ళీ సృష్టి విధానంలో ఎక్కడికక్కడ Plant మొత్తం మీద ఏ మూలనన్నా తేడా వుంటే, అక్కడ repair చేస్తే చాలు గదా, మొత్తం plant అంతా repair చేయక్కరలేదుగా. ప్రతి దానికి General Manager రానక్కరలేదుగదా . అక్కడ వుండే foreman కు చెప్తే వాడు wrench తీసుకుని ఆ కాస్తా బిగించేస్తాడు. అట్లా ఈ వరాహావతారం మనకి జలముల నుండి పృథ్వీ ఏర్పడడం అనే కార్యక్రమం వుందే, అది బాగా జరుగుతున్నంత కాలం శరీరం బాగుంటుంది. శరీరం అంటే భౌతిక శరీరం అని అర్ధం. వాటి యొక్క మేళవింపు బాగుంటుంది. హిరణ్యాక్షుడిచే ముడవబడదు. లేకపోతే వాడు వచ్చి ముడిచేస్తాడు. శరీరం దెబ్బ తింటుంది. ఇటువంటి రహస్యమైన అర్థాలు ఎన్నో వున్నాయి వరాహావతారం అనే ఘట్టంలో. మాస్టర్ గారు రెండు చోట్ల వ్రాసారు భాగవతంలో వరాహావతారం గురించి. యజ్ఞవరహామూర్తి యొక్క సంకేత అర్థాలు అన్నీ కూడా మాస్టర్ గారు చాలా చక్కగా వ్రాసి మనకి భాగవత రహస్య ప్రకాశంలో ఇచ్చారు. అవి బాగా చదువుకోండి. ఈ చెప్పే దాన్ని ప్రాతిపతికగా తీసుకోండి. ఎందుకంటే ఈ చెప్పిన దాంట్లో కొంత భాగం Secret Doctrine గుప్త విద్య అనే దాంట్లో వుంది. కొంత మాస్టర్ గారు చెప్పిన దాంట్లో వుంది. రెండూ కలిపి ఇవ్వడం జరుగుతుంది. కథ మీకూ తెలుసు. కథ లో వుండే ఈ రహస్యమైన విషయాన్ని కొంత అందించడానికి ఈ ప్రయత్నం. అది మనలో బాగా జరగాలి వరాహ నిత్య కథ. అది వరుణ నగరంలో జరగాలి అంటే పశ్చిమంలో, అంటే మూలాధారం దగ్గర వుండే స్థానం.

## 560 గోవిందః

ఇంతకు ముందు గోవింద అంటె సమస్తమునకు యజమాని అని అర్థం చెప్పకున్నాం. ఒకే నామంమళ్ళీ వేసినట్టు గా కనిపిస్తుంది గానీ ఒకే నామానికి రకరకములైన భగవత్ తత్త్వములు వున్నాయి. ఇక్కడ ఇంద్రియములకు సంభందించిన తత్త్వం. 'గో' అంటే ఇంద్రియములు అనే అర్థం వుంది. అంటే ఇంద్రియముల ఆధారంగా చైతన్యం ప్రవహిస్తూ వుంటుంది. ప్రకటింపబడిన చేతస్సు కలిగించేవి ఇంద్రియములు. ఈ చైతన్యం ప్రకటింపబడాలంటే స్పర్శ, రుచి , వాసన, వినికిడి, చూపు ఈ ఐదూ వుండాలి. ఇవి లేకపోతే చైతన్యం బయటికి ప్రసరించదు, లోపల వుండి పోతుంది. అందుకని చేతస్సు ప్రకటింపబడడానికి వుపయోగింపబడే కిరణముల లాగా పనిచేస్తుంది కాబట్టి వీటిని 'ప్రచేతసులు' అన్నారు. ప్రకటింపబడిన చేతస్సు. మనకి ఎంత ప్రకటింపబడిపోయిందంటే, చేతస్సు మళ్ళీ వెనక్కు వెళ్ళడం లేదు. మనకి ఇంద్రియములు అట్లా బయట ప్రపంచంలోకి విపరీతంగా 5 గుర్రాలలా, అలా 5 ప్రక్కలకి లాగేస్తుంటే, లోపలికి ఎట్లా తిరిగి వెళ్ళాలో తెలియక బాధ పడుతుంటే, 'యోగం' అని ఇచ్చారు. ఈ చిత్తవృత్తుల ని నిరోధించడమే యోగం అంటారు. 'యోగః చిత్త వృత్తి నిరోధకః' ఈ 5 గుర్రాల ద్వారా బయటకి వెళ్ళి పోతుంటాము. 5 గుర్రాలు అంటే 5 కిరణాలు. 5 కిరణాలు, 5 వాహికలు, 5 రోడ్లు, అందులోంచి బయటకు వెళ్ళి పోతుంటాము. ఈ వెళ్ళే చేతనాన్ని కూడా 'గో' అంటారు. గ+ఓ = గో. గ అంటే గమనము, దానికి బృహస్పతి అధిదేవత. 'ఓ' అంటే సూర్యుడు. సూర్యుడి యొక్క తత్త్వం చేతస్సు! చేతస్సు కి గమనం కలిగించడాన్ని 'గో' అంటారు. English లో కూడా go అంటే వెళ్ళమని కదా. సంస్కృతంలో 'గో' కు చాలా ఎక్కువ ప్రాముఖ్యత వున్నది. కదిలే చేతనము, వ్యాపనము చెందే చేతనము. ఆ 'గో' ని అనుభూతి పొందుతూ రహస్యంగా వుండేవాణ్ని 'గోప' అంటారు. లేకపోతే 'గోపి' అంటారు. ఆ గోపి లో నుండే Gobi Desert వచ్చింది. ఇక్కడ చాలా విషయములు గోపనము చేయబడి వున్నాయి. అది గోబి ఎడారి. మనం అనుకునే 'శంబళ' గ్రామం, విష్ణు యశస్సు కల్కిగా పుట్టడం, ఇవన్నీ కూడా గోబీలో వుండే శంబళ గ్రామంలో జరిగే కార్యక్రమం. అది రహస్యంగా భూమి మీద వుంది. 'గో' అంటే గోచారం. గోచారం అంటే గోవు చరించడం. 'గో' అనే నామం గ్రహానికి కూడా వుంది. గోచారం అంటె గ్రహములు చరించే మార్గం, అది అంతా కూడా వెలుగు మార్గం. దాన్నీ 'గో' అంటారు. ఇంద్రియాలలో ప్రవహిస్తున్న చేతస్సునీ 'గో' అంటారు. ఆ తత్త్వం మనకు ఆవు యొక్క కన్నులలో బాగా గోచరిస్తుంది, అందుకని దాన్ని 'గో' అన్నారు. ఆ తత్త్వమే ఏడు లోకాలకి మూలంగా వుంది. అందుకని ఏడు లోకాల పైన వున్న లోకాన్ని 'గోలోకం' అంటారు. గోపికలు, గోపకులు వీళ్ళందరూ కూడా ఆ తత్త్వాన్ని బాగా

అనుస్వాదించిన వారు, ఆనందించిన వారు. ఇక్కడ గోవింద నామానికి ఇంద్రియములలో సంచరిస్తున్న భగవత్ తత్త్వం అని అర్థం. దాన్నే మనకి 'అనిరుద్ధ' అని కూడా చెప్తారు. చేతస్సు ఇంద్రియాలలోకి రాంగానే, మనం ఏది ఆధారంగా అన్నీ అనుభూతి చెందుతూ ఉంటామో, దాన్ని మర్చిపోతుంటాం. ఇంద్రియముల ఆధారంగానే రుచి పొందుతాము. అసలు రుచి ఏర్పడుటానికి ఆధారంగా వున్న చేతనం గుర్తువుండదు. అది అందులో వుండే రహస్యం, గోప్యం. 'నన్ను ఆధారంగానే అన్ని రుచి చూస్తారు, నన్ను రుచి చూడరు. నేను ఆధారంగానే అన్నీ చూస్తుంటారు, నన్ను చూడరు, నేను ఆధారంగానే అన్నీ వింటుంటారు, నన్ను వినరు', ఇట్లా మాట్లాడుతుంటుంది ఉపనిషత్. కాబట్టి ఈ ఐదు ఇంద్రియాలలో నుండి ప్రవహిస్తున్న తత్త్వాన్ని బయటకి ప్రవహించనీయకుండా అపుకోగలిగితే, ఇంద్రియ లోకాల వరకూ గూడ భగవంతుని రసానుభూతిగా అనుభూతి చెందవచ్చు. 'రశో వై సః' అంటారు గదా. మామూలుగా చాలా ఊర్ధ్వగతి లోకి మనం ప్రవేశించి, అంటే మనస్సు పైనుండే లోకాలలోకి ప్రవేశించి, భగవంతుణ్ణి అనుభూతి చెందడం అనేది ఒకటి వుంటే, ఆయన్ని మన ఇంద్రియాలలో కూడా అంది పుచ్చుకుని, రసాస్వాదన చేయడం అనేది ఇంకొక పద్ధతి. అది గోవిందుడి యొక్క రుచి! కృష్ణుడి యొక్క అనుభూతి పొందినవాళ్ళు ఆనందంతో పిచ్చెక్కి వుంటారు. ఎందుకంటే ఇంద్రియముల వరకు కూడా ఆ రసానుభూతి దిగివచ్చి, అనుభూతి చెందుతూ వుంటారు. కారణం ఇంద్రియములు Externalise కాకుండా వున్నాయి. దాన్నే dynamic passivity అన్నారు అరవింద మహర్షి. అట్లా ఇంద్రియములు బయటకి పరుగెత్తకుండా వున్నట్లయితే, నీలో వున్న భగవత్ తత్త్వం హృదయం నుండి వ్యక్తమై, నీ యందు ఒక రకమైన అనుభూతిని కలిగించి, నిన్ను పారవశ్యంలో ముంచెత్తుతూ వుంటుంది. అదీ భక్తుల యొక్క పరవశం! మీరాబాయి యొక్క పరవశం అట్లా వుంటుంది. ఉద్ధవుడి యొక్క పరవశం అట్లా వుంటుంది. చైతన్య మహాప్రభువు యొక్క పరవశం అట్లా వుంటుంది. భక్తి మార్గంలో ఈ పరవశత్వానికి పరాకాష్టగా మనకి గోపికలు నిలుస్తారు. గురువుగా నారదుడు నిలుస్తాడు. వాళ్ళు అనుభవిస్తుండేది ఎక్కడో లోలోతుల్లోకి వెళ్ళి, భగవత్ అనుభూతిని పొందడం కాదు, ఆ అనుభూతిని సరాసరి తమ మనస్సుల్లోకి, తమ చిత్తం లోకి, అక్కడ నుండి ఇంద్రియాలలోకి కూడా దింపుకుని, ప్రస్ఫుటంగా అనుభవిస్తుంటారు. అది 'గోవింద' అనుభూతి అంటే! అంటే చూస్తున్నదాంట్లో నుండి దాన్నే చూస్తూ వుంటుంది, వినే దాంట్లోనూ దాన్నే వింటూ వుంటుంది, రుచి చూసే దాంట్లోనూ దాన్నే రుచి చూస్తూ వుంటుంది, స్పర్శలోనూ ఆ కేంద్రం యొక్క దివ్యానుభూతినే పొందుతూ వుంటుంది. అది ప్రహ్లాదుడి యొక్క స్థితి! అంబరీషుడు, ప్రహ్లాదుడు, శుకుడు వీళ్ళందరూ ఏదో ఎక్కడో లోపలికి వెళ్ళిపోయి, ఉచ్ఛ్వాస నిశ్వాసలను పట్టుకుని, హృదయం లోకి వెళ్ళి, అక్కడ నుండి స్పందనం లోకి వెళ్ళి, అక్కడి నుండి సూక్ష్మ స్పందనం లోకి వెళ్ళి, అక్కడ నుండి సుషుమ్న లోకి వెళ్ళి, ఇట్లా వెళ్ళి పోవడం

కాదు. ఇటు నుండి వెళ్ళి భగవంతుని అటు నుండి ఇంద్రియ ద్వారం వరకు పట్టుకొచ్చి, ఇంద్రియముల ద్వారా భగవంతుని పరిపూర్ణంగా రసాస్వాదన చేయడం అనేది, బాగా సాధన చేసుకుని ఉన్నత స్థితిలోకి వెళ్ళిన వాళ్ళకు వీలుపడే విషయం వాళ్ళకు జీవితం అంతా ఇంక రసానుభూతే! అంతా దివ్యానుభూతే! అది తప్ప ఇంకొకటి వుండదు వాళ్ళకు. భగవంతుడు అంత ప్రస్ఫుటంగా పంచేంద్రియములచె పట్టుపడడు, అని చెప్తుంటాము. కానీ వీళ్ళకి భగవంతుడు పట్టు పడతాడు. ఆ విధంగా అనుభూతి చెందే తత్వాన్ని 'గోవింద' తత్వం అన్నారు.

## 561 సుషేణుఃసుషేణుఃసుషేణుఃస

మామూలుగా పండితులు, జ్ఞానులు వాళ్ళందరూ, సంగము లేకపోవడం అని చెప్తారు. అంటే ఎక్కడ నీకు కొంచెం మమకారం కలిగిస్తుందో అక్కడల్లా కత్తెర వేసేయి, detachment అని చెప్తారు. కానీ భాగవత మార్గంలో 'నీవు ఎక్కడ మమకారంతో అతుక్కుని వుంటావో అది సంగమం కదా. ఆ సంగమముకు 'అ' చేర్చు' అంటారు. అంటే సంగమము నుండి విడకొట్టడం కాదు. అంతకు ముందు విభూతి యోగంలో భగవంతుడు 'అక్షరాలలో 'అ' నేను' అంటాడు. కాబట్టి 'నువ్వు మమకారం పడుతున్న సన్నివేశం గానీ, ప్రదేశం కానీ, మనిషి కానీ, వాటిని నన్ను గానే చూడు, అప్పుడు నీకు అసంగం సిద్ధిస్తుంది', అని చెప్పేది భాగవతం. అవి వుండకూడదు, ఇవి వుండకూడదు, మమకారం వుండకూడదు, పిల్లల మీద ప్రేమ వుండకూడదు, పెళ్ళాం మీద మొగుడికి, మొగుడు మీద పెళ్ళంకి ప్రేమ వుండకూడదు, వడియం ముక్కల్లా వుండాలి. ఇదో రకం. భాగవత మార్గం ఏమిటంటే 'అదేం అక్కర లేదు, నీవు దేనిమీద బాగా మమకార పడుతున్నావో ఆ రూపంలో నేనే వున్నానని, చూడు' అంటాడు. బాగుంది కదా ! కాబట్టి అక్కడ నుండి మనం sticker పీకక్కర్లేదు, ఇంకా బాగా అతికించుకోవచ్చు. 'దేన్ని చూసినా అన్ని చోట్లా నేనే వున్నాను కదా. అట్లా నాతో అతికించుకో, అందరిలోనూ, నీ వుద్యోగంలోనూ, నీ ఇంట్లోనూ, నీ స్నేహితుల విషయం లోనూ. ప్రతి వాళ్ళ విషయంలోనూ, నువ్వు అతికించుకుంటూ-పో' అన్నాడు. అంతకు ముందు మనకు శాస్త్రకారులు 'ఈ అతుకుల వల్ల, జిగురు వల్ల, మనం బాగా బాధ పడుతున్నాం కాబట్టి వదిలేయమంటారు'. భాగవతం వదిలేయక్కరలేదు, నీకు ఏది అతుక్కుందో అది నన్నుగా చూడమని చెప్తుంది. అయిపోయింది పని. అందుకే అసంగం అంటే 'అ' తో సంగమము అని చెప్తుంది భాగవతం. అసంగమము అంటే సంగమము లేకపోవుట అని చెప్తుంది శాస్త్రం. సంగం లేకపోవుట అనేది భాగవత మార్గంలో సహజంగా సిద్ధిస్తుంది. నెమ్మదిగా భర్త భార్యను చూడడంకన్నా, భార్య రూపంలో వున్న భగవంతుడ్ని చూడడం ఎక్కువ అవుతున్న కొద్దీ, భార్య అనే భావం జారిపోతుంది. కొడుకు అనే భావం జారిపోతుంది, భగవంతుడు నిలుస్తాడు. ఇంట్లో పనిచేసేవాడు అనే భావం జారిపోతుంది, భగవంతుడు నిలుస్తాడు. ప్రతి దాంట్లోనూ ఏది నిలవాలో అది నిలుస్తుంది, మిగతాది మన ప్రయత్నంతో సంబంధం లేకుండా జారిపోతుంది. జారిపోతే ఏమైంది నీకు ఏం చూసినా అదిగానే గోచరిస్తుంటే ప్రొద్దున లేచిన దగ్గర నుండి, రాత్రి పడుకోబోయేవరకు వాడి తోనే నీకు. అదిట సుషేణుడు! భగవంతుడు An Army of good numbers అంటారు. అంటే ఒక పెద్ద సైన్యం కట్టుకొచ్చినట్టుగా, ఎటుచూస్తే అటు, ఎక్కడ చూస్తే అక్కడ, దేన్ని చూస్తే అదే, ఏ సన్నివేశం చూస్తే అన్నీ అది గానే గోచరిస్తాడు, ఎవరికి? ఈ గోవింద నామం చేసుకునే వాళ్ళకు! గోవింద నామం సిద్ధించిన వాళ్ళకి ఇంక ఈ ప్రపంచములో గోవిందుడే వుంటాడు, ఇంకేం వుండదు.

ఇంకొకడు వాడికి వుండడు అంతే. మనకి వుంటుంది, వాడికి వుండదు. వాడికన్నీ అదైపోయివుంటుంది. అది తన్మయస్థితి.

## 562 కనకాంగదీ

భగవంతుడి యొక్క అంగములన్నీ కూడా బంగారం రంగులో వుంటాయి. ఇది కూడా సృష్టి ధర్మములలో ఒకటి. హిరణ్యవర్ణం భగవంతుని యొక్క మొదటి తొడుగు. బంగారం లోపల తాను నీల వర్ణుడై వుంటాడు. ఆ నీలం మనకి కనబడని చోటుగా వుంటుంది. మన మధ్య వుండే చోటు ఏమీ లేనట్టుగా, ఏ రంగూ లేనట్టుగా గోచరిస్తుంది. ఇక్కడ నుండి ఆ గోడ వరకూ చూస్తుంటే అంత లోతు లేదు. అట్లా గాకుండా విమానంలో వెళ్తూ, ఏ మేఘాలు లేనిచోట్లోకి మనం చూస్తున్నాము అనుకోండి, లేకపోతే అట్లా సముద్రం ఒడ్డుకు వెళ్ళి ఏ రూపమూ కనిపించని చోటులో చూస్తూంటే, రూపం అనే అడ్డంకి లేకపోవడంవల్ల, చూపుకు ఎక్కడా ఏమీ తగలదు. తగిలితే ఏదో కనిపిస్తుంది. తగలకపోతే ఏం వుంటుంది? నీలంగా వుంటుంది! అది ఎట్లా వుంటుందయ్యా అంటే, ఏమీ లేనట్లుగా వుంటుంది. వాడూ నీలవర్ణ దేవుడు! శ్యామల! 'శ్యామల కోమల కృష్ణా మురారి'. అదీ భగవంతుడు రాముడు గాని, కృష్ణుడు గాని నీలివర్ణం అని చెప్పడంలో వుద్దేశ్యం. వాళ్ళు నీలంగా పుట్టలేదు. సినిమాలలో వాళ్ళు paint పూస్తారు పూర్తిగా తప్ప, ఎక్కడన్నా నీలం గా పుడతారా? నీలం బాగా పెరిగిన కొద్దీ నల్లగా గోచరిస్తుంది. అంటే ఏం లేదు అని చెప్పడానికి, ఏం లేనట్టుగా వుంటాడు. వాడి మొదటి తొడుగు బంగారం రంగు. అందుకే భగవంతుని పట్టు పీతాంబరం ధరించినట్లుగా చెప్తుంటారు. అందుకనే వస్త్రదానంలో శ్రేష్ఠం పీతాంబరం అంటాం కదా. ఎందుకనీ బంగారం రంగులో వుంటుందని. పీతాంబరం ఎవరికి ఇస్తున్నాము? వాడికి! వాడు అసలు దిగంబరుడు. అంటే దిక్కులే అంబరముగా కలవాడు అని అర్థం. మరి వాడు మొత్తం దిక్కులే నిండిపోయి వుంటే మనకి చూడ్డం కష్టం కదా. కొంచెం వాడికి ఏదో బట్ట కడితే ఆ చోట్లో, మనం బట్ట కట్టినంత మేర వాడు కనిపిస్తాడు. చీకటికి బట్ట కట్టడం అండీ. బట్ట కడితే, ఆ బట్ట బట్టి ఆ చీకటిగా వాడు వున్నాడు అని తెలుస్తుంది. అది హిరణ్యవర్ణం! ఆ తొడుగు అమ్మవారు అంటారు. ఆ తొడుగే లేకపోతే ఆయన కనిపించడు. ఉన్నాడు, వున్నట్టు తెలియదు. అందుకని కృష్ణునికి బట్ట కడితే, బట్టను బట్టి కృష్ణుడు వున్నాడని తెలుస్తుందట. ఇప్పుడు విద్యుత్ వుందనుకోండి, అందులో వెలుగుతుంటే మనకి తెలుస్తుంది విద్యుత్ వుందని, లేకపోతే విద్యుత్ ఎట్లా చూస్తారు మీరు? ఇందులోంచి బాగా వ్యక్తం అవుతుంటే విద్యుత్ వుందని తెలుస్తుంది. విద్యుత్ వుందని మనమందరం నమ్ముతాము, ఆ వెలుగు వల్ల కానీ, Amplifier వల్ల కాని. కానీ విద్యుత్ ను చూశావా ? చూడకపోయినా వున్నదని తెలుస్తుంది కదా. ఎట్లా తెలుస్తుంది? ఒక తొడుగు ఆధారంగా తెలుస్తుంది. అట్లా శబ్దాలలో 'ఓంకారం' ఆయన తొడుగు, వర్ణాలలో అంటే రంగులలో బంగారం ఆయన రంగు. మొదటి తొడుగు. ఓంకారం మొదటి తొడుగు శబ్దాలలో. అందుకని

హిరణ్యవర్ణాం అని చెప్పి అమ్మవారిని అంటాం. ఎందుకని ఆవిడ వుండడం! ఆయన వున్నాడని తెలియడానికి, ఆవిడ వార్త ఇస్తుందట. She is the messenger that, he is there. అది వున్నది అంటే బంగారం వర్ణం ఆయన వున్నట్టు. ఆయన అంగాలన్నీ అంటే ఆయన రూపమే కదా. అందుకని ఆ రూపంలో ముందు దర్శనం చేసుకోవడం మనకు ఒక సాంప్రదాయంగా, ఒక సాధన భాగంగా ఇచ్చి, బంగారు వర్ణాన్ని బాగా ఎక్కువ ధ్యానం చేసుకోమని చెప్తారు. లక్ష్మీప్రదం అంటారు కదా, అంటే డబ్బులు వస్తాయని కాదు. శుభం కలుగుతుంది, ఎందుకని శుభం కలుగుతుంది అంటే, ఆమె యొక్క అస్థిత్వం, ఆమె యొక్క సాన్నిధ్యం, అంటే భగవంతుని యొక్క సాన్నిధ్యమే! రూపు దాల్చిన భగవంతుని సాన్నిధ్యమే అమ్మవారి సాన్నిధ్యం! అందుకని హృదయంలో ఆ వర్ణాన్ని బాగా ధ్యానం చేయడం అనే ఒక పద్ధతి మనకు ఇచ్చారు. ఎంత బాగా ధ్యానం చేసుకుంటే అంత బాగా మనకి సత్యమై నిలుస్తుంది. ఎందుకంటే చోటుకు రూపం లేదు. కన్ను ఒక రూపం లోకి పట్టుకొస్తే, ఆ రూపమే మీకు గోచరిస్తుంది. అందుకని ఏదో ఒక అందమైన రూపం, దానికి రకరకములైన ఆభరణములు, కిరీటం, భుజకీర్తులు, వక్షస్థలం లో నగలు, నడుము చుట్టూ వడ్డాణం ఇలా మగైనా ఆడైనా మన బొమ్మలలో వేసుకుంటాం కదా. ఎందుకని? కళ్ళు మూసుకుని విష్ణు సహస్ర నామం చదువుతున్నంత సేపు ఈ ఆభరణాలన్నీ పెట్టుకున్న భగవంతుడు, బాగా దేదీప్యంగా లోపల వెలుగుతున్నట్లు భావన చేస్తున్నకొద్ది నీలో వుండే హిరణ్యవర్ణం ఒక్కసారి వ్యక్తం అవుతుంది. అది ఆధారంగా భగవంతుని సాన్నిధ్యం నీ యందు స్థిర పడుతుంది. నీ భావన యొక్క త్రీవ్రత బట్టి, ఏకాగ్రతను బట్టి, అనుస్యూతం గా అంతరాయం లేకుండా దాన్ని నిర్మాణం చేసుకోవడం బట్టి, మొత్తం చోటులో నుండి నీవు కోరిన రూపంలో ఒక భగవత్ తత్వం నీ యందు సాక్షాత్కరిస్తుంది. ఈ విధంగా భగవంతుని రూపంలోకి తెచ్చుకుని, వాడితో మాట్లాడుతూ, వాడితో కబుర్లు చెప్పుకుంటూ, వాడితో సరసాలు ఆడుకుంటూ, వాడి గురించి స్తోత్రాలు చేసుకుంటూ, వాడినే అన్ని చోట్లా చూసుకుంటూ జీవించే భక్తులు చాలా మంది వున్నారు. అందుకని ఈ స్తోత్రం చేసినంతసేపూ మనం భావనలో భగవంతుని శిరస్సు నుండి పాదముల వరకూ సమస్తమైన భాగములను ఎంత అందంగ తీర్చి దిద్దుకోగలిగితే, అంత అందంగా తీర్చి దిద్దుకోవచ్చు. లోపల భగవంతుని దర్శనం చేసుకున్నప్పుడు, ఆయన కిరీటంలో వజ్రాలన్నీ బోలెడు పెట్టవచ్చు. కష్టం ఏమీ లేదు, ఖర్చు అంత కన్నా కాదు. మణిమయమైన కిరీటములు, వంకీలు, వడ్డాణములు, మెడనిండా, ఒంటినిండా నగలు, ధగధగలాడే పట్టువస్త్రం కట్టుకున్నట్టుగాను, కళ్ళల్లో నుండి కాంతి వెదజల్లుతున్నట్టుగాను, చిరునవ్వు చాలా అద్భుతమైన ప్రశాంతత మనకు కలిగిస్తునట్టుగాను, మనతో ఆయన స్నేహం చేస్తునట్టుగాను, ఆయన కాలివేళ్ళు, వేళ్ళకుండే గోళ్ళ దగ్గర నుండి, చేతులు, చేతుల వేళ్ళు, వేళ్ళ కుండే గోళ్ళు, గోళ్ళ కుండే మెరుపు, ఇట్లా అన్నిటిలో నుండి రకరకాల కాంతులను వెదజల్లుతున్న రూపాన్ని ధ్యానం

చేసుకోవడం అనే సులభమైన పద్ధతి మనకు పెద్దలు ఇచ్చారు. అందుకే అన్ని రకాల అలంకరణలు! అలంకారాలు రకరకాలుగా చేస్తాం కదా. ఆభరణాం సమర్పయామి, ఊహ కొద్దీ పెట్టండి ఆభరణాలు. వూరికే ఆభరణాం సమర్పయామి అని చెప్పి next చదివేద్దాం అనుకోవద్దు. హాయిగా కళ్ళుమూసుకుని లోపల భగవంతుని మీకు నచ్చిన రూపాన్ని ఒకటి ఆవాహన చేసుకుని, మనలోనే వున్నాడు చోటుగా. ఆ చోటుకు మీరు ఇచ్చే రూపమే రూపం. చాలా సార్లు చెప్పుకున్నాం, గ్లాసులో నీళ్ళు పోస్తే నీళ్ళకి గ్లాసు రూపం, బిందెలో పోస్తే బిందె రూపం వస్తుంది. మరచెంబులో పోస్తే మరచెంబు రూపం వస్తుంది. నీళ్లకు రూపం లేదు. అలాగే దైవతత్వానికి రూపం లేకపోయినప్పటికీ కూడా నువ్వు ఒక రూపంలోకి ఆవాహనం చేయడం ఒక అభ్యాసంగా చేస్తూ వుంటే, నీకు అది సత్యం అవుతుంది. నీకు నీ గురువు యొక్క దర్శనం కూడా అట్లా సత్యం అవుతుంది.

## 563, 564, 565, 566 గుహ్యః, గభీరః, గహనః, గుప్తః

గుహ్యుడు అంటే దాగి వున్న వాడు, లోపల వున్న వాడు అని అర్థం. గభీరుడు అంటే లోతైన వాడు, లోతుల్లో వుండే వాడు అని అర్థం. గంభీరుడు అని మనం తెలుగులో అంటాం. గుప్తుడు అంటే రహస్యంగా వుండే వాడు అని అర్థం. ఈ నామాల యొక్క అవగాహన లోతు నుండి, లేదా అంతర్దర్శనము అనే భావనకు సంభంధించినది. కనిపించే దాంట్లో వున్నది చూడడం. కనిపించేది వున్నదానికి ప్రతీకగా వుంటుంది. ప్రతీకను చూస్తాం తప్ప, ఆ ప్రతీక దేనిని అక్కడ ప్రతిపాదిస్తుందో, దేనికి ప్రతినిధిగా నిలబడుతుందో, దానిని చూడడం జరగకపోవడం, భగవత్ తత్త్వాలలో ఒకటి. ఎవరైనా కనిపిస్తే వారితో మనకు వున్న సంబంధం చూస్తాం తప్ప, భగవంతుని యొక్క ఒక రూపం అని చూడము. భగవంతుడే ఇన్ని రూపాలలో వున్నాడని ఎన్నిసార్లు మనం చెప్పుకున్నా, ప్రవర్తనలోకి వచ్చేసరికి ఈ మూడూ జరిగి పోతాయి. ఏ మూడూ? మనకి కనబడిన వ్యక్తిలో దాగివున్న వాడు కనబడడు. ఎంత సాధన చేసుకున్నా సరే ఇక్కడకు వచ్చేసరికి జారిపోతాం. అందరిలోనూ దేవుడు వున్నాడని చెప్తాం. అందరిగానూ దేవుడు వున్నాడని చెప్తాం. మనిషి కనిపించగానే అతని పేరు, అతని స్థితిగతులు, అతనికి మనకి వుండే సంబంధం, అదే గుర్తు వుంటుంది తప్ప భగవంతుడు గుర్తువుండడు. ఆ తత్త్వమే ఈ రూపంలో వున్నదని గుర్తు వుండదు కదా. ఎంత మనం చెప్పుకున్నా, ఎన్ని సార్లు చదువుకున్నా, ఎన్ని సార్లు గుర్తు చేసుకున్నా, అట్లా మళ్ళీ దాగుకుంటాడు. అక్కడే వుంటాడు, దాగుకుంటాడు. అందుకనే దొంగ అన్నారు. భగవంతుని నామాలలో దొంగ కూడా ఒకటి వుంది కదా. 'తస్కరాణాం పతయే నమః' దొంగలకు దొంగ. అది చాలా విచిత్రమైన విషయం. 'కనబడుతున్న దాంట్లో నేను కనబడుతూనే వున్నాను , నీవు చూడక పోతే నేనేం చేస్తాను?' అంటాడు. మనం వాణ్ణి చూడక, వాడు కనబడాలని రకరకాలుగా ఆరాటపడుతుంటాం, తాపత్రయపడుతుంటాం. కనబడుతుంటే చూడకుండా నాకోసం వెతుకుతావేమిటే? వినబడుతుంటే వినకుండా నాకోసం వెందామని ప్రయత్నం చేస్తావేమిటే? నా పాద స్పర్శ కావాలనుకుంటావు, దేని స్పర్శ యందైనా నా భావ స్పర్శ అందుతుంది. నా యొక్క వినికిడి నీకు ఏ చప్పుడు నుంచైనా అందుతుంది. నా యొక్క దర్శనం నీకు ఏ రూపం నుంచైనా అందుతుంది, అని మనకి మనం ముప్పై కోట్ల సార్లు చెప్పుకున్నా అందదు. అందుకని ఆయన దాగి ఉన్నాడు అని చెప్తారు. కృష్ణుడు అట్లా ఎదురుగుండా కనబడుతుంటే ఎంతమందికి తెలిసింది? తెలియ లేదుకదా. ఒక్క భీష్ముడికి తెలుస్తుంది పరిపూర్ణంగా. ఇతరులకు పరిపూర్ణంగా తెలియదు. అప్పుడప్పుడూ తెలుస్తూ మర్చిపోయిన వాళ్ళు చాలా మంది వున్నారు. ద్రౌపదికి తెలుసు. ఇంత విశ్వరూపసందర్శనం చూసిన అర్జునుడు కూడా, ఆ తర్వాత యుద్ధంలోనే

కృష్ణుడు చెప్పిన మాట వినకుండా నష్టపోయాడు. ధర్మరాజుకు తెలుసు మరుపు వస్తూ వుంటుంది. అర్జునుడికి తెలుసు మరుపు వస్తూ వుంటుంది. ద్రౌపదికి తెలుసు మరుపు వస్తూ వుంటుంది. ఎప్పుడూ మరవని వాళ్ళని మనం లెక్క వేసుకుంటే, గోపికలు కనిపిస్తారు. ఎందుకంటే వాళ్ళూ గోప్యంగా వుండే వాళ్ళు. ఎప్పుడూ మరవని వాళ్ళు మైత్రేయాదులు. కృష్ణునికి తెరవెనుక నిలబడిన వరమగురువులు మైత్రేయుడు, మరువు, దేవాపి, ఇత్యాది మహర్షులకి కృష్ణుడు మరుగు పడకుండా వున్నాడు. వ్యాసాది మహర్షులకి, శుకుడుకి, గోపికలకి మరుగు పడకుండా వున్నాడు. అప్పుడప్పుడు మర్చిపోయారు వాళ్ళు, ఎప్పుడూ మర్చిపోలేదు. చూపించినా మర్చిపోతాం. అందుకనే దర్శనం ఒక్కసారి అయినంతమాత్రాన మనం ఇంక అట్లా నిలబడిపోతాం అని ఏమీ లేదు. నిలబెట్టుకోడానికి సాధన అనేది ఎప్పుడూ జరుగుతుండాలి. ఒక్కసారి cycle మీద మనం ఎక్కి balance చేసి వెళ్తున్నప్పుడు ఎంతసేపు cycle మీద వుండగలం అంటే, ఎంతసేపు తొక్కుతూ వుంటే అంత సేపు వుండగలం. ఎంతసేపు తొక్కాలి అంటే ఎంతసేపు cycle మీద వుందామనుకుంటే అంత సేపు తొక్కాల్సిందే. అలాగే భగవంతుడితో వుండడం కూడా మన భావంతో, వాని యందు మనం యోగం చెందడం చేత వుండడానికి వీలుపడుతుంది తప్ప, భావంలో వాడు ఎప్పుడైతే మరుగు అవుతాడో అప్పుడు మొత్తం అంతా అదృశ్యం అయిపోతుంది. అందుకే భగవంతుడికి గుహుడు అనే పేరు వుంది. గుహలో వుంటాడు. దాక్కొని వుంటాడు. అందరి గుహలలోనూ తానే నివశించి వున్నాడు. గుహనే 'హృదయం' అంటారు. హృదయమునందు దాగి వున్నాడు. వాడి దర్శనం చేయాలంటే అందరూ హృదయంలో వుండే వాణ్ని గుర్తు తెచ్చుకోవడం ఒక్కటే తప్ప ఇంకో మార్గం లేదు. ఎప్పుడు మనం మర్చిపోతామో అప్పుడు వాడు మరుగు అయిపోతాడు. 'నిన్ను మర్చిపోకుండా నేను ఏం చేయాలి?' అంటే 'గుర్తు పెట్టుకో' అని చెప్తాడు. 'గుర్తు లేకపోతే ఏం చేయాలి?' అంటే 'మరచిపోవద్దు' అని చెప్తాడు, రెండూ ఒకటే. అదే బ్రహ్మకి నారాయణుడు బోధ చేస్తాడు తృతీయ స్కంధం భాగవతంలో. ఇంకో మార్గం లేదు. 'నాన్యః పంథా' నేను ఎప్పుడూ నీ యందు ఉన్ముఖుడై వున్నప్పటికీ కూడా నీ ఉన్ముఖత్వం బట్టి నీకు నేను, వుండడం లేకపోవడం జరుగుతుంది తప్ప, నేను ఎప్పుడూ వున్నవాణ్ణే అని చెప్తాడు. కాబట్టి గుహ్యంగా వున్నాడు. అది చూడక ఇతరములను చూస్తున్నప్పుడు అతను లోతుగా వున్నాడు. లోతుగా వున్నాడంటే అతని పైన మనకి మొదటి పొరగా చైతన్యం కనిపిస్తుంది. భగవంతుని యొక్క మూల తత్త్వానికి మొట్టమొదటి పొర చైతన్యం! మనం కూడా ప్రతి ఉదయం చైతన్యవంతులము అవుతుంటాము. ఇంతకు ముందు అత్మవంతులమే! అస్థిత్వము కలవారమై వుంటాము. వున్నామని తెలుసు. వున్నవాళ్ళం చైతన్యవంతులము అవుతూవుంటాము. చైతన్య వంతులము అవడం అనేది అతని యొక్క మొదటి పొర. అందుకని వెలుగు అతని యొక్క మొదటి పొర అని మనకి చెప్తారు. అమ్మవారు ఆయన యొక్క మొదటి వ్యక్తీకరణం,

అంటే వ్యక్తమవుట. ఇట్లా గోచరిస్తుంది. ఆ శుద్ధ చైతన్యం లో నుండి మళ్ళీ ఇంకొక పొర త్రిగుణాత్మకంగా ఏర్పడుతుంది. అది ప్రకృతి నుండి అంటే చైతన్యం నుండి ఏర్పడేది. మనం కూడా లేవంగానే తెలివి వచ్చిన తర్వాత కదా ఆలోచన ఏర్పడుతుంది. తెలివి రాక ముందు ఆలోచన రాదు. తెలివి వస్తే ఆలోచన వస్తుంది. ఆలోచనలు తెగవు. మళ్ళీ మర్చిపోతుంటాం. అట్లాగే శుద్ధ చైతన్యంగా మొదటి పొర ఆయన చుట్టూ ఒక ఆవరణ ఏర్పడితే, దాంట్లో నుండి త్రిగుణాత్మకంగా పొరలు ఏర్పడితే, అందులోంచి భావమయ లోకాలు ఏర్పడితే, అందులో నుండి సమస్త దేవతలు పుట్టుకొస్తే, ఆదిత్యలోకాలు, రుద్రలోకాలు, వసులోకాలు పుట్టుకొస్తే, వీటినన్నిటిని కూడగట్టడానికి ప్రచేతసులు పుట్టుకొస్తే, అంటే ఇంద్రియములు పుట్టుకొస్తే, శరీరానికి మనకి మధ్య అనుసంధానం చేసేటట్టుగా ఇంద్రియములు తయారై ఈ మొత్తం అంతా ఇలా పొరలు పొరలుగా ఏర్పడితే, ఇన్ని పొరల వెనుక లోతుల్లో వున్నాడు ఆయన. ప్రతి పొరలోనూ వున్నాడు, మన ముందూ వున్నాడు, మన వెనుక వున్నాడు. పొరలు మాత్రమే చూస్తూ వుంటాం. ఈ విధంగా అక్కడే వున్నా మనం దాన్ని చూడకుండా వుండే ఒక విచిత్రమైన తత్త్వం భగవంతుడు. లేక భగవత్తత్త్వం అటువంటిది అని చెప్తారు. శ్రీకృష్ణుడు 126 సంవత్సరాలు అందరితో కలిసి వున్నప్పటికి కూడా తెలిసిన వాళ్ళకి తెలిశాడు, తెలియని వాడికి తెలియలేదు. మన మధ్య భగవంతుడు తిరుగుతున్నంత మాత్రాన మనకి తెలియాలని లేదు. మన బట్టే వుంటుంది. ఒక గురువుని ఒక శిష్యుడు తన యొక్క స్థితిని బట్టి గుర్తిస్తాడు తప్ప, తన పక్కనే భౌతికంగా వున్నా గుర్తించడానికి అవకాశం లేదు. ఆ విధంగా భగవత్తత్త్వం మనలోనే మన వలనే వుండడం చేత మనం గుర్తించడానికి వీలుపడదు. అందుకని ఏం చెప్తారంటే రహస్యంగా వున్నాడు. గుప్త అనే పేరు వుంది కదా. గుప్తాగారు అంటే అన్నీ దాచి పెడతారు అని అర్థం. వైశ్యులకి గుప్తులు అని పేరు వుంది. ఎందుకయ్యా అంటే వాళ్ళకి ఏమి వచ్చిందో ఎవరికీ తెలియకుండా దాచి పెడతారు. బయటికి మామూలుగానే కనిపిస్తారు. కోటీశ్వరుడైనా మామూలు మనుష్యుల మాదిరిగానే బయటికి కనిపించేటట్టుగా రహస్యంగా వుంటారు. లాభాలన్నీ చెప్పకుండా, వాళ్ళకు ఎంత వుందో తెలియకుండా దాచేస్తారు. అలాగే గురువు కూడా తనయందు వున్న తత్త్వాన్ని మరుగు పరుస్తూ వుంటాడు. ప్రకటించుకుంటూ తిరిగే వాడు కాదు. భగవంతునికి ఏఏ గుణములు వున్నాయో, అవే భగవంతుని ప్రతినిధియైన మహాత్ములు, లేక గురువులకు కూడా ఉంటాయి. నేను మహాత్ముణ్ణి అనేటట్టుగా ప్రవర్తించరు. అందరితో సమానంగా కలిసిమెలిసి వుంటారు. తెలిసిన వాళ్ళు తెలుసుకుంటారు. తెలుసుకోలేని వాళ్ళు తెలుసుకోలేరు తప్ప తనకేమీ ప్రత్యేకమైన గుర్తింపు కోసం తాపత్రయ పడడం కానీ, ప్రత్యేకంగా కనపడాలి అనే ఒక ప్రయత్నం గానీ ఏమీ చేయక అందరిలో, అందరివలే జీవిస్తూ వుంటారు. ఎందుకని అంటే భగవంతుడు అట్లా జీవిస్తూ వుంటాడు కాబట్టి. భగవంతుడు కుక్కలో కుక్క వలే, పంది లో పంది వలే, పాములో

పాము వలే, చీమలో చీమ వలే , దోమలో దోమ వలే, మనిషిలో మనిషి వలే, దేవతలలో దేవత వలే వుండగలిగిన వాడు. తెలిసిన వాడు కూడా మనిషిగా వుంటే మనిషి వలే ఉంటాడు. ఇంకో రకంగా వుండడు. అంతకన్నా ఏదో తేడాగా వుందామనుకుంటే ఏదో రోగం వుందని అర్థం. మనిషిలో మనోవికారం ఏదో వుంటే తప్ప ప్రత్యేకంగా కనిపించాలని తాపత్రయం వుండదు. అందుకనే జగత్ గురువు మైత్రేయులు ఏం చెప్పారంటే- సనాతన ధర్మ మార్గంలో, యోగ మార్గంలో నడిచే వాళ్ళు తన యొక్క ప్రత్యేకతను ఇతరులు గుర్తించాలని తపన దాటి వుంటారు. ఎందుకని అంటే భగవంతుడు కూడా అట్లాగే వున్నాడు కదా. గుర్తింపుకోసం బాధ పడడంలేదు భగవంతుడు. అరే నన్ను ఎవరూ గుర్తించడంలేదే అని బాధ పడడు. ఇన్నిట్లోనూ తాను వున్నాడు. మనలో మన వలే వున్నాడు. అందుకనే భగవంతుని తెలియడం అంటే మనం మనకు తెలియడమే! 'నిన్ను నీవు తెలుసుకో' అని చెప్పడం అది. ఎవరైతే తనను తాను తెలుసుకుంటాడో భగవంతుడ్ని కూడా అదే సమయంలో తెలుసుకుంటాడు. భగవంతుని తెలియడం అంటే తనను తాను తెలుసుకోవడమే. తనని తాను తెలుసుకోవడం అంటే భగవంతుని తెలుసుకోవడమే. తన గురించి ప్రపంచం అంతా వెతికితే కనబడడు. అందుకని తానెవరో తెలుసుకోవడానికి తాను అంతర్ముఖుడు అవ్వాలి. అంతర్ముఖుడు అయితే మాత్రమే ఈ గుహలో వుండే వాడు దర్శనము ఇస్తాడుట. గుహ అంటే హృదయమే! హృదయ గహ్వరం అంటారు. అందులో ప్రవేశించాలి. మనం బాగా బాహ్య ప్రపంచం లోకి విచ్చుకుపోయి వుంటాము విపరీతంగా. విచ్చుకున్నా పర్వాలేదు, బాగా సాగిపోయి వుంటాము. ఇట్లా కళ్ళు మూసుకున్నా ఎక్కడికో వెళ్ళి పోతాము. విష్ణు సహస్రనామాలు చదువుతున్నా నామాలలో వుండకుండా ఎక్కడెక్కడో, ఎక్కడెక్కడో, మన గురుపూజల దగ్గర వున్న ఊర కుక్కల్లే, తిరిగి వచ్చేస్తుంటాం. మధ్య మధ్యలో వచ్చి చూసి పోతుంటాం ఎంతవరకూ వచ్చామని. మనందరకు జరిగేదే ఇది. బాధ పడక్కర లేదు. ప్రయత్నం చేసుకోవాలి. ఎందుకంటే చిన్నతనం నుండి బయటికి ఇంద్రియముల ద్వారా వెళ్ళడం అనేది నేర్పారు తప్ప అదే ఇంద్రియముల ఆధారంగా తన లోపలికి వెళ్ళడం అనేది నేర్పక పోవడం వల్ల కొంచెం కష్టం. చిన్నప్పటి నుండి నేర్పితే అంత కష్టం కాదు. పుట్టిన పిల్లవాణ్ణి వాడు కాళ్ళు చేతులు విదిలించేంతవరకు గోల చేస్తాం. వాడికి అసలు చెవుడా లేకపోతే వింటాడా అని తెలియడం కోసం చెవి దగ్గర చప్పళ్ళు చేస్తాం. వాడికి స్పర్శ జ్ఞానం వుందా లేదా అని తెలియడానికి బుగ్గలు గిల్లి , అది గిల్లి, ఇది గిల్లి ఏదేదో చేస్తుంటాం. వాణ్ణి బయటకు లాగుతాం. అంటే స్పర్శ జ్ఞానం కలిగిస్తాం, చూపు కలిగిస్తాం. అలాగే దూరం నుండి చిట్టీ, చిన్నీ అని పిలుస్తుంటాం, వాడు ఇట్లా తిరిగి చూస్తే మనం ఆనంద పడుతుంటాం. ఇవన్నీ ఏమిటయ్యా అంటే వాణ్ణి బయటకు లాగడానికి. వాడి చూపులను బయటకి లాగుతాం, వాడి వినికిడిని బయటకు లాగుతాం, వాడి స్పర్శ ద్వారా వాణ్ణి బయటకు లాగుతాం. వాడి నోట్లో Chocolate పెట్టి బయటకి లాగుతాం. ఆ తర్వాత

Chocolate తినగూడదు అని చెప్తాం. మనం పెద్దవాళ్ళం అయినా చాలా మూర్ఖమైన పనులు చేస్తూ వుంటాం. బయటకు లాగగూడదు అని నేను అనడం లేదు. ఏ అలవాటు నువ్వు నేర్పావో ఆ తరువాత దాంట్లో నుండి వాడు బయటకి రాలేడు. నువ్వు చక్కటి శబ్దాలను వినేటట్టు చేస్తే పిచ్చి శబ్దాలు వినడు. చక్కటి దృశ్యములు, చక్కటి వర్ణములు చూడడం నేర్పితే, పిచ్చి పిచ్చి వర్ణముల వైపు పోడు, చక్కటి మాటలు వినడం నేర్పితే చక్కటి మాటలు పలుకుతాడు. అందుకని సుమతీ శతకం, వేమన శతకం, కృష్ణ శతకం ఇవన్నీ చిన్నప్పుడు నేర్పుకుంటే, ఆ ఏం వస్తాయండి, అనుకుంటే, ఏం వస్తాయో పెద్దయ్యాక తెలుస్తుంది. నేర్పక పోతే ఏం వస్తాయో పెద్దయ్యాక తెలుస్తుంది. ఎందుకని అంటే బయటకు విచ్చుకునేప్పుడు ఏ విధంగా విచ్చుకుంటున్నారో దాన్ని బట్టి వుంటుంది. ఇలా ఐదు ఇంద్రియాలు విచ్చుకునే దానికి ఐదు సంవత్సరాలు పడుతుంది. ఆ తరువాత అక్షరాభ్యాసం కదా. ఇంకొంచెం విచ్చుకోవడం. ఆ తరువాత అది చూపిస్తాం, ఇది చూపిస్తాం, ఏదేదో రుచి చూపిస్తాం, బయట రుచులు. ఇలా పెరిగి పోయిన వాడికి 40 ఏళ్ళు అయినాక లోపలికి వెళ్ళు అంటే ఏమిటి వెడతాడు? కనీసం 40 ఏళ్ళు కావాలా? 40 ఏళ్ళు పట్టిన వాడు బయటకి రావడానికి, లోపలికి వెళ్ళడానికి 4 రోజులలో వచ్చేయాలనుకుంటే ఎట్లా వస్తుంది? నువ్వు ఎంత దూరం ప్రయాణం చేశావో దానికి ఎంత సమయం పట్టిందో, తిరిగి రావడానికి అంత సమయం పట్టదూ ? పడుతుందా? ఇక్కడ మనం గోదావరి express ఎక్కి Hyderabad వెళ్తే ఎంత సమయం పట్టిందో, Hyderabad నుండి మళ్ళీ Visakhapatnam రావడానికి అంత సమయం పడుతుంది. అంత కన్నా తక్కువ సమయం పట్టాలనుకోవడం ఆశ! ఆశ పడడం నేర్చుకున్నాం కాబట్టి ఇది కూడా తొందర తొందరగా అయిపోవాలని బాధ పడతాం. వివేకం ఏం చెప్తున్నదంటే ఎంత దూరం వెళ్ళావో, దానికి ఎంత సమయం పట్టిందో అంత దూరం మళ్ళీ తిరిగి రావాలి కదా. మనం ఎక్కడ నుండి విచ్చుకుంటున్నాం? ప్రతి రోజూ విచ్చుకుంటున్నాం, అస్తిత్వం లోంచి చైతన్యం లోకి, చైతన్యం లోంచి భావంలోకి, భావాలలోంచి ఇంద్రయాల లోకి, ఇంద్రియాలనుండి మాట లోకి, చేతల లోకి, బయట ప్రపంచం లోకి, ఇట్లా విచ్చుకుంటాం. రోజుకి పడుకున్న 8 గంటలు తీసేస్తే, 16 గంటలు లేచే వుంటాం. 16 గంటల్లో ఎన్ని గంటలు నువ్వు బహిర్ముఖుడైనావు? ఎన్ని గంటలు అంతర్ముఖుడై వున్నావు? సాధన చేసే వాళ్ళకి తొందరగా నిరుత్సాహం వస్తుంది, ఇంకా అవలేదేంటని? ఎట్లా అవుతుంది? చాలా సంవత్సరాలు బయటే తిరిగాం. ఇప్పుడు కూడా 16 గంటలు లేచే వున్నావు. కానీ ఎంత వరకూ అంతర్ముఖుడై వున్నావు? ఎంత వరకూ బహిర్ముఖుడై వున్నావు? పొద్దున పావు గంట, సాయంత్రం పావు గంట, అయినా వున్నావా అంతర్ముఖుడవై? కళ్ళు మూసుకున్నా బయటకి వెళ్తున్నాం కదా. మన account మనం సరిగ్గా వేసుకుని చూస్తే ఏం కనబడదు. అందుకని బహిర్ముఖంలో అంతర్ముఖుడి గా వుండే వాణ్ని దర్శనం చేయడం సాధనగా ఇచ్చారు. అంటే బయట

ప్రపంచంలో మనం తిరుగుతున్నప్పటికి కూడా ఈ ప్రపంచంలో కనిపిస్తున్నదాంట్లో, ఈ పొరలలో దాగివున్న వాడు నీలో వున్న వాడే కదా. నీవు అంతర్ముఖుడవై ఏం దర్శనం చేద్దామనుకుంటున్నావో దాన్నే బహిర్ముఖంగా కూడా దర్శనం చేస్తూ వుండు. TV చూస్తున్నావు, అందులో actors ని చూస్తావు, action ని చూస్తావు, రంగులు చూస్తావు, అప్పుడు ఇవన్నీ నడిపిస్తున్న చైతన్యాన్ని చూడు. అలాగే మనుషుల్ని చూసేటప్పుడు చైతన్యాన్ని చూడు. గాడిద అరిస్తే చైతన్యాన్ని చూడు, విను. కుక్క తోకలో చైతన్యం కదలికను చూడు. ఇట్లా చైతన్యాన్ని చూడడం పెట్టుకున్నామనుకోండి అన్నిట్లో కూడా, అప్పుడు ముక్కు మూసుకుని కూర్చోవడం కన్నా, చాలా ఎక్కువ సేపు సాధన జరుగుతుంది. ఇది రోజంతా ఎంత జరిగితే అంత మనం బహిర్ముఖంలో అంతర్ముఖాన్ని ఏర్పరచుకోవడం తయారు అవుతుంది. ఇది భాగవత మార్గం. మనకు పాద్దున్న లేచిన దగ్గర నుండి వాటిలోనూ వీటిలోనూ రకరకములైన తాపత్రయాలు వుంటాయి కదా. మూడు తాపత్రయాలు వుంటాయి. తాపం కలిగించే త్రయం. ఏమిటయ్యా అంటే- ధనేషణ, దారేషణ, పుత్రేషణ! డబ్బుల గురించి, భార్య గురించి, పిల్లల గురించి ఆరాటపడుతుంటాం. వీటన్నిటి లోనూ వాణ్ణి చూస్తే? ఇది సులువైన పద్ధతి. భాగవత మార్గం. చిట్ట చివరికి వేద వ్యాసుడి ద్వారా ఇవ్వబడినది. కృష్ణుడిచే సంకల్పింపబడినది. 'సమస్తమునందు నా సాన్నిధ్యాన్ని నువ్వు దర్శనం చేస్తే, అంతకు మించిన యోగమార్గం ఏమీ లేదు' అని చెప్తాడు శ్రీకృష్ణుడు. యోగం అని ముక్కులు మూసుకోవద్దు, యోగం అని భజనలు చేసుకోవద్దు, యోగం అని హోమాలు చేసుకోవద్దు. యోగం అని చేయవద్దు. చేస్తే ఆ చేసిన కాసేపు వుంటే వున్నావు అందులో, లేకపోతే లేవు. ఏ మాత్రం శివుణ్ణి చూస్తారండి 24 గంటలలో? మోసం చేసుకుంటూ బ్రతికేయడం. మనల్ని మనం మోసం చేసే కార్యక్రమాలలో మనం ఇమడడం ఎంత భయంకరంగా వుంటుంది. సమస్తమునందూ దాన్నే దర్శనం చేయడం పెట్టుకుంటే, 365 రోజులూ, లేచిన 16 గంటలూ, అదే పని చేస్తుండచ్చుగా, వాణ్ణి అట్లా గమనించాలి. ఎలా? విజయలక్ష్మి గారు ఎదురుగుండా కనిపించారనుకుందాము. విజయలక్ష్మి గారు, ఆమె భర్త నాకు స్నేహితులు, మంచి వాళ్ళు, ఇటువంటివన్ని ఆలోచించడం ఒక పద్ధతి. ఆమె రూపంలో వుండే తత్వాన్ని చూడడం, చైతన్యాన్ని చూడడం చేయగలగాలి. నేనే అక్కడ ఆమె రూపంలో వున్నానని తెలుసుకోమంటాడు. ఇది రాజ విద్య! 'ఎదుటి వ్యక్తిగా నేనే వున్నాను. ఇంకో రూపంలో వున్నా అక్కడ, ఇంకో రకం వేషం వేసుకున్నా, ఇంకో రకాల భావముల యొక్క తొడుగులు వేసుకున్నా, వున్నది నేనే. నేను ఈ సర్వజీవరాసుల యందు వున్నానని భావన చేయమంటాడు' శ్రీకృష్ణుడు రాజవిద్య రాజగుహ్య మందు. అప్పుడు గుహ్యమైన వాడు కనిపిస్తాడు కదా ! 'గుహ్యో గభీరో గహనో' అన్నప్పుడు రాజ గుహ్యమే కనిపించాలి. గుహ్యముగా వున్న రాజును చూడాలి. ఇంతమందిలో వున్న వాణ్ణి దర్శనం చేయడం అనే సాధన కన్నా మించిన సాధన లేదు, కళ్ళు మూసుకుని

కూర్చున్నా రాదు. ఎందుకు రాదు అంటే, ఇందాక చెప్పిన లెక్క చూడండి. 16 గంటలు మనం మేలుకున్న సమయంలో ఎంతసేపు మనం అంతర్ముఖంగా వుండడానికి ప్రయత్నం చేస్తున్నాం? మామూలుగా మనం అనుకునే ధ్యానం పేరున. అదే ధ్యానం బహిర్ముఖంగా కూడా చేయడం అనే దానిలో వున్నది రహస్యం. అప్పుడు నీకు ప్రొద్దున పావుగంట, సాయంత్రం పావుగంట, కాకుండా, ప్రొద్దున మొదలుపెట్టింది జీవితంలో సాగుతూ వుంటుంది మళ్ళీ సాయంత్రం సాధన అయ్యేవరకు. మళ్ళీ సాయంత్రం మనం మొదలుపెట్టింది తెల్లవారేవరకు సాగుతూ వుంటుంది. ఇలా అంతర్ముఖుడై, గుహుడై హృదయములలో అధిష్టించి, సర్వ భూతముల హృదయములయందు నేను అధిష్టించి వున్నానని చెప్తాడు. 'ఈశ్వర సర్వ భూతానాం హృదేశే అర్జున తిష్టతే' అని చెప్తారు భగవద్గీతలో. అందరి హృదయములలో, దోమ హృదయంలో, చీమ హృదయంలో ఇట్లా దర్శనం చేస్తుండడం అనేది రోజంతా చేస్తుంటే, అది ధ్యానమేనండి. మన ఉద్యోగం, మన బయట తిరుగుళ్ళు, మన ఇంట్లో చేయాల్సిన పనులు, ఇవన్నీ వేరు. ఇవి కాకుండా ఏదో ఒక గదిలో మనం అనుకున్న గురువో, దేవుడో దగ్గర కూర్చోవడం సాధన అని అనుకుంటే మాత్రం జన్మంతా బోల్తా కొడుతున్నట్లే. ఇది ఒక రహస్యం. అందుకని వాడు ఎన్ని సంవత్సరాలు సాధన చేసినా ఆయన రహస్యంగానే వుండిపోతాడు. ఎందుకు వుండి పోతాడు అంటే నువ్వు ఎంతసేపు చూడడానికి ప్రయత్నం చేస్తున్నావు, ఎంతసేపు చూడకుండా వున్నావు? చూడకుండా వుండే time చూసే time కన్నా ఎక్కువగా వున్నంత కాలం, వాడు రహస్యంగానే వుంటాడు. మరి అంతసేపు ముక్కు మూసుకుని కూర్చోలేము గదండీ! అంటే కూర్చోవద్దన లేదు, కూర్చోమని చెప్పలేదు, ఏం చెప్పాడంటే నువ్వు లేచిన దగ్గర నుండి నువ్వు పడుకునే లోపల కనిపించేదంతా వాడే! రకరకాల రంగులు వేసుకుంటున్నాడు, రకరకాల రూపాలు ధరిస్తున్నాడు, రకరకాల భాషలు మాట్లాడ్తాడు. ఇంగ్లీషు మాట్లాడ్తాడు, హిందీ మాట్లాడ్తాడు, బూతులు మాట్లాడ్తాడు. ఏం మాట్లాడడా? బూతులు మాట్లాడేవాళ్ళలో కూడా వాడే వున్నాడు. ఇదీ సమన్వయము. అందులో నుండి వచ్చే శబ్దాన్ని విను, బూతు నీకెందుకు? కాబట్టి

నర్తకునిభంగి బెక్కగు మూర్తులతో నెవ్వండాడు మునులు దివిజులుం
గీర్తింప నేర రెవ్వని,వర్తన మొరు లెఱుంగ రట్టివాని నుతింతున్

అన్నాడు గజేంద్ర మోక్షం. కాబట్టి ఇంత మంది లోనూ నర్తించే వాడు ఒక్కడే. మనం సహజంగా చతుర్భుజము. ఏవి మన నాలుగు భుజాలు.

1. మన అస్థిత్వం, నేను వున్నాను. 2. మన చైతన్యం. 3. మన భావం. 4. మన మాట మరియు చేత. భావము అనే భుజము, మాట, చేత అనే భుజము ఈ రెండూ మనకు తెలుసు. అందుకని మనకు రెండు చేతులే వున్నాయి. దేవతలకు నాలుగు చేతులు ఎందుకంటే తాము చైతన్యవంతులమని, భగవంతుని యొక్క అస్థిత్వమే తమ అస్థిత్వమని తెలిసి వుండడం ఒక దివ్యత్వం. మనషులలో కూడా మహాత్ములు ఆ రెండు

చేతులు కూడా పొంది వుంటారు, అందుకని వాళ్ళకి నాలుగు చేతులు. ప్రతి ఒక్కడికి నాలుగు చేతులు ఇచ్చి పంపిస్తే, మనం రెండే వాడుకుంటున్నాం, రెండు దాచేశాం. కట్టేశామ్ లోపల. ఉన్నాయి కానీ అవి వాడడం లేదు. అవి వుండడాన్ని సత్యం అన్నారు, చైతన్యాన్ని చైతన్యం అన్నారు. సత్ చిత్ అన్నారు. ఆ సత్ చిత్ అనే రెండు చేతులు మనకి పని చేయడం లేదు. అందరిలోనూ ఆ రెండింటిని మనం దర్శనం చేసుకుంటే మనలో కూడా ఆ రెండూ గోచరించడం మొదలవుతాయి. ప్రతివాడు వున్నాడు కదా. వాడు కూడా మేల్కాంచినప్పుడు చైతన్యవంతుడై వున్నాడు కదా. 'వాడి చైతన్యంగా నువ్వే వున్నావు,' అని భగవద్గీతలో తొమ్మిదో అధ్యాయం చెప్తుంది. 'నేను ఈ సర్వజీవ రాసులయందు వున్నాను, నాయందు ఈ సర్వ జీవరాశులు వున్నాయి. ఇదీ కృష్ణుడు ఇచ్చిన ధ్యానం'. భగవద్గీత మన భారతీయులం, ఆ-- భగవద్గీతే కదా అనుకుంటాం. కానీ అందులో లేనిది ఏం లేదు. అంతా అందులోనే వుంది. ఇది సాధన చేయండి, జన్మల తరబడి చేసే సాధన సంవత్సరాలలో అయిపోతుంది. వాణ్ని గుర్తించడం మొదలు పెట్టినట్లయితే, గుహలో వుండే వాణ్ని గుర్తించడం, అంటే హృదయంలో వుండే వాణ్ని గుర్తించడం. అక్కడ నుండి ఇంకా లోతులలో వాణ్ని గుర్తించడానికి వీలు పడుతుంది . అప్పుడు గభీరుడు పెరుగుతాడు. గుహ్యుడు కన్నా గభీరుడు ఇంకా లోతుగా వుంటాడు. గభీరుడు కన్నా గుప్తుడు ఇంకొంచెం లోతుగా వుంటాడు. అందుకని హృదయంలోకి వెళ్తే మన యొక్క స్పందనగా కనిపిస్తాడు. మనకి మన స్పందనగా మనం దర్శించినప్పుడు ఎదుటి వారిలో స్పందన కూడా అట్లాగే గుర్తిస్తారు, అదిట ఋషి దృష్టి. ఋషి ఎదుటి వాడి యొక్క స్పందనం బట్టి వాడి యొక్క స్థితి తెలుసుకుంటాడట. ఆ స్పందనం బట్టి వాడిలో వుండే ఉచ్ఛ్వాస నిశ్వాసలు, లేదా శ్వాస అంటారే, దాన్నే హంస అంటారు. ఆ హంస జీవనం అనే సరస్సులో ఏ విధంగా తేలియాడుతుందో చూస్తాడట ఋషి, ఇంక మిగతావన్నీ చూడడట. వాడి స్థితిగతులు ఏమిటి, వాడు ఎటువంటి భావనలో వున్నాడు, వాడికి వుండే కష్టాలు ఏమిటి, నష్టాలు ఏమిటి, ఇవన్నీ ఒకసారి సినిమా వేసినట్లు కనబడుతాయి. కారణం ఏమిటంటే వాడిలో హంస ఎట్లా వుందో చూసుకుంటాడు. అది ఒక్కటే వాడికి కావాలి. వాడిలో హంస, వీడిలో హంస రెండింటికీ వుండే ఆధారమైన స్పందనం. దాన్ని చూస్తూ వుంటే ఋషి దృష్టి వస్తుంది. విశ్వరూప సందర్శనం గనుక మనం చదువుకున్నట్లయితే అందులో చెప్తాడు, ఋషులు ఎదుటి వ్యక్తి యొక్క స్పందనాన్ని గుర్తించి జీవిస్తుంటారు తప్ప, ఇంక వాడి భావాలు వాడి యొక్క చెత్త చెదారం లోకి వెళ్ళడు. సరాసరి హృదయమును చూస్తారు. అక్కడ వున్న పరిస్థితిని చూస్తారు. దాని చుట్టూ వుండే దాన్ని చూడరు. హృదయంలో వాడే వున్నాడు కదా. అందుకని మనకి ఇష్టమైన వాడు, ఇష్టం కానివాడు ఇట్లా మస్తిష్కంలో వుండే భావములు, హృదయంలో వుండే వాడికి వుండవు. వాడు సరాసరి హృదయస్థుడైన ఈశ్వరుని యొక్క దర్శనం చేసుకుంటూ వుంటాడు. ఇది రోజంతా చేసుకోవాలి. ఇలా

చేస్తే బాహ్యంలో అంతర్ముఖ సాధన జరుగుతూ వుంటుంది. అంతర్ముఖ సాధన, లోపలికి వెళ్లిపోవాలి అనుకుంటాం కదా. ఈ లోపలికి వెళ్ళడం ముందు బయటనే మొదలు పెట్టాలి. బయట పొరల్లో నుండి దూసుకుని లోపలికి వెళ్ళి పోవాలి. మనం ప్రతి వాణ్ణి ముందు వాడి రూపాన్ని చూస్తాం. వాడి నామాన్ని గుర్తు తెచ్చుకుంటాం. వాడి స్థితిగతులను చూస్తాం. ఇంకొంచెం లోతులోకి వెళ్తే వాడి స్వభావాన్ని గుర్తిస్తాం. ఇంక అక్కడ నుండి మంచి చెడు అని, పక్క దారిలోకి వెళ్లిపోతాం. అలా వెళ్ళకుండా స్వభావాన్ని దాటి లోపలికి వెళ్తే, వాడి స్వభావానికి మూలం ఏమిటయ్యా అంటే, వాడిలో వుండే త్రిగుణముల యొక్క మిశ్రమమే! పాలు, పంచదార, కాఫీ పొడి ఏ విధంగా కలిపారో దాన్ని బట్టి వుంటుంది కాఫీ రుచి. అందరిలోనూ త్రిగుణాలు వున్నాయి. రజస్సు, తమస్సు మరియు సత్త్వము. వాటి పాళ్ళు బట్టి వాడి యొక్క స్వభావము వుంటుంది. అందుకే వాడి స్వభావము వల్ల వాడు అట్లాగే వుంటాడు, అలాగే ప్రవర్తిస్తాడు. కారణం వాడిలో వుండే త్రిగుణముల కలయిక అట్లా వుంది. ఇంకొంచెం లోతులోకి వెళ్ళి చూస్తే, త్రిగుణములు ఎక్కడ నుండి పుట్టినాయి? ఒకే చైతన్యంలో నుండి పుట్టినాయి. కాబట్టి త్రిగుణములు దాటి చైతన్యంలోకి ప్రవేశిస్తే, అక్కడ వాడికి, మనకి ఏకీభావాలు వుంటాయి. అక్కడ నుండి దిగి వస్తే వివిధత్వం గోచరిస్తుంది. అంతకు పైన వుంటే ఏకత్వం గోచరిస్తుంది. దేన్ని కలిసినా ముందు ఏకత్వంలో మనం కలిసినట్లయితే, వివిధత్వం మనల్ని ఎక్కువ బాధ పెట్టదు. అట్లా పాములను నెత్తికి ఎక్కించుకున్న వాళ్ళు వున్నారు, పులులను సముదాయించిన వాళ్ళు వున్నారు, పిచ్చి ఏనుగులకి ప్రశాంతత కల్పించిన వాళ్ళు వున్నారు. క్రౌర్యంతో మీద పడి చంపేద్దామనుకున్న వాళ్ళను చూపుతో ఆపేసిన వాళ్ళు వున్నారు. ఎందుకు వీలు పడ్డది అంటే, చైతన్యమును దర్శనము చేయడం తప్ప ఇంకోటి చేయకపోవడం వల్ల. ఇది ఎలా వీలు పడుతుందీ? మనం ఊరికే గూట్లో దేవుణ్ణి ప్రార్థన చేసుకుంటే వీలుపడదు. మనం పెట్టుకున్న దేవుని రూపం మనం పెట్టుకున్నదే తప్ప, అట్లా ఎక్కడా లేదు ప్రపంచంలో. నువ్వు పెట్టుకున్న రూపంలోకి వస్తుంది, కానీ నువ్వు పెట్టుకున్నదే తప్ప అది అట్లా లేదని కూడా తెలిసివుండాలి. మనం మనుషులం కాబట్టి దేవుణ్ణి మనిషిగా పెట్టుకున్నాం. అసలు మనం మనిషి అని ఎవరు చెప్పారు మనకీ? మనం చెప్పుకున్నదే! భాష ఎవరికి వచ్చింది? మనకే! క్రింద లోకాలలోనూ భాష లేదు, పై లోకాలలోనూ భాష లేదు. భాష/మాట వచ్చింది కదా అని చెప్పి, మనం మనుషులం అని చెప్పి, పేరు పెట్టుకున్నాం. మనం మనిషి అని మనం అనుకోవడం బట్టి మనుషులమైనాము. అంతా అనుకోవడమే! ఇది అనుకోవడానికి మూలం, నేను వున్నాను అని అనుకోవడం చేత! నేను వున్నాను అనే భావన అందరికీ వుంటుంది. అది చైతన్య స్థితి! వుండడం సత్యమైన స్థితి! అందుకని 'సమస్తంలో వుండే నన్ను దర్శనం చెయ్యి' అని చెప్పాడు శ్రీకృష్ణుడు. 'ఇదే రాజ గుహ్యం' అని చెప్పాడు. ఎందుకు గుహ్యం అంటే ఎప్పటికప్పుడు మరుపు వస్తుంటుంది కాబట్టి గుహ్యం. మరపు

రాకుండా చేసుకో. ఎట్లా చేసుకోవాలి? గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నం చెయ్యి. మర్చిపోవడం ఇది వరకు అభ్యాసం. గుర్తు తెచ్చుకోవడం ఇప్పటి అభ్యాసం. సాధన అంటే అంతే! సాధన చాలా సులువు. మనం కష్టం చేసుకుంటే అది మన కర్మ. సత్య దర్శనం కూడా చాలా సులువు. కానీ మనిషికి సులువైన విషయములయందు తేలికైన భావం వుండడం చేత, ఇంకొంచెం complicated గా వుంటే బాగుంటుంది అన్నట్టుగా వుంటాడు. లేచిన దగ్గర నుండి దాన్నే దర్శనం చేసుకోవచ్చు. తన యందు, అఖిల భూతముల యందు దర్శనం చేసుకోవడమే! అట్లా చేసే వాళ్ళే ప్రహ్లాదులు. అలా చేస్తే అందరిలో వుండే స్పందనాత్మకమైన చైతన్యం దర్శనం ఇవ్వడం జరుగుతుంది. వాడి గురించి చెప్తూ వుంటాడు భగవంతుడు భగవద్గీతలో. బ్రాహ్మణుని యందు, శూద్రుని యందు, కుక్క యందు, కుక్క మాంసం యందు నన్నే దర్శనం చేసేవాడు నా భక్తుడు, లేక సమదర్శనుడు. ఇలా రోజంతా దర్శనం చేశామనుకోండి, officeకి వెళ్తే అదే దర్శనం. Train లోనో, Plane లోనో వెళ్ళుతున్నా అదే దర్శనం. అదొక పక్క పడేసి ఉంచామనుకోండి, పెట్టెలో ఇంగువ పడేసుకున్నట్టు. పెట్టెలో ఇంగువ పడేస్తే ఏమైంది? ఎప్పుడూ ఇంగువ వాసన. జేబులో ఇంగువ పెట్టుకొని తిరుగుతున్నారనుకోండి, చెప్పక్కరలేదు ఇంక వార్త. అట్లా ఈ భావము లోపల ఓ పక్కన పడేసి వుంచండి. అట్లా పడేసి వుంచితే అది నెమ్మదిగా వ్యాప్తి చెందుతూ వుండి మిగతా భావాలన్నీటిని దానిలోనికి మలుచుకుంటుంది. అదీ తోడు అంటే! పాలు తోడు పెట్టడం, పెరుగు అవ్వడం, అంటే అది. ఈ భావం ఎంత తీసేస్తే అంతలా మార్పు ఆగిపోతుంది. ఈ భావం ఎంత సేపు వుంటే అంతసేపు మార్పు జరుగుతుంది. ఏమిటి మార్పు జరుగుతుంది? అజ్ఞానం లో నుండి జ్ఞానం వైపు రసాయినిక మార్పు జరుగుతుంది. అందుకని శ్రీకృష్ణుడు చిట్టచివర భాగవతమార్గంగా మైత్రేయుడికి అందించిన రహస్యం ఒకటి వుంది. ఎన్నో రకాల మార్గాలు అంతకు ముందు సాధనలో వున్నాయి. ఇప్పటికీ వున్నాయి అవన్నీ. 'ఇవన్నీ పక్కన పెట్టవయ్యా, ఒకటే సరాసరి మార్గం ఇస్తాను నేను, దాంట్లో నువ్వు వుండి, అది అందరికీ అందించు' అని చెప్తాడు మైత్రేయునికి శ్రీకృష్ణుడు. కలియుగంలో వూరికే ఏవేవో చేయలేరు, దీక్షలు పట్టలేరు, ఒక పూట ఉపవాసం చేస్తేనే సాయంత్రానికి మొహం మాడిపోతుంది. ఈ దీక్షలు వద్దు, ఒక్కటే గుర్తుపెట్టుకో, 'సాన్నిధ్యమే నా మార్గం' అని చెప్తాడు. 'సమస్తమునందు నేను వున్నానని గుర్తిస్తే నా సాన్నిధ్యం అక్కడ ఏర్పడుతుంది'. కాబట్టి ఆ గుర్తింపు నీకు వుంటే నా సాన్నిధ్యం నీకు అనుగ్రహింపబడుతూనే వుంటుంది. నీ పరిసరముల లోని వ్యక్తుల లోనూ నన్ను దర్శింపవచ్చు. నీకు వుండే సన్నివేశాలలోనూ నన్ను దర్శించవచ్చు. చుట్టూ వుండే వాతావరణం లోనూ నన్ను దర్శింపవచ్చు. అట్లా దర్శిస్తూ వుంటే అన్నింటి నుండి నేనే నీకు గోచరిస్తుంటాను. అది సాధన చేసుకుంటే ఎంత దాక్కొని, కనబడకుండా ఏడిపిస్తున్నవాడు, చాలా బాహాటంగా ప్రతి చోట గోచరిస్తూ వుంటాడు.

పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాస
లీలా నిద్రాదులు చేయుచుం దిరుగుచున్ లక్షించుచున్

అది కదా ప్రహ్లాదుడు. వాళ్ళ అమ్మ వెండి కప్పులో పాలిస్తే చూస్తే పాలలో కనిపిస్తాడట. పాలు కూడా అదే కదా అని త్రాగుతుంటాడట. ఇట్లా అన్ని చోట్ల ఆయననే చూస్తూ

విష్ణుడు ఇందియే గాని వేరొండు లేడని వెక్కిలి నగుచుండు నొక్క చోట

'ఓరినీ ఇంత ప్రస్పుటంగా వుంటే నీ కోసం ఎందుకయ్యా ఇంత తాపత్రయపడి చచ్చిపోతున్నారు అందరూ' అని చెప్పి నవ్వుకుంటాడట. మనం ఎన్ని కసరత్తులు చేస్తున్నాం దేవుని పేరున? ఆయనకు ఆశ్చర్యం వేస్తుందట, 'అదేంటి ఎదురుగానే వున్నాను కదా నాకోసం వెతుకుతావేమిటి?' అంటాడు. కళ్ళకు కళ్ళజోడు పెట్టుకుని కళ్ళజోడు కోసం వెతుకుతున్నట్లుగా వుంటుంది మన పరిస్థితి. భయంకరం! ఇంతకన్నా అజ్ఞానం ఇంక ఏమీ లేదు. అజ్ఞానంలో ఇంకా పరాకాష్ఠ ఏమిటయ్యా అంటే ఇంకా వాడి గురించి చాలా దూరంగా ఆలోచించి, ఎంతో దూరంలో వున్నాడు మనం వాణ్ణి చేరుకోవాలి, అని ఆలోచిస్తుంటాం. రహస్యం ఏమిటంటే అసలు ఈ ఆలోచించేవాడుగా కూడా వాడే వున్నాడు. అదీ గుప్తుడు! నీలో ఆలోచించే వాడుగా నీయందే వాడు ఇమిడివున్నప్పుడు నీవు ఎట్లా గుర్తిస్తావు వాడిని. అదే నారదుడు ఏడిపిస్తాడు హిరణ్యకశిపుడ్ని. 'ఏరా ఈ మధ్య చాలా కులాసాగా కూర్చుంటున్నావు, వాడి గురించి వెదకడం లేదా?' అంటే 'ఎవడు వాడు?' అంటాడు హిరణ్యకశిపుడు. 'అదేరా విష్ణువు' అంటాడు. 'లేడు కదా' అంటాడు. 'మరి అంతకు ముందు వెతికావు కదా', అంటే 'అవును వెతికాను' అంటాడు. 'ఎందుకు వెతికావు' అంటే 'మా తమ్ముణ్ణి చంపిన వాణ్ణి చంపాలని'. 'మరి మీ తమ్ముణ్ణి చంపిన వాడు లేడంటావేమిటి? ఒక ప్రక్క మీ తమ్ముణ్ణి చంపాడు అంటావు, వాడు లేడు అంటావు అదేమిటి? లేడా, లేక నీకు కనపడలేదా' అని అడుగుతాడు. అంటే 'నేను అన్నీ వెతికాను పద్నాలుగు లోకాలు ఎక్కడా కనబడలేదు, కాబట్టి లేడనుకుంటున్నాను'. 'అదేమిటి లేకపోతే మీ తమ్ముణ్ణి ఎవరు చంపారు? వాణ్ణి చంపారు అనేగా నువ్వు మళ్ళీ తపస్సు చేసి, బ్రహ్మ దగ్గర వరాలు పొంది, వాణ్ణి సంహరిస్తాను అని బయలుదేరి, వాడు లేడంటావేమేమిటి? అని అంటాడు. 'వెతికాను అన్నీ చోట్లా కనబడలేదు కాబట్టి లేడంటాను.' 'నీకు కనబడక పోతే లేని వాడు మీ తమ్ముణ్ణి ఎట్లా చంపుతాడు?' అని ప్రశ్నిస్తే 'నిజమే కదా' అనిపిస్తుంది. అప్పుడు మళ్ళీ పౌరుషం వచ్చి ఎక్కడున్నాడంటే, 'ఏమో నీ ఇంట్లోనే వున్నాడేమో' అంటాడు. 'ఇంట్లో ఎట్లా వుంటాడు?' అంటే 'ఏమో చెప్పలేము. నీ కొడుకు రూపంలో వున్నాడేమో!' అంటాడు. ఇంక వాణ్ణి సాధిస్తాడు. 'అసలు నీ రూపంలోనే వున్నాడేమో' అని కూడా అంటాడు నారదుడు. భాగవతంలో లేకపోయినా మనం చెప్పుకునే భాగవతంలో వుంది. అదే స్తంభం పగలగొట్టడం అంటే! ప్రతివాడికి లోపల ఒక స్తంభం వుంది. ఎముక గొట్టం ఒకటి నిర్మింపబడి వుంది కదా. దాని లోపల వుండే సుషుమ్న నాడి లోపల వుండే

బ్రహ్మరంధ్రం లో వుండే తత్త్వం వాడే! దానిలో నుండి నృసింహుడు వ్యక్తం అవుతాడు. ప్రతివాడికి వ్యక్తం అవుతాడు. హృదయం నుండి వ్యక్తం అవుతాడు. హృదయం సింహరాశికి ప్రతీక. సింహ రాశి శ్రావణ మాసం. అందుకని శ్రావణ మాసంలో ఈ కథ జరిగిందని చెప్తారు. సాయంకాలం అంటే శ్రావణ మాసం. జ్యోతిష్యం ప్రకారం శ్రావణమాసానికి సాయంకాలం వస్తుంది. గడప దగ్గర కూర్చోపెట్టి చంపేస్తాడు కదా. ఎక్కడ నుండి వచ్చాడు అంటే, స్తంభం నుండి అంటారు. సింహం కదా. సింహరాశి. నృసింహం. కాబట్టి నరుడే సింహం. లోపల వుండే హృదయం నుండి వ్యక్తం అయ్యేవాడు నరసింహుడు. అందుకని హృదయ కవాటములు తెరుచుకోవాలంటే నరసింహుని పూజ చేసుకునే ఒక సంప్రదాయం వుంది. ఆ కవాటములు తెరుచుకుని విపరీతమైన కాంతితో ఆయన బయటకు వస్తాడట. మనం ఈ శ్వాసను అందుకుని ఆ స్పందన దగ్గరకు వెళ్ళి అలా చూస్తూ కూర్చుంటే, ఏదో ఒక రోజున భళ్ళున తెల్లారుతుంది అక్కడ. తెల్లవారితే మనం పెద్ద వెలుగు గొట్టం లాగా కనిపిస్తాం ముందు. అక్కడ నుండి గొట్టం కూడా పడిపోతుంది, మొత్తం వెలుగుగా వ్యాపించిపోతాం. ఇట్లా హిరణ్యకశ్యపుడికి గొట్టం నించి దర్శనం ఇస్తాడు. అదే స్తంభం! ఎందుకు చెప్తున్నాను ఈ కథ అంటే నీ లోపల వుండే వాణ్ణి నీవు బయట వెతుకుతుంటే నీకు కనబడక, దేవుడు లేడు, అది లేదు, ఇది లేదు అనేస్తాం. దేవుడు అంటే తత్త్వము, అస్థిత్వం! అది నీయందు నీవలె వుంది కాబట్టి దానిని నీవు అట్లా వెతుక్కోవడానికి ప్రయత్నం చేయడం లో భాగంగా, ముందు బయట పొరలు తీసి చూడడం నేర్చుకోవాలి. మూడు పొరలు వుంటాయి. భూర్భువస్సువ లోకాలుగా మనకు కనిపిస్తుంటాయి. అందుకని గాయత్రి మంత్రంలో 'భూ' అంటే పదార్థము, 'భువ' అంటే శక్తి, 'సువ' అంటే ప్రజ్ఞ. ' ప్రజ్ఞ, శక్తి, పదార్థముగా వ్యాపనం చెంది వున్న ఒకే ఒక తత్త్వం వుందే, ఆ తత్త్వం నన్ను అవరించాలి, నన్ను కౌగలించుకోవాలి. 'వరేణ్యం' నన్ను వరించాలి అని కోరుకుంటున్నాం'. సంస్కృతంలో కోరుకుంటున్నాము కాబట్టి తెలియదు ఏమీ కోరుకుంటున్నామో. అంటే మనలో 4వ భుజం వుంది కదా, అది ఈ మూడు అంటే 1. నేను వున్నాను అనే ప్రజ్ఞని, 2. నాకున్న శక్తిని, 3. నాకున్న పదార్థము లేక శరీరాన్ని, అదే ఆవరించి వున్నది. మర్చిపోయి దాన్ని పెట్టెలో పెట్టి మూత వేసేశాం. ఆ మూత తెరిచి 'మొత్తం ఇదంతా వ్యాపించి నువ్వే వుండు' అని కోరడం గాయత్రి మంత్రం! ఆ విధంగా మనం భావన చేసినట్లయితే త్రిగుణములకు అవతల వుండే, చైతన్యమునకు అవతల వుండే 'పెంజీకటి కవ్వలనెవ్వ, డేకాకృతి వెలుంగు' అంటాడు భాగవతంలో. వాడు ఈ మూడు భుజాలలోనూ వ్యాపిస్తాడు. సత్యము చైతన్యమై, చైతన్యము భావమై, భావము భాష లేక ప్రవర్తన అవుతూ వుంటుంది ప్రతి నిత్యం. కాబట్టి అందరిలోనూ బయట మనం చూసినప్పుడు, వూరికే పైపై పొరలు చూడకుండా, ఉల్లిపాయ పొరల్లా మిగతా పొరల్లోకి కూడా వెళ్ళమంటారు. ఇల్లు చూడడం అంటే ఏమిటి? వూరికె సింహద్వారం చూస్తే అయిపోయిందా? ఇంకొంచెం లోపలికి వెళ్ళాలి. ఇంకా లోపలికి వెళ్ళాలి. గర్భం లోపలికి

వెళ్ళాలి. గుడికి వెళ్ళి రావడం అంటే ఏమిటి? ముందు గోపురంలో నుండి లోపలికి వెళ్ళాలి. అక్కడ నుండి ధ్వజ స్తంభం చూడాలి. అక్కడ నుండి ఇంకొంచెం లోపలికి వెళ్ళాలి. అక్కడ వాహనాన్ని చూడాలి. ఇంకొంచెం లోపలికి వెళ్ళాలి. అక్కడ భగవత్ దర్శనం జరుగుతుంది. ఇట్లాగే కనబతున్న ప్రతిదానికి పారలు వున్నాయి. అట్లా పారలు దాటి లోపలికి వెళ్ళి చూడడం కోసమే మనకి రాయికి, చెట్టుకి, పాముకి అన్నిటికీ పూజలు ఇచ్చారు. ఎందుకని ఇచ్చారు ఇవన్నీ పూజించమని? చెట్టుని పూజించమన్నారు, ఓ గుండ్రాయిని పూజించమన్నారు. విపరీతంగా గుండ్రాయి మీద నీళ్ళు పోసేస్తుంటాం మనం. మన అభిషేకం అంటే మన concept ఆ గుండ్రాయి మీద బాగా నీళ్ళు పోసేసి ఆవేశంగా ఏవో చదువుతాం. అయిపోయింది. బాగా జరిగే వుంటుంది, శివుడు మెచ్చుకునే వుంటాడు, ఆయన బాగా ఆనందపడే వుంటాడు, అనుకుని అలసిపోయి ఉసూరుమంటూ ఆ రోజు రాత్రి పడుకుంటాం. ఆ రాత్రి పడుకోకపోతే పొద్దున అంతా ఎప్పుడు రాత్రి అవుతుందా అని ఎదురుచూసి పడుకుంటాం. అంతే కదా. కానీ గుండ్రాయిలో వుండే దాన్ని చూడమని చెప్పడం అక్కడ మనకు ఇచ్చిన భావం. చెట్టులో, చెట్టుగా వున్న ప్రజ్ఞని దర్శనం చెయ్యి. పాముగా వున్న ప్రజ్ఞని దర్శనం చెయ్యి అని చెప్పడం కోసం. వేమన ఒక చక్కటి పద్యం వ్రాశాడు, మొన్న ఆ మధ్య చూసా. 'సజీవమైన పామును చంపుతూ రాతి పామును పూజచేసే మానవుడు, వీడి కన్నా మూర్ఖుడు ప్రపంచంలో ఎవ్వడూ లేడు' అని చెప్తాడు. రాతిపామునేమో అక్కడేదో రావి చెట్టు దగ్గర పెట్టేస్తే, దాని చుట్టూ 40 సార్లు తిరిగి, 40 రోజులు తిరిగి, పార్లు దండాలు పెట్టి, చేస్తాం గదా. అక్కడ ఆ రాతి బొమ్మ దగ్గర పాము వుందనుకోండి ఏం చేస్తావు, చంపుతావు. అంతేనా. అదేంటది? పుట్టలో పాముకు పాలు పోయాడానికి నాగుల చవితికి పాలు అవీ తీసుకెళ్తుంటే పక్కన ఒక జవానుని తీసుకువెళ్తారు కర్ర పట్టుకొని. ఎందుకురా అంటే అది పాలు తాగడానికి వస్తే కొట్టడానికట. మనంత తెలివైనవాడు లేడనుకుంటాం కదా. పాముకు పాలు పోయడానికి వెళ్ళి, నాకోసమే పాలు తెచ్చారని అది అమాయకంగా బయటకు పాలు తాగడానికి వస్తే, దాని తల పగులుతుంది మనిషి చేతిలో. అలాంటి వాళ్ళని వేమన నాగుల చవితి నాడు దర్శనం చేసి 'ఓహో ఏమీ ఈ సృష్టి వైచిత్రం' అని ఉక్కిరిబిక్కిరి అయిపోయి, ఎంత తెలివైన వాడు మానవుడు అని ఓ పద్యం వ్రాసి అక్కడ పడేశాడు. ఇట్లా వుంటుంది మన తెలివి. కానీ దాన్నే దర్శనం చేసే వాడికి అది పామని గోచరించదు. నీకది పాము కాదు కాబట్టి అది కాటు వేయదు. అది సత్యం! నీకది పులి కాకపోతే అది నిన్ను తినదు. Androcles and the Lion అని చదువుకున్నాం చిన్నప్పుడు. చిన్నప్పటి నుండి నువ్వు అడుకుంటున్నావు అనుకో సింహంతో, అది నిన్ను తినదు, అది తింటున్నదను భావన నీకు వుండదు. సింహం వరకూ అక్కరలేదు కుక్క చాలు. ప్రొద్దున్నే కుక్కలు ఊరి మీద తిరుగుతుంటే మనకు రోడ్డు మీద వెళ్ళడానికి భయం వేస్తుంది. అది కుక్క అనే భావన నీలో వున్నంత సేపు అది కుక్క గానే నీతో ప్రవర్తింస్తుంది.

అది సత్యం. అందుకనే శ్రీకృష్ణుడు ఒకచోట అంటాడు పురుషమేధంలో 'దుష్టులు వున్నారనుకోవడం నుంచే దురాచారం ఎక్కువ పుడుతుంది' అని. వాడు దుష్టుడు అని నువ్వు అనుకోవడం చేత నువ్వే ముందు వాడి యందు సరిగ్గా ప్రవర్తించవు. రావణుణ్ణి సమ్మోహనం చేస్తాడు రాముడు చూపుతో. వాళ్ళు చూసేదేమిటి? మనం చూసేదేమిటి? అంబరీషుడు చూసిందేమిటి? ప్రహ్లాదుడు చూసిందేమిటి? శుకుడు చూసిందేమిటి? వాళ్ళు 1st category లో వచ్చే వాళ్ళు. వాళ్ళు అది తప్ప ఇంకొకటి చూడరు. కాబట్టి గుహుడిని వెతుక్కోవడానికి తపస్సు చేయాలి. తపస్సు కేవలం అంతర్ముఖమే అనుకోవద్దు, బహిర్ముఖం కూడా. అలా చేస్తూ వెళ్తుంటే ఇంత లోతైన వాడు నీకు ప్రస్ఫుటంగా వచ్చి కనిపిస్తుంటాడు. అందుకే దీన్ని వాసుదేవోపాసన అని చెప్తుంటారు. విష్ణోపాశన, వాసుదేవోపాసన, నారాయణోపాసన, అని మూడు మెట్లు చెప్తారు. రూపం వాడే విష్ణువు, ఆ రూపం నుండి ప్రవర్తించదలచుకున్న ప్రవర్తన వాడే అనుకోవడం వాసుదేవుడు. ఆ ప్రవర్తనకు ఆధారంగా వుండే చైతన్యము, అస్థిత్వం వాడే. అది నారాయణ రూపం. దాన్నే శైవ పరంగా చెప్పాలంటే ఇంకో రకంగా చెప్పుకోవచ్చు. పరమ శివుడు, సదా శివుడు, శివుడు అని చెప్పుకోవచ్చు. సూర్య పరంగా చెప్పుకోవాలంటే ఆదిత్యుడు, సవిత్రుడు, సూర్యుడు అని చెప్పుకోవచ్చు. సాంఖ్య పరంగా చెప్పుకోవాలంటే వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, వ్యూహాలుగా చెప్పుకోవచ్చు. ఇట్లా రకరకాలుగా దాన్నే చెప్తుంటారు. వాక్పరంగా చెప్పుకోవాలంటే పరా, పశ్యంతి, మధ్యమే వైఖరిగా వస్తున్నది. ఇదే Secret Doctrineకి మూలం. Secret Doctrine అనే పుస్తకం చదవడానికి ప్రయత్నం చేస్తాం కదా, ఆ ప్రయత్నం ఎప్పుడు ఫలిస్తుందంటే, నువ్వు చదివినదాంట్లో ఇంకా 3 పొరలు వున్నాయని నీకు తెలిస్తే! ఇట్లా కనిపించిన కాగితంలో వ్రాసిన దాన్ని చదివేస్తే అయిపోదు Secret Doctrine. అందుకని ఆ పుస్తకానికి ముందే ఈ చతుర్భుజం యొక్క భావాన్ని చక్కగా విశదీకరిస్తారు. కనబడుతున్న ప్రతిదీ నాలుగుగా చూడమంటారు

చతుర్వర్గ ఫలం జ్ఞానం కాలావస్థా చతుర్యుగా,
చతుర్వర్ణ మయోలోకః తత్తత్సర్వం చతుర్ముఖాత్

అని వేదవ్యాసుడు మహాభారతంలో ఒక చక్కటి శ్లోకాన్ని ఇచ్చాడు. అన్నీ నాలుగు. నువ్వు పైది చూస్తావు. దాని వెనకాల మూడు వున్నాయి. ఆ మూడూ, మూడు గుణాలుగా వున్నాయి. ఆ మూడు దాటేస్తే వెనక చైతన్యం దొరుకుతుంది. అది మొత్తం ప్రపంచం అంతా వ్యాపించి వున్నది. అది భగవంతుని యొక్క వెలుగు. అంటే అమ్మవారు. ఆ వెలుగు వెనకాల నిలబడిన వాడు, మన చేత నిర్వచింపబడని వాడు, ఊహింపబడలేని వాడు, అనిర్వచనీయుడు, అప్రతర్క్యుడు, లక్షణములు కూడా దాటిన వాడు. మనకి తెలియక మన జ్ఞాత కూడా జ్ఞేయం లో కలిసిపోయే స్థితిలోకి వుండేవాడు. ఇట్లా చెప్తారు. కాబట్టి మనం భగవంతుని ప్రతినిత్యం చూడవచ్చు. ఇప్పుడు మనం సంప్రదాయమైన పరంగా

చేసేవన్నీ వుంటాయే అవన్నీ అప్పుడు వుండవు. ఏమీ అనుకోవద్దు. అది యోగమార్గం! యోగమార్గంలో భగవంతుని దర్శనం అయినట్లుగా, ఉపాసన మార్గంలో వుండదు. ఈ ఉపాసనలు అన్నీ కూడా ఏదో కాసేపే. మళ్ళీ వీడి రోషం, వేషం, ఆవేశం అన్ని కనిపిస్తాయి. ఇంత ఉపాసన చేస్తుంటాడు, వెష్ట పడుతుంటాడు, ఆవేశ పడుతుంటాడు. యోగి, వేమన లాగ గోచి పెట్టుకుని సమస్తము చూసేసి చెప్పేస్తాడు. అందుకనే కృష్ణుడు ఇన్ని గొడవలు వద్దురా, యోగి అయిపో అంటాడు అర్జునుడితో. 'యోగీభవా అర్జునా', ఈ జ్ఞాని, వాళ్ళు వీళ్ళు వద్దు, యోగివి అయిపో, అంటాడు. సమస్తమునందు వున్న భగవంతునితో అనుసంధానం చెంది వున్న వాడు యోగి! అనుసంధానం చెందడం అంటే పొరలు దాటి లోపల వుండే దాంతో కలవాలి. అప్పుడు లోతులో వుండేవాడు అవ్వచ్చు, రహస్యంగా వుండే వాడు అవ్వచ్చు, దాగి వుండే వాడు అవ్వచ్చు, నీకు మాత్రం వాడు ప్రస్ఫుటంగానే వుంటాడు. లేకపోతే చూడండి ఎంత చూపించాడు అర్జునుడికి. నాదొక మనవి భగవద్గీత రోజూ ఒక శ్లోకం చదివి, దాని అర్థం చదవడం మాత్రం మానవద్దు. ఏమిటేమిటో చదువుతాం. ఉదయం భగవద్గీతలో ఒక శ్లోకం, రాత్రి భాగవతంలో ఒక ఘట్టం చాలు, జన్మ తరిస్తుంది. మిగతావన్నీ fashion కి చదువుకోవాలి. అది చాలు. ఇంతకు మించిన గ్రంధాలు లేవు. నేను అన్నీ చదివేసి చెప్తున్నాను అని మీతో అనలేను గాని, ఇందులో దొరకనిది ఇంక మిగతావాటిలో ఏదో దొరుకుతుంది అనుకోవడం వ్యామోహం. ఉదయం భగవద్గీతలో ఒక శ్లోకం, సంస్కృతం రాకపోతే వివరణ, ఒక యోగి వ్రాసిన వివరణ చదవండి, పండితులు వ్రాసిన వివరణ వద్దు. చదువుకుంటే చక్కగా భగవంతుని యొక్క దర్శనం సాయంత్రం వరకూ ఎట్లా చేసుకోవచ్చో కనిపిస్తుంది. ప్రతిచోటా చెప్తుంటాడు 'మయ్యా శక్త మనో బుద్ధిర్' అంటాడు. 'నా యందు ఆసక్తి కలిగిన మనస్సు, బుద్ధి కలిగివుండు అర్జునా' అని చెప్తాడు. 'నాతో కలిసి వుండి అనన్య చింతన చెయ్యి. అన్య చింతన వద్దు' అంటాడు. దాన్నే ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడికి చెప్తాడు. 'వాళ్ళు వీళ్ళు అనుకోబోకు నాన్నా అంతా నేనే అనుకో' అంటాడు. నేను అంటే హిరణ్యకశిపుడు, అనుకుంటాడు వాడు. 'ఓం హిరణ్యకశిపాయ నమః' అని మంత్రం చేయిస్తుంటాడు. శ్రీకృష్ణుడు నేను అంటే కృష్ణుడు అని చెప్పలేదు. నేను కృష్ణుణ్ణి అనలేదు. కృష్ణుడు అని మనం పిలిచాము ఆయనని. ఆయన నేను కృష్ణుడు అని చెప్పలేదు. ఎవరయ్యా అంటే 'నేనే' అన్నాడు. 'నా చింతన చెయ్యి' అన్నాడు. 'పర్యుపాశన' చేయమన్నాడు. ఉత్త ఉపాసనలు వద్దు అన్నాడు. పర్యుపాసన అంటే 'బాగా శ్రద్ధా భక్తులతో లోతులలో వున్న వాడితో నువ్వు కలిసి వుండు.' నిత్య అభియుక్తుడవై వుండమని చెప్పాడు కదా. 9వ అధ్యాయం 18 అధ్యాయాలలో కీలకం అయినది. అందులో వుండే శ్లోకం

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం

ఎప్పుడూ నాతోనే భావనలో కలిసి వుండే వాళ్ళ యొక్క యోగక్షేమం వహామ్యహం. అంటే అట్లా వాళ్ళను యోగంలో నిలపడం చేత, వాళ్ళకు క్షేమం కలిగిస్తాను. యోగంలో వుండడం చేత క్షేమం కలగడం తప్ప, యోగం వేరు, క్షేమం వేరు కాదు. యోగంలో వుండడమే క్షేమం. యోగక్షేమాలు చూస్తాను అంటే యోగం ఒకటి, క్షేమం ఒకటి అని కాదు. యోగములో వుండడం వలన క్షేమం కలిగి వుండడం. అందుకని ఆ దర్శనం మనకి.

మీరు నేమను మతిభ్రమణంబున భిన్నులై ప్రవర్తిల్లక,
సర్వము న్నతని దివ్య కళామయ మంచు విష్ణునందుల్లము జేర్చి

అని చెప్తాడు ప్రహ్లాదుడు. కాబట్టి అందరిలో వుండే వాణ్ణి దర్శనం చేయడం అంతర్ముఖ సాధన. ఇది మామూలుగా అంతర్ముఖ సాధన అంటే కళ్ళు మూసుకుని, శ్వాసని పట్టుకుని లోపలికి వెళ్ళిపోయి, స్పందనాన్ని పట్టుకుని ఇంకా లోపలికి వెళ్ళి , సూక్ష్మ స్పందనం లోనికి వెళ్ళి, అక్కడ నుండి లోపల వుండే సుషుమ్న నాడి ద్వారా ఊర్ధ్వగతి చెంది, అక్కడ తత్ అనే సత్ రూప దర్శనాన్ని ఉదయం, సాయంత్రం తీరిక వేళలలో చేసుకోవచ్చు. దాని కన్నా బయట మనం ఎక్కువ వుంటాము కాబట్టి, బయట వున్నప్పుడు కూడా దాన్నే దర్శనం చేస్తూ వుంటే వీడు దొరుకుతాడు. వీడు దొరికిన తర్వాత ఇతడు కూడా గుహ్యుడు అయిపోతాడు. ఇతడు కూడా గభీరుడు అయిపోతాడు. ఇతడు కూడా గుప్తుడు అయిపోతాడు. ఈ మూడు లక్షణాలు భగవంతునికి ఎట్లా వున్నాయో, మహాత్ములకు కూడా అట్లాగే వుంటాయి. పైకి ఒకరకంగా కనిపిస్తారు, లోపల వేరు. నిజమైన గురువు అది ప్రకటించుకోకుండా వుంటాడు. నీ ఓపికకొద్ది ఆయనని కొంచెం పరికించి చూస్తే, నువ్వు లోతులలో పెరుగుతూ వుంటే, ఆయన లోతులలోకి పెరుగుతాడు. నువ్వూరికే పై పైన తేలుతుంటే 'ఆయన ఏం వుందండి, ఎప్పుడూ సిగరెట్టు కాల్చుకుంటూ తిరుగుతూంటాడు' అనుకుంటాము. సిగరెట్టు కాల్చేస్తూ తిరిగేవాడికి ఏమి పెద్ద తెలుస్తుంది అనుకుంటారు. ఎందుకంటే పై పొరలలో జీవించేవాడు, వైష్ణవుడా? కాదు, వైష్ణవులలా బొట్టు పెట్టుకోరు. శైవుడూ కాదు. విష్ణు పూజలు చేస్తాడట, శివ పూజలు చేస్తాడట. యోగము చేస్తాడట, తంత్రం చెప్తాడట, మంత్రం చెప్తాడట. ఏవో బుట్టలో నాలుగూ పడేసి గారడీ చేస్తున్నాడు అన్నట్లుగా, ఏం తెలియదు. తెలియాలి అంటే మనం లోతులలోకి వెళ్తే ఆయన లోతులు తెలుస్తుంటాయి. కుమారస్వామి ఏమాత్రం అంచనా వేశాడేమిటి వినాయకుడి గురించి. ఏదో పాపం అన్నయ్య కాబట్టి ఈయనని మనం గౌరవించాలి తప్ప, లేకపోతే ఆయన ఆకారం, ఆయన వాహనం చూస్తే ఏమాత్రం గౌరవం వస్తుంది వినాయకుడి మీద కుమారస్వామికి. కుమారస్వామి చాలా అందగాడు. వినాయకుడు చాలా వికారంగా కనిపిస్తాడు. కుమారస్వామి చాలా చలాకీగా కనిపిస్తాడు, వినాయకుడు తిండిపోతు లాగా కనిపిస్తాడు. ఎప్పుడూ ఉండ్రాయి చేతిలో పెట్టుకుని తింటూ ఉంటే ఏమనుకుంటాము? వాహనమా చూడబోతే ఆయనకి

తగ్గ వాహనం కాదు. పహిల్వాన్ అంతటి వాడికి లూనా ఇచ్చినట్లుగా వుంటుంది. ఎటు నుండి చూసినా ఆకారం ప్రకారం బేలీజు వేస్తే వినాయకుడు బొత్తిగా మనకి ఆనడు. కథ చెప్పారు కాబట్టి వినాయకుడు గొప్పవాడు అని మనకు తెలుస్తుంది గాని, కుమారస్వామికి తెలియలేదు అంటే మనకేం తెలుస్తుంది? పైగా కుమారస్వామి పేరు గుహుడు. గుహుడికే గుహ్యం అయిపోయాడీయన. అందుకనే మనకు మనుషులలో మహాత్ములు తెలియరు. ఎందుకు తెలియరు అంటే కేవలం వాళ్ళకు గడ్డం వుండి, కాషాయం కడితే మనం వెంటనే పాదం మీద పడడానికి ready గా వుంటాము. జుట్టు క్రాప్ చేసుకుని, కాషాయం కాకుండా jeans వేసుకుంటే చచ్చినా వాళ్ళ కాళ్ళ మీద పడము. రూపం దగ్గర మనం ఆగిపోయాం కదా. కాబట్టి వాడు దాగుకుని వుంటాడట. కృష్ణుడు అలాగే వస్తాడు. వాళ్ళందరూ దేవుడు దిగి వస్తాడు అంటే ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క అంచనా వేసుకున్నారు. అంతకు ముందు దిగి వచ్చిన వాళ్ళను చూస్తే మంచి బ్రహ్మవర్చస్సు వున్న వాడిలో దిగి వచ్చాడు. సుక్షత్రియవంశం లో దిగి వచ్చారు, పరశురాముడు, రాముడు. అంతకు ముందు వామనుడు కూడా అంతే. ఈ సంకర వంశం యదు వంశం. సంకర జాతి. అటు చంద్ర వంశం కాదు, ఇటు సూర్య వంశం కాదు. సంకరజాతిలో పుడుతాడంటే ఎట్లా అండీ, ఒప్పుకుంటారా? ఉత్తమమైన జాతిలో పుట్టిన వాళ్ళు అసలు ఒప్పుకోలేరు. రకరకాలుగా అనుకుంటారు. పోనీ అందగాడా అంటే నల్లగా వున్నాడు. ఆజానుబాహువా అంటే కాదట, పొడవు కాదు, పొట్టి కాదు అన్నట్టుగా ఉంటాడట. పోనీ dress అన్నా సరిగ్గా వేసుకుంటాడా అంటే నెమిలి ఈక పెట్టుకుంటాడట. రాజులకు కిరీటం లో ఏ మాత్రం వైఢూర్యాలు, మణులు ఉంటే దాన్ని బట్టి కదా లెక్క, ఆభరణాల బట్టి లెక్క. రాజ్యం యొక్క విస్తారం బట్టి లెక్క. ఉన్న సైన్యాన్ని బట్టి లెక్క, అశ్వాలు ఎన్ని వున్నాయి, గజాలు ఎన్ని వున్నాయి వీటి బట్టి లెక్క. ఏమీ కాదు ఈయన దగ్గర, రాజు కూడా కాదు. అదొక రకమైన రాజ వంశంలో పుట్టాడు. 'శీలము గల వంశమున ఎలా పుట్టెను' అని ఒక పద్యం వుంటుంది భాగవతంలో. అంటే శాపం కలిగిన వంశంలో పుట్టాడు కదా, ఎందుకు అట్లా పుట్టాడు? ఇట్లా ఉంటాయి గుహ్యాలు. ఎట్లా మరుగున వుందాం, లేకపోతే ఆవేశపూరితమైన భక్తులు చుట్టూ చేరి జపం చేస్తూ వుంటే పనులు అవవు. పైగా నల్లగా పుట్టాడట, ఇంకొంచెం వెలుగు దాచడానికి. 'కృష్ణుడు' కదా నల్లని వాడు. అంత బాగా ప్రకటింపబడకుండా వుండే పద్ధతిలో పుట్టాడు. పుట్టడమే గుహుడుగా పుట్టాడు. అంతే కాదు అప్పుడప్పుడు ఎవరికన్నా కాస్తో కూస్తో దేవుడేమో అనే అనుమానం వస్తే, కాదన్నట్టుగా మరు చర్యలోనే చూపించేసేవాడు. పద్నాలుగు లోకాలు చూసిన యశోదాదేవి కూడా, మరుక్షణంలోనే నా పిల్లవాడే అన్నట్టుగా ప్రవర్తించాడు. మనకు కాస్తో కూస్తో తెలిస్తే నలుగురికి మన గురించి తెలీకపోయెనే అని ఎంతో బాధ పడుతుంటాము. ఎట్లాగో అట్లాగా మన గురించి చెప్పుకోవడానికి ఎంతో తపన పడుతుంటాము. భగవంతుడు దిగివస్తే బొత్తిగా అసలు

ఏమీ తెలియనట్లు వుంటాడట. తెలిసినట్టుగా కనిపించడట. తెలిసినవాడికి తెలిసినట్టుగా కనిపిస్తాడు. నీవు పెరుగుతుంటే, నీకన్నా ఒక అంగుళం పెరిగి కనిపిస్తూ వుంటాడట. అదే కుమారస్వామి పెరుగుతున్న కొద్ది అతడి కన్నా ముందు కనిపిస్తుండడం. అది గురువు! నువ్వు ఒక అంగుళం పెరిగితే అంత కన్నా ఇంకో అంగుళం మాత్రం ఎక్కువ కనిపిస్తాడు. ఇంకో అంగుళమే కదా నాకన్నా ఆయన పెద్దవాడు అనిపిస్తుంది. ఈయన ఆయన దాదాపు సమానమే, నాకన్నా ఒక అంగుళం లేక ఒక అడుగు ముందు వున్నాడు అనిపిస్తుంది. నువ్వు ఆ అడుగు ముందు వేస్తే ఇంకో అడుగు ముందు వుంటాడు. ఆ అడుగు ముందు వేస్తే ఇంకో అడుగు ముందు వుంటాడు. అట్లా ఎన్ని చోట్లకు వెడితే అన్ని చోట్లా ఈయన కన్నా ముందు కనిపించాడు వినాయకుడు. అందుకని 'కుమార గురవే నమః' అనే నామం వచ్చింది. గుహుడికే గురువు అయిపోయాడు. గుహగురు అని ఒక పాట కూడా వుంటుంది త్యాగరాజ కీర్తన. గురుగుహుడు! ఆ విధంగా దాగి వుండి, చిన్నవాడుగా వుండి, ప్రకటింపబడక వుండి, ఇతరులకు తన లోతులు తెలియక వుండి, తాను గుప్తముగా వుండి, తానెవరో ఎవ్వరికీ తెలియక, అందరికీ 'తాను, నేను అనే తత్త్వమును' అందించేవాడు సద్గురువు. సద్గురువు వెళ్ళిపోయిన 300 ఏండ్లకు తెలుస్తుంది 'అమ్మో చాలా పెద్ద విషయం వచ్చి వెళ్లిపోయిందని'. మనం మొదలు పెట్టిన దగ్గర నుండి మనమే రోడ్డు మీద పెద్ద life-size cutout పెట్టేసుకుని, మన గురించి మనమే ప్రచారం చేసుకుని, మన గురించి మనమే శిలా విగ్రహాలు నెలకొల్పుకుని, ఇట్లా వుంటాము. సద్గురువుకి ఆ యావ వుండదు, కారణం ఏమిటంటే అసలు తాను అనే వాడు ప్రత్యేకంగా లేడు, వాడే ఇక్కడ వున్నాడు. సద్గురువుకి ఈ తీట లేదు. అసలు వాడికీ తీట లేదు కదా. అసలు వాడితో వున్న వాడికి అసలు వుండదు. ఎందుకు వుండదు అంటే వాడికి లేనిది నాకెందుకు వుండాలి అని. అందుకని అంత సామాన్యంగా వుండడానికి ప్రయత్నం చేస్తాడు. అందుకని భగవంతుడు గుహుడు, భగవంతుడు గభీరుడు, భగవంతుడు గుప్తుడు అని చెప్పకోవడం ఒకటి. భగవత్ భక్తుడు కూడా ఈ కళ్యాణ గుణాలు కలిగి వుంటాడు. వారి గురించీ భాగవతం లో ఇవ్వబడింది. చిట్టచివరలో భాగవతంలో ఒక అవధూత వస్తాడు. ఆయన ఎవరో ఈవాళ్టికి కూడా ఎవరికీ తెలియదు. ఉద్ధవుడికి సందేహాలు వస్తే కృష్ణుడు మూడు ముక్కలు చెప్పి తర్వాత వాడు చెప్తాడు అని చెప్పి, వాణ్ణి తగిలించేస్తాడు. ప్రతి చోటా కృష్ణుడు ఇదొక పని చేస్తాడు. ఇది చెప్పడానికి ఆ labour మనకు ఎందుకు అని, వాళ్ళకు అప్పచెప్పేస్తాడు. ధర్మరాజు పట్టాభిషిక్తుడు అవడానికి కొంత నిరాకరించి వున్న సందర్భంలో, తాను మొదలు పెట్టి, నారదుడి చేత చెప్పించేసి, పూర్తి చేస్తాడు. అట్లాగే ఉద్ధవుడుకి బోధ చేసేప్పుడు కూడా తాను కొంత చెప్పి ఆ తర్వాత అవధూతకు అప్ప చెప్పి వెళ్ళిపోతాడు. 'అవధూత యదు సంవాదం' అని వుంటుంది మనకు. ఆ అవధూత ఎవరో అదొక పెద్ద రహస్యం. తెలియక్కరలేదు. సుమతీ శతకం ఎవరు వ్రాసారు? ఉపనిషత్తులు ఎవరు వ్రాసారు?

పేర్లు పెట్టుకోరు ఎందుకంటే వాడే వ్రాసుకున్నాడు, వాడితో మనం ఇలా వున్నాం, వాడే మనం అని తెలిసిన వాళ్ళు, తమ పేర్లకి, తమ చిత్రపటాలకి, తమ రూపాలకి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వరు. ఇతరులు తాపాత్రయపడితే దాని యందు ఉదాసీనులై వుంటారు తప్ప తామే promote చేసికోరు. తమ గురించి తాము ఆ విధంగా గుప్తులై, గభీరులై , గుహ్యులై వుంటారు. భగవత్తత్త్వం అట్లా వుంటుంది. దాన్ని అందుకోవడానికి మనం మాత్రం చేయాల్సింది ఒకటే ఒకటి. ఆ సాధన సాంప్రదాయంతో సంబంధం లేకుండా కూడా వుంది. సాంప్రదాయం కాదనక్కరలేదు. సాంప్రదాయంలో ఇరుక్కుపోతే భగవంతుడు దొరకడు. సాంప్రదాయాన్ని మన్నించండి. కానీ కొద్దిగా మెడ అంతకు పైన పెట్టుకోండి. బేధాలు చూడడం మంచిది కాదు, సత్ సాధన కోసం. సంఘపరంగా కాదు, సాధన పరంగా చెప్తున్నాను. చూసినప్పుడు సమస్తము నందు వాడిని దర్శనం చేస్తూ వెళ్తూ వుంటే, ఆయన దర్శనం చాలా సులభంగా అవుతుంది. అలా గాక నువ్వు అనుకున్న, నీ భావనలో వున్న భగవంతుడు నీకు గోచరించాలంటే చాలా కష్టం.

## 567 చక్రగదాధరః

చక్రమును, గదను ధరించిన వాడు. చక్రమును ధరించి వుండడము అంటే ఈ మొత్తం సృష్టి చక్రాన్ని ధరించి వుండడమే! అది కాలం రూపంలో ధరించి, తాను కాలాన్ని ఆధారం చేసుకుని, వ్యక్తం అవుతూ వుంటాడు. అందుకని కాలమును తెలిసిన వాడు సుదర్శనుడై వుంటాడు. కాలచక్రానికి సుదర్శన చక్రమని ఒక పేరు వుంది. భవిష్యత్తు, భూతము ఈ రెండింటియందు జీవించే వాడికి కాలము తెలియదు అంటే రేపు యందు, నిన్నటి యందు జీవించే వాళ్ళకి తెలియదు. ప్రస్తుతం యందు జీవించడం అనేది సహజ గుణం అయినప్పుడు భవిష్యత్తు, భూతం అందులో ఇమిడి పోయి, వర్తమానం భవిష్యత్తులోకి, భూతంలోకి వ్యాపనం చెంది, తద్వారా పాత విషయములు, కొత్త విషయములు గోచరించి, పరిపూర్ణ దర్శనం ఏర్పడుతుంది. అది సుదర్శనం! ఇది కాలం యొక్క మడతలలో వుంటుంది. కాలం మడతలలో వుండే దాన్ని మనకు తెలియాలి అంటే మనం ప్రస్తుతమునందు జీవించడం అనేది సాధన చేసుకుంటూ వెళ్ళాలి. దీన్నే 'అశ్వవిద్య' అని చెప్తారు. 'శ్వ' అంటే భవిష్యత్తు, భూతము. 'అశ్వ' అంటే భవిష్యత్తు భూతము కానిది, వర్తమానము. 'సూఫీ' అనే సిద్ధాంతం ఒకటి వున్నది. వాళ్ళందరూ ఇదే ప్రయత్నం చేస్తూ వుంటారు. ఎప్పుడూ వర్తమానం నందు అంటే ఇప్పుడు, ఇక్కడ ఏం చేయాలో దాని యందు జీవిస్తూ, ఆ సన్నివేశాన్ని భగవంతునిగా ఆరాధన చేసుకుంటూ వుంటారు. అలా ఉంటే సుదర్శనం ఏర్పడుతుంది. అదొక భుజం మనలో. అలాగే గద. భగవంతుని గద 'కౌమొదకం' అని, దాంతో ధర్మ సంస్థాపన చేస్తారని చెప్తారు. గద తల నేల మీద ఉండి, చేతిలో దాని కాడ వుంటుంది. ఆ కాడ మన వెన్నెముక. తల మన మెదడు. తలక్రిందులుగా వున్నావురా నువ్వు, అని చూపిస్తూ వుంటుంది. మొత్తం 'Cerebro Spinal System' నువ్వు! ప్రతివాడి వెనుక వాడి యొక్క వెలుగు దర్శనం వాడికి జరిగితే, వాడొక నిలబెట్టిన గద వలే వుంటాడు. బుర్రకాయ ఒక Bulb, వెన్నెముక ఒక Tube Light. ఒక పెద్ద Bulb మీద ఒక Tube Light పెడితే ఎట్లా వుంటుందో అట్లా వుంటుంది. దాన్నే ఇంకో రకంగా ఏం చెప్తారంటే ఒక పడగ విప్పిన పాము వలే కనిపిస్తావు అని చెప్తారు. ప్రతివాడు, వాడి దర్శనం వాడు చేసుకుంటే, వాడి కుండలినీ చైతన్యం పడగ విప్పిన పాము వలే వుంటుంది నిలబడి. పడగ వృత్తాకారంగా వుంటుంది. మిగతా భాగం అంతా కూడా ఒక కాడ వలే వుంటుంది. అందుకని కుండలినీ చైతన్యమును అధోముఖంగా నిలబెట్టి, స్థితిని కలిగిస్తుంటాడు సృష్టికి భగవంతుడు. ఆ స్థితి యందు ఆనందాన్ని నింపివుంచాడు. అది నందకి అనే గద! ఆ గద పైకెత్తాడంటే సృష్టి తనలోకి లయమైపోతుంది. ఆ గద క్రిందకి దింపాడంటే సృష్టి, స్థితి యందు వుంటుంది. అందుకని 'మొత్తం అంతా స్థితి యందు వుంచాను, తల్లక్రిందులుగా వుండడమే

ఎక్కువగా వుంటుంది, నువ్వు దీన్ని గుర్తు పెట్టుకుని సరిగ్గా నిలబడు' అని చెప్పడానికి మనకు సందేశం కూడా ఇస్తూ వుంటుంది. ఆ గద మనం అని భావన చెయ్యాలి. ఆ గదకు వుండే క్రిందభాగం మన తల అని, దాని కాడ మన వెన్నెముక అని భావన చేసుకోవడం వున్నది. ఆయన చేతిలో వుండే చక్రం కాలచక్రం అని భావన చేయాలి. అది మనకు సుదర్శనం అవ్వాలి అంటే ప్రస్తుతంనందు వున్న భగవంతుని దర్శనం చేస్తూ వుండడమే చేయాలి. అలా చేస్తేనే ఆ సుదర్శనం అనుకూలిస్తుంది, లేకపోతే అనుకూలించదు. అది అంబరీషుడు చేసి చూపించాడు. చక్రం విష్ణువు మాట తప్ప మరొక్కసారి ఎవరి మాటన్నా విన్నదంటే, అది అంబరీషుడి మాటే విన్నది. ఎందుకు విన్నది అంటే అంబరీషుడు తనని తిట్టిపోస్తున్న వాళ్ళల్ళో దేవుడ్ని చూశాడు. మనల్ని తిట్టిపోసే వాళ్ళల్ళో దేవుడిని చూడడం అనేది చాలా ఉన్నతమైన సాధన జరుగుతున్నప్పుడు అయ్యే పని కానీ, అంతవరకు అవదు. మనల్ని పొగిడే వాళ్ళల్ళోనే దేవుడిని చూస్తాం, తిట్టే వాళ్ళల్లో చూడం. కృష్ణుడు ఏం చెప్పాడంటే రెండింటిలోనూ నన్నే చూడమన్నాడు. 'తుల్య నిందా స్తుతిర్ మౌని' అంటాడు భక్తి యోగంలో. నిందా స్తుతులయందు ఒకే విధమైన మౌనము కలిగి వుండుము. మౌనము అంటే ఏమిటి మూతి ముడుచుకు కూర్చోవడం కాదు, మననం చేత మౌనం వహించి వున్న కారణంగా ముని అంటారు. మననం దేన్ని? వాణ్ణి! అంబరీషుడు అట్లా దుర్వాసుడు తిట్లతో సహస్ర నామాలు చదువుతుంటే, చదువుతున్న వాడి లోపల వున్న వాడిలో, వాణ్ణి దర్శనం చేస్తూ ఉన్నాడు. ప్రస్తుతమునందు సాన్నిధ్యమును ఇస్తున్న భగవంతుని మాత్రమే చూసే స్థితి యందు వున్నవాడు, అంబరీషుడు. మన ఉద్యోగమే మనకు తలమునకలుగా వుంటుంది. ఆయన సప్త ద్వీపములు, అంటే ఏడు ఖండాలతో కలిగిన భూమండలానికి చక్రవర్తియై వున్నాడు. ఎన్ని పనులు వుంటాయండి? మనం ఊహించుకోగలమా? ఎవడూ లేడు అట్లా భూమి మీద. అన్ని పనులు ఆయనే చూసుకోవాలి. కానీ ఎప్పుడూ భగవంతుడినే చూస్తూ వుంటాడు. విష్ణువునే దర్శనం చేస్తూ వుంటాడు, ఇన్ని రకాల పనులలో. 'భళి భళీ అంబరీషు పొగడగ వశమే' పొగడలేమని చెప్పేశాడు పోతనామాత్యుడు. మిగతావాళ్ళకు, మిగతావిషయాలలో అట్లా చెప్పలేదు. ఎందుకంటే ఏదో ముక్కు మూసుకుని అరణ్యంలో వున్నాడట, దేవుణ్ణి ఎప్పుడూ చూస్తున్నాడట అంటే అది వేరే సంగతి. జనకుడు కూడా చూశాడట అంటే అది ఏదో చిన్న మిథిల రాజ్యం, పెద్ద పెద్ద రాజ్యాల మధ్య. చూశాడట అంటే అర్థం వుంది. ఇదేమిటిది భూమి అంతా పరిపాలిస్తున్న మహాచక్రవర్తి ప్రతి చిన్న విషయంలో కూడా భగవంతుని మరవకుండా వున్నాడట. ఆయనని అడ్డగోలగా తిడుతున్నాడు ఒక ఋషి వచ్చి, తిడుతుంటే, దేవుడినే చూశాడట. ఒక మహా శక్తిని పుట్టించి చంపబోతుంటే, కంగారు పడకుండా, మహా శక్తిలో కూడా విష్ణువునే దర్శనం చేశాడట. అది వచ్చి చంపేస్తుంటే మరి విష్ణుచక్రం దాని అంతట అదే వచ్చేసింది, విష్ణువు చేత సంకల్పింపబడి. వచ్చేస్తే, అన్ని లోకాలు తిరిగాడు, విష్ణువు దగ్గరకు కూడా వెళ్ళాడు, విష్ణు చక్రం కాబట్టి

విష్ణువు మాట వింటుందని అక్కడికి వెళ్తే, 'నా మాట వినదది, ధర్మం మాట వింటుంది. ఇప్పుడు నేను పోనీలే మనవాడే, నన్ను ఇప్పుడు పొగిడాడు కాబట్టి ఇంక ఆగమంటే, నిన్ను ఎవరన్నా పొగిడి, వెధవ పనులు చేస్తుంటే, నేను ఏం చేయకూడదా వాణ్ణి? అని అడుగుతుంది' అని విష్ణువు అంటడు . భగవత్ భక్తులు దురాచారాలు చేస్తుంటే భగవత్ భక్తులు కాదన్నమాట. ధర్మాన్ని అనుసరించకపోతే దైవం కూడా పోరాడడానికి అవకాశం లేదు. ధర్మాన్ని అనుసరిస్తే దైవాన్ని ప్రశంసించక పోయినా, దైవం పని చేయాలి. అందుకని ధర్మరాజుకు ఇంత ఊడిగం చేస్తాడు కృష్ణుడు. ఎందుకంటే అక్కడ ధర్మం వుంది, అయన ధర్మాన్ని నమ్ముకున్నాడు. ధర్మాన్ని నమ్ముకున్నవాడికి దైవము స్నేహితుడు. దైవాన్ని నమ్ముకున్నవాడు ధర్మాన్ని నమ్ముకోకుండా వుండే స్థితి జరిగితే పతనం చెందుతాడు. 'దుర్వాసుడు సహజంగా దైవభక్తి వున్నప్పటికి అధర్మ ప్రవృత్తి చూపించాడు కాబట్టి, ధర్మానికి సంబంధించిన సుదర్శన చక్రాన్ని నేను శాసించలేను' అని చెప్తాడు విష్ణుమూర్తి. శాసిస్తే, రేప్పొద్దున్న ఇంకెవరో ఇటువంటి పని చేస్తే, వాణ్ణి మీరు అట్లా మన్నించారు కదా, వీడు కూడా మొన్న ఆ మధ్యన విష్ణు సహస్రనామం చదివాడు ఏకాదశి నాడు, ఈవాళ ఏదో పారపాటు చేశాడు, వదిలేయండి, అని చెప్తుంది చక్రం కూడాను. అట్లా అయితే మరి సృష్టి నడవదు. అందుకని సృష్టి నిర్మాణం చేసినప్పడే సృష్టి ధర్మాలు కూడా నిర్మాణం చేయబడ్డాయి. ధర్మాన్ని అనుసరిస్తేనే దైవం! కాబట్టి దూర్వాసుడుకి విష్ణువు 'నేను రక్షణ ఇవ్వలేను, ఎందుకంటే నువ్వు దురాచారం చేశావు కాబట్టి. ఎక్కడ అపచారం చేశావో అక్కడే ప్రాయశ్చిత్తం చేసుకో' అని చెప్తాడు. ఒకచోట ఎవరికో లెంప కాయ కొట్టి, గురువుగారి పాదాల మీద పడి తప్పయిపోయింది గురువుగారు అంటే పని అవదు, గుర్తుపెట్టుకోండి. పోనీలే అని గురువు అన్నా కూడ అది వీలు పడదు. ఎందుకంటే అన్ని జగాలకి గురువు, ప్రభువు అయినవాడే ఈ విషయం చెప్పాడు, ఎక్కడ తప్ప అయిందో అక్కడే దిద్దుకో అని. మనం ఏం చేస్తామంటే చేయాల్సిన చెత్త పనులు అన్నీ బయట చేసి వచ్చి, గురువుగారి పాదాలు ఆశ్రయిస్తుంటాము. సద్గురువు వీడికి తొందరగా దానికి ప్రాయశ్చిత్తం జరిగేటట్టు చూస్తారు. కాపుకాయడం అంటే అట్లా వుంటుంది. ఎక్కడికక్కడ account clear అయిపోతే సుఖంగా వుంటుంది. CVV గారికి దణ్ణం పెట్టుకుని పిచ్చిపనులు చేస్తే, వెంటనే వికటిస్తాయి. ఇది ప్రత్యేకమైన అనుభవం మన బృందంలో చాలా మందికి. ఎందుకూ అంటే అంతే! పేరుకోవడం అనేది ఇష్టం వుండదు సద్గురువుని ఆరాధన చేసే విషయంలో. అందుకని అక్కడికి వెళ్ళి దుర్వాసుడు అంబరీషుడుని ప్రార్థిస్తే, అంబరీషుడు సుదర్శన చక్రాన్ని ప్రార్థిస్తాడు వదిలివేయమని. ఆ సన్నివేశం కూడా విష్ణువే! 'చూశావా నా సంగతి. నేనంటే ఏమనుకుంటున్నావ్ ఇంత సాధన చేస్తున్నాను, నన్ను పట్టుకుని తిట్టావే' ఇట్లా మాట్లాడలేదు. మనమైతే అప్పుడు ఎన్ని మాట్లాడ్తాము. మనం మాట్లాడకపోయినా చాలా తేలికగా చూస్తాము. కానీ ఆయన అంత శరణార్థి అయి వచ్చిన దుర్వాసుడిలో కూడా

మళ్ళీ విష్ణువునే చూశాడు. అంతేకాదు వచ్చిన విష్ణుచక్రంలో కూడా విష్ణువునే చూశాడు. చూసి ఒకటే చెప్పాడు 'నేను ఎప్పుడూ విష్ణువునే దర్శనం చేస్తూ వున్నవాడినే అయితే, అది కారణంగా నీకు నామీద ఏమైనా దయ వుంటే, ఈయన్ని వదిలేసేయ్' అని. వీళ్ళందరూ భాగవతులలో ఉత్తములు. 'భాగవతోత్తములు' అంటారు. అలా సుదర్శనం మాట విన్నది. ఎందుకు విన్నదో తెలుసా, విష్ణువు చెబితే వినేది కాదు, అందుకని విష్ణువు చెప్పలేదు. అంబరీషుడు చెప్తే విన్నది. ఎందుకంటే అంబరీషుడు క్షమించాడు కాబట్టి. అంబరీషుడికి లోపల ఎక్కడా గాయం కాలేదు దుర్వాసుడు అన్న మాటలకి. కాబట్టి వదిలేశాడు. అటువంటిది సుదర్శన చక్రం! అంటే భాగవతోత్తముడికి సమస్తము అనుకూలమే! ప్రతికూలము కూడా అనుకూలము అయిపోతుంది. ప్రతికూలమైన సన్నివేశము అనుకూలముగా మారిందట అంటే భగవంతుడు నీయందు వున్నాడని అర్థం. అనుకూలమైన విషయాలు కూడా ప్రతికూలమై పోతున్నాయంటే మనం చేసే వాటిలో ఎక్కడో అపశృతి వుంది అని తెలుసుకోవాలి. అందుకని గదా మీరే , చక్రమూ మీరే. మీ సాధన బట్టి వుంటుంది. ఈ రెండిటినీ ధరించిన భగవత్తత్త్వాన్ని మళ్ళీ మనకు ఒక్కసారి గుర్తుచేశారు. లేకపోతే మర్చిపోవడం మన హక్కు కాబట్టి, మళ్ళా ఒకసారి గుర్తుచేసుకోవడం మన బాధ్యత కాబట్టి మళ్ళీ ఒకసారి గుర్తు చేయడం. విష్ణు సహస్రనామం చేస్తున్నప్పుడు ఒక్కవిషయం గుర్తుపెట్టుకోండి. భీష్ముడు విష్ణు సహస్రనామము ఎటువంటి పరిస్థితులలో చెప్పాడు? అంపశయ్య అంటే మన Bedroom లో మంచం లాగా వుండదు. అన్నీ పాపం తూట్లే. మనకీ తూట్లే. పడుకోవడం Dunlop పరుపు అయినా ఏవో గుచ్చుకుంటూనే వుంటాయి కదా మనకి కూడా అవో ఇవో. అంత గుచ్చుకుంటే మనం బతకలేము, భీష్ముడు కాబట్టి బ్రతికాడు. ఒకే ఒకటి గుచ్చి వుంచుతారు ఎప్పుడూ, జీవుడుకి. ఏదో ఒక కోరిక వుంటుంది ఎప్పుడూ. అట్లా విష్ణు సహస్రనామం చదివేటప్పుడు మనం కూడా భీష్ముడి లాగా ఒక రకమైన దీన స్థితిలో వుండి భగవంతుని ప్రార్థన చేసుకున్నట్టుగా భావన చేసుకుంటే కొంచెం బాగుంటుంది. ఎందుకు దీన స్థితి అంటే, అతడు అపరిమితుడు, అతని అంశయైన మనం కూడా అపరిమితులమే, కానీ పరిమితులమై పడి వున్నామే! నీవు అపరిమితుడవు కదా, నీ తనయుని కదా నేను, నాకే పరిమితత్వం ఏమిటి? నాకేం తెలియదు, నేనేమీ చేయలేను, నేను ఒకటి చేస్తే ఇంకోటి అయిపోతూ వుంటుంది, ఏమిటి నాకీ పరిస్థితి, నన్ను ఎందుకు ఇట్లా వుంచావు, ఇటు వంటి అంపశయ్య మీద మనం వున్నట్లు, అది అంపశయ్యే! నిజానికి భగవంతుని యొక్క అంశావతారములమే మనం అంతా! అయినప్పటికీ కూడా సమస్తాన్ని కోల్పోయాము, ధర్మరాజు రాజ్యం కోల్పోయినట్టు, నలుడు దమయంతిని, రాజ్యాన్ని కోల్పోయినట్టు, హరిశ్చంద్రుడు రాజ్యాన్ని, భార్యని, పిల్లవాణ్ణి కోల్పోయినట్టు. అదే పరిస్థితి మనది, ఎక్కడికక్కడ సరిపెట్టేసుకుంటాము మనం. పోన్లే బాగానే వున్నామనుకుంటూ అట్లాగా మిణుకు మిణుకుమంటూ జీవించేస్తుంటాం. నిజానికి మన

పరిస్థితి ఏమిటి? ఆయన యొక్క ప్రతిబింబము, ఆయన యొక్క ప్రతీకలము అయినప్పుడు మనం కూడా అపరిమితులమే కదా. కానీ ఎంత పరిమితత్వంతో బాధ పడుతున్నాము. ఎందుకు నన్ను ఇట్లా వుంచావు? నీ యందు నన్ను చేర్చుకో, నా యందు నీవు ఉండు. నా యందు నీవు ఉండడం చేత, నేను నీ యందు ఉండడం చేత అపరిమితంగా నా నుండి దివ్యమైన కార్యాలు నిర్వర్తించుకో. తద్వారా ఆ వైభవాన్ని నన్ను చూసి ఆనందింప చేసే అనుగ్రహాన్ని నాకు కలిగించు, అనే భావన వుండాలి. అందుకని సహస్రనామాలు చేసేప్పుడు పై నుండి క్రింద వరకు, క్రింద నుండి పై వరకు అన్నీ దర్శనం చేస్తూ వుండాలి. ఎట్లా చేయాలి దర్శనం అంటే ఆయన యొక్క రూపాన్ని మనం ఏర్పరుచుకున్నదే అయినప్పటికీ కూడా, ప్రతి చిన్న విషయాన్ని దర్శనం చేయడం ద్వారా, ఆయన కాళ్ళు, కాళ్ళ గోళ్ళు, వేళ్ళు, వేళ్ళ గోళ్ళు, చేతులు, చేతులకుండే కండరములు, వాటికి పెట్టిన ఆభరణములు, ఆ చర్మం యొక్క రంగు, దాని యొక్క కాంతి, కంఠము, హృదయము, అట్లా అన్నీ చూసుకుంటూ ఈ లోపల నామాలు చదువుతున్నాము అనుకోండి, ఎలా వుంటుంది తెలుసా, కొన్నాళ్ళు పోయిన తర్వాత మీలోనే వాడు వున్నాడు కాబట్టి, మీతో వాడు చతుర్భుజుడై, ఇటు పక్క చూస్తే శంఖం, అటు పక్క చూస్తే చక్రం కనిపించే వరకూ వుంటుంది సాధన. అదీ అక్రూరుడు చేసిన సాధన. పురాణ పురుషుడు చదువుకోండి. తాను నడిచి వెళ్తుంటే చతుర్భుజుడైన భగవంతుడు తనతో నడిచి వస్తునట్టుగా భావన యందు నిలబడ్డ వాడు అక్రూరుడు, సామాన్యుడు కాదు. ఏదో చిన్నచిన్న పారపాట్లు అందరూ చేస్తారు అలాగే విష్ణుసహస్రనామం రోజూ మనం చదువుకుంటాం కదా, ఎట్లా చదువుకోవాలి? ఏమిటో ఏదో ఆలోచించుకుంటూ ఇట్లా పిండిమర తిప్పినట్లు తిప్పేయడం కాదు. కనులు మూసుకుని నీవు కూర్చుంటే నీ మూలాధారం నుండి నీ తల వరకూ మొత్తం అంతా ఆయన నిలబడి వున్నట్టుగా, క్రింద నుండి పైకీ, పై నుండి క్రిందకీ, ఆయన సమస్త అంగములను దర్శనం చేస్తూ, అంగములకు వున్న ఆభరణాలను దర్శనం చేస్తూ, ముందు పాదాలను బాగా దర్శనం చేస్తూ, అక్కడ నుండి పెరిగిపెరిగి తల వరకూ వెళ్ళి , బాహువులను చూసి, మళ్ళీ ఆయన ఆయుధాలను చూసి, మళ్ళీ రూపాన్ని చూసి, కన్నులను చూసి, చిరునవ్వును చూసి అట్లా 20 నిముషాలు స్థాపన చేసుకో. నిజానికి నీ సుషుమ్న యందు అదే నిండి వున్నది. దానికి నువ్వు ఒక రూపాన్ని నీ భావన చేత కల్పిస్తున్నావు. నీ భావనలో వుండే తీవ్రతను బట్టి, ఏకాగ్రతను బట్టి, నీకు అది సత్యమై నిలిచి, అదే భగవంతుడు నీకు వ్యక్త స్వరూపంలో ఒక వాహికగా ఏర్పడి, అనుసంధానం ఏర్పడుతుంది. భగవంతునితో నీవు మాట్లాడుకోవచ్చు. భగవంతునితో అడుకోవచ్చు. ఇట్లా తయారుచేసుకోవడానికి ఈ స్తోత్రాలు పనిచేస్తాయి. అందుకు ఇచ్చాడు భీష్ముడు. అందుకూ వేదవ్యాసుడు ఇచ్చాడు. సాక్షాత్ భగవంతుడు అక్కడ వచ్చి నిలబడి చెప్పించాడు. భగవంతుని సమక్షంలో, భగవంతుని కోరిక మీద, భక్తుడు ఇచ్చిన స్తోత్రం ఇది. లలితా సహస్రనామం ఇంకో సన్నివేశం. విష్ణు సహస్రనామానికి ప్రత్యేకత వుంది.

భగవంతుడే మొత్తానికి సాక్షి! దానికి approval ముద్ర ఆయనదే వుంది. పైగా ఆయనే కోరాడు ధర్మరాజు ద్వారా. 'ఇక్కడే వున్నాడు, చూడు, సమస్తము తెలిసిన వాడు, ఆయన కనుసన్నుల యొక్క అనుమతి కోసం వేచివున్నాను' అని భీష్ముడు చెప్తాడు. కాబట్టి మనం నామం చేసుకునేటప్పుడు మన యొక్క పరిమిత స్థితిని ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలి. అన్నమయ్య వ్రాస్తాడు 'ఎన్ని బాధలు తనకు ఎన్ని తలపోతలు' అంటూ. తలపోతలే కాదు తలపోటులు కూడా వున్నాయి. ఇన్ని వున్నవాళ్ళం నీ దగ్గరికి చేరాం, నీ పంచన చేరాం, నీ పాదాల దగ్గరికి చేరాం, నన్ను కూడా నీలో ఇముడ్చుకో అన్న భావనతో ఇవన్నీ చేసుకుంటున్నాము అనుకోండి, ఒక కృపారసదృష్టి మన మీద పడేటట్టుగా, ఒక రకమైన భక్తి భావనతో, శ్రద్ధతో ఈ నామాలు చేసుకుంటూ వుంటే, అందులో భాగంగా ఈ ఆయుధాలు అన్నీ కూడా మనకి ఉన్ముఖమై వుంటాయి. కాలచక్రం ఉన్ముఖమై వుంటుంది. పద్మం అంటే వికాసం. వికాసం మనలో కలగడానికి అన్నీ పద్మాలేగా. చక్రాలలాగా వుండేవి పద్మాలలాగా మారుతాయి. యోగికి ౭ చక్రాలు ౭ పద్మాలు అవుతాయి. చక్రాలు అయితే గిరగిరా తిప్పుతూ వుంటాయి. పద్మాలు అయితే వికాసాన్ని అందిస్తాయి. అలాగే గద. అలాగే శంఖము అంటే నాదము. అన్నీ మనకు ఉన్ముఖత్వము కలిగించి బంగారం వర్ణం, నీలవర్ణం, వాటి యొక్క అనుభూతి నిచ్చి, తద్వారా భగవంతుని యొక్క చేరికకు మనని దగ్గర చేస్తాయి.

## 568, 569 వేధాః, స్వాంగః

సమస్తమునకు తండ్రి అయిన వాడు అని అర్థం. తండ్రి అంటే 'పుట్టుటకు మూలకారణము'. తండ్రి నుండి తల్లి, తల్లి నుండి తనయుడు. ఇక్కడ తల్లికి కూడా ఆయనే తండ్రి! తనలోంచి సంకల్పమాత్రంగా బయటకు వచ్చి, ఆ సంకల్పం మూడుగా/ త్రిగుణాత్మకంగా తయారైతే, త్రిగుణాత్మకమైన ప్రకృతి నుండి సమస్త జీవరాసులు (ఎందులో నుండైతే త్రిగుణాత్మకమైన ఈ ప్రకృతి పుట్టుకు వచ్చిందో అందులో నుండి ఈ జీవరాశులు) బయటకు వస్తాయి. అందుకని ఎక్కడ, ఎవరు పుట్టారన్నా, మూలకారణం భగవత్తత్త్వం! దాన్ని 'వేధః' అని చెప్తారు. మనకి తండ్రి, ఆయనకు తండ్రి, ఆయనకు తండ్రి అలా మనం తీసుకున్నట్లయితే, బ్రహ్మకు తండ్రి, తల్లి. ఆ తల్లికి కూడా తండ్రి. తనలోంచి సంకల్పం పుడితే, ఆ సంకల్పం లో నుండి త్రిగుణాత్మకమైన ప్రకృతి పుడితే, ఆ త్రిగుణాత్మకమైన ప్రకృతి నుండి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు పుడితే, అందులో బ్రహ్మ నుండి జీవులు పుడితే ఇలా చెప్పుకోవాలి. ఈ తత్త్వం లేకపోతే ఏదీ పుట్టడానికి లేదు. ఇది పునాదిగా, త్రిగుణములు, వీటి పునాదిగా మిగతా పుట్టుకలు. సమస్త సృష్టి అనే నాటకానికి ఆధారం ఈ తత్త్వం! దేనియొక్క మూలానికి వెళ్ళినా ఈ తత్త్వం గోచరిస్తుంది. మనలో కూడా అలా మూలస్థానానికి వెళ్తే, మనకందరికీ తండ్రి అయిన వాడు మనయందు మనకి గోచరిస్తాడు. వాడుండబట్టి మనం చూడ్డం జరుగుతోంది. ఆ తత్త్వాన్ని 'వాడు' అంటాం. ఎందుకంటే, భగవంతుణ్ణి విష్ణువుగా చెప్పుకుంటాం. కానీ అది తత్త్వమే! తత్త్వం కి స్త్రీ, పురుష లింగం అని లేదు. అది రెండూ కలిపినది. అది ఆధారంగా మనం చైతన్యవంతులం అవుతున్నాం. చైతన్యవంతులం అవడానికి ఆధారంగా ఆలోచనలు చేస్తున్నాం, ఆలోచనలు ఆధారంగా పనులు చేస్తున్నాం. మాట్లాడుతున్నాం. అందుకని మనం విష్ణుసహస్రనామ స్తోత్రం చేసినప్పుడు, విష్ణువు ఎక్కడో వున్నాడని అనుకోకుండా, మనయందు మనవలె ఆయనుండబట్టి, ఆయన్ని మనయందు దర్శనం చేసుకుంటూ, స్తోత్రం చేసుకుంటే బావుంటుంది. మనం మాట్లాడుతున్నా, ఆ తత్త్వం వుండబట్టే మాట్లాడుతున్నాం. వినడం అయినా, మన నాలుక కదలాలన్నా, ఇలా మనలో జరిగే సమస్తమైన వ్యాపారం, మనం చేస్తున్నట్లుగా జరుగుతున్నది అనేది, ఆ చేతన ఉండబట్టి జరుగుతున్నది. మనం మనలోని భగవత్తత్త్వం లోంచి వెండి తెరమీద బొమ్మలాగ పడుతున్నాం. నిజానికి మనం వెండి తెరమీద బొమ్మలాంటి వాళ్ళమే, ఆయన వెండితెర! ఆయన తన మీద ఎన్ని బొమ్మలయినా ఆడిస్తాడు, ఎన్ని రకాలయినా ఆడిస్తాడు. అసలు తెర లేకపోతే? బొమ్మే లేదు. అలాగే ఆ తత్త్వం మనయందు లేకపోతే, ఈ ఆటలు ఏమీ లేవు. మన ఆట అంతా ఆయన ఆటే! ఇదీ తండ్రి ఆట అంటే! ఆయనలా ఉండబట్టి, వెనకాల ఆయన ఆధారంగా మనం ఇన్ని ఆటలు ఆడుతున్నాము. మనము

వింటున్నాము. చూస్తున్నాము. రుచి చూస్తున్నాము. స్పర్శ పొందుతున్నాము. ఆ తత్త్వం మనలో లేకపోతే మనం చేసేది ఏమీ లేదు. అదే మనలో ఊపిరి పీలుస్తున్నది. అదే మనలో గుండె కొట్టుకోడంగా ఉంటోంది. అదే మనలో స్పందనాత్మక చైతన్యంగా ఉంటోంది. అదే మనలో అహర్నిశలూ రక్తశుద్ధి చేస్తున్నది. ఇంత సన్నిహితంగా, ఇంత ప్రస్ఫుటంగా మనలో ఉంటే, మనము అక్కడ చూడకుండా ఎక్కడెక్కడో చూస్తూంటాం. దేవుణ్ణి లోపల వెతుక్కోవాలి తప్ప బయట వెతుక్కుంటే ఎలా కనిపిస్తాడు? లోపల వెతుక్కుంటే అసలు 'మనము చేసేదంతా ఆయనే' అని తెలుస్తుంది. మనలో, మనకి ఆధారముగా ఉండి, మన శరీరములో అణువణువు నందు వ్యాపించిన ప్రజ్ఞను ఒక సుందరమైన చతుర్భుజుడైన పురుషాకారంగా, మనకు తోచినంతవరకు ఆపాదించుకుని, చూసుకుంటూ, ఒక రకమైన రసానుభూతి పొందడం కోసం ఈ స్తోత్రం ఇచ్చారు. స్తోత్రం చేయడానికి ఆయనే ఆధారం! ఆయనిచ్చిన గొంతుతో, ఆయనిచ్చిన మేధస్సుతో ఆయనని స్తోత్రం చేయడం కోసం సమర్పణ చేయడం లో మన circuit complete అవుతుంది. Circuit complete అయితే వెలుగుతుంది. Complete కాకపోతే వెలగదు. అందుకని ఎక్కడా చూడక, లోపల ఎక్కడ నాదం పుడుతోందో అక్కడో, లేకపోతే భ్రూ మధ్యంలోనో, లేకపోతే హృదయంలో చూడడమో, లేదా మన శరీరమంతా ఆయనే వ్యాపించి ఉన్నట్లు భావన చేసుకోవడమో (మరి ఈ శరీరం ఆయనే కదా) చేస్తే, అదీ తండ్రిని చూడడం! అట్లా నువ్వు తండ్రిని చూస్తే, కుమారుడవవుతావు. అదే దైవ కుమారుడు, Son of God అంటాం! ఋషి, సిద్ధ పురుషుడు, దైవకుమారుడు తనయందు అస్తిత్వం చెందిన భగవత్తత్త్వాన్ని, తనయందు దర్శనం చేసిన వాడు. అది కారణం చేత సమస్తములో వుండే తత్వాన్ని అలాగే దర్శనం చేస్తాడు. తనయందు దర్శనం అయితే, బయట కూడా దర్శనం అవుతుంది. తనయందు దర్శనం కాకపోతే బయట దర్శనం కాదు. తనయందు దర్శనం అవ్వడం అంటే ఏమిటో? ఈ నడిపిస్తున్నదంతా అవ్యక్తంగా వుండి, నడిపిస్తున్న దానియందు మనం బాగా భావన చేయడం వల్ల ఆయనతో యోగము చెందడము జరుగుతోంది. ఆయనకు రూపం ఏమన్నా ఉన్నదా? లేదు. నామం ఉన్నదా? లేదు. కానీ నువ్వు పెట్టుకుంటే ఆ రూపంలోనికి, ఆ నామంలోనికే వస్తాడు. అసలు మనం ఉండడం అంటే, ఆ తత్త్వం ఉండడమే! ఇది బాగా ఆకళింపు కావాలి. దాని మీద ధ్యానం చేయాలి. కానీ మనం లేకపోవడం ఆయన లేక పోవడం అని మాత్రం అనుకోకూడదు. ఎందుకంటే, మనం లేకపోవడం ఉండవచ్చుగానీ, ఆయన లేకపోవడం వుండదు. ఆయన్లోకి వెళ్తూ వుంటాం. ఆయన్లో నుండి బయటకి వస్తూంటాం. వెండితెర మీద బొమ్మలు పడుతూంటాయి. బొమ్మలు మళ్ళీ మాయమై పోతూంటాయి. ఎన్ని సినిమాలు వచ్చి వెళ్ళిపోయినా, తెర అలాగే వుంటుంది. మనం వేరుగా వున్నామనుకోవడమే, తెరమీద బొమ్మ ఆవడం, తెర లేకపోతే బొమ్మ లేదు కదా. అసలు తెరనుండి వచ్చిన వాణ్ణి నేను, అనే భావన

ఉందనుకోండి! తెరనుండి అలా రావడం అనే దాన్నే 'తరంగం' అన్నారు. సముద్రం నుండి ఒక తరంగం వచ్చింది. కానీ అసలు అది సముద్రమే కదా. ఇది బాగా భావన చేయాలి. అదే ఇదిగా వున్నదని భావన చేయాలి. మన గురించి మనం చేసుకునే నిర్వచనం కాదు ఇది. ఒక పెద్ద మంత్రం ఏమంటే 'అదే ఇది' అని! నిజానికి మనం అదా, ఇదా? అదే కానీ, ఇది అనుకుంటున్నాం. This is that అని. That is this. అనేది మనకి బాగా తెలియాలి. దాని నుండి మనము వ్యక్తము అయినప్పుడు మనం వ్యక్తి అని పిలవబడుతున్నాము. మన నుండి మళ్ళీ బోలెడు వ్యక్తము అవుతుంటాయి. బోలెడు భావాలు వస్తూంటే వాటికి మనము తండ్రి అవుతుంటాము. అంటే మనకి ఒక తండ్రి ఉంటే, మనము చాలా వాటికి తండ్రిగా ఉంటుంటాము. అయన మనని తనలోనికి ఎప్పుడైనా లాగేసుకోగలడు. మనము, మనలోంచి పుట్టిన వాళ్ళని మనలోనికి లాక్కోలేము. ఒక్కో భావము బయటకు వస్తే, పడేసి దున్నేస్తుంది జీవితమంతా. 30 సంవత్సరాలు శుభ్రంగా రాపాడి వదిలేస్తుంది. ఆ తండ్రికి మనమీద ఎంత స్వామిత్వం ఉందో, మనలో నుండి పుట్టుకు వచ్చిన వాటియందు మనకు అంత స్వామిత్వము వస్తే, మనము నిజంగా దైవకుమారులము అవుతాము. దేంట్లో నుండి సమస్తము దిగి వచ్చిందో దాన్ని జయించే ప్రశ్నయే లేదు. అల సముద్రాన్ని జయించే ప్రశ్నయే లేదు. దానిలోంచి పుట్టుకొచ్చింది కదా. బంగారం లో నుండి ఉంగరం పుట్టుకొచ్చింది. ఉంగరం వంకర పోయి మారిపోవచ్చు తప్ప, బంగారం బంగారము లాగానే ఉంటుంది. విరిగి పోయినా, ముక్కలయినా అది బంగారమే! ఎన్ని రూపాలు అందులోంచి వచ్చినా బంగారం బంగారం లాగే ఉంటుంది. అందుకే ఉంగరము ముక్కలయిందంటాము కానీ బంగారము విరిగినదనము. ముక్కలయినా బంగారము కనుక దాచుకుంటాము. దానికి అవస్థితి లేదు. ఎన్ని రూపాలు అందులోంచి వచ్చినా బంగారం బంగారం లాగే ఉంటుంది. అలాగే ఈ భగవతత్త్వము లో నుండి అన్నీ బయటకి వచ్చాయి కనక, ఏవీ లేనప్పుడు కూడా అది వున్నది. కాబట్టి దాంట్లోంచి వచ్చేవి దాన్ని జయించ లేవు. అందుకనే దాంట్లో నిలబడివున్న వాడిని కూడా ఎవరూ జయించ లేరు. అదీ భక్తుడి బలము! మహాశక్తులు కూడా అటువంటి మనిషి వద్దకు వచ్చేసరికి ఆగిపోతాయి. విశ్వామిత్రుడి వద్ద బోలెడు శక్తులున్నాయి. ఆ శక్తులన్నీ వశిష్ఠుడి మీద ప్రయోగించాడు. ఏమీ కాలేదు. అందుకనే ఉపాసన ద్వారా, పూజలూ, మంత్ర, తంత్రాల ద్వారా రజోగుణంతో సంపాదించిన శక్తులు బోలెడుంటాయి. ఈ శక్తులన్నీ సహజ యోగిని ఏమీ చేయలేవు. ఆయన వద్దకు వస్తే అన్నీ మాయమైపోతాయి. ఎందుకంటే శక్తి ఎక్కడైతే పుడుతుందో ఆ చోటులో ఈయన కూర్చొని ఉంటాడు. అందుకని శక్తికి తండ్రి ఈయన లో నుండి పని చేస్తుంటాడు. అందుకని అన్ని శక్తులూ అక్కడకి రాగానే పడిపోతుంటాయి. ఏ శక్తీ పని చేయదు. కృష్ణుడు కనిపించగానే మహా శక్తివంతుల శక్తులు కూడా హరించుకు పోతాయి. ఎందుకంటే కృష్ణుడు ఎప్పుడూ మూలతత్త్వం నుండి విడివడి ఉన్నవాడు కాదు.

రూపంలోకి వచ్చినా కూడా, మూలతత్వమే దిగివచ్చింది కాబట్టి ఆ భావం నుండి విడిపడ్డ భావన లేకపోవడం చేత, అలా కన్నులు పెట్టి చూడగానే అవతలవాడి లోని సమస్తమూ, Straw పెట్టి కొబ్బరి నీళ్ళు, coco cola సమస్తమూ, లాగేసినట్లు వచ్చేస్తుంది. అవతలవాడిలో వున్నవన్నీ కూడా 'పరభూపాలుర ఆయువు లెల్ల' అని కదా భాగవతంలో వున్నది. వారి ఆయువులెల్ల అలా రథంలో కూర్చుని లాగేశాడు. ముందు ఈయన కూర్చొని, వెనక అర్జునుడు యుద్ధం చేస్తున్నాడట. ముందు అవతలవార్ని ఈయన చూసి నవ్వుతాడట. అట్నుంచి అన్నీ, పంచ ప్రాణాలతో సహా ఇటు వచ్చేస్తాయి. మిగతా డొల్లని అర్జునుడు కొట్టి, కీర్తి సంపాదించుకున్నాడుట. అదీ భక్తి పరంగా దర్శనం చేసింది. మామూలు కథ అయితే ఆ అస్త్రం వేసి, ఈ అస్త్రం వేసి ... ఇలా ఉంటాయి భారతం లో కథలు. ఇవన్నీ అలా ఉండగా, వీటన్నిటికీ మూలం అసలు ఇది. జరాసంధుడ్ని భీముడు చంపినపుడు కూడా అదే చేస్తాడు. భీముడు ఓడిపోతూంటే, తనలో ఉన్నది భీముడిలో ప్రవేశ పెడతాడు. భీముడిలో వున్నది కాని కొంచెం నాసిగా వున్నది. ఎందుకంటే అతడు కండబలాన్ని నమ్ముకున్నాడు కానీ, ఆత్మబలాన్ని నమ్ముకోలేదు. అందుకని అతడిలో ఆత్మబలాన్ని ప్రవేశింపజేయడంతో జరానంధుడు వెళ్ళిపోతాడు. అలాగే ఆత్మబలం ప్రవేశింపజేసే ధుర్యోధనుణ్ణి సంహరింప చేస్తాడు. ఆత్మబలం చేతనే మిగతా వారందరికీ సూర్యాస్తమయం అయినట్లుగా భ్రమ కల్పిస్తాడు. ఇవన్నీ కృష్ణుడిలో కనిపించినట్లే యోగుల్లో కూడా కనిపిస్తాయి. సహజమైన యోగుల మీద ఏ శక్తులు పనిచేయవు. మాస్టరు గారు అదే Challenge చేసేవారు, 'ఎవర్నయినా నా మీద ప్రయోగం చేయమనండీ వాళ్ళ శక్తులని' అని! ఎందుకంటే, అంతర్యామితో అనుసంధానం చెంది వున్నచోట, అంతర్యామిలోంచి పుట్టినవి అంతర్యామినేమీ చేయలేవు. అంతర్యామినేమీ చేయలేవు అన్నదెంత సత్యమో, అంతర్యామిలో వున్నవాడిని కూడా ఏమీ చేయలేవు అన్నదంత సత్యం! అందుకనే శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'నా భక్తుడు నశించడు' అంటాడు. అంటే, 'నాతో ముడి వేసుకునే వాడికి నాశనం వుండదు' అని అర్థం. ఏమిటి నాశనం లేదూ? వాడి అస్తిత్వానికి నాశనం లేదు. వాడు మిగతావి వున్నాయా లేదా అని చూసుకోడు. వశిష్ఠుడు తన కుటీరం వున్నదా లేదా అని చూసుకోడు. మనం వాడిలో వున్నామా లేదా అన్నదే ముఖ్యం. మిగతా ఏమీ ముఖ్యం కాదు. మన వాళ్ళు, మనం అనేవి ఉండవు యోగికి. ఇతడుంటాడు, వాడుంటాడు. అంతే! వాడితో సర్వకాల సర్వావస్థల యందూ ముడి వేసుకుని వున్నామా లేదా అంతే! ఇలాంటి వాడ్ని ఎవ్వరూ ఏమీ చేయలేరు. అప్పుడు అతడు కూడా అజేయుడుగా నిలుస్తాడు. అర్జునుడు అజేయుడుగా నిలవడానికి కారణం కృష్ణుడితో ముడి వేసుకోవడమే! ధర్మరాజు ధర్మంతో ముడి వేసుకోవడం వలన అజేయుడిగా నిలబడ్డాడు. ధర్మంతో గానీ, దైవంతో గానీ, ముడివేసుకున్న వాడు అజేయుడే! మనక్కూడా ఏదైనా కష్టం గానీ, సమస్య గానీ వచ్చిందనుకోండి, ఇంత భక్తి, ఇంత సాధనా చేసేవారికి కూడా మనస్సులో ఎక్కువగా

సమస్యే, లేదా కష్టమే వుంటుంది. దైవం తక్కువుంటాడు. నువ్వు సమస్యలో వుంటావా? దైవంలో వుంటావా? దైవంలో వుంటే సమస్య దూది పింజల్లే ఎగిరిపోతుంది. సమస్యలో వుంటే దూదిపింజ కూడా పెద్ద బండరాయి అవుతుంది. ఇది విన్నా కూడా ఎందుకో అది మన జీవలక్షణం లోనికి ప్రవేశించదు. అదే పెద్ద గొడవ మనకి. భగవంతునియందు నిలబడి ఉంటే సమస్య చిన్నదవుతుంది. భాగవతంలో, 'అవతల తీరం కనపడని పెద్ద సముద్రం కూడా, మన ఇంటి ముందు పారే కుళ్ళు కాలవంత చిన్నదయి పోయి, ఒక బాలపథముగా దాటేస్తారు భగవంతునితో కలిసి ఉంటే' అని చెప్తారు. ఎవరు? భక్తుడు! సంసారం లో ఉండికూడా, భగవంతునితో అనుసంధానం చెంది ఉండడం చేత అవధులు లేనంత భయంకర సమస్యలను కూడా అతి మామూలుగా దాటేస్తాడుట. ఓ పెద్దగీత ఉంటే దాన్ని చిన్నది చేయాలంటే దాని పక్కన మరో పెద్ద గీత పెట్టుకోమన్నారు మన పెద్దలు. అన్నిటికన్నా పెద్ద గీత భగవద్గీత! అది పట్టుకున్నామనుకోండి చాలు! సమస్య వచ్చినప్పుడు ఎక్కువ భగవంతుడు లో ఉంటే సమస్య చిన్నది అవుతుంది. సమస్య లో ఎక్కువ ఉంటే సమస్య చాలా పెద్దదవుతుంది. అదే వాసుదేవోపాసన! సమస్యనే దేవుడిగా చూడడం! నీ సమస్య రూపంలో దేవుడున్నాడు ప్రస్తుతం అనుకోవాలి. అంబరీషుడు అలా చూశాడు. తనని చంపడానికి దుర్వాసుడు మహాకృత్య అని ఒకటి పంపితే అది భీకరంగా తన మీదకు వస్తూ ఉంటే దాన్ని దేవుడిగా చూశాడట. ఎందుకంటే ఆయనకు దేవుడు కానిది ఏదీ లేదు. లాగినా అందులోంచి బయటకు రాడు. అంత sticky దేవుడితో ఆయన భక్తి. అన్నీ దైవమే! ప్రహ్లాదుడు కూడా అంతే! ఇవే మనకి ఆదర్శాలు. మనం కూడా కష్టాలని ధ్యానం చేయకుండా కష్ట రూపంలో నా దైవమే ఉన్నాడనుకుంటే తేలికయిపోతుంది. అది ఎంత చెప్పినా, పట్టుపట్టి అభ్యాసం చేయకపోతే తెమలదు. ధర్మరాజు అలా సమస్య ఎంత పెద్దదైనా 'దేవుడు చూసుకుంటాడు, మనకెందుకు' అని వదిలేశాడు. అలా కానప్పుడు మనకి సమస్య చాలా పెద్దదిగా కనిపిస్తుంది. అలా ధర్మంతోను, దైవంతోను ముడివేసుకున్నవాడు కూడా భగవంతుని వలె 'అజేయుడుగా' ఉంటాడు. భగవంతుడు అజేయుడు అని చెప్పకోవడం పెద్ద గొప్ప విషయమేమీ కాదు. అందుకే ప్రతి నామంలోనూ కూడా భగవత్ భక్తులను ఉదాహరణగా తీసుకుంటే 'మనకు కూడా ఇది వీలేమో' అనిపిస్తుంది. లేకపోతే ఏవీ మనకు వీలయ్యేవిగా ఉండవు. అవును దేవుడు గొప్పవాడు. అజేయుడు, శాశ్వతుడు, అచ్యుతుడు! కానీ ఆయనతో ముడి వేసుకోవడం వల్ల ఆయినంత వారైన వారిని గురించి చెప్పకోవాలి. కొంతమంది ఎంతటి సన్నివేశంలోనూ, మునగకుండా తేలి వస్తూంటారు. ప్రహ్లాదుడు, అంబరీషుడు, హరిశ్చంద్రుడు, నలుడు, ధర్మరాజు ఇలా తేలి వచ్చినవారే! దేన్ని పట్టుకుంటే ఎప్పుడు తేలి ఉంటామో అది పట్టుకోవడం వలన వారు అలా ఎప్పుడు తేలి ఉన్నారు. అది పట్టుకోకపోయినట్లయితే మునిగిపోవడమే!

## 570 అజితః

అజితః అంటే సమస్తమును జయించిన వాడు. ఏసుక్రీస్తు అలా జయించినవాడు. ఆయన భగవంతునితో ముడి పెట్టుకుందామని బాగా 40 రోజులు తపస్సు చేసిన తర్వాత, 'సృష్టిలో ఎంత ఆకర్షణీయమైన విషయం వున్నా సరే, అదికాక కేవలం భగవంతుణ్ణే పట్టుకుని వుంటాను, వదలను', అని నిర్ణయం చేసికుని వచ్చాడు కొండదిగి. కొండదిగి రాగానే భూగోళానికంతా చక్రవర్తి అయ్యే అవకాశం వచ్చింది. పోనీ తీసుకుంటే బానే వుంటుంది కదా అనిపించదూ? త్యాగరాజు 'రాముడు తప్ప నాకిక ఏమీ లేదు' అని అనుకోగానే, తరతరాలకూ సరిపడ సంపద పంపించేస్తారు ఇంటికి. ఆయనకి పెద్ద సందిగ్ధం, పుచ్చుకోనా వద్దా అని. అలాగ మనం భగవద్భక్తిలో బాగా నిలబడదాం అనే దీక్ష పుచ్చుకోగానే, చూద్దాం అన్నట్లుగా ఒకటి వస్తుంది, ఏమాత్రం దీక్ష పుచ్చుకున్నాడని? జారితే ఇక అంతే సంగతి. జారకుండా వున్నట్లయితే, తెరవలె, తెరమీద బొమ్మ కూడా తెరతో ముడిపడి వుండటం చేత, అంత అజేయంగానూ వుంటుంది. అలా అజేయులుగా మనం మిగిలి వుండడానికి అవకాశమున్నది. మామూలుగా 'దేవుడా దేవుడా' అంటూంటాం. కానీ సమస్య వచ్చినప్పుడు బేర్ మంటాం. సమస్యలు లేనప్పుడు దేవుడి గురించి బోలెడు కబుర్లు చెప్పుకోవచ్చు. సమస్యే దేవుడుగా భావించాలనీ చెప్పుకోవచ్చు కమ్మగా. కానీ నిజంగా సమస్య వచ్చినపుడు సమస్యే దేవుడుగా భావన వున్నదా! ఉంటేనే లెక్క. లేకపోతే లేదు. అదీ నిజమైన పరీక్ష! రాముడు అలా దర్శనం చేశాడు. 'రేప్పొద్దున్న చక్రవర్తిని చేస్తారుట' అంటే మనస్సెలా వుంటుందీ? అరగంటలో చక్రవర్తి అవ్వవలసిన వాణ్ణి 'అడవులకి వెళ్ళాలిరా' అంటే ఎలా వుంటుందీ? ఎట్లాగో లేదుట. మామూలుగా వున్నాడుట ఆయన. ఆయనకలా ఎందుకయ్యిందీ అంటే అంతకు ముందే 'యోగవాసిష్ఠం' అంతా అయిపోయింది. కావలసిన బోధంతా అయిపోయింది. రాముడు అమ్మవారిని వివాహం చేసుకొనక మునుపే తత్త్వం అంతా పారం చేశేస్తాడు. చేశాక, 'ఇక ఎందుకు ఈ శరీరం లో, మనం ఏమి చేయాలి కనక, ఏమి చేయనక్కర లేదు. ఊరికే, ఓ మూల పడి ఉందాం' అనుకుంటాడు. 'వాడే అన్నీ చేసుకునేవాడు, నా రూపంలో కూడా వాడే ఉన్నాడు, వాడే అంతా అనుకుని,' రాజుకి ఉండాల్సిన రజోగుణం దాటి, సత్త్వగుణం దాటి, గుణాతీత స్థితిలో కూర్చుంటాడు. అటువంటి వాడికి రాజ్యం ఇస్తామంటే సరే, అన్నాడు. ఇవ్వమంటే సరే, అన్నాడు. మనకు అలా వీలు పడుతుందా, పడదు. ఎందుకంటే మనకు ఇంకా యోగవాసిష్ఠం అవ్వలేదు కాబట్టి. వశిష్ఠునిచే చెప్పబడ్డ యోగం కనుక అది యోగవాసిష్ఠం ! యోగం అంటే తత్త్వం తో అనుసంధానం చెంది ఉండడం! అలా అనుసంధానం చెంది ఉన్నవాడికి పడిపోవడం ఉండదు. పడిపోయినంత పరిస్థితి వచ్చినా రక్షింపబడతాడు. లేకపోతే ఒక మానవుడు

సముద్రం మీద వంతెనగట్టడం, లంకకు వెళ్లడం సామాన్యమా? మనం రాముడిని మానవుడు గానే తీసుకుందాం. ఎందుకంటే ఆయన ఎక్కడా మానవాతీత శక్తులు ప్రదర్శించలేదు. కానీ, తన చుట్టూ ఉండే సృష్టిలో నుండి తనకు సహాయ సహకారాలు అంది వచ్చాయి. తను అలా ముడి వేసుకుని ఉండడం చేత అలా జరిగింది. భక్తుడికి పడిపోవడం ఉండదు. భక్తి అంటే దేవుడితో పీటముడి వేసుకుని కూర్చోవడమే! దానిని ఎవరూ విప్పలేరు. ఏమి వచ్చినా, నువ్వే అంతా నువ్వే. కనిపించేవీ, చేసేది అంతా నువ్వే. కొట్టినా, తిట్టినా, కష్టపెట్టినా నేను మాత్రం నీతోనే ఉంటానని మొండికేస్తాడు. అలా భక్తి చేత ఆ మొండితనం, ఆ 'అజేయ స్థితి' వస్తుంది. ఏసుక్రీస్తు, రాముడు అదే చూపారు. రాముడికి ఎంత సహకారం లభించింది! తన సైన్యంలో ఉండే ఓ రెండు కోతులకి ఎప్పుడో చిన్నప్పుడే 'నీళ్ళల్లో వీళ్ళు ఏమి పారేసినా తేలాలి' అని వరం ఇవ్వబడినదట. వాళ్లొచ్చి ఈయన team లో చేరడంతో రాళ్లన్నీ తేలాయి. లేకపోతే మునిగిపోతాయి. అలా ఆయనకు ఎందుకు కలిసి వచ్చింది? వాడితో ముడిపడి ఉండడం వలన! కలసివస్తే మేమూ అలాగే ఉండగలం అంటాం. కానీ వాడికలా ఎందుకు కలిసి వచ్చింది? నీకెందుకు కలిసి రాలేదు? రావణాసురుడు కలలో కూడా లంకకి రాముడిలా వంతెన కట్టి వచ్చేస్తాడు అని అనుకోలేదు. కానీ వీలు పడ్డది. ఎక్కడికక్కడ రావణుడు ఎన్ని వ్యూహాలు పన్నినా, రాముడు ఒక ప్రణాళిక ముందే ఉండి ఛేదించలేదు. తను చేయాల్సింది చేస్తుంటే, రావలసిన సహాయం అంతా వచ్చి, సన్నివేశాలు అన్నిటిలో ఆ ధర్మము దైవము వచ్చి రక్షించేసింది. అందుకు చదువుకోవాలి రామాయణం. రాముడు మానవుడు అనుకుని చదువుకోండి. యుద్ధంలో రాముడి పని ఇహ ఇంతటితో సరి, అనే సన్నివేశాలు ఎన్నో వచ్చినాయి. కానీ రాముడితో సంబంధం లేకుండానే ప్రకృతి శక్తులు వచ్చి, చొరవ చేసుకుని పనులు చేసేసి, నమస్కరించి వెళ్లిపోయినాయి. యోగికి దైవీశక్తులు కూడా నమస్కరిస్తాయట. ఎందుకనీ? యోగం అంటే దైవంతో కలిసి ఉండటం కనుక! ఆ దైవం దైవీశక్తులకు కూడా స్వామి కనుక, దైవంతో ఉన్నవాడికి కూడా అంత గౌరవాన్నీ ఇస్తాయి. ఓ police commissioner car లో వెళుతుంటే ఆయనతో పాటు నీకు కూడా సలాములు కొడుతూ ఉంటారు. పదిసార్లు ఆయనతో తిరిగి, 11వ సారి మీరు ఒక్కరే వెళ్లినా వాళ్ళు సలాములు కొడుతూ ఉంటారు. ఎందుకని? commissioner గారి స్నేహితుడని. అలాగే దైవానికి సన్నిహితుడైన వాడికి సృష్టిలోని శక్తులన్నీ కూడా సహకరిస్తాయి. అదే గురువు చుట్టూ అందరు దేవతలూ సహకరించి ఉంటారని చెప్పడం లో ఉద్దేశ్యం! అందుకే ఏ దేవతా మంత్రాన్ని అయినా గురువు ఇవ్వగలుగుతాడు. దేవతా మంత్రం కన్నా గురువు పెద్దవాడు. ఎందుకంటే గురువు మొత్తంతో అనుసంధానం చెంది ఉంటాడు. సమస్త దేవతలకీ ఆధారభూతమైన తత్వానికి తాను ప్రతీకగా ఉన్నాడు కాబట్టి. తాను దేనియందు నిలబడి ఉన్నాడో దానికి మార్గం కూడా తాను చూపగలడు. అలా మనం తీసుకుంటే మనం అజేయంగా

నిలుస్తాం. అలా కాకపోతే అజేయత్వం అనేది రాదు. అందుకని అన్ని మార్గాలలోకి యోగమార్గం అత్యుత్తమమైన మార్గంగా చెప్పారు. యోగం అంటే తత్త్వం తో కలిసి ఉండడం. అదే కృష్ణుడు అర్జునుడ్ని 'నువ్వు యోగి అయిపో బావుంటుంది' అంటాడు. 'యోగీ భవ అర్జున' అంటాడు. వాడితో ఎలాగైనా సరే జతపడి మాత్రం ఉండు. అదే యోగం! భావంతో గాని, నామంతో గాని, శ్వాస ద్వారా గాని ఎట్లా అయినా సరే జతపడు. ఎట్లా జతపడ్డావు అన్నది ముఖ్యం కాదు. జతపడి ఉన్నావా లేదా అనేది ముఖ్యం. అలా జతపడి ఉన్నంతసేపు తేలుతూ ఉంటావు. తేలుతూ ఉండడం వల్ల అజేయంగా ఉంటావు.

## 571 కృష్ణః

ఒక్కోసారి ఒక్కో భావం లో అర్థముంటుంది ఈ నామానికి. ఒక్కో తత్త్వంగా ఉంటుంది. ఇక్కడ కృష్ణ అంటే లోతు తెలియనివాడు, అంతు తెలియనివాడు అని అర్థం (mysterious). కృష్ణుడి లోతు ఎవరికీ తెలియదు. కృష్ణః అనేది భగవంతుని నామాలలో ఒకటి. అది కృష్ణుడికి కూడా పెట్టారు. కృష్ణుడి అవతారానికి ముందు కూడా కృష్ణః అనే నామం ఉన్నది. రాముడి అవతారానికి ముందు నుండే రామః అనే నామం ఎలా ఉన్నదో అలా భగవంతుని తత్త్వంలో కృష్ణతత్త్వం ఒకటి ఉన్నది. అంటే కనపడని వాడు అని ఇదివరకు చెప్పకున్నాం. ఇప్పుడు లోతైన వాడు అని చెప్పకుంటాం. అంటే సంపూర్ణమైన అవగాహన చేసుకోలేని వాడని. ఎందుకనీ? అవగాహన చేసుకునేవాడు కూడా అందులోంచి వచ్చాడు కాబట్టి! అందులోంచి వచ్చినవాడు దాన్నేం అవగాహన చేసుకుంటాడు? అల సముద్రాన్ని అవగాహన చేసుకుందామని సముద్రంలోకి వెళితే అసలు అలే ఉండదు కదా, సముద్రమే ఉంటుంది. అవగాహన చేసుకునేవాడు దేని గురించి అవగాహన చేసుకుందాం అనుకుంటున్నాడో, దానిలో కలిసిపోయేసరికి, అవగాహన చేసుకునేవాడు లేకపోవడం చేత దేన్ని అవగాహన చేసుకోవాలో అది అవగాహన కాదు. అందుకని భగవంతుడిని గురించి పూర్తిగా చెప్పడం ఎవరివల్ల అయ్యే పని కాదు. నీ గురించి ఎవరూ చెప్పలేరు అంటే మొత్తం అంతా నువ్వు ఎక్కడ చూశావు? నీ మొత్తమే వాడి లోంచి వచ్చింది. నువ్వు వాడి లోకి వెళ్ళిపోతే నీకు అర్థం కాదు. నువ్వు వాడి లోంచి బయటకు వచ్చినాక నువ్వు మొక్కగా వస్తావు. మొక్కకు మొత్తం తెలియదు. మన వరకు నిద్ర అవగాహన చేసుకుందాం అనుకోండి, అవగాహన చేసుకుంటున్నంతసేపూ నిద్ర ఉండదు. నిద్ర వచ్చాక అవగాహన చేసుకునేవాడు ఉండడు. ఇక నిద్ర అవగాహన ఎప్పుడయ్యేను? అదీ mystery! కృష్ణుడి గురించి అవగాహన చేసుకుందాం అనుకున్న వారంతా అలా బోల్తా పడ్డవాళ్లే. ఎందుకంటే ఆ బావిలో దూకితే అలా పోతూనే ఉంటావు. 'ఇక నేలకు చేరానులే' అని ఏమీ ఉండదు. మనందరికన్నా ముందు వచ్చినాయన బ్రహ్మగారున్నారే, వారు అలా దిగారుట. కమలం చూసి మనల్ని ఇందులో ఎవరు కూర్చోబెట్టారు అని, చూస్తే కమలం గొట్టం కనిపించింది. ఇది ఎక్కడ నుండి వచ్చింది చూద్దాం అని, అందులో దిగి అలా పోతూ పోతూ ఉంటే ఎన్నాళ్ళయినా అది తెమలడం లేదు. అంతకంతకు భయంకరమైన చీకటి కమ్మేసి, భయమేసి 'ఇది ఎక్కడ నుండి అయితే మనకెందుకు, మనల్ని ఎందులో కూర్చోబెట్టారో అక్కడే కూర్చుంటే మంచిదని' మళ్లీ తన స్థానంలోకి వచ్చి కూర్చున్నారట. అంటే 'ఇది లోతు తెలియని విషయం' అని చెప్పడంలో ఉద్దేశం. 'ఇది లోతు తెలియని విషయం. తెలుసుకుందామనుకోమాక. నీకు ఏదో నీకు తెలిసినంతవరకు సంతోషించు'. అదీ

కృష్ణుడు! భీష్ముడు సహస్రనామాలలో కృష్ణః నామం వాడి, కృష్ణుడిని చూపించాడు. అంటే నీ లోతు తెలియదని చెప్పడం! 'నీ లీలలు తెలియగ మా తరమా' అంటాడు నారదుడంతటివాడు. ఎందుకంటే అక్కడ తెలుసుకోవడానికి కావలసిన తెలివి కూడా అందులోంచి పుట్టిందే కాబట్టి, అవకాశం లేదు. అందుకే తెలిసినవాడు 'నాకు తెలిసింది' అని అనడు. 'నాకు తెలియదు' అని తెలిసినవాడు తెలిసినవాడట. నాకు తెలియదని తెలిసి, తెలియదనీ చెప్పడుట. తెలిసిందనీ చెప్పడుట. రెండూ తెలియవు. తెలిసిందన్నా అహంకారమే, తెలియలేదన్నా అహంకారమేనట. ఉంటాడట అంతే! అవతల వాడు ఎంత పుచ్చుకుంటే అంత పుచ్చుకోనిస్తాడట. వీడు ఎంత అనేది వాడికి తెలియదు. ఎందుకంటే వీడు ఎప్పుడూ వాడితో ఉంటాడు. వాడి లోతే వీడి లోతు. వీడికి సొంతం లోతులేం లేవు. అందుకనే ప్రహ్లాదుడిని ఎక్కడ పారేసినా బయటికి వచ్చేస్తూ ఉంటాడు. అర్థం కాదు. భక్తుడితో వచ్చే గొడవ అది. భక్తుడి లోతు తెలియదు. సన్నివేశం బట్టి పెరిగిపోతూ ఉంటాడు. లేకపోతే మామూలుగా ఉంటాడు. హనుమంతుడు లోతు ఎవరికి తెలుస్తుంది? దైవంలోతే హనుమంతుడు లోతు. హనుమంతుడికి తాను లేడు. అందుకనే నువ్వింతటి వాడివని చెప్పాలి. లేకపోతే ఆయనకు తెలియదు. ఎందుకంటే తాను లేడు కదా. దాటగలవా? అంటే ఆహా దాటగలనా, అంటాడు. దాటేస్తాడు. దాటగలడా అంటే వందేమిటి, 600, 800 ఎంత దూరమైనా దాటగలడు. కాకపోతే తన గురించి తను ఆలోచించడం ఎప్పుడో మానేశాడు హనుమంతుడు. ఎందుకని? తను రాముడు గురించి ఆలోచిస్తాడు కాబట్టి. ఆయనలో రాముడే నిండి ఉన్నాడు. 'నువ్వు రామభక్తుడివి' అంటే 'ఆహా! అలాగా!' అంటాడు. మనమైతే మనమే డప్పు వేసుకుంటాం. అవతలవాడు తెలుసుకోలేడేమోనని. ఎందుకిలా మనం చెప్పుకుంటున్నాం అంటే మన గురించి మనకి చాలా భావన ఉన్నది కాబట్టి. భక్తుడికి తన గురించి భావనే ఉండదట. తను కరిగి, వాడుంటాడక్కడ. మనమో, పేరు వాడిది, ఊరు మనది. రెండు ముక్కలు గురువుగారి గురించి మాట్లాడి, మూడో ముక్కలో గురువుగారితో మనల్ని చేరుస్తాం. మనకి గురువుగారికి మధ్య జరిగినవి చేరుస్తాం. ఇంకొంచెం దూరం వెళ్లేసరికి గురువుగారిని ఇహ వదిలేస్తాం. అంతా మన గురించే. ముందంతా ఆయనతో మొదలుపెట్టి, నెమ్మదిగా పక్కన మనం చేరి, మనం మాటల్లో పెరిగిపోతూ ఉంటాం. ఇక ఆయన పక్కనే. ఇలా ఉంటుంది. అసలు భక్తుడు తన గురించి మాట్లాడడానికి తానుండడు కదా, వాడే ఉంటాడు. వేణువు తనంత తాను ఊదేది ఏమీ లేదు. వాడు ఊదితే ఊదుతుందది. వాడు ఊదకపోతే ఏమీ లేదు. అందుకే ఆయన చేతి పనిముట్టు అయిందది. Instrument in the hands of God. తనదంటూ ఏమీ లేకుండా అయిపోయి, వాడే చోటు రూపంలో అందులో ఉంటాడు. అప్పుడు ఇంక దాని లోతు ఏమిటి? వేణువుకి వాయించే వాడి లోతే దాని లోతు. 'ఏమి బాగా పాడుతోంది' అంటే వాయించేవాడి బట్టే కదా. లోతు తెలియకుండా దైవం ఉన్నాడు అనేది ఒకటి. లోతు

తెలియకుండా దైవ భక్తుడు ఉన్నాడు అన్నది రెండు. నువ్వు కూడా నీకు తెలియనంత లోతులోకి వెళ్లాలనే CVV గారు 'dip deep' అన్నారు. నీ గురించి మానేసెయ్యాలి. మాస్టారు శంఖారావంలో వ్రాశారు. వ్యాయామం చేసేవాడు మధ్య మధ్యలో కండలు చూసుకుంటూ ఉంటాడట ఏమాత్రం పెరిగిందో, అని. అలా ఉంటుంది మన వ్యవహారం. మైత్రేయుడు తన గురించి ఏమి చెప్పుకున్నాడు? శుకుడు పరీక్షిత్తుకు భగవంతుడు గురించి కదా చెప్పాడు. అదీ భాగవతం! తన గురించే ఏం చెప్పుకోలేదు. వశిష్ఠుడు రాముడికి బోలెడు చెప్పాడు. తన గురించి ఏం చెప్పుకున్నాడు? తన గురించి గుర్తున్నంతసేపు దైవం గురించి గుర్తు లేనట్లే. దైవం గురించి గుర్తున్నంత సేపూ తను లేనట్లే. అందుకే కృష్ణుడు 'నువ్వుంటే నేను ఉండను, నేనుంటే నువ్వు ఉండవు' అని చెప్పాడు. నువ్వు నాలో నిండిపోతే, నీలోంచి పనిచేస్తూ ఉంటాను. నువ్వు నువ్వుగా పనిచేస్తుంటే నేను పడుకుని ఉంటాను. అంటే నేను లేనట్లే! అందుకే పరమ గురువు దేవాపి 'ఒక ఒరలో రెండు కత్తులు ఎలా ఇమడవో భక్తి సామ్రాజ్యం కూడా అంతే' అంటారు. భగవంతునికి కైంకర్యం చెందడం వలన భక్తుడి రూపంలో భగవంతుడు ఉంటాడు. మరి భక్తుడికి వేరే అస్తిత్వం ఉండదు. 'Either you or god exist. Both cannot exist'. అర్జునుడు సమర్పణ చెందినంత సేపూ నారాయణుడుంటాడండీ. సమర్పణ లేకపోతే నరుడు ఉంటాడండీ. అందుకే నరుడు పనిచేస్తుంటే నారాయణుడు తపస్సు చేసుకుంటాడు, నారాయణుడు పనిచేసుకుంటూ ఉంటే నరుడు తపస్సు చేసుకుంటూ ఉంటాడు అని చెప్తారు. అదే మాస్టర్ గారు కూడా అన్నారు. 'నువ్వెనా చెయ్యి, నన్నన్నా చేయనీ' అని. ఎవరన్నా అంతా తికమకగా చేస్తుంటే 'ఒరేయ్ పూర్తిగా నువ్వు నీకు తోచినట్లయినా చెయ్యి లేదా నేను చెప్పింది చెప్పినట్లు చెయ్యి. కొంత నాది, కొంత నీది కలిపితే కంపు అవుతుంది' అని చెప్పేవారు. అలా చేస్తే మనకి తెలియకపోవచ్చు. కానీ అత్యంత లోతుల్లోంచి విషయాలు బయటకు వచ్చి రక్షిస్తూ ఉంటాయి. 'పెద్దల మాట చద్ది మూట' అనడానికి కారణం ఏమిటంటే, ఈ చద్దన్నం ఏం బాగుంటుందిలే అనిపిస్తుందిప్పుడు. అదే మూట కట్టుకుని ఎండలో వెళ్లి మధ్యాహ్నం 12 గంటలకు కరకర ఆకలి వేసినప్పుడు, ఆ చద్దన్నం విలువ తెలుస్తుంది. అంతవరకు తెలియదు. అలాగే పెద్దలు ముందుగా చెప్పిన మాట ఇవాళ మన మేధస్సుకు నచ్చకపోయినప్పటికీ, దాన్ని అందుకుని ముందుకు వెళ్లడంలో అంతకుముందు తెలియని లోతు అప్పుడు తెలుస్తుంది. అలా లోతులు తెలియబడని వాడు దైవము. లోతులు తెలియని వాడు భక్తుడు. అలా లోతులు మనలో పెరగాలంటే మన గురించిన డబ్బా పక్కన పెట్టాలి. మన డబ్బాకి లోతు ఇంతే అని తెలుస్తుంది. మూడు ముక్కలు మాట్లాడితే నాలుగవ ముక్కలో మన గురించే. భక్తుడు దైవం గురించి తప్పమాట్లాడడు. అప్పుడు వాడి లోతులు ఎవరికీ తెలియదు. తనకి కూడా తెలియదు. హనుమంతుడి

లోతులు ఎవరికీ తెలియలేదు. నారదునికి కూడా తెలియలేదని బోలెడు కథలలో చెప్పకున్నాం. అర్జునుడికీ, భీముడికి కూడా తెలియలేదు.

## 572 ధృఢః

ఎప్పుడూ స్థిరంగా ఉంటాడు. ఎటువంటి పరిస్థితులలోనైనా బాగా ఎప్పుడు స్థిరంగా ఉండే ఒకాయన కనిపించాడనుకోండి భగవంతుడు అక్కడ ధృఢః అనే తత్త్వంలో ఉన్నాడు అని గుర్తించాలి. భగవంతుడు ధృఢంగా, స్థిరంగా ఉంటాడని చెప్పనక్కర్లేదు. అటువంటి గుణం కనిపించిన వాళ్ళ వద్ద 'ఆహా... భగవంతుని ధృఢతత్త్వం ఇక్కడ కనిపిస్తున్నది' అనుకోవాలి. కొంతమంది ఏ పరిస్థితిలోనూ చలనం లేకుండా ఉంటారండీ... దానినే భగవద్గీత రెండవ అధ్యాయంలో 'స్థితప్రజ్ఞుడు'గా కృష్ణుడు చెప్పాడు. అంటే ప్రజ్ఞ యందు స్థితి పొందినవాడు. ఇక అక్కడి నుండి కదలడు. ఇక వచ్చేదల్లా పోయేదే! సన్నివేశాన్ని కాలం అలా పట్టుకొస్తూ ఉంటుంది. అలా పట్టుకు వెళ్ళిపోతూ ఉంటుంది. మధ్యలో మనం అలా చూస్తూ ఉంటాం అంతే! అది అంతకు ముందు లేదు, ఆ తర్వాత లేదు. ఆ సమయంలో ఉన్నట్లుగా ఉన్నది. అది అట్లాగే ఉండదు. సినిమాలో ఒకటే బొమ్మ వేసి ఉంచరు కదా. అలా బొమ్మలు మారిపోతూ ఉంటాయి. కాలం అనే ప్రవాహంలో ఇదంతా మారుతూ ఉంటుంది. ఈ మార్పు దేని మీద జరుగుతున్నదో దానితో అనుసంధానం చెంది ఉన్నామనుకోండి, ధృఢత్వం వస్తుంది. అందుకనే Bible లో 'It came to pass' అంటారు. అంటే ఏ సన్నివేశమైనా వెళ్ళిపోవడానికి వస్తుంది. ఉండిపోవడానికి రాదు. కాసేపు ఉంటుంది, మళ్లీ వెళ్ళిపోతూ ఉంటుంది. వచ్చిందంతా వెళ్ళిపోతుంది. వచ్చిన వాళ్లంతా వెళ్ళిపోతారు. వచ్చి, వెళ్లిపోయే వాటి వెనక నడుస్తున్న కథలో ఉన్నాం అనుకోండి. అంటే ఇప్పుడు గోదావరిలో నీళ్లు వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. ఏంటి గోదావరి? అందులో ఎప్పుడూ ఉండే ప్రవాహం. ప్రవాహం ఆధారంగా నీళ్లు కదులుతున్నాయి. ఎన్ని వేల కిలోమీటర్లు దానంతట అది పరిగెడుతూ ఉందంటే ఎట్లా పరిగెడుతుంది? Current of life జీవన ప్రవాహం. జీవనదీ ప్రవాహం. ఏమీ మిగలదు దానిమీద. అట్లా పోతూ ఉండేవే అన్నీను. దానిమీద తేలుతూ ఉండేవే చూస్తాం తప్ప, ప్రవాహాన్ని చూడం. ప్రవాహాన్ని చూసే వాడికి తెలుసు అన్నీ వెళ్ళిపోతాయని. ఈ కనపడేదంతా ఇలా ఉండదు. మార్పు చెందే దానిలో, మార్పు చెందనిది ఒకటి ఉన్నది. దానియందు మనస్సు లగ్నం అయితే! తిరగలిలో పైరాయి తిరుగుతూ ఉంటే కింద రాయి అలా ఉంటుంది తిరగకుండా. కింద రాయి కూడా తిరిగితే పిండి రాదు. అలాగే ఆయన స్థిరంగా ఉంటే ఆవిడ పైన ఆడుతున్నది. తిరగలిలో పైరాయి అమ్మవారు, కింద రాయి అయ్యవారు. అందుకే అమ్మవారిని 'అనపగామిని' అంటారు. క్షణం కూడా ఒక పద్ధతిగా ఉండని చంచల. లక్ష్మి 'చంచల' అంటారు కదా. చైతన్యానికి కదలిక స్వభావం. సత్త్వానికి స్థితి స్వభావం. తిరగలిలో పైరాయి తిరిగి, కింద రాయి తిరగకుండా ఉండడం వల్లనే పిండి వలె మనం బయటకు

వస్తున్నాం. మనలో కూడా తిరిగేది కొంత, తిరగనిది కొంత ఉన్నది. కదిలేది కొంత, కదలనిది కొంత ఉన్నది. అందుకే మనం కూడా అర్ధనారీశ్వరులము. మనస్సు, ఇంద్రియములు, శరీరం వీటికి కదలిక ఉన్నది. వీటన్నిటినీ కదిలించేది మనలో ఉన్నదే, అది మాత్రం స్థిరంగా ఉంటుంది. మనం తిరిగే వాటిలో ఉంటామా, తిరగని వాటిలో ఉంటామా? ఎంత మారినా అద్దం చూసుకున్నప్పుడు మనం మారామని మనకు అనిపించదు. ఎవరో తర్వాత చెప్తేనే తెలుస్తుంది మనకు. లేదా కిందటి ఏడాది ఫోటో ఈ ఏడాది ఫోటో పోల్చి చూసుకుంటే తెలుస్తుంది. రోజూ అద్దం చూసుకున్నా మనలో మార్పు రాలేదు అలాగే ఉన్నాము అని ఎందుకనుకుంటామో తెలుసా? అట్లాగే ఉండేవాడు ఒకడు మనలో ఉన్నాడు. పై మార్పులు పైన జరుగుతుంటే, మారకుండా ఉండే భాగం మనలో ఉన్నది. కాబట్టి మారకుండే భాగంతో మనం ఏకీభావం చెంది ఉండడం చేత బాగానే ఉన్నాం. అట్లాగే ఉన్నాం అని అనుకుంటాం. కానీ మారిపోతోంది కదా. మారిపోతున్నాం అని మనకి తెలియడం లేదు కదా. మారని వాడిగా కూడా నువ్వు ఉన్నావు. కాబట్టే మారిపోతున్న దానిలో నువ్వు ఉండవు కాబట్టి, మార్పు నీకు తెలియదు. అంతేకాదు ఎంతోమంది వస్తూంటారు, పోతూంటారు. 'చావక మానెడి వారి భంగి ఈ చచ్చిన వాడికేడ్చెదరు' అన్న పద్యం ఉంది కదా. ఎంతోమంది చచ్చిపోవడం చూస్తాం. ఆ నిమిషంలో మనకు కూడా మనము పోతాం అనిపిస్తుంది. మరుసటి రోజు నుండి అంతా మామూలే. మనం పోతాం అన్న భావన మనకి రాదు. ఎందుకంటే నిజంగా మనం పోము. శరీరమే పోయేది. ఇది సత్యం! ప్రజ్ఞకి మార్పు లేదు కనుకనే అద్దంలో మనల్ని మనం చూసుకున్నా మార్పు కనిపించదు. ఎన్ని చెప్పినా కొన్ని విషయాలలో మనం మారం. అందులో స్థితప్రజ్ఞత ఏర్పడిపోయిందన్నమాట. మనలో కాలం కూడా మార్చలేనిది ఒకటి ఉన్నది. బాగా దెబ్బలు తిన్నప్పుడు మన స్వభావంలో మార్పు వస్తుంది. కానీ 'నేను' అనే ప్రజ్ఞ లేదా 'ఆత్మతత్త్వం'లో మార్పు ఉండదు. అది దేనికీ లొంగదు. ఎందుకంటే అది కాలానికి అతీతమైనది. భగవత్ తత్త్వం కాబట్టి. దానియందు మన మనస్సు లగ్నం చేసుకుని అదీ మనం అని తెలుసుకున్నాం అనుకోండి, ఇక వీడు పిడి రాయల్లే అలాగే ఉంటాడు. పిడులు విరిగిపోతుంటాయి, పగిలిపోతుంటాయి తప్ప రాయి మాత్రం అలాగే ఉంటుంది. తరతరాల నుండి అదే రాయి. అందుకు పిడి రాయల్లే అలాగే ఉన్నాడు అంటూ ఉంటాం. అలా స్థితప్రజ్ఞుడనేవాడు వాడి మీద నుండి ఏం వచ్చినా చలనం లేకుండా ఉంటాడు. వాడికి ఏమీ కాదు. అంత ధృఢంగా ఉంటాడు. భగవంతుడు ఉన్నంతకాలం భగవత్ భక్తుడు శాశ్వతంగా ఉంటాడు. లయమైపోయినప్పుడు ఆయనలో వెళ్ళి ఉంటాడు. మూత తెరవగానే ముందు బయటికి వచ్చేస్తాడు. అది బ్రహ్మ దర్శనం! బ్రహ్మ కి సృష్టి చేయాలి, బోలెడు మందిని తయారు చేయాలంటే ఎలా అనుకుంటాడు. తీరా జాగ్రత్తగా ధ్యానం చేసుకుని చూస్తే వీళ్లంతా ఆయన లోపలే ఉన్నారుట. ఊరికే అలా తలుపేసి ఉంచాడు. బ్రహ్మగారు తలుపు. ఊరికే తాను అలా

తెరుచుకుంటే అలా బయటకు వచ్చేస్తారు. అది జీవులు శాశ్వతులు అని చెప్పడంలో ఉద్దేశ్యం. 'దేహో దేవాలయ ప్రోక్తః జీవో దేవః సనాతనః' అనే శ్లోకం ఉన్నది. అందుకే బ్రహ్మగారు తలుపు తీయగానే నలుగురు బయటికి వచ్చేసారట. వారే సనక సనందనాదులు. సృష్టి తయారు చేయకుండా ఎలా వచ్చేస్తారు మరి? అలాగే సప్త ఋషులు, 10 మంది ప్రజాపతులు బయటపడ్డారు.. ఊరికే నేను సృష్టిస్తాననే పేరు తప్ప, అసలు అంతా ready గానే ఉంది అనుకుంటాడు బ్రహ్మ. అలాగ స్థితప్రజ్ఞుడిగా నిలబడిన వాడు ఆ ప్రజ్ఞయందు స్థితుడై ఉండడం వలన, శాశ్వతంగా ఉంటాడు. అదే మనకు అక్షర పరబ్రహ్మ యోగంలో ఇవ్వడానికి శ్రీకృష్ణుడు ప్రయత్నం చేశాడు. మంద్ర గీతలోనూ, శంఖారావం లోనూ మాస్టారు చెప్పిన ఎనిమిదవ అధ్యాయం బాగా చదువుకుంటే మనం ఎలా శాశ్వతులమో మనకు బాగా తెలుస్తుంది. ఇప్పుడు ఉండే దేశకాలమాన పరిస్థితులలో మన బుర్రలకు చక్కగా అర్థమయ్యే పద్ధతిలో ఇచ్చారు. అంత బాగా ఎవరూ ఇవ్వలేరు. అది సత్యం! మాస్టర్ గారి శంఖారావం, తరింపుకు సరాసరి మార్గం! ఇంకో తమాషా ఏమిటంటే, శంఖారావం లో చెప్పినది మంద్ర గీతలో చెప్పలేదు, మంద్రగీతలో చెప్పినది శంఖారావంలో చెప్పలేదు. రెండూ భగవద్గీత వ్యాఖ్యానాలే! రెండు కలిపి చదువుకోవాలి, అలా రాశారాయన. ఈ రెండు కాకుండా ఇంగ్లీషులో Mandra scripture అని ఉంటుంది. ఒకే భగవద్గీత గురించి ఒకే మనిషి నుండి మూడు వ్యాఖ్యానాలు వచ్చాయి. దేనిలోనూ repetition లేదు. అది దైవ సంకల్పం! కనుక మూడూ దగ్గర పెట్టుకుని అక్షరపరబ్రహ్మయోగం చదువుకోండి. నేను క్షరుడను కాను, అక్షరడను అని అందులో ఇచ్చాడు కృష్ణుడు. శరీరం వదిలేసే సమయంలో 'తాను చచ్చుట కాకుండా ఈవలకు వచ్చుట' అంటే ఏమిటి? ఈ రహస్యం తెలుసుకుంటే, ప్రతిరోజు నిద్రలోకి వెళ్ళినప్పుడు సాధన చేసుకుంటే, చావకముందే ఈవలకు రావడం తెలిసి ఉండటం చేత, చావకుండా ఈవలకు రావడం ఉంటుంది. 'చచ్చుట కాక ఈవలకు వచ్చుట ఉండును' అని రాస్తారు మాస్టారు శంఖారావంలో. మనం ఏ విధంగా ధృఢంగా ఉంటామో తెలుస్తుంది. శరీరానికి ధృఢత్వం లేదు. వచ్చిపోయేది, పెరిగేదితరిగేది అయిన స్వభావం కలది శరీరం. అందుకే దాన్ని అలా శాశ్వతంగా ఉంచాలని నువ్వు చేసే ప్రయత్నంలో ఎప్పటికీ జయం ఉండదు. నువ్వు ఏ భాగంలో స్థిరం? ఏ భాగంలో అస్థిరం? స్థిర భాగంలో ఉండు. అస్థిర భాగంలో ఎందుకు ఉంటావు? రెండూ నీలోనే ఉన్నాయి. దాంట్లోకి వెళ్లి ఆడుకుని, దీనిలోకి వచ్చేస్తూ ఉండు. అది నువ్వు నేర్చుకుంటే, అది లేకపోయినా నువ్వు ఉంటావు. అస్థిరమైనది లేకపోయినా స్థిరమైన దానిలో ఉండడం నేర్చుకోవడంతో నువ్వు ఎప్పుడూ ఉండే వాడివి అని నీకు తెలుస్తుంది.

## 573 సంకర్షణః

దేహాలను విచ్ఛిన్నం చేసేవాడు అని అర్థం. శత్రువుల దేహాలను విచ్ఛిన్నం చేసేవాడు. బలరాముడికి కూడా 'సంకర్షణుడు' అని పేరు ఉన్నది. సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలు నాలుగు చెప్తారు. అందులో సంకర్షణుడున్నాడు. ఈ తత్త్వం కారణం చేత దేహాలు విచ్ఛిన్నం అవుతూ ఉంటాయి. దేహాలు సృష్టించడం, పోషించడమే కాకుండా విచ్ఛిన్నం చేసే శక్తి కూడా భగవంతుడిదే! సమస్తాన్ని భగవంతుని యొక్క తత్త్వంగా అవగాహన చేసుకోవడం అనేది భారతీయ జ్ఞానంలోనే చాలా ఎక్కువగా గోచరిస్తుంది. దేహవిచ్ఛిన్నతి కావాలంటే సంకర్షణుడు పనిచేస్తుంటాడు. సంకర్షణుడికి ఇంకో అర్థం 'అహంకార ప్రజ్ఞ' అని. అంటే సమస్తమూ వ్యాపించిన దివ్యప్రజ్ఞ యందు మనం ఉన్నప్పుడు, మనం వేరుగా ఉన్నామని అనుకోవడం చేతే ఈ మొత్తంలో నుండి మనం వేరు పడతాం. ఈ మొత్తం అంతా ఒక్కటే. ఈ శరీరాలు, గోళాలు సృష్టిలోని సమస్త తత్త్వాలు ఒకే తత్త్వంలో తేలుతూ ఉంటాయి. వేటికి వాటికి మనము విడివిడిగా ఉన్నాం అని అనుకుంటుంటాయి. అలా విడివిడిగా ఉన్నాం అనుకోవడమే అహంకారం. ఎప్పుడైతే విడిగా ఉన్నాను అనుకున్నాడో అప్పుడు మొత్తం బలం నుండి వాడి బలం, వీడు వేరైపోతారు. చెట్టు లోంచి ఓ కొమ్మో, రెమ్మో వేరుగా వచ్చేసింది అనుకోండి... చెట్టుగా ఉన్నప్పుడు దానికి ఉన్న జీవన పరిమాణానికీ, విడివడిన తర్వాత దాని జీవన పరిమాణము చాలా తేడా ఉంటుంది. విడివడినాక దాని జీవన పరిమాణము ఎంతకాలం ఉంటుంది? అలాగే మనం అహంకారం వల్ల అంటే నేను వేరు, వీరంతా వేరు అనే భావన చేస్తాం. అదే మాయ అంటారు. ఆ మాయ కమ్మబట్టే మన కోసం అన్నట్లు పనులు చేసేస్తుంటాం. దీన్నే 'అహంకార ప్రజ్ఞ' లేదా 'ప్రత్యేకాత్మ' అంటారు. నేనొక్కడినే ప్రత్యేకంగా ఉన్నాను అనుకోవడం! సముద్రంలో ఉన్న అల తాను వేరుగా ఉన్నాను అనుకున్నా, అది సముద్రంలోనే ఉంటుంది. వేరుగా ఉన్నాను అనుకుని రాగానే, మళ్లీ తిరిగి కలిసిపోవడం ఉంటుంది. సంకర్షణ ప్రజ్ఞ ఎవరు యందు భాసిస్తూ ఉన్నదో వాళ్లు త్వరగా దేహాన్ని విచ్ఛిన్నం చేసేసుకుంటుంటారు. తన కోసం జీవించడంలో త్వరత్వరగా తన శరీరాన్ని పాడుచేసుకుంటుంటాడు. శరీరంలో సమస్త ప్రజ్ఞలు లేదా దేవతా శక్తులు, ఎవరిలో నుండి దిగి వచ్చాయో వాడికి ఆధిపత్యం కట్టిపెట్టి ఉంటే, అవి చక్కగా పనిచేస్తూ ఉంటాయి. వాడు కూడా మన శరీరంలోనే ఉంటాడు. ప్రజ్ఞలన్నీ వాడికి లొంగి ఉంటాయి. చూసేది, వాసన చూసేది, రుచి చూసేది, వినేది, గాలి పీల్చి వదిలేది, గుండె కొట్టుకునేది, Liver/ కాలేయం ఇవన్నీను. కొన్ని పని చేయవు. కొన్ని అంతంత మాత్రమే పనిచేస్తుంటాయి. ఈ ప్రజ్ఞలన్నీ లోపల ఉన్న దివ్య ప్రజ్ఞకు సమర్పిద్దాం, అనే సంకల్పంతో అనుసంధానం చెంది నరుడు పనిచేస్తుంటే, అవన్నీ సహకరిస్తాయి. వీడు

ఎప్పుడైతే పై ఆయన మాట వినడో, ఇవి కూడా వాడి మాట వినవు. ఒక్కొక్కటీ వాలిపోతూ ఉంటుంది పళ్ళు రాలినట్లుగా. అన్నీ సెలవు పుచ్చుకుంటాయి. దైవీ ప్రజ్ఞతో అనుసంధానం చెందిన వాడికి మొత్తం పని చేస్తూ ఉంటుంది. కానీ వీడికి ఈ విధంగా బండి వెళుతుంటే ఎక్కడికక్కడ ఓ చక్రం ఊడిపోయి, సీల ఊడిపోయి, ఒరిగిపోయి, అలా లాగుతూ ఎక్కడో పడిపోతూంటుంది. ఇదంతా మనలో సంకర్షణ ప్రజ్ఞ పని చేస్తూ ఉండడం వల్ల ఇలా జరుగుతుంది. నాలుగు స్థితులుగా మనం ఉన్నాం. కపిలుడు దేవహూతికి చెప్పిందిది. వాసుదేవ తత్త్వం మనలో ఉన్నది. 'వాసుదేవ సర్వమితి' అని గీత లో ఉన్నది. అంటే మొత్తం కూడా వాసుదేవునితో నిండి ఉన్నది. సమస్తము వ్యాపించిన అంతర్యామి ప్రజ్ఞ! వాసుదేవ ప్రజ్ఞ! అది మన మొదటి స్థితి. అందులోంచి మనం మాటిమాటికీ లేస్తుంటాం. ఎప్పుడైతే ఎవడికి వాడు ప్రత్యేకంగా లేస్తాడో వాడపుడు 'సంకర్షణ ప్రజ్ఞ' అవుతాడు. ఉదయాన్నే మనం నిద్రలేచినప్పుడు మనం ఎక్కడ నుండి లేచామో మనకు తెలియదు. మొత్తంలో నుండి లేస్తూ ఉంటాం. లేచిన దాంట్లో నుండి మనకు బుద్ధి. ముందు లేవగానే బుద్ధి పని చేస్తుంది. అంటే లేవగానే ఏం చేయాలి అనే దాని గురించి బుద్ధి పనిచేస్తూ ఉంటుంది. దాన్ని 'ప్రద్యుమ్న ప్రజ్ఞ' అన్నారు. ప్రద్యుమ్నుడు అంటే మనలో బుద్ధి వలె పని చేసే వెలుగు! బుద్ధిని 'వెలుగు' అంటారు. సంకర్షణుడిని 'జీవాత్మ' అంటారు. వాసుదేవుడ్ని 'పరమాత్మ' అని అంటారు. మొత్తం సృష్టిలో నిండి ఉన్న తత్త్వం, ఈ పరమాత్మ. అది నీలో నువ్వుగా పొద్దున్న లేచినప్పుడు జీవాత్మ అవుతుంది. నువ్వు లేవగానే నీకు సంబంధించిన బుద్ధి మేల్కాంచుతుంది. మొత్తం పరమాత్మ తత్త్వానికి సంబంధించిన బుద్ధి ఒకటి ఉన్నది. అది సృష్టి వెలుగు, లేక అమ్మవారు! ఆ మొత్తంలో నుండి నువ్వు లేచావు కాబట్టి ఒక మిణుగురు పురుగంత బుద్ధి, నీకు కూడా నీలో ఉంటుంది. ఎందుకంటే నువ్వు ఆ తత్త్వానికి సంబంధించిన వాడివి కాబట్టి అది నీలో లేస్తూ ఉంటుంది. దాన్ని పెంచుకోవడం కోసమే గాయత్రీ మంత్రం! మొత్తం వెలుగు, నా లోంచి బాగా వెలగాలని కోరుకోవడమే గాయత్రీ మంత్రం. 'ధియో యోనః ప్రచోదయాత్' 'మా బుద్ధులను ప్రచోదనం చెయ్యి' అని మొత్తం వెలుగును కోరుతున్నాం అన్నమాట. అంటే మొత్తం పరమాత్మ తత్త్వానికి సంబంధించిన వెలుగు ఉన్నది. సూర్యుడొకడున్నాడు. సూర్యునికి సంబంధించిన వెలుగు ఒకటి వస్తూ ఉంటుంది. వెలుగునే మనం అమ్మవారు, అంటాము. అదే మనలో బుద్ధిగా పనిచేస్తూ ఉంటుంది. ఈ బుద్ధిగా పనిచేసే దాన్ని 'ప్రద్యుమ్న ప్రజ్ఞ' అంటాం. బుద్ధి, ఇంద్రియాలతో పనిచేసేప్పుడు కూడా మనలో పని చేస్తుంటే అది 'అనిరుద్ధ ప్రజ్ఞ' అంటాం. మనం ఏదన్నా తిందాం అనుకుంటే మనకు ఇష్టమైనదైతే బుద్ధితో సంబంధం లేకుండా తినేస్తాం. అనిరుద్ధుడు ఇంద్రియాల లోనికి దిగడం లేదు. మనకు ఇష్టం అయ్యింది చూడకూడదు అని తెలిసినా చూసేస్తాం. T.V. అంతసేపు చూడకూడదు అని తెలిసిన చూస్తాం కదా. కన్నులలోనికి అనిరుద్ధుడు దిగి రాలేదన్న మాట! అనిరుద్ధుడు దిగివస్తే చూడదగ్గదే

చూస్తారు. నాలుక మీదికి అనిరుద్ధుడు దిగివస్తే శరీర పోషణకి మాత్రమే రుచులు వాడతాం. అలాగే స్పర్శలోకి అనిరుద్ధుడు దిగివస్తే అడ్డమైనవి ముట్టుకోం. ఏమి తాకుతున్నాం అనేదాని మీద శ్రద్ధ ఉండాలి. ఏది పడితే అది ముట్టుకోవడం అనేది పదార్థంతో బాగా ముడి వేసేస్తుంది.

1) నాలుక కారణంగా స్థూలంగా పదార్థం లోపలికి పుచ్చుకుంటున్నాం. కన్ను, చెవులు, ముక్కుతో పుచ్చుకునే పదార్థం కొంచెం సూక్ష్మంగా ఉంటుంది. ఈ నాలుకతో అయితే విపరీతంగా పనిచేస్తుంది. ఆ వెళ్ళేది లోపల ఏం చేస్తుందో బుద్ధి పనిచేయకపోతే తెలియదు.

2) అలాగే పదార్థాన్ని ముట్టుకోవడం స్పర్శ. ఈ నాలుక, స్పర్శ వల్లనే జన్మజన్మలుగా భూమికి/పదార్థానికి మనం ముడిపడి ఉన్నాం. అందుకే కృష్ణుడు భూమి బంధనం లేకుండా ముక్తజీవుడిగా హాయిగా బతకాలనుకుంటే రెండే చేయాలి. స్పర్శ, రుచి ఇంద్రియాల మీద నువ్వు స్వామిత్వం సంపాదించగలిగితే చాలు అంటాడు. ఎందుకంటే ఈ రెండే భూమితో సరాసరి ముడి వేసేవి. ఈ రెండు గెలిస్తే జితేంద్రయుడవు అవుతావు, అని చెప్తాడు ఉద్ధవుడికి, ఉద్ధవగీతలో. దీన్ని సాధించడానికి ప్రయత్నం చేయమంటూంటాడు. అనిరుద్ధ ప్రజ్ఞ మనలోని నాలుగవ ప్రజ్ఞ.

అందుకే నాలుక చాలా జాగ్రత్తగా వాడుకోమంటారు మనవాళ్ళు. రెంటికి వాడుతాం కదా. తిండికీ, మాటకీనూ. కనుక వాసుదేవ ప్రజ్ఞ నుండి సంకర్షణ ప్రజ్ఞ, సంకర్షణ ప్రజ్ఞ నుండి ప్రద్యుమ్న ప్రజ్ఞ, ప్రద్యుమ్న ప్రజ్ఞ నుండి అనిరుద్ధ ప్రజ్ఞ. అనిరుద్ధ ప్రజ్ఞ ఉన్నవాడిలో భగవంతుడు హృదయం వరకు వచ్చి ఉంటాడుట. ఉండి పంచేంద్రియముల ద్వారా ఆ వెలుగే ప్రసారమవుతుంది. ఏదైతే వాసుదేవతత్త్వం సంకర్షణత్వం చెందిందో( సంకర్షణత్వం చెందడమంటే అదే తత్త్వం వ్యక్తమవటం.) అది సముద్రం అలగా వ్యక్తమైనట్లు. తేడా ఏం లేదు. దానితో కలిసి ఉన్నాను అనే భావన ఉండి ఉంటే, అప్పుడు నీ బుద్ధి కాకుండా మొత్తం బుద్ధి పనిచేస్తుంది నీలో. మనకి మహాత్ములకి తేడా ఏంటంటే, మహాత్ములు మొత్తం వ్యాపించి ఉన్న ప్రజ్ఞతో అనుసంధానం చెంది ఉండడం చేత, ఈ మొత్తం తత్త్వానికి ఉండే వెలుగు అదే గాయత్రి, ఆ వెలుగు వాళ్లకి ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. అందుకనే వాళ్ల దగ్గరకు పోయి మనం సలహాలు, సందేహాలూ అడుగుతూ ఉంటాం. ఎందుకంటే మనమేమో వేరు పడిన ముక్కలం, ఆయనేమో మొత్తంతో కలిసి ఉన్న తత్త్వం. కాబట్టి మన బుద్ధి కన్న ఆయన బుద్ధి ఎక్కువ చురుగ్గా ఉంటుంది, ఎక్కువ వ్యాపనం చెంది ఉంటుంది, ఎక్కువ లోతు కలిగి ఉంటుంది, ఎక్కువ అవగాహన కలిగి ఉంటుంది అన్న ఉద్దేశంతో పెద్ద వాళ్ల దగ్గరకు వెళ్లి అడుగుతూ ఉంటాం. మనకన్నా తక్కువ బుద్ధి ఉన్న వాళ్ళ దగ్గరికి వెళ్లి అడగం కదా. ఎట్లా చేస్తే బాగుంటుంది అని, ఇంట్లో పని మనిషిని అడగరు కదా. మనం సలహా ఇస్తూంటాం. మనం ఇంకో చోటున సలహా పొందుతుంటాం. ఆ పెద్దలు వాసుదేవ తత్త్వం నుండి సంకర్షణ తత్త్వానికి దిగివచ్చినా

కూడా వాసుదేవ తత్త్వం మరచిపోరు. కృష్ణుడు నిద్రలేచిన దానికి, బలరాముడు నిద్రలేచిన దానికి తేడా ఉన్నది. కృష్ణుడు ఎప్పుడూ అందులోంచి బయటకు రాడు. దాంతో ముడిపడి ఉంటాడు. విడివడి ఉండడు. బలరాముడు అప్పుడప్పుడు విడివడిపోయి మర్చిపోతూ ఉంటాడు. మనం విడివడడమే కాకుండా, చాలా దూరం కూడా వెళ్లిపోయాం. ఎప్పుడైతే విడివడ్డామో బలం తగ్గిపోతుంది. బలం తగ్గగానే శరీరంలోని ప్రజ్ఞలన్నీ సన్నగిల్లుతాయి. ఆ విధంగా సంకర్షణతత్త్వం శరీరాలను క్రమశః క్షీణింపజేస్తుంది. 126 సంలు శ్రీకృష్ణుడు బ్రతికి, 128 సంలు బలరాముడు బ్రతికి ఉంటే బలరాముడికి శ్రీకృష్ణుడివలె చిట్టచివరి వరకు అదే యవ్వనం లేదు. శ్రీకృష్ణుడు 126 సంవత్సరాలూ 16 సంవత్సరాల బాలుడిలా కనిపించాడట. మిగతా వాళ్ళకి వయసు కనిపిస్తూ ఉంటుంది. వయసు పెరిగిన శరీరంలో వయసు కనిపించడం లేదంటే వాళ్లకు శరీరంలోని సర్వ ప్రజ్ఞలు కూడా, దైవం బాగా నిండి ఉండడం చేత ఉత్సాహంగా ఉండడమే! వారికి ముసలితనం రాదు. మనం ఎప్పుడైతే దైవంతో కత్తెర వేసుకున్నామో, 'ఆ! వీడి కోసం పనిచేసేదేమిటీ' అన్నట్లు ఉంటాయి. అందుకని పని చేసి, చేయనట్లుండి మొత్తానికి మనల్ని బండి ఎక్కించేస్తాయి. సంకర్షణ ప్రజ్ఞ వల్ల శరీరాలు సృష్టిలో వాటంతట అవి సహజం గా క్షీణించి నాశనం అయ్యేటట్లుగా ఒక అమరిక పెట్టాడు. ఎవరిని ఎవరూ ప్రత్యేకంగా వచ్చి సంహరించనక్కరలేదు. మనల్ని మనమే చక్కగా సంహరించుకుంటాం. ఎంత చక్కని అమరిక ఇదీ! Automatic arrangement అన్నమాట. అందుకే హిరణ్యకశిపుడు, రావణాసురుడు మేము చచ్చిపోకుండా చూడు అంటే 'వీలుపడదు రా' అని చెప్తాడు బ్రహ్మ. ఎందుకంటే ఎప్పుడూ దానితోనే అనుసంధానం చెంది ఉన్నవాడికి వీలుపడ 'వచ్చు'. అప్పటికే కొన్ని శరీర ధర్మాలు యుగధర్మాలుగా పనిచేస్తూ ఉంటాయి. శ్రీకృష్ణుడి విషయంలో ఆయనంత పరిపూర్ణంగా దానితో అనుసంధానం చెంది ఉండడం చేత శరీరం అలా పువ్వు లాగా ఉన్నది. అలాగే కొంతమంది యోగులకు ఎంత వయస్సు వచ్చినా కనపడదు. మనం మామూలుగా 30 కే 50 లాగ కనిపిస్తూ ఉంటాం. వాళ్ళు 60 సంవత్సరాలు వచ్చినా 30, 40 సంవత్సరాలు లాగా కనిపిస్తారు. వారి జీవప్రజ్ఞ దైవప్రజ్ఞతో అనుసంధానం చెంది ఉండడం వలన వారు అలా కనిపిస్తారు. శరీరంలో ఉండే సమస్త ప్రజ్ఞలు విజృంభించి ఉత్సాహంగా పనిచేస్తూ ఉంటాయి. ఒక గురువుగారు చుట్టూ ఉన్నప్పుడు మనుషులు ఎంత ఉత్సాహంగా ఉంటారు? ఆయన లేనప్పుడు ఎవరికి వాడు నీరసంగా ఉంటాడు. కదా. అట్లా ప్రజ్ఞలు ఉత్సాహపడేట్లుగా ఎప్పుడు ఉంటుందంటే వాసుదేవునితో కలిసి ఉంటే! వాసుదేవుడంటే సమస్తము వ్యాపించి ఉన్న ప్రజ్ఞ! అందులోంచి మనం ఎప్పుడైతే బయటికి వచ్చేస్తామో మనకి ముసలితనం వచ్చేస్తుంది. శరీరం పడిపోతుంది. అందుకే 'సంకర్షణుడు' అనే నామానికి దేహములు విచ్ఛిన్నము చేయువాడు అని అర్థం ఎందుకు చెప్పారు అంటే వాడు నేను అని వేర్పాటుగా ఉంటాడు కాబట్టి. నేను, అనగానే బలం పోతుంది. నదిలో

నీళ్లు పారుతున్నాయి. ప్రవాహంలో ఉండే జలానికి చాలా ఎక్కువ జీవం ఉంటుంది. ప్రవాహంలోంచి ఓ బిందెలోకి నింపి ఇంటికి తెచ్చేసరికి అందులో ఉండే జీవం, నువ్వు ఎంత దాచుకుని జాగ్రత్త చేసినా ఉండదు. ఎందుకంటే జలం యొక్క బలం ప్రవాహం! 'గంగ' లో గ అంటే గమనము. గంగ లోని రెండు 'గ'లలో ఒక గమనం సూక్ష్మం నుండి స్థూలంలోకి, ఇంకో గమనం స్థూలం నుండి సూక్ష్మంలోకి జరుగుతూ ఉంటే ఈ రెండింటికీ మధ్య center point బిందువుగా ఉన్న 'సున్న' నీవు. ఒకపక్క సూక్ష్మంలో నుండి స్థూలానికి పదార్థం తయారవుతూ ఉంటే శరీరం లో, రెండవ పక్క స్థూలం నుండి సూక్ష్మానికి పదార్థం తయారవుతూ ఉంటే మధ్యలో నువ్వు ఉన్నావు. అందుకని రెండు మహా నదుల మధ్య జీవించి ఉంటావు నువ్వు. అది చెప్పడానికే 'మైత్రేయుడు ప్రయాగలో ఉన్నాడు, నీకు భాగవతం చెప్తాడు పద' అని ఉద్ధవుడు విదురుణ్ణి తీసుకుని పోతాడు. ఏమిటి ప్రయాగ త్రివేణి సంగమం! అంటే తాను చైతన్య స్రవంతి, ఒకపక్క 'ఇడ' స్రవంతి, మరోపక్క 'పింగళ' స్రవంతి. నిజమైన యోగి అలా స్థూలంలోకి కూరుకుపోయేట్లుగా ఉండడు. అట్లా సూక్ష్మంలోకి అదృశ్యమయ్యేట్లుగా ఉండడు. రెంటికి మధ్య అనుసంధానం చేసుకుని ఉంటాడు. ఉండి తను సత్త్వమునందు నిలబడి గుణాతీతమైనతత్త్వంతో ముడి వేసుకుని ఉంటాడు. ఇట్లా ఉండే సంకర్షణ తత్త్వం, వాసుదేవతత్త్వంతో అనుసంధానం చెంది ఉంటుంది. అతడినే యోగి అంటాం. భక్తుడంటాం. అలాంటి వారికే ప్రద్యుమ్న ప్రజ్ఞ, అనిరుద్ధ ప్రజ్ఞ కూడా పనిచేస్తాయి. ఒకసారి అనిరుద్ధుణ్ణి ఎత్తుకుపోతారు. బలరాముడు వాళ్లు వెతికినా దొరకడు. బాణాసురుడు వాళ్ళింట్లో దాచేస్తాడు అనిరుద్ధుణ్ణి. అనిరుద్ధుడు ఎక్కడున్నాడో కృష్ణుడికొక్కడికే తెలుసు. ఎలా తెలుస్తుందీ అంటే అందులో జీవించే వాడికి తెలుస్తుంది. భావం చేత మనం ముడి విడివడతాం. నిజానికి భావం చేతనే ముడి పడవచ్చును. దేవునితో కలిసి ఉండడానికి పెద్ద కసరత్తులు చేయనక్కరలేదు. కేవలం భావంలో ఈ మొత్తం అంతా అదే ఉంది, నాలోను అదే ఉంది. నాలో అది ఉన్నప్పుడు నేను లాగా కనిపిస్తుంది. వీళ్లలో ఉంటే వీళ్ళ లాగా కనిపిస్తుంది అనే భావం నీలో బాగా స్థిరం అయిపోతే, నువ్వు ప్రత్యేకంగా ఉన్నా ఆ మొత్తంతో కలిసి ఉండడంగా ఉంటుంది. అలా ఉంటే సుస్థిరత్వం ఉంటుంది. అలా లేనప్పుడు అస్థిరత్వం ఉంటుంది. అస్థిరత్వం సంకర్షణ ప్రజ్ఞ! శరీరం నుండి తనను తాను తిరోధానం చెంది, భ్రూమధ్యం ద్వారా ఈ శరీరాన్ని విచ్ఛిన్నం చేసుకుని వెళ్లిపోవడం, అంటే దేహాన్ని వదిలి వెళ్ళే ప్రజ్ఞ 'సంకర్షణ ప్రజ్ఞ'! నిజానికి ఈ శరీరం వదిలేప్పుడు సంకర్షణ ప్రజ్ఞ పని చేస్తుంది. అది తెలియాలంటే 'అక్షరపరబ్రహ్మయోగం' చదవాలి. జీవుడు తనను తాను సమీకరణ చేసుకుని అంటే ఈ శరీరంలో సమస్త భాగములను సమీకరణ చేసుకుని హృదయంలో చేరి, హృదయం నుండి ఊర్ధ్వగతిగా స్పందనం పట్టుకు వెళ్లి, భ్రూమధ్యంలోకి వెళ్ళి అక్కడ నుండి, బయటికి వెళ్లిపోతాడు తెలిసినవాడు. ఇది ఎట్లా చేయాలి అని జ్వాలాకుల్ మహర్షి 'The art of dying' గా ఇచ్చారు. రోజూ నువ్వు నిద్రలోకి పోవడం అంటే చచ్చిపోవడమే! నిద్రలోంచి

లేవడం పుట్టడమే! చచ్చిపోయేలోగా ఈ శరీరం నుండి బయటకు వెళ్లిపోవడం ఎలాగో తెలుసుకుంటే, శరీరంలోంచి బయటకు వెళ్లిపోయినా నేనున్నానని తెలుస్తుంది కదా. అది అక్షరత్వం అంటే. నేను క్షరుడును కాను, నేను అక్షరడను అని తెలియాలని ఎనిమిదవ అధ్యాయంలో కృష్ణుడు ఇది నువ్వు రోజూ అభ్యాసం చేయమని చెప్పాడు. పడుకునే సమయంలో దీన్ని అభ్యాసం చేయాలి, అని చెప్పాడు. ఈ శరీరాన్ని పంచభూతాలకి అప్పజెప్పి, మనస్సు, భావాలు భావమయ లోకానికి అప్పచెప్పేయడం, నీ గురించి నీకున్న భావాలు రేపటి వరకు ఇక అక్కర్లేదు కనుక పక్కన పెట్టేయడం, అప్పుడు నువ్వు, ఒక జీవుడుగా నిన్ను నువ్వు భావన చేసుకుని దైవంతో అనుసంధానం చెందుతూ, మనస్సుని హృదయంలోని స్పందన మీద లగ్నం చేసి, ఆ స్పందనం ఊర్ధ్వ గతిలో వెళుతున్నట్లుగా భావన చేసుకుంటూ స్పందనం కారణం చేత అలా పెరిగీ పెరిగీ పైకి వెళ్లి, భ్రూమధ్యంలో స్పందనాన్ని అనుభూతి చెందుతూ పడుకోవడం అనే సాధన మనకు ఇచ్చారు, యోగపరంగా! అదే మనకు అక్షర పరబ్రహ్మ యోగంలో ఇచ్చారు. మాస్టరుగారు చాలా అద్భుతంగా వ్రాశారు. అదే యోగి వ్రాసిన భగవద్గీతకీ, పండితుడు వ్రాసిన భగవద్గీతకీ గల తేడా. పండితుడు ప్రకర్ష చూపిస్తూంటాడు. యోగి సరాసరి కృష్ణుడు చెప్పింది తను దర్శనం చేసి, ఇస్తాడు. అక్షర పరబ్రహ్మ యోగమే CVV గారి 'భృక్తరహిత తారక రాజయోగం'! ఈ శరీరంలో నుండి ఒక నేను గా, ఒక బిందువుగా మొత్తం అంతా సమీకరణ చేసుకుని, హృదయం లోకి వచ్చి, అక్కడ నుండి ఓంకారం చేస్తే, మొత్తం శరీరంలో నుండి లేచి హృదయగ్రంథికి వచ్చి, అక్కడ నుండి సుషుమ్న అనే highway పట్టుకుని భ్రూ మధ్యలోకి వస్తాట్ట. అక్కడ ఉండు. అక్కడ నుండి నెమ్మదిగా బయటకు వెళ్ళిపోతావు. ఇది మామూలుగా నిద్రపోయేప్పుడే జరిగితే, చచ్చేలోగా తెలిస్తే చావడం అంటే ఏమీ లేదు, శరీరం వదిలేస్తాం తప్ప మనం ఉంటాం అని తెలుస్తుంది. మనం ఉంటాం అంటే చావంటే భయం ఉండదు. చావు గురించిన భయం కేవలం మనం వుండమనే కదా. మరి రోజూ నిద్రపోయినప్పుడూ మనం ఉండము కదా. హాయిగా నిద్రపోతున్నాం. పైగా నిద్ర కోసం ఎదురు చూస్తూంటాం. నిద్రపోతే అసలు సమస్యలే కాదు, ఒంట్లో బాధలు కూడా తెలియవు. ఒక్కోసారి నిన్ను బాధ పెట్టాలంటే, ఒంట్లో బాగా లేకపోతే నిద్రపోనివ్వడు బాధపడమని. అలా రోజూ నిద్రలో పోతూ, పొద్దుట వస్తూ ఉండే దారి మనకి తెలిసిందనుకోండి, ఆ దారిన కాస్త బయటకు పోయి వస్తూ ఉండవచ్చు. ఇది కూడా సంకర్షణత్వమే! సముద్రంలోంచి అల ఏ విధంగా బయటకు వచ్చింది? మొత్తం లో నుండి నువ్వేవిధంగా ప్రత్యేకంగా బయటకు వచ్చావు? మళ్లీ మొత్తంలోకి నువ్వెలా వెళ్లావు? మొత్తంలో నుండి బయటకు రావడం 'వేనుడు' అనే గంధర్వప్రజ్ఞ గా చెప్పారు. బయటకు వచ్చిన వాడు మొత్తం లోకి వెళ్లడం 'మార్కండేయుడు' అని చెప్పారు. అదీ రహస్యం! మాస్టర్ గారి నామం భ్రూమధ్యంలో నుండి పై వరకూ ఉంటుంది. 'ఆ దారి మొత్తం నాకు తెలుసు' అని వైష్ణవులు ఆ నామం

పెట్టుకుంటారు. మరి ఎంతమంది వైష్ణవులకు ఇది తెలుసో మనకు తెలియదు. దాంట్లోంచి బయటికి వెళ్ళిపోవచ్చు హాయిగా. రాత్రిపూట దివ్య ప్రణాళికలో పనిచేసే వారంతా అలా బయటకు పోతూంటారు, రాత్రి పడుకున్నాక. అందుకే వారికి రాత్రి ముఖ్యం. పగలు వాళ్లూ, వీళ్లూ పీక్కుతింటారు కదా. పొద్దుట లేచి మనం ఇలా గడుపుదాం అనుకుంటే, మనం అనుకున్న పద్ధతి కాక ఇంకోలా గడిచిపోతుంది రోజంతా. రాత్రి అందరూ పడుకుంటారు గనుక పని సుళువుగా ఉంటుందని యోగులు రాత్రి ఎప్పుడా అని చూస్తూ ఉంటారు. రాత్రి అందరూ పడుకుంటే, ఈయనా అలా పడుకున్నట్లుండి, తన్ను తాను హృదయంలోకి సమీకరణం చేసుకుంటాడు. ఈ సమీకరణం ఎలా చేసుకోవాలో అక్షర పరబ్రహ్మయోగంలో ఉన్నది. Etheric Body అనే పుస్తకంలో నేనూ ఇచ్చాను. అలా సమీకరణ చేసుకుంటే, సంకర్షణుడు పోయి, ఆ వాసుదేవుడిలో కలిసిపోవచ్చు. మళ్లీ వాసుదేవుడు లో నుండి సంకర్షణుడిగా రావచ్చు. నువ్వు ఎప్పుడైతే శరీరంలో నుండి వెళ్లిపోయావో అప్పుడు కూడా శరీరం విచ్ఛిన్నమైపోతుంది. అట్లా సంకర్షణుడు విచ్ఛిన్నం చేశాడు శరీరాన్ని బలరాముడుగా వచ్చినప్పుడు. బలరాముడు శరీరం వదిలిన ఘట్టం మాస్టారు పురుషమేధంలో చాలా చక్కగా ఇచ్చారు. అలాగే పృథు చక్రవర్తి శరీరం వదిలివేసిన ఘట్టం చదవండి. ధ్రువుడు విష్ణుమూర్తిని దర్శనం చేసింది కూడా ఇదే పద్ధతిలోనే. ఇన్నిచోట్ల ఇదే ప్రక్రియ మాటిమాటికీ ఇస్తుంటారు. దాని ముఖ్య ఉద్దేశం ఏమిటంటే నీవు కూరుకు పోయావు ఈ శరీరంలో, ఇందులోంచి చిచ్చుబుడ్డిలో లాగా బయటికి రావాలి. చిచ్చుబుడ్డి కి ఒకే కన్నం. అందులోంచి అంతా వస్తూ ఉంది. మనకి అంతే. finalగా వెళ్ళిపోవడానికి. భ్రూమధ్యం తూర్పు ద్వారం. శిరస్సు ఉత్తర ద్వారం. తూర్పు ద్వారం గుండా అయితే వెళ్లి వస్తూండవచ్చు. ఉత్తర ద్వారం తెరిస్తే ఇక అంతే సంగతులు. 'సంకర్షణ' నామానికి ప్రత్యేకత ఒకటి. వాసుదేవుని నుండి ప్రత్యేకంగా విడివడడం, రెండు - తద్వారా మన శరీరాన్ని మనమే ధ్వంసం చేసుకోవడం. సంకర్షణుడు శరీరాన్ని వదలగానే మొత్తం అయిపోతుంది. అందుకే సంకర్షణ నామానికి దేహములను/వాహికలను విచ్ఛిన్నం చేసే భగవత్ తత్త్వం అని చెప్పారు.

## 574 అచ్యుతః

చ్యుతము కానివాడు. చ్యుతము అంటే జారిపోవడం. కొంతమంది ఊరికే మాటిమాటికీ జారి పడిపోతూంటారు. మనం ప్రత్యేకంగా పడిపోవడానికి ఏమీ లేదు. ఎందుకంటే అసలు మనం ఎప్పుడూ జారే ఉంటాం. అ నుండి జారడం. అంటే భగవత్తత్త్వం నుండి విడివడి ఉంటాం. ఎప్పుడైతే దాని నుండి విడివడ్డామో, అంతా అక్కడి నుండి జారుడుబల్ల మీద నుండి జారి వచ్చినట్లు కిందకు దిగి వచ్చేస్తాం. పాద్దున్నే దైవ ప్రార్థనతో ఎంతో స్ఫూర్తితో మొదలుపెట్టిన రోజు, మధ్యాహ్నానికి సగం బావిలోకి దిగి, సాయంకాలానికి పూర్తిగా బావిలో మునిగి ఉంటాం. మళ్లీ చేంతాడు వేసుకుని సాయంత్రం పైకి వస్తే సరిపోతుంది. రోజు ఇంతే బావిలోకి దిగడం, పైకి రావడం. దేవుడు ఎప్పుడూ జారడు/slip అవ్వడు అని చెప్పకుంటే గొప్పేం లేదుగా. ఆయనలాగా జారని వాడిని ఒకడిని చూస్తే చాలు. చాలా ఆనందంగా ఉంటుంది. అందుకనే మనకి తెలియకుండానే మహాత్ములను చూస్తే ఆనందం కలుగుతుంది. ఆయన జారకుండా ఉంటాడు. మనతో పాటు జారుతున్నట్లుగా ఉన్నా, ఆయన జారడు. మనం జారుతూ ఉంటాం. మనతో పాటు గాలం వేసుకుని దిగుతాడు. బావిలో గాలం వేసుకుని దిగిన వాడికే, బావిలో దూకిన వాడికి తేడా లేదా! బావిలో దూకినవాడు బయటకు రాలేడు. గాలం వేసుకుని దిగిన వాడు మళ్ళీ గాలం తో పాటు బయటకు వస్తాడు. ఈ 'గాలం' వేసుకోకపోతే జారిపోతూ ఉంటాం. ఈ గాలం మనము 'భావం' తో వేసుకోవాలి. అందుకే హఠయోగంలో రోజు 'ఉడ్యానం' అనే ఆసనంలో కూర్చోమంటారు. అలా కూర్చుంటే మూలాధారం, స్వాధిష్టానం మధ్య ఒక చక్కటి అనుసంధానం ఏర్పడుతుంది. ఈ గొట్టం, ఆ గొట్టం కలిపి చూస్తే రెండు గొట్టాల్లోంచి ఒకటే చోటు కనిపించినట్లుగా రెండూ కలుస్తాయి. బాణాకర్రలాగ వంగి ఉండే వెన్నుముకలో ప్రజ్ఞ ఊర్ధ్వానికి వెళ్లదు. మనం నిట్టనిలువుగా వెన్ను పెట్టం. అసలు వెన్నుముక నిలబడదు.. మనకందరికీ గోడలు, కుర్చీలు కావాలి... అనుకోవడానికి. పోనీ వాటి ఆసరా తీసుకున్నా, వెన్నెముక వంగిపోయి ఉంటాం. యోగులు కూర్చోవడం చూస్తే అద్భుతంగా ఉంటుంది గడకర్రా, వెన్నుముకా అన్నట్లు ఉంటుంది. మొత్తం ఏడు చక్రాలు, ఒకదానికొకటి correct గా కలిసి, ఇటు నుండి చూస్తే అటు చివరకు కనిపించే అంత క్రమంగా ఉంటాయి. మనకి అన్ని చక్రాలు ఇటు ఒకటి అటు ఒకటి ఉంటాయి. 'ఓం' అన్నా అప్పుడేం ఉండదు. 'ఓం' అన్నప్పుడు అది పైకి లేవాలంటే, అది కాస్త తిన్నగా ఉండాలి కదా. అందుకే ఆసనం కావాలన్నారు. కుర్చీలో కూర్చున్నా దాన్ని నిలువుగా కూర్చోబెట్టాలి. ఆసనం మనకి రెండు మూడు అంగుళాలు ఎత్తు వేసుకుంటే అది కాస్త నిలబడి ఉంటుంది. చప్టాగా కూర్చుంటే వంకర తిరిగిన గడకర్ర లాగా ఉంటుంది. హఠాయోగం చేసినప్పుడు గడకర్ర లాగా

తిన్నగా కూర్చోమంటారు. అప్పుడు ఓంకారం చేయమంటారు. 'ఓంకారం' నిశ్వాసలోంచి చేస్తాం కదా, అప్పుడు వీడు కూడా ఇలా పైకి లేస్తున్నట్లుగా భావన చేయాలి. ఎక్కడికి లేస్తావు? కంఠానికి ముందు లేవాలంటాడు. అసలు దానికి ముందు నువ్వు లేవడానికి ఒక దారి ఏర్పడాలి కదా. అందుకని 'ఓంకారం' చేస్తున్నప్పుడు నీ యొక్క అంగుష్ఠమాత్ర పురుషుడు నుండి ఒక బంగారు దారం నిర్మాణం జరుగుతున్నట్లుగా భావన చేయమని చెప్తారు. యోగంలో దీనినే 'చిత్రిణీ నాడి' అని చెప్తారు. ఓంకారం ద్వారా దాన్ని నిర్మాణం చేసుకుంటూ, ఓంకారం కాకపోతే గురువు ఇచ్చిన శబ్దం...ఒక్క అక్షరంతోనే ఉంటుందా శబ్దం. దాన్ని ఉచ్చారణ చేయాలి. కొంతమంది, మూలాధారంలో ఉండేది 'గణపతి' మనకు ఉపకారం చేస్తాడని, 'గం' అనుకుంటారు. అక్కడ నుండి ఒక బంగారపు తాడు, నువ్వు అంగుష్ఠమాత్రుడుగా ఉన్నావు కదా లోపల, సహస్రారంలో నుండి పైకి అలా పెరుగుతున్నట్లుగా, పాదరసం ధర్మామీటర్లో పెరిగినట్లుగా, మంత్రం చేసి ఆ తర్వాత ఉచ్ఛ్వాస చేసి ఆపి, అది పట్టుకుని పైకి వెళుతున్నట్లుగా భావన చేయాలి. ఇట్లా చేస్తే సాధన అవుతుంది. అయితే బయట చేసే పనుల్లో అవకతవకలు లేకపోతేనే లోపల ఏదన్నా జరుగుతుంది. ఇది చాలా చాలా ముఖ్యమైన విషయం. బయట పెంట పెంట చేసుకుని లోపలికి వెళ్ళమంటే వెళ్ళనీయరు. అసలు మనకే వెళ్ళబుద్ధి కాదు. 'లోపలికి వెళ్ళమంటారు ఏం వెళతామండీ' అనిపించింది అంటే, బయట ఇంకా చాలా చాలా సర్దుకోవాలి అన్నమాట. ఇట్లా వెళ్లిన వాడికి కంఠం దగ్గరకి వచ్చేసరికి తాను ఆకాశంలో కూర్చున్నట్లు, తన కింద భూమి అంతా ఉన్నట్లు ఉంటుంది. మనం జారి పడిపోయాం కనుక ఇట్లా ఎక్కి వెళ్లడం అనేది మనం చెప్పుకుంటున్నాం. దీన్ని హఠయోగంలో ఇచ్చారు. దానికి చిత్రిణీనాడిని పట్టుకోమంటారు. చిత్రిణీ నాడిని నువ్వు ఉచ్ఛ్వాస, నిశ్వాస ద్వారా నిర్మాణం చేసుకోవాలి. దాన్ని ఉచ్ఛ్వాస ద్వారా పైకి పట్టుకుని వెళ్లాలి. మూలాధారం నుండి ఎక్కడో గోతిలో పడిపోయినట్లు ఉంటుంది. భారతంలో ఓ కథ ఉపమన్యువు నీళ్లు లేని బావిలో పడిపోతాడు. మనమైతే ఓ తాడు అందించి లాగేస్తాం. కానీ ఆ గురువుగారు అలా చెప్పలేదు. అది ఓ యోగ ప్రక్రియ! మనమైతే అలా నూతిలో పడిపోయిన వాళ్ళమే! భారతంలో అంతా పై కథ వేరు, లోపలి కథ వేరు. అది వేదవ్యాసుని speciality. ఎక్కడికక్కడ యోగ రహస్యాలు, సృష్టి రహస్యాలు ఉంటాయి. బయటకు మాత్రం అందంగా, రుచిగా కథ ఉంటుంది. ఉపమన్యువుకి గురువుగారైన ధౌమ్యుడు ఓ మంత్రం చెప్పి, ఈ మంత్రం చేసుకోరా పైకి వస్తావంటారు. ఇదే 'హఠయోగం' అంటే! చ్యుతుడైన వాడు/ జారిపడిపోయిన వాడు పైకి రావాలంటే గురూపదేశంతో పైకి రావడం. అలాగే రాజయోగ మార్గంలో ఇంత కష్టపడకుండా, మనస్సు చేత భావన చేయడంతో పైకి రావచ్చు. అదీ భాగవత రహస్యం! ముక్కు మూసుకోవడం, ఎగశ్వాసలు, నడ్డి నిలువుగా పెట్టడం, ఇవన్నీ పక్కనపెట్టి, భావనలో నీ లోపల, నీ బయట, అంతా నీవే ఉన్నావని

స్థిరపరచుకుంటే సరాసరి జారి పడిపోయిన స్థితి నుండి పైకి వస్తావని శ్రీకృష్ణుడు భాగవతంలో చెప్తాడు. ఎప్పుడు భగవంతుడి అస్తిత్వాన్ని మన భావనలో నిలుపుతామో, అప్పుడు మనం జారి పడిపోయిన స్థితి నుండి, స్వస్థానానికి వస్తాము. ఎప్పుడు అది గుర్తుండదో, అప్పుడు జారి పడిపోతూ ఉంటాము. బాగా బాధపడుతున్నప్పుడు, చిరాకు పడుతున్నప్పుడు, మనం వాడి అస్తిత్వంలో లేము, అని గుర్తుపెట్టుకోండి. అప్పుడు ఎవరన్నా వచ్చి దీన్ని తలుచుకోమంటే, కొడదాం అనిపిస్తుంది. ఎందుకలా అనిపిస్తుంది అంటే ఈ భావనని దగ్గరకు రానివ్వదు. అది దాని ప్రత్యేకత. ముడుచుకుపోతుంది. అందుకని శ్రీకృష్ణుడు 'నువ్వెప్పుడు ఎక్కడ భావన చేత నన్ను తలుచుకుంటే, అక్కడ అప్పుడు కేవలం భావన వల్ల నా సాన్నిధ్యం లభిస్తుంది' అంటాడు. ఏమిటా భావం? 9వ అధ్యాయంలో ఇచ్చాడు. 'సర్వ జీవరాసులు నాయందు ఉన్నాయని, నేను సర్వ జీవరాసుల యందు ఉన్నాను' అని భావన చేయమంటాడు. అదే 9వ అధ్యాయం. ఈ భావం చేస్తే 'రాజయోగం' అవుతుంది. అదే మంద్రజాలంలో మైత్రేయుడు 'యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి స్థితులేమీ అక్కరలేదా' అని అడిగితే, 'అవన్నీ నీలాంటి యోగులకే' అంటాడు కృష్ణుడు. మరి 'సంకీర్తన, భజన, గానం ఇలాంటివో' అంటే అవన్నీ ఉద్ధవుడి లాంటి వాడికంటాడు. 'ఏం చెప్పినా కొట్టి పారేస్తాడు. ఏంటయ్యా' అంటే ఆలోచించమంటాడు. 'నువ్వు సంకల్పిస్తేనే కదా నాకు తెలుస్తుంది' అంటాడు. అదీ మైత్రేయుడి గొప్పతనం. 'సంకల్పించేశాను' అంటాడు. అప్పుడు కృష్ణుడు చెప్తాడు 'కేవలం నువ్వు భావన వల్ల సాన్నిధ్యం ఇస్తాను' అని. మొత్తం అంతా అదే కదా అన్నప్పుడు సముద్రంలో కాకిరెట్ట పడినట్లు అవుతుంది. మొత్తంలో కాకి రెట్ట అంటే ఏమన్నా అస్తిత్వం ఉంటుందండీ? అలాగే నీ భావాలన్నీ కరిగిపోతాయి. కరిగిపోయి నేను అనే అంతర్యామి ప్రజ్ఞలో నిలబడి ఉంటావు. అలా ఎప్పుడూ నిలబడి ఉండేవాళ్ళు అచ్యుతులు. మనకి మహాత్ములందరి జీవితాల్లోనూ కనిపిస్తుంది. జారిపోరు. 'స్థితప్రజ్ఞులు' లాగా ఉంటారు.

## 575 వారుణః

వారుణి అంటే మొత్తం వెలుగు. వరుణుడు అంటే అసలు తత్త్వానికి మొదటి తొడుగు వెలుగు. అమ్మవారు కనిపిస్తే అయ్యవారు కనబడ్డట్లే. అయ్యవారు లేకుండా అమ్మవారు వచ్చే ప్రశ్నే లేదు. అయ్యవారు వచ్చేరట అంటే అమ్మవారే. అందుకే అమ్మవారిని పిలవ్వయ్యా, ఆమె వస్తే ఆయన వచ్చినట్లే అని తెలివిగా శ్రీవిద్యలో చెప్పారు. పైగా ఆవిడతో రాకపోతే ఆయన వచ్చినట్లు ఏం తెలుస్తుంది? మనలో ఉన్నాడంటే ఏం తెలుస్తుంది మనకు? 'తమ బొంద' అన్నట్లుగా ఉంటుంది. మనలో ఉన్నాడని ధ్యానం చేసినప్పుడు మంచి వెలుగుగా కనిపించింది అనుకోండి, అంటే గుండెలో బంగారు రంగులో కనిపించవచ్చు. ఆకుపచ్చ నీలము నెమలి గొంతు మీద ఉండే తెలియని రంగులోనో ధగధగలాడుతూ కంఠంలో కనిపించవచ్చు. లేదా భూమధ్యంలో తెలుపో, నీలమో తెలియకుండా దగధగలాడుతూ కనిపించవచ్చు. లేదా కళ్ళు మూసుకుంటే నక్షత్రాలు కనిపించాయనుకోండి, ఆనందంగా ఉంటుంది. మన బోటి వాడికి, భగవంతుడి అస్తిత్వం తెలియాలంటే, అలా వెలుగు దర్శనం అయినప్పుడు ఆనందం తప్ప, 'ఉన్నాను కదరా' అంటే 'ఉంటే ఉన్నావు, నువ్వు ఉన్నట్లు నాకు తెలియడం లేదు కదా' అన్నట్లు ఉంటుంది. అదే అమ్మవారు వస్తే? అందుకే అమ్మవారుగా అందుకోవడం కొంచెం సులభం. అయ్యవారిగా అందుకోవడం కష్టం. శివుడిని పట్టుకోవాలంటే శక్తిని పట్టుకోవాలి. 'శివా' అంటేనే అమ్మవారు. శివ అంటే అయ్యవారు. 'శివ శివా' అంటే ఇద్దరినీ పిలిచినట్లు. అందుకే 'నమఃశివాయ' అనే మంత్రంలో ప్రార్థన అమ్మవారి గురించి, అయ్యవారి గురించి కాదు అని, శ్రీ శివానందమూర్తి గారు చెప్పారు. అందుకే 'శివాయ' అంటున్నాం. ఎందుకు ఆమెను పిలుస్తున్నావు? ఆమెను పిలిస్తే ఆయన వచ్చాడుగా! పైగా ఆయన వస్తే నీకు తెలియనే తెలియదు. కానీ ఆవిడ వస్తే నీకు అనుభూతి, ఆనందం ఉంటాయి. ఉండడమే కాకుండా ఆమె రావడం, ఆయన రావడం కూడా! మొత్తం వెలుగులోంచి ముద్దలు ముద్దలుగా వెలుగులు బయటకు వస్తాయి. మొత్తం వెలుగు ఓ విష్ణుచక్రం గానో, భూచక్రం గానో మనం చూస్తే రవ్వలు రవ్వలుగా బయటకు వస్తాయే అలాంటి రవ్వలే భృగువులు! వరుణుడి యొక్క ముక్కలన్నమాట. మొత్తం వెలుగులోంచి ముక్కలుగా/ఖండాలుగా బయటికి వస్తే వాటినే 'భృగువులు' అన్నారు. ఆ వెలుగు ఖండాలు మళ్ళీ ఒక్కో దాంట్లోవి ఒక్కో కేంద్రంగా ఏర్పడితే సూర్యుడు అవుతాడు. అందుకని 'భార్గవులు' అంటాం. 'భార్గవు'డని సూర్యుడికొక పేరు. 'భృగు' అంటే వెలుగు ముద్ద. వరుణుడిలోంచి వచ్చిన ఈ భృగువులు భార్గవులు అవుతూ ఉంటారు. ఈ సూర్యులంతా, సంసారాలను పెట్టుకున్నవారు. ప్రతి సూర్యుడికీ చుట్టూ ఏడుగురు కొడుకులు ఉంటారు. ప్రతి కొడుకుకి కూతుళ్లు, కొడుకులు. భూమి పుడితే,

భూమి చుట్టూ తిరిగే గ్రహాలు కొన్ని ఉన్నాయి చంద్రుడిలాగా. అలాగే బృహస్పతి చుట్టూ 18 మంది చంద్రులు తిరుగుతూంటారట. మనకేమో ఇక్కడి నుండి చూస్తుంటే ఒక చిన్న నక్షత్రంలా కనిపిస్తాడు బృహస్పతి. కానీ చుట్టూ బోలెడున్నాయి. దూరం నుండి మన భూమిని చూస్తే, మన చంద్రుడు కనిపించట్ట. భూమి, చంద్రుడు కలిసి పోయి కనిపిస్తారట. ఇట్లా సూర్యుడు గారి సంతానం మనకివాళ తెలిసినవి 10. 7 గ్రహాలు (సూర్యుడు బదులు భూమి వేసుకుంటే) కాక వరుణుడు, ఇంద్రుడు, యముడు. కానీ ఋషులు చెప్పినవి 72 గ్రహాలు. మన సూర్యుడు చుట్టూ 72 సంతానం (అంటే గ్రహాలు) వున్నారటండీ. ఇలా ప్రతి నక్షత్రం ఒక సంసారం. ఇలా కాకుండా, ఈ భార్గవులలో కొంతమంది సన్యాసులున్నారు. వాళ్లే తోకచుక్కలు! వాళ్లు పెళ్లి చేసుకోలేదు. సంతానం లేదు. వాళ్ళ చుట్టూ సూర్య మండలాలు పెట్టుకోలేదు. ఎందుకీ గోల అనుకున్నారు. కాషాయం కట్టేశారు. Halley Comet వచ్చింది కదా. అదొక సన్యాసన్నమాట. సన్యాసం అంటే వారింటికీ వీరింటికీ అలా తిరుగుతూండడమే. 70 సంవత్సరాలకొకసారో, 80 సంవత్సరాలకొకసారో ఇటు వస్తుంది. 'ఎలా ఉన్నావురా' అని కనుక్కుని పోతుందట. అలా భృగువులు కొంతమంది సన్యాసులుగా, సంసారులుగా ఉన్నారు. వాళ్లలోనే ఒక భృగువు బ్రహ్మ, విష్ణువు, శివులని చూద్దామని పోయి గొడవ చేశాడు. తిరుగుతుంటాయి, సన్యాసుల్లాగా, ఈ comets కొన్ని. సంసార్లు అలా పడి ఉంటాయి. వాటి చుట్టూ పెంచుకుంటాయి/ పెరిగి ఉంటాయి. 'ఏమయ్యా ఎలా ఉన్నావని' ఈ సన్యాసి అడిగితే, 'నీకేం నువ్వు బానే తిరుగుతున్నావు, నేను వచ్చేస్తే ఇవన్నీ పడిపోతాయి' అంటాడు. గృహస్థు సులభంగా బయటికి రాలేడు కదా. పిల్లలు, చదువులు, పెళ్లిళ్లు, భార్య, వారి తిళ్ళు, బంధువులు, ఇంతమందిలో ఈ సన్యాసి గార్లను కూడా receive చేసుకోవాలి. అంత కార్యక్రమం ఉంటుంది. వీరందరూ 'వారుణీ, వెలుగు ముద్దలు' అని అర్థం. గాయత్రీ మంత్రంలో కూడా వీరిని గురించి చెప్తారు. 'భర్గోదేవః' అని ప్రార్థిస్తాం. భర్గులంటే భృగువులే! ఎవరు భర్గో దేవుడంటే? ఈయనే! ఇలాంటి వెలుగు ముద్దలన్నిటికీ మగాడు ఎవరు? పతి ఎవరు? దేవుడు ఎవరు? వాడిని గాయత్రి మంత్రంలో ప్రార్థన చేస్తున్నాం అమ్మ వారి గురించా? అయ్యవారి గురించా మనం చేసే ప్రార్థన? 'తత్ సవితుర్వరేణ్యం' ఆ వెలుగు నన్ను ఆవరించాలని. అమ్మవారని ఇందాక చెప్పుకున్నామే, ఆ వెలుగు మనలను ఆవరించాలనీ, ఆ వెలుగుకి మూల కారణమైన వాడిని మనం ధ్యానం చేస్తున్నాం. 'ధీమహి' అంటే, we meditate మేము ధ్యానం చేస్తున్నాం. ఎవరిని? 'దేవః అస్య భర్గః' భర్గుల యొక్క దేవుడ్ని! అంటే భర్గులన్నిటికీ ఆయన నాన్న, ఆమే అమ్మ! ఆ తత్త్వాన్ని ధ్యానం చేస్తున్నాం. మనం గాయత్రిగా ఏదో అయిదు తలకాయలు పెట్టుకుని, లాగీ, పీకీ 11 సార్లు చెప్పి, హమ్మ-- మాస్టర్ గారు సంతోషించే ఉంటారిపాటికి అనుకునీ, ఇలా కాదు చేయాల్సింది. వాడికీ మనం సరాసరి link పెట్టింది. ఆ మంత్రంతో చేస్తే వాడు భూ,

భువః, సువః అనే ఈ మూడు లోకాలు నిండి ఉన్నాడు, ఈ మూడింటికీ పైన వెలుగుగా ఆయనే ఉన్నాడు. ఆయన్నీ ప్రార్థన చేస్తున్నాం, 'ఈ బుర్రలో బల్బు కొంచెం weak గా ఉంది. నీ bulb నాలో వెలిగేటట్టు చూడు, అప్పుడు నీతో కలిసి ఉంటాను' అని ముడివేసుకోవడం. అందుకూ ప్రార్థన! కనుక ఇది కూడా ఆయనే! తాత, కొడుకు, మనవడు కూడా ఆయనే అని చెప్తున్నాడన్నమాట. 'వరుణుడు' చెప్పాడు కదా. ఇప్పుడు 'వారుణీ' అని చెప్పాడు. 'భృగుర్వై వారుణీ' అని చెప్పి చదువుకుంటూంటాం. అంటే వరుణుడి కొడుకు వారుణీ, I am Bhrugu, son of Varuna అని. మొత్తం వెలుగులోంచి ఓ ముద్ద బయటకి వచ్చిందనుకో, మొత్తం అన్నం కలిపినప్పుడు ఓ ముద్ద తీసినట్లు. అ ముద్దలో ఆ మొత్తం తత్త్వం ఉన్నది కదా. అట్లా భీష్ముడు అన్ని చోట్లా చూశాడండీ! వారుణి కూడా నువ్వే నాయనా! అచ్యుతుడి నుండి వచ్చి, వరుణుడి వద్దకు వెళ్లాడు. అసలు ఎక్కడ మొదలుపెట్టాడూ, ఆయన మేధస్సులో భగవంతుడిని ఎన్ని విధాలుగా దర్శించి ఉంటాడూ? మన భగవంతుడు అయితే చాలా చిన్నవాడు. ఏదో పూజ గదిలో మూల నువ్వు ఒకడివి ఉన్నావు కదూ! అన్నట్లుంటుంది. ఈయనకి భగవంతుడు మొత్తం అంతా ఎక్కడంటే అక్కడే కనిపిస్తున్నాడు.

## 576 వరుణః

వరుణుడు అంటే మనలో పశ్చిమ దిశగా ఉండే బలం. మనలో పశ్చిమ దిశ ఉంది. సృష్టికి పశ్చిమ దిశ ఉన్నది. పశ్చిమ దిక్కు బలానికి ప్రసిద్ధి. అందుకని మనిషిలో బలం బాగా రావాలంటే వరుణ ప్రజ్ఞ కావాలి. అగస్త్యుడు వరుణ ప్రజ్ఞ. మనకు అశ్వినులలో మిత్ర, వరుణ అనే రెండు ప్రజ్ఞలు ఉన్నాయి మిత్ర ప్రజ్ఞ మూలతత్త్వం! ఆ మూల తత్త్వాన్ని పట్టి ఉంచే ప్రజ్ఞ వరుణ ప్రజ్ఞ! ఎంత బలం ఉండకపోతే పట్టి ఉంచగలదు? ఈ పట్టి ఉంచేదే లేకపోతే సృష్టి లేదు. పాలు కావాలంటే గిన్నె కావాలి కదండీ! గిన్నె లేకపోతే పాలెలా వాడుకోగలం? గిన్నె లేకపోయినా దోసిళ్ళలోనైనా పోసుకోవాలి కదా. ఎక్కడో అక్కడ పట్టి ఉంచుకోవాలి కదా. అలా తత్త్వాన్ని పట్టి ఉంచుకోవడానికి ఏర్పడి ఉన్న ప్రజ్ఞ వరుణ ప్రజ్ఞ. తత్త్వం మిత్ర ప్రజ్ఞ. మైత్రేయుడంటే ఆ తత్త్వం! దాన్ని పట్టుకుని ఉంచేది వరుణ ప్రజ్ఞ. ఆ మిత్రావరుణులే వశిష్ట, అగస్త్యులు అవుతారు. ఇంకొక స్థితిలో ఇంద్రగ్రహం, యమగ్రహం లేదా వరుణగ్రహం Uranus అవుతారు. ఇంకొక స్థితిలో హిమాలయాలు, నీలగిరిలు అవుతాయి. అందుకని నీలగిరులలో ఉండే ప్రజ్ఞ భగవత్ తత్త్వాన్ని చక్కగా అందిపుచ్చుకుని ఉండగలదు. దక్షిణంలో ఉంటుందని చెప్పారు కదా. అంటే మనకు పశ్చిమ ప్రజ్ఞ. ఈ వరుణ ప్రజ్ఞని ఆరాధన చేయడమే అమ్మవారిని ఆరాధన చేయడం. అమ్మవారు తన యందు అయ్యవారిని నింపుకుని ఉన్నది. అందుకని వెలుగుతోంది. అయ్యవారు లేకపోతే అమ్మవారు వెలగలేరు. అమ్మవారి కాంతి అంతా లోపల అంతర్గతంగా, అదృశ్యం గా ఉన్న అయ్యవారి అస్తిత్వమే! ఈ bulb లోపల విద్యుత్తు ఉండడం వలన వెలుగుతోంది. అలాగా అమ్మవారు వెలుగైతే, ఆ వెలుగుకి ఆధారంగా ఉండే విద్యుత్తు అయ్యవారు. ఆయన కనబడరు. అమ్మవారు కనబడ్డారుట అంటే, అందులో అయ్యవారు ఉన్నారుట అని అర్థం. అంటే మొట్టమొదటి కనిపించే భగవత్ తత్త్వము తొడుగు 'వెలుగు'. దాన్నే అమ్మవారు అంటారు. ఆకాశంలో వెలుగు కూడా అమ్మవారే. అందుకే 'అదితి' అన్నారు. అసలు అది అలా వెలగడానికి కారణం ఒకడున్నాడు. వాడు వెలుగుకీ, చీకటికీ ఆవల ఉంటాడుట. కనుక దాన్ని పట్టుకుని ఇస్తే కదా తెలిసేది. లేకపోతే ఏమనుకుంటాం? అన్న హితం లేదు. jaundice వచ్చింది. వాడికి అక్కడ ఏమన్నా పెట్టు, చస్తే ముట్టుకోడు. అంతకుముందు మీద పడి తినేవాడివి ఏమైపోయావు! నీరు కూడా తాగ బుద్ధవదే! కారణం వరుణుడు! అనుభూతి చెందాలంటే అమ్మవారండీ. ఆయనేముందీ, అలా ఉంటాడు అంతే. నిరాకారం. శివుడు అదే కదా. రకరకాల తిట్లు తిడతాడు దక్షుడు శివుడిని. నిజానికి అవన్నీ పొగడ్తలు. నిందాస్తుతి భలేగా ఉంటుంది. 'నువ్వు నిర్వికారుడువి. నీకు రుచా పచా? రూపమా పాడా' అంటాడు. ఏమీ లేదు, కానీ అన్నీ ఉన్నాయి ఆయనలో. అయితే అది అనుభూతి

చెందాలంటే నీకు వరుణ ప్రజ్ఞ ఉండాలి. సృష్టి ఒక పెద్ద గరుడ పక్షిగా తీసుకుంటే మిత్రా వరుణులు కుడి రెక్క, ఎడమ రెక్కలు. ఎడమ పక్క ఇడ, కుడిపక్క పింగళ. 'శ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ' అంటూ పురుష సూక్తం లో, శ్రీ - లక్ష్మి, నీకు ఇరుపక్కలా ఉన్నారని చెప్తున్నారు. ఒక్కళ్ళు ఉంటే అవ్వదు. శ్రీదేవి, భూదేవి ఇద్దరు ఉంటేనే అవుతుంది. వాళ్ళిద్దరూ పోట్లాడుకుంటూ ఉండాలి ఈయన చూస్తూ ఉండాలి. కానీ వారిద్దరూ చాలా సహకరించుకుంటున్నట్లు. ఇద్దరినీ ఎదురు బొదురుగా పెట్టడం వలన సృష్టి ఉన్నది. ఉత్తర, దక్షిణ ధృవాలు ఉంటేనే గోళం ఉన్నది. దక్షిణ ధృవం అంటే పునాది, అది లేకపోతే ఉత్తర ధృవం అంటే roof/కప్పు లేదు. మన సృష్టి పునాది నుండి కప్పు వరకు వచ్చింది. అసలు సృష్టి కప్పు నుండి పునాదికి వచ్చింది. అందుకని ఉత్తర ధృవానికి, దక్షిణ ధృవం ఉండాలి. మొగుడికి పెళ్ళాం ఉండాలి. రెంటికి పోటీ పెడితే కథ నడుస్తుందండీ. కథానాయకుడుండాలి. ఖల్నాయక్ కూడా ఉండాలి. రావణుడు లేని రామాయణం, కర్ణుడు, దుర్యోధనుడు లేని భారతం బాగుంటాయా? అసలు దేవాసురులు లేకపోతే సృష్టే లేదు కదా. ఒకళ్ళు ఒకవైపు, మరొకరు ఇంకొక వైపు పట్టుకు చిలికితే కదా సృష్టి అంతా వచ్చింది. మరి మనలో ఉచ్ఛ్వాస మిత్ర ప్రజ్ఞ అయితే నిశ్వాస వరుణ ప్రజ్ఞ! ఉచ్ఛ్వాస ఇస్తాం, నిశ్వాస ఇవ్వం అన్నామనుకోండి! ఏమైపోతాం? పీల్చడం మాత్రమే ఉండి వదలను, అంటే మండిపోతాం ఢామ్ అని. Oxygen కదా. అది అమ్మవారు, అయ్యవారూను. 'వారుణీ మద విహ్వల' అని అమ్మవారిని అంటాం. అదే అయ్యవారి నామాల్లో 'వరుణః' అని చెప్తున్నారు. 'అది నువ్వేనయ్యా' అంటున్నాడు. అందుకనే CVV గారు వరుణ తత్త్వాన్ని అందించాలని ప్రయత్నించేది. 'శరీరాలు బాగుంటే ఆత్మతత్త్వం అనుభూతి చెందడం ఎంతసేపయ్యా' అంటారాయన. అదీ ఆయన speciality! Cup అంతా చిల్లులై, అందులో కాఫీ పోసి తాగుదాము అనుకుంటే అంతా కారిపోతుంది. కదా. నీ నోటికి అందనే అందదు. పోనీ అంతకుముందు బాగుండి, కాఫీ పాయ్యగానే పగిలిపోయింది అనుకోండి? అప్పుడూ అంతే కదా. అందుకే CVV గారు ఏమన్నారంటే, 'సహజంగా మీరు ఆత్మతత్త్వమేను. కానీ మీకు అది ఎందుకందడం లేదో తెలుసా? మీ శరీరాలు చాలా నాసిగా, భయంకరంగా ఉన్నాయి. శుభ్రంగా చేసుకోవాలి. మనువు మొదలైన వారికి శరీరం ఎలా తయారు చేయాలో చేత కావడం లేదు. వారికి పని నేర్పడానికి నేను వచ్చాను. నేను ఇచ్చిన మంత్రం చేసుకుంటూ ఉంటే, ముందు శరీరంలో ఏవేవి ఏర్పడితే ఆత్మానుభూతి కలుగుతుందో అవన్నీ ఏర్పరుస్తాను' అని చెప్పారు. Car ఇచ్చారు కానీ ఎంతకీ start కాదు. Start అయినా పోదు. Car ఉన్నా ఉపయోగం లేదుగా! మనకి తంటాలుగా ఉన్న బళ్ళు, ఇళ్ళు, ఒళ్ళు లేవూ? అందుకని ఏమన్నారంటే, 'నేను నీకు శుభ్రంగా repair చేసేస్తాను. నేను వరుణ ప్రజ్ఞని! (Uranus అంటే వరుణ ప్రజ్ఞే!) ఎట్లా repair చేస్తానంటే ఇలా switch on చేస్తే అలా వంద మైళ్ళు పరుగులు పెట్టేటట్లు అంత speed గా నువ్వు ముందుకు వెళ్లేట్లుగా నువ్వుండే

పాత్రని/వాహికని/శరీరాన్ని నిర్మాణం చేసి పెడతాను. అసలు వస్తువుకి ఎప్పుడూ తేడా లేదు కదా. తేడా అల్లా నీ శరీరం యొక్క అమరికలోనే ఉంది. దాన్ని నేను మారుస్తాను. నీకు ఉండే pituitary ని బాగు చేస్తాను.' అని. Dip Deep Course నే ' New pituitary course' అని ఆయన ఇచ్చారు. Pituitary Regulation Course! ధనిష్ఠ prayer అంటే 'ఆ... పోదు పడుకుందాం' అనిపిస్తుంది మనకి. ఎంతమంది ధనిష్ఠకి respond అవుతారు? పెట్టినవాడికే అనుమానం వస్తుంది. ఎందుకు అసలు మనం పెట్టామా, మనం కూడా పోయి పడుకుంటే పోలేదా అని. ఆయన 'నెలకొకసారి ధనిష్ఠ నక్షత్రంలో చంద్రుడు ఉన్నప్పుడు దీనికి సంబంధించిన తరంగాలు జీవులు అందుకోవడం సులభం. సంవత్సరానికోసారి సూర్యుడు ఉన్నప్పుడు అందుకోవడం సులభం' అని చెప్పారు. ఎందుకంటే ఈ రెండూ reflexive principles. ధనిష్ఠ నక్షత్రంలో ఏ గ్రహం ఉన్నా సరే ఆ గ్రహం నుండి new dimension మనకి అందుతుంది' అని చెప్తారు. ప్రతి సంవత్సరం Feb 7 నుండి 13 రోజులు Feb 20 వరకు, అంటే VPS శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారి పుట్టినరోజు Feb 7 నుండి మొదలు అనుకోండి, Feb 20 వరకు సూర్యుడు ధనిష్ఠ నక్షత్రంలో సంచరిస్తూ ఉంటాడు. ఆ సమయంలో ఈ ప్రజ్ఞ చక్కగా అందుకోవచ్చు. అలాగే ప్రతినెలా చంద్రుడు ధనిష్ఠ నక్షత్రం లోకి వస్తాడు. వచ్చినప్పుడు చంద్రుని ద్వారా ఈ తత్త్వం మనకి అందుతుంది. 12 సంవత్సరములకు ఒకసారి బృహస్పతి వస్తాడు. అయిపోయింది. వచ్చి వెళ్ళిపోయాడు. మొన్నే మీనంలోకి వచ్చేశాడు. కిందట ఏడాది అంతా ధనిష్ఠ నక్షత్రంలో ఉన్నాడు బృహస్పతి. ఇతడు ఎంతైనా వ్యాపనం ఇవ్వగలిగినవాడు. బృహ్మణస్పతి అంటే మనం అలా ఉచ్చరిస్తూ ఉంటే బయటికి వచ్చినట్టుగా, విపరీతంగా వ్యాపనం ఇస్తాడు. Expansion అంటాం ఇంగ్లీషులో. మళ్లీ 12 సంవత్సరాల కి గాని రాడు. అంతేకాదు వరుణగ్రహమే అసలు ధనిష్ఠ లో ప్రవేశించే సమయం వస్తున్నది. నిజమైన యోగ సాధన చేసుకునే వారికీ, చేసుకుందామన్న ఆకాంక్ష ఉండే వారికీ, పండగ time ఇది. మరి ఆ పండగ ఎవరికి వారు పండించుకోవాలి. శరీరంలో రకరకాల మార్పులు తీసుకురావడమే CVV గారి యోగం యొక్క ముఖ్యోద్దేశం. 'బండి repair చేస్తాను. Repair కి పొద్దున్న 15 నిమిషాలు, సాయంత్రం 15 నిమిషాలు shedలో పెట్టరా, నువ్వేం చేయక్కర్లేదు, నేను చూసుకుంటాను' అన్నారాయన. 'బండి తనకు అప్పగిస్తే చాలు,' అన్నారు. నమ్మకం ఉంటే బండి car shed లో పెట్టి వచ్చేయాలి. వచ్చేయక్కర్లేదు కూడా, అక్కడే పడి ఉండవచ్చు. 'నువ్వేం చేయక. కానీ కనీసం పది సంవత్సరాలు బండి తెచ్చి పెడుతూ ఉండు' అన్నారు. ఇదంతా వరుణప్రజ్ఞకు సంబంధించినది. ఎందుకంటే వాహికలు చక్కగా తయారైతే అనుభూతి/ భగవదనుభూతి చాలా సులభం. కష్టం కాదు. 'Unless the stage is stable, how can the statue stand?' అన్నారు. యోగ సాధన, అంగుష్ఠమాత్ర పురుషుడు, ఆజ్ఞా చక్రం, హృదయంలో చూడు అంటే, 'నీ శరీరాన్నే నువ్వు

సరిగ్గా కూర్చోపెట్టలేవు కదా. ఇక నీకు యోగం ఏంటి? సాధన ఏంటి? అయ్యే పని కాదు, నేను నీకు తయారు చేసి పెడతాను. దాన్ని ఇలా పడెయ్యి, నీకై నువ్వు repair చేసుకోలేవు. నేను repair చేసి పెడతాను' అంటారు. పెద్ద tank లో నీళ్లు ఉన్నా, మన వంటింటి వరకు వచ్చే గొట్టం సరిగ్గా ఉంటేనే కదా మనకు నీళ్లు వచ్చేది. అదీ bathroom sewage గొట్టం, కలిసిపోతే ఎలా ఉంటుంది? అలా ఉంది మన పరిస్థితి. అలా అన్నీ మారాలంటే వాహిక బాగుండాలి. ఈ వాహిక కి అధ్యక్షపదవి అమ్మవారిది. అందుకే అగస్త్యుడు ఇచ్చాడు 'లలితా సహస్రనామం'! ఆశ్రమం నుండి వచ్చింది అమ్మవారు అంటే అగస్త్య ఆశ్రమమే! దుర్గా, లలిత వీళ్లంతా అగస్త్య ఆశ్రమం నుండి రావాల్సిందే! విష్ణువు, నారాయణుడు వీరంతా బదరికాశ్రమం నుండి రావలసినదే! వాళ్లు కొంచెం సౌమ్యంగా వస్తుంటారు. వీరిది మంచి పులిలాంటి ప్రజ్ఞ లాగా అనిపిస్తుంది. నిజానికి ఆయన 'నేను తయారు చేసేస్తాను నువ్వు అనుభవించు' అని అపారకరుణతో అంటారు. దుర్గపర్వతం అని నీలగిరిలో ఉన్నది. అక్కడ అగస్త్య ఆశ్రమం ఉన్నది. వారి పనల్లా శరీరాలు చక్కగా నిర్మాణం చేసి ఇవ్వడం. తద్వారా అనుభవాలు. అసలు అన్ని గ్రంధులూ పనిచేస్తుంటే శ్రమే వుండదండీ. కానీ మనకు అసలు అన్ని గ్రంధులూ పనిచేయవు. ఆ విధంగామనకు చేసి పెట్టే వరుణ ప్రజ్ఞ మనలో పశ్చిమంగా మూలాధారం, స్వాధిష్ఠానం లో ఉంటుంది. నిజానికి భౌతిక బలం కూడా అక్కడే ఉన్నది. యోగ బలం అలా ఉంచి, నడుము దగ్గర ఏ పూస అయినా నెప్పెట్టిందనుకోండి, చెంబు కూడా ఎత్తలేం. ఆ మూల బలమే వరుణ ప్రజ్ఞ. అందుకే వరుణపాశం అంటాం. వేసి లాగితే ఎంతటిదైనా వచ్చేయాల్సిందే. మన పెద్దవాళ్లు వరుణ ప్రజ్ఞ గురించి చెప్తూ, 'అసలు ఆకాశమే ఒక తరంగములతో నిండిన ఒక సముద్రం లాంటిది. (అందుకే మనవాళ్లు 'ఆకాశగంగ' అంటారు. ఆకాశంలో ఉండే తరంగాలు నీరే! స్థూలంగా/ భౌతికంగా నీరు మనం భూమి మీద చూస్తున్నాం. ఆకాశంలో దీని సూక్ష్మస్థితి ఉన్నది. అందుకే అది నీరుగా కిందకి వస్తుంది.) తరంగాలు తరంగాలుగా ఆకాశంలో సముద్రం వెళ్తుంటే, దానిమీద ఒక తెల్లని నిగనిగలాడే మొసలి తేలి వెళుతున్నట్లుగా ఉంటుందండీ. ఆ మొసలి మీద ఒక ఐదు సంవత్సరాల కుర్రాడు అద్భుతమైన సౌందర్యం కలిగిన వాడు, కూర్చుని ఉంటాడుట. ఆయన చేతిలో ఒక త్రిశూలం ఉంటుందట. ఆ త్రిశూలం పెట్టి ఆ చోటులో అలా రాస్తూ పోతూ ఉంటాడట. దాంట్లో నుండి శబ్ద తరంగాలు పుట్టుకొచ్చి అక్కడ నుండి సృష్టి దిగి వచ్చేస్తుంటుందిట. ఇదట 'వరుణుడు'! కుంభరాశి తత్వానికి అధిపతి వరుణుడు. ఇదంతా ఈయనే అని, భీష్ముడు కృష్ణుడి గురించి చెప్తున్నాడు. విష్ణువుని చూపించి అది కూడా నువ్వే కదా, ఇది కూడా నువ్వే కదా, అన్ని నువ్వే కదా. అని చెప్పుకోవడం విష్ణు సహస్రనామం అంటే!

# 577 వృక్షః

ఇలా దిగి వస్తూంటే ఓ పెద్ద చెట్టులాగా అయిపోయింది సృష్టి అంతా! ఎక్కడ మొదలుపెట్టాడు? వెలుగు కవ్వాల ఉండేవాడి వద్ద మొదలుపెడితే అది వెలుగై, వెలుగు నుండి వెలుగు ముద్దలు, ముద్దల్లోంచి సంసారులూ, సన్యాసులూ, వాళ్లలో నుండి గోళాలు, గోళాలలోంచి జీవులు, ఇవంతా ఒకే మూలం! ఆ మూలం నుండి ఇంత చెట్టు. ఈ చెట్టు గురించి 15వ అధ్యాయంలో చాలా బాగా ఇచ్చారు. భగవద్గీతలో. 'ఊర్ధ్వ మూలం అధః శాఖం' అని. పురుషోత్తమ ప్రాప్తి మనకి కలగాలని తాపత్రయపడి మనచేత బట్టీ పట్టిస్తారు. అందుకు రెండు కారణాలు: ఒకటి, పురుషోత్తమ ప్రాప్తి జరగాలని, రెండు, అన్నిటికన్నా చిన్న అధ్యాయం అని. పెద్దదయితే చదవం. మామూలుగా చెట్టుకుమూలం కింద ఉంటుంది కదా. కానీ ఈ సృష్టి చెట్టు తలకిందులుగా ఉంటుందయ్యా, అంటాడు. భగవంతుణ్ణి వృక్షంతో పోల్చడం అనేది వేదంలో చాలా చోట్ల ఉన్నది. సృష్టి అంతా ఒక వృక్షం కింద చెప్తారు. ఆ వృక్షంగా దిగి వచ్చింది వాడే, అని చెప్తారు. బైబిల్ లో వృక్షం ఉంటుంది. ప్రతి దైవపరమైన సిద్ధాంతంలోనూ వృక్షం ఉంటుంది. ఇక్కడ మూలాలు సూక్ష్మంగా ఉంటాయి. శాఖలు కిందకు దిగి ఉంటాయి. తలకిందులుగా ఉంటుంది. అవి స్థూలంగా ఉంటాయి. మూలం తెలియదట. అదృశ్యంగా ఉంటుంది. మనలో కూడా అంతే. మన మూలం తెలియదు. మనం ఏమన్నా పని చేస్తుంటే, లోపల ఏం పెట్టుకుని పని చేస్తున్నామో ఎవరికి తెలుసు? మనం కూడా ప్రతినిత్యం సూక్ష్మంలో నుండి స్థూలం లోకి వస్తూ ఉంటాం. ముందు మనం లేస్తాం. మనలోంచి భావం లేస్తుంది. భావం లోంచి భాష, మాట, చేత వస్తాయి. ప్రతినిత్యం సూక్ష్మంలో నుండి స్థూలం లోకి వస్తూనే ఉన్నాం. అదీ వృక్షం! అవి చిలవలు పలవలుగా తయారైపోతూ ఉంటాయి. మళ్లీ మనం చేసిన వాటిలోంచి మళ్లీ కొత్తవి పుట్టుకొస్తూ ఉంటాయి. ప్రతి శాఖలోంచి మూలం పుట్టుకొస్తూ ఉంటుంది. అదీ మర్రిచెట్టు! సృష్టి మామిడి చెట్టులా ఉండదు. అందుకనే సృష్టిని మర్రిచెట్టుతో పోలుస్తారు. శాఖలాగా వచ్చింది మళ్ళీ నేలలోకి వెళ్లిపోయి, అక్కడ నుండి అది మరో మూలం అయిపోయి, ఇంకో చెట్టు తయారైపోతూ ఉంటుంది. అలా తామర తంపరగా పెరిగిపోతూ ఉంటుంది. అసలు మొదలు ఎక్కడో తెలియదండీ. కనకే మర్రి చెట్టుని సృష్టికి సంకేతంగా ఇచ్చారు. సృష్టి అవగాహనకు పనికొస్తుందని ఆ చెట్టుని ప్రార్థనలు చేసుకుంటూంటారు. మర్రిచెట్టు నీడ కింద కూర్చుని ధ్యానం చేసుకుని జ్ఞానం పొందిన వారున్నారని చెప్తారు. అంతేకాదు, ఎక్కడ మర్రిచెట్టు ఉంటే అక్కడ మునులు అదృశ్యంగా తపస్సు చేసుకుంటుంటారని చెప్తారు. ప్రత్యేకించి రావి, మర్రి చెట్ల మీద సూక్ష్మ శరీరాలతో చాలామంది మునులు తపస్సు చేసుకుంటూ ఉంటారు. అందుకే చాలాచోట్ల మర్రికీ,

రావికే ఒక ప్రాముఖ్యత రావడం, దానివద్ద ఏవో నాలుగు రాళ్లుపాతుకుని పూజ చేసుకోవడం, దాని చుట్టూ తిరుగుతూండడం, ఇలా జరుగుతూంటుంది. మనం ఏదో పల్లెటూరి వాళ్ళ మూఢనమ్మకం అనుకుంటాం. వాళ్లలో ఆ భావన కలగాలంటే అక్కడ ఏదో ఉండడానికి కారణం ఏదో ఉండే ఉంటుంది. లేకపోతే అక్కడే ఎందుకు జరగాలి. అక్కడ ఏ దైవపరమైన అద్భుత కార్యం జరిగినా అక్కడే ఎందుకు జరిగిందని ఆలోచిస్తే, అక్కడ స్థలమహత్యం చాలా ఉంటుంది, వెతికి చూస్తే. కృష్ణుడు చెప్తాడు 'నీకు ఈ సృష్టిలో మూలం తెలియదు. ఎందుకంటే వృక్షం మూలాలు, శాఖలు ఒకదానికొకటి జమిలిగా అల్లుకుపోయినాయి' అని. అసలు మనం ఎందుకు మొదలు పెట్టామో మర్చిపోతాం కొంచెం దూరం వెళ్లేసరికి. గురు పూజల్లాంటివి ఎందుకు చేస్తున్నామో తెలియకుండా చేసేస్తుంటాం. అలాగే పూజలు, ధ్యానాలు ఎందుకు మొదలు పెట్టామో మర్చిపోయి, ఎక్కడో దిగబడిపోయి, అసలు దారి వదిలేసి ఎక్కడికెక్కడికో వెళ్ళిపోతూ ఉంటాం. సృష్టిలో ఆ తత్త్వం కూడా ఉన్నది. అందుకని మూలం మర్చిపోతాం. మాస్టర్ గారి మార్గంలో ఉండే వారికి, మన వరకు మూలం CVV గారి మంత్రం! అది మర్చిపోయి ఎన్ని పెంచుకుంటున్నాం? అసలు ఎక్కడో పడిపోయింది. మనం కూడా వ్యాపారమో, ఉద్యోగమో మొదలుపెట్టినప్పుడూ అంతే. ఏదో మొదలుపెట్టి, పోనీ ఆదివారం పూట కాస్త real estate చేస్తే బాగుంటుందనిపిస్తుంది. చాలడం లేదని. చాలక పోవడమేమిటో? ఉన్నదానితో బ్రతకడం నేర్చుకుంటే యోగం! చాలడం ఎప్పటికీ ఉండదు. 1000 రూపాయలు ఉంటే 1500 ఉంటే బాగుండనిపిస్తుంది. ఇలా లెక్క పెరిగిపోతుంది. బావుందిట, అనిపించడం ఉండదు. చాలక పోవడం అంటే రోగం. ఉన్నదానితో సరిపెట్టుకోకపోతే మూలం పోతుంది. ఇలా ప్రతి విషయంలోనూ మూలం పోతుంది. సృష్టిలో ఒక ధర్మంగా ఉందీ మాయ. ఇక్కడ ఈయన మొత్తం వృక్షంలో, శాఖలో, కొమ్మల్లో, మొగ్గల్లో, పువ్వుల్లో, కాయల్లో, పళ్ళల్లో అంతా నిండి ఉన్నాను. కాబట్టి ఈ మొత్తంలో నన్నెక్కడ దర్శనం చేసినా మూలంలోకి వచ్చేస్తావు, అని చెప్పాడు. అదీ పురుషోత్తమ ప్రాప్తి! ఊరికే మూలం కోసం వెతికి, అన్నిచోట్ల గుంటలు చేయకు, అంటాడు. మర్రి చెట్టు వద్దకు వెళ్ళి మూలం కోసం అన్నీ తవ్వేసి పాడుచేయకా, నీకు కనబడే ఏ భాగంలో అయినా సరే 'అక్కడ నేనే అలా ఉన్నాను' అని భావన చేస్తే అందులోంచి లేదా అక్కడి నుండి మూలల్లోకి వచ్చేస్తావు అని చెప్పాడు. ఆకుకూడా మామిడి చెట్టేగా. ఆకులోకి అలా విపులీకరించుకుంటూ లోపలకి వెళ్తే, అందులోంచి అణుతత్త్వంలోకి, అక్కడ నుండి శాశ్వత తత్త్వంలోకి వెళ్తాం. ఇలా ఎక్కడన్నా నన్ను దర్శించుకోవచ్చు. అక్కడ నన్ను ప్రాప్తించుకో, అని చెప్పడం పురుషోత్తమ ప్రాప్తి యోగం! 'ఇహ వెతకబాక. నీలోనే ఉన్నాను. నీలోనే చూసేసుకో, అక్కడా ఇక్కడా ఇహ తిరగక' అని చెప్పడం. ప్రాప్తికి మనలోపలే, మన వెనకాలే తిరుగుతున్నాడు. ఎవరికోసం అయితే వెతుకుతున్నామో వాడు మన వెనకాలే ఉంటాడూ, మనలాగా ఉంటాడు. ఎలా

కనిపిస్తుంది? అదీ తమాషా! హిరణ్యకశిపుడికి నారదుడు చెప్పిన అద్భుతమైన విషయం. దీన్ని EK గారు చాలా బాగా చెప్పారు. 'నీ శత్రువు నీ ఇంట్లోనే ఉన్నాడేమో' అంటాడు నారదుడు. 'మా ఇంట్లో ఎట్లా ఉంటాడు?' అంటాడు హిరణ్యకశిపుడు. 'అసలు నీలోనే ఉన్నాడేమో' అంటే ఇహ మరి ప్రశ్న లేనట్లుగా ఉండదూ? మనమెంత వెర్రి వాళ్ళం కాకపోతే మన లోపల ఉండే వాడి గురించి బయట వెతుక్కుంటున్నాం. పాపం నారదుడు హిరణ్యకశిపునికి సాయం చేద్దామనుకుంటాడు. అయినా వాడు 'వీల్లేదు', అంటాడు. మనం కూడా లోపల ఉండడానికి వీలులేదని తలుపులు వేసేసుకొని, బయట ఏ రాయో, ఏ చెక్కో పెట్టుకుని తాపత్రయపడిపోతూంటాం. ఊ కానీ... అంటాడు. 'యద్భావం తద్భవతి'! అందుకని పురుషోత్తమ ప్రాప్తిలో ఒక రహస్యం ఉన్నది. అసలు 18 అధ్యాయాలు 18 రహస్యాలు. తెలిస్తే సృష్టి అంటే ఏమిటి, నువ్వేమిటి, దేవుడేమిటి, అన్ని తెలిసి ఇక ఘర్షణ ఉండదు. పడి ఉండడమే ఉంటుంది. వాడికి ఏమీ సందేహాలు ఉండవు. అవకాశం మేరకు అనుభూతి చెందుతూ ఉంటాడు, వాడి యొక్క లీలలని. కొడితే పడతాడు. తిడితే తింటాడు. వాడూ వైష్ణవుడు! చిత్రకేతుకు శివుడు రాక్షసుడై పుట్టమనీ శాపమిస్తే, 'మహా ప్రసాదం' అంటాడు. ఆయనే వృత్రాసురుడు! రాక్షసుడు గా ఉంటే మాత్రం ఏం? వాడి భావనలో ఉన్నప్పుడు నువ్వు పందిలా ఉంటే ఏం, రాక్షసుడులా ఉంటే ఏం, కుక్కలా ఉంటే ఏం? ఎలా ఉంటే ఏం? అందుకనే బలి చక్రవర్తిని మోకాలు లోతుకు తొక్కేస్తే ఏమీ మాట్లాడలేదు. ఎందుకు మాట్లాడలేదు? అక్కడ మాత్రం నువ్వు కాదా ఉన్నదనీ! అదే విషయం. ప్రహ్లాదుడుకే ఇంకా కొంచెం doubt వస్తుంది అంటే, మరి బలి చక్రవర్తి ఎంత ఎదిగాడో చూడండి. తొక్కబడ్డ వాడు ఏమాత్రం దావా వేయలేదు. 'నేనేం చేశానని నన్ను తొక్కేశావు' అని అడగలేదు. వాళ్ళ ఆవిడ అడిగింది 'ఎందుకు అలా తొక్కేస్తున్నావు? నీకేమన్నా న్యాయం ఉన్నదా' అని. పై నుండి బలి తాత ప్రహ్లాదుడు, చూస్తాడు. చూసి 'అన్యాయం చేస్తున్నారు గురువుగారు, ఇన్నాళ్ల నుండి నమ్ముకున్నాను నా మనవడిని ఇలా చేస్తారా' అని. ప్రహ్లాదుడి వైపు ఓర కన్నులతో చూస్తాడు. ఉండబట్ట లేక అడిగితే బలినే అడుగు అంటాడు. అతను 'నాకు బావుంది. ఇక్కడా నువ్వే కదా ఉన్నదీ, నీ ఆజ్ఞ మేరకు నేను ఎక్కడన్నా ఉంటాను', అంటాడు. యముడు ఎందుకు ఎప్పుడూ యమలోకంలో ఉండాలి? కాసేపు స్వర్గంలో ఎందుకు ఉండకూడదు? అయితే అలా అనుకోడు యముడు. ఎక్కడుంటే ఏమిటిట 'వాడి' పనిలో ఉన్నాం. 'ఆ ఇంద్రుడు ఎప్పుడూ సింహాసనం మీద కూర్చుంటాడు, నేను ఎప్పుడూ వీళ్ళ ప్రాణాలు తీస్తూ ఉండాలా' అనుకోడు. ఏ పనిలో ఉన్నవాడైనా 'వాడి' పనిలో ఉన్న వాడికి 'అదే' ఆనందం. వాడిక్కడున్నాడు, అక్కడున్నాడు, కుర్చీ మీద కూర్చున్నాడు, నేను నేల మీద కూర్చున్నాను, ఏమీ ఉండవు. వాడికే పురుషోత్తమప్రాప్తి! మనలా choice ఉండేవాడికి ప్రాప్తి ఉండదు. వెంకటేశ్వర స్వామి గుడికి 200 రూపాయలు ticket కొనుక్కుని అర్చనకని పొద్దుటే ఏడుస్తూ వెళ్తాం. ఎందుకంటే దర్శనం ఇష్టమైతే జరుగుతుంది, ఇంకో

అప్పుడైతే జరగదని. ఆ పాడ్డటే లేవడం ఎప్పుడూ గండమే! పైగా దీనికైతే ఒంటిగంటకే లేవాలి. ఒంటి గంటకి లేచి ఎలాగో తయారై అక్కడికి చేరుకుంటే పరిగెత్తాలి లోపలికి. మరి ముందు గదిలోకి వెళ్లాలి కదా. మనం ఎన్ని ప్రయత్నాలు చేసుకుని వెళ్లినా అక్కడ already ఎవరో recommendations పట్టుకుని ఉంటారు, మనకన్నా ముందే. మనం ఎలాగూ ఆ జయ విజయుల వద్దే పడి ఉంటాం. అక్కడ నుండి ఆ తోమాల సేవ, అర్చన జరిగినంత సేపూ ఆ ముందు వాళ్లంతా మనకన్నా ముందే వచ్చి కూర్చున్నారు అనే బాధ తప్ప, ఏం చూశాం? పోనీ ఆ ముందు కూర్చున్నవాడికైనా ముందు కూర్చున్నాననే ఉత్సాహం తప్ప దేవుడు మీద శ్రద్ధ ఉండదు. ఎందుకంటే ఎప్పుడు ఇంటికి వెళ్లి, నేను ముందు కూర్చున్నాను అని చెబుదామా అని ఉంటుంది. ఎంతో సేపు చూడనివ్వరు గనుక మరీ మరీ చూడాలనిపిస్తుంది వెంకటేశ్వర స్వామిని! అదే ఒక గంట వాడి ముందు కూర్చొబెడితే మళ్లీ వెళ్లాలనిపించకపోవచ్చు. అక్కడ జయవిజయులు అంటారూ 'మమ్మల్ని చూడు మాలో ఉన్నాడు వాడు' అని. వాళ్ళని అసలు బొత్తిగా 'నువ్వేంటిలే' అన్నట్లు చూస్తాం. ప్రాప్తి అక్కడే దొరకొచ్చు, నిజంగా చూడగలిగితే! అసలు అక్కడికి పోయి వెతుక్కోనక్కరలేదు నీ ఇంట్లోనే దొరుకుతుంది. ఓ పిల్ల పిట్ట అమ్మ పిట్టతో 'ఎక్కడికి బయలుదేరావ్' అందిట. 'అక్కడ దేవుడున్నాడుట, చూసి వస్తాను' అందిట. 'దేవుడు అక్కడ ఉండడం ఏంటి? అక్కడకి వెళ్ళి చూడడమేమిటి' అంటుంది. అంటే, వాళ్ళ అమ్మ ఇది నాస్తికురాలు, అనుకుంటుంది. వెళ్ళొస్తుంది. 'ఏం చూసొచ్చావు? దేవుడ్ని చూశావా' అంటే, దేవుడిని కాదు, అక్కడ ఏదో ఓ బొమ్మని పెడితే చూసి వచ్చాను' అంటుంది తల్లి పిట్ట. 'దేవుడిని చూడడానికి అంత దూరం వెళ్ళనక్కర్లేదు, ఇక్కడే చూడొచ్చు' అంటుంది పిల్ల పిట్ట. పుణ్యక్షేత్రాలకు వెళ్ళండి. కానీ చూడ్డానికి ప్రాప్తి ఎక్కడుంటే అక్కడే దొరుకుతున్నప్పుడు అక్కడ చూడగలగాలి, అని పురుషోత్తమ ప్రాప్తి యోగంలో ఈ వృక్షం గురించి కృష్ణుడు చెప్పాడు. చెట్టులో నువ్వెక్కడ చూసినా అక్కడ నన్ను గుర్తించవచ్చు. మూలం కోసం మొత్తం అంతా తవ్వి చెట్టు పాడు చేయవద్దంటాడు. దేవుడి పేర సగం యుద్ధాలు జరిగినాయి ఈ భూమి మీద. క్రిందటి శతాబ్దంలో శైవ, వైష్ణవ పోరాటాలు చాలా ఉన్నాయి. ఎంత కరుడు కట్టిన అజ్ఞానం! అలాగే క్రైస్తవులూ, ముస్లింలూ అయింది కదా. అవుతోంది కదా. దేవుడి పేర ఎంత రక్తపాతం జరుగుతున్నదీ? 15వ అధ్యాయంలో కృష్ణుడు వద్దురా, అంటున్నాడు. చెట్టు పాడు చేయక. ఆకులు తుంచి పాడు చేయక, అక్కడ నేనున్నాను. నువ్వు చూస్తే నేను కనిపిస్తాను. అదీ 'వృక్షః'. పురుషోత్తమప్రాప్తియోగంలో 'వృక్షః' అనే నామం చదువుకోవచ్చు.

## 578 పుష్కరాక్షః

పుష్కరాక్షుడు అంటే కమలముల వంటి కన్నులు కలిగిన వాడు. అందమైన కనులు కలవాడు వాడు. మీ కళ్ళలో మంచి ఆకర్షణ రావాలంటే, భగవంతుడు కళ్ళు అందంగా ఊహించుకుని దర్శనం చేసుకుంటూంటే మన కళ్ళలో బోలెడు కాంతి వస్తుంది. ఆకర్షణ వస్తుంది. వాడి కళ్ళలోని కాంతిని నువ్వు ఎంత ఊహించుకుంటే,ఎందుకనీ? వాడే నీలోనే ఉన్నాడు. నీ కళ్ళు వాడివే. నువ్వు పిలవడం చేత అక్కడ అంత కాంతి వస్తుంది. విచ్చుకున్న కమలం లాగా భగవంతుని కనులు ఉంటాయని భావన. నిజంగా కమలాల లాగా చూస్తే కనులు బావుంటాయా? శుక్లాలు వచ్చినట్లు ఉంటుంది. మన ఋషులకు విపరీతమైన మోజు కమలాలంటే ఎందుకనీ? అది సూర్యునికి ఉన్ముఖంగా ఉంటుందనీ, సూర్యుడు వస్తే విప్పారుతుందనీ. నేను రాసిన' white lotus' లో ఓ కమలంలో ఎన్ని దివ్య విషయాలు ఉన్నాయో రాశాను, చూడండి. అలా కన్నులకీ, కమలాలకీ ఎందుకు పోలుస్తారంటే కన్ను ఎప్పుడూ వెలుగును కోరుతుంది, కమలం కోరినట్లే. మనం గమనిస్తే రాత్రి వెళుతూ ఉంటే ఎదురుగా lorry lights కళ్ళలో పడితే, కళ్ళు నొప్పి పుడుతాయి. కానీ మళ్ళీ ఇంకో లారీ వస్తుంటే మళ్ళీ దానిని చూడనే చూస్తాయి. చూడకుండా ఉండలేవు. అంతేకాదు, అలా చీకట్లో వెళుతూ ఉంటే ఎక్కడో దూరంగా light ఉంటే దాన్ని పట్టుకుంటుంది కన్ను. అంటే కంటికీ, వెలుగుకీ అంత సంబంధం ఉంటుంది. వెలుగుకీ, కమలానికీ అంత సంబంధం ఉంటుంది. అందుకని కన్నులు కమలాలతో పోల్చడం అనేది పెద్దలు చేసిన ఒక ప్రక్రియ, లేదా కవి సమన్వయము. లేదా వారి యొక్క సృజనాత్మక దృష్టి! గభాల్న నీతో సంబంధం లేకుండా నువ్వు చూసేలోగా కన్ను వెలుగును చూసేస్తుంది. పెద్ద flash light అయితే వెంటనే చూసి కళ్ళు మూసేస్తుంది తప్ప, చూడకుండా ఉండదు. కాబట్టి కన్నులలో భగవంతుని ఆరాధన చేసేవాడికి ఆ కాంతి ఏదైతే ఉందో, మనలో కూడా ఆ కాంతి కన్నులలో నుండి బయటకు వస్తూ ఉంటుంది. అందుకే కనులే చూస్తూంటాం. మనం అద్దంలో చూసుకున్నా, మనం సరాసరి చూసేది ఆ కన్నులలోని వెలుగే. వాడే అక్కడ దేవుడు. కళ్ళు చూసి, మన మొహం అలా ఉంది, అందంగా ఉంది ఇలా అనుకోవడం ఒక పద్ధతి. మన కన్ను అద్దంలో చూసినప్పుడు ఆ కన్నులో వెలుగు బిందువు లాగా, కిరణాల లాగా వస్తాయి. అది భగవంతుడు నీ లోపల ఉన్న వాడు నీకు గోచరిస్తున్నాడు. మనకన్ను మనం చూసుకోలేకపోతే వదిలేయ్. ఎదుటివాడి కన్ను చూసినప్పుడు వాడి కన్నులో ఉండే కాంతి దేవుడని చూడగలవా? ఆవు కన్నులలోనికి చూడండి, ఎంత బాగుంటుందో. అలా కన్నుల్లోకి చూసి, ఆ వెలుగుని దేవునిగా దర్శిస్తే, గేదె కన్నులలో కూడా బాగుంటుంది. ఏ కన్నుల్లో చూసినా బాగుంటుంది. ప్రతి కన్నులోంచి బయటకు

వ్యక్తమయ్యేది వెలుగే. వెలుగు మొదటి తొడుగు కదా మరి, అసలు తత్త్వానికి. మరి మనం ఇలా చూసుకోవచ్చు కదా. కనబడ్డాడా, కనబడుతూనే ఉంటాడు ఇలా చూస్తే. ఇదంతా కాదండి, వాడికి రూపం లేదు, నామం లేదు, చూస్తాం అంటే ఏం చూస్తావు? ఇందులోంచి దర్శనమిస్తాడు. అదే అమ్మ వారిలో నుండి అయ్యవారిని చూడ్డం. అది పుష్కరాక్షః! ఇదివరకు మీకు పుష్కరాక్ష గురించి చెప్పాను. ఏమిటయ్యా అంటే పుష్కరాక్షుడు అనే ఒక రాజు ఉన్నాడు. ఆయన పేరు పుష్కరాక్షుడు కాదు. అది ఆయనకు బిరుదు వచ్చింది. ఎందుకొచ్చిందంటే, రోజు 108 కమలాలతో, అది కూడా ఎక్కడో ఒక ప్రత్యేకమైన ప్రదేశం నుండి ఆయన తెచ్చుకుని పూజ చేస్తూ ఉండేవాడు. సౌగంధిక పుష్పం కోసం భీముడు వెళ్లినట్లు, చాలా ప్రత్యేకమైన సరస్సు నుండి తీసుకుని వచ్చి పూజ చేస్తూ ఉంటాడు. ఒకరోజు రెండు కమలాలు తక్కువ వస్తాయి 108 కి. అప్పుడు శుభ్రంగా అతని రెండు కళ్ళు తీసేసి అక్కడ వేసి పూజ చేస్తాడు. ఆయన కన్నులు కూడా అంత అందమైన కన్నులట. అందరూ అంటుండే వారట. కమలాల లాగా ఉంటాయి మీ కళ్ళు, అందంగా ఉంటాయి అని. 106 ఉన్నాయి రెండు తక్కువైనాయి. ఏం చేయాలి? ఏం చేస్తాడు? అందుకని ఏం చేస్తాడంటే ఎలాగూ తన కళ్ళు కమలాల లాగా ఉంటాయని అందరూ అంటుంటారు కదా. అందుకే ఈ రెండు కమలాలతో 108 చేద్దామని, అతని రెండు కళ్ళు పీకేసి, అక్కడ వేసేశాడటండీ. భగవంతుడు ఇట్లా చేస్తే సంతోషిస్తాడా అంటే 'సమర్పణ'! వాడివే కదా కళ్ళు. అప్పటి నుండి నీ పేరు కూడా నేను పెట్టుకుంటా నన్నాడట దేవుడు. నా నామాల్లో, నీ పేరు కూడా నాకు నామంగా వస్తుంది. కళ్ళు ఇచ్చిన వాడివి నువ్వు, అని 'పుష్కరాక్ష' అనే నామం వచ్చిందని అప్పుడు చెప్పుకున్నాం. మళ్లీ పుష్కరాక్ష ఎందుకు ఇప్పుడు? వ్యాసుడు మళ్ళీ మళ్ళీ అవే నామాలు వాడుతూ ఉంటాడు. వెయ్యి ఎనిమిది నామాలు దొరక్క మళ్ళీ అవే నామాలు వాడేశాడా? కాదు! సంస్కృతంలో ఒకే పదానికి లక్ష అర్థాలు ఉంటాయి. ఒక్కొక్కసారి, ఒక్కొక్క అర్థంలో వాడుతారు. ఇక్కడ ఎందుకు వాడారు అంటే, అటువంటి కన్నులతో చూస్తే, (అంతకుముందు వృక్షః ఉంది కదా.) అన్నింటిలో అందరి కన్నులతో ఉన్న వెలుగును చూసినప్పుడు, చెట్టులో నుండి వచ్చిన పువ్వులో కూడా చూడవచ్చు. లేతఆకులో చూడవచ్చు. రెమ్మలో చూడవచ్చు. కొమ్మలో చూడవచ్చు. అట్లా చూసే దృష్టి ఏర్పడుతుంది కాబట్టి ఇక్కడ పుష్కరాక్ష గురించి అట్లా చెప్పుకోవాలి.

## 579 మహామనాః

మహామనాః అంటే మొత్తం మనసనే సృష్టి మనస్సు! సృష్టి మొత్తము లో ఉండే పదార్ధం జీవుడి శరీరంలో కొంత కొంతగా ఉంటుంది. భూమిలో ఉన్న మట్టి లోంచి మన శరీరంలో మట్టి కూడా వస్తుంది. ఎందుకంటే మనం తినే ఆహారంలో నుండి ఏర్పడే శుక్రకణం లో ఉండేది ఈ భూమికి సంబంధించిన పదార్థము యొక్క మూలమే ! మొత్తం భూమి లోంచి శరీరం కొంత కొంత తీసుకొని ఈ భూమిలోని జీవులు శరీరం ఆకృతి ఏర్పరచుకున్నాయి. అందుకని మనం తిరిగి ప్రయాణము అయినప్పుడు, మరణించినప్పుడు భూమి దగ్గర నుండి తీసుకున్నది తిరిగి భూమికి అప్పచెప్పడమే! అలాగే భూమి చుట్టూ నీరు ఉంది. మనలో కూడా నీరు ఉంది. భూమి, భూమి మీద ఉన్న నీరు ఏ శాతంలో ఉన్నదో భూగోళం మీద, అదే శాతంలో మనలో ఉండే భౌతికమైన పదార్థము నీరు వుంటాయి. నీరు ఎక్కువ! అదే మనకి రక్తంగా ప్రవహిస్తూ వుంటుందని అంటారు. కాబట్టి ఈ మొత్తం భూమిలోని నీరు మనలో కొంత నీరుగా పని చేస్తోంది. మొత్తము భూమి పదార్థము మనలో కొంత పదార్థముగా మన శరీరంలో కనబడుతుంది. అలాగే భూమి మనకి ఇచ్చిన, భూమిలో ఉన్న అగ్ని మన శరీరంలో కూడా, కొంత అగ్నిగా పని చేస్తూ ఉంటుంది. అలాగే భూమి చుట్టూ ఉన్న వాయువు మన శరీరంలో కొంత వాయువుగా పని చేస్తుంది. భూమి చుట్టూ ఉన్న ఆకాశము, మనలో ఆకాశముగా పని చేస్తుంది. దానిని ఘటాకాశము అంటారు. అంటే ఘటములు, ఆకృతులు, శరీరములు, వాహికలు వీటియందు ఉంటుంది. ఈ భూమి చుట్టూ ఏర్పడిన పంచభూతములే మనలో కూడా పని చేస్తున్నాయి. అలా అన్నీ పోగేస్తే మన శరీరము ఏర్పడుతుంది. పాంచభౌతిక శరీరము లేదా పంచభూతములచే తయారు చేయబడిన శరీరము మనది. అలాగే ఏ గోళానికి చుట్టూ ఉండే పంచభూతాలు ఆ గోళానికి సంబంధించిన పంచభూతాల శరీరంగా ఏర్పడతాయి. శుక్రుడు, బృహస్పతి, అంగారకుడు, ఇలా గ్రహాల మీద కూడా జీవులు ఉన్నారు. వారు మనకు గోచరించక పోవటానికి కారణం అక్కడ వారిలో ఉండే పంచ భూతముల యొక్క స్వభావములు వేరు, ఇక్కడ ఉన్నవారివి వేరు. మనకన్నా రెండితలు సూక్ష్ముగా ఉంటాయి శుక్ర గ్రహము మీద. మన కన్న ఆరింతలు సూక్ష్ముగ వుంటాయి బుధ గ్రహము మీద. మన కన్నా ఏడింతలు సూక్ష్ముగ వుంటాయి సూర్య గ్రహము మీద. ఈ మన శరీరంతో అక్కడ సూక్ష్మంగా ఉండటానికి అవకాశము లేదు. కాని వాళ్ళకి మనమంతా కనిపిస్తూ ఉంటాము కానీ మనకి వాళ్ళు కనిపించరు. పెద్దలు చెప్పిన విషయం చెబుతున్నాను. మనకి వాళ్ళు కనిపించాలంటే మనలో కుడా దానికి సంబంధించిన శరీరం తయారు చేసుకునే విధానము ఒకటి ఉన్నది. అది తయారైతే కనిపిస్తారు. అందుకనే నారదుడు వంటి మునీశ్వరులు, అన్ని గోళాలకి వెళ్ళగలుగుతారు.

భూగోళం మీదకి ఎప్పుడు అవతార మూర్తులు దిగివచ్చినా, శుక్ర గ్రహము మీదుగా దిగి వస్తారు. శ్రీకృష్ణుడు కూడా అలాగే శుక్రగ్రహము మీద నుండి దిగి వచ్చాడు! భూమి మీద పూర్ణప్రజ్ఞ సాధించిన వారు శుక్రగ్రహం లోకి వెళ్తారు, అని ఋషులు చెప్తారు. ఇట్లా పంచ భూతాలతో ఏర్పడిన శరీరాలు కలిగిన గోళములు, ఆ గోళములు ద్వారా జీవులు. మనకీ ఉంది పంచ భూతాలతో తయారైన శరీరం. ఈ శరీరాన్ని నడిపించే మనస్సు ఒకటుంది. ఇప్పుడు ఈ శరీరం మనది కాదని తెలుస్తుంది గదా! ఎందుకనీ? మొత్తం భూమి చుట్టూ ఉన్న పంచ భూతాలు కొంత మనకి అప్పు ఇచ్చారు. అప్పు తెచ్చుకుని, పండుగ చేసుకుంటున్నాము మనం. మనది కాదు శరీరం. Remember The One Giver అంటారు. ఇచ్చినందుకు వాడిని గుర్తు పెట్టుకోవాలి. ఇచ్చిన వాడిని గుర్తు పెట్టుకో! నీది అనుకోబాక! నీదా? పదార్థము నీది కాదు, జలం నీది కాదు, అగ్ని నీది కాదు, ఏదీ నీది కాదు. ఏదైనా తిన్నగా పని చేయకపోతే శరీరం కూడా నీది కాదు. కదా. జలం సరిగా పనిచేయకపోతే అవీ ఇవీ, అక్కడా ఇక్కడా వాస్తూ వుంటాయి. ఎక్కడైనా నీళ్లు నిలిస్తే మోకాళ్ళు, పాదాలు, కాళ్ళు ఇలా వాచిపోతుంటాయి. అగ్ని తక్కువ అయితే రకరకాల ఇబ్బందులు, బాధలు, రుగ్మతలు వస్తాయి. అగ్ని ఎంత ప్రజ్వలంగా దేహం లో వుంటే అది సమస్తాన్ని దహించి వేస్తూ ఉంటుంది. అందుకు అగ్ని బాగా ఉండాలి. అగ్ని బాగా ఉండాలంటే వాయువు బాగా ఉంచుకోవాలి. ఉచ్ఛ్వాస నిశ్వాసలు వాయులీనాలు అంటాం కద! మన పంచ ప్రాణాలు వాయు రూపములో ఉంటె మనవి అనుకుంటున్నాము. కాదు. అలాగే ఆరోది! దానిని 'మనస్సు' అంటారు. అదే మన శరీరాన్ని పని చేయిస్తున్నది. అది కూడా మనది కాదు. ఈ మొత్తములో ఏదీ మనది కాదు, అంతా అప్పే! అద్దె ఇల్లు, అద్దె ఇల్లు అని అంటూ ఉంటాము కదా సొంతఇల్లు లేదని. అసలు ఉన్నదే అద్దె ఇల్లు! ఇంకా ఆ పైన స్వంత ఇల్లు ఏమిటి? తెలివైన వాడు కట్టడు, తెలివి తక్కువ వాడు స్వంత ఇల్లు కట్టుకుంటాడు. ఇంగ్లీషువాడు అదే అన్నాడు 'Fools build houses and wise men live in them' అని. ఏదీ మనది కాదు. వెళ్లిపోవాలంటే వెంటనే చెంబూ, తప్పేల పట్టుకుని బయటకి వెళ్ళిపోవాలి. అదే మన ఇల్లు అయితే అలా వెళ్ళిపోలేము కదా. ఈ శరీరం మన ఇల్లు అనుకోవడము వల్లనే కదా, వెళ్ళిపోలేము! 'అద్దెల్లురా, నీది కాదురా, ఉండనిచ్చారురా' అని గుర్తుంటే వెళ్ళడం సులభం. అలాగే మన మనస్సు కూడా అడ్డము వస్తుంది. మహామనస్సు నుండి కొంత మన దాంట్లో కూడా పెట్టారండీ! మనము తెచ్చుకోలేదు. మీ ఇంట్లో ఇదికూడా ఉంచుకో, అని పెట్టాడు. మొత్తము మనస్సు ఎవడూ? వాడు 'మనువు' అంటారు. మొత్తము జాతికి వాడే మనస్సు. వాడే అందరిలోనూ కొంచెం కొంచెం మనస్సుగా ఉంటాడు. ఈ వూళ్ళో మనం అందరం ఇళ్లు కట్టుకున్నాము కదా. గాలి అందరిళ్ళల్లో ఉన్నది కదా. మరి అది మనదా? మనది కాదు కదా. కానీ అందరి ఇళ్లల్లోను కొంచెం కొంచెముగా ఉన్నట్టు అనిపిస్తుంది. అట్లా అందరిలో కూడా కొంచెం కొంచెం మనస్సుగా ఉంటుంది. ఇందరిలో మనస్సు

ఒకడిది! వాడి గురించి 'మహామనాః' అని చెబుతారు. ఇందులో ఏ ఒక్కటి మనది కాదు. మీరాబాయి ఒక చక్కటి పాట పాడింది. 'ఈ శరీరం నీది, ఈ సృష్టి నీది, ఈ సృష్టిలో మమ్మల్నందరినీ సృష్టించి, ఈ మాయ కల్పించావు. మేము మాత్రం ఎవరు కనక మేము నీ వాళ్ళమే! కాబట్టి మమ్మల్ని ఈ మాయ బాధపెట్టకుండా నువ్వే చూసుకోమని కోరుతున్నాము' అని. ఎంత గొప్ప విషయం! ఈ మాయను దాటివేద్దాము అని రకరకాల బాధలు పడుతూ ఉంటాము కదా. ఎలా దాట్తావ్? నువ్వూ వాడివాడివే, మాయా వాడిదే! మేము, మాయ నీకు చెందిన వారమే కాబట్టి నీకే చెప్పేస్తే చాలు కదా. మేము నీ వాళ్ళమే కదా మళ్ళీ నీ మాయతో నీవే మళ్ళా మమ్మల్ని ఎందుకు ఏడిపిస్తావ్? నువ్వే చూసుకో' అని సమర్పణ బుద్ధితో మీరాబాయి అన్నది. మన మనస్సుతో కదా మనం రకరకాల వర్గీకరణం చేసుకుంటుంటాము. అది వ్యక్తిగత మనస్సు అవుతుంది. మహామనస్సు అందరికోసం పనిచేస్తుంది. సృష్టిలో ఇవన్నీ ఏర్పడాలంటే మనం ఇంట్లో చెంబు తప్పేలా ఏర్పరుచుకున్నట్లే, ఆయన ఈ సృష్టి కార్యక్రమము లో ఈ సూర్యగ్రహ గోళాదులు, తోక చుక్కలు, మళ్ళీ వాటిలోంచి గోళాలు. ఇలా ఈ గోళాలన్నింటిని ఏర్పరిచినపుడు ఈ సమస్తము నిర్వర్తించటానికి ఆయనకి ఒక మనస్సు ఉంది. అది అందరి కోసం పని చేసే మనస్సు! మనదో? ఇచ్చినప్పుడు అందరికోసం పని చేస్తామని ఇచ్చారు. ఒకళ్ళ కోసం ఒకరు పని చేయటానికి పనికి వస్తుందని మనకి మనస్సు ఇచ్చారు. మనము అందరి కోసం కాకుండా మన శరీర పోషణం కోసం తయారైపోయేటప్పటికి అసలు మనస్సు కొంత అవస్థితి చెందింది. ఎంత సేపు నా కోసం, నా వొళ్ళు, నా ఇల్లు, నా వాళ్ళు ఇవే కదా? అలా గిరి గీసుకుంటావు కదా. గిరి గీసుకుంటే అప్పటి నుండి నీదై కొంత కర్మ నీకు కూడుతూ ఉంటుంది. మొత్తములో ఏ ఉద్దేశముతో మనకి తయారుచేసి ఇచ్చారో, ఆ ఉద్దేశముతోనే అనుసంధానం చెంది జీవిస్తూ ఉంటే సృష్టి వైభవంగా ఉంటుంది. సృష్టి మనకు వైభవముగా లేదు, అని మనందరికీ తెలుస్తుంది కదా ! ఏవో బాధలు పడుతూనే ఉంటాము. ఎందుకో తెలుసా? ఇచ్చిందాన్ని ఇచ్చినట్టుగా ఎందుకిచ్చాడో వాడకుండా ఇంకో రకముగ వాడుతూ ఉండడం చేత! అంచేత అక్కడ నుండి నీదైన కర్మ పుడుతూ వస్తుంది. అందరికీ చక్కగా ఆడుకోడానికి తండ్రి బొమ్మలు ఇస్తే, కొంత మంది పోట్లాడుకుంటారు బొమ్మల కోసం కదా. పోట్లాడుకోవడం తండ్రి ఉద్దేశము కాదు కదా. ఆడుకోవడం కోసమే ఇచ్చాడు. ఈ శరీరం కూడా చక్కగా ఆనందిస్తారని పాపం ఇచ్చాడు. మనలను దుఃఖ పెట్టే సంకల్పము లేదు. చాల మంది అనుకుంటారు, మనము చేసే వెకిలి పనులు, వికారం పనులు కూడా ఆ భగవద్ సంకల్పంలో భాగమే కదా. అని. కాదు! ఎందుకంటే మనకంటూ బుద్ధి ఒకటి ఇవ్వడం చేత, మనం తనంతటి వాడుగా తయారవ్వాలని తండ్రి కొడుక్కి అన్ని అప్పచెప్పేస్తాడు. ఎట్లా నడుచుకోవాలో కూడా చెప్తాడు. అట్లా నడుచుకోక, ఇంకో విధముగా నడుచుకోవడంతో బాధలు తెచ్చుకుంటూంటే ఇది తండ్రి సంకల్పము అని అంటే ఎట్లా?

ఇదా తండ్రి సంకల్పం? శుభమా అని ఆస్తి ఇచ్చి, పెళ్లి చేసి, ఇంట్లో ఉంటే కోడలికి కొడుకుకి ఇబ్బందిగా ఉంటుందని ఎక్కడికో వెళ్ళిపోయి, ఇన్ని చేస్తే, మానాన్న వలన నేను పాడైపోయాను అని చెప్పకున్నాడనుకోండి ఆ కొడుకు, ఎట్లా ఉంటుంది? అలా ఉంటుంది మనలో పుట్టే అజ్ఞానం కూడా ఆయన సంకల్పమే అనేది! సోమరితనం చేసి ఇట్లా మాట్లాడుకుంటూ ఉంటారు బాగుచేసుకోవడానికి ఇష్టము లేక. సృష్టి నిర్మాణము చేసి, సృష్టిలో ఎలా జీవించాలో తను తాను దిగివచ్చి చెప్పి వెళ్ళాడు. చెప్పలేదు అంటారేమో అని, ఈ భూగోళం పుట్టంగానే 'కపిలుడు' గా దిగి వచ్చాడు. దిగి వచ్చి యోగము ఇచ్చాడు, జ్ఞానం ఇచ్చాడు, భక్తి ఇచ్చాడు, వైరాగ్యం ఇచ్చాడు. ఇవన్నీ తీసుకుని చక్కగా ఈ నాలుగింటినీ మిళితము చేసుకొని ఆనందంగా జీవించ గల సంపత్తి ఇచ్చాడు. ఆ తరువాత పృథు చక్రవర్తిగా వచ్చాడు. వచ్చి, భూమి మీద ఏవేవి ఉన్నాయో అవన్నీ తెలుసుకుని, వాటిని మనం సద్వినియోగం చేసుకుని, ఆనందముగా జీవించటానికి కావాల్సిన విజ్ఞానము ఇచ్చేసి వెళ్లాడండి. ఈరెండు కూడా భగవంతుని ఏకవింశతి అవతారాలలో ఒక భాగం. ఏక వింశతి అంటే ఇరవైఒకటి. ఇరవై ఒక అవతారాలలో కపిలుడు ఒకడు, పృథు చక్రవర్తి ఒకడు. ఇచ్చి వెళ్లిన తరువాత చేసుకోలేదు అంటే తప్ప ఎవరిది? భగవంతునిదా? శుభ్రంగా వండుకోమని కారము లేని మిరపకాయలు ఇచ్చారు అనుకోండి. వంట చేసుకోవడం చేతకాక బజ్జీలు పాడైతే, ఇచ్చిన వాడిని తిడతారు కదా, వాడు ఇవ్వకపోతే మనకి ఈ బాధ ఉండేది కాదు కదా అని. భగవంతుడు మనకి అపారమైన కరుణతో మనస్సు ఇచ్చాడండి. అదీ తానే మనస్సుగా మనందరిలో ఉన్నాడు. మనందరిలో కలసి ఉన్న మనస్సుని 'మనువు' అంటారు. వాళ్ళు 14 మంది. అందులో ప్రస్తుతము ఉండే మనువు పేరు 'వైవస్వతమనువు'. వైవస్వత మనువు వివస్వత మనువు నుండి పుట్టుకొచ్చాడు. ఏమి చేస్తాడుటా ఆయన? అట్లా ఈనెలు లాగినట్లుగ మనకి ఆలోచనలు వస్తూనే ఉంటాయి, దాంతో మన సృష్టి మనం చేస్తూ వుంటూ ఉంటాం. వాడి సృష్టితో అనుబంధముగా మన సృష్టి మనము చేస్తుంటే ఆనందంగా ఉంటుంది. తండ్రి చెప్పిన పద్ధతిలో కొడుకు తనకి ఇచ్చిన ఆస్తి వాడుకుంటే, తండ్రి ఎంతో ఆనందిస్తాడు కదా. అలా సద్వినియోగం చేసుకోరా! అని మనస్సు ఇచ్చాడు. అది మన కోసమే అని మొదలు పెట్టడము చేత మనస్సుకి అవస్థితి కలిగి, బుద్ధి, మనస్సు higher mind, lower mind గ తయారు అవుతాయి. అసలు మనకి ఇచ్చినప్పుడు మనస్సు బుద్ధే! బుద్ధి ఉన్నవాడు బుద్ధిమంతుడు అయితే, ఆత్మచైతన్యము చుట్టూ తిరుగుతాడు. అతడూ 'బుద్ధుడు'! అన్ని గ్రహాలలో కెల్ల బుధగ్రహం సూర్యునికి అతి సన్నిహితముగ ఉంటుంది. సూర్యుడిని వదిలి ఇవతలికి రాదు. అక్కడ నుండి అవస్థితి చెందిన మనస్సు చంద్ర గ్రహము లాగ భూమి చుట్టు తిరుగుతుంటుంది. భూమి చుట్టూ తిరగడం అంటే, మనస్సు శరీరము చుట్టూ తిరగడం, శరీర పోషణ కోసం ఆలోచించడం అన్నమాట! ఈ శరీరముతో ఏర్పడిన సంబంధీకులు

వుంటారే, నా పెళ్ళాం, నా బంధువులు, మా వాళ్ళు మా వాళ్ళు అంటూ వుంటాము కదా, అట్లా ఆత్మ సంబంధం కాక శరీర సంబంధముతో ఉన్నవాళ్ళు అంతా కూడ, వాళ్ళ గురించి చెప్తారు 'చుట్టాలు దొంగలూ' అని, సుతులు ఋణస్థులు అని. నిజంగా అంతా ఋణమే! మానాన్నే మానాన్నే అని ఇదివరకు మనం అప్పు చేసి ఎగ్గొట్టి వచ్చేస్తే, వాడు ఇహ శుభ్రంగా మన నుంచే దిగి వస్తాడు. ఇంక అక్కడ ఇక్కడ ఎందుకు వీడి దగ్గర మన హక్కు వుంది, అని దిగి వస్తాడు. అప్పుడు వాడికి ఆ అప్పు తీర్చడానికి నానా అబద్ధాలు చెప్పిన వాణ్ణి ఇప్పుడేమో వడ్డీతో సహా ముక్కు పిండి మరీ పుచ్చుకుంటాడు. నీ బాకీ తీరక పోవడం చేత నీకు వాడు కొడుకుగా వచ్చాడు, తీర్చుకో ఇప్పుడు! అని చక్కగా రాశారు వాళ్ళు. వాడు నీ బాకీ తీరడం కోసం దిగి వచ్చాడు లేకపోతే తీరదు కదా. కమ్మగా తీరుస్తూ ఉంటాడు. తీరుస్తున్నాను అన్న భావన కూడా ఉండదు ఎందుకంటే 'మాయ'! అట్లాగానీ మనం చేయమని అలా మన చేత చేయిస్తూ ఉంటాడు. కాబట్టి మనస్సు ఏర్పడ్డప్పుడు, మనస్సు యొక్క ఉద్దేశము ఏమిటంటే, సమస్తమును మనం జీవితాన్ని చక్కగా ఒక ప్రణాళికా బద్ధముగ నిర్మాణము చేసుకుని అందరికొరకు ఎట్లా జీవించాలి అనే! సృష్టి మనస్సు అట్లా పరిపాలిస్తుంది. అది భగవంతుడి యొక్క మనస్సు, మహామనాఃఁ! మహాత్ముల యందు పని చేసే మనస్సు అట్లా పని చేస్తుంది. అందరి శ్రేయస్సు గురించి పని చేసే మనస్సు మహామనస్సు! వాళ్లూ మహాత్ములు! మన కోసమే మనము పని చేసే మనస్సు ఉంటుంది మనకి. కానీ ఆధ్యాత్మిక సామ్రాజ్యము లోనికి అడుగు పెట్టాలంటే మనము రోజూ చేసే ఆరాధనలో మనము, మన వాళ్ళు గురించి అనే గీత చెరిపేసుకోవాలి. అలా లేనప్పుడు ఇంక ఏమీ లేదు. ఈ మొత్తము అందరిలో వుండే మనస్సుగా ఉన్న వాడు వాడే! ఉండి ఏమి చేస్తాడు? మనుధర్మము ప్రకారం పని చేస్తూ ఉంటె ఆనందాన్ని ఇస్తాడండీ! అలా కాకపోతే నీలోనే ఉండి నిన్నే దుఃఖపెడతాడు. దుఃఖ పెట్టడము వాడి ఉద్దేశము కాదు. దుఃఖ పడడము అనేది తప్పదు. ఎందుకంటే సృష్టిలో వుండే అలాంటి ఒక అమరిక వుంది. ఇట్లా ఇట్లా వెళ్తే ఇట్లాంటి అనుభవము ఉంది. అట్లా వెళ్తే చేదు అనుభవములుంటాయి. ఎందుకంటే చేదు అనుభవము చేత మళ్ళా అట్లా వెళ్ళకూడదు అని తెలుస్తుంది. నిర్ణయం చేసే స్వతంత్రత మనకి ఇచ్చాడు. అలా వేలు పెడితే కాల్తుంది అని పెద్దలు చెప్పినా స్వంతబుద్ధితో పెడుతూ వుంటాము. కాలితే అప్పుడు తెలుస్తుంది కాల్తుందని. అట్లా మనము ఎన్నోసార్లు వేలుపెట్టి కాల్చుకొని వద్దన్నా పెడతాం అనుభవిస్తున్నాం అనుకుంటాం. గురువాక్యం, పెద్దలవాక్యం అనుసరించకుండా స్వంత అనుభవము కోసం ప్రయత్నించే వాళ్లందరికీ ఆ విధంగ కొంత జరుగుతూ ఉంటుంది. ఆ మనస్సెక్కడిదీ? మనకిచ్చిన స్వతంత్రత నుండి వచ్చినది. మనకి ఎంత స్వతంత్రత ఇస్తే, అంత బాధ్యత అందజేశారనేది మనకి తెలియాలి. సరిగా ప్రవర్తిస్తున్న వారిని ఎవరైనా అంటారు. 'మా ఇంట్లో మీరు స్వతంత్రముగా తిరగవచ్చండి. మాకు ఏమీ ఇబ్బంది లేదు. మీరు ఎప్పుడు వచ్చినా పర్వాలేదు. మా వాకిలి తెరిచే ఉంటుంది,' అని చెప్తే, మనం వెళ్లి

మనం ఆ ఇంటాయన మంచము మీద వెళ్లి పడుకున్నామనుకోండి. స్వతంత్రత అందుకు ఇవ్వలే! మనకి బాధ్యత ఉన్నది కాబట్టి స్వతంత్రత ఇచ్చారు. Responsibility తెలిసిన వారికి Rights. మొత్తము సృష్టిలో మానవుని కన్నా ప్రజ్ఞానవంతుడు ఎవ్వరూ లేరు. తనంతటి వాడిగా తీర్చిదిద్దిన తరువాత తనంతటి వాడిగా వెలుగులో వీడు కూడా ఉంటాడని స్వతంత్రత ఇచ్చారు. అదీ బాధ్యత! ఇంటికి పెద్ద కొడుకుని తండ్రి వెళ్ళిపోతూ 'అందరిని చూసుకోరా నాయనా' అని తాళాలు ఇచ్చేసి వెళ్తే, అది స్వతంత్రత అనుకుని, మిగతా వాళ్ళు తన వాళ్ళు కారని శుభ్రంగా డబ్బులన్నీ తన కోసం, తన పెళ్ళాం పిల్లల కోసం తండ్రి ఆస్తిని వాడేస్తే? అసలు మనస్సు సమస్తమును చక్కగా అమరిక చేసుకుని ఆనందము పొందడం కోసము ఇవ్వబడినది. ఈ మనస్సు వల్లే అన్ని కష్టాలు, ఈ మనస్సుని చంపేయాలి, ఇటువంటి theories చెప్తుంటారు కదా. మామూలుగా సన్యాసులు సంసారం వద్దు, పిల్లలు వద్దు, ఉద్యోగం వద్దు, తిండి వద్దు, ఉష్ణ వద్దు, కారం వద్దు. ఉపవాసాలు ఉండు. ఎందుకు ఉండడమండీ? అందుకా ఇచ్చిందీ? ఎట్లా ఉండాలో తెలియక అలా చెప్తారు. తెలిసిన వారు 'శ్రీకృష్ణుడు' లాగ ఉండమని చెప్తారు. జనకుడి లాగా ఉండమని చెప్తారు. వాళ్ళందరూ ప్రవృత్తులో ఉంటూ, భగత్ వైభవాన్ని అనుభూతి చెందుతూ, ఆత్మానుభూతి పొందుతూ కూడా ఉంటారు. ఇట్లా చేతకాక అది మంచిది కాదు, ఇది మంచిది కాదు అని చెప్తారు. చాల మంది ధనం పాపిష్ఠిది అని చెప్తారు. ధనము పాపిష్ఠిది కాదు. నువ్వు పాపిష్ఠి వాడివి అయితే ధనము పాపిష్ఠి పనులు చేయడానికి నీకు ఉపకరిస్తుంది. సంస్కారవంతుల చేతిలో అదే ధనం ఎంతో మందికి ఉపకారము చేస్తుంది. కాబట్టి ధనములో వుందా, నీలో వుందా? అట్లాగే మనస్సులో ఏముంది? నీ బట్టే మనస్సు! నువ్వు ధర్మంలో వుంటే ధర్మంగా నడుస్తుంది. నీకు అది ఒక facility! ఒక ఉపకరణము! 'అంతఃకరణం' అంటారు. ఆ అంతఃకరణాన్ని చక్కగా వినియోగించుకోడము చేతనయితే, భగవంతుని యొక్క మనసే మన యొక్క మనస్సుగా పని చేస్తుంది. అప్పుడు మీ మనస్సు మహామనాఃఅనే భగత్ తత్త్వానికి లోబడి పని చేస్తుంది. అలా కాకపోతే నీదిగా నీ మనస్సు, నీకు ఏమి కావాలి, నీ పిల్లలకి ఏం కావాలి, మీ ఆవిడకి లేక మీ ఆయనకీ ఏమి కావాలి ఇంతవరకే తిరుగుతూ ఉంటుంది, బావిలో పడ్డ కప్పలాగా ! దానితో మనం సూర్యుడి చుట్టూ తిరిగే బుధతత్త్వము నుండి, అంటే బుద్ధి లోకాలు నుండి భూమి చుట్టూ తిరిగే లేక శరీరము చుట్టూ తిరిగే చంద్రగ్రహంగా అవస్థితి చెందుతాం. అందుకని ఇతరుల శ్రేయస్సు కోరే పద్ధతులలో మనస్సుని పదును పెట్టుకోవడంలో మనిషికి ఈ మానవ శరీరములో ఉండడానికి కావలసినంత యోగ్యత, అనుభవించడానికి కావలసిన అర్హత ఏర్పడతాయి. అది కాకపోతే తన కోసమే వినియోగించుకోవడం వలన, సృష్టి అనే యంత్రంలో వీడు అమరిక చెందలేక తిప్పలు పడుతూ ఉంటాడు. అందుకని మన మనస్సుని మొత్తము మనస్సుతో అనుసంధానము చేయించాలంటే ఒకటే మార్గము ఉంది. భగంతుడు ఏ

ఉద్దేశ్యముతో ఇదంతా ఇచ్చాడో అది అట్లా చేయడానికి ప్రయత్నము చేయాలి. మన ఇష్టం లా కాదు. అదే మార్గములో నడవాలి. అలా నడిస్తే మనకి మహామనస్సు నుండి మన మనస్సుకి ప్రణాళికలు అందుతాయి. అదే 'మా ప్రణాళిక దివ్య ప్రణాళికగా' మనం అనే ఆశంసనము! మన ప్రణాళికకు, దివ్య ప్రణాళికకు సంబంధము ఎప్పుడు ఉంటుంది అంటే, తెగబడి నలుగురి కోసము బతుకుతుంటే, దివ్య ప్రణాళిక నీ మనస్సు లోంచి కూడా వ్యక్తము అవుతుంది. ఆధ్యాత్మిక జీవితములో కూడా తన కోసమే చేసుకోవడం కూడా ఉంటున్నది. ఎక్కడ చేయకూడదో అక్కడ కూడా అదే చేస్తూ ఉంటాము. ఆధ్యాత్మికత ముఖ్యము ఏమిటంటే 'నలుగురి కోసం బతకడం'. నలుగురం కలసి ఎక్కడో ఒకచోట దీపము పెట్టి, మళ్ళి ఇంట్లో ఇంకో దీపము పెట్టుకున్నావు అనుకో, అదో పద్ధతి. అస్సలు నలుగురి కోసం కాకుండా ముందే మనకోసం మన ఇంటిలో దీపము పెట్టుకుని, అప్పుడు నలుగురి దగ్గరకు వెళ్ళాము అనుకోండి, అంటే అవగాహన కాలేదనేగా అర్థం. ఆధ్యాత్మికత పేరున 'తమ కోసము చేసుకుంటాము' అనేది పరమ గురువుల మార్గములో లేదు. తాను సమర్థత సంపాదించుకోవడం వరకు అంగీకారమే! ఇక మిగతాదంతా ఇతరుల కోసం చేయడంలోనే భాగవత ధర్మమునందు ఎక్కువ నియుక్తులమై ఉంటాము. నీకోసం ప్రత్యేకించి చేసుకుంటే సంతోషించడు భగవంతుడు. అందరి కోసము అని చేసుకుంటుంటే సంతోషిస్తాడు. మనింట్లోనే నలుగురు పిల్లలు ఉన్నారండి, మన కళ్ళ ముందే వాడెవడో వాడొక్కడే ఒక కుంపటి పెట్టుకొని అందరికీ చూపిస్తూ ముందు తింటూ ఉన్నాడనుకోండి, తల్లిదండ్రులకి ఎట్లా ఉంటుందీ, వండింది వాడు నలుగురికీ పెట్టి తింటాడనుకోండి, తల్లిదండ్రులకి ఎట్లా ఉంటుందీ? తల్లిదండ్రులు పిల్లల నుండి ఏమి ఆశిస్తారో, భగవంతుడు భగవతి కూడా జీవుల నుండి అదే ఆశిస్తారు. ఆ మాత్రము commonsense బజారులో పారేసుకుని, భగవంతుని పని అని అట్లా చేస్తూ ఉంటాము మనం. అదంతా ఒక గొడవగా తయారు అవుతుంది తప్ప, అందులోంచి ఏది ఉద్దేశింపబడ్డదో అది జరగదు. ఎందుకంటే మనస్సు వికారము చెంది ఉంది కాబట్టి. అందుకని వ్యక్తిగతమైన మన మనస్సుని భగవంతుడి యొక్క మనస్సు తో అనుసంధానం చేయాలి. భగవంతునిది పెద్ద మనస్సు. ఆయనది 'చాల పెద్ద మనస్సు గలవాడండీ' అని అంటుంటాము కదా ! అంటే ఏమిటి అర్థం? పిల్లిబుర్ర లో ఉండే వాడి మనస్సు కన్నా మించి ఉన్నాడని. బావిలో ఉండే వాడికి, బావి యొక్క అంచుకైవారాన్ని బట్టే వాడి ఆకాశం. బావి యొక్క వర, పార వీడికి ఆకాశం. బయటికి వస్తే? ప్రతి కప్ప తన బావిలో ఉండే ఆకాశమే గొప్ప అనుకుంటుంది. బావి లోంచి బయటకి వస్తే అక్కడ ఒకటే ఆకాశం. ఇన్ని బావులలో కూడా కాస్త కాస్త కాస్త ఆకాశమే! అలా మనం మన పరిధిలో ఉండే ఆలోచనలని పక్కన పెడితే, అసలాయన పరిధి ఒకటి ఉంది కదా, అందులోంచి మనకు వస్తాయండి! అందుకూ ధ్యానము! ఇప్పుడూ నాటక రంగములో నీకు ఒక పాత్ర ఇచ్చారనుకో, అది పోషించమని రంగం లోకి వెళ్తావు. వచ్చిన తరువాత

వాడి కథలో భాగముగ నువ్వు అక్కడ చెప్ప వలసిన సంభాషణ కానీ, చేయ వలసిన నటన కాని ఉంటుంది. అదికాక నీది ఒకటి మొదలు పెట్టావు అనుకో! భారతములో అర్జునుడి వేషము నీది అని stage మీదకి పంపిస్తే, రామాయణము లో సుగ్రీవుడి వేషము మొదలు పెట్టావు అనుకో అప్పుడు నీదైన కథ ఒకటి మొదలు అవుతుంది. అలా కాకుండా ఉండడానికే ధ్యానం! ధ్యానం వల్ల ఉపయోగము ఏమిటంటే నువ్వు ఏమి నిర్దేశించి నన్ను ఇక్కడికి పంపించావు, శరీరము ఇచ్చావు అది తెలుసుకోవాలి. దాన్నే divine plan అంటారు ఆంగ్లం లో. తెలుగులో లేక సంస్కృతములో 'దివ్య ప్రణాళిక'! జీవన ఉద్దేశ్యము! అది తెలియాలంటే వాడినే అడగాలి అంటే మనని పంపించిన వాడినే! ఇంకొకడిని అడిగితే లాభము లేదు. వాడిని అడగడానికి వీలు పడనప్పుడు, వాడ్ని అడగడం తెలిసిన వాడి దగ్గరకు చేరి, ఆ చేరిన వాడు చెప్పినది తూచా తప్పకుండ చేయాలి. నీక్కూడా వాడు నువ్వు సరాసరి 'వాడితో' మాట్లాడుకునే పద్ధతి కూడ ఇస్తాడు. ఎందుకంటే, ఎప్పుడూ వాడి దగ్గరకే వస్తుంటే వాడికి విసుగుగా ఉంటుంది. ఎప్పుడూ నన్నే వచ్చి అడుగు, నేను చెప్తూ వుంటాను, అన్నట్టుగా ఉండదు. వచ్చిన వాడికి వాడితో సరాసరి ఎట్లా మాట్లాడుకోవాలి అనే ప్రక్రియ ఇస్తాడు. ఇస్తే పెద్ద మనస్సు వాడితో, చిన్న మనస్సుగాడు మాట్లాడుకోవచ్చు. మాట్లాడుకుంటే సరాసరి మనము ప్రణాళికలో భాగము అయ్యి, ప్రణాళిక కోసము పని చేయడముగా తయారవుతాము. అదీ మనకి పరమ గురువులు యొక్క పరంపర! మహాత్ములు అందరు కూడా దివ్య ప్రణాళికకి అనుసంధానము చెంది జీవిస్తున్నారు అంటే, తనదైన మనస్సు తీసి భగవంతుడి యొక్క మనస్సుకి తాము వాహికలుగ ఉన్నారు. కాబట్టి 'మహామనాః' అనేది మహాత్ములకి అవగాహన అవుతుంది. మనం ఏదైనా వాళ్ళని వెళ్లి అడిగినపుడు కూడా, వాళ్ళు మహామనస్సుని సంప్రదించి మనకి చెప్తారు, ఇట్లా చేసుకోమని. ఒకసారి కళ్ళు మూసుకుని, గ్రహించి, మనకి అందించడానికి ప్రయత్నము చేస్తారు. మహాత్ములు అందరూ అదే చేస్తారు. అంతే కానీ పుటుక్కున చెప్పరు. మనమే చెప్తాము అనుకుంటే 'మనకి ఇంతకాలానికి ఒకడంటూ దొరికాడు, సరిగా చెప్పకపోతే మన చేజారిపోతాడు, పక్క కొట్టుకి వెళ్ళిపోతాడేమో' అన్నట్టుగా ఉంటుంది. అసలు మనమే మన సంగతి తెలియక కొట్టుమిట్టాడుతున్న పరిస్థితిలో అందరం ఒకడినే అడగాలి. అందుకనే బ్రహ్మ దగ్గరకి వెళ్ళినా కూడా, బ్రహ్మ ఎప్పుడూ సమాధానము తనుగా చెప్పలేదు. బ్రహ్మ అంతటి వాడే తనుగా సమాధానము చెప్పలేదంటే మనం ఎంత! ఏమి చేశాడు బ్రహ్మ? ఇట్లా కనుక్కుని వస్తాను అని, కూర్చున్న స్థానంలో కళ్ళు మూసుకుని లోపలకి వెళ్ళి, ఎవరైతే ఈ మొత్తానికి, ఈ ప్రణాళికకి మూలమో, అక్కడ కనుక్కుని వచ్చి చెప్తాడు. ఇట్లా మనం ప్రతి రోజూ ఉదయం ఆ పని చేసుకోవచ్చు. లేవంగానే ధ్యానం అందుకు చేసుకోవాలి. అంతే కానీ ఎదో డబడబా అది పెట్టుకోడాలు ఇది పెట్టుకోడాలు, ఇహ మొదలుపెట్టి ఏవో టపటప చదవడాలు. ఆ తరువాత మామూలుగా మనం అంటే 'వెనుకటి గుణమేల

మాను' గా ఉండడాలూనూ. వీటి వల్ల ఏమి జరుగుతుంది అంటే నీలో 'ఒరేయ్ ఏం చేస్తున్నావురా నువ్వు' అని అడిగేవాడు చచ్చిపోతాడు. ఇవి పెరిగిపోతూవుంటాయి. ఏవి? హనుమంతుడు, వినాయకుడు, శివుడు, విష్ణువు, అంతర్యామి, అటు భాగవతము, మహాభారతము, భగవద్గీత, ఓపికుంటే Secret Doctrine, New Testament, Old Testament, లేక కొత్తగా ఈ మధ్యన వచ్చిన ఇంకో గురువుగారి పుస్తకాలు. ఇలా load పెంచుకుంటాము. కానీ అసలైనది మనము ఏమిటి చేస్తున్నాము అనే ప్రశ్న ఉండదు. అందుకని రోజూ ధ్యానానికి ముందు ఒక Self Introspection, ఆత్మ పరిశీలనము, 'ఇదేనా నేను చేయవలిసింది. దేనికి ఇవన్నీ చేస్తున్నాను? అసలు నేను ఏమి చేయడానికి వచ్చాను?' అనే ప్రశ్న ఉండాలిగా? ఈవేళ మనం నిద్ర లేచాము అంటే, ప్రపంచంలో మన script ఏమిటి ఈ పూట? నర్తకుడు రంగం మీదకి వెళ్ళే ముందు వాడి script ఏమిటో వాడికి తెలియాలి కదండీ! ఈరోజు వాడి వేషము ఏమిటో వాడికి తెలియాలి. వాడు చెప్పాల్సిన dialogues ఏం చెప్పాలో అనేది తెలియాలి. What Am I to do? నాయనా నేను ఏమి చేయాలి? పాడు పనులు చేయనీకుండా చూడు కనీసం. ఇందుకు వాడాలండీ మనస్సు. మనస్సు ఒక వెండి తెర లాంటిది. దాన్ని భగవంతుని యొక్క మనస్సుతో అనుసంధానము చేసి అట్టా కూర్చో పెడితే, అక్కడ నుండి మనకి అందుతాయండీ--! నిజంగా! అదేకదా మనకి CVV గారు చెప్పారు. 'నువ్వు ఏమి చేసుకోవాలో నీకు నేనే చెప్తాను, ప్రశ్న వేసుకుని కూర్చో 15 నిమిషాల పాటు' అంటే మనం ఏం ప్రశ్న అనుకుంటాము అంటే, అవుతుందా, అవదా అని. 'అవుతుందా అవదా కాదు ఏమి చేయాలో చెప్తాను' అంటారు. మనం ఎంతసేపూ 'అది కాదు గురువుగారూ ఇది అవుతుందో లేదో చెప్పండీ' అంటాము. లాభము వస్తుందా, రాదా? పిల్ల పుడుతుందా, లేదా? పెళ్లి అవుతుందా, లేదా? పరీక్ష pass అవుతుందా, లేదా? ఇవన్నీ చెప్పడానికి కాదు. 'Predictions చెప్పడానికి నేను లేను. రోజూ నువ్వు ఏమి చేయాలో బోధ గా నేను అందిస్తాను, పుస్తకం పెట్టుకో!' అని చెప్పారు. నేను ఏమి చేయాలి, అని రోజూ 15 నిమిషములు కూర్చుంటే, ఆయన అందిస్తారు. బ్రహ్మే వేసుకున్నాడు, మనం ఎంతండీ? ఆయనే 'నేను ఏమి చేయాలి, ఏమి చేయాలి?' అని ప్రశ్న వేసుకున్నాడు. లోపల నుండి తపస్సు చేసుకోమన్నాడు. అలా చేస్తూ ఉంటాడు. మనం అసలు అడిగే ప్రశ్నే లేదు కదా. మనము అంతా తెలిసిన వాళ్ళం కదా. గారెలు వండడానికి బయలుదేరి పోతాము. చిన్నప్పుడు గారెలు కథ ఒకటి ఉండేది మాకు. ఏమి చేయాలో, ఎట్లా చేయాలో వినదు సరిగా. గారెలు చేయాలని తాపత్రయం. మనం అంతా అంతే! మనకి కావలసినవి చాలా ఉంటాయి కానీ అవి ఎట్టా చేసుకోవాలో అన్న జ్ఞానం మాత్రం ఉండదు. 'ఒరేయ్! ఎట్లా చేసుకోవాలో చెప్తారా, అడగరా' అంటారు. అట్లా అడగడం అనేది నిజమైన ధ్యానము. అలా అడిగితే, నీకు, మహామనస్సుకి ఒక అనుసంధానం వస్తుంది. EK గారు అదే అనేవారు. 'నా program నాకు daily వస్తుంది' అనే వారు. మేము అనుకునే

వాళ్ళం, కిటికీ లోంచి రోజూ ఎవరో ఒక cover ఇస్తారేమో అని. అలా మనం కూడా రోజు ఆ కిటికీ వైపు చూస్తూ, దాని కోసం కిటికీ తెరిచి ఉంచి---. కిటికీ తెరిస్తే ఏమి అవుతుందో తెలుసా? పిల్లి వచ్చి మీద పడుతుంది. నేను ఒక సారి కిటికీ తెరుచుకుని కూర్చున్నా అర్ధరాత్రి Message కోసం చూస్తూ ఉంటే, నల్ల పిల్లి వచ్చి మీద పడ్డది. అప్పుడు అర్థమయ్యింది, మరి ఇంకెప్పుడు అర్ధరాత్రి వరకు ఎక్కడా కూర్చోనే లేదు. మంచి Message వచ్చింది అట్టా అర్ధరాత్రివరకు కూర్చోనక్కరలేదని. ప్రతి రోజు మాస్టర్ చైతన్యము అనండి లేక మీరు నమ్మిన గురువు అనండి, దైవం అనండి, (రెండూ ఒకటే!) దానితో అనుసంధానం చేసి ఆర్తితో 'నేను ఏమి చేయాలి? ఇదే చేయాల్సిందా? ఇంతేనా? ఇంకేమన్నా ఉందా? ఏమి చేయాలి? అన్న ప్రశ్న వేసుకుంటే మనస్సుకి, మహామనస్సుకి మధ్య అనుసంధానం వస్తుంది. అది చేసుకుంటే మనం జీవితములో ఏమి చేయాలో తెలిసే ఒక అవకాశము ఉంది. అలా చేసుకోకపోయినా మనస్సు పవిత్రముగా, ధర్మాన్ని ఆచరించేటట్టుగా ఉంటే, అప్రయత్నముగనే తెలుస్తూ ఉంటాయి. ఏదో ఒకటి. మనస్సు పవిత్రముగా ఎప్పుడు ఉంటుందంటే, తన గురించి ఆలోచన మానేసి లేచిన దగ్గర నుండి, ఎవరికీ ఏమి చేసి పెట్టాలా? అని ఆరాటం ఉంటే! ఈ రెండు రకాలుగా మనం మహామనస్సు ని పొందవచ్చు. అప్పుడు మన మనస్సు వెండితెర లాగ మహామనస్సుని ఇక్కడ ప్రతిబింబింప జేస్తుంది. పరమ గురువుల మార్గములో నడిచేవారందరూ కూడ ఆ ప్రణాళికలు తాము అందుకుని తద్వారా తమని తాము అన్నీ నిర్వర్తించుకుంటూ ఉంటారు. ఆ విధముగా తమను తాము నియమించుకుంటూ ఉంటారు. ఆవిధముగా తమను తాము ఒక నిష్ఠలో పెట్టుకుంటూ ఉంటారు. అందుకని వెళదామని అనిపించిన చోటుకి వెళ్ళడం, సరదా అనిపించిందని వెళ్ళడం, చూడాలని అనిపించిందల్లా చూడడం, తినాలి అని అనిపించిందల్లా తినడం ఇట్లా ఉండదు. ఎందుకు అలా ఉండదంటే ఆ మహామనస్సు తనకు ఏమి తెలుపుతుందో దానికి తాము బద్ధులై ఉండడం వలన.

## 580 భగవాన్

'భ' అనే అక్షరం నిరుక్త శాస్త్రం ప్రకారం వెలుగుకి సంబంధించినది. భా రతి వెలుగు యందు రతి అని. భారతీయులు. అందులోంచే మనకి భార్గవులు వచ్చారు. భృగువులొచ్చారు. భర్గులొచ్చారు. భరతుడు ఉన్నాడనుకోండి, అతడికి వెలుగు యందు రతి. అట్లా 'భ' అంటే వెలుగు, 'గ' అంటే దాని యొక్క వ్యాపనం. వెలుగుకి వ్యాపనము అని ఉంది. కాబట్టి వ్యాపనం చెందే వెలుగు కలిగిన వాడు అని అర్థం. ఎంత వ్యాపనం అంటే సృష్టి అంతా వ్యాపించింది. మహాత్ములు అలా వ్యాపించి ఉంటారు. ఒక్కొక్కళ్ళకి ఒక్కో పరిధి ఉంటుంది. Area of influence అని. అగస్త్య మహర్షి ఆశ్రమానికి శ్రీరాముడు లక్ష్మణుడితో బయలుదేరి వెళుతున్నప్పుడు, కొన్ని యోజనాల దూరం నుంచే అగస్త్యుని యొక్క స్పర్శ శ్రీరాముడు స్పష్టంగా పొందుతూ ఉంటాడు. మనం మన ఇంట్లో ఉంటే, సింహద్వారం లోంచి లోపలికి వచ్చినా ఇంట్లో ఉన్నారో లేదో తెలియదు కదా. ఉన్నాడాండీ, అని అడగాలి ఎందుకంటే ఉన్నాడో లేడో అనేది తెలియదు. కానీ రాముడికి ఎంతో దూరం నుండే ఆశ్రమంలో అగస్త్యులవారు ఉన్నారని తెలిసిపోయిందట. అట్లా తరంగాలు అందినాయట. అట్లా వ్యాపనం చెందుతూ వుంటుంది ఈ వెలుగు. ఆ వ్యాపనం చెందే వెలుగునే అమ్మవారు అన్నారు. అది కలిగిఉన్న వాడట. ఆయనదేగా! ఆయన ఉండబట్టే కదా ఆమె వెలుగుతుంది. ఈ మొత్తము సృష్టిలో వెలుగుల యొక్క సౌందర్యాలు గాని, శక్తులు గాని, దేవతల యొక్క శక్తులు అన్నీ కూడా ఆయనలోంచి వచ్చినవే. 'వెలుగు శక్తులన్నిటికీ కూటమి నీవు' అని చెప్పటం భగవాన్! ఎవరైనా భగవాన్ అని పేరు పెట్టుకుంటే అంత శక్తిమంతుడై ఉండాలి. భగవాన్ అంటే 'మొత్తం సృష్టిలో ఉన్న సమస్తమైన శక్తులకి నిలయము' అని అర్థం. భగవాన్ అని పెట్టుకోబోకండి. మాస్టర్ అన్నా భగవాన్ అన్నా ఒకటే అర్థం. అందుకని ఆ తత్త్వము ఆయన నుండి విపరీతముగా వెలుగులు ముద్దలు ముద్దలు పుట్టి సృష్టి ఏర్పడి, జీవులు ఏర్పడి, వీళ్ళల్లో కూడా ఆ వెలుగు ఉండి ఇట్లా వచ్చింది కదా. వ్యక్తము- అవ్యక్తము, వెలుగు- నీడ, రాత్రి- పగలు, పౌర్ణమి-అమావాస్య పక్క పక్కనే పెట్టడం మంచిది. లేకపోతే మనం వెంటనే, రూపాయి బిళ్ళ ఒక పక్కే చూడటము ఎక్కువ నేర్చుకుంటామని, ఈ రెండో పక్క కూడా ఉంది బిళ్ళకని 'భగహా' అన్నారు.

## 581 భగహా

అంటే మొత్తం వెలుగులు అన్నీ హరించే వాడు కూడా తానే! నిన్న సాయంత్రం ఉన్నాడు సోదరుడు రవిశర్మ శరీరంలో. ఇప్పుడా శరీరంలో లేడు. మంచి రోజున వెళ్ళిపోయాడు. ఏమైందీ? భగహా పని చేసిందన్నమాట. ఆ switch off చేసేస్తాడు, అందులో ఉన్నదంతా వెళ్ళిపోతుంది. ఎక్కడికెళ్ళిందీ? తనలోకి. మళ్ళీ on చేస్తే మళ్ళీ వచ్చేస్తుంది. ఎంత అద్భుతమైన విషయం! మనం switch వేస్తాం ఆర్పుతాం, వేస్తాం ఆర్పుతాం కదా. ఎన్నడన్నా దాని గురించి ఆలోచిస్తామూ? అది ఎట్లా అక్కడకొస్తోంది? అక్కడి నుండి ఎట్లా వెళ్ళిపోతోంది? ఎక్కడికెళ్ళిపోతోంది? వెలుగు వెలగడం ఆరడం, వెలగడం ఆరడం అట్లా పనిచేస్తున్నాడండీ భగవంతుడు. అంటే సృష్టి విచ్చుకోలుగానూ, ముడుచుకోలుగానూ, రెండూ

ఒకపరి జగములు వెలి నిడి, యొకపరి లోపలికి గొనుచు, నుభయముదానై
సకలార్థసాక్షి యగు న య్యకలంకుని నాత్మమూలు నర్థి దలంతున్

అంటాడు గజేంద్రమోక్షంలో గజేంద్రుడు. వెలుగులో కాస్సేపు బయట పెడతాడుట. కాస్సేపు లోపల పెడతాడుట. ఆయనే కాదు, మనం కూడా అంతే. కాస్సేపు నవ్వుతాము, నవ్వినప్పుడు బోల్డు వెలుగు వస్తుంది బయటకి. మళ్ళి ముడుచుకుపోతాం. ఎక్కడి నుండి వచ్చినాయి అంటే ఆయనలోంచే వచ్చినాయి మనకవన్నీ. కాకపోతే ఆయనకి వాటి మీద ఒక స్వామిత్వము ఉంది. మనకి లేదు. ఇట్లా అమావాస్య, పౌర్ణమి జరుగుతూ ఉంటాయి. అంతేకాదు నిద్రలోకి వెళ్ళపోవడం- వెలుగు లోపలికి వెళ్ళిపోవడం, నిద్రలోంచి బయటకి రావడం- వెలుగు బయటకి రావడం! అదే తెలివి రావడము అంటే! పొద్దున్నే తెలివి వచ్చిందంటాము కదా. వచ్చిన తెలివి మనది కాదు. ఆవిడొచ్చింది కాబట్టి మనం వాడుకోవచ్చు ఇహ, మన పనులకి. కాబట్టి భగవాన్, భగహా రెండూ పక్క పక్కన వెలుగుల యొక్క వ్యాపనము-సంకోచము, వ్యాపనము-సంకోచము, ఇట్లా నడిపిస్తున్నాడండీ సృష్టిని! అందుకనీ, ఒక సృష్టి దాని యొక్క స్థితే కాక లయంగా కూడా భగవంతుడిని చూపించడమనేది సమగ్ర జ్ఞానం! అది మనలో కూడా జరుగుతుంది విచ్చుకోలు, ముడుచుకోలుగా. అందుకనీ, మనకి వెలుగులు పెరుగుతూ ఉంటాయి, వెలుగులు తరుగుతూ ఉంటాయి. ఈ పెరగడం-తరగడంగా, ఉత్తరాయణం-దక్షిణాయణంగా, రాత్రి-పగలుగా, పౌర్ణమి-అమావాస్యగా ఒక చక్ర భ్రమణం జరుగుతూ ఉంటే, దానికి అవతలగా కూడా ఉండి వెలుగ్గా ఉండిపోతాడు.

లోకంబులు లోకేశులు లోకస్థులు దెగినదుది నలోకం బగుపెం
జీకటి కవ్వల నెవ్వం డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్

అట్లా ఈ ముడుచుకోటాలు విచ్చుకోటాల్లోంచి బయటకొస్తే ఎప్పుడూ స్థిరంగా వెలిగే ఒక వెలుగ్గా ఉండచ్చు. అది యోగికి సాధ్యము. ఎప్పుడూ చిరునవ్వే! శ్రీకృష్ణుడు దానికి చక్కటి ఉదాహరణ. మనకి కాస్సేపు బావుంటుంది, కాస్సేపు బావుండదు. బాగుండంది వచ్చిందంటే తర్వాత వచ్చేది బాగుండేదే. బాగుండేది వచ్చిందంటే తర్వాత వచ్చేది బాగుండందే. ఈ ఉయ్యాల తెలియాలి. ఇటొచ్చిందంటే అటెళ్తుంది. అటెళ్ళిందంటే ఇటొస్తుంది. మనకేం జరుగుతుందంటే బాగున్న సమయం సంవత్సరమైనా రోజులా గడిచిపోతుంది. బాగుండని సమయం ఒక్కరోజు అయినా సంవత్సరం అంత అనిపిస్తుంది. అంటే మన మనస్సులో ఉండే కాలభావము అట్లా చేస్తుంది తప్ప, రెండింటికి అవతలగా కూర్చుంటే, మడి కట్టుకొని, ఇవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. అందుకే చెప్పా Old Testament అని క్రైస్తు పుట్టకముందు వాళ్ళకో మంచి గ్రంథం ఉండేది. అందులో 'it came to pass' అని రాస్తారు. ప్రతిసారి అదే రాస్తారు. అంటే వచ్చింది, వెళ్ళిపోవడానికి వచ్చిందని. మనం కూడా అంతే. శరీరం వచ్చిందంటే వెళ్ళిపోతుందని తెలియాలి. మనకు రావడము నందు సంతోషమే తప్ప వదలడము నందు సంతోషం లేకపోవడం వలన దుఃఖపడుతున్నాము. వచ్చిందల్లా పోతుంది కదా. 'సిరితా వచ్చిన వచ్చును నారికేళ సలిలము భంగిన్!' కొబ్బరికాయలోకి నీళ్ళు ఎట్లా వచ్చాయొ మనకి తెలియదు. 'సిరితా పోయిన పోవును కరి మింగిన వెలగపండు క్రియన్!' ఏనుగుకి వెలక్కాయ ఇస్తే మళ్ళీ intact నీకు కాయ యిచ్చేస్తుంది వెనక నుండి. కొట్టుకు చూసుకుంటే లోపలేముండదుట. అదేమిటో? అట్లా పోతుందిట. అట్లా వస్తూవుంది- పోతుంది, వస్తుంది- పోతుంది. వచ్చేపోయే వాటిల్లో ఉండకురా, నువ్వు గనక వెండి తెరలాగా ఉంటే వచ్చేపోయేది చూసుకుంటూ ఉండచ్చు అని చెప్పడం. అందుకే మన వాజ్మయములో రెండింటిని ఒక్కసారి చూపించేస్తారు. ఉద్దేశ్యమేమిటంటే మనం ఏదో ఒక దాంట్లో అతుక్కుపోదాం అనుకుంటాం. ఇట్లా settle అయిపోదాం అనే ఓ బుద్ధి ఉంటుంది మనకి. ఇది హాయిగానే ఉంది, ఇట్లా settle అయిపోదాం అనుకుంటాం. అట్లా settle అవడానికి వీలు లేదు, కాలమే అసలు చాలా unsettling factor. ఇప్పుడు ప్రస్తుతంలో మనకి ఇవ్వబడిన దాంట్లో అనుభూతి చెందడం నేర్చుకోగలిగితే, అట్లా 'ఉండడం' అనేది వస్తుంది.

## 582 ఆనందీ

కృష్ణుడి వేణువు పేరు ఆనంద. అది చేతిలో పట్టుకున్నాడు కాబట్టి ఆయన ఆనందీ. ఆనందము కలిగి ఉన్నవాడు. ఈ నామము గురించి ఎంతసేపు చెప్పుకున్నా ఉయ్యాల అని చెప్పుకున్నట్టే ఉంటుంది. అటు ఇటు ఎడా పెడా. దిగివస్తూ ఉంటాం. పైకి వెళ్తూ ఉంటాం. సూక్ష్మ పదార్థం స్థూలం అవుతుంది. స్థూలం సూక్ష్మం అవుతూ ఉంటుంది. ఉత్తరాయణం వస్తుంది. దక్షణాయణం వస్తుంది. ఈ ఉత్తరాయణం వచ్చి మనం peak, పరాకాష్టకు వచ్చాము ఇప్పుడు ఈ రోజున. ఉత్తరాయణం మనకి డిసెంబర్ 22 నుండి మొదలయింది. మార్చి 21కి సరిగ్గా మనం కేంద్రానికి వచ్చాం. ఇహ ఇక్కడ నుండి మళ్ళీ సాయంత్రమే. మిట్ట మధ్యాహ్నం పిచ్చి వెలుగన్నమాట. వెలుగు కోసం తాపత్రయపడే వాళ్ళకి ఇవాళ చివరి రోజు. ఇహ రేపటి నుండి సన్నగిల్లుతుంది వెలుగు. ఎందుకనీ? మధ్యాహ్నం దాటింది కాబట్టి. ఈ తాపత్రయపడేవాడు డిసెంబర్ 22 నుండి తాపత్రయ పడుతూ ఉండాలి. అసలు వెలుగు కనబడడం డిసెంబర్ 22 నుండి అన్నప్పుడు అంతకు ముందు నుండి తాపత్రయ పడితే కానీ అసలు కనబడదు. కనబడిన వాడికి కదా వెలుగు పెరగడం. అందుకని దుర్గాపూజలు నుండి మొదలు పెట్టుకుంటే, కార్తీక మాసంలో శివ పూజలు, మార్గశీర్ష మాసంలో విష్ణు పూజలు అయ్యి, ఆ 90 రోజులు బాగా గట్టిగా, సరియైన పద్ధతులలో ఉంటే వాడికి ఉదయం వస్తుందండీ! ఉషా కిరణం! వాడికి ఆ ఉషాకిరణం! డిసెంబర్ 22 మకర సంక్రమణంగా వచ్చిన వాడికి ఇవాళ మధ్యాహ్నం. మిగతా వాళ్ళందరికీ ఏ రోజు అయినా ఒకటిగానే నడిచిపోతూ ఉంటుంది. ఓహో ఇవాళ మనకు Equinox day యా? అని ఎవరో చెప్తే, ఓహో కదా అనేట్టుగా ఉంటుంది. ఇదొక పద్ధతి. ఈ రెండింటిని మనం ఎప్పుడూ సమతుల్యంగా చూసుకు పోతే, మొత్తం వలయం నుండి బయటికి వచ్చామనుకోండి, వాడికీ మొత్తం సమానంగానే ఉంటుంది, వీడికీ మొత్తం సమానంగానే ఉంటుంది. పూర్ణ అజ్ఞానంలో వీడికేం తెలియదు. వాడికి పూర్తి జ్ఞానంలో వెలుగు చీకట్లు ఉండవు. చూడండి ఎంత తమాషాయో! అందుకనేట పూర్తిగా తెలిసినవాడు మరీ జడుడల్లే కనిపిస్తాడట. ఎందుకంటే వీడికి తెలిసింది చెప్పుకుందామనే బుద్ధి కూడా దాటి వెళ్ళిపోయినట్టి స్థితి కాబట్టి పూర్ణజ్ఞానం. కృష్ణుడి వేణువు పేరు ఆనంద. అది చేతిలో పట్టుకున్నాడు కాబట్టి ఆయన ఆనందీ. ఆనందీ నామం అర్థం ఎప్పుడూ చేతిలో నీకు వేణువు ఉంది అని చెప్పినట్లుగా ఒకటి. ఎప్పుడూ ఆనందంగా ఉంటాడు అనేది రెండు. ఆనంద వేణువు అనేది మామూలుగా మనందరికీ తెలిసిన విషయం కాదు. ఆయన చేతిలో ఉండే వేణువు ఎంత అదృష్టం చేసుకుందో, ఎంత పూర్వపుణ్యం చేసుకుందో, ఎటువంటి వ్రతాలు ఆచరించిందో? అది ఆయన చేతిలో ఉండడం చేత ఆయనకీ పేరొచ్చింది. అది ఆనంద కాబట్టి ఆయన ఆనందీ అయ్యాడు.

ఆనందము పొంది ఉన్నవాడు, ధరించి ఉన్నవాడు అని అర్థం. ఆనందం అనేది ప్రతి మనిషికి 48 సంవత్సరాలు నిండిన తర్వాత తప్పకుండా వచ్చే ఒక అవకాశం ఉందిటండీ! నాలుగు బృహస్పతి చక్రాలు పూర్తి అయిన సంవత్సరం ఏదైతే ఉంటుందో దాన్ని కూడా ఆనందీ అంటారు. అందుకనే 49 వ సంవత్సరం మనవాళ్ళు the year of initiation అని చెప్పారు. Seven times Seven. ఏడు ఏళ్ళు నలభైతొమ్మిది. 12×4=48 నిండిన తరువాత వచ్చేది అని చెప్తారు. చాలామంది మహాత్ములకి 49వ సంవత్సరంలో, చేసుకున్న సాధన బట్టి, పండి, ఆత్మదర్శనం జరిగిన సందర్భాలు ఉంటాయి. అందుకని 49 సంవత్సరాలకి సమస్తాన్ని పూర్తిచేసుకుని, పూర్ణంగా భగవంతుని మార్గంలో నడవడానికి ఏడవ సంవత్సరం నుండి ప్రయత్నం మొదలు అవుతుందిట. 21 సంవత్సరాలకి అంతర్గత, బహిర్గత విద్యల యందు అభ్యాసము పూర్తి అవ్వాలిట. 21కి పెళ్ళి. అక్కడ నుండి 4 ఏళ్ళు 4×7=28. సంఘసేవ, కుటుంబసేవ దాంట్లోంచి బాధ్యతలు తెలుసుకుని బాగా మెత్తబడతాడట. ఈ లోపల అంతర్గత సాధన జరుగుతూ ఉంటుంది. బహిర్గతంగా నేర్చుకున్న విద్యల ద్వారా సంఘంలో సేవలు చేస్తూ ఉంటాడు. ఏడవ సంవత్సరంలో మొదలయిన సాధన 49 వ సంవత్సరానికి అంటే 6 ఏళ్ళు 42 అవుతుంది. అప్పటికి ఒక శని చక్రం 30 ఏళ్ళు, ఒక బృహస్పతి చక్రం 12 ఏళ్ళు ఏడవ సంవత్సరం నుండి. ఎందుకంటే ఏడవ సంవత్సరం వరకు ఎట్లాగూ ఆనందం ఉంది. ఏడు నుండే ఆనందం తగ్గుతుంది. చదువుకోమంటారు కదా. ఐదేళ్ళ వరకూ పిల్లలకి ఆనందమనేది సహజంగా ఉంటుంది. బళ్ళో వెయ్యడమే మొదలు. అందుకనే మనం అక్షరాభ్యాసం అని మొదలు పెట్టగానే గురుపూజల్లో, వాడు ఆ రోజు నుండే ఏడుపు మొదలు. అక్కడే ఏడుస్తాడు ముందు. 'ఓం' అనమనగానే వాడు ఓ.. అని ఏడుస్తాడు. ఒక్కసారే ఓం అనమన్నానురా అంటే వాడు ఓ ఓ ఓ అని తెగ ఏడుస్తాడు. ఎందుకంటే మూడవ ఏటలో చేసేసి వాడికేదో మనం ఇప్పటి నుండే EAMCET కి తయారు చేసేయాలి కదా. అది మన బాధ. వాడికి EAMCET అంటే ఏమిటో తెలీదు అప్పటికింకానూ. ఇదేమిటిరా నన్ను బాధ పెట్టించేస్తున్నారు, ఎవరి ఒళ్ళోనో కూర్చో పెట్టేస్తున్నారు, ఆయనేమో గట్టిగా చేయి పట్టేసుకుంటున్నాడు స్వతంత్రం లేకుండా, అనుకుంటాడు. వాడి చేయి పట్టుకుని మనం రాసేస్తుంటాం కదా. 7 ఏళ్ళ నుండి చేసే సాధన పండి 48 నిండేసరికి వాడికి పూర్ణజ్ఞానం రావడానికి 49 వ సంవత్సరం చాలా ముఖ్యం. పరమ గురువు జ్వాలాకూలుడు ఒక మాట చెప్తాడు. 49 ఏళ్ళకి నీ కుండ నిండితే బాగా నిండినట్టే. 49కి ఆగిపోతే కొన్ని కొన్నిచోట్ల exemptions ఇస్తూ ఉంటాం, అక్కడ 56 వరకు పర్వాలేదు. భారతీయుల శరీరం 56 ఏళ్ళ తర్వాత ఇంక ఆత్మజ్ఞానానికి పనికిరాదు. పాశ్చాత్యుల శరీరం బాగా బండ శరీరం కాబట్టి వాళ్ళకి సాధన చాలా ఎక్కువ కావాలి. భారతీయులు చేసిన సాధన కన్నా పది రెట్లు ఎక్కువ సాధన చేయాలి. కానీ శరీరం బండది కాబట్టి, దృఢంగా ఉంటుంది కాబట్టి వాళ్ళకి 63 వరకు అవకాశం ఉంది. అవకాశం అరవైమూడే

గానీ డేకాల్సింది మాత్రం మనకన్నా పది రెట్లు ఎక్కువుంటుంది. Age ఎందుకు తక్కువయ్యా అంటే ఏడేళ్ళే పరవాలేదు ఇదే సుఖం. అమ్మో వాడికి 63 ఇచ్చారు. నాకు యాభైఆరే అనుకోకండి. ఆత్మజ్ఞానము పొందడం భారతీయ మనస్తత్వానికి శులభము. శరీర నిర్మాణం కూడా దానికి అనుగుణంగా ఉంటుంది. శుభ్రమైన శరీరం లేపోతే సాధన ఏం చేస్తామండీ! అస్సలు బొత్తిగా మనమొకటి చెప్తే అదొకటి చేస్తూ ఉందనుకోండి, అంతే కదా మన శరీరం. ఇవాళ నుండి ఇట్లా చేస్తానంటే, ఎట్లా చేస్తాడో చూద్దామని వెంటనే అది opposite court లోకి వెళ్తుంది. ఏమి చేయనీయదు కదా. దాన్ని సానపట్టుకోవడమే 7 ఏళ్ళ నుండి 21 ఏళ్ళ లోపల అవ్వాలి. ఇహ ఆ తరువాత అది వంగే విషయం కాదు. రేపు వంగుతుంది, ఎల్లుండి వంగుతుందని ఊరికే ఆశగా ఉంటుంది. అది ఎప్పటికీ వంగనంటే వంగను, అంటుంది. నాకు 20 ఏళ్ళ నుండి, 27 ఏళ్ళ నుండి కోరిక రోజూ ఆసనాలు వేసుకోవాలని. ఇవాల్టికి నా దేహం తెమల్చలేదు. దాన్నిబట్టి అది గెలిచిందా, నేను గెలిచానా చెప్పండి? అట్లా మనలో మనం అనుకున్నా మన శరీరం ఒప్పుకోదు. గయ్యాళి భార్య కన్నా శరీరం చాలా కష్టం. అట్లాగే గయ్యాళి భర్త కన్నా భార్యకి శరీరం చాలా కష్టం. దానికేమన్నా పదును పెట్టదలుచుకుంటే ఏడు నుండి ఇరవైఒక్క లోపల పెట్టాలండీ! ఉపనయనములో వాళ్ళు చెప్తారు చన్నీళ్ళతో స్నానం చేయి. ఏదో స్ఫూర్తి వచ్చి చేయిద్దాం అనుకుంటే వెంటనే ఆ మమకారం వస్తుంది తల్లికి. చిన్నపిల్లవాడు చన్నీళ్ళ స్నానం చేస్తే జలుబు చేస్తుందీ....ok అయిపోయింది. తల నిండా చెయ్యరా. తలనిండా చన్నీళ్ళు చేస్తే జలుబు చేస్తుంది. తెల్లవారుఝామున లేస్తే జలుబు చేస్తుంది. ఏం చేసినా జలుబు చేస్తుంది. ఇంక వాడు తరువాత లెమ్మంటే లేస్తాడా? ఇవాల్టికి మనకి complaint ఆరింటికి prayer కి కూర్చోవాలి అంటే, శరీరం ముక్కుతూ మూలుగుతూ లేస్తూనే, ఒక్కొక్క రోజు పడుకుంటుంది కదా. ఎందుకు ఇలా అయింది? ఏడు నుండి 21 వరకు ఎంత రాపాడితే ఆ time లో తరువాత అంత అది పదునుగా ఉంటుంది. ఇహ అక్కడ నుండి ఏం చెప్పారంటే 21 నుండి 42 వరకు ఇవ్వాల్సిన భోగాలన్నీ ఇచ్చేసెయ్ శరీరానికి అని. శరీరం ఇచ్చింది, ఒకటి భోగించడం కోసం, రెండు యోగించడం కోసం. ఈ రెండూ కాకపోతే రోగించడం ఉంటుంది. మనకి రోగము, భోగము, యోగం అండీ! యోగికి భోగం అనేది చక్కగా ఉంటుంది. అట్లా గడ్డాలు మీసాలు పెంచుకుని, గుంటకళ్ళు పెట్టుకుని, దవడలు అంతా చప్పిడి పడిపోయిన వాళ్ళు యోగులు కారు. వాళ్ళెవరినీ మనకు ఉదాహరణగా ఇవ్వను కూడా ఇవ్వలేదు కృష్ణుడు. చక్కగా పుష్టిగా ఉండి, భగవంతునిలో ఉంటూ, సమస్తాన్నీ అనుభూతి చెందే వాడు యోగి. అదీ రాజయోగం! ఉత్తయోగి లాభం లేదట. రాజయోగి అవ్వాలని కోరుకుంటారట యోగులందరునూ. యోగులకి గమ్యం ఏమిటయ్యా అంటే 'రాజయోగం' సింహరాశి spiritual astrology లో చదువుకోండి. సింహం లాగా ఉండాలట యోగంలో ఉన్నవాడు. అంతే తప్ప EK మాష్టారు చెప్తుండేవారు బడిపంతులు

లాగా ఉండకూడదు యోగి అని. తెలుగు మాస్టారుగా అసలు ఉండకూడదు అనేవారు. ఎందుకు అట్లా ఉంటాము అంటే మనం ఎప్పుడు ఏది చేయాలో అప్పుడు అది చేయకపోవడం వలన రోగగ్రస్తం అవుతుంది శరీరం. ఇప్పుడు మనకి రోగాలేగా ఉన్నాయి. యోగము, భోగము లేవు. రోగములు మాత్రం ప్రతి వారి దగ్గరా జేబులోంచి తీసి చూపించగలరు, నా prescription ఇది అని. అంత రోగము ఉంది. ఎందుకొచ్చిందీ? ఏడు నుండి ఇరవైఒక్క వరకు వాడిని చేయవలసింది చేయనీయక, వాడికి చేద్దాం అని ఉన్నా సరే, మనం అడ్డుపడిపోయి, ఆ తరువాత వాడిని అడుగుతాము ఏదీ లే పాద్దున్నే, అని. ఎట్లా లేస్తాడో చూద్దామని. వాడు నవ్వి పడుకుంటాడు. లేవడం ఏమిటి అని? బుద్ధి లేదా అన్నట్టు. అయిపోతుంది ఆ జన్మకి ఇంక అది కష్టం. 21 ఏళ్ళు అయింతరువాత మళ్ళీ 21 ఒక సెట్టు. ఆ 21 ఏళ్ళు నీకు కావలసిన భోగాలు అన్నీ అనుభవించు ధర్మపరంగా. అధర్మపరంగా చేసావో ఇహ అక్కడ నుండి చుట్టేస్తుంది లుంగలు. ధర్మపరంగా 21 సంవత్సరాలు చక్కగా భోగించు. 42 నుండి మళ్ళీ దీక్ష. ఏమిటి దీక్ష? సౌకర్యములు అనేవి శరీరానికి అలవాటు చేయకుండా ఉంచాలిట. ఎందుకంటే శరీరము ముసలిదవుతున్న కొద్దీ సౌకర్యాలు ఎక్కువ కోరుతుందిట. సౌకర్యాలు ఎక్కువ కోరుతున్న కొద్దీ, నువ్వు దానికే మొగ్గుతూన్న కొద్దీ ఏం జరుగుతుందంటే అది బలుస్తుంది, నువ్వు సన్నగిల్లుతావు. అందుకని 42 ఏళ్ళు వచ్చిన తర్వాత ఒక పూటే భోంచెయ్. అప్పుడు తక్కువ నిద్ర ఉంటుంది. రెండో పూట ఏదో పళ్ళు ఫలాలు, శనివారం ఉపవాసంలా కాకుండా! శనివారం ఉపవాసం అంటే పండుగే మామూలుగా. శుభ్రంగా రుచులు రుచులుగా చేసుకు తిండానికి ఎప్పుడొస్తుందా అని ఉపవాసం కోసం ఎదురు చూసి, ఎదురుతెన్నులు కాసేట్టుగా ఉండే ఉపవాసాలు కాదు. ఏవో రెండు చపాతీలు తిండం లేదా రెండు పళ్ళు తిని పాలు తాగడం, ఇట్లా 42వ సంవత్సరం నేలమీద పడుకోవడం. ఎందుకంటే 42 నుండి శరీరతత్వం బాగా ఇహ మొద్దుబారుతుంది. మొద్దుబారిన శరీరానికి మనం పదును ఎక్కించాలంటే సౌకర్యాలనేవి తగ్గించాలి ఒకటి, లేకపోతే బాధ పడని స్థితిలో దాన్ని పెట్టాలి. ఇట్లా ఆ శరీరాన్ని ఎప్పటికప్పుడు మనకి, రౌతు గుర్రాన్ని స్వాధీనం చేసుకున్నట్టుగా ఉంచాలండీ! లేకపోతే అది అట్లా పెరిగిపోయి అది మనకి చెప్తూ ఉంటుంది ఏం చేయాలో. అక్కడికి పోయి అది తిను, ఇక్కడికి పోయి ఇది తిను, పడుకో, prayer చేయకపోతే ఏం పరవాలేదు, నిద్రలో కూడా జరుగుతుందని చెప్పారు CVV గారు, ఇట్లా బోల్డు విషయాలు మనకి తెలుసు కదా. ఇంకా అలా వెళ్ళిపోతూ ఉంటాం. ఇహ వాడికి 'ఆనంది' అనేదేం లేదు. ఏది? 49 వ సంవత్సరంలో ఇంక ఆనందం ఏముంది? అక్కడ నుండి దుఃఖమే! ఎందుకంటే అన్నీ వచ్చేస్తాయి. త్రిమూర్తులు ఉన్నారు మనకి. ఏమిటంటే ఒకటి blood pressure, రెండు sugar మూడు heart. చాలు. 35 నుండి అంటే ఏడు ఐదులు, ఇలా మనకి stations వస్తాయి. మనం Visakha నుండి బయల్దేరి వెళుతుంటే

తుని ఒక important station. మనకి ఏమన్నా పళ్ళు, తమలపాకులకు, తిండానికి సామర్లకోట important station. ఆ తర్వాత మళ్ళీ రాజమండ్రి, ఆ తరువాత మళ్ళీ నిడదవోలు junction. అటు ఇటు ఎటన్నా పోవచ్చు. ఇంకో దారి పట్టచ్చు. అట్లా junction points అన్నమాట 35 years. 35 ఏళ్ళకి Ezekiel's wheel అని చెప్తారు. అందుకని ఏం చెప్పారంటే 21 నుండి 49 చేరుకునే లోపల junction 35 లో, అక్కడ నుండి 42 వరకు ఉంది చూసారా, ఆ ఏడేళ్ళ కాలంలో జబ్బులు ఏమైనా ఒంటి మీద పడితే అవి జన్మంతా ఉంటాయట. 32 నుండి 42 వరకు పడ్డ జబ్బు ఇంక అది 'గెహరాదాగ్' అని చెరిపినా చెరగని మచ్చగా మనతోబాటు ఉండి, వెళ్ళిపోతుంది శరీరంతో పాటు. అందుకని ఏమి చేశారంటే 35 నుండి, 21 నుండి మనం భోగాలు అనుభవిస్తున్నా, 14 ఏళ్ళ వరకే బాగా పెట్టుకో, 35 నుండి కొంచెం జాగ్రత్త పడుతూ ఉండు. కొద్దిగా తగ్గించు. 42 కి జబ్బు పడలేదు, బావుంది. లోపల సాధనోటి జరుగుతుంటే, అది ఊరికే శరీరం పోషించుకుంటూ జాగ్రత్తగా ఉండడం కాదు ఇది. శుభ్రమైన పెట్టెలో పెట్టుకున్నట్టుగా పోషించుకుంటుంటారు కొంతమంది. శరీరమే అసలు పోషణ, అదొక్కటే వేరు కార్యక్రమంగా నడుస్తూంటుంది కదా. పొద్దున్నే time కి ఇంత గింజలు తినడం, time కు ఇన్ని పాలు తాగడం, time కు పళ్ళ రసాలు తాగడం, time కి అన్నం పెట్టడం, మళ్ళీ మధ్యాహ్నం time అన్నీ time time గా అట్లా చచ్చిపోతూ ఉంటారు. అట్లా ఆరోగ్యం వల్ల ఏం ఉపయోగం లేదు. ఉండచ్చు. కాకి కూడా కలకాలం ఉంటుంది. కాకిలా కలకాలం బ్రతికేదానికన్నా హంసగా నాలుగు రోజులు బ్రతికితే చాలు. ఇవన్నీ ఎవరికంటే, రెండో పక్క పరహితం అనే ధర్మాన్ని ఆచరించేవాళ్ళు, అంతర్ముఖంగా సాధన చేసుకునే వాళ్ళు, సూక్ష్మశరీరం నిర్మాణం చేసుకునే వాళ్ళు, వాళ్ళేంటంటే శరీరాన్ని కొంత అశ్రద్ధ చేస్తారు. వాళ్ళ కోసం ఇవి చెప్పారు. అవీ చేయకుండా, ఇవీ చేయకుండా అన్నీ, రెండూ ఉభయ భ్రష్టత్వం ఉంటుంది మనకి. అందుకని ఈ ఏడవ సంవత్సరం నుండీ ఇట్లా ఒక ప్రణాళికాబద్ధంగా మనం తీసుకొస్తే 49 వ సంవత్సరంలో ఖచ్చితంగా, పూర్ణమైన ఆనందం దొరక్క తప్పదు. ఇది సత్యం! అందుకని ఆ 49 వ సంవత్సరానికి అంత మంచి importance. It is the year of initiation in the life of an aspirant. సత్సాధకులకి అద్భుతమైన ఒక వికాసం కలగడానికి అవకాశంగా కాలం తెచ్చి ఇచ్చే సంవత్సరం 49 వ సంవత్సరం. అంటే 48 నిండి 49 మొదలై, 49 నిండే లోపల ఆ అద్భుతమైన అనుభూతి రావడానికి అవకాశం ఉంది. ఇహ లేదూ, కొంచెం ఏదో కుంటుకుంటూ నడుస్తుంటుంది బండి, అవకాశం తక్కువ కానీ, అసలు లేకపోలేదు 56 వరకు. అందుకని జాగ్రత్త పడండి, త్వరపడండి. చిన్నతనంలోనే మంచి విషయాలు తెలుసుకున్న వాళ్ళు మంచిగా జీవితాన్ని ఈ మార్గంలో మలచుకోండి. భారతీయుడికి ఎక్కువ సులభం, మిగతా వాళ్ళకి అంత సులభం కాదు. చాలా ఖచ్చితంగా రాశారు పరమ గురువులు. జ్వాలాకూలుడు చెప్తాడు, occidental body is basically unfit

for yoga. Basically. Oriental body, Asian body specially the Indian body is basically fit for yoga. అందుకని వాడు చాలా సంస్కరించుకుంటే తప్ప యోగంలోకి రాలేడు. వీడు ఇచ్చిన సంస్కారాలు పాడు చేసుకుంటే యోగంలోకి రాలేడు. అంత అద్భుతమైన పరిస్థితి ఉంది మనకి. దాన్ని చిన్న వయస్సులో తెలుసుకున్న వాళ్ళు, తెలుసుకుని స్ఫూర్తి చెంది ఆచరణలోకి దిగిన వాళ్లకి చాలు 49 ఏళ్ళు! ఊరికే స్ఫూర్తి ఉంటే ఏం లాభం? అదీ ఆనందీ! ఇకపోతే ఆనందం గురించి మనకి తైత్తరీయోపనిషత్తులో చెప్పారు. దీనికన్నా అది వంద రెట్లు ఆనందం, దానికన్నా అది వందరెట్లు ఆనందం, దానికన్నా అది వందరెట్లు ఆనందం అట్లా ఆనందం, సృష్టిలో భౌతికకక్ష నుండి సూక్ష్మకక్షలోకి వెళుతున్న కొద్దీ పెరుగుతూ ఉంటుంది. శరీరం కి కొంత ఆనందం ఉంది. ఆదివారం మధ్యాహ్నం వర్షం పడుతోంది, చల్లగా ఉంది, మంచి వేడి బజ్జీలు వేసి పెడతావేంటి అని అడిగామనుకోండి, వేసి పెట్టారనుకోండి, తిన్నాం అనుకోండి, ఆనందం ఉన్నది. ఎంతసేపు? ఎండాకాలం వచ్చింది, ఎండలు వచ్చినాయి, అబ్బా ఎండలు ఎండలు ఎండలు అంటాం. చలికాలం వస్తే అబ్బా చలి చలి చలి చలి. అదేమిటో చలి వస్తే చలి చలి చలి చలి, ఎండ కావాలంటావ్. పోనీ నువ్వు అడిగావు కదా అని ఎండ పట్టుకొస్తే ఎండ ఎండ అంటావ్. చల్లగా ఉంటే వేడిగా ఉండాలనిపిస్తుంది శరీరానికి. వేడిగా ఉంటే చల్లగా ఉండాలనిపిస్తుంది. మన బాధ భరించలేక ఆయన ఏం చేశాడంటే ఒక వసంత ఋతువు, ఒక శరదృతువు రెండూ పడేసాడు మనకి. ఈ ఋతువులలో వెచ్చగానూ ఉండదుట, చల్లగానూ ఉండదట. హాయిగా ఉంటుందిట. అవి కూడా పాడయిపోయినాయి. వసంత ఋతువు మనకి, ఆ వేసంకాలం అనే ఆయన అంటే గ్రీష్మ ఋతువాయన కొంచెం ముందుకు వచ్చి, ముందు ఇల్లు కూడా ఆయనే పుచ్చుకున్నాడు. ఏమిట్రా అంటే, ఈ ఇల్లు కూడా నేనే కొనుక్కున్నాలే ఈమధ్య అని చెప్తాడు. ఇదేంటి నీ ఇల్లు నీకు ఉందిగా అంటే, ఉంది, ఇంకో ఇల్లు కూడా కొనుక్కున్నాను అంతకన్నా ఏం లేదు. ఏదో కాస్తో కూస్తో శరదృతువు ఓ నెల జరిగి, October అంతా బాగుండకపోయినా November, December బావుంటాయి. ఋతువులు కూడా ఒక్క 23 రోజులు వెనక్కి జరిగినాయండీ! ఇటు ముందుకు జరిగినాయి. వేసంకాలం ముందొచ్చేస్తుంది. అలా అని ముందుగా అయిపోతుందా? అవదు. ముందొచ్చి వెనగ్గా వెళ్తుంది. శరదృతువు మామూలుగా మనకి ఆశ్వీయుజ మాసంలో రావాలి. మన దుర్గాపూజలకింకా వేడిగానే ఉంటుంది. కార్తీక మాసంలో వస్తుంది. అదేమిటంటే, మరి నన్ను ముందుగా రానీయట్లేదు, అని చెప్తుంది. కార్తీక మార్గశీర్ష మాసములు శరదృతువు అని చెప్పుకోవాలి ఇప్పుడు మనం. ఇదివరకు ఆశ్వయుజ కార్తీక మాసములు శరదృతువు అని చెప్పుకున్నాం. ఆ రెండు నెలలే ప్రత్యేకంగా విశాఖపట్నంలో బాగుండేది November, December. కదా. ఎప్పుడూ శరీరానికి ఇది ఉంటే అది కావాలి అనిపిస్తుంది, అది ఉంటే ఇది కావాలి అనిపిస్తుంది. ఇక్కడ ఉంటే అక్కడ

ఉండాలనిపిస్తుంది. అక్కడ ఉంటే ఇక్కడ ఉండాలనిపిస్తుంది. ఇంట్లో కూర్చుంటే కాసేపు అసలు, అబ్బా bore గా ఉంది office కి వెళ్ళాలనిపిస్తుంది. Office కి వెళ్తే bore గా ఉంది ఇంకో చోటికి పోదాం అనిపిస్తుంది. ఎక్కడికి వెళ్ళినా bore గానే ఉంటుంది దానికి. ఉన్న కాస్సేపు కూడా ఎక్కువ ఆనందించలేదు. ఆనందం కి తరగతులు ఉన్నాయి. శరీరం కన్నా ఇంద్రియాలలో పొందిన ఆనందం ఇంకొంచెం సేపు ఉంటుందిటండీ. అక్కడికెళ్ళి అదేదో చూసొచ్చాం. చాలా బాగుంది కదా, చాలా బాగుంది కదా అని చెప్పుకుంటూ ఉంటాం. అంతేకాదు చూడని వాడికి అది ఎక్కించేంతవరకు మనం వదలము కదా. చాలా బాగుంది, మీరు తప్పకుండా వెళ్ళాలి, అంటాం. అంటే వీడు ఇంకా దాని ఆనందం పొందుతున్నాడన్నమాట. ఇంద్రియాల ద్వారా పొందే ఆనందం, కేవలం శరీరం ద్వారా పొందే ఆనందం కన్నా కొంచెం బావుంటుంది. కొంచెం ఎక్కువ సేపు ఉంటుంది. దీనికన్నా అది ఒక వంద రెట్లనుకోండి. అంతకన్నా మనస్సుతో పొందిన ఆనందం వుందే అది ఇంకా కొన్ని రెట్లు ఎక్కువుంటుంది. ఆ మనస్సులో ఆ ఆనందం-- మంచి గ్రంథం చదివాము, మంచి మాటలు విన్నాము-- అది జన్మల తరబడి వెంట వచ్చేంత ఆనందం. అదే నెమరు వేసుకుంటూ ఉంటాం. కానీ మనస్సు సంస్కారవంతం కాకపోతే ఆనందపడ్డవన్నీ పక్కన పెట్టేసి, దుఃఖపడుతున్నవన్నీ గుర్తుతెస్తూ ఉంటుంది. అదేమో తర్వాత కానీ ఇది చూడు అని, చూపిస్తుంది. ఇదే చూపిస్తుంది. ఏమిటో తమాషా. కొంతమందికి నెమరు వేసుకున్నట్టు దుఃఖపూరితమైన సంఘటనే మళ్ళీ మళ్ళీ గుర్తొచ్చి వెక్కి వెక్కి లోపల ఏడుస్తూ ఉంటారు. కొంతమంది ఆనందపడ్డవి గుర్తు తెచ్చుకుని ఆనంద పడుతూ ఉంటారు. కాబట్టి మనస్సులో పొందే ఆనందం ఇంకొంచెం ఎక్కువ. అంతకన్నా ఆనందం బుద్ధిలోకంలో ఉందిటండీ! అందుకనే మనస్సు ఆనందం పొందుతూ ఉంటే శరీరం ఎట్లా ఉందన్నది పెద్ద పట్టించుకోడట. శరీరానికి కొంచెం అసౌకర్యమైనా, మనస్సు ఆనందం పొందుతూ ఉంటే అక్కడ శరీరం పడుంటుంది, మనస్సు దానికన్నా పెద్దది కాబట్టి. కొంతమంది పాడుతున్నా, మాట్లాడుతున్నా అబ్బా అంతసేపు ఎట్లా కూర్చున్నామండీ అన్న సంఘటనలు ఉంటాయి. కొంతమంది పాడుతుంటే, మాట్లాడుతుంటే అసలు శరీరమే గుర్తుంటుంది, ఎప్పుడు ఆపుతాడురా అన్నట్టుగా. కాబట్టి మనస్సు ఆనందాన్ని పొందుతుంటే శరీరం, ఇంద్రియాలు ఉపశమనంలో ఉండి, అందులో ఇవి కూడా ఇమిడిపోతాయి. మరి బుద్ధిలో? బుద్ధి లోకంలో ఆనందం రుచిచూసిన వాడికి ఇహ ఈ మనస్సు, శరీరం పొందే ఆనందాలు పెద్ద ఆనందంగా అనిపించదు. వాడు, ఓ రామాయణంలో ఒక రాముడు గురించి, భరతుడు గురించి, హనుమంతుడు గురించి చదివి, అనుభూతి పొంది, ఆ ఆనందంలో రుచి మరిగి, జన్మజన్మలకి రామాయణం మరిచిపోలేడట. జన్మజన్మలకి భారతంలో ఉండే ధర్మ సూక్ష్మాలు మరచిపోలేడుట. అట్లా పవిత్ర గ్రంథాల్లో ఉండే విషయములు బాగా ఆకళింపు అవడం చేత, ఇహ ఇది ఉంది అది ఉంది, ఇది లేదు అది లేదు అనే సమస్య

లేకుండా వాడు హాయిగా ఉంటాడటండీ! అందుకని మన పెద్దవాళ్ళు ఆ సూక్ష్మం ఇచ్చారు. ఇవి పిచ్చి ఆనందాలురా, అది మంచి ఆనందం, అందులో పడు. ఇందులో ఎందుకని. ఆ పద్యం ఎప్పుడూ చదువుకోవాలి. ఏ పద్యం? ప్రహ్లాదుడు తన తండ్రికి చెప్తాడు

మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు, నిర్మలమందాకినీవీచికల దూగు, అంటూ, వెళ్ళదు నాన్నా ఇంకో చోటుకీ, అంబుజోదర, దివ్య పాదారవింద చింతనామృత పానవిశేషమత్త చిత్తమే లీతి నితరంబు జేర నేర్చు అంటాడు. ఆ విష్ణుమూర్తి యొక్క పాదాలు విచ్చుకున్న అరవిందాలులా, కమలములాగా ఉన్నాయట. అమృతము వస్తోందిట అందులోంచి. ఆ అమృతము పుచ్చుకుందిట ఆయన మనస్సు. ఆ పుచ్చుకున్నట్టి అమృతంలో మత్తెక్కిపోయిందట. ఇహ అక్కడ పడుంటుందది. ఇంక రమ్మన్నా రాదు, బంగారం చూపించినా రాదు. ఏం చూపించినా రాదు నాన్నా అయిపోయింది. 'ఏ రీతి నితరంబు చేరనేర్చు?' అదీ బుద్ధి లోకాల్లో ఉండే ఆనందం! అందుకనే పవిత్ర గ్రంధాలు చదివే వాళ్ళకి ఇహ మిగతా వాటి మీదకు మనస్సు పోదండీ! మీకు చెప్తున్నాను, ఒకసారి కొనుక్కుని, కొనుక్కోకపోతే శ్రద్ధ ఉండదు అందుకని, లేదా శరీర శ్రమచేసి ఇక్కడికొచ్చి, అప్పలాచార్యులు గారు రాసిన రామాయణం చదువుకోండి. ఎంత రసభరితంగా ఉంటుందో మీకు తెలుస్తుంది. రామాయణం అంటే ఇదా అని తెలుస్తుంది. మనకి తెలుసు అనుకోవద్దు రామాయణం. మనకి నిజానికి ఏమీ తెలియదనుకోవడం శ్రేష్ఠం. మనకది చాలా శ్రేయస్సు కూడా. ఆ విధంగా రామాయణం చదువుకున్నామనుకోండి, Rt.Hon. శ్రీనివాస శాస్త్రి అని, ఆయన రామాయణ ప్రసంగాలు చేశారు. అందులో ఆయన ఏం చేస్తారంటే, ఒక్కొక్క పాత్రని అంటే రాముడ్ని పట్టుకుని మొత్తం రామాయణంలో రాముడు గురించి చెప్తాడు. రామాయణంలో భరతుడు, రామాయణంలో హనుమంతుడు చదువుతుంటే ఎంత అద్భుతంగా ఉంటుందంటే, ఇంకోటి ముట్టుకో బుద్ధి కాదు. అవి ఇవి చూడ బుద్ధి కాదు. ఎక్కడికెళ్ళబుద్ధి కాదు. అవి ఇవి ఏవో వస్తుంటాయి. కర్తవ్యాలు కూడా కొంచెం తప్పించుకుందామా అన్నంత రుచికరంగా ఉంటాయి. భాగవతంలో గాని, రామాయణంలో కానీ ఆ రకమైన రుచి ఉన్నది. కాబట్టి అటువంటి గ్రంథాలు చదువుతున్నామనుకోండి, మనిషి బుద్ధి లోకంలో ఉంటాడు. మాటిమాటికే పెద్దవాళ్ళని చూద్దామని ఎందుకనిపిస్తుంది? వాళ్ళు చెప్పే మాటలు విందామని ఎందుకనిపిస్తుంది? బుద్ధి లోకాల రుచి వలన అనిపిస్తుంది. EK గారిని చూద్దామని మాటిమాటికీ తిరిగే వాళ్ళం కాదూ! అలాగే భీమిలీ చుట్టూ తిరగట్లేదూ! లేకపోతే పుట్టపర్తి వెళ్ళటల్లా! మనిషి భౌతికంగా కనపడకపోయినా షిరిడి వెళ్ళటల్లా! ఎందుకివన్నీ చేస్తున్నాం? బుద్ధి లోకాల్లో రుచి మరిగి, శరీరశ్రమయినా పట్టించుకోకుండా, గంటల తరబడి అక్కడ కూర్చుని, మూడు నిమిషాలు, నాలుగు నిమిషాలే కనబడుతున్నా పొందే ఆనందం, ఇంత శ్రమనీ మరి ఉపశమనం చేస్తోందిగా. చూశారా ఆనందంలో ఎట్లా మెట్లు

ఉన్నాయో! అంతకుమించిన ఆనందం మనకి హృదయంలో దొరుకుతుంది. ఇట్లా గోళానికి సంబంధించిన ఆనందం, సూర్యుడికి సంబంధించిన ఆనందం, బృహస్పతికి సంబంధించిన ఆనందం--, సూర్యుడి ఆనందం కన్నా బృహస్పతి ఆనందం 12 రెట్లు ఎక్కువట. అది చూడండి. ఇది అట్లా వెళ్ళిపోతూ, వెళ్ళిపోతూ ఉంటే అసలీ మొత్తం తయారుచేసి, ఇంత ఆనందాన్ని పెట్టినాయన 'ఆయన'! ఆయన్నే పొందావనుకో ఇక్కడే కూర్చుని. ఇక మరి అన్ని ఆనందాలు దాటేసి సరాసరి 'నిత్యానంది' అయిపోతావు. అదిట 'ఆయన'! అందుకని ఆయనను పొందిన వాడికి ఇంక ఏమీ అక్కర్లేదండీ! మనకి చిన్న చిన్న ఆనందములు ఉన్నప్పుడు కొన్ని కొన్ని మర్చిపోతామే, అట్లా ఇప్పుడు మనం ఒక్కొక్క లెక్క వేసుకొస్తే, శరీర ఆనందం, ఇంద్రియాల ఆనందం, మనస్సు ఆనందం, బుద్ధి ఆనందం, హృదయ లోకములల్లో ఆనందం, అక్కడ నుండి ఆత్మలోకాల్లో ఆనందం, అక్కడ నుండి 'పరమానందం'. ఇట్లా ఇన్ని ఆనందాలూగా ఆయనే ఉన్నాడట. అంటే శరీర ఆనందం దగ్గర నుండి ఆయనే ఉన్నాడు. అందుకని ఎప్పుడు నువ్వు ఏ విధంగా ఆనందం పొందినా, పొందింది 'ఆయననే' అని గుర్తు పెట్టుకోవాలి. అంటే ఒక మిరపకాయ బజ్జీ నమిలినా ఆనందం వచ్చిందనుకోండి, ఆ ఆనందాన్ని 'ఆయన గా' చూడు. ఇట్లా మనలో ఇప్పుడు అవతరించి ఉన్నాడు ఆనందంగా. Cricket ఆటలో wicket పడిపోయింది. ఆనందం వచ్చింది కదా. మనకంతే కదా. అల్పానందాలు. మనం అల్పానంద్, స్వల్పానంద్ అని పేరు పెట్టుకోవాలి. అప్పుడు పొందిన ఆనందంలో ఎంత వెలుగొచ్చింది మనలోంచి? అటువంటి ఆనందం ఎట్లా వస్తుంది అంటే, కోరుకుంటే వస్తుందని చెప్పారు. కొనుక్కుంటే రాదు అని చెప్పారు. మనం కొనుక్కున్నవన్నీ మనకి ఆనందం తెచ్చినాయా అంటే చెప్పలేము. నువ్వు ఆనందంగా ఉంటే నువ్వు కొనుక్కున్నవి కూడా నీకు ఆనందాన్ని ఇస్తాయి. నీకే ఆనందం లేకపోతే, చూసిన దానిమీదల్లా కోపం వస్తుంది. అదెందుకు కొనుక్కున్నావు ఇదెందుకు కొనుక్కున్నావు అన్నట్టుగా. ఇంటి నిండా కొనుక్కుని ఆనందం కోసం, కాళ్ళకి చేతులకి తగిలి కాలి వేలు కొంచెం చితికిందనుకోండి, అప్పుడు మనకి ఏం వస్తుందీ? అడ్డమైనవన్నీ తెచ్చి ఇంటో పెడతారు, కాళ్ళకి చేతులకి అడ్డంగా అని, తీసి విస్సిరి అవతల పారేస్తాం. ఆనందం రాలేదు కదా. ఆనందం ఎక్కడ నుండి వస్తుందయ్యా అంటే ఒకటే చెప్పారు, 'నీవు సహజముగా ఆనంద స్వరూపుడువి. కాబట్టి ఆనందంగా ఉండడం అనేది నువ్వు నీకు ఒక సంకల్పం చేసుకో. స్వయం సంకల్పం చేత ఆనందం వస్తుంది'. అందుకని ఇంకొక రకంగా రాదా? అనక. దానివలన, దీనివలన, ఇంకో దానివలన అనే ఉపాధులు పెట్టుకోబోక ఆనందం కోసం అని చెప్పారు. ఆనందంగా ఉండాలంటే ఏం చేయాలి మాస్టారూ అంటే, 'ఉండడమేనోయ్' అన్నారు. ఇంకేం చేయడానికి లేదు. ఆనందంగా ఉండాలంటే ఏం చేయాలంటే 'ఉండడమే' అన్నారు. అదేమిటంటే 'ఏం లేదూ నవ్వుతూ ఉందామనుకుంటే అప్పటి నుండి ఆనందంగా ఉంటుంది. అంతేగానీ అది చేస్తే వస్తుంది, ఇది చేస్తే వస్తుంది

అని చేసిన ప్రయత్నాలన్నీ కూడా విఫలం అయిపోయినాయి'. అని చెప్పారు. కాబట్టి అదీ ఆనందం! 'ఆనందీ' అంటే ఆనందమును ధరించి ఉన్నవాడు. అంటే వేణువు, 'ఆనంద' అనే వేణువును ధరించి ఉన్నవాడు. ఆనంది అంటే 49 వ సంవత్సరంలో, సంస్కారయుతంగా పెరిగిన జీవుడికి దొరికే అనుభూతి. ఈ మూడు రకాలుగా చెప్పుకున్నాము.

## 583 వనమాలి

వనమాలి అంటే వనములలో ఉండే పువ్వులను మాలగా ధరించిన వాడు. భగవంతుడు ఎప్పుడు ఒక మాలను ధరించి ఉంటాడు. ఆ మాల ఎప్పుడూ వాడిపోక సుగంధమైన పరిమళాలు జల్లుతూ విజయాన్ని చేకూరుస్తూ ఉంటుంది అని పెద్దలు మనకి తెలిపి ఉన్నారు. అందుకని ప్రతిరోజు భగవంతునికి ఒక మాల కట్టి మనము వెయ్యడమనేది ఒక సాంప్రదాయంగా వస్తున్నది. భగవంతునికి మాల వేయడం ద్వారా భక్తులు తమ యొక్క జీవితంలో పొందవలసిన విజయములను పొందగలరు. విజయం పొందడమంటే భక్తుని వరకు భగవంతుని సానిధ్యంలో ఉండడానికి ఏర్పడిన అవరోధముల నుండి బయటపడడం. అలాగే తన జీవన విధానంలోనూ, తన చుట్టూ ఉండే పరిసరాల్లోనూ భగవంతుని యొక్క అనుసంధానం చెందడానికి కావలసిన సదుపాయాలు కలగడమే విజయంగా భావిస్తారు. భగవంతుని యొక్క మాలను 'వైజయంతి' అంటారు. అందుకని తమకి సుఖములు, తమకి జయములు, తమకి విజయములు, తమకి పురోగభివృద్ధి కలగాలి అనుకునే వారు అందరూ కూడా, భగవంతునికి రోజు ఒక మాల కట్టి ఆయనకు ధరింప చేసే ఒక సాంప్రదాయం ఉన్నది. భగవంతుని మెడలో వేసిన దండ కారణం చేత తనకి ఆ రకమైన విజయములు కలిగే అవకాశం ఏర్పడుతుంది. అందుకని ఇంట్లో మగవారు కానీ, ఆడవారు కానీ తమకు ఉన్న చిత్రపటాల్లో ఏదో ఒక పటానికి తమ ఇంట్లో తమ స్వహస్తములతో పెంచిపెద్ద చేసిన పూల మొక్కలకు పూసిన పువ్వులను ప్రేమతో, అనురాగముతో భక్తితో, భగవంతునికి మాలగా ఏర్పరిచి దానిని భగవంతునికి ధరింప చేయడమనే ఒక సాధన ఉంటుంది. ఇలా మాలను కట్టుకుంటూ, ఆ పూల మొక్కలను మనమే పెంచుకుంటూ, ఆ పెరుగుదలకు మనమే బాధ్యత వహిస్తూ, ఆ పెరుగుతున్న వాటిని ప్రేమ అనురాగాలతో పెంచుతూ, పూల చెట్టు ఇచ్చే ఆ పువ్వులను చక్కగా అందుకుని వాటిని భక్తి ప్రధానంగా నామస్మరణ చేస్తూ ఒక దారానికి ఎక్కిస్తూ, ఆ ఎక్కించిన మాల భగవంతునికి ధరింప చేసిన తర్వాత భగవంతుని యొక్క చిరునవ్వుతో కూడిన ముఖమును ఆరాధన చేసుకోవడం అనే సాధన ఒకటి, మధురమైన సాధన! గోదాదేవి అటువంటి సాధన చేసినట్లుగా మనకిపెద్దలు చెప్తారు. భక్తి ప్రధానమైన కార్యక్రమములో మనకు ముఖ్యముగా ఏ పని చేసినా అది భగవంతునికి కైంకర్యముగా చేయడం అనేది ఒకటి చెప్పబడియున్నది. పని ఏదైనా కావచ్చు అందులో ప్రతి చిన్న విషయం నుండి కూడా భగవంతుని కొరకు అనేదిగా ఉన్నట్లయితే, ఆయన స్మరణలో ఆ కార్యం నిర్వహిస్తున్నట్లయితే, మధురమైన అనుభూతి రావడానికి అవకాశం ఉంది. కొని దండలు వేయడానికి, మనమే ఆ పూలు అందుకుని మనమే మాల కట్టి వేయడానికి తేడా

ఉంది. నలుగురికి భోజనము hotel నుండి తెప్పించేసి పెట్టిందానికి, మన ఇంట్లోనే మనం నలుగురు కలిసి వండుకుని, అది చక్కగా అమర్చి, మన చేతులతోనే మనం వడ్డించిన దానికి చాలా తేడా ఉంది. ఈ రోజుల్లో ప్రతీది కూడా ఇంత డబ్బులు పారేస్తే వాళ్ళే వచ్చి నిర్వర్తించేస్తారు వంటలు కూడా ఈ రోజుల్లో పెళ్లిళ్ల సమయంలో ఎవరూ చేయడం లేదు. అందరూ ఒళ్ళు దాచుకోవడం అనే కార్యక్రమంలో ఉన్నారు. ఈ రకమైన కార్యక్రమంలో ఉన్న అనుభూతిని కోల్పోయి, అనుభూతి కోసం ఇక్కడ అక్కడ వెతుక్కుంటూ ఉంటారు. చేసే పనులు భగవంతునికి కైంకర్యం చేసుకుంటూ చేస్తున్నట్లయితే, అందులో నుండి అనుభూతి కలుగుతుంది. వంట చేసేటప్పుడు ఆ రకమైన అనుభూతితో వంటచేసి, వడ్డన చేసేటప్పుడు ఆ రకమైన అనుభూతితో వడ్డన చేస్తే అప్పుడు ఆ రకమైన వడ్డన ఆనందాన్నిస్తుంది. అన్నదానము అంటే ఇంత కొని పడేయడం కాదు. ఏదైనా కొని పడేసేది శ్రద్ధతో చేసినట్లుగా అవదు. అందుకని భగవంతుని విషయంలో మన వరకు ప్రతీది శ్రద్ధతో, మన స్వహస్తాలతో ఎంత చేస్తే అంత ఆనందం పొందుతాం. ఇక్కడ మనము చేసే కార్యక్రమములో చిత్రపటాలు అమరిక చేసిన వారు, దండలు వేసేవారు, దీపాలు పెట్టేవారు, కూర్చోడానికి పరదాలు పరిచేవారు, ఎందుకు చేస్తారంటే అందులో వారికి అనుభూతి ఉండడం వలన. ఎందుకు చేస్తున్నామంటే మనలో ఎవరు అతిథులు లేరు. అందరూ ఒకటే కుటుంబానికి సంబంధించిన సభ్యులము అనే భావన ఉండడము చేత. అలాకాక ఇక్కడ దండలు వేయడానికి ఒక మనిషిని పెట్టడం, ఇక్కడ ఇవన్నీ పరచడానికి ఒక మనిషిని పెట్టి జీతం ఇవ్వడం, వచ్చినవాళ్లు వినడానికి వచ్చేసి వెళ్లిపోవడం, వెళ్లిపోయేటప్పుడు అక్కడేమన్నా డబ్బా ఉంటే అందులో ఉపన్యాసానికి ఇంత అని వేసి వెళ్ళిపోవడం ఇట్లా ఉందనుకోండి అప్పుడు అందులోంచి అనుభూతి రాదు. మనము నెమ్మదిగా మన జీవితంలో ఎక్కువ ధనానికి చోటు ఇస్తున్నాం. ఎంత ధనానికి చోటిస్తే అంతా మన మధ్య గోడలు పెట్టుకోవచ్చు. వీలున్నంతవరకు ధనాన్ని తగ్గించుకుని, మానవ చైతన్యంతో ఎక్కువ కలిసి పని చేయడం అనేది చెయ్యగలిగినట్లయితే అప్పుడు మనకి సహజీవనము అనేది చక్కగా అబ్బుతుంది. కలిసి పని చేసుకుంటే మనిషికి, మనిషికి మధ్య అనుబంధం పెరుగుతుంది. అది ఎవరికి వారుగా చేసుకోవడం లో ఉండదు. నలుగురికి సంబంధించిన పనిలో డబ్బు ప్రధానమైతే, ఈ అనుబంధం తగ్గుతూ వస్తుంది. ఇలా విడదీసే తత్త్వం ధనంలో మనకి కనిపిస్తుంది. కలసి విష్ణుసహస్రనామం చదువుకోవడం లో ఉండే అనుభూతి ఎవరికి వాళ్లు చదువుకోవడం లో ఉండదు. కలసి భోజనం చేసే అనుభూతి ఎవరికి వాళ్లు గా భోజనం చేస్తుంటే ఉండదు. ఆ కలిసి చేసుకునే దాన్లో అందరిదీ కాస్తోకూస్తో పడుతూ ఉందనుకోండి అక్కడ అనుభూతి వేరు. అలా కాకపోతే పాడి పాడిగా అయిపోయి, మనము సముద్రం పక్కన ఉన్న ఇసుకలాగా తయారవుతాం. సముద్రము ఇసకకి నల్లరేగడి మట్టికి తేడా తెలుసా ? నల్లరేగడి మట్టిలో అణువులన్నీ కూడా బాగా అనురాగం

చెంది పటిష్టంగా కనిపిస్తాయి. సముద్రపు పక్కన తీరంలో ఉండే ఇసుకలో అన్నీ దగ్గరే ఉంటాయి గాని, ఒకదానికొకటి సంబంధం ఉండదు. ఎడారిలో ప్రతి ఇసుక రేణువు పక్క దాంతో కలిసే ఉంది, కలిసే ఉన్నాయ్, అని ప్రపంచానికి కలిసి ఉన్నాము అని చెప్పడానికి పనికి వస్తుంది తప్ప, నిజానికి అవి కలిసి లేవు. ఒకచోట ఉన్నాయి గాని దేని దారి దానిదే! నల్లరేగడిమట్టిలో ఉండే అణువులు ఎంత కలిసి ఉన్నాయంటే, అందులో మీరు ఒక విత్తనం వేస్తే అవన్నీ కలిసి సామూహికంగా ఆ విత్తనాన్ని మొలకింపచేసి, ఒక మహా వృక్షంగా తయారు చేస్తుంది. అదే విత్తనము మీరు ఇసుకలో వేస్తే రాదు. తేడా అది. అక్కడ కలి లేదు, ఇక్కడ కలి ఉంది. ఆ కలయికే వనము! అనురాగం, ప్రేమ, ఆప్యాయత, ఒకరియందు ఒకరికి అనుబంధం ఉంటే అక్కడ ఏమైనా మొలుస్తుంది. నలుగురికి కలిసివచ్చే పని అవుతుంది. అలా లేకపోతే అందరం కలిసి ఉంటాము కానీ నలుగురికి పనికొచ్చే పనులు ఏమీ ఉండవు. కలిసుంటాము కానీ అందులోంచి ఏమీ పుట్టదు. అందుకని ఒకటి ఎవరికి వారుగా చేసుకోవడం లోనూ, రెండవది ధనంతో చేసుకోవడం లోనూ, మనుషులు తగ్గిపోతారు. ధనం మనుషులను విడదీస్తూ ఉంటుంది. ఇదివరకు ఊరంతా కలిపి ఒక గడియారం ఉండేది. గడియారం చూడడానికైనా ఊర్లో అందరూ ఒక దగ్గర చేరే వాళ్ళం. ఆ తర్వాత ఇంటికి గడియారం వచ్చింది. ఇప్పుడు ఎవరి చేతికి వాళ్ళ గడియారం. ఇంట్లో వాళ్ళందరూ ఒకచోట ఉండడం కాకుండా వేరే వేరే గదులు వచ్చినాయి. ఎవరి గదులు వాళ్ళవి, ఎవరికి వాళ్ళ రేడియోలు, ఎవరికి వాళ్ళ టీవీలు, వాళ్ళ గదులు అట్లా ధనం పెరుగుతున్న కొలది విడిపోవడం అనే తత్త్వం ఉంటున్నది. ఇది తెలిసే, ధనం యొక్క ఆవశ్యకత వీలున్నంతవరకు తగ్గించుకుని మనుషులు యొక్క అన్యోన్యత, ఆవశ్యకత, అనురాగము వీలున్నంత పెంచుకోవడం కోసం మనకి బృందావనం అని ఇచ్చారు. వసుదేవుడు తాను రాజుగా ఉన్నప్పుడు చాలా భావన చేశాడు. రాజుగా రాజ్యాన్ని అంతా పటిష్టంగా ఉంచాలంటే తను సింహాసనంపై కూర్చుని కప్పాలు చెల్లించుకుంటూ రాజ్యం నిర్వహిస్తుంటే జరగదు. ప్రజల మధ్యలోకి వెళ్లిపోయి వారికి పాడి-పంట ఏ విధంగా అభివృద్ధి పెంచుకోవాలి, అలాగే మనిషి, జంతు, వృక్షము, ఖనిజము ఈ నాలుగింటికి మధ్య ఒక అనుసంధానం పట్టుకొస్తే చక్కగా ఉంటాడు మానవుడు అని, గుంపులు గుంపులుగా హాయిగా ఒక కుటుంబం లాగా, వసుదైక కుటుంబంగా తయారు చేయాలనే ఉద్దేశంతో, ఆయన రాజసింహాసనం వదిలేసి, చక్కగా వెళ్ళిపోయి కొంతమందిని పల్లెటూర్లో చేరదీసి వాళ్లందరికీ భూములను ఎట్లా చూసుకోవాలో, ఆవులని ఎద్దులని ఎలా వాడుకోవాలో, మనుషులకి మనుషులకి మధ్యన అనురాగం ఎలా ఉండాలో నేర్పి, అందర్నీ భూమికి, పాడికి, పంటకి కలిపి ముడి వేశాడు. అందరూ బాగుండాలి అనుకోవడం, ఊళ్ళో వాళ్ళందరూ కలిసి ఒకే కుటుంబంగా ఒకచోటే వండుకోవడం, అందరూ అక్కడికే వచ్చి తినడం. కొంతమంది పంట పండిస్తే, కొంతమంది నేత నేస్తే, కొంతమంది పిల్లలకు విద్యాబోధన

చేస్తే, మరి కొంతమంది వైద్య సౌకర్యాన్ని కలిగిస్తే, కొంతమంది వేదబోధన చేస్తారు. దేవాలయము, వైద్యాలయం, విద్యాలయం మూడు ఆలయాలు. ఇవి కాక ఇంకా కావలసినవి, జంతువులకు కావలసినవి, వృక్షమునకు కావలసినవి, భూమికి కావలసినవి ఇవన్నీ వీళ్ళే అందరూ కలిసి ఏర్పాటు చేసుకోవడం. అలా చేసుకోవడం వల్ల వచ్చిన ధాన్యం అంతా కూడా తీసుకొచ్చి ముందు దేవాలయంలో దేవుడికి అని ఒక 20 శాతం పెట్టేయడం. ఎందుకంటే ఊర్లో ఎవరికైనా కష్టం వస్తే అక్కడ నుండి తీసుకుంటారు. మిగతాదంతా ఎవరెవరిది వాళ్ళ ఇళ్లకు పంపించడం కాదు. ఒక భోజనాలయం ఉండేది. అక్కడ అందరికీ వండి, అందరికీ వడ్డించేవారు. అలాగే గొడ్ల శాలలు. సమస్తమూ కూడా ఒక సమిష్టి కుటుంబం గా తయారుచేయడానికి, వర్ణాశ్రమ ధర్మములు ఆధారంగా చేసుకుని, నిర్వర్తింప చేశాడు వసుదేవుడు. ఇదే కార్యాన్ని Pythogarus అనే మహాశయుడు Greek దేశంలో Pythogarian Brother Hood అని చేశాడు. ఈ రోజున పరమగురువుల మార్గములో ఉండేవారు వారికంటూ ఉంచుకోకుండా, అందరూ కలిసి ఒకచోట ఉంచుకుని, అందులోంచి అందరూ తీసుకునే పద్ధతి పెట్టుకున్నారు. ఊళ్లో నేత పనిచేసే వారందరూ దానికి సంబంధించింది అక్కడ తెచ్చి పెడతారు. ధాన్యాలన్నీ ఒకచోట చేర్తాయి, కూరగాయలన్నీ ఒకచోట చేర్తాయి, ఎవరికి కావాల్సినవి వాళ్ళు అక్కణ్ణుండి తీసుకు వెళ్ళవచ్చు. అలా ఉన్న చోట డబ్బుకు అవసరము ఎక్కువ ఉండదు. అటువంటిది ఏమైనా మనం కూడా చేద్దామని మాస్టర్ గారు 'మిథిల' అను గ్రామాన్ని నిర్మాణం చేయడానికి ఒక ప్రయత్నం చేశారు, 'మంద్ర' అనే ఒక సంఘాన్ని పెట్టి. అది కాల స్వభావము చేత ఫలించలేదు. ఇది ఎందుకు చెప్తున్నాను అంటే దేవుడికి పెట్టే దండ నుండి కూడా మనము ఈ రోజుల్లో కొనేసి వేయడానికి ఒక మనిషిని పెట్టేసి, వాడి చేత వేయించేస్తే, నీకు దాని అనుభూతి ఉండదు కదా. ఇక్కడ నుండి మనము ఒక వెయ్యినూటపదహార్లు తిరుపతికో, పుట్టపర్తికో పంపించేశాం అనుకోండి, దానికి ఏదో అక్కడ ఒక భోగం చెప్పామనుకోండి, ఆ భోగం అక్కడ జరిగిందనుకోండి, నీకు దాని అనుభూతి అయ్యిందా? నీకు ఆ అనుభూతి కలగాలి అనుకుంటే నీ వంతు సేవ, నీకుగా చేయడంలో అనుభూతి వస్తుంది తప్ప, చేయించడం వల్ల రాదు. భగవంతుడి అనుభూతి కావాలంటే నువ్వు స్వంతం గా చేసుకోవాలి. నీదైన పని అది ఎంత చేసుకుంటే అంత నీ శరీరము, ఇంద్రియములు, మనస్సు, 'బుద్ధితో' కూడి ఉంటాయి. అలా కూడి ఉండడం చేత బుద్ధిలోకాల్లోంచి వచ్చే అనుభూతి మనస్సుకు అందుతుంది, ఇంద్రియాలకు శరీరానికి కూడా హాయిగా ఉంటుంది. ఈ రోజుల్లో మనం ఒత్తులు కూడా కొనుక్కునే పరిస్థితి వచ్చింది. అన్నీ కొనుక్కోవడమే! ఇంట్లో ఈ రోజు వంట చేసుకోకపోతే ఏమీ, హాయిగా ఎక్కడికైనా వెళ్లి తింటే బాగుంటుంది అనిపించట్లే? ప్రతీది కొనుక్కోవడం అనేది ఉందే--. మీరు సాధకులు కాబట్టి చెప్తున్నాను వీలున్నంతవరకు కొనుక్కోకుండా మన చేతులతో మనం చేసుకోగలిగినవి ఏమైనా

ఉంటే అది మాత్రం కనీసం చేస్తూ ఉండండి. రోజు పూలు కొనుక్కొచ్చి మా ఇంటిలో దేవుడికి పెట్టెయ్యరా అన్నామనుకోండి, మనది అవ్వదు కదా అనుభూతి. ఆ పూల మొక్కలను పెంచడంలోనూ, వాటి పూలని దండలు కట్టడంలోనూ, వాటిని దైవానికి వేయడం లోనూ, ఆ దీపాలు పెట్టుకోవడంలోనూ అందులో చాలా సాధన ఉంది. మనస్సు భగవంతుని మీద ఉంచి చేస్తే బాగుంటుంది. మనస్సు ఎక్కడో తిరుగుతూ యాంత్రికంగా చేస్తే అనుభూతి ఉండదు. కాబట్టి భగవంతుని యొక్క మాల వేయడం ప్రత్యేకంగా కష్టంలో ఉన్న వారు చేయవలసిన పని. వైజయంతి కదా అందుకని! భగవంతునికి వేసే ప్రతి మాలా ఒక వైజయంతిమాల! భగవంతుని మెడలో పడితే అది వైజయంతిమాలే! అందుకనే ఆయన ధరించినది తీసి, మళ్లీ మిగతా వాళ్ళకి వేయడం గా మనకి కథ ఉన్నది. భగవంతుడు మెడలో వేసుకున్న మాల ఇంకొకరు వాళ్ళ మెడలో వేసుకుంటే, భగవంతుడు స్పృశించిన మాల ఎవరి మెడలో అయినా పడితే, భగవత్ భక్తుడు గనక ఒక మాల తన చేతులతో ఎవరి మెడలో అయినా వేస్తే వాళ్లకి విజయం. అట్లా ఉంటుంది ఈ పూలమాల కథ! సుగ్రీవుడు మొట్టమొదటిసారి వాలితో యుద్ధానికి వెళ్ళినప్పుడు రాముడి ఆజ్ఞ తీసుకుని వెళ్తాడు. శుభ్రంగా తన్నులు తిని వస్తాడు. రెండవసారి సుగ్రీవుడికి రాముడు మళ్లీ ధైర్యం చెప్పి, లక్ష్మణుడి చేత ఒక మాల వేయిస్తాడు. ఆ మాల ప్రభావము వల్ల, లక్ష్మణుడి ద్వారా, సుగ్రీవుడికి ఆశీర్వాదం దక్కుతుంది. ఎందుకంటే లక్ష్మణుడు భగవత్ భక్తుడు! హనుమంతుడు వచ్చి, రామలక్ష్మణులు ఎవరని కనుక్కుందాం అనే సందర్భంలో హనుమంతుడు ప్రసంగించిన తర్వాత మీరెవరు? అని అడిగితే, రాముడు లక్ష్మణుడు వంక చూస్తాడు. లక్ష్మణుడు అంటాడు 'ఈయన పేరు రాముడు. అతనికి నేను సోదరుడ్ని. నా పేరు లక్ష్మణుడు. నేను అతనికి దాసుడ్ని' అంటాడు. అది చూడండి 'అతనికి ఇతను సోదరుడు అంట' అంటే రాముని దృష్టిలో లక్ష్మణుడు అతని తమ్ముడు కానీ, లక్ష్మణుడు దృష్టిలో రాముడు తన అన్నయ్య కాదు, సాక్షాత్తు భగవంతుడు. అతనికి దాసత్వము చేస్తున్నానంటాడు లక్ష్మణుడు. దాసోహం! నేను దాసుడుగా ఆయన్ని కొలుస్తున్నాను అని చెప్పడంలో, ఈయన తప్పు చేస్తున్నాడని మనకనిపిస్తుంది. దాసుడు ఎవరూ? తాను లేక తనయందు కూడా ఆ తత్వమే నింపుకున్నవాడు! భగవంతుడికి పరిపూర్ణముగా సమర్పణ చెందినవాడు దాసుడు. పేర్లలో కూడా దాసు అని పెట్టుకోవడం వల్ల మనకి 'దాసోహం' అంటే తెలియట్లేదు. విశ్వామిత్రుడు అన్ని రాముడికే చెప్తూ ఉంటాడు. ఎక్కడా లక్ష్మణుడికి చెప్పినట్టుగా ఉండదు. అంతా రాముడితోనే మాట్లాడుతూ ఉంటాడు లక్ష్మణుడికి ఏమి చెప్పినట్టు ఉండదు. అస్త్రాలన్నీ కూడా రాముడికి బోధిస్తారు కానీ లక్ష్మణుడికి కూడా వచ్చేస్తాయి. ఎందుకు వస్తాయీ? రాముడిలో, లక్ష్మణుడిలో ఉన్నది ఒక్కటే! అదీ లక్ష్మణుడి సమర్పణ! 'నాతో మాట్లాడరేమిటీ, అందరూ మా అన్నయ్యతోనే మాట్లాడుతున్నారు' అనుకోలేదు లక్ష్మణుడు. ఎందుకంటే తను అంటూ లేడు. అన్నయ్యే,

తను! తనలో కూడా అన్నయ్య ఉన్నాడు. తానంటూ ఉన్నాడు అంటే రాముడికి దాసుడుగా ఉన్నట్టు. చూడండి ఎంత అద్భుతంగా చెప్పాడో! అంటే లక్ష్మణుడు స్వతహా శక్తిమంతుడు. 'నేను కాలపురుషుడిని అయినప్పటికీ కూడా ఆయన వరకు దాసుడిని' అని చెప్పాడు మిగతా వాళ్ళకి. 'ఎవరికీ నేను లొంగను పరమాత్మకి పరిపూర్ణంగా లొంగి ఉంటాను' అని చెప్పినవాడు. అటువంటి వాడిని హనుమంతుడు చూసి, చూడంగానే గుర్తించేస్తాడు. రాముడితో మాట్లాడదామని రాముణ్ణి మీరు ఎవరు? ఏమిటి ఇలా ఉన్నారు? అడుగుతాడు హనుమంతుడు. అద్భుతంగా ఉన్నారు వర్ణిస్తాడు. వర్ణిస్తే లక్ష్మణుడు సమాధానం చెప్తాడు, అంటే రాముడికి పొగరా? అది two in one! మనము radio, tape recorder ఒకటే two in one అనుకుంటాం. కానీ అది all in one! మొత్తం అంతా ఒకదానిలోనే ఉన్నాయి, ఆ ఒక్క దాంట్లోంచి అన్నీ వచ్చినాయి. అది తెలిసినవాడు లక్ష్మణుడు! అది గమనిస్తాడు హనుమంతుడు. గమనించి ఇద్దరినీ భుజాన్ని ఎక్కించుకుంటాడు. ఒకళ్ళని భుజాన ఎక్కించుకుని ఇంకొకరిని 'నువ్వు దాసుడివి కదా వెనకాల నెమ్మదిగా రా' అనకుండా ఎక్కించుకుని ఋురుష్యమూక పర్వతమునకు తీసుకెళ్తాడు. తెలిసినవాడు దాసుని అవమానించడు, ఎందుకంటే దాసుని రూపంలో భగవంతుడు చాలా ఎక్కువ ఉంటాడు. వాడికి ఏం చేస్తున్నారో చూసుకుంటూ ఉంటాడు. తనతో వచ్చినవాడు తనని ఎప్పుడూ అంటిపెట్టుకుని ఉన్నాడంటే, వాడు ఎంతటి వాడై ఉండాలీ? కాబట్టి వాడికి ఏం జరుగుతూ ఉంటుందో ఈయన చూసుకుంటాడు. సుగ్రీవుడి దగ్గరికి తీసుకువచ్చి రాముణ్ణి పరిచయం చేయగానే, సుగ్రీవుడు పక్కన ఒక చెట్టును కొట్టేసి చక్కగా రాముడు కూర్చోడానికి ఆసనంగా వేస్తాడు. వెంటనే హనుమంతుడు ఆలస్యం చేయకుండా ఇంకొక చెట్టు పెళ్లగించి తీసుకొచ్చి లక్ష్మణునికు ఆసనంగా వేస్తాడు, అది తెలుసు కాబట్టి! అప్పటికీ సుగ్రీవుడికి ఎక్కదు. అంటే రాముడు రాజు. మనం రాజు. Meet levels, ఇంక మిగతాది మనకు అనవసరం అనుకున్నాడు. చూశాడు రాముడు. సర్లే కానీ time వస్తుందిలే అని. వాలి చేత ఒకసారి తన్నుతిన్న తర్వాత, 'ఏమిటి నువ్వు నన్ను పంపించి ఏమీ చేయలేదంటే', 'నాకు నీకు, మీ అన్నయ్యకి మధ్య తేడా తెలియలేదు. (తెలియదా? నిజానికి ఎంత కవల పిల్లలు అయినా తేడా ఉంటుంది). సరిగ్గా గుర్తు పట్టలేకపోయాను నువ్వు ఎవరో, అతను ఎవరో. మళ్ళీ యుద్ధం చెయ్యమంటాడు. సుగ్రీవుడు తనకి దండం పెడుతుంటే, లక్ష్మణుడిని పిలిచి ఒక మాల వేయిస్తాడు. అప్పుడు లక్ష్మణుడికి కూడా సుగ్రీవుడు దండం పెడతాడు. ఆ మాల వేయించడంలో ఉద్దేశం ఏంటంటే 'భక్తుడ్ని కాదని భగవంతుని ఆశ్రయిస్తే కాదబ్బాయ్, మా వాడు ఉన్నాడు వాడు ఒప్పుకోవాలి. వాడు కాలపురుషుడు! వాడు ఒప్పుకోకపోతే నీకేం జరగదు' అన్నట్టుగా ఆయనచేత మాల వేయించిన తర్వాతే మనవాడు వెళ్ళడం, విజయం సాధించడం, మళ్ళీ తిరిగి రావడం జరుగుతుంది. భగవంతుడికి మాల వేసిన దాంట్లో, భగవంతుడు యొక్క భక్తుడికి మాల వేసిన దాంట్లో

అంత ఉన్నది. అందుకని భగవంతుడికి వేసిన మాల తర్వాత ఏం చేస్తాం అనేదానికి జాగ్రత్త చూసుకోవాలి. వెంటనే చెత్త బుట్టలో వేయకూడదు. ఈ రోజుకు ఇది అయిపోయింది కదా అని చెత్తబుట్టలో వేయకుండా కొంత వైశ్య ప్రవృత్తి ఉంటే మీ గల్లా పెట్టెలో వేసుకోండి ఒక రోజు, లేకపోతే మీ బట్టలు పెట్టుకునే బీరువాలో ఒకరోజు పెట్టుకోండి. తిరుపతి నుండి తెచ్చుకుని దాచుకోవడం కాదు, మన ఇంట్లోనూ అదే చేయవచ్చు. దాన్ని ఏం చేస్తాం అనేది ముఖ్యం. దాని disposal లో శ్రద్ధ చాలా ముఖ్యం. నువ్వు భగవంతుని భావంతో కదా వేశావు అక్కడ? అది కారణం చేత ఆ భగవత్ స్పర్శ ఆ మాలకు వస్తుంది. వచ్చిన మాలను మనము ఎట్లా వినియోగిస్తాము దానిపై మళ్లీ శ్రద్ధ ఉండాలి. ఇంత ఉంది ఈ మాల విషయం. మొత్తం ఈ నక్షత్ర మండలం అంతా భగవంతుని మాలయే అని చెప్తారు. అన్నీ ఒక దారానికి ఎక్కించిన పూసల్లాగ ఇవన్నీ ఒకదానికొకటి, ఒకదానికొకటి అనుసంధానం చేసి, మొత్తం ఈ సూర్య మండలాలన్నీ కూడా ఒక మాలగా, ఒక దర్శనం ఉన్నది. 'ద్విగుణీకృతంగా మెరుస్తున్న మాల ధరించిన భగవంతుడు నీలమేఘశ్యాముడు' అని చెప్తారు. ఎందుకంటే ఆయన నీలంగా ఉంటాడు/ ఆకాశం. అందులో మెరిసే గోళాలు, మండలాలు అవన్నీ కూడా మాలగా చెప్తారు. ఇదో పెద్ద మాల ఉంది. అలాగే మనకి మన లోపల కూడా ఈ షట్చక్రములకు సంబంధించిన ఒక మాల ఉంది. ఇవన్నీ ఒకే దారానికి ఎక్కించిన పూసలు. మూలాధారం నుండి సహస్రారం వరకు మనలో మాలగా భగవంతుడు ఉన్నాడు. ఈ దండ, యోగపరంగా అవగాహన చేసుకోవడం ఉంటుంది. ఇవన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది ఉండటం చేత, ఈ శరీరము ఈ విధంగా నడుస్తూ ఉంది. ఇందులో ఏ ఒకటి పని చేయకపోయినా మనపని అంతటితో సరి. అందుకని మన యందు ఆ మాలను యోగము ద్వారా దర్శనం చేసుకోవచ్చు. మొత్తము సృష్టిని ఒక మాలగా తను ధరించి ఉన్నాడు అని చెప్పడానికి, భగవంతుడు ఎప్పుడూ తన శరీరం మీద ఒక మాలను ధరించినట్టుగా మనకు పెద్దలు ఒక కవిత్వపరంగా చెప్పి ఉంచారు. అందుకని మనలో ఆ మాల యొక్క స్పర్శ కలగాలంటే ఆయనకి మాల వేసిన తర్వాత, మన లోపల ఉండే మాలను ఒకసారి భావన చేసుకుంటూ ఉండవచ్చు. మనకి మూలాధారం లో నాలుగు దళాల పద్మం ఒకటి ఉంది, స్వాదిష్ఠానంలో ఆరు దళాల పద్మం, మణిపూరకంలో 10 దళాల పద్మం, హృదయంలో 12 దళాల పద్మం, అలాగే విశుద్ధి చక్రానికి 16 దళాల పద్మం ఒకటి, ఆజ్ఞ చక్రం లో 108 దళాలు పద్మం ఒకటి ఉన్నవి. సహస్రారానికి వెళ్తే 1008 దళముల పద్మం ఉంది. వీటన్నింటికీ మూలంగా ఈ విశుద్ధికి, హృదయానికి మధ్యగా ఒక కేంద్రం ఉన్నది. దాన్ని 'నారాయణ లోకము' అంటారు అక్కడ 8 దళముల పద్మమొకటి ఉన్నది.( పద్మాలు అని ఎందుకు చెప్పారంటే సూర్య కిరణాలకు మాత్రమే వికసించేవి అని అర్థం. అంటే విశ్వ చైతన్యమునకు మాత్రమే అవి అనుసంధానం చెంది ఉండి పనిచేసేవి తప్పా, దానిమీద శ్రద్ధ లేదు.) ఈ పద్మము యొక్క ప్రత్యేకత ఏమంటే అక్కడి నుండే మనకు

సమస్తము విచ్చుకున్నది. అష్టదళ పద్మము మన ఆడవాళ్లు అట్లా ముగ్గులు పెట్టేస్తుంటారు. ఎక్కడ చూసినా అష్టదళ పద్మాలు ఎక్కువగా వేసుకుంటాం మనం అందులోంచి మొత్తం అంతా వచ్చిందని వెయ్యి పైన కూడా మిగిలింది 8, 1008, 108 అష్టోత్తర శతం, అష్టోత్తర సహస్రం అది కదా మనకి. అష్ట- ఎనిమిది, ఆ 8 దళాల పద్మం ఒకటి! ఇవన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానము చెంది ఉన్నాయి. అదే మనకి భగవద్గీతలో కూడా ఒక సూత్రానికి ఎక్కించిన మణుల వలె ఇవన్నీ ఉన్నాయని చెప్తాడు. 'సూత్రే మణిగణా'. కాబట్టి ఆ విధంగా ఈ మాల దర్శనం ఒకటి ఉన్నది. పువ్వులు వికసించటం అనేది గమనించేవాడి మనస్సులో వికాసం కలుగుతుంది. పువ్వు దేనికి ప్రతీక అంటే మనలో ఉండే మృదుస్వభావానికి ప్రతీక! మనలో ఎంత మృదు స్వభావం ఉంటే మనకి పువ్వులంటే అంత ఆదరణ, పువ్వులంటే అంత ఆనందం! ఒక పువ్వు వికసిస్తుంటే చూసి ఆనందపడే హృదయం చాలా తక్కువ ఈ రోజుల్లో. మన గులాబీ మొక్క ఈరోజు పువ్వు పూసింది అని మొక్క పెంచిన వారు ఇంట్లో వారికి చెప్తే అయితే ఏమిటా అన్నట్టుగా ఉంటాడు మగాడు. కదా. అక్కడ పువ్వు ఉందనుకోండి అది చూడకుండా వెళ్ళిపోతూ ఉంటాం. మనలో సూక్ష్మగ్రాహ్యత పెరగాలంటే పువ్వుయందు అనురాగము కలిగి ఉండాలి. మనలో sensitivity అంటాం మనం దాన్నే సూక్ష్మగ్రాహ్యత చెప్తారు అంటే సున్నితమైన విషయాలు, సూక్ష్మమైన విషయాలయందు మనకి దృష్టి ఏర్పడకపోతే వాటి యొక్క అస్తిత్వము కూడా మనకు దక్కదు. సూక్ష్మ శరీరం కావాలని కదా అనుకుంటూ ఉంటాం. యోగపరంగా సూక్ష్మమైన, సున్నితమైన వాటిని చూసినప్పుడు నీకు ఆనందం కలగలేదనుకో, నీవు ఇంకా సిద్ధంగా లేవని అర్థం. ఒక పువ్వు ఒక పూల మొక్కకు సంబంధించిన సూక్ష్మ శరీరము. ఆ పూల మొక్కల్లో ఉండే అణువుల యొక్క సాంద్రత, స్థూలతకి అందులోంచి వచ్చిన పువ్వు రెక్కలకు ఉండే సాంద్రత, సూక్ష్మతకి మనము పోల్చి చూశాం అనుకోండి ఎంత తేడా? గులాబీ ఆకు చూడండి, గులాబీ కాడ చూడండి, గులాబీ రెక్క చూడండి ఎంత తేడా ఉంది సున్నితత్వంలో? అలాగే ప్రతి పువ్వు ఎంతో సున్నితంగా ఉంటుంది. ఆ పువ్వు ఆ మొక్కలో నుండి ఎప్పుడు విచ్చుకుందో, అప్పుడూ ఆ మొక్కకి సార్థకత వచ్చినట్టు. పూలు పూయని మొక్కలు నిష్ప్రయోజనం! అలాగే ఆ పువ్వు తర్వాత కాయగా మారుతుంది. కాయ కాయని వృక్షము నిష్ప్రయోజనం!. వృక్షము నీడ ఇస్తుంది. పండు కూడా ఇస్తే దాని ప్రయోజనము ఇంకా ఎక్కువ కదా. పూలు కూడా ఇస్తే ఇంకా ఎక్కువ కదా. అంటే ఏంటంటే పువ్వులు, కాయలు కాచే వృక్షములు ఏవైతే ఉంటాయో అవి 'పూర్ణమైన ప్రచోదనమును పొందినవి' అని చెప్తారు. ఎందుకంటే మనలో సూక్ష్మ శరీర నిర్మాణం జరగడం అనేది ఎటువంటిదో అలాగే ఒక చెట్టు నుండి ఒక పువ్వురావడం, కాయ అవడం, అది పండవడము చేత అందులోంచి మళ్లీ తను పుట్టడానికి కావలసిన సామగ్రి అంతా తయారు చేసుకుంటుంది వృక్షం కదా. ఆ పువ్వులో నుండి ఆ కాయలోంచి తను మళ్లీ పుట్టడం, పుట్టడానికి కావాల్సినంత మళ్లీ విత్తనంగా

తయారవుతుంది. తన యొక్క శాశ్వతత్వానికి తనలోంచే దాన్ని నిర్మాణం చేసుకుని, ఆ శాశ్వతత్వము తను పొందుతుంది. అలా మనుషుల్లో కూడా హృదయమునందు వికాసము కలగాలి. అందుకనే భగవంతుడి హృదయం నందు ఒక పుష్పము పెట్టడం. హృదయంలో ఉన్న పుష్పము వికాసం చెందడం అనేది జరిగితే అక్కడి నుండి మనకు నెమ్మదిగా మిగతా దండ అంతా తయారవడానికి అవకాశము ఏర్పడుతుంది. అందుకని వేసే పూలదండ కంఠాహారంగా కాకుండా కాస్త హృదయం వరకు వచ్చేటట్టుగా, మనము గొలుసు వేసుకుంటాం చూడండి అలా, అది హృదయానికి తాకేటట్టుగా ఒక దండ తయారు చేసుకుని వేసుకోవడం మొదలు పెడదాం. ప్రత్యేకంగా ఏవైనా ఇబ్బందులు ఉంటే రోజు ఒక దండ వేసే సాధన ద్వారా మనము విజయాన్ని పొందడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది ఒక ప్రయోజనం! వనమాలి అంటే మొత్తం సృష్టి ఒక వనం అనుకుంటే, దాన్ని అంతా రక్షించేవాడు అని ఒక అర్థం ఉంది. ఇప్పుడు ఇన్ని దండలు ఉన్నాయి, ఈ దండలలో పువ్వులు కనిపిస్తాయి కానీ దారం కనబడదు కదా. కానీ దారం లేకపోతే ఈ దండ నిలవదు కదా. తానుండి, తాను కనపడక ఈ సమస్తాన్ని కలిపి ఉంచిన తత్త్వం మనకి అవగాహన కావాలంటే పూలదండలు చూస్తే అవుతుంది. మనము దండ చూసినప్పుడు దారం గుర్తుంటుందా? ఉంటే సూక్ష్మమైన విషయములయందు ఆసక్తి ఉన్నట్లు, లేకపోతే స్థూలమైన విషయములయందు ఆసక్తి ఉన్నట్లు. అందుకని మనము దారం ఎక్కించేటప్పుడు పువ్వుకి ఆ దారమే భగవంతుని యొక్క తత్త్వముగా భావన చేయాలి. అదే సూత్రము! దానివల్ల అవన్నీ కలిసి ఉన్నాయి. అలాగే మన శరీరంలో కూడా ఉన్నాయి. అలాగే ఈ గోడలన్నీ కలిసి ఉన్నాయి ఇట్లా భావన చూసుకున్న కొద్దీ వస్తూ ఉంటుందండి. ఈ శ్లోకంలో భగవంతుని యొక్క వెలుగు గురించి ముందు చెప్పాము. తర్వాత భగవంతుడు తాను స్వతహాగా చీకటి స్వరూపుడు అని చెప్పుకున్నాం. భగః ఇది భగవంతుడి సౌందర్యాన్ని వర్ణించేదిగా చెప్పుకోవచ్చు ఈ శ్లోకంలో. భగవాన్ అంటే పూర్ణమైన వెలుగుగా కనిపిస్తాడు, భగః అంటే ఆ వెలుగును తనలోకి హరించిన వాడుగా చెప్పుకుంటాం. ఆనంది అంటే తాను ఆనంద అనే ఒక వేణువుని ధరించి ఉన్నవాడు అని అర్థం. ఆ తరువాత ఆయన వేసుకున్న మాల! నిజానికి ఆయన మెడలో ఉన్న మాల గురించి మన ఊహల లో నుండి ఇవన్నీ పుట్టుకొచ్చాయి. శ్రీకృష్ణుడు వనంలో ఏ పువ్వులైనా సరే, అడవి పువ్వులు అవి ఇవీ అన్ని కలిపి ఒక మాలగా ఎప్పుడు వేసుకుంటూ ఉండేవాడట. మిగత అవతారాలలో ఇది లేదు. ఈ అవతారంలోనే ఇది ప్రత్యేకము! దాని సందేశము ఏంటంటే ఈ మొత్తం అంతా నేనే మాలగా ధరించి ఉన్నాను అని చెప్పడం. దానికే అన్నట్లుగా వనంలో ప్రతిరోజు ఒక పూలదండ ఆయన ధరించి ఉండేవాడు.

## 584 హలాయుధుఃరాముడికి లక్ష్మణుడు ఎట్లా వేరు కాని పద్ధతిలో ఉన్నాడో, కృష్ణుడికి బలరాముడు ఆ విధంగా అంశావతారము. కాలపురుషుడు కాలంతో కలిసి వస్తాడు, అని చెప్పడానికి రామాతారంలో లక్ష్మణుని కృష్ణావతారంలో బలరాముని వెంటబెట్టుకుని వస్తాడు. ఎందుకంటే కొంత పని ఆయన చేస్తూవుంటాడు, కొంత పని ఈయన చేస్తూ వుంటాడు. కాలము కలసి వచ్చినట్లుగా కాలం యొక్క అనుకూలతను బట్టి కార్యాలు నిర్వర్తిస్తూ ఉంటాడు. అందుకని హలాయుధుడు అనే నామము చెప్పకున్నప్పుడు బలరాముడు అనిపిస్తుంది. హల అను ఆయుధం ధరించినవాడు. ఆ హలం అనే ఆయుధంతోనే అందర్నీ సంహరిస్తూ ఉండేవాడు. ఆ హలం అనే ఆయుధంతో యమునా నది గతి మార్చాడు బలరాముడు. అటేటో పోతూ ఉంటే కాస్త మన పొలాల మీదుగా పోవాలన్నట్లుగా ఇలా లాగాడన్నమాట. లాగితే అదిటొచ్చి ఇటు తిరిగి వెళ్ళిందిట ప్రత్యేకంగా. ఆయన హలమే ఆయుధంగా పెట్టుకున్నాడు, ఈయన సుదర్శనము ఆయుధంగా పెట్టుకున్నట్లు. హల అనే పదానికి 'ప్రత్యేకంగా కొని రాబడినది' అని అర్థం. 'హ' అనే అక్షరానికి అర్థం నిరుక్తశాస్త్రం లో 'పూర్ణము' అని చెప్తుంది. శివుని నామాలలో కూడా 'హ' అనే నామం ఉంది. పరమశివుడు పూర్ణమైనవాడు. పూర్ణత్వంలో నుండి బయటకు వచ్చిన తత్త్వం! 'ల' అనేది 'పృథ్వీ బీజము' అని చెప్తారు. అక్కడ నుండి కొని రాబడిన తత్త్వం అంటే మొత్తం లోంచి తాను వచ్చాడు అని చెప్పడానికి గుర్తుగా 'హలం'! అందుకని సృష్టిలో కూడా మొత్తం పూర్ణంగా ఉన్నదానిలోంచి కొంత కొంత బయటికి తీసుకురావడం, కాలంగా జరుగుతూ ఉంటుంది. అవ్యక్తమైన తత్త్వంలోంచి సంకల్పం పుట్టినప్పుడే కాలం కూడా పుట్టింది. మూడు పుట్టాయి. సంకల్పము పుట్టింది, కాలం పుట్టింది, అదే సమయంలో ఆ తత్త్వంలో నుండి శక్తి పుట్టింది. శక్తి పుట్టి సంకల్పాన్ని కాలానుసారంగా దీన్నంతా తయారుచేసింది. ఈ మూడు ఒక్కసారి ఆయనలోంచి బయటికి వచ్చాయి. కాలం రావడం చేత అన్నీ బయటకు వచ్చాయి. ఇట్లా బయటకు వచ్చిన వాటినన్నిటినీ కూడా అట్లా హలం పట్టుకొచ్చినట్లు. దున్నేటప్పుడు నాగలి అట్లా భూమి మీద పెట్టి లాగుతారు. మనం లాగలేము, అందుకుని ఎద్దుల్ని పెట్టి లాగిస్తారు. లాగిస్తే ఏమైంది? భూమి నుండి ఉత్పత్తి అనేది జరగడానికి అవకాశం ఏర్పడింది. కదా? అట్లాగే ఆకాశంలో పెట్టి అలా లాగారనుకోండి అక్కణ్ణుండి సృష్టి మొదలవుతుంది. ఇంత ఉంది హలం లో! హలం చేత ఏది దున్నబడుతుందో దాన్ని 'హల్యా' అన్నారు. 'అహల్య' అన్నామంటే ఇంకా దున్నబడలేదు అని చెప్పడం! అంటే కన్య అని అర్థం! ఆవిడ కన్య అని చెప్పడానికి 'అహల్య' అని చెప్తారు. సంస్కృతము చాలా అద్భుతమైన భాష. దైవమును అవగాహన చేసుకోవాలంటే సంస్కృతం లేకుండా అవదు. సంస్కృతము పూర్తిగా

తెలుసుకున్న వాడికి జ్ఞానమునకి కావాల్సిన దారులు బాగా దొరుకుతాయి. అందుకని స్ఫూర్తి ఉన్నవారు సంస్కృతము చదువుకోవాలి. పరమ గురువులు 'ఏ జన్మలో అయితే నువ్వు సంస్కృత భాషను పరిపూర్ణంగా అవగాహన చేసుకుంటావో ఆ జన్మలో నీకు పూర్ణజ్ఞానము వస్తుంది' అని చెప్పారు. వ్యాకరణము, నిరుక్తము, శిక్ష తెలియాలి. తెలిస్తే సంస్కృత భాషలో సమస్తమైన రహస్యాలు తెలుస్తాయి. అది దైవ భాష అని చెప్పారు కదా. రోజూ ఒక గంట చదువుకుంటే 10 ఏళ్లలో బాగా సంస్కృతము వస్తుంది. అదే పనిగా చదువుకుంటూ ఉంటే రెండు మూడు సంవత్సరాల్లో రావచ్చు. సంస్కృతం మాత్రమే వస్తే ఉపయోగం లేదు. సంస్కృతం వచ్చిన తర్వాత అందులో లోతుల్లోకి వెళ్లాలి. దాన్ని 'నిరుక్తము' అన్నారు. హలం అంటే నాగలి అనుకుంటే చాలదు. అసలు 'హ' ఏంటి? 'లం' ఏంటి? ఆ రెండింటినీ జోడిస్తే ఏమైంది? విడివిడిగా ఏమిటి? అలా తెలుసుకోవాలి. భారతంలోనూ, భాగవతంలోనూ, రామాయణంలోనూ ప్రతి నామానికి ఇంత లోతైన అవగాహన ఉంటుంది తెలుసుకుంటే. అది తెలుసుకుంటే విష్ణు సహస్రనామం లోతు లోంచి మనము అవగాహన చేసుకోవచ్చు. విపరీతమైన అర్థం తీయడం కాదు. 'అక్షరము' ఉందనుకోండి 'అ' నుండి 'క్షరము' విడదీస్తే 'క్షరము కానిది' అని ఉంటుంది. 'అక్ష' నుండి 'ర' ను విడదీస్తే, 'అక్షమును తీసుకు వచ్చినది' అంటే కేంద్రం నుండి పరిధికి వచ్చింది. అప్పుడు మళ్లీ హలమైపోతుందన్నమాట. ఇట్లా ఒక పదంలో అద్భుతమైన అర్థాలు బోలెడు దొరుకుతాయి. అలాగే ఒకే పదానికి రకరకాల భావాలు దొరుకుతాయి. ఎందుకంటే ఒక్కొక్క అక్షరానికి అంతంత భావం ఉన్నది. సృష్టి చేసేటప్పుడు ఏ శబ్దాన్ని ఉచ్ఛరించడం వల్ల అది పుట్టిందో, అదే దానికి పేరుగా పెట్టారు, సంస్కృతంలో! అందుకే సంస్కృతాన్ని 'వ్యుత్పత్తి అర్థము ఉన్న భాష' అని చెప్తారు. సంస్కృతము బాగా తెలిసి, ఆ అక్షరములను బాగా స్పష్టంగా పలకడం చేత సృష్టిచేయగలిగే స్థితికి వెళ్లవచ్చు. అవి మంత్రాలు! మంత్రాలతో అలా సృష్టి చేయడం, మంత్రాలతో అలా నాశనం చేయడం అన్ని అక్షరాల నుండి వచ్చినవే! అంటే ఒక్కొక్క అక్షరంలో ఎంత బలం ఉంది? వాటిని అక్షరాలు అని ఎందుకన్నారు? అవి నశించినవి! అన్ని అక్షరాలూ బీజాక్షరాలే! ఒక్కొక్క అక్షరానికి రకరకాల అర్థములు ఉన్నాయి. అందులో 'హ' అనే అక్షరానికి సంఖ్యాపరంగా 33 వ అంకె ఇస్తారు. 33 అంటే, మూడు లోకాలలో ఉన్న ఏకాదశరుద్రులు 33! The Magnificiant number అంటారు. 'హ' లో అంత ఉంది. 33 degrees అందుకుంటే Masonic అనే system లో ఆయన్ని Grandest Master అంటారు. The Master of 33 degrees అంటారు. 33 ఏళ్లు జీవించాడు ఏసుక్రీస్తు. ఏం? తమాషా అనుకున్నారేంటి? అలా ఉంటుంది ఆ 33 ఏళ్ల లెక్క. 33 అంటే పూర్ణ పురుషుడు, దానికి శబ్దము 'హ' సంస్కృత భాష ప్రకారం. ఇవన్నీ మనకి ఎట్లా తెలుస్తాయి? సంస్కృతం లో నిరుక్తము బాగా అర్థం చేసుకుంటే! సంస్కృతమునకు మూల భాష ఒకటి ఉన్నది అది Sanjaar అని. ఇందులోంచి

అందులోకి పోతే వ్యుత్పత్తి అర్థాలు దొరుకుతాయి, అందులో బోలెడు తెలుస్తాయి. ఈ 'హలం' ఎందుకు పనికొస్తుందంటే, కాలపురుషుడు ముందు పైన అక్కడ చారలను పెట్టేస్తే, ఆ చారల నుండి ఇవన్నీ ఏర్పడుతూ వస్తాయని తెలుస్తుంది. ముందు కాలము నడిచి వెళ్తూ ఉంటే వెనకాల సృష్టి నడిచి వెళుతూ ఉంటుంది అందుకని 'హ' అనే శబ్దానికి 'కాలభైరవుడు' అనే నామం కూడా ఉంది. అలాగే 'భయాపహ' అన్నారనుకో అంటే భయాన్ని హరించేవాడు! అలాగే హర ఉంది, హరి ఉంది, ఇలా 'హ' తో చాలా ఉంది కథ! ఇలా తెలుసుకుంటుంటే ఇంకొంచెం తెలుసుకుందాం, శ్రద్ధగా చదువుకుందాం అనే భావన వస్తుంది. బుద్ధిలోకంలో ఆనందం పొందితే, మనోలోకాలు, ఇంద్రియలోకాలు శరీరానికి సంబంధించిన ఆనందాలు 'ఆ! నా మొహం!' అన్నట్టుగా ఉంటాయి. బుద్ధి లోకంలోకి ప్రవేశించకపోవడం చేతనే రామాయణము, భారతము, భాగవతముల ఇత్యాది గ్రంథములయందు రుచి లేకపోవడం! ఉంటే అన్నం తినడం కూడా మర్చిపోయి చదువుకునే పరిస్థితి ఉంటుంది. అందులో ఉండే ఆనందము అటువంటిది. బుద్ధిలోకాల్లో ప్రవేశించిన వాడే ఆత్మవంతుడు అవుతాడండి! అన్ని మెట్లు! ముందు బుద్ధిమంతుడవ్వాలి బుద్ధిలోకాల్లో ఆనందించగలిగివుండాలి, అప్పుడు మనము పైలోకాల్లో వుంటే ఈ క్రింద లోకాలు బాధించవు. అది ఒక అమరిక! చాలా మంచి picture చూస్తున్నాం అనుకోండి, అవతల వాళ్ళు అన్ని వడ్డించి రండిరా, అంటే ఇప్పుడు కాదు కాసేపు ఆగు, అంటారు కదా, ఎందుకని? మనోలోకంలో కాస్త ఆనందపడుతున్నాం. Wickets పడిపోతున్నాయమ్మా, కాసేపాగమ్మా, అంటాం కదా? మనవాళ్లు బాగా ఆడుతున్నారమ్మా! కాసేపు చూసి వస్తాను ఆగు అంటాం కదా? అలా ఆకలి ఆగుతుంది నీకు, మనస్సు బాగా దేని మీదైనా రుచి మరిగినప్పుడు. అంటే ఏమైంది? భౌతిక, ఇంద్రియ ము లకు సంబంధించిన లోకాలు మనోలోకానికి లోబడి పోయాయి. అక్కడ ఈ మనోలోకాన్ని కూడా దాటి మనము బుద్ధిలోకంలోకి పెరిగితే ఇది కూడా లోబడి పోతుంది. అందుకని బుద్ధిలోకాల్లో ఉండే వివిధమైన విషయాలను తెలుసుకోవడంలో ఆసక్తి కలిగి, ఆ నైమిశారణ్యంలో ఆకులు తింటూ హాయిగా ఆనందంగా బతికేస్తున్నారు ఇన్ని వేల సంవత్సరాల నుండి. వాళ్లు మనలాగా దోశలు, ఇడ్లీలు, సాంబారు తినడం లేదు. వాళ్ళకి ఆకలి ఉంటే, 'శరీరం ఉంటుంది కదా' అని తింటారు. ఆ చెప్పే ఆయన చెప్తూ ఉంటే ఈ వినేవాళ్ళు వింటూ ఉంటారు. అంటే ఈ వినే వాళ్లకు ఒక శరీరం ఉండాలి కదా. అందుకని మధ్య మధ్యలో 'కొంచెం ఆకులు తిని, నీళ్లు తాగండి రా' అని చెప్పేవాడు చెప్తాడు. లేకపోతే అది కూడా వాళ్ళు మర్చిపోతారు. నైమిశారణ్యం అంటే ఏమిటనుకున్నారూ? వాళ్లు కనురెప్పలు కూడా అర్పకుండా, పరిసరాలలో ఏమున్నాయో చూసుకోకుండా, చెప్పే వాక్కు యందే శ్రద్ధ కలిగి వుండి, సమస్తమూ మర్చిపోయి ఉంటారు. ఆ పక్క నుండి ఒక పులి వెళ్లినా వాళ్లకి ఏమీ అనిపించదు. మనకి పులి వరకు అక్కర్లేదు. కదా. వారికి ఈ స్థితి ఎందుకు వచ్చింది? అంటే బుద్ధిలోకంలో

రమించటం వలన! ఒక్కో లోకానికి ఆనందం మారుతుంది. సూక్ష్మ లోకాల్లోనికి వెళ్తున్నకొద్దీ ఆనందం యొక్క పరిధి విపరీతంగా పెరుగుతుంది. అట్లా ఇందులో పడ్డవాడికి ఇక ఈ ప్రపంచంలో అది సంపాదించుకుందాం, ఇది సంపాదించుకుందాం, అవి కొనుక్కుందాము, ఇవి కొనుక్కుందామూ ఆ గొడవ ఉండదు. 'పాపం ఏమిటో ఇట్లా ఆరాటపడిపోతున్నారు అందరూ, ఎందుకు ఈ ఆరాటం వాళ్ళకి కలుగుతుందో' వాడికి అర్థం కాదు. తెలియకుండా ఉంటాడు. అంతా వేరేగా ఉంటుంది. ఇదే లోకంలో, వేరేగా, ఇంకో లోకంలో ఉంటాడు. అలా వెళ్ళిన వాళ్ళు మనకు అందిస్తారు ఇటువంటి రహస్య ప్రకాశం! ప్రకాశం చేయడమే రహస్యాన్ని! నిరుక్తం తెలియడం, వ్యాకరణం తెలియడం! EK గారి రచనలల్లో అలాంటివి చాలా అందించారు, అందుకోవచ్చు. అప్పలాచార్యగారు రామాయణంలో అలా చాలా విషయాలు చెప్పారు. ఆయన వ్యాకరణములో చాలా దిట్ట, సంస్కృతంలో చాలా దిట్ట, నిరుక్తం లో చాలా దిట్ట. ఆయనవి చదువుకోవచ్చు. నీకే శ్రద్ధ ఉంటే నీవే ఒక సంస్కృతం dictionary తీసుకుని చదువుకో. ఇంకొక చోట ఇంకొక అక్షరం గురించి రాస్తాడు, చదువుకో. ఇంకొక చోట మరో అక్షరం గురించి చదువుకో. అన్నీ కలిపి వండు. ఇప్పుడు వంకాయ, కొంచెం కారం, మూకుడు, అందులో కొంత నూనె కలిపి, కింద మంట పెట్టి వేయించుకుంటే ఏం వస్తుంది? వంకాయ గుత్తొస్తుంది! అట్లా ఈ అక్షరాలన్నీ పోగేస్తే ఒక చైతన్యం ఏర్పడుతుంది. అట్లా వంట చేశారు, తద్వారా సృష్టిని నిర్మాణం చేశారు. ఇంత ఉంది కథ ఇందులోకి మనం ప్రవేశం చేయాలంటే శరీర అవసరాలు మితిలో పెట్టుకుంటే వీలుపడుతుంది. శరీరాన్ని మించి ఇంద్రియాలు, ఇంద్రియాలను మించి మనస్సు అట్లా ఆరాట పెట్టేస్తుంటే ఎందులోకీ పోదు. అది మనము ఎవరికి వాళ్లు నిర్ణయం చేసుకోవాలి. చేసుకుంటే అద్భుతమైన ఆనందము కలిగించే విషయాలు కనబడతాయి, తెలుసుకుంటూ ఉండొచ్చు. అందులో పొందిన ఆనందము 100 సినిమాలు చూసినా రాదు, వందసార్లు మసాలా దోశ తిన్నా రాదు. ఒక సినిమా చూసినా మళ్లీ సినిమా చూడాలి అనిపిస్తుంది. ఈ బుద్ధి లోకంలో ఆనందం ఎంత ఉంటుందంటే ఒక్కోసారి ఆత్మలోకంలోకి ప్రవేశించకపోతే పింగై అన్నట్టుగా ఉంటుంది. ఈ హలాన్ని పట్టుకుని గతులు మార్చి సృష్టి ఏర్పాటు చేసే అంత ఉందండి హలంలో. జరాసంధుడి సైన్యం మీద బలరాముడు హలం ని ఉపయోగించే ప్రక్రియ దీనికి సంబంధించిన ప్రక్రియ! 'హ' అనే శబ్దము ఉండడం చేత అన్నీ పూర్ణత్వంలోనికి ఉద్ధరించడం జరుగుతుంది. కాబట్టి ఈ హలం చాల అద్భుతమైన సంకేతం! అది ఆయన ధరించి తద్వారా కొంత ధర్మ సంస్థాపన చేయడం జరుగుతుంది ప్రత్యేకంగా ఇన్ని ఆయుధాలు ఉంటే ఇది పట్టుకోవడం ఎందుకూ? అదీ నాగలి. ఆయన సందేశం ఏమిటో తెలుసా? 'నాగలిచే సమస్తాన్ని దున్ను' అని చెప్తున్నాడు! భూమి దున్నుకున్నావో నీకు కావాల్సింది వస్తుంది, నిన్ను దున్నుకున్నావనుకో, అదే సాధన! తన శరీరాన్ని తను దున్నుకుంటే తనలోంచి పంట వస్తుంది. పంట వచ్చిన తర్వాత యమునను దగ్గరగా

పట్టుకొస్తాడు. యమున అంటే మనలో పింగళ నాడి! పాలం దున్ని యమునను దగ్గరకు పట్టుకొచ్చే ఆయుధం హలం! ఏం జరుగుతుందంటే పంట పండి అందులోంచి పువ్వులు, పళ్ళు బయటికి వస్తాయి. అంటే ఇక్కడ మనలో ఉండే సంకల్పబలం హలం! అగ్నితత్వము! అందుకనే బలరాముడు! అగ్నికి ప్రత్యేకమైన స్వభావము ఒకటి ఉంది. ఒక మంచిపని విషయంలోనూ, మన జీవితము విషయంలోనూ ఒక సంకల్పం చేస్తే, ఒక కార్యము నెత్తి మీదకి ఎత్తుకుంటే అది పూర్తయ్యేంతవరకు అహర్నిశలు దానికోసం కృషి చేసే ఏకాగ్ర దృష్టి కావాలి. ఆ ఏకాగ్రతలోంచి పుడుతుంది వేడి. సూర్యుని కిరణం భూతద్దంలోంచి ఒకచోట మనము convert చేసి, ఆ కిరణాలతో ఎంత దానైనా కాల్చేస్తున్నాం కదా? అట్లా నీలో కూడా సంకల్పంలోంచి వచ్చే వేడిమి, ఏకాగ్రత వల్ల దానికి బలం పెరుగుతుంది. తద్వారా నీ శరీరాన్ని నువ్వు సాధనలో పెట్టు. దాన్ని బాగా దున్నాలి. దున్నకపోతే అది బీడు అయిపోతుంది. ఎంత మంచి సారవంతమైన నేలైనాసరే దున్నకపోతే పంట రాదు కదా? నేను దున్ననండి, నాకు వరి కావాలి, అంటే రాదు కదా? అందుకని దున్నుకోవాలి. బలరాముడు యొక్క హలం మనకి 'దున్నుకోరా!' అని చెప్తుంది. అది ఆయన యొక్క సందేశం! దున్నుకుంటే దొరుకుతుంది. రామాయణంలో కూడా దున్నుకున్నాడు జనకుడు. దొరికింది కదా. ఎవరు దున్నుకుంటే వాళ్లకి దొరుకుతుందండి, పక్కవాళ్ళని దున్నకుండా. మనము ఎవరిని దున్నుదామా? అని లేచినప్పటి నుండి చూస్తూ ఉంటాం. నిన్ను నువ్వు దున్నుకో, దున్నుకుంటే నీలో ఉన్న పింగళ నాడి నీకు ఎక్కువ పని చేయడం జరుగుతుంది. సత్సాధకుడికి పనిచేసేది పింగళ నాడే! పింగళాం పద్మమాలినీం. చూడండి ఆ రెండు పక్క పక్కన పెట్టారు. ఏం చేసింది పింగళ నాడి? నీలో ఉన్న పద్మమాలిని ని నీకు చూపించేస్తుంది, దర్శనమిస్తుంది. పింగళ అంటే ఏమిటి? స్థూలం నుండి సూక్ష్మం లోకి ప్రవేశింపజేసే దారి. గంగలో ఒక 'గ' సూక్ష్మం నుండి స్థూలానికైతే, మరొక 'గ' స్థూలం నుండి సూక్ష్మానికి వెళ్తూ ఉంటే అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు తిరుగుతూ ఉంటే దీన్నే గంగ అన్నారు. ఈ అద్భుతమైన వివరణ మనకి నా వరకు EK గారు తెలపడం వలన తెలిసింది. మాస్టర్ గారు చాలాసార్లు అంటూ ఉండేవారు 'గంగా, గీత, గోవిందా, గాయత్రి వీటి గురించి అద్భుతమైన వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవాల్సినవి ఉంటాయి' అని. అందులో గంగ రెండు 'గ' లు గమనములు. మధ్యలో ఉండే సున్నా బిందువు లేక చైతన్యము అది నీవు. ఒకపక్క నుండి సూక్ష్మం నుండి స్థూలంలోకి కొంత చైతన్యం వచ్చేస్తుంటే, కొంత చైతన్యము స్థూలం నుండి సూక్ష్మమునకు వెళ్తుంటే మధ్యలో నువ్వు ఉంటావు, చక్కగా దర్శనం చేస్తూ ఉండు. సాధకుడు అనేవాడు బాగా స్థూలంలో ఇరుక్కున్నవాడు సూక్ష్మంలోనికి వెళ్ళడానికి చేసే ప్రయత్నం సాధన! సత్సాధన అంటే బాగా బండ్రాయి, గుండ్రాయిగా ఉండేవాడు దూది పింజలాగా తేలికగా తయారవడం! దానికి పనికొచ్చేది పింగళ నాడి. ఆ పింగళ నాడిని మనవాళ్లు దశమస్కంధంలో

యమునా నది కింద వేశారు. ఆ యమునా నది తీరంలోనే కదా ఈయన దొరికేది కూడా, ఇంక ఎక్కడా దొరకడు. గంగా నది తీరంలో లేడు కృష్ణుడు యమునా నది తీరంలో ఉన్నాడండీ! గంగని మనవాళ్లు ఇడ గా చెప్పారు, యమునను పింగళ గా చెప్పారు. మైత్రేయుడు 'నేను రెండు చూస్తా అని' వెళ్ళి గంగా యమునా సంగమంలో కూర్చున్నాడు. అది యోగం! ముక్తి పొందుదామనే జీవులు ఉంటారే అంటే భావ పరంపరలో బంధించబడిన జీవులు, ఇంద్రియములో బంధింపబడిన జీవులు, శరీరాల్లో బంధింపబడిన జీవులు అందులోంచి బయటపడడానికి తాపత్రపడే వాళ్ళందరూ యమున దగ్గరికి చేరాలి. యమున దగ్గర ఆయన ఈ పని చేసి పెడతాడు. యమున దగ్గరికి మనం చేరేది ఏంటట? యముననే మీ దగ్గరికి పట్టుకొస్తాను అన్నాడు బలరాముడు. ఎప్పుడు? దున్నుకుంటే! 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న సూక్తి ఉంది చూశారా! ఎంత నువ్వు సాధన చేసుకుంటే అంత నీలో పంట వస్తుంది. ఆ పంట ఏమిటయ్యా అంటే, వెలుగు పంట! అది కుడి కన్నులో ఉంది మనలో. మళ్లీ హృదయంలోకి వచ్చేస్తుంది, మళ్ళీ మూలాధారంలో గోచరిస్తుంది. ఆజ్ఞలోనూ, హృదయంలోనూ, మూలాధారంలోనూ మూడు చోట్ల ఈ మూడు నదులు కలుసుకుంటాయండి గంగా, యమున, సరస్వతి లేక ఇడ, పింగళ, సుషుమ్న. అందులో రాజయోగ మార్గంలో హృదయంలో కలయిక దగ్గర కూర్చోమని చెప్తారు. ఆజ్ఞలో కలయిక దగ్గర మైత్రేయుడు కూర్చుని ఉన్నాడు. అది ప్రయాగలో కూర్చోవడం అంటే. మనవరకు హలం నుండి పుచ్చుకోవలసింది ఏమిటయ్యా అంటే దున్నుకో! శరీరము అనే భూమిని ఈ హలం పెట్టి వ్యవసాయము చేసావంటే పంట విపరీతంగా పండుతుంది. దాన్నే 'తపస్సు' అంటారు. Cultivate! అందులోంచి అన్నీ పుట్టుకు వస్తే నీకు దుర్భిక్షము ఉండదు. శరీరము దాచుకునే వాళ్ళకి ఏమీ దొరకదు. శరీరాన్ని దేనికో ఒకదానికి వినియోగం చేసుకోవాలి. అటు భోగం కోసమైనా వినియోగం చేసుకో, ఇటు యోగం కోసమైనా వినియోగం చేసుకో. రెండింటికి ఉపయోగించకపోతే మిగిలేది రోగమే! అందుకని రోగం రాకుండా ఉండాలన్నా, నీకు కావాల్సిన సకల సంపత్తులు భూమి మీద ఉండి పొందడానికైనా, ధర్మమైన పద్ధతుల్లో వినియోగం చెయ్యి, లేకపోతే యోగానికైనా సమర్పణ చెయ్యి. ఈ రెండింటికి కావాల్సింది సంకల్పబలం! అదే నీలో ఉండే నాగలి! దీన్ని First ray అని కూడా చెప్తారు. నాగలి First ray, అంటే సంకల్పబలము/The Will . ఆ సంకల్పానికి ఉన్న బలం ఎటువంటిది అంటే అది అగ్ని వలె దానికి అడ్డువచ్చినదాన్నంతా కాల్చుకుంటూ వెళ్లిపోతుంది. అది దేని మీద నువ్వు పెడితే, దానిమీద అది పూర్తి ఫలాన్నిస్తుంది. దైవము యొక్క సంకల్ప బలమే మానవుడిలో కూడా ఉంది. అందుకని సంకల్పించి, ఏకాగ్రతతో ఆ సంకల్పానికి సమర్పణ చెంది, జీవిస్తూ ఉంటే అసాధ్యము అయినది మానవుడికి లేదు. 'మానవుడే మహనీయుడు' అని మనకు ఒక పాట ఉంది తెలుసా. ఎందుకంటే భగవత్తత్త్వంలో

ఏమున్నాయో అవన్నీ మానవుడిలో పూర్ణంగా ఉన్నాయి కాబట్టి తన సంకల్పబలము చేత కాలము, కాలమును అధిష్టించి ఉన్న దైవము ఈ ఇద్దరు తప్ప మిగతాఅందరూ లోబడిపోతారు. ఆ ఇద్దరికీ దండం పెట్టుకో. ఎక్కువగా, మనకి కాకపోవడానికి మనం బద్ధకించటమే కారణం. ఇచ్చింది సారవంతమైన నేల అయినప్పుడు దున్నుకోకపోతే పంట రాదు. ఏకాగ్రతతో, సమర్పణ చెంది దున్ను. అట్లా చేసుకుంటూ ఉండు పంట తప్పకుండా వస్తుంది. బలరాముడు తన హలం తో ఆ సమయంలో భారతదేశంలో కొన్ని వేల ఎకరాలని పంట భూములుగా మార్చాడు. పెద్ద Socialist ఆయన. ఈ బలరాముణ్ణే Herculus అని చెప్పకుంటున్నారేమో అని ఒక భావం ఉంది. Greek సాంప్రదాయంలో Herculus అనే ఒక మహానుభావుడు ఉన్నాడు. 'హరి కులేశ్' అంటారని మాస్టర్ గారు Spiritual Astrology లో రాశారు హరికులేసే Herculus అయిపోయాడని, ఏం! అవకూడదా? అవ్వచ్చు. ఎందుకంటే, ఆయన చేసిన పనులు కూడా బలరాముడు చేసిన పనుల్లాగానే ఉంటాయి. విపరీతమైన పనులు చేస్తాడు. ఎలా ఇంత విపరీతమైన పనులు చేస్తాడు అంటే కేవలము సంకల్పబలము చేత! అదీ ఆయన నాగలి. అందుకని ఈ శరీరాన్ని పండించుకుని తద్వారా అనుభూతిని పొందండి. పండించుకుంటే ఉంది సూక్ష్మ శరీరం/ దివ్య శరీరము. పండించుకోపోతే అందులో కలిసిపోయింది రాదు బయటకి. చచ్చిపోవడం అవుతుంది.

## 585, 586 ఆదిత్యః, జ్యోతిరాదిత్యః

ఆదిత్యుడు, అదితి నుండి వచ్చినవాడు. ఎవరు వచ్చారు అదితి నుండి? కశ్యప ప్రజాపతి ప్రజ్ఞయే అదితి నుండి దిగి వచ్చింది. కశ్యపుడు అంటే పై డిప్ప. అక్కడ నుండి అంతా చూస్తూ ఉంటాడుట. 'అవలోకతేశ్వర ' అంటారు బౌద్ధమతస్థులు. అలా పైనుండి సమస్తాన్ని చూసేవాడిని ఆంగ్ల భాషలో Now Menon /నౌ మీనన్ అంటారు. ఆయన అలా చూస్తూ ఉంటే ఆయనకి తలోపక్క ఇద్దరు ఉన్నారు. 'హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ' అని ఉంది కదా మనకి. ఒకావిడ హ్రీం, ఇంకొక ఆవిడ లక్ష్మి. ఇద్దరూ 'అహోరాత్రే పార్శ్వే' ఎప్పుడూ తలోపక్కా ఉన్నారు. అలాగే అదితి, దితి ఉన్నారు. ఉంటే ఆ చూస్తున్నాయన లో నుండి ఈ అదితి అందుకుంది. అలా చూస్తూ ఉంటే ఆ తత్త్వము ఈవిడ లోకి వచ్చింది. అంటే ఇక్కడ కశ్యపుడు అంటే పరతత్త్వము అని చెప్పడం. అందులోంచి వ్యక్తం అయిన వెలుగుతత్త్వము అదితి! ఆ అదితి అలా చూస్తూ ఉంటే, తనలోంచి ఆ తత్త్వం గర్భం ధరించి, మళ్లీ బయటకు వచ్చిందట. వాళ్ళూ ఆదిత్యులు! ఈ రెండో ఆవిడ చూడడమే లేదు. మొగుడ్ని పీకుతుంది మరి నాకూ, అంటూ. అదితికి గర్భం వచ్చింది నీకు ఎందుకు రాలేదు? ఇద్దరి యందు ఒకటే దృష్టి కశ్యపుడికి. ఓ గురువుగారికి ఇద్దరు శిష్యులు ఉన్నారనుకోండి ఒకరికి అందుతుంది, ఇంకొకరికి అందదు కదా. అందనివాడు పీకితే వస్తుందా? అందినవాడు ఏం చేశాడో అది తెలియాలి. రుక్మిణికి ఏమి అందిందో అది సత్యభామకు అందలేదు కదా. Demand చేస్తే అందదు. అనుసంధానం చెందితే అదే ఇటు వచ్చేస్తుంది. అనుసంధానం చెందటం వల్ల ఆ ప్రజ్ఞయందే నీ మనస్సు లగ్నం అయి ఉండడం చేత, క్రమశః దాన్ని నువ్వు పొందడము జరుగుతుంది. పొందడంవల్ల నీలోంచి అది వ్యక్తం అవుతుంది. అది పొందింది నేను పొందలేదు, అని ఏడుస్తున్న వాళ్ళకి అసలు అందదు. దితి గోల అదే, అదితి కి 12 మంది పుట్టుకొచ్చారు నా సంగతేంటి? అట్లా అనుకున్న కొద్ది ఇంకా దూరం అవుతుంది. మన గోలా అదే కదా? వాడికి అంతా వచ్చేసింది మనకి ఏం రాలేదు. వాడికొచ్చింది మనకి రాలేదు అనుకోకుండా, వాడికి రావడానికి ఏం చేశాడో నువ్వు కూడా అదే చెయ్యి. ఇలా కశ్యపుడ్ని ఉతుకుష్ట పెట్టేస్తుందండి! మొగుణ్ణి అంటే ఊరికే మనకి కథగా ఇచ్చారు. అక్కడ మొగుడూ లేడు, పెళ్ళాలూ లేరు. ఇంకా సృష్టి మొదలే కాలేదు. మొగుడెక్కడ పెళ్ళాం ఎక్కడా? మనమంతా మొగుడు పెళ్ళాం అని ఆలోచించుకుంటాం కాబట్టి, మన పిల్లి బుర్రకి అర్థమయ్యేటట్టుగా కథలు తీసుకొచ్చారు. కశ్యపుడు అంటే సమస్తమును అట్నుంచి చూసేవాడు. పశ్యకుడు, కశ్యప్పుడు ఇలా ఇద్దరున్నారు. పశ్యకుడు అంటే ఈ మొత్తాన్ని చూసేవాడిని ఇట్నుంచి చూస్తూ ఉంటాడు. పశ్యంతి వాక్కు చెప్తాం కదా అంటే perception అంటాము కదా. పశ్యంతి. Perception ఒకే మూలం నుండి వచ్చిన ఒకే శబ్దం. ఒక్కోసారి భగవంతుని

యొక్క ధ్యానంలో మనము ఉన్నప్పుడు మంచి భావము మనకు ఒకటి వెలుగుతుంది చూశారా, అది నువ్వు వానియందు లగ్నమై ఉండడం వల్ల నీయందు భాసించినదన్నమాట. అలా ఎవరికి భాసిస్తే వాళ్లు 'పశ్యంతిగా' దాన్ని అందుకుంటారు. భగవంతుని అలా ఎప్పుడూ ఏకాగ్రతతో అందుకోవడానికి ప్రయత్నం చేస్తున్నవారికి, ఎప్పుడో ఒక కాలం రూపేణా ఒక మెరుపులాగ వచ్చేస్తాడు. వచ్చి నీ హృదయంలో నీకు అనుభూతి కలిగిస్తాడు, అదీ నీ పుట్టినరోజు! మిగతా పుట్టినరోజులు అన్నీ కూడా పిచ్చి పుట్టినరోజులు. శరీరం పుట్టినరోజులు పుట్టినరోజులు కాదు. మళ్లీ వాడి పుట్టుక మనలో జరగాలి. అలా జరిగింది అదితికి. అందుకని విష్ణుసహస్రనామంలో దితి సంతతికి సంబంధించిన నామాలు అన్నీ రావు. ఆహ్లాదం, ప్రహ్లాదం ఇలా వస్తాయి. అంటే ఇటు నుండి పుట్టుకొచ్చినా, చచ్చిచెడి మళ్లీ ఏదో వెలుగులోకి వచ్చారని. దితి అలా orient కాలేదు. కాకపోవడం వలన, నిర్బంధించి కాస్త ఏదో పీక్కోవడం వల్ల ఇంకో రకం అందులో నుండి బయటికి వచ్చింది. వాళ్లతో పోల్చి చూస్తే వీళ్ళు కొంచె నాసిగా ఉంటారు. దైత్యులు వేరు, రాక్షసులు వేరు గుర్తుపెట్టుకోండి. ఒక్కసారి భాగవతము చదువుకోండి EK గారు ఇవన్నీ బాగా రాశారు. ఆ విధంగా బయటికి వచ్చిన వాళ్ళందరూ కూడా ఎవరండీ? ఆ తత్త్వమే మళ్ళీ ఆమె లో నుండి బయటకు వచ్చింది. అందుకనే ఆదిత్యులు అంతా ఆయనే! అదే తండ్రి కొడుకుగా రావడం అంటే. ఆ విధంగా పరిపూర్ణంగా అదితి తన నుండి ఆ తత్త్వాన్ని మళ్ళీ వ్యక్తం చేసింది. అంటే ఏమిటి? కేవలం తన ప్రతిబింబంగా ఆ తత్త్వాన్ని వ్యక్తం చేయించింది. ఇట్లా స్త్రీ ప్రతిబింబంగా పురుషుడు తనే వస్తూ ఉంటాడు. (ఈ కథనే మనకి భాగవతంలో అశ్వమేధము కథగా మాస్టర్ గారు ఇచ్చారు. అశ్వమేధం జరిగినప్పుడల్లా మళ్లీ వాళ్లు బ్రతికారు అంటూ ఉంటారు. ఊరికే గుర్తుచేస్తున్నా మీరు భాగవతం చదువుకున్నప్పుడు పనికొస్తుందని. రాత్రిపూట పడుకునే ముందు భాగవతం చదువుకోండి. పగలు లేచినప్పుడు శంఖారావం చదువుకోండి.) అలా వచ్చాడు కాబట్టి, అదే ఇది అంటారు చూశారా, అలా వచ్చింది ఆ వెండితెర మీద నుండి. ఆదిత్యులందరూ వాళ్లు! మళ్లీ ఆ 12 మందిలో ఒకడు బాగా వెలుగుతున్నాడట. వాడు జ్యోతిరాదిత్య! ఎవరైనా పేరు పెట్టుకోండి బాగుంటుంది. ఐదు అక్షరాల పేరు. పంచాక్షరి! ఆయన విష్ణువు! ద్వాదశ ఆదిత్యులలో విష్ణువును నేను అంటాడు. నలుగురు కొడుకులు పుట్టినా అందులో ఒకడిలో తండ్రి బాగా ఎక్కువగా కనిపిస్తూ ఉంటాడట. తండ్రి కొంచెం కొంచెం అందరిలోనూ ఉంటాడు ఒకళ్ళలో చాలా ఎక్కువగా ఉంటాడు. ఆ తండ్రి వాడే, మళ్లీ ఇలా వచ్చి పనిచేసుకుంటున్నాడు, అని చెప్తుంది మన సాంప్రదాయం. ఎందుకంటే వాడి తత్త్వము వీడిలో బాగా వెలుగుతుంది. ఆ పరతత్త్వం ఏదైతే ఉందో ఆ పరతత్త్వం మొత్తం వచ్చి మళ్లీ ఈయనలో వెలుగుతుంది విష్ణుమూర్తి లాగా. అందుకని ఈయనకి పూజలు ఎక్కువ. అందులో పూషుడు, మిత్రుడు, వరుణుడు ఇలా ఉన్నారు. కాని జ్యోతిరాదిత్య ఆదిత్యులలో ముందు ఆయనే! 12 మందిగా దిగివచ్చిన వారందరూ

ఆయనే! 12 మాసాల ప్రజ్ఞగా మనకి అందుతూ ఉంటాడు ఈ మాసంలో. మేషమాసప్రజ్ఞగా మనకు అందుతూ ఉంటాడు. సమస్తమైన దక్షత కలిగి వినయంగా ఉండడం మేషం. ప్రతి సంవత్సరాది నాడు ఒక తలకాయ తెగుతుందండీ! (తల మార్పిడి జరుగుతుంది). తెగడము వలన సంవత్సరము మొదలవుతుంది. దక్షుడి తలకాయ తెగేసి గొర్రె తలకాయ పెట్టేస్తుంటారు లేకపోతే అశ్వం తలకాయ తెగింది అంటారు. అశ్విని నక్షత్రంగా అలా చెప్తారు. కృత్తిక నక్షత్రంగా కత్తెరలు వేసేస్తారు. ఒక ప్రజాపతికి కత్తెర వేసేస్తే అక్కణ్ణుంచి ఒక సంవత్సరం వచ్చింది. అంటే ఏంటంటే పూర్ణదక్షత్వం కలిగి సమర్పణ చెందడం అనేది సామాన్యంగా జరగదు. సమర్ధుడికి సమర్పణ ఉండదు. చేతగానివానికి సమర్పణ ఉన్నా ఉపయోగం లేదు. 'let virtue be the strength of my intelligence'. అర్జునుడు సమర్థుడై భగవంతునికి సమర్పణ చెందాడు కర్ణుడు సమర్ధుడు కానీ సమర్పణ ఏది? రావణుడు సమర్ధుడే గాని సమర్పణ ఏది? అలాగ దక్షుడు భగవతత్త్వానికి, ప్రణాళికకు సమర్పణ చెందిన సమయం మేష రాశి. అతడితో మనకి మొదలవుతుంది మేష మాసము. మనకి మేషమాసం ఇచ్చే సంకేతం ఏంటంటే భగవంతునికి సమర్పణ చెందుతూ సమర్థవంతుడిగా తయారవ్వు అని! రెండు రకాలు ఉన్నాయి ఇందులో. నువ్వు ఒక సమర్థవంతుడివిగా తయారయ్యి, తర్వాత భగవంతుడికి సమర్పణ చెందడం చాలా కష్టం. తల తెగేస్తేనే గాని అవదు. అసలు సమర్ధతే భగవంతుని యొక్క అనుగ్రహంగా నీవు పొందుతూ వచ్చావనుకో, ఎప్పటికప్పుడు ఏం జరిగినా ఆయన అనుగ్రహం వల్ల జరిగింది అనే వినయంతో తో పెరగాలి. దక్షత పెంచుకుంటూ వెళ్లాలి. దాంతోపాటుగా వినయం కూడా పెరిగిందనుకో, అప్పుడు నువ్వు మేషమాస ప్రజ్ఞగా ఉంటావు. మేషమాసం అంటే సూర్యుడికే ఉచ్ఛస్థానము 12 రాశుల్లో. సూర్యుడికి ఉచ్ఛస్థానము అంటే మొత్తం సూర్యమండలంలో సూర్యుడే అందరికంటే బాగా వెలిగేవాడు. ఆయన ఇంకా బాగా వెలుగుతాడట చైత్రమాసంలో. 'Sun is, exalted' అంటాము. ఉచ్ఛస్థితి అన్నమాట! ఎందుకలా వచ్చిందంటే వినయముతో కూడిన పూర్ణసమర్థత వున్నవాళ్లు ఆదిత్యలు. వాళ్లలో మళ్లీ అదే అంటే ఆ తత్త్వమే ఇలా వచ్చేసింది, ఇంక దీనికి దానికి ఏం తేడా లేదు అన్నట్టుగా ఉన్నాడు విష్ణువు! ఎందుకని? ఆయన మొత్తం అంతా వ్యాపించి ఉన్నాడు పరతత్త్వముగా. ఈయన సృష్టిలో మొత్తం అంతా వ్యాపించి ఉన్నాడు. సృష్టిలో సమస్తమును వ్యాపించిన ప్రజ్ఞను విష్ణువు అన్నారు. వ్యాపనము చెందే ప్రజ్ఞ! అందుకని ఆయన జ్యోతిరాదిత్య! ఎంత వ్యాపనం చెంది ఉన్నాడంటే అడ్డమైన వాటిల్లో కూడా ఉన్నాడు. ఎంత అడ్డమైన వాటిల్లో ఉన్నాడంటే మనకు బొత్తిగా నచ్చని వాళ్ళలో కూడా ఉన్నాడు. అదిట సహిష్ణువు అంటే, ఆయనకి ఎవ్వరిలోనైనా ఉండటానికి అభ్యంతరం లేదు.

## 587 సహిష్ణుః

సహిష్ణు అంటే బాగా సహించి ఉంటాడు, అసహ్యించుకోవడం ఉండదట. మనకి అసహ్యం చాలా ఎక్కువ కదా. ప్రతిదీ అసహ్యమే! వాళ్లకి అసహ్యం ఉండదు. అది భగవంతుడు గుణాల్లో క్షమాగుణంగా చెప్తారు. అసలు సహిష్ణు అనే నామము చాలా అద్భుతమైన నామము. ఎంత సహనము అంటే మనము యావగించుకునేవాటిలో కూడా ఉంటాడు, అసహ్యించుకునే వాటిల్లో కూడా ఉంటాడు, ఉండగలమా మనం? ఉండలేము. అందులో ఏమీ సందేహం లేదు. అరెరే! ఎంత కరుణ? బొద్దింకలో ఉన్నాడు అనుకోండి అది వచ్చి మన మీద వాలిందనుకోండి ఎలా వుంటుంది? మనకి బొద్దింక ఏం పర్వాలేదు, గొంగళి పురుగులు? అదేంటి సార్ గొంగళి పురుగులో కూడా ఉన్నారు మీరు? అంటే అవున్రా ఎక్కడైనా ఉంటాను, అంటాడుట, అంత సహనం. విష్ణువు సహనం గురించి ఈ నామంలో ఎంతైనా చెప్పుకోవచ్చు. పెళ్ళాం తిట్టినా నవ్వుతాడు, భక్తుడు కొట్టినా నవ్వుతాడు, తిట్టి పోసినా, ఏం చేసినా చిరునవ్వే విష్ణువుకు. శివుడిలా కోపంరాదు. తీసేసినా కూడా చిరునవ్వుతో తీసేస్తాడు. ఎందుకంటే, ఈయన ఆదిత్యల్లో జ్యోతిరాజు అవడమే కాకుండా సహిష్ణువు! చక్కని పేరు. ఈ పేరు ఎవరు పెట్టుకోవట్లేదు. సహిష్ణు ఏదైనా భరించేస్తాడు. ఈ నామం ఎందుకు వచ్చిందో తెలుసా? అసలు సృష్టికి మొదల్లో తాబేలుగా ఉన్న ఆయన వీపు మీద మందర పర్వతము అనే ఒక రోకలి తెచ్చి పెట్టేసి అటు ఇటు అటు బాగా లాగారు. భరించాడు కాబట్టి సృష్టి బయటికి వచ్చింది. అంటే రాపాడేస్తారంటారు చూశారా! అలా వీపు మీద పెట్టి తిప్పితే ఎలా ఉంటుంది మనకి? దేవతలు అందరూ సృష్టి యజ్ఞానికి బలిపశువు గా ఎవరు అనుకుంటే, ఆ భగవంతుడే బలి పశువు అయ్యాడు. దాన్నే నరమేధము అంటారు లేదా పురుషమేధము అంటారు. పరమ పురుషుడు తనని తాను సమర్పణ చేసుకోవడం వల్ల సృష్టి వచ్చిందండి. మనము మళ్లీ పరమపురుషుని చేరుకోవాలంటే మనం కూడా మనల్ని మనం అలా ఆహుతి చేసుకోవాలి. నువ్వు ఒళ్ళు కదలకుండా భగవంతుని చేరుకోవాలి అంటే ఏదో కొంత fashion గా వెళ్ళిపోతుంది. ఆహుతి అయిపోవాలి నీ శరీరము, నీ ఇంద్రియాలు, నీ మనస్సు, బుద్ధి, సమస్తము నీ చుట్టూ ఉండేవాళ్ళ కోసం వినియోగం చేయడమే! అర్ధరాత్రి phone వచ్చినా లేచి మాట్లాడాలి. అర్ధరాత్రి పిలిచినా వెళ్లి మందు వేయాలి. అలా అర్ధరాత్రి వెళ్లి మందు వేశాం కాబట్టి పొద్దున్నే లేవకుండా ఉండకూడదు. ఏం మాస్టారూ? అంటే రాత్రి రెండు గంటల వరకు వాడు కూర్చున్నాడు అందుకనే పొద్దున్నే prayer చేయలేదు అనడానికి వీలు లేదు. మళ్లీ యధావిధిగా నాలుగు గంటలకు లేచిపోవాలి. నీకు ఉన్నదంతా దాచుకోకుండా అన్నీ సమర్పణ చేసి జీవించాలి, ఇది నరమేధం! పురుషమేధం! ఇలా ఉన్నదంతా సమర్పణ చేయడానికి ముందు ఇంకొకటి

చేయమంటారు. అసలు నిన్నే సమర్పణ చేసుకో ముందు, అంటారు. తనని తాను సమర్పణ చేసుకుని, తన దగ్గర ఉన్నది కైంకర్యం చేసేసి జీవించేవాడు పురుషమేధము అనే యజ్ఞము పాటించినవాడు. పూర్ణమైన పురుషమేధయజ్ఞము ఈ కలికాలంలో చేసినవాడు ఏసుక్రీస్తు. ఆ మాట నేను అనడమే కాదు మాస్టర్ గారూ రాశారు ఆ ఒక్కడే అని. శరీరంతో సహా సమస్తం కార్యానికి అప్పగించేసి, పూర్ణ అంగీకారంతో ఒంటికి మేకులు కూడా కొట్టించుకున్నాడు దైవకార్యంలో భాగంగా! అవసరం కూడా లేదు. తప్పూ చేయలేదు. వాదించుకోవచ్చు. 'దీనివల్ల గాని అవ్వదా?' అని అడుగుతారు పాపం చివరికి ఒక మాటగా. 'దీనివల్ల ఎక్కువ జరుగుతుంది, కానీ నిర్ణయం నీదే' అని చెప్తారు. 'ఎందుకంటే నీకుగా నీవు సమర్పణ చేసుకుంటే తప్ప, నువ్వు చేస్తే బాగుంటుందని చెప్పకూడదు' పైవాళ్ళు. పైవాళ్ళెవరు మైత్రేయుడు, మరువు, దేవాపి! The three Wise Men of the East! చెప్తే, కానీయండి అని తనని తాను సమర్పణ చేసుకుని భూగోళం మొత్తాన్ని జయించేశాడు. ఎంత సమర్పణ చెందితే అంత నీకు విజయం అవుతుంది. అది పూర్ణమైన సమర్పణ, అది పూర్ణ విజయం. పూర్ణాహుతి. ఈ కాలంలో లెక్క వేసుకోవడానికి కూడా ఎవరూ కనబడరు. అందుకునే పురుష సూక్తం లో 'తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః' అంటారు. సర్వహుతం అనే యజ్ఞాన్ని చేశారు దేవతలు. ఏమీ మిగలకుండా ఆయన్ని వండేస్తారటండి. బొత్తిగా ఏమీ consideration లేకుండా వండేసారండి. వేయించేశారు, బొగ్గుల మీద. అలా ఆయన్ని వేయించేస్తుంటే అందులోంచి పుట్టుకొచ్చాయట. ఏం పుట్టుకొచ్చాయట? అరణ్యాలు, గ్రామాలు, ఆవులు, గొర్రెలు, గుర్రాలు. వాటి పేర్లు అలా ఉన్నాయి అశ్వములు, వేదాలు పుట్టుకొచ్చాయట. ఒక్కొక్క దానికి ఒక సంకేతార్థం ఉంది. పురుషసూక్తం తెలుసుకుంటే సృష్టి రహస్యం అంతా తెలిసినట్లే! అసలు మనం చదువుతున్నది ఏమిటో కనీసం పైపైన అర్థమైనా తెలుసుకోవాలి. వండేస్తే ఇవన్నీ వచ్చాయి కాబట్టి ఆయన సహిష్ణు! తాబేలు కథ చిన్న విషయం. మొత్తం తలలోంచి ఒకడు వచ్చాడు, బొడ్డులోంచి ఒకడు వచ్చాడు, ఏమీ నీ కోరిక అన్నట్లుగా నిలబడ్డాడు. బ్రహ్మగారు నేను ఏం చేయాలి అంటే, సృష్టి చేయాలి అన్నాడు. సృష్టి చేయాలి అంటే నిన్ను వండేయాలి కదా, అన్నాడు. వండేసుకోండి అన్నాడు. సరే వాళ్ళ నుండి కొంతమంది వచ్చారుట. వాళ్ళందరూ కలిసి ఈయన్ని వండేసారు. వండేస్తే సృష్టి వచ్చింది. మూల పదార్థం లేకుండా ఇవన్నీ తయారవవు కదా. మనని ఎవరైనా కాస్త వాడుకుంటే మనకి ఎట్లా ఉంటుంది? మనవరకు వచ్చేద్దాం అనిపిస్తుంది. సహిష్ణు కాదు అసహిష్ణు! కాస్త మనని ఎక్కువ వినియోగించుకుంటే ఎంత మండిపోతుందండీ! భగ భగ భగ మంటలు వస్తాయి, అందుకని ఏం చెప్పాడో తెలుసా? ఆధ్యాత్మిక సాధనలో Old Testmant లో చెప్పిన మొదటి commandment 'Tolerance'! భగవద్గీతలో మొట్టమొదట చెప్పింది క్షమ! క్షమ కలిగిన వాడే యజ్ఞానికి అర్హుడు. క్షమలేని వాడు యజ్ఞానికి అర్హుడు కాదు. క్షమించగలవా? అట్లా అడ్డగోలగా

వాడుకున్నా కూడా వాళ్లకు ఉపయోగపడితే అంతే చాలనే భూమిని చూడండి. మనం ఎట్లా దున్నేస్తుంటాం? భయంకరంగా దున్నిన కొలది మనకు అందిస్తుంది, అది చూడండి తమాషా. అందుకని సహిష్ణు అనే పదానికి 'క్షమ' అనే గుణం అని చెప్పుకోవాలి. క్షమకు ప్రతీక భగవంతుడే తర్వాత మనకి ఉదాహరణకు భగవత్ భక్తుడు. భగవత్ భక్తుడి యొక్క క్షమ అంతా ఇంతా కాదు. వసిష్ఠుని క్షమ చూడండి. విశ్వామిత్రుని వికారమైన చేష్టలయందు కూడా చాలా క్షమ కలిగి ఉంటాడు. సత్త్వగుణ సంపన్నుడు! ఎంతో క్షమతో అన్నీ భరిస్తూ ఉంటాడు. 'వ్యక్తిగతముగా తనకు జరిగిన అన్యాయములను ధీరతతో సహించుట' చేస్తామా మనము? చేస్తేనే సాధనలో ఉన్నట్టు. చెయ్యము. 'వ్యక్తిగతముగా ఇతరులకు అన్యాయం చేయడం ఉంటుంది'. తనకు జరిగిన అన్యాయము, మోసం చేస్తున్నాడు అని తెలిసి కూడా, సహాయము పొంది తనను తిడుతున్నాడని తెలిసి కూడా, అలా ఉంటాడటండి. కృష్ణుని ఎంతమంది తిట్టారు? కృష్ణుడి వరకు అక్కర్లేదు. మామూలు భక్తులు కూడా తిడుతూ ఉంటే పడుతూ ఉంటారు, కొంతవరకు అయిపోయింది లే అని. ఒకటి తిడితే పది తిట్టేవాళ్ళు భక్తులు కాదు. పది తిట్టినా మాట్లాడకుండా ఉండేవాడు భక్తుడు. అది కూడా ఆయన చెప్పేసి వెళ్ళిపోయాడు 'నిందాస్తుతి చేసినా మౌనంగా ఉంటామయ్యా మేమని'. ఎవరు మేమంటే? భక్తులు! ఆ భక్తులు ఎలా ఉంటారంటే, ఎవరైనా తిట్టాడు ఎవరైనా పొగిడాడు రెండిటికీ మౌనంగా ఉంటాడు అది సహిష్ణు! పెద్ద పెద్ద విషయాల్లోకి మనం వెళ్లాలనుకుంటే ఇవి పట్టుకొమ్మలు. అస్సలు మనము ఏమీ సహించము అంటే మన దగ్గరికి ఏమీ రాదు. ఎందుకంటే, భగవతత్త్వము సహించేవాళ్ళకి ఎక్కువగా దగ్గరకు వస్తుంది. ఎంత బరువులు ఎత్తితే అంత దగ్గరగా వస్తుంది. మాస్టర్ గారు అహర్నిశలు 30 సంవత్సరాలు చాలా రకాలుగా తన సాధన ఆయన చేసుకున్నారు. ఒకసారి ఆయన్ని 'ఏం మాస్టర్ గారు మీకు ఇచ్చిన task' అంటే, 'ఏం లేదోయ్, ఒక నున్నటి కొండ ఉన్నది యాదగిరిగుట్ట లాగా. ఆ భుజానికి ఈ భుజానికి తలో పది మందిని ఎక్కించుకోమన్నారు. ఎక్కించుకుని ఆ నున్నటి కొండ ఎక్కమంటున్నారు. ఎక్కుతూ ఉంటే అక్కడక్కడ పైనుండి నూనె కూడా పోస్తూ ఉంటారు. జారకుండా ఈ పదిమందిని నా భుజాల మీద ఎక్కించుకుని పైకి వెళ్ళమంటారు. అదీ నా పని' అని చెప్పారు. పట్టువదలని విక్రమార్కుల్లా పనిచేయాలి అంటే చాలా కావాలి. ఆయనకున్న ఓర్పు మనం ఊహించలేము. అటువంటి ఓర్పు ఉంటే పురుషమేధం జరుగుతుంది. ఎంత నువ్వు పరమునకు సమర్పణ చేసుకుంటే అంత అమృతత్వము నీకు ఏర్పడుతుందని చెప్పారు.

## 588 గతిసత్తమః

మార్గములో నడిచేవాళ్లలో ఉత్తముడుట. జగద్గురువు అని అర్థం. జగద్గురువు రూపం లో ఉండేది ఆయనే అని చెప్పడం. మార్గంలో నడిచే వాళ్లల్లో ఉత్తముడు అంటే, గురుపరంపరకంతా ముఖ్యుడిగా నిలబడి, భగవతత్త్వాన్ని అందించి, తన వెనుక నడిపించేవాడు. గతి అంటే మార్గము. అందులో ఉత్తముడు. 'నేనే మార్గమును' అని చెప్తే మేకులు వేసేసి పంపించేశారు, అలా అంటావా, తప్పు కదా అని. ఆయన 'వచ్చి నేను నడుస్తున్న ఆ మార్గంలోనే మీరు నడవండి' అని చెప్తాడు. EK గారు ఏం చెప్పారు? 'నా మార్గం అనుకోకండి నేను నడిచే మార్గం అనుకోమన్నారు. ఇది నా మార్గము కాదు, ఎప్పటి నుండో ఉన్నది. సృష్టి మొదలు నుండీ ఉంది ఈ మార్గం. నేను అందులో నడుస్తున్నాను మీరు కూడా అందులో నడవండి. ఈ మార్గమే దైవము. మార్గాంతము కాదు'. అందుకని నడుస్తూ ఉంటేనే అనుభూతి కలుగుతుంది. ఎప్పుడో చివరికి వెళ్లిపోయిన తర్వాత అక్కడికక్కడ కూర్చుని settle అయ్యి, శుభ్రంగా మనకి పక్కల వేస్తారు, దిండు తెచ్చి పడుకోబెడతారు అనుకోకండి. అసలు మార్గమే మధురంగా ఉంటుంది, ఆ మార్గం చెప్పడానికి వచ్చినవాడు కూడా వాడే! మనము ఏదో పుణ్యం చేసుకోవడం వల్ల ఎప్పుడో మనము దేవుణ్ణి ఆర్తితో ఒక్కసారి పిలవడం వలన, మాస్టర్ గారి వంటి మహాత్ములు మన జీవితంలోకి వస్తారు. వచ్చింది ఎవరంటే వాడే ఈ రూపంలో. వాడు చెప్పింది చేసుకుంటే ఆ మార్గంలో నడిచినట్టు. ఎవరికి ఏమి చెప్తే అదే చేయాలి. మీకు చెప్పింది నేను, నాకు చెప్పింది మీరు చేయకూడదు. అందుకని 'గురువాక్యం తక్షణకర్తవ్యం' అన్నారు లేక 'గురు ఆజ్ఞ తక్షణకర్తవ్యం'. అంటే ఏంటి? ఆ క్షణంలో మొదలుపెట్టేయాలి. లేకపోతే కాసేపు పడుకుంటాను మాస్టారు! అంటే, పడుకో! అంటారు కాసేపు ఏంటి, రోజంతా పడుకోమంటారు. పగలు పడుకోవచ్చా? పడుకో! ఎంతకాలమో నీకు ఓపిక ఉన్నంతకాలం పడుకో! నీకేమీ లేదు, ఆయన చెప్పింది చేసావనుకో ఆ మార్గంలో నువ్వు ఉన్నట్టు. ప్రతి గురువు ఒక శిష్యుడికి ఒకటి ఇస్తూ ఉంటాడు. ఒకణ్ణి ఒరే! నువ్వు కట్టెలు కొట్టుకు రారా! అని చెప్తూ ఉంటాడు, ఇంకొకరికి నువ్వు వంట చూస్తూ ఉండరా! అని చెప్తూ ఉంటాడు. ఇంకొకడికి నువ్వు బట్టలు ఉతుకు! అంటాడు. పూర్వకాలంలో అలా చెప్తూ ఉండేవారు. ఏమిటయ్యా ఉద్దేశం? అంటే చెప్పిన పని చెప్పినట్టుగా చేస్తాడా, లేదా? అందులో ఏకాగ్రత ఉన్నదా లేదా? సమర్పణ బుద్ధి ఉన్నదా లేదా? సంకల్ప బలము ఉన్నదా లేదా? అని. అది మర్చిపోయి ఇంకోటి ఏదో మళ్లీ చెప్పండి, అంటూ ఉంటాం. ఎన్నిసార్లు అడిగినా సరే, మళ్లీ అదే చెప్తారు, ఎందుకంటే వాడి జీవలక్షణానికి దేని ద్వారా వాడు ఉద్ధరింపబడడానికి అవకాశం ఉంటుందో, దాని ద్వారా గురువు అదే మొదలు

పెడతాడు. అందరికీ ఒకటే కార్యక్రమం ఇవ్వడు. ఇచ్చింది పుచ్చుకుని మనకి ఇది ఇచ్చారు దీంతో మనము బయలుదేరుదాము, అని అనుకుని ఆయన ఇచ్చిన మంత్రమో, ఉపదేశమో చేసుకుంటూ, కార్యక్రమం చేసుకుంటూ వెళుతూ ఉన్నామనుకోండి, కాల ప్రవాహంలో వెళుతున్న కొలది వికాసము వస్తుంది. 12 ఏళ్లు ఏ గురువు చెప్పింది చెప్పినట్టుగా చేసావో అప్పటికి నీకు ఒక వికాసము వస్తుంది. అలా కానప్పుడు రావడానికి అవకాశం లేదు. అందుకని 'గతిసత్తముడు' గా భగవంతుడే వస్తాడు. వచ్చి మార్గాన్ని ఇస్తాడు. మార్గం కోసము తహతహలాడే వాడికి ఇస్తూ ఉంటాడు. ఒక మహాత్ముడు దిగివస్తే మార్గం అడిగేవాళ్లు కొంతమంది ఉంటారు, మిగతావి అడిగేవాళ్లు ఎక్కువమంది ఉంటారు. మార్గం అడిగే వాళ్ళకి మార్గం ఇస్తాడు, ఇంకేవో అడిగే వాళ్ళకి అవి ఇస్తాడు. రాక్షసులకి గురువుగారు ఎవరు? శుక్రుడు! శుక్రుడు దగ్గర ఏమి విద్య ఉంది? మృత సంజీవిని విద్య! చచ్చిపోతామన్న భయం రాక్షసులకి ఎందుకండీ అసలు? ఆ విద్య నేర్చుకోవచ్చు కదా. ఎంతసేపూ దేవతల్ని ఎట్లా కొట్టాలో అడుగుతూ ఉంటారు. చెప్తూ ఉంటాడు శుక్రాచార్యుడు. అదేమిటి ఈయన దగ్గర మృత సంజీవిని విద్య ఉంది కదా, అమృతత్వ విద్య అది ఇవ్వవచ్చు కదా. నీ దగ్గర ఉన్నది అది ఇవ్వలేదేమిటి? అని అడగలేదు వాళ్లెవరూ. గుర్తుపెట్టుకోండి గురువు నువ్వు ఏది అడిగితే అదే ఇస్తాడు తప్ప, ఆయన ఇద్దాం అనుకున్నది నువ్వు అడిగితేనే ఇస్తాడు. ఆయన వచ్చినపని అందుకే. చెరువులాంటివాడు గురువు. దాహము నీకు వేస్తే నువ్వు వెళ్లి తెచ్చుకోవాలి అందులోంచి. నీకు దాహం వేస్తే నోట్లోకి చెరువు వచ్చి దూరుతుందా? ఆ చెరువులో నువ్వు గేదెను కూడా తోముకోవచ్చు, బట్టలు కూడా ఉతుక్కోవచ్చు, ఇంకా ఏవైనా పనులు చేసుకోవచ్చు, ఏమిచేసినా ఒప్పుకుంటాడు. ఎందుకంటే ఆయన సహిష్ణువు కదా. ఎలా వాడుకున్నా ఒప్పుకుంటాడటండీ! ఎలా వాడుకోవాలో మీకు తెలిసి వాడుకోవాలి. మార్గాన్ని ఇచ్చేవాడు అని నీకు తెలిస్తే, మార్గం అడిగితే మార్గం ఇస్తాడు. 'బోధలడిగిన బోధ చేయను, బాధలన్నచో బాధ తీర్చును, బరువులన్న బరువు దించును, దారి కోరిన దారి చూపును' అని రాశాడు కదా కృష్ణస్వామి. అందుకని మనకి దారి చూపించే వాడి రూపంలో దేవుడే వచ్చాడు అని తెలుసుకుని ఉండాలి. అది నామములో ప్రత్యేకత! గతి అంటే మార్గము. మార్గంలో ఉత్తమమైనవాడుగా భగవంతుడు వస్తాడు. అంతేకాదు ఎక్కడైనా మనం తెలియక చిక్కుబడిపోయామనుకోండి ఎవరైనా వచ్చి తీసుకెళ్లారనుకోండి, వాడు కూడా వాడే అని గుర్తుపెట్టుకోండి. ఆత్మమార్గమే కాదు అలాంటి చిల్లర మార్గాలలో కూడా వాడే దారి చూపించేది. ఆ వాహికను వినియోగించుకుని నీకు సహాయం చేస్తాడు, సంబంధం లేకుండా! కాబట్టి గతిసత్తమః అంటే మార్గమును చూపించే ఉత్తముడైన రూపంలో నీకు గోచరించేవాడు! అంటే భగవద్భక్తుడు లేక గురువు లేక గురుపరంపర! పరంపరగా ఒక మార్గం వస్తుంటే, ఆ మార్గాన్ని అనుసరిస్తూ మనము వెళ్తూ వుంటే సరిపోతుంది. అందుకని బుద్ధుడికి అదే

పేరు పెట్టారు. బాగుంది నీకు ఈ పేరు కొత్తగా పెట్టారంటే, కొత్తగా కాదు పాతదే, ఎప్పటి నుండో ఉంది, అని చెప్పాడట ఆయన. బుద్ధుడు పాత మార్గం తీసేసి కొత్తగా పెట్టారన్నారు కదా, అప్పుడు ఆయన 'అదేం లేదు తథాగతుడిని నేను. అదే మార్గంలో నడిచి వెళ్తున్నవాడిని' అని చెప్పారు. అయినప్పటికీ మనం ఒప్పుకునామేమిటి, special అని చెప్పుకున్నాం. అట్లాగే CVV గారి New Yoga గురించి. New Yoga ఉండదు, Old Yoga said newly! మళ్లీ చెప్పారు. విన్నవాళ్ళకి కొత్త! మార్గం పాతదే! మనము ఇవాళ రామాయణం విని best అండీ ఇంత బాగా ఎవరు చెప్పలేదు అంటాం కదా. ఇప్పటివరకు ఎన్నిసార్లో ఎంతోమంది చెప్పారు. మనము ఇవాళ విన్నాము. మనకి ఇవాళ తెల్లారింది కదా. అంత మాత్రం చేత చెప్పినవాడు ఇలా అనంగానే వీడు ఉబ్బిపోయి, వాడు ఉబ్బుపోతే ఇద్దరూ మురికింట్లో ఉన్నట్టే. చంద్రశేఖరభారతి శిష్యుడు ఆయనతో 'ఇంత అద్భుతంగా ఎవ్వరూ చెప్పలేరు అందుకే అంతా రాశాను' అంటే 'చింపేయమన్నారు. ఎవరైనా నేనే చెప్పానంటే అబద్ధం అయి ఉంటుంది. ఎవరు చెప్పినా చెప్పిందే చెప్పాలి కానీ, చెప్పంది చెప్పడానికి ఏమీ లేదు' అని చెప్పారు. 'అలా కాదు లెండి మిగతా వాళ్ళు చెప్పిందే! కాకపోతే మీరు చెప్తే నాకు బాగుంది' అంటే 'చెప్పిందే కదా చింపేసేయ్' అన్నారు. చెప్పలేదంటే చింపేయమన్నాడు, చెప్పిందంటే చింపేయమన్నాడు. అప్పుడు 'నీ బుర్రకు ఇవాళ అందిందిరా! ఎంతమంది ఎన్నిసార్లు ఈ సృష్టిలో చెప్పారో! ఎంతమంది దీన్ని వివరించారో! నేను మొట్టమొదటగా చెప్పినవాడినీ, నువ్వు మొట్టమొదటగా విన్నవాడివీనా? వద్దు వద్దు అలాంటి పిచ్చిపనులు చేయక' అని చెప్పారు. అద్భుతమైన విషయము! మాస్టారు అంటూ ఉండేవారు కొత్త కొత్తగా మీసాలు వస్తుంటే పిల్లవాడు మా తాతకు ఇంత ఒత్తుగా మొలిచి ఉండవు అనుకుంటాడట. ఎందుకంటే వాళ్ళ తాతయ్యను వీడు చూసేసరికి అవన్నీ గొరిగేసుకుని ఉంటాడు. 70 ఏళ్లకి మీసాలు ఎందుకులే! అని తీసేసుకుంటూ ఉంటాడు. ఇప్పుడే వీడికి 16 - 17 ఏళ్లు, నూనుగు మీసాలు వస్తూ ఉంటే, తాతా! ఇలా వచ్చినాయా నీకు? అంటాడు. అట్లా ఉంటుంది. మనవరకు, వాళ్ళు మనకు చెప్పిన మార్గంలో నడవడం ముఖ్యం! ఇంక ఎవరూ చెప్పలేదు అనకూడదు. నీకు వాడు చెప్పాడు. ఇంకొకడికి ఇంకొకడు చెప్తాడు. ఒకే గురువు 100 రకాలుగా చెప్పవచ్చు, వందరకాలుగా దిగి రావచ్చు. అందుకని జగద్గురువే ఇన్ని గురువుల రూపంలో పనిచేస్తూ ఉంటాడని తెలియాలి. జగద్గురువు ఎవరండీ అంటే, మళ్ళీ పేర్లు పెట్టకండి, పరతత్త్వమే అనుకోండి! ఇంక మనకు అప్పుడు తగువులు ఉండవు. ఒకడు మైత్రేయుడు అంటే ఇంకొకళ్ళు ఇంకొకటి అనొచ్చు, దత్తాత్రేయుడు కాదా? అందరికీ గురువు దక్షిణామూర్తి అని చెప్పారు కదండీ అంటే? అందరికీ గురువు ఈశ్వరుడే కదా? అన్నారనుకోండి. పరమశివుని తత్త్వమే గురుతత్త్వముగా చెప్తారు. అందుకని పేర్లు పెట్టుకుంటే తగువులు వస్తాయండీ! నీకు దారి చూపించాడు ఒకడు. ఆ రూపంలో ఆ పరతత్త్వమే వచ్చింది అనుకోండి నీవరకు! అంటే

వచ్చావు కదా మార్గం కోసం, చూపించడానికి వచ్చాడు. నడుస్తావా, కూర్చుంటావా? చేసేది ఏమీ లేక ఇంత పెద్ద మార్గంలో కూర్చోవచ్చు. వాళ్ళు ఏమీ అనుకోరు. 'నువ్వేదో అడిగావురా అందుకని మేము ఉత్సాహపడి చెప్పాము కానీ నిర్ణయము నీది' అంటారు. అందుకని మన వరకు అదృష్టం, మాస్టర్ గారు వలన మళ్లీ సనాతనమైన ధర్మ మార్గము ఒక్కసారి సులభంగా అందివ్వబడినది. మనవరకే తప్ప మొత్తం ప్రపంచానికి అని అనుకోవద్దు దయచేసి. అది అహంభావమవుతుంది. అలా ఎంతోమంది ఎన్నోచోట్ల చెప్తూనే ఉన్నారు. అలా చెప్పడం వల్ల మనము మాస్టర్ గారిని చిన్నవాళ్ళం చేసినట్లు అవదు. ఒకే సత్యాన్ని తెలిసినవాళ్ళు ఎన్నోచోట్ల, ఎంతోమంది సత్యాన్వేషకులకు చెప్తూ ఉంటారు. వారి జీవలక్షణాన్ని బట్టి వారికది నచ్చుతూ ఉంటుంది. కొంతమందికి సాయి నచ్చొచ్చు కదా. కొంతమందికి ఇంకొకరు నచ్చొచ్చు. ఎవరికి ఏది నచ్చితే వాడు, దాన్లో ముందు నచ్చిన పద్ధతిలో చెప్పింది చేసుకుంటూ పోవడమేనండి! గురువు చెప్పిన బోధన ఆచరణలోకి తీసుకురావడం అనేది చేస్తే మార్గంలో నిలిచినట్టు. గురువు బోధించింది ఇంకొకరికి బోధించాలని పెట్టుకుంటే ఊరికే కొట్లు పెట్టుకున్నట్టు. మనము నడవకుండా, ఇంకొకళ్ళకు బోధ చేసుకోవడం! మా గురువుగారు అలా చెప్పారు ఏమనుకుంటున్నావు? అన్నట్టుగా పదిమందికి చెప్తున్నామనుకోండి, అది విన్నవాడు మార్గంలో నడిచి వెళ్ళిపోతూ ఉండొచ్చు. వీడు ఇక్కడే ఉంటాడు కాశీకి tickets అమ్ముతున్నాడుట ఒకాయన. కాశీకి tourist bus లు organise చేసి పెడుతున్నాడుట. ఓ వేలాది మంది వెళ్లారు, వచ్చారు. ఎంతోమంది విశ్వేశ్వర దర్శనం చేసుకున్నారు. కొంతమందికి గంగలో అనుభూతులు వచ్చాయి, కొంతమందికి మార్గం దొరికింది. ఎవరికి వాళ్ళు తరించారుట. వీడు ఇట్లాగే ఉన్నాడు బస్సులు పెట్టుకుని. ఒకరోజు ఒక ఆయన వచ్చి అడిగాడట 'ఇంతమందిని కాశీకి పంపించారు మీరు వెళ్లారా?' అని అంటే 'అబ్బే! లేదండీ, నిజమే మీరు చెప్పింది నాకు తట్టలేదు' అన్నాట్ట. గురువు గురువుని చెప్పకోవడంలో ఉపయోగం ఏమీ లేదు నీ నడకలో నుండి మళ్లీ గురువు ప్రతిబింబించాలి. అట్లా నడవమన్నాడు. ఏ గురువు అయినా వాళ్ళ శిష్యుణ్ణి 'నేను నడిచిన దారిలో మీరు నడవండి రా! తథాగతుడై నేను వెళుతున్నాను, మీరు కూడా అంతే తప్ప మళ్ళీ ఊరికే కబుర్లు చెప్పకండి, బోధన చేయబోకండి, అడిగితే చెప్పండి, అడగకపోతే నోరు మూసుకుని మీరు మాత్రం నడుస్తూ ఉండండి' అని చెప్తాడు. అంతేకానీ నావలెనే మీరు కూడా బోధనలు చేసుకుని కలకాలం వర్ధిల్లండి అని ఏ సద్గురువూ చెప్పడు. 'నా వలెనే మీరు కూడా జీవించండి' అని చెప్తారు. ఆయన ఒక్క బోధలే కాదు కదా చేసింది. మిగతావన్నీ మనకు convinient అనుకుంటే చేసుకుంటూ ఉంటాం. అలా అయితే సమర్పణం, సహిష్ణుత్వం, ఇవన్నీ ఎక్కడి నుండి వస్తాయి? ఎక్కడ ఏ గురువు పాదాలు పట్టుకున్నా వాడే! వాడి కాళ్ళకి దండం పెట్టుకుంటున్నాం! అలా అనుకోండి. ఏ పాదం పట్టుకున్నా ఆ పాదమే పట్టుకున్నాం అనుకోవాలి. విష్ణుపాదం! ఎప్పుడు విష్ణు పూజ

చేసేవారు ఒకరోజు శివ పూజ చేశారంటే ఆరోజు తీర్థము ఇచ్చేవాడికి విష్ణుపాదోదకం అని వస్తుంది, శివపాదోదకం అని రాదు కదా. అయినా ఏదో పురోహితుడు చదువుతూ 'విష్ణుపాదోదకం పావనం శుభం' అనేసరికి ఒక పెద్దాయనకి కోపం వచ్చిందిట. శివ పూజ చేసి విష్ణుపాదోదకమంటావా? అంటే, ఆయన బిత్తర పోయాడు. అప్పుడు మాస్టారు చెప్పింది ఒకటి గుర్తొచ్చి చెప్పాను 'విష్ణువు కంటే పాదం ఉందండి, కానీ శివుడికి పాదం లేదు కదా అంతా లింగమే కదా' అని అంటే పోనీలెండి ఫరవాలేదు అని ఆ పెద్దాయన నవ్వేశాడు. అట్లా ఏ పాదం పట్టుకున్నా వాడి పాదమే పట్టుకున్నామని మార్గంలో మాత్రం నడవండి. నడిస్తేనే సాధన! కూర్చుంటే సాధన లేదు. అలా మనకి కోటాను కోట్లు చెప్పి ఉంటారు కదా, ఏదో ఒక్కటి మొదలుపెట్టి చేస్తూ ఉండండి. అప్పుడు మార్గంలో నడుస్తున్నట్టు లేఖ్క. స్ఫూర్తి ఉంటే ఒకటికి రెండు, రెండు మూడు 30 అలా చేరిపోతుంటాయి. కేవలము స్ఫూర్తివల్ల చేరిపోతూ ఉంటాయి. బరువు ఎక్కకుండా చేసుకుంటూ వెళ్లిపోండి. ఎంత మనము సహిష్ణుతత్త్వంతో భరిస్తూ వదిలించుకుంటూ, ఎంత మథనం జరుగుతుంటే అంత పువ్వులాగ వికసిస్తాం.

## 589. సుధన్వా

సుధన్వా అంటే చక్కటి ధనుస్సు ధరించి వున్నవాడు. 'ప్రణవో ధనుఃʼ అంటే, 'ప్రణవము ధరించి ఉన్నాడనిʼ అర్థము. ప్రణవమును ధరించి వుండేది పరమాత్మ. రామలక్ష్మణులు ఇద్దరూ కూడ, మేము పరులమే అయినప్పటికి కూడ, నరులుగా భూమి మీద సంచరిస్తున్నాము అని మనకి సంకేతము ఇవ్వడానికి అన్నట్లుగా ఎప్పుడూ ధనుర్ధారులై సంచరించారు. అంటే ప్రణవమును ధరించి, సంచరించారు. మనము కూడ ఆత్మ సాధకులము కాదలచుకున్నట్లయితే ధనుస్సుని అంటే ప్రణవాన్ని ధరించాలి. అంటే 'ఓంకారముʼ అనే ధనుస్సుని అందుకోవాలి. తద్వారా జీవుడు దైవము దగ్గరకి చేరడానికి కావలసిన దారి ఏర్పడుతుంది. ఓంకారమును ఎంత చక్కగా సాధన చేసుకుంటే, అంత చక్కగా మనలో ప్రజ్ఞగా అన్ని లోకములకు వున్న సూత్రము ఏదైతే ఉందో, ఆ సూత్రము చక్కటి దర్శనము మనకి ఇస్తుంది. అది ఆధారంగా సూక్ష్మలోకములకు వెళ్ళవచ్చు. స్థూల లోకములలోకి రావచ్చు. నారదాది మహర్షులు ఈవిధముగానే స్థూల, సూక్ష్మ లోకములలో విహరిస్తూ వుంటారు. ఆయన ధనుస్సు బదులు, తత్తుల్యముగా నాదము ఇచ్చే వీణని ధరించి వున్నాడు, అని చెప్తారు. ఈ నాదము ఇచ్చే వీణను ధరించడమంటే సంకేతము ఎప్పుడూ నారదుడు వీణ లేక వుండడని, అంటే ఓంకారము వదిలి వుండడని, నాదము వదిలి వుండడని, తత్కారణంగా భగవంతునితో అనుసంధానము చెంది వుంటాడని. భావము యందు భగవంతుని యొక్క స్మృతి కలిగి వున్నంతసేపు ధనుస్సు ధరించి వున్నట్లే. ధనుస్సు లేని రాముడిని మనము ఎప్పుడూ, ఎక్కడా బొమ్మలలో చూడము. 'సుధన్వాʼ అనే ఈ నామము భీష్ముడు శ్రీకృష్ణుడి యందు 'ఓంకారము అనే ధనుస్సుʼ ని దర్శించి చెప్పడమే! ఓంకారము ధరించినవాడు భగవంతుని ధరించినట్టు లెక్క. భగవంతునిచే ధరింపబడిన వాడు భగవత్ సమానుడే ! భగవంతుడు ఎప్పుడూ ధనుస్సు ధరించి వున్నాడు అనే భావన చాల సామాన్యమైన భావనగా మనం అనుకోవచ్చు. ఎందుకంటే ఆయన 'నాదస్వరూపుడుʼ. లోకములోకి అవతరించి వున్నవాడు ధనుస్సు ధరించి వున్నాడు, అనేది మనకి పనికొచ్చే విషయం. రాముని దేవునిగ కాక, నరునిగా ఎల్లప్పుడూ ధనుస్సుని ధరించి వున్నవాడుగా మనం భావన చేసినట్లయితే, ఎల్లప్పుడూ ఓంకారమునందు నిలిచి ఉన్నాడని అర్థము. మనం ఓంకారములో నిలిచి వుంటే, ఓంకారము ఆధారము చేసుకుని ఆశ్రయించి వున్నట్లయితే 'ఓంకార రూపుడుగాʼ భగవంతుడు వున్నాడు. కాబట్టి, భగవంతుని ధరించి వున్నట్లే. భగవంతుని మనం ధరించడం వేరు, భగవంతునిచే మనం ధరింపబడడం వేరు. ఆ రెండింటిలో మళ్ళా తేడా వుంది. మనం భగవంతుని ధరించడం అంటే, అవసరమైనప్పుడు ధరించడం, తరువాత పక్కన పెట్టడముగా వుంటుంది. భగవంతునిచే

ధరింపబడడం అంటే మరి ఇంక అంతే! వారిని 'వాహికలు' అంటారు. వారిని 'మహాత్ములు' అంటారు. అటువంటి వాడిని 'దాసుడు' అంటారు. అందుకని లక్ష్మణుడు 'రామునికి నేను తమ్ముడను అయినప్పటికీ కూడా, నేను రాముని దాసుడను' అని చెప్తాడు. 'అతనికి నేను తమ్ముడ్ని. నాకు మాత్రం ఆయన స్వామి. నేను ఆయనకు చేసేది దాస్యము' అని చెప్తాడు. అంత మాత్రం చేత తక్కువ వాడు అయిపోయాడని కాదక్కడ అర్థం. నిజానికి జీవుడుగా దైవము నుండి దిగి వచ్చిన తత్త్వం ఏదైతే ఉందో, అది భగవత్తత్త్వానికి దాస్యము చేస్తూ వుండాలి. దాస్యం చేయడం అంటే భగవత్తత్త్వముచే ధరింపబడి వుండాలి. అదీ దాసత్త్వం. అదే మనకి విశిష్టాద్వైత మార్గముగా, రామానుజ మార్గముగా ఎప్పుడూ చెప్తూ వస్తూ వుంటారు. రాముడి అనుజుడు భగవంతునిచే ధరింపబడిన వాడు. ఆ మార్గములో ప్రయాణము చేసే వారందరు కూడ భగవంతుని యొక్క అనుగ్రహాన్ని పొంది ఆయనచే ధరింపబడి వుండడం జన్మకి సార్థకత అని భావన చేస్తారు. ధనుస్సు ధరించడము అంటే కూడ అదే. మనము కూడ ఆ రకమైన ధనుస్సుని ధరించడానికి ప్రయత్నము చేయాలి. ఆ ధనుస్సే భగవత్ స్ఫూర్తి. ఆ ధనుస్సే ఉపనిషత్తుల్లో విల్లుగా చెప్పారు, ప్రణవముగా చెప్పారు. 'ధనుస్సు అందుకో! బాణాన్ని ఎక్కుపెట్టు! గమ్యాన్ని చేరు!' అని ముండకోపనిషత్తు చెప్పింది. రాముని ధనుస్సు, అర్జునుడి ధనుస్సు, ధర్మము కొరకు ధరింపబడిన ప్రతి ధనుస్సు కూడ సుధన్వా యే! ధర్మము కొరకు ఎవరు ధనుస్సు ధరించినా వారంతా 'సుధన్వులు' అవుతారు. మహాత్ములు అందరు కూడా సుధన్వులే. బయట ధనుస్సు ప్రతీక, లోపల ధనుస్సు సత్యము అయినది. ఈ లోపల వున్న ధనుస్సు యొక్క బలమే బయట ధనుస్సులోకి ప్రసరిస్తూ వుంటుంది. అంతే కాని అది బాగ గట్టిగా మంచి లోహముతో తయారు చేయించుకోవడం వల్ల గట్టిగా వుంటుంది అని అనుకోవడానికి వీలు లేదు. మన లోపల ఓంకారము యొక్క బలము చేత, మనం ఏది ధరిస్తే దాంట్లోకి అది ప్రసరిస్తుంది. ఒక సంకల్పాన్ని ధరిస్తే ఆ సంకల్పంలోకి అది ప్రసరిస్తుంది. ఒక కార్యము లోకి అది ప్రసరిస్తుంది. ఒక మాట నుండి అది ప్రసరిస్తుంది. మొత్తము జీవితములో అన్ని సన్నివేశాలలోకి అదే ప్రసరిస్తుంది, దాన్నే ధరించి వున్నట్లయితే! అలా కాకపోతే, ఎత్తుకోవడం దించుకోవడం గా వుంటుంది. కాస్సేపు ఓ 10 నిమిషాల పాటు ధరించి, మళ్ళా పక్కన పడేసి, ఎక్కడ వుందో వెతుక్కుని, మళ్ళీ ధరించుకుంటూ--. పక్కన పెట్టేసినదాన్ని వెతుక్కోవాలిగా. ఇక్కడే పెట్టేనమ్మా ఎవరో ఊడ్చేసారు అంటాం. మనం పెట్టింది పెట్టిన చోట మన ఇంట్లో వుండదు. మళ్ళి వచ్చేసరికి అది ఇంకో చోట వుంటుంది. అయితే ఈ ధనుస్సు ఇట్లా క్రింద పెడితే మళ్ళా దొరకదు. అందుకని ఎప్పుడూ ధరించి వుండాలి. అట్లా ధరించి వున్నట్లయితే, నీవు ఓంకారము ధారణ చేసిన స్థితి సాధనలో పొందగలిగినట్లయితే, నువ్వు ఏదైనా సంకల్పము ధరిస్తే అది కాల క్రమములో సిద్ధిస్తుంది. నీ నుండి వచ్చే వాక్యము ఆ విధంగా సిద్ధిస్తుంది. నువ్వు చేసే పనులు సిద్ధిస్తాయి. ఇవన్నీ సిద్ధించడమే తప్ప, నువ్వు చేయడము కాదు. నువ్వు దాని

యందు వుండడం చేత అది నీ నుండి ప్రసారమై, ఈ సమస్తాన్నీ సిద్ధింప చేస్తుంది. వారూ 'సిద్ధులు' అంటే, చేస్తున్నాము అనే మెరమెరలు వుండే వారు సిద్ధులు కారు. వాళ్ళు 'శ్రామికులు' అని చెప్పవచ్చు. శ్రమ పడే వారు, చాలా శ్రమ పడుతూ వుంటారు. చేస్తున్నాము అనే భావన. మనకి ఆ భావన చాలా ఎక్కువగా గోచరిస్తూ వుంటుంది సేవ చేసేప్పుడు. సేవ చేస్తున్నాను, కర్తవ్యము నిర్వర్తిస్తున్నాను అనే గొప్ప. ఏంటిటా నిర్వర్తిస్తే? నిర్వర్తించడమే, నిర్వర్తిస్తున్నాను అనే భావన వద్దు. సేవ చేస్తున్నావు కానీ, చేస్తున్నాను అనే భావన వద్దు. ఆ భావన వలన నీకు అనుభూతి వుండదు. చేయడంలో కనుక ఆనందము వున్నట్లయితే అక్కడికక్కడ ఫలితము దక్కినట్లే. చేసిన దాని నుండి ఆనందము పొందుదాము అని అనుకోవడం వేరు. ఇన్నాళ్లు విష్ణు సహస్రనామము చెప్తున్నాను, ఏమి లాభము? అని అనుకుంటే కాదు. విష్ణు సహస్రనామము చెప్తున్నప్పుడు ఆనందముగా వుంటుంది అంతే. కార్యములోనే ఫలశ్రుతి కూడ వుంది. అదీ భగవత్ కార్యములో వుండే ఒక అద్భుతమైన సన్నివేశము. భాగవతము రాస్తూ వుంటే ఆనందము కలుగుతూంటుంది పోతనామాత్యుడుకి! భాగవతము అయిపోయింది. అక్కడ పెట్టేసి పోయాడు. ఏమిటి మరి print అంటే, అది నాకు సంబంధము లేదు, అన్నాడు. మనము, పుస్తకాలు మనమే print వేసుకుని, దాని అట్ట మీద మళ్ళీ మన బొమ్మ మనమే వేసుకుని, మన గురించి రాసుకుని, అవన్నీ మన ఇంటిలో బొత్తులుగా బొత్తులుగా పెట్టుకుని ఎవరు కొనుక్కోవడం లేదే అని బాధపడడం కన్నా, రాయడంలో అనుభూతి వచ్చేసింది, కదా. ఆ తర్వాత ఇంక ఎందుకు ఇక్కడ, అక్కడ పెట్టేసి పోవచ్చుగా? ధరించి వున్న వాళ్లు అట్లా ధీరులై వుంటారు. చేయడము లోనే ఆనందం వుంది. అందుకని ఒక మహాత్ముడు ఏమి చెప్పారంటే 'ఆనందము ఇస్తోందో లేదో చూసుకుని చేసుకుంటూ వుండు. ఆనందము లేనిది చేయబోక' అని. Duty అని, ఎవరో demand చేస్తున్నారని చేయబోక. ఎవరో demand చేశారని నువ్వు చేస్తుంటే నీకు ఏమి ఆనందంగా వుంటుంది? స్వతంత్రించి నీకుగా నువ్వు చేస్తున్నావా? ఇష్టపడి చేస్తున్నావా? కష్టపడి చేస్తున్నావా? సేవ కష్టపడి చేయడము వుంటుంది, సేవ ఇష్టపడి చేయడము వుంటుంది. సేవ ఇష్టపడి చేస్తే సేవ అని గుర్తు వుండదు. చేయడం లో ఆనందము వుంటుంది. లోకహితము మన duty కదా అని నెత్తిన ఎక్కించుకున్నామనుకోండి luggage లాగ, అది railway కూలీ లాగ వుంటుంది. Railway కూలీలు మాకు వద్దు, అంటున్నారు పరమ గురువులు. 'ఒరేయ్ ! నీకు ఎందులో ఆనందముగా వుంటే అదే ఫలశ్రుతి'. మరి చేసే వాటిలో ఎప్పుడు కనబడతావు? అదేమిటి? కనబడడం ఎందులోనూ లేదు. నీకు ఇష్టమైతే చేయడం, చేయడం ద్వారా ఆనందము పొందడం మాత్రమే. ఇహ మిగతా conditions ఏమి నువ్వు పెట్టబోక ! మిగతా కోరికలు దీనికి ముడి వేయబోక, చేసిన పని చేస్తున్నప్పుడు ఆనందాన్ని ఇస్తే నువ్వు అదృష్టవంతుడవి. అది ఎవరికి సాధ్యం అంటే, ఈ విధంగా ధరించి వున్న వారికి సాధ్యంట. సూఫీ మార్గములో భక్తులు ఎట్లా ఉంటారంటే, ఎప్పుడూ ప్రస్తుతము యందే

జీవించి వుంటారు. ఊహలలో బతకరు. నిన్నలో బతకరు, రేపులో బతకరు. ఇప్పట్లో బతుకుతారు. దీన్నే 'అశ్వ విద్య' అని మనకి ఇస్తారు పెద్దలు. 'శ్వ' అంటే భూతము కాని, భవిష్యత్తు కాని. 'అశ్వ' అంటే భూతమూ కానిది, భవిష్యత్తూ కానిది. అనగా వర్తమానము అని అర్థము. వర్తమానమునందే జీవించేవాడు భగవంతుడిని 'రస స్వరూపుడుగా' అనుభూతి చెందగలడు. ఇదంతా చేస్తున్నాము, రేపు ప్రొద్దున్న ఏమొస్తుందో అని అనుకునే వాడు రసానుభూతి పొందడు. ఇప్పుడు తింటున్నాము బాగానే వుంది. కానీ, తరువాత కడుపు నొప్పి వస్తుందేమో అన్నట్టుగా తిన్నాము అనుకో, తిన్నప్పుడు కూడ ఆనందము దక్కదు. తినేటప్పుడు తినేయడమే, తరువాత సంగతి తరువాత చూసుకోవచ్చు. వచ్చినప్పుడు భరించడమే. తింటూ అదికూడా అనుకుంటె ఇదీ దక్కలేదు, అది ఎలాగో తప్పదు. Sugar వస్తుందేమో అని sweet నోట్లో పెట్టుకుంటే, sweet రుచి ఏమి వుంటుంది ? వచ్చేసే వుంటుంది ఈపాటికి అనిపిస్తుంది మింగంగానే. ఆవకాయ ముద్ద, శుభ్రంగా కలిపి దట్టించి నోట్లో కలిపి BP వస్తుందేమో అని ముద్ద నోట్లో పెట్టుకున్నామనుకోండి, ఇక ఆనందము ఏమి వుంది దానికే ? అందుకని అనుభూతి పొందడానికి, వర్తమానంలో జీవించడానికి నిజమైన గురుకులాలలో సాధకుడికి ప్రాథమిక దశలో కొన్ని ముఖ్యమైన సాధన అంశములు ఇస్తారు. అలాగే రోజుకి మూడు గంటలు గొంతు చించుకుని చదవమని చెప్తారు. చక్కగా పలకడం మూడు గంటల సేపు, ఎందుకో తెలుసా? విశుద్ధి బాగా బలపడి, మణిపూరకము, స్వాధిష్ఠానము, మూలాధారము నుండి ప్రజ్ఞ ఊర్ధ్వగతికి కొనిరాబడుతుంది కాబట్టి. అదీ శిక్ష నిజంగా. స్తోత్రములను, సూక్తములను ఎలుగెత్తి ఉచ్ఛరించడం లో మనకి విశుద్ధి బాగా బల పడుతుంది. విశుద్ధి బలపడితే ఈ క్రింది లోకములలో వున్న ప్రజ్ఞ ఊర్ధ్వగతి చెందడానికి, విశుద్ధి పైకి త్రాడు వేసి లాగినట్టుగా లాగేస్తుంది. పిలక పట్టుకొని పైకి లాగేసినట్టుగా లాగేస్తుంది. అందుకని నిజమైన ఆశ్రమములలో ఎవరైనా కొత్తగా చేరితే, వాడిని 3 గంటల సేపు శిక్ష. ఇంత శిక్ష వేశారు ఏమిటా, అని అనిపిస్తుంది. శిక్ష అంటే ఇక్కడ 'ఉచ్ఛారణ'! శిక్షావల్లి! ఆ ఉచ్ఛారణ ద్వారా 7 కేంద్రములలోను, 3 స్థాయిలలోను శబ్దము వలన శరీరంలో మార్పులు ఏర్పడతాయి. అటువంటి వాళ్ళకి శరీరం బాగా తేజోవంతంగా వుండడానికి అవకాశము ఏర్పడుతుంది. గట్టిగా గంటన్నర పూజ చేస్తే మనకి ఉసూరుమంటుంది ప్రాణం. అలా వుండకూడదు. వీలైనంత వరకు వెన్నెముక, తల భాగం అన్ని నిలువుగా ఉంచుకొనడానికి ప్రయత్నము చేస్తూ, చక్కగ ఉచ్ఛారణ చేస్తూ, ఉచ్ఛారణలో నిమగ్నమై వుండి, ఆనంద పడుతూ చేస్తున్నట్లైతే, శరీరంలో మార్పులు వస్తాయి. అలా కాకపోతే ఎన్ని పూజలు చేసినా అట్లాగే ఉంటాము. అలాగే 'ఓంకారం' ని ధరించడం అనేది ఒకటి మనకి సాధనపరంగా వున్నది. ఈ రకముగా సాధన చేసుకుంటున్న వాళ్ళకి చక్కని పద్ధతులలో వంతెన నిర్మాణము జరుగుతుంది అన్ని లోకాలలో కూడ. ఇన్ని లోకాలలోను ఆ రకమైన వంతెన నిర్మాణం చేసుకోవడానికి

ఇంకొక ముఖ్యమైన అంశం మనకి ఇవ్వబడినది ఏమిటంటే 'అశ్వ విద్య'! ప్రస్తుతము నందు జీవించు. భూతము నందు, భవిష్యత్ నందు వద్దు. భగవద్గీతలో కూడ భగవంతుడు మొట్ట మొదటిగా పలికిన శ్లోకం

గతాసూన గతా సూన్ శ్చ నానుశోచంతి పండితాః

'అయినదానికీ అల్లరి ఎందుకు అల్లుడా' అనే పాట వుందిగా! అయిపోయిందిగా మధ్యాహ్నము తిన్నది, ఇప్పుడు ఉరికే నెమరు వేసుకుంటే ఏమి లాభం? ఇప్పుడు విష్ణు సహస్రనామంలో ఉన్నాం. నందోరాజా భవిష్యతి! ముందు ఏమి వస్తుందో చూద్దాం ఆనందం. ప్రస్తుతానికి ఇది. ఇప్పుడు ఇక్కడ వుండడం అనేది ప్రయత్నమూ చేయాలి. అలా ప్రయత్నం చేస్తే రసానుభూతి పరిపూర్ణముగా వుంటుంది. ఎంత రసానుభూతి ఉంటుందంటే, ఒక కప్పు కాఫీ, లేక టీ, లేక పాలో, తేనెనీళ్ళో త్రాగడంలో అనుభూతి పరిపూర్ణంగా పొందవచ్చు. కైలాసమే వెళ్ళనక్కరలేదు అనుభూతికి. మానస సరోవరం పోనక్కరలేదు. ఇక్కడే, ఇప్పుడే దొరుకుతుంది. ఎప్పుడు అంటే, నువ్వు వర్తమానంలో జీవించడం మొదలు పెట్టినట్లయితే. అర్జునుడు అశ్వవిద్యలో చాలా నిష్ణాతుడు. అందుకనే సంయమము కలిగిన మనస్సు పొందగలిగి, సమస్తాన్ని జయించ గలిగాడు. 'విజయుడు' అనే పేరు పొందాడు. రాముడు అశ్వ విద్య యందు నిష్ణాతుడు. మనము కుడా ప్రాథమిక దశలోనే అశ్వవిద్య నేర్చుకోవాలి. ఊహలలో బ్రతికే వాళ్ళకి ఏమీ రాదు. ఇప్పుడు పరమ గురువులు ఏమి చేస్తూ వుంటారంటారు హిమాలయాలలో అని అడిగితే, అంటే ఇప్పుడప్పుడే మనకి ఏమీ తరుణోపాయము లేదని అర్థం. ఇప్పుడు నువ్వు ఇక్కడ ఏమి చేయాలో అది చేసుకుంటూ, దాంట్లో ఆనందముగా వుండాలి. కప్పు కాఫీ తాగడం కావచ్చు, స్నానం చేయడం కావచ్చు, భగవద్గీత చదువుకోవడం కావచ్చు, లేకపోతె వంట పని చేయడము కావచ్చు, లేక ఇల్లు తుడుచుకోవడం, బట్టలు సర్దుకోవడం, ఏదైనా కావచ్చు. ఏదైనా చెయ్యి. ఆనందంగా చెయ్యి. అనుభూతి పొందుతూ చెయ్యి. ఇలా చేస్తూ వుంటే నీకు ప్రతి చిన్న విషయం లోంచి భగవంతుడే దొరుకుతూ వుంటాడు. ప్రహ్లాదుడు అట్లా దొరికించుకున్నాడు. అందుకని అతడికి ఆహ్లాదం అటువంటిది. విపరీతమైన ఆహ్లాదం! ఎందుకంటే ముట్టుకుంటే అది, తుడుచుకుంటే అది, చూస్తే అది, వింటే అది, తింటే అది, త్రాగితే అది.

పానీయంబులు ద్రావుచున్, కుడుచుచున్, హాస నిద్రాదులు చేయుచున్

ఏమి చేస్తున్నా అదే. అదే భాగవతములో చెప్పబడిన అశ్వవిద్య. అప్పుడు అది చేయ లేకపోతిని, ఇది చేయలేక పోతిని అని వుండదు. ఇంట్లో వుంటే అయ్యో అక్కడకి వెళ్లలేకపోతినే అని, అక్కడ వుంటే ఇంట్లో ఎదో మర్చిపోయానే చేయడం అని, ఇట్లా వుండదు. ఎక్కడ వుంటే అక్కడ పరిపూర్ణముగా, ఆనందముగా వుంటావు నువ్వు. ఇట్లా విపరీతంగా పరిపూర్ణంగా ఆనందం పొందుతూ వున్నాడుట ఒకాయన ప్రహ్లాదుడులాంటి వాడు సూఫీ మార్గములో. ఆయన పేరు Junoon. Egypt దేశములో వున్నాడు. కేవలం

భారతదేశములోనే పుణ్యాత్ములు ఉన్నారనుకోబోకండి. ప్రపంచము అంతా కూడ సత్ సాధకులు వున్నారు. ఈ Junoon అన్న ఆయన ఎడారులలో పడి తిరుగుతున్నాడట, చాలా ఆనందంగా, విపరీతంగా ఆనందంగా వున్నాడట. నిష్కారణముగా ఆనందంగా వున్నాడట. ఇలా వుంటే భగవంతుడికి తోచదు. ఆయనకు కనబడి భగవంతుడు అన్నాడట 'ఒరేయ్ నిన్ను చూస్తే నాకు చాల ఆనందంగా వుంది. నువ్వు నిష్కారణంగా ఆనందంగా ఉన్నావు కాబట్టి నీకు ఏ మహత్తరమైన శక్తులు కావాలన్నా నేను ఇస్తాను' అని అన్నాడాయన. అది చూడండి. ఎందుకు హాయిగా వున్నవాడికి. అంటే 'నేను హాయిగా ఉన్నాను మరి నువ్వు ఇస్తాను అంటున్నావు. నువ్వు ఇస్తాను అంటే నేను కాదనటం ఎందుకు, ఇందులో కూడా జీవించాలి కదా ! సరే, ఇవ్వు. అయితే ఒక పని చేయి. నేను దారి వెంట ఎడారిలో నడిచి వెళ్తుంటే, అటూ ఇటూ ఆకులు రాలిపోయిన చెట్లు వుంటే వాటికి వెంటనే ఆకులు చిగురించి, పూత పూయించి, పూలు పూచి, పళ్ళు పండాలి. నేను ఏ ఊరిలో నడచి వెళ్తుంటే ఆ ఊరిలో ఇంకిపోయిన బావులలో నిండా నీళ్లు రావాలి. నేను బాధలో వున్న వాళ్లను చూస్తే వారికి బాధ నుండి విముక్తి కావాలి. దరిద్రంలో వున్న వాళ్ళు నాకంట పడితే వాళ్ళ దారిద్ర్యం పోవాలి. సంతానము కావాలని మొర్రో అని ఏడ్చేవాళ్ళు కొంత మంది వుంటారు కదా వాళ్లకి నన్ను చూడంగానే వాళ్ళకి సంతానము కలగాలి. ఎవరికి ఏది కావాలంటే అది వాళ్ళు నన్ను చూడగానే వాళ్ళకి అది కలిగేటట్టుగా ఆశీర్వదించు' అన్నాడు. 'అలాగే' అన్నాడు భగవంతుడు. చచ్చాడు దెబ్బతో భక్తుడు అనుకున్నాడు. అయితే ఆ భక్తుడు ఇవన్నీ చేయాలి కాని ఒక షరతు వుందన్నాడు. ఏమిటంటే, 'నేను అక్కడ నుండి నడచి వెళ్లిన తరువాత ఇవన్నీ అవ్వాలి' అని చెప్పాడు. 'లేకపోతే ఆ ఊరిలో వాళ్ళు నన్ను కూర్చోపెట్టి, నాకో మఠం తయారుచేసి, నాకు పూజలు చేస్తూ, నన్ను బంధించేస్తారు. అట్లా వుండడం నాకు ఇష్టము లేదు. అందుకు నేను వెళ్ళిపోయిన తరువాత జరగాలి' అని. అది ఒకటి. రెండోది 'నా వల్ల వాళ్ళకి ఇన్ని జరిగినాయని వాళ్ళకి కూడా తెలియ కూడదు.' అదేవిటిరా అంటే. 'జరుగుతున్నాయి అని నువ్వు చెప్పావు, జరుగుతాయి. ఆ జరగడం లో ఆనందం చాలు నాకు. ఇహ ఆ తరువాత వాళ్లు నా పేర చేసే గోల నాకు వద్దు. వాళ్ళు నా వెంట పడనూ వద్దు, నేను వాళ్ళ మధ్యలో ఇరుక్కోనూ వద్దు. ఇట్లాగే హాయిగా ఆనందంగా వెళ్ళిపోతూ వుంటాను శరీరం ఉన్నంత కాలం' అని చెప్పాడట. అంటే మనం మొదలు పెట్టినప్పుడు ఆనందంగా వుండి, తరువాత ఇరుక్కున్నట్టుగా వుంటాయి కొన్ని పనులు. 'అమ్మా ఇందులో ఇరుక్కున్నాంరా, తెలియక. పాగిడి ఇరికించారురా.' అని అనుకుంటాం కదా. విష్ణు సహస్రనామం నేను చెప్తే బాగుంటుందంటే, నేను దిగిపోయాను అనుకోండి, ఏడు యేళ్ళు దిగిపోయినట్లే అందులోనికి. కూరుకు పోయినట్లే. ఎవరో చెప్పారని చేయకూడదు. ఎవరో చెప్పారు సంఘపరంగా ఇట్లా చేయడం కర్తవ్యమని, చేయకూడదు. ఎవరో చెప్పారు ఇట్లా చేస్తే పరమ గురువు కనిపిస్తాడు, మాస్టర్ అనుగ్రహిస్తారని చేయకూడదు. ఎట్లా చేయాలో

తెలుసా? నీకు అది ఆనందాన్ని ఇస్తే చేయాలి. లేకపోతే నిన్ను నువ్వు మోసము చేసుకున్నవాడివి అవుతావు. నిన్ను నువ్వు మోసము చేసుకున్నవాడివి ప్రపంచాన్ని కూడ మోసం చేస్తావు. ఆత్మవంచన వుండకూడదు. ఆత్మానుభూతి కావాలి చేసే పనులలో. ఎంత పెద్ద విషయం అయినా అది నీకు ఆత్మానుభూతి ఇవ్వకపోతే అట్లా తీసి పక్కన వెంట్రుక వలె పెట్టగలిగి వుండాలి. అన్నములో వెంట్రుక పడిందనుకోండి, ఏమి చేస్తారు? తీసి జేబులో పెట్టుకుంటారా? అలా తీసి అందరికి చూపించి పక్కకి పెట్టేస్తారు. ఎందుకు అట్లా చూపిస్తారు అంటే 'ఇంకా నయం, లోపల లుంగలు చుట్టుకుపోయి చచ్చిపోయేవాడిని సుమా! మీకు కూడా వస్తుందేమో చూసుకోండి' అని చెప్పడానికి. అట్లా మనం త్రికరణశుద్ధితో ప్రస్తుతము నందు జీవించగలిగినట్లయితే, ఆనందం మిగులుతుంది. ఆనందం అనేది ఎవరికి హక్కుగా మిగులుతుందంటే, ఆర్తిగా మిగులుతుందంటే ఈ విధముగా ధనుస్సు ధరించిన వాడికి. వాడికి ఏమి చేస్తున్నా ఆనందమే. ఎందుకంటే అన్నిట్లో దాన్నే దర్శనం చేస్తూ వుంటాడు. చేయాలి కదా, చేయాలి కదా అని ఉరేసుకోడు. చేయకపోతే ఏమి అనుకుంటారో అనే బాధ వుండదు. స్వతంత్రుడవై బాధ్యతలు పడడం వేరు. బాధ్యత యందు కూడా స్వతంత్రత వుండడం వేరు. ఈ స్వతంత్ర బుద్ధి మామూలుగా బాధ్యతారహితులకి వుండే స్వతంత్ర బుద్ధితో తూచి చూట్టానికి వీలు లేదు. కాబట్టి ఈ ధనుస్సుని మనమంతా ఎత్తుకోవాలి. రాముడు ఆ ధనుస్సు ఎత్తుకున్నాడు. స్వతంత్రించి ఎత్తుకున్నాడు ఆ ధనుస్సుని. ఎత్తుకుని రాక్షసులందరితోను వైరం తెచ్చుకున్నాడు. 'వైరం తెచ్చుకున్నావు కదా, మరి చాల పెద్ద ప్రణాళిక వచ్చేస్తుంది నీకు, మరి ఇప్పుడు యేమి చేస్తావు?' అని అడుగుతుంది సీతాదేవి. ఎందుకంటే, మునులాశ్రములన్నీ పుణ్యారణ్య విహారాలు అని చదివాం. అలాంటి అరణ్యములలో పుణ్యాత్ములు చాలా మంది ఉన్నారు. వాళ్ళందరిని చూసాడు. వాళ్ళందరూ ఒక్కటే చెప్పారు ఎక్కడికి వెళ్ళినా ఒకటే విన్నాడు ఆయన, 'రాక్షసుల బాధ చాల ఎక్కువగా వుంది' అని. అందుకని ధర్మాన్ని అనుసరించటం కోసము దిగి వచ్చిన తత్త్వం కాబట్టి, ధర్మాన్ని అనుష్ఠించే వాడు ధర్మానికి హాని కలుగుతున్నప్పుడు తన వంతు కర్తవ్యము నిర్వర్తించవలసి వుంది కాబట్టి, 'ఈ అడ్డగోలుగా మితిమీరి ప్రవర్తిస్తున్న రాక్షసులు అందరిని సంహరిస్తాను' అని ప్రతిజ్ఞ చేస్తాడు. ప్రతిజ్ఞ చేయగానే మొదలయిపోతుంది. 14000 మంది రాక్షసులు అటు వస్తారు. వాళ్ళందరిని తృటి కాలంలో ఈ ధనుస్సుతో సంహరిస్తాడు. శివధనుస్సును ఎత్తాడు. అదే ధనుస్సుతో బ్రహ్మ వర్చస్సు కలిగిన, రావణబ్రహ్మ కదా, ఆయనని సంహరించాడు. మనకి తరువాత నామంలో 'ఖండపరశుః' వస్తుంది. ఇక్కడేమో క్షత్రియుడుగ పుట్టి, బ్రహ్మ కులంలో పుట్టిన వాడిని సంహరించాడు. అక్కడ బ్రహ్మ కులంలో పుట్టి క్షత్రియులందరిని సంహరించాడు. రెండూ పక్క పక్కన పెట్టాడు ఈనామంలో. అదీ చూడండి తమాషా! వాళ్ళ పొందిక అట్లా వుంటుంది. ఇదీ అదీ ఒక్కసారే చూపించేస్తారు. దూరంలో చూపిస్తే

ఈలోపల కాస్త మనకి బ్రాహ్మణులూ, క్షత్రియులు ఈ భావాలన్నీ లోపల వచ్చేస్తాయి ఏది ఎక్కువ, ఏది తక్కువ అని. ఇక్కడేమో క్షత్రియుడుగా పుట్టి బ్రహ్మ కులంలో పుట్టిన వాడు అధర్మపరుడు అవడం వలన సంహరించాడు. దేనిచేతా? ధనుస్సును ధరించి. అక్కడ బ్రహ్మ కులంలో పుట్టి, క్షత్రియులను గండ్రగొడ్డలితో సంహరించాడు. పరశు అంటే గండ్రగొడ్డలి. మాములు గొడ్డలితో ఇంట్లో కట్టెలు కొట్టుకోవచ్చు. పెద్ద పెద్ద చెట్లు నరకాలంటే గండ్రగొడ్డలి కావాలి. కాబట్టి, అక్కడా ధరించాడు, ఇక్కడా ధరించాడు. ఇంతకు ముందు శ్లోకాలలో అంతా భగవంతుడు ధరించినవేవో చూపిస్తున్నాడు. అవి మనం ధరించడం కాదు. భగవంతుడు అవి ధరించాడు కదా. మనం వాటి యందు సాధన చేయడము వలన మనలను కూడా ధరిస్తాడు. ఆ పద్ధతి మంచిది. భక్తి మార్గములో భగవంతునిచే మనం ధరింపబడాలి. మనం భగవంతుని స్మరించడమే తప్ప ధరించలేము అని తెలుసుకోవాలి. భగవంతుని మనం భరించలేము కూడా. భగవంతుని మనం ధరించలేం. మనని భగవంతుడు ధరించి వున్నాడు నిజానికి. అదే సత్యం. చొక్కా లాగు మనని ధరించిందా, మనం చొక్క లాగు ధరించామా? చొక్కాలాగుయే మనని ధరించింది అన్న భావం వుంటే, ఇంటికి వెళ్ళగానే విప్పేస్తాము. విప్పనివ్వకూడదు కదా చొక్కా లాగూ? జీవాత్మ పరమాత్మకి చొక్కా, లాగు లాంటి వాడు. శరీరం జీవాత్మకు చొక్కా లాగు లాంటిది. పరమాత్మకు జీవాత్మ దాసుడు అయితే, జీవాత్మకు శరీరం దాసత్వం అయి వుండాలి. మనకి అది తల్లక్రిందులుగా వుంటుంది. శరీరం జీవుడు చెప్పినట్టు వినడం కాకుండా, శరీరం చెప్పినట్టు జీవుడు వింటూ వుంటాడు. ఇలా తల్లక్రిందులు అవడం వల్ల పరమాత్మ ఎప్పుడూ నిద్రపోతూ వుంటాడు. అందుకని ఈ ధారణ బాగా చేసుకోవాలి. 'సుధన్వా' మనం ఓంకారాన్ని వింటూ లోపల అద్భుతమైన ధనుస్సు ధరించిన, చక్కని నవ్వు కలిగిన, రమణీయమైన ఒక ఆకారాన్ని, గమనిస్తూ వున్నామనుకోండి, అది ఒక సాధన. హృదయము నుండి ఆజ్ఞ వరకు, ఆ ఓంకారం మన యందు ఒక సూత్రం నిర్మాణం చేయాలి. వెలుగు సూత్రాన్ని ఒక కిరణము లాగ. అది మనకి ఒక వంతెనగా తయారు అవుతుంది. దాన్నే The Bridge అంటారు. అప్పుడు జీవుడు ఇక్కడ నుండి అక్కడ దైవలోకాలలోకి, దేవుడు అక్కడ నుండి జీవలోకాలలోకి దిగి రావడానికి ఒక వంతెన ఏర్పడుతుంది. హృదయము నుండి భ్రూమధ్యం వరకు వంతెన. ఆ వంతెన వుంటే, అటు నుండి ఆయన వచ్చి నీతో మాట్లాడవచ్చు, ఇటు నుండి నువ్వు వెళ్లి ఆయనతో మాట్లాడవచ్చు. అది వుండడం అంటే ఇది ధరించాలి. భగవంతుడు ధనువు ధరిస్తాడు కాబట్టి మనం ధరించినట్లే. లేకపోయినా ధరించి వున్నాడు, మనకి ఎరుక లేదు. అయన ధరించ లేకపోతే మనమంత ఇట్లా కూర్చొని మాట్లాడుకోలేము. మీయందు, నాయందు ఆయన వుండి మనందరినీ ధరించి వుండడం చేత నేను చెప్పేవాడిగాను, మీరు వినే వారుగాను ఇక్కడ నిలబడివున్నాము, కూర్చొని ఉన్నాము. నిలబడివున్నాము అని ఎందుకన్నానంటే నిట్టనిలువుగా వున్నాము

కాబట్టి. ఆయన వదిలేస్తే అడ్డంగా పడిపోతాము. కాబట్టి ధరించే వున్నాడు. 'నన్ను భగవంతుడు ధరించాలని కాదు, భగవంతుడు నన్ను ధరించి వున్నాడు, అనే ఎరుక కలగడం కావాలి'. ఆ ఎరుక కలగడానికి మనం ఈ ధనుస్సుని ఆరాధన చేయాలి. ఆరాధన చేసిన కొలది అది పెరుగుతూ వుంటుంది. ఎటువంటి ధనుస్సు రాముని యొక్క ధనుస్సు? తప్పక రామాయణములో చదువుకోవాలి రాముని యొక్క ధనుస్సు యొక్క వైభవము. అది, ఆ బయట పట్టుకున్నది కాదు, లోపల వున్నది. హనుమంతుడు వాళ్ళిద్దరిని చూస్తూనే, 'ఓహో! ఓంకారమే రూపు కట్టుకొని వచ్చింది' అని తెలుసుకుంటాడు. సుగ్రీవుడు చూస్తాడు దూరము నుండి భయపడతాడు. భరతుడికి తెలుసు, లక్ష్మణుడుకి తెలుసు, హనుమంతుడికి తెలుసు, సీతాదేవికి తెలుసు. వీళ్ళందరికీ బాగా తెలుసు ఎటువంటి ధనుస్సో అది. అందుచేత ఆయన వేసిన బాణం అంత నిశితంగా వుంటుంది. వాలి సంహరణం ఏదో చెట్టు చాటు నుండి కొట్టాడు అని అనుకుంటాము కాని మనం, నిజానికి వాలి గురించి తెలిసినవాడికి, చెట్టు చాటు నుండి కొడితే మాత్రం చావడానికి ఎట్లా వీలవుతుందో తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ప్రతిరోజు తూర్పు సముద్రం, పడమర సముద్రం, ఉత్తర సముద్రం, దక్షిణ సముద్రం ఈ నాలుగు సముద్రాల లోకి వెళ్ళి, స్నానం చేసి, శుచి అయి వస్తాడుటండీ వాలి. అతని బలము ఎంతయ్యా అంటే, ఈయన స్నానాలు చేసే time లో, రావణుడు ఒకసారి ఎదో కొంచెం గొడవ చేస్తూ వుంటే, 'ఏంటిరా నీ గోల అని చెప్పి, వాణ్ణి చంపడం ఇష్టము లేక, అట్లా మడిచి చెవిలో పెట్టుకుని, మొత్తం నాలుగు సముద్రాలలో స్నానాలు చేసి, తరువాత అవతల పారేసి వెళ్ళిపోయాడట, అతడూ వాలి అంటే! అటువంటి వాడిని నువ్వు ఒక్క బాణంతో చంపగలవా? సూర్యతేజస్సు కలిగిన సుగ్రీవుడు వెళ్ళినప్పుడల్లా, మామిడికాయ పచ్చడి చేసి పంపించేస్తూ వుంటాడు. ఇక లాభము లేదు అని వదిలేస్తాడు. సుగ్రీవుడు ఋష్యమూక పర్వతం దిగి వచ్చాడా, చంపడు, ఎందుకంటే తమ్ముడు అని ప్రేమ. చంపడం ఇష్టం లేదు కాని, వాడు మాత్రం బాధ పడుతూ వుండాలి. అదీ లెక్క! ఆ వాలిని ఒక్కటే ఒక్క బాణంతో కొడితే వాడు చచ్చిపోయాడట. అది ఎటువంటి బాణం అయి వుండాలి? ఆ బాణం ఎందులోంచి వచ్చింది? ఆయన ధనుర్ బలం లోంచి వచ్చింది. ఆ ధనుస్సు ఏమిటి? ఆయన లోపల వుండే తత్త్వం! అలాగే సంహరిస్తాడు రావణుని కూడ. ఇంత దెబ్బ తిని, వాలి మారిపోతాడు. ముందు కొంత స్వభావసిద్ధభావాలు బయటకి వచ్చినా, తరువాత హాయి కలిగించి, తనని ఉత్తమ లోకాలలోకి ఉద్ధరిస్తుంది ఆ బాణము యొక్క స్పర్శ. రావణుడికి కూడా అంతే. ఎందుకంటే, ప్రేమతో చంపడమే. ద్వేషంతో చంపడం కాదు. అందుకని రామబాణం యొక్క ప్రత్యేకత మనం మనస్సులో పెట్టుకుని, రాముడు చేసిన ఈ కార్యాలన్నీ చదువుకుంటే, రామబాణం అంటే ఏమిటో తెలుస్తుంది. హనుమంతుడంతటి వాడు లంకను దాటినపుడు ఒకటే స్మరణ చేస్తాడు. 'రామబాణం వలే వెళ్తాను నేను' అంటాడు.

ఎందుకంటే, అంతకు ముందే వాలి సంహరణమప్పుడు చూసాడు రామబాణం ఎట్లా ఉంటుందో. అంతకు ముందు ఏడు తలల తాటి చెట్లను కొట్టినప్పుడు చూశాడు. 'ఆమ్మో! ఇదే మనకి' అనుకున్నాడు. 'రామ బాణమై' వెళ్తానని అన్నాడు. అంటే రామ దూతగా వెళ్ళడం. అట్లా వెళ్ళాడు. అందుకని ఆ విధమైన ధనుస్సు రాముడు యొక్క తత్త్వమున వున్నది. ఆ తత్త్వాన్ని కృష్ణుడులో కూడా దర్శనం చేసిన వాడు భీష్ముడు. కృష్ణుడికి ధనుస్సు ఎక్కడ ఉందండి? ఊరికే తిరుగుతూ వుంటాడు బొడ్డులో వేణువు ఇట్టా దోపుకొని. ఎక్కడికైనా వెళ్తే ఆ వేణువును వాయించుకోవడం తప్ప, ధనుస్సు లేదు కదా. అయినా కృష్ణుడుని చూసి 'సుధన్వా' అంటాడు . అంటే ఆయనకు అవన్నీ ఈయనలో కనిపించాయి.

## 5910 ఖండపరశుః

ఖండపరశు: అంటే ఖండించే గొడ్డలి. దీన్నే మనకి భగవద్గీతలో ' అసంగము' అనే అస్త్రం అని చెప్తారు. ఎంతటి కూకటి వేళ్ళతో పాతుకుపోయిన చెట్టునైనా సరే తుంచగలిగినది గండ్రగొడ్డలి. ఎంతంత చెట్లునూ కొట్టెయ్యగలదు గండ్రగొడ్డలి. అట్లా మనం శరీరంలోకి, శరీరానికి సంబంధించిన వాటిల్లోకి, తత్సంబంధమైన వాటిలోకి చెట్టులా విపరీతంగా పాతుకుపోతాం. ఈ పాతుకుపోయిన వాళ్ళకి 'అసంగము' అనే అస్త్రం పెట్టి శుభ్రంగా అన్నిటినీ నరికేసుకోమని మనకి 'పురుషోత్తమ ప్రాప్తి యోగము' లో ఇస్తారు. ఏమిటి మరీ ఈ నరికేసుకోవడం? ఇంత మరీ దుష్టకరమైనది, క్లిష్టతరమైనది, హింసాత్మకమైన మార్గం అని అంటే, దానికి ఏమి చెప్పారంటే, దేని యందు నీకు సంగమము వుండి చూస్తున్నావో దాని యందు నన్ను చూడడమే అసంగం! 'అ' తో సంగమం చేయాలి వున్న వాటిలో. భార్య యందు మమకారం వున్నది. భార్యని చూడకు, భార్యరూపంలో వున్న అంతర్యామి ప్రజ్ఞను దర్శనం చేయి. అది ' అసంగం'. భార్యలో 'నేను' అనే ప్రజ్ఞతో సంగమించడు. 'నేను' అనే ప్రజ్ఞకి అక్షర రూపముగా 'అ' నేను అని చెప్తాడు. అంతకు ముందు అధ్యాయంలో. అక్షరాలలో 'అ' ని నేను అంటాడు. అసంగము అంటే 'అ' తో సంగమం చేయమని అర్థము. 'అ' తో సంగమం చేస్తే అక్కడ భార్య వుండదు, భగవత్తత్త్వం కనిపిస్తుంది. 'అ' తో సంగమం చేస్తే అక్కడ పుత్రులు ఉండరు, భగవత్తత్త్వం/ అంతర్యామి తత్త్వం గోచరిస్తుంది. అట్లాగే మనకి ఊరిలో వుండే మంచి, చెడు సంబంధాలు అన్నిటిలోను 'అ' తోనే సంగమం చేస్తే, అంతకు ముందు దేనితో సంగమించావో అది నిర్మూలనము అవుతుంది. గొడ్డలితో చెట్టు కొట్టేసినంత free గా అయిపోతుంది. అట్లా మహావృక్షాల్లాగ పెరిగి ప్రపంచానికి పనికి రాకుండా తయారవుతున్న క్షత్రియులందరినీ కూడ వరుసగా నరికేయడానికి ఒక అవతారం వచ్చింది. అదే 'పరశురామ అవతారం'. ఆయనని ఉత్త రాముడని అనం గదా! ఆయన పరశురాముడు. ఆయన పని ఏమిటయ్యా అంటే, ఇట్లా తామర తంపరగా అధర్మం పెరిగిన చోటల్లా కూడా అసంగం అనే అస్త్రంతో ఖండిస్తాడు. అదీ గొడ్డలి! అందుకని భగవంతుని అన్నిటి యందు భావన చేయడమే అసంగం అనే అస్త్రాన్ని ధరించడం. అదే 'ఓంకారం' గా ధనువును ధరించడం. అసంగం అనే ధనువు, లేక ఖండపరుశు: ఖండించే పరశు ధరించడం అంటే సమస్తమునందు అంతర్యామి భావన కలిగి వుండడమే అసంగం. అప్పుడు మనకి దేని మీద జిగురు వుండదు. ఏదన్నా, మన భావనతో కాని, వాక్యముతో కాని, చేతలతో కాని ముట్టుకుంటే ఏమవుతుందంటే, మనలో నుండి ఒక జిగురు వెళ్ళి దానికి అతుక్కుంటుంది. మనం దాన్ని వదలలేము, అది మనని వదలదు. ఏది ముట్టుకుంటే అది అతుక్కుంటుంది. ఇంత తుమ్మ జిగురు మరి

ఎక్కడ నుండి వస్తుందో తెలియదు, అది తనది అన్న భావన రాగానే జిగురు వచ్చేస్తుందండీ ఈ తుమ్మచెట్టులోంచి. అంటే మనలో తుమ్మ తత్త్వం చాలా వుంది. తుమ్మ ముళ్ళు లాగా పాడుస్తూ వుంటాం. తుమ్మ జిగురు లాగా అతుక్కుంటూ వుంటాము. మనది కాని దానిని కోరడం, మనది అనుకున్న దానిని వదలకుండా వుండడం, అదీ తుమ్మ. తుమ్మ ముల్లు గుచ్చుకుంటే మిగతా ముళ్ళు గుచ్చుకున్న బాధ కంటే ఎక్కువ బాధగా వుంటుంది. తుమ్మ జిగురుతో అతికించుకుంటే మరి ఇహ ఊడేది ఏమి లేదు, శవం బయటకి రావలసిందే. అంత బాగా అతుక్కుంటుంది. అంత జిగురు వుంది మనలో. ఈ జిగురు పోవాలంటే ఏమి చేయాలంటే, ఈ జిగురుతో దేన్ని అతికించుకున్నామో, ఆ అతికించుకోబడ్డది 'అంతర్యామి' అంటే జిగురు వెంటనే కరిగిపోతుంది. అదే మీరాబాయి చాల బాగా చెప్తుంది. రాముడి గురించి ప్రార్థన చేస్తూ, 'నువ్వే దైవానివి, నేను నీదాన్నే, నీ మాయ కూడా నీదే, నీ మాయ, నేను, నీవాళ్ళమే కాబట్టి నీమాయతో నన్ను ఎందుకు బాధ పెడతావు? నన్ను నీలో తీసుకో' అని చెప్తుంది. మాయని కూడా భగవంతుడుగా దర్శనం చేస్తే ఇంక మాయ ఏమి చేయదండీ! మాయం అయిపోతుంది. మాయ రెండు రకాలుగా వుంటుందిట. ఒకటి, అందరి యందు అంతర్యామిని మర్చిపోతే, మాయ అక్కడ మనకి పొర వేసేస్తుంది. ఆ పొరని చూసి, మమకారాన్ని చూసి మనం, 'తల్లీ ! ఈ మాయ అద్భుతమైనది, నేను దాటలేను అని నాకు తెలుసు' అని చెప్తే చాలుట, అది దాటిస్తుందిట. అమ్మవారిని ప్రార్థిస్తే అయ్యవారి దగ్గరకి తీసుకు వెళ్తుంది. అయ్యవారిని ప్రార్థిస్తే అమ్మవారి దగ్గరికి తీసుకువెళ్తుంది. ఈ రెండు పద్ధతులు తప్ప ఇంకో పద్ధతి లేదు. ఈ ఖండపరశు మనీపర్సు లాంటిది కాదు. మధ్యాహ్నం మా అమ్మాయి ఏమిటీ ఖండపరశు? అంది. అంటే ! ఈ లోపు మా అబ్బాయి అన్నాడు, ఇది మనీపర్సు లాంటిది కాదా అని. అందుకని, ఆ పర్సు వేరు, ఈ పరశు వేరు. అందుకని, పరశు, గండ్ర గొడ్డలి, భావము నందు వాడిని నిలుపుకుని, కనబడే దాంట్లో దాన్ని చూస్తే అది 'నీది అనే మమకారం' నీకు వుండదు. నీది అనే మమకారం నీకు వున్నప్పుడు, నీ ప్రవర్తన చాల తేడాగా వుంటుంది. భగవంతుడిది, మనం దానికి సేవ చేసుకోవడములో మనకి ఆనందం కలుగుతుంది అన్న భావన వున్నదనుకోండి, అంత వరకు సరి. ధర్మకర్తగా ఉండడమే తప్ప, దేన్నీ మనది చేసుకోవడానికి ప్రయత్నం చేసావో, జిగురు వచ్చేస్తుంది. ఇంక ఆ జిగురు కష్టం. మనిషిని పంపిస్తూ ఒక లీటరు జిగురు కూడా ఇవ్వు వాడికి అని అంటాడట. దేనికే అంటే, పనికొస్తుందన్నాడట. ఈ జిగురు రెండు రకాలుగా పనికి వస్తుందన్నాడట. ఈ జిగురు మనం అంతర్యామి భావము మీద పెట్టాము అనుకోండి, అక్కడ అతుక్కుంటుంది. అదే జిగురు ఇంకో రకముగా పెట్టాము అనుకోండి అది సిద్ధిస్తుంది. మనస్సుకి దేని యందు లగ్నం చేస్తే దాని యందు వుంటుంది అది. దాని తత్త్వం అది. అదే కపిలుడు చెప్తాడు దేవహూతికి, 'ఏముందమ్మా! దీన్ని తీసుకు వెళ్లి దైవము మీద అతికించేసేయ్, అక్కడ పడి ఉంటుంది. అక్కడ పడి వుంటే

మిగతావన్ని వూడిపోతాయి. మిగతా వాటిలో పడివుందనుకో అది మూసుకు పోతుంది' అని కాబట్టి మనకు ఈ 'ఖండపరశు' అంటే అసంగత్వం. ధనుస్సు అంటే ఓంకారం. వీటిని మనం ధరించడం వల్ల భగవంతుడు మనని ధరించడానికి అవకాశము ఏర్పడుతుంది.

## 591 దారుణః

చాలా దారుణము అయిన వాడు భగవంతుడు. మనకి తెలియదు. మనం ఎప్పుడూ 'ప్రసన్న వదనం ధ్యాయేత్' అనుకుంటాము కాబట్టి మనకి ప్రసన్నం. చెప్పడం కూడా 'దారుణో వదనం ధ్యాయేత్' అనము కదా. ప్రసన్న వదనం ధ్యాయేత్ అంటే, బాబూ మాకు మాత్రం నువ్వు Mister ప్రసన్నం గా వుండు తప్ప, ఇంకొకటి వద్దు అని చెప్తున్నాము. ఎంత దారుణమండీ? భీష్ముడు చూసాడు కాబట్టి అది కూడ వేసేశాడు. పరమ దారుణముగా అందరినీ చంపేశాడు. తన, మన అని చూడలేదు. ఒక పక్కేమో భగవంతుడు అని కాస్త అందరికి అనుమానము వుంది. నమ్మకము లేదు, ఒక్క భీష్ముడికి తప్ప. మిగతా అందరికి అనుమానం వుంది 'అయి వుండ వచ్చు' అని. కాబట్టి ఆయన సమక్షంలో ఇంత యుద్ధము జరగడం ఏమిటండీ? ఇట్లా జన నష్టము జరగడం ఏమిటి? తీరి కూర్చుని యుద్ధము నడిపించాడు. అదేంటది? తన, మన తేడా లేకుండా అందరిని పొట్టన పెట్టుకున్నాడు. దారుణుడు కదూ! ఎంత దారుణము. అందుకే చెప్తాడు శ్రీకృష్ణుడు విశ్వరూప సందర్శన యోగంలో, 'నారూపం కేవలం సుందర రూపమే అనుకోబోకు, నాకు ఇంకో face వుంది. అది చూసావంటే చస్తావు. అందరికి చూపించను. కోరుకుంటారు కానీ చాలా మంది చూద్దాం చూద్దామని, కాని చూస్తే చస్తారు, అందుకని చూపించను,' అని అంటాడు. మునులూ వాళ్ళూ కోరుకుంటారట భగవంతుని యొక్క విశ్వరూపం చూద్దామని. వాళ్ళు ఏమి కోరుకుంటున్నారో వాళ్లకి తెలియదు కాబట్టి, అట్లా కోరుకుంటున్నారు. అది కనిపిస్తే అసలు ఇంక ఆ శాల్తి మిగిలి వుండడం చాల కష్టము. అందుకనే అర్జునుడు అంతటి వాడు 'భయంకరంగా వుంది బాబూ, ఇక నేను చూడలేను మూసేసేయ్. మామూలు సుందరమంద హాసరూపం నాకు గోచరింప చేయి, ఇది నాకు వద్దు ' అని అడుగుతాడు. భీష్ముడు అది కూడా చూసాడు శ్రీకృష్ణుడిది. 'ఎంత భయంకర రూపము నీది. ఇట్లా పైకి నవ్వుతావు తప్ప, తేనె పూసిన కత్తి, గోముఖ వ్యాఘ్రం అన్నట్టుగా వుంటావు'. ఇప్పుడు చూడండి మనకి సమస్తం ఒక్కసారి గభాల్న ముంచారనుకోండి, భూమి విచ్చుకొని లోపలకి వెళ్ళిపోయింది, అగ్ని భూమి లోంచి బయటకు వచ్చి సమస్తాన్ని దగ్ధం చేసింది. ఇట్లాంటి వన్నీ పెద్ద పెట్టున జరిగినపుడు దేవుడు దారుణుడు కాదా? దారుణం, దారుణం అంటే నవ్వుతూ 'అవునులే'! అని లాగేస్తాడు. ఆ విధంగా అది కూడ నీలో వున్నది. అదీ గొప్పతనం దైవము గురించి భారతీయ వాఙ్మయంలో ఉన్నది. ఒకటే చూపించరు, రెండూ చూపిస్తారు. 'చీకటి, వెలుగు రెండూ కూడా భగవంతుడే' అని చెప్పగలిగే దమ్ము వున్న వాఙ్మయం మనది. ద్రష్టలు అట్లా చూసారు ఒకటే కాదు, రెండూ ఉన్నాయని. ఈ రెండూ వాడి లోంచే వచ్చినాయి. అందుకనే ఎంతసేపూ దైవాసుర కథలే మనకు వుంటాయి. వాళ్ళు అటు, వీళ్ళు ఇటు.

వాళ్ళు ఇద్దరూ friends గా వుంటె సృష్టి వుండదు. Sudden గా సినిమాలో villan, hero friends అయిపోయారు అనుకోండి, ఇంకేముంది శుభం అని చూపిస్తారు అంతే. కథ అయిపోతుంది కదా. పగలు, రాత్రి కలిసిపోయినాయి. పౌర్ణమి, అమావాస్య కలసిపోయినాయి, ఉత్తరాయణము, దక్షిణాయణం కలసిపోయినాయి, ఉత్తరధ్రువం, దక్షిణధ్రువం కలసిపోయాయి. ఇక మనం ఇంటికి వెళ్ళడమే వుంటుంది. ఇంక కథ ఏమీ లేదు. అట్లా ఉంచుతాడు. అలా ఇక్కడ వరసగా ముందు ధనుస్సు దాని ప్రభావం చెప్పాడు. పరశు దాని ప్రభావం చెప్పాడు. తరువాత దారుణం గురించి చెప్పాడు. 'పరమ కారుణికోత్తమ' లాగే 'పరమ దారుణికోత్తమ' భగవంతుడు అని కూడా చెప్పడానికి ఎంత దమ్ము వుండాలండీ! 'Excuse me, ఇది కూడా నువ్వు' అని చెప్పాడు ఆయన. నిజమే కదా. అందుకని నవ్వుతూ విన్నాడు కృష్ణుడు. కాదా ? నువ్వు వచ్చిందే అందుకూ. కృష్ణాష్టోత్తరం మొత్తము అంతా list రాయండి ఎంత మందిని చంపాడో. అంతా చంపుడే. అదేమి అష్టోత్తరమో! టప టప మని పుట్టిన దగ్గర నుండి 'పూతనా జీవిత హర' నుండి మొదలుపెడితే, ఇంతింతై, ఇంతింతై 'దుర్యోధన కులాంతకః' దగ్గర ఆపేస్తాడు ఆయన. ఇట్లా ఇంత మందిని చంపి, చివరికి యాదవులను కూడా జాగ్రత్త చేసి వెళ్ళిపోయాడు ఏమీ మిగల్చకుండా. దారుణం కదా. మరి అది తెలియాలంటే కాలచక్రం తెలియాలి.

## 592 द्रविणप्रदः

द्रविणप्रदः అంటే అట్లా పట్టుకు పోతాడు, మళ్ళీ ఇస్తాడు. అట్లా ఇట్నుంచి అటు వేసేస్తాడు. మన భాషలో చెప్పుకోవాలంటే ఇటూ అటూ వేస్తారు, దోసెను ఇటు అటు పెనము మీద వేసినట్టుగా. ఏదో ఒక పక్కే settle చేయరు. చేస్తే partial understanding అవుతుంది. 'వెలుగే' దేవుడు అని మనం బల్ల గుద్ది చెప్పామనుకోండి. చీకటి ఎవరుటా? అంటే 50% నువ్వు consider చేసేసావు దైవము కాని దానికి. 50 శాతమే నీ దేవుడు, వెలుగే దేవుడు అంటే. ఏం చెప్పండి? అమావాస్య కాదా? పౌర్ణమేనా? అట్లా మనకు ఒక పక్క చూడడం మొదలు పడితే పక్షవాతము వస్తుంది. మొత్తము చూపిస్తే యోగం అవుతుంది. శిశిర ఋతువు, మళ్ళీ వసంత ఋతువు. అది, ఇది రెండూ వుంటేనే ఆనందం. Alternating forces గా తాను వ్యక్తం అవుతున్నాడని చెప్పడానికి విష్ణు సహస్రనామంలో ఇట్లా చాల సార్లు వచ్చింది. ఇటు తీసుకెళ్తారు, అటు తీసుకెళ్తారు. మళ్ళా అటు నుండి ఇటు పట్టుకొచ్చి, ఇటూ నుండి అటు పట్టుకెళ్ళి, ఇదంతా ఎందుకంటే దీనినంతటికి మించి 'వాడు' వున్నాడని చెప్పడానికి. ఆ విధంగా द्रविणप्रदः. అంటే द्रविणము ఇస్తాడట. ఇప్పటి నుండి ఇచ్చేది అదే. ఒక చెట్టుని మనం చూస్తే సంవత్సర చక్రంలో మనకి అన్ని అర్ధము అయిపోతాయి. కొన్నాళ్ళు చిగురు వస్తుంది. కొన్నాళ్ళు అట్లా బోడిగా వుంటుంది. ఈ వెనకాల చెట్టుని చూడండి. దానికి ఆకే లేదు. ఎంత భయంకరంగా వుంది. దారుణ స్థితిలో వుంది. 'దారుణో' అన్న నామానికి అది ప్రతీకగా వుంది. ఇక్కడేమో ఈ మామిడి చెట్టు 'द्रविणप्रदः' ఇది మామిడి కాయలతో బాగా బరువెక్కి కొమ్మలు క్రిందికి వచ్చేస్తున్నాయి. అక్కడేమో పూర్తిగా ఎండిపోయి వుంది. ఈ రెండూ చూసి మరి ఏది బాగుంది? అంటే రెండూ అంటాడు యోగి. అది కావాలి. ఇంకో రెండు నెలలలో, అదీ వస్తుంది విపరీతముగా పచ్చగా. ముందు లేత ఆకుపచ్చ తరువాత ముదురు ఆకుపచ్చ. తరువాత ఎర్రటిపూలు, అబ్బో చెట్టంతా పువ్వులు అయిపోతుంది. అబ్బ ఎంత బాగుందో, అనిపిస్తుంది. ఇంత బాగుండేది ఇప్పుడు ఇట్లా ఉందేంటి? ఇప్పుడు ముండక స్థితిలో వుంది. అట్లా కూడా వుంటుంది ఇట్లా కూడా వుంటుందని, రెండు పక్కపక్కనే ఏర్పాటు చేశాడు. కాబట్టి వాడి లోంచి సమస్తము వస్తూ వుంటుంది. వాడిలోకి సమస్తము పోతూ వుంటుంది. వచ్చి, పోయేది నువ్వు చూడడం నేర్చుకోగలిగితే సుఖ పడతావు. లేకపోతే మనకి వస్తున్నప్పుడే బాగుంటుంది, పోతున్నప్పుడు బాగుండదు. అంటే ఏమిటి? మనకి పక్ష వాతమే కదా మరి! కుడికో ఎడమకో అతుక్కుపోతే ఇక రెండోది అక్కర్లేదనుకుంటే ఏమవుతుంది? ఎడమ అంటే పదార్థం. కుడి అంటే పరమార్థము. పరమార్థమే కావాలి, పదార్థము కాదు అనుకుంటే యోగం కాదు. పదార్థమే కావాలి, పరమార్థము వద్దు అనుకుంటే యోగం కాదు.

పదార్థము, పరమార్థము రెండూ వుంటాయి, రెండింటిలోను నేను అనుభూతి చెందుతూ, రెండింటికి మించిన దాంట్లో వుంటాను అని చెప్తాడు. ఈ రెండింటికి మూలము అయినది ఒకటి వుంది కదా, 'ఆత్మ మూలు నర్ధి దలంతున్' . ఆ విధంగా మనకి సంవత్సర చక్రములో, ఆరు ఋతువులలో బోలెడు వస్తూ వుంటాయి. ఈ ద్రవిణప్రదః అనే నామానికి సంవత్సర పురుషుడ్ని ధ్యానం చేసుకోవడం చాల ముఖ్యం. ఆరు ఋతువులు ఆరు రకాలుగా విచ్చుకోలు, వసంత ఋతువు నుండి శరదృతువు వరకు విచ్చుకుంటుంది, అక్కడ నుండి నెమ్మదిగా చలి కాలం వచ్చేసరికి ఒక్కొక్కటి రాలిపోయి, ఎండిపోయి, చివరికి మోడు బారి, శిశిర ఋతువుకి వచ్చేస్తాము. ఆరు నెలలు ఇట్లాగ, ఆరు నెలలు అట్లాగ. అది పెద్ద చక్రం, అలాగే రోజూ చిన్న చక్రం. మనం లేచిన దగ్గర నుండి ఉదృతంగా చాల సేపు పనులు చేసుకుంటూ వెళ్తాము. కొంత దూరం వెళ్ళేసరికి down అయిపోతాము. కాసేపు మళ్ళీ నిష్క్రమించి, మళ్ళీ బయటకి రావాలి. ఇలా మనం నిష్క్రమిస్తూ ఉంటాము, మళ్లీ తెర మీదకి వస్తూ వుంటాము, అందుకని పోయిందల్లా ఒక ఆశ ఇస్తుందట, వస్తుందని. ఇప్పుడు ఆ చెట్టుకి ఇక వచ్చే నెలలన్నీ మంచివే. ఈ చెట్టు ఇంక ఎన్నో రోజులు మిగులు లేవు మనకు అనుకుంటుంది. ఇహ మనని బతక నీయరు, పీక్కుంటారు వీళ్ళు, ఆ తరువాత మనకి ఏమి పండవు. ఎండిపోతాము, అట్లా ఉంటాము, మళ్ళీ వస్తాము. ఇట్లా cyclical గా, చక్రభ్రమణంగా మొత్తము జరుగుతూ వుంటుంది. ఆ జరిగే దాన్ని గమనించగలగడం తెలియాలి. అందుకని దారుణముతో అపలేదు భీష్ముడు కృష్ణుడు విషయములో. ఇప్పుడు వున్న సంపద అంతా కూడా హరించినట్టుగా, హరుడు వలె గోచరిస్తున్నావు, మళ్ళీ హరి అయి సమస్తాన్ని అందిస్తావు ధర్మరాజుని వాహికగా చేసుకుని అని చెప్పడం అన్న మాట. నువ్వు ఎంత దారుణడివో అంత ద్రవిణప్రదుడవు కూడా. దేనియందు దారుణం? ధర్మగ్లాని యందు దారుణముగా ప్రవర్తిస్తాడు. ధర్మమునందు ద్రవిణప్రదుడుగా ప్రవర్తిస్తాడు. ధర్మాన్ని ఆచరించే వారికి 'ప్రదాత'. అధర్మాన్ని ఆచరించే వాళ్ళకి ఆయన యొక్క దారుణమైన తన రూపాన్ని చూపిస్తాడు, ఎక్కడా concesssion ఇవ్వడు. స్వంత మేనమామ పిల్లల్ని, మేనత్త పిల్లలని కూడా ఆయన ఏమీ spare చేయలేదు. చేశాడా? శిశుపాలుడిని ఏమి చేశాడు? అంత వరకు ఎందుకు? తన స్వంత మేనల్లుడు అభిమన్యుడినీ వదిలేసాడు. మరి ఇవన్నీ ఏమిటో? దేనితో ఎలా ప్రవర్తించాలో ఆ విధంగా ప్రవర్తించడం. పదహారు సంవత్సరాలు మించి వీడు నా లోకం వదిలి ఉండరాదని శివుడు మరీ ఇచ్చి పంపిస్తాడు అభిమన్యుడ్ని. సోమలోకంలోని వాడు. వీళ్ళు ఎదో అడిగారు 'ధర్మానికి ముందు చాల పెద్ద ఉపద్రవం వుంది. ఎవడినో ఒకడిని మాకు పడేయ్' అంటే పంపిస్తాడు 'వీడు పదహారేళ్ళు వుంటాడు, అంతకన్నా ఉండడు ఇష్టమేనా' అంటాడు. ఇష్టమే, అని పట్టుకు వచ్చారు. మరి agreement ప్రకారము వాడు వెళ్లిపోయే time వచ్చింది. వెళ్ళిపోయాడు. మనకి వెళ్ళిపోవడం, రావడం వుంటుంది కానీ, కృష్ణుడి లాంటి తత్త్వంలో వున్న వారికి

వెళ్లడము, రావడము లేదు. అన్ని అక్కడే వున్నాయి ఈ భుజము నుండి ఆ భుజానికి, ఆ భుజము నుండి ఈ భుజానికి మారుతూ వుంటాయి. మనం చూడండి, మూట పట్టుకు నడుస్తున్నాము అనుకోండి, అందులో బంగారు నగలు వున్నాయి అనుకోండి, ఏమి చేస్తారు? కాస్సేపు కుడి భుజము మీద వేళ్ళాడేసుకుంటారు, నెప్పి పుడితే ఎడము భుజం మీదికి మారుస్తారు. మొత్తానికి భుజము దిగదు. బంగారం కదా. అట్లాగే ఈ జీవులు కూడా ఆయనకి బంగారము లాంటి వాళ్ళు. బంగారూ, బంగారూ అంటూ వుంటాం కదా. అందుకని జీవులను కాస్సేపు పొట్టలో పెడుతుంటాడు, కాస్సేపు బయట పెడుతూ వుంటాడు. ఇది మొత్తం కథ. కాబట్టి ఈ కథని మనకి అవగాహన చేయడానికి ఈ నామంలో మనల్ని కాసేపు అలా ఉయ్యాల ఎక్కించారు. కాస్సేపు అట్లా వెళ్ళాం, కాస్సేపు ఇట్లా వచ్చాము, కాసేపు అటు వెళ్ళాము, కాస్సేపు ఇటు వచ్చాం. ఇందులోంచి మనకి తెలియాల్సినది ఏమిటంటే, ఇది ఒక ఉయ్యాల లాగ అటూ ఇటూగా వుంటుంది. అటు ఊపితే, అటు ఆనందిద్దాం, ఇటు ఊపితే ఇటు కూడా అంగీకరిద్దాం. కష్టాలలో ఆనందదిద్దాము అనేది కుదరదు. కష్టము వున్నప్పుడు కూడా ఆనందంగా వుంది, అని ఎవడైనా అంటే వాడికి కొంచెం తేడా పడిందని అర్థం. సమదూరంగా వుండవచ్చు వీటకి. సుఖం వచ్చినప్పుడు ఉబ్బిపోకుండాను, కష్టము వచ్చినపుడు క్రుంగిపోకుండాను వుండాలి తప్ప, కష్టము వచ్చినపుడు నవ్వుతూ వుండలేడు ఎవ్వడూ. శ్రీకృష్ణుడంతటివాడికి పాండవుల కష్టము చూసేసరికి గంభీరమైన వదనం వచ్చింది. నా మొహము ఎప్పుడూ చిరునవ్వుతోనే వుంటుందని చూపించలేదు అప్పుడు. సన్నివేశం గంభీరం కదా. అప్పుడు నవ్వితే ఎట్లా వుంటుంది? సభలో ఇట్లా జరిగింది, అట్లా జరిగింది అని అరణ్యంలోకి వచ్చిన తరువాత, వాళ్ళు ఒక్కొక్కటిగా, ఒకరొకరుగా చెప్తుంటే, నువ్వు చక్కగా నవ్వుతూ కేరింతలు కొడుతూ వింటూ వుంటే ఎట్లా వుంటుందండీ? చాలా గంభీరం అప్పుడు శ్రీకృష్ణుడి వదనం. ఎంత గంభీరం అంటే అసలు ఆశ్చర్య పోయారుట వాళ్ళందరూ. అంత గంభీర వదనం. అట్లాగే భీష్ముడు దేహం వదిలేస్తున్నాడు అంటే గంభీరవదనం. ఎంత గంభీరవదనం అంటే ధర్మరాజుకి భయము వేసింది. సన్నివేశాన్ని బట్టి, కానీ లోపల మాత్రం అన్ని సన్నివేశాలకి తాను దూరంగా వుండి, సమదూరంలో వున్నాడు. అన్నిటిని ఒకే భావంతో తన వంతు పని పూర్తి చేసినవాడు. ఇచ్చినపుడు ఇచ్చాడు, పుచ్చుకున్నపుడు పుచ్చుకున్నాడు. ఇట్లా సృష్టి పరంగా చెప్పుకోవచ్చు, కృష్ణుడి పరంగా చెప్పుకోవచ్చు. మన జీవితములో కూడా అదే జరుగుతూ వుంటుంది. ప్రతి ఉదయం మనకి ద్రవిణప్రదమే. మనకి ముందు ఏమి ఇచ్చాడు అంటే తెలివి ఇచ్చాడు లేవడానికి. లేకపోతే లేవము. పొద్దున్నే తెలివి వచ్చిందా, మనం తెచ్చుకున్నామా? మనం తెచ్చుకోలేదు. అది వస్తే మనం లేచాము. రాలేదు అనుకోండి, ఇహ లేవడం ఏమి లేదు. కాబట్టి తెలివి ఇచ్చాడు. అక్కడ నుండి మనస్సు ఇచ్చాడు. అక్కడ నుండి ఎదో కొంత అవగాహన ఇచ్చాడు. దానితో కొట్టుకుంటూ పోతూ వుంటాము రోజంతా.

సాయంత్రమయితే ఒక్కొక్కటి వెనక్కి తీసుకుంటాడు. లేకపోతే నిద్ర పట్టదు. తిరిగి వాడు లోపలకి వెళ్లకపోతే నీకు నిద్రేమి వస్తుందీ? వస్తుందా? నిద్ర పట్టకపోతే చాలా బాధ పడతాము. నిద్ర పట్టడం లేదని ఇటు పొర్లి అటు పొర్లి, ఎటు పొర్లినా నిద్ర రాదు. అప్పుడు ఏమి చేస్తారండీ? నిద్ర లోంచి బయటకి రావాలన్నా, నిద్ర లోకి వెళ్ళాలన్నా అది 'ఆయన' కృపే. అందుకని దారుణంగా మనని నిద్రలోకి లాగేస్తాడు. మన మంచికే, లేకపోతే అట్లా పడిపోతాం. ఇది అవగాహన అయితే మనకి ద్వంద్వములు దాటి అవతల వుంది సమస్తం అని తెలుస్తుంది. ద్వంద్వములలో వున్నప్పుడు పూర్ణమైన ధర్మం ఎప్పుడూ వుండదు. పూర్ణమైన అధర్మం ఎక్కువ వుండదు. కొంచెం హెచ్చు తగ్గులుగా రెండూ వుంటూనే వుంటాయి ఎప్పుడూ. ఎంత అవతారం దిగి వచ్చినా, ధర్మానికి గ్లాని కొంత తగ్గించి సమతూకంగా పెట్టి వెళ్ళిపోతాడు. అంటే రాళ్ళబరువు ఎక్కువ అయిపోయి, వంకాయలు పైకి వెళ్ళిపోతుంటే వంకాయలు వేస్తాడు. ఎంత వరకు వేస్తాడు వంకాయలు? రాళ్ళు పైకెళ్ళి పోయేంతవరకు వేస్తారా? వెయ్యరు, ఒప్పుకోడు. మహాఅయితే ఓ కాయ ఎక్కువ తూగేటట్టుగా ఒప్పుకుంటాడు. బేరం కుదుర్చుకున్నాడు కాబట్టి ఒక వంకాయో, ఒక కాకరకాయో ఎక్కువ వేస్తాడు. అంతే. ఎప్పుడూ కూడా వంకాయలు వేసిన తక్కెడ పైకి వెళ్ళినప్పుడల్లా వస్తాడండీ. వచ్చి ఏంచేస్తాడు, ఒకటి రెండు వంకాయలు రాళ్ళ కన్నా ఎక్కువ బరువుగా వుండేటట్టుగా చూసి, ఇట్లా ఉండండిరా అని చెప్పి వెళ్ళిపోతాడు. అంతే కానీ పూర్ణంగా అట్లా ధర్మమే వుండి అధర్మం లేకుండా అనే స్థితి లేదు. సృష్టి లోనే రెండూ వుంటాయి. సృష్టి అంటేనే రెండూ వుంటాయి. రెండూ లేకపోతే సృష్టి లేదు. ఆయన లోంచి ఆవిడ వచ్చి వాళ్ళిద్దరు ఆడుకుంటూ వుంటె ఇవన్నీ వచ్చినాయి. ఆవిడ లేదనుకోండి, ఏముంది అక్కడ? వెలుగూ లేదు, చీకటీ లేదు. రెండూ లేవు. నువ్వు లేస్తే కదా నీకు వెలుగు చీకటి, బాగుండడం, బాగుండకపోవడం వుంటాయి. అస్సలు నువ్వు లేవడమే లేదు. నువ్వు లేవడమే ఆవిడ నీ లోంచి లేవడం. ఇహ అక్కడ నుండి నీ ఇష్టం. ఇంత కథ మనకి ఈ నామంలో కనిపిస్తుంది. దీని గురించి చాల ఉపమానాలు చెప్పుకున్నాం. ఊరికినే గుర్తు చేస్తున్నాను అంతే. కాబట్టి సమస్తాన్ని అందిస్తాడు. అందిస్తాడు అనేది గుర్తు వున్నపుడు మళ్ళీ పట్టుకెళ్లిపోవచ్చు. వాటినైనా పట్టుకెళ్లిపోవచ్చు, అవి అక్కడ వుంచి మనల్ని పట్టికెళ్ళి పోవచ్చు. మనకి ఈ ఇల్లు శాశ్వతము కాదని, ఎవరో వేదాంతి చెప్తే, అది నిజమే అనుకుంటాము. అది మన కన్నా శాశ్వతం. మనకి శాశ్వతం కాదు, అంతే. It stays more than one life. ఈ చెట్టు వుంది, ఈ చెట్టు శాశ్వతం కాదండీ, ఈ ఇల్లు శాశ్వతం కాదండీ అని ఇట్లా చెప్తుంటారు. అవి శాశ్వతమే, మనకి అవునా కాదా అన్న point తప్ప. అట్లా అన్నింటిలో కూడా, వున్నవి వుంటాయి. మనమన్నా వుంటాం. మనం వుండడం, లేకపోవడం గా వుంటుంది. వుండడం, లేకపోవడం అనేది రోజూ చూస్తూనే వున్నాం. ఈ రెండింటికీ మించి వుండడంగా వుండడానికి, ప్రయత్నం 'ఆత్మసాధన'. ఎక్కడ నుండి ఈ చైతన్యం మేల్కాంచుతుందో, ఎక్కడకి మళ్ళీ ఈ చైతన్యం

ముకుళించుకు వెళ్ళిపోతోందో, దీన్ని కుంభరాశి మార్గము అని చెప్పారు. లేక మార్కండేయ మార్గముఅని చెప్పారు. అదే మనకి వైష్ణవులు పెట్టుకునే నిలువు గీత, భ్రూమధ్యము నుండి పైకి. అది తెలిసిన వాళ్ళకి ఈ రావడం, పోవడం అన్నీ తెలుస్తూ వుంటాయి. అక్కడ కూర్చున్నావనుకో, అప్పుడు ఇది అంటదు. అంటక పోవడమే తప్ప, ఆడుకోకపోవడం వుండదు. ఆడుకోకపోతే ఆనందము లేదు. కానీ అంటకుండ ఆడుకోవాలి. Gloves వేసుకొని ఆడుకోవాలి. అట్లా gloves వేసి ఆడుకునే వాడికి అంత తాకిడి వుండదు. అది మనకి సాధనగా జరగాలంటె ఈ రెండింటికి అవతల 'అంతర్యామి' అనే వాడు ఒకడు వున్నాడు. అంతర్యామి అంటే వెండితెర లాంటి వాడు. ఆ వెండితెర మీద హత్యలు జరుగుతూ వుంటాయి, పెళ్ళిళ్ళు జరుగుతూ వుంటాయి, చెంపకాయలు పగులగొడుతూ వుంటారు, ముద్దులు పెట్టుకుంటూ వుంటారు. అన్ని అక్కడే జరుగుతాయి. తెరకి ఏమీ అంటవు. తెర స్థితి ఒకటి వుంది. అది మనం పొందాలంటే ఒక్కటే భావం చేయాలి. ఈ భావం చేయడం కష్టం అని ఇవాళే ఒకరు అంటే విన్నాను. అంత కష్టం కాదు అని నాకు భావన. ఎప్పుడు కష్టం కాదు అంటే, లేవంగానే నిన్ను నువ్వు నిర్వచించుకుంటే కష్టం. నేను 'ఇది' అని అనే నిర్వచనం నీ గురించి నువ్వు చేసుకున్నావనుకో, అలా అనుకోవడం వలన నీకు అన్నీ కష్టాలే వుంటాయి. ఎందుకంటే you have taken to a position. ఎప్పుడైతే ఒక position నువ్వు తీసుకున్నావో అక్కడ నుండి ఇహ నీకు ఒక view వుంటుంది. Position తీసుకోకపోతే vision వుంటుంది. Position తీసుకోవడం అంటే నిన్ను నువ్వు నిర్వచించుకోవడం. ఏమని నిర్వచించుకుంటావు? అది నీకే వదిలేస్తున్నాను. నువ్వు నిజానికి ఏ నిర్వచనం నీ గురించి నువ్వు చేసుకున్నా అది అబద్ధమే! It can be a temporarory truth, తాత్కాలిక సత్యం. లేవంగానే 'నేను మనిషిని' అని అనుకుంటున్నావు. నువ్వు అనుకోవడమేగా మనిషినని. మనిషివని ఎవరైనా చెప్పారా నీకు? మనిషి తనను తాను మనిషినని అనుకొనడం మొదలు పెట్టేడటండీ. ఇంకెవరైనా చెప్పారా తను మనిషిని అని ఇంకొకరు ఎవరైనా వచ్చి తనకి చెప్పారా? 'మనిషిని' అని నిర్వచించుకున్నావు. ఎదురుగా ఒకటి పోతుంటుంటే అది జంతువు అని నువ్వు నిర్వచించుకున్నావు. ఎందుకు ఇలా నువ్వు నిర్వచించుకుంటున్నావు అంటే, ఇట్లా నిర్వచించుకోవడం వలన పరస్పరత్వం చేసుకోవలసిన ప్రవర్తనలో ఒక పద్ధతి ఉంటుందని. అంత వరకే. లేవంగానే తల్లిదండ్రులు కనపడంగానే కొడుకుగా నిర్వచించుకుంటావు. పిల్లలు కనబడగానే తండ్రిగా నిర్వచించుకుంటావు. తమ్ముడు కనబడితే అన్నగా నిర్వచించుకుంటావు. అన్నగారు కనబడగానే తమ్ముడుగా నిర్వచించుకుంటావు. ఈలోపల నీ కాళ్ళకి దణ్ణం పెట్టే వాళ్ళు వస్తే నువ్వు ఇంకొకటిగా నిర్వచించుకుంటావు. అలాగే నువ్వు కాళ్ళకి దణ్ణం పెట్టేవాళ్ళు వస్తే నిన్ను శిష్యుడిగా నిర్వచించుకుంటావు. Office కి వెళ్తే Officer గా నిర్వచించుకుంటావు. ఇందులో ఏది నువ్వు? ఇన్ని రకాలుగా ప్రతి రోజూ పిచ్చి పిచ్చిగా

మనని నిర్వచించుకుంటాము కదా. అది పిచ్చి కాదు, ఎందుకంటే అప్పటికి అది సత్యం! నీతో కలసి ప్రయాణం చేసేవాడు వున్నాడనుకోండి, సహవాసి, సహాధ్యాయి. వాళ్ళు కలిసినపుడు ఒకలా వుంటావు. అట్లా ఇంకోళ్ళతో ఉండలేవు కదా. మాస్టర్ గారిది ఒక standard joke 'పెళ్ళాం కనిపిస్తే మొగుడవుతావు కానీ, ఇంకో ఆవిడ కనిపిస్తే మొగుడు అవడానికి వీల్లేదు కదా' అని. తాత్కాలిక సత్యమే కదా భార్య కనపడగానే భర్తగా అయిపోవడం, పిల్లలు కనబడగానే తండ్రిగా అయిపోవడం. అసలు ఇవన్నీ ఏమి కనబడడం లేదనుకో, కళ్ళు మూసుకున్నావు అనుకో, ఏమి అయ్యి వుండాలి నువ్వు? ఇది అని చెప్పండి? వెండి తెర మీద ఏ బొమ్మ పడితే ఆ బొమ్మ కనిపిస్తూ వుంటుంది తాత్కాలికమైన సత్యం, ఏ బొమ్మా పడకపోతే? ఉషా కిరణాలు కనపడ్డాయి అనుకోండి, ఎర్రగా, క్రింద నీళ్లు, పైన కొంచెం సింధూర వర్ణంలో ఆకాశము, అప్పుడు వెండి తెర కనిపించదు. అది వెండి తెర మీద వుందా? వుంది. అంటుకుని వుందా? లేదు. అట్లా నీవు ఒక వెండి తెరవు, నువ్వు మనిషి అనుకుంటే మనిషివి. నిజానికి మనిషి అని కూడా అనుకోవడమే. ఎందుకు అలా అనుకోవాలి? మనం అనుకోవడం ఎందుకు? ఇంకొకళ్ళని అనడం ఎందుకు? ఒక ఋషి ఎట్లా వుంటాడో తెలుసా? మనం దీనిని ఏమంటాం? మామిడి చెట్టు అంటాం. కదా. కానీ ఋషి ఏమంటాడంటే 'మామిడి చెట్టు' అని పిలవబడేది. That which is called a mango tree. That which is called house. That which is called Cow. That which is called Dog. That which is called stone. అంతా 'THAT' ! పిలవబడేది! అంటారు. మాస్టర్ గారి ఉపన్యాసాలు వింటే ఎక్కువ 'అనేటువంటిది' అని వస్తూ వుంటుంది మాటిమాటికి. ఎందుకంటే అలా 'అనేటువంటిది' అనటం అంటే అట్లా అంటున్నాము కానీ, అసలు విషయము 'అదే' అని చెప్పడం. తెలిసిన వాళ్ళు అట్లా మాట్లాడ్తారు. 'నేను పార్వతీకుమార్ని అని అంటే అది శుద్ధ తప్పు. పార్వతీ కుమార్ అని అంటారు నన్ను' అనడం కొంత సత్యం. అంటే, మీరు ఎవరండీ? అంటే, నిజానికి నాకు ఏం తెలియదు, అని చెప్పాలి. భక్తరాజ్ మహారాజ్ గారు ఆ మాట మాటిమాటికి అంటుంటే, మొదట్లో ఏదో హాస్యానికి తీసుకున్నా. తరువాత అందులో పెద్ద మంత్రం కనిపించింది. ఆయన అంటూ వుండేవారు 'పార్వతీ కుమార్! దేవుడు ఎవరో నాకు తెలుసు కాని నేను ఎవరో నాకు తెలియడంలేదు' అని. నవ్వు వస్తుంది మాములుగా! కానీ అది సత్యం! అదే విషయం రమణ మహర్షి చెప్పారు 'నేను ఎవరు అనే ప్రశ్న వేసుకో, సమాధానం చెప్పకోక' అని. నిజానికి సమాధానం లేదు. ఎందుకు లేదు అంటే, నువ్వు ఒక వెండి తెర లాంటి వాడివి. తండ్రివి, కుమారుడివి, మొగుడివి, శత్రువువి మిత్రుడివి ఇలా అనుకోవడం బట్టి ఆ position తీసుకోవడం జరుగుతుంది, ఒకటి. అలా కాకపోయినా మనకి కాలం రూపంలో వచ్చే సన్నివేశాలలో ఒకటి అవుతూ వుంటాము ప్రతి నిత్యం. అప్పటికి అది అవుతాము తప్ప 'అదే కాదని', నువ్వు తెలుసుకోవాలి. నేను 'ఇది' అని

అనుకుంటే అందులో స్థిర పడిపోతాము. అప్పుడు మొత్తం సత్యము లోంచి బయటకి వచ్చేస్తాము. నేను 'గురువు' ని అని అనుకున్నాడు అనుకోండి ఎవరైనా. వాడికి వాడు గురువు కాదు. ఇంకోళ్ళకి వాడు గురువు అవచ్చు, అది వాళ్లకి సంబంధించినది, వీడికి అస్సలు సంబంధించినది కాదు. అట్లాగే ప్రతి విషయం మనని మనం నిర్వచించుకుంటాం. నేను భక్తుడ్ని, నేను శిష్యుడ్ని, నేను లోకహితుడ్ని, నేను సాధకుడ్ని, నేను చాలా సేవ చేస్తున్నాను, నేను చాల మంచి వాడిని. ఇవన్నీ అనుకోవడమే. నువ్వు మంచి వాడవని ప్రపంచం అంటోందా? నువ్వు లేకుండా సభ పెట్టుకుంటే తెలుస్తుంది నీ గురించి. నేను చెడ్డ వాడిని, అది కుడా అనుకోవడమే. భావంలో వుంది అంతా. నువ్వు ఏది ఇందులో? ఒకడికి శత్రువు అయినవాడు అందరికీ శత్రువేనటండీ? రావణాసురుడు అందరికీ చెడ్డవాడా? కాదు. కుంభకర్ణుడికి కాదు, రావణాసురుడి వాళ్ళ ఆవిడకి కాదు, పిల్లలకి కాదు, ఇంద్రజిత్ కి కాదు. అదేవిటీ? వాళ్లకి కాకపోవడం, మనందరికీ అవడం? అంటే, అసలు వస్తువు దగ్గరకి వెళ్తే ఏమి జరుగుతుంది అంటే మిగతావి అన్నీ కూడ దాంట్లో నుండి వ్యక్తం అయిన గుణాలుగా గోచరించినపుడు, 'గుణాతీతము' అయిన ప్రజ్ఞగా మనము వున్నప్పుడు, మనకిక నిర్వచనం లేదు. It is undifinable, it is undescribable, it is unspeakable, it is unqualified. అప్రతర్క్యం, అవిజ్ఞేయం. అది నిన్ను నువ్వు ఎట్లా నిర్వచించుకుంటే అట్లా అయిపోతావు అంతే. ఇట్లా నిర్వచించుబోక. తెలుగు వాడివి అనుకుంటే తెలుగు వాడివి. తెలుగు వాడు ఏమిటి? ఏమిటి వుంది నీలో నువ్వు తెలుగు వాడిగా ప్రత్యేకంగా ఇంకోడిలో లేనిదీ, నీలో వున్నదీ? తెలుగు భాష తప్ప. వాడూ తింటున్నాడు, నువ్వూ తింటున్నావు, వాడూ తిడుతున్నాడు, నువ్వూ తిడుతున్నావు. వాడూ తిరుగుతున్నాడు, నువ్వూ తిరుగుతున్నావు. శుద్ధ చైతన్యంగా నువ్వు ఏదీ కాదు. అక్కడ నుండి ఒక projection గా వచ్చింది, అట్లా వుంటావు, అందులోకి వెళ్ళిపోతూంటావు, అందులోంచి వస్తూంటావు. వచ్చిన తరువాత నీ మీద పడే బొమ్మలు నువ్వు అనుకుంటే ఎట్లా? ప్రణాళికలన్నీ రకరకాల బొమ్మలు. దివ్య ప్రణాళిక పెద్ద బొమ్మ, అందులో మళ్ళీ మన ప్రణాళిక బొమ్మలు. అసలే బొమ్మరా, మళ్ళా బొమ్మలో బొమ్మ ఏమిటే? కథలో పిట్టకథ లాగ వుంటుంది మన కథ. కాబట్టి పిట్ట కథ లోంచి అసలు కథలోకి, అసలు కథ లోంచి అంతకు వెనకాతల వుండే అసలు తెర మీదకి వెళ్ళిపోయాం అనుకోండి, వాడు తత్త్వం తెలిసిన వాడు అవుతాడు. తత్త్వం తెలిసిన వాడికి పట్టు విడుపులు వుంటాయి. రాగ ద్వేషాలు వుండవు. ఈర్ష్య అసూయలు వుండవు. మదం అస్సలు వుండదు. మాత్సర్యం వుండదు. క్రోధం, కామం వుండదు. ఏవిటి వుంటాయి? అవి ఉన్న వాళ్ళని చూసి, వీళ్ళందరితో సర్దుకుని, వీళ్ళందరి మధ్య జీవిస్తూ వుంటాడు. అందరితోనూ సర్దుకొని జీవించడమే వాడి పని. ఎట్లా జీవిస్తాడు అంటే, ముందు రాంగానే, తను వెండి తెరే కదా అసలు, వెండి తెర మీద ఏమి ఏమి బొమ్మలు వేసుకు వచ్చాశారో ఈయనకి

కనబడిపోతుంది. నల్లగా చార పెట్టుకు వచ్చేస్తుంటారు ఒక్కొక్కడు. లేకపోతే ఎర్రగా ఇంకో చార పెట్టుకు వస్తాడు ఇంకోడు. అంటే కోపం, ద్వేషం. లేకపోతే ఇంకోటి. ఇవన్నీ రంగులు రంగులుగా పూసుకు వస్తారు హోలీ అల్లే. రోజూ హోలీ లాగే వుంటుంది అతడికి, ఇవన్నీ వేసుకు వచ్చాడు పాపం అని, అసలు వెండి తెరతో అనుసంధానం చెంది, 'కానీ చెప్పు' అంటాడు. మహాత్ముడు దగ్గరకి మనం వెళ్తే, ఆయన ఏమి చేస్తాడంటే తాను వెండి తెరగా మిగిలిపోయి, వచ్చిన వారి రంగులు అన్ని చూస్తూ ఆనందిస్తూ వుంటాడు, ఓహో! ఏమి వైభవం అని. వాడిలో వుండే వెండి తెరతో అనుసంధానం చెందుతాడు. చెంది, పులివేషగాడి లాగా వచ్చిన వాడికి వాడి రంగులయొక్క బలం తగ్గించి పంపిస్తాడు కొంతవరకు. 'ఏమిటోనండీ, మీ దగ్గరికి వస్తే కాస్త హాయిగా వుంది' అంటాడు. ఏమీ లేదు, మరీ భయంకరంగా పూసుకున్న రంగు కాస్త తగ్గి, వాడి మొహం వాడికి కనిపించేటట్టుగా తయారు చేసి పంపిస్తాడు. వాడి మొహం, వాడికి, ఇట్లా వుంటుంది కాబోలు తన మొహం అని తెలిసేట్టుగా తయారు చేసి పంపిస్తాడు. ఈ Subjective, Objective Worlds అంటే, అంతర్గత లోకములు, బహిర్గత లోకములు. రెండు లోకాలని అధిష్టించి వున్న ప్రజ్ఞలు. అంతర్గత లోకాలలో ఏవో అవి కనిపించినాయ్, ఇవి కనిపించినాయ్, పిడుగులు కనిపిస్తూ వుంటాయి, బంగారు రంగులు కనిపిస్తాయి, ఇంకా రంగులు కనిపిస్తాయి, ఏవో అద్భుతమైన శరీరాలు కనిపిస్తూ వుంటాయి. వాళ్ళందరు తేలుతున్నట్లు, పరుగెత్తినట్లు, మనని పరిగెత్తిస్తున్నట్లు. ఇవన్ని కూడా మాములుగా ఈ లోకంలో ఎట్లా పరుగెడుతున్నామో అవీ అంతే. ఇది material world అయితే, అది Phenomenal world. భావమయ ప్రపంచము అది. అక్కడ నుండి nominal. కశ్యప స్థితి. ఏమి చేశాడు? అదితి, దితి ఇద్దరు ఉన్నారు కదా. He is equally husband to both of them. ఇద్దరికీ మొగుడే, అంటే బహిర్గత లోకాలకి, అంతర్గత లోకాలకి స్వామిత్వం వహించి వున్నాడన్నమాట. ఇడా, పింగళా అంటే కాదు సుషుమ్న అని అనాలి. అమ్మా నాన్నా అంటే కాదు, ఇద్దరూ. ఆకాశము కావాలా, భూమి కావాలా? ఆకాశము కావాలి అంటే, 'ముందు శరీరం ఇచ్చేసేయ్' అని అన్నారు అనుకోండి, 'అమ్మో' అంటాము. కాబట్టి, ఈ విధంగా సమస్తము లోకి మనం ప్రవేశించి, అది రావాలంటే కోరడం, negative గా వుండడం కోరడం, వద్దు అనడం negative desire. నాకు ఇవి వద్దు అంటాం చూడండి, నాకు కష్టాలు వద్దు. అది కోరికే. నాకు సుఖాలు కావాలి, అదీ కోరికే. వద్దు అంటే negative కోరిక. కావాలి అంటే positive కోరిక. రెండూ దులిపేశావు అనుకో, అది వస్తే దానితో వుంటావు, ఇది వస్తే దీనితో వుంటావు. ఏదైనా కాలం ఇచ్చి, పట్టుకు పోయేదే. ఒక దానితో ముడి వేసుకుంటాను అంటే, దాని పక్కనే ఇంకోటి వుంటుంది ముల్లల్లే! అందుకే రెండింటిని దాటి జీవించడానికి చేసే ప్రయత్నం 'యోగ స్థితి'. అందుకనే యోగికి భక్తి యోగంలో చెప్పిన నలభైరెండు గుణాలు సాధ్యపడతాయి. అతడు వెండి తెరగా వుంటాడు. ఆ రోజు, ఆ

కాలంలో, ఆ సన్నివేశంలో తన పాత్ర పోషణ చక్కగా చేసుకుంటూ వుంటాడు అంతే. రంగస్థలం లాంటిది అని చెప్తూ వుంటారు కదా. రంగస్థలంలో నటుడికి వాడిదైన సంభాషణ కొంత వుంటుంది. అంతవరకే. ఎక్కువ మాట్లాడ కూడదు, పిలిచేస్తారు వెనక్కి. ఇక చాల్లే రా, ఇక చాల్లేరా అని పిలవరూ ఎక్కువ మాట్లాడితే. అసలు మాట్లాడ లేదు అనుకోండి prompting వుంటుంది. వేషము వుంటుంది. అందుకనే నాటకం వేసిన వాడికి ఆధ్యాత్మిక చింతన రావడానికి ఎక్కువ అవకాశము వుంది. ఎందుకంటే వాడు అది కాదని వాడికి తెలిసి వాడు అట్లా నటిస్తున్నాడు అక్కడ. ఇది కూడా అంతే. ఇది తను కాదు, కానీ అట్లా నటించాలి అప్పుడు. తండ్రిగా నటించాలి కొడుకు కనబడంగానే. ఇంకొకడు కనబడి తండ్రిగా నటిస్తే ఊరుకోరు, వేషము మార్చుకోవాలి వెంటనే. కేవలం భావం చేత ఇక్కడ వేషం మారిపోతుందండి. చిన్నతనంలో మాకు కొమ్మూరు సాంబశివరావు నవలలు చదివే వాళ్ళము, detective నవలలు అవి. అందులో detective యుగంధర్ కి Chrysler అనే కారు వుంటుంది. ఆ కారు సమయాన్ని బట్టి రంగులు మార్చేసుకుంటుంది. Numbers మార్చేసుకుంటుంది. రూపము మార్చేసుకుంటుంది. అదేంటది? మనమే. సమయాన్ని బట్టి మార్చేయమా? మార్చేసినప్పుడు ప్రతీది వేషమే కదా. నటుడికి తెలుస్తుంది ఇది వేషమని. నటనలో చాతుర్యం ఏమిటి? తానూ అందులో లీనం అయిపోవడం కాదు చాతుర్యం. నటనా చాతుర్యం అంటే, లీనం అయిపోయి అట్లాగే నువ్వు అయిపోయి చేస్తే గొప్పేముంది. అది కాదు అని తెలిసి, అది అందరికి రక్తి కట్టించేటట్టుగా మిగతా వాళ్లకి తాను నటించి చూపిస్తాడు. ఎవడిని చూస్తే వాడు నాగేశ్వర్ రావు, రామారావు అనే తెలుస్తుంది తప్ప, వాడు వేసిన పాత్ర పోషణ తెలియక పోవడం అనేది జరిగేది. కానీ పాత్ర పోషణ ఎట్లా ఉండాలంటే, 'విప్రనారాయణే' ఇతడు అని అనిపించాలి. నాగేశ్వరావు కనిపించకూడదు. 'రాముడే' ఇతడు, రామారావు కనబడకూడదు. అట్లా ప్రేక్షకులను రక్తి కట్టిస్తూ, 'నేను రాముడ్ని కాను, నేను రామారావుని' అని, 'నేను విప్రనారాయణ అని కాదు నేను ఉత్తి నాగేశ్వర్రావుని' అని తెలిసి వుండాలి. లేకపోతే రంగంలోంచి దిగి వచ్చిన తర్వాత రాముడిగా, విప్రనారాయణుడిగా ప్రవర్తిస్తే ప్రపంచము ఒప్పుకోదు కదా. అట్లా మనం కూడా ప్రతీది అప్పటికి అక్కడ రక్తికట్టించేటట్టుగా నటించాలి. వాడూ నటుడు. 'నర్తకుని భంగి పెక్కగు మూర్తులతో ఎవ్వడాడు' వాడి నటన ఎంత నటన అంటే మనం మర్చిపోయాం, వాడికి గుర్తు వుంటుంది. ఎటువంటి నటన అంటే మునులు, దివిజులు కూడా కీర్తించ లేరట. మనం కూడా చేసేది అదే. కాకపోతే మనం లీనం అయిపోతాము నాటకంలో. లీనం కాకపోతే రక్తి కట్టదా? కడుతుంది. అందులో ఇంకొక రకమైన రక్తి వుంటుంది. అది అంటని ఆనందం. అంటుతూ కూడిన ఆనందం అవ్వంగానే మళ్ళీ దుఃఖం వుంటుంది. ఆ విధంగా జీవించడానికి చేసే ప్రయత్నంలో మనం వున్నట్లు అయితే ద్వంద్వాలుగా వస్తున్న ఈ నామాలు మనకి చక్కని అవగాహన ఇస్తాయి. ఎంతసేపూ

మనకి రుచి రుచిగా వుండేవే చెప్పకుని, చేదు చేదుగా వున్నవి వదిలేస్తే మనం పూర్తిగా చెప్పకున్న వాళ్ళం కాదు. అందుకనే ఒక రాముడి జీవితం చూసినా, హరిశ్చంద్రుడి జీవితము చూసినా, ధర్మరాజు జీవితము చూసినా, సత్ సాధకుడి జీవితము చూసినా, ఏ మహానుభావుడి జీవితము చూసినా రెండూ వుంటాయి. అది వుండి ఇది లేక, ఇది వుండి అది లేక వుండదు. ఏదో గురువుగారు కాళ్ళు పట్టేసుకుంటే మనకి అక్కరలేనివి అనుభవించకుండా, కావలసినవి మాత్రమే అనుభవించుకుంటూ, అట్లా హాయిగా ముందుకు సాగిపోవచ్చు అనుకుంటాము. అట్లా వుండదు. సద్గురువు ఏమి చేస్తాడంటే అవగాహన ఇస్తాడు. రెండూ వుంటాయి 'పుచ్చుకుంటావా, వద్దా' అని, 'వద్దు' అంటే, 'ఇప్పుడు వద్దు, మళ్ళా రా' అని అంటాడు. పుచ్చుకుంటాను అంటే సంసిద్ధుడిని చేస్తాడు పుచ్చుకోవడానికి. పుచ్చుకోవడానికి సంసిద్ధుడ్ని చేయడమే తప్ప, నీకు కావలసినవి మాత్రమే పొంది, నీకు అక్కరలేనివి ఆయనని అడ్డేసి దాటేయడానికి కాదు. ఆ సంసిద్ధత, ఆ ధీరత, ఆ స్థిత ప్రజ్ఞత్వం లభించడానికి అసలు వున్నది ఎట్లా వున్నదో, దాని యొక్క తత్త్వము ఎట్లా వున్నదో, సృష్టిలో అది ఎట్లా వుంటుందో, అది నీ వరకు ఎట్లా పని చేస్తుందో, నువ్వు ఎట్లా వుంటే ఇవన్నీ నిన్ను అంత ఇబ్బంది పెట్టకుండా వుంటాయో, ఇది తెలియ చెప్పడం గా వుంటుంది. Only positives, no negatives అంటే there is no right. ఇది దీనియొక్క ఒక ముఖ్యమైన భావన. మన వాఙ్మయములో ఈ భావన చాల ఎక్కువ గోచరిస్తుంది. మనం రెండింటినీ చూడాలి. తెనాలి రామకృష్ణని 'ఇది పుచ్చుకుంటావా? అది పుచ్చుకుంటావా?' అంటే, 'రెండూ ఇచ్చెయ్యమ్మా!' అని చెప్తాడు. రెండూ అందుకొనే స్థిరత్వం మనకి లభించాలని మనం దైవ ప్రార్థన చేద్దాం.

## 593, 594 దివిస్పృక్, సర్వదృక్

దివిస్పృక్ అంటే వెలుగులోకాల వరకు సమస్తాన్ని స్పృశించే వాడని అర్థం. అంటే తన నుండి దివ్యమైన లోకములు, స్థూలమైన పదార్థమైన భూమి, ఏడు లోకములు, అంతకన్నా చీకటిగా ఉండే పాతాళ లోకములు, ఇన్నిటి యందు తాను ఉండి, సమస్తమును స్పృశించి ఉన్నాడు అని చెప్పే నామం. మనకి మొత్తం లోకాలను మూడు రకాలుగా విభజించి చూపిస్తారు. అంటే మన అవగాహనకే విభజన. ఇల్లు ఒకటే అయినా గుమ్మం ఆధారంగా ఇది వంటిల్లు, ఇది పడకగది, ఇది భోజనాల గది ఇట్లా మనం ఒకే ఇంటిని పై విధంగా మన యొక్క వ్యవహారం కోసం ఎలా అమరిక చేసుకుంటామో, అలాగే సృష్టిలో కూడా సూక్ష్మం నుండి స్థూలానికి పొరలు పొరలుగా దిగి వస్తున్న సృష్టిలో ఈ రకమైన అమరికను మనం గమనించినట్లయితే, సమస్తమును దివ్యమైన లోకములుగా ఒక విభాగం, భూమి లోకములుగా ఒక విభాగం, చీకటి లోకములుగా ఒక విభాగం, మూడు విభాగాలు మనకుంటాయి. చీకటి లోకాలన్నీ పాతాళ లోకములని చెప్తారు. భూమి లోపల ఉంటాయి అవి. స్థూలమైన పదార్థము లోపల ఉండే లోకాలన్నీ స్థూలమైన లోకాలు. మన మూలాధారము నుండి పాదాల వరకు ఉండే లోకాలన్నీ కూడా పాతాళ లోకాలు. మూలాధారం నుండి మణిపూరకం వరకు ఉండేవన్నీ కూడా స్థూలమైన లోకాలు. హృదయం నుండి శిరస్సు వరకు ఉండే లోకాలన్నీ దివ్యమైన లోకములు. దివి అంటే వెలుగు అని అర్థం. దివ్యమైన లోకములు అంటే వెలుగుతో నిండిన లోకములు. అంటే మిగతా లోకాల్లో వెలుగు లేదా? అంటే ఇక్కడ వెలుగు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అది భూమి లోకములలోకి వచ్చేసరికి అంత ప్రస్ఫుటంగా కనిపించదు, పదార్థం ఎక్కువ కనిపిస్తుంది. పాతాళలోకములలో మరీ తక్కువగా కనిపిస్తుంది. ఇట్లా మూడు లోకాల్లోనూ, మూడు విధాల భాగాలుగా విభజించిన 14 లోకాలున్నాయి. వీటిలో పాతాళ లోకం నుండి ఆ చివర వరకు సమస్తమైన లోకములను తాను స్పృశించి ఉన్నాడు. ఇటువంటి భావన మనకి ఈ నామంలో కనిపిస్తుంది. సృష్టి మొత్తము భగవత్తత్త్వం లేని చోటు అంటూ ఏమీ ఉండదు. మన శరీరంలో పాదం దగ్గర నుండి శిరస్సు వరకు మనం ఉండని చోటేమైనా ఉందా? లేదు కదా. అందుకని మానవుని అవగాహన చేసుకుంటే పరిపూర్ణంగా భగవత్తత్త్వాన్ని అవగాహన చేసుకున్న వాళ్ళమవుతాం. ఇది ఋషుల యొక్క సూచన. 'మానవా నిన్ను నీవు తెలుసుకో' అని చెప్పడంలో ఉద్దేశ్యం. ప్రపంచాన్ని తెలుసుకోవాలని ప్రయత్నం చేయక. నీ యందు సమస్త లోకములు ఉన్నాయి. నీ యందు సమస్తమైన దైవశక్తులు, సమస్తమైన అసుర శక్తులు, సమస్తమైన మానవ శక్తులు ఉన్నాయి. నీయందు సమస్తమైన జంతు ప్రవృత్తి, సమస్తమైన వృక్ష ప్రవృత్తి, సమస్త పదార్థమయమైన ప్రవృత్తి ఉన్నది. నీయందు పాతాళ లోకములు,

స్థూలమైన లోకములు, దివ్య లోకములు కూడా ఉన్నాయి. సమస్తం నీలో ఉన్నాయి. నువ్వు మొత్తం వ్యాపించి ఉన్నావు, తల నుండి పాదం వరకు. ఆ వ్యాపనం చేత, పాఠాలు చెప్పకుంటుంటే కాళ్ళకి చీమలు కుడితే తెలుస్తుంది కదా. ఏదో పాకుతూ ఉంటే తెలుస్తుంది. కాళ్ళ నుండి తల వరకు మనమంతా వ్యాపించి ఉండడం చేత, స్పృశించి ఉంటాం. మొద్దుబారిపోయినపుడు ఆ భాగంలో మనం కొంత లేమన్నమాట. ప్రాణప్రవృత్తిగా మొత్తం అంతా వ్యాపించి ఉన్నాము. ప్రాణవంతుడు. ఈ విధంగా సమస్తము వ్యాపించి ఉన్నాడు కాబట్టి భగవంతుడు ఎక్కడ చూస్తే అక్కడ కనిపిస్తాడు. స్మరణ మాత్రం చేత కనిపించే తత్త్వం. ఇక్కడ ఉన్నాడు అక్కడ లేడు అనేం లేదు. 'ఎందెందు వెదకి చూచినా అందందే కలడు'. ఎందెందు చూచినా కాదు. ఎందెందు వెదకి చూచినా. వెతికే బుద్ధి ఉండాలి. ఇక్కడ లేడా? ఉన్నాడు. అక్కడ లేడా? ఉన్నాడు. ఇక్కడ ఉండి, అక్కడ ఉండి అక్కడికెందుకు పరిగెత్తాలి? అది తెలిసినవాడు ఇంక పరిగెత్తడం మానేస్తాడు. తెలియనివాడు పరిగెత్తుతూ ఉంటాడు. తన యందు దర్శనం జరిగేంతవరకు ఇవి తప్పవు. ఎందుకంటే ఈ ఆరాటం చేత మన యందు ఉండే ఆ తత్త్వాన్ని మనం స్పృశించే అవకాశం ఉంటుంది కాబట్టి ఇవన్నీ ఆరోహణ క్రమంలో భాగంగా జరుగుతూ ఉంటాయి. అందుకనే బలిచక్రవర్తిని 'సుతలము' అనే లోకంలోకి తొక్కి వేసినా కూడా, అక్కడ కూడా నీవే ఉన్నావు కదా అని అంగీకరించి అక్కడ ఉండిపోయాడు. దివ్య లోకాల్లోనే ఉండాలి అనుకోరు తెలిసిన వాళ్ళు. ఎందుకంటే సమస్తము దైవముచే నిర్మింపబడినది. దైవము ఆధారంగా నిలబడి ఉన్నది. తాను ఎక్కడ ఉంటే అక్కడే దైవముతో సాన్నిధ్యము పొంది ఉండవచ్చు. అందరూ అందలం మీదే కూర్చోనక్కర్లేదు. అందలం మీద కూర్చున్న వాడు పడడానికి అవకాశమున్నది. నేల మీద కూర్చున్న వాడికి పడడానికి అవకాశం లేదు. ఇంద్రుడు పైకెక్కినప్పుడల్లా పడ్డాడు. ఇంద్రుడి లాగా పైన ఉందామని ప్రయత్నం చేసి పైకి వెళ్ళిన వాళ్ళంతా పడ్డారు కదా. అందుకని పడకుండా ఉండే పరిస్థితి పెట్టుకోవచ్చు కదా. అందుకని ఎత్తులు పెరగడం కాకుండా, లోతులు పెంచుకోమని చెప్తారు. సాధన మార్గంలో కావలసింది ఏంటయ్యా అంటే మనం బయటికి పరుచుకుపోవడం కాదు. లోపలికి చొచ్చుకు పోవడం ఉండాలి. ఎంతమందిని మనం ఈ విధంగా కమ్ముకున్నాం అనేది లౌకికం. ఎంత లోతుల్లోకి మనం వెళ్ళాం? ఎంత లోతుల్లోకి వెళ్ళాలంటే ఉల్లిపాయ పొరల్లాగా ఈ అన్నమయము, ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయము, ఆనందమయము ఆపైన ఆది, అనుపాదక లోకములలోకి కూడా మనం వెళ్ళవచ్చు. అంటే జీవుడుగా ఆనందమయ లోకం నుండి జీవలోకంలోకి ప్రవేశించవచ్చు. జీవుడుగా తానెట్లా ఉన్నాడు? అక్కడ నుండి దైవముగా తానెట్లా ఉన్నాడు? దైవమే జీవుడుగా దిగి వచ్చినట్టు, అక్కడ నుండి ఆనందమయ లోకము, అక్కడ నుండి విజ్ఞానమయ లోకము, అక్కడ నుండి మనోమయము, ప్రాణమయము, అన్నమయము ఇట్లా విచ్చుకొస్తున్నప్పుడు అన్ని

లోకాల్లోనూ జీవించాలి కదా. అన్ని లోకాల్లోనూ జీవించగలగడానికి మానవుడికొక్కడికే ఎక్కువ సాధ్యం. దేవలోకంలో ఉండే వాళ్ళు పాతాళ లోకంలోకి వెళ్ళలేరు. పాతాళ లోకంలో ఉండే వాళ్ళు దేవలోకంలోకి వెళ్ళలేరు. మానవుడు అటూ వెళ్ళగలడు, ఇటూ వెళ్ళగలడు. అర్జునుడు ఇంద్రుడి దగ్గరికి వెళ్ళి ఆయన సింహాసనం మీద ఐదు సంవత్సరాలు ఆయనతో పాటు కూర్చొని కులాసాగా గడిపేసాడు. అరణ్యవాసం 12 ఏళ్ళలో ఐదు ఏళ్ళు అర్జునుడు మిగతా వాళ్ళతో ఉండడు. హాయిగా ఇంద్రుడితో ఆయన కుర్చీలో సగం ఈయనక్కూడా ఇస్తే, కూర్చుని ఆనందిస్తాడు. అలాగే పాతాళ లోకాల్లోకి కూడా వెళ్ళాడు అర్జునుడు. పూర్ణమైన మానవుడు అటూ ఇటూ కూడా వెళ్ళగలడు. ఎందుకు వెళ్ళగలడంటే, అది మానవుడు పూర్ణ ప్రజ్ఞగా, భగవంతుని ప్రజ్ఞగా నిర్మాణం చేయబడి ఉన్నాడు కాబట్టి. వాడియందే ఉన్నాయి అవన్నీ. ఉదరవితానం దాటి కిందకి వెళితే అదంతా భూలోకాల్లోకి వెళ్తాం. జననేంద్రియాలు దాటి ఇంకా కిందకి వెళితే పాతాళ లోకాలలోనికి వెళ్తాం. ఈ ఉదరవితానం పైన ఉంటే దివ్యలోకాల్లో జీవిస్తూంటాము. ఏది ఏమైనప్పటికీ అన్ని లోకాల్లోనూ మనం చైతన్యం కలిగి ఉండవచ్చు. భగవంతుడు కూడా ఆ విధంగానే చైతన్యవంతుడై ఉన్నాడు. విజ్ఞానమయ లోకము, ఆనందమయ లోకము, జీవ లోకము, దైవ లోకము, ఇంతవరకు సాధారణ మానవుడికి ఆ గదులు తెరుచుకోలేదు. మానవుడికి మొత్తం ఏడంతస్తుల భవనం ఇస్తే, ఆ నాలుగు అంతస్తులు వదిలేసి, మనస్సు, ఇంద్రియములు, శరీరము వీటికి సంబంధించిన మూడంతస్తు లలోనే ఎక్కువ జీవిస్తూంటాడు. దైవము సమస్తమునందూ జీవిస్తూ ఉంటాడు. నాస్తికుల యందు కూడా జీవిస్తూ ఉంటాడు. నమ్మని వారి యందు ఉండక, నమ్మిన వారి యందు ఉండే తత్త్వం దైవానికి లేదు. మనకుంటుంది. ఇష్టమైన వాళ్ళతో కలిసి తిరుగుతాం, ఇష్టం లేని వాళ్ళొస్తే మొహం అట్లా తిప్పేసుకుంటూంటాం. ఇటువంటివన్నీ మనకి జరుగుతూ ఉంటాయి. కానీ ఇష్టం లేనివారి రూపంలో కూడా మనం ఎంత వద్దనుకున్నా దేవుడున్నాడు. సమస్తమునందూ ఉండే దేవుణ్ణి ఆ విధంగా దర్శనం చేసిన ఋషులు కూడా ఏడు లోకముల యందూ జీవిస్తూ ఉంటారు. కాసేపు దైవ లోకంలో, కాసేపు భూలోకంలో, కాసేపు పాతాళ లోకంలో, ఇలా తిరిగి వస్తూండే వాడినే నారదుడిగా పేర్కొన్నారు. ఊర్ధ్వలోకములలోకి, అధోలోకములలోకి, చక్కగా ప్రవేశించగలిగిన వాడు, ఈ ప్రవేశం యొక్క జ్ఞానమును మనందరికీ ప్రదానము చేసే వాడు, గురువులందరికీ గురువు, 60 సూర్య మండలములకు గురువు నారదుడు. ఏదో మనకి సినిమాల్లో చూపించినట్లుగా ఉండడు. 'జగద్గురో నమస్తుభ్యం' అని మనం పాడుతున్నది ఈ భూమికి సంబంధించిన గురువు గురించి. ఈ భూమి లాగా ఇంకా గోళాలన్నీ కలిపితే ఒక సౌరమండలం ఉంది. ఈ సౌర మండలంలో మిగతా గోళాలన్నీ కూడా మన గోళం కన్నా ఎక్కువ స్ఫూర్తి కలిగినవే. మనదన్నింటికన్నా బాగా స్థూలమైనది. ఇంతకన్నా తక్కువ స్థూలమైనవి మిగతావన్నీ. కుజుడు గానీ, శుక్రుడు

గానీ, బుధుడు గానీ, బృహస్పతి గానీ ఇంతకన్నా చాలా సూక్ష్మమైనవి. సూర్యుడు మరీ సూక్ష్మమైనవాడు. అంటే మనం అన్ని లోకాల్లోకి పెరిగి వెళ్ళడానికి అవకాశం ఉన్నది. అక్కడి నుండి సూర్యుడి దగ్గరికి వెళ్తే, ఇటువంటి సూర్యులు 12 మంది ఒక గుంపుగా, ఒక సౌర మండలం ఉంది. ఈ 12 మంది గుంపుల్లాంటివి ఐదుగురు ఒక జట్టుగా ఉన్నారు. మొత్తం అట్లా 60 మంది సూర్యులు, వాళ్ల కుటుంబాలు, 60 సౌర కుటుంబాలకి గురువు నారద మహర్షి. అదే మనకి ఇవ్వబడిన 60 సంవత్సరాలూనూ. ఈ 60 సౌర కుటుంబాలకి, సంబంధించిన తత్త్వం పనిచేస్తూ ఉంటుంది. ఈ 60 భాగాలకి సంబంధించిన సమస్తమైన జీవులకి జ్ఞాన ప్రదాత నారదుడు. ఆయన నారాయణుని దగ్గర నుండి పాతాళ లోకాలలోకి, పాతాళ లోకాల నుండి నారాయణుని దగ్గరికి ఇట్లా వెళ్తాడని చెప్తారు. ఈ విధంగా సమస్తమునందూ వ్యాపించి ఉండడమే కాకుండా, సమస్తమునూ దర్శిస్తూ ఉంటాడు. ఋషులు ఆ విధంగా ఉంటారు. సమస్తమునందూ వ్యాపించి ఉండడం, సమస్తమునూ దర్శించి ఉండడం. సమస్తమునందూ ఉండే ఒకే ఒక ప్రజ్ఞను అవగాహన చేసుకుంటూ, దానియందు తాము జీవిస్తూ, తద్వారా సమస్తమునూ దర్శించే వాళ్ళు ఋషులు. భగవత్తత్త్వము అన్నిచోట్లా ఉన్నది కాబట్టి, ఈ చోటు ఆ చోటు అని లేకుండా ఎక్కడి నుండైనా చూస్తూనే ఉంటాడు. అందుకని 'సర్వసాక్షి' అని చెప్తారు. సర్వసాక్షి భగవంతుడు కాబట్టి మనం చేసే సమస్త కార్యములూ గమనిస్తూనే ఉంటాడు. మనం బయటికి చేసినవే గమనిస్తున్నాడని కాదు, లోపల చేసే ఆలోచనలు గమనిస్తాడు, లోపల ఉండే కోరికలను గమనిస్తాడు, లోపల ఏర్పరచుకున్న తంత్రములను, కుతంత్రములను గమనిస్తాడు, సమస్తమునూ గమనిస్తూనే ఉంటాడు అని భావన చేసుకుని జీవించే వాడు నెమ్మదిగా వాడి జీవితంలో, చెప్పకూడనివి అనేవి లేని ప్రవర్తనయందు స్థిరపడటానికి అవకాశం ఉంటుంది. కొన్ని కొన్ని మనం చెప్పలేనివి ఉంటాయి ప్రతి వాళ్ళకీనూ. ఇవి చెప్తే బాగుండవు అన్నవి. ఏవి ? మనకు ఉండే కోరికలు గానీ, భావాలు కానీ, కొన్ని కొన్ని చెప్పలేనివి ఉంటాయి. ఎన్ని చెప్పలేనివి ఉంటే అంత transparency లేదని అర్థం. Transparency పెరగడం అంటే మన జీవితం విచ్చుకున్న పువ్వల్లే ఉంటుంది. పరిపూర్ణంగా విచ్చుకున్న పువ్వులో దాచుకున్నదేమీ లేదు కదా. అలా ఎందుకు విచ్చుకున్నదంటే, తన నుండి ఆ విధమైన చైతన్య వికాసం జరగడం వలన తన నుండి వచ్చే అందాన్ని అందరికీ పంచి ఇచ్చి, ఆనందం కలిగిస్తుంది. అలాగే మానవుడు కూడా వికాసవంతుడైతే చైతన్య పరంగా, తన నుండి సమస్తమునకు ఆనందం మాత్రమే అందుతూ ఉంటుంది. ఆ విధంగా జీవించే పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు తనలో నుండి ఈ వికాసం జరుగుతుంటే తన సమస్తమైన పొరల్లో తననే తను చూసుకుంటూంటాడు. అన్ని పొరల్లోనూ తానే నిండి ఉన్నట్లుగా భావన చేసుకోవాలి. భగవంతుడు అదే విధంగా ఉంటాడు. పరిపూర్ణమైన జ్ఞాని కూడా అదే విధంగా జీవిస్తూ ఉంటాడు.

## 515 వ్యాసుఁ

వ్యాసుడు అంటే మనకు తెలిసింది వేదవ్యాసుడే! కానీ సృష్టిలో వ్యాసము అనేది ఒకటి ఉన్నది. ఆ ప్రజ్ఞని 'వ్యాసో' అని పిలుస్తారు. వ్యాసమంటే కేంద్రం నుండి పరిధికి అటు ఇటు పరుచుకున్నది. తాను కేంద్రం నుండి పరిధికి అక్షముగా వ్యాపనం చెంది ఉంటాడు. ఇటు పక్కకి, అటు పక్కకి, పైకి, కిందికి, అన్ని పక్కలకీ కేంద్రము నుండి పరిధి వరకు వ్యాపనము చెందిన అక్షములేవైతే ఉన్నాయో అవన్నీ వ్యాసములే. ఇలా వ్యాపనం చెంది ఉండడం చేత అన్ని లోకములలో తాను, తన యొక్క స్పర్శనిస్తున్నాడు. అందుకని 'దివిస్పక్' అనే నామానికీ, 'వ్యాస' నామానికీ అనుసంధానం చేసుకుని చెప్పుకోవాలి. మనలో కూడా ఒక వ్యాసం ఉన్నది. మెదడు నుండి వెన్నుపూస చివరి వరకు ఒక కిరణం ఉంటే, అది కేంద్రం నుండి పరిధి వరకు వెలుగుల్ని ప్రసారం చేస్తూంటుంది. అలాగే కేంద్రం నుండి పరిధి వరకు ప్రసారం మనకు జరుగుతున్నట్లే సూర్య మండలాలలో కూడా గుర్తించవచ్చు. సూర్యుని నుండి వచ్చిన కిరణాలు రకరకాల గోళాలను తయారు చేశాయి. ప్రతీ గోళం నుండి సూర్యుడికి ఒక పరిధి ఏర్పడుతూ ఉంటుంది. సూర్యుడు నుండి ఒక్కొక్క గోళం ఒక్కొక్క రకమైన దూరంలో ఉన్నది. మనం (భూమి) కొంత దూరంలో ఉంటే, బృహస్పతి ఇంకొంత దూరంలో ఉంటే, శని మరికొంత దూరంలో ఉంటే, బుధుడు కొంచెం తక్కువ దూరంలో ఉంటే, శుక్రుడు మనకన్నా కొంచెం తక్కువ దూరంలో ఉంటే, ఇట్లా మొత్తం మీరు సౌర కుటుంబం చోటులో ఏ విధంగా ఉంటుందో చూసినట్లయితే ఒక చక్రం వలే ఉంటుంది. మధ్యలో కేంద్రం సూర్యుడు. సూర్యుడు నుండి వెలుగులు వ్యాపనం చెంది, అక్కడి నుండి ఒక్కొక్కటి ఒక గోళంగా ఏర్పడి, ఆ గోళం మళ్ళీ సూర్యుడి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అలాగే మన భూగోళం కూడా తిరుగుతోంది. సూర్యుని నుండి భూగోళం వరకు ప్రతిరోజూ ఒక కిరణం వస్తూనే ఉన్నది. అందుకనే భూమికి వెలుగు అందుతోంది. ఇది 360 రోజుల్లో ఒక వృత్తంగా భూమి సూర్యుని చుట్టూ తిరుగుతూంటే, 360 రకములైన కిరణములు భూమి సూర్యుని చుట్టూ తిరుగుతూ అందుకుంటోంది. అంటే సూర్యుడు మనం గుడి అనుకుంటే, మనం ప్రదక్షిణ చేస్తున్న భూమి అనుకుంటే, గుడి చుట్టూ తిరిగే వాళ్ళకి ప్రదక్షిణంగా, ఒక్కొక్కసారి గుడిలో నుండి ఒక్కొక్క భాగం గోచరిస్తూ ఉంటుంది కదా. అట్లాగే సూర్య గోళం నుండి భూమికందేటి సూర్య కిరణములు, భూమి తిరుగుడుని బట్టి తను ఏ ప్రదేశం లో ఉన్నాడో ఆ తిరుగుడులో దానికి సంబంధించిన ముఖము సూర్యుడికి మనకి కనిపించడము, దానికి సంబంధించిన కిరణములు మనకందడం జరుగుతోంది. అది గోళం-సూర్య గోళం, నువ్వో గోళం ఇలా తిరుగుతున్నావు. తిరుగుతున్నప్పుడు పక్కకొస్తే పక్క కిరణాలన్నీ కనిపిస్తూ మీద పడతాయి. అటు వెళితే అటు కిరణాలు, అట్లా మొత్తం చుట్టూ

మనం తిరుగుతూ ఉంటే ప్రదక్షిణంగా, సూర్యుని చుట్టూ ఉండే వెలుగు కిరణాలు అట్లా మన మీద పడుతూ ఉంటాయి. అవి మొత్తం 12 విభాగాలుగా చెప్పారు. రోజూ వచ్చే కిరణం స్వభావము అదే విధం గా ఉండదు. 12 విభాగాలుగా, 12 మాసాలుగా చెప్పారు. ఒక్కొక్క మాసంలో వచ్చే కిరణము యొక్క కాంతిలో ఉండే భావము, స్వభావము వేరుగా ఉంటాయి. అట్లాగే ఒక నెలే కాదు, ఒక నెలలో వచ్చే 30 రోజుల్లో ప్రతిరోజూ అంతకు ముందు రోజు కన్నా గట్టిగా, విశిష్టంగా తేడాగా ఉంటుంది. నిత్య నూతనంగా ఉంటుంది. ఇట్లా 360 రకములైన ముఖములు లేక కిరణములు, మనం సూర్యుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ ఉంటే మన మీద పడుతున్నాయి. మనకి వేదవ్యాసుడు ఎందుకొచ్చాడు భూమికి? భూమి జీవులని దైవంలోనికి మళ్ళీ మళ్ళించడానికి, దారి ఏర్పరచడానికి సమస్తమైన వాఙ్మయం ఇచ్చి వెళ్ళాడు కలియుగం ప్రారంభంలో. వేదవ్యాసుడే కనుక ఆ సమయంలో అవతరించకపోతే, ఇప్పుడు భూమి మీద ఉన్న జ్ఞానం ఉండేది కాదు. అది గమనించే పరాశరుడు వేదవ్యాసుని జననానికి సంకల్పం చేస్తాడు. కాబట్టి వ్యాసుని యొక్క అవతారం యొక్క ముఖ్య ప్రయోజనం అర్చిర్ మార్గము లేక వెలుగు మార్గము లేక కిరణముల మార్గమును మళ్ళీ మనకి అందించే ప్రయోజనం. ఆ విధంగా ఒక్కొక్క కిరణం మనకు సూర్యుడు నుండి భూమి మీదకు వస్తోందంటే అర్థం ఏమిటంటే, అదే కిరణాన్ని మార్గంగా ఏర్పరచుకుని మనం భూమి మీద నుండి సూర్యుడు దగ్గరకు వెళ్ళొచ్చుగా. ఆ కిరణం సూర్యుడు దగ్గర బయలుదేరి ఇక్కడకొచ్చేసి అక్కడ మాయం అయిపోలా. మనం ఇక్కడి నుండి వెళ్తే Hyderabad లో ఉంటాం ఇక్కడ ఉండం. Hyderabad నుండి ఇక్కడికి వస్తే ఇక్కడ ఉంటాం. Hyderabad లో ఉండం. కదా. కానీ సూర్యకిరణం సూర్యుని దగ్గర నుండి బయలుదేరి, అట్లా గమనము చేయుచూ, వ్యాపనము చెందుతూ భూమి వరకు వచ్చింది. మధ్యలో ఎక్కడా తెగలేదు. అక్కడి నుండి ఇక్కడి వరకు వంతెన వలే ఉంది. సూర్యుని దగ్గర ఉన్నది. మన దగ్గర ఉన్నది. సూర్యునికి మనకి మధ్యలో ఉండే చోటులో ఉంది. అట్లా వ్యాపనం చెందే ప్రజ్ఞని 'అశ్వము' అన్నారు వేదంలో. 'గమనము చేయుచు వ్యాపనము చెందినది' అని అన్నారు. 'అశ్నుతే గమనేన ఇతి అశ్వః' అది గమనం చేస్తోందిట. వ్యాపనం చెందుతోందిట. మనలాగా అక్కడ ఉంటే ఇక్కడ ఉండకపోవడం, ఇక్కడ ఉంటే అక్కడ ఉండకపోవడం ఉండదు సూర్యకిరణానికి. సూర్యుని దగ్గర నుండి బయలుదేరి భూమి వరకు వస్తే, మధ్య దారిలో చోటులో కూడా ఉంటుంది. అట్లాగే సూర్యుడు దగ్గర నుండి బృహస్పతికి వెళుతుంటే ఆ చోటంతా ఆక్రమించి, సూర్యుడు దగ్గర నుండి బృహస్పతి వరకు ఉన్నది. అంటే ఏమిటండీ? ప్రతి గోళానికి సూర్యకిరణములు వంతెనల లాగా పనిచేస్తున్నాయి. ఆ వంతెన ఎక్కి సూర్యుడి దగ్గరకు వెళ్ళడం కోసమేనండీ సంధ్యావందనమూ, గాయత్రీ మంత్రమూ. పొద్దున్నే మన దగ్గరకి ఆ కిరణం వస్తుంటే, ఆ కిరణాన్ని అందుకుని సూర్యుడు దగ్గరికి మనం వెళ్ళడానికి ప్రయత్నం చేయమని మనకి ఋషులు మార్గాన్నిచ్చారు. అబ్బా అంత ప్రయాణం పొద్దున్నే

ఎట్లాగండీ అని అనుకోక్కర్లేదు. అంటే సామాన్యమైన ప్రయాణం కాదు కదా. ఆ సూర్యుడే మళ్ళీ నీలో సూర్యుడిగా కూడా ఉన్నాడు. మనం ఎక్కడుంటాం మామూలుగా? మానవులం కాబట్టి ఎక్కువగా 'మనస్సుగా' ఉంటాం. మనస్సుగా ఉండడం అంటే సౌర కుటుంబంలో చంద్రుడిగా ఉండడం. మనస్సు యావ ఎప్పుడూ చంద్రుని యావే! చంద్రుని యావ ఏమిటి? ఎప్పుడూ భూమి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అంతేగా! భూమి చుట్టూ అట్లా అహర్నిశలూ తిరుగుతూ ఉంటుంది చంద్రగోళం. అట్లాగే మన మనస్సు కూడా మన శరీర ఆవశ్యకతల గురించి తిరుగుతూ ఉంటుంది పాపం. ఇక అదే పని. దీనికేం పెడదాం, దీన్నెక్కడ పడుకోబెడదాం, దీనికేం బట్టలేద్దాం, దీనికి తలంటెపుడు పోద్దాం, ఇవాళ పండగ కదా ఏం పిండి వంటలు పెడదాం ఇట్లా కేవలం శరీరం కోసమే మానవులు తిరుగుతూ ఉంటారు. 'ఉదర పోషణార్థం ఇదం శరీరః' అని అట్లా దాన్ని పట్టుకునే తిరుగుతూ ఉంటుంది. భూమేమో సూర్యుడి పక్క తిరుగుతోందిటండీ. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతున్నాట్ట. ఇపుడు మనకేం చెప్తుందంటే ఈ నామం, మనస్సు కక్షలో మనం భూమి చుట్టూ తిరగడం, అంటే శరీరం ఆవశ్యకతల గురించి ఆలోచిస్తున్నాం. ఆ మనస్సుని సరాసరి తీసుకువెళ్ళి సూర్యుడికి అప్పచెప్పమని చెప్తోంది మనలో ఉండే సూర్యకేంద్రం. అందుకని మనం ఎక్కడ ఉన్నవాళ్ళం అక్కడి నుండి కళ్ళు మూసుకుని, ఒకసారి ఓంకారము చేస్తూనో, శ్వాసను గమనిస్తూనో హృదయమునందుండే వెలుగులోకి ప్రవేశించడం చేస్తే, అక్కడ మీ సూర్యుడు మీకు లభిస్తాడు. అదే నీ హృదయంలోకి ప్రవేశించడంగా, ఉదయం సూర్యుడి నుండి వచ్చే కిరణం అందుకుని, ఆ వెలుగుని నీ హృదయంలో దర్శనం చేస్తూ ఉంటే నువ్వు కూడా పరిధి నుండి మళ్ళీ కేంద్రానికి వెళ్ళడానికి వీలు పడుతుంది. అంత పరమోద్దేశ్యాన్ని మనవాళ్ళు ఈ గాయత్రీ మంత్రంలో ఇమిడ్చి మనకిచ్చారు. అది ఏదో యాంత్రికంగా చేసుకునేది కాదు. అది ఎంత ఇచ్చారంటే హృదయంలో ఉండే సూర్యుడు దగ్గరకు వెళ్ళి, అక్కడ్నుండి భ్రూమధ్యంలో ఉండే సూర్యుడు దగ్గరకు వెళ్ళి, అక్కడ్నుండి నడి నెత్తి మీదఉండే సూర్యుడు దగ్గరి వరకూ కూడా వెళ్ళవచ్చు. ఎందుకంటే ఒకదానికొకటి ఒకదానికొకటి ఒకదానికొకటి అట్లా కిరణాల వంతెనలు ఉన్నాయి. వెలుగు వంతెనలు ఉన్నాయి. ఒక వంతెన సవితృ మండలంలో ఆ సూర్యమండలానికి సంబంధించిందే. సూర్యుడు దగ్గర నుండి సవితృ మండలానికి మళ్ళీ కిరణం వంతెన ఉంది. అక్కడి నుండి ఆదిత్య మండలంలోకి ఉన్నది. అక్కడి నుండి అసలు మూలంలోకి ఉన్నది. అసలు మూలం హృదయ కమలంగా, అష్టదళపద్మంగా మనకి హృదయ కేంద్రానికి, విశుద్ధి కేంద్రానికి మధ్యలో ఉంది. అక్కడి నుండి మెదడులోకి, మెదడులోంచి భ్రూమధ్యంలోకి, భ్రూమధ్యంలోంచి విశుద్ధిలోకి, విశుద్ధిలోంచి అనాహత చక్రం లోకి, అక్కడి నుండి మణిపూరకంలోకి, అక్కడి నుండి స్వాధిష్ఠానంలోకి, అక్కడి నుండి మూలాధారం లోకి, అక్కడ నుండి ఇంకా కిందకి పాతాళ లోకాల్లోకి, 'పాతాళమున్ చేరె గంగా కూలంకషన్'

అని మనకు పద్యం ఉంది. మనం ఇక్కడ పాతాళ లోకాల్లోకి కూడా వెళ్ళిపోతాం కానీ, ఎక్కడి నుండి బయలుదేరి వెళుతున్నాం? హృదయంలో ఉండే నారాయణ లోకం అనవచ్చు. పరమ శివలోకం అనవచ్చు. పరబ్రహ్మ లోకం అనవచ్చు. అక్కడి నుండి శిరస్సు. శిరస్సు నుండి భ్రూమధ్యం. అక్కడి నుండి విశుద్ధి. అక్కడి నుండి అనాహతం, అక్కడి నుండి మణిపూరకం, అక్కడి నుండి స్వాధిష్ఠానం. అక్కడి నుండి మూలాధారం, అక్కడి నుండి మోకాలులోకి, అక్కడి నుండి చీలమండలు దాకా. అక్కడి నుండి పాదాలదాకా, అక్కడి నుండి బయటికి కిరణముల ప్రసారం అవుతూనే ఉన్నది. కిరణములు అక్కడ ప్రాణ ప్రవృత్తులుగా పనిచేస్తూ ఉంటాయి. కాబట్టి ఈ కిరణాలు అందుకోవడానికి పెద్దలు ఏం ఇచ్చారంటే అగ్ని, వాయువు. ఈ రెండింటిని ఆధారంగా వీటిని చేరుకోవచ్చు, అని చెప్పారు. దాన్నే 'జ్యోతిష్టోమం' అనే ఒక యజ్ఞంగా ఇచ్చారు. బాగా శ్వాస పీలిస్తే వేడి పుడుతుంది. మంచి వెలుగు ఆరాధన చేస్తుంటే శ్వాసకు ఉత్సాహం వస్తుంది. ఒకదానితో ఒకటి ఇట్లా అనుసంధానం చేసుకుంటూ ముందుకు వెళ్ళాలి. ఎందుకు ఇది చెప్తున్నానంటే పరిధిలో నుండి కేంద్రంలోకి వెళ్ళడం ఇప్పుడు మనం చేస్తున్న ప్రయత్నం. పరిధి నుండి కేంద్రానికి వెళ్ళడానికి కావలసిన దారులు, మెట్లు అన్నీ కూడా వేదవ్యాసుడు ఇచ్చి ఉన్నాడు కాబట్టి, ఆయన్ని కూడా వ్యాసుడన్నారు. సూర్యుడి నుండి గోళాలన్నిటికీ ఈ దారులు మనకి సృష్టిలో ఉన్నాయి. ఆ దారులు పట్టుకునే దేవతలు, ఋషులు దిగివస్తూ ఉంటారు, వచ్చి వెళ్తూ ఉంటారు. అన్ని గోళాలకీ ఇటువంటి దారులున్నాయి. అన్ని గోళములూ మనలో ఉన్నాయి. మన హృదయము సూర్యునికి కేంద్రము. మన విశుద్ధి బుధునికి కేంద్రము. అంటే బుధ గ్రహానికి, మన విశుద్ధి చక్రానికి అనుసంధానం. మన భ్రూమధ్యానికి, బృహస్పతికి అనుసంధానం. మన మణిపూరకానికీ (బొడ్డుకీ), చంద్రుడికి అనుసంధానం. మనలో ఉండే స్వాధిష్ఠాన కేంద్రానికీనూ కుజుడుకీ అటువంటి అనుసంధానం, మూలాధారానికీ శనికీ అనుసంధానం ఉన్నది. అంటే మన శని మూలాధారంలో ఉంటాడు. మన కుజుడు స్వాధిష్ఠానంలో ఉండి తిప్పలు పెడుతూ ఉంటాడు. కుజుడికి సరియైన ఆశయాన్ని ఇవ్వకపోతే మనల్ని తిప్పలు పెడుతూ ఉంటాడు. ఎందుకంటే కుజుడు మనలో ఉండే వీర్యశక్తి, బలం. ఆ వీర్యశక్తిని ఎటు వినియోగిస్తే అటు వినియోగపడతాడు. అదే మనలో కామంగా కూడా పనిచేస్తుంది. సద్విషయములయందు కామించావనుకో వెలుగులోకాల్లోకి వస్తావు. ఇతర విషయములయందు కామించావనుకో చీకటి లోకాల్లోకి వెళతావు. Directional planet. చాలా శక్తిమంతుడిగా చెప్తారు. బొడ్డులో చంద్రుడు, మన ఆలోచనలన్నీ అక్కడ ఉంటాయి. బొడ్డు నిండా ఎన్ని ఆలోచనలురా అంటూంటాం. హృదయంలో సూర్యుడు. హృదయంలో శుక్రుడు కూడా చెప్తారు. విశుద్ధిలో బుధుడు, భ్రూమధ్యంలో సూర్యుడు, అంతకన్నా పైన సహస్రారంలో బృహస్పతి ఇలా కూడా చెప్తారు. అలాగే సాధన చేసుకునే వాళ్ళకి మూలాధారంలో పరిమితుడ్ని చేసిన శని తత్త్వాన్ని మార్చి, అక్కడ గురుతత్త్వం

పెట్టుకోమంటారు. అందుకని మూలాధారంలో గణపతిని ప్రార్థన చేయడం వలన పరిమితత్వం తొలగి, మనిషి అపరిమితత్వంలోకి పెరగడానికి అవకాశం వస్తుంది కాబట్టి అక్కడ 'గం' అనే శబ్దం చేసుకోమంటారు. అలాగే ఈ గోళాలకుండే రంగులన్నీ కూడా ఈ కేంద్రాల్లో దర్శనమవుతాయి. భ్రూమధ్యంలో నీలం, విశుద్ధిలో లేతాకుపచ్చ, హృదయంలో బంగారు రంగు హిరణ్మయం, బొడ్డులో orange. అక్కడి నుండి స్వాధిష్ఠానంలో గులాబి, అంతకన్నా కిందకి వెళితే ముదురాకుపచ్చ, ఇటువంటి రంగులన్నీ మనకి యోగపరంగా తెలుపుతారు. అట్లాగే వీటికి అక్షరములు కూడా, శబ్దములు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే సూర్యుడు నుండి ఈ కిరణములు వచ్చినప్పుడు ఒకే వెలుగులోంచి పుట్టే ఏడు రంగుల కారణంగా ఏడు రకాలైన గోళములు తయారయినాయి. అలాగే మన యందు కూడా ఒకటే వెలుగు అయినప్పటికీ కూడా ఈ ఏడు కేంద్రములలో ఏడు రకములైన రంగులుగా తయారయి, వాటి తత్వములుగా ఆయా కేంద్రములు పనిచేస్తూ ఉంటాయి. బుధుడంటే విచక్షణా జ్ఞానం ఉన్నవాడు. విచక్షణాజ్ఞానం ఉండేవాడు గొంతుని జాగ్రత్తగా వాడుకోవాలి. ఎందుకంటే ఏదైనా మనం అవతరింప చేయడానికి అదే ఆధారం. బుద్ధికి బృహస్పతి, అలాగే ఆత్మతత్వానికి సూర్యుడు, సంకల్ప బలానికి కుజుడు, చేసిన పనులని చక్కగా, కట్టుదిట్టంగా, పటిష్ఠంగా తయారుచేయడానికి శని, దివ్యమైన సంకల్పాలు ఏవన్నా కావాలంటే బృహస్పతి, మంచి అనుభూతితో జీవితం గడపాలంటే శుక్రుడు ఇట్లా ఉంటుంది. ఇవన్నీ కూడా కేంద్రం నుండి వ్యాసములుగా బయటకు వచ్చినవే. ఇవన్నీ సూర్యుడు నుండి బయటకు వచ్చినాయి. గోళాలుగా వచ్చాయి. ఆ గోళాలలో ఆ తత్వాలు ఉన్నాయి. మనలో మనం కూడా సూర్యుడే. మనం సహజంగా సూర్యులం. కానీ ఏంచేశామంటే దిగివచ్చేసి, మనస్సు అనే గోళంలో ఉండిపోయాం. అసలు మనకు ఇల్లు ఉందండీ! ఆ ఇల్లు వదిలేసి ఎక్కడో ఊరి బయట చిన్న farmhouse ఉంటే అందులో ఉంటారు చూడండి కొంతమంది. ఎందుకురా అక్కడికెళ్ళాడంటే అక్కడ గుట్టు చప్పుడు కాకుండా కొన్ని పనులు చేసుకోవడానికి. మనం ఊరి బయటికి చిన్నింటికి వెళ్ళిన వాళ్ళం, అలా ఉండి పోయాం. పెద్దింటికి రావాలంటే వ్యాసుడు కావాలి. వ్యాసప్రజ్ఞ అనేది సృష్టిలో ఎప్పుడో ఉంది. ఆ ప్రజ్ఞని పట్టుకొచ్చాడు అయోనిజుడుగా.

## 596, 597 వాచస్పతిః, అయోనిజః

వాచస్పతి అంటె కేంద్రం నుండి ఈ పరిధికి వ్యక్తమవుతున్న ప్రజ్ఞని బ్రహ్మ అన్నారు. బృహ్మణము చేస్తాడు కాబట్టి. ఈ శ్లోకం ఉత్తరార్ధంలో లో ఉండే భావం అంతా ఒకటే! కేంద్రం నుండి పరిధికి, పరిధి నుండి కేంద్రానికి. ఇన్ని లోకాలుగా వాడే వ్యాపించి ఉన్నాడు. వ్యాపించి ఉన్నాడు కాబట్టి అన్నిటినీ స్పృశించి ఉన్నాడు. స్పృశించి ఉన్నాడు కాబట్టి అన్నిటినీ చూస్తూ ఉన్నాడు, సర్వదృక్. ఈ వ్యాపనమే వ్యాసము. ఈ వ్యాపనం చెందడానికే బృహ్మణం చేసాట్ట ఆయన. బ్రహ్మగారు బృహ్మణం చేస్తే వచ్చింది కదా. మనం కూడా బృహ్మణం చేస్తాం పొద్దున్నే లేచి మన పనుల్లోకి. మనం కూడా బ్రహ్మలమే. ఎందుకంటే ఎవడిదైన జీవితం వాడొకటి సృష్టించుకున్నాడు కదా ఈ మొత్తంలో. ఎందుకంటే మనలో బృహ్మణ శక్తి ఉంది కాబట్టి వాచస్పతి. వ్యాసుడు కూడా వాచస్పతే. మనం కూడా వాచస్పతులమే. మన నుండి వచ్చే వాఙ్మయం మన నుండి వస్తోంది. వాఙ్మయం అంటే ఏమిటో తెలుసా? మన జీవితమే వాఙ్మయం. బ్రహ్మ నుండి సరస్వతి పుట్టుకొచ్చి అట్లా పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయిందటండీ నదిలాగ. దాన్నుండి ఆయన పరిగెత్తుకుంటూ వెళ్తుంటే సృష్టి వచ్చేసిందిట. మనం కూడా అంతే. మనలోంచి ఒక ఆలోచన వస్తుంది. ఆ ఆలోచనలోంచి ఇట్లా చేద్దాం అని మాట చెప్పాం. ఇహ ఆ మాట చెప్పి అక్కడి నుండి పరిగెడతాం. అంతే కదా. ఏదో పారపాటున తిరుపతి వెళ్దాం అని ఓ భావన వచ్చిందనుకోండి. ఎంత దూరం పరిగెత్తిస్తుందీ? పోనీ బదరీ వెళ్దామటమ్మా అని అనుకున్నాం అనుకోండి. ఇక్కడి నుండి బదరీ వరకు పరిగెత్తిస్తుంది. పరిగెత్తిస్తోందా? ఎక్కడెక్కడికి, ఎక్కడెక్కడికి మనం తిరుగుతున్నామండీ? పూర్ణా మార్కెట్ దగ్గర నుండి వైష్ణవి దేవి వరకు తిరుగుతూనే ఉంటుంది. తిప్పేదెవరో తెలుసా? మనం చేసే బృహ్మణం, ఆ బృహ్మణంలోంచి వచ్చిన వ్యాసం! పట్టుకుపోతుంది ఒక్కసారి అట్లా తిరపతి, శ్రీశైలం, వైష్ణవ దేవి, హిమాలయాలు, ఏమనుకుంటే అక్కడికి తీసుకుపోతుంది. ఎక్కడ్నుంచి వస్తోందీ? లోపల్నుంచేనా? ఎప్పుడన్నా గమనించామా? అసలది పుట్టే స్థానం ఒకటుంది కదా. అక్కడికి పోతే పోలా. అక్కడే చూద్దాం అనుకుంటున్నావా? అది పుట్టుక స్థానంలో కూడా అదే ఉంది. కానీ ఈ వ్యాసుడు గారేం చేస్తారంటే పట్టుకుపోతూ, మళ్ళీ వెనక్కి కూడా పట్టుకు రాగలడు. ఇటు నుండి అటు వెళ్ళే వంతెన, అటు నుండి ఇటు కూడా దాటవచ్చుగా. నది మీద వంతెన వేసుకుంటే ఇటు నుండి అటు వెళ్ళడానికే కాదు, అట్నుండి ఇటు రావడానికి కూడా పనికొస్తుంది. ఆ వంతనే వ్యాసం. ఆ వంతెన మీద నడవడమే గాయత్రీ మంత్ర జపం. ఆ వంతెన మీద నడవడమే ఓంకారం అనే శబ్దాన్ని ఆధారం చేసుకుని వెళ్ళడం. శబ్దం ఒక వంతెన. వెలుగు ఒక వంతెన. ఇట్లా వంతెనలు పట్టుకుంటే ఇట్నుంచి అటు వెళ్ళచ్చు, అట్నుంచి ఇటు రావచ్చు. వంతెనలు మనం

విరగొట్టుకున్నాం అనుకోండీ, అంతే అటు వాళ్ళు అటుంటారు. ఇటు రాలేరు. ఏరా అంటే ఎవరన్నా వంతెన నిర్మాణం చేసి మన్ని పట్టుకు రావాలి. అదీ సీతాదేవి కథ. రావణుడుఎత్తుకెళ్ళిపోయాడు. మనం కూడా మన కోరికల చేత అట్లా ఎత్తుకు వెళ్ళబడతాం. ఆ చుట్టూ ఇహ జలమే. జలమే మనకుండే స్వాధిష్ఠానమంతా కూడా. జలమయ లోకాలు. ఇక్కడి నుండి దూకాడటండీ హనుమంతుడు. మహేంద్ర పర్వతం అంటే విశుద్ధి చక్రం నుండి దూకాడు. అంటే గురుస్థానం మనకి విశుద్ధి. ఇక్కడికి తీసుకొచ్చి, అక్కడి నుండి హృదయంలోకి ప్రవేశపెడతాడు. అందుకని ఇక్కడి నుండి అక్కడికి దూకి, ఆవిడ్ని చూసి, వచ్చి, భగవంతుడ్ని పట్టుకుని, అంటే వెలుగు కిరణాలను మళ్ళీ తీసుకొచ్చి, సూర్య కిరణమే కదా రాముడంటే. సూర్యవంశీయుడే కదా. ఆయన్ని పట్టుకొచ్చి, ఈ సూర్యవంశీయుడైన సుగ్రీవుడు వారి అనుచరుల చేత వంతెన నిర్మాణం చేయించి, ఆ వంతెన మీద నుండి, అటు చేరుకుని, అక్కడికెళ్ళి ఆవిడ్ని పట్టుకొచ్చుకున్నాడు కదా. ఇంత కష్టపడాలి వంతెన ఎప్పుడైతే విరగొట్టుకున్నామో. వచ్చే అప్పుడు మనకి వంతెనలిచ్చే పంపిస్తారు. బావిలోకి దిగడానికి వాడేదో ఇచ్చి, దిగింతర్వాత తాడు లాగేసాం అనుకోండి ఎట్లా ఉంటుంది? మనకేమైందంటే మన లోపల తాడు మనం మర్చిపోయాం. దాన్నే 'చిత్రిణీ' అంటారు యోగంలో. యోగశాస్త్రంలో ఏం చెప్పారంటే, కళ్ళుమూసుకుని ఎక్కడో కూపస్థం లో, అంటే బావిలో పడిపోయి చీకట్లో ఉన్నవాడివి నువ్వు. ఎక్కడ పడున్నావు మూలాధారంలో? మలము, మూత్రము వాటి దగ్గర పడి ఉన్నాం. కళ్ళు మూసుకో. ఎక్కడో గోతిలో పడున్నాను, కానీ నా లోపల ఉన్న వెలుగుతో నేను నా శిరస్సు పైనుండి, ఈ గోతిలోంచి అట్లా బయటికి ఒక వెలుగు దారి నిర్మాణం చేసుకుంటూ బావి పైవరకు ఏర్పరచుకుంటాను. ఓం అని అంటూ దాంట్లోంచి అట్లా పైకొచ్చేస్తాను. వచ్చేసి ఇక్కడ కూర్చుంటాను. ఇదో సాధనిచ్చారు. ఇది ఉపమన్యుడికి ఇచ్చిన సాధన. బావిలోంచి రావడం. ఊరికే తాళ్ళు వేసి లాగడు గురువుగారు. పడ్డావా గోతిలో? అవున్సార్. ఇది చేసుకో పైకొస్తావు. గోతిలో పడ్డ వాళ్ళందరికీ ఉపదేశం ఇస్తాడు. అట్లాగే అదే ధౌమ్యుడుకి ఉదంకుడనే ఇంకో శిష్యుడు ఉన్నాడు. ఉదంకుడనే శిష్యుడు గురువుగారి భార్యకి ఏవో కుండలాలు తీసుకురావడానికి బయలుదేరి వెళ్ళినవాడు, కుండలాలు సంపాయించుకుని, దారిలో మోసపోయి, పాతాళ లోకాల్లోకి వెళ్ళిపోతాడట. అప్పుడు వాడికి ఎవరో చెప్పారట లోపల, ఒకాయన అంతకుముందు వాడ్ని పేడ తినమంటాడు తినేస్తాడు. పేడ తినమన్నాయనే అప్పుడొచ్చి, 'అక్కడ గుర్రం తోక ఉంది, దాన్ని పట్టి ఒక్కసారి ఊదేశావంటే ఈ తోక లోంచి గుర్రం ఒంట్లోకి, అక్కడి నుండి దాని ముఖం లోంచి వెళ్ళి సరాసరి అట్లా బయటకి విసిరి వేయబడి, నువ్వెళ్ళాల్సిన నీ గురుసాన్నిధ్యం లోకి వెళ్తావు' అని చెప్తాడు. అంటే మన మూలాధారం నుండి విశుద్ధికి వెళ్ళే దారన్నమాట అది, గురుసాన్నిధ్యంలోకి వెళ్ళడం అంటే. అక్కడ అశ్వము అంటే ప్రాణ ప్రవృత్తులు అని అర్థము. అశ్వము అంటే కిరణం అని

అర్థం. కిరణాన్ని పట్టుకుని అక్కడికి చేరుకోరా ఒక్కసారి కనులు మూసుకుని, మనస్సుని శ్వాస యందు లగ్నం చేసి, బాగా దాంతో నువ్వు ప్రాణమును యమింపజేయగలిగితే, తద్వారా నీవొక్కసారి మళ్ళీ వెళ్ళి చేరవలసిన చోటికి చేరతావు అని చెప్పడానికి అదొకటిచ్చారు. ఎందుకివి చెప్తున్నానంటే వ్యాసము అనే భావము మనకి అటునుండి ఇటు దిగి రావడానికి పనికొచ్చింది తప్ప, ఇటు నుండి అటు ఎక్కి వెళ్ళడానికి, నిజానికి అది ఎక్కువ వినియోగించుకోవాలి. ఇటు నుండి అటు వెళ్ళగలగాలి. అటు నుండి ఇటు రాగలగాలి. అటెళ్ళిపోయి అక్కడ అతుక్కుపోవడం కాదు. పనుంటే బయటికెళ్ళి ఇంటికి రావడం లేదూ? అట్లాగే ఇక్కడ చేసుకోవలసిన పనులు చేసుకోవడం, మిగతా time లో లోపలికి వెళ్ళి అక్కడ ఉండడం. ఆ విధంగా ఉంటే నీవు వ్యాసుని వలే వ్యాప్తి చెందవచ్చు. కిరణము వలే వ్యాప్తము చెందవచ్చు. ఈ నామంలో వాచస్పతి అంటే సరస్వతికి భర్త అని. మనం కూడా సరస్వతీ భర్తలమే. సరస్వతి అంటే మనలో వచ్చే సంకల్పం. అది వచ్చిందంటే మరి మన్ని పరిగెత్తిస్తుంది కదా. అట్లాగే బ్రహ్మ నుండి సరస్వతి పుడితే, సరస్వతి వెంట బ్రహ్మ పరిగెత్తాడు అని వేదం లో చెప్పారు. అంటే బృహ్మణము చేయడమనే ఒక స్వభావము మనలో ఉంది కాబట్టి, మనలోంచి ఒక భావం బయటికొస్తే, ఆ భావము వెంట మనం పరిగెత్తట్లేదా? అందుకని మనం కూడా వాచస్పతులే. మనలో వచ్చే భావాల వెంట మనం పరిగెడుతున్నాం. ఋషులు వాళ్ళలో వచ్చే లోకహితమైన భావాల వెంట వాళ్ళు పరిగెడుతున్నారు. వాళ్ళు పరిగెత్తడం అంటే వెలుగుదారుల్లో పరిగెత్తడమే. ఎందుకంటే లోకహితమనేది పరహితము పరమధర్మము. దేవతలు కూడా ఈ అర్చిర్ మార్గంలోనే నడుస్తూంటారు. బుద్ధి కలిగిన మానవులు కూడా తమలో కలిగే సంకల్పాలని, దివ్యమైన సంకల్పాలుగా ఏర్పడేంతవరకు సాధన చేసుకుంటారు. ఆ వెలుగునే మనలో బుద్ధి ప్రచోదనం చేయమని అడగడం గాయత్రీ మంత్రం! గాయత్రీ మంత్రంలో ఏం చెప్తాం? 'धियः योनः प्रचोदयात्'. మా బుద్ధులను ప్రచోదనము చేయుము అని ఆ వెలుగుని అడుగుతున్నాం. ఎందుకంటే అప్పుడు మనం వెలుగుదారుల్లో నడవడం అనే ఓ పద్ధతిలోకి వస్తాం. వెలుగుని చేరడం హృదయంలోకి చేరడంగా ఉంటుంది ముందు. అంతకుముందు విశుద్ధిని చేరడం గా కూడా ఉంటుంది ఒక్కొక్కసారి. లేక హృదయము నుండి విశుద్ధి, విశుద్ధి నుండి భ్రూమధ్యము ఇలా చేరారటండీ. వ్యాసుడట్లా ఉన్నాడు. వ్యాసుని జీవితంలో ఇవన్నీ సత్యం. ఎందుకని? తాను కేవలము కృష్ణతత్త్వమే! వేదవ్యాసుడు కూడా కృష్ణుడనే చెప్తారు భారతంలో. వేద వ్యాసుడు ఒక కృష్ణుడు. ద్రౌపది ఒక కృష్ణ. మనకి తెలిసిన కృష్ణ. అంటే అవ్యక్తము నుండి దిగివచ్చిన తత్త్వమని చెప్పడం. ముగ్గురూ అయోనిజులే. ఆమె అయోనిజ. వీరిద్దరూ అయోనిజులు. అంటే యోని నుండి పుట్టని వాళ్ళు. ద్రౌపది యోనిలోంచి పుట్టలేదు. అగ్నిలోంచి పుట్టింది. వేదవ్యాసుడు, కృష్ణుడు యోనిలోంచి పుట్టలేదు. సిద్ధ పురుషులు యోనుల్లోంచి పుట్టరు. భగవంతుడు

అయోనిజుడు అని చెప్పడానికేం వుంది? దేవకీదేవికి వసుదేవుడున్నాడు కదా. అయినా కృష్ణుడు అయోనిజుడు ఎలా అయ్యాడు? చంద్రాత్మకమైన తత్త్వము తల్లి గర్భంలో పెరుగుతుంటే, తాను సూర్యాత్మకమైన ప్రజ్ఞగా తండ్రి తల మీదే ఉండి, బిడ్డ బయటికి వచ్చింతర్వాత తన్ని తాను ఆ బిడ్డ శరీరం మీద ఆపాదించుకుంటాడు సిద్ధపురుషుడు. అందుకని తాను తల్లి యోనిలోంచి వచ్చినవాడు కాదు అని అర్థం. కృష్ణుడట్లా వచ్చాడు. వ్యాసుడట్లా వచ్చాడు. మరువుమహర్షి 'ఇవాళ్టి మహత్యం రేపటి శాస్త్రం. మీరందరూ ఏవేవి మహత్యాలు అనుకుంటూంటారో, ఆ శాస్త్రములు మా దగ్గర ఉన్నాయి. అవి మీకిప్పడప్పడే అందివ్వబడవు. మీకు ఏ శాస్త్రమిచ్చినా దాన్ని దుర్వినియోగం చేయడమే తెలుసు తప్ప, సద్వినియోగం చేయడం తెలియదు కాబట్టి, మీలో ఆ చైతన్యం యొక్క వికాసం కలుగుతున్న కొద్దీ సశాస్త్రీయంగా ఇవన్నీ ఎట్లా సత్యమో తెలుస్తూ ఉంటాయి. అంతవరకు అట్లా ఉండండి' అని చెప్తాడు. అలాగే పాండవులు- వీళ్ళందరూ మామూలుగా పిచ్చిపిచ్చిగా వచ్చిన వాళ్ళు కాదు. మనం పిచ్చిగా వచ్చాం కాబట్టి మళ్ళీ ద్విజత్వం సంపాదించుకోవాలి. వాళ్ళు జన్మతః ద్విజులు. మనం పుట్టిన తరువాత మళ్ళీ పుట్టాలి. అందుకని రెండవసారి పుట్టడం అంటారు మనల్ని. మనం మళ్ళీ వెలుగులో పుట్టాలి. ఎందుకంటే, చీకట్లో శరీరం ద్వారా పుట్టుకొచ్చిన వాళ్ళం కాబట్టి. ఆ విధంగా వ్యాసుడు అయోనిజుడు. భగవత్తత్త్వం 'అయోనిజ' అని చెప్పనక్కర్లేదు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు అయోనిజులు. ఈ నామంలో ఎంతమంది అయోనిజులని చెప్పారంటే, అందరినీ మనం తల్చుకోవచ్చు. రాముడు యజ్ఞంలోంచి పుట్టుకొచ్చాడు. పుట్టుకొచ్చి దశరథుడి తలకాయ మీద వేలాడుతూ ఉంటాడు. మనమైనా, సిద్ధపురుషులైనా అందరూ ముందు తండ్రి తల మీద వాల్తాం అండీ ఈగల్లే. అక్కడ land అవుతాం. తండ్రి తల Airport runway. అప్పుడు వాడికి ఏమనిపిస్తుందంటే, వాళ్ళ ఆవిడతో చెప్తాడు, ఏమోయ్ ఏమన్నా పిల్లల్ని కందామా అని. నేను అదే అనుకుంటున్నాను అంటుంది, వీడు వాలడం వల్ల. వీడు వాలకపోతే ఇప్పుడు కాదులెండి అంటుంది. అదే ఆవిడ అడిగిందనుకోండి ఆ... ఇప్పుడే కాదులే, ఇంకో నాలుగు రాళ్ళు సంపాదించనీ, అంటాడు వీడు. ఇద్దరూ సై అంటే సై అని ఎప్పుడు అనుకుంటారు తెలుసా? వీళ్ళకు తెలియదు మూడోవాడు ఒకడున్నాడు, వాడప్పుడే land అయిపోయాడు. అవడం చేత వీళ్ళకిద్దరికీ కూడా ఉన్ముఖత్వం వస్తుంది. సరే అంటే సరే అనుకుంటారు. అనుకోంగానే వాడు తండ్రి సంకల్పంలోకి దిగుతాడు. సంకల్పంలోకి దిగి, తల్లి సంకల్పంలోకి కూడా దిగుతాడు. ఇద్దరూ ఉన్ముఖత్వం కలిగి ఉండడం చేత తండ్రి తినే ఆహారంలో నుండి పుట్టే వీర్యంలోకి ప్రవేశిస్తాడు. ఆ వీర్యంలోంచి తల్లి గర్భంలోకి వెళ్తాడు. అక్కడ శరీరము అంటే మనస్సు, ఇంద్రియములు, శరీరము అక్కడ పెరుగుతూ ఉంటుంది. దేహపుంజం! అది పెరుగుతూ ఉంటే వీడు తండ్రి తలమీదే ఉంటాడు. ఎవడు? సిద్ధ పురుషులైనా, సామాన్యుడైనానూ. ఆ తరువాత ఏం జరుగుతుందంటే మనం సీమంతం అని చేస్తాం చూశారా! ఎందుకు

చేస్తారో తెలియదు సీమంతం. ఏడవ నెల వచ్చింది కదండీ అందుకు చేస్తాం. ఏడవ నెల వస్తే సీమంతం. ఐదవ నెల ఎందుకు చేయకూడదు? ఏడవ నెల రాంగానే వీడు అందులోకి వెళ్తాడు. వెళ్ళి అక్కడ పడాల్సిన నరకయాతన అంతా పడతాడు. సీమంతం యొక్క ఉద్దేశ్యం ఏమిటయ్యా అంటే, ఈ సూర్యాత్మక ప్రజ్ఞ, ఆ చంద్రాత్మక ప్రజ్ఞను చేరుతుంది. మనం సూర్య చంద్రాత్మకమైన ప్రజ్ఞలం. సృష్టి అంతా కూడా అంతే. సృష్టిలో ఏ జీవుడిలో అయినా సరే ఈ రెండూ ఉంటాయి. లేకపోతే పని జరగదు. కాబట్టి అక్కడ ఈ తండ్రి తలమీద సూర్యాత్మక ప్రజ్ఞ ఉంది కాబట్టి, స్త్రీ గర్భం ధరించినంత కాలం కూడా తండ్రి కూడా చాలా సత్కార్యములు, సద్భావములు, సత్ ప్రవర్తనము కలిగి ఉన్నవాడైతే బిడ్డకి ఆ సంస్కారములన్నీ అందుతాయి. అలాగే తల్లి కూడా సరి అయిన ఆహార వ్యవహారములు, మంచి భావములు కలిగి ఉంటే, మంచి మనస్సు, నియమింపబడిన ఇంద్రియములు, సౌష్ఠవమైన శరీరము ఈ మూడూ పిల్లవాడికి లభ్యం అవ్వాలంటే అప్పుడే చేయాలి చేయాల్సిందంతా. తరువాత ఏం చేసినా ఉపయోగం లేదు. అల్లిక అప్పుడు జరిగిపోయింది. చీర నేత అయిపోయింది ఇంక. ఆ తరువాత నువ్వు దాని మీద ఎంత చేసినా ఆ నేత ప్రకారం ఉంటుంది తప్ప, నేత నువ్వు పెంచలేవు కదా. ఎంతండీ count అని అడుగుతాము కదా. ముదురుగా ఉందండీ count ఎంత అని అడగవూ? అంటే ముదురు count తో బయటికి వచ్చినవి వుంటాయి, అక్కడి నుండి పట్టు వస్త్రంగా వచ్చినవీ ఉంటాయి. కదా. కాబట్టి నీ నేత బట్టి నీ శరీరం ఉంటుంది. నీ పూర్వజన్మ సుకృతం బట్టి నీకు దొరికే తల్లిదండ్రులు దొరుకుతారు. చాలా దురదృష్టం ఇటువంటి తల్లికి, తండ్రికి పుట్టాననుకోకూడదు. దురదృష్టం నీది కాబట్టి నువ్వక్కడికెళ్ళావు. ఆ airport లో నువ్వెందుకు land అయ్యావంటే నీకదే. అందుకని అక్కడికెళ్ళి ముదురుగా పుట్టుకొస్తారు. మరంతే! దాన్ని ఇహ సాధించడమనేది ఒక దున్నపోతును దారిలో పెట్టడం లాగా ఉంటుంది. చాలా కష్టం కదా. మామూలుగా అందరూ ఏడో నెల మొదట్లో వచ్చి, ఏడో నెల, ఎనిమిదో నెల, తొమ్మిదో నెల, చివర పదొస్తుంటే బయటికొస్తారు. ఆ ౨౦ రోజులూ వాడు పడతాడండీ విపరీతంగా పడతాడు. చేసిన వెధవ పనులన్నీనూ గుర్తొస్తాయి. చస్తే ఈ పనులు చేయను అని మాటిమాటికి, మాటిమాటికి తన్ని తాను నెమరు వేసుకుంటాడు. మనకి కపిల దేవహూతి సంవాదంలో అంతా ఉంది. సిద్ధ పురుషుల వరకు ఏడవ నెలలో ఈ తల్లి గర్భంలో చేరడు. ౨ నెలలు అయిపోయింతర్వాత, బిడ్డ బయటికొచ్చింతర్వాత దానిమీద తనని ఆపాదించుకుంటాడు. అది మనకి శ్రీకృష్ణుడి యొక్క జననం ద్వారా వివరంగా ఇచ్చారు. వసుదేవునికి వాసుదేవుడు కనిపిస్తాడు చతుర్భుజుడై, ఇంకాసేపట్లో ప్రసవిస్తుంది దేవకి అని తెలియంగానే. 'నేను ఎందుకొస్తానో నీకు తెలుసు, ప్రస్తుతం నువ్వు చేయవలసిన పని ఏమిటయ్యా అంటే పిల్లవాడు పుట్టంగానే నన్ను తీసుకెళ్ళి అక్కడ రేపల్లెలోని నందుని ఇంట్లో పెట్టమని చెప్పాడు.' అతడా కొడుకు ఇతడా? అదేంటి? ఇక్కడ కడుపులో ఉంటే, మళ్ళీ వీడొకడు కనిపించాడు. కనిపించి

చెప్తాడు. చెప్పిన తర్వాత పిల్లవాడు బయటకి వస్తాడు. ఏంటిది? శరీరం బయటికొచ్చింది. వస్తే అప్పుడు వాసుదేవుడు తనని తాను ఆపాదించుకుంటాడు ఆ శరీరం మీద. ఆపాదించుకున్నప్పుడు కెవ్వున కేక పెడతాడు. ఎందుకంటే ఆ వెలుగు అప్పుడు ప్రవేశం చేసింది. అక్కడి నుండి కేవలం దానిమీద ఆపాదించుకోవడమే. కానీ దాంట్లో ఇరుక్కుపోవడం కాదు. అది గుర్తుపెట్టుకోండి. మనం ఏడవ నెలలో లోపలికి వెళ్ళిపోయిన వాళ్ళం శుభ్రంగా లోపలికి వెళ్ళి, బయట తాళాలు పెట్టుకుంటాం. మనం ఇంట్లోకి వెళ్ళిన తర్వాత బయట తాళం పెడితే ఎలా ఉంటుందీ? అట్లా పెట్టేస్తారు మనకి తాళాలు. తాళం చెవి లోపల ఎక్కడో అంతరాంతరాలలో, చైతన్యంలో ఉంటుంది. అది మళ్ళీ తెచ్చుకుని విప్ప కోవాలి. అందుకని శ్రీకృష్ణుడు మహత్కార్యాలు ఆ శరీరంతో చేస్తుంటాడు పూతన సంహారం దగ్గర నుండి. కనిపించేది ఇది కనిపిస్తుంది. అదీ అయోనిజుడి తత్త్వం. ఆ శరీరం ఊరికే ఉపాధిగా వాడుకుంటూ ఉంటాడు తప్ప అది తను కాదు అని ఎప్పుడూ తెలిసి ఉంటాడు. వాళ్ళు అయోనిజులు. అయోనిజత్వం అంటే అది. తాను తను నిర్మించిందాంట్లో, తను దిగివచ్చి స్వతంత్రుడై ఉంటాడు. తనని ఆపాదించుకోవడమే తప్ప అందులోంచి పుట్టుకురావడం కాదు. అందులోంచి పుట్టుకొచ్చిన వాడికి శరీర బంధనం ఉంటుంది. అందులోంచి పుట్టుకుని రాకుండా వచ్చిన వాడు జన్మతః దివ్య శరీరుడై ఉంటాడు. ఆ శరీరం పెరుగుతూ ఉంటుంది. ఈ లోపల పనులు చేసుకుంటూ ఉంటాడు ఆ ఇంకో శరీరంతో. తరువాత దాంతో పనులు చేసినంత కాలం చేస్తాడు. ఎప్పుడు కావాలంటే అప్పుడు స్వచ్ఛందంగా వదిలేస్తాడు. దాన్నక్కడ పెట్టి కూడా పనులు చేసుకుంటూ ఉంటాడు. ఇట్లా చేసుకుంటూ ఉంటాడు అయోనిజుడు. కేంద్రం నుండి పరిధికి వచ్చిన వాళ్ళం తిరుగుదారిలో శరీరము, ఇంద్రియములు దాటి మనస్సు వరకు వచ్చాం మానవులం. మనస్సు నుండి బుద్ధిలోకి వెళ్ళాలి. కాబట్టి బుద్ధి ప్రచోధనం కోసం ప్రార్థనలు, గాయత్రి ప్రార్థనలు. కాబట్టి దీపాలు పెట్టుకుని, బాగా అలంకరణ చేసుకుని వెలుగులు, కళలు పెంచుకునేట్టుగా దేవతలని తయారు చేసుకుని ఆరాధన చేసుకోవడం. కాబట్టి బంగారం రంగుని ఆరాధన చేయడం. ఎందుకంటే బొడ్డులో ఉండేవాళ్ళం హృదయంలోకి పెరగాలంటే తరువాత రంగు బంగారమే. ఆ బంగారం మీద మోజు ముందు బయట కొనుక్కోవడంగా ఉంటుంది. ఆ బంగారం లోపల దొరికిన తరువాత బయట బంగారం మీద మోజు పోతుంది. లోపలే ఉంది బంగారం ఇంక బయట బంగారం ఎందుకు? బయట బంగారం బరువు, కాపలా కాయాలి. లోపలి బంగారం ఎవరూ ఎత్తుకుపోలేరు. అట్లా కళ్ళు మూసుకుని లోపలికి వెళ్తే ఆనందంగా, హిరణ్మయమైన రంగు పొద్దున్నే సూర్యుడు ఉదయించేప్పుడు వస్తూ ఉంటుంది చూసినట్లయితే. అది హృదయంలో దర్శనం చేయవచ్చు. దాన్నే మొదట అమ్మవారన్నారు. అదే శ్రావణ మాసంలో మనం చేసే లక్ష్మీ పూజలు. అక్కడికి చేరుకోవాలి. అక్కడి నుండి మనకి మళ్ళీ కేంద్రం వరకు వంతెనలు ఉన్నాయి. ఆ

వంతెనలు ఎక్కి వెళ్ళిపోతూండాలి. వంతెనెక్కి వెళ్ళడానికి సహాయపడే వారు ఇద్దరున్నారు. అనల్, అనిల్ అని. అనల్ అంటే అగ్ని. అనిల్ అంటే వాయువు. 'అనిలో అనలః' అని మనకు ఇద్దర్నీ ఓ చోట చెప్తారు. వీళ్ళిద్దరూ భలే మంచి స్నేహితులు. వాళ్ళిద్దరినీ పట్టుకుంటే మన్నట్లా ఆకాశంలో తీసుకుపోతారు. వాళ్ళని పట్టుకోకపోతే మురుగ్గుంటల్లో ఉంటాం. ఏం సందేహం లేదు. అగ్ని పవిత్రీకరిస్తుంటుంది. వాయువు ఊర్వగతికి తీసుకుపోతూ ఉంటుంది. అగ్ని, వాయువు రెండూ మనలో పనిచేయాలంటే చేయవలసిన ప్రక్రియ ఒకటే. దీర్ఘమైనఉచ్ఛ్వాస నిశ్వాసాలని ప్రశాంతంగా, చాలా సేపు రోజూ చేసుకుంటూ ఉండడం. అలా చేయడం వల్ల వచ్చే సిద్ధిని ప్రాణాయామం అన్నారు. చేయడం ప్రాణాయామం కాదు. ప్రాణాయామం చేస్తున్నానని ఎవరన్నా అంటే వాడికేం తెలియదని తెలుసుకోండి. ప్రాణమును చక్కగా మనస్సు లగ్నం చేసి దానితోపాటు దీర్ఘంగా పీల్చుకుంటూ హృదయంలోకి వెళ్ళి, అక్కడి నుండి మళ్ళీ దీర్ఘంగా వదులుతూ బయటికొస్తూ, లయాత్మకంగా అట్లా దానియందే మనస్సుపెట్టి రోజూ అరగంట చేస్తే, అనల్, అనిల్ వీళ్ళిద్దరూ మనలో బాగా ప్రజ్వలించి పనిచేస్తారు. అగ్ని గారు ఏం చేస్తారంటే శరీర ధాతువులన్నింటినీ కూడా శుభ్రంగా వేడెక్కిస్తాడు. వేడెక్కితే కదా పదార్థం మారుతుంది. భగోణీలో బంగాళదుంపలు వేసి, నూనె వేశాం. కింద మంట పెట్టకపోతే అవేం మారతాయి! అట్లాగే ఉంటాయి. నీళ్ళు పోసి బంగాళదుంపలు అక్కడ పడేసాం, కింద మంట పెట్టలేదు. మూడు రోజుల తర్వాత ఎట్లా ఉంటుంది? పాచికంపు కొట్టదూ? అగ్ని వాడుకోనివాడి శరీరం కూడా అట్లా పాచి కంపు కొడుతుంది. కొంతమంది శరీరాలు భయంకరమైన వాసనలొస్తూంటాయి, వాళ్ళు పక్క నుండి వెళితే. భయంకరమైన వాసనలు శరీరంలోంచి ఎందుకు వస్తాయో తెలుసా? ఇక్కడ అగ్నిగారికి, వాయువు గారికి అసలు బొత్తిగా మేము ఏమాత్రం చోటివ్వలేదని చెప్పడం. వాటిని బాగా మనం వాడాం అనుకోండి. అవి శరీరం నుండి దుర్గంధాలన్నీ పోగొట్టి, శరీరం నుండే సుగంధాన్ని అందిస్తుంది. యోగుల శరీరం నుండి సుగంధ పరిమళాలు వస్తాయి. నేను ప్రత్యేకంగా ఒక్కరి విషయంలో చూశా. ఒకాయన మహాయోగి. ఆయన జొన్నలగడ్డ వెంకటసుబ్బయ్యగారు! ఆయన మరణిస్తే మూడు రోజులు ఉంచేశారు శరీరం, అందరూ రావాలి అని. మామూలుగా మూడు రోజులు శరీరం ఉంచితే కంపు కొట్టెయ్యాలి ఊరంతా. అలాకాకుండా సుగంధ వాసనలు వచ్చినాయి ఆ శరీరంలోంచి. చేసిన సాధన అటువంటిది. బాగా ప్రాణాయామమునందు నిలబడి ఉన్నవాళ్ళకి ఇలా జరుగుతుంది. సత్యం ఇది. మనక్కూడా సత్యం ఎప్పుడంటే, మనం శ్వాసనందుకుని వేడిని పెంచుకుంటే, గట్టిగా మూడుసార్లు శ్వాస ఎగదీశామంటే ఆవలింతలు వస్తాయి తెలుసా? ఎందుకు ఆవలింతలు వస్తాయి అంటే లోపల చచ్చే తమస్సు. భయంకరమైన తమస్సు. అట్లా గాండ్రింపుగా వస్తాయి ఆవలింతలు. అయినప్పటికీ చేస్తూ ఉంటే రోజూ అరగంట, శరీర ధాతువులన్నీ వేడెక్కి, అగ్ని మార్చలేనిదేమీ లేదు కదా. దేన్నైనా అదృశ్యం

చేయగలదు. స్థితి మార్పు రావాలంటే అగ్నికార్యం జరగాలండీ ఒంట్లో. కబుర్లు చెప్తే రాదు. అగ్నికార్యం జరిగితే శరీరం ముందు పవిత్రీకరింపబడుతుంది. కాబట్టి దీన్ని పవిత్రీకరించుకుంటుంటే మనస్సులో ఆలోచనలు కూడా పవిత్రీకరింపబడతాయి. ఏవో పాపం రకరకాలుగా చెప్పి ఇచ్చారు. పోనీ ఇట్లా చేసి చూడరా. అట్లా చేసి చూడరా. ఇంకో రకంగా చేయరా. ఎన్ని చెప్పినా మనకి మాత్రం హుహూ... అన్నట్లుగా ఉంటుంది. కదల్దు ఎద్దు. పెద్ద దున్నపోతు వ్యవహారం. వీళ్ళిద్దరినీ వాడుకోవడం మొదలుపెడితే ఒక దాన్ని ఒకళ్ళు, అట్లా చక్కగా అగ్నికి వాయువు తోడైనట్లు అంటూంటాం చూశారా! అలా మొత్తం శరీరాన్ని పునర్నిర్మాణం చేసి పెట్టేస్తారు. మనకి petromax light మంచి ఉదాహరణ. అట్టా పంపు కొడుతూ ఉంటే, అంటే అది గాలేగా. ఆ పంపు కొట్టిన కొద్దీ ఆ మంట లేస్తూ ఉంటుంది. లేచి లేచి అది బాగా ఊర్ధ్వగతి చెంది పైన mantleకి అంటుకోంగానే అది వెలుగుతుంది కదా. ఇంక అది వెలిగిన తరువాత పంపు కొట్టనక్కరలేదు. కనీసం అదన్నా చేయండి. ఓ petromax light కొనుక్కొని దాని పంపు కొడితే ఏం జరుగుతుందో తెలుస్తుంది. అట్లా ఆ కొట్టిన పంపు వల్ల బుర్రలో వెలుగుతుంది. మన brain material ఆ petromax light లో పెట్టిన mantle లాంటిదే. అంత సూక్ష్మమైనది. అది వెలిగిందనుకోండి, ఒక స్తంభానికి పైన గుండ్రని dome లో bulb పెట్టినట్లు అయిపోతుందన్నమాట. The light in the head అంటారు. పరమగురువులు చెప్తూ ఉంటారు. సంవత్సరానికి ఒక్కసారి చూస్తారట. ఏమన్నా కొద్దిగా అన్నా వెలిగిందా లేదా అని. వెలక్కపోతే వాడి జోలికి రారట. వెలిగితే వస్తారట. వెలగని వాడిని పట్టుకుని ఏం చేసుకుంటారు? వెలిగిన వాడితో ఏమన్నా పనుంటుంది వాళ్ళకి. అది కూడా ఎవర్నీ? తాపత్రయపడే వాడి విషయంలో. అసలు తాపత్రయమే లేకపోతే గొడవేలేదు. బాగా తాపత్రయపడితే ఏదో సాధన పేరున కిందా మీద పడుతున్న వాళ్ళకి వెలిగిందేమో చూస్తారు. మరెట్లా వెలుగుతుంది? ఇవేమన్నా చేస్తే వెలుగుతుంది. వెలుగు ధ్యానం చేయాలి. లేదూ ఓంకార ధ్యానం, శబ్దాన్ని పట్టుకుని లోపలికి వెళ్ళాలి. లేదూ శ్వాస పట్టుకుని లోపలికి వెళ్ళాలి. లేకపోతే కూర్చో, లేకపోతే పడుకో అంతే. ఇంకో మార్గం లేదు. నామాలు లాభం లేదు సార్, ఇది యోగం. నామాలు మనస్సు పరిపరి విధాలుగా పోకుండా ఉండడానికి ప్రయత్నం చేశావే తప్ప, అంతర్ముఖుడై తన్ను తాను తెలుసుకోవడానికి పెద్ద పనికొచ్చే విషయాలు కావవి. మనస్సు పవిత్రంగా ఉంచుకోవడానికి కాస్త పనిచేస్తాయి. అంతర్ముఖుడవాలంటే మంత్రం కాదు. మంత్రం అంటే మనస్సుకు సంబంధించింది. 'మననాత్ త్రాయతే ఇతి మంత్రః' మననం ఉన్నంతసేపు మనస్సు ఉంటుంది. ఇది మనస్సు కరిగిన స్థితిలో కానీ తెలిసే విషయం కాదు. అందుకనే బయట చెప్పకునే విషయాలు వేరు. పరమ గురువుల పరంపరలో చెప్పకునే విషయాలు వేరు. మామూలుగా రోజంతా దైనందిన కార్యక్రమాల్లో అవి ఇవి పిచ్చి పిచ్చి ఆలోచనలు చేసుకోకుండా ఉండడం కోసం మంత్రం చేసుకోండి. అంతటితో

చాలదు. అంతర్ముఖుడుగా ఆ మంత్ర దేవతను లోపల ధ్యానం చేయండి కనీసం. అది వెలుగు మూర్తిగా ధ్యానం చేయండి. రంగురంగుల రూపంలో రాముడి రూపం చూసుకుంటూ, రామనామం చేసుకోండి. కానీ లోపల వెలుగును చూడకుండా ఏం చేసినా ఏం లేదు. లోపలికి తిరగాలి, లోపల వెలుగుని చూడాలి, దాంట్లో మనస్సు కరగాలి, అంతే! బయట మనం వినేవన్నీ కూడా ఊరికే బహిర్లోకాల్లో, కాస్త సంఘంలో శాంతి, భద్రతలకు పనికొచ్చే విషయాలు. సాధనంతా అంతర్ముఖమే, బహిర్ముఖంలో ఏమీ లేదు. ఇందులో ఏం సందేహం లేదు. బాధపడి ఉపయోగం లేదు. చేసుకోవడంలో ఉంది. ఆ విధంగా మనం వ్యాస తత్త్వాన్ని మనలో ఉన్న అన్ని ఏడు కేంద్రముల నుండి మూల కేంద్రంలోకి దారులున్నాయి. వాటిని నిర్మాణం చేసుకోవడానికి అగ్నిని, వాయువుని వాడుకోవాలి. వాడుకుని నిర్మాణం చేసుకోవాలి. అట్లా నిర్మాణం చేసుకున్న వాళ్ళ దగ్గర నుండి స్ఫూర్తి అందుకోవడం కోసం ఒకసారి వారి స్మరణ చేసుకోవడమే గురుమంత్రం స్మరణ చేసుకోవడం. సద్గురువు ఎప్పుడూ కూడా 'అట్లా నా మొహం మీదే concentrate చెయ్' అని చెప్పరు. 'నన్ను స్మరణ చేయి, నా ఆశీర్వచనం నీకిస్తాను, నువ్వు ఆశీర్వచనం అందుకుని ముందుకి నడు' అని చెప్తారు. ఇక్కడి నుండి కాశీకి దారి చూపిస్తూ ఒక board పాతి, ఆ board దగ్గరే కూర్చుంటే? ఏరా అంటే కాశీకి వెళ్ళాలి అని కూర్చున్నా, అని అన్నట్టుంటుంది. కాశీకి వెళ్ళాలంటే కూర్చున్నావేంట్రా అంటే మరి అదేగదండీ! అది కాదు. దిక్సూచి లాంటి వాడు, మార్గదర్శి గురువు. మార్గంలో నడవాల్సింది నువ్వు. మార్గంలో నడవాలంటే నువ్వేం చేయాలో తట్టెడు చెప్పిపోతాడు, తట్టెడు రాసి పోతాడు. చెప్తే మర్చిపోతారేమో అని భయపడి రాసి కూడా పోతాడు. మన మీద ఆయనకి చాలా అపనమ్మకం. ఎందుకంటే చెప్పింది చెప్పినట్టుగా ఒకటి వినడు, చెప్పింది చెప్పినట్టుగా ఇంకోడికి చెప్పలేడు. కాబట్టి ఎందుకైనా మంచిది మనం చెప్పింది మనమే రాసిపోతే గొడవుండదని రాసుకుపోతాడు. చూసుకుంటే కనిపిస్తాయి ఏం చేయాలో. ఇప్పుడు నేను చెప్పేవన్నీ రాసున్న విషయాలే. రాసిన వాటిని చూస్తూ సంతోష పడకూడదు. రాసినవన్నీ చూసుకుని, అవి వంటికి పూసుకుని బయలుదేరాలండీ, బయలుదేరితే ముందుకెళ్తామండీ, ముందుకెళ్ళడం అంటే లోపలికెళ్ళడమండీ, ఎత్తులు మనకొద్దు. లోతులు కావాలి. ఎత్తులు, పైఎత్తులు అవన్నీ ప్రపంచానికి సంబంధించినవి. లోపలికెళ్తే ఇంక పైఎత్తులేం లేవు. Dip deep, అన్నారు కదా ఆయన. ఒకే ఒక మాట. అట్లా మనకి లోపలికి ఎంత వెళ్తే అంతుంది. అక్కడి నుండి నీకు దారులు, మెట్లు బోలెడు దొరుకుతాయి. అందుకని బయట చదువుకున్న గ్రంధాలు కన్నా, ఈ చేయడం వల్ల తెలుసుకున్నవే ఎక్కువ. అప్పుడు ఈ వాయువు, అగ్ని నీలో బాగా ప్రజ్వలించి పనిచేయడం మొదలుపెడితే నీ లోంచి వచ్చే సంకల్పాలలో, ఆలోచనల్లో మార్పులొచ్చేస్తాయి. అంటే నీ బృహ్మణము వేరుగా ఉంటుంది. నీ వాచస్పతి తత్త్వం వేరుగా ఉంటుంది. ఎంత నీలో మార్పు వస్తుందంటే నెమ్మదిగా అది దివ్య శరీర నిర్మాణానికి దారి తీసేంతవరకు

వస్తుంది. ప్రాణాయామం అయింతర్వాత ప్రత్యాహారం. ప్రాణాయామం జరిగితే అక్కడి నుండి తను, తన శరీరం నుండి విడివడి లోపలికి withdraw అవడం అనేది ఉంటుంది. అందులోంచి, హృదయకేంద్రంలోంచి, ఆ బిందువు లోంచి, అంతర్లోకాలకు వెళ్ళి, అక్కడి నుండి బయటికి రావడమే ధారణ. అప్పుడు తన శరీరాన్ని తను ధరించి ఉన్నట్టు తెలుస్తుంది. కాబట్టి అటు వెళ్ళాలి. ఈ నామములో మనకి అటు వెళ్ళిన వాడికి ఏమి జరుగుతుందంటే 'దివిస్పుక్'. అంటే మొత్తం తనలో ఉండే ఏడు కేంద్రములు తనకే గోచరిస్తాయి. ఆరు కేంద్రాలు కనిపిస్తాయి, ఏడవకేంద్రం తనే. తను ఎక్కడి నుండి వచ్చాడో అది ఎనిమిది. అందుకనే ఆయన అష్టమ గర్భం. 8 ఆయన అంకె. ఆయన ఎనిమిదో వాడు. మనం ఏడో వాళ్ళం. 6 కేంద్రాల్లోకి ఎట్లా మనం వస్తున్నామో తెలుస్తుంది ప్రతినిత్యం. జీవాత్మగా భ్రూమధ్యంలోకి రావడం, నిద్దర్లోంచి లేవడం. అంటే ఎక్కడి నుండి ఎక్కడికొస్తున్నామో తెలియడం భ్రూమధ్యంలోకి రావడం. అక్కడి నుండి విశుద్ధి లోకి రావడం బృహ్మణం. హృదయమునందు, సమస్తమునందు భగవంతుని యొక్క దర్శనం చేస్తూ, సమస్తము యొక్క శ్రేయస్సు కోరుతూ పనిచేయడంగా ఉంటుంది. ఆ ఆలోచనలు బోలెడు. దానిని నిర్వర్తించే బలము కుజుడు-స్వాధిష్ఠానము. మూలాధారంలో శని దాన్ని అవతరింప చేయగలిగిన సమర్థత. ఇన్ని కేంద్రాలు తన నుండి వ్యక్తమై పనిచేస్తున్నాయి అని తెలుస్తాయి. ఈ దారాలన్నీ తన నుండే బయటకు వస్తున్నాయి, ఆ దారాల్లోంచి తను బయటికెళ్ళి, మళ్ళీ ఆ దారాల్లోంచి (దారం అంటే దారులే) లోపలికొచ్చేస్తాడు. అట్లా బయటకి వచ్చి పని చేసుకోవచ్చు. లోపలకు వెళ్ళి తలుపు వేసేసుకోవచ్చు. లోపల నుండి బయటకు వచ్చేవాడుదేవాలయం గర్భగుడిలోకి వెళ్ళి బయటికొచ్చినట్టు. ఆ బయట ఉండే దాన్ని outer Temple అంటారు. ప్రపంచం కూడా దేవాలయమే. ప్రపంచంలో పగలంతా పనిచేస్తాడు. సాయంత్రం అయ్యేసరికి దాన్ని మూసేసుకుంటాడు. అంతర్లోకాల్లోకి, దేవాలయం గర్భగుడిలోకి వెళ్ళిపోతాడు. ఓ inner Temple opened. Outer Temple opening, inner Temple opening, ఇట్లా జరిగిపోతూ ఉంటుంది. లోపలుంటే వాడితో ఉంటాడు, బయటికొస్తే వాడిని పట్టుకుని బయటికి వచ్చి పనులు చేసుకుని మళ్ళీ లోపలికి వెళ్తాడు. వాడి కష్టడేం తెలుస్తుంది? వెలుగులోకములు తను కూడా స్పృశించి ఉంటాడు. మనస్సు దగ్గరికొచ్చేసరికి వెలుగు తక్కువగా ఉంటుంది. చంద్రుడు వెలుగు చాలా తక్కువ, సూర్యుడి వెలుగుతో పోల్చి చూస్తే. బుధుడు వెలుగు మన భూమి కన్నా 6 రెట్లు ఎక్కువ. బుద్ధి లోకాల్లోకి వెళితే అంత వెలుగు వస్తుంది. కాబట్టి ఎక్కువ వెలుగుతో అన్ని వెలుగు లోకాలని స్పృశించడమే 'దివిస్పుక్'. సర్వదృక్ అక్కడి నుండి సాక్షీభూతుడుగా తానే సమస్తాన్ని దర్శించే స్థితి ఏర్పడుతుంది. అక్కడి నుండి తనే పరిధిలోకి వస్తాడు వ్యాసంగా. వాచస్పతి, తనదైన దివ్య ప్రణాళిక తన నుండి వ్యక్తమవుతుంటే దాన్ని అనుసరించి తను పనిచేస్తూంటాడు. అయోనిజుడు, ఇక్కడ ఉన్నప్పటికీ కూడా దీనికి సంబంధించి గాక,

దీంట్లో బంధింపబడక ఉంటాడు. ఈ విధంగా మనకి ఈ నామాలు చక్కటి అవగాహన ఇస్తాయి. ఏ నామంలో అయినా సరే మనకు కావాల్సింది సాధనండీ. దేవుడు చాలా గొప్పవాడు. దేవుడు మరీ గొప్పవాడు. ఇట్లా చెప్పకున్నాం అనుకోండి రోజూ కూర్చుని ఏమవుతుంది? స్తోత్రంలో చాలా ఉద్దేశించారు మనకి. చాలా నిర్దేశించారు కూడా. దేవుడు గొప్పవాడని నువ్వెందుకు చెప్పడం? నువ్వు చెప్పకపోయినా గొప్పవాడే. కానీ ఆ దైవం నీయందు నీవలే ఉన్నది. కాబట్టి దాన్ని నువ్వేమన్నా దర్శిస్తే నువ్వు కూడా అంతటి వాడివిరా అని తెలియాలి. భీష్ముడు వ్యాసుడ్ని కూడా అట్లా దర్శించాడు. కాబట్టి విష్ణు సహస్రనామంలో అది కూడా చేర్చారు. వ్యాసుడు జన్మం అయోనిజ చెప్పకోవాలి. పరాశరుడు-తండ్రి, సత్యవతి-తల్లి కదా. పరాశరం అంటే ఏమిటో తెలుసా? శరం అంటే బాణం. 'శరోఃఆత్మా' అంటుంది ముండకోపనిషత్తు. బాణమే జీవాత్మ. ధనస్సు ఓంకారము. ఓంకారానికి జీవాత్మని సంధించడం వలన పరమాత్మని చేరుకుంటుందని మనకి ముండకోపనిషత్తు ఇచ్చే మార్గం. ఇక్కడ ఆ శరం ఏం శరం అయ్యా అంటే పరాశరం అంటారు. అంటే అది కేవలం పరతత్త్వానికి గురిపెట్టి ఉన్నటువంటి బాణం. అది ఇంకో బ్రాహ్మణుడు అనుకోకండి. పరాశరముని ఎటువంటి వాడంటే ఆయన కారణంగానే శ్రీకృష్ణుడంతటివాడు భూమ్మీదకు రావడానికి వీలుబడ్డది. లేకపోతే కష్టం. తాను, ఏడు రోజులు తన అనుయాయులతో కలిసి, నారదుడి యొక్క సలహాతో, ఒక యజ్ఞం ఆచరించి, ఏడు రోజుల్లో ఏడు ధాతువులు, శ్రీకృష్ణుడు జీవించి ఉండడానికి సరిపడ అర్హత కలిగిన ధాతువులు నిర్మాణం చేసి, అది దేవకీదేవి గర్భంలోకి ప్రవేశింప చేస్తాడు. ఏడవ రోజు రాత్రి గుహలోకి వెళ్ళి ఇంక అక్కడి నుండి తనని తాను సమర్పణ చేసేసుకుంటాడు. ఎందుకంటే అప్పుడు చేసిన ఉచ్చారణ తరువాత ఆయన ఉండడానికి వీలు లేదు. మన భాషలో చెప్పకోవాలంటే ఆత్మాహుతి చేసినవాడు. సామాన్యుడు కాదు. ఆయన పేరు పరాశరుడు అని ఎందుకొచ్చిందీ? పరము ని లగ్నం చేసిన శరముగా ఉన్నవాడని అర్థం. పరతత్త్వం తప్ప ఇంకోటి లేదండీ ఆయనకి mind లో. ఎక్కడ చూసినా పరతత్త్వము యొక్క అవతరణమే చూస్తాడాయన. నరులలోనూ పరుని చూస్తాడు. సృష్టి అంతటా పరునే చూస్తాడు. ఇంకేం చూడడు. ఆ పరుని యొక్క కార్యక్రమాన్ని తను దర్శిస్తూ జీవిస్తూ ఉంటాడు. మైత్రేయుడికి ముందు పరాశరుడు జగద్గురువు. శ్రీకృష్ణుడు రావడానికి దారులేర్పచినవాడు. అదీ పరాశరము అంటే. పరమునకు గురి చేయబడిన తత్త్వము కలిగిన వాడు. ఆయన పరాశరుడు. ఆమె సత్యవతి. సత్యమే రూపు కట్టుకుని ఉన్నదనుకోండి, ఎట్లా ఉంటుంది? సత్యలోకం ఏడో లోకంగా చెప్తారు. ఓం భూః, ఓం భువః, ఓం సువః, ఓం మహః, ఓం జనః, ఓం తపః, ఓగ్ం సత్యం అంటాం కదా. సత్య లోకంలోనే జీవిస్తుందిట ఆవిడ. ఊరికే ఇట్లా పడవ నడుపుకోవచ్చు, మాంసం అమ్ముకోవచ్చు, అది వేరే సంగతులు. చేపలు తినచ్చు, అబ్బే ఆవిడ చేపలు తింటుందండీ. మనకి భౌతిక వాదం బాగా ఎక్కువ కాబట్టి మనం అవే

చూస్తాం. ఆవిడ తిన్నదో లేదో మనకు తెలియదు కదా. ఇంకో ఆయన మాంసం అమ్ముకున్నాడు సత్యలోకంలో జీవిస్తూ. శరీరం ఏం చేస్తుంది అనేది కాదు. తానెక్కడ స్థిరపడి ఉన్నాడని. ధర్మవ్యాధుడు మాంసం కొట్టు పెట్టుకున్నాడు. ఏమిట్టా? ఇంకో ఆయన చెప్పులు కొట్టు పెట్టుకుంటాడు. కాదా పెట్టుకోకూడదా? Spiritualist అంటే మనకేవో కొన్ని idea లు ఉన్నాయి. అట్లా ఉంటేనే అనేం లేదు. నువ్వక్కడుంటే, ఇక్కడ ఎట్లా ఉన్నా పర్వాలేదు. ఆ స్థితిలో ఉండే వాళ్ళు, అంటనటువంటివాళ్ళు ఏదైనా పెట్టుకోవచ్చు. ఆవిడ సత్యమునందు స్థిరపడి జీవిస్తూ ఉంది ఒక దివ్య ప్రణాళికకి. కేవలం వ్యాసుని పుట్టుక ఆమె జీవితం యొక్క ప్రయోజనం. ఆ తరువాత శంతనుడు వ్యామోహపడడం ఇంక వేరే విషయం. వ్యాస జననం కోసమే ఆమెని పంపించారు. పరాశరుడు వచ్చాడు. దిగి వచ్చినవాడి పేరు 'ఉపరిచరవసువు'. ఉపరి అంటే పైన. పై లోకాల్లో చరించే ప్రజ్ఞ అండీ. ఆయన వేదవ్యాసుడండీ! భీష్ముడు కూడా వసువే! వ్యాసుడు కూడా వసువే! ఉపరిచరవసువుగా ఆ పైలోకాల్లో హాయిగా విహరిస్తున్న వాడన్నమాట. పరాశరుడు ఆకాశంలో గ్రహముల యొక్క కూటమిని చూశాడు. కాలం యొక్క సందేశాన్ని చూశాడు. రాబోయే కాలాన్ని ఒక్కసారి గుర్తుతెచ్చుకున్నాడు. అంతా పరమ చీకటిగా ఉంది. జీవులయందు కలిగిన అపారమైన ప్రేమ కారణంగా ఆ ఉపరిచరవసువుని ఒక్కసారి ఇట్టా కొక్కేం వేసి కిందకి లాగాడుట. ఆ time లో తప్ప అంత మహత్తరమైన ప్రజ్ఞ భూమికి దిగడానికి అవకాశం లేదు. గ్రహముల యొక్క తీరు అట్లా ఉంది. వాటికి placements అంటాం చూశారా. అంత అద్భుతంగా ఉన్నాయి గ్రహముల యొక్క స్థితి. ఈ సమయంలో గనక ఒక జీవుడ్ని మనం గనక తీసుకురాగలిగితే, అత్యుత్తమమైన లోకాల నుండి తీసుకువచ్చి, అందివ్వవచ్చు. అంటే కృష్ణ లోకము, ఏడు లోకములకు పైన ఉండే గోలోకమంటామే ఆ లోకం నుండి ఒక ప్రజ్ఞను పట్టుకొచ్చాడాయన. ఆయన కూడా లోకహితార్థమే దిగి రావడానికి సంసిద్ధుడయ్యాడు. సంసిద్ధుడైతే ఈయన సంకల్పించాడు, ఆయన వచ్చాడు, ఆమెకి , సత్యవతికి చెప్పాడు, దీనివల్ల నీ కన్యత్వము ఏమీ చెడదు అని. ఇది కేవలం ఒక దివ్యమైన ప్రక్రియగా తీసుకో నువ్వు. మహత్తరమైన యుగములకు సరిపడా, కావలసిన పని చేశాడు. Service service అని గోల పెడుతూ ఉంటాం కదా. ఎన్నాళ్ళు చేస్తాం? ఎన్ని పూటల చేశాం? మనం చేసేది ఎన్నాళ్ళు నిలిచింది? అక్కడ చూడండి పరాశరుడు ఒక్క పని ద్వారా మొత్తం కలియుగానికి కావల్సిందంతా చేశేసాడండీ! ఆమె ఆ ఒక్క కార్యము చేత, 'జన్మ ధన్యత గాంచెన్' అంటాం చూశారా! అటువంటి మహాత్ముడ్ని ఆ విధంగా అందించడానికి ఉపయోగపడింది. అటువంటి ఉత్తమమైన కార్యములలో, యోగ్యాయోగ్యతలు, ఇట్లా చేయవచ్చా? ఇట్లా చేయకూడదా? అబద్ధం చెప్పను నేను అనంగానే, మన ఇంటోకి ఎవడో ఒకాయన పరిగెత్తుకుంటూ వచ్చి దాక్కుని అయ్యా నన్ను ఎవరో వెంటపడి చంపుతాం అంటున్నారు. కాస్త ఇక్కడ దాక్కోనివ్వండి. వస్తే

చెప్పకండి అని చెప్తే, ఇప్పుడు అసత్యం చెప్పాలా? చెప్పకూడదా? సత్యమే పలుకుతానని చెప్పి, సత్యం చెప్పి వాడిని చంపిస్తావా? నీవు సత్యం చెప్పకపోయినా పర్వాలేదు వాడి ప్రాణం నిలబెడతావా? ఈ రెండిట్లో ఏది ఎక్కువ ధర్మం? చిన్నచిన్న ధర్మాల్లో పెద్ద ధర్మాలొచ్చినప్పుడు పక్కకి తప్పుకోవాలి. అదే శ్రీకృష్ణుడు చూపించాడు. అదే పరాశరుడు చూపించాడు. అదే వేదవ్యాసుడు కూడా చూపించాడు. చిన్న ధర్మాలు చిన్న ధర్మాలుగా పనిచేస్తూ ఉంటాయి. పెద్ద ధర్మం ఒకటి వచ్చినప్పుడు చిన్న ధర్మం పక్కకి తప్పుకోవాలి. మాస్టారు గారు ఎప్పుడూ ఒక ఉదాహరణ చెప్తుండేవారు. ఈ ఊళ్ళో collector గారు రేపో programme వేసుకుంటే ఇట్లా చేద్దాం అని, రాత్రి Chief secretary గారు వస్తున్నారని phone వచ్చిందనుకోండి, రేపు పొద్దున ఈ programme అంతా ఏమవుతుంది, పక్కన పెట్టాలి. అలా కాదు సార్ నేను already వేసేసుకున్నాను అంటే, నోర్మూయ్ అంటాడు. బద్ధడే కదా. Chief secretary కి local collector బద్ధుడు. అసలు వచ్చేదెవరు? అటువంటి వాడు వస్తున్నప్పుడు ఇప్పుడు మీదేం కులం అమ్మాయ్, అని అడిగాడనుకోండి అక్కడ కూర్చుని, అంటే మన బ్రాహ్మల్లాగా. ఆవిడకే కులం లేదు. ఎందుకంటే సత్యవతి దొరికింది. చేపల వాళ్ళకి పుట్ట లేదు. అటువంటి సంభాషణలు పెట్టుకుని ఏదో మన శ్రోత్రియతకు ఇది అడ్డొస్తుందా, రాదా? ఇట్లా చూసుకునే వాళ్ళు జగత్ హితమైన కార్యాలు చేయలేరు. తన గురించి ఆలోచన ఉండక, సంఘశ్రేయస్సు గురించి ఆలోచన, ఒక యుగమునకు సంబంధించిన జీవుల యొక్క శ్రేయస్సు ఆలోచించాడండీ పరాశరుడు. అంతే స్ఫూర్తి కలిగినది సత్యవతి దేవికి. కాబట్టి వేదవ్యాసుడు దొరికాడు. మనబోటి వాళ్ళకోసం వాళ్ళు ఎంత చేశారో మనకి అర్థమే కాదు. ఎట్లా చెప్పుకుంటాం అంటే ఆ... వ్యాసుడు కూడా అట్లాగే పుట్టాడు కదండీ! ఏంటో మాట్లాడుతూ ఉంటాం. అంటే నీ బుద్ధి ఏ ఏ లోకాల్లో పనిచేస్తుంటుందో, అంతవరకే నువ్వు అవగాహన చేసుకోగలవు తప్ప, అసలు విషయం అవగాహన చేసుకోలేవు. పుట్టీపుట్టంగానే పెరిగిపోయి, తండ్రికి నమస్కరించాడు, తల్లికి చెప్పాడు 'తల్లీ నువ్వెప్పుడు తలుచుకుంటే అప్పుడు నేను కనిపిస్తాను, నేను వెళ్తున్నాను' అన్నాడు. అంతే రావడం, రావడం పనిలోకి వెళ్ళిపోయాడండీ, కుమారస్వామిలాగా. కుమారస్వామి అంతే, పుట్టీపుట్టంగానే పదండి బయలుదేరుదాం తారకాసురుడ్ని సంహరించడానికి అన్నాడు. ఇట్లా పుట్టాడు, అట్లా ఐదేళ్ళ పిల్లాడై, లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా బయల్దేరతాడు. ఎంత అద్భుతంగా ఉంటుందో. వాళ్ళు ఇప్పుడే పుట్టాం, కాసేపు అట్లా ఉందాం, ఆ గంగానది దగ్గర కాస్త అటు ఇటు తిరుగుదాం, ఇట్లా ఉండదు. రావడం రావడం కార్యక్రమమే! దిగాడు, బయటికి వచ్చాడు, చేశాడు చేశాడు. తను వచ్చింతర్వాత పురాణ పురుషుడు వచ్చాడు. పురాణ పురుషుడు వెళ్ళిన తర్వాత తను వెళ్ళాడు. ఎంత పని చేసాడండీ! అహర్నిశలూ పనిచేశాడు. ఆయన గురించి కూడా చెప్పుకోవాలి. ఎందుకంటే వ్యాస అన్నప్పుడు వ్యాసుడు. అయోనిజుడు. ఆయనా వాచస్పతే. ఎటువంటి

వాక్కు వచ్చింది ఆయన నుండి. గణపతంతటివాడు రాయలేనంత వాక్కు వచ్చింది. అంత వాఙ్మయం వచ్చింది కదా. ఎవరూ రాయలేకపోయే వారుట ఆయన మాట్లాడుతుంటే. చూశాడూ, ఇది కాదు అని, ఉపరిచరవసువు కదా అందుకని పైన Highest quarters కి వేశాడు ఒక application. 'ఏమయ్యా మరి నన్ను పంపించారు కదా. ఎవడన్నా రాసేవాడుంటే రాస్తాను లేకపోతే నాకేం బట్టే' అన్నాడుట మన భాషలో చెప్పుకోవాలంటే! బాబ్బాబూ రాయరా బాబూ, అని గణపతినిచ్చారు. గణపతి 'ఆ.. నా అంతటివాడు కావలసి వచ్చిందా? ఇంతోటి రాసే వాడికి నేను కావాలా' అనుకున్నాడు ఆయన. గణపతంటే ఏంటే? సమస్తమైన శబ్దములని వర్గీకరించి, గుంపులు గుంపులుగా తయారుచేసి, సృష్టికి కావాల్సిన శక్తులన్నింటినీ పుట్టించిన మహా ప్రజ్ఞ! ఊరికే మనకన్నీ పెద్ద పెద్ద విషయాలు అట్లా ఊరికే ఇచ్చేసారండీ చలిమిడి ముద్దల్లాగా. మనం ఏదో ఆ..గణపతే కదా అనుకుంటాం. లో నుండి వచ్చిన నాదాన్ని ముక్కలు ముక్కలు చేయడమే ఉండ్రాళ్ళు బయటికి తీసుకురావడం. పొట్టలోంచి బయటికొచ్చేస్తాయి కదా. ఉండ్రాయి కూడా మన లడ్డు లాగా చిన్నచిన్న గుళ్ళు, మళ్ళీ పోగేస్తే పెద్ద గుండవుతుంది. అట్లా అన్నీ పోగేసి వాఙ్మయాన్ని ఇచ్చినవాడు శబ్దాలతో. గణాధిపత్యం అది! గణములుగా విభజించి, వాటిమీద అధిపతిగా తానున్నవాడు. వ్యాసుడు ఆయన్ని అడుగుతాడు. ఆయన వస్తాడేమో కనుక్కో అని. ఆయన 'ఏంటయ్యా నేను కావాలా? పెద్ద ఏమాత్రం చెప్తావేంటి? చూస్తానేం చెప్తావో. నేను నీ కన్నా ఎక్కువ పనులు ఉన్న వాడిని. కాబట్టి నేను ఒక్క క్షణం కూడా ఊరికే కూర్చోలేను. నువ్వంతా అనుస్యూతంగా ఎక్కడా తెగకుండా చెప్పుకుంటూ పోయేట్టయితేనే రాస్తా. కాసేపు ఇట్లా ఆలోచించి ఉండు, మళ్ళీ తర్వాత విషయం ఆలోచించి చెప్తానంటే వెళ్ళిపోతానంటాడు'. అట్లాగే రా, అంటాడు వ్యాసుడు. వచ్చిన తర్వాత వ్యాసుడు 'నేను అనుస్యూతంగా చెప్తాను. నువ్వు అవగాహన చేసుకుని రాసుకోవాలి. ఊరికే యాంత్రికంగా రాస్తే ఒప్పుకోను' అంటాడు. 'నీకవగాహన కాకపోతే నువ్వాగాలి. అట్లా అయితేనే రాయి. లేకపోతే నేనొకటి చెప్తే నువ్వొకటి రాస్తావు', అని చెప్పి గణపతిని పట్టుకొచ్చి అట్లా చెప్పుకుంటూ పోతూ పోతూ, చాలా లోతైన విషయాలు చెప్పడానికి అప్పుడప్పుడు ఒక క్షణం time కావాలనుకోండి ఆలోచించడానికి, ఆగితే ఈ stenographer పారిపోతాడు. అందుకని వ్యాసుడు అక్కడ మెలికేసి చెప్పేవాడు. ఏంటిది? అనేవాడు గణపతి. ఆలోచించు, అని చెప్పి ఈయన ఆలోచించుకునేవాడు. ఇట్లా చెప్పావేంటి, అనేవాడు గణపతి. అట్లా చెప్పాను కదా, అదేమిటో ఆలోచించు, అని ఆయన ఆలోచించుకుంటుంటే, ఈ లోపల ఈయన ఆలోచించుకునేవాడు. ఈ లోపల గణపతికి అర్థమయ్యేది వ్యాసుడు వేసిన మెలిక. ఆ... బానే ఉంది అంటే, మరి పద, ఇంక చెప్తా, ఇట్లా చెప్పుకుంటూ వచ్చాడు. ఎంతటి వాడు? వాచస్పతి! మళ్ళీ బ్రహ్మే దిగివచ్చినట్టు. అయోనిజుడు. ఇట్లా మనకి భగవంతుడే వేదవ్యాసుడుగా వచ్చాడని గుర్తుపెట్టుకోవాలి. మరియొక బ్రహ్మ మనకి కలియుగానికి!

వేదాలిచ్చాడు కదా. చతుర్ముఖబ్రహ్మగా నాలుగు వేదాలిచ్చినవాడు. మళ్ళీ నాలుగు వేదాలు మనకి సంస్కరించి ఇచ్చాడు కాబట్టి, ఈయన కూడా వాచస్పతే! ఈ నామాల ద్వారా చేసుకున్న అవగాహనగా మనకి మిగిలిందేమిటయ్యా అంటే శ్వాస! అదొకటి పట్టుకోండి. పట్టుకుంటే అన్నీ దొరుకుతాయి ఆ తాడు/సూత్రం పట్టుకుని పైకెళ్ళండి. లేదూ జీవలక్షణం ప్రకారం కొంతమందికి వెలుగు ధ్యానం కుదరవచ్చు. భ్రూమధ్యంలో వెలుగు ధ్యానం చేయండి. అప్పుడు దానిలో ఉండే ఆకర్షణ వల్ల, శ్వాస అట్లా ఊర్ధ్వముఖం చెంది అక్కడ దానితో అనుసంధానం చెందుతుంది. ఆ రకమైన ధ్యానం అక్షరపరబ్రహ్మయోగంలో ఇచ్చాడు. హృదయంలో, శ్వాస మనస్సుతో లగ్నం చేస్తే, ఏకాగ్రత చెందిన మనస్సు, శ్వాస రెండూ కలిసి చక్కగా పక్షి వలె ఎగురుకుంటూ ఊర్ధ్వముఖంగా మళ్ళీ ఆజ్ఞలోకి వస్తాయి. ఇది జరిగితే ఇప్పుడు చెప్పుకున్న విషయాలన్నీ చాలా సత్యాలుగా మిగుల్తాయి. లేకపోతే మనం మళ్ళీ మామూలుగానే ఉంటాం, వింటాం.

## 598 త్రిసామ

త్రిసామ అంటే మూడు సాములు అంటే మూడు శ్వాసలని అర్థం. మూడు శ్వాసలు అంటే ఉచ్ఛ్వాస, నిశ్వాస, పూర్ణ శ్వాసలు. అవి భగవంతుడే అని చెప్పడం.

త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి

అని శాంతిపాఠంలో చదువుకుంటాం. వాయువు ప్రత్యక్షబ్రహ్మగా చెప్తాం. 'నమస్తే వాయుః' అంటాం కదా. ప్రత్యక్ష బ్రహ్మగా సాక్షాత్కరించేది భగవంతుడు. మనలో జరుగుతున్న శ్వాస ఒక్కటి చాలు దేవుడు వున్నాడని తెలియడానికి. ఎందుకంటే మనం చెయ్యకుండా అది జరుగుతోంది కాబట్టి. నువ్వు చేయకుండా నీలో జరిగేది ఎవరు చేస్తున్నట్లూ? పెద్దలేమన్నారంటే ముందు నీలో జరిగే శ్వాసనే భగవంతుడిగా గుర్తించు. అందుకనే మనకు వాయువుని 'ప్రత్యక్ష బ్రహ్మ' అని చెప్పారు. పరోక్ష బ్రహ్మాని చేరుకోవడానికి ప్రత్యక్ష బ్రహ్మ అయిన వాయువు ఆధారం. మనం గాలి పీలుస్తున్నామని మనకి తెలుస్తున్నది. అందుకనే హనుమంతుడు కూడా పరోక్ష బ్రహ్మకి దారి చూపించే ప్రత్యక్ష బ్రహ్మ. మనలో పనిచేసే వాయువు శ్వాసద్వారా ప్రత్యక్షం అవుతూంటుంది. భగవారాధన చేసుకోవడం అంటే, నువ్వే ఈ రూపంలో వున్నావని తెలుసుకోవడం. 'నిష్ఠా శాంతిః పరాయణమ్' అదొక నిష్ఠగా పెట్టుకోవాలి. శ్వాసయే నాయందు భగవంతుడిగా యున్నది. శ్వాసను నడిపించేవాడు భగవంతుడే! శ్వాసే గరుత్మంతుడు! గరుత్మంతుడి వీపుమీద యున్న విష్ణుమూర్తి నావద్దకు వచ్చి ఆశీర్వదించాలని, నారాయణకవచంలోని మొట్టమొదటి శ్లోకంలో చదువుకుంటాం 'పతగేంద్ర పృష్ఠే' అని. శ్వాస రూపంలో భగవంతుడెలా వున్నాడూ 'త్రిసామా' ఉచ్ఛ్వాస రూపంలో, నిశ్వాస రూపంలో భగవంతుడున్నాడు. శ్వాస బాగా పీల్చగా సమానంగా వుండే స్థితి వస్తుంది. పూర్ణమైన స్థితిలో శ్వాస పీల్చవలసిన అవసరంలేని స్థితి ఒకటి వస్తుంది. ఈ మూడింటినీ 'త్రిసామా' అన్నారు. మనలో జరిగే ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనించడం సాధన. ఇది పతంజలి చెప్పిన అష్టాంగయోగం లో నాల్గవ అంగము అయిన ప్రాణాయామమునకు దారి తీస్తుంది. తీరిక వేళల్లో భగవత్ చింతనకై ఏవేవో చేయడం కన్నా, ప్రత్యక్షంగా నీయందే శ్వాస రూపంలో వున్న వాడ్ని గమనించండి. మిగతా రూపాలు దైవంగా మనం భావించుకున్నవి, పెట్టుకున్నవి, చిత్రీకరించుకున్నవి. శ్వాసకు రూపకల్పనేమీ లేదు. శ్వాస ఉన్నది. రాముడిట్లా వుంటాడు, కృష్ణుడిట్లా వుంటాడు అని ఋషులు, మునులు వర్ణించిన దానిని నమ్మి రూపకల్పన చేసుకుని, ఆ విధంగా భగవత్ చింతన చేస్తున్నాం, ఆచరణ చేస్తున్నాం. పతంజలి మహర్షి చెప్పే విషయంగానీ, యోగంలో చెప్పే విషయంకానీ నమ్మమని అడగడంలేదు. ఉన్నది చూపిస్తున్నాం దాన్ని పట్టుకు వెళ్ళమని చెప్తారు. నీలో శ్వాస వున్నదా, లేదా? ఉన్నది. అదే దేవుడు. ఎందుకంటే అది నువ్వు

చేయకుండా జరుగుతున్నది. అది లేకపోతే నువ్వుండవు. అంత మరీ స్పష్టంగా, ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే ఇంకా దేవుడున్నాడా లేడా అనే గొడవ ఎందుకు? దేవుడనేది కూడా ఓ పేరే అనుకో. ముందసలు ఈ శ్వాస ఏమిటో, ఎట్లా జరుగుతున్నది అని ఉచ్ఛ్వాస తీసుకుని, దానితోపాటు మెల్లిగా లోపలకి వెళతాం. కొంతదూరం వెళ్ళాక ఆ ఉచ్ఛ్వాసే, నిశ్వాసగా మారుతుంది. మళ్ళీ బయటకి వస్తాం. అలా శ్వాస వదులుతూంటే మళ్ళీ కాసేపయ్యాక నిశ్వాస ఉచ్ఛ్వాస అవుతుంది. ఎంతోసేపలా వదులుకుంటూ పోలేం కదా. కొంతదూరం వదిలాక దూడను మళ్ళీ వెనక్కి పిల్చుకోవాలి. అందుకని నిశ్వాస మళ్ళీ ఉచ్ఛ్వాసగా, ఉచ్ఛ్వాస నిశ్వాసగా మారుతూంటుంది. 'ఈ మారే స్థలం ఉందే, అది' తెలుసుకోవాలి. దాన్నే మాస్టారు శంఖారావంలో 'క్రియాయోగం లోని మెలుకువ' అని చెప్పారు. అది ఇదిగానూ, ఇది అదిగానూ మారుతున్నది అని, రెండు కలిపి ఒకటి అని తెలియడం మూడవది. రాత్రి, పగలు కలిపి ఒకరోజు అని తెలిసినట్లుగా, అంతర్ముఖం బహిర్ముఖం కలిపి ఒకటి అని తెలిసినట్లుగా, బొమ్మా బొరుసు కలిపి ఒకటే రూపాయి అని తెలిసినట్లుగా. ఇట్లా మనకి ఒకటే రెండుగా గోచరిస్తున్నది. కానీ నిజానికివి ఒకటి, మూడుగా వున్నాయని అర్థం. సత్త్వము నుండి వ్యక్తమైన రజస్సు, తమస్సు -- సత్త్వము, రజస్సు, తమస్సుగా వ్యక్తమౌతున్నాయి. ఒకటి మూడుగా వ్యక్తమవడం అంటే అంతే. మనమున్నాము. మననుండి ఒక సంకల్పం వచ్చింది. దాన్నెలా నిర్వర్తించుకోవాలీ అని ఒక ప్రణాళిక. ఆ తర్వాత నిర్వర్తించడం. ఇలా ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగా ఒకటే మూడుగా దిగివస్తుంది. అలాగే ఒకటే శ్వాస, మూడు శ్వాసలుగా దిగివస్తుంది. ఈ మూడు శ్వాసలలో ఒకదానితో ఒకటి లయం చేయడం అనేది ఒక సాధన! ఉచ్ఛ్వాస నిశ్వాసగా ఎలా మారుతున్నదీ, నిశ్వాస ఉచ్ఛ్వాసగా ఎలా మారుతున్నదీ దీన్ని గమనిస్తూండు అని చెప్పారు. అలా బాగా గమనిస్తూంటే, ఈ రెంటినీ నడిపిస్తున్న ఒక కేంద్రం లోపల వున్నదని తెలుస్తుంది. ఎవరు దీన్ని నడిపిస్తున్నారు? ఎవరక్కడ? అని ప్రశ్నవేస్తే, 'నేనిక్కడ' అనే సమాధానం వస్తుంది. 'నేనిక్కడున్నాను, నేను నిన్ను నడిపించేవాడిని' అని చెప్పడాన్నే 'హృదయం' అన్నారు. 'హృత్ అయము' అంటే 'నేనిక్కడున్నాను' అని చెప్తుంది. అందుకని ఉచ్ఛ్వాస నిశ్వాసలని మనం నిష్ఠగా ఆరాధన చేస్తే, ఇంతకన్నా దేవుడు లేడు, ఇదే దేవుడు నాకు అని, ఈ దేవుడ్ని పట్టుకుంటే సామగః.

## 5వ సామగః

'గ' అంటే గమనం. అంటే దారి చూపిస్తుంది. సామ నుండి ఒక మార్గంగా తానే ఏర్పడి యున్నాడుట. శ్వాసమార్గంలో బయల్దేరి వెళ్ళడం అనేది 'త్రిసామా సామగ' అనేది. శ్వాస రూపంలో తానై వెళ్తుంటే ఆ మార్గంలో తనలో వుండే సామము అంటే గానము అది హృదయంలో తనే వినిపిస్తాడు. రెండక్షరముల శబ్దముగా వుంటాడు. దాన్నే 'సోహం' అంటారు. హృదయము 'సోహం' అని చెప్తూంటుంది. ముందు హృదయం అనే పదానికి 'నేనిక్కడున్నాను' అని చెప్పడం కదా. అక్కడకి వెళ్ళేసరికి మూడు సాములు మనకు అర్ధం అయినట్లే! వెళ్ళడానికి దారి ముక్కు చివర నుండి భ్రూమధ్యంలోకి, అక్కడ నుండి నాభం పట్టుకుని లోపలకి వెళ్ళి, హృదయంలో ఉచ్ఛ్వాస నిశ్వాసగా మారుతూంటే, మళ్ళీ నిశ్వాస ఉచ్ఛ్వాస అవుతుంటే ఇట్లా కొన్నాళ్ళు వెళ్ళడం, రావడం రోజూ సాధన చేసుకోవాలి. ఈ సాధన 24 నిముషముల సేపు చేసుకోవాలి. ఒక మూడుసార్లు బాగా గాలి పీల్చి వదిలేసరికి, మళ్ళీ కాసేపు గాలిపీల్చి వదిలే అవసరం శరీరానికి రాదు. అవసరం రానపుడు ఆ విశ్రాంతి ఇచ్చే సమయములో, ఆ మూడవ సామ వినిపిస్తుంది. అది ఉచ్ఛ్వాస నిశ్వాస కానిదీ, రెంటికీ పుట్టుక స్థానం అయినది. అక్కడకు ముందు చేరుకోవడమే 'సామగ'. 'గ' అంటే గమనము. అంటే సామము చూపించే మార్గము. అక్కడకు వెళ్ళేసరికి త్రిసామా, సామగః,

## 600 సామ

సామ అంటే హృదయ స్పందనం వినిపిస్తుంది. గానంలాగ వినిపిస్తుందిట. అందుకే దానిని 'సామవేదము' అన్నారు. మనకి వచ్చే ఆలోచనలన్నీ 'ఋగ్వేదం'. తెగ పుట్టిస్తాం బ్రహ్మాల్లాగ. లేచిన దగ్గర నుండి బ్రహ్మ మనకు సంకల్పంగా పుట్టిస్తూంటాడు. అది 'ఋగ్వేదం'. ఇక్కడ ఈ సామవేదం నడుస్తూంటే, అక్కడ ఆ ఋగ్వేదం నడుస్తూంటుంది. అయితే తర్వాత ఋగ్వేదం వల్ల సామవేదం ఏర్పడుతుందని తెలుస్తుంది. అందుకని ఋగ్, సామలలో ఏదీ ముఖ్యం అంటే రెండూనూ అంటారు. ఋగ్వేదం విష్ణుమూర్తి అయితే, సామవేదం గరుత్మంతుడు. గరుత్మంతుడు లేని విష్ణుమూర్తి కదలలేడు. విష్ణుమూర్తి లేని గరుత్మంతుడు కదలడు. ఇలా కలిపి ఇచ్చారు. భారతంలో గరుడోపాఖ్యానం బాగా చదువుకోవాలి. అసలు ముందొక సంకల్పంగా మనం రావడంచేత మనం వ్యక్తమై, ఆ వ్యక్తమైన దాంట్లోంచి 'స్పందన' పుడుతున్నదిట. The birth of the body is separation of the centre. మొత్తంలోంచి బయటకు వచ్చేసరికి, ఆ బయటకు రావడమనేది ఉచ్చారణగా జరుగుతోంది. అది అట్నుంచిటు వచ్చే కథ. అట్నుంచి ఇటు వచ్చేటప్పుడు నీవు ఉచ్ఛరింపబడ్డావు అని తెలుస్తుంది. ఉచ్ఛరింపబడ్డ తర్వాత నీవు స్పందనాత్మక చైతన్యం అవుతావు. అప్పుడు మళ్ళీ నీనుండి సంకల్పాలు ఉచ్ఛరింపబడుతూంటాయి. నువ్వొకడివి స్పందనాత్మక చైతన్యంగా ఏర్పడడం చేత, నీనుండి వచ్చే సంకల్పాలన్నీ నీ స్పందనాత్మక చైతన్యం ఆధారంగా బయటకి వస్తూంటాయి. అసలు నువ్వు బయటకు రావడమనేది ఋగ్వేదమే! నీలోంచి సంకల్పాలు ఎలా బయటకు వచ్చాయో, నువ్వూ అలాగే బయటకు వచ్చావు. నిన్ను ఉచ్ఛరించినది ఋగ్వేదమైతే, ఉచ్ఛరింపబడ్డ తర్వాత నువ్వు సామవేదమైతే, మళ్ళీ నీలోంచి ఋగ్వేదం ఉచ్ఛరింపబడుతుంది. అసలు ఋగ్వేదం ముందా, సామవేదం ముందా అని ఋషులు శోధన చేసిచేసీ, దీన్ని గూర్చి ఆలోచించడం అనవసరం అని తెలుసుకుంటారు. రెండూ గొప్పవే అని చెప్తారు. అయ్యవారు ముందా, అమ్మవారు ముందా? అయ్యవారూ, అమ్మవారూ ఒకరు ముందూ, ఒకరు వెనకా లేరు. ఇద్దరూ ఎప్పుడూ వుంటారు. ప్రళయం సమయంలో అయ్యవారిలో అమ్మవారుంటుంది. అప్పుడు కూడా వుంటుంది. ఉండకపోతే వచ్చేదేమీ లేదుకదా. కలసి ఉన్నదీ, ఆయనలో ఇమిడియున్నదీ, ఆయనలోంచి వ్యక్తమవుతూ వుంటుంది. ఆవిడ వ్యక్తమైన తరువాత, ఆమె నుండి ఆయన వ్యక్తమవుతూ వుంటాడు. ఆయన వ్యక్తమవుతున్నప్పుడల్లా ఆవిడకొక రూపం, లోకం వచ్చేస్తూంటుంది. ఇట్లా వీళ్ళు కలిసి పని చేసుకుంటూంటారు. అలాగే ఋగ్వేదమూ, సామవేదము. నువ్వు ఉచ్ఛరింపబడ్డ తర్వాత, నువ్వు వ్యక్తిగా ఏర్పడిన తర్వాత నీనుండి ఉచ్చారణ వస్తూంటే, నీ ఉచ్చారణ లన్నిటికీ, నీ స్పందనం కేంద్రంగా

వుంటుంది. అందుకని మనం వెనక్కి వెళ్ళే దారిలో మళ్ళీ ఏం చేయాలయ్యా అంటే అలా ఆలోచనలు వచ్చే మనస్సును తీసుకువెళ్ళి, మళ్ళీ ఈ సామమార్గంలో పెట్టాలి. దీన్నే 'సామగఃు' (సామమార్గాన్ని) అన్నారు. సామమార్గంలో పెడితే, అన్ని ఆలోచనలు హరించుకుపోయి నెమ్మదిగా, ఒకే ఆలోచన వుంటుంది పీలుస్తున్నాం, వదులుతున్నాం అని. ఇదే బాగా రోజూ చేసుకుంటూంటే మనం పీలుస్తున్నాం, వదులుతున్నాం కాదు, ఏదో పీలుస్తున్నటీ, ఏదో వదులుతున్నటీ ఆ ఏదో మరి ఎక్కడ వున్నటీ, అని దాని వెంటపడడానికి రోజూ దానిమీద సాధన చేసుకోవాలి. ఇది 24నిమిషములు చేసుకోమన్నారు. మూడు శ్వాసలు బాగా తీస్తే, మధ్యలో విశ్రాంతి వస్తుంది. విశ్రాంతిలో మనకు వినిపించేదే స్పందనం! ఆ స్పందనంలో ఇమిడి, మళ్ళీ మూడుసార్లు ఉచ్ఛ్వాస నిశ్వాసలు, మళ్ళీ కాసేపు స్పందనంలో వుండి, మళ్ళీ అలా చేస్తూంటే, రెండో మెట్టు ఎక్కుతాం. ముందు ఉచ్ఛ్వాస నిశ్వాసలు బాగా చేయడాన్ని గమనించడమే వుంటుంది. ఆ తర్వాత మూడు శ్వాసలు చేసిన తర్వాత, మళ్ళీ మూడు శ్వాసలు చేసే లోపల, ఉండే విశ్రాంతిలో స్పందనాన్ని గమనించడం వుంటుంది. గమనిక శ్వాస నుండి స్పందనానికి వెళ్తూంటుంది. మీరు ప్రయత్నించి, బాగా ఊపిరి పీల్చి, మళ్ళీ బాగా వదిలి, ఇలా మూడుసార్లు చేస్తే, కాసేపు ఊపిరి పీల్చనక్కర లేదనిపిస్తుంది. మనం సరిగా పీల్చం కనుక మళ్ళీ మళ్ళీ పీలుస్తూంటాం. బాగా పీలిస్తే, ఎప్పుడూ పీల్చనక్కరలేదు. అప్పుడప్పుడు పీలిస్తే చాలు. బాగా సుష్టుగా భోంచేస్తే చిరుతిళ్ళు తిననక్కరలేదు కదా. సరిగ్గా తిననివాడే మళ్ళీ అది తిందామా, ఇది తిందామా అనుకుంటూంటాడు. పూర్తిగా శ్వాస పీల్చుకుని వదులుతూంటే, మధ్యమధ్యలో పీల్చనక్కరలేదు అనే సమయం ఎక్కువవుతూ వుంటుంది. అప్పుడు మనం శ్వాసను తక్కువగా వాడడం జరుగుతుంది. ఎన్ని శ్వాసలు తక్కువ వాడితే, అంత ఎక్కువ ఆయుష్షు పెరుగుతూంటుంది. శ్వాసలు ఎక్కువగా వాడేస్తే, ఆయుష్షు తక్కువవుతూ వుంటుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు, ఈర్ష్యాసూయలు బాగా పట్టేసిన మనస్సు ఎగశ్వాసలూ, దిగశ్వాసలూ చాలా ఎక్కువగా చేస్తూంటుంది. ప్రశాంతంగా ఉండేవాడిలో వుండే శ్వాస గమనము, ఈ రకమైన ఆవేశ కావేశములలో ఉండేవాడి శ్వాస గమనము ఈ రెంటిలో చాలా తేడా వుంటుంది. ఈ రెండో రకంవాడు చాలా ఎక్కువగా శ్వాసను ఖర్చు పెట్టేస్తూంటాడు. ఆలోచనలు బాగా వేగంగా ఉండేవాడికి కూడా శ్వాసలు చాలా తొందరగా ఖర్చయిపోతాయి. అందుకనే శ్వాసమీద మనస్సు పెడితే, ఇన్ని ఆలోచనల మీద కాకుండా, ఒక్క ఆలోచన మీదకి వచ్చేస్తాం. కాబట్టి చాలా వేగం తగ్గుతుంది. ఆలోచన వేగం తగ్గుతూంటే శ్వాసవేగం తగ్గుతుంది. శ్వాసవేగం తగ్గేకొద్దీ, ఆలోచనా వేగం ఇంకా తగ్గుతుంది. ఇలా ఒకదాన్నొకటి చక్కగా తగ్గించుకుంటూ, స్పందనంలోకి తీసుకుపోతూంటాయి. ఆ విధంగా స్పందనాలలోకి వెళ్ళడం రుచి బాగా మరిగితే, 24 నిముషాలు చేసే 27 శ్వాసలకి 48నిముషముల సమయం పడుతుంది. అప్పుడు మధ్యలో

ఎంతసేపు శ్వాస నువ్వు తీసుకుంటున్నావో, అంతసేపు విరామం ఇవ్వడం కూడా తయారవుతుంది. ముందు మూడు శ్వాసలుగా శ్వాసరూపంలో వున్న దేవుడే, శ్వాసమార్గంగా వున్నాడని తెలిసి, హృదయంలోకి వెళ్ళిన తర్వాత, హృదయంలో ఆ శ్వాసను గానంగా వింటారు. అది మూడవనామం–'సామః'. అక్కడకి వెళ్ళేసరికి శ్వాస తగ్గుతుంది. ఆలోచన తగ్గుతుంది. బాగా ముందుకు పోయినకొద్దీ శ్వాస బాగా తగ్గి, అసలు శ్వాస లేదేమో అనిపించే స్థితికి వస్తుంది. ఆలోచన కూడా అలాగే 'నేనున్నాను' అనే భావన తప్ప, మరేమీ లేని స్థితికి వస్తుంది. మిగతా మన గురించిన ఆలోచనలు మనకేమీ వుండవు. ఒక్కటే ఆలోచన వుంటుంది. అది గానం! ఆ గానాన్ని వినమని చెప్తారు. శ్రీకృష్ణుడు చేసే గానాన్ని అట్లా విన్నారుట అంతా. హృదయగతులై విన్నారన్నమాట. అంచేతే శ్వాసతోనూ, మనస్సుతోనూ సంబంధం లేక దాన్ని వింటూ వున్నారు. అది కృష్ణగానము యొక్క మాధుర్యము అని చెప్తారు. ఒకసారి హృదయంలో ఈ మాధుర్యాన్ని పొందినవాడికి మిగతావాటిమీద మాధుర్యం వుండదు. దానిమీదే ఎక్కువ శ్రద్ధ కలిగియుంటాడు. అక్కడ వినిపించే గానం 'సోహం'! ఎందుకనీ? విచ్చుకోలు, ముడుచుకోలుగా స్పందనం జరుగుతూంటుంది కనక. 'సో' అనే శబ్దం విచ్చుకోలుగా, 'హం' అనే శబ్దం ముడుచుకోలుగా వినిపిస్తూంటే, అలా వింటూంటాడు. సోహం అంటే, 'సః అహం', అతడే నేను అని అర్థం. ఈ స్పందనం ఏం చెప్తుందంటే, 'నేనే కాదు నా వెనకాల నా మూపురం ఎక్కి ఒకడున్నాడు. వాడే నేనుగా నీలో వున్నాను' అని చెప్తుంది. ముందు మనమే ఆ స్పందనం అని తెలుస్తుంది. మన మనస్సు, మన భావములలో నుండి శ్వాసలోకి ప్రవేశించినపుడు మనమే మన శ్వాసగా తెలుస్తుంది. ఆ మార్గంలో వెళ్తున్నప్పుడు 'మనమే మార్గం' అని తెలుస్తుంది. 'నేనే మార్గమును' అని క్రీస్తు అన్నట్లుగా. అక్కడ నుండి గానంలోకి వెళ్ళినపుడు 'మనమే గానం' అని తెలుస్తుంది. ఈ గానం చేసే అవ్యక్త ప్రజ్ఞ అవతలపక్క వున్నది, దాన్ని తెలుసుకోవాలి అనే భావం చేస్తున్నంతసేపూ, అసలు ఈ గానాన్ని నడిపించే ప్రజ్ఞ ఏదైతే వున్నదో అదే ఇదిగా వున్నది. ఉంటే, నేనొకణ్ణి వున్నాను, చుట్టూ అల్లుకున్నాను అని తెలుస్తుంది. అసలు ప్రజ్ఞే ఇట్లా గానరూపంలో నాయందుంటే, అదే ఇదిగా వుంటే, ఇది పెట్టుకుని నేనొకణ్ణి, నాదొక జీవితం, అని ప్రత్యేకంగా ఏర్పరచుకున్నాను. ఇది ఆధారంగా చేసుకుని నేను నా భావాలన్నీ అల్లుకున్నాను. నిజానికి నా భావాలన్నీ నేను లేకపోతే లేవుకదా. మన నిద్రలో మనకు భావాలు లేవు. ఎందుకంటే 'నేను' అనే ప్రజ్ఞ/ ఎరుక మనకు లేకపోవడం వలన. ఎందుకంటే ప్రత్యేకమైన ప్రజ్ఞ, మొత్తం ప్రజ్ఞతో కలిసియుండడం చేత. ఇప్పుడు తెలిసి, 'నేనున్నాను, అతడే నేనుగా వున్నాను' అనే భావన చాలా పెరుగుతుంది. అసలు ఈ 'నేనున్నాను' అనే భావన ఆధారం గా మనం రకరకాల పనులు చేస్తున్నాం. అతడే నేనుగ వున్నానని మర్చిపోవడం చేత, నాదైన పనులు, తలపులు పెట్టుకుని, నాదైన జీవితం, కర్మ ఇలాంటివన్నీ తెచ్చుకుంటాం. అసలు నిజానికి మనల్ని కల్పించారు. బృహ్మాణం

చేశారు. కల్పించి, మనలోంచి అదే ముందుకు నడిచి వెళ్ళే కార్యక్రమం ఒకటి వున్నది. దానినే 'వాహికగా ప్రణాళికను నిర్వర్తించడం' అంటారు. అలా కాకుండా ఆ ప్రణాళికకు మూతవేసి, మనదైన ప్రణాళిక చేసుకుంటాం. దాంతో మన గురించి మనం మర్చిపోతాం. 'అతడే నేనుగా వున్నాను, నానుండి అతడు వ్యక్తమై, ఈ సమస్త చరాచర సృష్టిలో అనుభూతి మాత్రము నాకిస్తాడు' అని తెలిసినవాడు, అతడితో కలిసియున్నవాడు. అలాకాక తను ప్రత్యేకించి ఏర్పడడం వలన, తనొక అహంకారప్రజ్ఞగా ఏర్పడి, మొత్తంలోంచి విడిపడిపోతాడు. దాంతో వీడిలో నుండి ఆలోచన, పని అంతా పుట్టుకొస్తాయి. దాని ప్రకారం నిర్మాణం చేసుకుంటూంటాడు. ఈ మార్గంలో తిరిగి వెనక్కి వెళ్ళేసరికి 'అరే అసలు మనమేంటి, మనం ఉండడమేమిటి, అతడే నేనుగా వున్నాను కదా. ఈ నా ఆలోచనలన్నీ నానుండి పుట్టిన వికృతి' అని తెలుస్తుంది. ప్రకృతి కాదని తెలుస్తుంది. ఏ సంకల్పానికి నేను ఇక్కడకు పంపబడ్డానో, ఆ సంకల్పానికి వాహికగా నేనిక్కడ నిలబడక, నేను వేరే తయారుచేశాను. అందుకని ప్రకృతి అనే జీవనం నుండి వికృతి అనే జీవనం లోకి ప్రవేశించడం జరిగింది. అది కారణం చేత మన గురించి మనకి కొన్ని భావన లుంటాయి. నేనిది, నేనది, ఇది నాది, వీళ్ళు నావాళ్ళు ఇలా అల్లుకుంటాం. తిరిగి వెళ్ళే దారిలో, ఈ గానంలో బాగా ఇమిడియున్న వాడికి, ఈ భావాలన్నీ మళ్ళీ ఒక్కసారి అదృశ్యమై, తాను ఆ స్పందనంలో నుండి ఇంకా లోతులలోనికి, సూక్ష్మ స్పందనంలోకి వెళ్తాడు. వెళ్ళి తానున్నానని వుండడం తప్ప, మిగతా భావాలేమీ వుండవు. తనదిగా ఇదివరకు చూస్తున్నవన్నీ ఇప్పుడు భావాల్లో మెలగవు. ఇట్లా తానుండి, తన భావములన్నీ చచ్చిపోవడాన్ని 'నిర్వాణము' అన్నారు.

★★★★★★



# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్దోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# విష్ణు సహస్త్రనామ పారాయణ ప్రాశస్త్యము

మానవుడు తన్ను తాను పవిత్రీకరించుకుని భగవత్ అనుభూతిని పొందుటకు 'భగవంతుని యొక్క నామములను సర్వదా కొనియాడుచుండుట' అను ఒక సులభమైన మార్గమును, మనకి భగవంతుడైన శ్రీకృష్ణుడు భీష్ముని ద్వారా ఇచ్చుట జరిగినది. కలియుగములో అతి సులభమైన పద్ధతిలో భగవంతుని అనుభూతి పొందుటకు అవకాశము ఎక్కువగా వున్నదని తెలియుచున్నది. ధ్యానములు, యోగములు, తంత్రములు, మంత్రములు - ఇవన్నీ చేయగలిగిన శక్తి సామర్థ్యములు కలియుగములో మానవునికి ఉండకపోవడమే కాక, కొంత అలసత్వం, కొంత మంద బుద్ధి దానికి తోడవుట వలన, స్తోత్రాదుల తో భగవంతుని యొక్క నామములను ఎక్కువగా స్మరణము చేసుకొనుట ద్వారా, సులభముగా తన్ను తాను పవిత్రీకరించుకుని, భగవంతుని యందు నిలబడుటకు అవకాశము ఏర్పడగలదని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు చెప్పుట జరిగినది.

ఆ మార్గములోనే మనకి వేదవ్యాస మహర్షి, శంకరాచార్యులవారు, ఇతర ఋషులు, రకరకములైన స్తోత్రములు యిచ్చి వున్నారు. అవి ఎంత చేసుకుంటూ ఉంటే, అంత మనయందు, మన పరిసరముల యందు వాతావరణము పరిశుద్ధి చెందుట జరుగుతుంది. ఎంత ఎక్కువగా వీలుంటే అంత ఎక్కువగా, సామూహికముగా భగవంతుని నామ పారాయణము చేసుకొనుట ఆయన మనకి ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశములలో ఒకటి. దాన్ని అనుసరించి విష్ణు సహస్రనామములను కొనియాడుతూ, అవగాహన చేసుకొనుచూ, ఆ మార్గాన భగవంతుని యందు జీవించుటకు భక్తి శ్రద్ధలతో ప్రయత్నము చేయవలెను. భగవంతుని ఈ మార్గములో అనుభూతి చెందుటకు శ్రద్ధ, ఓర్పు బాగా అవసరము. ఓర్పు కలిగినకొద్దీ శ్రద్ధ పెరుగుతూ ఉండుట జరుగును. శ్రద్ధ పెరిగినకొద్ది ఓర్పు పెరుగుతూ వుండును. ఒకదానిని ఒకటి ఇలా పెంచుకొనుచూ మనము మనని పవిత్రీకరించుకొనుచూ, కాలము యొక్క ఇబ్బందులకు గురి కాకుండా భగవంతుని యొక్క రక్షణలో జీవించుటకు అవకాశము కల్పించుకోవడము అవసరము.

-కంభంపాటి పార్వతీ కుమార్